మద్రాసు క్రైస్తవ కళాశాల

(స్వయం ప్రతిపత్తి)

తెలుగుశాఖ (స్థాపితం - 1887)

తాంబరం, చెన్నై - 600 059, తమిళనాడు.

Madras Christian College

Department of Telugu

భావవీణ ప్రత్యేక సంచిక

Journal of Telugu Literary, Culture & Language Studies

Vol. 16 - Issue. 01 - Spl. Edition - September 2019 - ISSN No. : 2456-4702

జాతీయ సదస్సు - 2019



తెలుగులో గిరిజన సంస్కృతి – సాహిత్యం

సదస్సు సంచాలకులు :

డా॥ శ్రీపురం యజ్ఞ శేఖర్

శాఖాధ్యక్షులు, తెలుగు విభాగం,

మద్రాసు క్రైస్తవ కళాశాల, తాంబరం, చెన్నై - 600 059, తమిళనాడు.

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు



BHAVA VEENA (భావ వీణ)

Journal of Literary, Culture & Language Study

(సాహిత్య, సాంస్కృతిక, భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

Vol. 16 - Issue No. 1 - Spl. Edition - September 2019 - ISSN No. : 2456-4702

EDITORIAL BOARD

Chief Editor

PITTA SANTHI

M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,

C/o. Dr. Busi Venkataswamy

Holy Homes Apartment, Postal colony ,
4 Th Line - 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Dept. of Telugu,
   Sri Padmavathi Mahila University,
   Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   HOD & Research Guide, Dept. of Telugu
   PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
   Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies
   Universityof Heidelberg, Germany.

ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Dr.V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Madras University,
   CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor, Dept.of Hindi,
   Moulana Azad National Urdu University,
   HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
   Board of Studies Chairman,
   Telangana University, Dichpally,
   Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
   Dept. of Telugu & O.L.,
   Acharya Nagarjuna University,
   Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Kakatiya University, Warangal District.
   Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Asst. Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Dr. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr.D.ESWARA RAO,** M.A.,
Associate Professor, Dept.of English,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr.P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr.K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, CIIL, Mysore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A. (San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

LEGAL ADVISER

Dr. A. GURAVAIAH, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

COVER PAGE & PAGE SETTING

TENALI PRAKASH, G.L.S.GRAPHICS, Guntur. 9494 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar,
Guntur - 522 002. Ph. 9703301698.

మద్రాసు క్రైస్తవ కళాశాల

తెలుగుశాఖ (స్థాపితం : 1887)

తాంబరం, చెన్నై – 600 059, తమిళనాడు.

జాతీయ సదస్సు - 2019

తెలుగులో గిరిజన సంస్కృతి – సాహిత్యం

నిర్వహణ :

తెలుగు విభాగం

మద్రాసు క్రైస్తవ కళాశాల

తాంబరం, చెన్నై – 600 059, తమిళనాడు.

తెలుగులో గిరిజన సంస్కృతి – సాహిత్యం

“Tribal Culture & Literature in Telugu”

జాతీయ సదస్సు

భావవీణ ప్రత్యేక సంచిక

ISSN No. : 2456-4702

RNI No. APTEL/2003/12253

UGC Approved Journal No. 42500

ప్రథమ ముద్రణ	:	**25 సెప్టెంబర్ 2019**
ప్రతులు	:	**500**
వెల	:	**రూ. 300/- (మూడు వందల రూపాయలు)**
కాపీలకు	:	**డా॥. శ్రీపురం యజ్ఞ శేఖర్,** **సదస్సు సంచాలకులు, తెలుగు శాఖాధ్యక్షులు,** **మద్రాసు క్రైస్తవ కళాశాల, తాంబరం, చెన్నై.**
గమనిక	:	**ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు – సంపాదకవర్గం.**
ఎడిటోరియల్ చిరునామా	:	**డి. నెం. 18, మద్రాసు క్రైస్తవ కళాశాల క్వార్టర్స్,** **తాంబరం, చెన్నై, తమిళనాడు.**
డి.టి.పి & ప్రింటింగ్	:	**తెనాలి ప్రకాష్** **జి.యల్.ఎస్. గ్రాఫిక్స్, గుంటూరు.** సెల్ : 9494 660 509.

తెలుగులో గిరిజన సంస్కృతి – సాహిత్యం

Tribal Culture & Literature in Telugu

జాతీయ సదస్సు - ప్రత్యేక సంచిక

Editorial Board

Editor in Chief :

Dr. Sripuram Yagna Sekhar

HOD, Telugu Department,

Madras Christian College,

Tambaram, Chennai.

Sub - Editors :

Dr. M David Wesley

Assistant Professor,

Department of English.

Sri. K Moses Samuel Srinivas

Assistant Professor,

Department of English.

A. Jyothi Salomi Tsapa

Assistant Professor,

Department of Mathematics.

Dr. Joshuva Kalapati

Associate Professor(Rtd),

Department of Philosophy.

Madras Christian College (Autonomous)
Tambaram East, Chennari - 600 059, India.
UGC - College with Potential for Excellence. Reaccreditedwith 'A' Grade by NAAC.

Office : 044-2239 6772, 044-2239 0675
Residence : 044-2239 8169, 044 - 2239 5741
Fax. : 044-22394352
Mobile : 9840622438
E-mail : principal@mcc.edu.in
principalmcctam@gmail.com
alexjesu62@gmail.com
Website : www.mcc.edu.in



R.W. Alexander Jesudasan
Principal & Secretary

From the Principal's Desk

I am pleased to understand that a two day National Seminar on "Tribal Culture & Literature in Telugu" is organised by the Department of Languages (Aided Stream) at Madras Christian College (MCC) on 25th & 26th September, 2019.

The language of Telugu has been one of the vibrant languages along with other Indian and Foreign Languages in that department and we have had the previlege as Part 1 course in the Undergraduate Studies in MCC.

MCC has also been the place where many teaching and non-teaching faculty have had telugu as the mother tongue. As MCC is highly cosmopolitan in nature, I am happy to state that we are one of the few institutions in India which exemplify unity in diversity.

I warmly welcome several learned scholars to speak in the Seminar and I am confident that great contributions would be made by them which I am sure would motivate young minds.

Wishing the seminar every success.

R.W. Alexander Jesudasan
Principal.

Madras Christian College

UGC - CPE, Tambaram, Chennai - 600 059.

Department of Telugu



Dr. Sripuram Yagna Sekhar

HOD, Telugu Department.

ముందుమాట

భారతదేశంలో పురాతన కళాశాలలో ఒకటి మద్రాసు క్రైస్తవ కళాశాల. తెలుగు శాఖ 133వ వార్షికోత్సవం సందర్భంగా 2019, సెప్టెంబర్ 25, 26వ తేదీల్లో నిర్వహించాలనుకున్న "తెలుగులో గిరిజన సంస్కృతి - సాహిత్యం" అనే అంశంపై వందకుపైగా పత్రాలు వచ్చాయి. పరిశోధనా దృక్పథంతో పంపిన పత్రాలను ముంద్రించి యూజీసీ అప్రూవ్డ్ జర్నల్ భావవీణ ద్వారా ప్రత్యేక సంచికగా తీసుకొస్తున్నాం. ఆచార్య తరపట్ల సత్యానారాయణ, డా॥. బూసి వెంకటస్వామి, డా॥. ఎల్వీకె రెడ్డి మొదలగు మిత్రులు సహాయ సహకారాలు మరువలేనివి నా గురువు ఆచార్య కె. ఆనందన్, మిత్రులు ఆచార్య జి. బాలసుబ్రమణ్యం, ఆచార్య రాంప్రసాద్‌రెడ్డి చేసిన మేలు మరువలేనిది.

మా కళాశాల ప్రిన్సిపాల్ డా॥. ఆర్. డబ్ల్యు. అలెగ్జాండర్ జేసుదాసన్, బర్సార్ శ్రీ సుందరాజ్ మరియు అధ్యాపక, విద్యార్థి నాయకులకు కృతజ్ఞతలు.

డా॥. శ్రీపురం యజ్ఞ శేఖర్

సదస్సు సంచాలకులు.

ADIKAVI NANNAYA UNIVERSITY

Rajah Rajah Narendra Nagar,
RAJAMAHENDRAVARAM, East Godavari District, A.P. - 533296.

DEPARTMENT OF TELUGU



డా॥ టి.ఎస్.నారాయణ

ఎం.ఎ(తెలుగు), ఎం.ఎ(ఎడ్యుకేషన్), ఎం.ఫిల్,పి.జి.డి.టి., పి.హెచ్.డి., నెట్., జె.ఆర్.ఎఫ్ & ఎస్.ఆర్.ఎఫ్.,
పి.హెచ్.డి. గోల్డ్ మెడలిస్ట్, బెస్ట్ థీసిస్ అవార్డు గ్రహీత దక్షిణ భారతీయ జానపద విజ్ఞానవేత్త
తెలుగు శాఖాధ్యక్షులు

తేది : 11-09-2019



భారత స్వాతంత్ర్యానికి ముందు 1837లో మద్రాస్‌లో స్థాపించబడిన కళాశాల మద్రాసు క్రైస్తవ కళాశాల. 182 సంవత్సరాల చరిత్ర కలిగి భారతదేశంలో ఉన్నత ప్రమాణాలు గల పేరు పొందిన 10 కళాశాలల్లో మద్రాసు క్రైస్తవ కళాశాల అత్యున్నత స్థానంలో నిలవడం గర్వ కారణంగా భావిస్తున్నాను.

ఇంత చరిత్ర కలిగిన ఈ కళాశాలలో తెలుగు శాఖ ఏర్పడి 133 సంవత్సరాలు కావడం. ఈ సందర్భంగా 133వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా తెలుగుశాఖ "గిరిజన సంస్కృతి - సాహిత్యం" అనే అంశం మీద ఏర్పాటు చేసిన జాతీయ సదస్సు సంచాలకులు డా॥ యజ్ఞ శేఖర్ గారికి కళాశాల అధ్యక్ష, ఉపాధ్యక్షులకు అభినందనలు తెలియజేస్తున్నాను.

ప్రస్తుతం అంతరించిపోతున్న గిరిజన సాహిత్యం, సంస్కృతి, సంప్రదాయాలు, భాష మొదలైన అంశాలపై పరిశోధనలు జరగవలసి ఉంది. భావితరానికి వీటి మూలాలను తెలియజేయవలసి ఉంది. అందుకే ఈ కళాశాల గిరిజన సంస్కృతి, సాహిత్యంపై జాతీయ సదస్సును ఏర్పాటు చేయడం అభినందించదగిన అంశంగా భావిస్తూ మద్రాస్‌లో కూడా తెలుగు భాషా ఔన్నత్యాన్ని, సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించే దిశలో భాగస్వామ్యం పొంది అభివృద్ధి పథంలో పయనిస్తున్న శుభ సందర్భంగా జాతీయ అంతర్జాతీయ సదస్సులు నిర్వహించాలని కోరుతూ...

అభినందనలతో....

Adikavi Nannaya University, Rajah Rajah Narendra Nagar, Rajamahendravaram, East Godavari District, A.P. - 533296.
Mobile No.: 9290630752, 72072 24473 Mail ID : dr.tsnarayana@gmail.com

Madras Christian College

UGC – CPE, Tambaram, Chennai - 600 059.

DEPARTMENT OF TELUGU
ANDHRA BHASHABHIRANJANI SANGHAMU

We cordially invite you for the
Inaugural Function of the

NATIONAL SEMINAR ON
"TRIBAL CULTURE & LITERATURE IN TELUGU"
on Wednesday, the 25th September 2019 at 9.30 am
at the Centre for Media Studies, (Near Library) MCC.

MR. A.VIDYA SAGAR, IAS
Retd. Spl. Chief Secretary to Govt. of Andhra Pradesh
has consented to be the Chief Guest

DR. P. SIVA RAMAKRISHNA
Director Sakti NGO, Hyderabad
Will deliver the Key Note Address

DR. L.V.K. REDDY
Dy. Director
Dr. B. R. Ambedkar Open University, Huderabad
Will be the Guest of Honour

Dr. R. W. ALEXANDER JESUDASAN
Principal, MCC
Will preside over the function

Mr. C. SUNDARAJ
Bursar, MCC
Will offer Felicitations

DR. K. RAVINDRANATH
Senior Advocate, Madras High Court

DR. M. SAMPATH KUMAR
HOD, Telugu & Director ORI, Marina Campus
University of Madras
Will receive MCC-ABRS Life Time Achievement Awards

Prof. Mrs. Jyothi Salomi
Mathematics Professor & Vice President
Andhra Bhashabhiranjani Sanghamu

Dr. S. Yagna Sekhar
Associate Professor of Telugu
Seminar Director

Madras Christian College

UGC – CPE, Tambaram, Chennai - 600 059.

DEPARTMENT OF TELUGU
ANDHRA BHASHABHIRANJANI SANGHAMU

We cordially invite you for the
Valedictory Function of the

NATIONAL SEMINAR ON
"TRIBAL CULTURE & LITERATURE IN TELUGU"
on Thursday, the 26th September 2019 at 3.00 pm
at the Centre for Media Studies, (Near Library) MCC.

Prof. D. MUNIRATHNAM NAIDU
Project Director
Center for Excellence of Studies in Classical Telugu
Central Institute of Indian Languages, Mysore
has consented to be the Chief Guest

Prof. K. ANANDAN
Director, Retd. P.S. Telugu University, Hyderabad

Prof. T. SATHYA NARAYANA
HOD, Telugu, Adi Kavi Nannaya University

Dr. B. VENKATASWAMY
HOD, Telugu PAS College, Guntur Dt.
Will be the Guests of Honour

Dr. R. W. ALEXANDER JESUDASAN
Principal, MCC
Will preside over the Function

Mr. C. SUNDARAJ
Bursar, MCC
Will distribute the Certificates

Prof. Mrs. Jyothi Salomi
Mathematics Professor & Vice President
Andhra Bhashabhiranjani Sanghamu

Dr. S. Yagna Sekhar
Associate Professor of Telugu
Seminar Director

CONTENTS

1. గోండుల సంస్కృతి - శాస్త్రీయాంశాలు	- ఆచార్య జి. బాలసుబ్రమణ్యం	1
2. తెలుగునాట గిరిజనుల స్థానం - ప్రస్థానం	- డా॥. పి.శివరామకృష్ణ	7
3. తెలుగులో గిరిజన విజ్ఞాన పరిశోధనలు - తీరుతెన్నులు	- డా॥. తరపట్ల సత్యనారాయణ	16
4. గోర్ సమాజాల సంస్కృతి - సామాజిక వ్యవస్థా నిర్మాణం	- డా. శ్రీపురం యజ్ఞ శేఖర్	20
5. గోండుల - గుసాడీ నృత్యం (దండారియా ఉత్సవం)	- డా॥ బూసి వెంకటస్వామి	25
6. మెకంజి కైఫియత్తులు - గిరిజన జీవనం	- డా॥ పాలెం రమాదేవి	29
7. శ్రీకాళహస్తిమాహాత్మ్యం - గిరిజనుల సాంస్కృతిక జీవనం	- యం. దీనదయాళం	33
8. గిరిజనుల విలక్షణత-సాంఘిక జీవనం-సమస్యలు-పరిష్కార మార్గాలు	- డా. బత్తల అశోక్ కుమార్	37
9. ఫణికుమార్ "గోదావరి గాథలు"-గిరిజనుల యదార్థ జీవిత చిత్రాలు	- డా॥. పి.భగ్గు నాయక్	43
10. గిరిజనుల జీవితాన్ని చిత్రించిన తెలుగు కథలు	- డా॥ టి. చక్రధర స్వామి,	48
11. శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యం - కన్నప్ప పాత్ర చిత్రణ	- డా॥ జి. రవికుమార్	52
12. ఎరుకల కొరవ, కొరిచ (కొరమ) భాషలపై జరిగిన కృషి - ఒక సమీక్ష	- డా. గుజ్జల శ్రీరాములు	58
13. ఏకాగ్రత, శిల్పచతురత, గురుదక్షిణలకు ఆదర్శం-ఏకలవ్యుడు	- డా॥ గుండ్లూరు వెంకట రమణ	70
14. పురాణ స్త్రీలతో గిరిజనుల తాదాత్మ్యం	- డాక్టర్ గుంటుపల్లి గౌరి	66
15. ఆంధ్రదేశంలో గిరిజన వైద్య విజ్ఞానం - స్థూల విశ్లేషణ	- డా॥. కె. సురేశ్ కుమార్	71
16. గిరిజన బంజారాలు - చైతన్య స్రవంతి గేయాలు	- డా॥ ఆర్. కుసుమ కుమారి	74
17. గిరిజనుల విద్య - చిన వీరభద్రుడు గారి అవగాహన - కృషి	- డా॥. వై.వి.సిహెచ్.లీలా పద్మజ	78
18. తెలుగు సృజన మాసపత్రిక - రాగో నవల గిరిజన స్త్రీ సామాజిక జీవితం	- డా॥. లింగాల మంగమ్మ	83
19. గిరిజన పండుగలు - విశ్లేషణ	- డా. ఒభిన్ని శ్రీహరి	88
20. ఎరుకల సంస్కృతి	- డా॥. పోచంరెడ్డి రాజేశ్వరి	93
21. నల్లపూసలు కథానిక - గిరిజన జీవనం	- డా॥. జి. పార్వతి	98
22. కొండ కావ్యం'గుమ్మ' - గిరిజన జీవన చిత్రణ	- డా॥. పులపర్తి శ్రీనివాసరావు	101
23. తెలంగాణ కథా సాహిత్యం - గిరిజనుల ఆచార వ్యవహారాలు	- డా॥. నూనవత్ రాంబాబు	106
24. కర్నూలు జిల్లా గిరిజనుల బాంధవ్య గేయాలు - పరిశీలన	- డా॥. కె. వెంకటరమణ	113
25. లంబాడీలు - వివాహ ఆచారాలు	- డా. వై. విజయానంద రాజు	117
26. "బంజారా స్త్రీలు - ఆభరణాలు"	- దేవరపు ఈశ్వరరావు	121

27. గిరిజనుల వివాహ పద్ధతులు	- భూక్య జ్యోతి	124
28. సంస్కృతి సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం - బంజారాలు	- కె. అశోక్	127
29. అడవి బిడ్డల నాగోబ జాతర - సాహిత్య సాంస్కృతికాంశాలు	- కె. గంగాధర్ & - కె. సరిత	131
30. గిరిజనుల ఆర్థిక పరిస్థితులు - జీవన విధానం	- కనపాల జోసఫ్	133
31. డా. పి. రమేష్‌నారాయణ గారి "గిరిజన సంస్కృతి సాహిత్యం - ఒక పరామర్శ	- కనుమల మునిస్వామి	136
32. "లంబాడోళ్ళ రాందాసు" నవల - సామాజిక చైతన్యం	- భూక్యా కాశీరామ్	141
33. గిరిజనుల వివాహ పద్ధతులు - ఒక పరిశీలన	- శ్రావణి కత్తి	145
34. బంజారా గేయ సాహిత్యం	- ఆవుల అనిత	148
35. ఘోషిస్తున్న గిరిజనం	- డా॥. పి. కుమారి నీరజ	152
36. బంజారాల ఆరాధ్య దైవం - సంత్‌సేవాల్ జయంతోత్సవాలు	- యం. దీపిక	157
37. గిరిజనుల ఆచార వ్యవహారాలు సాంప్రదాయాలు - ఒక పరిశీలన	- నారాయణదాసు మంజులాచారి	160
38. కన్నీటికే 'విలువ' కట్టే 'రుదాలి'	- శ్రీపతి మారుతి	164
39. గిరిజనుల నృత్య రీతులు	- బి. మేరికుమారి	168
40. వరంగల్ జిల్లా బంజారా ఉప తెగాల వృత్తులు	- మూడ్ రాజు	171
41. అతడు అడవిని జయించాడు - నవలలో ఎరుకల జీవన శైలి	- విజయలక్ష్మి నూకల	174
42. గిరిజనుల విషాద గేయాలు - పరిశీలన	- పి. ఇందిర	178
43. చివరి గుడిసె నవల - గిరిజన జీవన చిత్రణ	- పి. మనోహర్	181
44. కొన్ని గిరిజన కథలు - జీవన చిత్రణ	- పోతగాని సత్యనారాయణ	186
45. కర్నూలు జిల్లా గిరిజనుల ఆహారపు అలవాట్లు - పరిశీలన	- మార్తల పవన్ కుమార్ రెడ్డి	190
46. ఆదివాసులు వారి ప్రాశస్త్యం - ఒక పరిశీలన	- పెద్దోజు నరేష్	193
47. మారేడుమిల్లి మండలం "గిరిజన గేయాలు-విశ్లేషణ	- డాక్టర్ యశోద పూర్ణచంద్రరావు & - శ్రీమతి అనుమోలు రామలక్ష్మి	196
48. "గోదావరి గాథల్లో గిరిజనుల జీవన చిత్రాలు"	- రుద్రపాక జితేంద్ర కుమార్	199
49. 'జానకీ రాఘవము'లో ఎరుకల సానిగా పార్వతీదేవి	- ప్రభాకరరావు సగ్గుర్తి	202
50. 'సంఘం' నవల - ఆదివాసుల జీవన చిత్రణ	- శశికళ యస్.	205
51. తెలుగు గిరిజన సంస్కృతి - సాహిత్యం	- దొడ్డి శ్రీదేవి	210
52. గిరిజనుల కళారూపాలు - పరిచయం	- నలసాని శ్రీలత	213
53. శ్రీశైల చెంచులు	- పూషడపు సుబ్బారావు	217

54. తెలంగాణ బంజార గేయ సాహిత్యం - సాంస్కృతిక జీవనం	- బానోత్ వెంకటేశ్వర్లు	221
55. తెలుగు ప్రబంధాలలో గిరిజన సంస్కృతి	- తంత్రవహి శ్రీరామమూర్తి	225
56. భద్రాద్రి గిరిజనుల వ్యవసాయ పండుగలు	- అన్నపరెడ్డి వీరకుమారి	229
57. చెంచుల సంస్కృతి - ఆదర్శనీయం	- డా॥ బిర్రు అశోక్	233
58. మనుచరిత్ర, రామాభ్యుదయాలలో గిరిజన సంస్కృతి	- డా॥ బ్రహ్మానందరెడ్డి	237
59. గురికల ఎరుకల మొనగాడు	- డా॥ పి.ఎ. సత్యనారాయణ	240
60. ఉత్తరాంధ్ర గిరిజన నృత్యాలు	- డా॥. సింగర వాణి	243
61. రఘునాథనాయకుని వాల్మీకీచరిత్రము - గిరిజన సంస్కృతి	- జి. నాగభూషణరెడ్డి	247
62. గిరిజనుల అణచివేత, అస్తిత్వ పోరాటాలు	- పులి చెంచయ్య	250
63. కె. వరలక్ష్మమ్మ గారి "ఆనకట్ట" కథ- గిరిజనుల సామాజిక చిత్రణ	- పోతురాజు దుర్గాదేవి	257
64. తెలంగాణ గిరిజన కథలు - సామాజిక జీవనం	- డా॥ అంకెం శివజ్యోతి	262
65. 'పునరావాసం' - గిరిజనుల స్థితిగతులు	- డా॥ డి. నల్లన్న	267
66. గోండు - పాటలు	- ఎస్. లలిత	272
67. గోండుల సంస్కృతి - ఆచారాలు - సాంప్రదాయాలు	- నల్ల యామిని	278
68. ఆటవికుల జీవితానికి అద్దం పట్టిన - "ఆకురాలు కాలంలోకి..."	- దాసరి రమేష్	283
69. తెలుగు సాహిత్యంలో గిరిజన దింసా నృత్యం - విశ్లేషణ	- డా॥. యస్. సరళాదేవి	286
70. తెలుగు రాష్ట్రాలలోని గిరిజనుల పండుగలు - సంస్కృతి - సంప్రదాయాలు	- కె. ఎం. సునీల్ కుమార్	290
71. గిరిజనుల జీవన విధానం - స్థితిగతులు	- కైలా హేమ బాంధవి	293
72. చెంచు జాతి సంస్కృతి సంప్రదాయాలు	- ఆర్. లక్ష్మీ ప్రసన్న కుమార్	296
73. గిరిజనుల ఇలవేల్పులు - సమ్మక్క - సారలమ్మలు	- సోనబోయిన సతీష్	299
74. తెలంగాణాలో ఆదివాసి గిరిజన "కోయ" తెగ వివాహ పద్ధతులు	- డా॥ ఈసం సారయ్యదొర	303
75. గిరిజనుల సంస్కృతి - గిరిజనుల మూడనమ్మకాలు	- ఆవుల బాలస్వామి	308
76. ఐక్యతకు చిహ్నం తాండాల్లోని దీపావళి పండుగ	- బసినేని శ్రీనివాసులు	311
77. చివరిగుడిసె నవలలో ప్రతిఫలించిన యానాది జీవన చిత్రణ	- జి. బాలచంద్ర	314
78. తెలంగాణ గిరిజన కథ - గిరిజనోధ్యమం	- బానోత్ స్వామి	319
79. గిరిజన కళారూపాలు	- ఎంబేటి అమృతేష్	323
80. బంజారాలు - స్త్రీ దేవతా ఆరాధనలు	- ఎ. చంద్రకళావతి	326
81. లంబాడీల ప్రదర్శన కళలు	- ధీరావత్ లక్ష్మణ్	330

82. తెలంగాణ రాష్ట్రంలో పోడు వ్యవసాయం - ఒక అధ్యయనం - డా॥ రవి కాక 333
83. గిరిజనుల జీవిత సజీవ దర్పణం - వసంతరావు 'అడవి' - డా॥ కోలా శేఖర్ 339
84. భారతీయ ఆదివాసీలు - వివాహ పద్ధతులు - డా॥ లింగదారి బాబు 342
85. కోయ గిరిజనుల వేటలు, ఆటలు, మూడ నమ్మకాల-పరిశీలన - నోముల రాజు 348
86. ఆదివాసుల జీవన విధానం - సామాజికాంశాలు - పి. ఝాన్సీరాణి 354
87. గిరిజన తండావాసుల జీవిత చిత్రణ - "రేలపూలు" - పెద్దపల్లి తేజస్వి 357
88. నవలా సాహిత్యంలో గిరిజన జీవన చిత్రణ - కె. పుణ్యవతి 361
89. నిబద్ధతకు, జాతీయ సమైక్యతకు, మత సామరస్యాలకు ప్రతీకలు-లంబాడీల పండుగలు - జలిపిగారి రామాంజనేయులు 364
90. గిరిజన వైద్యం - చర్మ సంబంధిత వ్యాధుల నివారణ - సాలి రాజా 368
91. గోండుల ఆచార సంప్రదాయాలు - సిహెచ్. నాగమహాలక్ష్మి 374
92. రాసాని 'విషప్పురుగు' కథా సంపుటి - గిరిజన జీవితం - డా॥ తొండాటి రాజశేఖర్ 378
93. గిరిజన సమూహాల్లో కనిపించే ప్రత్యేక సంస్కృతి సంప్రదాయాలు - గుల్ల దుర్గాదేవి 383
94. నగారావలె ధ్వనిస్తున్న శబ్దాలు - డా॥ ఎం. విజయశ్రీ 386
95. గిరిజన సంస్కృతి, సాహిత్యం భారతీయ ఇతిహాసాలు-గిరిజన సంస్కృతులు - మల్లికార్జున్ పి 389
96. గిరిజనుల పోడు వ్యవసాయ పద్ధతులు - ఎం. మాధవి 392
97. గిరిజన భాషా సంస్క్ళతులు - సమగ్రాభివృద్ధి - డా॥ జె. సీతాపతి రావు 395
98. గిరిజన సాహిత్యం - యానాదుల జీవితం - డా॥ ఎం. మునిరత్నం 400
99. చెంచులెరుకల జీవన విధానం - వైరుధ్యాలు - డా॥ నూనె అంకమ్మరావు 410
100. గిరిజనుల నృత్యరీతులు - ఆదిమవాసులు - నృత్యాలు - డా॥ వైరాగ్యం ప్రభాకర్ 414
101. చెంచులు - జీవన శైలి - డా॥ యన్.హెచ్.పి.కిరణ్ కుమార్ 416
102. వలస పాలన - ఆదివాసులు - డా॥ చదలవాడ విజయ కుమార్ 417
103. ఖండాంతర మూలవాసుల్లో 'తెలుగు ఆనవాలు' - డా॥ సగిలి సుధారాణి 421
104. సవర భాషా సాహిత్యాలు - గిడుగు కృషి - డా॥ భూక్య తిరుపతి 428
105. యనాదులు - ఆచారాలు - సంస్కృతి - డా॥ టి. మోహనశ్రీ 432
106. గిరిజనులు - పండుగలు - డా॥ లేబాకు విజయకృష్ణారెడ్డి 436
107. ఎరుకలజాతి వారి కథలు - జీవన చిత్రణ - నల్లమోతు సునీత 441
108. చెంచుల మౌఖిక భక్తి గేయాలు - సామాజిక నేపథ్యం - డా. కె. భాను నాయక్ 447
109. గిరిజనుల వాడుక భాషలోని తెలుగు సామెతలు - డా॥ జి. శైలమ్మ 450
110. గిరిజన హక్కుల కోసం పోరాడిన ఆదివాసీ వీరవనితలు - ఏ. స్వప్న 456
111. ప్రాచీన కావ్యాల్లో చెంచుల జీవన చిత్రణ - డాక్టర్ ఉడాలి విష్ణుప్రియ 459
112. లంబాడీ తెగ - ఆచారాలు, అలకంరణ - డా॥. యస్. మైథిలి 463
113. Studies of Religion, Culture and Traditions of Indian Tribal People - Dr. Hilda Annie Grace 466

గోండుల సంస్కృతి – శాస్త్రీయాంశాలు

– ఆచార్య జి. బాలసుబ్రమణ్యం, తెలుగు & తులనాత్మక సాహిత్య శాఖ, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

భారతీయ సమాజాల్లో గోండీ సంస్కృతి పురాతనమైన దని చరిత్రకారుల కథనం. భారతదేశంలో సాత్పురా వింధ్యపర్వతశ్రేణిలో నర్మదా ప్రాంతం, గోదావరి, పెన్నా నదులు మధ్య విస్తరించిన ప్రాంతాలు, గోండు సంస్కృతి ఉనికిని తెలియజేస్తున్నాయి. గోండి సమాజాల సమూహా లను మధ్యప్రదేశ్ మహారాష్ట్రలలో కోయతూర్, కోల్, కోర్‌కల్, కోయజర్, కోత్‌కౌరి (వత్‌కౌరి), కొండరల్ (బురుద్) కోయగళ్ (బయగా) కోర్‌లా (పారా - పారాల్)కోయర్‌వాతి (గోండ్‌లోనార్) కొతడ్యాల్, కోలామ్, ప్రధాన్ ప్రధానమైనవి. ఆంధ్రా, కర్ణాటకలలో కోయ, గోండు ప్రధాన్, కోలాం, తోటి, నాయకపోడు, కొండరెడ్డి, కొండదొర, బగతు, సవరా, కొత్యాల్ కోలియా, కోయ మాలీ, కోర్‌నాల్, కోర్‌నా, కోలాహ, ప్రధానంగా కన్పిస్తారట. బీహార్, ఒరిస్సా ప్రాంతాల్లో కొండ్‌కొముండ్యాల్ ఖేరియా, కోరా, కొక్వా, కొంతాల్, కోటియా, కోల్, భీల్, సంతాల్, ముండా మొదలగు తెగల వారున్నారు. గోండులు విస్తరించి ప్రాంతాలను **'గోండ్వానాభూమి'** అంటారని గోండు సంస్కృతి గ్రంథంలో మెస్రా మనోహర్ తెలిపారు. గోండుల గురువు శ్రీ పాహన్డీకుపార్‌లింగో. ఈయన తత్వం ఉన్నతమైన మానవతావిలువల సమాహారమని వీరి నమ్మకం. కాబట్టి శ్రీ పాహన్డీకుపార్‌లింగో ప్రతిపాదించిన గోండుల తాత్వికత (సంస్కృతి) లోని శాస్త్రీయాంశాల్ని చర్చిద్దాం.

ఐక్యతకు చిహ్నం – గోండీ గురుతత్వం :

గోండి జాతుల సమాజాల్ని 'సగా'లంటారు. 'సగా' అంటే 'ఘట్టం' అని అర్థం. వీరిలో 12సగాలున్నాయి. ఈ సగాల ధర్మాలు పురాతనమైనవి. ధార్మికంగా, సామాజిక ప్రయోజనకంగా ఉంటాయి. గోండీ ప్రజల్ని ఏకతాటిపై నడపడంకోసం గోండీగురువు శ్రీ పాత్ర పాహన్డీకుమార్ లింగో సామాజిక న్యాయపరంగా నిర్మాణ చేసినట్లు తెలుస్తుంది. ఈ 'సగా' నిర్మాణానికి ఆయనకు 'జంగోపేన్ రాయితడ్' అనే దేవత సహాయం చేసిందనే ఐతిహ్యం కూడా వుంది. కాబట్టే ఈమె పేరు మీద చేసేపూజకు ఆమెపేరే పెట్టినట్లు కూడా తెలుస్తుంది. ఈ పూజ దసరా రోజుల్లో జరుగుతుంది. జమ్మివృక్షం **(కట్‌సవర్)** క్రిచ పటేలు **(పాట్లాల్)** పూజారి **(దేవారి)** కుల గురువు పాహన్డీ కుపార్‌లింగో, మరియు జంగోపేన్‌రాయితడ్ లతో పాటు డాలు, కత్తులు, కొడవలి, నాగలి కర్రులకు పూజలు చేస్తారు. ఈ పూజ వారి వీరత్వాన్ని, వ్యవసాయంపై గౌరవాన్ని తెలియజేస్తాయి. అంతేగాదు శ్రీపాహన్డీ కుపార్‌లింగో, రాయితీర్‌జంగోలు పార్వతి **(హీర్‌బా)** సంతనమని నమ్ముతారు. ఈ సందర్భంలో తమ కుల గురువు గురించి ప్రార్థనారూపంలో కింది విధంగా పాడు కోవడం కన్పిస్తుంది.

పూర్వకోట్ పోయ్‌తార్ పోయారే కేన్జా నావిదాదా కేన్జా
పూర్మికోకు ఆసివాతోరే కేన్జా నావి దాదా కేన్జా
పూర్మికోక్‌నాన్ పూతాజ్జే కేన్జా నావి దాదా కేన్జా
పూల్ శివహర్‌యాల్ ఆతోరే కేన్జా నావిదాదా కేన్జా
కుపార్ లింగో జంగో ఆతాజ్జే కేన్జా నావి దాదా కేన్జా
ఖిలా ముఠ్యా మున్డే నివాడే మతాయే కేన్జా నావి దాదా కేన్జా
సార్ సగా పోయ్‌సి వాతాజ్జే కేన్జా నావి దాదా కేన్జా
నాలుంగ్ జండాంగ్ ముండాంగ్ మాతాజ్జే కేన్జా నావి దాదా కేన్జా
చుడూర్ సగా పోయ్‌సి వాతాజ్జే కేన్జా నావి దాదా కేన్జా
సల్లే గాగ్‌రెంగ్ నివ్‌డే మాతాయే కేన్జా నావి దాదా కేన్జా
పేర్సాపేన్ సూక్తీ వాతాయే కేన్జా నావి దాదా కేన్జా

గోండులు - సగాలు (ఐతిహ్య) నమ్మకం :

గోండులు కోయపున్నమి (దేవాల్‌పునాక్) తో వీరికి ఒక ఐతిహ్యగాథ వుంది. ఆదికాలంలో భోళాశంకరుడు మాతాకాళికంకాళి సంతానాన్ని శపించి కోయల్‌ఖచడ్, లోహగాడ్ గుహలలో (ఇవి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ సరిహద్దుజిల్లా అయిన బండారా జిల్లాలో ఉన్నాయి) బంధించినాడట. శంకరుని చేత శపించబడ్డ దేవతలను పాహన్డీకుమార్‌లింగో తన శిష్యులుగా స్వీకరించాడట. వీరికి మానవతా విలువల, సమ సమాజనిర్మాణం, ధర్మాధర్మాల నియమాలు దైవచింతన మొదలైన తత్వ జ్ఞానాన్ని బోధించినాడట. వీళ్ళే గోండులు అనేది యీ ఐతిహ్యసారాంశం.

ఇక్కడ ఒక విషయం గమనించాలి. ఆది భారతీయులు సంస్కృతీచిహ్నాలన్నీ శైవసంబంధాలే. వీరి కథ శైవంతో ముడిపడి వుంది. కాబట్టి ఆర్యులు భారతదేశానికి రాకమునుపు కొన్ని వేల సంవత్సరాల క్రితం నుండే గోండులు భారతదేశంలో విస్తరించారని సూచించేకథగా ఈ ఐతిహ్యాన్ని చెప్పుకోవచ్చు. అప్పటి నుండి భారతదేశాలలో గోండీ సంస్కృతుల 'సగా'ల (ఘట్టాలుగా) రాజ్యాలున్నట్లుగా చరిత్రకారులు నిర్ణయం. వీటికే గోండ్వానా రాజ్యాలని పేరు. ఇవి కోయటగణ్ ఖండాక్ పేరుతో 4 రాజ్యాలుగా పిలువబడేవట. అవి :

1. ఉమ్మేసట్టాకోల్ (ఉత్తరభాగం)
2. యేరు సట్టాకోల్ (వింధ్య సాత్పూరా ప్రాంతం)
3. సాయ్‌మల్ కోల్ (పశ్చిమభాగం) ఇందులో 24గోండు రాజ్యాలుండేవట.
4. అఫోకాకోల్ (దక్షిణభాగం)

ఈ రాజ్యాలు పాహన్డీకుపార్‌లింగో, రాయితడ్ జంగోలు ఏర్పరచిన శాస్త్రీయ సామాజిక వ్యవస్థకు ప్రతిరూపాలుగా వెలసిల్లాయని కోయ, గోండులు నమ్ముతారు.

గోండులు శుచీ శుభ్రతకు నిలయాలు - జనన, బారసాల సమయాలు :

గోండీ సంస్కృతిలోని ఆచారవ్యవహారాలు చాలా నియమనిష్టలతో కూడుకొన్నవిగా చెప్పవచ్చు. ఈ నియమనిష్టలో చక్కటి ఆరోగ్య రహస్యాలు కూడా దాగున్నాయి. శిశువు తల్లి గర్భం నుండి బయటపడగానే తమ ఇళ్ళ ముందురకాని, దొడ్లల్లో కానీ స్నానాల నిమత్తం ఒక గుంటను తవ్వుతారు. ఆ గుంటపైన తునికి, జీడి, వేప కట్టెలను పరుస్తారు. ప్రతిరోజు తల్లీబిడ్డ స్నానం చేయాల్సిన ప్రదేశమదే. స్నానాల సమయంలో తడిసిన ఈ కట్టెల నుండి కారిన నీటిలో ఎలాంటి క్రిములు దరి చేరవని తల్లీబిడ్డలు ఆరోగ్యంగా వుంటారనేది వారి నమ్మకాలు కావచ్చు. అంతేగాకుండా స్నానపునీటిలో తక్కెడు, ఆయిలు చెట్లు ఆకులను నీటిలో మరగించి, ఆ నీటితో స్నానం చేస్తారు. ఈ ఆకులు శారీరక నొప్పులను తగ్గించే అవకాశమున్నట్లుగాను, ఇది వారి ఆయుర్వేద పరిజ్ఞానాన్ని తెలిపే అంశంగాను చెప్పుకోవచ్చు.

బిడ్డపుట్టిన రోజున ఆడవారికి మాత్రమే విందును ఏర్పాటు చేస్తారట. దీనిని **పుట్టిసబ్బ** అంటారు. బిడ్డకు బొడ్డు ఊడిపోయిన రోజు బాలింతను ఇంట్లోకి తీసుకుంటారు. ఆ రోజే బిడ్డకు మేనమామలు తలవెంట్రుకలు తీసి శిశువును గూడా ఇంట్లోకి తీసుకొని వస్తారు. ఈ పురుడు కార్యక్రమాన్ని **మొడ్‌సభా, పాచేవి** పేరుతో జరుపుకుంటారు. ఈ రోజు మంత్రసాని **(సుయిన్)**ని అధ్వర్యంలో బాలింతను బావిదగ్గరకు తీసుకొనిపోతారు. ముత్తైదువలు బాలెంతకు పసుపుకుంకుమలతో అలంకరించి, పాటల పాడుతూ గంగపూజ చేయిస్తారు. ఈ పూజతోపాటు బావిదగ్గర **ఎహెవెలాక్, కంకంబుదోక్, సాటే ఆస్రాంగ్ మరిముంజంగ్** దేవతలకు కూడా పూజలు చేస్తారు. తర్వాత ఆ 21 రోజులకు బారసాల జరిపి, నామకరణం చేస్తారు. బంధువుల్ని ఆహ్వానించి ఇంటి సగా దేవతలకు పూజలు చేస్తారు. దీన్ని **తోకుడ్ పోర్** అంటారు. ఇంతవరకు నేలపై పడుకోబెట్టిన బాలెంతను అప్పటి నుండి మంచంపై పడుకోబెడతారు.

గోండీ సంస్కృతిలో "పీసివాట్ వారీ" - "శివార్ సాన్‌వాల్" ప్రాధాన్యత :

గోండీ సంస్కృతిలో ఎనిమిది రోజులపాటు వివాహ

ఉత్సవాలు జరుపుకుంటారు. ప్రస్తుతం యీ సంప్ర దాయాలు తగ్గాయి. కానీ పద్ధతులు మాత్రం సాంప్ర దాయబద్ధంగా వుంటాయి. ఈ సమాజాల్లో మగవారికి చేసే బలవంతపు వివాహాలను **పీసివాట్ వాల్** అంటారు. మగవారిని చేలనుండి, సంతలనుండి బలవంతంగా ఎత్తుకొనిపోతారట. తర్వాత అమ్మాయి తల్లిదండ్రులు అబ్బాయి తల్లిదండ్రుల్ని బంధువుల్ని ఒప్పించి పెళ్ళి చేసేవారు.

అమ్మాయి నచ్చినవారింటికి వెళ్ళడాన్ని **శివార్‌సాన్‌నాల్** అంటారు.ఈ ప్రవేశం చేసే అమ్మాయిలు తమకు వరసైన సగా గోత్రాలను తెలుసుకొనే పోతారు. ఇది దాదాపుగా ప్రేమవివాహం. ఈ వివాహంలో స్త్రీకి సంపూర్ణ స్వేచ్ఛ వుంటుందని దీని అర్థం. తమకు నచ్చిన వాళ్ళ ఇంటికి పోయిన వెంటనే పెద్దలు అంగీకారంతో పెళ్ళి జరిపిస్తారు. ఒక్కోసారి ఇల్లరికం **(లామ్‌సడే)** వివాహాలు కూడా జరుగు తుంటాయి.

సంప్రదాయ పద్ధతుల్లో సగాల ప్రాధాన్యత :

గోండుల సంస్కృతులో 12సగాలున్నాయి. ఈ సగాల్లో ఏ సగా వాళ్ళు ఎవరిని పెండ్లిచేసుకోవాలన్న విషయంలో వీరికి ఒక అవగాహన వుంది. వీరికి సగోత్రీకులతో వివాహాలు జరగవు. అంతేగాకుండా సరిసంఖ్య గోత్రాల వారితో కూడా వివాహసంబంధాలు కలుపుకోరు. నిశ్చి తార్థానికి పోయే ముందు వరుడు ఏ సగాలకు (సంఖ్య) చెందినవాడో అన్ని కణుపుల వెదురు కర్రను తీసుకొని పోవడం ఆనవాయితీ. ఊరి పొలిమేరలో శభశకునం చూడటాన్ని **అల్లు** అంటారు. పాలపిట్ట దర్శనాన్ని కూడా వీరు శుభశకునంగా భావిస్తారు.

వధువు తరుపువారు వరున్ని సగౌరవంగా ఇంటికి ఆహ్వానిస్తారు. ఊరి పెద్దల బంధువుల సమక్షంలో నిశ్చితార్థం జరుగుతుంది. ఈ సమయంలో వధువు వారు బీడీ చుట్టను తీసుకొంటే పెళ్ళి నిశ్చయమైనట్లే, భోజనా నంతరం వరుడు తీసుకెళ్ళిన వెదురుకర్రను వధువు ఇంటి చూరుతో చెక్కుతాడు. ఇంటిచూరులో కర్ర వుంటే ఆ యింటి అమ్మాయికి పెళ్ళి నిశ్చయమైనట్లు భావిస్తారట. అంటే ఆ కర్రను చూరులో గుచ్చుటమంటే పెళ్ళి అయ్యేంత వరకు యీ కర్ర మాకు బదులుగా అమ్మాయికి రక్షణలాగా వుంటుందని అర్థమట. అంటే భార్యకు భర్త రక్షకుడు అనే అర్థం గోండీ సంస్కృతిలో వుందని మనం భావించవచ్చు. కొన్ని సంప్రదాయ వివా హాలు వరుని ఇంటిలో జరగడం విశేషం.

వివాహపు తంతులు - వివరాలు :

వివాహానికి ముందురోజున వరుడు తరపు వ్యక్తి వధువు ఇంటికి పోతాడు. అతన్ని **'సుర్‌వెర్తల్'** అంటారు. తర్వాత వధువును, వరుడి ఊరిలో ఆమెకు కేటాయించిన ఇంటికి తీసుకొని వస్తాడు. వీరి పరిభాషలో విడిది గృహాన్ని **'జానాస్‌రోన్'** అంటారు. వధువు ఏ సగాకు చెందుతుందో అదే సగా ఇంటిలోనే విడిదికి వస్తుంది. వివాహానికి ముందురోజు ఊరిలోని పోచమ్మ పూజ చేసి, శక్తికొద్దీ బలులు సమర్పిస్తారు. దీన్నే **'అవ్వనాపూజ'** అంటారు.

వివాహానికి ముందురోజు వధూవరులకు బంధువుల ఇళ్ళలో పసుపుతో రోజుకు 5సార్లు చల్లని నీటితో స్నానం చేయిస్తారు. తర్వాత తీపి పదార్థాలు చేసి తినిపిస్తారు. దీన్ని **'ఎర్‌దొస్వారీ'** (మంగళస్నానం) అంటారు. పెళ్ళి సమయంలో పసుపులో నానబెట్టిన తెల్లటిబట్టను దోవతిగా కడతారు. దీన్నే **కపిడిగడి** అంటారు. వధూ వరులతో అమ్మవారికి పూజ చేయిస్తారు. ఆ పూజకు రెండు హారతుల్ని తయారు చేస్తారు. వధూవరులకు చెరొ కటి యిస్తారు. తర్వాత వధూవరులకు ఒక్కో కత్తిని యిస్తారు. ఆ కత్తి చుట్టూ ఖడ్గమాకారంలో బట్టను చుడ తారు. వధూవరులు ఎక్కడికెళ్ళినా పెళ్ళి అయ్యేంతవరకు అవి చేతిలో ఉండాల్సిందే. గొంగళి కూడా కప్పుకుంటారు. వదిన **(ఆంగ్డే)** వరుస వారు మాత్రమే హారతిని పట్టుకొని ముందు నడుస్తారు. వధూవరులకు బావ **(భాటో)** వరుసకు వ్యక్తి వధూవరులు కప్పుకొనే గొంగళిని, వెదురు కర్రను పట్టుకొని వుంటాడు. ఇతడే వధూవరులను పూజా కార్యక్రమాలకు, పెండ్లి పందిట్లోని మోసుకొని తీసుకెళు తుంటాడు.

పెళ్ళిలో వరుని మేనత్త మేనమాలు చేసే కార్యక్రమాన్ని **'కుమ్మెకుమ్మరీ'** అంటారు. ఐదు చిన్నముంతలను **(కరియకుపాంగ్)** అలంకరించి, వెదురు జల్లతో తీసుకొని పోయి, ఊరి మధ్య కానీ, ఊరి చివరగానీ ఖాళీ స్థలంలో ఉంచి, ఆ ముంతల్లో నీటిని నిప్పురవ్వల్ని వేస్తారు. దీన్నే **'పనెడువ్వే'** పూజ అంటారు. తర్వాత వాటిని పెళ్ళి పందరికి తీసుకొని వస్తారు. పెళ్ళి పందరిలో జొన్నపిండి, పసుపు, కుంకుమ, గులాల్ జొన్నల కలిపి ముగ్గు వేస్తారు. ముగ్గుపై పీటలువేసి వధూవరులను కూర్చోబెడతారు. ఆ ముగ్గుపై ఐదుస్థలాల్లో జొన్నలు పోసి వాటిపై చిన్న కుండలు పెట్టి నూనెపోసిన దివ్వెలు వెలిగిస్తారు. వాటి చుట్టూ ఐదుసార్లు దారంతో కడతారు.

బహుశా ఈ అయిదు సంఖ్య ముత్తయిదువ తనానికి సాక్ష్యం కాబోలు. వధూవరులు ఒకటిగా వుండాలనే ఉద్దేశ్యంతో ఒక దోవతిని రెండుగా చింపి వధూవరులకు చెరొకటి యిస్తారు. ఇలాంటి పెళ్ళి బట్టలన్నీ దాదాపుగా పసుపులో నానబెట్టినవే. శాస్త్రీయంగా ఆలోచిస్తే పసుపు సూక్ష్మక్రిమినాశిని అని మనకు తెలిసిందే. కొని వేల సం॥క్రితమే పసుపులో రోగ నిరోధక శక్తి ఉందని వీళ్ళు ఆలోచించడం ఆశ్చర్యం. పెళ్ళి సమయంలోనే ఒక చిన్న కోడిపిల్లను వధూవరుల చేతులలో ఆడిస్తారు. దీన్ని **ఖోడకూరి** అంటారు. తమ ఇంటి సగా లోని దేవతను పూజించే విధానాన్ని **దేవదేవీ** కార్యక్రమం అంటారు.

వీరి **చిట్టింగ్** కార్యక్రం వియ్యపురాళ్ళ సఖ్యతకు సాక్ష్యం. వియ్యంకులు, వియ్యపురాళ్ళు ప్రత్యేకంగా తయారైన వంటకాలను ఒకరికొకరు మార్చుకొంటూ తింటారు. ఈ మార్పుల నాలుగవ సగా వారైతే నాలుగు సార్లు, ఐదో సగా వారైతే ఐదుసార్లు మార్చుకోవడం గమనార్హం. చివరగా వధూవరులు చేతుల్లోని హారతి కుడుకలను **గోవాధాన్ గోటాన్** దగ్గర పూజానంతరం ఆ కుడుకులను వధువు ఆడవారి చేతికి వరుడు మగవారి చేతికి ఇస్తారు. ఆ గోవార్ దాన్ గోటాను గురించి తెలుసుకుందాం.

గోవార్ దాన్ గోటాన్ :

పెళ్ళి సమయంలో మేనత్త, మేనమామలతో ఆరంభమయ్యే ఈ తంతు గురించి ముందే తెలుసుకున్నాం. ఇంకా ఈ తంతుతో వధూవరులకున్న ప్రాముఖ్యత గురించి తెలుసుకుందాం.

ఊరిబయటకానీ, మధ్యలోకానీ ఖాళీ స్థలంలో కుండలో నీరుపోసి నిప్పురవ్వలు వేసి వుంచుతారు. వధూవరులు ఎదుర్కోలు ఇక్కడే జరుగుతుంది. వధూవరులను కొత్త దుస్తులతో ముస్తాబుచేయించి బావవరుసైన వ్యక్తి వధూ వరులను ఇంటినుండి బయటకు ఎత్తుకొని వస్తారు. ఇంటిబయట వారి సగా దేవుని సంఖ్యను బట్టి కొబ్బరికాయలు కొట్టి పూజిస్తారు. తర్వాత గోవరదాన్ గొటాన్ కు వస్తారు. ఇక్కడ వధూవరుల్ని ఎదురెదురుగా నిలబెట్టించి మధ్యలో ఒక గుడ్డ కడతారు. వధూవరుల బంధువులు కూడా ఎదురెదురుగా నిలబడి బ్రహ్మముడి పేరుతో **(లింగో)** మూడుముళ్లు వేసి అక్షింతలు చల్లుతారు. వాస్తవానికి ఊరిమధ్యలో కానీ, బయట కానీ చేసే ఈ తంతులో పారమార్థకత దాగి వుంది. వీళ్ళు ప్రకృతి బిడ్డలు. ప్రకృతి నుండి పుట్టిన మనం ప్రకృతిలోని పంచభూతాల సాక్షిగా ఒకటౌతున్నామనే అర్థంతో వధూవరులు ఒక్కటౌతారనేది ఈ తంతుకు సాక్ష్యం.

అంతేగాకుండా తమ కులగురువు శ్రీ పాహాన్డి కుపార్ లింగో ఈ బ్రహ్మముడిని వేస్తాడని కూడా వారు నమ్ముతారు. తర్వాత వధూవరులను అక్కడికి తీసుకొని వచ్చిన వ్యక్తి ఎత్తుకొని పెండ్లిపందిరి లోని చిన్నకుండలు **(కురియాపాంగ్)** చుట్టూ కట్టిన నూలుపోగు చుట్టూ ఐదు సార్లు ప్రదక్షిణం చేస్తారు. ప్రదక్షిణాంతరం వధూవరులు పీఠలపై కొంతసేపు కూర్చొని వెళ్ళిపోతారు. తదనంతరం పసుపురుద్ది వధూవరులకు మంగళస్నానం చేయించి కొత్తబట్టలు కట్టించి మళ్ళీ పెండ్లి పీఠలపై కూర్చోబెట్టి మంగళ సూత్రాధారణ చేయిస్తారు అప్పుడు వీరి ఆనందోత్సవాలు మిన్నంటుతాయి.

అప్పగింతలు (కోరతే దొస్సార్):

నూతన వధువుకు అత్తగారింట్లో మెలగవలసిన మెళుకువలు చెబుతూ అమ్మమ్మలు, అమ్మలు, అక్కలు, వధువు తరపున బంధువుల స్త్రీలు పాటలు పాడుతూ 'మా అమ్మాయిని అప్పగిస్తున్నాం. అమ్మాయికి మంచి చెడులు ఇక నుంచి మీరే చూడండి' అన్నట్లుగా అప్పగిస్తారు. అప్పగింతలు తర్వాత వరుడు ఐదురోజుల పాటు వధువు ఇంట్లోనే ఉంటాడు. దీన్నే మారుపెళ్ళి అంటారు. తర్వాత వరుడు వధువును తన ఇంటికి తీసుకొని వస్తాడు. దీన్నే తీరుపెళ్ళి అంటారు. తీరుపెళ్ళి తర్వాత వరుని ఇంట్లో ఒక కార్యక్రమం జరుగుతుంది. దీన్నే **'గూడాసూటికి యావాల్'** అంటారు. నూతన వధూవరుల బంధువులు అందరూ కలిసి రొట్టెలు, బెల్లం పట్టుకొని పెండ్లిపందిరి చుట్టూ కట్టిన దారాన్ని విప్పుతారు. దీనితో ఆ పెళ్ళితంతు ముగుస్తుందని అర్థం.

మరణ సమయంలో చేసే కర్మకాండ తంతులు :

గోండీ సంస్కృతిలో ఖననము, దహనకాండ రెండూ ఆచారాలు ఉన్నాయి. దహనం అయిన వారికి కర్మకాండ అదేరోజుగానీ, మూడురోజులకు గానీ చేస్తారు. ఖననము అయినవారి కర్మకాండ ఐదు రోజుల తర్వాత చేస్తారు. ఒక్కోసారి 'కారుణ్' (సంవత్సరీకం) పేరుతో ఒక సంవత్సరం తర్వాత చేస్తారు. ఈ సంస్కృతిలో పాడె మోసే నలుగురికి ఒకరోజు మాత్రమే సూతకం వుంటుంది. తర్వాత వీళ్ళు స్వేచ్ఛాజీవులే. పేన్‌కారుణ్ అంటే వీరి భాషలో భగవంతునిలో ఐక్యమవ్వడమనే అర్థం వుందట. కాబట్టి ఈ కార్యక్రమంతోనే వారి ఆత్మకు శాంతి కలుగుతుందనేది వారి నమ్మకం. సాధారణంగా చనిపోయిన వారి కర్మల్ని వీరు కార్తీకమాసంలోనే నిర్వహించడం గమనార్హం.

ఈ కారుణ్ కాండలో మృతులైనవారు ఎన్ని సగాల వారైతే అన్నే కుండలను తెప్పిస్తారు. ఇల్లు వాకిలి శుభ్రపరచి ఇంటి వాకిలి ముందు పాడవాటి గాడిని తవ్వి, ఆ గాడిలో కుండలను పేర్చుతారు. అక్కడ ఏడవడానికి ఏర్పాటుచేసుకున్న ఇద్దరి స్త్రీల తలలను నీటితో తడుపుతారు. వీరిద్దరిలో ఒకరు చనిపోయిన వ్యక్తి తాలూకు సగా వారై వుండాలనేది నియమం. తర్వాత ఒక గుంజకు కట్టిన మేక నెత్తికి కాళ్ళకు పసుపు, కుంకుమరాసి మెడకు ఆకులతో చేసిన మాలను వేసి అలంకరిస్తారు. ఒక కుండ నీటిలో ఇప్పపూలు నానబెట్టి వుంటారు. ఒక ఆకుతో ఆ కుండ నీటిని తీసుకొని మేకపై చల్లుతారు. తర్వాత మేకను వధించడంతో కారుణ్ పూజ ముగుస్తుంది.

మరణకాండలో చివరి తంతు - కోర్‌మెర :

కారుణ్ కార్యక్రమాలలో కోసిన మేకమాంసాన్నే నైవేద్యంగా వండిన తర్వాత పిండరూపంలో పిట్టకు పెడతారు. పిండం పెట్టిన ఆ స్థలంలోనే మగవాళ్ళు భోంజేస్తారు. స్త్రీలకు ఇండ్లలో ఏర్పాటు చేయబడిన ఆహారం భుజిస్తారు. జొన్న పిండిపై ధాన్యం కొలిచే తూనిక వంటి పాత్రను వుంచి దానిపై దీపం పెడతారు. అక్కడే తెల్లవార్లూ పాటల పాడుకుంటూ జాగరణ చేస్తారు. మరణించిన వారి సగా లకు చెందిన (ప్రధాన్) పాడే పాటల్లో - మరణాల వృత్తాంతాలు, మానవసృష్టి, మానవ సమాజాలకు పూర్వం భూమిసృష్టి గోండీ ధర్మ పూర్వాపరాలు చెప్పబడతాయి. ఈ కార్యక్రమంలో చనిపోయిన వారు ఆపైన ధరించే ఆత్మ ఆకారం జొన్నపిండిలో ఏర్పడుతుందని ఆ ఆకారాన్నే బట్టి వాళ్ళు ఏ జన్మనెత్తుతారో తెలిసిపోతుందని వారి నమ్ముతారు.

చనిపోయిన ఆత్మలు పేన్‌కారుణ్ తర్వాత దేవునిలో ఐక్యమైనట్లు వీరు భావిస్తారు. పేన్‌కారుణ్ జరపని వారి ఆత్మలు గాలిలోనే వుంటాయనేది కూడా వారి నమ్మకమే. కారుణ్ తర్వాత **'తుమే'** అనే కార్యక్రమం ద్వారా వారి సగా పెద్ద దేవుని దగ్గర పూజలు చేస్తారు. అప్పటికి వారి ఆత్మకు శాంతి చేకూరుతుందని నమ్ముతారు. కాబట్టి ఈ **'కోర్‌మెర'** కార్యక్రమాలలో రాబోయే జన్మఆకారాన్ని దర్శించడం కోసమే కోర్‌మెర కార్యక్రమాన్ని చేస్తున్నట్లుగా భావించవచ్చు. మానవ సమాజానికి చనిపోయిన వాళ్ళు మళ్ళీ పుడతారనే నమ్మకం లేనట్లుయితే కొందరు ఒక

నిరాశకు గురికావచ్చు. అలాంటి వాళ్ళకు ఈ తంతు ఊరట మాత్రమే.

ఇంతవరకు సాగిన యీ వ్యాసంలో గోండులు ధర్మ సంస్థాపనకు, ఉన్నతమైన మానవతా విలువలకు కట్టుబడి వుండాలనేది వారి నియమంగా తెలుస్తుంది. వారు ఏర్పర్చుకున్న సగా లు చక్కగా వ్యవస్థీకృతమైన సమాజానికి నిదర్శనమని కూడా చెప్పవచ్చు. బాలింతలు, శిశువుల పట్ల వారు ఆచరించే (ఆయుర్వేద పద్ధతుల) పద్ధతులు వారి ప్రకృతి వైద్యాలకు సూచకాలు. వివాహ విషయాలలో మగవారితో సమానంగా స్త్రీలకు కల్పించిన స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు వారి సమసమాజాలకు ఆన వాళ్ళు. పెండ్లి సమయాల్లో ఆచరించే శాస్త్రీయ విధానాలు, వారి ఆలోచనలు రేపటి తరాలకు ఆదర్శం కాగలవని చెప్పవచ్చు. ఒక్క మాటలో చెప్పాలంటే వారి సంస్కృతీ చర్యల్లో శాస్త్రీయత పారమార్థకత రెండూ దాగున్నాయని నిస్సందేహంగా ఉద్ఘాటింపవచ్చు.

❁❁❁

తెలుగునాట గిరిజనుల స్థానం – ప్రస్థానం

– డా॥. పి.శివరామకృష్ణ , శక్తి స్వచ్ఛంద సంస్థ. హైదరాబాదు, తెలంగాణ.

'ఆటా మనదే, పాటా మనదే బీఅన్నీ విద్యలు గల్ల వారము
వేట మనదే, వెట్టి మనదేబీవేయి విద్యలు గల్లవారము
కొలువు మనదే, కొలత మనదేబీకోటివిద్యలు గల్ల వారము
ఆడవాలె పాడవలె, వేడుకలు చేయవాలె
జంగం కాము, జోగుకాముబీజోటాలుండే బాలలము
వీట్లం కాము విద్దెలం కాముబీవేడుకల బాలలము
అమ్మవారు ఉన్నప్పుడు ఆడే పాడే బాలలము
మనసుకు మంచివారము మాపటికి దొంగవారము
అచ్చుకోడ లయ్యోకోడ, లాలచ్చిరి బాల కోడలా
అడవులుబీలోయలు, బయళ్ళు, కులపర్వతాలు.
తూర్పుకనుమలు.

నల్లమల అడవులు, గోదావరి లోయలు, ఉత్త రాంధ్రంలో బయళ్ళుగా తూర్పుకనుమల ప్రకృతిలో వైవిధ్యాన్ని మనం పిలుచుకుంటాం. ఈ కనుమలలో ఉన్నత శిఖరం మహేంద్ర గిరి కులపర్వతాలలో ఒకటి. ఈ కనుమలన్నిటిని మరో కులపర్వత శ్రేణి మలయ పర్వతాలుగా కొంధమల్, మాల్యవంతం, నల్లమల, తిరుమల, అన్నామలలుగా ఆయా ప్రాంతాలలో పేర్కొంటారు.

దండకారణ్యంలో రంప-జాడి-దంతెవాడ-మన్నె కొట్టాలు :

వీటిలో మల/మాల్యవంతం అంటే తూర్పు పశ్చిమ గోదావరిజిల్లాల్లో పాపికొండలనుండి ఏలేశ్వరంలో నాగుల కొండదాకా, విశాఖ జిల్లా సరిహద్దులోగల సీలేరు / డొంకరాయి అంటే జాడిదేశం, అనగా ఝాడ్/ చెట్లదేశం దాకా విస్తరించిన లోయల్లోగల రంపరాజ్యంలోని, కొండ రెడ్డి తెగవారు మువ్వలదుడ్డు వేస్తూ కదంతొక్కుతూ, పండుగ, పెళ్లి బసలలో స్వతంత్రమైన తమ జీవన విధానాన్ని వివరిస్తూ, తమను లోకువగా చూసే దిగువ వారి బతుకులను ఎండగడుతూ పాడుకునే యువగీతం ఇది. 'దండకారణ్య మధ్య పుళింద రంభాహి వంశజులకు అభయమొసగి'నారని భీమేశ్వర పురాణంలో రాజ మహేంద్రవరం రెడ్డి రాజులను శ్రీనాథుడు ప్రస్తుతిస్తూ, వారు 'ఝాడేశ వన, నప్త మాడే. బారహ, దొంతివంతు నాది క్షితీశ్వరులను గెలిచి'నారని పేర్కొంటారు. సప్తమాడేములు 'మాడ్గుల ఆదిగా గల మన్నె కోట్టములు' దొంతి నేటి ఛత్తీస్ఘర్ లో దంతె వాడ. 'మాడుగుల గెల్చె-వడ్డాది మసి యొనర్చె'నని అల్లసాని పెద్దన కృష్ణదేవరాయల కళింగ దండయాత్రలో వర్ణిస్తాడు.

తూర్పు కనుమలు స్థల పురాణాలు :

ఈ కనుమలతో తెలుగుజాతి చిరంతనమైన అనుబంధంలో వివిధ పార్శ్వాలను, దక్షిణాన చెంచులక్ష్మి, ఎరుకలసాని, హాధీరామ్ బావా, సేవాలాల్, భక్త కన్నప్పబీ ఉత్తరాన గోదావరి లోయల్లో గంగాలమ్మ, పోకల దమ్మక్క / శబరి, విశాఖ మన్యం పాడేరు బయళ్ళలో మోద కొండమ్మ, మత్స్య కంబేరమ్మ, శ్రీ ముఖలింగం, పూరి క్షేత్రాల స్థల పురాణాలు వారి ప్రస్థానంలో గతి శీలాన్ని చాటి చెపుతాయి. ఆచార్య బిరుదురాజు రామరాజు పేర్కొన్నట్లు 'వీరందరి వారసులం మనం'.

గణ రాజ్యాలు-రాజ్యాలు :

కుల పర్వతాలు పేర్కొన్న తూర్పు,పశ్చిమ తీరం మధ్యనున్న కనుమలు, వింధ్య, సహ్యాద్రి పర్వత శ్రేణులు, హిమాలయాలు, ఈశాన్య, వాయవ్య సరిహద్దు ప్రాంతాలలో వస్తుమార్పిడి, సంప్రదాయ సరిహద్దులు, ఉమ్మడి కట్టుబాట్లు, వాటిని అమలు చేసే సదురు, గొట్టుబస, నసాబు మొదలైన గ్రామసభల సమాఖ్యలు, ఆట పాటలతో నిండిన గణరాజ్యాలు ఈ కొండ ప్రాంతా

లవి కాగా , కోశం, దండం, కవి గాయక వైతాళిక పురోహిత వర్గాలు, శాసనాలతో దిగువ ప్రాంతాల్లో రాజ్యాలు పరిపాలిస్తుంటాయి. వ్యాపారవర్గం, సైనికబలంతో, రాజ్యాలు, గణ రాజ్యాలలోకి చొచ్చుకు పోయినప్పుడల్లా, ఆజన్మ ధనుర్ధరులైన గిరిజనులు వారిమీద తిరుగుబాటు చేస్తున్నారు.

మహేంద్రగిరిలో శివాలయాలను పాండవులు నిర్మించారట. విశాఖ జిల్లాలో వడ్డాది రాజధానిగా మత్స్య రాజులు పాలించారు. మత్స్యదేశంలో తలదాచుకున్న పాండవులుగా తమను భావిస్తూ

'విరాట రాజు దేశం విటిం పండుగలు-
కాశివారిదేశం గంగ పండుగలు,
కొండవారిదేశం కొలువు పండుగలు'

అంటూ నంది కొలువు పండుగలలో భారత గాధను తమకు అనువుగా మార్చుకుని పాడుకుంటారు. పిట్టగడ్డ జాలంపల్లి పట్టపు కోలన్న అని గ్రామనౌకరు వర్గానికి చెందిన కోలన్న అంటే కర్ణుడిని ఆహ్వానిస్తారు. కర్ణుడు పాండవుల వ్యవసాయాభివృద్ధికి తోడ్పడతాడు.

ఈ పాటలో 'కొండవారిపంట - దిగువవారి వంట పంచ పాండవుల పంట-దుర్యోధనుడి వంట' 'కోదోడి పంట- కోమటోడి సంచి' అంటూ దోపిడీని నిరసిస్తున్నారు.

ఓ ...ఎద్దుమీదర సజ్జ గట్టి ఎంతోదవ్వుర బేరగాడు
దవ్వు కాదోయ్ దారకొండ దారకొండ ర బేరగాడు
తూరుపుకుంచముతో తూరగొలచినబేరగాడు
పడమర కుంచముతా పారగొలిచిన బేరగాడు
చిగురుల చింతలలోన చిత్తులాటలో పొద్దుపోయే
పొద్దు పొతే పోయిది గాని పొద్దు వెంటర ఎద్దుపోయే
ఎద్దు పొతే పోయిది గాని ఎద్దు వెంటర సజ్జ పోయె
సజ్జ పొతే పోయిది గాని సజ్జ వెంట డబ్బుపోయే
డబ్బు పొతే పోయిది గాని డబ్బు వెంట ఇల్లు పోయె
ఇల్లు పొతే పోయిది కాని ఇల్లు వెంట ఇల్లాలు పోయె

పండించకుండా, వేటాడకుండా, పెంచకుండా రూపాయలతో కొనుక్కునే రాజ్యంలో మార్కెట్ వ్యవస్థను 'దుకాణం మీద బియ్యం -దుక్కమీద ముక్క'గా దుయ్యబడుతున్నారు.

'రాజ రాజము-రంప రాజము
రాజు వచ్చి చేయి వేయ
రాజమంతా తొనుకు తొణికే'

ఈ విధంగా, సోకులతో, బంగారంతో నాణేలతో అధికారంతో రాజు చేయివేసేసరికి తొణికి వెలితి పడసాగింది. రకాల వికారాలు ప్రవేశించాయి.

'నయ్యకేసి రంగులవాడు,రంగు పూసల బేరగాడు'.
'గుమస్తా వాడితో గుద్దుకున్న లంజ',
'గూడెము సంతకు వెళ్లి గుట్టు చక్కగాడుక రావో'

తూర్పు గోదావరి గిరిజనుల సంప్రదాయం ప్రకారం, రాజు బలవంతం చేస్తే గంగాలమ్మ ప్రాణత్యాగం చేసుకుంటుంది. అయితే విశాఖ మన్యంలో పెద్దలే రాజు ప్రేమించిన గంగతో పెళ్లి చేస్తారు.

ఈ విధంగా గణరాజ్యాలతో ఇచ్చిపుచ్చుకుని సంధి చేసుకుంటూ సంబంధాలు పెంచుకుంటున్న వైనాన్ని చెంచులక్ష్మి, మోదకొండమ్మ,సమ్మక్క సారక్క ఐతిహ్యాలు తెలియచేస్తాయి తెలుగు రాష్ట్రాల మధ్యలో గల నల్లమల అడవులలోలో ఓడిపోయిన రాజులు తలదాచుకునేవారు. వారిని వెంటాడే క్రమంలో ఈ అడవులమీద పట్టు సాధించటానికి నాగార్జున కొండ కేంద్రంగా బౌద్ధం, శ్రీశైలానికి దారులు తెరచి శైవం, 'చెంచుల అహోబల శ్రీ నారసింహము' అని కీర్తిస్తూ వైష్ణవం పాటిపడ్డాయి.

'ఇటు పక్క లక్షుమమ్మ, అటు పక్క చెంచురాలు-
ఇద్దరికీ నట్టనడుమ దేవుడు పెన్నోబలేశు' అని జాతుల సహజీవనాన్ని మెచ్చుకుంటూ, 'అందమైన అడపడు చులు చెంచువారికెందుకు పొంచి పొంచి ఓబులేశుడు ఎత్తుకు పోయేటందుకా' అంటూ లైంగిక దోపిడీని గిరి జనులు, జానపదులు ఎత్తిపొడుస్తారు.

విశాఖ మన్యంలో కొండదిగువన ఉన్న వడ్డాది వారు - కొండరాజ్యం జైపూర్ నందపురం వారు బంధుత్వం కలుపుకున్నారు. విభిన్నమైన విలువలు పాటించే ఎగువ-దిగువ వివాహ సంబంధాలలో అపశృతులను, దిగువ ధోరణిలో అంటరానితనం పాటిస్తున్న కొండజాతులలో వివక్షవల్ల జరుగుతున్న నష్టాన్ని, వివరించి వారి మధ్య ఇచ్చి పుచ్చుకోడానికి అనాది పునాది, వివాహ సంబధాన్ని ఆదర్శంగా నిలుపుతూ, మోదకొండమ్మ పదంలో

'శరణు శరణు దుర్గాలమ్మలు మీచరణాలు తప్పలేను
మీ చరణాలు తప్పినగాని మీ కరుణలు తప్పలేము
మీలాటి కాలము లాగా మిమ్ము తలచి పాడుతాము'

దిగువ రాకుమారితలు మోదమ్మలను దుర్గలుగా పేర్కొంటూ, వారి కుమారుడు సంజీవరాజు 'మన్నెఇంటి రాజైనా మాలయింటిపడుచు గంగను' పెండ్లి చేసుకున్న తీరును పాడుకొంటారు.

మోదకొండమ్మ, సమ్మక్క సారక్క పండుగలను ప్రభుత్వ గిరిజనోత్సవాలుగా ఇరు తెలుగు రాష్ట్రాలు జరుపుతున్నాయి.

అభివృద్ధిలో పోటిపడిన దొరలు - రాజులు :

రాయల కళింగ దండయాత్రలో ఓడిపోయిన తూర్పు తీరంలో గజపతుల సామంతులైన కొందరు రాజులు, నందపురం కొలువులో చేరారు. కొండదిగువన ముఖాసాలు పొందారు. నందపురం వారసత్వ కలహాల్లో ఒక వర్గాన్ని సమర్థించారు. అందుకు బదులుగా నందపురం దాని బంధు సామంత రాజ్యాలను తమ సామంతులుగా ప్రకటించుకున్నారు. కొండదొరలందరూ రాజులమీద తిరుగుబాటు చేసారు. బ్రిటిష్ ప్రభుత్వం వారందరిని స్వతంత్ర సంస్థానాలుగా గుర్తించారు. విజయనగరాన్ని విద్యలనగరంగా రాజులు అభివృద్ధిచేస్తే, విశాఖ పట్టణాన్ని తూర్పుకనుమలను పాలించిన కొండదొరలు అభివృద్ధి చేసారు. తూర్పుకనుమలలో ప్రాచీనరాజధాని నందపురం / జైపూర్ రాజా విక్రమదేవ వర్మ ఆంధ్రవిశ్వ విద్యాలయం కులపతి. హవామహల్, దసపల్లా, విశాఖ తాజ్ మహల్, కురుపాం మార్కెట్, రాణి చంద్రమతి దేవి ఆసుపత్రి ఇవన్నీ గిరిజనుల వితరణకు తార్కాణాలు.

17వ శతాబ్దంలోనే నందపురం నుండి జైపూర్‌కు రాజధాని మారింది. అయినా ఇప్పటికీ గిరిజనులు

'అందమైన నందపురము నంది ఆటలు అడివద్దాం-
తియ్య గుమ్మడి తీసి వద్దాం, మళ్ళు గుమ్మడి మరలి వద్దాం'

అని పాడుతుంటారు. హంపీ విజయనగరాన్ని చరిత్ర కారులు forgoten kingdomగా, ఈ వదిలేసిన నంద పురాన్ని forsaken kingdomగా వర్ణించారు.

గిరిజనుల భాషా సాహిత్యాలు :

తమిళం నుంచి తుళు దాకా గలవి దక్షిణ ద్రావిడ భాషలు కాగా, తెలుగు నుంచి కువి దాకా ఉన్నవి మధ్య ద్రావిడ భాషలు. (ద్రావిడ భాషలు. పి.యస్. సుబ్రహ్మణ్యం. తెలుగు విశ్వవిద్యాలయం 1997) మధ్య ద్రావిడ భాషల్లో ఉత్తరాది కనుమలలో కొండరెడ్లు, బగతలు, వాల్మీకులు, కొండదొరలు, నాయక పోడు వగైరాలు, దక్షిణాదిన ఉన్న చెంచులు యానాదులు, మొదలైన తెగలది తెలుగు గిరిజన భాషా మాండలికం.

వివిధ ప్రాంతాలు, తెగలు, జాతులు, వారి జ్ఞానంబీ తరతరాలకు అందించుకునే భాషలు, నుడికారపు తీరులు ఒక క్రమ పద్ధతిలో సేకరించి, పాఠాలుగా పెట్టడం, వాటిని ఉన్నత విద్య పరిభాషతో జోడించడానికి ప్రత్యేకంగా కృషి చేయాలి. పాలకుల పాలన పద్ధతులు, లెక్కలు, కొలతలు తెలియని పాలితులు మోసపోతారు. ఈ అవసరాన్ని గుర్తించడమే కాదు, 1890 లొనే ఆ పనికి పూను కున్న బడిపంతులు గిడుగు రామమూర్తి పంతులు. సవరల జంతువిజ్ఞానం తెలియజేసే కథలు, వారికి తెలిసిన నాటి తిరుగుబాటు చరిత్ర, వారి కట్టుబాట్ల ప్రకారం నేరము - శిక్షబీ న్యాయస్థానాల్లో వారు పడే తబ్బిబ్బులు - వీటితో అయన పుస్తకాలు తయారు చేశారు (సవర కథలు.

ఎమెస్కో). ఒక సంస్కృతిని అర్థం చేసుకునే పద్ధతికి, పునాది వేశారు. కానీ ఆ దారిలో బుద్ధిజీవులు ముందుకు పోలేకయారు.

గుర్తింపుకు నోచుకోని తెలుగు గిరిజన మాండలికం:

కొత్త భాషలను కనుక్కోవాలనే ధ్యాసలో పడిన మన భాషా శాస్త్ర వేత్తలు, ఈ కనుమలలలో ఇరుగు పొరుగు రాష్ట్రాలలో గల ద్రావిడ భాషలు గోండి, మండ, పెంగో, కూయి, కొలామి, నాయకీ మొదలైన భాషలను అధ్య యనం చేసారు కానీ గిరిజన భాషా మాండలికాన్ని పట్టించుకోలేదు. వారి గురువు ఎమనోవ్ తోడాతెగవారి పాటలు పోగుచేసాడు కాని, వీరు భాషను తప్ప సాహి త్యాన్ని సేకరించలేదు. వృత్తిపదకోశాల తయారీలో కూడా తూర్పుకనుమలలో గల తెలుగు మాండలికాన్ని పట్టించు కోలేదు.

పరిశోధక విద్యార్థిగా స్వీకరించి ఈ తెలుగు తెగల సాహిత్య సేకరణ విశ్లేషణకు 1976లో నాందిపలికినవారు రామరాజుగారు ('తెలుగు గిరిజన గీతాలు' 1991. పరి వర్ధిత ముద్రణ 'కొండకోనలలో' తెలుగు గిరిజనులు 2007, శక్తి ప్రచురణ). దీని సంక్షిప్త రూపం 'గిరిజనుల కళలు, సాహిత్యం'లో (అంబేద్కర్ సార్వత్రిక విద్యా లయం తెలుగు జానపద విజ్ఞానం) స్థల పురాణాలలో గతిశీలతలో వివిధ దశలను విశ్లేషించింది (2010). తెలుగు విశ్వవిద్యాలయం జానపద విజ్ఞానశాఖలో ఈ కృషిని వ్యాప్తి చేసినవారు ఆచార్య భక్త వత్సలరెడ్డి (కొర్రా జుల కథలు పద్మనాయకుల వృత్తాంతం, కొండరెడ్డి గిరిజనుల పాటలు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచు రణలు). గిరిజనమాలికలో ద్రవిడవిశ్వవిద్యాలయం తెగల వారీగా మొదలుపెట్టిన ప్రచురణలలో చెంచు, బంజారా, తెలుగు కదా సాహిత్యం గిరిజన జీవితం వచ్చాయి. గోండ్ కోల మిల సంప్రదాయ సాహిత్యాన్ని పాశ్చాత్య మానవ శాస్త్రజ్ఞులు హైమెండర్ఫ్, మైఖేల్ యార్క్‌లు రికార్డ్ చేశారు. ఆకాశవాణి ఆదిలాబాద్ కేంద్రంలో, సుమనస్పతి, అక్కడి తెగల సాహిత్యాన్ని గూర్చి రాస్తూ, రికార్డు చేస్తున్నారు. బంజారాల సాహిత్య సేకరణలో జనపాల శంకరయ్య (తెలుగు లంబాడీల గేయ సాహిత్యం 2001. జనపాల వారి ప్రచురణలు) కృషి చెప్పుకోదగినది. సూర్య ధనుంజయ్, గోననాయక్ విశేషంగా కృషి చేసారు.

నేను స్థాపించిన శక్తి స్వచ్ఛంద సంస్థ గిరిజనుల సాధి కారితకు తోడ్పడుతూ, చెంచు, కొండరెడ్డి యువకులను ప్రోత్సహించి, వారు సేకరించిన సంప్రదాయ సాహిత్యం ప్రచురిస్తున్నది (నల్లమలలో చెంచు ప్రపంచం), అమ్మ నుడి పత్రికలో 'గోదావరి లోయలో కొండరెడ్ల బతుకు కథలు' ధారావాహికంగా (2015) వచ్చాయి. 1, 2, 3 తరగతుల వాచకాలను తెలుగేతర తెగలభాషలలోకి మాతృభాషలో విద్యాబోధనకోసం ప్రభుత్వం అనువదింప చేసింది. ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమశాఖ (ట్రైబల్ కల్చరల్ మిషన్ విశాఖపట్నం) రాయించిన విశాఖ గిరిజన సంస్కృతి సాహిత్యాలు, కొండరెడ్ల సంస్కృతి సాహిత్యాలు, ప్రధానోపాధ్యాయులకు కరదీపిక గిరిజన సంస్కృతి (2018), అచ్చులోకి రావాలి, ఈ శాఖలో ఎందఱో రచ యితలున్నారు కానీ వారిలో గిరిజన వారసత్వాన్ని, సాహి త్యాన్ని గూర్చిన ఆసక్తి, అవగాహన కనిపించదు.

చట్టాలు, లెక్కలు చెప్పని చదువులు :

గిరిజనులది మౌఖిక సంప్రదాయం. తెల్లవారు ప్రవేశ పెట్టిన రాతకోతలు - మ్యాప్‌లు, రికార్డులు, లెక్కలు గిరిజనులకు అంతుబట్టలేదు. వారు ప్రవేశ పెట్టిన సార్వ త్రిక విద్య నేటికీ వీటిని బోధించదు. తమ పాలనపై గంజాం, గుణుపూరు, గూడెం, రంపలలో గిరిజనులు చేసిన తిరుగుబాట్లను అణిచివేసారు. ఈ తిరుగుబాటు లకు స్పందిస్తూ ఒక నాడు గణరాజ్యాలున్నప్రాంతాలను అనుసూచిత ప్రాంతాలుగా ప్రకటించి ప్రభుత్వం చట్టాలు చేస్తున్నా, అమలు చేసే అధికారులు, చొచ్చుకు వస్తున్న దిగువవారితో కుమ్మక్కై సహజవనరులు వారికి కట్టబెట్టసాగారు. అప్రాంతాలలో 'తరుణ కాష్టజలసమృద్ధి' సంప్రదాయ విధానం కాగా కింది ప్రాంతాలకు అనువైన

వ్యవసాయ ప్రధానమైన అభివృద్ధి పథకాలను గిరిజనుల నెత్తిన రుద్దారు. కాలనీలలోకి నెట్టారు. ఇలా అందరూ కలసి గిరిజనులను దోచుకోసాగారు. సాయుధపోరాటం కొనసాగించటం వారికి తప్పని సరి అయింది. దిగువ ప్రాంతాలవారు కొందరు విముక్తి పోరాటాలు చేసారు. అమరవీరులైనారు.

ప్రశ్నించటం నేర్పని చదువులు, శిష్టసాహిత్యం :

ఈ కాలం కథలు అభివృద్ధి వల్ల దళితులు ఉన్న అరకొర భూములు కోల్పోవటం భీభత్సంగా చిత్రించాయి. ఉదాహరణకు కారా మాస్టారి యజ్ఞం కథలో(యజ్ఞంతో తొమ్మిది కదల సంపుటి) ఊరికి బడి, రోడ్డు, కరంటు, తెచ్చిన సర్పంచ్ హరిజనుడు అప్పలరాముడి కొడుకును బడిలో ఎందుకు చేర్చలేదు? ఆ బడిలో దళితుల రుణ విముక్తి చట్టాలు భూమిలెక్కలు ఎందుకు చెప్పలేదు? అని రచయిత, విమర్శకులు ప్రశ్నించి ఉంటే శ్రీకాకుళం పోరాటం మరో విధంగా ఉండేది. (తమిళనాడులో ఈ భూములను 'పంచమీ' భూములు అంటారు). అదే ధోరణిలో సాహిత్యం నడుస్తున్నది. చదువులో లేనిది మనకు తట్టదు. అందరికీ తట్టాలంటే సాంఘిక శాస్త్రాలు వీటి అవసరాన్ని చాటుతుండాలి. ఆలోచనలు గాలి లోంచి రావు. కుమ్మరావంలో ఇత్తడి ముంతలు దొరకవు. అందుకే కాబోలు ఇటువంటి 'రచనలవల్ల రచయితకు పేరు రావచ్చు కాని సమాజంలో మార్పు రాదు' అని కొడవటి గంటి కుటుంబరావు వ్యాఖ్యానిస్తారు. (కొడవటి గంటి కుటుంబరావు శతజయంతి ప్రత్యేక సంచిక. ప్రజా సాహితి నవంబరు 2009. పుట 96) రచనలే ఉద్యమంగా భ్రమపెడుతున్న ఈ ధోరణిని కథయే పరమార్థంగా, వాహికగా గాక లక్ష్యంగా, సాహిత్య ప్రక్రియగా గాక ఉద్యమంగా ప్రచారం చేసి, ఆ ప్రచారమొక సత్యంగా నమ్మే ప్రమాద సూచిక దగ్గరికి ప్రచారకులు చేరిపోయారు అని వరవరరావు చురకవేస్తారు. (భూమితో మాట్లాడు, వరవరరావు, యుగ ప్రచురణలు 2005).

లిఖిత, ఉద్యమ సాహిత్యం ప్రభావం. సంప్రదాయ సృజనకు సాహిత్యానికి మంగళం.

'చుక్కలు తేలివో, చూసే వారు లేరు
వెన్నెల తేలిదో,ఆడేవారు లేరు
చుక్కల సురిటిపల్లి చూడగల్ల బయలు
వెన్నెల వెదురుపల్లి ఆడగల్ల బయలు'

'పాలకవర్గాలు జానపద సాహిత్యాన్ని ముద్దుపేరో, మొరటు పేరోపెట్టి నిరసిస్తున్నారు'. (సాహిత్యంలో వస్తు శిల్పాలు. త్రిపురనేని మధుసూదనరావు. పుట 109. పెర్ స్పెక్టివ్స్ ప్రచురణ) ఇటువంటి తరుణంలో గిరిజనులను చైతన్యపరచటానికి వారు (ఉద్యమకారులు, రచయితలు) సృష్టించిన సాహిత్యం ప్రభావాన్ని తన అధ్యయనం 'శ్రీకాకుళోద్యమసాహిత్యం'లో (దృష్టి ప్రచురణ 1993) కె.ముత్యం ఇలా వివరిస్తారు.. ఈ ఉద్యమ కార్యకర్తలు, గిరిజనుల సాంస్కృతిక జీవితం గురించి తెలుసుకోక పోవడంతో, వారిని కదిలించగల మౌఖిక సాహితీ ప్రక్రియల గూర్చి తెలియకుండా పోయింది. గిరిజనులు ఆశువుగా పాడుకునే పాటల స్థానంలో, కవుల లిఖితశైలి, వారికి పరిచయం లేని బాణీలు, వారిది కాని భాష ఉద్యమ వస్తువుతో పాటలు రాయడానికి గిరిజన రైతాంగాన్ని పురికొల్పలేదు. కార్యకర్తలు పాటలను సవర భాషలోకి అనువదించినా, వాటి లిఖితశైలి, భిన్న అభివ్యక్తి నిర్మాణాల వల్ల వాటిని తమ అనుభవాలుగా కవితా బద్ధం చేయడానికి గిరిజనులు పూనుకోలేదు.

కార్యకర్తల ప్రచారలక్ష్యం నెరవేరినా, ప్రజలు తమ అనుభవాలను కవితబద్ధం చేయటానికి, వారు కార్య కర్తలు వినిపించినపాటలను ఆదర్శంగా భావించడంతో, ఆ స్థాయిలో రాసినవే పాటలనీ, తాము ఆస్థాయిలో రాయలేమని భావించడంతో కూడా వారు తమ అనుభవానికి రూపాన్నివ్వలేకపోయారు. ఈ పాటలు వారి స్వేచ్ఛా వ్యక్తీకరణకు ఆటంకాలయినాయి ఇటువంటి వాతావరణంలో ఎదిగిన గిరిజన రచయితలు, తమ ప్రతిభలు, సమిష్టి సాహిత్యం మరచిపోయి సాహిత్యగాళ్ళ మీద, వారి

కళాబృందాలమీద, సంఘాలమీద, పత్రికల మీద ఆధార పడుతూ అనుకరిన్స్తూ, పేరు కోసం తాప త్రయపడసాగారు. ప్రభుత్వాలు వారి వనరులను ఇతరు లకు కట్టబెడితే, ఉద్యమాలు వారి సమష్టి సాహిత్యాన్ని కనుమరుగు చేసాయి. సాహిత్యం జీవిత వృక్షానికి పూసే పువ్వు. పువ్వుకు పువ్వులు పూయవు. సాహిత్యానికి పుట్టే సాహిత్యం నాకు ఆనాడే కృత్రిమంగాను, కాగితం పువ్వు లాను కనిపించింది. ('రాయటం దేనికి' కొ.కు. శత జయంతి సంచిక పుట 44) 'ఈనాడు రచయితలకు పెద్దగా భాషాజ్ఞానము, పాండిత్యము, ప్రాచీన సాహిత్య పరిచయమూ అవసరములేదన్నది ఏనాడో నిర్ణయ మయింది. కానీ వారికి ప్రపంచ జ్ఞానము, జీవితాను భవము, సామాజిక దృక్పధము కూడా అవసరం లేదన్నది రాను రాను రుజువవుతున్నది' (కవిత్వం, చైతన్యం, త్రిపురనేని మధుసూదనరావు రచనలు - 1 విరసం, 2006, పుట 157) అని కొ.కు. విచారిస్తాడు. 'గిరిజన జీవితంలోంచి సహజంగా తీసుకునే ఇతివృత్తానికి అంశా నికి ఒక ప్రయోజనం లక్ష్యం ఉంటుంది. ప్రతిభా రాహిత్యం, తక్షణ ఫలితం ఆశించి కధకుడు ఉద్యమానికి గిరిజనులను అతికించి పాత్రధారులుగా చేయాలనీ చూస్తాడు. అపుడు సహజ గిరిజనుడు మాయమౌతాడు గిరిజన గూడేనికి బదులు గ్రామం వంటిదేదో కని పిస్తుంది. గిరిజనుడి ప్రత్యేక వేదనకు బదులు సాధారణీ కరించిన లోకవిదితమైన కష్టాల చిట్టా వల్లిస్తాడు. పాలి కేకలతో ఆ కధ అంతటితో ముగుస్తుంది. పై రెండు రకాల కధలు ఇందులో లేవని చెప్పలేం' అని 'ఇప్ప పూలు' గిరిజన సంచార జాతుల కదా సంకలనం (ప్రతిభా ప్రచురణలు, ఖమ్మం, 2009) ముందుమాటలో జయ ధీర్ తిరుమలరావు పేర్కొంటారు.

బస్తర్ అడవుల్లో తిరిగిన రచయిత సత్యం 'జంగల్ నామా'లో ఆదివాసీ సంప్రదాయ వీరగాధలను సేకరించ వలసినదిగా కోరతాడు. ముందు మాటలో జానపద బాణిలో గెరిల్లాలు ప్రవేశ పెట్టిన సరిగ్గా నూరేళ్ళ కిందటి గాధలు వినిపించాయి కాని, నాయనమ్మ, అమ్మమ్మ కధలు వినిపించలేదు అంటూ తీసి పారేస్తారు (మలుపు ప్రచురణ 2012). జానపద సాహిత్యంలో వర్గ స్పృహ ఉంది. వర్గ చైతన్యం లేదు అంటారు త్రిపురనేని మధు సూదనరావు (సాహిత్యంలో వస్తు శిల్పాలు. పెర్ స్పెక్టివ్స్ ప్రచురణ 19. పుట 109). తమ, దిగువ సామాజిక ఆర్థిక వ్యవస్థపట్ల వారి, వారి సాహిత్యంలో, పోరాటాలలో స్పష్టంగా కనిపిస్తూనే ఉంది. ఆ పోరాటాలకు కాలాను గుణంగా కావలసిన నైపుణ్యాలను అందించటంలో చదువుకున్నవాళ్ళు విఫలమైనారు., నేరస్థజాతుల చట్టం- గాంధేయ ఉద్యమాలు - యానాది రాఘవయ్య.

దిగువ ప్రాంతాలలో ఎరుకల యానాది,నక్కల వంటి తెగలను నేరస్థజాతులుగా పేర్కొంటూ వారిని హింసి స్తున్న తీరుపై ఉద్యమించినవారు వెన్నెలకంటి రాఘ వయ్య గారు. రాఘవయ్య గారు రచయిత, న్యాయవాది. గిరిజన పౌరహక్కుల ఉద్యమ నాయకుడై యానాది రాఘవయ్యగా ప్రసిద్ధులైనారు. నెల్లూరు యానాది గిరిజనాభివృద్ధి సంస్థ పునర్ముద్రించిన రాఘవయ్య గారి 'యానాది' (ఆదిమజాతి సేవక్ సంఘ్ 1974, పునర్ము ద్రణ 2016) గిరిజనుల మీద, యానాది సంస్కృతి మీద సునిశితమైన పరిశోధన. అయితే తరువాతి తరం పౌర హక్కుల సంఘాలు వారినుండి స్ఫూర్తి పొందటం సరే, కనీసం తలచుకోలేదు.

తెలంగాణాలో ఉద్యమాలు అధ్యయనాలు :

తెలంగాణాలో గోండు వీరుడు కొమరం భీం పోరాటం తెలంగాణ సాయుధ పోరాటానికి స్ఫూర్తి నిచ్చింది. భీం బలిదానం తరువాత హైదరాబాదు ప్రభుత్వం పనుపున మానవశాస్త్ర వేత్త చెంచు, కొండరెడ్డి, గోండ్ తెగలను అధ్యయనం చేసారు. నాటిప్రభుత్వ సలహాదారుగా గిరిజనోపాధ్యాయుల శిక్షణాకేంద్రాలను ప్రారంభించారు. ఆయన కూడా భూమి, అడవి, కూలి కి సంబంధించిన లెక్కలు పాఠాలుగా పెట్టలేదు. తిరిగి వచ్చి, 1982 లో

ప్రచురించిన అధ్యయనంలో (Tribes of India-Struggle for survival .Oxford ప్రచురణ 1982) గిరిజన ఉద్యోగులు ఒక వర్గంగా తయారైనారని, చదువుకున్నవారు ఏవిధంగానూ తోటి వారికి సాయ పడలేక పోతున్నారని వాపోతాడు. అది వాళ్ళతప్పుకాదు. వాళ్ళకు మనం నేర్పుతున్న చదువులు అటువంటివి.ఈ చదువులు ఉద్యోగాలకు తప్ప ప్రశ్నించటానికి,హక్కులు పొందటానికి పనికిరావు.

రైతుకూలీ సంఘాలు – పౌరహక్కుల ఉద్యమాలు – గిరిజనసాహిత్యం :

1976లో వరంగల్ పౌరహక్కుల సంఘాలకు కేంద్రంగా ఉండేది. అరుణతార, సృజన పత్రికలలో కథలురాసే అల్లం సాహు, పెద్ది శంకర్ వంటి ఉద్యమ నాయకులు గ్రామస్థాయిలో రివిన్యు, ఫారెస్ట్, అధికారులు చేస్తున్న మోసాలు, కూలి లెక్కలలో తకరారులు కళ్ళకు కట్టినట్లు చిత్రించేవారు. వాటిని ప్రశ్నిస్తే పోలీసులు మక్కెలిరగ తన్నేవారు. సంఘాలలో చేరి సాయుధ పోరాటం బాటపట్టమంటూ ఈ కథలు ప్రబోధించేవి. ఈ కథలు, తరువాత బాలగోపాల్ ముందుమాటతో (కరీంనగర్ బుక్ ట్రస్ట్ 1985)లో 'అడవిలో వెన్నెల' సంకలనంగా వచ్చాయి. రివిన్యు వగైరా సమస్యల జ్ఞానం తీరుతెన్నుల జోలికి పోకుండా, గిరిజనులు పిచ్చినమ్మ కాలతో న్యూనతాభావంతో కుంగిపోతున్నారని కుంగిపోతున్నారని, వారికి విజ్ఞానం అందాలని ముందు మాటలో ఆయన వ్యాఖ్యానిస్తారు. తరువాతి కాలంలో (2000) 'చట్టం సాధికారితను ప్రశ్నించకుండా దాని చుట్టూ ఉన్న మిథ్యను తొలగించటం అనే లక్ష్యాన్ని పౌరహక్కుల ఉద్యమం స్వీకరించాలి' అని పిలుపు నిస్తాడు, సలహా సంస్థతో కలసి గాంధేయ పద్ధతిలో పని చేసిన గొరైపాటి నరేంద్రనాథ్ కృషికి నివాళి సమర్పిస్తాడు. (హక్కుల ఉద్యమం-తాత్విక దృక్పథం 2010 పేజి 82, 245. మానవహక్కుల వేదిక ప్రచురణ). మొత్తానికి బహుళ ప్రచారం తెచ్చుకున్న పౌర హక్కుల సంఘాలు, వామపక్షాలు, వారి సాహిత్యం, గిరి జన సంప్రదాయ సాహిత్యాన్ని పట్టించుకోలేదు. ఉత్పత్తి సాధనాలైన భూమి, అడవి, నీరు, కూలి లెక్కలు ప్రజలకు నేర్పటానికి పూనుకోలేదు. జ్ఞానం లేని చైతన్యం గుడ్డిది. చైతన్యం లేని జ్ఞానం కుంటిది.

సంప్రదాయ సాహిత్యం-సాధికారిత :

'శక్తి' గిరిజనుల సంప్రదాయ సాహిత్యం సేకరణకు గిరిజనులను ప్రోత్సస్తూ, ప్రభుత్వం, భూమి రికార్డులు వారికి పంచిపెట్టేటట్లు ఉద్యమాలు చేసింది. వాటి లెక్కలు, నేర్పటంలో, అటవీ హక్కుల గుర్తింపు కోసం పటాలు గీయించటంలో శక్తి ద్వారా, ప్రభుత్వం శిక్షణ నిప్పించింది. కానీ ఈ లెక్కలు,పటాలు సార్వత్రిక విద్యలోభాగమైనపుడే, జనానికి హక్కులు దక్కే దారి దొరుకు తుంది.

తమిళనాడు, కేరళల మార్గదర్శనం :

తమిళనాడు, కేరళకు గిరిజనుల జ్ఞానాన్ని గుర్తించటం, నైపుణ్యాలు పెంచటంలో, హక్కులు ఇప్పించటంలో ప్రపంచ ప్రసిద్ధమైన ఉదాహరణలు తమిళనాడు, కేరళకు చెందినవే.

ఇస్రో, ప్రళయకావేరిలోని శ్రీహరికోటలో యానాదులను, మత్స్యకారులను తొలగించి రాకెట్ ప్రయోగ కేంద్రం నెలకొల్పింది. యానాదులకు మొక్కుబడిగా సంక్షేమ కార్యక్రమాలను నడుపుతుంది. కానీ, పక్కనే ఉన్న చెన్నైలో యానాదులను ఇరులవారుగా పిలుస్తారు. పాముల విషం పిండి తోలుతీసి అమ్మటం, ఎలుకలు పట్టటం ఇదీ వారి జీవన విధానం. పాము తరచు విషం పెడుతుంది, తోలు తీసి చంపేస్తే ఒకసారి మాత్రమే ఆదాయం వస్తుంది, కాబట్టి చంపకుండా విషం తీయడం నేర్చుకోండి అని నచ్చ చెప్పి ఉద్యోగ రీత్యా చెన్నైలో స్థిర పడిన విదేశీయుడు జాన్ వారికి నచ్చచెప్పి శిక్షణ ఇచ్చాడు. వారిని సహకార సంఘంగా ఏర్పరచాడు. అతని కొడుకు రాములస్ విటేకర్ కూడా ఇదే కృషి కొనసాగించి డిగ్రీలు

లేని సర్పశాస్త్రవేత్తగా పేరుపొందాడు. అతనికంటే 20 ఏళ్ళు చిన్నదైన జానకి అనే స్థానిక ఫోటోగ్రాఫర్ సహచరిగా చేరింది'మై హస్బండ్ అండ్ అనిమల్స్' అనే శీర్షికతో ఆంగ్ల దినపత్రిక ది హిందూలో ఆదివారం తమ అనుభవాలు రాస్తుంటుంది. వాళ్ళు ఆగుంబేలో పాముల అభయారణ్యం అభివృద్ధి చేస్తున్నాడు.

అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం సరస్సులలో పాముల సంతతి పెరిగి పోయింది. వాటిని అదుపులో పెట్టటానికి అక్కడి శాస్త్రవేత్తలు చేసిన ప్రయత్నాలు విఫలమైనాయి. వారు రామ్‌ను సంప్రదించారు. అయన ఇరులబృందంతో వెళ్ళాడు. వాళ్ళు పాములతో ఆటాడుతూ వేటాడుతూ పాముల సంఖ్యను అదుపులోకి తెచ్చిన వార్త ప్రపంచ మంతా మారుమోగిపోయింది. స్ఫూర్తిదాయకమైన ఈ కృషి రాకెట్ కేంద్రం శాస్త్రవేత్తల దృష్టికి రాలేదు. నెల్లూరు చెన్నైలలో ఉండే ప్రముఖులు ఈ కేంద్రానికి వచ్చే ప్రధాన మంత్రుల దృష్టికి ఈ విషయం తేలేదు.

బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా, కోయంబత్తూర్ శాఖ ద్వారా 'ఎథ్నో బాటనీ ఆఫ్ ఈస్టరన్ ఘాట్స్' ప్రచురించిన పుష్పాంగదన్ కేరళలో కాని తెగవారి మందుకు పేటెంట్ హక్కు ఇప్పించాడు.

సంప్రదాయ వృత్తులపై చిన్న చూపు :

ఇరుల యానాది తెగలవారు పొలాల్లో ఎలుకలు పడతారు. వారికి ఉపాధి భద్రత కల్పిస్తే ఎలుకలను చంపటానికి విషగుళికల వాడకం తగ్గించవచ్చునని, రామ్, జిల్లా కలెక్టరుకు ప్రతిపాదించారు. వాళ్ళను చదివించి పైకి తీసుకురావాలి కానీ వాళ్ళచేత ఎలుకలు పట్టించటం ఏం బాగుంటుంది అంటూ కలెక్టర్ పెదవి విరిచాడు. వాళ్ళు తమ పిల్లలు బాగుపడతారని చదివిస్తారు. ఒకరిద్దరికి చిన్న చిన్న ఉద్యోగాలొస్తాయి. కానీ చాలా మంది మామూలు కూలి పనులు చేసుకుంటూ ఆకలి దప్పులతో అలమటిస్తుంటారు. విషం తీసే ఇరులవారు తగ్గిపోతున్నారు.

ఆదివాసీ సాహిత్యం- ఆదివాసుల పరిస్థితి :

వర్ధమాన సవర గిరిజనరచయిత మల్లిపురం జగదీష్ నేటి గిరిజనుల పరిస్థితి , వారి మీద వస్తున్న సాహిత్యంపై చేసిన వ్యాఖ్యలు గమనించదగినవి.

'ఆదివాసీ కథ అనగానే ఉద్యమకథ అనే అభిప్రాయం స్థిరపడిపోయింది'. 'తనకు తాను పరాయిగా మారేక్రమం గతం కంటే రెట్టింపయ్యింది, ఆదివాసీలు ఇప్పుడు వాటి ముందు దరఖాస్తుదారులుగా క్యూకట్టి నిలబడి ఉన్న సందర్భ మొకటి ఆవిష్కృతమౌతుంది. దీని ఫలితంగా శ్రమకి పనిముట్టుకి దూరమయ్యాడు ఆదివాసీ.ఆదివాసీ చట్టాలు వాటి అమలులో వస్తున్న ఇబ్బందులు ఆదివాసీ సమాజం ముందు కొత్త దృశ్యాలను అవిష్కరిస్తున్నాయి. ఈ దృశ్యాలన్నీ సాహిత్యంలోకి తీసుకురావలసి ఉంది'. (బహుళ ..పెర్ స్పెక్టివ్ ప్రచురణ 2018.పుట 301)

అతని కథాసంకలనం 'శిలకోల'(2018)లో ఆశీస్సు లందిస్తూ అతని గురువు, ప్రముఖ రచయిత గంటేడ గౌరినాయుడు, జగదీశ్ తన జాతి మూలాలు తెలుసుకుని రాయాలని సూచించారు. 'బహుళ'లో అతని వ్యాసం చదివితే చెంచుల పాటల సంకలనం 'గిరిగింజ గిరి మల్లెలు' (2006 నల్లమల ఫౌండేషన్ ప్రచురణ) తప్ప మరే సంప్రదాయ గిరిజన సంకలనం చూసినట్లు కనిపించదు. ఆ సాహిత్యాన్ని అతని / గిరిజన రచయితల దృష్టికి తేవకపోవటం మన తప్పు.

'నాను చదువుకుంతాను' కథాసంకలనంలో వచ్చిన అతని మొదటికథలో, బడిలో ఇమడలేని సవర పిల్లడు డ్రాయింగ్ మాస్టారికి దగ్గరౌతాడు. బడి మానేసిన పిల్లాడిని వెతుక్కుంటూ మాస్టారు వాళ్ళగూడెం వెళతాడు. తిరిగి వస్తుండగా గురిచూసి చెట్టుమీద ఉన్న మామిడి కాయను కొట్టి మాస్టారికిస్తాడు. 'కొమ్మలు రెమ్మలు ఎన్ని అడ్డున్నా గురిపెట్టి కొట్టావు చూడు!, అలాగే బడిలో ఎన్ని ఇబ్బందులున్నా, చదువునుంచి గురి తప్పకూడదు' అని మాస్టారు ఉపదేశిస్తాడు.

సవరలు గొప్ప చిత్రకారులు :

పండుగలలో దేవతలను ఆహ్వానిస్తూ ఇంటి గోడల మీద బొమ్మలు గీస్తారు. ఆ నేపధ్యం నుండి వచ్చిన పిల్లాడు ఆ మాస్టారికి దగ్గరౌతాడు. వాళ్ళ గూడెం వెళ్లి నపుడు మాస్టారు గోడలమీద బొమ్మలు చూసి ఉత్తేజితు డౌతాడు. మాస్టారు ఆ పిల్లాడిని, మరో పికాసోగా తీర్చి దిద్దటానికి పూనుకుంటాడు అని కథను మలుపు తిప్పితే బాగుండేదని రచయితలో, విమర్శకులో అతనికి సలహా ఇచ్చి ఉంటే బాగుండేది.

సాహిత్య మానవ శాస్త్రానికి పునాది :

మన ఆదివాసీ సాహిత్యం ఇలా తప్పటడుగులు వేస్తుంటే అంతర్జాతీయంగా literary anthropology గా సాహిత్య మానవ శాస్త్ర విమర్శ అభివృద్ధి చెందుతుంది. తెలుగు గిరిజనగీతాలను ఈ పద్ధతిలో విశ్లేషించటం ('వార్తయందు జగము వర్ధిలుచున్నది'. వివేచన. ఉస్మా నియా విశ్వవిద్యాలయ తెలుగుశాఖ పత్రిక 1982) మూల్యాంకనం చేసిన మానవ శాస్త్రవేత్తల మెప్పు పొందింది. (The topic focusses cognition and environment .The material of multi disciplinary approach. very relevant to our thinking on culture, cognition and language. Linguistic and anthropological reasoning is sound. Prof. Muniratnam Reddy.1982), జీవనశైలి, సంజ్ఞానం (cognition), అభిజ్ఞానం(recognition), విజ్ఞానం (Science) సంస్కృతి నిర్మాణ స్వరూపంలో గతితర్కం (dialectics), నమ్మకాల దొంతరలు (belief systems), అర్థచ్ఛాయలు (semantic domains) పరివర్ధిత ముద్రణ 'కొండకోనలలో తెలుగు గిరిజనులు'లో పట్టికగా ఇచ్చింది. మానవశాస్త్ర విచారధారను సాంఖ్య దర్శనంతో సోదాహరణంగా సమన్వయించింది.

'అంగట్లో అన్నీ ఉన్నాయి అల్లుడి నోట్లో శని ఉంది' అన్నట్లు గిరిజనులకు గొప్ప వారసత్వముంది. రక్షణకు చట్టాలున్నాయి. అధ్యయనాలున్నాయి. వాటిని ఇటు వంటి సదస్సులలో చర్చిస్తుంటే, వారి స్థితిగతులు, మన చదువులు, రచనలు మెరుగౌతాయి.



తెలుగులో గిరిజన విజ్ఞాన పరిశోధనలు – తీరుతెన్నులు

– డా॥. తరపట్ల సత్యవాణి, శాఖాధ్యక్షులు, తెలుగు విభాగం, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమండ్రి.

ప్రవేశిక :

నవ్యశకానికి నాంది పలుకుతూ నూతన ఆవిష్కరణలకు ఆహ్వానం అందిస్తు నడుస్తున్న యుగం నేటి ప్రపంచీకరణ యుగం, అభివృద్ధే ధ్యేయంగా ప్రపంచ ప్రగతి పటంలో చేరాలనే ఆరాటంతో పరుగెడుతున్న దేశాలు, మనుషులు, మనస్తత్వాలు, వ్యాపారాలు అన్నీ మనకళ్ల ముందు కనిపిస్తున్న సజీవ చిత్రాలు. ఇంత విశాల ప్రపంచంలో మానవ సంబంధాలు, జనజీవన సంస్కృతి, ఆచార సంప్రదాయాలు, తరతరాలుగా తరగని మౌఖిక వారసత్వ సంపద, సాహిత్య సాంస్కృతిక భాషా సంపద కనుమరుగవుతుంటే పట్టించుకునే నాధుడే లేని అనాధ దేశంగా మిగిలిపోయే ప్రమాదం ఏర్పడబోతుంది. శాస్త్ర సాంకేతిక రంగాలపైన దృష్టితప్పా మన వారసత్వ సంపదను కాపాడుకునే దృష్టి లేకపోవడం దురదృష్టకరం. అందుకే అంతరించిపోతున్న ఆదిమ జాతుల జనజీవన సంస్కృతిపై, ఆచారసంప్రదాయాలపై, సాహిత్య సంపదను పరిరక్షించుకునే దశలో పయనించి భావితరాలకు ఆ సంపదను అందించే ప్రయత్నం చేయాలి. అందులో భాగంగా గిరిజన విజ్ఞానంపై పరిశోధనలు జరగాల్సిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ముఖ్య ఉద్దేశ్యం :

ఈ మధ్యకాలంలో వివిధ అంశాలపై పరిశోధనలు విస్తృతంగా జరుగుతున్నాయి. వివిధ విశ్వవిద్యాలయాలు ఆ పాత్రను బాగానే పోషిస్తున్నాయి. పరిశోధక విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగానే పెరిగింది. అందుకు తగ్గట్టుగా యూనివర్శిటి గ్రాంట్ కమీషన్, దక్షిణ భారతీయ భాష సంస్థాన్, రూసా వంటి సంస్థలు అనేక ప్రాజెక్టులు, ఫెలోషిప్‌లు ఇచ్చి పరిశోధనలను ప్రోత్సహిస్తున్నాయి. ఇవి పరిశోధనలు విస్తృతం కావడానికి ఒక అవకాశంగా భావించాలి. ఈ సందర్భంగా గిరిజన విజ్ఞానంపై జరుగుతున్న పరిశోధనలు, జరగవలసిన పరిశోధనలు పరిశీలించే ప్రయత్నంలో పున:పరిశీలన చేస్తే వాటి తీరుతెన్నులను, పరిశోధనలప్రయోజనాన్ని, ఆవశ్యకతను వివరించే ప్రయత్నమే ఈ పరిశోధన పత్ర ముఖ్య ఉద్దేశ్యం.

గిరిజన విజ్ఞానంపై జరిగిన పరిశోధనలు :

అనలైన ఆదివాసీలు, మూలవాసీలు ప్రపంచంలో ప్రతీ దేశంలోను కనిపిస్తారు. నాగరిక సమాజం రాకముందే మానవ మనుగడ ఆధునిక భావజాలంలోకి అడుగు పెట్టక ముందే ఆదిమానవులుగా అనాగరికులుగా అరణ్యవాసులుగా, వింత జీవులుగా కొండల్లో, గుట్టల్లో, వాగుల్లో వంకల్లో తిరుగుతూ అనాగరిక అరణ్య జన జీవన వ్యవస్థకు అసలైన ఆనవాళ్లుగా నిలిచి ఈ నాగరిక మానవ జీవన శైలికి ముందుగా నడిచి, ఆదర్శ జీవులుగా సంచరించిన గిరిజనులు వారి సంస్కృతీ సంప్రదాయాలు, లిఖిత రూపం పొందని, చరిత్రకెక్కిన సాహిత్యం, అలిఖితంగా మిగిలిపోయి అంతరించే స్థితికి చేరుకున్న గిరిజన విజ్ఞానంపై వివిధ విశ్వవిద్యాలయాల్లో జరిగిన పరిశోధనలు పరిశీలిస్తే అతికొద్దిగానే కనిపిస్తాయి. వాటిలో 1982లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్య బిరుదురాజు రామరాజు గారి పర్యవేక్షణలో జరిగిన పరిశోధన "తెలుగు గిరిజన గీతాలు" డా॥ పి.శివరామకృష్ణ చేసిన పరిశోధన అది, ఆ తర్వాత వరుసగా అదే విశ్వవిద్యాలయంలో గిరిజన జీవన జాతిచిత్రణ వి.వేణుగోపాల్, తెలంగాణా గిరిజనుల మౌఖిక సాహిత్యం పై రాజా మహ్మద్, కరీంనగర్ జిల్లా లంబాడీలపై, ఆచార వ్యవహారాలపై జె.శంకరయ్య, జానపదవిజ్ఞానం - గోండుల ఆచార వ్యవహారాలు, పై కె.రాజారాం వంటి పరిశోధకలు

గిరిజన విజ్ఞానంపై ఆయా అంశాలపై పరిశోధనలు చేసారు. ఆ తరువాత వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి కర్నూలు జిల్లా గిరిజన గేయాలపై సిహెచ్.వేంక టేశ్వర్లు, ప్రకాశంజిల్లా గిరిజన గేయాలపై కె.మల్యాద్రి, పరిశోధనలు చేసారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి తూర్పు గోదావరి జిల్లా గిరిజన విజ్ఞానం పై కె.మురళీకృష్ణ, తెలుగు విశ్వవిద్యాలయం నుండి తూర్పుగోదావరి జిల్లా గిరిజన కధలుపై పి.సుబ్రహ్మణ్య శాస్త్రి చిత్తూరు మండల గిరిజన గేయాలపై వై.జయంతి, మారేడుమిల్లి మండల గిరిజన గేయాలపై పి.సుబ్రహ్మణ్యం, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నుండి సుగాలి సంస్కృతి భాషా సాహి త్యాలపై ఎం.గోనానాయక్ పరిశోధనలు చేసారు. హైద్రా బాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం నుండి జరిగిన పరి శోధనలో విశాఖ పట్నం గిరిజన విజ్ఞానం, జర్ర అప్పారావు పద్మతీభాయ్. తెలుగు సామెతలు - బంజాల సామెతలు తులనాత్మక పరిశీలన, హరిబాబు, ఎరుకలభాషా సాహిత్యం - తెలుగు ప్రభావం, జె.ఎల్. ప్రభాకర్, ఖమ్మం జిల్లా గిరిజన సాహిత్యం - సాంస్కృతిక అంశాల అధ్య యనం, ఎన్.రాంబాబు తెలుగులో గిరిజన కథలు - వస్తుశిల్ప వైవిధ్యం బానునాయక్, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లా గిరిజన విజ్ఞాన అధ్యయనం జె.రమేష్, తెలుగు నవలా సాహిత్యంలో - గిరిజనుల జీవిత చిత్రణ, టి.బగ్గు నాయక్ నల్గొండ జిల్లా గిరిజన విజ్ఞాన అధ్యా యనం. ఇలా చాలా పరిశోధనలు జరిగాయి.

జరగవలసిన పరిశోధనలు :

ఇప్పటి వరకు క్షేత్ర పర్యటన, విషయసేకరణ వంటి సమస్యల వలన గిరిజన విజ్ఞానంపై పరిశోధనలు నత్తనడకతో నడిచాయి. పరిశోధకునికి ఆర్థిక సమస్య ప్రధానమైన అవరోధంగా కనిపిస్తుంది. విశ్వవిద్యా లయాల్లో పరిశోధన చేయడంలో అనేక సమస్యలను ఎదుర్కొనే పరిశోధకునికి ఆర్థిక సమస్య ప్రధానమైన సమస్య. అందుకనే క్షేత్ర పర్యటనకు సంబంధంచిన అంశాన్ని ఎన్నుకోవడంలో ఉత్సాహాన్ని చూపలేక పోతున్నారు. క్షుణ్ణంగా అధ్యయనం చేయడం ఒక ఎత్తు అయితే సేకరించడం. వాటిని రికార్డ్ చేయడం, మరొక ఎత్తు, ఇన్ని సమస్యలు గిరిజన విజ్ఞానంపై పరిశోధన చేసే పరిశోధకునికి ఎదురయ్యే సమస్యలు ఈ సమస్య లను ఎదుర్కొనే పరిశోధకునికి జె.ఆర్.ఎఫ్., ఎస్.ఆర్.ఎఫ్. & పి.డి.ఎఫ్ వంటి ఫెలోషిప్‌లు కొంత ఉత్సాహాన్ని ఊరటను కలిగిస్తాయి. అందుకే గిరిజన విజ్ఞానం పై ఇప్పుడు కొంతమంది ఉత్సాహవంతులైన పరిశోధకులు పరిశోధనలు ప్రారంభించారు.

ఇప్పటి వరకు పరిశీలిస్తే గిరిజన గేయాలపైన కతల పైన, సంస్కృతిపైన పరిశోధనలు జరిగాయి. అవి కూడా సమగ్రంగా జరిగినట్టు కనబడుటలేదు. ప్రస్తుతం చేయ వలసిన పరిశోధనల్లో పూర్తిగా గిరిజనుల జీవనశైలి, ఆహారపు సంస్కృతి, వైద్య విధానం. ఆచార సంప్రదా యాలు, సాహిత్యాంశాలు, వస్తుసంస్కృతి గేయ సంపద వైధ్య పద్ధతులు వంటి అంశాలపై జరగవలసిఉంది. అంతేకాకుండా జిల్లాలు, మండల స్థాయిలో ప్రత్యేక అధ్యయనం చేయాలి. సేకరణతో పాటు ప్రతీ విషయాన్ని రికార్డు చేసి భద్రపరచవలసిన అవసరాన్ని గుర్తించాలి. అలాగే గిరిజన తెగలు, సమూహాలను గుర్తించి కుల విజ్ఞానంపై పరిశోధనలు జరగాలి. అక్కడితో ఆగకుండా సాహిత్యాంశాలతో పాటు భాషాంశాలను పరిశోధనాశంగా స్వీకరించి భాషా పరిరక్షణకు కృషి చేయాలి. లిపిని కనిపెట్టడం తయారుచేయడం జరగాలి. నిఘంటు నిర్మాణంతో పాటుగా విజ్ఞాన సర్వస్వాల్ని తేవాలి. గిరిజన మాండలీకాలను, సామెతలను, జాతీయాలను సేకరించి వాటిని ముద్రించే ప్రయత్నం చేయాలి. ప్రభుత్వం చిత్తశు ద్ధితో ఒక ప్రణాళిక ప్రకారం ప్రాజెక్టులను రూపొందించి విశ్వవిద్యాలయ పరిధిలో పరిశోధనలకు స్వీకారం చుట్టాలి. అలా చేస్తే గిరిజన విజ్ఞానంపై పరిశోధనల్లో ప్రగతి కనిపిస్తుంది.

గిరిజన విజ్ఞాన పరిరక్షణ చర్యలు :

1) తెలుగు రాష్ట్రాల్లో గిరిజన విజ్ఞాన సేవలను

2) ప్రతి విశ్వవిద్యాలయాల్లో జానపద గిరిజన అధ్యాయన సంస్థలను నెలకొల్పాలి.
3) వాటికి ప్రత్యేక నిధులు కేటాయించాలి. రెండు రాష్ట్రాల్లోను జానవద గిరిజన విశ్వవిద్యా లయాలను నెలకొల్పాలి.
4) ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన విశ్వవిద్యా లయం నెలకొల్పబడింది. కాని అక్కడ గిరిజన సంస్కృతి సాహిత్య భాషాంశాలకు సంబంధించిన అధ్యయన విభాగం లేకపోవడం దురదృష్టకరం.
5) తెలంగాణాలో వరంగల్‌లో గిరిజన విజ్ఞాన పీఠం ఉంది. కాని ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు విశ్వవిద్యా లయానికి సంబంధించిన గిరిజన విజ్ఞాన పీఠం లేకపోవడం విచారించదగిన అంశం.
6) మండల స్థాయి నుండి జిల్లాల స్థాయిలో క్షేత్ర పర్యటన జరగాలి.
7) ప్రత్యేక పైలెట్ ప్రాజెక్టుగా గిరిజన గూడేలు, తండాలు అక్కడ ప్రజల జీవన శైలికి సంబం ధించి, ఆర్థిక అంశాలు, ఆరోగ్య సమస్యలు వైద్య పద్ధతులు, వసతులపై సమగ్రమైన సర్వే జరగాలి.
8) గిరిజన కళాకారులను గుర్తించి వారికి తగిన ప్రోత్సహకాలను, ఫించన్లను ఇప్పించే ఏర్పాటు చేయాలి.
9) ఉగాది, దసర, సంక్రాంతి ఉత్సవ సందర్భంగా కళాకారులకు ప్రత్యేక పురస్కారాలను ప్రకటించి ప్రజావేదికలపై ఘనంగా సత్కరించాలి.
10) ఆదివాసి దినోత్సవం రోజున ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసి వారికి ప్రత్యేక గుర్తింపును ప్రభుత్వం ఇవ్వాలి. దేవాలయ ఉత్సవాల్లో గిరిజన కళాప్రదర్శనలు విధిగా ఏర్పాటు చేసి వారికి గౌరవ పారితోషికం ప్రక టించాలి.
11) ప్రత్యేక డాక్యుమెంటరీలను తయారు చేయాలి.
12) ప్రతి థియేటర్‌లో వాటిని ప్రదర్శించి ప్రజలకు పరిచయం చేయాలి.ఇలా చేస్తే అంతరించి పోతున్న గిరిజన విజ్ఞానాన్ని పరిరక్షించుకునేవాళ్లం అవుతాం.

ప్రస్తుత పరిశోధనలు - తీరు తెన్నులు :

విశ్వవిద్యాలయాలు నూతన ఆ విష్కరణలకు వేదిక కావాలి. అసలు ఉద్దేశ్యం కూడా అదే. నూతన పరిశోధన లుకు నిలయాలుగా విశ్వవిద్యాలయాలు నిలవాలి. నాణ్యమైన విద్యతో ప్రామాణికతతో కూడిన పరిశోధనలు రావాలి. అప్పుడే ఆ విశ్వవిద్యాలయం ప్రగతి పధంలో నిలుస్తుంది. ప్రస్తుతం విద్యా విధానంలో మార్పులు వచ్చాయి. కాని విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుల కొరతవల్ల పరిశోధనలు వెనుకంజలో ఉన్నాయి. జనాకర్షణ పథకా లలో ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపులు చేస్తుంది. ఉన్నత విద్యకు తిలోదకాలు ఇస్తుంది. భర్తీ ప్రకియలో ఎన్నోలోపాలు ఉన్నాయి. దీనివల్ల మైనర్, మేజర్ రీసర్చ్ ప్రాజెక్టులు రావడంలేదు. నేక్ గ్రేడింగ్ రావటం లేదు. ఈలోపాన్నే సరిదిద్దే ప్రయత్నాలు ప్రభుత్వాలు చేయాలి.

ప్రస్తుతం పరిశోధనలు చూస్తే తేలిపోతున్న పరి శోధనలే తప్పా ప్రయోజనం ఉండే పరిశోధనలు రావడం లేదు. విశ్వవిద్యాలయల్లో చేరిన పరిశోధకులు చాలా మంది క్షేత్ర పర్యటనకు అశక్తి చూపడం లేదు. దానికి సవాలక్ష కారణాలు. పదిపుస్తకాలు రాసిన కవి మీద, రచ యిత మీద 250 పేజీల సిద్ధాంత గ్రంథాలు వస్తున్నాయి. ఒక జానపద, గిరిజన అంశాలపైన, భాషలపైన, వైద్య పద్ధతులపైన, జీవనశైలిపై, తులానాత్మక అధ్యయనంపై, కులవిజ్ఞానంపైన పరిశోధనలు జరగడం లేదు. దీనివల్ల అంతరించి పోతున్న జానపద గిరిజన సాహిత్యం, భాష, సంప్రదాయలు, వారసత్వ కళాసంపద కనుమరుగయ్యే పరిస్థితి ఉంది. పరిశోధకుల్లో పుస్తక పఠణం లోపించింది. వివిధ భాషల పరిచయం పూర్తిగా పోయింది. పరిశీలన లోపించింది. తులనాత్మక ఆలోచనావిధానం పూర్తిగా కోల్పోతున్నారు. కేవలం పి.హెచ్.డి పట్టా కోసమో పరి శోధనలు, కేవలం ఉద్యోగం కోసమో పి.హెచ్.డి పట్టా

అన్న మాదిరి పరిశోధన తయారయింది. చాలామంది పరిశోధకులు విషయ సేకరణకు, విజ్ఞాన అధ్యయనానికి ఆసక్తి చూపడం లేదు. కేవలం ఉద్యోగానికి ఉపశమనం పరిశోధన అన్న చందాన పరిశోధకులు తయారవు తున్నారు. ఆ స్థితినుండి పరిశోధకులు పరిణామం చెందాలి. త్వరిత గతిన పరిశోధన పూర్తిచేసుకోవాలి అనే ఆలోచన మానుకోవాలి. సమాజానికి ఉపయోగపడే పరి శోధనలు రావాలి. ప్రభుత్వాలు ప్రత్యేక ప్రణాళికలతో విశ్వవిద్యా లయాల్లో పరిశోధనలకు అగ్రస్థానం కల్పించాలి. కను మరుగవుతున్న జానపద, గిరిజన విజ్ఞానం పై దృష్టిపెట్టి పటిష్టంగా ఉన్నత ప్రమాణాలతో కూడిన పరిశోధనలు రావాలని ఆశిస్తు భావి పరిశోధకులు గిరిజన భాషా పరిరక్షణలో భాగస్వామ్యం పొందాలని కోరుతున్నాను.

ఆధార గ్రంథాలు :

1) విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన - డా॥ వెల్లదండ నిత్యానందరావు.
2) సమాచార దీపిక - కేంద్రీయ విశ్వవిద్యాలయం.



గోర్ సమాజాల సంస్కృతి – సామాజిక వ్యవస్థా నిర్మాణం

– డా. శ్రీపురం యజ్ఞ శేఖర్, శాఖాధ్యక్షులు, తెలుగు విభాగం, మద్రాసు క్రైస్తవ కళాశాల, తాంబరం, చెన్నై, తమిళనాడు.

బంజారాలు, సుగాలీలు, లంబాడీలు అనే పదాలు సమానార్థకాలుగా పిలవబడుతున్న ఈ తెగ గోర్ అనబడే ఏకసంస్కృతి కలిగిన గిరిజన తెగ. ఒకప్పుడు నగరవాసులు గానూ, కాలక్రమేణ అటవీసమీపప్రాంతాల్లో ఆవాసాలు ఏర్పర్చుకున్న ఈ గిరిజన తెగ తాము పృథ్వీరాజ్‌చౌహాన్, రాణాప్రతాప్‌సింగ్ వారసులమని, రాజస్థాన్ ప్రాంతీయులని చెప్పుకొంటారు. రాణాప్రతాప్‌సింగ్ మరణం తర్వాత వీరు దక్షిణప్రాంతాలకు తరలివచ్చినట్లుగా చరిత్ర చెబుతూ వుంది. ఉత్తర భారతదేశంలోని గోరఖ్‌పూర్ నుండి హరిద్వార్ వరకు విస్తరించిన పర్వతసానువులు వీరికి మూలఆవాసాలని కైఫియత్తుల సృష్టికర్త కల్నల్ మెకంజీగారు అభిప్రాయపడ్డారు. భారతదేశంలో ఏక సంస్కృతి కల్గిన సమూహాలు నివసించే ప్రాంతాన్ని గ్రామం అన్నట్లుగా సుగాలీలు నివసించే ప్రదేశాలకు తాండాలనే పేరు వచ్చింది. ఏకసంస్కృతి కల్గిన ఈ తెగ భారతీయ ఆత్మను ప్రామాణికంగా, ప్రగాఢంగా కల్గిన జాతి అని నిస్సందేహంగా చెప్పవచ్చు. వీరి క్రమశిక్షణ సాంఘిక జీవితం, సాంస్కృతికవిధానం, జీవనవిధానం మొదలైన విషయాలన్నీ వీరి ఐక్యతకు, ఏకరూపతకు నిదర్శనంగా కన్పిస్తాయి. కాబట్టి వీరి సామాజిక వ్యవస్థ నిర్మాణాన్ని గురించి తెలుసుకుందాం.

తాండాలు నాయకత్వ నిర్మాణాలు :

'గోర్' అనే ఏకసంస్కృతికి తాండా'పెద్ద' లేదా 'నాయక్' వీరికి ప్రముఖమైన వ్యక్తి. ఆ తాండాలోని సాంఘిక, సామాజిక, ఆర్థిక వ్యవహారాలకు ఇతడు పునాది. ఈ నాయకుని సహకారంగా కార్‌బారీ అనే కార్యదర్శి ఉంటాడు. నాయకుడు లేనప్పుడు తాండా కార్యకలాపాల్ని చూసేది కార్బారీ. కార్‌బారీ కి ఇద్దరు సలహాదారులను నియమించుకుంటాడు. వారికి **ఢావో, సఫాయి** అనే పేర్లు వుంటాయి. ఈ నాయక్‌లు, **కార్‌బారీ** ఆ తాండాలోని జననమూహాన్ని బట్టి నిర్ణయిస్తారు. ఈ తాండాలలో ప్రధానంగా పమార్, రాథోడ్, చౌహాన్ అనే మూడు ప్రధాన వంశాల వారు వుంటారు. పమార్ వంశానికి పన్నెండు గోత్రాలు, రాథోడ్ వంశానికి ఇరవైగోత్రాలు, చౌహాన్ వంశం వారు ఆరుగోత్రాలు కల్గివున్నారు.

సాధారణంగా ఎక్కువమంది వున్న వంశం నుంచే 'నాయకుని' ఎన్నుకొంటారు. వీరి కన్న తక్కువ జనాభా వున్న వ్యక్తిని కార్యదర్శిగా ఎన్నుకొంటారు. గోర్ సంస్కృతికి ప్రతీకాలైన లంబాడీలు చేసే పంచాయితీని **నసాబ్** అంటారు. ఈ పంచాయితీ (నసాబ్)లో ఇద్దరు గౌరవ సభ్యులు వుంటారు. వారి పేర్లు ఢాడీ, ఢాలియా. పై నిర్మాణాన్ని బట్టి తాండా వ్యవహారాల్ని ఈ ఆరుగురు పెద్దలమధ్య జరుగుతుందని ఊహించుకోవచ్చు. సుగాలీ సంస్కృతిలోని ఈ ఢాడీ, ఢాలియా సంస్కృతులు మిగతా సమాజాల్లో కనిపించే తోటి తలార్లు అయ్యుంటారని భావించవచ్చు. నిష్పక్షపాత నిర్ణయానికి ప్రతీక నసాబ్. గోర్ పంచాయితీలు (నసాబ్) నాయకుల ఆజ్ఞలే చెల్లుతాయి. ఈ పంచాయితీ నిర్వహణ నిష్పక్షపాత నిర్ణయాలకు ఆలవాలు. తాండాల్లో అనివార్యంగా, అకస్మాత్తుగా జరిగే సంఘటనలకు న్యాయం కోసం బాధితుడు నాయక్‌కు నివేదించుకుంటారు. నాయక్ ప్రతివాదిని పిలిపించి (నసాబ్) నిర్వహణకు అయ్యే ఖర్చును ప్రతివాది భరిస్తానంటేకానీ పంచాయితీని జరపరు. పంచాయితీ ఏదో ఒక సంకేతస్థలంలో జరుగుతుంది. ఈ పంచాయితికి ఆరుగురు పెద్దలతో పాటు తాండావాసులకు అనుమతి వుంటుంది. ఒక్కోసారి వీరి నుండి గూడా సలహాలు స్వీకరిస్తారు. సాధారణంగా ఆ పంచాయితీలలో స్త్రీలకు అనుమతి ఉండదు. ఒక వేళ వాది, ప్రతివాదులు స్త్రీలైనపుడు మాత్రమే వారిని

పిలుస్తారు. ప్రతి ఒక్కరు పంచాయితీ పెద్దల తీర్పును అనుసరించాల్సిందే. నేరస్తులకు విధించేదండన కఠినం గానే ఉంటుంది. కఠినత్వం వలన నేరాలు జరగవనేది వారి నమ్మకం.

తాండాల్లో అమలయ్యే శిక్షలు - వాటి వివరాలు :

ఈ గోర్ పంచాయితీల్లో తప్పుచేసిన వారికి పంచాయితీ పెద్దల తీర్పుప్రకారం కొంత డబ్బుతోపాటు పంచాయితీ ఖర్చులు అతనిపై బనాయింపబడుతాయి. సామాన్యంగా జరిగే అన్యాయాలకు కాకుండా స్త్రీలపై జరిగే అత్యాచారా లకు దండన తీవ్రంగా ఉంటుంది. భార్యభర్తల మధ్య పొడచూపే వివాదాలను పరిష్కరించడం, పరిష్కారం కాని సమాయాల్లో వాళ్ళు విడివిడి కాపురానికి కాని, విడివిడి పెళ్ళిళ్ళుకు కానీ పంచాయితీ అనుమతినిస్తుంది. స్త్రీ సమాజాల్లో పెళ్ళిగాని అమ్మాయి తప్పుచేసి ఇచ్చుకొనే పరిహారాన్ని **కుమారీ చోరీ** నేరస్తురాలైన వివాహిత యువతి ఇచ్చుకొనే పరిహారానికి **'వీయావాళ్'** అనే పేరు నేరస్తురాలైన విధవ ఇచ్చే పరిహారానికి **రాండ్** అని పేరు. పంచాయితీ పెద్దలకు, నేరస్థులకు, మిగతావారికి ప్రధా నంగా సమాచారం నిమిత్తం వ్యవహరించే వారు ఢాలీ, ఢోలియాలే.

గోర్ సమాజాలు వివాహ సంబంధాలు :

సాధారణంగా ఈ గోర్ సమాజాల్లో సగోత్రీకుల్లో వివాహ సంబంధాలు వుండవు. పవార్ వంశం వారు **బనావత్, భూక్యా, వడతియ** గోత్రాల్లో వివాహం చేసుకుంటారు. **బనావత్** గోత్రం వారు **భూక్యా, వడతియ, చౌహాన్** మొదలైన గోత్రాల్లో వివాహసంబంధాలు కలిగి వుంటారు. **వడిత్యా** గోత్రం వారు **పమార్, బనావత్, భూక్యా** మొదలైన గోత్రాల్లో వివాహ సంబంధం కల్గి వుంటారు. **చౌహాన్** వంశం వారు **రాథోడ్** వంశం వారితో మాత్రమే వివాహసంబంధం కల్గివుంటారు.

తాండాల్లోని వివాహవ్యవస్థ కొన్ని ప్రత్యేకతలు కలిగి వుంది. వీరు ఒకప్పుడు సంచార జీవులు. వీరి నివాసాలు విసిరేసినట్లుగా వుండేవి. నిర్దిష్టమైన ప్రదేశాల్లో తాండాలు ఏర్పర్చుకున్న తర్వాత పరస్పర వివాహసంబంధాలకు వెసులబాటు కనిపించింది. ఈ సమాజాలల్లో పూర్వం కొన్ని నెలలపాటు పెళ్ళి సంబరాలు జరిగేవి. ఈ మధ్య పది లేక పక్షంరోజుల వరకు కుదించబడ్డాయి. ఈ ఆధునిక కాలంలో రెండు, మూడురోజుల్లో సంపూర్తి కావిస్తున్నారు. వధూవరుల ఎంపిక ఇంటి పెద్దలదే. ఇంటి పెద్ద కన్న తాండా పెద్ద అనుమతి తప్పనిసరై వుంటుంది. ఇతర సమాజాల లాగానే వధూవరుల పూర్వపరాల చర్చ లోతుగానే వుంటుంది.

గోర్ సమాజాలు - కరార్‌ధరార్, కఠారీ, వధాయి, బళద్ :

గోర్ సమాజాల్లో కన్యాశుల్కం అమల్లో వుంది. దీన్నే **కరార్‌ధరార్** అంటారు. వారి శక్తి మేరకు ఆవులను కాని, ఎద్దులను కాని ఆడపిల్లలకు ఇవ్వడాన్ని **కరార్** అంటారు. గోసంపద లేని వాళ్ళు శక్తికొద్ధి ధనం చెల్లిస్తారు. దీన్నే **ధరార్** అంటారు. సాధారణంగా పెళ్ళిళ్ళు వధువు ఇంటి లోనే జరుగుతాయి. పెళ్ళికుమారునికి చొక్కా, ధోవతి, నడుముకు ఎర్రరుమాలు, రుమాలు పట్టిమీద కత్తిని (కఠారి) ధరిస్తారు. చేతికి వెండి కడియం, వేలికి ఉంగరం, చెవులకు బంగారు కమ్మలు ధరిస్తారు. భుజాలకి ఆకువక్కలు నింపిన సంచులు **(కోతళో)** తగిలించు కుంటారు. ఈ సంచిని తాండా స్త్రీలు శక్తికొలది, నేర్పుకొద్దీ ఆకర్షణీయంగా తయారు చేస్తారు.ఈ సందర్భంలో పెళ్ళి కుమారున్ని ఉద్దేశిస్తూ పాడే పాటను గమనించండి.

తార హతేమా కేటారీర దూల!
ఫరమేలన చాలోర సైర సరదార దూల!
తార కాందేపర్ కోతోళోర దూల!
సైర సరదారదూల పర మేలన చాలోర
తార కాంకేమ కొతళిరే దూల పరమిలన చాలోర
సైర సరదార దూల పరమేలన చాలోర

గోర్ సమాజాల పెళ్ళిలో ఒక వింత ఆచారం వుంది. అదే **వదాయి** కార్యక్రమం. **వధాయి** అంటే పెళ్ళి కొడుకుకు అతని తమ్ముడికి ఆముదపునూనె దీపంలో కమ్మిని

ఎర్రగా కాల్చి, ఆ కమ్మీతో తాండా నాయకుని చేత వాత పెట్టడం. పెళ్ళి కొడుకు తమ్ముడు లేక పోతే గోనెసంచికి వాత పెడతారు. ఒకసారి వాత పెట్టించుకొన్న వాళ్ళకు మరోపెళ్ళి సమయంలో వాత పెట్టించుకోరు. ఒక్క సారి వాత పెట్టించుకొన్న వాళ్ళు మరో పెళ్ళి కూడా చేసుకోవడానికి వీలు లేదని దాని అర్థం.

గోర్ సమాజాలు పెళ్ళికుమారునికి ఇచ్చే కట్నాన్ని **బళద్** అంటారు. ఒకప్పుడు గుర్రాలు, ఏనుగులను ఇచ్చే వారు. ఈ మధ్య ఎద్దులను, ఆవులను ఇస్తున్నారు. ప్రస్తుతం పై వాటికి బదులుగా ఎద్దులను ఇవ్వడాన్ని ఆనవాయితీగా మిగిలిపోయింది. వీరి వివాహాలలో పెళ్ళి పెద్ద ప్రత్యేకంగా (బ్రాహ్మణులు) ఉండరు. సాధారణంగా వారి తాండాపెద్దే పూర్తి బాధ్యత వహిస్తాడు. ప్రస్తుతం ఈ సాంప్రదాయం వీళ్ళల్లో కనుమరుగవుతూవుంది. కొత్త పద్ధతులు చేరిపోతున్నాయి.

లేరియా - చొట్టీర్ అంగోళి :

గోర్ సమాజాలు పెళ్ళికొడుకు శారీరకంగా, మానసికంగా, మేధోపరంగా బలిష్టుడై వుండాలని కోరుకుంటారు. పెళ్ళికిముందు పెళ్ళికూతురు ఇంటికి పెళ్ళికుమారుని వెంట సమర్థుడైన వివాహితున్ని పంపుతారు. ఇతన్నే **లేరియా** (దూత) అంటారు. ఈ లేరియా పెళ్ళికొడుకును సమస్యలనుంచి బయట పడేసే వాడిలాగా వుండాలి. పెళ్ళికి ముందునుంచి చివరి వరకు ఆడపెళ్ళివారు పెట్టే పరీక్షల్ని నెగ్గుకురావడానికి ఈ లేరియా సహాయపడాలి. ఆడపెళ్ళివారు వేసే చిక్కుప్రశ్నలకు కూడా పెళ్ళికొడుకు తరపున లేరియా సమాధానం చెప్పాలి. పెళ్ళికొడుకు అతడి స్నేహితుడైన లేరియా ఆడపెళ్ళివారు పెట్టే పరీక్షలు నెగ్గని సమయాల్లో అపహాస్యానికి గురవుతారు.

గోర్ సమాజాల్లో పెళ్ళికొడుకు చేసే మంగళస్నానాన్ని **చొట్టీర్ అంగోళి** అంటారు. పెళ్ళికొడుకు అతిజాగరూకతతో మెలగవలసిన సమయమిది. పెళ్ళికొడుకుకు వరసైన నలుగురైదుగురు అతనితో తలపడి కిందకు పడదోయటానికి ప్రయత్నిస్తారు. వారి చేష్టలకు తను గట్టిగా నిలబడాలి. పొరపాటున క్రిందపడితే శారీరకంగా అసమర్థుడని వివాహానికి యోగ్యుడు కాడని ఎగతాళి చేస్తారు. కానీ ఒక్కోసారి శారీరకంగా బలం లేని వాళ్ళకు అప్పటి నుంచి పౌష్టికాహారం అందించడం కూడా వాళ్ళే చేస్తారు. ఇది వారి సహృదయతకు సాక్ష్యం.

గోర్ సమాజాల్లో మంగళస్నాన సమయంలో కాబోయే అల్లుడిచేత అత్తచేయించుకొనే ప్రమాణం అల్లుడి నోటి దురుసుకు కళ్ళెంలాంటిది. మంగళస్నాన సమయంలో అల్లుడు జుట్టునుంచి కారే నీటిని అత్త తాగుతూ 'కూతురిని తన పేరు పెట్టి తిట్టనని ప్రమాణం చేయించుకొంటుంది. ఒకవేళ తిడితే రోకలితో కొడతానని కూడా ప్రమాణాన్ని రూఢి పరుచుకుంటుంది' ఆ విధంగా ప్రమాణం చేయని పక్షంలో వరుసకు మరదలైన వాళ్ళు కాబోయే బావకు కొన్ని ఇబ్బందులు పెట్టడం ఆ సమాజంలో ఆనవాయితీగా వస్తోంది. ఈ మంగళ స్నానసమయాల్లో పాడేపాటలు క్రింది విధంగా వుంటాయి.

పెళ్ళికుమారుని తరుపు వారు పెళ్ళికూతురుపై పాడే పాట:

గోళ టోపపరేరి ఘలిమేలి అంగ్డి
వెతడున దుబళో కరమేలి
బాయి సరమ ఛేని
ఘీయే దూదేరి ఘలిమేలి అంగ్డి
నవలేరిన తాజ కరమేలి
బాయి సరమ ఛేని

పెళ్ళి కుమారుడు మంగళస్నానం చేసేటప్పుడు వారి చెల్లెలు పాడే పాట :

ధుజ మతలాడ ధుజ మతరే తారే రేడియా
సరిక తార భీయ హు బేచ
ధుజ మతలాడ ధుజ మతరే
తారే బామణి సరికి తారి భేన హుబీచ
ధుజమత లాడ ధుజ మతరే

తారే రేడిణీ సరికి తారి యాడి హుబీచ - అని పెళ్ళి కుమారుని ఉద్ధేశించి వారి వరసకు చెల్లెలైనవారు అతనికి స్నానం చేయించేటప్పుడు శరీరానికి పసుపు పూస్తూ పై విధంగా పాటలు పాడుతారు.

పెళ్ళి సమయాల్లో క్రమశిక్షణలు :

సాధారణంగా అటవీప్రాంతాలలో నివసించే జాతులకు స్వేచ్ఛతోపాటు కట్టుబాట్లు కూడా వుంటాయని గోర్ సమాజంలోని ఈ తంతులు నిరూపిస్తున్నాయి. పెళ్ళికి ముందు వధూవరులు, పెళ్ళి తర్వాత భార్యాభర్తలు చాలా కాలం వరకు పరస్పరం చూసుకోవడం, బహిరంగంగా మాట్లాడుకోవడం వీరిలో నిషిద్ధాలు. పెళ్ళైన వధువు ఇంటి పెద్దల పట్ల గౌరవసూచకంగా ఎప్పుడు ముఖానికి ముసుగువేసుకొని వుంటారట. సాధారణంగా తొలి సంతానం కలిగే వరకు వీరు ఇళ్ళలోను సిగ్గు, బిడియం కలిగి వుంటారు. కానీ ఈ సమాజాల్లోని స్త్రీ భర్త ఇంటిలో అంత స్వతంత్రత తీసుకోదట. కానీ ఇప్పుడు కాలాలు మారిపోయాయి. నూతన వధూవరులను తాండాలోని ప్రజలు సొంతకూతురు, అల్లుడులాగా చూసుకోవడం గోర్‌సంస్కృతిలో భాగం.

పెళ్ళికొడుకు కూడా తాండాలోని ప్రతి ఒక్కరితోనూ కూడా ఏ విధంగా నడుచుకోవాలి, ఎవరితో ఏవిధంగా మాట్లాడాలి అనే విషయాల పట్ల అవగాహన కల్పించి పంపడం వారి ముందు జాగ్రత్తకు నిదర్శనం. పెళ్ళి ప్రారంభం నుండి చివరి వరకు పెళ్ళి కుమారుడు తల ఎత్తుకొని తిరగకూడదు. తలపై ఎర్రటి వస్త్రం ముసుగుగా వేసుకోవాలి. ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడకూడదు, ఒంటరిగా తిరగరాదు. తిరగవలసిన అవసరం వస్తే తోడు తప్పనిసరి. నడకకూడా నెమ్మదిగా ఉండాలి. ప్రతి ఒక్కరిపట్ల వినయవిధేతలు హెచ్చుగా కల్గి వుండాలి. తాండాలోని వ్యక్తులు పెళ్ళికూతురు ఇంటికి చుట్టం చూపుకు వచ్చినప్పుడు కాబోయే పెళ్ళికుమారుడు లేచి నిలబడాలి. సదరు వ్యక్తి అనుమతి లేనిదే కూర్చోగూడదు. కొందరు తమాషాగా ఆటపట్టించడం కోసం కూర్చోమని చెప్పరు. అది అతనికి తమాషా అయినా పెళ్ళికొడుకు దాన్ని గౌరవంగానే స్వీకరించాలి. ఆడపెళ్ళి వారింటికి వచ్చిన ప్రతి ఒక్కరికి చిన్నా, పెద్దతేడా లేకుండా ప్రతి ఒక్కరికి తాంబూలం ఇచ్చి గౌరవించాలి. పెళ్ళి అయ్యేంత వరకు పెళ్ళి కొడుకు తన స్నేహితుడుతో కలసి ఇంటి బయట కూర్చోని వచ్చి పోయే వారికి నమస్కరిస్తూనే వుండాలి. అంతేగాకుండా పెళ్ళి సమయంలో ప్రతి రోజు ప్రతి ఇంటికి వెళ్ళి నమస్కరించి తాంబూలం ఇచ్చి రావడం వారిపట్ల అతనికున్న గౌరవానికి సూచనగా భావిస్తారు. పై విషయాల్ని పెళ్ళి కుమారుని పక్కనున్న లేరియా జాగ్రత్తగా చూసుకొంటూ ఉంటాడు.

పెళ్ళికుమారున్ని ఆడపెళ్ళివారు రకరకాలుగా పరీక్షించి అతని యోగ్యతను నిర్ణయిస్తారు. పెళ్ళి అనేది పూర్వజన్మల సుకృతమని పూర్వ జన్మల అనుబంధం అని అది గట్టిపడటానికి ఇలాంటి తంతులతో పునీతున్ని చేయడం వివాహ వ్యవస్థ పట్ల వారికున్న నమ్మకమే ప్రధానమని వారు భావిస్తారు. పెళ్ళి చివరిరోజుల్లో చేసే **గోట్** కార్యక్రమాన్ని వీరు అతిపవిత్రంగా భావిస్తారు. పెళ్ళికుమారుడు, పెళ్ళికుమార్తె తన బంధువర్గాలకిచ్చే విందును **గోట్** కార్యం అంటారు. స్థాయి కొద్దీ జంతువును బలిచ్చి పూర్వీకులకు నైవేద్యం పెట్టి తర్వాత బంధువులందరూ భోంచేస్తారు. ఈ తంతు గాలి, ధూళి, భూత పిశాచాలు వారి దరి చేరకుండా కాపాడుతుందని వారి నమ్మకం.

ఢావళో సాంప్రదాయం :

గోర్ ప్రజలు పూర్వం సంచారజీవులు. వీరు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వెళ్ళేటప్పుడ ఇంకెపుడు కలుసుకుంటామోనన్న బెంగతో ఒకరినొకరు చూసుకొని ఏడ్చుకొనే వారట. ఆ సాంప్రదాయం అత్తవారింటికి పోబోతున్న వధువుకు కూడా వచ్చిందని చెబుతుంటారు. పెళ్ళికాబోయే వధువుకు రకరకాలుగా ఏడ్వడం శిక్షణనిచ్చి మరీ ఏడ్పించడం సాంప్రదాయం. పై సాంప్రదాయానికి చిహ్నంగా భావించుకోవచ్చు. దీనిలో ఢావళో అంటారు. ఈ సమయాల్లో పెళ్ళికూతురు రాగాలు తీస్తూ ఏడ్వడం గమనార్హం. **ఢావళో** అనునది పెళ్ళి చివరలో పెళ్ళికూతురు పాడే పాట. ఈ పాట పెళ్ళైన స్త్రీలు పెళ్ళికాని స్త్రీలకు నేర్పిస్తారు.

ఏయాడికూణపాళో కూణపోసో!
కూణసోక కరచయే యాడి హియా!
తూపాళన్ తూపోషన్ పరవస కరరిచియాడి షియా!
మారనాయక్ బాపేస్ హరో పులో!
దేకేసరే నంగరీరో నాయక్ బాపు! హియా

పెళ్ళికూతురు అత్తారింటికి పోయే కార్యక్రమాన్ని హవేళి. ఈ సందర్భం ప్రతి స్త్రీకి ప్రాణ సంకటంగా వుంటుంది. ఆ అప్పగింతల తంతును హృదయవిదారకంగా స్త్రీ పక్షపాతంగా కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలంలో కరుణ రస ప్రధానంగా వర్ణించడం లోక ప్రసిద్ధమే. అదే విధంగా గోర్ సమాజంలో స్త్రీలు 'హవేళి' సందర్భాన్ని పాటలతో పూరించుకుంటారు. పుట్టింటి వారు కానుకగా ఇచ్చిన వస్తువులపై గానీ, జంతువులపైగానీ నిల్చుకొని పాడేపాట **హవేళి**. తానింతవరకు వుండిన తాండాలోని బంధుగణాలకు మంచి జరగాలని చెప్పడమే కాకుండా సహృదయతో తన వీడ్కోలు కూడా **హవేళీ**లో సాక్షాత్కరిస్తాయి. గమనించండి.

హవేలి :

మారేజే నాయేకె బాపూరే హవేలి!
హరీ రేస హరీ వాళి నంగేరి
కనాదేకూ జనా హరీ రేసె హరీ నంగేరీ
ఝరలాజ ఫేలేస్ వడలాజు వదేన హవేలి!
తారేజ ఝంగలామ ఘాలన గోకలరే నాయకే బాపు!
హనుమానే భీయా అజేతి తారీ
భేనడ వేరాణి వేగిరె భీయా
ధోభీరో ధోరాయో భీయా
దర్జీరో సీడాయో హనుమాన భీయా
బుడిగి జాంగియా వాళోభీయా!
కాయిజే నారదాయి కరేచిరే

హనుమానే భీయా - పెళ్ళి కూతురిని అత్తవారింటికి పంపే ముందు పెళ్ళికూతురు తండ్రి, అన్న మొదలగు వారిని గురించి, వారి తాండా గురించి హవేలి పాట ద్వారా తెల్పుతుంది. వివాహమైన తర్వాత పండుగలు - జాతరలు సమాయాల్లో పుట్టింటి వూరి నుంచి వచ్చిన బంధువులతో తలపై ముసుగులు వేసుకొని ఏడ్వడమే **మళేరో** అంటారు.

గోర్ సమాజాల్లో బహుభార్యత్వం వుంది. బహు భర్తృత్వం లేదు. అన్న చనిపోతే అతని భార్యను తమ్ముడు, తమ్ముడు చనిపోతే అతని భార్యను అన్న వివాహం చేసుకోవడానికి ఈ సమాజం అంగీకరిస్తుంది. గోర్ సమాజాల్లో ఇల్లరికం సాంప్రదాయం వుంది. ఈ సాంప్రదాయాన్ని **ఘర్ జమాయి** అంటారు.

ఈ విధంగా గోర్ సమాజాల్లో కనిపించే సామాజిక వ్యవస్థలోని సంస్కృతీ సాంద్రాయాలు కొన్ని వారసత్వ పరంగా వచ్చినవి, కొన్ని మానవసంబంధాల పటిష్టతకు ఏర్పడినవి. చాలా విషయాలు వైవాహిక వ్యవస్థ గాఢతను తెలిపేవిగా వున్నాయని భావించుకోవచ్చు.

గోండుల – గుసాడీ నృత్యం (దండారియా ఉత్సవం)


– డా॥ బూసి. వెంకటస్వామి, శాఖాధిపతి, తెలుగు విభాగము, పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, పెదనందిపాడు, గుంటూరు.

నవనాగరికతకు దూరంగా స్వచ్ఛంగా నిర్మలంగా కొండల్లో, కోనల్లో, లోయల్లో, అడవుల్లో తనదైన జీవనం గడుపుతున్నారు ఆదివాసీలు. వారి ఆచార సంప్రదాయాలలోనూ, సంస్కృతిలోనూ, వివాహాలు - కట్టుబాట్లు, నమ్మకం, పండుగ-పబ్బాలలోనూ, ఉత్సవాలు - జాతర్ల లోనూ మొదలైన ఎన్నో అంశాలలో విలక్షణత స్పష్టంగా గోచరిస్తుంది. అటువంటి ఆదివాసీలలో విశిష్టంగా పేర్కొన దగినవారు గోండులు. వీరు ఆదిలాబాద్ జిల్లాలో నివశించే ఆదిమజాతి ప్రజలు. ఆచార సంప్రదాయాలలోనూ, సంస్కృతిలోనూ మిగిలిన గిరిజన తెగలకు భిన్నమైన లక్షణాలు కలిగి ఉండటం వీరి ప్రత్యేకత. ముఖ్యంగా వీరు ప్రదర్శించే నృత్యం గిరిజన తెగలలో ఎవరికీ లేని విశిష్టతను సంస్కృతిని తెలియజేస్తుంది. గోండులు పండుగలు, శుభదినాలు, పెళ్ళిలు, ఆటవిడుపు సందర్భాలలో అద్భుతమైన నృత్యాలు చేస్తారు.

గోండులు - చారిత్రకనేపథ్యం :

గోండ్వానా ప్రాంతం నుండి రావటం చేత వీరికి గోండులు అనే పేరు వచ్చినట్లు తెలుస్తుంది. మొగలులు, మరాఠాదాడులలో వీరు ఓడిపోవటంచేత చెల్లా చెదరై అనేక ప్రాంతాలకు వెళ్ళినట్లు విశదమవుతుంది. ఆ విధంగా వెళ్ళిన వారిలో కొంతమంది ఆదిలాబాద్ జిల్లాలో తలదాచుకున్నట్లు తెలుస్తుంది వారే గోండులు. ఒకప్పుడు రాజ్యాలేలిన గోండులు నేడు అటవికులుగా పరిగణింపబడుతున్నారు. అయితే వీరి సంస్కృతి మిగిలిన గిరిజన తెగలకు భిన్నంగా ఉండటం చెప్పుకోదగిన అంశం. వీరు గోండీ భాష మాట్లాడతారు. వీరిలో మురియా గోండీ, మరియాగోండీ, రాజ్‌గోండీ, దురివి గోండీ అనే తెగలు ఉన్నట్లు స్పష్టమవుతుంది. తెలుగు ప్రాంతంలో రాజ్ గోండీ ప్రజలు నివశిస్తున్నారు. వీరు ప్రధానంగా పితృస్వామ్య వ్యవస్థ కలిగి 4 గోత్ర కూటాలను కలిగి ఉన్నట్లు తెలుస్తుంది. అవి :

గోండీ గోత్రకూటాలు



అంతర్గత గోత్రాలకు చెందిన వారిని వీరు వివాహం చేసుకోరు. అయితే వీరందరికి పర్సాపెన్ కులదైవం. శంభు మహాదేవుడ్నే కాక దేవతల్ని కూడ పూజిస్తారు. దేవుడికి నేవధ్యం పెట్టకుండా వీరు ఏ పని చేయరు. పెళ్ళిలలో, దేవతారాధనలో, పండుగలలో, శుభదినాలలో వీరు నృత్య ప్రదర్శనలు చేస్తారు. గోండుల సంస్కృతిలో భాగమైన నృత్య సంప్రదాయం దండారీ ఉత్సవాలలో కనువిందు చేస్తుంది.

దండారియా ఉత్సవం :

గిరిజన సంస్కృతి సంప్రదాయాలకు నిలువెత్తు

నిదర్శనంగా నిలుస్తుంది దండారియా ఉత్సవం. ఆది వాసీలు జరుపుకునే పండుగలలో విశిష్టమైనది దండా రియా పండుగ. దీపావళి పర్వ దినాలలో ఈ దండారియా ఉత్సవాన్ని గోండులు అంగరంగ వైభవంగా జరుపు కుంటారు. అత్యున్నత సంప్రదాయాలకు పట్టు గొమ్మలుగా, సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించు కోవటంలో వారికి వారే సాటి అని నిరూపిస్తారు. వారు జరుపుకునే ప్రతి పండుగలో ఒక ఆంతర్యం దర్శిన మిస్తుంది. ఈ దండారియా ఉత్సవాన్ని గోండుల కాలెం డర్ ప్రకారం అకాడి (ఆషాడం) నెలలో ప్రారంభిస్తారు. మన కాలెండర్ ప్రకారం దసరా అయిన వెంటనే ప్రారంభ మవుతుంది. దీపావళికి తర్వాత రెండు రోజులకు ముగు స్తుంది. దీపావళి పండుగ సమయానికి గోండుల చేతికి పంట వస్తుంది. అప్పటి వరకు గిరిజన తండాలు అనేక విషజ్వరాలతో కునారిల్లి చిన్నగా తెప్పరిల్లుకునే సమయం. పైగా చితచితలాడే బురదనేలలు, వర్షబాధలు పోయి వాతావరణం చల్లగా హాయిగా ఆనందదాయకమై ఉత్సాహోభరితంగా ఉంటుంది. అందుకే ఈ దండారీ ఉత్సవం ప్రతి గిరిజన తండాలలో నూతనోత్తేజాన్ని నింపుతుంది. గోండులు ఆ తొమ్మిదిరోజులను ఎంతో గొప్పగా, వైభవోపేతంగా నృత్య ప్రదర్శనలతో ఉత్సవాన్ని జరుపుకుంటారు. ఈ ఉత్సవం జరుపుకోవటానికి గోండులు చెప్పే కథలెన్నో ప్రచారంలో ఉన్నాయి.


దండారియా ఉత్సవం – చారిత్రక నేపథ్యం :

గోండులు దండారియా ఉత్సవం జరుపుకోవటానికి ఒక పురాణకథను చెప్తారు. పూర్వం వనవాసానికి వెళ్ళిన పాండవులు బ్రాహ్మణుల రూపంలో ఏకచక్రాపురంలో తలదాచుకుంటారు. ఆ సమయంలో బకాసురుడు సమీప అటవిక తండాలను హింసిస్తూ ఉండటం చేత భీముడు అతడ్ని చంపివేస్తాడు. దానిని పురస్కరించుకొని ఆ సమీప గిరిజన తండాలు దీపాలు వెలిగించి ఆనందోత్సవంతో నృత్యాలు చేస్తూ సంబరాలు జరుపుకుంటారు. ఆ పండుగే దండారియా పండుగ అని, అనృత్యమే గుసాడీ నృత్యం అని గోండులు చెబుతారు. దీపావళికి వారం రోజుల ముందునుండే పండుగ ఉత్సవాన్ని ప్రారంభి స్తారు. దీనిని వాళ్ళు భోగి అంటారు. పౌర్ణమి నాడు భోగి ప్రారంభమై చతుర్ధశి వరకు ఉత్సవం కొనసాగు తుంది.

దండారియా నృత్యం :

గోండు తెగలలో మగవారు దండారియా నృత్యం చేస్తారు. ఆడవాళ్ళు, మగవాళ్ళు కలిసి పెళ్ళి శుభ సంద ర్భంలో ధింసానృత్యం చేస్తారు. దండారియా నృత్యంలో ఐదు రకాల నృత్యాలు అంతర్భాగంగా ఉంటాయి. అవి గుసాడీ, గుమ్మెల, పర్ర, టప్పల్, కోడల్ అనేవి.

దాండారియా నృత్యరకాలు



దండారియా నృత్యంలో అంతర్భాగంగా ఉన్న గుమ్మెల నృత్యాన్ని నల్వేన్ సాగా (నలుగురు సోదరుల దివ్యసమూహం), పర్ర నృత్యాన్ని సేవెన్ సాగా (ఐదుగురు దివ్యసమూహం), టప్పల్ నృత్యాన్ని గుర్వేన్ సాగా (ఆరు గురు సోదరుల దివ్యసమూహం), కోడల్ నృత్యాన్ని ఎడ్విన్ సాగా (ఏడుగురు సోదరుల దివ్యసమూహం) చేస్తారు. అయితే గుసాడీ నృత్యాన్ని గోండులందరూ దీపావళి పర్వదినాలలో చేస్తారు.

దీపావళికి వారం రోజుల ముందు నుండే దండారి నృత్యంతో ఈ పండుగ ప్రారంభమవుతుంది. దండారి అంటే చాటింపు, దరువు అని అర్థం. ఏటా దీపావళికి దండోరా వేసి ప్రక్క గూడేనికి తాము వస్తున్నామని కబురు చేయటమే దండారియా ప్రత్యేకత. వీరు ఏ గూడానికైతే వస్తున్నారో ఆ గూడెం గిరిజనులు ఎదురు వెళ్ళి వారిని తమ గూడెంలోకి ఆహ్వానిస్తారు. ఆ సమయంలో ఆతిథ్య మిచ్చే గూడెం ఆడవాళ్లు మగవాళ్ళు కలసి ధింసా నృత్యం

చేస్తూ అతిథులకు స్వాగతం పలుకుతారు. ఆ విధంగా గ్రామంలోకి వచ్చే నాట్య బృందాలకు దండారియా నాట్య బృందాలని పేరు. ఈ బృందంలో 20 నుండి 40 మంది సభ్యులు వరకు ఉంటారు. గ్రామ పొలిమేరల్లోకి అడుగు పెట్టిన వెంటనే ఒకరు కొమ్ము బూర ఊదుతారు. కొంత మంది డప్పుల మోత చేయగా ఎంతోకోలాహలంతో, ఆట పాటలతో దండారియా నాట్యబృందం ఆ గూడెంలోకి ప్రవేశిస్తుంది.

దండారియా నాట్య బృందం వలయాకారంలో గూడెం మధ్యలో నృత్యం చేస్తారు. లయబద్ధంగా నర్తిస్తూ క్రమ బద్ధంగా ఏడమ వైపుకు అడుగులు వేస్తూ ఉంటారు. అడుగులు వేసేటప్పుడు కుడి పాదాన్ని ఎడమ కాలు మీదకు ఊగిస్తూ నృత్యం ప్రారంభిస్తారు. వారి చేతుల్తో ఇత్తడి తొడుగుతో కూడిన రెండు కోలాటకర్ర పుల్లలు ఉంటాయి. నృత్యం చేసే సమయంలో ఆ కర్ర పుల్లలను ఒక దానితో మరొకటి తాడించి తర్వాత కుడివైపు ఉన్న నర్తకుని చేతులోని కర్రలకు తాకిస్తారు. మరలా తన కర్రలను తాడించి తర్వాత ఎడమవైపు ఉన్న నర్తకుని చేతుల్లోని కర్రలను తాకిస్తారు. ఇలా అడుగులు ముందుకు వేస్తూ కోలాటమాడుతూ యధాపూర్వస్థితికి చేరిందాక నృత్య ప్రదర్శన చేస్తారు. చివరకు అందరూ క్రిందికి వంగి కర్రలను నేలకు తాకించి నాలుగు దిక్కులకూ అడుగులు వేస్తారు. ఇలా చేయటం అనేది దేవతలకు గౌరవం ఇచ్చినట్లుగా, వందనం చేసినట్లుగా వాళ్ళు భావిస్తారు. తర్వాత వాళ్ళు గుండ్రంగా చేరి కర్రలను క్రింద ఉంచి చేతులతో చప్పట్లు కొడుతూ పాటలు పాడుతూ కోలాహాలాన్ని ప్రదర్శిస్తారు. ఈ వలయంలోని వాళ్ళే 2 బృందాలుగా భావించుకుంటూ పాట అందుకొని ఒక బృందంవాళ్ళు ఒక చరణాన్ని పూర్తి చేయగా మరొక బృందం రెండో చరణాన్ని గానంచేస్తూ దండారియా నృత్యాన్ని వాద్యాలకు అనుగుణంగా తారాస్థాయికి తీసుకు వెళతారు. అప్పుడే హఠాత్తుగా ఆ వలయంలోకి గుసాడీ బృందం ప్రవేశిస్తుంది. జట్టులోపలకు చొచ్చుకు వచ్చి గుసాడీ నృత్యం చేస్తారు. వీరినే గుసాడీ వేషధారులంటారు. వారు చేసే నృత్యమే గుసాడీ నృత్యం.

గుసాడీ నృత్యం :

దండారియా ఉత్సవాలలో అందరినీ ప్రధానంగా ఆకర్షించేది గుసాడీ నృత్యం. ఈ గుసాడీ వేషధారణే ఈ ఉత్సవ ప్రత్యేకంగా చెప్పవచ్చు.

గుసాడీ వేషధారణ :




గుసాడీ వేషధారణ చిత్రంగా ఉంటుంది. నెమలి ఈక తల పాగాలు, చిన్నచిన్న అద్దాలు, పెట్టుడు మీసాలు, గడ్డాలు శరీరంపై మేక చర్మం, మెడచుట్టూ గవ్వల హారాలు, తుంగకాయల హారాలు ఉంటాయి. మణికట్టు చుట్టూ మోగుతున్న గంటలు, శరీరంపై తెలుపు, నలుపు చారలతో, చుక్కలతో వింత వింత అలంకరణాలు కలిగి ఉంటారు. కాళ్ళకు గజ్జెల పట్టీలు కట్టుకుంటారు. నెమలి ఈకల టోపీలలో దుప్పి కొమ్ములను అమర్చుకుంటారు. చేతిలో ఒక కర్ర ఉంటుంది. దానిని 'చౌటా' అంటారు. గోండులు దీనిని మంత్ర దండంగా భావిస్తారు. ప్రతి గుసాడీ ఎడమ చేతిలో జింక చర్మం ఉంటుంది. పూర్వం పులి చర్మాలు ఉండేవని ఇప్పుడు జింక చర్మాలు ఉపయోగిస్తున్నట్లు గోండు పెద్దలు చెబుతారు.

గుసాడీ నృత్యప్రదర్శన :




దండారియా నాట్యబృంద వలయంలోకి గుసాడీలు

హఠాత్తుగా ప్రవేశించి దండారియా సభ్యులను చెల్లా చెదరుచేస్తారు. ఆ సమయంలో వారు వేసే పోలికేకలు, గెంతులు చూసి అందరూ ఆనంద పారవశ్యంలో మునిగి తేలతారు. నృత్యం చేసే సమయంలో తమ దగ్గరకు వచ్చేవారిని చేతి కర్రతో తాడిస్తుంటారు. ఆ సమయంలో గుసాడీ చేతిలోని కర్రలను తమ శరీరంపై తాకించు కోవ టానికి గోండులు ఉత్సాహం చూపిస్తారు. గుసాడీ నృత్యం చేసేవారికి దేవతలు ఆవహిస్తారని, అతని చేతిలోని కర్రలను తాకితే ఎటువంటి వ్యాధులైనా నయం అవు తాయని గోండులనమ్మకం. గోండులు గుసాడీని పరమ పవిత్రంగా భావిస్తారు. గుసాడీ గ్రామంలోకి వచ్చిన వెంటనే ఆ గ్రామానికి చెందిన పటేలు ఇంటికి సమీపం లోని ఆకీపేమ్ ముందు తమతోపాటు తీసుకు వచ్చిన సంప్రదాయ వాయిద్యాలు డోలు, పట్టే, డప్పులు, తుడుము, పిప్రీ(బాకా), కలికోమ్ (తప్పెట), చౌటా, నెమలి ఈకలటోపీలు ఉంచి ఎత్నమసన్ దేవునికి ప్రత్యేక పూజలు చేస్తారు. దండారీ ఉత్సవంలో పాల్గొని పూజలు నిర్వహిస్తే కోరిన కోరికలు తీరతాయని గోండుల విశ్వాసం. తర్వాత మేకలు, కోళ్ళు బలియిచ్చి దేవతానుగ్రహం పొందామని సంతృప్తి చెందిన తర్వాత గుసాడీ నృత్యం ప్రారంభిస్తారు. అనంతరం దండారియా బృందవలయంలోకి ప్రవేశించిన గుసాడీలు గుసాడినృత్యం చేస్తారు. గుసాడీ వేషధారణ వేసిన వారిని శ్రీకృష్ణుని స్వరూపంగా భావిస్తారు. వారిని దేవత స్వరూపంగా భావిస్తూ "ఎత్నోపి" అని పిలుస్తారు. గుసాడీలు వాయిధ్యాలకు అనుగుణంగా లయబద్ధంగా నృత్యం చేస్తూ మధ్యమధ్యలో తన చేతి కర్రతో ప్రేక్షకుల నడుమును తాకించి చక్కిలిగింతలు పెడుతూ ఛలోక్తులు విసురుతూ పెద్దగా నవ్విస్తారు. వాద్యశబ్దాల వేగం పెరిగే కొద్దీ గుసాడీ నృత్య వేగం పెరుగుతుంది. కాస్త విరామం దొరికినప్పుడు ఎడమ చేతిలోని జింక చర్మాన్ని నేలపై పరుచుకొని కూర్చుంటారు. తర్వాత మరలాలేచి నాట్య వేగాన్ని పెంచి వెనుకకు, ముందుకు, ప్రక్కకు, వంకర టింకరగా అడుగులువేస్తూ వాయిద్య పరికరాల శబ్దాలకు తగినట్లు లయబద్ధంగా నృత్యం చేస్తారు. ఇలా గుసాడీ నృత్యం ఆటపాటలతో, వినోద ప్రదర్శన కార్యక్రమాలతో ప్రేక్షకులను అలరిస్తుంది.

గుసాడీనృత్యం అయిన తర్వాత ఆతిధ్యం ఇచ్చిన గ్రామస్థులు అయిష్టంగానే గుసాడీల కాళ్ళు కడిగి ఆ తంతు పూర్తి చేసామనిపించుకుంటారు. అనంతరం గ్రామ పటేలు కాస్త ఆర్థికంగా బలవంతుడైతే గ్రామస్థులందరికి భోజన ఏర్పాట్లు చేస్తాడు. లేదంటే ఈ కార్యక్రమానికి అయ్యే ఖర్చుని గూడెం అంతా చందాల రూపంలో వేసు కొని చేస్తారు. మళ్ళీ భోజనాలయ్యాక గుసాడీ నృత్యాలు అర్ధరాత్రి వరకు కొనసాగుతాయి. రాత్రి పడుకొని మళ్ళీ తెల్లవారుజామున నుంచి మధ్యాహ్నం వరకు ఇతే తంతు కొనసాగుతుంది.

సాయింకాల సమయంలో గుసాడీలు గోండీ భాషలో గుసాడి అనే ప్లాస్కువలె ఉండే బుర్ర కథ డక్కి లేదా కింగ్రి అనే వాద్యం సహకారంతో మహాభారత ఘట్టాలు, పాండవుల వీరోచిత గాధలు, గోండు రాజుల పూర్వ చరత్రను, దేవతల కథలును చెబుతారు.

నేడు గుసాడీ వేషధారణలో కూడా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఒకప్పుడు పులి చర్మం ధరించిన గుసాడీలు ఇప్పుడు జింక చర్మం ధరిస్తున్నారు. కళ్ళకు అద్దాలు ధరించి గుసాడీ నృత్య ప్రదర్శన చేయటం వారిలో వచ్చిన మార్పుకు సంకేతం. ఏది ఏమైనప్పటికీ దీపావళి వచ్చిందంటే గోండుల గూడెంలో తుడుం మోగా ల్సిందే. కాళ్ళకు గజ్జెకట్టారంటే డప్పు చప్పులతో ఆదివాసి గూడెలన్నీ గుసాడీ నృత్యాలతో ఆడాల్సిందే. స్వచ్ఛమైన గౌరవభావం, ఆత్మీయతా సౌరభాన్ని పంచే గోండుల సంస్కృతికి నేటికి చెక్క చెదరక కొనసాగుతుండటం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తుంది. పాశ్చాత్య నాగరికత విషసంస్కృతి విస్తరిస్తున్న ఈ రోజుల్లో మనం మన సంస్కృతీ సంప్రదాయాలను మంట గలుపుతుంటే ఆది వాసీలైన గోండులు సంస్కృతీ సంప్రదాయాలను పది లంగా కాపాడుకుంటూ వస్తున్నారు. వారి సంస్కృతి సంప్రదాయాలు నేటి యువతరానికి ఆదర్శం కావాలి.

మెకంజి కైఫియత్తులు – గిరిజన జీవనం

– డా॥ పాలెం రమాదేవి, సహాయ ఆచార్యులు, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

కైఫియత్తులలో గిరిజన విజ్ఞానానికి సంబంధించిన అనేక విశేషాలున్నాయి. నల్లమల కొండలలోని అహోబళం కైఫియత్తు, శ్రీహరి కోటలోని యానాదుల కైఫియత్తు, దాసరి చెంచుల కైఫియత్తులలో అనేక ఆసక్తికరమైన విషయాలు చరిత్ర పరిశోధనకు ఉపకరిస్తాయి.

ముఖ్యంగా అహోబిలం కైఫియత్తులలో చెంచులు, యానాదుల జీవన విధానం గురించి స్పష్టంగా ఉంది. వీరు అడవుల నుంచి అనేక పదార్థాలను సేకరిస్తారు. వాటిని అమ్మగా వచ్చిన సొమ్మును పంచుకొంటారు. అలాగే ఆ సొమ్మును ఖర్చు చేసుకొనే విధానం నేటి ఆధునిక సమాజానికి ఎంతో ఆదర్శవంతమైంది.

పుట్టుపాపలు (లిల్లీపుట్స్) :

ఈ పుట్టుపాపల గురించి అహోబళ కైఫియత్తులో ఉంది. చాలా ఆసక్తికరమైన విషయాలు ఇందులో కనిపిస్తాయి. ఈ నలమల పర్వతాల్లో 'పుట్టుపాపలు' అనే పొట్టి మనుషులు ఉండేవాళ్లు. వీరు కేవలం 1.5 గజం పొడవు మాత్రమే ఉంటారు. పసిపాపల లాగా పుట్టినప్పటి నుండి ఏమాత్రం పొడవు పెరగకుండా ఉంటారు కాబట్టి వీరిని గిరిజనులు 'పుట్టుపాపలు' అనే పేరుతో పిలిచేవారు. వీరు పర్వతాల్లోనే నివాసం ఏర్పరచుకొని జీవిస్తారు. మైదానం ప్రాంతాలకు వెళ్ళరు. వస్త్రాలను ధరించరు. ఆహారం స్వల్పంగా తీసుకొంటారు. జంతువుల మాంసం, పండ్లు, తేనె, ఇంజేటి గడ్డలు వీరి ఆహారం. కేవలం పచ్చివి మాత్రమే తింటారు. వీరికి వండుకొని తినటం రాదు. వీరు ఎవరికంట పడినా వెంటనే పారిపోతారు. మాములు మనుషులు తిరిగే ప్రదేశాలకు వీరు వెళ్ళరు. ముత్తాలపాటి పాళెగాడైన రంగప్పనాయుడు చెంచుల ద్వారా ఇద్దరు పుట్టుపాపలను పట్టుకొంటాడు. ఇందులో ఒకడు 24 గంటల్లోనే భయంతో చనిపోతాడు. రెండో వాడిని మళ్ళీ అరణ్యాల్లో వదిలి వేస్తారు. ఈ పుట్టు పాపలకు ఆయుధాలు లేవు. ఏవైన అడవి మృగాలు వీరికి చిక్కితే రాతితో నరకి చీల్చుకొని పచ్చిమాంసం భక్షిస్తారు. దట్టమైన అడవిలో జనసంచారం లేని ప్రాంతాల్లోనే వీరు జీవిస్తారు. (అహోబళం కైఫియత్తు పుట 24-26)

నల్లమల్ల చెంచులు - జీవన విధానం :

వీరినే "యానాది చెంచులు" అని పిలిచేవారు. అహోబిలం సమీపంలోని నల్లమల దగ్గర మల్లిమళ్ళ చెరువు భార్గవ నారసింహులు నివాస ప్రదేశంలోని ఈ మహారణ్యంలో పొదరిండ్లపైన బోరగడ్డి కప్పి నివాసం ఏర్పరచుకొని జీవిస్తారు. వీరి సంతానం అంతా ఉమ్మడిగా జీవిస్తారు. వీరు సంచార జీవులు. ఏ ప్రాంతంలో కూడ స్థిరనివాస ముండరు. రెండు మూడు నెలల కొకసారి స్థలాలు మారుతుంటారు. (అహోబలం కైఫియత్తు పుట 89-90)

వీరు మైదానం ప్రాంతాలలోకి వచ్చి అటవీ ఉత్పత్తులను అమ్మి ఆ సొమ్ముతో మట్టి పాత్రలను కొంటారు (పుట 90).

ఆహారం - వంట :

వీరు జొన్నలు, సజ్జలు, రాగులు, బియ్యం, పప్పు దినుసులు, మిరపకాయలు, చింతపండు మొదలైనవి కొంటారు (పుట 90). వీరి దగ్గర దంచుకోడానికి రోళ్ళు ఉండవు. కాబట్టి ధాన్యాలను బండ మీద వేసి రాయితో నూరి పిండి తయారు చేసుకొంటారు. మట్టి పాత్రలలో వండుకొని తింటారు.

చెంచుగడ్డలు అనే దుంపను భూమి నుంచి త్రొవ్వుకొని, వాటిని కాల్చి చాలా ఇష్టంగా భుజిస్తారు (పుట 90-91).

జంతువుల వేట :

స్త్రీ పురుషులిద్దరు ధనుర్బాణాలు ధరించి వేటాడు తారు. అడవి మృగాలైన దుప్పలు, జింకలు, కణుతులు, కొండ గొర్రెలు, గొనంగులు, కోతులు, ఉడుములు, అడవి పందులు, యేదులు, చెవుల పిల్లులు మొదలైన వీటిని వేటాడుతారు.

పక్షుల వేట :

కారుకోళ్ళు, నెమళ్ళు, కంజులు, పాలపిట్టలు, కొక్కి రలు, కాకులు, గువ్వలు, పూరేళ్ళు, పిచుకలు, పావురాలు, ఉమ్మగువ్వలు, తెల్లకంకణాలు, నల్లకంకణాలు, చిలు వలు, వంగపండ్లు, నేలమళ్ళు, టిట్టిభములు, నీరు కోళ్ళు, నీరుకాకులు, కొంగలు, బగ్గొరైలు, గోరవంకలు, నెలవంచికాండ్లు, పికిలి పిట్టలు, గద్దలు, బందుగెద్దెలు మొదలైన పక్షులను వేటాడి అగ్గిలో కాల్చి తింటారు. వీటిని పాత్రలో వండుకొని తినరు.

వీరికి దాహం వేసినపుడు నీరు లభించే నదులు, కొలనుల దగ్గరికి వెళ్ళి చేతులతో నీళ్ళను తాగుతారు. వీరు గృహాలలో రాగి పాత్రలను వాడరు. మలమూత్ర విసర్జన అయిన తర్వాత వెంటనే నీళ్ళతో శుభ్రం చేసు కోరు. ఎప్పుడైతే నీళ్ళు లభిస్తాయో అప్పుడే శుభ్రం చేసు కొంటారే గాని అతముందు దాని గురించి పట్టించుకోరు (పుట 91).

ఆభరణాలు – కేశాలంకరణ :

ఈ చెంచుస్త్రీలు 14 మూరలుగల ముతక చీరెలను మైదానం ప్రాంతంలోకి వెళ్ళి కొంటారు. వీటిని చీరె లాగే ధరిస్తారు. రవికలను ధరించరు. పురుషులు గోచి మాత్రమే పెట్టుకొంటారు. స్త్రీలు అడవుల్లో లభించే గురు విందగింజలను సేకరించుకొని వాటికి కొయ్య పూసలు కలిపి దండలాగా అల్లుకొని కంఠహారాలుగా ధరిస్తారు. అలాగే స్త్రీలు గ్రామాలకు వెళ్ళినప్పుడు అక్కడ నుంచి రాగి వైరును తెచ్చుకొని ఉంగరాలు తయారు చేసు కొంటారు. స్త్రీ పురుషులిద్దరూ జడలు వేసుకొంటారు. జుట్టు కత్తరించుకోరు. స్త్రీలు చారపప్పు, కానుగపప్పును దంచి తైలం తీసి తమ శిరోజాలకు పట్టించుకొంటారు. పురుషులు తలకు నూనెను వాడరు.

స్త్రీ పురుషులిద్దరూ బాణాలు ధరిస్తారు. వింటి బద్దతో పాటు ఒక్కొక్కరి దగ్గర కనీసం 5 బాణాలు ఉంటాయి. వెదురుతో తయారు చేసిన కర్రకు చివర ఇనుప ముక్క లను పదునుగా చేసి అతికిస్తారు. వీటిని బాణాలుగా వాడుతారు.

ప్రసవం – నామకరణం :

స్త్రీలు ప్రసవించిన తర్వాత వెంటనే బిడ్డకు బొడ్డు కోసి, చన్నీళ్ళతో స్నానం చేయిస్తారు. చలికాలమైతే వేనీళ్ళతో స్నానం చేయిస్తారు. బిడ్డను ఒక గట్టి బట్టలో పడుకోబెట్టి ఊయలలాగా తయారు చేసి నాలుగు వైపుల దూసర తీగెలు తాళ్ళుగా కట్టి ముడివేసి వెదురు గడెకు తగిలించి భార్యాభర్తలిద్దరూ వేటకు పోతారు. తిరిగి వచ్చిన తర్వాత బిడ్డకు తల్లి పాలిస్తుంది. శిశువుకు నామకరణం చేసే సాంప్రదాయం వీరిలో ఉంది.

వివాహం :

కన్య రజస్వల అయిన తర్వాతే వివాహం చేస్తారు. వివాహానికి ముహూర్తాలు చూడరు. ఒకవేళ భర్త చనిపోతే భర్త తమ్ముడైన మరిదిని వివాహం చేసుకొనే సాంప్ర దాయాన్ని పాటిస్తారు. దీనినే 'మారుమనువు' అంటారు.

తేనె సేకరణ – వింత ఆచారం :

కొండపేట్లకు తేనె పెట్టలుంటాయి. అవి చాలా ఎత్తుగా ఉంటాయి. తేనె సేకరణ అతి పెద్ద సాహసం. గిరిజనులు తమ విజ్ఞానాన్ని ఉపయోగించి చాలా జాగ్రత్తగా ఈ తేనెను సేకరిస్తారు. ఈ తేనె సేకరణలో వింత ఆచారం ఉంది. తేనె సేకరణ సమయంలో ఎత్తైన పేటుకు తాడుతో లంగరు లాగా వేస్తారు. చివరకొనను ఒకరు పట్టుకొంటారు. ఒకరు పాత్రను గాని, సొరకాయ బుర్రగాని తీసుకొని తాడును ఒడుపుగా పట్టుకొంటారు. ఇంకొకరు తాడును లాగుతారు. అలా లాగగానే తాడుకు

వేళాడే వ్యక్తి తేనే పెట్ట దగ్గరికి చేరుకొని తేనె సేకరిస్తాడు. కింద తాడు పట్టుకొనే వ్యక్తి పొరబాటున వదిలేస్తే పైనున్న వ్యక్తి నేలకు పడిపోయి మరణించే ప్రమాదముంది.

అన్నదమ్ములిద్దరు తేనె సేకరణకు వెళ్ళరు. ఎందు కంటే కింద ఉండే సోదరుడు దురుద్దేశంతో తాడును వదిలేస్తే ఒకవేళ అన్న మరణిస్తే వారి సాంప్రదాయం ప్రకారం అన్నభార్యను తమ్ముడు వివాహం చేసుకోవచ్చు. దీనివల్ల అన్న తమ్ముడితో కలిసి తేనె సేకరణకు వెళ్ళడు. బావమరదులుగాని, తండ్రీ కొడుకులు గాని కలిసి వెళ్తారు (పుట 95-96).

అలా సేకరించిన తేనెలో సగం గ్రామస్తులకు సగం సేకరించినవారు పంచుకొనే ఆచారముంది. దీనినే 'కోరు' అంటారు. మత్స్య, మగధ దేశాల్లో దీనినే 'సంగోరు' అంటారు.

చెంచుస్త్రీలు ఈ తేనెను సమీప గ్రామాల్లో విక్ర యిస్తారు. ఈ ఆదాయంలో సగభాగం చెంచుగ్రామాభి వృద్ధికి కేటాయిస్తారు.

దేవుడికి నైవేద్య సమర్పణ :

అహోబిళం నారసింహునికి ఈ చెంచులు తమ శక్తి మేరకు కానుకలు సమర్పిస్తారు. అహోబిళస్వామి కళ్యా ణోత్సవం రోజు అమ్మవారికి, స్వామికి తేనె, పసుపు కుంకుమ, ఫలహారాలు, ధూపదీప నైవేద్యాలు సమర్పిం చుకొని ఉత్సవం ముగిసినంత వరకు స్వామివారి సన్నిధిలోనే ఉండి ఆ తర్వాత స్వస్థలాలకు వెళ్ళిపోతారు.

ధనసంపాదన :

శ్రీశైల పర్వతంపైన నివాసం ఉండే చెంచులు, ఆ పర్వతానికి సమీపంలో ఉన్న చెంచులు యాత్రికులను ఎద్దుబండ్లలో, గుర్రపు బండ్లలో కొండపైకి చేర్చు తుంటారు. అందుకు భక్తులు వారికి కొంత డబ్బులు ఇచ్చేవారు. దానిని అందరూ సమానంగా పంచు కొంటారు.

ఒకవేళ యుద్ధంలో సహాయం చేయమని రాజు దగ్గరి నుంచి పిలుపు వస్తే వారు ధనుర్బాణాలు ధరించి యుద్ధంలో పాల్గొంటారు. అందుకు రాజులు వారికి తగిన బహుమానాలిస్తారు. ఇందులో భాగంగా వారు కొంత భూమి మాన్యాలుగా పొందారు. ఈ భూమిని వారు సాగుచేయరు. రైతులకు కౌలుకిస్తారు. కొందరు చెంచులు దొంగతనాల ద్వారా సంపాదిస్తుంటారు. ఒకవేళ రాజుకు ఈ విషయం తెలిస్తే మరణ శిక్ష తప్పదు. ఒకవేళ ఈ భయం లేకపోతే దారిన పోయే బాటసారులు చాలా ఇబ్బందులు ఎదర్కొనేవారు (పుట 98).

సంచార జాతులు- జీవన విధానం దొమ్మరాట :

దొమ్మర్లు సంచార జీవనం సాగించేవారు. వీరు గాడిద లను మేపేవారు. కొన్ని గ్రామాలను ఎంపిక చేసుకొని పొలిమేర్లలో తాత్కాలికమైన గుడిసెలు నిర్మించుకొని ఒక నెలరోజుల పాటు ఉంటారు. చుట్టు ప్రక్కల గ్రామాల్లో 'గెడాటలు' ప్రదర్శించేవారు. రెండు ఎత్తైన గెడెకర్రల మధ్యలో ఒక బలమైన తాడును కట్టి ఆ తాడు మీద నడవడం, పల్టీ కొట్టడం మొదలైన విన్యాసాలు ప్రదర్శి స్తారు. ప్రాచీన కాలం నుంచి వీరు ఈ విద్యలో ప్రావీణులు.

పెమ్మసాని తిమ్మానాయుడు గండికోటను పరి పాలించే కాలం గొప్ప విద్యావంతులైన దొమ్మరివారు ఆయనను కలుసుకొంటారు. వారి విద్య గురించి తెలియ జేస్తారు. నాయుని అనుమతితో గండికోటలో ఉండే మాధవస్వామి గోపురం మీద గెడెవేసి రెండు బాటలు కట్టుకొంటారు. ఎంత దూరం గెడెల మీద నడిచి ఆగిపోతారో ఆ గ్రామాన్ని జాగీరుగా ఇవ్వమని కోరుతారు. ఆయన అందుకు సమ్మతిస్తారు. వారు నంద్యాల గ్రామం వరకు గెడెల మీద నడుస్తారు. ఆ గ్రామ సరిహద్దులో పడిపోతారు. అప్పటి నుండి ఆ గ్రామానికి 'దొమ్మర నంద్యాల' అనే పేరు పెట్టి వారికి, వారి వంశస్థులకు తిమ్మనాయుడు ఆ గ్రామాన్ని జాగీరుగా ఇస్తాడు. కొన్ని సంవత్సరాల పాటు వీళ్ళు ఈ జాగీరును అనుభవించి దేశ సంచారం కోసం వెళ్ళిపోతారు. వారు తిరిగి రాక పోవడంతో గోల్కొండ నవాబులు ఈ ప్రాంతాన్ని ఆక్ర

మించినపుడు వారి సామంతరాజైన మీర్‌జుమ్లా గండి కోటను పరిపాలించే సమయంలో ఈ దొమ్మర నంద్యా లను తన రాజ్యంలో కలుపుకుంటాడు (ప్రపంచపాళ్యం కైఫియత్తు పుట 154-155).

ఉపయుక్త గ్రంథాలు :

1. మెకంజి కైఫియత్తులు - కడప జిల్లా 8 భాగాలు, సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం
2. అహోబిళం కైఫియత్తు
3. శ్రీహరికోట యానాదుల కైఫియత్తు
4. దాసరి చెంచుల కైఫియత్తు
5. ప్రపంచపాళ్యం కైఫియత్తు

శ్రీకాళహస్తిమాహాత్మ్యం – గిరిజనుల సాంస్కృతిక జీవనం

– యం. దీనదయాళం, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయనశాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

భూమి మీద మానవుని మనుగడకు మూలాధారం ఆదిమానవుడు. మానవజాతి పరిమానక్రమంలో తొలి దశను ఆటవిక జీవనంగా మానవశాస్త్రజ్ఞులు నిర్ధారించారు. అనేక శతాబ్దాల నుండి కొండలలో, అడవులలో, ఎడారులలో, హిమప్రదేశాలలో, ద్వీపాలలో నివసిస్తూ ఉండే వారు. కాబట్టి వీరిని 'గిరిజనులు' అన్నారు. గిరి అనగా కొండ అని, జనులు అనగా సమూహం అని అర్థం. ఆనాటి నుండి ఈనాటి వరకు గిరిజనులను అనేక రకాల పేర్లతో పిలుస్తున్నారు. ఆదిమవాసులని, ఆటవికులని, అనాగరికులని, కొండ జాతీయులని, గిరిపుత్రులని రకరకాలుగా పిలువబడుతున్నారు. కొండలలో, పర్వతశ్రేణులలో నివసిస్తుండడం వలన వీరిని మనం గిరిజనులని నేటికి సర్వసాధారణంగా పిలుస్తున్నాం. భారతదేశంలో అనేక గిరిజన తెగలు ఉన్నాయి. భారతదేశంలో గిరిజనులను వివిధ మాండలికాల్లో వివిధ పేర్లతో పిలుస్తున్నారు. హిందీలో 'ఆదివాసి' లేదా 'జాన్ జాతి' గాను ఆంగ్లంలో 'TRIBE' గాను గిరిజనులను పిలుస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో అనేక గిరిజన తెగలు ఉన్నాయి. మాట్లాడే భాషను బట్టి గిరిజనులు రెండు విధాలుగా కనిపిస్తారు. ఒక తెగ పూర్తిగా తెలుగు మాట్లాడేవాళ్ళు. మరో తెగ తెలుగు భాషతో పాటు తమ తమ గిరిజన తెగకు సంబంధించిన భాషల్ని మాట్లాడేవాళ్ళు. అయితే తెలుగు కావ్యాల్లో కూడా గిరిజనుల ప్రస్తావన ఉన్నాయి. తెలుగు కావ్యాలైన నన్నయ మహాభారతం, నన్నెచోడుని కుమారసంభవం, తిక్కన మహాభారతం, శ్రీనాథుని శివరాత్రిమాహాత్మ్యం, హరవిలాసం, అనంతామాత్యుని భోజరాజీయం, పిల్లలమర్రి పినవీరభద్రుడి శృంగార శాకుంతలం, కొఱవి గోపరాజు సింహాసనద్వాత్రింశిక, అల్లసాని పెద్దన మనుచరిత్ర, అయ్యలరాజు రామభద్రుని రామాభ్యుదయం, ధూర్జటి శ్రీకాళహస్తిమాహాత్మ్యం, మట్ల అనంతరాజు కకుత్స్థ విజయం మొదలైన కావ్యాలలో గిరిజనుల ప్రస్తావన, వారి సాంస్కృతిక జీవనం గూర్చి వర్ణించబడింది. అయితే వీటిలో ధూర్జటి రచించిన 'శ్రీకాళహస్తిమాహాత్మ్యం' లో గిరిజనుల సాంస్కృతిక జీవనం గూర్చి ప్రస్తావించడం జరుగుతుంది.

గిరిజనులు నగర, గ్రామీణ సంస్కృతి ప్రభావాలకు లోను కాకుండా తమ సంస్కృతిని, భాషను, ఆచార సాంప్రదాయాలను కాపాడుకొంటున్నారు. వీరి సాంస్కృతిక జీవన విధానంలో వండుగలు, నమ్మకాలు, ఆచారవ్యవహారాలు, కళలు, వినోదాలు, విలాసాలు మొదలైనవి కలవు. గిరి జనుల సాంస్కృతిక జీవన విధానంలో చోటు చేసుకున్న పండుగలు, పూజా విధానం, ముగ్ధభక్తి, ఆచార వ్యవహా రాలు, బలి, కళలు, ఆటలు, మద్యపానం మొదలైన వాటి ప్రస్తావన కొన్ని 'శ్రీ కాళహస్తిమాహాత్మ్యం'లో కనిపిస్తు న్నాయి. వీటిని గూర్చి ఈ కింది విధంగా ప్రస్తావించడం జరిగింది.

పండుగలు :

గిరిజనుల పండుగలంటే జాతరలే. కొండదేవతకు గిరిజనులు జరుపుకునే సంబరమే జాతర. ధూర్జటి శ్రీకాళహస్తిమాహాత్మ్యంలో గిరిజనుల పండుగైన 'కాటిఱేని' జాతరను విపులంగా వర్ణించాడు. వేట సమయంలో గిరిజనులు పూజించేదైవం కాటిఱేడు. తిన్ననికి వేట పద్ధతుల్ని తెలియజేయడానికై నాథనాథడు కాటిఱేని జాతరకు రావలసిందని చాటింపు వేయిస్తాడు. అప్పుడు చెంచులంతా చక్కగా అలంకరించుకొని వివిధ ఆహార పదార్థాల్ని, వాద్యాల్ని మ్రోగిస్తూ కాటిఱేని గుడి వద్దకు వస్తారు. ఎరుకుల రాజైన నాథనాథుడు అతని భార్య తండె ఉపవాసం ఉండి సహజమైన భక్తితో పూజకు సిద్ధమయ్యారు.

"ఒక్క ప్రొద్దుండి సెలయేట నుదకమాడి
నాథనాథుండు తండెయునైజమైన
చతురలంకారములు దాల్చి సహజభక్తి"

తల్లిదండ్రులు పూజకు సిద్ధంకాగా తిన్నడు కూడా స్నానం చేసి అలంకరించుకొని విల్లమ్ములు ధరించి కాటిఱేని పూజలకై బయలుదేరుటను ఈ కింది పద్యంలో ప్రస్తావించాడు.

'జలకంబాడి విభూతి పెట్టుకొని రక్షామూలికా మాలికా
వలయంబుల్ యిడి దట్టి గట్టుక శిరోవర్ధిష్ణు నీలాలకం
బులలేదీగను జుట్టి కేల విలునమ్ముల్ పూని కాట్రేని పూ
జులు సేయం వెడలెంగు మారుడు.....'

అంతే కాకుండా శబర దంపతులు అందరు వెంట రాగా కాట్రేని గుడికి వెళ్ళి దేవుని ముందు తమ ఆయుధాన్ని ఉంచి, ఎర్రని పూలదండల్ని, నివ్వరి బియ్యాన్ని, రక్త చందనాన్ని, గుగ్గిలంతో పొగవేసి, నెత్తిన జ్యోతుల్ని ఎత్తుకొని వివిధ కానుకల్ని కాట్రేనికి సమర్పించి సేవించటాన్ని, పూజానంతరం అన్నపానాదులను గురించి, వినోదాలతో ఆడిపాడిన విలాసాల్ని ధూర్జటి వర్ణించడం జరిగింది.

భక్తి :

గిరిజనుల్లో మూఢభక్తి అధికం. దైవం పట్ల వాళ్లకు గల ప్రగాఢ విశ్వాసం అనన్యమైంది. శైవసంప్రదాయంలో మూఢభక్తుల కథలు అధికంగా కన్పిస్తాయి. గిరిజనులు చాలా వరకు శైవులుగా కన్పిస్తారు. గిరిజన జాతికి చెందిన తిన్నని మూఢభక్తిని ధూర్జటి చక్కగా వర్ణించాడు.

తిన్నడు జంతువుల్ని వేటాడి అలసిపోయి చెట్టునీడన నిద్రిస్తుండగా శివుడు కలలో కనిపిస్తాడు. తిన్నడు నిద్ర నుండి మేల్కొని కలలో కనిపించిన శివున్ని వెదకి కనుగొంటాడు. శివుని చూసిన తిన్నడు ఎన్నో రోజులు నుంచి పస్తున్నాడని భావించి అడవికి వెళ్ళి పందిని చంపి కాల్చి ఆ మాంసఖండాల్ని తినమని శివున్ని ఇలా ప్రార్థిస్తాడు.

"తిన్నండంతట దేవ దేవునకు భక్తిందృష్టిగావింపనా
సన్నగ్రావ మహాటవుల్ తిరిగి దంష్ట్రాటంక కోటీపుట
చ్ఛిన్నక్ష్మాజ వరాహమున్ గెడపి కాల్చివ్రేల్చె నగ్నింగడున్
జెన్నై యుండెడు మాంస ఖండముల నిచ్చెం దొప్పలంజొప్పడన్"

తిన్నని కథ వల్ల గిరిజనుల ముగ్ధభక్తి ఎలాంటిదో స్పష్టంగా తెలుస్తుంది. గిరిజనులు ఇలాంటి ముగ్ధభక్తిని కల్గి ఉండడం నేటికి మనం గమనింపగలము. నిష్కల్మషమై, నిష్కామమైన భక్తి భావనే గిరిజనులకు అలంకారప్రాయం. అదే వాళ్లకు సంస్కారం, సంపద.

బలి :

జానపదులు గ్రామదేవతల పేర్లతో జరుపుకొనే జాతర, దేవర మొదలైన పండుగ సమయాల్లో బలియిచ్చే ఆచారం కన్పిస్తుంది. శక్తి ఆరాధనలో ఈ బలి ఇచ్చే ఆచారం ప్రధానంగా ఉంది. బలి రెండు విధాలుగా కన్పిస్తుంది. ఒకటి నరబలి, రెండవది జంతుబలి. గిరిజన సంస్కృతిలో కూడ బలి ఇచ్చే ఆచారం ఉంది. కోయ, చెంచు మొదలైన ఆటవిక జాతుల వాళ్ళు అడవుల్లో మనుషులు కన్పిస్తే చంపుతారనే భయం ప్రజల్లో కన్పిస్తుంది. పండుగ సమయాల్లో తమ దేవతకు బలి ఇస్తే తృప్తి పడుతుందనే నమ్మకం ఆటవికుల్లో ఉంది.

'మానవ బలి వల్ల వర్షం వస్తుందని నమ్మేవారు. బలి ఇవ్వబడిన వ్యక్తి కళ్ళలో నుంచి వచ్చే నీటిలాగా, తెగిన కంఠంలో నుంచి వచ్చే రక్తంలాగా వర్షం కూడా వస్తుందని వారి నమ్మకం' అంటూ 'భారతదేశంలో గిరిజన సంప్రదాయాలు' లో చెప్పబడింది. గిరిజనుల్లో నరబలి ఇచ్చే ఆచారం కలదని చెబుతూ "ఆటవికులకు గోండు, కోయ మున్నగు వారిలో నీయాచారమెక్కువగా నుండినట్లు కానవచ్చును" అని సురవరం ప్రతాపరెడ్డి 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర'లో పేర్కొన్నారు.

ధూర్జటి శ్రీకాళహస్తిమాహాత్మ్యంలో గిరిజనుల జంతు బలిని ప్రస్తావించాడు. కాటిఱేని జాతరకు పోతూ చెంచులు వివిధ రకాల జంతువుల్ని బంతులుగా కట్టుకొని బయలు దేరారట. తిన్నడు అడవిలో తిరిగి వేటాడిన జంతువుల్ని

కాటిజేనికి నైవేద్యంగా సమర్పించడాన్ని ఈ కింది విధంగా వర్ణించాడు.

"మును అవు వడిన మెకముగొనివచ్చి మిడిగ్రుడ్లు
పొడిచి, నీట శిరము దడిపి, తోక
గోసి, ధూపమిచ్చి మీసంబు పెకలించి
కానుకిచ్చి కాటిజేని గొలిచి"

జంతువుల్ని కానుకగా సమర్పించేవారని, జంతువుల్ని చంపి, కాల్చి దాని మాంస ఖండాల్ని సమర్పించడాన్ని ఒకవిధంగా జంతుబలని భావించవచ్చును. ఈ విధంగా గిరిజన సంస్కృతిలో కన్పించే నరబలి, జంతుబలిని గూర్చి ధూర్జటి తన కావ్యంలో ప్రస్తావించాడు.

ఆచార వ్యవహారాలు :

గిరిజనుల్లో కన్పించే కొన్ని ఆచారాల్ని ధూర్జటి శ్రీకాళ హస్తిమాహాత్మ్యంలో వర్ణించాడు.

ఒక్కప్రొద్దుండడం :

పండుగ సమయాల్లో ఇష్టదేవతలకు సంబంధించి ఉపవాసం ఉంటారు. ఉపవాసం ఉండడాన్ని ఒక్కప్రొద్దు అని అంటారు. చెంచులు కాటిజేని జాతరకు వెళ్లాక నాథ నాథుడు, తండె ఒక్క ప్రొద్దుండి స్నానం చేసి భక్తి శ్రద్ధలతో కాట్రేనిని సేవించారని ధూర్జటి ఇలా వర్ణించాడు.

"ఒక్క ప్రొద్దుండి సెలయేటనుదక మాడి
నాథ నాథుండు తండెయునైజమైన
చతురలంకారములు దాల్చి ....."

దిష్టి బొమ్మలు పెట్టడం :

దేనికైనా సరే దృష్టి దోషం తగలడాన్నే 'దిష్టి' అని అంటారు. చిన్న పిల్లలకు దిష్టి తగలకుండ బుగ్గన నల్లచుక్క పెడతారు. రైతులు పంట బాగా పండడం వల్ల తమ పొలాలకు ఇతరుల దిష్టి తగలకూడదని పొల్లాల్లో దిష్టి బొమ్మల్ని పెడతారని ధూర్జటి వర్ణించాడు.

"ఏనుగుల తల కొమ్ముల
తోనారబములకు దృష్టి దోషము వాయం
గానెత్తుదురెఱుకులుదమ
చేనికి లుసరంబు తలలు చెలువంబెసగన్"

పురుడు పోయడం :

గిరిజనుల 'పుంసవనాన్ని' గూర్చి ధూర్జటి ప్రస్తావించాడు. నవమాసాలు నిండాక 'తండె' అలసిపోయి పనులు చేయడం మాని విశ్రాంతి తీసుకోవడాన్ని, నొప్పులు ప్రారంభం కాగానే చెంచు స్త్రీలు మంత్రసానిని పిలిపించడాన్ని, నీటిని కాచి, గుంతను త్రవ్విపురుడు పోయడానికి సిద్ధమవ్వడాన్ని ధూర్జటి వర్ణించాడు.

'చెలువకు బిడ్డకుట్లు విలసిల్లగ బిల్ల పురంధ్రు లంతలో
బిలువరె మంత్రసాని దలపెట్టెరె కాయముగూర్చి లేమకున్
జలకముగా పరే కొలను చయ్యద్రవ్యరె మందగా మినిన్
నిలువగనీకురే యనుచు నేర్పరులై కడు సంభ్ర మింపగన్"

బొడ్డు కోయడం :

ప్రసవం అయ్యాక పనిబిడ్డకు బొడ్డుకోసే ఆచారం అన్ని జాతుల్లో ఉంది. ధూర్జటి ఈ ఆచారాన్ని ఆధ్యాత్మిక భావంతో సమన్వయం చేసి చెప్పడం జరిగింది.

'సంస్కార మోహపాశం గోసినటువలె
బొడ్డుగోసిరి పిన్న బిడ్డనికిని'

పేరు పెట్టడం :

పుట్టిన బిడ్డకు చేసే జాతక సంస్కారాల్లో పేరు పెట్టడం ఒకటి. పుట్టిన ప్రతివారికి సంకేతంగా ఏదో ఒక పేరు ఉండడం అవసరం. నాథనాథుడు, తండె తమ బిడ్డ తిన్నదనాన్ని చూచి సంతోషించి ఆ బాలునికి 'తిన్నడు' అని పేరు పెట్టడాన్ని ధూర్జటి ప్రస్తావించాడు.

"తండెయు, బుళింద బృందారకుండును నందను
తిన్నదనంబునకానంద కందళిత హృదయారవిందులై
తిన్నడని పేరు పెట్టిన"

వినోద విలాసాలు :

కష్టాల్ని మరచిపోయి మనిషి హాయిగా జీవించడానికి,

జీవితాన్ని సుఖమయం చేసుకోవడానికి వినోదాలు, ఆటలు మొదలైనవి చాలా అవసరం. గిరిజనుల వినోద విలాసాల్ని కొందరు కవులు ప్రస్తావించారు. ధూర్జటి తన కావ్యంలో గిరిజనలు ఆటలు, మృగయావిహారం (వేట) మద్యపానం మొదలైన వినోద విలాసాలను గూర్చి ప్రస్తావించాడు.

ఆటలు :

గిరిజనుల ఆటల్ని కేవలం ధూర్జటి మాత్రమే ప్రస్తావించాడు. చెంచు కుమారుడైన తిన్నడు ఇతర చెంచు కుమారులతో కలిసి ఆడుకున్న ఆటల్ని ధూర్జటి క్రింది పద్యంలో వర్ణించాడు.

"చిట్ల పొట్లకాయ సిరిసింగణావత్తి
గుడుగుడు గుంచాలు కుందెనగుడి
దాగిలిమ్రుచ్చులాటలు గ్రచ్చకాయలు
వెన్నెల కుప్పలు తన్ను చిల్ల
తూరన తుకాంలు గీరన గింజలు
పిల్లదీపాలంకి బిల్లగోడు
చిడుగుడువ్వల పోటి చెండుగ గట్టిన బోది
యల్లి యుప్పనబట్టె లప్పళాలు
చిక్కనా బిల్ల లోటిళ్ళు చిందఱూది
యైన శైశవక్రీడా విహార సరణి
జెంచుకొమరులతోడ నుద్ధించుకాడు"

వేట :

గిరిజనులకు అత్యంత ఇష్టమైన వినోదం వేట. ధూర్జటి శ్రీకాళహస్తిమాహాత్మ్యంలో వేటను విహారంగా పేర్కొనాడు. తిన్నడు యౌవనంలో ప్రవేశించగానే ఎరుకులు రాజు దగ్గరకు వచ్చి 'తిన్ననికి బహు విధ మృగయా విహారంబుల తెఱంగెఱుక పఱుపవలయునని' అంటారు. తిన్నడు చెంచు కుమారుతో కలిసి అడవిలోకి వెళ్లి జంతువుల్ని, పక్షుల్ని వేటాడి చంపి వాటి మాంసాన్ని కాల్చుకొని తింటూ కొంత కాలం మృగ విహారం చేశాడని ధూర్జటి వర్ణించాడు.

మద్యపానం :

మద్యపానం చేయడం గిరిజనుల్లో ఒక సంప్రదాయంగా కనిపిస్తుంది. ముఖ్యంగా పండుగల్లో, ఉత్సవ సమయాల్లో గిరిజనులు తప్పక మద్యం సేవిస్తారు. తాటి కల్లు, ఈతకల్లు, జీలుగుకల్లు, కాపుసార లేదా ఇప్పసారా మొదలైనవి గిరిజనులు సేవించే మద్యపానీయాలు. ధూర్జటి 'శ్రీకాళహస్తిమాహాత్మ్యం'లో మద్యపానం అలవాటును, మద్యపానం సేవించిన వారి చేష్టల్ని వర్ణించాడు. కాట్రేని జాతర సందర్భంలో శబర దంపతులు అన్నపానాదులు చేసిన పిమ్మట మద్యపానం చేశారని, మద్యపానం వాళ్ళపై ఎలా ప్రభావాన్ని చూపిందో ధూర్జటి వర్ణించాడు.

గిరిజనుల సాంస్కృతిక జీవన విధానాన్ని వర్ణించే సందర్భాల్లో పండుగలు, ఆచార వ్యవహారాలు, భక్తి, బలి, వినోద విలాసాలు, గిరిజనులు ఆడే ఆటలు, జాతర చేసే విధానాలను ధూర్జటి తన 'శ్రీకాళహస్తిమాహాత్మ్యం' లో చక్కగా వివరించాడు. ఈ కావ్యం గిరిజనుల సంస్కృతిని, సాంస్కృతిక జీవన విధానాన్ని పరిరక్షించి అనంతరం తరాల వాళ్ళకు అందించడానికి తోడ్పడుతుందని భావించవచ్చును.

ఆధార గ్రంథాలు :

1. ఆంధ్రుల సాంఘిక చరిత్ర - సురవరం ప్రతాప రెడ్డి.
2. తెలుగు కావ్యాల్లో గిరిజన సంస్కృతి - డా॥ బి.రామాచార్యులు.
3. శ్రీకాళహస్తిమాహాత్మ్యం - ధూర్జటి

భారతదేశంలో గిరిజనుల విలక్షణత – సాంఘిక జీవనం – సమస్యలు – పరిష్కార మార్గాలు

– డా. బత్తల అశోక్ కుమార్, గ్రంథాలయ సహాయకులు, సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇంక్లూజివ్ పాలసీ, (సీఎస్ఎస్ఈఐపీ), శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురము.

భారతదేశంలో వేలాది సంవత్సరాలుగా పర్వత సానువులు, అరణ్యాలకు మాత్రమే పరిమితమైపోయి, నాగరిక ప్రపంచంతో సంబంధం ఏమాత్రం లేని మానవ సమూహాలు గిరిజనులు. అనాది కాలం నుండి ఎంతో ప్రాచీనతను సంతరించుకున్న వీరిని "ఆదివాసి" అని వాడుకలో వ్యవహరిస్తారు. సభ్యసమాజానికి దూరంగా, పూర్తిగా తమదైన ప్రత్యేకతగల జీవన విధానంతో ప్రకృతితో మమేకమై జీవించే జీవన రీతుల్ని గిరిజనులు కలిగి వున్నారు. గిరిజనులు సాధారణంగా అరణ్యాలు, పర్వతాలు, నదీతీరాలు వంటి ప్రాంతాల్లో నివాసం వుంటారు. తెగలుగా వుండటం వల్ల వారు 'పర్వతీయులు', 'వన చరులు', 'ఆటవికులు' అనే పేర్లతో పిలువబడుతున్నారు.

భారతీయ సమాజంలో అత్యంత ప్రాధాన్యం ఉన్న సమూహాలు గిరిజన తెగలు. వీటికి సామాజికంగా, సాంస్కృతికంగా ప్రత్యేకతలున్నాయి. వీటితోపాటు వైవిధ్య చరిత్ర, సంస్కృతులున్నాయి. జన జీవన స్రవంతిలో భాగంగా కొందరు. దూరంగా ఇంకొందరు జీవనం సాగిస్తున్నారు. ఆదివాసీలు, గిరిజనులు ఏ దేశానికైనా మూల వాసులన్నది మానవ శాస్త్రవేత్తల భావన. ప్రస్తుత భారత జనాభాలో దాదాపు 8-9 శాతం ప్రజలు వివిధ గిరిజన సమూహాలకు చెందినవారే. భారతీయ సమాజంలో గిరిజన సమూహాలన్నీ ప్రత్యేకమైన మత విశ్వాసాలను కలిగి ఉన్నాయి. గిరిజన సమాజమనేది కొన్ని ప్రత్యేక లక్షణాలతో కూడుకున్న సమూహం.

ఆంథ్రోపాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధ్యయనం ప్రకారం ఒక్కో గిరిజన తెగ ఒక నిర్దిష్టమైన భౌగోళిక ప్రాంతానికి పరిమితమై ఉంటుంది. ఒక గిరిజన తెగ విభిన్న రాష్ట్రాల్లో విస్తరించి ఉండటం అరుదు. ప్రతి గిరిజన సమూహానికి ఒక నిర్దిష్టమైన పేరుంటుంది. ఒకే రకమైన భాష, సంస్కృతి ఉంటాయి. ఒకేరకమైన ఆచార వ్యవహారాలు కలిగి ఉంటారు. ఒకే న్యాయం, ఒకే చట్టం ఉంటాయి. అంతర్వివాహ పద్ధతిని ఆచరిస్తారు. గిరిజన సమూహాలకు ప్రత్యేకమైన మత విశ్వాసాలు, ఆరాధన పద్ధతులు ఉంటాయి. ముఖ్యంగా ప్రకృతి శక్తులను ఆరాధిస్తారు. వీటితోపాటు ప్రతి గిరిజన సముదాయానికి ఒక స్వయం ప్రతిపత్తి గల రాజకీయ వ్యవస్థ ఉంటుంది. ఈనాటికీ చాలా తెగలు ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థలో ప్రవేశించినా, తమనుతాము నియంత్రించుకునే స్వీయ రాజకీయ వ్యవస్థను (ఆదివాసీ మండలి) కొనసాగిస్తున్నాయి. ఆయా తెగల పెద్దలు ఇందులో సభ్యులుగా ఉంటారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ కార్యకలాపాలను వీరే నియంత్రిస్తుంటారు. అన్నింటికీ మించి ఇవి ఏకరూపత కలిగిన సమూహాలు. వీటన్నింటిలోనూ గోత్ర వ్యవస్థ అంతస్సూత్రంగా పనిచేస్తుంది. గిరిజన సమాజంలోని సభ్యుల ప్రవర్తనను గోత్రవ్యవస్థ నియంత్రిస్తుంటుంది. స్వగోత్రికులు రక్తబంధువులనే భావన కలిగి ఉంటారు. అందుకే స్వగోత్రీకులు పెళ్లిళ్లు చేసుకోరు.

పవిత్ర టోటెమ్ :

ప్రతి గోత్రానికి ఓ టోటెమ్ ఉంటుంది. టోటెమ్ అంటే మతపరమైన చిహ్నం. గోత్ర సభ్యులంతా ఆ మత పరమైన చిహ్నం నుంచి ఉద్భవించామనే భావనతో దాన్ని పవిత్రంగా భావిస్తారు.. ఆరాధిస్తారు. ఈ చిహ్నం ఒక వ్యక్తి కావొచ్చు, జంతువు, చెట్టు లేదా ప్రకృతిలోని ఏదైనా కావొచ్చు. అది వారి తెగకు గుర్తు.

మూడు రకాల తెగలు :

భారత్‌లో మనకు 3 రకాల గిరిజన తెగలు కనిపిస్తాయి.

1. దట్టమైన అటవీ ప్రాంతాల్లో, పర్వత ప్రాంతాల్లో జీవించేవారు. వీరు జనజీవన స్రవంతికి దూరంగా ఉంటారు. అడవులు, అటవీ సంపదపై ఆధారపడి జీవిస్తారు. ఆర్థికంగా, రాజకీయంగా స్వతంత్రంగా జీవించినప్పటికీ ఆర్థికంగా వెనకబడిన తెగలివి.
2. అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్నా, వ్యవసాయం ప్రధానంగా చేసే ఆదిమ తెగలు. వీరికి పాక్షికంగా గిరిజనేతరులతో సంబంధాలుంటాయి. సామాజిక, వ్యాపార సంబంధాలుండే అవకాశముంది.
3. మైదాన ప్రాంతాల్లోని గిరిజన సమూహాలు. జనజీవన స్రవంతిలో భాగంగా ఉండి ఆధునిక జీవన విధానానికి దగ్గరగా ఉంటారు. ప్రభుత్వం కల్పించే చాలా అభివృద్ధి పథకాలు ఈ మైదాన ప్రాంతాల్లో స్థిరపడిన, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు దగ్గరగా ఉన్న తెగలు ఎక్కువగా ఉపయోగించుకుంటాయి. అందుకే వారిలో విద్య, ఆర్థిక అభివృద్ధి కనిపిస్తుంది. ఉదాహరణకు ఉత్తర భారత దేశంలో తీసుకుంటే బిల్లులు, సంతాల్ (మధ్యప్రదేశ్)లు, ముండాలు (బిహార్), మహారాష్ట్ర, తెలంగాణల్లోని రాజ్‌గోండులు, లంబాడీలు జనజీవన స్రవంతికి చాలా దగ్గరగా ఉండే సమూహాలు. అందుకనే వీరిలో రాజకీయ, ఆర్థిక, విద్యాపరమైన అభివృద్ధి కనిపిస్తుంటుంది. అదే చెంచులాంటి తెగలను చూస్తే వారింకా జనజీవన స్రవంతికి దూరంగానే ఉన్నారు.

ఈశాన్య భారతంలో..

సామాజిక, మానవ శాస్త్రవేత్తల అంచనా ప్రకారం భారత్‌లో దాదాపు 450కి పైగా గిరిజన సమూహాలున్నాయి. ఈశాన్య రాష్ట్రాల్లో వీరి జనాభా శాతం ఎక్కువ. దాదాపు 80 నుంచి 90 శాతం దాకా ఈశాన్య రాష్ట్రాల మొత్తం జనాభాలో గిరిజనులే. వీటిలో జనాభా పరంగా చూస్తే, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణల్లో విస్తరించిన గోండు తెగ అత్యధిక జనాభాతో ఉంది. ఈ గోండుల్లో కూడా రకరకాల వారున్నారు. ఉదాహరణకు మధ్యప్రదేశ్, మహారాష్ట్రల్లో ఎక్కువగా కనిపించేవారు మరియా గోండులు. తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా పరిధిలో కనిపించే వారు రాజ్‌గోండులు. రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌ల్లో ప్రధానమైన తెగ భిల్లులు. బిహార్, ఒడిశా, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్ (పాక్షికంగా)ల్లో సంతాల్‌లుబీ జార్ఖండ్‌లో ముండాలు అత్యధిక జనాభా ఉన్న గిరిజన సమూహాలు. మధ్యభారత ప్రాంతాల్లో ముఖ్యంగా మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, బిహార్, జార్ఖండ్, ఒడిశా, మహారాష్ట్ర, గుజరాత్‌లలో గిరిజన జనాభా ఎక్కువగా ఉంది. ఈశాన్య రాష్ట్రాల్లో మాత్రం అక్కడి జనాభాలో అత్యధిక శాతం గిరిజన తెగకు చెందినవారే. ఉదాహరణకు మిజోరాంను చూస్తే స్థానిక జనాభాలో 95 శాతం గిరిజన సమూహాలే. అరుణాచల్‌ప్రదేశ్, మేఘాలయల్లోని జనాభాలో 80 శాతం గిరిజనులే. నాగాలాండ్‌లో 85 శాతం పైగా, మధ్యప్రదేశ్, ఒడిశాల్లో 25 శాతం వంతున గిరిజన జనాభానే. గుజరాత్‌లో 14, రాజస్థాన్‌లో 12, అసోం, బిహార్‌ల్లో 10 శాతం గిరిజన జనాభా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

గిరిజన సమూహాలు.. జోన్లు :

భారత్‌లో భౌగోళికంగా వివిధ గిరిజన సమూహాలు ఏ విధంగా విస్తరించి ఉన్నాయనేది ఆసక్తికరం. దీనిపై ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ ఫర్ రిసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్), ఎల్‌పీ విద్యార్థి అనే సామాజిక మానవ శాస్త్రవేత్త ఆధ్వర్యంలో ఓ సర్వే నిర్వహించింది. భారత్‌లోని వివిధ గిరిజన సమూహాల భౌగోళిక విస్తరణను అధ్యయనం చేసిన విద్యార్థి వీరిని నాలుగు జోన్లుగా విభజించారు.

1. హిమాలయ ప్రాంతం

2. మధ్య భారత ప్రాంతం
3. పశ్చిమ భారత ప్రాతం
4. దక్షిణ భారత ప్రాంతం

భారతదేశ జనాభాలో గిరిజన జనాభా 9-10 శాతం ఉంటుందని అంచనా. మొత్తం గిరిజన జనాభాలో.. హిమాలయ పర్వత ప్రాంతాల్లో 11 శాతం ఉంటే.. 57 శాతం మధ్య భారతంలోనూ, 25 శాతం పశ్చిమ భారతం లోనూ, 7 శాతం దక్షిణ భారతంలోనూ ఉన్నట్లు విద్యార్థి అంచనా. ఇతడి సర్వే ప్రకారం ఆయా ప్రాంతాల్లోని ప్రధాన తెగలను చూస్తే..

1. హిమాలయ ప్రాంతంలో..

జమ్మూ కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్‌లలో ప్రధానంగా కనిపించేవి భోట్, గుజ్జర్, గద్ది తెగలు. ఉత్తర్ ప్రదేశ్‌లోని తెరాయి ప్రాంతంలో ప్రధానమైన తెగ తారూ. అసోంలో - మిజో, గారో, ఖాసీలతో పాటు బోడోలు.. మేఘాలయలో - ఖాసా, ఖాసీలు.. నాగాలాండ్‌లో - నాగాలు.. మణిపూర్‌లో - మావో, కూకీలు.. త్రిపురలో - త్రిపురి తెగ.

2. మధ్య భారత ప్రాంతంలో..

పశ్చిమబెంగాల్, బిహార్, జార్ఖండ్‌లో- సంతాల్, ముండా, ఒరావన్, హెూ తెగలు.. ఒడిశాలో - ఖోండులు, గోండులున్నారు.

3. పశ్చిమ భారత ప్రాంతంలో..

రాజస్థాన్‌లో - భిల్లులు, మీనాలు ఘరాసియాలు.. మధ్యప్రదేశ్‌లో - సంతాల్‌లు, భిల్లులు.. గుజరాత్‌లో - భిల్లులు, దుబ్లాలు, ధోడియాలు.. మహారాష్ట్రలో - భిల్లులు, కోలీలు, మహదేవ్‌లు, కోక్నాలు ప్రధాన తెగలు.

4. దక్షిణభారత ప్రాంతంలో..

ఆంధ్రప్రదేశ్‌లో - కోయ, కొండదొర, సవర, కొండరెడ్డి.. తెలంగాణలో - రాజ్‌గోండులు, లంబాడీలు, చెంచులు, ఎరుకలు, గుత్తికోయ, కోలమ్, నాయక్‌పోడ్.. తమిళనాడులో - ఇరుల, తోడా, కురుంబా, కడార్‌లు.. కర్ణాటకలో - నాయికాడ, మరాటీలు.. కేరళలో - కురుమన్, పనియన్.. అండమాన్, నికోబార్ దీవుల్లో - అండమానీలు, జారవాలు, నికోబారీలు ప్రధాన తెగలు. రకరకాల కారణాల వల్ల జారవా అనే తెగతో పాటు అండమానీలు జనాభా పరంగా దాదాపు అంతరించే స్థితిలో ఉన్న తెగలు.

కులం – తెగ :

ప్రతి తెగ సజాతీయ సమాజం. తెగలో ఏకరూపత ఉంటుంది. భౌగోళికపరంగా ఉన్న సమూహమిది. కులం అలా కాదు. కులం ఏకరూపత కలిగిన సమూహం కాదు. కులానికి చెందినవారు వేర్వేరు భాషలు మాట్లాడొచ్చు. వారికి వేర్వేరు సంస్కృతులుండొచ్చు. కులానికి వార సత్వంగా ఉండే వ ృత్తి ఉంటుంది. కానీ గిరిజనులకు ఆయా భౌగోళిక ప్రాంతాల్లోని వనరులను బట్టి జీవనోపాధి ఉంటుంది. ప్రతి తెగకు ఓ నిర్దిష్టమైన భాష ఉంటుంది. గిరిజన భాషలకు చాలామేర లిపి లేదు. కులానికి నిర్దిష్టమైన భాష అంటూ ఉండదు. కులానికి, తెగలకు ఉన్న ఏకైక ప్రధాన సారూప్యత ఏమైనా ఉందంటే అది రెండూ అంతర్వివాహ సమూహాలే.

సమస్యలు – పరిష్కార మార్గాలు :

గిరిజన ఆదివాసీ ప్రజలు ఆధునిక నాగరికతా ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న భావన ప్రపంచవ్యాప్తంగా కుదిపేస్తున్న అంశం. మానవుడు తన అవసరాల కోసం ప్రకృతిని నాశనం చేస్తున్నాడని, అందులో ముఖ్యంగా నాగరికులైనవారు తమ ఎదుగుదలకోసం అడవిబిడ్డలకు అగాథం కలిగిస్తున్నారని సామాజిక శాస్త్ర వేత్తలు అభిప్రాయాలను వ్యక్తం చేస్తుండటం నేడు గమనిస్తున్నాం. ఇందులో భాగంగా చాలా గిరిజన తెగలు నశిస్తున్నాయంటున్నారు. ఇలాంటి సమస్యలు భారతదేశ వ్యాప్తంగా చాలా ఉన్నాయి. భారతదేశంలో ఏ నదిపైనైనా భారీ నీటిపారుదల ప్రాజెక్టులు నిర్మించాలన్నా ఏదోఒక గిరిజన తెగ నష్టాన్ని చవిచూడాల్సి రావడం చాలా బాధాకరమైన అంశం. నీటిపారుదల సౌకర్యాలతో పాటు, బాక్సైట్ తదితర ఖనిజాల కోసం కూడా అటవీప్రాంతాల్లోని గిరిజన ఆదివాసీలను ఖాళీ చేయించే ప్రయత్నం జరగడం తరచూ చూస్తున్న అంశమే.

గిరిజన ఆదివాసీ తెగలకు జరుగుతున్న నష్టాన్ని వివరించే ప్రయత్నంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ - తెలంగాణాల రెండు ప్రాంతాల్లో (పోలవరం ముంపు గ్రామాల్లో) అంతరించిపోయేందుకు సిద్ధంగా వున్న ఒక గిరిజన తెగను ఉదాహరణగా గమనించవచ్చు. ఇటీవలే ఆంధ్ర ప్రదేశ్ విభజన తరుణంలో జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల కనుమరుగు కానున్న ఒక గిరిజన తెగ గురించి ప్రస్తావించుకుంటే ... గిరిజనుల సమస్యలు, పరిష్కార మార్గాలను అవగతం చేసుకోవచ్చు.

ఓ ప్రాచీన గిరిజన సంస్కృతి కనుమరుగు కాబోతోంది :

శతాబ్దాలుగా సజీవంగా ఉండి, ఆధునిక ప్రపంచ పోకడలు విస్తరిస్తున్నా ఉనికిని నిలబెట్టుకున్న ఓ గిరిజన జీవన విధానం అంతర్ధానం కాబోతోంది. పచ్చని పంట పొలాలు గోదావరిలో కలిసిపోబోతున్నాయి. కొన్ని వందల గిరిజన గ్రామాలు 'ముంపు ప్రాంతం'గా మారబోతున్నాయి. గిరిజనులు సహా లక్షలాది మంది ప్రజల బతుకులు అధ్వానం కాబోతున్నాయి. పోలవరం ప్రాజెక్టు కింద ముంపునకు గురయ్యే ఖమ్మం జిల్లాలోని భద్రాచాలం, పాల్వంచ డివిజన్‌లలోని ఏడు గిరిజన మండలాలకు చెందిన గిరిజన జాతులు ముంపు కారణంగా ఇతర పునరావాస ప్రాంతాలకు తరలించడం వల్ల వారి జాతి కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆ తెగల నాయకులు చెబుతున్నారు. ఈ మొత్తం జనాభాలో కొండరెడ్ల జనాభా పదివేలు. కొద్దిమందే కదా వీరి గురించి ఆలోచించాల్సింది ఏముంది? అని మనం అనుకోవచ్చు. జనాభా తక్కువే కావొచ్చు. కాని ఓ గిరిజన సంస్కృతి అంతర్ధానమవుతోంది. ప్రాజెక్టు డిజైన్ మారిస్తే ముంపు ప్రాంతం తగ్గుతుందని, తద్వారా గిరిజనులకు నష్టం తక్కువగా ఉంటుందని మేధావులు, జల నిపుణులు చెబుతున్నారు. వీటిపై చర్చ జరగాల్సి వుంది.

కొండరెడ్ల ఉనికి ప్రశ్నార్థకమేనా?

పోలవరం ప్రాజెక్టు ముంపు మండలాల్లో నివసిస్తున్న గిరిజనుల్లో కొండరెడ్లు ప్రధానమైనవారు. శతాబ్దాలుగా సజీవంగా ఉన్న గిరిజన తెగ ఉనికి ఇప్పుడు ప్రశ్నార్థమైంది. విలక్షణమైన వీరి జీవనవిధానం, సంస్కృతి, సంప్రదాయాలు ఇక కాలగర్భంలో కలిసిపోతాయని చరిత్రకారులు, ఆంత్రోపాలజిస్టులు ఆందోళన చెందుతున్నారు. ఇంతకాలం పచ్చటి అడవుల్లో, కొండల్లో ప్రశాంతంగా జీవించిన కొండరెడ్లు పోలవరం ప్రాజెక్టు కారణంగా చెల్లాచెదురైపోతారని, వారి బతుకులు అధ్వానమైపోతాయని అంటున్నారు.

పోలవరం కారణంగా కూనవరం మండలంలోని ఏరువాడ గట్టుపై ఉన్న మూడు కొండరెడ్ల గ్రామాలు, కూనవరం నుంచి చింతూరు వరకూ ఉన్న కూనూరుగడ్డ గుట్టలపై ఉన్న 12 గ్రామాలు, రేఖపల్లి నుంచి తుమ్మలేరు వరకు ఉన్న కొండరెడ్ల గ్రామాలు కనుమరుగవుతాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఉన్న 33 ఆదివాసీ తెగల్లో కొండరెడ్ల తెగ ఒకటి. ఈ తెగ రాతి యుగానికి చెందిందని పరిశోధకులు చెబుతున్నారు. తూర్పు కనుమల్లో ముఖ్యంగా గోదావరికి ఇరు పక్కలా గుట్టలపై దట్టమైన అరణ్యాల్లో నివసించే అరుదైన గిరిజనులు కొండరెడ్లు. కొండరెడ్డి అంటే కొండలపై నివసించే మనిషి అని అర్థమట...! తాము సూర్యవంశానికి చెందినవారమని చెప్పుకునే కొండరెడ్లు స్వాభావికంగా అమాయకులు. నిగర్వంగా, నిరాడంబరంగా, ఆధునిక సమాజానికి దూరంగా గుట్టలపై జీవిస్తుంటారు. వీరి గ్రామాల్లో ఈనాటికీ మౌలిక సౌకర్యాలు లేవు. రహదారులు, విద్యుత్తు, విద్య, వైద్య మొదలైనవి కరువే. మూఢ నమ్మకాలు, బహు భార్యత్వం, బాల్య వివాహాలు, మంత్ర తంత్రాలు ఇలాంటివెన్నో వీరి జాతిలో ఈనాటికీ ఉన్నాయి. విచిత్రమేమిటంటే ఆధునికులుగా, నాగరికులుగా చెప్పుకునే గిరిజనేతరులు వీరి నుంచి నేర్చుకోవాల్సిన కొన్ని మంచి విషయాలు కూడా ఉన్నాయి. కొండరెడ్లను ప్రధాన జన జీవన స్రవంతిలో కలపాలని ప్రభుత్వాలు కోట్లు ఖర్చు చేస్తున్నా ఈనాటికీ అది పూర్తి ఫలితాలు ఇవ్వలేదు.

కొండరెడ్డి - పోడు వ్యవసాయం :

గుట్టలపై నివసిస్తున్న కొండరెడ్లకు పోడు వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. కొండలపై వాగులకు దగ్గరగా ఉన్న భూములను చదును చేసుకొని పోడు వ్యవసాయం చేస్తుంటారు. జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు మొదలైన వర్షాధార పంటలు పండిస్తారు. వీరు నిరక్షరాస్యులు కావడం, నాగరిక సమాజానికి దూరంగా ఉండటంతో ఆధునిక వ్యవసాయ విధానాలు తెలియవు కాబట్టి ప్రకృతి కరుణిస్తేనే పంట చేతికొస్తుంది. అయితే ఆధునిక పోకడలు సంతరించుకున్న కొందరు కొండరెడ్లు సాధారణ రైతులతో పోటీ పడి పంటలు పండిస్తున్న దాఖలాలు కూడా ఉన్నాయి. ఇలాంటివారు తమ పిల్లల్ని పాఠశాలలకు పంపి పట్టుదలగా చదవిస్తున్నారు కూడా. అయితే మొత్తం మీద చూస్తే ఇలాంటివారి శాతం చాలా తక్కువ. పోడు వ్యవసాయంతో పాటు వెదురుతో తట్టలు, బుట్టలు, చాపలు, తడికెలు మొదలైనవి తయారుచేసి వారపు సంతల్లో అమ్ముతారు. అడవుల్లో లభ్యమయ్యే తేనె, జిగురు, చింతపండు తదితరాలూ విక్రయిస్తారు. వర్షాకాలంలో పనులు దొరక్క ఆకలితో అల్లాడుతుంటారు. శనగగడ్డలు, జీలుగుచెక్క, మామిడి టెంకలు వీరికి ఆహారం. కొండరెడ్లలో 30 శాతం మంది అడవుల్లో లేదా వాటికి దగ్గరగా నివసిస్తుంటారు. వీరు ఇళ్లలోనే అనేక పండ్ల చెట్లు పెంచుతుంటారు. చింతచెట్లను ఉమ్మడి ఆస్తిగా పరిగణిస్తారు. అనేక గిరిజన జాతుల్లో మాదిరగానే కొండరెడ్లకు కూడా వేట ప్రధాన వ్యాపకం. మగవారు ఎప్పుడూ విల్లంబులతో తిరుగుతూ జంతువులను వేటాడుతుంటారు. వేటాడిన జంతువుల మాంసాన్ని సమష్టిగా పంచుకుంటారు. చేపల వేట కూడా ఉమ్మడిగానే సాగిస్తారు.

కొండరెడ్లు - సంప్రదాయాలు...వేషధారణ :

కొండరెడ్ల సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు చిత్రంగా ఉంటాయి. వారు వీటిని కట్టుబాట్లు అంటే, ఆధునికులు మూఢ నమ్మకాలు అంటారు. ప్రధానంగా చెప్పుకోవల్సినవి బాలికలు రజస్వల లేదా పుష్పవతి (మెచ్యూర్) కాగానే ఇళ్లకు దూరంగా 'కీడుపాక' పేరుతో ఓ చిన్న ఇల్లు తయారుచేసి వారం రోజులు అక్కడే ఉంచుతారు. గర్భవతులను కూడా ప్రసవ సమయంలో అక్కడే ఉంచి ప్రసవమయ్యాక వారం రోజుల తరువాత ఇంటికి తీసుకొస్తారు. ముత్యాలమ్మ, గంగానమ్మ, భూదేవి, గండమ్మ మొదలైన దేవతలను కొలుస్తారు. వీరిని కొండ దేవతలంటారు. భూత వైద్యాన్ని ఎక్కువగా నమ్ముతారు. అనారోగ్యం కలగ్గానే భూతవైద్యుడిని తీసుకొచ్చి వైద్యం చేయిస్తారు. అంటురోగాలొస్తే రకరకాల పూజలు చేస్తుంటారు. వీరిలో ఎక్కువమంది కొండలు దిగి ఆస్పత్రులకు వెళ్లేందుకు ఇష్టపడరు. దానికితోడు డబ్బు లేకపోవడం, రహదారులు, బస్సులు కరువువడంతో స్థానకంగానే నాటు వైద్యం చేయిస్తుంటారు. ఇళ్ల దగ్గర ఉన్నప్పుడు పురుషులు ఎక్కువమంది చొక్కా లేకుండా గోచీలతో కనబడతారు. ఆడవారు చినిగిన, మాసిన బట్టలతో ఉంటారు. శుభకార్యాలకు వెళ్లేటప్పుడు మగవారు నిక్కర్లు, చొక్కాలు వేసుకుంటారు. ఆడవారు చీరలు కట్టుకుంటారు. మహిళలు చెవులకు వెండి దిద్దులు, ముక్కుపుడకలు పెడతారు. మెడలో రకరకాల కడియాలు వేసుకుంటారు. కాళ్లకూ కడియాలు, పట్టలు ధరిస్తారు. సంతల్లో దొరికే గిల్టు నగలు ఎక్కువగా కొంటారు. ప్రస్తుతం కొండరెడ్ల యువతులు, యువకులు ఫ్యాషన్ల వైపు మొగ్గు చూపుతున్నారు.

కొండరెడ్లు - వివాహాలు :

కొండరెడ్లలో వివాహాలు మూడు రకాలుగా జరుగుతాయి. వీటిల్లో బలవంతంగా పెళ్లి చేసుకోవడం ఒక రకం. దీన్ని 'మొగనాలు'అంటారు. పురాణాల్లో కనిపించే రాక్షస వివాహం వంటిదే ఇది. అమ్మాయి, అబ్బాయి ఎవ్వరికీ చెప్పకుండా వెళ్లిపోయి పెళ్లి చేసుకోవడం మరోటి. పెద్దలు కుదిర్చిన పెళ్లి ఇంకోటి. వీరి వివాహాల్లో కట్నం ప్రసక్తి ఉండదు. బహుభార్యత్వం, పునర్వివాహాలు వీరిలో సాధారణం. ముఖ్యంగా తమ్ముడు చనిపోతే అతని భార్యను అన్న వివాహం చేసుకునే ఆచారం ఉంది.

కొండరెడ్లు - పండుగలు :

కొండరెడ్లు మూడు రకాల పండుగలు జరుపుకుంటారు. వానలు కురవగానే జరుపుకునే పండుగను భూదేవి పండుగ అంటారు. వ్యవసాయ పనులు ప్రారంభించేముందు పందిని బలి ఇచ్చి పనులు ప్రారంభిస్తారు. పంటలు చేతికొచ్చే సమయంలో కోతల పండుగ చేస్తారు. మరొకటి మామిడికాయల పండుగ. కొండరెడ్లు నివసించే ప్రాంతాల్లో మామిడికాయలు ఎక్కువగా కాస్తాయి. అవి పక్వానికి వచ్చేవరకూ ఎవ్వరూ ముట్టుకోరు. పక్వానికి వచ్చాక గ్రామ పెద్ద అయిదారు కాయలు కోసి పూజ చేసి (దీన్ని గొందికి పెట్టడం అంటారు) పెద్దలకు పంచుతాడు. అప్పటి నుంచి మామిడి పండ్లు తినడం ప్రారంభిస్తారు. పండుగులు, జాతర్ల సమయంలో ఆటపాటలతో సంతోషంగా కాలం గడుపుతారు. ఆ సమయంలో ప్రత్యేకంగా వస్త్రధారణ చేస్తారు. జంతువుల కొమ్ములతో, నెమలి ఈకలతో అలంకరించుకుంటారు. పురుషులు కోయడోళ్లు వాయిస్తారు. ఆడవారు గిల్లలు మోగిస్తారు. వీరి గిరిజన నృత్యాలు చూడముచ్చటగా ఉంటాయి. వీరి డప్పు నృత్యం, కొమ్ము డ్యాన్స్ ప్రత్యేకంగా వుంటుంది. పండు గల సమయాల్లో తెల్లవారేవరకూ ఆడ,మగ కలిసి కల్లు సేవిస్తారు. జీలుగు కల్లు వీరి ప్రత్యేకత.

ముగింపు :

ప్రపంచంలో ఇప్పటికే అనేక ప్రాచీన గిరిజన జాతులు అంతరించిపోయాయి. ఇప్పడు పోలవరం ప్రాజెక్టు ముంపు కారణంగా కొండరెడ్ల జాతి కూడా అంతరించే అవకాశముందని సామాజిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వారు కొన్ని శతాబ్దాలుగా జీవించిన ప్రాంతం మునిగి పోయిన తరువాత కొత్త ప్రాంతంలో కృత్రిమంగా జీవితం సాగించాల్సిందే తప్ప ఆ సహజత్వం ఉండదు. ప్రభుత్వ పునరావాస కార్యక్రమాలు ఎంత చక్కగా అమలు జరుగుతాయో అందరికీ తెలిసిన విషయమే. ఏదిఏమైనా కొండరెడ్ల ఉనికిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైన, నాగరికులపైన ఉంది. ఆ బాధ్యతలను ఎంతవరకు వారు నెరవేర్చగలరో వేచి చూడాలి.

ఆధార గ్రంథాలు :

1. నదీంహస్నైన్ - భారతీయ గిరిజనులు, ఓరియంటల్ లాజ్మన్, హైదరాబాదు-1995
2. ఎం. సూర్యనారాయణ - ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన సముదాయాలు, తెలుగు అకాడమీ ప్రచురణ - 2005
3. డా. పి. రమేష్ నారాయణ - గిరిజన సంస్కృతి సాహిత్యం, అనంతపురము - 2015
4. S.N. Tripathy (Editor) - Glimpses on Tribal Development, Discovery Publishing House, New Delhi- 2000.
5. Chaturbhuj Sahu (Editor) - Approaches of Tribal Development, Adhyayan Publishers, New Delhi- 2009.
6. Dr. A. Naganna & Prof Ch. Umamohan - Tribal Development Programms and Social Transformation, Discovery Publishing House, New Delhi- 2010.

ఫణికుమార్ "గోదావరి గాథలు" – గిరిజనుల యదార్థ జీవిత చిత్రాలు

– డా॥. పి.భగ్గు నాయక్, పోస్ట్ డాక్టోరల్ ఫెలో, తెలుగువాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, తెలంగాణ.

పరిచయం :

ఫణికుమార్ రాసిన గోదావరి గాథలు ప్రథమ ముద్రణ 1989లోను, రెండవ ముద్రణ 1991లోను, మూడవ ముద్రణ మార్చి1997లో వచ్చింది. ఈ గాథల కథాకాలాన్ని గోదావరి వరదలలో జరిగిన సంఘటనలను డైరిలో రాసు కొని, 1987 సెప్టెంబర్‌లో మళ్ళి రాశానని, వీటిలో సాహిత్య విలువలు ఉన్నాయన్న భ్రమ నాకంతకంటే లేదని, గిరిజనులు ఎదుర్కొనే కష్టాల గురించి తెలియ జేసినా, సహానుభూతిని కలిగించినా ఈ గోదావరి గాథల పరమార్థం నెరవేరినట్లేనని రచయిత కోరుకున్నాడు.

మారుమూల అడవి ప్రాంతాలలో నివసించే గిరి జనుల కోసం తన వంతు సహాయం చేయడానికి పూను కున్న రచయిత గిరిజనులకు కష్టనష్టాల్లో సహాయపడి, వారికి బాసటగా ఉండి అక్కడి గిరిజనుల పరిస్థితులను నిశితంగా గమనించి విశ్లేషించి గిరిజన జీవిత రేఖా చిత్రాలను గాథల రూపంలో అందించడం విశేషంగా చెప్ప వచ్చు.

గోదావరి గాథలకు ముందుమాట రాసిన మధు రాంతకం రాజారాంగారు "ఆంధ్రప్రభ దినపత్రిక సార స్వతానుబంధంలో కొద్ది నెలల క్రితం వెలువడిన గోదావరి గాథలు పరిమితిలో చాలా చిన్నవి. వీటిని జీవిత చరిత్ర శకలాలని చెప్పవచ్చు. వీలయినంతలో ఇవి పెద్ద కొండను ప్రతిఫలించే చిన్న అద్దాలు...ఆదిలాబాదు జిల్లా ఒక అజ్ఞాత ప్రదేశమైతే, అక్కడి గిరిజన ప్రాంతాలు మరింత చీకటి కోణాలు. గోదావరి గాథలు ఆ చీకటి కోణాలలోనికి ప్రస రించిన కాంతి కిరణాలు..ప్రతి గాథా ఒక కథలాగే తోచడం, అలరించడం వీటి ప్రత్యేకత....చదివిన తర్వాత సాంద్ర విషాద గీతికల్లా వినిపిస్తూ గుండెల్లో ఆవేదనను ఘూర్ణిల్ల జేసే యదార్థ కథలు గోదావరి గాథలు" అనడం వలన ఈ గాథలకు ఉన్న ప్రత్యేకత తెలుస్తుంది. అమాయక గిరిజన ప్రజల జీవన విధానంలోని కఠినమైన వాస్తవాలను తెలియజేస్తున్న ఈ గోదావరి గాథల్లో 15 గాథలు ఉన్నాయి. పరిశోధన పత్రం పరిధి దృష్ట్యా అందులోని 1.నువ్ మంచిగుండు మామా 2.చింతా సాలక్క 3.వాళ్ళ కోడళ్ళూ వద్దు, అల్లుళ్ళూ వద్దు 4.రాకి తల్లి 5.సంబూ అక్క అనుభవ గాథలను విశ్లేషించదలచాను.

1. నువ్ మంచిగుండు మామా :

ప్రకృతి వైపరీత్యాల కారణంగా వరద ప్రవాహ సమయంలో గిరిజనులను రక్షించే ప్రయత్నంలో ప్రాణాలు కోల్పోయిన స్త్రీ విషాద గాథను ఈ కథలో చూడవచ్చు.

గోదావరి వరదల్లో చాలామంది నిరాశ్రయులయ్యారు. ఏటూరు నాగారానికి చుట్టుపక్కల ఉండే మానసపల్లి, రామన్నగూడెం మొదలైన గ్రామాల నుంచి వచ్చిన వారం దరికి నాగారం హైస్కూల్‌లో అన్ని ఏర్పాట్లు చేస్తున్న సమయంలో గోదావరి ఉధృతంగా ఉప్పొంగి ఆ శిబిరాన్ని ముంచివేస్తుంది. అతికష్టం మీద ఇంకొక శిబిరాన్ని నిర్మాణం కాని ఐటిడిఎ కార్యాలయానికి తరలించి ఉన్న దాంట్లో ఏర్పాట్లు చేస్తున్న సమయంలో లక్ష్మీపురం గ్రామం పూర్తిగా మునిగిపోయి 14మంది చనిపోయారని తెలియ గానే ఎన్నో బాధలు భరించి కాలినడకన వెళుతూ దెబ్బలు తగిలించుకొని వరద బాధితులకు ఏర్పాటు చేసిన శిబిరంలో కూర్చోని వారి బాధలు వింటూ ఉండగా ఆ శిబిరంలో కూర్చున్న లక్ష్మయ్య ఓ మూల కూర్చోని కనీసం పెదవి కూడా విప్పకుండా భయంతో గజగజ వణికిపోతూ కనిపించగానే బాధల్లో ఉన్నాడని వెళ్ళి ఏమయ్య అని అడిగితే బదులివ్వకపోగా, కళ్ళమట ఏకధారగా నీళ్ళు కారుస్తున్నాడు. కాని ఏమి బదులివ్వడం లేదు. మిగతా

వాళ్ళు కూడా ఆస్తులను, సర్వస్వాన్ని పోగొట్టుకున్నారు కదా మరి ఇతనెందుకు ఇలా బెంగ పెట్టుకొని కూర్చున్నాడని విసుక్కున్నా, కోప్పడిన ఆ అబ్బాయి కిమ్మనలేదు కాని లక్ష్మీపురం హూసెన్ సాహెబు పడవ ప్రమాదం జరిగి అందరం చెల్లాచెదురైపోయామని ఎవరు ఉన్నారో ఎవరు లేరో కూడా తెలియదని చెప్తూ "ఈ కిష్టయ్య విషయం అలా కాదు. పడవ మునిగిన వెంటనే తనభార్యను ఒక చెత్తో పట్టుకుని, మరో చేత్తో ఈదడానికి ప్రయత్నం చేస్తున్నాడు. ఆ అమ్మాయి చేతిలో ఆర్నెల్ల పాప ఉంది. నీళ్ళలో చేతులు ఆడిస్తున్నాడే తప్ప అంగుళం కూడా ముందుకు కదలడం లేదు. ఆ అమ్మాయి కర్థమయింది. తనని పాపని ఒడ్డుకు చేర్చడం కిష్టయ్యకి సాధ్యం కాని పని అని.

చెప్పి చూసింది తమని గొదావరి నీళ్ళలో వదిలెయ్యమని అలా చేస్తే కనీసం కిష్టయ్య అయినా బతకవచ్చు. కిష్టయ్య వినలేదు. తన ప్రయత్నం తాను చేస్తూనే ఉన్నాడు. చాలాసేపు అలా ఈదడంలో ఆయాసం వచ్చి రొప్పుతున్నాడు. ఇక ఆలస్యం చేస్తే కార్యం కాదని, కిష్టయ్యని బలంగా తన్ని తనని తాను విడిపించుకొని వరద గోదావరిలోకి దూకేసింది. దూకుతూ "మామా మేం బతకం..నువ్ మంచిగుండు" అంది. ఒడ్డుకైతే చేరాడు కానీ ఇంతవరకు నోటమ్మట మాటలేదు"(గోదావరి గాథలు : 7,8) అని చెప్పేసరికి రచయిత బావురుమంటాడు. భార్యను, బిడ్డను కోల్పోయిన వర్ణనాతీతమైన బాధ నుండి తేరుకోలేక కిష్టయ్య మౌనం వహించడంతో అతడి నోటి నుండి మాట రావడం లేదు. గోదావరి వరద గిరిజన స్త్రీని పొట్టన పెట్టుకున్న హృదయ విధారక సంఘటన ఇది.

1986 సంవత్సరంలో వరద గోదావరిలో గిరిజనులను రక్షించే ప్రయత్నం చేసిన ఐటిడిఎ అధికారి తన అనుభవాన్ని తెలియజేయాలన్న ఉద్దేశ్యంతో తన భర్తను కాపాడే ప్రయత్నంలో తన ప్రాణాన్ని పణ్ణంగా పెట్టిన గిరిజన స్త్రీ దీన గాధ ఈ కథలో చెప్పబడింది. ఇలాంటి గిరిజన స్త్రీల బతుకులు గోదావరిలో ఎన్ని కలిసి పోయాయో ఎవరికి తెలియదు.

2. చింతా సాలక్క :

కంతనపల్లి గ్రామమంటే నాకు ప్రత్యేక అభిమానమని రచయిత కథా ప్రారంభంలో ఇలా చెప్పుకున్నాడు. లక్ష్మీపురం వెళ్ళేటప్పుడు లాంచీని కంతనపల్లి తీరమే పడేసింది. వరదలలో అన్నీ పోగొట్టుకొని వచ్చినవాళ్ళకు ఆప్యాయంగా భోజనం పెట్టింది, వరద బాధితులకు మొదటి పునరావాస గృహసముదాయాన్ని కూడా ఇక్కడే ప్రారంభించారు. గిరిజనులు ఐటిడిఎ సహకారంతో పాగాకు తోటలు వేసింది కూడా ఇక్కడేనని గుర్తు చేసుకున్నాడు రచయిత.

అయితే కంతనపల్లి గ్రామానికి చెందిన చింతా సాలక్క భూమి సమస్య ప్రత్యేకంగా చెప్పుకోదగిందిగా చెప్పాడు రచయిత. ఐటిడిఎ ద్వారా గిరిజనులకు ఎలా సహాయం చేసి అభివృద్ధి పనులు మొదలుపెట్టాలో చర్చిస్తున్న సమయంలో అక్కడి అధికారుల దగ్గరకు వచ్చిన చింతా సాలక్క "అయ్యా మీరు మంచి విషయాలే చెబుతున్నారు. బాగానే ఉంది కానీ అసలు విషయానికి రావడం లేదు. నా భూమి ఎనిమిదెకరాలు గుంటూరు వాళ్ళు లాక్కున్నారు. నేను నా భర్త ఊరోదలి ఎక్కడో ఉన్న చెలపాక గ్రామంలో ఉన్నాం. మేం మా ఊరు వచ్చే మార్గం లేదా వీళ్ళ దౌర్జన్యాన్ని ఎవరూ ఆపలేరా? భూమి ఇప్పించకపోతే ఇళ్ళు ఎవరిక్కావాలి మీ ఇతర సహాయం ఎవరిక్కావాలి అంది. గ్రామ పెద్ద వీరయ్య కథంతా వివరించాడు (గోదావరి గాథలు:14,15) చింతా సాలక్క భర్త భూమి పోగొట్టుకోవడానికి గల కారణాలను విశ్లేషిస్తే కంతనపల్లి గ్రామంలో నివసిస్తున్న గిరిజనుల దగ్గరకు గుంటూరు నుండి వచ్చిన గిరిజనేతరుడు వచ్చి గిరిజనుల కోసం అప్పులు ఇస్తూ వాళ్ళ బలహీనతలను ఆసరాగా చేసుకొని, గిరిజనుల భూములను తనఖా పెట్టుకొని అప్పు ఎక్కువైనప్పుడు గిరిజనుల భూములను కొనుక్కొన్నాడు. అలా డెబ్భై ఎకరాలు పోగు చేసుకొని అర్ధ బలంతో, అంగ బలంతో

గిరిజన గ్రామంలో గిరిజనేతరుడు నివసించడం చట్ట విరుద్ధం. కాని అధికారుల అండదండలతో గిరిజనులను మోసం చేస్తున్న మిగతా వాళ్ళు మాకెందులే అనుకున్న ఒక గిరిజన స్త్రీ ధైర్యంగా ముందుకు వచ్చి అధికారులను నిలదీయడం చాలా గొప్ప విషయం.

గిరిజనులకు అండదండగా నిలబడాలన్న సంకల్పం ఉన్న అధికారి గిరిజనేతరుడు సాగిస్తున్న మోసాలను గుర్తించి చింతా సాలక్క భూమిని తిరిగి ఆమెకు అప్ప గిస్తున్నప్పుడు కళ్ళ నీళ్ళు పెట్టుకోవడం అతనికున్న మానవీయ కోణాన్ని తెలియజేస్తున్నది. అయితే నెల తిరక్కముందే చింతా సాలక్క తిరిగి అధికారి దగ్గరికి వచ్చి నా భూమిని మళ్ళి ఆక్రమించుకున్నాడని కళ్ళనీళ్ళ పర్యంతం అవుతుంది. కళ్ళముందు జరిగిన అన్యాయాన్ని సహించలేని ఆ అధికారి ఏదో చేయాలని తాపత్రయ పడతాడు కాని పాలనా వ్యవస్థలో లనకున్న అధికారి పరిధి వలన అవసరానికి సహాయం చేయలేని తన దౌర్భాగ్య పరిస్థితికి తానే తిట్టుకుంటాడు.

ఎందుకంటే డబ్బున్నవాళ్ళు ఏమైనా చేయగలరని నిరూపిస్తూ భూమి మీద హైకోర్టు నుండి స్టే తెచ్చుకొని భూమిని కబ్జాదారుడు దున్నుకుంటాడు. కోర్టు తీర్పు రాకముందే ఆ అధికారి కంతనపల్లి వదిలి వచ్చానని చెప్పడం ద్వారా గిరిజన జీవితాలు, వారి పరిస్థితులు ఎలా ఉంటాయో కళ్ళకు కట్టినట్లుగా చెప్పిన యదార్థ గాథ ఇది.

3. వాళ్ళ కోడళ్ళూ వద్దు-అల్లుళ్ళూ వద్దు :

గిరిజన యువకుడు గిరిజనేతర స్త్రీని పెళ్ళాడతాననే సమస్యకు పరిష్కారం ఆలోచించే క్రమంలో ఎదురైన సవాళ్ళు, సందేహాలు ఎన్ని ఉన్నా చివరికి నిర్ణయం జరిగి పోవటమనే కథాంశంతో ఉంది గాధ.

కొత్తగూడలో ఉన్న ఒక గిరిజన యువకుడు చల వాయి గ్రామానికి చెందిన గిరిజనేతర స్త్రీని వివాహం చేసు కుంటానని చెప్పటం వలన కలిగే పరిణామాలను మండలాధ్యక్షుడు ప్రగతిశీల దృక్పథంతో ఆలోచిస్తుండగా అలా జరిగితే గిరిజన సమాజం చిన్నాభిన్నం అయ్యే పరిస్థితి వస్తుందని బాధపడుతున్నాడు ఐటిడిఎ అధికారి. "గిరిజనేతరులు గిరిజన స్త్రీలను బలాత్కరించడం, చెరచడం తెలియని విషయం కాదు. కొండా కోనల్లో గిరి జనేతరులు గిరిజన స్త్రీలను వివాహం చేసుకున్నా, గిరిజన స్త్రీని కుటుంబసభ్యురాలిగా ఇతరులు అంగీకరించక పోవడంతో పనిమనిషి హోదాకి భిన్నం కాని హోదాను ఆమెకు కల్పించారు. ఇది తరతరాలుగా జరుగుతున్న దోపిడిలో భాగం.....మరి ఇప్పుడు వాళ్ళమ్మాయి మన వాడిని ప్రేమించి పెళ్ళాడుతానని వస్తే మనం కాదన కూడదు. ఇన్నేళ్ళు మన అమ్మాయిలు వాళ్ళకి భోగ వస్తువు లయితే ఇపుడు వాళ్ళమ్మాయి మన ఇంటికి వస్తోంది. ఈ మార్పును అంగీకరించడమే కాదు ప్రోత్సహించాలి కూడా అన్నారు. గిరిజనుడు అభ్యుదయవాది అయిన శ్రీవెంకటయ్యగారు" (గోదావరి గాథలు : 19)

కాని గిరిజనుడు గిరిజనేతర స్త్రీని వివాహం చేసు కోవడం మరో రూపంలో జరగబోయే దోపిడికి నాంది అని ఆ అమ్మాయి వెంట ఆమె బంధువర్గం గిరిజన గ్రామా లలోకి వచ్చి భూమిని ఆక్రమించి దౌర్జన్యం చేసి ఏక త్రాటిపై నడుస్తున్న గిరిజన సమాజంలో చీలిక తెస్తుందని, ఏది ఏమైనా దీని వలన గిరిజనేతరులకే లాభం కలుగు తుందని అంటాడు రచయిత.

గిరిజనేతరులకు హఠాత్తుగా గిరిజనుల మీద ప్రేమ ఎందుకు వస్తుందని, గిరిజనేతరులకు అవకాశం ఇస్తే గిరిజన సమాజంలో చీలిక వస్తుందని అలాంటి వాళ్ళ అల్లుళ్ళూ వద్దు కోడళ్ళూ వద్దు మనకు అంటాడు రచయిత.ఎందుకంటే గిరిజనేతరుల వల్ల నష్టపోయే గిరిజనులు ఒకవైపు, గిరిజనేతరుల బంధువులుమరోవైపు చీలిపోయి వాళ్ళలో వాళ్ళే చీలికలు తెచ్చుకొని చిన్నాభిన్నం అవుతారని రచయిత ఆవేదన చెందుతాడు. కాని ఎవరి అభిప్రాయంతో పని లేదన్నట్లుగా యధావిధిగా పెళ్ళి జరిగిపోయింది. కాని దీని పర్యవసానం ఈ క్షణం నిర్ణ యించలేమని, ఆగామికాలం నిర్ణయించాల్సిన విషయ మని, అంతవరకు బతికుంటే కొత్తగూడ మళ్ళి వెళతానని ముగించాడు రచయిత.

4. రాకితల్లి :

ఒరిస్సా నుండి వలస వచ్చి కమలాపురం రేయాన్స్ ఫ్యాక్టరీ దగ్గర గుడిసెలు వేసుకొని నివసిస్తున్న గిరిజనుల గురించి అందులో ముఖ్యంగా తన బిడ్డకు పాలిస్తున్న రాకీతల్లి గురించిన గాద ఇది.

గోదావరి వరదలలో చిక్కుకున్న ఈ గిరిజన గూడానికి వెళ్ళిన రచయిత అక్కడి పరిస్థితులను గమనించి ఫోటోలు తీసే క్రమంలో తన బిడ్డకు పాలిస్తున్న రాకీతల్లి ఫోటోను కూడా తీసి ఆ తరువాత ఆ ఫోటోను ఎన్‌లార్జ్ చేయించి ఆ గూడెంలోని గిరిజనులకు చూపించిన క్షణంలో వారు ఆనందపడిన క్షణాలను వర్ణించలేనని అంటాడు రచయిత.

కొందరు ఆదివాసుల సంతోషానికి పరోక్షంగానైనా కారణమయ్యానన్న సంతోషంతో ఆ ఫోటోని అఖిల భారత స్థాయి ఫోటో స్థాయి ఫోటో ఎగ్జిబిషన్లకు "మదర్ అండ్ చైల్డ్" అనే శీర్షికతో రచయిత పంపగా రెండు బహు మతులు వస్తాయి. అలా అతన్ని ఆమెచ్యూర్ ఫోటోగ్రాఫర్ల కుటుంబంలో సభ్యునిగా చేసిన రాకిని ఆమె పాపని గిరిజన గూడెం వెళ్ళినప్పుడల్లా చూసి వస్తుండేవాడు. కాని "కొన్ని వారాల తరువాత ఒక రోజు మధ్యాహ్నం ఏటూరు నాగారం ఐ.టి.డి.ఏ లో కూర్చుని పనిచేసుకుంటున్నాను. ఉన్నట్టుండి ఆఫీసులోకి దూసుకొచ్చారు యీ గూడెం వాసులు. "అయ్యా! అన్యాయమైపోయింది" అని గుండెలు పగిలేలా ఏడుస్తూ నన్ను కావలించుకున్నారు. నాకు వారి పరిస్థితి చూడగానే జరగకూడనిదేదో జరి గిందని అర్థమయింది. ఏ దుర్వార్త వినవలసి వస్తుందో అని ఏం జరిగిందని అడగలేదు..."రాత్రి గూడెం పై రెండు ఎలుగుబంట్లు దాడి చేశాయి. గొడవ విని అందరం లేచి ఎలుగుబంట్లని తరిమి వేసే లోపు జరగకూడనిది జరిగి పోయింది. బయట తిరుగుతున్న రాకీని పట్టుకుని మొహం వక్షస్థలం రక్కి కొరికి నానా భీభత్సం చేశాయి. ఆమెకు మొహమన్నది లేదిప్పుడు. గూడెంలో స్పృహ తప్పి పడుంది" అన్నారు"(గోదావరి గాధలు:67) రాత్రి పూట గిరిజన గూడెల మీద ఎలుగుబంట్లు దాడి చేసిన సంఘ టనను రచయిత కళ్ళకు కట్టినట్లుగా రికార్డు చేసాడని చెప్పవచ్చు. కొండాకోనల్లో, దట్టమైన అటవి ప్రాంతంలో నివసించే గిరిజనుల మీద క్రూరమృగాలు, అడవి జంతు వులు దాడులు చేసి ఎందరి ప్రాణాలను హరించాయో, ఎందరి జీవితాలు గాలిలో కలిసిపోయాయో లెక్కలేదు.

ఎలుగుబంటి రాకీతల్లిపై దాడి చేసిన విషయాన్ని తెలుసుకొని ఆస్పత్రికి పోవటానికి సహాయం చేసిన అధికారి ఎంతో శ్రమించి వైద్యం చేసిన డాక్టర్లు రాకితల్లి ప్రాణాని కాపాడారు కాని ఆమె అందమైన ముఖాన్ని తిరిగి తేలేకపోయారు. రాకితల్లి అందమైన మోహంలో చాలా భాగం లేదని ఆమెను మళ్ళి చూసేందుకు ధైర్యం కూడా లేదని వాపోయాడు రచయిత. క్రూరమృగాలు, అడవి జంతువుల బారిన పడి ప్రాణాలు కోల్పోయిన గిరిజనుల జీవితాలను గురించిన యదార్ధ గాధ ఇది.

5. సంబూ అక్క :

మత్తడిగూడకి చెందిన గిరిజన యువకుడు సీడం సంబూ అక్క ప్రసవ వేదనతో మూర్ఛపోతే, ఆమెను హాస్పటల్‌కి చేర్పించి సంబూ అక్క ప్రాణాన్ని కాపాడిన గాధ ఇది.

రాత్రి పదకొండు గంటలప్పుడు వచ్చి సీడం సంబూ తన అక్క కనేదుంది. అయితే ఉన్నట్టుండి సృహ తప్పిందని చెప్పగానే స్పందించిన అధికారి తాలూకా ఆస్పత్రి డాక్టరును బతిమాలి ఐదు కిలోమీటర్లు గతుకుల రోడ్డులో ప్రయాణించి మత్తడిగూడ వెళ్తారు. "మేము మత్తడిగూడ చేరగానే, సంబూ కుటుంబ సభ్యులే గాక, ఆ గ్రామంలోని గోండు సమాజమంతా కళ్ళమ్మట నీళ్ళతో దర్శన మిచ్చారు. వాళ్ళని సమాధాన పరిచి యింట్లోకి వెళ్ళగానే ఐదు నిమిషాల్లో డాక్టరు గారు పరీక్ష చేసి చెప్పారు. ఆవిడ గర్భస్థ శిశువు మరణించిందనీ వెంటనే ఆపరేషన్ చేసి మృత శిశువును తీసి వెయ్యకపోతే తల్లి ప్రాణాలు కూడా దక్కవనిన్నీ.

"మరి ఆలస్యమెందుకు ఇక్కడే ఆపరేషన్ చేసె య్యండి" అన్నాను. "ఇక్కడ కాదు గదా - ఉట్నూరులో కూడా చెయ్య లేను. ఆదిలాబాదు జిల్లా ఆస్పత్రికి వెళ్ళవలసిందే" అన్నారు డాక్టరుగారు.

స్పృహలేని గర్భిణీ స్త్రీ ని జీపులో, ఆ దారిలో ఉట్నూరు తీసుకెళ్ళడమే కష్టమంటే ఉట్నూరు నుంచి దాదాపు అరవై కిలోమీటర్ల దూరంలో వున్న ఆదిలాబాద్ ఎలా తీసుకువెళ్ళేది? వెళ్ళినా ప్రయోజనం వుంటుందా?

వెళ్ళినా ప్రయోజనం వుండకపోవచ్చు కనుక స్పృహ లేని గోండు మహిళని మారుమూల గ్రామంలో నరక యాతన అనుభవిస్తూ చావమని చెప్పి మేం వెళ్ళిపోవాలా? అలా చేసిన రోజు మేము కూడా మనుషులమేనని ఎలా చెప్పుకోగలం? ఏం చేయాలి?

భగవంతుని మీద భారం వేసి ఆవిడని జీపులో పడుకో బెట్టి అప్పుడు ఐ.టి.డి.ఏలో తాత్కాలిక వేతనంపై పని చేస్తున్న డాక్టర్ నాయక్‌ను వెంట తీసుకుని ఆదిలాబాదు ప్రభుత్వాసుపత్రికి వెళ్ళాం. వెళ్ళే ముందు ఈ స్థితిలో ఉన్న రోగిని తీసుకొస్తున్నామని వైర్‌లెస్ మేసేజిచ్చి మరీ వెళ్ళాం"(గోదావరి గాథలు:70.71) గిరిజన ప్రాంతంలో రోడ్లు, మౌలిక సదుపాయాలు ఎలా ఉంటాయో పై సంఘ టన తెలియజేస్తుంది.

అంతరాత్రి అవస్థ పడుతూ ఆస్పత్రికి చేరుకోగా, ఆప రేషన్ చేయడానికి రక్తం కావాలని డాక్టరు చెప్పడంతో అక్కడి వారందరిని అడిగిన ప్రయోజనం లేకపోవడంతో, రిక్షావాళ్ళను బతిమాలితే సీసాకు రెండొందలు ఇస్తేనే రక్తమిస్తానని చెప్పడంతో ఆ రాత్రి హడావిడిగా వచ్చేసిన వాళ్ళ జేబులో చిల్లిగవ్వ లేకపోవడంతో డాక్టర్ నాయక్ తన మిత్రుల దగ్గర నుండి తెచ్చిన డబ్బులు రిక్షావాడికి ఇవ్వగా, సంబూ అక్కకు ఆపరేషన్ చేసి మృత శిశువును తీసేసి ఆమెను బతికిస్తారు డాక్టర్లు. ఆ విషయం విన్న రచయిత మృదయం వేయి దీపావళుల కాంతులు వెల్లి విరిసిందనడంతో గిరిజనుల పట్ల అతనికున్న అభి మానాన్ని తెలియజేస్తుంది.

సంబూ అక్క విషయం సరే ఇలాంటి వారు వేల మంది ఉన్నారు. మరి వాళ్ళ సంగతి ఏమిటని కూడా ఆవేదన చెందుతాడు. గిరిజన గూడెలలో, తండాలలో తగినంత వైద్య సదుపాయాలు లేకపోవడంతో ఎంత మంది గిరిజనులు చనిపోతున్నారో నాగరిక ప్రజలకు తెలియదని, వసుధైక కుటుంబమనే మేధావులకు కూడా గిరిజనుల గురించి పట్టింపు లేదని చెబుతాడు.

గిరిజన ప్రాంతాలలో ఉన్న వాస్తవమైన పరిస్థితులను కళ్ళకు కట్టినట్లుగా తెలియజేశాడని చెప్పవచ్చు.

ముగింపు :

గోదావరి గాథలను రాసిన ఫణికుమార్ తన అను భవంలో వచ్చిన సంఘటనలను ఈ గాథల ద్వారా తెలియ జేశారు. ముఖ్యంగా ఆదిలాబాదు, వరంగల్ జిల్లాలో ఉన్న గిరిజనుల గురించిన అనుభవ గాథలివి. అయితే "నేను రాసిన గాథల్లో అసత్యమైన విషయం కానీ, వర్ణన కానీ లేదు. అయితే నేనెరిగిన సత్యమంతా చెప్పలేదు" పేర్కొన్నడం ద్వారా రచయితకున్న పరిధిలో ఈ గాథలను తెలియజేశాడని చెప్పవచ్చు.

గిరిజనుల జీవితాలలో జరిగిన యదార్ధ సంఘటన లలో తాను ప్రాణాలు కోల్పోయి తన భర్త ప్రాణాన్ని రక్షించిన గిరిజన స్త్రీ గాధ హృదయ విదారకమైనది. అలాగే తన భూమి కోసం అంగ బలం, అర్ధ బలం, అధికారుల అండదండలు ఉన్న గిరిజనేతరుడి మీద పోరాటం చేసిన చింతా సాలక్కకు హ్యాట్సాప్ చెప్పవలసిందే. గిరిజన సమాజంలో కూడా అభ్యుదయ భావాలు కలిగిన వాళ్ళు ఉండడం, గిరిజనుల మధ్య పెళ్ళి ద్వారా చీలిక వస్తుం దనే అధికారుల ఆలోచనతో సంబంధం లేకుండా పెళ్ళి జరిగిపోవడమనే సంఘటన తాము అనుకున్న పనిని చేసుకునే గిరిజన తత్వాన్ని తెలియజేసింది. కొండా కోనల్లో నివసిస్తూ అడవి జంతువుల, క్రూర మృగాల బారిన పడిన రాకీ తల్లి విషాద గాధలో గిరిజనుల జీవన స్థితిని, వైద్యం సహాయం అందించడం కోసం పడిన పాట్లు, ఎదురైన సంఘటనలే సంబూ అక్క. ఈ అనుభవ గాధల ద్వారా గిరిజనుల వాస్తవమైన జీవన నేపథ్యాన్ని తెలియ జేస్తున్నాయి.



గిరిజనుల జీవితాన్ని చిత్రించిన తెలుగు కథలు

– డా॥ టి. చక్రధర స్వామి, అధ్యక్షులు, తెలుగు శాఖ, శాతవాహన విశ్వవిద్యాలయం, కరీంనగర్, తెలంగాణ.

భారతదేశానికి గల ప్రత్యేకతలలో గిరిజనులు అనేది ఒకటి. ఇతర దేశాలలో గిరిజనులు లేరని కాదు గానీ మనదేశం లోని గిరిజనులకు ఒక ప్రత్యేక మైన స్థానం వుంది. గిరిజనులు దేశం లోని అన్ని రాష్టాల లోనూ నివసిస్తున్నారు బ్రిటీష్ వాళ్ళ కాలం నుండి ఇప్పటి దాకా మన దేశం సాధించిన అభివృద్ధి వల్ల అత్యధికంగా నష్ట పోయింది గిరిజనులే. అత్యధికంగా తిరుగుబాట్లు చేసింది కూడా గిరిజనులే.

జనపదులది జానపద సాహిత్యమైతే, గిరిజనులది గిరిజానపద సాహిత్యం. బంజారాల సాహిత్యాన్ని వచన శాఖ, గేయశాఖ, దృశ్యశాఖలుగా చూడవచ్చు .వచన శాఖ లో వచన కథలు , పొడుపు కథలు వస్తాయి, అలాగే బంజారాలకు గేయం అంటే ప్రాణం . బాల్యం మొదలు కొని వృద్ధాప్యం వరకు ఆయా సందర్భాన్ని బట్టి పాటలు పాడుకొంటారు. పెండ్లి వేడుకలు, పండుగలను ఆటలు, పాటలు లేకుండా వారు జరుపుకోరు.

గిరిజనుల ఆచార వ్యవహారాలు, జీవన సంస్కృతిని ప్రతిబింబించే కథలు , సమకాలిన సమాజం పై గిరి జనుల ప్రభావం, గిరిజనులపై సమాజ ప్రభావాన్ని చిత్రించే కథలుగా గిరిజనుల కథలను చూడవచ్చు. గిరిజనుల సంస్కృతి, జన జీవన విధానం పై వివిధ యూనివర్సిటీలలో ఎం.ఫిల్ ,పిహెచ్.డి పరిశోధనలే జరి గాయి కాబట్టి నేను గిరిజనుల జీవితాలను సభ్య సమాజం ఏ విధంగా ప్రభావితం చేస్తుందన్న కోణం నుండి నా పత్రాన్ని రూపొందించాను.

దీని కోసం పి.చంద్ (వూరుగొండ యాదగిరి) 'రాసిన రాధాబాయి, గుమ్మన్ ఎగ్లాస్‌పూర్ గ్రామస్థుడు, గెరిల్లా' కథలు, బోయ జంగయ్య 'పండ్లగంప' కథ, సాహు రాసిన "నీటి కథ-కన్నీటి కథ, భూమికొరకు" కథలను స్వీక రించాను.

రాధాబాయి :

రాధాబాయి ఊహ తెలియని వయసులొనే తల్లి కాలం చేసింది. అడవిని ఆనుకొని ఉండే తమ పచ్చ పచ్చని ఊరు, అడవి మీద ఆధారపడి బ్రతికే బ్రతుకు. ఏదో మహమ్మారి కమ్ముకున్నట్లుగా అడవి మాయ మైంది. లారీల కొద్ది కలప పట్టణాలకు, కాగితపు పరిశ్రమకు తరలి పోతుంటే అడవి బిడ్డలు నిలువు గుడ్లేసుకుని చూసుడు తప్ప ఏం చేయలేకపొతారు. దాంతో అడవి అంతరిం చింది. పులి మీద పుట్రలా ఓపెన్ కాస్ట్ వచ్చిన తర్వాత భూములు పొతాయి. గిరిజనుల బ్రతుకు గూడ చెదిరన పక్షుల్లా ఆగమాగమవుతుంది.

రాధాబాయి అన్న ఇప్రును కట్టెలకు పోయిన వాన్ని నక్సలైటని కాల్చి చంపడం. ఉన్న ఊర్లో బ్రతుకు పోయి గోదావరిఖనికి బ్రతుక వచ్చి క్రాంట్రాక్టరు రాఘవేంద్రరావు దగ్గర తన తండ్రి తాత పోషు ఇసుక కార్మికుడు కావడం, తండ్రి నర్సింగం పిడుగు పాటుకు మృతి చెందడం ,ఇదే అదనుగా భావించిన కాంట్రాక్టరు రాధాబాయిని నేనున్నా నంటూ సానుభూతి వాక్యాలు చెప్పి లోబరుచుకోవడం. ఆ తర్వాత రాధాబాయి అమాయకత్వం, బ్రతుకు భయం, తియ్య తియ్యని రాఘవేంద్రరావు మాటల వెనుక దాగి వున్న క్రూరత్వాన్ని పసిగట్టని తనం ఆమెను నిస్స హాయస్థితి లోకి నెట్టి వేసింది. తప్పో, ఒప్పో ఆలోచించే పరిస్థితి లేదు. తన వారి కోసం, ఆకలి కోసం తప్ప లేదు. ఫలితంగా రాఘవేంద్రరావు డబ్బుల ఆశ, చూపి, మాయ మాటలు చెప్పి ఆమెను తన అవసరాలు, కాంట్రాక్టులు, రాజకీయ ఎదుగుదలకు ఉపయోగపడే వ్యక్తుల వద్దకు పంపించడం. ఆమెని ఎరగా వేసి చాలా సులభంగా తన పనులు నెరవేర్చుకుంటుంటాడు. ఆ విధంగా రాధాబాయి రాఘవేంద్రరావుకు డబ్బులు ,కాంట్రాక్టులు తెచ్చి పెట్టే ఒక వస్తువుగా మారిపోయింది.

ఇలా ఒకరి తర్వాత ఒకరు రాధాబాయిని లైంగికంగా అనుభవిస్తూనే వుంటారు. ఒక ఘోరమైన హింస, క్రూరత్వం, లైంగిక అత్యాచారాలు నిస్సహాయ స్థితిలో జీవితం వెళ్ళ దీస్తున్న రాధాబాయి లాంటి వాళ్ళు ఈ పరిస్థితికి నెట్టి వేయబడి మాటల్లో చెప్పలేని మౌన ఆక్రందనను అనుభవిస్తున్నారు. ఈ విధంగా వారి సంపదను దోచేస్తూ, వారిని కూలీలు గా మారుస్తూ, వారి పైనే లైంగిక దాడులకు, అత్యాచారాలకు హత్యలకు కారణమౌవుతున్న పారిశ్రామికీకరణ గురించి చంద్ కథ వాస్తవికంగా తెలియజేసింది.

రిజర్వ్ ఫారెస్ట్ పేరు మీద గిరిజనుల పై జరిగే దాడులు అమానుషంగా వుండి, కనీసం వాళ్ళకు నిలువ నీడ లేకుండా చేస్తున్నాయి. ఏ భూమిలోనైతే ఏండ్లకేండ్లు బ్రతుకు వెళ్ళదీస్తున్నారో ఆ భూమి నుండి వారిని వెళ్ళగొట్టి ఉన్న సహజ వనరులను, అటవీ సంపదను దోచుకునే ప్రక్రియ లో భాగమే రిజర్వ్‌ఫారెస్ట్. రిజర్వ్‌ఫారెస్ట్‌ను గురించిన కథ "గుమ్మన్ ఎగ్లాస్‌పూర్ గ్రామస్థుడు".

ఒకప్పుడు ఇక్కడ తమ చేను చెలకలు, గూడెంలో పంటలు పండించుకునే భూముల్లో యిప్పుడు ప్లాంటేషన్ పేరు మీద పిచ్చి మొక్కలు నాటాల్సి వస్తోంది. ఒకప్పుడు ఇదే అడవిలో కిక్కిరిసి వుండే వెదురును పెద్ద, పెద్ద చెట్లనూ తమ లాభాల కోసం కొల్లగొట్టుకు పోయిన వాడు అడవిని అలాగే వదిలేసిపోయాడు. కానీ తాము అడవి నరికింది పచ్చని పంటలు పండించడానికి, పట్టెడు మెతుకుల కోసం. కానీ ఏ నేరస్తులైతే అడవిని నాశనం చేశారో మళ్ళీ ఆ నేరస్థుల కోసమే తమ భూముల్లో ప్లాంటేషన్ పేరు మీద తమ చేతులతో మొక్కలు నాటిస్తోంది ప్రభుత్యం.

రిజర్వు ఫారెస్ట్‌గా ప్రకటించి గూడెంలో బ్రతుకీడుస్తున్న గిరిజనులను అక్కడి నుండి తరిమి, వాళ్ళ ఇళ్ళను తగుల బెట్టి వాళ్ళను నిరాశ్రయులగా చేసింది. ఒంటి మీద గుడ్డలు తప్ప ఏమీ లేని స్థితి. వర్షాలు, చలి, అన్నింటికన్నా ఆకలి. అది తమ పాలాల్లో తమనే కూలీలుగా మార్చింది. ప్లాంటేషన్ కూలీలుగా మార్చింది. ప్లాంటేషన్ కూలీలుగా మారి అర్ధాకలితో పడుకోవాల్సి వస్తోంది లింగన్న అనే గిరిజనుడి ఆక్రందన ఇది.

అడవి లో పశువుల తీరుగా బ్రతుకుతూ కడుపునిండా ఒక పూట తిండి కూడ దొరక్క అడవిలో దొరికే ఫలమో పత్రోతిని జీవితం వెళ్ళదీస్తున్న గిరిజనుల వ్యధాభరిత జీవితాలు, జీవన విధానం తన కథల్లో చంద్ హృద్యంగా చిత్రించాడు. ఒక విప్లవ కార్యకర్తకు రక్షణ కల్పించి పోలీసులు రాగా తన కొడుకునే విప్లవ కార్యకర్తగా అప్పగించిన కథ "అమ్మ". గిరిజనులు తిండికోసం పడే అవస్థలు చిత్రణ చేశాడు, "గెరిల్లా" కథలో రచయిత పి.చంద్.

చేతినిండా పనులుండని ఎండాకాలంలో పోట్ట గడవటం కోసం పొద్దంత అడవి లో తిరిగి గునుగు కట్టలను ఏరుకొని రావటం, మోపెడు గునుగు పువ్వుల నుండి రాలిన సేరో అర్ధ సేరో గునుగు గిరిజలను దంచి జావ కాసుకోవడం; ఆదిలాబాద్ జిల్లా లోని అడవి ప్రాంతంలో నివసించే నిరుపేద గిరిజనులు, ప్రాణాలు నిలబెట్టుకోవడం కోసం ప్రతి సంవత్సరం ఏప్రిల్, మే మాసాల్లో చేసే పని ఇది.

ఇక వానాకాలంలో- కొద్దిగా గూడెం చుట్టూ ఉన్న చెలకలను దున్నుతారు. అది కూడా అడవి జంతువులు నాశనం చేసింది కాక తాలు తప్పలు పోతే మిగిలింది రెణ్నెల్లు పొద్దు గడుస్తుంది. మిగతా కాలమంతా అడవి మీదే బ్రతకాలి. అడవి లో దొరికే తునికి, రేగుపండ్లు పట్నానికి తెచ్చి అమ్ముకొంటారు. అవేవీ దొరకనప్పుడు. అడవిలో కంక బొంగులు కొట్టి పట్నానికి తీసుకెళ్తారు. అది కూడా ఫారెస్ట్ వాళ్ళ కంటబడిందో మళ్ళీ ఇంటికి వచ్చేదుండదు. కేసులు జైళ్ళు వున్నాయి వాళ్ళ కోసం. ఒక్కొక్క మోపుకు పది పదిహేను బొంగులుంటుయి. అవి అమ్ముకోగా వచ్చే కొద్దిపాటి డబ్బుతో జొన్నలో, నూకలో తెచ్చుకోవటం, ఆ తెచ్చుకున్నవి ఆ పూట వండుకొని తిని తెల్లారి పిల్లలకు కొద్దిగా మిగిల్చి మళ్ళీ బొంగుల కోసం తిరిగి అడవి లోకిపోవడం వాళ్ళ నిత్యకృత్యము.

ఈ విధంగా అడవిలో దొరికింది తిని, దొరకనినాడు కాలే కడుపులతో కుస్తీ పడుతున్న గిరిజనులు ఆహారానికి, ఆసుపత్రికి, విద్యకు అన్నిటికీ దూరమవుతున్నారు. సమగ్ర గిరిజనాభివృద్ధి అంటూ ఢంకా బజాయించే ప్రభుత్వం మాటలు నీటి మూటలవుతున్నాయి.

అడవిలో శ్రమ కోర్చి సీతాఫల పండ్లను తెంపుకుని వచ్చి పట్టణంలో అమ్మే గిరిజన దంపతులను బెదిరించి డబ్బు దోచుకునే పోలీసుల నిర్ధయను బోయ జంగయ్య "పండ్లగంప" కథ ఆవిష్కరించింది.

రమవత్ దాస్య అతడి భార్య సాలి ఎడ్ల బండిలో సీతాఫల పండ్లతో పట్టణానికి వచ్చి పుట్ పాత్ పై కుప్పలుగా పేర్చి ఇరవై అయిదు రూపాయల ధర చెప్పి బుట్ట ఇరవైకి అమ్ముతుంటారు. పుట్ పాత్ మీదనే చాయ్ చేసుకొని త్రాగడం, మధ్యాహ్నం జొన్న, రొట్టెలు కాల్చుకు తినడం, రాత్రి ఇప్ప పువ్వు సారా త్రాగి రొట్టెలు తిని ఒకరు బండిలో ఒకరు పుట్ పాత్ పై పడుకోవడం మూడు రోజులూ చేసి పండ్లని అమ్మేస్తారు. ఈ మూడు రోజుల్లో ఒకసారి బీట్ కానిస్టేబుల్ వచ్చి పుట్ పాత్ మీద అమ్మ కూడదంటూ ఒక గంప పండ్లు పట్టుకెళ్తాడు. మరొక సారి మరో పోలీస్ వచ్చి తక్ పట్టి కట్టాలంటూ పది రూపాయలకు రసీద్ ఇచ్చి ఇరవై రూపాయలు తన జేబులో వేసుకుని పోతాడు. కష్టపడి బ్రతికే పేద గిరిజనులను దోచుకునే తీరును హృదయ భారంగా రచించారు బోయ, జంగయ్య. వీరి "ఇప్ప పూలు" కథా సంపుటిలోని కథలన్నీ కూడా గిరిజన జన జీవనానికి సంభందించినవే.

విప్లవ సాహిత్యంలో రచనకూ, సామాజికాచరణకూ మధ్యవుండే అంతరం బాగా కుదించుకుపోయి, రచన కూడా సామాజిక ఆచరణగా రూపొందుతుంది. "సాహు" (శనిగరం వెంకటేశ్వర్లు) కథల్లో అత్యధిక భాగం 1970 నుండి 1983 వరకు రాశాడు. ఆ కాలంలో అతడు విప్లవ కార్యకర్తగా అడవుల్లో ప్రవేశించి, అక్కడి గిరిజనుల్లో ఒకడిగా జీవిస్తూ, వారి జీవితాలని కథలుగా మలిచాడు. తాను రచయితనని అనిపించుకోవడం కోసం కాక, ఆ గిరిజనుల జీవితాలను మార్చడం అనే అకాంక్షతో పెరాటంలో భాగంగా ఈ కథలు రాశాడు. ఇవి దండ కారణ్య విప్లవోద్యమంలో భాగంగా వచ్చిన కథలు.

సాహు నీటి కథ-కన్నీటి కథ" నీళ్ళ కోసం గిరిజనులు పడే శ్రమను, అనుభవించే యాతనను తెలియజేస్తుంది. అడవిలో ఎత్తైన కొండల మీద అమాయకంగా, అనాగరికంగా, ఏ సౌకర్యలూ లేకుండా జీవిస్తున్నారు. నాగరికునికి వేల సంవత్సరాల తేడాతో బతుకతుంటారు. వాళ్ళు ఎన్నో ఏళ్ళుగా ఎండాకాలం "నీటి కోసం యుద్ధం" చేస్తున్నారు. చీకటితో లేచి కొండ దిగి అక్కడ వున్న చిన్న చెలిమె ఊటలో ఊరిన కొద్దీనీళ్ళు నింపుకొని కొండ పైకి తీసుకెళ్తారు. ఆ కాలంలో వాళ్ళు స్నానం చేసిన రోజు మహదానందమే.

అలా ఓ రోజు అందరితో బాటు వెళ్ళినిండు చూలాలు సక్కుబాయి తన వాళ్ళతో నడవ లేక వెనకబడి ఓ గుడ్డేలుగు చేతిలో చిక్కి ఘోరంగా మరణిస్తుంది. అయితే సక్కుబాయి నిప్పహాయం గానో, పిరికి గానో మరణించక ఆ ఎలుగుబంటితో యుద్ధం చేసి మరణిస్తుంది. ఆ నేలంత రక్త సిక్తమౌతుంది. ఈ విషయాన్ని రచయిత చెప్తూ అక్కడ పగిలి పోయిన కుండ పెంకుల మీద తన కన్నీళ్ళు జారిపడితే, ఆ పెంకుల్ని తన జేబులో వేసుకుని నడక ప్రారంభిస్తాడు. ఆ పెంకులు రచయితను ఆవేశ పరుస్తాయి. "నీటి కోసం జంతువులతో పోరే వీళ్ళు - జంతువుల్లాంటి మనుషులతో పోరాడాలి" అనుకుంటాడు. ప్రకృతి పరంగా గిరిజనులు ఎదుర్కొంటున్న మంచి నీటి సమస్య ఎంత ఘోరంగా ఉందో ఈ కథ హృదయాన్ని కదిలించేలా కళ్ళ ముందుంచుతుంది. వాళ్ళ దుస్థితికి కారణం రాజ్యమేననే భావం అంతర్లీనంగా ధ్వనింప జేస్తుంది.

భూమి కొరకు గిరిజనులు సాయుధ దశను తీసుకుంటున్న క్రమాన్ని తెలిపేది "భూమి కొరకు" కథ. అది 1975వ సంవత్సరం. ఏళ్ళ తరబడి గిరిజన గూడాలు సాగు చేసుకుంటున్న పంట భూముల్ని ప్లాంటేషన్ పేరు మీద పిచ్చి మొక్కలు నాటి, వాళ్ళను భూమి లేని వాళ్ళను

చేస్తున్నారు.తమ భూమిలో గిరిజనుడు రక్తం మడుగవు తాడు. మన్నెగూడెం మంట్లె గలిసింది. కాల్చి మంటల కలిపారు. ఒకటా రెండా ఊర్ల కూర్లు కొన్ని వేల ఎకరాలు ఇలా రక్త సిక్త మై ప్లాంటేషన్ చేయబడ్డాయి. ఎక్కువ ప్లాంటేషన్ చేసిన ఏరియా రేంజర్‌కు బంగారు పతకం లభిస్తుంది. తుంబాగూడెం కనిపించిన ప్రతి వాని కాళ్ళు పట్టుకుంటుంది కానీ భూమి దక్కలేదు. ఇప్పుడు తుంబాగూడెం కొత్తగీతం పాడుతోంది. ఆ ఊళ్ళో సంఘం సూర్యుడు ఉదయిస్తాడు. తుంబాగూడెం పాడిన గీతం అడవంతా వ్యాపించింది. దావానలమైంది. పోలీసులు వచ్చి పండిన పంటను ఖరాబు చేశారు. 'సర్కారు తుమ్మను, పిచ్చి తుమ్మను' నాశనం చేయడానికి గిరి జనులు "ఎర్రమందు" ను కనిపెడితే వెర్రెత్తిన ప్రభుత్వం (పోలీసులు) విరుచుకుపడి ఇంద్రవెల్లిలో కనిపించిన వాణ్ణలా కాల్చింది. ఆ రక్తం తోనే గిరిజన రైతాంగ పోరాట జెండా మరింతగా విస్తరించింది.

గిరిజన సంస్కృతి, వారి జీవితాలు, వారి పై దోపిడి, దాన్ని ఎదిరించి వారు చేసిన పోరాటాలు, వారి మధ్య మానవ సంబంధాలు మొదలైన అనేక విషయాల్ని తెలుగు కథకుల గిరిజన కథలు వెలికి తెచ్చాయి.

ఉపయుక్త గ్రంధాలు :

1. గుమ్మన్ ఎగ్లాస్‌పూర్ గ్రామస్థుడు- అటవీ ప్రాంత కథలు బి.ఎస్.రాములు (సం), విశాల సాహిత్య అకాడమీ, హైదరాబాద్.
2. తెలుగు కథ-దళిత, మైనారిటీ, గిరిజన, బహుజన జీవితం-సం.డా॥ పి.ఆర్. రాసాని.
3. బోయ. జంగయ్య సాహితీ దర్పణం- సం॥ నోముల సత్యనారాయణ సాహితీ మిత్రులు, (హైదరాబాద్) ప్రచురణ.
4. అడవిలో వెన్నెల- కె.వి.రమణారెడ్డి. కరీంనగర్ బుక్ ట్రస్ట్.

శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యం – కన్నప్ప పాత్ర చిత్రణ

– డా॥ జి. రవికుమార్, సహాయ ఆచార్యులు (సి), తెలుగు విభాగం, రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, ఒంగోలు.

పరిచయం :

శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యం ప్రబంధకర్త ధూర్జటి. ఇతడు శివభక్తుడు. అష్టదిగ్గజకవులలో ధూర్జటి అగ్ర గణ్యుడు. ఈయన శ్రీకాళహస్తీశ్వర శతకాన్ని కూడా రాశాడు. రెండు గ్రంథాల్లో శివ మహిమను తెలిపి శివునికే అంకితం చేశాడు. ధూర్జటి కవిత్వం గొప్పది. ఇతని కవితా ప్రాశస్త్యాన్ని శ్రీకృష్ణదేవరాయలు "స్తుతిమతియైన యాంధ్రకవి ధూర్జటి పల్కులకేల గల్గె నీ యతులిత మాధురీమహిమ' అని కొనియాడాడు. రాజాశ్రయంలో ఉండి కూడా రాజుల్ని నిరసించాడు.

రాజుల్మత్తులు వారిసేవ నరకప్రాయంబు (ప. 18), భవదుఃఖంబులు రాజకీటములనే బ్రార్థించినం బాయునే (ప. 44), రాజశ్రేణికి దాసుకై సిరులంగోరం జేరంగా సౌఖ్యమో (ప. 88)

అని పలురకాలుగా రాజుల దుష్టప్రవర్తనను, నిరంశకుత్వాన్ని విమర్శించాడు.

శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యం మొదటి ముద్రణ 1895లో జరిగింది. ఆ తర్వాత పలుముద్రణలకు నోచుకుంది. ఈ గ్రంథంలో నాలుగు ఆశ్వాసాలున్నాయి. 756 గద్యపద్యాలతో ప్రకాశిస్తున క్షేత్ర మాహాత్మ్య కావ్యం. ఈ రచనకు మూలకథ ఏదో ధూర్జటి తెలుపలేదు. కాని లింగ రాజుకవి రాసిన 'పెదకాళహస్తి మాహాత్మ్యం'లో 'సంస్కృతం లోని షడధ్యాయి' కథను ధూర్జటి తెలుగులో రచించినట్లు తెలిపారు. ఈ కావ్యంలో వశిష్ఠుడు, బ్రహ్మ, సాలెపురుగు, పాము, ఏనుగు, ఆటవికుడు తిన్నడు, బ్రాహ్మణుడు, నత్కీరుడు, వేశ్యాతనయులు, యాదవరాజు అనే పది మంది భక్తులు శివసాక్షాత్కారం, మోక్షాన్ని ఎలా పొందారో తెలిపాడు. ఈ పదిమంది భక్తుల కథలను మాయాజంగమస్వరూపుడైన శివుడే స్వయంగా యాదవరాజుకు చెప్పినట్లు ధూర్జటి కల్పన చేశాడు.

ప్రస్తుత పత్రసమర్పణలో 'తిన్నని కథ' శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యం తృతీయాశ్వాసంలో ఉంది. 226 గద్య పద్యాలతో చెంచువాని కథను గొప్పగా ధూర్జటి చిత్రించాడు. ఆటవికుడైన తిన్నని భక్తి నిరుపమానమైంది. శివునికై తనరెండు నేత్రాలను పెరికి ఇవ్వడానికి వెనుకాడని ధీరభక్తుడు తిన్నడు - తిన్నడే భక్తకన్నప్పగా మారిన విధానాన్నే గాక, చెంచు బిడ్డల బాల్యక్రీడలు, ఆట పాటలు, వారి ఆచార వ్యవహారాలు, జాతరలు, వేట మొదలైన అంశాలను పరిశీలించడమే ప్రధాన ఉద్దేశం.

వీరశైవమత వ్యాప్తికి కృషి చేసిన పాల్కురికి సోమన రచించిన బసవపురాణంలో 'ఉడుమూరికన్నప్ప' కథ ఉంది. ఇదే కథను పండితారాధ్య చరిత్రలో చాలాచోట్ల 'కన్నప్పదేవుడు' అని ప్రస్తావించాడు. తిన్నడు తన చెప్పుకాలిని శివలింగానికి తాకించిన విషయం, పుక్కిటపట్టి తెచ్చిన 'సువర్ణముఖి' జలాలతో శివుని అభిషేకించడం, 'పందిమాంసాన్ని' నైవేద్యంగా పెట్టి శివుణ్ణి అర్చించిన విషయాలు, పదేపదే ఇతరభక్తుల కథలు చెప్పే సందర్భంలోను ప్రస్తావించాడు. తమిళ, కన్నడ భాషల్లో ప్రచారంలో ఉన్న ఈ భక్తుని కథ గురించి కళ్ళకు కట్టినట్లు తెలిపే తెలుగు కావ్యం బసవపురాణం. పాల్కురికి సోమన తర్వాత మూడు శతాబ్దాలు అంటే 16వ శతాబ్దంలో శ్రీకాళహస్తి మహాత్మ్యంలో ధూర్జటి తిన్నని కథగా ఈ భక్తుని కథను మనకు అందించాడు. ఒక ఆటవిక భక్తులలో ఉత్తమ భక్తుడు కన్నప్ప.

తిన్నని జననం :

జంతు వేటను ప్రధానవృత్తి కలిగి ఉన్న అటవీ తెగల్లో బోయ ఒకటి. సంస్కృత మహాభారతంలో పేర్కొన్న కిరాతులు తెలుగు అనువాదంలో బోయవారిగా పేర్కొన్నారు. అందుకు కారణం "కిరాతుల్లో ఉన్న శక్తి సామర్థ్యాలు బోయవారిలో కూడా ఉండటమే. తమ ధైర్య

సాహసాలతో భూములను ఆక్రమించి అనుభవించేవారు కావున వీరు 'భోగికులని' అదే పేరు 'బోయ' అయ్యిందని కంభంపాటి సత్యనారాయణ గారు అభిప్రాయపడ్డారు.

తమిళ సంఘ సాహిత్యంలో శేషాచల ప్రాంతంలోని చిట్టడవుల్లో వడుగర్లు (తెలుగుప్రజలు) బోయలు వేట కుక్కల్ని వెంటబెట్టుకొని వేటాడేవారని, కొందరు ఏనుగుల్ని మచ్చిక చేసుకొనేవారని చెప్పబడింది. చిత్తూరు జిల్లా తిరుపతి తూర్పు మండలాలు సత్యవీడు, శ్రీకాళహస్తీ స్వర్ణముఖీతీరం వరకు చిట్టడవులు వ్యాపించి ఉన్నాయి. నెల్లూరు, కడప జిల్లా అంతటా చిట్టడవులు వ్యాపించి ఉన్నాయి. ఈ చిట్టడవులో బోయల ఆవాస ప్రాంతమని తెలుస్తుంది. ధూర్జటి శ్రీకాళహస్తీ మాహాత్మ్యంలో పొత్తపి నాడు తిన్నడి ఆటవిక రాజ్యమని పేర్కొన్నాడు. ఈ బోయ తిన్నడే. శివుడికి కన్నిచ్చి కన్నప్ప అయ్యాడు. ఇప్పటి కడప జిల్లా రాజంపేట తాలుకా కేంద్రంగా దక్షిణాన స్వర్ణముఖీ తీరం వరకు, పొత్తపినాడు విస్తరించి ఉండేది.

తిన్నడు పుట్టింది 'పొత్తపినాడు'లోని 'ఉడుమూరు' అనే బోయపల్లెలో. ఆ పల్లెకు రాజు నాథనాథుడు, ఇతని భార్య తండె. వీరిరువురి సంతానమే తిన్నడు.

ఉ. "పొత్తపి నాటిలో విపినభూమి గిరాతుల కాట పట్టులో
కోత్తరవన్యవస్తు 'వుడుమూ'రను పక్కణ మొప్పు, దద్రమో
దాత్తమహత్త్వ మద్భుతరసావహమూహయొనర్ప, మేదినీ
భృత్తనిర్ఝరాంబురుహబృంద మరంద సుగంధ వాహమై" పద్యం 3

ప్రకృతి రమణీయమైన సెలయేళ్ళు, జలపాతాలూ, మనోహరమైన కొండ చరియలూ ఉడుమూరులో ఉన్నాయి.

ఆటవికుల ప్రకృతి సౌందర్యాన్ని ధూర్జటి సూక్ష్మ పరిశీలన దృష్టితో పరిశీలించి -

సీ. 'స్తబ్ధరోమవిషాణల లబ్ధమౌక్తికముల, బాటింపుదురు రేగుపండ్ల పాటి

అనే పద్యంలో ముత్యాలు కూడా వారికి రేగు పండ్ల లాగా, గంధపు చెక్కలు వంటకట్టెలుగా, సంకు మదము, పునుస, జవ్వాది, కస్తూరి లాంటి సుగంధ ద్రవ్యాలను వారి ఇంటి మట్టికుండల్లో నింపుకొని ఉం టారంటూ చమత్కరించాడు.

చెంచుల వినోదాలు :

చెంచుబిడ్డల బాల్యక్రీడలు, ఆటపాటల్ని ఎంత మనోహరంగా ధూర్జటి వివరించాడు.

సీ. చిట్లపొట్లాకాయ, సిరిసింగణావత్తి, గుడుగుడు గుంచాలు, కుందెనగుడి
డాగిలిమ్రుచ్చులాటలు, గ్రచ్చకాయలు, వెన్నెల కుప్పలు, తన్నుబిల్ల
తూరనతుంకాలు, గీరనగింజలు, పిల్లదీపాలంకి, బిల్లగోడు
చిడుగుడువ్వలపోటీ, చెండు గట్టిన బోది, యల్లి యుప్పన బట్టె, లప్పళాలు

గీ. చిక్కనాబిల్ల, లోటిళ్ళు, చిందఱాది / యైన శైశవ క్రీడావిహార సరణి
జెంచు కొమరంతో నుద్ధించు కాడు / దిన్నడభినవ బాల్య సంపన్ను డగుచు (పద్యం 33)

వెన్నెలకుప్పలాట, తన్ను బిల్లాట దీన్నే తొక్కుడుబిల్లగా పిలుస్తారు. తూరనతంకాలు ఆట యిప్పటి వారికే తెలియదు. బిల్లగోడు, చెండాట, ఉప్పెనబట్టలు, చిక్కనా బిళ్ళ లాంటి ఎన్నో ఆటలు ఆ బోయవారు ఆడుకుంటారు. తన వయస్సు బాలురతో నేటి బాలబాలికలకు తెలియని క్రీడలు అనేకం ఆటలాడుకుంటూ తిన్నడు తన బాల్యాన్ని ఆనందంగా గడిపాడు.

శారీరక శ్రమను తగ్గించేవి ఆటలు. మనం ఈ పద్యం ద్వారా తెలుసుకోవాల్సింది ఆటలు బాల్యానికి ఎంతో అవసరం. చురుకుదనాన్ని పెంపొందించేవి ఆటపాటలు.

తిన్నడి భక్తి :

తిన్నడు పెరిగి పెద్దవాడై విలువిద్యలన్నీ నేర్చుకొని వారి కులవృత్తి వేటకు వెళ్ళి కనిపించిన ప్రతి జంతువును వేటాడడంలో మంచి ప్రదర్శనను కనబరచాడు. పరివారంతో వేటకు వెళ్ళి జంతువుల్ని వేటాడిన తిన్నడు అలసిపోయి ఒక చెట్టు క్రింద నిద్రించాడు. ఆ నిద్రలో తిన్ననికి జంగమ రూపంలో శివుడు కనిపించాడు.

కం. బాలక! యిచట శిలావట / మూలంబున గొండ దండ మొగలేటిదరిన్
శైలసుతాపతి, భక్తుల / పాలిటి పెన్నిధి వసించు, భక్తింగొలుమీ! (పద్యం : 56)

కేతకీ నది ఒడ్డున శివలింగాన్ని సేవించమని కోరి మాయమాయ్యాడు. తిన్నడు నిద్రలేచి కలలో చెప్పిన శివలింగం దగ్గరికి వెళ్ళి

గీ. "కాంచి, రోమాంచ కంచుకోదం చితాంగు / డగుచు, నానంద బాష్పంబులతిశయిల్ల
నమ్మహా లింగమునకు సాష్టాంగనతులు / సేసి, ముకుళిత హస్తుడై చేరబోయి"

అవిద్యతో సుఖాసక్తులైన పాణులకు తెలివినిచ్చేదిగా, ముక్తి మార్గాన్ని చూపేదిగా, మొదటి చూపులోనే 'భక్త తిన్ననికి' ఆ లింగ స్వరూపం అనిపించింది, కనిపించింది. తిన్నని శరీరం పులకించింది. ఆనందంతో కన్నీరుబికింది. సాష్టాంగపడ్డాడు. అతనిలో భక్తిభావం మేలుకొనింది. సాకారుడైన శివుడే, ప్రాణవంతంగా, తన ఆత్మీయ బంధువుగా అగుపించాడు తిన్నడికి. అందుకే అమాయకంగా, ఆత్మీయంగా శివునితో మాట్లాడడానికి ప్రయత్నించాడు. యోగక్షేమాలు తెలుసుకోవాలని స్వామితో

శా. "ఓసామి! యిటువంటి కొండదరిలో నొంటిం బులుల్ సింగముల్
గాసింబెట్టెటి కుట్ర నట్టడవిలో, గల్బువ్వి క్రీనీడ, నే యాసం గట్టితి వేటిగడ్డ నిలు? నీ వాకొన్నచో కూడు నీళ్ళే నుట్టంబులు దెచ్చి పెట్టెదరు? నీకిందేటికే లింగమా! (పద్యం : 65)

ఊళ్ళు, పట్టణాలూ లేనట్లు పోయిపోయి ఈ నట్ట డవిలో వచ్చి కూర్చున్నావెందుకు? ఇది పులులూ, సింహాలు ఉండే అరణ్యం. ఇక్కడ ఒంటరిగా ఉన్నావు. ఎంత అపాయమో తెలీదా? తలదాచుకోవడానికి నీకు ఇక్కడ ఇల్లుందా? ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, చలికి వణుకుతూ ఈ చెట్టు కింద ఎలా ఉంటున్నావు? నీకు ఆకలివేస్తే కూడు, నీళ్ళు నీకెవరిక్కడికి తెచ్చియిస్తారు? వద్దు నీవు ఉండే చోటు బాగోదు. నావెంటరా మా బోయపల్లె వెళ్దాం అని శివుని అమాయకత్వంతో, ధీనంగా ప్రార్థిస్తున్నాడు తిన్నడు.

శివునికి అరణ్యప్రాంతంలో దొరికే రకరకాల పండ్లను తెచ్చి యిస్తాను అని తిన్నడు ప్రాధేయపడుతున్నాడు. అడవుల్లో దొరికే ఫలజాతుల్ని ధూర్జటి గొప్పగా ఈ పద్యంలో తెలిపాడు.

సీ. నేరేడు పండులు నెలయూటిపండులు, గొండ మామిడి పండ్లు దొండపండ్లు
బాలపండులు, నెమ్మిపండులు బరివంక, పండులు జిటిముటిపండ్లు గలివె
పండులు దొడివెందపండ్లు దుమ్మికిపండ్లు, జాన పండులు గంగరేను పండ్లు
వెలగ పండులు పుల్ల వెల్లగ పండులు మోవి, పండ్లు నంకెన పండ్లు బలుసు పండ్లు

తే. బీర పండ్లును బిచ్చకబీరపండ్లు / గొమ్మిపండ్లీత పండ్లును గొంజి పండ్లు
మేడిపండ్లును మొదలుగా గూడిమాడి / చెంచెతలు దెత్తు విచ్చేయుమయ్య (పద్యం : 69)

అరణ్యంలో పండ్లకు కొదువలేదు. ధూర్జటి చెప్పిన పండ్లు నేటికాలంలో చాలా మందికి తెలియవు. నేరేడు పండ్లు, నెలయూటి, కొండమామిడి, దొండ, పాల, నెమ్మి, బరివెంక, చిటిముటి, కలివె, తుమ్మికి, జాము, గంగరేను, వెలగ, పుల్లవెలగ, మోవి, అరికెన, బలుసు, బీర, పిచ్చుకబీర, కొమ్మి, గొంచి, అత్తిపండ్లు మొదలైన ఎన్నో రకాల పండ్లు మా చెంచెతలు కలిసి మెలిసి అడవికి పోయి కోసి తెస్తారు. అవన్నీ నీకోసం తెప్పించియిస్తాను.

మా పల్లెకు రమ్మని ప్రేమతో, నిండు హృదయంతో ఆహ్వానం పలుకుతున్నాడు తిన్నడు.

శివున్ని తిన్నడు ఎంత ప్రాధేయపడినా శివుడు ఉలక లేదు. పలకలేదు. కాని తిన్నడు మాత్రం శివలింగాన్ని వదలి వెళ్ళకుండా భక్తి మైకంలోనే పడి ఉన్నాడు. ఆ సమయంలో చెంచుబాలురు తిన్నడు కనిపించలేదని వెతుక్కుంటూ వచ్చారు. తిన్నడిని పలకరించారు. ఇంకటికి రమ్మన్నారు. అమ్మనాన్నలు ఎదురు చూస్తూ ఉంటారు. నీకేమయ్యిందరా వెళ్దాం అంటూ ప్రాధేయపడినా ఫలితం లేకపోయింది. తిన్నని ధ్యాస, శ్వాస అంతా శివునిమీదే ఉంది. పరిపూర్ణ మనస్కుడితో అతని హృదయం శివనామస్మరణతో నిండిపోయింది. తర్వాత కొద్ది సేపటికి తేరుకొని చెంచు సావాసగాళ్లతో తిన్నడు...

శా. నాకుం జుట్టము తల్లిదండ్రులు జెలు ల్నాథుండు నీదైవమే
మీకిచ్చే బనిలేదు కస్తిపడగా మీపల్లెకుం బొండు; కా
రాకూరంబులు చేసినం, గదలినేరా, నిచ్చటం బ్రాణముల్
పోకార్తుందుది నాదు వేలుపునకై బొరకన్నిజం బింతయున్ (పద్యం : 82)

ఈ శివలింగంతో నా ప్రాణం ముడిపడి ఉంది. నేను చచ్చేదాకా నా బ్రతుకు ఈ లింగంతోనే! మీరెందుకు చింతిస్తారు? మీ పల్లెకు మీరు వెళ్ళండి. నావెంట ఈ స్వామివస్తే నేనూ మనపల్లెకు వస్తాను. లేకపోతే ఈయనతో ఉండిపోతాను. నాకీదేవుడే బంధువు. తల్లీ తండ్రి స్నేహితులూ, ప్రభువూ మీరు తొందరపెడితే అసలురాను అని చెప్పి మళ్ళీ శివుని ధ్యానంలో మునిగిపోయాడు. ఈతని భక్తితత్వం ఎంతగొప్పదో ధూర్జటి మనకళ్ళకు కట్టినట్లు చిత్రించాడు.

బోయవాడు తిన్నడు శివునితో మాట్లాడిన మాటల్లో అతని భక్తితోపాటు కరుణ రసాన్ని ధూర్జటి చక్కగా పోషించాడు. ఎవరితోనైనా నీకు తగాధ ఉంటే నేను మధ్యస్థునిగా ఉండి ఇద్దరి మధ్య సంధి కుదుర్చు తానన్నాడు తిన్నడు. కీకారణ్యంలో ఆకలిదప్పికలతో ఉన్నాడని, అందుకే నీరసం వచ్చిన దేవుడు తనతో మాట్లాడ లేకపోతున్నాడని తలచిన తిన్నడు, శివునికి వెంటనే మంచి జంతుమాంసం తెచ్చి పెట్టాలని అడవికి బయలుదేరాడు. మాంసపు పుష్టి గల జంతువులు కొన్ని మచ్చిక అయ్యి, అవే తిన్నని వద్దకు వచ్చాయి. అతని చేతికి చిక్కాయి. తిన్నడు ఆనందపడ్డాడు. మాంసాన్ని కాల్చి రుచిచూపి మేలురకం మాంసపు ముక్కల్ని దొన్నెలో తెచ్చి స్వామిని తినమన్నాడు. "నీవారగింపకుండిన, జీవనమేమిటికి నాకు? అని శివుడి తినమని నీవు స్వీకరించకుంటే నా ప్రాణాలు వదలుతానన్నాడు తిన్నడు. బోయవాని భక్తి ఎంత గొప్పదో. శివలింగంపై ఉన్న పదార్థాలేవో, వాటి నంతా తన చెప్పు కాలితోనే పక్కకు నెట్టి శుభ్రం చేశాడు. నోటి నుండి పట్టి తెచ్చిన పవిత్ర నదీజలాన్ని తన పుక్కిటి నుండి నేరుగా వెళ్లి శివలింగం మీద పడేటట్లు ఊశాడు.

తిన్నడు పూజిస్తున్న పవిత్ర శివలింగేశ్వరుణ్ణే మరొక బ్రాహ్మణ భక్తుడూ ప్రతిరోజు సేవించేవాడు. అతని పూజను తిన్నడు చెప్పు కాలితో చెరపడం తన పూజను తాను చేసుకొనేవాడు. తిన్నడు మాంసం ముక్కల్ని స్వామికి తినిపించి, మిగిలినవి తాను ఎంగిలాకుల్ని అక్కడే పారాసేవాడు. ఈ పరిసరప్రాంతమంతా దుర్వాసనతో నిండేది. ఇలా నిత్యం జరగడం చూపిన బ్రాహ్మణుడికి కోపం వచ్చింది. బాధ కలిగి

కం. "దేవా! యీకసుమూలము / దేవెడు కేల్దొయినీదు దేహం బంటం
గావెఱవయ్యెడు, నెంగిలి / కీవెట్లోర్చితివి? పార్వతీశ్వరా చెపుమా!

అని శివుణ్ణి ప్రశ్నించాడు. దానికి శివుడు బ్రాహ్మణునితో....

కం. 'శవ శవపడ నేటికి మది / శివగోచర! నీకు? నన్ను జెంచొకడు శ్రుతి
వ్యవహారేతరమతమున / దవిలి మహాభక్తి గొలువ, దయపుట్టుటయున్ (పద్య : 103)

నన్నొక చెంచుభక్తుడు వేదేతర పద్ధతితో పూజిస్తున్నాడు. అతని భక్తి నిర్మలమైంది. అమాయకత్వం, దృఢ సంకల్పంతో కూడింది. కాబట్టే అతణ్ణి కనికరించాను. అతని పూజ ఎలాగున్నా స్వీకరిస్తున్నాను. తిన్నడు అస మాన్యుడైన భక్తుడే. కొంతసేపు నీవు నా వెనుక దాగి ఉండు. కొంచెం సేపట్లో అతడు వస్తాడు. అతని భక్తి విశ్వాసాలు ఎంత గాఢమైనవో నీవే కళ్లార చూడగలవు'' అని బ్రాహ్మణ భక్తునికి తెలిపాడు. చెంచుభక్తి తిన్నని శివుడు నోరార కీర్తించాడు.

తిన్నడు ఎప్పటిలాగే చెప్పు కాలితో బ్రాహ్మణుని పూజ తొలగించి, శివుని కోసం తెచ్చిన మాంసాన్ని నైవేద్యంగా ఉంచాడు. కానీ శివుడు మాత్రం తినలేదు. శివుని కుడి కంటి నుండి నీరు కారుతోంది. సన్నగా కారుతున్న కన్నీరు కొద్దిసేపటికి పెద్దధారగా మారింది. శివుని ఏమయిందో తిన్నడికి అర్థం కాలేదు.

తిన్నడి భక్తిని శివుడు పరీక్షించడం :

శివుడు కన్నప్ప భక్తిని స్వయంగా పరీక్షించడానికి కంటినీరు క్షణక్షణానికి అధికమౌతున్నది. ఇక్కడ ధూర్జటి కంటి జబ్బుకు చేయాల్సిన చికిత్సా విధానాన్ని అంతా సూక్ష్మంగా తిన్నడి ద్వారా తెలిపాడు.

సీ. కోకపాట్లం బావిగొననూది యొత్తుచు, గషణోష్ణకరభ
భాగమును గాచి
నెత్తితంగేడాకుమెత్తి, రేచకినిమ్మ, పంటినీరున
నూఱిపట్టువెట్టి
తెల్లదింటెన పువ్వుదెచ్చి తద్రసమిడి, కలివెపువ్వులు
గోసి నలచివిడిచి
పేరిన నెయివెట్టి, పెరుగు వత్తులు వైచి, చను
బాలతో రాచి, సంకుచమిరి

గీ. విన్న మందులు, తాసరి కన్నమందు / లడిగి
తెచ్చిన మందులు, నడవిమందు
లెన్ని చేసిన మానక, యిందుమౌళి / కన్న తొడిబడి
నెత్తురు గాఱుటయును (పద్యం : 110)

నోటితో ఆవిరిపట్టిన వెచ్చని వస్త్రాన్ని కంటిపై పెట్టి ముందే కాపడం పెట్టాడు. అరచేతులు వేడిపుట్టే దాకా రుద్ది వెచ్చని కుడిచేతి భాగాన్ని కంటిపై ఒత్తాడు. తంగేడాకు తెచ్చి స్వామి తలమీద మెత్తాడు. రేచనిమ్మ ఆకులు మెత్తగా నమిలి కంటిపై పట్టువేశాడు. తెల్ల దింటెన పూపురసం కంట్లో విడిచాడు. పేరిన నేతిని వేశాడు. పెరుగువత్తులు పెట్టాడు. చనుబాలతో శంఖాన్ని చాది, ఆ గంధాన్ని పూశాడు. ఇలా తనకు తెలిసిన వైద్యం, ఇతరులు చెప్పగా విని ఉన్న వైద్యంతో శివునికి చికిత్స చేశాడు. లాభం లేకపోయింది. శివుడి కంటి నుండి నీటికి బదులు కంటి నుండి నెత్తురు కారడం ఆరంభమైంది.

ఈ సమయంలో తిన్నడు స్వామికి 'కంటిహాని' కలిగింది. ఈ కంటికి బదులు మరొక కన్ను పెడితే సరిపోతుంది కదా అనుకున్నాడు. కంటికి కన్నే సరైన మందు అనుకొని

ఉ. ప్రాణము వోవునో, తనువు భంగము నొందునొ నాక, తూణికా
బాణము జిఱ్ఱునందిగిచి, భల్లముఖాగ్రముర క్త పద్మ దృ
క్కోణము జేర్చిక్రుచ్చి, యొకగ్రుడ్డు వడిం బెకలించి, శోణిత
ద్రోణికయైన దైవతశిరోమణి కంట నమర్చె నంతటన్
(పద్యం : 115)

తన ప్రాణంపోయినా పర్వాలేదు అని తిన్నడు బాణపు కొసను తనకంటి కొసన పెట్టి క్షణంలో కనుగుడ్డును పెకలించి స్వామి కుడికంటిపై తన కనుగ్రుడ్డు పెట్టాడు. శివుని కన్ను బాగయ్యింది. ఆకనుగ్రుడ్డు సహజంగా అతుక్కుపోయింది. శివుడు 'భక్తుని పరీక్ష కోసం చేసిన మాయ 'అదైతే, భక్తుడు అమాయకత్వంతో చేసిన చికిత్స ఇది. కన్నప్ప ఆనందానికి అవధుల్లేవు. కాని కొద్దిసేపటికే స్వామి రెండో కన్ను నుండి నీరుకారడం మొదలైంది. ఆ అమాయక తిన్నడు ఇది స్వామి పరీక్షలే. నాకు ఎలాగూ నా రెండోకన్ను ఉంది. వెంటనే పెరికి పెట్టేస్తాను. కానీ శివుడికి మూడోకన్ను కూడా ఉంది. దానికేమైనా అయితే ఎలా? అంటూ

కం. లాలాట లోచనంబున / గీలాలముదొరగెనేని, కేవల భక్తిన్
గీలించి, మనోదృష్టికి / మూలంబగు నాదు ప్రాణములు నీకిత్తున్" (117)

తన ఎడమకంటిని పెకలిస్తుండగా శివుడు ప్రత్యక్షమై బోయని చేయిపట్టి ఆపాడు. ఈ సన్నివేశాన్నంతా శివుని వెనుక ఉన్న బ్రాహ్మణుడు ఆసక్తిగా చూశాడు. అనాగరిక భక్తుడు తనకు బద్ధశత్రువు అన్న భావన పోయింది.

తిన్నడు కన్నప్పగా మారడం :

కన్నప్ప కళ్ళలో ఆనంద బాష్పధారలు ఆరంభం కాగా, శివుని కళ్ళలో 'మాయ' కన్నీటిధారలు మాయమై పోయాయి. ఆ తర్వాత ఆకాశంలో దేవతలూ, దానవులు, ఋషులు, మునులు వచ్చారు. దుందుభులు మ్రోగాయి. పూలవాన కురిసింది. వేటగానిగా మొదలైన తిన్నని జీవితం మహాభక్తుడైన కన్నప్పగా చరిత్రలో నిలిచిపోయింది.

ముగింపు :

ధూర్జటి కవిత్వానికి, ధూర్జటి తత్వానికి ప్రాణం తిన్నని కథ. తిన్నడు ఆచార వ్యవహారాలు తెలియనివాడు. ఆట వికుడు. వేదాల పరిచయం లేదు. సామాన్యభక్తుడు. సంస్కారాలు తెలియవు. నిరాడంబర భక్తికి చిత్తశుద్ధి సోపానమని తిన్నని కథ ద్వారా నేటి సమాజం తెలుసు కోవాలి. 'శివా' అనే రెండక్షరాల ఉచ్చరణ మోక్షాన్ని కలిగి స్తుందనే సందేశం తిన్నని కథనే ఆదర్శంగా తీసుకోవాలి. మహాపాతకాలను పోగొట్టి ముక్తిని ప్రసాదించే కరుణా మయుడు ఈశ్వరుడు.

ఆధార గ్రంథాలు :

1. శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యం - ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ప్రచురణ
2. ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి - కంభంపాటి సత్యనారాయణ
3. బసవపురాణం - పాల్కురికి సోమన
4. శ్రీకాళహస్తీశ్వర శతకం - ధూర్జటి
5. తెలుగు సాహిత్య సమీక్ష - జి. నాగయ్య

ఎరుకల కొరవ, కొరిచ (కొరమ) భాషలపై జరిగిన కృషి – ఒక సమీక్ష

– డా. గుజ్జల శ్రీరాములు, పోస్ట్ డాక్టోరల్ ఫెలో, తెలుగు మరియు తులనాత్మక సాహిత్యశాఖ,
శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురము.

ఆంధ్రదేశంలోని ఎరుకల (ఎఱుకల) జాతివారికి తమిళదేశంలో కొరవలని, కర్ణాటకంలోని కొరిచ (కొరమ) లని పేరు. తమిళ, కర్నాటక దేశాల్లోని కొరవల్లో, కొరమల్లో కూడా తెలుగు పదాలు అని చెప్పగదగ్గవి కొన్ని కనిపిస్తున్నాయి. తెలుగునాట ఎరుకల్లో అధికశాతం వారికి ఎరుకల భాషే రాదు. ఒకప్పుడు ఎరుకల భాష వచ్చినా, వీరు ఎన్ని శతాబ్దాల క్రితం మాతృభాషను ఆంధ్రదేశంలో పోగొట్టుకున్నారో తెలియదు. అయినా వీరిలో కొందరికైనా 'కుర్రుభాష' వస్తుంది. వీరి మూలాన్ని అన్వేషించినవారు. వీరు కొండజాతి జనులని కుర్ - అనే మాటకు ద్రావిడ భాషల్లో కొండ అని అర్థం. కురుఖ్ అనే మాటలో కూడా ఇదే దాగివుంది. కొంగునాడు (ఇప్పటి పెరియార్ - కోయంబత్తూర్ - ధర్మపురిల నుండి మైసూర్ ప్రాంతం దాకా) వీరి జన్మస్థలమని అభిప్రాయపడుతున్నారు. (చూ. డా. రామయ్య 1979) ఈ ప్రాంతంలో ఇప్పటికీ తెలుగు తమిళం - కన్నడం భాషలు మూడు కలిపి మాట్లాడే వారున్నారు.

ఎరుకలను గురించిన పూర్వ పరిశోధనలు తెలుగులో చేసినవి ఎక్కువగా లేవు. అలాంటి సందర్భంలో గిరిజన జాతులపై తమకున్న ప్రత్యేకమైన అభిమానంతో ఆచార్య హెచ్.ఎస్. బ్రహ్మానందగారు నాకు పరిశోధన పద్ధతులు నేర్పి ఆచార్య ఎం. సంపత్‌కుమార్‌గారితో పరిచయం కలిగించారు. ఆచార్య సంపత్‌కుమార్‌గారు మద్రాస్ విశ్వవిద్యాలయంలో ఎరుకల బంధువాచకాలపై ఎం.ఫిల్. (1986) చేసి, 1989లో పీ.హెచ్.డీ కీ.శే. చల్లా రాధాకృష్ణ శర్మగారి పర్యవేక్షణలో ఎరుకల భాషపై పూర్తి చేశారు. మనకు తెలిసినంత వరకు ఈ రంగంలో తొలి పరిశోధన వీరిదే. వారి ద్వారా పూర్వ పరిశోధనలను గురించి కొంత వివరణ తెలిసింది. క్రమంగా ఆంధ్రదేశంలోని ఎరుకల వారిని గురించి పరిశోధన చేయడం జరిగింది. వీరి పరిశోధనల ద్వారా నేను ఇక్కడ రాయలసీమ జిల్లాలోని బందలాయిలు, బిడారులు, కుచ్చేళ్ళు మొదలైన కుటుంబాలకు చెందిన ఎరుకలవారి ద్వారా భాషా పదజాలాన్ని సేకరించి పూర్వ పరిశోధనలతో సేకరణ పోల్చి చూసి, ఈ పరిశోధన పత్రాన్ని ప్రచురించడం జరిగింది. ఫలితంగా ఎరుకల భాష విశిష్టమైన భాష అని, వారి సంస్కృతే వారికి తార్కాణం అని తెలిసింది.

కొరమ/కొరచ జాతిపై జరిగిన కృషి :

కొరమ లేదా కొరిచ అనే తెగవారు కర్నాటక రాష్ట్రంలో నివసిస్తున్నారు. వీరిని గురించి డా. బి.పి. రామయ్యగారు కర్నాటకలోని తిప్పటూరు సమీపంలో బిదిరేగుడి అనే గ్రామంలో కొరమ జాతిలో జన్మించి ఉన్నత విద్యావంతులై ఉత్తర కర్నాటక జిల్లాలోని 'కుమట' అనే ఊరిలో కన్నడ భాషాచార్యులుగా పనిచేస్తున్నారు. కొరచవాడైన రామయ్యగారు ఇలా కన్నడ అధ్యాపకులు కావడం రాష్ట్రంలోనే ఒక గొప్ప విషయమని వారి పరిశోధన పర్యవేక్షకులు ఆచార్య ఎస్.ఎమ్. వృషభేంద్రస్వామి చెబుతూ అనేక విశేషాలు తెలిపారు.

రామయ్యగారి తల్లి సావిత్రమ్మ కొరవంజి వృత్తిలో వుండేదట. ఆమె రామయ్యను జోలిలో వేసుకొని పల్లెలు తిరుగుతూ కొరవంజి పాటలు పాడేదట. ఆ జాతిలో పుట్టడం చేతనే కొరమ జాతికి సంబంధించిన భాష, సంస్కృతి, సాహిత్యాలను తమ పీహెచ్‌డీ సిద్ధాంత గ్రంథంలో ఆయన వివరించారు. వీరి సిద్ధాంత గ్రంథం పేరు "దక్షిణ కర్నాటకద కొరమరు ఒందు సాంస్కృతిక అధ్యయన" (1979) దీనికే డాక్టరేట్ లభించింది.

కొరమ తెగ గురించి చెబుతూ అనాది కాలం నుండి ఏదో ఒక కారణం చేత భారతీయ జనసముదాయాల్లో జనాలతో కలసిమెలసి బ్రతుకుతూ వచ్చిన కొరమజాతి వారు కర్నాటకలో కూడా వున్నారు. మధ్యకాలంలో వీరిని దొంగలుగా, నేరస్థులుగా సమాజం గుర్తించినా ప్రాచీన కాలం నుంచి వీరిది ఒక ధార్మిక సమాజం అని చెబుతూ ఇలా అంటున్నారు. వెనుకటి కాలంలో అడవుల్లో, కొండల్లో వుంటూ పశువుల్ని మేపుకొంటూ దీనికితోడు వెదురు బుట్టలు తయారు చేస్తూ, సోదె చెప్తూ, తాయత్తులు కడుతూ, పచ్చబొట్లు పొడుస్తూ ఈ తెగ వారు సమీపం లోని హైందవ జనజీవనంతో సంబంధం కలిగి వున్నారు. ధర్మదృష్టి కలిగిన హైందవ జనులు వీరి వృత్తుల్ని పోషిస్తూ వచ్చారు. వీళ్ళు తయారు చేసిన తట్టలు, బుట్టలు, గ్రామాలలో ముఖ్యమైన వస్తువులు అయ్యాయి. వీరి సోదె ప్రజలకు సంతోషాన్ని, దు:ఖాన్ని, ఉపశమనమూ కలిగించడం చేత జానపదులు వీరిని గౌరవిస్తూ వచ్చారు. కన్నడ జానపద సాహిత్యంలో కొరవంజికి దక్కిన స్థానం కొరవంజి కళాత్మక జీవిత వైభవాన్నే మనముందు నిలుపు తుంది.

డా. హెచ్.ఆర్. స్వామి కొరచ భాషా కృషి :

కొరచజాతివారిని గురించి ఇటీవల వచ్చిన మరొక పరిశోధన హెచ్.ఆర్. స్వామిగారిది. 'కర్నాటకద కొరచ జనాంగ ఒందు అధ్యయన' (2008). హెచ్.ఎల్.కె. నంజుండయ్య, అనంతకృష్ణయ్యర్ మొదలైన పూర్వ పరి శోధకులు లాగానే హెచ్.ఆర్.స్వామి కూడా కొరచ వారు కర్నాటకలో కనిపించే కొరమజాతి కన్నా భిన్నులు అన్న అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. బి.పి. రామయ్యగారు కూడా ఊరి కొరవల్ని 'ఊర్గువలరు' అని కొరిచల్ని 'బ్యార గ్యాయిగలు' పిలుస్తారని గుర్తించారు. ఆచార వ్యవహా రాల్లో కూడా తేడాలున్నాయని వీరి అభిప్రాయం. 'గెజిటి యర్స్'లో కూడా వాళ్ళను వేరుగానే గుర్తించారని చెబు తున్నారు.

కొరచ శబ్దానికి వ్యుత్పత్తి గురించి చెబుతూ 'కుర్రు' శబ్దానికి 'పర్వతం' అని 'థర్‌స్టన్' 'ఓపర్ట్' మొదలైనవారి అభిప్రాయాలను గుర్తిస్తూ తమిళంలో 'కురుంజి' మళ యాలం 'కురుచ్చి' అనే పదాలను చర్చించి వీటికి కూడా కొండ మనుషులు అనే అర్థం వుందని చెబుతూ తెలుగులో కొరచవాడు, ఎరుకలవాడు, అనే మాటలకు కూడా 'కొండమనుషులే' అని అర్థం వివరిస్తూ సుప్రసిద్ధ పరిశోధకులు ఆచార్య సింహాద్రిగారు "ఎక్స్- క్రిమినల్ ట్రైబ్స్" అనే గ్రంథం(1979)లో పుట 88లో చెప్పిన ఒక వివరణను ఇచ్చారు.

ఎరుకల శబ్ద వ్యుత్పత్తి :

ఎరుకల అనే శబ్దానికి 'సోదె' చెప్పడం వల్ల ఈ పేరు ఏర్పడిందని, ఎరుక అంటే జ్ఞానమని చెప్పడం ఉంది. అందుకే 'ఎఱుక' అనే రేఫంతో రాయటం వుంది. కాని ఇంకొక అర్థాన్ని చెప్పిన పండితులూ ఉన్నారు. డా.రామయ్యగారు విల్సన్ అభిప్రాయంగా క్రింది వాక్యాలు ఉదహరించారు. ఈ విషయాన్ని థర్‌స్టన్ కూడా (పుట.441) ఉదహరించాడు.

"it has been suggested, for example, that Yeru is connected with erra, meaning red. In Telugu Yerukalavandalu would mean fortune tellers" (B.P. Ramaiah, P-15)

ఎర్రగా ఉంటారు కాబట్టి ఎర్రటివారు అనే అర్థంలో 'ఎర-కల్' (కళ్) అయి వుండవచ్చని ఇంకొక రకంగా వ్యుత్పత్తి చెప్పవచ్చు. ఇక్కడ కొరమ మాండలికంలో కూడా ఎర్ర అంటే ఎరుపు అనే అర్థం ఉందని రామయ్యగారు గుర్తించే వున్నారు. దీనినిబట్టి తమిళంలో, కన్నడంలో 'కెంపు' అనే ధాతువుకు సంబంధించిన రూపాలే వున్నాయి. అంటే ఎర్ర అనే శబ్దం తెలుగులో ఎరుకల, కొరమ భాషల్లో మాత్రమే కనిపించడం అంత సులభంగా తీసి పారవేయదగ్గ విషయం కాదు.

నేను గుర్తించినంత వరకు ఎరుకల వారిలో నల్లటి వారు తక్కువ. దీనినిబట్టి ఎర్రదనం కూడా ఎరుకల అనే ఒక పేరు రావడానికి ఒక కారణం అయి వుండవచ్చు.

ఇలా ఎరుకల భాషా సంస్కృతులను అవగాహన చేసుకోవడంలో కొరమ, కొరిచ జాతి అధ్యయనం మనకు చాలా సహాయపడుతుందని గుర్తించడానికై ఇంత విస్తారంగా చర్చించాను. భవిష్యత్తులో ఈ మూడు మాండలికాలను సమగ్రంగా, తులనాత్మక అధ్యయనం చేస్తే ఈ భాషా మూలాన్ని పునర్నిర్మాణం చేయవచ్చు. అందుకే కొరవ, కొరమ మాండలికాల్లో కూడా తెలుగు పదాలు కనిపిస్తాయి.

కొరవల్లో కనిపించే అడ్డపేర్లు :

ఎర్రతలకాయుడు - ఎర్రతల కలవాడు (కానిస్టేబుల్)

రెండుకాల్ నాయుడు - రెండు కాళ్ళుండే నాయుడు (కోడి)

పై రూపాలలో ఎర్రతల, రెండుకాళ్ళు, నాయుడు నిస్సందేహంగా తెలుగు రూపాలే.

ఇక కొరమ మాండలిక రూపాలు చూద్దాం.

తెలుగు	కన్నడ	తమిళం	కొరమ
ముద్ద	ముద్దె	కళి	కళి
నిప్పు	బెంకి	నెరిప్పు	నెర్పు
పాము	హావు	పాంబు	పాము
చెట్టు	గిడ	సెడి	సెడి
పాలు	హాలు	పాలు	పాలు

పై రూపాలలో కొరమ రూపాలు కొన్ని తమిళానికి, కొన్ని తెలుగుకు దగ్గరగా వుండటం గమనిస్తాం. కన్నడ దేశంలో వాడే కొరమ భాషలో ఇంకా కొన్ని విలక్షణమైన తెలుగు రూపాలు ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోంది.

కన్నడ	తెలుగు	కొరమ
ఎమ్మె	ఎనుము	ఎలిమి
బారిగె	పొరక	పరికి
మొల	కుందేలు	కేందలు
కై	చేతులు	కయ్యంగ
చెన్ను	వెన్నెముక	ఎన్నుముకి
నరి	నక్క	నక్కి
సారు	పప్పుకట్టు (చారు)	కొట్టు

'కొరమ భాషలో తెలుగు రూపాలు వుండటమే కాకుండా కొన్ని ధ్వని పరిణామాలు కూడా తెలుగులో కనిపిస్తాయి.

ణ- న గా మారటం ఇలాంటి ఒక రూపం.

త, మ, క - కణ్ణు తె - కణ్ణు కొరమ - కన్ను

ఇలాంటి రూపమే తణ్ణి - తెన్ని

తెలుగులో 'తణ్ణి'కి బదులు నీరు అనే మాట వుంది. (తంపు - అనే రూపంలోని ధాతువు ఇదే) కాని ణ - నగా మారటం తెలుగులో విలక్షణంగా కనిపించే ధ్వని పరిణామం.

కొరమ, కొరిచ మాండలికాల్లో కన్నడ భాషతో పోల్చి డా. స్వామి (2008) కొన్ని రూపాలిచ్చారు. వీటిలో కూడా తెలుగుదనం అధికంగా కనిపిస్తుంది.

కొరవ	ఎరుకల	కన్నడ	తెలుగు
పులి	పాట్టు	హులి	పులుసు
చాట	సోటి	మర	చాట
ఎలాకు	ఏలి	ఎలె	ఆకు
వక్కోడు	పాకు	అడికె	వక్క
కుండ	సెటి	మడికె	కుండ
క్వాక	సీరి	సీరె	కోక (చీర)
కాసు	పాన్ను	హణ	లెక్క (డబ్బు)

ఈ రూపాలను గమనిస్తే తెలుగు భాషతో ఈ తెగ వారికి ప్రాక్చారిత్రక సంబంధం ఉందని తెలుస్తోంది. పురాణాలలో, కావ్యాలలో ఎరుకల పాత్ర చాలాచోట్ల కనిపిస్తుండటం 'కొరవంజి' పేరుతో యక్షగాన నృత్యాలకు మూలమైన ఆటవికుల చిందు మూలరూపం ఉందని కీ॥శే॥ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు పేర్కొనడం గమనిస్తే ఎరుకలవారు మౌళికంగా తెలుగునాటితో బంధం కలవారే అని లేకపోతే తెలుగు పదాలు తమిళనాడు, కర్నాటకల్లో కనిపించే వీరిలో కనిపించడం సాధ్యంకాని విషయం అని నిర్ధారించగలం.

ఇలా ద్విభాషా, త్రిభాషా ప్రాంతాలలో కనిపించే ఎరు

కల భాషను గమనించడం ద్వారా పూర్వ యుగాలను గురించి గుర్తించగలమని చెప్పటమే ఈ భాషయొక్క ప్రయోజనం. వీటిపై పరిశోధన చేస్తేనే ఎరుకల భాష 'ప్రాక్' చరిత్రను మనము పునర్నిర్మించుకోగలం.

సంప్రదించిన రచనలు :

1. గోనానాయక్ యం. - సుగాలి సంస్కృతి భాషా సాహిత్యాలు (పీహెచ్‌డీ సిద్ధాం గ్రంథం, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురము (1993).
2. బ్రహ్మానంద హెచ్.ఎస్. - శిష్టసాహిత్యంలో జానపద ధోరణులు, అక్షర ప్రసార ప్రచురణలు, అనంతపురము (1989).
3. భాస్కరరావు గొడవర్తి - ''కురవంజి'' (ఎల్లోరా వ్యాసం) తెలుగుఅకాడమీ, హైదరాబాదు (2003).
4. రామయ్య బి.పి. - దక్షిణ కర్నాటక థ కొరమరు ఒందు సాంస్కృతిక అధ్యయన (కన్నడం) మానస ప్రకాశన కుమట (2002).
5. శ్రీరాములు గుజ్జల - ''ఎరుకలవారి మాతృభాష ఏది?'' గిరిజన భాషా సాహిత్యాల అధ్యయనం, (యూజీసీసెమినార్, ఉస్మానియావిశ్వవిద్యాలయం, హైదరాబాదు (2008).
6. Abbe.J.A. Dubois – "Hindu Manners, customs and ceremonies" Asian educational services, New Delhi (1986).
7. Sampath Kumar. M – "Descriptive grammer of Yerukala" Ph.D thesis, Madhurai Kamaraju university, Madurai (1989).
8. Thurston E.H – "Caste and tribes of South India" Vol-III, government Press, Madras(1909).

ఏకాగ్రత, శిల్పచతురత, గురుదక్షిణలకు ఆదర్శం – ఏకలవ్యుడు

– డా॥. గుండ్లూరు వెంకట రమణ, తెలుగు ఉపన్యాసకులు, అక్కినేని నాగేశ్వరరావు కళాశాల, గుడివాడ, కృష్ణ జిల్లా.

ఏకలవ్యుడు హిరణ్యధన్వుడనే ఎరుకల రాజు కుమారుడు. ఈయన తండ్రి ఎరుక వంశాన్ని పరిపాలించే రాజు. వంశమేదైనా కానివ్వండి ఓ రకంగా చెప్పాలంటే ఈయన కూడా ఒక రాజ కుమారుడే. సకల విద్యల్ని నేర్చుకోవాలనే ఆశ, ఆసక్తి చిన్నతనం నుండి ఏకలవ్యునిలో కనిపిస్తాయి. మొట్టమొదటిగా ఏకలవ్యుడు మహాభారతం ఆదిపర్వం, పంచమాశ్వాసంలో మనకు కన్పిస్తాడు.

మహాభారతంలో కనిపించే ఏకలవ్యుడు ఏకాగ్రత, ఏకత్వం, నైపుణ్యం, శిల్పచాతుర్యం, మనోనిబ్బరం, స్థిరత్వం, గురుభక్తి అనే అద్భుతమైన లక్షణాలు కల వాడుగా మనకు దర్శనమిస్తాడు. ఏకలవ్యునిలో ఉండే లక్షణాలను, మిగిలిన గురువులో ఉండే పక్షపాతాన్ని, రాజకుమారుల్లో ఉండే మత్సరాన్ని తెలపడం, తద్వారా అంతిమ విజయం ఎవరిదో చెప్పడమే ఈ వ్యాసం ముఖ్యోద్దేశం.

ఏకలవ్యుని ప్రయత్నం :

ఏకలవ్యునికి విలువిద్యను నేర్చుకోవడం అంటే ఎంతో ఇష్టం. విద్య పట్ల తనకున్న ఆసక్తి ఇంతా అంతా కాదు కాబట్టి ఆ విద్యను నేర్పే గురువును గురించి తెలుసు కుంటాడు. ఆయనే గ్రోణాచార్యుడు. నేరుగా అతని యొద్దకు వెళ్ళి తనకూ విలువిద్యను నేర్పుమని ద్రోణున్ని ప్రాధేయపడి అడుక్కుంటాడు ఏకలవ్యుడు. అయితే తాను ఎరుకులవాడని చెప్పి తిరస్కరిస్తాడు ద్రోణుడు. అలా తిరస్కరించిన వెంటనే వచ్చేయకుండా మళ్ళీ తననొక అనుమతిని ఇవ్వమని అడుగుతాడు. నేరుగా విద్యను నేర్పకపోయినా తన బొమ్మను చేసుకుని దాన్నే గురువుగా భావించి విద్య నేర్చుకోవడానికి అవకాశాన్ని వ్వమని అడుగుతాడు ఏకలవ్యుడు. సరేనంటాడు ద్రోణుడు. ఈ విషయంలో ఏకలవ్యుని నిజాయితీ, ఎంతగొప్పది.

ఏకలవ్యుని నైపుణ్యం :

ఏకలవ్యుడు మట్టితో ద్రోణుని రూపాన్ని చేసే అంశాన్ని ఈ కింది పద్యంలో గమనించవచ్చు.

వినయమున ద్రోణు రూపు మన్నున నమర్చి
దాని కతి భక్తి తోడ బ్రదక్షిణంబు
జేసి మ్రొక్కుచు సంతతాభ్యాసశక్తి
నస్త్ర విద్యారహస్యంబు లర్థి బడసె.

(శ్రీమదాంధ్ర మహా భారతం - ఆదిపర్వం
-పంచమ శ్వాసం - పద్యం -232)

పై పద్యంలో ఏకలవ్యుని శిల్ప చతురత, నైపుణ్యం కన్పిస్తాయి. ఎంతో నిపుణతతో మట్టితో ద్రోణుని బొమ్మను చేస్తాడు. తర్వాత దాన్ని చూసిన ద్రోణుడే ఆశ్యర్య పోతాడు. నిజంగా అంత చిన్న వయస్సులో బొమ్మను చేయడం ఆశ్యర్యమే. తనకున్న శిల్ప చాతుర్యంతో ద్రోణుని విగ్రహాన్ని చేసుకుంటాడు. అలా చేయడంలో ఏకలవ్యుని నేర్పు, సృజనాత్మకత మనకు కన్పిస్తాయి. అయితే ద్రోణుడు వీటినేమీ చూడడు. ద్రోణుడు కన బడని కులాన్నే చూసి వద్దంటాడే కానీ తనలో కనిపించ కుండా దాగి ఉండే అపారమైన శిల్ప నైపుణ్యాలను చూడలేకపోతాడు.

ఏకలవ్యుని ఆహార్యం :

దిట్టమైన శరీరం కలవాడు, పొడవైన శరీరమూ చేతులూ కలవాడూ, మురికి పట్టిన శరీరం కలవాడూ, నల్లని బొగ్గులాంటి శరీరం కలవాడూ, జించ చర్మాన్నే వస్త్రంగా ధరించుకొన్నవాడూ, పదును పెట్టిన బాణాన్ని చేతపట్టుకున్నవాడూ, (అస్త్ర విద్యలో ఏ లోటు లేని వాడూ అయిన ఏకలవ్యుడు ద్రోణుని విగ్రహాన్ని చూసు కుని సొంతంగా విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తాడు. విలు విద్యలోని మెలకువల్ని అన్నీ తెలుసుకుంటాడు. అపార మైన కఠోరసాధన చేస్తాడు.

ఏకలవ్యునికి ఏకాగ్రత :

ఏకలవ్యుడు విలువిద్యను సొంతంగా నేర్వడంలో తనకు తానేసాటి. అనతి కాలంలోనే అన్ని రకాల అంబుల్ని ప్రయోగించడాన్ని నేర్చుకుంటాడు. కౌరవులు పాండవులు అత్యుత్సాహంతో వేటకు వెళ్ళినప్పుడు వారి భటులలో ఒక కుక్క ఏకలవ్యుని చూచి మొరుగుతుంది. ఆ కుక్క మొరగడానికి నోరు తెరిచి మూసే లోపల ఆ కొన్ని క్షణాల వ్యవధిలోనే దాని నోట్లో 7 బాణాలు వేస్తాడు. అది మొరుగుకుంటూ పాండవుల యొద్దకు వస్తుంది. అది చూసిన ద్రోణుడు కూడా ఆశ్చర్యపోతాడు. కుట్రతో ద్రోణుడు కోపావేశం ఉన్న వాడికి ఇలాంటి విద్య పనికి రాదని అన్నాడు. కానీ ఎంత నేర్పు, ఎంత ఏకాగ్రత ఉంటే ఇలా కుక్క నోట్లో 7 బాణాల్ని వేయగలడనే నైపుణ్యాన్ని చూడలేకపోయాడు. పక్షపాత బుద్ధితో ద్రోణుని కళ్ళు మూసుకుని పోయాయని చెప్పవచ్చు.

ఏకలవ్యుని కులం :

కులం చూసి ద్రోణుడు ఏకలవ్యుని తిరస్కరించారు. కానీ ప్రతిభకు, సొంతంగా ఉండే తెలివి తేటలకు కులం కొలమానం కాదనే సంగతిని గ్రహించలేకపోయారు. ఈనాడు సమాజంలో ఇంకా ఇలాంటి పిచ్చి చాలా మందిలో ఉంది. అది సమూలంగా నాశనం కావాలి. చాలా మంది విద్యాబుద్ధులు నేర్పాల్సిన వారిలోనే వుంది. అపార ప్రతిభా వ్యుత్పత్తి అభ్యాసాలున్న కఠోర సాధకుడు ఏకలవ్యుడు.

పాండవ రాజకుమారుల మత్సరం :

కుక్కనోట్లో 7 బాణాల్ని వేసిన ఏకలవ్యుని పట్ల పాండవ కుమారులందరికీ మత్సరం కలుగుతుంది. అర్జునుడు ఏకలవ్యుని తనకంటే గొప్ప విలుకాన్ని చేశావని ద్రోణుని నిందిస్తాడు. అప్పుడు జరిగిన విషయమంతా ద్రోణునితో చెబుతారు. ద్రోణుడు కూడా ఒకింత సంభ్రమానికి లోనై ఏకలవ్యుని నివాసస్థానానికొస్తారు. అర్జునుడికి ఏకలవ్యుని పట్ల పోటీ ఉండదు. కానీ కుళ్ళు బాగా ఉంటుంది. గురువు ప్రత్యేకంగా లేకపోయినా సొంత తెలివితేటలతో ఈనాడు రాణించినవారు చాలామందే ఉన్నారు. అలాంటి వారందరికీ ఏకలవ్యుడే ఆదర్శం. విద్యార్థి దశలో గానీ, ఉద్యోగ దశలోగానీ ఎక్కడైనా గానీ ఎదుటివారు బావుంటే, మనకన్నా తెలివైనోళ్ళయితే, మనకు వాళ్ళతో పోటీ ఉండాలి కానీ మత్సరం, అసూయ కాదనే సంగతిని గ్రహించాలి.

అర్జునిడి బాధ :

'విలువిద్యతో అర్జునుడికంటే గొప్పవాడు ఏకలవ్యుడు' అని అర్జునుడే ద్రోణునికి దు:ఖంతో తెలుపుతారు.

విలువిద్య నొరులు నీక
గ్గలమున లేకుండ నిన్ను గఱపుదునని మున్
బలికితిరి; నాక కాదీ
త్రిలోకముల కధికుజూచితిమి యొక యొఱుకున్.

(ఆంధ్ర మహాభారతం - ఆదిపర్వం - పంచమాద్యకం - పద్యం -239)

అర్జునుడు ద్రోణునితో "విలువిద్యలో నిన్ను ముల్లోకాల్లో మించినవాడు లేకుండా చేస్తానని చెప్పారు. ఇప్పుడు నాకేకాదు మూడులోకాల్లో మించిన విలుకాడు బకడున్నాడు వాడే ఎరుకవాడు ఏకలవ్యుడు" అని చెబుతాడు. ఏకలవ్యుడు ముల్లోకాలు మెచ్చిన విలుకాడు. ఎక్కడో రహస్యంగా అడవిలో నేర్చుకున్న విలువిద్య వల్ల ముల్లోకాలకు వ్యాపించింది.

ద్రోణుడు, పాండవులు ఏకలవ్యుని దర్శించుట :

అర్జునుడి కంటే, ముల్లోకాలకంటే అధికుడు మాత్రమే కాదు ద్రోణునికంటే కూడా గొప్పవాడని అర్జునుడే ఈ సంగతిని ద్రోణునితో చెబుతాడు. చెప్పడమే కాదు గురువు చేత అతడు గురు దక్షిణ అడిగించే ప్రోద్బలం కూడా అర్జునిడిదే. కుట్రకే శక్తి ఉంది కానీ నిజాయితికీ, సత్యానికీ లేదనిపిస్తోంది. ఏకలవ్యుని విలువిద్యానైపుణ్యం అర్జునుడికి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. మత్సరం కూడానూ. తాను కూడా ద్రోణాచార్యుడి శిష్యుడన్న మాట అతనికి పిడుగు పాటవుతుంది. అర్జునిడి హృదయం ఈ మాటలకు బద్ధలై

పోతాయి. వెళ్ళి గురువుని అవే మాటల్ని చెప్పి అడుగుతాడు. ద్రోణుడు అసత్యం చెప్పడు కదా? ఎందుకు దాచావని దెప్పిపొడిచినట్లు అడుగుతాడు అన్జునుడు. 'మీకు ప్రియ శిష్యుడట' కదా అని హేళనగా అడుగుతాడు. అయితే వాన్ని 'చూద్దాం' రండని ద్రోణుడంటాడు.

ద్రోణుడు, పాండవులు అందరూ కలసి ఏకలవ్యుని యొద్దకు రాగా నిరంతరం విలువిద్యా సాధనలో నిమగ్నమై ఉంటాడు ఏకలవ్యుడు. గురువు రాకని తెలుసుకొని ఏకలవ్యుడు, తన శరీరాన్నీ, సంపదనూ, యావత్తునూ సమర్పించి, "తమరి దయవల్ల ఈ విద్యను నేర్చుకొన్నాను. నేను మీ శిష్యుడను. మిమ్మల్ని సేవించడంవల్ల నాకు ఈ విద్య అబ్బిందని" ద్రోణునితో చెబుతాడు. అయితే ద్రోణుడు 'తనకు గురుదక్షిణను ఇవ్వమని అడుగుతాడు.

ఏకలవ్యుని గురుదక్షిణ :

ఏకలవ్యుడు గురుదక్షిణను అడిగిన ద్రోణునితో "నా ధనం, నా దేహం, నా పరిజనం ఏది ఇష్టమో అడగండి సంతోషంగా ఇస్తానని" అంటాడు. ఈ మాటకు తిరుగు లేదు అంటాడు. అందుకు ద్రోణుడు "నీ కుడి చేతి బొటన వేలును ఇమ్ము" అని అడుగుతాడు. వెంటనే ఏకలవ్యుడు బాణాన్ని తీసుకొని తన కుడిచేతి బొటనలేలిని కోసి తన గురువుకు దక్షిణగా అర్పిస్తాడు. అలా అర్పించటానికి ఎంతో సంతోషిస్తాడు. తనకున్న అపార గురుభక్తిని చాటుకుంటాడు.

ఏకలవ్యుని మరణం :

ద్రోణాచార్యులు ధర్మం వైపు మొగ్గకుండా అధర్మం వైపు వెళతాడు. తరువాత ఏకలవ్యుడు జరాసంధునికి చాలా విశ్వాసపాత్రుడిగా వ్యవహరిస్తాడు. రుక్మిణీ స్వయంవరం సమయంలో జరాసంధుని కోరిక మేరకు, శిశుపాలుడికి మరియు రుక్మిణీ దేవి త్రండియైన భీష్మకునికి మధ్యవర్తిగా వ్యవహరిస్తాడు. భీష్మకుడు రుక్మిణి శిశుపాలుడుని పెళ్ళి చేసుకోవాలని కోరతాడు. కానీ రుక్మిణీ శ్రీకృష్ణుని పెళ్ళి చేసుకుని వెళ్ళిపోతుంది. తరువాత ఒకసారి జరాసంధుని సైన్యంతో యుద్ధ సమయంలో శ్రీకృష్ణుడు పైకి ఏకవ్యుడు ఒక రాయి విసరడంతో శ్రీకృష్ణుడే అతన్ని చంపేస్తాడు.

ఏకలవ్యునిపై ఆరుద్ర అభిప్రాయం :

ఆరుద్ర గారు తన 'వ్యాసపీఠం' లోని ఒక వ్యాసంలో "మహాభారతంలో "అయ్యో పాపం!" అనిపించి సానుభూతికి నోచుకునే కొన్ని పాత్రలలో ఏకలవ్యుడు ఒకడు. ఈ ఉదాత్త పాత్ర గురించి సామాన్య పాటకులకూ సాధారణ సాహితీ పరులకూ తెలుగు భారతం, ఆదిపర్వంలో లభ్యమైనంత సమాచారం మాత్రమే తెలుసు. ఆదిపర్వం పంచమాశ్వాసంలో పదిహేను గద్య పద్యాలో నన్నయ్య గారు ఏకలవ్యుని అస్త్ర విద్యాభ్యాసం, పాటవ ప్రదర్శనం, గురుదక్షిణ సమర్పణం తెలియజేశారు. తన శిష్యులలో ఒకే ఒకణ్ణి అందరికన్నా మిన్నగా చేయాలని ఇంకొక అసమాన పరాక్రమశాలని ఆచార్యుడు అంగవికలునిగా చేయడం అనుచితం. బొటనవేలు కోసిచ్చిన మహోన్నత వ్యక్తి ఏకలవ్యుడు.

తర్వాత ఏకలవ్యుడు ఏమయ్యాడు? అనే ఈ ప్రశ్నకు తెలుగు భారతంలో జవాబు దొరకదు. భారతకథలో ఎంతో ప్రముఖ పాత్రను వహించకపోతే ఆదిపర్వంలో ఏకలవ్యుని కథను కథనం చేయడం అనవసరం. తెలుగు భారతంలో దొరకదు. గానీ వ్యాసభారతంలో ఏకలవ్యుని అట్టు పట్టు ఆనవాళ్ళన్నీ ఓపికతో గాలించితే చేతినిండా చిక్కుతాయి. నన్నయ్యగారు గానీ, తిక్కన గారు గానీ వ్యాస భారతాన్ని యథామూలంగా అనువదించకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. సంస్కృత హరివంశం చదివితే ఆశ్చర్యకమైన విషయాలు తెలుస్తాయి. పాండవులకు గాని కృష్ణునికి గాని ఏకలవ్యుడు పరాయివాడు కాదు. రక్త బంధువు. పాండవులు, ఏకలవ్యుడు పినతల్లి బిడ్డలు.

కృష్ణుడు ఏకలవ్యుడు మేనత్త మేనమామ బిడ్డలు. ఈ బీరకాయ పీచు బంధుత్వాలు ఎర్రయ్య గారి తెలుగు హరివంశం వల్ల కూడా కొంత తెలుస్తాయి. ఏకలవ్యునికీ, కీచకునికి కూడా బంధుత్వం ఉంది. ఉత్తరకుమారునికి పాండవులు మేనమామలు. యాదవకులంలో అంధక వంశ శాఖ ఉంది.

కేకయరాజుకూ, శ్రుతదేవకూ పుట్టిన ఏకలవ్యుడు నిషాదుడెందుకయ్యాడు? అనే సంగతి హరివంశంలోని ఒక శ్లోకం ఆ సంగతిని చెబుతుంది. అదేమిటంటే, దేశశ్రవునికి ఏకలవ్యుడు జన్మించి నిషాదులచే పెంచ బడ్డాడని. దేవశ్రవుడు వసుదేవుని తమ్ముళ్ళలో ఒకడు. శ్రుతదేవ అనే పేరుకు బదులు దేవశ్రవ అనే పేరు ఈ శ్లోకంలో చోటుచేసుకుంది. ఎర్రయ్యగారు ఆంధ్ర హరి వంశంలో "శ్రుతదేవ కుంగేకయేశ్వరుని వలన ఏకలవ్యుడు పుట్టి నిషాదులలోనె బెరిగె" అని ఈ శ్లోకాన్ని అనువదిం చారు. ఏకలవ్యుడు జరాసంధుని ఆంతరంగికులలో ఒకడు. జరాసంధుని సైన్యాలకు ఏకలవ్యుడే సేనాధిపతి. మధర మీద పద్దెనిమిది సార్లు జరాసంధుడు దండెత్తాడు. ప్రతీముట్టడి లోనూ ఏకలవ్యుడు సైన్యాధిపత్యం వహిం చాడు. సంస్కృత హరివంశంలో ఏకలవ్యుని సంగర విక్రమం కనబడుతుంది." ఇదీ ఆరుద్ర గారి పరిశోధనా వ్యాసం!

ఏకలవ్యుడు నిషాదులింట పెరిగి, నిషాదునిగా గుర్తించపడ్డాడు. కులదూషణకు, కుల విపక్షతకు గురి అయ్యాడు. ఎన్నో అవమానాలు భరించాడు. నేటి సమాజంలో దళితులు ఏకలవ్యుడిని దత్తత చేసుకొన్నారు. ఇది చాలావరకు న్యాయమే అనిపిస్తుంది.

ముగింపు :

అత్యంత ఉత్తమ విద్యార్థియైన ఏకలవ్యుడు కుళ్ళుతో కుళ్ళిపోయిన అర్జునుడు, పక్షపాతంతో పాడైపోయిన ద్రోణుడు మనకు దర్శనమిస్తారు. అన్ని కోణాల్లో ఏక లవ్యుడే అధికుడుగా కనిసిస్తాడు. అడిగింది ఇవ్వడంలో అతనికున్న ఉదారత్వం ఎంతో గొప్పది. తన స్వార్థం పేరు ప్రతిష్టలు గురించి ఏమీ ఆలోచించుకోలేదు. తన విద్య ద్వారా సాధించిందీ, సంపాదించిందీ అంతా గురువుకు సమర్పించుకున్నాడు. అత్యున్నత గుణగణాలు కలవాడిగా ప్రసిద్ధిచెందాడు. ఏకలవ్యుడు ప్రతీ విద్యార్థికీ ఒక ఆదర్శ పాఠం అని చెప్పవచ్చు.

ఉపయుక్త గ్రంథ సూచిక :

1. శ్రీమదాంధ్ర మహా భారతం - టి.టి.డి ప్రచురణ. తిరుపతి. 2011
2. శ్రీమదాంధ్ర మహాభారతం (వచనం) - నాయని కృష్ణమూర్తి - విజయవాణి పబ్లికేషన్స్, చౌడేపల్లి - 2015.



పురాణ స్త్రీలతో గిరిజనుల తాదాత్మ్యం

– డాక్టర్ గుంటుపల్లి గౌరి, ఆంధ్రోపన్యాసకులు, తెలుగు విభాగం, ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి), గుంటూరు.

భారతీయ సంస్కృతికి మూలస్తంభాలు వేదాలు. వేదాలలో చెప్పబడిన ధర్మసూక్ష్మాలు ప్రజలు ఆచరించడం కొరకు సామాన్య ప్రజలకు సులభంగా అర్థమవడానికి పురాణాలు వ్రాయబడ్డాయి. ఇవి హిందూ మతాన్ని ప్రచారం చేయడానికి సాధనాలుగా ఉపయోగపడ్డాయి. పురాణాలతో పాటు ఉపపురాణాలెన్నో ఇంచుమించు క్రీ.శ. 7.8 శతాబ్దాల నుండి 13వ శతాబ్దాల మధ్య అధికసంఖ్యలో రచింపబడినట్లు సాహితీవేత్తల అభిప్రాయం. పురాణాలలో దేవతాపరమైన గాథలు, పితృదేవతల మహిమలు, దేవతల అనుగ్రహానుగ్రహాలు, చర్యలు, ప్రకృతిశక్తికి సంబంధించిన కథలు, ఆచారాలు, ఆచారాల పుట్టుక, వాటిననుసరించే పద్ధతులు, వంశపురుషుల కథలు నిక్షిప్తం చేసుకున్నాయి. అష్టాదశ పురాణాలతో పాటు రామాయణ, భారతాలు పురాణాలుగా భారతదేశంలో గౌరవాన్ని సంతరించుకున్నాయి.

రామాయణ, భారత, భాగవతాలు భారతీయ సంస్కృతికి మూలమైనవి. రాముని కథ ఆదర్శ వ్యక్తిత్వానికి, భారతం సంఘసంస్కారానికి, భాగవతం ఆత్మతత్త్వానికి ప్రతీకలని ప్రాచీనకాలం నుండి వస్తున్న నమ్మకం. భారత భాగవతాలకంటే ఆంధ్రులకు ఎక్కువ ప్రీతిపాత్రమైంది రామాయణం. సీతారాములు ఆంధ్రులకు ఆరాధ్యదైవాలు. తమ భక్తిని అభిమానాన్ని తెలియజేయడానికి పిల్లలకు సీతారాముడు, లక్ష్మణుడు, ఊర్మిళ మొ॥ పేర్లుపెట్టి పిలుచుకుంటారు. రామాయణం ఒక సంస్కారవంతమైన ఆంధ్రుల సమిష్టి కుటుంబానికి దర్పణం.

వాల్మీకి రామాయణాన్ని ఎందరో కవులు వేరు వేరు భాషలలో జానపదకథలనెన్నిటినో చేర్చి రచించారు. ఈ రామాయణాలలోని ఘట్టాలను గానంచేస్తూ పొట్టపోసుకుంటున్నవారు బాలసంతు, శారదకాండ్రు అనే జానపద భిక్షులు. రామాయణం జానపదనోళ్ళలో అనేక రకాలుగా మార్పు చెందింది. భాస్కర రామాయణము, రంగనాథ రామాయణము, గోపీనాథ రామాయణములలో మూలంలో లేని కథలెన్నో ఉన్నాయి. రంగనాథ రామాయణంలో జంబుమాలి కథ, సులోచన కథ, కాలనేమి కథ, రావణునకు శుక్రుని ఉపదేశము, రావణుని పాతాళ హోమము మొ॥ ఎన్నో కథలు కలవు జానపదుల రామాయణపు పాటలు లెక్కకు మించినన్ని ఉన్నవనటానికి ప్రధాన కారణం జానపద మనస్తత్వం.

సీత :

జానపదులు సీతారాముల పాత్రలతో ఐక్యమయినారు. జానపదులకు సీతారాములు అవతార పురుషులు కారు గాని, తమ కుటుంబంలోని వారే. తమ జీవితమే సీతారాముల జీవితం. తమ కష్టసుఖాలను ఈ పురాణ దంపతుల కష్టసుఖాలుగా జానపదులు కల్పించుకొని పాడి, వారితో తాదాత్మ్యాన్ని పొందిన అదృష్టవంతులు. ఒక్క సీతాదేవిని గురించి పెరిగిన రామాయణపు పాటలెన్నో కలవు. సీతపుట్టుక, సీతాకళ్యాణం, సీతను అత్త వారింటికి పంపుట, సీతసమర్త, శుభగోష్ఠి, సీత గడియ, సీత వామన గుంటలు, సీతమ్మ వారి అలుక, సీత వసంతం, సీత దాగిలిమూతలు, సీత అనవాలు, సీత అగ్నిప్రవేశం సీతవేవిళ్ళు మొ॥నవి.

రాముడు రావణున్ని వధించిన పిదప విభీషణునితో సీతను అలంకరించి తీసుకురమ్మంటాడు. రాక్షస స్త్రీలు సర్వాలంకారాలతో సీతాదేవిని అలంకరించగా ఆమె రథమెక్కి రాముని వద్దకు వచ్చి అతని పాదాలకు నమస్కరిస్తుంది. రాముడు అప్పటి వరకు సీత రావణుని చెరలో నున్నందున ఆమె ముఖం చూడటానికే ఇష్టపడడు. అతని తిరస్కారానికి సీత మూర్ఛపోతుంది. అదే అదనుగా

రాముడు రథాన్నెక్కి వేగంగా వెళుతుంటాడు. సీతస్పృహ నుండి తెలివిపొంది--

"భూదేవి పుత్రికను జనక కన్యకను - నాయాన అని పల్కె సీతాదేవి
పరమ పతివ్రత సీతపై ఆనబెట్టి - పంకజనాభుల రథము కదలరాదు"

అని సీతాదేవి పాతివ్రత్య మహిమను చూపడానికి ప్రయత్నిస్తుంది. అప్పుడు రాముడు లక్ష్మణునితో

"కుక్కముట్టిన కుండ నాకువనికిరాదు, సీతాదేవిని కౌసల్య దగ్గరకయినా వెళ్ళమని అదికుదరకపోతే మూడు లోకాల ప్రజలు చూచునట్లుగా భిక్షమెత్తుకోమని"

సామాన్య జానపదునివలె అవమానపరుస్తాడు. ఆ అవమానాన్ని సహించలేక-

"ఆడజన్మము బుట్టి అజ్ఞాని నైతి గుఱ్ఱాలనయిన బుట్ట లేనయితి"నని
"కపిభల్లూకముల పాటికాకుండనయితి - పక్షుల లోనయిన జన్మించనయితి"

అని భూమిపైనున్న అన్ని ప్రాణులకన్న ఆడజన్మం అల్పమయిందని దుఃఖిస్తుంది. సీతాదేవి అచ్చమయిన జానపదస్త్రీ వలె

"పూర్వమందు చేసిన పూజ - భువిలోన స్త్రీయై పుట్టిందేచాలు"

అని, కర్మ సిద్ధాంతాన్ని నమ్మిన జానపదుల సీత చివరకు తనను తానే ఊరడించుకొన్నది తప్ప రాముని మాటలకు ప్రతీకారం చేయలేదు. కష్టాలను సహించి నీ శక్తిని చూపెట్టమని స్త్రీకి భారతీయ సంస్కృతి నేర్పింది. సీతమ్మ సహనం భారతీయ మహిళలందరికీ శిరోధార్యం.

ఊర్మిళ :

శయ్యపై నిదురించుచున్న భార్యను చూచి ఆమెతో తన విరహబాధను తెలియపరచుకుంటాడు లక్ష్మణుడు. నిదురలో ఉన్న ఊర్మిళ కన్నులు తెరువకనే ఎవరో పరపురుషుడని అనుకొని -

"అయ్యా మీరెవ్వరయ్యా, ఈరీతి
యాగడమ్ముల కొస్తిరీ
ఎవరులేని వేళ మీరిపుడు
ఏకాంతముల కొస్తిరీ
మాతండ్రి జనకరాజు విన్ననూ
యాజ్ఞసేయక మానరూ
మా'యక్కబావవిన్న' మీకిపుడు
ప్రాణమునకు 'హానివచ్చుం
మాయక్క మరిదివిన్నా మిమ్ములను
బ్రతుకనివ్వరు జగతిలో" అంటూ

ఇంకా

"ఒకనాలి గోరిగాదా ఇంద్రునికి
యొడవెల్ల హీనమాయె" పరస్త్రీలను

కోరడం క్షేమం కాదని చెప్పి-

"ఆడతోడూబుట్టరా మావంటి
తల్లి లేదా మీకు"

అని తనను అవమానపరచటం భావ్యంకాదని దీనంగా వేడుకుంటుంది. ఆ తరువాత మాట్లాడేది లక్ష్మణుడని తెలుసుకున్న ఊర్మిళ అతనితో మా తండ్రి జనకరాజు 'నా అల్లుడు అభిమానవంతుడు, మంచివాడని నమ్మి' నన్ను మీకిచ్చి వివాహం చేసారు. కాని మీరు

"చిత్తమొక దిక్కునుంచి సమయమున
చిన్నబుత్తురు యింతులా" అని

భర్త దగ్గర గారాలుపోతూ తన బాధను తెలియపరుస్తుంది అపుడు లక్ష్మణుడు-

"తరుణి పదునాలుగేండ్లు నినువిడిచి
ధరియిస్తినే ఫాణము
ఆహార నిద్రలూను యెరుగనే
అతివనీమీదయాన
పుణనపురుషుల స్త్రీలనెడబాపిన

పూర్వజన్మమున మనమూ
ఎన్నెన్ని యుగములైన ఇదిమనకు
అనుభవించక తీరదూ" అని భార్యను ఊరడించాడు.

వీరి కష్టాలన్నీ తమవిగా భావించి వారితో తాదాత్మ్యమును పొందిన సహృదయులు జానపదులు.

రామాయణం తరువాత భారత, భాగవత గాథలంటే భారతీయులకు ప్రీతిపాత్రాలు ధర్మరాజు, ధర్మనిరతి, పాండవుల సత్ప్రవర్తన, శ్రీకృష్ణుని ధర్మపక్షపాతం, దుష్టశిక్షణ, శిష్టరక్షణ, కౌరవుల దుర్మార్గతను తెలియజేసే గాథలంటే భారతీయులు చెవులుకోసుకుంటారు. వ్యాస భారతాధారంగా భారతంలో జానపదుల కల్పనలెన్నో చేరిన జానపద సంబంధమైన సాహిత్యమెంతో ఉంది. అందులో ధర్మరాజు జూదం, ద్రౌపదివలువలు, పండు పాట, విరాటపర్వం వంటివి ఎన్నో కలవు. అందులో "ధర్మరాజు జూదం" ఒకటి. ఈ కథాగేయాన్ని స్త్రీలు తమకు పనివల్ల కలిగిన శ్రమను మరచిపోవడానికి పాడుకుంటారు. ఇందులో తమ మనస్సులలోనున్న భావాలను ద్రౌపదీదేవి ద్వారా విదితం చేసారు.

లక్ష్మీదేవి :

మూలభారతంలో 'కపటజూదం'లో ధర్మరాజు సమస్త రాజ్యాన్ని గెలుచుకోవాలన్న శకుని ఆలోచనతో కౌరవులు ధర్మరాజును జూదమాడడానికి పిలుస్తారు. జూదంలో దుర్యోధనుని దిక్కునుంచి శకుని జూదమాడు తాడు. కాని ఈ పాటలో దుర్యోధనుడు తానే స్వయంగా ధర్మరాజుతో జూదమాడుతాడు. ఆ విధంగా ఒక దిక్కు ధర్మరాజు మరొక దిక్కు దుర్యోధనుడు కూర్చుండి జూదమాడుతారు.

"ధర్మరాజుకు చిక్కె కనకమ్ము నేడు
రాజరాజుకు చిక్కె బలపమ్మునేడు"

ఇలా జూదమందు మొదట ధర్మరాజే గెలుస్తాడు (భారతమందు రాజరాజు గెలిచినట్లుంది) దుర్యోధనుడు తానోడిపోవటంచూచి పాచికలు శకునిచేతికిచ్చి తాను లోనికి పోయి లక్ష్మీదేవికి అక్కగారైన జేష్ఠాదేవిని ప్రార్థిస్తాడు. ఆమె అతనిని ఊరడించి తాను తన చెల్లెలింటికి పోతుంది. అక్క రాకడ చూసి చెల్లెలు ఆమెకు ఎదురువెళ్ళి మ్రొక్కి వచ్చిన పనేమిటని అడుగుతుంది. లక్ష్మీదేవికి జూదం గురించి చెప్పి తననొకప్పుడు పాండవులు అవమానించిన సంఘటనను తెలియజేస్తుంది. ధర్మరాజు రాజసూయయాగం చేసినప్పుడు అందరికీ భోజనం పెట్టే సమయంలో ఆమె కూడా పోయి ఆ బంతిలో కూర్చుంటుంది. అపుడు అక్కడకు వచ్చిన భీముడు-

"ఆడదానవు నీవు ఇది నీతిగాదు
మగవారితో కుడువసాటి లేదనుచు
ఆకులు దీయించీ పారవేయంచే
అప్పుడు భీమునికిస్తేనే శాపమ్మునేను
చేటలోపల వడ్లు నెరిపిన్ననాడు
నాడు నినుగొలుతునని పలికితినేమి
నాటికార్యము నేడు సమకూడెననుచు
నీ వేగధర్మనందనులబాసి
రాజరాజును పొందుమమ్మరోనీవు"

అని వేడుకుంటుంది. కాని లక్ష్మీదేవి ధర్మనందనుని ధర్మప్రవర్తన వల్ల అతనిని తాను వదలనంటుంది. కాని జేష్ఠాదేవి కోపగించుకున్నందున విధిలేక ధర్మరాజాదులను వదిలి రారాజును చేరుతుంది లక్ష్మీదేవి. ఇదంతా జానపదులు కల్పించిన కల్పన. చేటలో వడ్లు నెరపడం, సగం తడిచేటట్లు కాళ్ళు కడుగుకోవటం దరిద్రమని ఇప్పటికీ మన పెద్దలు చెపుతుంటే మనం విన్నవారమే.

ద్రౌపది :

లక్ష్మి రాజరాజును చేరడం వల్ల ధర్మరాజు జూదంలో సమస్తాన్ని ఓడిపోతాడు. తనను, తమ్ములను కాక ద్రౌపదిని కూడ ఓడిపోతాడు. అప్పుడు ఆమెను సభకు పిలుచుకొని రావడానికి గాంధారి అనే వ్యక్తిని పంపిస్తాడు. (భారతంలో ప్రాతిగామి అని ఉన్నది). అతడు ద్రౌపదితో ఆ సంగతి చెప్పగా ఆమె "తలలంటి, పసుపుబూసి, జాజుల్లుముడిచి అంగుష్ఠ శారధి (రజస్వల) రారాదు

యనెను'' అతడు పోయి రాజరాజుతో ఆ విషయం చెప్పగా అతడు దుశ్శాసనుణ్ణి పంపిస్తాడు. ద్రౌపది అతనికి కూడా గాంధారి అనే అతనికి చెప్పిందే చెపుతుంది. అప్పుడతడు ఆమెపై నీళ్ళు పోసి ఆమె జుట్టు పట్టుకొని ఈడ్చుకొని వచ్చాడని'' చెప్పడంలో జానపదుల ఔచిత్యం కనిపిస్తుంది. రజస్వల అయిన స్త్రీని ముట్టుకోవడం ఆచారం కాదు. కాబట్టి నీళ్ళు చల్లితే అపచారం తొలగి పోతుందని జానపదుల విశ్వాసం. రాజరాజు సభకు వచ్చిన ద్రౌపదిని అనరాని మాటలని అవమానిస్తాడు. అందుకామె కోపంతో రాజరాజును చూపించిన విధానంలో అచ్చమయిన జానపదస్త్రీ మనస్తత్వం కనిపిస్తుంది.

గాజు మెరిసితేను పుష్యరాగమగునా
మాణిక్యమ్ము నలుపయితే మసిబొగ్గగునా
గాడిదయది ఎంతగజ మౌనటోరి
కాలువవెన్నయిన కలిసిపారితే
గంగానది తోటి సాటియగునటరా
ఏరులు ఎన్నయిన ఎత్తిపొంగితె
సముద్రముతో నవిసాటియగునటరా
అధికులమని మీరుపడగలెత్తినను
శేషునితో సరియగున చిలువలెన్నయిన
పక్షులమని తమరు వృక్షమెక్కినను
గరుత్మంతునితో సరియగున ఆ పక్షులెల్ల
కరుణాలమని మీరు కవిలెబట్టినను
శ్రీరామునితో సరియగున సృష్టికరణాలు
రాజులమని తమరు రచ్చలెక్కినను
ధర్మరాజులతో సరియగు సకలరాజులెల్ల

అని, అల్పమయిన వస్తువులెన్నటికి శ్రేష్ఠమయిన వస్తువులతో సాటిరావని చెప్పి ద్రౌపది రాజరాజును దూషిస్తుంది జానపదస్త్రీలు తమకు రాజురాజుపై వుండే కోపం, కసి, పౌరుషంతో ద్రౌపది పలికిన మాటల వలన జానపద స్త్రీలకు ఉండే స్వాభిమానం స్పష్టమవుతుంది.

తన భర్తను అవమానించిన వానితో భర్త గొప్పతనాన్ని పొగడడం జానపద స్త్రీల స్వభావం. రాజరాజు దుశ్శాసనునితో ద్రౌపది బట్టలు ఒలిపిస్తాడు. ఆపదలో నున్న పతివ్రతా స్త్రీలకు భగవంతుడే దిక్కని ద్రౌపది శ్రీకృష్ణుణ్ణి ప్రార్థించగా, అక్కడ వైకుంఠంలో లక్ష్మీదేవితో పాచికలాడుతున్న విష్ణువు 'అక్షయ' అని పాచికలు వేసి అక్షయ వలువలిస్తాడు ద్రౌపదికి. (జానపదులకు విష్ణువైనా, కృష్ణుడైనా, రాముడైనా అందరూ ఒకటే) వారికి కావలసింది తమను ఆపద నుండి కాపాడడం ముఖ్యం. ఇందులో ద్రౌపది యొక్క శక్తి, పౌరుషం, పాతివ్రత్యం, స్వాభిమానం తెల్లమవుతుంది.

అరుంధతి :

జానపదులు ఎల్లవేళల తమమనస్సునందు గౌరవించు ప్రతివ్రతామ తల్లులు సీతమ్మ, అనసూయమ్మ, సావిత్రి, సతీసుమతి, ద్రౌపది. పురాణ కాలంనాటి జానపదుల మనస్సులను ఎక్కువగా ఆకర్షించింది అరుంధతి. ఈమెను తమ ఇంటి ఆడబిడ్డగా చెప్పుకుంటారు. ఒకనాడు నారదుడు మూడులోకాలలో పతివ్రత ఎవరో తెలుసుకోవలెనని కుంచెడు రాళ్ళను కొంగున కట్టుకుని వండమని త్రిమూర్తుల భార్యలనడుగుతాడు. వారికది సాధ్యంకాకుండెను. నారదుడు అరుంధతిదేవికి ఆ రాళ్ళ నిచ్చి వండమంటాడు. ఆమె పతిని ప్రార్థించి వండిపెడుతుంది. ఆమె పాతివ్రత్య మహిమను తెలుసుకుని త్రిమూర్తులతో కలిసి ముగ్గురమ్మలు అరుంధతికి నమస్కరిస్తారు. అప్పుడు త్రిమూర్తులు అరుంధతితో

''నీవు పాతివ్రత్యమందు నిజమగుదారి జూపితివి
నీ ధ్యానంబు జేయువారు నీవలె వన్నెకెక్కుదురు''

అని ఆమెను ఆకాశంలో నక్షత్రమై విరాజిల్లుమనిరి. వారి ప్రభావం చేత యిప్పటికీ, వధూవరులకు అరుంధతీ నక్షత్రాన్ని చూపించకపోతే వివాహ తంతు పూర్తికాదు.

జానపద సాహిత్యంలో స్త్రీల అనుభూతులు, కష్ట సుఖాలు, రాగద్వేషాలు, పగలు, పట్టింపులు, భక్తి, ప్రేమ, పవిత్రత, ఆచార సంప్రదాయాలు, నీతి నియమాలు, సామెతలు మొ॥నవి స్త్రీ సంపూర్ణ వ్యక్తిత్వం కనిపిస్తుంది.

జానపద సాహిత్యంలో స్త్రీ మనస్తత్వ చిత్రణ చిత్రింప బడినంతగా మరే సాహిత్యంలో చిత్రింపబడలేదంటే అతిశయోక్తి కాదు. జానపద సాహిత్యంలో స్త్రీసర్వతో ముఖమైన మనస్తత్వాన్ని మనం దర్శించగలం.

జాతికి మూలం సంస్కృతి, సంస్కృతికి మూలం ఆచార సంప్రదాయాలు ఆచార సంప్రదాయ పరిరక్షకురాలు స్త్రీ. విద్యాగంధం లేని స్త్రీ అనుశ్రుతంగా ఆచార సంప్రదాయాలను మౌఖికంగా ప్రచారం చేస్తూ జానపద సాహిత్యంలో నవరసాలతో స్వైర విహారం చేసి పరాశక్తిగా నిలిచింది. ప్రకృతి లేనిది సృష్టిలేనట్లుగా స్త్రీ లేనిది జానపద సాహిత్యాభివృద్ధి ఉండేదికాదు. జానపద సాహిత్యం స్త్రీ విభిన్న మనస్తత్వాలకు దర్పణం. కనుమరుగైపోతున్న జానపదసాహిత్యాన్ని పరిరక్షించే బాధ్యత ప్రభుత్వంతో పాటు జానపదవేత్తలందరిది.



ఆంధ్రదేశంలో గిరిజన వైద్య విజ్ఞానం – స్థూల విశ్లేషణ

– డా॥. కె. సురేశ్ కుమార్, ఆంధ్రోపన్యాసకులు, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కందుకూరు.

భాష జంతు ప్రపంచం నుండి మనిషిని వేరు చేసింది. బ్రతుకు పోరాటంలో మనిషికి ఎదురయ్యే ఎన్నో అనుభవాలు, మనిషి సుఖంగా ఉండటానికి తోడ్పడుతున్నాయి. మానవాళి చరిత్ర అడవుల నుండే మొదలై, అడవులను సరిచేసుకుని, అడవులను దాటుకుని నదీ తీరాలకు, సముద్రతీరాలకు, కొండలు, లోయలకు, మైదాన ప్రాంతాలకు సాగింది. ఈ క్రమంలో మనిషి రక్షణ, కూడు, గూడు, గుడ్డ, సంతతిని పెంపొందించుకోవడం, మనుగడ కొనసాగించుకోవడం అనేవి నిరంతరం ఎంతో జాగ్రత్తగా ఉండటం వల్లనే సాధ్యమయ్యింది. కలిసి కట్టుగా ఉండటం వల్లనే కుదిరింది. అలాగే తమ అనుభవాలను తమ వారసులకు అందించటం అనేది కొనసాగుతూ ఉండటం వలన కూడా దీని సారాంశం ప్రత్యక్ష అనుభవం వల్లనే జ్ఞానం వస్తుంది. అయితే ఈ జ్ఞానం ఒక్కోసారి దోపిడీకి గురౌతుంది. గిరిజనులు పలు విషయాల్లో సంపాదించిన జ్ఞానం లెక్కలేనన్నిసార్లు దోపిడీకి గురైయ్యింది. దీని గురించి ముందు చూద్దాం. ఇక ప్రస్తుతానికి వస్తే కాలక్రమంలో మనుషులు పలు జాతులుగా, పలు తావుల స్థిరపడ్డారు. కారణాలు ఏవైనా నేడు అడవులలో నివశించేవారిని గిరిజనులు అంటున్నారు.

ఆఫ్రికా తర్వాత భారతదేశంలో గిరిజనులు ఎక్కువగా ఉన్నారు. మొత్తం 457 తెగల/ఉపతెగల ప్రజలున్నారు. వీరు 100 భాషలు మాట్లాడుతున్నారు. ఉమ్మడి ఆంధ్ర దేశంలో 35 తెగల/ఉపతెగల వారున్నారు. ఆ తెగలు ఆంధ్, ఎరుకల, కొండకమ్మర, కొండదొర, కొండరెడ్డి, కోలాము, కోయ, కోందు, కోటియా, ములియా లేదా కులియా, గదబ, గోండు, గౌడు, చెంచు, తోటీలు, నాయక్‌పోడ్, నాయక్, ప్రధాన్/పరదాన్, పొరజలు, బగతలు, బిల్లులు, మన్నేదొరలు, మాలీలు, మూకదొర/నూకదొర, యానాదులు, రెడ్డిదొర, వాల్మీకులు, సవరలు, సుగాలీలు/లంబాడాలు/బంజారాలు, కోదులు, జాతపు / సామాంత బెంధో, ఒరియా, రోన, కట్టునాయికన్, కొండకాపు మొ॥వి.

పూర్వం గిరిజనులు స్వతంత్ర గణరాజ్యాలు కలిగి ఉన్నట్లు చరిత్ర చెబుతుంది. గోండురాజ్యం, కోయ రాజ్యం, కొండరెడ్ల రాజ్యం, నల్లమల వైపు యానాదులు రాజ్యాలు చేసినట్లు తెలుస్తోంది. ఏమైనా నేడు పరిస్థితి వేరుగా ఉంది.

జీవన్మరణ పోరాటంలో ప్రతిదీ నేర్చుకోవల్సిన అవసరం వీరిది. అయినా గిరిజన తెగల జీవనాన్ని సామాజిక, ఆర్థిక, రాజకీయ, మత/సాంస్కృతిక విషయాల్లో గమనిస్తే పలు ఆసక్తికర అంశాలు కనిపిస్తాయి. ఇక్కడ ప్రధానమైనది వైద్య విజ్ఞానం కాబట్టి దాని గురించి మాత్రం చూద్దాం.

ప్రపంచవ్యాప్తంగా చూస్తే నేడు అనేక వైద్య విధానాలు కనిపిస్తాయి. బాగా ప్రచారంలో అల్లోపతి వైద్య విధానం కనిపిస్తుంది. దీని ఆశ్రయించుకుని చదువులు, ఆసుపత్రులు, మందులు, శస్త్ర చికిత్సలు.... ఇలా బోలెడంత వ్యవహారం నడుస్తుంది. భారతదేశంలో ప్రాచీన కాలం నుంచి ఆయుర్వేద వైద్యవిధానం ఉంది, ఆ తర్వాత పలు వైద్య పద్ధతులు పలు కారణాల వలన చేరాయి. యునాని, హోమియో, ప్రకృతి చికిత్స మొ॥వి.

ప్రాచీన కాలం నుంచి నేటి వరకు కూడా అడవులనే నమ్ముకుని అక్కడే బతుకుతున్న గిరిజన జాతుల వైద్యం, గిరిజన వైద్యం బతుకు పోరాటంలో, అనుభవాల నేపధ్యం నుండి పుట్టుకొచ్చింది ఈ వైద్య విజ్ఞానం. అనుభవాన్ని మించిన జ్ఞానమేముంది ? ఎవరైనా వీరి నుంచి ఈ జ్ఞానాన్ని దొంగిలించ వలసిందే గాని వేరే ఎవరి దగ్గరి

నుంచో వీరు నేర్చుకునేది ఏమీ లేదు ఇది సత్యం. ఎందుకంటే ఆకులు, తీగలు, మూలికలు, వేర్లు, కాయలు, పండ్లు.... ఇలా సమస్తం మనిషికి దేనికి పనికొస్తాయో తెలుసుకోవటానికి వీరికి నాగరిక సమాజాల్లో లాగా ప్రయోగశాలలు లేవు... తమ మీద తామే ప్రయోగాలు చేసుకొని వాటి తత్వాన్ని గ్రహించి, దాని గురించి తర్వాత తరాలకు అందించారు. వాస్తవానికి ప్రాచీన కాలం నాటి ఋషులు వైద్య విజ్ఞానంలో ఎంతో జ్ఞానం సాధించారు. ''వారంతా గ్రంథస్తం చేసిన దానికంటే, ఇంకా మిగిలిపోయి గిరిజనుల్లోనే ఉండిన విజ్ఞానం అనంతంగా ఉంది'' అంటారు ప్రముఖ ఆయుర్వేద వైద్యులు, వృక్షశాస్త్రవేత్త కొప్పల హేమాద్రి.

(గిరిజన వైద్య సర్వస్వం - కొప్పల హేమాద్రి, పుట ఎ)

ప్రత్యక్ష జ్ఞానం కలిగిన వీరి దగ్గర నుంచే ఎవరైనా జ్ఞానాన్ని పొందాల్సిందే. బడుగు, వర్ధమాన దేశాల సంపదను విజ్ఞానాన్ని దోచుకుని, పెట్టుబడిదారీ దేశాలు 'పేటెంట్స్' పేరుతో పెద్ద వ్యాపారం చేస్తున్నాయి. ఇప్పటికే వేప, తులసి, పసుపు, బాస్మతి మొ॥ వాటి మీద బహుళ జాతి కంపెనీలు 'పేటెంట్స్' హక్కులు పొందాయి. వాటి నుంచి బయట పడటానికి ఎంతగా శ్రమించాల్సి వచ్చిందో విజ్ఞులందరికి తెలిసిందే. ఏమైనా 'మనదేశం' ఇటువంటి విపత్కర పరిస్థితుల్లోకి వెళ్ళడానికి ప్రధాన లోపం మన వ్యవస్థలోనే కనిపిస్తుంది. ''మానవ విలువల మౌలిక సూత్రాలకే వ్యతిరేకమైన అసంబద్ధ సామాజిక వ్యవస్థ నేపథ్యం, లక్ష్యరహిత, అనైతిక - స్వార్థ - ప్రజా వ్యతిరేక రాజకీయ వ్యవస్థ వర్తమానం భారతజాతి పురోగమనానికి అడ్డంకిగా ఉన్నాయి. (పుట VI)

నేడు అనేక రోగాలకి వైద్యం కోసం ఎంతో డబ్బు ఖర్చు చేస్తున్నారు. అల్లోపతి వైద్యం అంతటా ప్రచారంలో ఉంది. ఈ వైద్యం పెద్ద వ్యాపారమైపోయింది. పెరటిచెట్టు వైద్యానికి పనికి రాదన్నట్లు మన వైద్య విధానాలు కొరగానివిగా చూస్తున్నారు. మన వైద్యంలో తక్కువ ఖర్చుతో, ఇతర ప్రమాదాలు లేకుండా హాయిగా రోగాలు రాకుండా, వచ్చినా తగ్గిచ్చుకోవటానికి అవకాశం ఉంది. గిరిజన వైద్యంలో చాలా రోగాలకు మందులున్నాయి. మనుషులు, పశువులు, పక్షులు మొ॥ అందరికీ, అన్నింటికీ మందులున్నాయి. ఏయే రోగాలకు ఎటువంటి విధానాలు వీరు అనుసరిస్తున్నారు అనేది స్థూలంగా కొన్ని వివరిస్తాను.

మనిషి జీవన విధానం.... అంటే భౌగోళిక వాతావరణం, తినే తిండి, నివసించే పరిసరాలు, చేసే పని, అలవాట్లు, ఆలోచనలు మనిషి ఆరోగ్యం మీద ప్రభావం చూపుతాయనేది తెలిసిందే. గిరిజనులు అడవుల్లో, కొండ, కోనల్లో ఉంటుంటారు. చెట్లు, చేమలు, ఆకులు, అలమలు, విషకీటకాలు, క్రూరమృగాలు, జలావాసాలు... ఇట్లా అంతా సహజంగా ఉండే ప్రకృతి బడిలో పెరుగుతుండటం వలన, ప్రతిదీ నేర్చుకోవాల్సిన అవసరం వీరికి ఏర్పడుతుంది. అంటే బ్రతుకే పోరాటం. ఈ పోరాటంలో గుంపులుగా నివసించడం తప్పనిసరి. గుంపు నేర్చుకున్న జ్ఞానం అందరిదీ అవుతుంది. అలాగే వ్యక్తిగత అనుభవాల నుండి పొందిన జ్ఞానం కూడా క్రమంగా అందరిదీ అవుతుంది. కాలక్రమంలో గిరిజనుల్లో వైద్యులు ప్రత్యేకంగా రూపొందటం కనిపిస్తుంది. ఏమైనా జ్వరం, ఒళ్ళునొప్పులు, చర్మరోగాలు- చిడుములు, దద్దుర్లు, తలపుండ్లు, పేను కొరుకుడు, గోకుడు, దెబ్బలు, పుండ్లు, అరికాళ్ళ మంటలు, తిమ్మిర్లు, మచ్చలు, మొలలు, మొటిమలు, ప్రసవం, బాలచిన్నెలు, మూర్ఛ, పక్షవాతం, జీర్ణకోశానికి సంబంధించిన రోగాలు, మూత్ర సంబంధమైన వ్యాధులు, స్త్రీల వ్యాధులు, తలనొప్పులు, కామెర్లు, గుండెదడ, గుండెనొప్పి, మధుమేహం, జలుబు, దగ్గు, ఆయాసం, గురక, ఉబ్బసం, కంటి పొరలు, రేచీకటి, ఎముకలు అతకడానికి, ఉన్మాదం తగ్గటానికి, రక్తపుష్టికి, జ్ఞాపక శక్తికి, లైంగిక సమస్యలకి, గర్భ సంబంధమైన పలు విషయాలకి, విషం కక్కించడానికి, పక్షవాతానికి ఇలా ఎన్నో విషయాలకి వీరి దగ్గర మూలికా వైద్య విజ్ఞానం ఉంది.

గర్భం నిలవడానికి :

ముట్టు అయిన తర్వాత వరసగా మూడు రోజులు పదిగ్రాముల గచ్చకాయ పొద (సీసల్ పినియా బండుక్) పూల మొగ్గలు ఒక తమలపాకు (పైపర్ బీటల్) లో పెట్టి తినిపించి గర్భం నిలిచేలా చేస్తారు.

బాలింత రోగాలకు :

ఇరవై గ్రాముల సన్న బాలింతాకు (మొల్లుగోపెంటా పుల్లా) పదిగ్రాముల వెల్లుల్లి దంచి ఆ ముద్దను రోజుకు రెండు సార్లు వరుసగా మూడు రోజులు పురిటాలి చేత తినిపిస్తారు.

నొప్పులు తగ్గి సుఖంగా ప్రసవించేలా :

ఉత్తరేణి (అఖిరాంథస్ ఆస్పరా) వేరు నుండి రసం తీసి పది మిల్లీ లీటర్ల నీటిలో కలిపి తాగించి సుఖ ప్రసవయ్యేలా చేస్తారు. అలాగే ప్రసవానంతరం బలం పుంజుకోవడానికి 'కంగి' గింజలు 'తిరుమాను బంక' సమంగా తీసుకుని నెయ్యిలో దోరగా వేయించి చూర్ణం చేసి తగినంత బెల్లం కలిపి లడ్డులుగా చేసి రోజుకొకటి చొప్పున వారం రోజులు తినిపించి బాలింతరాలు కోల్పోయిన బలాన్ని తిరిగి పొందేలా చేస్తారు.

పాము కాటు / తేలు కాటు :

అడవుల్లో ఉండేవారికి పాము, తేలుకాట్లు, విష పురుగులు, కీటకాలు కుట్టడం ఎప్పుడో ఒకప్పుడు జరుగుతూనే ఉంటుంది. ఈ ప్రమాదాల నుంచి రక్షించుకోవడానికి వీరు పలు పద్ధతులు అనుసరిస్తారు. కొన్ని చూద్దాం.

పొడపత్రి తీగ (జిమ్నియా సిల్వెస్టర్) ఆకులు, మిరియాలు కలిపి నూరి పాము కరిచిన చోట పట్టు వేస్తారు. నాగదొండ (కొరొల్లోకార్పస్ ఎపిజియస్) దుంపను అరగదీసి పాముకాటుకు పట్టువేసి విషం దిగేలా చేస్తారు.

తేలు కాటు :

చందనం, అడవిబెండ, ఇండుప, గింజలు, చింత పిక్కలను గాని అరగదీసి పూస్తారు. విత్తనాన్ని తేలు కుట్టిన చోట అదిమి పెడతారు. అలాగే రేగుచెట్టు ఆకులు నూరి కట్టుకడతారు. అలాగే తుమ్మి, తంగేడు, సోమిచెట్టు మొ॥ వాటి ఆకుల రసాన్ని వాడతారు.

ముళ్ళు తీయడం :

కాలికి గుచ్చుకునే ముళ్ళని తుమ్మ ఆకు నూరి కట్టుకట్టి బయటకు వచ్చేలా చేస్తారు. గోదెబుడ్లు ఆకు, కొద్దిగ బియ్యం, నమిలించి ముల్లు బయటకు వచ్చేలా చేస్తారు.

వొంటికి నీరు :

నీరు పట్టిన శరీరానికి గిరిటికూర ఆకు కూడ వండించి అన్నంతో పాటు తినిపించి అయిదు రోజుల్లో తగ్గిస్తారు.

కడుపునొప్పి :

తునికి ఆకు నమిలించి ఆ రసాన్ని మింగించి కడుపునొప్పి తగ్గిస్తారు.

పిల్లి, కుక్క, ఎలుక, కోతి మొ॥ కరిస్తే గరిక గడ్డి నూరి పట్టువేసి కట్టుకట్టి విషాన్ని హరించేలా చేస్తారు.

అలాగే పచ్చకామెర్లకు, చర్మరోగాలకు, కఫం, దగ్గు, ఉబ్బసం, ఆయాసం, గుండెనొప్పులు మొ॥ అనేక రోగాలకు వీరి వైద్యం ప్రసిద్ధి చెందింది.

అయితే ప్రచారం లేకపోవడం వలన వీరి వైద్యం ప్రాచుర్యంలోకి రావటం లేదు. వీరు అనుసరిస్తున్న విధానాలను దొంగతనంగా నేర్చుకుని, తెలుసుకుని నాగరిక ప్రపంచం మందులు రూపొందించి వ్యాపారం చేస్తుంది. ఎన్నోసార్లు వీరి వైద్యం నమ్మదగినదిగా ఉండటం రుజువైంది. కొన్నిసార్లు నాగరిక ప్రపంచంలో కొన్ని రోగాలకు, మందులు కనిపెట్టక ముందే, గిరిజనులు దిగ్విజయంగా ఆరోగాలను తరిమికొట్టిన వైనం కనిపిస్తుంది. గిరిజన వైద్య విధానాల మీద పరిశోధన చేసిన డా. కొప్పల హేమాద్రి గారు ఇటువంటి ఎన్నో విషయాలను పత్రికా ముఖంగా వెల్లడించారు. ఖమ్మం, తూర్పుగోదావరి ఏజెన్సీ జిల్లాల్లో పని చేయడం వలన వీరి గురించి ప్రత్యక్షంగా చూడటం జరి గింది. నల్లమల చెంచులతో కలిసి ఉండటం వలన కూడా ఈ విషయాలను గ్రహించటానికి అవకాశం ఏర్పడింది.

గిరిజన బంజారాలు – చైతన్య స్రవంతి గేయాలు

– డా॥ ఆర్. కుసుమ కుమారి, ప్రిన్సిపాల్ (FAC) & తెలుగు అధ్యాపకురాలు, గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, వి. మాడుగుల, విశాఖపట్నం.

తెలుగు రాష్ట్రాలలో గిరిజన తాండాలు కొన్ని వంద లకు పైగా ఉన్నాయి. వీరు ఈనాటికి అభివృద్ధి చెంద కుండా, కొన్ని తాండాలు నాగరికతకు దూరంగా దుర్భర మైన జీవితాన్ని గడుపుతున్నారు. కొన్ని ప్రాంతాలలోని బంజారాలు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తుండగా, మరి కొంతమంది సున్నపురాళ్ళు కాల్చి వాటిని గ్రామాల లోకి తీసుకెళ్లి అమ్ముకోవడం, మరి కొంతమంది రిక్షా లాగడం, మరి కొంతమంది వ్యవసాయకూలీలుగా, కట్టె లను గాడిదలపై వేసుకొని సమీపపల్లె, పట్టణ ప్రాంతా లలో అమ్ముకొని పొట్టపోసుకుంటున్నారు. అలా వీరు పనులకు వెళ్ళి నప్పుడు చేస్తున్న పనియొక్క కష్టం తెలియకుండా ఉండటం కోసం వీరు గేయాలను పాడు కోవడం జరుగుతూ ఉంటుంది.

వీరు కేవలం కాయకష్టం సమయంలోనే కాకుండా వీరు ప్రతి విషయాన్నీ, విశేషాన్ని కూడా గేయరూపంలో పాడుకోవడం వీరి ప్రధాన ఆచారం. అది కష్టమైనా, సుఖ మైన, దుఃఖమైన, ఆనందమైనా సరే వీరు ఆశ్రయించేది మాత్రం గేయాన్నే. బయటి ప్రపంచంలో ఇతర కులాల వాళ్ళకు వీరు బంజారా వాళ్ళు అని తెలిస్తే వాళ్ళు మాట్లాడే మొదటి మాట 'వాళ్ళు పాడతారు కదా' అంటుంటారు. అంటే బంజారాల సంస్కృతిలో ఈ గేయాలు ఎంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయో దీనిని బట్టి మనకు తెలుస్తుంది.

కాబట్టి బంజారాల సంస్కృతిలో వివిధ సందర్భాలలో వారు పాడుకొనే కొన్ని గేయాలను పరిశీలించి వివరిం చడం జరిగింది.

భీయ్యారే మార్ గోర్ భీయ్యా
కష్టా భారి క రేరే గోర్ భీయ్యా
మార్ గోర్ భీయ్యా
రాజస్థానేరో రాజ్‌వెత్తోరే రాజదానీన
ఛోడన్ కశేన్ ఆయెరే
గామేతీ ఛేటియెన్ తాండో భాందేరే
గావు గోదాన పాళేలాగరే
మార్ గోర్ భీయ్యా!
మా, బాపున్ చోడన్ అయెలాగరే
కూలీ నాలీ కరేలాగేరే.
మార్ గోర్ భీయ్యా!
(రామావతు నర్సింహ, వ. 45 సం.),
వెంకటాయపాలెం, గుంటూరు జిల్లా .

భావం :

ఓ బంజారా నాయక్‌కులారా! నీ యొక్క రాజస్థాన్ రాజ్యాల్ని విడిచి ఈ కొండ కోనల్లో ఎందుకొచ్చారు? పశువులను మేపుచు, తల్లితండ్రులను విడిచిపెట్టి, ఈ కష్టాల పాలవడానికి కారణం ఏమిటి? అని చరిత్రను తలచుకుంటూ పాడేపాట.

పల్లవి : జగేరి ఎతాండేమా ఏభీయ్యా కాయి వేగే తమరే
క్వారేరో కుండా గ్వారురి తాండేమా నాయక వేగోరే - 2

చరణం 1 :

"పూధ్వీ చౌహాన్ నామలిదేతో
క్వారురి ఛాతిమా ఛేకే పడితి
క్వారుతి వ్యారకరన ప్యాన
ఢిల్లీమా నాయకి కీదేరే ఆపణ
వాలి శుక్రేర్ జాతెరే భీయ్యా ఆపణి గ్వారురిరే
ఘోడేఫర్ సవారి మారన్ వ్యార కిదేజకోరే
॥ జగేరి ॥ - 2

చరణం 1 :

రాణా ప్రతాప్ సింగ్ రాథోడ్ భీయ్యా
మియ్యాతి వ్యార కర కరన

జంగలే జోలేమ దాడ కాడన్
రాజస్థానేమా రాజ కేరాయో
చింతా ఏగే గ్వారరే ఏభీయ్యా ఝులలిదే జోలరే
ఆపణి భేనున ఫేట్యా పేరాన మొడలిదే ఢాళరే
॥ జగేరి ॥ - 2

చరణం 3 :

జోలేన నాయకేరి నంగరి కేలేన
రాతడి రంగేరి పాంకడి భాందలిదే
దేవలోకేరి భజన భజే
గొరి ఓటేరి ఏచన్ వచే
కాకొటిమ పాసరే ఏభీయ్యా రమన్ నొక్త కిదరే
రాయమల కాంజిర ఆపణ డొరణ బాందేరే
॥జగేరి॥ - 2

చరణం 4 :

క్వారురి జాతేరి వాతే మానన
వేచలిదే ఆపణ గ్వారురి జాతేన
ఆపణి బ్యానున సాడొ బందాన
చోడ దినే దండి యాడిరి సేవాన
హేమా సాదేరి వాతెన ఏ భీయ్యా భులగేచో తమరే
పయింట ఝగల పార్యలేన జలలిదే గామరే
॥ జగేరి ॥ - 2

(రాథోడ్ ప్రేమ్‌చంద్‌నాయక్, వ. 60 సం.)
తాడవాయి తండా, గుంటూరు జిల్లా.

భావం :

1. తండాల్లోనే ఉంటున్నా ఓ అన్నలారా!
మీకేమైంది ఓరన్నా!
పృథ్వీ రాజ్ చౌహాన్ పేరువింటేనే
ఇతరుల గుండెల్లో గుబులు గుండేది
ఇతరులతో పోటాపోటీగా ఢీల్లీలో రాజ్యాలేలా రురా!
వాలిసుగ్రీవులమంతటి శక్తివంతులమన్నా!

2. గుర్రాల మీద స్వారి చేస్తూ యుద్ధాలు చేసి ఉంటిమి
రాణాప్రతాప్‌సింగ్ మన రాథోడ్ కదన్నా
ఇస్లాంమత రాజులతో యుద్ధాలు చేశాడన్నా!
యుద్ధాలతో జయించి
రాజస్థాన్‌లో ఉన్న ఓ బంజారన్నాలారా

3. మొత్తం ఏకమై ముందుకు సాగండి రా!
అంతా ఒకటయి, నంగారా, (పెద్దడ్రమ్ము) మోగించండి.
మేము కూడా అందరి లాగా వ్యవహారాలు చేయగలమని
సమరసింహాలై గర్జించండిరా!

4. మోతుపరుల మాటలు విని
అమ్ముడు పోయాం, మోసపోయాం ఇన్నాళ్ళు.
మన అక్కాచెల్లెళ్ళ, అన్నా తమ్ముళ్ళ
బాగోగులకోసం ముందుండి నడిపించరా !
నీ సమాజాన్ని, మునుముందుకు ఓరన్నా!
బంజారన్నా!.

"లకణి సీఖో భాయి తమ్ ఆచ్చొబంచెన
లకణి సీఖో భ్యానె తమ్ గ్యానకరెన - 2

పల్లవి : బన లకణీర నరసె లాకడేతి భూండెరే
లకణి వాళ నరదేఖొ హుంసేతి బ్యాటే చరే
లకణి సీకతో మాలం వచ్చు జాతేరి భావటిరే
భాయి భ్యానే లకణి సీకన్ కరలీజో వజాళోరే
॥లకణి సీఖో॥

జణి తీయాడి సరిక బడి మాయి లకణి సీకొరె
గ్వారూరొ వచన లకేన పెన్ను ఝులలీజొరె
బన లకణీర గ్వారసె ఝాంపడీమ రోరేరే
ఆంకీ రేన కాయి ఫాయదో బనలకణీర ఆందేరే
॥లకణి సీఖో॥

ప్యానారొ నాచొ దేక దేకన్ హూంస కీదొ హూనియ
సిల్మామ క్వారీన దేకన్ భూలగీర హునకి
టి.వి. మాయి ఆడి జాడి ఆంధ్రారి క్వారి ఆరి
హుందూన దేక దేకన్ లడెలాగి ఆపణి నారి
॥లకణి సీఖో॥

లకణి సీకతో మాలం వచ వాతే కూంకన కరేరొ
లకణి సీకతో మాలం వచ అచొ కుంకన్ బంచెరొ
లకణి వాళ క్వారి క్వార లూటరేచ గ్వారున
యాండె వేన ఫరరేచ పాపి దారు పీలెన
॥లకణి సీఖో॥

బామణ గుడిమ బ్యాసన లూటన పొట్ భాందెరే
థొరియ తాండుమ ధాంసన ఆన ఓట్ మాంగేరే
ఓటెమాయి మోటొ వేన క్వార సీట చడగొ
టాండుమాయి గ్వారలోక ఠాల ఏన బ్యాసగె
॥లకణి సీఖో॥

(నూన్యావత్ భీమానాయక్, వ. 77 సం.)
చిట్యాలతండా, గుంటూరు జిల్లా.

భావం :

మీరు బాగా బతకటానికి చదవడం నేర్చుకోండి తల్లీ! జ్ఞానం సంపాదించటానికి చదువు నేర్చుకోండి చెల్లీ!

1. చదువులేని బ్రతుకులు ప్రాణంలేని కట్టెతో సమానం
   చదువు సంధ్యలున్నవాళ్ళు తెలివిగా బ్రతుకుతున్నారు
   చదువుకుంటే తెలుస్తాయి సమాజం యొక్క పోకడలు
   అక్కలారా, అన్నలారా చదువుకొని బాగుపడండి. మీరు బాగా బ్రతకటానికి.
2. అమ్మలాంటి బడిలో చదువు నేర్చుకొండి
   బంజారాల వ్రాత వ్రాయటానికి కలం పట్టుకోండి
   చదువుకోకపోతే ఎన్నటికి బ్రతుకులు మారవు
   కళ్ళుండి ఏం లాభం చదువులేని బ్రతుకు వ్యర్థం గుడ్డివాడితే సమానం.
3. పురాతనమైన నృత్యం చూసి హునియా నవ్వుకుంటున్నాడు
   సినిమా హీరోయిన్‌ను చూసి మురిసిపోతుంది హునియమ్మ
   టీవీలోన ఎర్రఎరన్ని అమ్మాయిలను చూసి, అలాంటి
   వస్త్రాలు కావాలని గొడవలు చేస్తున్నారు మన మగువలు.
4. చదువుకుంటే తెలుస్తుంది సంస్కారం
   చదువుకుంటే తెలుస్తుంది తెలివిగా ఎలా బ్రతకటం
   బాగా చదువుకుంటే ఎవ్వరు మోసం చెయ్యలేరు పాపిష్టి సారాయి త్రాగి పిచ్చోళ్ళై తిరుగుతున్నారు.
5. బ్రహ్మణుడు గుడిలో కూర్చొని, మూట కట్టుకుంటాడు
   దొర ఏమో పరుగున వచ్చి ఓటు అడుగుతున్నాడు
   ఓటు వేయించుకొని దొర గద్దెనెక్కాడు
   తండాలలో మనుషులంతా బ్రతకటానికి తండా ప్రజలు పాట్లు పడుతున్నారు.

పల్లవి : భీయ్యాభీయ్యారే బంజార భీయ్యారే
ఆచ్చో బంచన్ నాయేకి కరోర - 2

చరణం 1 :

రాజ తేజలేర దాడకతొ అపణేన అయేచ భీయ్యా
వాలి సుకరేర జాత అపణసర్వణేర నూతర అపణ
పంచ్యా రూమాల భాందన చాలో హతేమాయి
బర్చి ఝుల్లో
॥ భీయ్యాభీయ్యారే ॥

చరణం 2 :

అచ్చోసామి కన కేరెచో తమి కాయి నామ లారెచో భీయ్యా
రాతన దీయ భావేటి కరన్ క్వారూరి జాతేన బాగుకరరేచో
ఏక రపీయారో ఝూడ దేన దీ రపియ కన లకలేరో
బేటి బేటాన బడి సిఖావో, నాయకి తమ కరన చాలో
॥ భీయ్యాభీయ్యారే ॥

చరణం 3 :

గటలారి కోబల్ దేకో వార్సాళేరో గీద్ బోలరీచ
సీళివాళేరో మబ్బు దేకో ధ్వాళే వాజళేరో పాణి పడో
డావ ఝుమణ బళదూ భాందో గళేమాయి ఝుగర భాందో
గ్వారా గ్వాణ్ణి గీద బోలన దాణ దూణి నాకలీజో
॥ భీయ్యాభీయ్యారే ॥

చరణం 4 :

ఆపణితో భ్యానేదేకో బల్యా వాంకడి కాడలీది
బల్య వాంకడి కాడలేన హతేమ బంగడి ఘూల లీది
క్వారీరి సాడ భాందలీది దండియాడిన సాంస దీని
॥ భీయ్యాభీయ్యారే ॥

(బాణావత్ బాలూనాయక్, వ. 85 సం.)
పెద్దవడ్లపూడి, గుంటూరు జిల్లా.

భావం :

అన్నలారా ! ఓ అన్నలారా ! బాగా బతికి మీరు నాయకులుగా ఎదగాలి. మనకు రాజరికపు లక్షణాలు వచ్చాయి. వాలి, సుగ్రీవుల జాతి మనది. పంచ, రుమాలు కట్టుకొని చేతిలో కత్తి పట్టుకొని నడవాలి. మంచి ఆసామి దగ్గర పని చేస్తున్నారని మీరు చేస్తున్న పని ఏమిటి ? పగలు, రాత్రి కష్టపడి పరులను బాగుపెడుతున్నారు మీరు. ఒక్క రూపాయి మందు ఇచ్చి రెండు రూపాయిలు తీసుకొని మోసం చేస్తున్నాడు. పిల్లలకు చదువు చెప్పిస్తే వాళ్ళే మన జాతికి నాయకత్వం వహిస్తారు. కొండల్లో కోయిలమ్మ, వాన కోసం పాట పాడుతుంది. మబ్బుపట్టి చల్ల గాలి వీచి, వర్షం పడుతుంది. కాబట్టి ఆవులకు పగ్గాలు కట్టండి. భార్య భర్తలు పాటలు పాడుకుంటు విత్తనాలు చల్లుకొండి. కష్టపడి పంట పండించుకొండి అన్నలారా ! మన స్త్రీలు (బంజారా) దంతగాజులు తీసి, మట్టిగాజులు వేసుకున్నారు. మన దుస్తులు వదిలి చీర, జాకెట్టు ధరించారు. మన దేవత మన వారి ఎదుగుదలకు ఊపిరి పోస్తుంది చూడండి అన్నలారా ! ఓ అన్నలారా ! రైతులను నాయకులు, దళారీలు మోసం చేయకుండా ఉండాలంటే చదువు ఒక్కటే మార్గం అనే సందేశం మనకు కనిపిస్తుంది.

ముగింపు :

బంజారాల గేయాలను పరిశీలించినట్లయితే వారి బాధలు, భావాలు తెలుస్తాయి. అంతేకాకుండా వారు అమాయకులు కావున ఇతర కులాలవాళ్ళు తమని ఎలా మోసం చేస్తున్నారో, వారి నుండి ఎలా బయటపడాలో వారిని, ఎలా ఎదుర్కొవాలోనని ఈ గేయాల్లో చెప్పడం జరిగింది.

ఇంకా వారి ఆర్థిక స్థితిగతులు మెరుగుపడాలని దేవుణ్ణి ప్రార్థిస్తూ పాటలు పాడటం కనిపిస్తుంది. వారికి కష్టం వచ్చినా, బాధ కలిగినా పాట రూపంలో వ్యక్తం చేయడం గమనించదగ్గ విషయం.

ఈ మోసాల నుంచి బయట పడాలంటే వారు బాగా చదువుకోవాలని, జ్ఞానాన్ని సంపాదించాలనీ, ఇతరుల్లా బంజారాలు కూడా ఇతర కులాల్లా ఎందులోను తీసిపోలేరని, ఇలాంటి ఎన్నో ఉత్తేజపరిచే, చైతన్యాన్ని కలిగించే గేయాలు ఉండడం వారి యొక్క ప్రత్యేకమైన శైలికి సంస్కృతికి నిదర్శనం.

పాదసూచికలు :

1. గ్యానె ధ్యానేర్ గ్వాయార్ గీద్, ప్రేమచంద్‌నాయక్, పుట 16.
2. గ్యానె ధ్యానేర్ గ్వాయార్ గీద్, ప్రేమచంద్‌నాయక్, పుట 16.

గిరిజనుల విద్య – చిన వీరభద్రుడు గారి అవగాహన – కృషి

– డా॥. వై. వి. సైలెచే. లీలా పద్మస, విభాగాధిపతి, తెలుగు విభాగం, రాజా ఆర్.ఎస్.ఆర్.కె. రంగారావు కళాశాల, బొబ్బిలి, విజయనగరం జిల్లా.

'విద్యలేనివాడు వింత పశువు' అనే మాటను మనం అనాదిగా వింటున్నాం. అలాగే విద్య అంటే ఏదో ఒక విద్యను చదవడం కాదు. ప్రజలు సాధారణంగా విద్యని కూడా విలువ కట్టి తమ పిల్లలు బాగా సంపాదించడానికి పనికొచ్చేదే విద్య అనుకుంటారు. కానీ చదువంటే విద్యార్థుల శీలాన్నీ, సత్ప్రవర్తననీ పెంపొందించడమనే భావన కలగాలి. మనకి నిజంగా స్వతంత్రులుగా ఉండడానికి ఏ చదువు సహకరించదో దాన్ని ధిక్కరించండి. అటువంటి చదువు రాక్షసం, పాపభూయిష్టం అని అంటారు మహాత్మా గాంధీ.

యుగమేదైనా జాతి ఏదైనా విద్య అనేది వారికి ముఖ్య అవసరంగా వుంది అనేది మనకు పురాణాలు, చరిత్ర చెప్పే నగ్న సత్యాలు, ఉదా :- రాక్షసరాజైన హిరణ్య కశిప్పడు తన కుమారుడైన ప్రహ్లాదుడిని శుక్రాచార్యుని కుమారులైన చండా మార్కుల వద్దకు పంపినపుడు చదువు ఆవశ్యకత నిలా చెప్పారు. 'చదువని వాడజ్ఞుండగు చదివిన సదసద్వివేక చతురతకలుగును, చదువగ వలయును జనులకు, చదివించెద నార్యులొద్ద చదువుము తండ్రీ' అంటూ చెప్పిన ఈ మాటల్ని బట్టి చూస్తే చదువు వల్ల ఏది మంచీ ఏది చెడూ అనే వివేకం కల్గుతుంది. మనిషికి తిండి, బట్ట, గృహం లాగే మెదడు ఆకలి తీర్చే చదువు కూడా తప్పని సరి (కనీస) అవసరంగా గుర్తించాలి. అయితే పైన మనం చెప్పుకున్న విద్యావశ్యకత కేవలం నగరంలోని వారికే కాదు. పల్లెల్లో, గ్రామాల్లో వున్న వారికి కూడా వుంది. చాలా వరకు చూస్తే ఇది కొంత వరకూ సాధ్యం అయింది. కానీ ఇంకా కావల్సింది ఎంతో వుంది.

1) పోతన - మహాభాగవతం - సప్తమస్కంధం - ప్రహ్లాద చరిత్ర

చిన వీరభద్రుడి గారి - కొన్ని కలలు - కొన్ని మెల కువలు - సార్వత్రిక విద్యతో నా అనుభవాలు - అనే పుస్తకం ఆధారంగా ఈ వ్యాసం వ్రాయబడింది.

గిరిప్రాంతాలలో వున్న గిరిజనులకు విద్య అనేది గగన కుసుమంగా వుంటున్న విషయం జగద్విదితమే. ఇదే విషయంలో శ్రీ వాడ్రేపుచిన వీర భద్రుడిగారి ఆలోచనా, ఆవేదనా, కృషి ఎట్లా వున్నాయో తెలియచెప్పేదే ఈ వ్యాసం.

చిన వీరభద్రుడి గారి సామాజిక స్వప్నం ఎలాంటిదో ఆయన మాటల్లోనే చూద్దాం. ఈయన మొదటి కల - ప్రతి మనిషీ బాల్య, కౌమార యవ్వన అవస్థల్లో ప్రపంచం పట్ల కుతూహలవంతంగా తన నేత్రాలు విప్పుకోవాలని, నేర్వడానికి, తెలుసుకోవడానికి, ఉత్సాహపడాలని తెలుసుకోవడం దానికదే ఒక అనుభవం, ఒక ఆనందం, జ్ఞానానుభవం ఒక్కటే నిజమైన ఆనందానుభవం.

రెండవకల - ప్రతివిద్యార్థికీ విద్యాను భవం కుతూహల వంతమైన అనుభవంగానే కాక ఆ అనుభవంలో అతని కుతూహలాన్ని ఆరకుండా ప్రజ్వలింప చెయ్యగల సహన శీలురైన తల్లిదండ్రులూ, ఉపాధ్యాయులూ కావాలి.

మూడవ కల :

పూలతోటవంటిది పాఠశాలల నిర్మాణం. అయితే వీర భద్రుడు గారు ఈ కలలు కనడమేకాదు. అబ్దుల్ కలాం గారు 'ది వింగ్స్ ఆఫ్ ఫైర్' లో చెప్పిన కలలు కనండి కానీ వాటిని సాకారం చేసుకొనే ప్రయత్నం చెయ్యండి అన్నట్లు సాకారం చేసుకొనే ప్రయత్నాన్ని పూర్తిగా చేసుకొన్నారు. సాకారం చేసుకోవడానికి వచ్చిన ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగారు. కనుకనే ఆయన మాటలు, చేతలు, మనసు ఒక్కటిగా నిలిచాయి.

అంతేకాదు 'నా కలలకి నేను ఎంత ఋణపడి వున్నానో నా మెలకువలకి - కూడా నేను అంతే ఋణపడి వుంటాను అంటారు.' ఇది ఎంత అర్థవంతమైన మాట. ఈ మెల కువలు కూడా నాకై నేను మొదటిసారి పొందినవి కావు. నా ముందు ఎందరో విద్యావేత్తలు, భావకులు, రచ యితలు అటువంటి మెలకువలకు లోనయిన వారే అంటారీయన. ఈ మాటల్లో ఎదిగినా ఒదిగి వుండే తత్వం కనబడుతుంది. అదీకాక మహనీయుల సామాజిక స్వప్నాలు ఆయా కాలాల నాటి సమాజానికి ఏదికావాలో ఆ దిశగానే సాగుతాయి.

విద్య అంటే మనిషి, ఆత్మకి శిక్షణ ఇవ్వడమని గాంధీజీ అన్నదాన్ని గుర్తు చేస్తూ విద్యనివ్వవలసిన పాఠ శాలలు ఆ ఆత్మని మేల్కొలిపేవిగా వుండాలి గానీ దాన్ని శాశ్వతంగా నశింప చేసేవిగా వుండకూడదు అనే ఉత్కృష్ట ఆలోచనను వీరభద్రుడిగారు మనతో పంచుకున్నారు.

వీరభద్రుడు గారు నివసించినది తూర్పు గోదావరి దగ్గర వున్న గిరిజన ప్రాంతమే. అక్కడి నుండీ ఆయన గుంటూరు జిల్లా తాడికొండ గురుకుల పాఠశాలలో సుశిక్షితులైనారు. అలాంటి పాఠశాల క్రమశిక్షణను ఆయన తరువాత విద్యలో ఎక్కడా చూడలేదు అన్నారు. అలాంటి అసంతృప్తితోనే ఆయన తనకున్న డిగ్రీ విద్యా పరిజ్ఞానం తోనే పై చదువులు చదవకుండా చిన్న ఉద్యోగంలో చేరా నని ఆయన పేర్కొనడం జరిగింది.

అయితే ఈయన విశ్వావిద్యాలయం చదువు చదివితే మనకు ఈయన సేవలు అందేవో లేవో. ఆయన కలలు సాకారం అయ్యే ఉద్యోగమే ఆయనను వరించింది. రాష్ట్ర ప్రభుత్వం సర్వీస్ కమీషన్ నిర్వహించిన పరీక్షల్లో జిల్లా గిరిజన సంక్షేమాధికారిగా ఉద్యోగం వచ్చింది. దానిలో భాగంగా పార్వతీపురానికి ఎనిమిది నెలల ట్రయినింగ్‌కు వెళ్ళమని ఉత్తర్వులు అందుకొన్నారు. దాని నిమిత్తం మొదటి రెండు వారాలు ఏదన్నా హాస్టలుకు వార్డెనుగా పనిచెయ్యాలి. ఆ హాస్టలు నిర్వహణా బాధ్యతను వారం రోజుల పాటు ఆయనే పూర్తిగా వహించాలి. గుమ్మ లక్ష్మీపురం మండలం లోతట్టు అడవిలో వుండే గొయిపాక అనే చోట ఉండే ఆశ్రమ పాఠశాలకి వెళ్ళారు. రాయగడ వెళ్ళేదారిలో ఒరిస్సా సరిహద్దుల్లో వుండే జిమిడిపేట గ్రామానికి వెళ్ళారు. ఆ ప్రయాణం ఎంతో కష్ట నష్టాలతో కూడి వుంది. నాగావళి నదిలో నడుచుకుంటూ వెళ్ళారు. అక్కడి నుండీ బీరుపాడు అనే కోదు గ్రామానికి చేరారు. ఇది నిజమైన గిరిజన గ్రామంగా భావించారీయన. ఇక్కడి నుంచీ విద్యా కార్యక్రమాలు చేపట్టాలి. అంటే అది సులభ మైన విషయం కాదు. అలాగని ప్రయత్నిస్తే అసాధ్యమైన విషయమూ కాదని అనుకొన్నారు. గిరిజనుడు మరెవ్వరి దయాదాక్షిణ్యాల మీదా ఆధారపడ నక్కర లేకుండా తన వ్యవహారాలు తాను చక్క బెట్టుకొనే నైపుణ్యాలు కల్పనకి ప్రధాన ఆధారం విద్య అనీ, అది వారికి అందాలనీ దాని అవశ్యకతను వారు గుర్తించాలని, తలచారు. వీరభద్ర రావు గారు బీరుపాడులో మూడు రోజులున్నప్పుడు ఆయన అక్కడ చుట్టుపక్కల కోదుపల్లెల్ని చూశారు. కోదుల్ని కొండ దిగువున జాతాపులంటారు. ప్రక్కనే వున్న విశాఖ జిల్లాలో సామంతులని పిలవబడతారు. ఒరిస్సా సరిహద్దులో వున్న గ్రామం బీరుపాడు. అటు పక్క కోరాపుట్ జిల్లాలోని గిరిజన ప్రాంతాలున్నాయి. కానీ వాటికి సరిహద్దులేమి లేవు. ఆ కోదులు మాట్లాడేది కుయి అనే పురాతన భాష అని గ్రహించారు.

వీరభద్రుడు గారు తన వృత్తి నిర్వహణలో పరిశీ లించిన అంశాలు, ఆయా అనుభవాల కారణంగా ఆయన ఏర్పరచుకున్న ప్రణాలికలు, ఇచ్చిన సూచనలు అనే అంశాల వారీగా పరిశీలిద్దాం.

ఆ గిరిజన పాఠశాలల్లో ఉండవలసిన ఉపాధ్యా యులు వుండలేక పోవడం, ఒక వేళ ఒకరో ఇద్దరో వున్నా వారే హాస్టలు కూడా నిర్వహించాలి. గనుక గిరిజన కార్పొ రేషన్ నుండి ఆ కొండ ప్రాంతాలకు సరుకులు తెచ్చి వండి, వడ్డించే ఏర్పాట్లలోనే తమకు సమయం చాలేది కాదు. అదీకాక ఆ కొండ ప్రాంతాలలో వుండే అరాకోరా సౌఖ్యాలతో తన కుటుంబంతో సహా వుండలేక ఎప్పు

డెప్పుడు తమను ట్రాన్స్ఫర్ చేస్తారని ఎదురు చూడడం, ఒక వేళ ఉద్యోగానికి వచ్చినా పిల్లల్ని పాఠశాలకు పిల్చు కొచ్చేందుకే వాళ్ళకు సమయం సరిపోయేది. అదీకాక ఆ పిల్లలు వచ్చినా ఆశ్రమ పాఠశాలల్లో ఆహారం దొరుకు తుందన్న ఆశతోనే వచ్చేవారు. బీరుపాడు నుండీ వచ్చిన వీరభద్రుడు గారు అక్కడ గిరిజన పాఠశాలకు కావల్సిన అవసరాలను, వసతులను ఒక లిస్ట్‌గా చేసి ఇచ్చారు. కానీ దాన్ని ఆ కార్యాలయం విస్మరించడం ఒక విశేషం.

ఆయన తన ఎనిమిది నెలల శిక్షణలో దాదాపు రెండు వందలకు పైగా ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించి ఉన్నారట. చాలా వరకు ఆ కార్యాలయాలు ప్రజల సమస్యల పట్ల స్పందించేవిగా లేక పోవడం. అలాగే రోడ్డుకి లోపల లోతట్టు గిరిజన ప్రాంతాల్లో పనిచేసే పాఠశాలలు అసలు పని చేసేవి కావనీ గమనించారు.

గిరిజన గ్రామంలో ప్రభుత్వం పాఠశాలని తెరవడమే ఎంతో కష్టమైన పని. అలాంటిది ప్రభుత్వం తెరిచిన ఆ పాఠశాల పనిచెయ్యక పోవడం ఎంతో విషాదం అనీ అనుకున్నారు. గిరిజన ప్రాంతాల్లో గిరిజనుల స్థితిగతుల్ని చూసిన ఎవరికైనా కనీస సౌకర్యాలు లేకుండా వున్న వారికి కనీసం విద్య అయినా అందితే బాగుండనే భావం అంద రికీ అనిపిస్తుంది. ఎందుకంటే విద్య అన్నిటి నుండీ అధిగ మింప చేయగలశక్తి కలది. అలాగే ఆంత్రోపాలజీ (గిరి జనాభివృద్ధి) గురించి వ్రాయబడిన గ్రంధాలు ఈయన చదివారు. అందులో ఈయనను ఆకట్టుకొన్నది, ఆది వాసీల గురించి 'ద ఆంత్రో పోలాజికల్ స్టడీ ఆఫ్ ఎడ్యు కేషన్' అనే గ్రంధం ద్వారా ఈయనను అర్ధమయిన అంశాలు గిరిజన ప్రాంతాల్లోని విద్యా వ్యవస్థలోనూ, నిర్మాణాల్లలోనూ ప్రగతి వ్యతిరేక అంశాలు, సాంస్కృతిక వ్యతిరేక అంశాలూ జన జీవితానికి సంబంధంలేని అంశాలూ విస్తారంగా వున్నాయని బోధపడింది. అంతేకాదు అటువంటి విద్యావ్యవస్థను తమకి తెలియకుండానే గిరి జనులు తిరస్కరిస్తున్నారనీ అందుకూ గిరిజన ప్రాంతాల్లో విద్యాలయాలు పనిచేయలేకపోతున్నయనీ గ్రహించారు.

విధాన పత్రం గురించి ఈయన వ్యక్తీకరించిన అంశాలు :

దానిలో ఆదివాసుల విద్య గురించి, ఎటువంటి చర్చగా నీ దిశానిర్ధేశంగానీ లేక పోవడం, దళితుల, ఆదివాసుల, వెనుకబడిన వర్గాల శారీరక వికలాంగుల విద్యలన్నిటినీ ఒకే గాటన కట్టడం.

కాబట్టి ఆదివాసుల విద్య గురించి ఈయనకు ఎదురైన అస్తవ్యస్థ పరిస్థితుల్లోంచే ఈయన ఒకదారి వెతుక్కుని ముందుకు సాగినట్టు తెలుస్తుంది. గిరిజన విద్యాసమస్యల్ని అర్ధం చేసుకున్నట్లయితే భారత జాతీయ విద్య తన సమస్యల్ని తాను మరింత విస్పష్టంగా బోధ పరచుకోగలుగుతుంది. పాఠశాల విద్యలో పునరావృత్తి తప్పనిసరి. పదే పదే వల్లె వేయించాలి. గిరిజన సంక్షేమాధి కారిగా ఈయన తన పాత్రను గుర్తించారు. శిక్షణ పూర్తియిన అనంతరం దాన్ని అమలు చూపాలని ప్రయ త్నించి కొంత వరకు సఫలీకృతులైనారు. అంటే గిరిజన విద్యార్థుల్ని పాఠశాలలవై ఆకర్షితులను చేయాలి. టాగోర్ కలగన్నట్లుగా పిచ్చిన గూళ్ళుగా పెంపొందించాలనీ అను కున్నారు.

వీరభద్రుడిగారికి శిక్షణ పూర్తికాగానే సమగ్ర గిరి జనాభివృద్ధి సంస్థ పార్వతీపురంలో నియమించబడ్డారు. పార్వతీపురం గిరిజన ప్రాంతం ఒకప్పటి శ్రీకాకుళం జిల్లా నుండి విడివడి విజయనగరం జిల్లాలో భాగమయ్యింది.

అందులో పూర్తి గిరిజన ప్రాంతం ఎనిమిది మండ లాలు కాగా ప్రధానంగా గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస మండలాలుగా వుండేవి. వాటిలో కురుపాం మండలంలో ప్రధాన గిరిజన తెగ సవరలు. వారు అతి తక్కువ అక్షరాస్యతతో వుండేవారు. వారిదైన భాష, సంస్కృతిక ఆచారాలతో వుండేవారు. ఇక గుమ్మ లక్ష్మీపురంలో ప్రధానంగా జాతాపులు, సవరలతో నిండి వుండేది. అక్కడి లోతట్టు గ్రామాల్లో ఎలాంటి సౌకర్యాలు లేవు.

రెండవ భాగం పార్వతీపురం, కొమరాడ మండలాలు, అక్కడ ఎక్కువ భాగం కొండ దొరలు, జాతాపులు

వుంటారు. అందులో కొమరాడ మరీ వెనకబడ్డ మండలం కావడంతో ఎలాంటి సౌకర్యాలూ లేవు. మూడవ ప్రాంతంలో మక్కువ, సాలూరు, పాచిపెంట మండలాలు వున్నాయి. ఈ ప్రాంతాలన్నీ గిరిజనేతర దోపిడీకి గురి కాబడుతుండేవి. ఇవికాక శృంగవరపుకోట, మెంటాడ, గంట్యాడ వంటివి పార్వతీపురానికి దూరంగా వుండే గిరిజన గ్రామం. రామభద్రపురం కొండ కింది గ్రామం. దాన్ని ఈయన సందర్శించారు. అలాగే మోదుగ పాఠ శాలనూ చూశారు. ఇంకా ధర్మలక్ష్మీపురం పాఠశాలనీ దర్శించారు. కురుపాం మండలంలోని మొండెంఖల్లులో సంత కార్యాలయానికి వెళ్ళేవారు. అక్కడ ధర్మలక్ష్మీపురం పాఠశాలలో ఈయనకు ఎంతో ఆహ్లాదకర వాతావరణం కనిపించింది. 88-89 విద్యా సంవత్సరం ముగిన పిదప పదవ తరగతి పరీక్షా ఫలితాలు మొత్తం విద్యా సమాజ మంతటినీ సంభ్రమాశ్చర్యాలతో ముంచెత్తేటట్టు వచ్చా యట. ఇదే విజయం ఇంకా కొన్ని పాఠశాలల్లో సాధిం చాలని అనుకొన్నారు. గుమ్మలక్ష్మీపురం మండలంలోని టిక్కుబాయి, జియ్యమ్మవలస మండలంలోని రావాడ రామభద్రపురం, పార్వతీపురం మండలంలోని డోకిశీల, కొమరాడ మండలంలోని ఉలిపిరి, మక్కువ మండలం లోని యెర్రసామంతవలస, సాలూరు మండలంలోని తోణాం, రేగిడి మొ॥న పాఠశాలల పై దృష్టిసారించారు.

ఈయన ఆవేదన చెందిన మరొక విషయం. గిరిజన సమాజపు కేలండర్ వేరు, నాగరిక సమాజపు కాలండర్ వేరు. వారి వారి సంస్కృతులు, పండుగలు కూడా వేరే. కానీ సెలవులిచ్చేటప్పటికి నాగరికుల కేలండర్ ప్రకారం ఎందుకిస్తున్నట్టు. అలాగే ముఖ్యంగా కోదులు, సవరలు వంటి సాంస్కృతికంగా బలంగా వున్న తెగలకు వారిదే అయిన సుసంపన్నమైన భాష వుండగా దానిలో కాకుండా వారికి తెలుగులో విద్యా బోధన వాళ్ళని పరాయీకరణకు గురిచేస్తుంది. క్రమంగా వాళ్ళ మాతృభాషకు వారిని దూరం చేసినట్టే కదా. దళితుల విద్యా వికాసాల గురించి మాట్లాడే టప్పుడు జ్యోతీరావు పూలే గారేటువంటి గౌరవానికి అర్హుడో గిరిజన విద్య గురించి మాట్లాడేటప్పుడు గిడుగు రామమూర్తి పంతులు గారు కూడా అటువంటి గౌరవానికి అర్హుడనేది ఈయన భావం.

అరకొరా సౌకర్యాలతో వున్న గిరిజన పాఠశాలలకు సౌకర్యాలు కల్పించాలి. ముందుగా తగిన స్థలం వెదు క్కొవాలి. పాఠశాల ఎదుగుతున్న బిడ్డలాంటి దన్నారీయన. బిడ్డకు ఎప్పటికప్పుడు ఎలా సంరక్షణ చేస్తామో పాఠశాల అవసరాలు నిత్యం వుంటూనే వుంటాయి.

ఈయన సందర్శించిన పాఠశాలల్లో మరొకటి పాడేరు. ఈ ప్రాంతం అన్నిటి కన్నా చాలా వెనకబడి వుంది. ఋషీవేలీకి చెందిన గ్రామీణ విద్యాకేంద్రాన్ని పాడేరు పాఠశాలలకు రిసోర్స్ కేంద్రంగా వుండమని అడగమని లతా మీనన్ సూచించారట. గిరిజన విద్యకు సంబం ధించిన వీరభద్రుడి గారు తన అనుభవాలలో తక్కిన దేశానికి పనికొచ్చేవి ఎంతో కొంత వుందని భావించారు.

కొన్ని కలలు - కొన్ని మెలకువలు - సార్వత్రిక విద్యతో నా అనుభవాలు అనే వీరభద్రుడిగారి రచనలో చివరిగా ఆయన చెప్పిన అంశాలు చూస్తే అవి నూటికి నూరు పాళ్ళూ నిజం అని మనకు అనిపించకమానదు. నిజమైన అభ్యాసి జీవితకాల సాధకుడు అనే మాటను తాను జీవిత కాలం ఆచరిస్తాను అన్నారు. ముఖ్యంగా 1987 నుండి 1997 వరకు పదేళ్ళ పాటు గిరిజన విద్యారంగంలో వివిధ భూముల్లో చేపట్టిన అనుభవాలను వివరిస్తూ ఆ రచనకు గిరిజన విద్యతో నా అనుభవాలు అనకపోవడానికీ, సార్వ త్రిక విద్యతో నా అనుభవాలు అనడానికి ప్రత్యేక కారణం చెప్పారు. ఎందుకంటే గిరిజనులకు ఆధునిక విద్య అందే క్రమాన్ని సరిదిద్దడమే ఆయన లక్ష్యమని అందుకే సార్వ త్రిక విద్య అనడం జరిగిందన్నారు. ఆధునిక విద్య పిలుపు అందుతున్నప్పటికీ విద్యావంతులు కాలేకపోతున్న అనేక బలహీన వర్గాలు ఇంతదాకా అప్రధానీకరణకు గురవుతూ వస్తున్న వివిధ ప్రజా సమూహాలూ, ఆ దారిలో జరుగు తున్న తప్పులు సరిదిద్దుకోవాల్సిన అవసరం వుందన్నారు.

దీపం ఎవరికైనా వెలుగునే ఇస్తుంది. విద్య ఎవరికైనా జ్ఞానాన్నే ఇస్తుంది కనుక అందుకే బహుశా ఈయన అన్ని బలహీన వర్గాలను దృష్టిలో వుంచుకొని ఇలా అని వుండవచ్చు.

ఈయనకు నచ్చిన పాఠశాలలు :

శ్రీకాకుళం జిల్లాలో సీతంపేట దగ్గర ఈతమానువలస జనచేతన అనే స్వచ్ఛంద సంస్థ సవరల కోసం సవర మీడియంలో నడిపిన మొదటి పాఠశాల అలాగే ఇంకా హట్టగూడ ఇంకా అదిలాబాద్ జిల్లాలో సిర్పూర్ మండలంలో మనహాగాల్‌లో నడుపుతున్న పాఠశాల. అది లాబాద్‌లోని అడవుల్లో కుంతాల జలసాతానికి చేరువలో కొరటికల్ అనే ఆశ్రమ పాఠశాలలో గోండు బాల బాలికలు కోసం నడిపేది మొదలైనవి.

మన మన వ్యక్తిగత గత దర్శనాలు విద్యపట్ల మనకి కలిగిస్తున్న కలల్ని మన మన వ్యక్తిగత అనుభవాల్ని మనకి కలిగిస్తూ వచ్చిన మెలకువల్ని మనమొకరితో ఒకరం పంచుకొంటే ఇప్పుడున్న దానికన్న మనం విద్యా పరంగా మరింత బలపడతాం అనే ఆశతో అయన తన అనుభవాలను రచన రూపంలో పంచుకొన్నారు. మనం కూడా సామాజిక స్పప్నం కలిగివున్న వారమైతే సామాజిక బాధ్యత చూపించే వరమైతే ఆయన పిలుపు నందుకోవాలి. ఆ అవసరం నేటికీ సమాజంలో వుంది అని చెప్పడానికి పాచిపెంట గిరిజన పాఠశాల ఏ స్థితిలో వుందో తెలియ చెప్పే ప్రముఖ పత్రికలో (తేదితో సహా) పడిన సమాచారాన్ని మీ ముందుంచుతున్నాను.

మహాప్రస్థానం - శైశవగీతిలో శ్రీ శ్రీ చెప్పినట్లు "అయిదారేడుల పాపల్లారా మెరుపుమెరిస్తే వానకురిస్తే - "అవి మీకే అని ఆనందించే కూనల్లారా" అది తమ కోసమే అని భావించే చిన్నారి బాల బాలికలకు మంచి విద్యను అందిందాం.

గుంటూరు శేషేంద్ర శర్మగారు పలకే బలపం పట్టిన పిల్లలు బాలాయేసుల్లా కనబడతారు అంటారు. రేపటిని వెన్నెల్లో ముంచుకుతినమంటారు. అంటే వాళ్ళకు భవిష్యత్తు వెన్నెల్లా వుండాలనే భావం.

"పిల్లల్ని రాత్రి ముక్కలు వెన్నెట్లో ముంచుకొని కొరుక్కుంటూ తినమంటారు.

గుంటూరు శేషేంద్రశర్మ - మండే సూర్యుడు.

తెలుగు సృజన మాసపత్రిక – రాగో నవల గిరిజన స్త్రీ సామాజిక జీవితం

– డా॥. లింగాల మంగమ్మ, పోస్ట-డాక్టొరల్ ఫెలో, తెలుగుశాఖ, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాదు, తెలంగాణ.

సమకాలీన సమాజ స్వరూప నిరూపణకు మనుషులు ఎదుర్కొంటున్న సమస్యల్ని, వారు అనుభవిస్తున్న కష్ట సుఖాలను వ్యక్తీకరించడానికి, మానవ జీవిత వాస్తవ చిత్రణకూ, సామాజిక సంస్కరణ నేపథ్యానికి నవలా ప్రక్రియ ఎంతగానో తోడ్పతుందని చెప్పడంలో అతి శయోక్తిలేదు. కానీ సాహిత్యంలో అనేక రచనలు ముందుగా ఏదోఒక సాహిత్య పత్రికలలోనో, మాస పత్రికలలోనో, సాహిత్య పత్రికలలోనో అనేక ప్రచురణలలో నిరంతరం డైలి సీరియల్లోగాని, కథలు, నాటికలు, నవలలు, కవిత్వం మనం ఎప్పుడు చూస్తుంటాం. మొదట ఏప్రక్రియకైన పేరు రావాలి అంటే సాహిత్య పత్రికలైన దిన, మాస, పత్రికలు సంపాదక వర్గంలో ప్రచురించబడుతూ ఉంటాయి. దానిని ముఖ్యంగా తెలుగు దినపత్రికలు ఈనాటి కాలంలో ఎంతో ప్రాచుర్యం పొందినాయి. అందుకనే ప్రతి ప్రతికలోను ఆదివారం ప్రత్యేక సంచికలో సాహిత్యానికి తప్పకుండా ఒక ప్రత్యేక పేజీని ఉంచుతున్నారు. దానికి కారణం ప్రజాదరణ ఉండడం, పాఠకులకు దగ్గర చేరటం, ఖర్చు తక్కువగా ఉండటం వంటి వాటివల్ల దినపత్రికలు, ప్రత్యేక సంచికలలో ఆధునిక ప్రక్రియలు వెలువడుతున్నాయి.

అందులో భాగంగానే ఒక సామాజిక కోణంలో వచ్చిన ప్రక్రియ నవల. అటువంటి నవల తెలుగు సృజన మాస పత్రికలో సీరియల్‌గా వచ్చిన ఒక సామాజిక జాతి మూలాలను వెలికితీసే ప్రయత్నంగా సాధన రాసిన రాగో నవలలో ఉన్న గిరిజన స్త్రీ సామాజిక జీవితాన్ని వివరించడం .

సాధన గత ముప్పై ఏళ్లకు పైగా మధ్యభారతంలోని విప్లవోద్యమంలో రూపొందిన రచయిత. మైదాన ప్రాంత మధ్యతరగతి నుంచి వచ్చిన ఒక యువకుడు విప్లవం గీటురాయిగా తాను వచ్చిన కులాన్ని, వర్గాన్ని, పితృ స్వామ్యాన్ని నిర్మూలించుకుంటూ వచ్చిన గుణాత్మక పరిణతికి రాగో ఒక సజీవ సాక్ష్యం.

సాధన మొదటి నవల సరిహద్దు. రెండో నవల రాగో. ఆదివాసీ జీవితమూ, పోరాటమే కేంద్రమైన నవల. రాగో నవలలో విభిన్న అంశాలకు సంబంధించిన వస్తువులు కనిపిస్తాయి. ఈ నవల 1991 జూన్ నెలలో పూర్తయింది. సాహితీ మిత్రులు "సృజన మాస పత్రికలో సీరియల్‌గా" వేసి, తదనంతరం మొత్తం నవలను అచ్చువేసి పాఠకుల ముందుకు తీసుకొచ్చారు. గోండుల సాంస్కృతిక, సంప్రదాయాలతో పాటు, ఉద్యమ పోరాటంలో గిరిజనుల జీవన చిత్రణను చిత్రించిన నవల రాగో. రాగో నవల 1993లో సృజన ప్రచురణగా వెలువడింది. ఒక రకంగా సరిహద్దు నవలకు కొనసాగింపుగా కనిపిస్తుంది ఈ నవల. పాత్రలు కూడా చాలావరకు రెండు నవలల్లో ఒకే పాత్రలు. కాని ఈ నవల వస్తువు రూపంలో పూర్తిగా భిన్నమైంది. ఈ నవలలో రచయిత గిరిజన స్త్రీ సామాజిక జీవితాన్ని కళ్ళముందుంచారు.

నవల – ఇతివృత్తం :

రాగో యుక్తవయస్కురాలైన మాడియా గోండు యువతి. గోండుల్లో ఉన్న ఆచారం ప్రకారంగా రాగో చిన్నపిల్లగా ఉన్నప్పుడే రాగో తండ్రి పిల్ల నిస్తానని ఒక బీదయువకున్ని లామడే (ఇల్లరికం) తెచ్చుకున్నాడు. రాగో శారీరకంగానేకాక, మానసికంగా కూడా ఆ యువకున్ని ఇష్టపడలేదు. అదే గ్రామంలోని మరొక పెళ్ళైన యువకునితో రాగోకు సంబంధం కలిసింది (బహుభార్యత్వం). పెళ్ళి కాదంటే రాగో తండ్రి లామడే యువకునికి అన్ని సంవత్సరాలకు జీతం కట్టాలి. బలవంతపు పెళ్ళి నుండి తప్పించుకొని కోరుకున్న వాన్ని ఇంటికి వెళ్తుంది రాగో. అతను ఆమెను అట్టిపెట్టుకుంటే ఆ యువకునికి జీతం

ఇచ్చుకోవాలి. కోరుకున్నవాడు భయపడ్డాడు. రాగోను పశువును బాదినట్లు బాదుతూ మళ్లీ తీసుకువచ్చారు తండ్రి, బంధువులు.

రాగో ఈ దుర్మార్గమైన ఖాయిదాను (సంప్రదాయం) ఖాతరు చేయదలుచుకోలేదు. తప్పించుకుని, అడవిలో చెట్లు పుట్టలు పట్టి తిరిగింది. చివరకు స్నేహితురాలి ఇల్లు చేరింది. మళ్ళీ తండ్రికి దొరికి తన్నులు, గుద్దులు వల్ల రాగో మళ్లీ తప్పించుకుంది. ఈసారి మాడియా మనుషులే కాదు మనుషులంతా దుర్మార్గులేనని, వ్యక్తులుగా మంచి వాళ్లుగానే ఉన్నా? తనలాగే పెనుగులాడినా చివరకు ఖాయిదా వాతబడి మనుషులుపట్ల ముఖ్యంగా స్త్రీలపట్ల దుర్మార్గంగా ప్రవర్తిస్తారని ఆలోచించింది. అడవిలో తిరుగుతూ తనకు పరిచయమున్న సమస్త మానవ సంబంధాల గురించి ఆలోచిస్తూ, దారితెన్ను కానకుండా తిరుగుతున్న దశలో దళంతో కలిసి అక్కడి నుండి రాగో దళ జీవితంలో ఊపిరి నలుపకుండా తిరుగుతుంది. తానొక్కటే అనుభవించిన క్షోభ స్వేచ్ఛకోసం పడిన ఆరాటం మాడియా స్త్రీలందరిలోనూ చూస్తుంది. ఈ బాధలు ఖాయిదాల స్వరూప స్వభావాలు అవి మొత్తం ఆదివాసి జీవితంలో పెనవేసుకుపోయిన తీరు అర్థం చేసుకుంటుంది. పార్టీ సభ్యత్వం, తండ్రి రాగోను ఆమోదించడంతో ఈ నవల ముగుస్తుంది. స్థూలంగా ఇది ఈ నవల ఇతివృత్తం.

రాగో నవల - స్త్రీ సామాజిక జీవనం

ఆచారాలు :

గిరిజనుల ఆచారాల వల్ల కూడా చాలామంది యువతి, యువకులు అన్నల్లో కలిసిపోయారని రాగో నవల నిరూపిస్తుంది. రాగో నవలలో ప్రధాన పాత్ర అయినా రాగో మాడియా సంప్రదాయం నచ్చక, రాగో తల్లిదండ్రులు తనకు ఇష్టంలేని పెళ్లిచేస్తామని నిర్ణయిస్తారు. దానితో దిక్కుతెలియక అడవుల్లోకి వెళ్ళడం, అక్కడ అన్నలను కలవడం జరుగుతుంది. మాడియా మహిళ తరతరాలుగా అనుభవిస్తున్న ఈ చిత్రహింసలు తెల్లారేదెపుడు అనేది ఆనాటికి రాగోకు అర్థంకాని, పరిష్కారం లేని ప్రశ్నగానే మిగిలిపోయింది. రాగోకు హితోపదేశాలు, ఉచిత సలహాలు ఇచ్చేవారికి ఏం తక్కువ లేదు. ఏ వయసుకు ఆ ముచ్చట ఉండాలని కొందరు మొగంపైనే అంటుంటే, ఎక్కడో దగ్గర జోడైతే సరిపోతుందని మరి కొందరు ఊరికే ఊదరగొడుతున్నారు. పుట్టింటి మర్యాదలు, తల్లి తెచ్చే సంబంధాలు నిలబెట్టడానికి పుట్టింటికే పోతే మంచిదని అంటారు కొందరు సాంప్రదాయక పెద్దలు. వీరెవరికి రాగో మనసు తెలియదు. రాగోకు ఒక మనసుంటుందనే సంగతి వారెవరూ పట్టించుకోరు. అందువల్ల తనను అర్థం చేసుకోని వ్యవస్థలో ఉండడంకంటే అన్నల్లోనే ఉండడం మంచిదని భావించుకొని తిరిగి ఇంటికి రాకుండా అన్నల్లోనే ఉండిపోవడం ఈ నవలలోని ప్రధాన అంశం.

సంప్రదాయం ప్రకారం కల్లుతాగితే ఆ అమ్మాయిని వేరే వారెవరు పెళ్ళి చేసుకోరు. పుట్టిన బిడ్డను మీ ఇంటికే ఇస్తామని ఒప్పందం చేసుకునే వేళలో తల్లిదండ్రులు వియ్యంకుల నుండి కల్లు పుచ్చుకుంటే ఆ బిడ్డను ఇక ఎవరికి ఇవ్వరాదు. అమ్మాయిల ఇష్టాయిష్టాలను తల్లిదండ్రులు పట్టించుకోరు. ఒకరి పెళ్ళాం మరో మొగవాడి వద్దకు పోరాదు. అలా పోతే వారి సంప్రదాయం ప్రకారం ఆ చేసుకున్న అతను పాత మొగుడికి 3000 రూపాయలు చెల్లించి తీసుకుపోవాలి. లామ్ పెట్టుకుంటే రెండు సంవత్సరాలలో పెళ్ళి చెయ్యాలి. లామడే ఉంటే ఇక ఆ పిల్లను ఇంకెవ్వరు పెళ్ళి చేసుకోరు. ఇల్లరికం చేసుకునే ముందు మగాడితో ఆరేళ్ళు చాకిరి చేయించుకొని ఆ తర్వాత పిల్లను ఇస్తారు. జంగ్లాత్ (ఫారెస్టు ఆఫీసర్లు) అడిగింది ఇచ్చి వారి దయాదాక్షిణ్యాలపై బ్రతుకుతారు. కల్లు దించినా భయమే, ఇప్పపూలు ఇంట్లో వున్న ఇబ్బందులే ఉంటాయి. నాగలిపన్ను, మేకిపన్ను, ఎడ్లకు పన్నులు ఇలా ఇంటింటికి, భూమికి ఫారెస్ట్ ఆఫీసర్లు, రెవిన్యూ అధికారులు కలిసి వాళ్ళపై ఇష్టం వచ్చినట్లు పన్నులు వేస్తారు.

అలాంటి ధీనకొండ ఈనాడు ఎంతో మారిపోతుంది. ఇదంతా అన్నల చొరవే. ఈ రోజు ఏపన్ను విధించాలన్న, ఏపని చెయ్యాలన్న, ఏం చెయ్యాలన్న, ఏం చేయకూడ దన్న ఈ రోజు సంఘమే నిర్ణయిస్తుంది. ఊరిలోని షావు కార్లు రూపాయికి పది పైసల లాభం వుంచుకొని సంఘం చెప్పిన రేట్లకే సరుకులు అమ్ముతారు.

మొదట్లో మాట్లాడటానికి భయపడిన రాగో (జైని) దళంలో చురుకైన పాత్ర పోషిస్తుంది. మామూలు దళ సభ్యురాలిగా చేరిన రాగో వేరే ప్రాంతానికి డిప్యూటి కమాండర్ గా నియమించాలని అనుకుంటారు.

మూఢనమ్మకాలు :

ఈ నవలలో రాగో ప్రధాన పాత్ర. ఆధనిక సమాజానికి రాగో నిదర్శనం. రాగో అంటే గోండుభాషలో రామచిలుక. పంజరంలోవుండే చిలుక ఎలాంటి బాధలు అనుభవిస్తూ, పంజరం ఎప్పుడు తెరిస్తే అప్పుడు పారిపోదామన్న భావనతో ఎదురు చూస్తుంటుంది. ఇక్కడ కూడా రాగో పాత్ర విషయంలో ఇంచుమించు అలాంటి పరిస్థితి ఎదు రైంది. అనాగరిక గిరిజన సమాజంలో పాటించే ఆచా రాలు, మూఢనమ్మకాలను భరించలేక, ఆధునిక సమా జపు ఆచారాలను అణుచుకోలేక చివరికి అన్నల్లో కల వాల్సిన స్థితిరాగోది. ఈ పాత్రచిత్రణ ఈ నవలకు ప్రాణం. రాగో తండ్రి 'దల్సు'. రాగోకు దల్సు తాను ఒప్పుకున్న పెళ్ళి చేయాలని అనుకుంటాడు. తల్లి కూడా తండ్రి మాటనే సమర్థిస్తుంది. రాగోను ఆ ఇంటికిస్తే రాగో తల్లికిచ్చిన జీవపారే (కన్యాశుల్కం) తీరుతుందని రాగో తండ్రి అనుకుంటాడు. రాగోను అడగకుండా రాగో బావ అయిన సంఘితో ముహూర్తం పెట్టుకుంటారు. రాగోకి ఈ పెళ్ళి ఇష్టం ఉండదు. రాగో తన మనస్సుకు నచ్చిన వాడైన 'నాన్సు' తో జీవించాలని అనుకుంటుంది. రాగో ఇష్టాయిష్టాలను గురించి తల్లిదండ్రులు తెలుసుకోరు. రాగోకి తెల్లారితే పెళ్ళి. ఇష్టం లేనివాడితో జీవించడం కంటే ఇష్టమైన వాడితో వెళ్ళిపోవడం మంచిదని అను కుంటుంది రాగో. అయితే గోట్టోల్లలో (గోండుల) లోని యువతులు ఇలా చాలా మంది చేశారనేది ఆనవాయితీగా వస్తున్నదే. రాగో కాకా అయిన 'రామ' కూడ ఇలానే చేస్తాడు.

దళం- గిరిజన స్త్రీ :

సమాజంలో అట్టడుగు వర్గాలకు జరుగుతున్న అన్యాయాలను ఎదిరించి సామాజిక న్యాయం కల్పిం చాలనే ఉద్దేశంతో అన్నలు పని చేస్తారనీ, ఇదే వారి లక్ష్య మని వింటుంటాం. ఇలాంటి భావాలతోనే అట్టడువర్గమైన గిరిజనులను ఎంచుకొని వారి చట్టాలను పటిష్టంగా అమలు జరిపి, వారిని ఇతరత్రా అన్యాయాల నుండి కాపాడాలని అనుకుంటుంటారు. అన్నలు అనగానే వెంటనే గుర్తుకొచ్చేది దాదాపుగా గిరిజనులే! గిరిజనుల స్థిరనివాసం అడవి. అటువంటి అడవిని అన్నలు కూడా స్థిరనివాసం చేసుకుంటుంటారు. ఒకప్పుడు దళంలో గిరిజన యువకులు చేరుతుండేవారు. బతుకుదెరువు కోసం ఏమీ లేకపోవడం ఒత కారణమైతే, అందులో చేరడం ఒక సామాజిక న్యాయమని భావించేవారు మరొకరు. ఒకప్పుడు అన్నలు గిరిజనులకు ఆసరాగా నిలబడ్డారని తెలుస్తుంది. గిరిజన గూడెంలకు వివిధ నాయకులు, భూస్వాములు, జమీందారులు, గిరిజనేతర మోసగాళ్ళ చెరనుండి కాపాడుకోగల్గారు. అందువల్ల గిరిజనులు అన్నలకు దగ్గరైనారు.

అలా గిరిజనులకు ఒకప్పుడు అన్నలు దగ్గరైనారు. గిరిజన ప్రాంతాల్లో ఒకప్పుడు చాలా దోపిడీలు జరుగు తుండేది. కానీ అన్నలన్న భయంతో కొంతవరకు తగ్గింది. దీనిని ఆసరాగా చేసుకొని ప్రభుత్వం గిరిజనులకు కొన్ని ప్రత్యేక పథకాలను ప్రకటించింది. చదువుకున్న గిరిజన యువకులకు ఉద్యోగాలను ఇచ్చి, తద్వారా అన్నల్లో చేరుతున్న గిరిజన సంఖ్యను కొంతవరకు తగ్గించవచ్చు నన్న దృక్పథంతో, ఫలితంగా గిరిజనుల్లో అసలు విషయాన్ని గ్రహించకుండా ప్రభుత్వం పనిచేసిందని రచయిత అభిప్రాయం. గిరిజన యువకులకు ఉద్యో గాలు ఇచ్చి వారికి ఆశ్రయం కల్పించినా తగిన నిధులు

కానీ, సౌకర్యాలుగానీ, రవాణా సౌకర్యాలుగానీ కల్పించ లేదు. తద్వారా ఆ ప్రయత్నం విఫలమైంది. ఈ నవల వెలువడేకాలంలో అన్నలు కొంతవరకు సఫలమయ్యారు. అన్నల లాగానే గిరిజన ప్రాంతంలో స్వచ్ఛంద సేవలు చేయడానికి చాలా సంస్థలు పనిచేశాయి. కానీ, అన్న లంతగా, ఇతర స్వచ్ఛంద సేవలు గిరిజనుల హృదయాల్లో స్థానం సంపాదించలేకపోయారు. ఈ విషయాన్ని రచ యితలు పటుకుని తమ రచనల ద్వారా సామాజిక సంస్కరణకు నాంది పలికారు. తద్వారా రచనలు సామా జిక నేపథ్యానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

రాగో దళంలో చేరి తనవంతు సేవలు అందిస్తుంది. ఆమె చిరకాలంలో దళంలో మంచిపేరు తెచ్చుకుంది. జైనిగా పేరు మార్చుకొని గిరిజన గూడేలలో తిరుగుతూ అనేక సమస్యలను వెలికితీసింది. గిరిజన స్త్రీలలో చైతన్యం తేవడానికి ప్రయత్నించింది. చివరికి దళ డిప్యూటీ కమెండర్ వరకు ఎదిగింది. అన్నల గిరిజనుల సంబంధాల విషయంలో కొన్ని నవలలు సూక్ష్మంగా వివరించిన అంతర్గత అంశాలను పరిశీలిస్తే చాలా వరకు అన్నల, పోలీసుల మధ్య నలిగిపోతున్నారనిపిస్తుంది. దానికి కారణాలు అన్నలు గిరిజన గూడెంకు రావడం, అన్నలు వచ్చారని పోలీసులు తెలుసుకొని గిరిజనులను హింసించడం జరుగుతుంది. రాగో నవల ఈ అంశాలను క్రోడీకరించింది. గిరిజనులను ప్రగతిపథంలో నడిపించా లని అనుకుంటే, నిర్మాణాత్మక రంగాల్లో పథకాలు రాసి, వారికి మానసిక వికాసం కల్పించే విధంగా అన్నల విధానం ఉండాలి. ఇవి లేనప్పుడు అన్నలకు రక్షణ నిలయాలుగా గిరిజన గూడాలు(తండా)లను ఎంచు కున్నట్లు భావించకతప్పదని ఈ నవల వివరిస్తుంది.

ముగింపు :

సరిహద్దు నవలకు అనుసరిణే రాగో నవల. పాత్రల విషయంలో, ఇతివృత్త విషయంలో కూడా. గోండు కులంలో పాటించే కొన్ని ఆచారాలు, సంప్రదాయాలను భరించలేక ఎటువంటి మార్పులకు అవి దారి చూపు తాయో అనే అంశాన్ని ఈ నవల ద్వారా చిత్రించాడు రచ యిత. ఈ నేపథ్యంతోనే నవల ముందుకు సాగుతుంది. ముఖ్యంగా ఈ నవలలో గిరిజన తెగల్లో ఒకటైన గోండుల జీవితాలను, గోండుల జీవితాల్లో అంతర్లీనంగా పేరుకొని పోయిన మూఢాచారాలను చిత్రించాలనే నేపథ్యంతో వచ్చింది. రాగో నవల కథాకాలం 1985 తర్వాత. అడవి ప్రాంతాల్లోకి విస్తరించిన ప్రజాపోరాటాలు, ఆదివాసి జీవితంలోని సమస్త వైరుధ్యాలను సూచించింది.రాగో నవల ప్రథమ పురుషలో సాగింది. ఈ నవలలో అతడు, ఆమె అని వాడకుండా పాత్ర పేరుతో నవల సాగడం ఈ నవల ప్రత్యేకత. రాగో దిగాలుగా కూచొని ఉంది. మనసంతా కకావికలమై ఉంది. కొలిక్కిరాని ఆలోచనలు... అగమాగమై అడవిలో తిరుగుతున్నట్లుంది రాగో జీవితం'.

ఈ నవలలో రాగో లేవనెత్తిన ప్రశ్నల రూపంలో ఆది వాసి ఖాయిదాలకు సంబంధినట్లు కన్పించినా ఇవి ప్రపంచ ప్రజలవి. ముఖ్యంగా ప్రపంచ జనాభాలో సగ భాగంగా ఉన్న స్త్రీలకు సంబంధించినవవి.సకల మానవ సృష్టిని, వ్యక్తీకరణను నియంత్రించే క్రమంలోనే రాజ్యం తనను తాను నిలబెట్టుకున్నది. రాజ్యం తన మనుగడ కోసం వ్యక్తుల వ్యక్తిత్వాన్ని, వ్యక్తీకరణను నియంత్రించే నిర్మాణ రూపాలను రూపొందించుకుంది. అలాంటి నిర్మాణ రూపంలో చాలా పురాతనమైంది, సంక్లిష్టమైంది, జటిలమైంది ఇంతవరకు జరిగిన వర్గపోరాటాల్లా కూడా మిగిలి ఉన్నది కుంటుంబం. ఈ కుటుంబంతో, కుటుం బంలో మానవులు ఎడతెగని ఒంటరి పోరాటాలు చేస్తు న్నారు. మనం ఇప్పటిదాకా చూసిన అన్ని రకాల సమాజాల లోని ఈ పోరాటం కొనసాగుతున్నదే. కుటుంబం పురుషులకన్నా స్త్రీలను దాదాపు సంపూర్ణంగా అణచి వేసింది. కుటుంబంలో జరిగిన యుద్ధంలో స్త్రీలదే ప్రధాన పాత్ర. మట్టి మనుషులు, అడవి మనుషులు మహా సంగ్రామంలో అద్భుత శక్తులుగా ఎదిగే చారిత్రక క్రమంలో వ్యక్తికి నిదర్శనం రాగో. ఈ రాగో నవలలో

అభ్యుదయభావాల ప్రతిరూపం రాగో. గిరిజన ఆదివాసి స్త్రీ అయి కూడా ఆమె ఏవిధంగా అనేక బాధలు అనుభవించి చివరకు తన జాతి గురించిన అభ్యుదయ విప్లవంలో భాగంగా కిందస్థాయి నుండి కమెండో స్థాయికి ఎదిగిన విధానం స్త్రీ చైతన్యానికి స్ఫూర్తిగా నిలుస్తుంది. నేటి గిరిజన ఆదివాసీ స్త్రీల కష్టాలను మనకు సాధన రచయిత కొండను అద్దంలో చూయించిన విధంగా రాగో నవల ద్వారా స్త్రీ సమాజంలో ఎదుర్కొంటున్న కష్టాలు మరియు గిరిజన ఆదివాసీ స్త్రీ సమస్యలను కళ్ళకు కట్టినట్లు చూపించారు రచయిత. ఆధునిక ప్రక్రియలలో నవలకు అంత ప్రాధాన్యం ఉందని చెప్పకనే చప్పారు రచయిత సాధనగారు.

ఉపయుక్త గ్రంథసూచి :

1. నాగభూషణశర్మ,మొదలి. తెలుగు నవలా వికాసము. సికింద్రాబాద్ : ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, 1971.
2. వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. నవలా శిల్పం. హైదరాబాద్ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1989.
3. సాధన. సరిహద్దు. హైదరాబాద్ : విరసం ప్రచురణ, 1993.
4. సాధన. రాగో. హైదరాబాద్ : సృజన ప్రచురణ, 1993.
5. సంజీవమ్మ,సి. తెలుగు నవలలో సామాజిక చైతన్యం. కడప : అభ్యుదయ రచయితల సంఘం,1983.
6. రాంబాబు,నూనావత్. తెలుగులో గిరిజన కథలు- వస్తు, శిల్ప వైవిధ్యం.హైదరాబాద్ : గిరిజన సాంస్కృతిక పరిశోధన మరియు శిక్షణ సంస్థ, గిరిజన సంక్షేమ శాఖ, 2017.
7. మంగమ్మ,లింగాల. తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్తార నవలలు-పరశీలన.హైదరాబాద్: హైదరాబాద్ విశ్వవిద్యాలయం (అముద్రిత సిద్ధాంతగ్రంథం), 2014.

గిరిజన పండుగలు – విశ్లేషణ

– డా. ఒభిన్ని శ్రీహరి, తెలుగు అధ్యాపకులు, రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, నూజివీడు.

భారతదేశంలో అనేక గిరిజన సముదాయాలు ఉన్నాయి. మనదేశం శాస్త్ర సాంకేతిక, వైజ్ఞానిక రంగాలలో ఎంతో అభివృద్ధి సాధించామనుకొన్నా, నేటికీ ప్రధాన జీవన స్రవంతిలో కలవకుండా, కొండల్లో, కోనల్లో అభివృద్ధికి దూరంగా, అడవుల్లో జీవనం సాగిస్తున్న గిరిజన తెగలు ఎన్నో ఉన్నాయి. ఈ గిరిజనులలో తమదైన ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయం, సామాజిక విలువలు కనిపిస్తున్నాయి. మనదేశంలో గిరిజనులు లేదా ఆదివాసీలు నివసించే ముఖ్య రాష్ట్రాలు ఒరిస్సా, మధ్యప్రదేశ్, ఛత్తీస్'ఘడ్, రాజస్తాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్ర ప్రదేశ్, బీహార్, జారండ్, పశ్చిమబెంగాల్, మిజోరాం, అండమాన్ నికోబార్ దీవులు మొదలైన రాష్ట్రాలు.

భారత దేశ జనాభాలో 2011 జనాభా లెక్కల ప్రకారం 8.27 అనగా 8.44 కోట్ల గిరిజన జనాభా ఉన్నారు. ఈ జనాభాలో 461 రకాల గిరిజన తెగలు ఉండగా, వీరు 92 శాతం అటవీ ప్రాంతంలో వ్యవసాయం, వేట, అటవీ ఉత్పత్తులపై జీవిస్తున్నారు.

రాష్ట్రాల వారీగా వివిధ రాష్ట్రాలలో ఉన్న గిరిజనుల విభజన :

ఒరిస్సా గిరిజనులు : శంతల, శౌర, కంధాస్ , భూమి హార్, గ్వాండియా.

నాగాలయ గిరిజనులు : వీరు అస్సాం మరియు మయన్మార్'లోని గిరిజన తెగలను పోలి ఉంటారు. ఇండో మంగోలాయిడ్ కుటుంబానికి చెందుతారు. వీరు ముఖ్యంగా 14 తెగలకు చెందుతారు. అవి అంగమి, ఆవో, చఖేసంగ్, ఛాంగ్, ఖేముంగన్, కాన్యాక్, లోథా, ఫోమ్, పోచూరి, రెంగ్మా, సంగ్త, సుమి, ఇంచుంగ్, జిలాంగ్ మొదలైనవి.

మేఘాలయ గిరిజనులు : ఖాసీలు,

జార్ఖండ్ మరియు పశ్చిమ బెంగాల్ ఆదివాసీలు : సంతాల్'లు

ఆంధ్రప్రదేశ్ గిరిజనులు : చెంచులు, కొండారెడ్లు, గోండ్లు, కోలములు, నాయకపోడు, సవరలు, జాతాపులు, పరదాసులు, తోటిలు, సుగాలీలు, మన్నెవార్, ఎరుకలు మొదలైన వారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కర్నూల్ మొదలైన జిల్లాలలో గిరిజన ప్రాంతాలలో గిరిజనులు ఎక్కువగా నివసిస్తున్నారు.

ఆదివాసీలు లేదా గిరిజనులు ప్రత్యేకంగా కొన్ని రకాల ఆచార వ్యవహారాలు పాటిస్తారు. వారి జీవితంలో ఎదురయే ప్రతి కొత్త విషయాన్ని ఒక పండుగలాగ జరుపుకుంటారు. ఒక జాతి జాతీయకు పండుగలు ప్రతీకలవుతాయి. అందుకే ఏ పండుగా పబ్బం లేని దేశంగానీ, రాష్ట్రంగానీ, జాతిగానీ, మతంకానీ లేదంటే అతిశయోక్తి లేదు. "పండువు" శబ్దం నుండి పండుగ ఏర్పడింది. పండుగ అనే శబ్దానికి అర్థం ఫలించడం. అంటే కోరికలు ఫలించే వేళ, శుభవేళ ఉత్సవవేళ అని చెప్పుకోవచ్చు.

ఆనాడు జరుపుకొనే వేడుకలకు పబ్బం. ఈ దృష్టిలో తొలి మానవుడు చీకటి నుండి వెలుతురులో కలూనిన శుభవేళ అతనికి పండుగ వేళ. ఒక్కొక్క సందర్భంలో ఆయా సంఘజీవులకు విజయం చేకూరినప్పుడో, భయాందోళనలు తొలగినప్పుడో ప్రగతి పథం కనిపించినప్పుడో దానికి పరవశించి ఆనందంగా వేసిన గంతుల నుంచే పండుగలు ఉద్భవించాయి. పుత్రోత్సాహం కలిగినప్పుడో, కన్య వివాహిత అయినప్పుడో ప్రత్యేకంగా ఆయా గృహాల వరు సంతోషంతో కొన్ని వేడుకలు జరుపుకొంటారు. ఆదివాసీ వ్యవహారంలో పండుగ శబ్దానికి పర్యాయపదం కొత్త

శబ్దం . కొత్త పంటలు పండు కాలం కాబట్టి కొత్త అనే శబ్దం వీరి పండుగ చివర్లో చేరుతుంది. ఆదివాసీల పండుగ పేర్లు పప్పు కొత్త, మామిడి కొత్త, కొర్ర కొత్త అనే పేర్లతో వుంటాయి. అంటే కొత్తగా పండిన పంటలను దేవతలకు నివేదన చేయడం, ఆ అనేది నభోక్తవ్యం అని శాస్త్రకారులు చెప్పినట్లుగా వీరిలో అనాదికారం నుండి ఉండదాన్ని గమనించవచ్చు. అలా చేయడం వల్ల నివేదన లచే తృప్తులైన దేవతలు మానవులకు సర్వ శుభాలను ఇస్తారని నమ్మకం. నా యీ ప్రస్తుత వ్యాసంలో ఆంధ్ర రాష్ట్రంలో ఉత్తరాంధ్ర జిల్లాలలో గిరిజనుల కొన్ని పండుగలు వివరించే ప్రయత్నం చేస్తాను.

గిరిజనుల కొన్ని ముఖ్యమైన పండుగలు :

1. ఇటుకల పండుగ 2. భీముడి దోషం, 3. అమ్మవారి దోషం, 4. సల్ది తినడం , 5. కొర్ర కోత, 6. జోల్ధ పండుగ, 7. దానే0 కోతలు, 8. సంకురాతిరి, 9. కుడుపుల పండుగ, 10. హొళీ.

1. ఇటుకల పండుగ :

గిరిజనుల నెలల్లో మొదటిగా వచ్చే ఇటింగ్ నెలలో ఇటుకల పండుగను గిరిజనులు జరుపుకొంటారు. వ్యవ సాయ పనులను ఈ పండుగ అనంతరం ప్రారంభిస్తారు. ఈ పండుగ హొళీ పండుగను పోలి ఉంటుంది. హొళీ పండుగను ఒక్కరోజు మాత్రమే జరుపుకొంటే ఈ ఇటుకల పండుగను మాత్రం నెల రోజుల పాటు గిరిజనులు జరుపుకొంటారు. ఈ పండుగలో భాగంగా నెల రోజుల పాటు నీరును ఒకరిపై ఒకరు చల్లుకోవడం జరుగుతుంది.

ఈ పండుగను సాధారంగా గురువారం నాడు ప్రారం భిస్తారు. ఆ రోజున కోళ్ళు కోసి నాగలికి పూజా అంటే ఆయుధ పూజ చేస్తారు. మరుసటి రోజున అంటే శు క్రవారం నాడు పర్వతానికి వెళ్ళి పెద్ద వెదురు కర్ర లేదా అడ్డ ఒడ్డు అంటే అడ్డాకుల తీగ తో ఊయలను కట్టి గ్రామంలోని మహిళలు, పిల్లలు ఎక్కువగా ఊగుతారు. ఇలా ఊగేటప్పుడు పండుగ సందర్భానికి గల పాఠాలను పాడతారు. ఇది గిరిజనేతరులు అట్లతద్ది నాడు జరుపుకొనే ఊయల ఊగడం వలె ఉంటుంది.

ఈ పండుగ రోజుల్లో సంత రోజున గిరిజన సంప్ర దాయం ప్రకారం తాచేరును అడుగుతారు. తాచేరు అనగా సంత రోజున ఆ గ్రామానికి దగ్గర్లో ఉన్న రహదారికి అడ్డంగా ఒక కర్రను పెట్టి మనుషులు వెళ్ళినా, వాహనాలు వెళ్ళినా ఆపి డబ్బులు కానీ లేదా ఏదైనా వస్తువులు కానీ లేదా తినుబండారాలు కానీ అడుగుతారు. దీనిని మహి ళలు మాత్రమే అడుగుతారు. అది నిర్భంధం కాదు. ఇది ఆచారం ప్రకారం సరదాగా అడిగే ఒక సంప్రదాయం మాత్రమే. ఇలా సేకరించిన డబ్బుతో గిరిజనులు అందరూ ఒకచోట చెరీ విందు చేసుకొనే సంప్రదాయం ఇక్కడ ఉంటుంది.

ఈ పండుగలో భాగంగా ఆదివారం జరుపుకొనే పనులలో వేటకు వెళ్ళడం ఎంతో ఆనందభరితంగా ఉంటుంది. దీనిని వేట తేలడం అంటారు. వేటకు వెళ్ళే ముందు గ్రామంలో అందరూ గ్రామం బయటకు వచ్చి అక్కడ ఆయుధాలకు పూజా చేస్తారు. అనంతరం గిరి జనులు ఆడ, మగ చిన్నా పెద్దా తేడా లేకుండా థింసా నృత్యాన్ని చేస్తారు. దీన్ని గిరిజన వ్యవహార భాషలో గుమ్మాలాట అని పిలుస్తారు. ఈ నృత్యం చేస్తూ వారు ఆనందపరవసులవుతారు.

ఈ ఉత్సవం జరిగిన తర్వాత వచ్చే మూడు రోజులు అంటే సోమ, మంగళ బుధ వారాలలో గ్రామంలో పురు షులు అందరూ వేటకు అడవికి వెళతారు. వేటకు వెళ్ళిన పురుషులు ఏదో ఒక అడవి జంతువును వేటాడి ఇంటికి తీసుకురావలసి ఉంటుంది. అలా తీసుకురాని పురుష లను మహిళలు ఎందుకు పనికిరాని వారిగా చూస్తూ, ఎగతాళి చేస్తారు. వారికి స్నానానికి నీళ్ళు పెట్టేటప్పుడు కూడా మహిళలు ఏ విధంగా స్నానం చేస్తారో అదే విధంగా స్నానానికి ఏర్పాట్లు చేస్తారు. నీళ్ళతో పాటు పసుపు పెడతారు. ఎవరూ చూడకుండా అడ్డంగా ఏదో ఒక దానిని కడతారు.

ఈ పండుగను గిరిజనులు చాలా విశ్వాసంతో చేస్తారు, ఈ పండుగ బాగా చేస్తే ఆ సంవత్సరం పంటలు బాగా పండుతాయాని బాగా విశ్వసిస్తారు.

2. భీముడు దోషం :

ఈ పండుగను వ్యవసాయ పనులు ప్రారంభించ డానికి ముందు వర్షం బాగా పడాలని బైసంగ్ అంటే మే నెలలో నిర్వహిస్తారు. ఈ పండుగలో మొదటిగా పూజ చేస్తారు. ఈ పూజ కోసం కొబ్బరి కాయ, అరటి పళ్ళు తదితర పూజా సామగ్రితో పాటు నల్లని మేకను కూడా పర్వతం దగ్గరకు తీసుకొనివెళతారు. అక్కడ పూజలు నిర్వహించి అక్కడే మేకను బలి ఇస్తారు.

3. అమ్మవారి దోషం :

దీనినే అమ్మవారి పండుగగా పిలుస్తారు. దీనిని లండిజెట్ లేదా ఆషాడ మాసం జూన్ లేదా జులై నెల లలో జరుపుకొంటారు. సాధారణంగా ఆది, సోమ, మంగళ వారాలలో మూడు రోజులు ఈ పండుగను జరుపు కొంటారు. ఈ పండుగ ప్రారంభంలో గ్రామస్తులందరూ మరియు ఆ గ్రామ పూజారి ఈయనను దిశరి అంటారు. ఈయనతో కలసి ఆ గ్రామంలో ఒక బావి దగ్గరకు వెళ్తారు. ఆ బావి దగ్గర దిశరి పూజలు నిర్వహిస్తారు.

ఆ బావి నుండి కంచు చెంబుతో నీటిని తోడి దానిలో మూడు మామిడి ఆకులు, నంపంగి పూవులు వేసి మంత్రాలు జపిస్తాడు. గ్రామంలోని అన్నీ ఇళ్లకు వెళ్ళి, ఆ ఇళ్ళలో ఆ నీటిని చల్లుతాడు. విస్తరకులను చిన్న బుట్టలుగా చేసి, ఆ ఆకుల డొప్పలలో ఆ నీటిని పోసి గ్రామస్తులందరి చేత తాగించడం జరుగుతుంది. ఈ డొప్పలలో నీరు త్రాగించడం వలన జబ్బులు తగ్గు తాయని నమ్మకం. చివరి రోజున అంటే మంగళవారం ఒక రథాన్ని తయారుచేసి ప్రతీ ఇంటికి ఊరేగింపుగా తీసుకువెళతారు. ఇలా తిప్పినప్పుడు ప్రతీ ఇంట్లో వాళ్ళు వారి ఇంటిలోపల ఉన్న పాడైపోయిన చీపురు, బుట్ట, తదితర వస్తువులను రథంలో వేస్తారు. ఈ గ్రామంలో ఊరేగింపు పూర్తయిన తర్వాత ఆ గ్రామ పొలిమేరలు దాటించి అవతల గ్రామం పొలిమేరల్లో వదిలిపెడతారు. ఈ పూజా వలన గ్రామంలో ఎటువంటి కష్టాలు ఉండవని, అమ్మవారి దీవెనలు ఉంటాయని నమ్మకం.

4. సల్ది తినడంబీ :

ఈ పండుగ జూన్ నెలలో జరుగుతుంది. ఈ పండుగను పంట పొలాల్లోనే జరుపుకొంటారు. పొలము లోనే వ్యవసాయం పనిముట్లను, పశువులను పూజించి, పొలాల్లోనే సల్ది తినడం జరుగుతుంది. కాబట్టి దీనిని సల్ది తినడం అనే పేరు పెట్టారు. ఈ పండుగ రోజున ఉ దయాన్నే సాధారణంగా దుక్కికి వెళుతారు. వెళ్ళిన అనంతరం పశువులను శుభ్రం చేస్తారు. వారు కూడా స్నానం చేస్తారు. ఈ సందర్భంగా ఒక వంటకాన్ని తయారు చేస్తారు. ఈ వంటకాన్ని గిరిజన ప్రాంతాలలో లభించే పిండి దుంపలు, ఈత దుంపలు, ఈత పురుగులు, కూర గాయలు తదితరాలను కలిపి తయారుచేస్తారు. దీనితో పాటు గిరిజనులు అధికంగా లభించే అంబలి ఉం టుంది. ఈ సంవత్సరం పంటలు బాగా పండాలని ఆ ఆహార పదార్థాలను మొదట పశువులకు తినిపిస్తారు. ఆ తర్వాత వారు కూడా తిని ఆనందంగా వారు ఇంటికి తిరిగి వెళ్తారు.

5. కొర్ర కొత్త :

గిరిజన పండుగలలో అధిక ప్రాధాన్యత సంతరించు కొన్న పండుగలలో ఈ కొర్ర కొత్త పండుగ ఒకటి. ఈ పండుగ బందపన్ అంటే అంటే ఆగష్ట్ నెలలో జరుగు తుంది. ఇది ప్రధానంగా రైతులు పండిన కూరగాయలు తదితర పంటలను మొదటిసారిగా తీసుకువచ్చుటకు జరుపుకొనే పండుగ. ఈ పండుగ జరిగిన అనంతరం మాత్రమే కొత్తగా పండిన పంటలను వాడతారు. ఈ పండుగకు ఊరిలో గల చాలని అంటే తలయారి ప్రతి ఇంటికి వెళ్ళి కొద్దిగా బియ్యం, కొంత డబ్బులు సేకరిస్తారు. ఈ బియ్యంతో కోడిని కొంటారు. మిగిలిన బియ్యంతో గుమ్మడి ఇగురు కలిపి గ్రామ పెద్ద కొత్త పిడతలో బోనం

పెడతారు. తరవాత వారి గ్రామంలోని గ్రామ దేవతకు, సంకుదేవుడుకు, పోతురాజు దేవుళ్ళకు, కోడిని కోసి, కొబ్బరి కాయను కొట్టి పూజను చేస్తారు. బోనం పెడతారు. ఆ తర్వాత మాత్రమే భోజనం చేస్తారు. అంతవరకు ఉప వాసంతో ఉంటారు.

6. జోడ్డ పండుగ :

గిరిజనులు జరిపే వ్యవసాయ పండుగలలో జోడ్డ జోడ్డ పండుగ ఒకటి. జోడ్డ పండుగ ఉదయాన్నే ప్రారంభ మవుతుంది. ఈ రోజు వేకువజమునే పర్వతానికి వెళ్ళి జోడ్డ కొమ్మలు తీసుకువస్తారు. జోడ్డ కొమ్మలు అంటే ఒకే మొక్కల జాతికి చెందిన కొమ్మలు కాకుండా కోసిమి కొమ్మ, సీతమ్మ కర్ర, జీరుగు, బాపన కర్ర లాంటివి. అడ్డాకులు కూడా తీసుకువస్తారు. గ్రామ చలాన్ని ప్రతి ఇంటికి వెళ్ళి కొంత బియ్యాన్ని, కొంత డబ్బును సేకరిస్తారు. సేకరించిన డబ్బుతో కోడిని కొనడం జరుగు తుంది.

గ్రామ పెద్ద పోతురాజు సంకుదేవుడుల వద్ద కోడిని కోసి కోడి రక్తాన్ని బియ్యంతో కలిపి పూజా చేస్తాడు. గ్రామంలో ప్రతీ ఇంటివారు ఈ బియ్యాన్ని తీసుకువెళ్లి జోడ్డ కొమ్మల్లోని ప్రతి కొమ్మకు బియ్యని కడతారు. ఈ కొమ్మలను మరియు మిగిలిన కొమ్మల్లో కట్టిన భోజనాన్ని పొలాలకు తీసుకువెళ్లి దానిని నైవేధ్యంగా పెట్టి కొమ్మలను పొలాల్లో పాతుతారు. తర్వాత వారు ఆ నైవేధ్యాన్ని తిని, ఇంటికి తిరిగి వస్తారు. పొలంలో ఒక దిష్టి బొమ్మను ఏర్పాటు చేస్తారు. ఈ పండుగ చేయడం వల్ల పొలంలోని పంటకు చీడ పురుగులు పట్టకుండా ఉంటాయను వారి నమ్మకం.

6. సంకురాతిరి :

దీనినే మనం సంక్రాంతి పండుగని కూడా అంటాము. సంక్రాంతి పండుగ గిరిజన ప్రాంతాలలో జరిగే తీరు పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో జరిగే తీరు పూర్తి భిన్నంగా ఉంటుంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో వలె పంచాంగం ప్రకారం కాకుండా ఈ పండుగను గ్రామం లోని దిశరి నిర్ణయించిన ముహూర్తాన్ని బట్టి ఒక్కో ప్రాంతంలో ఒక్కోసారి జరుగుతుంది. గిరిజనుల నెలలో సంకురాతిరి నెల ఉండడం ఇక్కడ ప్రత్యేకమైన విషయం. ఈ గిరిజనుల ప్రాంతంలో సంక్రాంతి పండుగ నెల రోజులకు పైగా సాగుతుంది.

ఈ పండుగను దిశరి కనీనం వారం రోజులు ముందుగా నిర్ణయిస్తారు. దీనిని గ్రామ ప్రజలకు చాటింపు ద్వారా తెలియచేస్తారు. ఈ పండుగను దాదాపుగా మంగళ, బుధ వారాలలో చేస్తారు. మంగళ వారం రోజున కోళ్ళను కోయడంతో ఈ పండుగ ప్రారంభమవుతుంది. బుధవారం పులగం పెడతారు. వీటితో పాటు కుడుము లను వండి, నాగల దుంపను, గుమ్మడి ముక్కలను ఉడకపెడతారు. ఆ రోజు ఉదయం అన్ని పశువుల కొమ్ములకు ఎర్రటి రంగును పూసి, వీపు భాగంలో నూనెను వ్రాసి, పూజ చేసిన పులగాన్ని, దుంపలను, కుడుములను వాటికి పిల్లలు వాటిని తెంపుకొని తినవచ్చును.

ఈ పండుగలో మరొక ముఖ్యమైన సందర్భంగా "బుడియా దండడం" జరుగుతుంది. బుడియా దండడం అంటే ఇంటికి వెళ్ళి జోగి మాదిరిగా అడగడం జరుగు తుంది. ఇందులో పిల్లలు, పెద్దలు పురుషులు మాత్రమే పాల్గొనడం విశేషం. ఇటుకల పండుగ అప్పుడు మహిళలు మాత్రమే తచేరు అడగడం, ఈ పండుగ అప్పుడు పురుషులు మాత్రమే బుడియా అడగడం ఒక ప్రత్యేకత. ఈ విధంగా వీరు సేకరించిన వాటితో ఒక విందు ఏర్పాటుచేసుకొంటారు. విందు అనంతరం గ్రామ చావిడి వద్ద ప్రజలందరూ కూర్చొని, ఊర్లోని కష్ట, సుఖాలను మాట్లాడుకొంటారు. ఈ సందర్భంలోనే గ్రామానికి అవసరమగు గౌడ, చలాని అంటే గ్రామ పెద్దలను ఏర్పాటుచేసుకొంటారు.

భారతదేశానికి ఉన్న ప్రత్యేకత ఇతర దేశాల కన్నా విభిన్నమైన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలకు నిలయం. ఈ సంస్కృతీ సంప్రదాయాలు, ఆచారాలు

అన్నీ కూడా ఇప్పటి నాగరికుడిగా పిలువబడే ఒకనాటి ఆదిమమానవుడి నుండి సంక్రమించినవి అనుటలో అతిశయోక్తిలేదు. అయితే నేటి ప్రపంచంలో మారుతున్న పరిస్థితుల్లో గిరిజన ప్రాంతాలలో కూడా మార్పులు వస్తున్నాయి. ఇక్కడ గమనించాల్సిన విషయం. గిరిజనుల అక్షరాస్యత, ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు రావాలి, అప్పుడే గిరిజనుల నిజమైన అభివృద్ధి చెందినట్లు భావించాలి.అయితే ప్రస్తుత ప్రపంచీకరణ ప్రభావం వలన గిరిజన ప్రాంతాలలో సంస్కృతీ సంప్రదాయాలపై పడుతున్నాయి. అందువల్ల ఈ ప్రపంచీకరణ ప్రభావం వలన గిరిజనుల భావితరాలు ఈ సంస్కృతీ సాంప్రదాయాలను ఎంతవరకూ ఆచరిస్తాయో చెప్పడం సందేహమే అనవచ్చు. ఇలా జరగడం నిజంగా బాధాకరం. అందువల్ల ఇటువంటి ఆచార, వ్యవహారాలు, సంస్కృతీ సాంప్రదాయాలను భవిషత్ తరాలవారికి అదించాల్సిన బాధ్యత ఎంతైనా ఉన్నది.

సంప్రదింపు గ్రంథాలు :

1. భారతీయ గిరిజనుల - నదీం హాస్ నైస్
2. గిరిజన విజ్ఞానం (పిహెచ్.డి పరిశోధనా గ్రంథం) - జర్రా అప్పారావు.
3. గిరిజన సాహిత్యం . ఆచార్య ఎం. గోనా నాయక్
4. తెలుగు జానపద విజ్ఞానం - ఆచార్య భక్తవత్సల రెడ్డి.
5. ఆంధ్రుల జానపద విజ్ఞానం - డా. ఆర్.వి.ఎస్. సుందరం,
6. జానపద సాహిత్య ప్రభ , ఆచార్య వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి.

ఎరుకల సంస్కృతి

– డా॥. పోచంరెడ్డి రాజేశ్వరి, అసిస్టెంట్ ప్రొఫెసర్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురము.

గిరిజనులు సంచార జీవనులు. వీరిలో అనేక తెగలు ఉన్నాయి. అందులో ఎరుకలు ఒక తెగవారు. వీరు ఆంధ్రా ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించారు. వీరు తమిళ, కన్నడ, తెలుగు పదాలను కలిపి ప్రత్యేకమైన భాషను మాట్లాడుతారు.

నేటి సాహిత్యంలో గిరిజన సాహిత్యం తక్కువగా ఉంది. గిరిజన సాహిత్యాన్ని అభివృద్ధి చేయవలసిన ఆవశ్యకత ఉంది. ఈ దృష్టికోణంలో ఎరుకల సంస్కృతిని గురించి తెలియజేయడమే పత్ర ముఖ్య ఉద్దేశం.

ప్రతి సమాజంలో ఆయా సామాజికుల జీవన విధానాన్ని బట్టి సంస్కృతి ఉంటుంది. అలవాటైన జీవన విధానమే సంస్కృతి. సంఘంలో వ్యక్తి నడవడికను సరిదిద్ది ఆచార వ్యవహారాలు నేర్పుతుంది. అందులో ఒకటి గిరిజన సంస్కృతి. గిరిజన సంస్కృతిలో భాగము ఎరుకల సంస్కృతి. ఎరుకల సంస్కృతిలో వృత్తి, మతం, ఆచార సంప్రదాయాలు, వైద్యం, కళలు, నమ్మకాలు-విశ్వాసాలు, ఆటలు, ఆహారపు అలవాట్లు, అలంకరణ గురించి వివరించడం జరిగింది.

వృత్తి :

వ్యక్తి జీవనోపాధి కోసం కొన్ని కట్టుబాట్లకు లోబడి వంశపారంపర్యంగా ఒకే పనిని చేస్తుండడం, వ్యక్తులు వృత్తిలో నైపుణ్యాలను పెంపొందించుకుంటూ సమాజానికి ఉపయోగపడతారు. ఇలా అనేక వృత్తులు ఏర్పడ్డాయి. ఎరుకలు దేహ శ్రమకు తట్టుకుంటారు. ఏదో ఒక పని చేస్తూ ఉంటారు. తాళ్ళు పేడుతూ, చేపల వలలు తయారు చేసేవారు. అప్పట్లో ఉట్లు, కుదుర్లు తయారు చేసేవారు. ఎర్ర దారంతో గవ్వలను అందంగా కుట్టి ఎద్దులకు అలంకరణంగా వాడేవారు. డబ్బుల సంచికి గవ్వలతో అందంగా కుట్టి అమ్ముకొంటూ తిరిగేవారు. వాటిని అమ్ముకొంటూ ఎవరి ఇంట్లో దొంగతనం చేయవచ్చు అనే విషయం తెలుసుకుంటారు.

దొంగతనం :

ఎవరి ఇంట్లో ఏ దొంగతనం చేయవచ్చన్న విషయం తెలుసుకొని దొంగతనం చాలా నేర్పుగా చేసేవారు. వీరు ఎన్ని విధాలుగా దొంగతనాలు చేస్తారో, తప్పించుకుంటారో, చివరికి ఎంత ప్రాణాలు తోడేసినా దొంగతనం చేసినట్లు ఒప్పుకోరు. వీళ్ళు సుప్రసిద్ధులైన చోరులు కాబట్టి దొంగలకు దొంగనే కాపలాగా పెట్టినట్లు గ్రామాల్లో వీళ్ళనే కావలివాండ్లుగా నియమించేవారు.

బిడారీలు అనే తెగ ఉప్పు, చింతపండు, బెల్లం, కరివేపాకు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి ఎద్దుల మీద, గాడిదల మీద, 'అసిమి' సంచులలో వేసుకొని తిరుగుతూ వ్యాపారం చేసేవారు. కావడిలో అటు ఇటు గంపల్లో వస్తువులను పెట్టుకొని అమ్ముతూ తిరిగేవారు. వాళ్ళను కావడి ఎరుకలు అని పిలిచేవారు. ఉప్పు అమ్ముతూ తిరిగే వారిని ఉప్పు ఎరుకలు అంటారు. దబ్బలతో, వెదురుతో గంపలు తయారుచేసేవారు. ఈ గంపలను ఎరువు, ధాన్యం నిలువ చేయడానికి, రవాణా చేయడానికి వాడతారు. వీరిని దబ్బఎరుకులు అనేవారు. వెదురుతో బుట్టలు, విసన కర్రలు, చాటలు, జల్లెడలు, తడికెలు మొదలైనవి తయారుచేసేవారు.

కర్నూలు జిల్లాలో ఎరుకలు కృష్ణపక్షంలోనే (పున్నమి అయిన తరువాత) వెదురు బొంగులు నరుకుతారు. అప్పుడు అయితే జీరంగులు మొదలైన వెదురు తొలిచే పురుగులు లేకుండా ఉంటాయి. వెదురు చెట్లకు అధిదేవత అయిన 'మల్లాలమ్మ'కు పూజలు చేస్తారు. నల్లమల అడవులలో ఎరుకలు వెదురు బొంగును అడ్డంగా నరకరు. పైబద్దను మాత్రం తీసుకుంటారు.

వాటిని పెద్ద కట్టలుగా కట్టి గాడిదల మీద సాగిస్తారు. వీల్లే దబ్బల ఎరుకల వారు.

మరొక వర్గం వారు కుంచు ఎరుకలు. నేత పనికి వాడే కుంచెలు, బ్రష్‌లు తయారుచేస్తారు. కుంచెలు తయారుచేయడంలో నిపుణులు. వీరు వేటలో కూడా ప్రసిద్ధులు. దుప్పలు, గువ్వలు, బాతులు మొదలైన వాటిని వలపన్ని, బోనును పన్ని పట్టుకోవడంలో నిపుణులు. పిట్టల వేట ప్రసిద్ధమైనది. సన్నని వెదురు పుల్ల లతను వంచి మంచెలుగా తయారుచేసి దాని అడుగున పురుగును వ్రేలాడదీసి చుట్టూ దారాలను వలపన్ని ఆ ఎరకు ఆశపడి పిట్టలు వచ్చినప్పుడు వాటిని వలల్లో బిగిస్తారు. పిట్టలను అమ్మి జీవించేవారు.

పచ్చపోయటం :

కుంచు ఎరుకలు కోతుల్ని ఆడించుకుంటూ బిక్షమెత్తు కుంటారు. వారి ఆడవాళ్ళు పచ్చబొట్టు పొడిచి జీవనో పాధిని పొందుతారు. ఈ పచ్చబొట్టులో ఎన్నో రకాల ఆకు రాలు ఉన్నాయి. చేపలు, తేళ్ళు, చిన్నకోట, ఐదంతస్తుల భవనం, ముగ్గుల వంటివి ఎన్నో రకాలు వేస్తారు. కొబ్బరి చిప్పలో మసి, నూనె, పసుపు కలిపిన మిశ్రమం పెట్టుకొని దానితో మొదట చర్మంపైన బొమ్మను గీస్తారు. తరువాత సూదులతో ఆ బొమ్మపై గుచ్చుతారు. దానిపై బేలు పండ్లు, తాటిఆకులు కలిపిన మిశ్రమాన్ని పూస్తారు. అది శాశ్వతమైన ఆకుపచ్చ రంగుగా శరీరంపై ఉండిపోతుంది. ఇలా పచ్చపొడిచినందుకు ఆ స్త్రీకి కొంత డబ్బు, ధాన్యం ఇచ్చేవారు.

సోది చెప్పటం :

పచ్చపొడిచే కుంచు ఎరుక స్త్రీలు సోది చెబుతారు. దీనినే గద్దె అని కూడా అంటారు. సోది చెబుతామని గట్టిగా అరుస్తూ పోతారు. రోగాలతో బాధపడేవారు, పిల్లలు లేనివారు, పిల్లలు కలిగి చనిపోతున్న వారు సోదెకత్తెలను ఇళ్ళల్లోకి పిలిచి సోది చెప్పించుకుంటారు. చాపవేసి, బియ్యం పోసి భూత, భవిష్యత్తులను గురించి అడుగుతారు. వీరు చాలా తెలివిగా తగిన చమత్కార సంభాషణతో సోది చెపుతారు. వారికి ధాన్యం, డబ్బులు, దుస్తులు ఇస్తారు. ఎరుకలలో కొంతమంది పౌరోహిత్యం చేసేవారు సుబ్రమణ్యంస్వామిని పూజించే ఎరుకలు సుబ్రమణ్యస్వామి గుడిలో పూజారులుగా జీవనం సాగించే వారు, పందులను మేపుకుంటూ జీవించేవారు. అడవుల లోని జంతువులను వేటాడి వాటిని అమ్మి జీవించేవారు. కొందరు గూఢాచారులుగా జీవించేవారు.

మతం :

మతం అంటే మనసు నమ్మిన విధానం. ఎరుకలలో విష్ణుభక్తులు, మరికొందరు వేంకటేశ్వరస్వామి భక్తులు. కొల్హాపురి అమ్మ అనే పేరులో లక్ష్మీదేవిని పూజిస్తారు. సోదెలో కొల్హాపురి అమ్మను, వారి కులదైవాలను తలచు కుంటారు. వేంకటేశ్వరస్వామికి శనివారం కొబ్బరికాయను నైవేద్యంగా కొడవలి, కర్రలు ఉంచి అరటిపండ్లు, బెల్లం అన్నం నైవేద్యం పెట్టేవారు. ఒక కలశానికి నామాలు పెట్టి దాన్నే వేంకటేశ్వరునిగా పూజించేవారు. ఆ కలశంలో తమలపాకులుగానీ, మామిడి ఆకులుగానీ వేసి కొబ్బరి కాయను పెడతారు. ఎరుకలు పూజించే ఇంకొక దేవత 'సాతవ్వ' (చెట్టుదేవర) మూడు, నాలుగేళ్ళకు ఒకసారి ఈ దేవతను పూజిస్తారు. ఊరికి పడమటి భాగంలో బయట ప్రదేశంలో మట్టితో దిన్నెలాగా గుడి కడతారు. దానిపై ఇటుకలు పరుస్తారు.

బంకమట్టి ముద్దను శంఖు ఆకారంగా చేసి, పైన వేప ఆకులు పెట్టి పోలేరమ్మగా పూజిస్తారు. పోలేరమ్మను ఇంటి బయట బంకమట్టితో చేస్తారు. ఉపవాసం ఉండి స్త్రీలు పొంగలి వండి నైవేద్యం చేస్తారు. ఆ పొంగలి ఉడికేటప్పుడు వచ్చే బుడ బుడ శబ్దాల్లాని తేడాను బట్టి మంచి జరుగుతుందా అన్నది చెప్తారు. అలాగే వీళ్ళు దెయ్యాలను, భూతాలను విశ్వసిస్తారు. దీనితోపాటు గొర్రె లను, మేకలను సంవత్సరానికి ఒకసారి ఆదివారంగానీ, మంగళవారంగానీ తమకు ఇష్టమైన దేవతకు బలి ఇస్తారు. ఆ ఇటుకలపై గంధము, పసుపు రాసి కర్పూరం

వెలిగిస్తారు. అందరు కలిసి భోజనం చేస్తారు. వాళ్ళు ఎక్కడైనా దోపిడీకి వెళ్ళే ముందు ఆయా దేవతలను పూజించి వెళుతారు. దాన్ని బట్టి ఏ గుడిలో పూజ జరిగిందో తొలుత గమనించి తరువాత ఆయా దొంగలను పట్టుకొనే వారట.

ఎరుకలు 'మూదేవి'ని కూడా పూజిస్తారు. ఈమె నిద్రా దేవి. మూదేవి అనగా మూగతనానికి కూడా ఈమె అధి దేవత. అందుకే ఎరుకలు నోరు విప్పరు. ఆమెను ఇతర దేవతలకన్నా భయభక్తులతో పూజిస్తారు. నేరాలు వారికి ప్రధాన వృత్తి కాబట్టి ఈ పూజకు రెండు ప్రయోజనాలు ఉన్నాయి. (1) దొంగతనాలు చేసినప్పుడు తమకు నిద్ర రాకుండా ఉండడం. (2) ఆ ఇండ్ల వారు బాగా నిద్ర పోవాలి. ముఖ్యంగా ఈ దేవతలను స్త్రీలు పూజిస్తారు. ప్రత్యేకమైన నియమ, నిష్టలతో పూజిస్తారు. జంతుబలి, మద్యపానం ఈ పూజలో ప్రత్యేకం. ఈ పూజను ఎవరికీ తెలియకుండా రహస్యంగా చేస్తాను.

ఆచార సంప్రదాయాలు :

ఆచారాల ప్రభావం ఏ సంఘం మీదైనా ఎక్కువగానే ఉంటుంది. జననం మొదలు మరణం వరకు అనుష్ఠించే కార్యకలాపాల్లో వివిధ ఆచారాలు పాటింపబడు తుంటాయి. మానవుని వివిధ జీవిత దశలలో చేసే కర్మలు తరతరాల నుంచి సంక్రమిస్తున్నాయి. వీటిని ఆచరించకపోవడం వల్ల నష్టాలు ఉన్నాయని భావిస్తారు. అందుచేత ఈ ఆచారకర్మలను పాటిస్తుంటారు.

శిశు జననం - సంస్కారాలు :

శిశువు పుట్టగానే సాంబ్రాణి పొగ వేస్తారు. పెద్దలకు బెల్లం నైవేద్యంగా పెడతారు. ఇక్కడ పెద్దలు అంటే చనిపోయిన అని అర్థం. ఎరుకల భాషలో ఇలా చెబు తారు. ఓ పెద్దల ఆత్మలారా! క్రిందికి దిగివచ్చి మాకు సహాయం చేయండి. మా పశువులు అభివృద్ధి చెందేలా దీవించండి. మా సంపద పెరగనీ! ప్రభుత్వం నుండి మమ్ములను రక్షించండి. పోలీసులనోళ్ళు మూయిం చండి. మిమ్ములను ఎల్లప్పుడూ పూజ చేస్తూ ఉంటాము. నైవేద్యం పెట్టి అందరికీ పంచుతారు. శిశువును ఆవుపేడతో శుద్ధిచేసి, స్నానం చేయిస్తారు. పేరు పెట్ట డానికి బ్రాహ్మణుడిని సంప్రదిస్తారు. పేరు పెట్టాక మొల త్రాడును మేనమామ శిశువుకు కడతాడు. ఈ మొలత్రాడు ఆ శిశువు ఎరుకలలోకి వచ్చినదానికి గుర్తు.

వివాహ పద్ధతులు :

ఎరుకలలో పెద్దలే జోక్యం చేసుకొని వధూవరులను నిర్ణయించేవారు పెళ్ళికొడుకు తండ్రి పది రూపాలయను "సుల్లపాన్ను" (శుల్కంస్త్రీ)ను తీసుకొని పెళ్ళికూతురు ఇంటికి వెళతాడు. పది మంది పెద్దలు చేరి అక్కడ ఒక పెద్దాయన చేతిలో ఈ డబ్బు పెడతారు.

సాయంత్రం సమయంలో ఆడపిల్ల వాళ్ళ గుడిసె ముందు శుభ్రంగా కసువు ఊడ్చి ఒక పీటవేసి దాని ప్రక్కలో ఒక రాయి పెడతారు. అమ్మాయి పీట మీద కూర్చొంటుంది. అబ్బాయి రాయి దగ్గర కూర్చొంటాడు. వాళ్ళ ముందు రెండు కుండలలో నీళ్ళు పెడతారు. ఆ రెండింటికి కలిపి కుండ మూతులకు దారం చుడతారు. ఆ కుండలను తీసుకొని వాటిలో నీటిని ఆ ఇరువురిపై పోస్తారు. ఈ స్నానం తరువాత వాళ్ళకు కొత్త దుస్తులు ఇవ్వరు. పాత దుస్తులే ఇస్తారు. ఆ తరువాత ఒకరిపై మరొకరు తలంబ్రాలు పోసుకుంటారు. వారిలో బుద్ధి మంతుడైన వాడు బ్రాహ్మణుడిలాగా పౌరోహిత్యం నిర్వ హిస్తాడు. కొన్ని మంత్రాలు చదువుతాడు. ఆ తరువాత ఒక దారానికి పసుపుకొమ్మను కట్టి అందరికీ చూపిస్తాడు. దాన్ని అందరూ తాకుతారు. దాన్నే వరుడు వధువు మెడలో కడతాడు. సారాయితో సహా విందుభోజనం జరుగుతుంది. పెండ్లికొడుకు ఇచ్చిన పది రూపాయలతోనే ఈ ఖర్చు అంతా జరుగుతుంది.

వీరిలో 'దేవరన్యాయం' ఉంది. వదినను మరిది, మరదలిని బావ వారి భర్తలు పోయిన సందర్భంలో పెండ్లి చేసుకోవచ్చు. విధవరాలి పెండ్లి పుట్టింటిలోనే జరుగు తుంది. ఈ పెళ్ళిలో పసుపుదారం కడతారు. అయితే తక్కిన తతంగాలేవీ ఉండవు.

విడాకులు తీసుకోవడం :

విడాకుల పద్ధతి ఎరుకలలో ఉంది. మొగుడు విడాకులు తీసుకోవాలి అంటే అతని భార్య కులపంచాయితీలో ఒక పుల్లను విరిచివేస్తే చాలు, విడాకులు మంజూరు అవుతుంది. ఒక స్త్రీ తాను విడాకులు కోరుకుంటే మరొకరితో వెళ్ళిపోవచ్చు. అప్పుడు ఆ వ్యక్తి ఆమె భర్తకు 'పాణ్ణు' అనే శుల్కాన్ని (స్వల్ప ధనం) ఇవ్వాలి.

పెద్ద బోయసాని వ్యవస్థ :

ఒక స్త్రీ వరుసగా ఏడు మందిని పెండ్లాడితే ఎరుకల సమాజంలో ఆమె స్థాయి పెరుగుతుంది. వారిని పెద్ద బోయసాని అంటారు. పెండ్లిండ్లలోనూ, ఆచార వ్యవహారాలలోనూ వీరిదే పెద్దపీట.

మరణానికి సంబంధించిన ఆచారాలు :

ఎరుకలలో చనిపోయిన వారిని వెంటనే పూడ్చివేస్తారు. తలను ఉత్తరానికి, కాళ్ళను దక్షిణానికి పెట్టి పూడ్చడం ఒక పద్ధతి. నివసించిన గుడిసె దగ్గర వారిని సమాధి చేస్తారు. ఆ గుంపు అక్కడ ఉండరు. వేరేచోటికి వెళ్ళిపోతారు.

వైద్యం :

పూర్వం వైద్యం శాస్త్రీయమయినది కాదు. సంప్రదాయ బద్ధంగా ఒకతరం నుంచి మరోతరం వాళ్ళకు సంక్రమిస్తుండేది. మూలికా వైద్యం ఎక్కువ. ఎరుకలు వన మూలికలను సేకరించి మందులు తయారుచేసి వైద్యం చేసేవారు. ప్రసవ వేదనకు ముందుగా ఇంగువను తమలపాకులో పెట్టి ఇస్తారు. గాడిదలద్దితో కలిపిన నీటిని కొద్దికొద్దిగా త్రాగిస్తే నొప్పులు తగ్గుతాయంటారు.

పచ్చ పొడిచిన తర్వాత గాయం మానటానికి నూనె, పసుపు, ఆవరై ఆకుల మిశ్రమంతో గాయాన్ని శుభ్ర పరుస్తూపోతే గాయం త్వరగా మానుతుంది.

కళలు :

సంస్కృతికి నిలువటద్దాలు. కళలు ఎరుకలు విలువిద్యలో ఆరితేరినవారు. ఎరుక స్త్రీలు నృత్యకళలో గట్టివారు. దారం మీద కూడా నాట్యం చేసే కళానైపుణ్యం ఉండి, వీరి అడుగులే యక్షగాన ప్రక్రియలోని భిన్నతాళ రతులకు మూలం. ఎరుకలకు చోరకళా నైపుణ్యం కలదు.

నమ్మకాలు - విశ్వాసాలు :

నమ్మకాలు మానవులను కష్టాల నుండి విముక్తి కలిగిస్తాయని నమ్మకం. ఎరుకల వాళ్ళు నల్లపూసల దండ వేస్తారు. ఎందుకంటే పెండ్లిలో తాళి కోసం, మేళాల కోసం వెళ్ళిన వారు తిరిగి రాలేదట. అందుచేత నాదస్వరం బదులు గంట వాయిస్తారు. తాళి బదులు నల్లపూసలు వేస్తారు. పశువులకు రోగాలు రాకుండా బలి ఇవ్వడం వలన పంటలు పండుతాయని నమ్మేవారు. దోపిడి విఫలం అయితే దృష్టిదోషం పడిందని, ఎవరో తిట్టుకొంటున్నారని భావిస్తారు. ఇంటికి కన్నం వేయడానికి వాడే గునపం అగ్రభాగంలో 'పంచలోహాలు' పెట్టి పదును పెట్టిస్తారు. ఇలా చేస్తే దృష్టిదోషం పనిచేయదని వారి విశ్వాసం. దొంగతనానికి వెళ్ళేటప్పుడు ఏడుగురు కలిసి వెళ్ళరు. ఏడు అనే సంఖ్య దురదృష్టకరమని నమ్ముతారు. శ్రావణ మాసంలో 18వ రోజు అన్ని నేరాలు చేయడానికి శుభప్రదమైన రోజుగా భావిస్తారు.

స్త్రీకి కాన్పు కావడం కష్టమైతే ఏదో తప్పు చేసిందని నమ్ముతారు. పుట్టిన బిడ్డకు మెడలో బొడ్డుతాడు చుట్టుకొని ఉంటే తండ్రిగాని, మేనమామగానీ చనిపోతారని నమ్ముతారు. దీనిని నివారించడానికి ఒక కోడిని బలి ఇస్తారు.

ఆహారపు అలవాట్లు :

పిల్లులు, కోళ్ళు, చేపలు, పందులు, నల్లమూతి కలిగిన కోతులు, నక్కలు, పాలాల్లో ఉండే ఎలుకలు, జింకలు, దుప్పులు, మేకలు, గొర్రెలు ప్రధానంగా వీరి ఆహారం. బోయలతో కలిసి వీరు భోజనం చేస్తారు. డబ్బు ఉన్నప్పుడు, పది మంది చేరినప్పుడు వీరు త్రాగుతారు. పంచాయితి జరిగిందంటే తప్పక కల్లు, సారాయి ఉండాలి.

ఆటలు :

'డయాలోలో' అనే ఆటను పురుషులు ఆడుతారు.

ఒక దారం మీద నడుస్తూ ఒక కర్రకు దారపు ఉండచుట్టి ఆకాశంలోకి పారవేసి అది క్రింద పడేటప్పుడు పట్టు కుంటారు. వీరిలో చాలా నైపుణ్య ఉంది. లక్ష్యశుద్ధి ఉంది. ఇది వారి జాతి వారసత్వంలో భాగం. ఇంకా వివిధ రకాల ఆటలు ఆడేవారు.

అలంకరణ :

అలంకరణ జాతికీ జాతికీ, వ్యక్తికీ వ్యక్తికీ మధ్య తేడా ఉంటుంది. స్త్రీలు శంఖాలతో, గవ్వలతో చేసిన హారాలు మెడలో వేసుకుంటారు. వాటి నడుమ రకరకాల పూసలు ఉంటాయి. ఇవి రెండు, మూడు వరుసలుగా కూడా ఉండవచ్చు. ఇత్తడి గాజులు చేతినిండా వేసుకుంటారు. కొందరు ఇత్తడి నగలకు బదులు వెండి నగలు వేసుకొనే వారు. ఇత్తడి, సీసం, వెండి ఉంగరాలను నడిమి వేలుకు తప్పా తక్కిన అన్నివేళ్ళకు పెట్టుకుంటారు. నల్లచీరను ఎక్కువగా వాడుతారు. అయితే ఇది అన్నిచోట్లా కనిపించదు. ఎక్కడి నుంచో దొంగలించి తెచ్చిన చీరలను బార్డర్లు తొలగించి ఇతరులు గుర్తించడానికి వీలులేకుండా చేసి కట్టుకుంటారు.

చోళి లేదా రవిక వేసుకోవడం ఉంది. అయితే దానిని భుజాలపైన కట్టుకుంటారు. లంబాడివాళ్ళ లాగా వెనుకవైపు కాదు. మగవాళ్ళు చాలా గలీజుగానూ అసహ్యంగానూ ఉంటారు. వెంట్రుకలు పొడవుగా పెంచుకుంటారు. జుట్టు ముడివేసుకుంటారు. అరుదుగా దేహాన్ని పరిశుభ్రంగా ఉంచుకుంటారు. ఒక గోచి పెట్టుకుంటారు. వడిసంచి అని ఒక చిన్న తిత్తిని దగ్గర ఉంచుకుంటారు. (ఇది వంద సంవత్సరాల క్రితం థర్‌స్టన్ సేకరించిన విషయాలు. ఇవాళ ఎరుకలలో అందరూ పంచలు, షర్ట్, ప్యాంట్లు, స్త్రీలు చీర, జాకెట్లు ధరిస్తున్నారు. గోచీ పెట్టుకునే వారు అసలు కనిపించరు. అయినా పురుషుల్లో 50 సంవత్సరాలు దాటిన వారిలో థర్‌స్టన్ చెప్పినట్లు 'షోకు'గా ఉండాలన్న కోరిక తక్కువ).

ఎరుకల సంస్కృతి ద్వారా వారి జీవన విధానం తేట తెల్లమయింది. ఈ సాహిత్యం మీద ఎన్నో పరి శోధనలు జరగాల్సిన అవశ్యకత ఉంది.

ఆధార గ్రంథాలు :

1. భాస్కరరావు గొడవర్తి - "కురవంజి" తెలుగు అకాడమి, హైదరాబాదు.
2. రామయ్య బిజిలి - "జానపద విజ్ఞానంలో ఎరుక - ఎరుకత - పరిశీలన.
3. శ్రీరాములు గుజ్జల - "ఎరుకల సంస్కృతి - భాషాసాహిత్యాలు".

నల్లపూసలు కథానిక – గిరిజన జీవనం

– డా॥. జి. పార్వతి, సహాయ ఆచార్యులు, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

ఈ దేశ మూలవాసులైన గిరిజనులు ఆ మాటను ఎలుగెత్తి చెప్పుకునే స్థాయిలో మాత్రం లేరన్నది వాస్తవం. ఈ దేశంలో ఆర్థికంగా, రాజకీయంగా, అభివృద్ధిపరంగా బాగా వెనుకబడ్డ వాళ్ళమని మాత్రం ఘంటాపథంగా చెప్పుకొని సానుభూతిని పొందే వారిలో మాత్రం ముందుం టారు. దానికి అనేక కారణాలు, అందులో ఒక బలమైన కారణం ఏంటంటే, సాహిత్యపరంగా వాళ్ళను గుర్తించాల్సి నంతగా గుర్తించలేదు. వారి సామాజిక జీవన నేపథ్యాన్ని మన సాహిత్యకారులు సాహిత్యపుటల్లోకి చేర్చాల్సినంత చేర్చి లోకం ముందుంచక పోవడమేనన్నది నా అభి ప్రాయం. 1921లోనే చింతాదీక్షితులు గిరిజనుల గురించి రాసినా ఆధునిక సాహిత్యం వారికి చేయూతనివ్వడానికి చాలా కాలం పట్టింది. అలాంటి తరుణంలో బహుజన గిరిజన సాహిత్యానికి తనవంతు సహకారంగా తన సాహిత్యంలో పెద్దపీట వేసిన రచయిత, కవి, విమర్శకుడు డా॥ వి.ఆర్. రాసాని ప్రత్యేకించి గిరిజన సాహిత్యంపై రెండు కథాసంపుటాలను రచించి, ప్రచురించి గిరిజన జీవనం గురించి సాహితీలోకం ముందు చర్చకు పెట్టాడు. అలాంటి కథా సంపుటాలు మెరువణి, విషపురుగు. ఆ రెండింటిలోను 'నల్లపూసలు' ముద్రించబడింది. 'నల్లపూసలు' కథానిక పూర్తిగా గిరిజన నేపథ్యం కలిగి రచింపబడింది.

'నల్లపూసలు' కథానిక పూసలదండలు అమ్ముకునే ఒక గూలోళ్ళ స్త్రీ జీవన నేపథ్యం నుండి రాయబడిన కథ. "నాకు ముగ్గురితో మనవాయ. మూడు తావుల సంసారమాయ. అయినా నేనేం తప్పు సెయ్యలా. నేను నిప్పులాంటి దాన్నబ్బయ్యా....." అంటూ ఉత్తమ పురుషలో సాగే ఈ కథలో స్త్రీ పాత్ర ఆరంభంలోనే చెప్పడం పాఠకుడిని ఆద్యంతం కన్నార్పకుండా ఎంతో ఆసక్తితో చదివిస్తుంది. అలా తన జీవితాన్ని గూర్చి చెప్పిన స్త్రీ పేరు నాంచారి. ముగ్గురితో పెళ్ళి అయినప్పటికి వ్యక్తిత్వంపై మచ్చలేని మహారాణి నాంచారి. ఈ కథ మొత్తం చదివిన తర్వాత రాసాని స్త్రీవాద దృక్పథంతో కథ రాశాడని అనిపిస్తుంది.

నల్లపూసలు కథలో నాంచారి గూలోళ్ళ తెగకు చెందిన స్త్రీ. ఆమెకు మొదట యాదన్నతో వివాహం అవుతుంది. కానీ వాళ్ళిద్దరికి సంతానం కలగలేదు. ఈ పురుషాధిపత్య దురహంకార సమాజంలో సంతానం కలగడానికి, కలగక పోవడానికి పురుషులకంటే స్త్రీనే ఆ బాధ్యత అని అడదానిపై నెపం నెట్టడం సహజంగా జరిగేదే కదా. ఈ కథలో కూడా అలాగే జరిగింది. యాదన్న నాంచారిపై నిందమోపాడు. సంతానలేమి సమస్యకు మూలం నాంచారేనని నానా రాద్ధాంతం సృష్టించాడు. అప్ప డప్పుడూ ఆమెను హింసించేవాడు. అంతటితో ఆగక ఒక రోజు "ఒసే, గాట్లో గెడ్డితో కడుపు నిండకపోతే గొడ్డు సేన్లోనన్నాబడి ఎవురూ గానకుండా పైరు మేసేసి కడుపు నింపుకోవాల..." అంటాడు. యాదన్న ఎంత అమా నుషంగా మాట్లాడాడో అర్థం చేసుకోవచ్చు. సంసారానికి సంతానమే పరమావధి అనుకోవడం మూర్ఖుల లక్షణం. భార్యాభర్తలు సంతానం కలగకున్నా సౌఖ్యంగా మెగలడమే దాంపత్యానికి మంచిదని ఈనాడు చదువుకున్న వాళ్ళు సైతం గ్రహించలేక పోతున్నారు. నిరక్షరాస్యుడు, ఆలోచనా జ్ఞానం లేని యాదన్న అనడంలో ఆశ్చర్యం లేదు. కానీ భార్యను సంతానం కోసం పక్కదార్లు తొక్కమని ప్రోత్స హించడం చాలా హేయమైనచర్య. ఆత్మాభిమానం ఉన్న స్త్రీ ఎవరైనా ఇలాంటి మాటపడరు. మూడు ముళ్ళు పడిన తర్వాత భర్తను తప్ప మరొకరిని తనతో ఊహించకోడానికి కూడా ఇష్టపడని ఆడవాళ్ళు ఏ కులంలో నైనా ఉంటారు. భర్త సర్వస్వమని భావిస్తుంటే మరి ఆ భర్తే అలాంటి వేదనకు గురిచేస్తుంటే ఆమేం కావాల'

నల్లపూసల కథలో నాంచారికి భర్త యాదన్న మాటలు విని కోపం చిర్రెత్తుకొచ్చింది. "తూ, నీ జిమ్మడ.... ఎంత మాట అంటివిరా పరదేసి నా బట్ట. అంత వగాతగా లేనోడివి నన్నెందుకు కట్టుకున్నావా? దానికంటే ఆడ యాడన్నా బడి సావరాదా!" అంటూ చెడ మడా తిట్టేస్తుంది. శీలం విషయంలో తనెంతటి నిజాయితీ పరురాలో ధ్రువీకరిస్తుంది. శీలం విషయంలో నాంచారి ఎంత బలంగా తన వాదనను వినిపిస్తుందో ఆమె అంత పవిత్రురాలు. మరో సందర్భంలో ఆ ఊరి సర్పంచి గెంగి నాయుడు ఎవరూలేని సమయం చూసి ఆమెపై చెయ్యేస్తే చెంపచెల్లుమనిపిస్తుంది. "అరగాసు నా బట్ట, యింగెబ్బుడన్నా నా జోలికొచ్చినావో నావనమైపోతావు, జాగర్త!" అంటూ హెచ్చరిక చేస్తుంది.

ఈ విషయాన్ని పరిశీలిస్తే ఒక విషయం అర్థమవుతుంది. సాధారణంగా బాగా వెనుకబడిన జాతుల్లో కులాల్లో మహిళలు పరిస్థితుల ప్రభావానికిలోనై, జీవితంలో కష్టాలను ఎదురీదలేక గతితప్పి, నీతి తప్పి శీలాన్ని ఫణంగా బెట్టి ఎలాగొకలా బతికేస్తుంటారు. శీలానికి అంతగా ప్రాధాన్యమివ్వరని భావిస్తుంటారు. కానీ నాంచారి మాత్రం అటువంటి దురభిప్రాయాన్ని పటాపంచలు చేస్తూ తాను కులంలో తక్కువ కావచ్చునేమో కానీ తాను గుణంలో కాదని ఆమె ఉన్నత వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించింది.

కానీ గొడ్రాలు అన్న మచ్చను పోగొట్టుకోవడానికి అజ్జప్పతో లేచిపోయింది. అయినా వాళ్ళకు సంతానం కలగలేదు. దాంతో ఈమె సంతానానికి పనికిరాదంటూ అజ్జప్ప కూడా బయటకు గెంటేస్తాడు. కథలో నాంచారికి అజ్జప్ప అంటే చాలా ఇష్టం. గొడ్రాలినని అనవసరంగా ముద్ర వేయించుకున్న తను ఎలాగైనా ఆ నిందను తుడుచు కోవాలనే తన కిష్టమైన అజ్జప్పతో లేచిపోయింది. అజ్జప్ప కూడా మగవాడే కదా. తన అసలు రంగు బయటపెట్టాడు. నమ్మివచ్చిన ఆడదాన్ని ఒంటరి దాన్ని చేశాడు.

ఒంటరి అయిపోయిన నాంచారికి వాళ్ళ నాన్న మూడో పెళ్ళి చేస్తాడు. అతనితో సంసారం చేసిన నాంచారి ఒక ఆడుబిడ్డకు తల్లి అవుతుంది. బిడ్డను కనాలి అనే కోరిక మాత్రం తీరుతుంది కానీ ఆ మూడో మొగడు మాత్రం ఆమెను వదలి ఇంకోదాన్ని చేసుకొని దాంతో వెళ్ళిపోతాడు. ఇలా మూడు మనవులు చేసుకున్నా ఆమెకు సుఖసంతోషాలు మాత్రము కలగలేదు. ఆమె జీవితమంతా కష్టాలు. సమస్యలు ఆమెను వేధించాయి. అయినాసరే వాటన్నింటిని భరిస్తూ తన వ్యక్తిత్వాన్ని నిలుపుకుంటుంది నాంచారి.

నల్లపూసలు పరిశీలిస్తే డా॥ వి.ఆర్. రాసాని గిరిజన సంచారీ తెగల్లో నిలకడలేని స్త్రీ, పురుషుల సంబంధాలను వివరించాడు. అలాగే నాంచారి తన గతాన్ని చెప్పే క్రమంలో వారి ఆచార సంప్రదాయాలతో పాటు, అనాటి సమాజం వీరిపట్ల ఎలా వ్యవహరించిందో చెప్పే విధానం కళ్ళలో నీళ్ళు తెప్పిస్తుంది. ముఖ్యంగా సర్పంచి నాంచారిని బలత్కరించాలని చూసిన విధానం పరిశీలిస్తే అగ్రవర్ణాల వారి దాష్టీక ఆలోచనలు స్పష్టంగా బయటపడుతున్నాయి. సామాన్య పరంగా అసమానతలకు కారణమైన కులం గిరిజన స్త్రీలను అనుభవించడానికి మాత్రం అడ్డుగా కనిపించకపోవడం విడ్డూరంగా కనిపిస్తుంది. ఆ వాస్తవం ఈ కథ ద్వారా స్పష్టంగా కళ్ళముందు కనిపిస్తుంది.

ఈ కథలో కనిపించే ముఖ్యమైన దురాచారం, ఇది ఒకనాడు ఆచారమై తరువాత కాలంలో దురాచారమై సమాజాన్ని పట్టి పీడించే రుగ్మతగా పరిణమించింది. ఇప్పటి కొన్ని సమాజాల్లో నామమాత్రంగా నైనా ఇప్పటికీ ఉంది. 'ఓలి' దురాచారమై ఉన్న సమాజాల్లో మాత్రం స్త్రీ బతుకు దారుణంగా ఉంటుంది. ఓలి ఇచ్చి కొనుక్కున్న వాడితో వెళ్ళి జీవించాలి. అతను కాదనుకున్నా, ఇంకొకరు కావాలనుకున్నా ఓలి ద్వారా స్త్రీ మారకం జరిగిపోతుంది.

నాంచారికి అజ్జప్పపై ఇష్టమున్నా ఓలి అనే దురాచారానికి బలైపోతుంది. రెండు వేల రూపాయలు నగదు,

పందిపిల్లలను ఓలిగా ఇచ్చి, కులస్థులకు కల్లు తాగించి యాదన్న నాంచారిని పెళ్ళి చేసుకుంటాడు. డబ్బుచ్చి పశువును కొన్నట్లు స్త్రీని కొనుక్కోవడం ఎంతటి అనాగరికమో ఈ కథ ద్వారా అర్థం చేసుకోవచ్చు. 'ఓలి' సంప్రదాయం, పురుషాధిక్యతకు నిదర్శనం అవుతుంది. ఏ వర్ణ సమాజంలోనైనా స్త్రీని ద్వితీయస్థానంలో నిలబెడుతోంది. నాంచారి సంతానం కోసం అజ్జప్పతో లేచిపోయిందని పంచాయితీ పెట్టించిన యాదన్న తను ఓలిగా ఇచ్చిన తిరిగి కట్టించుకొన్నాడు. స్త్రీ అంగటిలో సరకులా ఎలా మారకానికి గురైందో వివరించే నల్లపూసలు కథ రచయిత స్త్రీవాద దృక్పథానికి నిదర్శనంగా నిలిచింది.

చివరగా సంతానం కలిగాక, ముగ్గురి భర్తల దగ్గర విడవబడ్డాక ఏకాకి అయిన నాంచారి జీవితంలోకి మళ్ళీ ఆ భర్తలే రావడానికి చూసినప్పుడు ఆమె తిరస్కరించి, సంతానం కలగలేదని ఛీత్కరించిన భర్తలు తీరా సంతానం కలిగాక ఆమెతో జీవించడానికి ముందుకొచ్చినప్పుడు ఛీకొట్టింది. "ఏ మొగోడొచ్చినా నా వంటి సొంపులే జూశ గానీ నా మొణుసు జూడడలే. నాకూ వొక యిదుంటుం దని అనుకోలే" అంటూ బాధపడింది. ఆ తర్వాత వేరే వాళ్ళు మనువాడతామని వచ్చినా వీళ్ళంతా సరదా తీరే దాక తనతో ఉండి తీరిన తర్వాత నాకేసిన పుల్లాకు మాదిరి విసిరి పారేస్తారని భావించి మరో పెళ్ళి చేసుకోలేదు. "మాకులంలో మెల్తాడు గట్టిన పెతి మొగనాకొడుకూ ఆడుదాన్ని వొగవస్తువు మాదిరి సూస్తాండె. మాసిపోతే వదిలేసే కట్టుగుడ్డ మాదిరి, కట్టుకున్న దాన్ని వదిలేస్తాడు. మొలకు మొల్తాడు మార్చుకున్నట్లు ఆడాన్ని మార్చేస్తాడు. ఇట్టేవుంటే మా బతుకులెప్పుడు బాగపడుతాయో ఏమో. మొగోడి సేతిలో ఆడది ఇట్ట ఎన్ని దినాలని అణగారి బతకాల్నో ఏమో? సెప్పండబ్బయ్యా సెప్పండి. ఇట్టి ఎన్ని దినాలు? ఎన్ని తరాలు?" అంటూ ఆవేదన చెందడం ఆ విషయాన్ని స్పష్టం చేస్తుంది. గూలోళ్ళ సంస్కృతిలో ఎన్ని పెళ్ళిళ్ళు చేసుకొనే స్వేచ్ఛ ఉంది. ఆలా ఉంటే ఆ జాతి స్త్రీలలో వ్యక్తిత్వం కలిగిన నాంచారి లాంటి వాళ్ళు దాన్ని తిరస్కరిస్తున్నారని రచయిత డా॥ వి.ఆర్. రాసాని ఎత్తి చూపాడు.

ముగింపు :

నల్లపూసలు కథలో 'ఓలి' సంప్రదాయం ద్వారా గూలోళ్ళ బతుకులు ముఖ్యంగా స్త్రీ జీవితం ఎలా చిద్ర మౌతుందో ఉత్తమ పురుష కథనంలో రచయిత డా॥ వి.ఆర్. రాసాని హృద్యంగా వివరించాడు. విశ్వ విద్యాలయంలో ఆంత్రోపాలజీ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి గువ్వలోళ్ళ గూడానికి వెళ్ళి వారి జీవనాన్ని గురించి తెలుసుకోవాలని విషయసేకరణలో భాగంగా సాగిన ఈ కథలో నాంచారి అనే యువతి చెప్పిన ఈ కథ స్త్రీ మనస్తత్వానికి అద్దంపట్టింది. నాంచారి ముగ్గురు పురుషులలో సంసారాన్ని చేసిన అనుభవం పురుషస్వామ్య సమాజం మీద తన అనుభవాన్ని, అవగాహనను చెబుతుంది. ఇందులో ప్రతి అనుభవం సత్యం.

రచయిత డా॥ వి.ఆర్. రాసాని సాహిత్యాన్ని పరిశీలిస్తే ఆయన సాహిత్యంలో సగభాగం స్త్రీలకు అవకాశం ఇచ్చాడు. ముఖ్యంగా వెనుకబడిన వర్గాలు, దళిత, గిరిజన, బహుజనుల సమస్యలను తన సాహిత్యంలో ఎత్తిచూపాడు. ఆయా వర్గాల స్త్రీల కడగండ్లను చక్కగా వివరించాడు.

ఆధార గ్రంథాలు :

1. మెరవణి (కథా సంపుటి) - డా॥ వి.ఆర్. రాసాని
2. లోచూపు - డా॥ వి.ఆర్. రాసాని
3. డా॥ వి.ఆర్. రాసాని సాహిత్య సమాలోచన - సంపా: ఆచార్య నాగకృష్ణారెడ్డి
4. విపుల మాసపత్రిక - మార్చి 2010



కొండ కావ్యం'గుమ్మ' – గిరిజన జీవన చిత్రణ

– డా॥. పులపర్తి శ్రీనివాసరావు, పోస్ట్ డాక్టోరల్ ఫెలో, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

"నాలుగ్గోడల వ్యక్తిత్వం కాదు అతను
నాలుగు దిక్కుల సూర్యప్రవాహం!"

- అని ప్రముఖ కవులు, రచయితల చేత ప్రశంసించ బడిన కొంక్యాన ఛాయరాజ్ గారు ఆధునిక తెలుగు సాహిత్యంలో, ముఖ్యంగా ఉత్తరాంధ్రలో పేరెన్నిక గల కవి.అభ్యుదయ భావాలతో పాటు, విప్లవ దృక్పథం కలిగిన కవి.

ఛాయారాజ్ గారు కొంక్యాన సూర్యనారాయణ, సూరమ్మ దంపతులకు మొదటి సంతానంగా 1948లో శ్రీకాకుళం జిల్లాలోని గార గ్రామంలో జన్మించారు. బాల్య మంతా శాలిహుండం సమీపాన గల కొంక్యాన పేటలోనే గడిచింది. ఛాయరాజ్‌గారి విద్యాభ్యాసమంతా స్థానికంగానే సాగింది. ప్రాథమిక విద్య కొంక్యాన పేటకు సమీపంలో గల 'తంగుళ్ళపేట' గ్రామంలో జరిగింది. గార గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్నత విద్యను అభ్య సించారు. పిమ్మట శ్రీకాకుళం ప్రభుత్వ కళాశాలలో పి.యు.సి. పూర్తి చేశారు. బియస్సీ డిగ్రీ కూడా అదే కళా శాల నుంచి అందుకున్నారు. ఉపాధ్యాయ శిక్షణ బి.ఇడి. ని విజయ నగరంలోని మహారాజ కళాశాలలో అభ్యసిం చారు. ఉపాధ్యాయ శిక్షణ పూర్తి అయిన వెంటనే 1970వ సంవత్సరం ఫిబ్రవరి నెలలో మెరకముడిదాం ఉన్నత పాఠశాలలో విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయునిగా నియమితు లయ్యారు. తదుపరి 1995వ సంవత్సరంలో ప్రమోషన్ పొంది లావేరు మండలం ఆదపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానో పాధ్యాయులుగా నియమింప బడ్డారు.

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఎ.పి.టి.ఎఫ్.)లో వివిధ హోదాలలో పని చేశారు. ఎ.పి.టి.ఎఫ్. శ్రీకాకుళం జిల్లా కార్యదర్శిగా ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారు. 1980 నుండి "జనసాహితి" సభ్యునిగా, తర్వాత రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా, 'ప్రజాసాహితి' సంపా దకవర్గ సభ్యునిగా బాధ్యతలు నిర్వహించారు. 2007వ సంవత్సరం నుంచి జనసాహితి (ఆంధ్రప్రదేశ్) అధ్యక్షుడిగా ఆ పదవికే వన్నె తెచ్చిన సాహితీయోధుడు ఛాయరాజ్.

కవిగా, కథా రచయితగా, విమర్శకునిగా, నాటక కారునిగా, నవలా కారునిగా సాహిత్యరంగంలో అన్ని ప్రక్రియలలోనూ లోతైన కృషి చేస్తూ ఒక నూతన ప్రజాతంత్ర సమాజంకోసం సాహితీ సాంస్కృతికోద్యమానికి నాయకత్వ బాధ్యతలు నిర్వహించారు. ఉత్తరాంధ్ర మాండలికానికి వన్నెతెచ్చి, పదబంధాలకు పట్టాభిషేకం గావించి, సంస్కృతీ సంప్రదాయాలను అక్షరబద్ధంచేసి, శ్రీకాకుళ ఉద్యమ కథాకావ్య రచనతో శ్రీకాకుళ ఛాయ రాజ్‌గా సాహితీ ప్రపంచంలో సుస్థిర స్థానం సంపాదించిన కవి కొంక్యాన ఛాయరాజ్. చైతన్యాక్షరానికి నాశనం లేదు. భౌతికంగా ఛాయరాజ్ మన మధ్య లేకపోయినా ఆయన వదిలిన చైతన్యాక్షరం తన విద్యుక్త ధర్మాన్ని నిర్వహిస్తూం టుంది. ఉత్తరాంధ్ర రచయితలలో కవి ఛాయరాజ్‌ది విలక్షణ శైలి.

గుమ్మ కావ్యం : పరిచయం :

ఛాయరాజ్ రాసిన దీర్ఘకావ్యాల్లో 'గుమ్మ' ఒకటి. దీనిని 1995 ఫిబ్రవరిలో ప్రచురించారు. ఛాయరాజ్ రాసిన 'గుమ్మ' కొండ కావ్యాన్ని గుండె చెమ్మగా అద్దేపల్లి వారు అభివర్ణించారు. గిరిజనుల విప్లవానికి సూచికగా ఈ గుమ్మ కావ్యాన్ని మలిచారు. ఉత్తరాంధ్ర సాహిత్యంలో ముఖ్యంగా ఉద్యమ సాహిత్యంలో విప్లవానికి పెద్దపీట వేశారు. దీనికి ప్రధాన కారణం ఉత్తరాంధ్ర ప్రాంతం అన్ని రంగాల్లోను వెనకబడి ఉద్యమానికి ఆయువు పోసుకుని విప్లవ చైతన్యాన్ని తీసుకువచ్చింది. ఈ ప్రాంతంలో

పుట్టిన లేకఈ ప్రాంతానికి వలస వచ్చిన వారైనా ఉత్త రాంధ్ర ప్రాంతంపై కొంచెం మమకారం పెంచు కుంటారు. ఈ ప్రాంత భౌగోళిక ప్రత్యేకతే ఇందుకు కారణం. ఈ విధంగా విప్లవ సాహిత్యానికి పాదులు వేసి విప్లవ చైత న్యాన్ని తీసుకొచ్చి ఉద్యమ స్ఫూర్తిని నింపిన రచయితలు, కవులు చాలామంది ఉన్నారు. ఛాయ రాజ్‌గారు ఇందుకు నిదర్శనం. ఛాయరాజ్ గారి 'గుమ్మ' విప్లవ బావుటా ఎగరవేసింది.

గుమ్మ కావ్యం - విప్లవ దృక్పథం :

ఈ కావ్యంతో రచయిత ఉత్తరాంధ్రలో ఒక ఉద్యమ పరివర్తన తీసుకువచ్చారు. మూడు దశాబ్దాల క్రితం శ్రీకాకుళంలో భూస్వాములు, కాంట్రాక్టర్లు, షావుకార్లు గిరిజనులను జీవచ్ఛవాలుగా మిగిల్చిన దోపిడీకి వ్యతి రేకంగా విప్లవోద్యమం ప్రారంభమయింది. విప్లవోద్యమ మూలాల్నీ, లక్ష్యాల్నీ, పరిణామాల్నీ తమ కవిత్వంలో ప్రతిబింబించారు ఛాయరాజ్‌గారు. విప్లవకారుల కోసం కూంబింగ్ చేస్తున్నప్పుడు, గిరిజనులపై పోలీసుల కిరాతకాలు దారుణంగా ఉంటాయి. ఊయలలో ఊగే గుమ్మను, ఒక పసి బాలికను బీభత్సంగా పోలీసులు చంపే ఘట్టం ఈ కథాకావ్యానికి వస్తువుగా తీసుకున్నారు రచయిత. రిజనులపై రాజ్యహింసలోని ఒక ప్రధాన అంశాన్ని ఇతివృత్తంగా తీసుకొని ఈ 'గుమ్మ'ను చిత్రిం చారు.

విప్లవానికి నిలువుటద్దమైన 'గుమ్మ' కావ్య ఆరంభం లోనే తనదృక్పథాన్ని బయటపెట్టే విధంగా చిత్రించారు. విప్లవానికి సంకేతంగా గుమ్మ దర్శనమిస్తుంది. విప్లవానికి మారుపేరుగా ఈ కావ్యాన్ని చిత్రించినా, బాలిక పరంగా, అలాగే ధ్వనిపరంగా, ఒక ఉన్నతమైన అభివ్యక్తిని ఈ కావ్యంలో సాధించారు.

"కోకాటుయ్యాల గట్టి
గుమ్మను కూకోబెట్టి
సూర్యుడు దూరే దిక్కుకు
చూరు దాటి ఉయ్యాలూపి
నిద్రలేచినల గుమ్మను
ముద్దు పెట్టింది సిరిబిడి ....."

సూర్యుడు దూరే దిక్కున నిద్రలేవడమనేది విప్లవమే అవుతుంది. గుమ్మ విప్లవానికి ప్రతీక అని చెప్పడానికి రచయిత చేసిన ఈ ప్రయోగం వినూత్నంగా కనిపిస్తుంది. ఇదే విషయం కావ్యమంతా మధ్యమధ్యలో తెలుపు తుంటాడు.

గిరిజనులపై పోలీసు చర్యలు అమానుషం అని చెప్పే విధంగా ఈ కావ్యం మలచబడింది. ప్రతీకాత్మకంగా సాగే ఈ కావ్యంలో రచయిత సందర్భానుసారంగా పలికిన పలుకులు కొంచెం ఆలోచింప చేస్తాయి.

"కాలం
ఆకాశాన్ని కోసి వేకువను చూసింది
వేకువ ఆకారాన్ని చూసి
వణికింది కాలం'

విప్లవ దశలోని త్యాగాన్ని ధ్వనింపజేసే ఇటువంటి మాటలు, గిరిజనుల, పోలీసుల మధ్య జరిగే పోరు సందర్భాన్ని గ్రహించేలా రచయిత చిత్రించి విప్లవ భావుటా ఎగరేశారు.

రచయిత విప్లవమంటే ఉద్యమంగా రూపుదిద్దారు. సాధారణంగా విప్లవ మంటే 'మార్పు' అనే అర్థంలో కూడా వాడుకలో ఉంది. గుమ్మ దీర్ఘకావ్యం వ్యంగ్యంగా విప్ల వాన్ని చిత్రించినా ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు పడు తున్న బాధలను సమస్యలను చిత్రించారు రచయిత. గిరిజనులకు అటు పోలీసుల నుండి, ఇటు మావో యిస్టుల నుండి ఒత్తిడి ఉంటుంది. వీరిద్దరి మధ్య జరిగే పోరాటంలో అమాయక గిరిజనులు ప్రాణాలు కోల్పోతుం టారు. ఈ కావ్యంలో పోలీసు చర్యల వల్ల జరిగిన రక్త పాతాన్ని వివరిస్తూ విప్లవ సూచికగా వర్ణించాడు రచయిత.

పోలీసులు చేసే భీభత్సం చూస్తే ఒళ్ళు గగుర్పొడు స్తుంది. అదే విషయాన్ని రచయిత ఈ కవిత ద్వారా తెలిపాడు.

"చూరుల్లో దాగిన
కొండ దేవర్లను కాల్చినారు
కుండల్లో దాచుకున్న
జీడంబలినీ కాల్చినారు
కుదురు మీద కూకున్న
కుండల్నీ పేల్చినారు
ఉట్టైన వేలాడుతున్న
మట్టి పిడతల్ని పొడిచినారు"

పై కవితలో వాస్తవికత దర్శనమిస్తుంది. పోలీసులు సృష్టించే మారణకాండ ఎలా ఉందో కళ్ళకు కట్టినట్లు వర్ణించారు. కొన్ని సందర్భాల్లో నేరం చేయని వాళ్ళు అసలు విప్లవానికి సంబంధంలేనివాళ్ళు కూడా బలైపోవడం అనేది కనిపిస్తుందని పై కవిత ద్వారా ఛాయరాజ్‌గారు వ్యావికంగా చిత్రించారు.

ఛాయరాజ్‌గారు ఈ దీర్ఘకావ్యంలో వర్ణనలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. స్వాభావిక జీవితాన్ని వర్ణించడంలో కృతజ్ఞులయ్యారు రచయిత. అందున గిరిజన జీవన చిత్రణ కళ్ళకు కట్టినట్లు వర్ణించారు.

గుమ్మ కావ్యం : గిరిజన జీవన చిత్రణ :

గిరిజనులు తమ వాస్తవిక జీవితంలో అనేక సాంప్ర దాయక వస్తువులను ఉపయగిస్తుంటారు. వారు వాడు కునే పదాల్నే తీసుకుని కవి వారి జీవితాన్ని అద్భుతంగా వర్ణించారు.

"మెడల మీద పొన్ను కర్ర
బీపి మీద గోనె సంచి
యిప్పసెట్టు తిప్పలోకి
యిప్పపువ్వు లేరికొనికి
పయనమయ్యావా! కొండన్నా!
చేతిలోన నెత్తిన
జెబ్బమీద కాపడి
బొబ్బర్ల పోడులోకి ....."

పై కవితలో వర్ణన చూస్తే గిరిజనుల వాడుక భాషా పదాలే కనిపిస్తున్నాయి. అంతేకాకుండా కళింగాంధ్ర మాండలికం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. పొన్నుకర్ర, బీపి, జెబ్బ మొదలైన పదాలు వాడుటలో రచయిత రచనా వైవిధ్యానికి మచ్చు తునకగా చెప్పుకోవచ్చు.

ఈ కావ్యంలో ప్రకృతి వర్ణనలకు కూడా పెద్దపీట వేసినట్లు తెలుస్తుంది. గిరిజనులు నిత్యం ప్రకృతితోనే మమేకం అయి ఉంటారు. సాధారణంగా ఉత్తరాంధ్ర ఏజెన్సీ ప్రాంతం కొండలు, అడవులు, లోయలు, వాగులు మొదలగు వాటితో నిండి ఉంటుంది. ఇవన్నీ ప్రకృతికి నిదర్శనాలు. ఈ ప్రకృతి సౌందర్యాన్నంతా రచయిత గుమ్మ కావ్యంలో సందర్భోచితంగా వర్ణించాడు.

"అల్లంత దూరాన
ఆ కొండవాలు
చిలక పచ్చని కోక
ఆరేసినట్టుంది
ఆరేసిన కోక అల్లాడినట్టుంది
అల్లాడిన వాలు ఉయ్యాలలా ఉంది
.....
కొండ తిరిగిన గాలి ఈలేసినట్టుంది
ఈలందుకొని పొద్దు ఎగిరొచ్చినట్టుంది"

సహజసిద్ధంగా ఏర్పడిన ప్రకృతిని గుమ్మ దీర్ఘకావ్యంలో అత్యంత రమణీయంగా వర్ణించాడు. కొండవాలు ప్రాంతంలో చిలకపచ్చని కోక ఆరేసి నట్టుందనడంలో ఎంత పచ్చదనం కలిగి ఉందోనని చెప్పాడు. ఈ కొండ కోనల మధ్య నుండి సూర్యుడు ఉదయించగానే కలిగే అనుభూతి అంతా ఇంతా కాదని రచయిత వర్ణన.

ప్రకృతి సౌందర్యాన్ని చూపించడంలో ఛాయరాజ్ శబ్ద సౌందర్యం తోపాటు భావనాత్మకమైన లోతుల్ని అల వోకగా అక్షరాల్లో పెట్టగలిగారు. అక్కడి అడవిని స్వర్గ సౌందర్యానికి సమాంతరంగా చేసి చెప్పాడు. ఒక పక్క నుంచి గాలి వీయడం ప్రారంభం అయింది. దాని తాకిడికి ప్రకృతి సోయగం ఎలా ఉందో వర్ణిస్తూ -

"లేచింది అపుడే
ఆకు అడుగున చేరి
పడుకున్న చిరుగాలి
వల్లు విరిచింది
తుమ్మ మానున అంటి
తొంగున పెనుగాలి
రెప్పెలల్లాడించింది
మొగలి పొత్తుల్లోన
కునికిన చిరుగాలి ....."

ఈ వర్ణన చూస్తే కొండలపై నుండి వీస్తున్న గాలి సహజ సిద్ధతనాన్ని అతి రమ్యంగా వర్ణించినట్లుంది. ఇక్కడ మరో గొప్పతనం దాగి ఉంది. అక్కడక్కడ విప్లవకారుల రూపాలూ, చేష్టలూ ధ్వనిస్తూ ఉంటాయి. కావ్యంలోని అంతః సూత్రానికి ఇవన్నీ కలిసిపోతూ ఉంటాయి. కొండ వర్ణనలో కొండ తిరగబడే గిరిజనుణ్ణి స్ఫురింపజేస్తూ ఉంటుంది. కొండ మీద మబ్బు వాలినపుడు

"తలపాగతో కొండ తల ఊపినట్లుంది
తల ఊపుతూ కొండ తాటించినట్లుంది
..... కొండ తిరిగిన గాలి ఈలేసి నట్లుంది"

సూర్యోదయంలాగ, అలాగే విప్లవోద్యమంలాగ కూడా వర్ణించడం అనేది రచయిత దూరదృష్టిని తెలుపుతుంది. మరో కవితలో -

"కంటి రెప్పతో అడవిని
కప్పింది సిరిబిడి
గొంతులోన కొండల్ని
దాచింది సిరిబిడి
.....
తుప్పల్ని కొప్పులోకి
తురుము కొంది సిరిబిడి....."

పై కవితా పాదాల్ని పరిశీలిస్తే కంటిరెప్పతో అడవిని కప్పడమంటే అడవి నంతా పరిశీలిస్తుందని, అడవినంతా వడబోసి వెతుకుతుందనే అర్థంలో రచయిత చెప్పడంలో అంతరార్థం పోలీసులు చేస్తున్న మారణకాండను గుమ్మ వీక్షించి మదన పడుతున్న సందర్భం ఇది. అలాగే -

"ఎరుపెక్కి ఆకుపచ్చ అడివీ! ఓ అడవీ
కన్నీటిని చమురు చేసి
కారుచిచ్చు అంటించవె
అమ్మో! ఓలమ్మో గూడ....."

అని వర్ణించడంలో విప్లవ సూచన కనిపిస్తుంది. పచ్చగా ఉన్న అడవి ఎరుపెక్కడ మంటే కోప ప్రకోపాలకు నిదర్శనంతోపాటు ఉద్యమ దృక్పథం వెల్లడయ్యేలా కవిత వర్ణించబడింది.

ఈ కావ్యంలో వర్ణనలను పక్కనపెట్టి ఇతివృత్తాన్ని పరిశీలించి చూస్తే కావ్య ప్రారంభం నుండి సమాప్తం అయ్యేవరకూ గిరిజన విప్లవమే దర్శనమిస్తుంది. గుమ్మ పాత్రను దీనికి మారురూపంగా చిత్రించడం మరో విశేషం. శ్రీకాకుళం గిరిజన ప్రాంతాల్లో ఇరవయ్యో శతాబ్దపు రెండవ భాగంలోని విప్లవకార వాస్తవాలు నేటికి చాలాచోట్ల కనబడుతున్నాయి. గుమ్మలోని వస్తువు 21వ శతాబ్దంలో అభివృద్ధి చెందవలసిన గిరిజన సామాజిక చైతన్యం తొలి రూపం తాలూకు మూలాలను చూపిస్తోంది. గిరిజనులపైన దోపిడీ పీడన అణచివేతలు తరతరాలుగా సాగుతున్నాయి. నేడు కూడా ఉన్నాయి. ప్రతి చర్యగా గిరిజన పోరాటాలు పెల్లుబికాయి. అవే విప్లవకరంగా అభివృద్ధి చెందాయి. ఇదే విషయాన్ని రచయిత 'గుమ్మ' కావ్యం ద్వారా కళ్ళకు కట్టినట్లు చూపించాడు.

శ్రీకాకుళం గిరిజన సమాజంలో ముఖ్యంగా, నక్సల్ బరీ ప్రాంతాలలో 1960 దశకం తరవాత అభివృద్ధి చెందిన చైతన్యం ఒక దశాబ్దం తరవాత సాయుధ మైంది. ఈ సాయుధ విప్లవ చైతన్యానికి నేపథ్యంగా ఉన్న విప్లవకర వాస్తవంగా 'గుమ్మ' కావ్యాన్ని గుర్తించవచ్చు. గత ఉద్యమాలను, విప్లవ కార్యాచరణను అధ్యయనం చేసి గుణపాఠాలు రాబట్టుకోలేనంత కాలమూ నష్టాలు వస్తూనే ఉంటాయి. ఉద్యమాలను సమీక్షించుకోవలసిన అవసరాన్ని గుర్తు చేయడానికే, విప్లవ విషాదంలోంచి

విల్లమ్ములు అందుకొని చారిత్రక విప్లవ వాస్తవానికి ప్రతిబింబంగా 'గుమ్మ' నిలిచిందనేది మనం గ్రహించాలి.

ఇంకో విషయాన్ని కూడా కావ్యం ద్వారా తెలుసుకోవచ్చు. అది నేటి సమాజంలో అభివృద్ధి చెందుతున్న విప్లవకర వాస్తవం యొక్క బలమైన అంశాలలో ఒక అంశాన్ని లోతుగా కళాత్మకంగా రూపుదిద్దుకున్న కొండ కావ్యం 'గుమ్మ' దీన్ని సృష్టించిన రచయిత ఈ సందేశాన్ని కళ్ళముందు సాక్షాత్కరింప చేయడం మరో విశేషంగా చెప్పుకోవచ్చు. నాలుగ్గోడల మధ్య పరిమితమైన కవి కాదు ఛాయరాజ్ జీవితం. ప్రజా ఉద్యమాలతో అడుగు కలిపి, చెట్టాపట్టాలేసుకుని ప్రస్థావించిన క్రియాశీల విప్లవకవి ఛాయరాజ్. 'తెలుగుతల్లి హృదయకోశంలో ఆ భాషలో అంతరిక్షాలుంటాయి. అఖాతాలుంటాయి. పాలపుంతని, బడబాగ్నిని రెండు కొనల్లో ముడిపెట్టి పదాన్ని అగ్ని గోళంగా ఎగరేయడం తెలిసిన సాముగరిడీ ఛాయరాజ్ కలానికుంది. మరెవరికీ అనుకరణ కాని విలక్షణమైన పదచిత్రాలతో, గొప్ప భావోద్వేగాలతో, ప్రజల పట్ల నిబద్ధతతో, పోరాట యోధులపట్ల గాఢమైన అనురక్తితో, నూతన సమాజ ఆవశ్యకత, అనివార్యతల పట్ల పరిపూర్ణ విశ్వాసంతో సాగిన కవి ఛాయరాజ్ మనకూ, భవిష్యత్ తరాలకూ సాహిత్యోద్యమ స్ఫూర్తిగా నిలుస్తారు" అన్న ఛాయరాజ్ సన్నిహితులు, 'ప్రజా సాహితీ' మాసపత్రిక సంపాదకులు శ్రీ పి.యస్. నాగరాజుగారి మాటలు అక్షర సత్యాలు.

ఉపయుక్త గ్రంథ సూచిక :

1. ఆధునిక తెలుగు కవిత్వంలో విప్లవ ధోరణులు:ఒక విశ్లేషణ-డా॥ మంచాల గంగాధర్.
2. ఉద్యమం నెలబాలుడు - వరవరరావు పీఠిక.
3. గుమ్మ (కొండ కావ్యం) - ఛాయరాజ్, జనసాహితి ప్రచురణ,1995.
4. తాకట్టులో భారతదేశం - కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి.
5. శ్రీకాకుళ ఉద్యమ సాహిత్యం - డాక్టర్ కె. ముత్యం.
6. శ్రీకాకుళమ జిల్లా చరిత్ర - ఆదిభట్ల వెంకటరమణ.

తెలంగాణ కథా సాహిత్యం – గిరిజనుల ఆచార వ్యవహారాలు

– డా॥. నూనవత్ రంభాబు, సీనియర్ ఫెలో, తెలుగుశాఖ, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ స్టడీస్ఉయ క్లాసికల్, సి.ఐ.ఐ.ఎల్., మైసూర్, కర్నాటక.

ఒక సంఘంలోని ప్రజలు తరతరాలుగా పాటించే పద్ధతుల్ని ఆచారాలని స్థూలంగా నిర్వచించవచ్చు. ఆచారాలు ఎప్పుడు ఒకే విధంగా ఉండవు. కాలాన్ని బట్టి మార్పు చెందుతుంటాయి. గిరిజన సంఘంలోని వ్యక్తులు ఆచారాలు ఎంతకష్టమైన అనుసరిస్తారు. గిరిజన పెద్దలు ఆచారాలు కొనసాగేలా చూస్తుంటారు. పుట్టింది మొదలు చనిపోయే వరకు మానవుడు ఆచరించే ఆచారాలున్నాయి. ఆచారాలు పాటిస్తే సౌఖ్యం, ఆయుస్సు లభిస్తాయని నమ్ముతారు. గిరిజనుల వివాహ పద్ధతులు సాధారణమే అయినప్పటికి కొన్ని విషయాల్లో ప్రత్యేకత ఉంది. వివాహ స్వేచ్ఛ ఉంటుంది. ఇల్లరికం, పెళ్లికి సంబంధించిన ఆచారాలు, మారుమనువు మరికొన్ని ఆచారాలు గిరిజన కథల్లో విశ్లేషింపబడినాయి.

గిరిజనులు నివసించే ప్రాంతాలు ఎక్కువగా తెలంగాణలోనే ఉన్నాయి. తెలంగాణ గిరిజన కథాసాహిత్యం పరిశీలించినట్లైతే ఎక్కువగా లిఖిత సాహిత్యరూపంలో వున్న కథా సాహిత్యాన్ని అనేకమంది గిరిజనులు, గిరిజనేతరులు, గిరిజన శ్రేయోభిలాషులు, అభ్యుదయ భావాలు గలవారు, ఉద్యమ నేపథ్యం వున్నవారు తెలంగాణ కథా సాహిత్యానికి దగ్గరగావుండి గిరిజన కథలను వెలువరించారు. అటువంటి తెలంగాణ గిరిజన కథాసాహిత్యంలో తెలంగాణ నేపథ్యం, తెలంగాణ గిరిజన జీవనం మొదలైన అంశాలను తెలియజేసే కథలు అనేకం వచ్చాయి. ఆ కథల్లో ఉన్న గిరిజనుల ఆచార వ్యవహారాలను, సంప్రదాయాలను కొంతమేరకు వివరించదలచాను.

ఇల్లరికం :

అత్తగారింట్లో అల్లుడుంటే ఇల్లరికం అంటారు. ఇల్లరికాన్ని ఇల్లటం అని వ్యవహరిస్తారు. ఇల్లరికపు అల్లుని ఇంటాబయట చులకనగా చూస్తారు. అత్తగారికి ఓలి ఇవ్వలేక అల్లుడు అత్తగారింట్లో చొరబడతాడు. ఇల్లరికపు వివాహాలు కథల్లో ప్రతిబింబిస్తున్నాయి. "తన తండ్రి తనకు పెళ్ళి జెయ్యనందుకు ఇల్లువిడిచి ఇల్లటం వచ్చాడు." (పెళ్ళికావాలి, సాహు, అడవిలో వెన్నెల, పు.21)

పెళ్లి తంతు :

వివాహం కోసం డబ్బు అప్పు తెచ్చుకున్నప్పటి నుండి బంధువుల భోజనాలకి ఏర్పాట్లు చేయాలి. వివాహానికి వచ్చిన అతిథులకు భోజనాలు ఏర్పాటు చేయాలి. పెళ్లి భోజనంలో మాంసం కూర తప్పనిసరి. పెళ్లి సమయంలో ఒక్కొక్కరు రెండు మూడు విస్తర్లు తింటారు. పెళ్లికోసం అప్పు చేసి పెళ్లి కొచ్చిన వారికి మర్యాదలు చేయాలి. పెళ్లికి మోగాల్సిన బజంత్రీలకి డబ్బులివ్వాలి. పెళ్లి డప్పులు మోగుతుంటే ముత్తెదువలు పాటలు పాడి అందరిని అలరిస్తారు. ఆరు పూటల నుండి ఐదు రోజుల వరకు పెళ్ళి భోజనాలు పెట్టాల్సి ఉంటుంది.

"పొద్దున్నే సంతకు రెండుగొడ్లు కొట్టుకొని వెళ్ళాడు అక్కడుండి అవి అడ్డికి పావుశేరే కదా. ఐదు వందల రూపాయలు వచ్చాయి. భూమి రైను పెట్టి దత్తు షావుకారి కాడ మూడుగోనెల జొన్నలు తెచ్చాడు. పెళ్ళి ఖర్చంతా కూడా పిల్లవాడే భరించాలి కాబట్టి ఆ అవస్థ....పెళ్ళి..... డప్పులు మోగుతున్నాయి....స్త్రీలు ఎదురెదురు పడి పదాలు పాడుతున్నారు.... పెళ్ళి కూతురికి ఎనిమిది బట్ట రవికెలు పెట్టారు..... కన్యాశుల్కం ఎభై రూపాయలు ఇచ్చాడు. వచ్చిన అతిథులకు ఆరు పూటల భోజనాలు, మూడు గోనల జొన్నలు.... మూడు మేకలు... స్త్రీలు నాలుగేసి విస్తర్లు అదనంగా పెట్టుకున్నారు. వడ్డించాలి తప్పదు. ఒక్కటే విస్తార్లది తిని మిగిలింది పడేస్తున్నారు..... ఇదంతా చూస్తున్న బొజ్జకు కోపం వస్తుంది. కాని లాభం లేదు. జుగ్నాక బొజ్జు కొడుకు రాము పెళ్ళి అయ్యింది." (పెళ్ళికావాలి, సాహు, అడవిలో వెన్నెల, పు.22)

మారుమనువు :

గిరిజనుల ఆచారం ప్రకారం చిన్నపిల్లపుడే తల్లి దండ్రులు ఓలి తీసుకొంటారు. ఆ అమ్మాయికి ఆ విషయం తెలియదు. యుక్త వయస్సు రాగానే తనకిష్టమైన వ్యక్తిని పెళ్లాడుతుంది. ఓలి తీసుకున్న కారణంగా ఆమె రెండో పెళ్లి చేసుకొన్నట్లు ముద్ర పడుతుంది. ఓలికింద తీసుకున్న డబ్బు, రచ్చబండ తీర్పు ననుసరించి జరిమానా తీసుకున్న వ్యక్తి తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. "జంగు బాయి తనకు నచ్చిన వేరొక యువకుని ఇంట్లో సొచ్చిం దట వాళ్లిద్దరిని పట్టుకున్నరట - ఆ యువకునికి జంగు బాయి అంటే ఇష్టమేనట. మారు మనువు చేసుకున్నదట." (జంగుబాయి, గోపీ భాగ్యలక్ష్మి, శ్వేతరాత్రులు, పు.6)

రజస్వల :

రజస్వల లేదా సమర్థ అయిన ఆడపిల్లను మూల కూర్చోబెడ్తాడు. ఐదోరోజు లేదా తొమ్మిదోరోజు వేడుకలు జరుపుతారు. గిరిజనులు ఓచిన్న గుడిసెను వేసి అందులో కూర్చోబెడతారు. అమ్మాయికి నువ్వులు, మూకలు, కొబ్బరి, బెల్లం తినడానికి పెడతారు. గుడిసె ముందు ఐదురోజులు కుంపటిని ఉంచుతారు. పెద్దమనిషి అయిన అమ్మాయికి చేసే తంతు ఎర కథలో కనిపిస్తుంది. "ఆ తరువాత ఇంటికెళ్లి నప్పుడు పెద్దమనిషి అయిన విషయం తల్లికి చెప్పింది. తల్లి తండా అందరి చెవుల్లోను వేసింది. అప్పుడే సరిగ్గా ఇంట్లోకి రాక పక్కకు నిలుచుంది. అది గ్రహించిన తల్లి ఇడుపున కమ్మలతో ఓ చిన్న గుడిసెను వేసి అందులో కూర్చోబెట్టి పసుపు, కుంకుమ, నువ్వులు, నూకలు, కొబ్బరి బెల్లంలు ఇచ్చింది. గుడిసె ముందు కుంపటిని ఆ ఐదురోజులు వుంచింది. తండాలోని తన అన్నల తమ్ముల భార్యలు ఆ మాట ఈమాట అని మోటు సరసాలు ఆడోవారు." (ఎర, బోయజంగయ్య, బోజ కథలు, పు.94)

బహిష్టు :

బహిశ్ట సమయంలో స్త్రీని ఇంటి బయట కూర్చోపెట్టి ప్రత్యేకంగా చూడడం ఆచారం. వారికి తిండీ తిప్పలు నిద్ర బయటే. ఆ సమయంలో వారువాడే వస్తువులు బయటే, వాన వచ్చినా, గాలి వచ్చినా బయటే. జంతువులు దాడి చేస్తాయని భయం ఉన్నా, జ్వరం వచ్చినా బయటే ఒక్కోసారి ప్రాణాలు కోల్పోతుంటారు కూడా. ఆచారం అనుసరించకపోతే దేవత ఆగ్రహిస్తుందని నమ్ముతారు.

'జంగుబాయి' కథలో జంగుబాయి బహిష్టు అవు తుంది. తల్లి ఇంటి బయటపెట్టి అన్నం పెడుతుంది. వర్షం వస్తుంది. బయట చలి అయినా గోదకింద కూర్చుంది. "జంగుబాయి గిన్నె తీసుకొని తింటోంది. వర్షపు నీళ్లు తెచ్చి కింద దూరంగా పెట్టింది. నీళ్లుతాగి చెంబు గిన్నె వారగా బోర్లించింది. (జంగుబాయి, గోపీ భాగ్యలక్ష్మి, శ్వేతరాత్రులు, పు.7) జంగుబాయి తల్లి ఆచారంపట్ల విరక్తిని వ్యక్తం చేస్తుంది. ఈ ఆచారం వల్ల జంగుబాయి మేనత్త జ్వరం వచ్చి చనిపోయింది."ఏం చేసుడమ్మా- పెద్దలు పెట్టిన కట్టడి. మామేనత్త ఒకామె జ్వరంతో నున్నప్పుడే ముట్టయ్యింది. ఇంట్లకు రానియ్యలే అప్పుడు సలికాలం. జెరం ఎక్కువై బయటనే నీల్గి నీల్గి పాణమిడి సింది" (జంగుబాయి, గోపీ భాగ్యలక్ష్మి, శ్వేతరాత్రులు, పు.7)

బహిష్టు సమయంలో యిస్రూ భార్యకు జ్వరం వచ్చి చనిపోయింది. 'ఆడవాళ్ళు మోకాలి పైనించి చుట్టుకున్న చీరని ఛాతీమించి కొంగులా వేలాడేసుకోవడంతో శరీరం మీద మరే అచ్ఛాదనా లేక చలికి పగిలి పుండును రంపంతో కోస్తున్న బాధ. పదిహేను రోజుల్నుంచి జ్వరంతో ఒళ్ళు నెగడులా మండుతున్న సమయంలోనే దానికి బహిష్టు రావాలా! ఇక తప్పలేదు ఎప్పటిలాగే బహిష్టు అయ్యాక వేరే పాకలో వుంది. గిరిజన స్త్రీలు నెలసరికి ప్రత్యేకమేన పాకలో చేరతారు. ఉన్నవే మూడు ముతక గుడ్డలు. కుండెడు తేనె పుచ్చుకుని షావుకార్లు యిచ్చిన రెండు చద్దర్లు ముడ్డి పంచెలా పల్చగా ఉన్నాయి. అలాం టివి ఎన్ని కప్పినా ఆ చలిజ్వరం ఆగదు . మరి రెండు పల్చటి చద్దుర్లుకు ఆగుతుందా! ఇంట్లోకి రావాల్సిన నాల్గోరోజు వుదయాన అది కట్టెలో కట్టె అయిపోయింది" (అడవిలోవెన్నెల, బి.ఎస్.రాములు, పు.63)

గ్రామ దేవతలు :

గ్రామదేవతలు తన భక్తులను వ్యాధుల బారినుండి కాపాడతాయని గిరిజనుల నమ్మకం. ఒక్కో దేవతకు ఒక్కో ప్రాధాన్యం ఉంటుంది.

ఈదమ్మ :

ఈదమ్మ దేవతను నమ్ముకొంటే తన భక్తులకి విజయం వస్తుందని నమ్ముతారు. ఈదమ్మ వీరవనిత దృష్టిని సంహరించి దేవతగా పూజలందుకుంటున్నది. "రైతులు మూడేళ్ల కొకమారు లేదా అయిదేండ్ల కొకమారు అత్యంత భయభక్తులతో కొలిచే కొలుపే ఈదమ్మకొలుపు అని ప్రతీతి ఉంది. ఈదమ్మతో యుద్ధం చేసిన రాజు మాంధాత. అతను ఆడదానికి పుట్టనని మగవాని కడుపు చించుకు పుడతాడు. ఈదమ్మతో భీకర యుద్ధంచేసి ఓడిపోతాడు. ఆడదాన్ని శరణు కోరనంటాడు. అష్టకష్టాలు పడతాడు. చివరకు దేవతల సహకారంతో మాంధాత ఈదమ్మను తిరిగి ఓడించడము, చివరకు తిరిగి రాజ్యం పొందడం ఆమె క్షుద్ర దేవతగా పూజలందుకొంటుంది." (పనిపిల్ల, తుమ్మేటి రఘోత్తమరెడ్డి, వందేళ్ల తెలుగు కథ, పు.291) పనిపిల్ల కథలో ఈదమ్మ జాతరను తెలియ జేశారు.

అలాగే ముత్యాలమ్మ, పోలేరమ్మ, తలుపులమ్మ, పెదమ్మతల్లి మొదలైన దేవతలు గిరిజన దేవతలుగా గిరిజన కథల్లో ప్రస్తావించబడినాయి.

పండుగలు :

గిరిజనులు సంవత్సరం పొడుగునా ప్రతిపని ప్రారం భానికి ముందు చేసేది పండుగే. తొలకరి నుండి హోళీ దాకా అన్ని పండుగలు ఎంత దూరమైనా దేవతలున్న చోటుకు తట్టాబుట్టా నెత్తిన పెట్టుకొని కాలినడకన పోయోవాళ్లు. మంచి చెడు చెప్పుకుంటూ వంటలొండు కుంటారు. ఆ పండుగల్లో సభలు జరుపుకుంటారు. తగా దాలు తీర్చుకుంటారు. దండగ పడ్డవాళ్లు అందరికీ ఇప్ప సారా పోసి సంబరం చేసుకొంటారు. ఆ సంబరంలో చివరగా డప్పులు, డ్యాన్సులు, ఆడవాళ్ళంతా లయ బద్ధంగా కాళ్లు కదుపుతూ వొకళ్ళ నడుంమీద ఇంకొ కళ్ళు చెయ్యివేసి విన్యాసాలు చేస్తారు. మగవాళ్లు కొమ్ముబూర ఊదుతూ డప్పు వాయిస్తారు.

దసరా పండుగ :

దసరా పండుగ నాడు గొండులు అహిరిమహారాజ్ (పూజారి)ని కలిసి కానుకలు ఇస్తారు. పండుగలో పాలు పంపులు లేనివారు జరిమానా చెల్లించాలి. ఈ పండుగలో లైంగిక స్వేచ్ఛే ఉంటుంది. ఆమె అడిగిన పూసలు, పిన్ను లకు కోరుకున్న వ్యక్తి ఖర్చు చేయాలి. "దసరా ఇంకొద్ది రోజులే వుంది. అహిరి మహారాజ్ కొలువులో దసరా ఉత్సవాలు అట్టహాసంగా జరుగుతాయి. అహిరి, సిరొంచ ఏటపల్లి తాలూకాలలోని గోండులంతా ఆ ఉత్సవాల్లో పాల్గొనడానికని చేరతారు. అయితే ఎవరి భత్యం వాళ్లే తెచ్చుకోవాలి. పై పెచ్చు వచ్చిన వాళ్లే అహిరి మహారాజ్ కు మేకలు, డబ్బులు, కానుకలుగా సమర్పించు కుంటారు. రెండు రోజుల ఆ ఉత్సవాలలో పాల్గొనడానికి మరి రెండు రోజుల ముందే బయలుదేరవలసి ఉం టుంది. మహారాజ్ కు సమర్పించుకోడానికి ఒక మేకను అట్టే పెట్టాడు. లైంగిక స్వేచ్ఛా కూడా ఉంటుంది. ఆ పండుగ రెండురోజులూ తన సరసకువచ్చే వారికోసం పూసలు, ఇతరత్రా కొనిపెట్టడానికి కోసం డబ్బుకూడ బెడుతున్నాడు కూడా. కటి భార్య ఇటీవల పోయింది. ఆ పండుగ రోజులలో ఆ పాటి లైంగిక స్వేచ్ఛను ఆ గూడేల్లోని చాలామంది అనుభవిస్తుంటారు. మహారాజ్ కు యిస్రూ ఏంకానుకలు తీసుకుపోవాలనుకుంటున్నాడో తెలుసుకోగోరాడు కటి." (అడవిలోవెన్నెల, బి.ఎన్. రాములు, అడవిలో వెన్నెల, పు.66)

పంటల పండుగ లేదా పచ్చపండుగ :

పక్షుల నుండి, జంతువుల నుండి పంటను కాపాడు కొని పంట ఇంటికి వచ్చినందుకు దేవతలకు దేవుళ్లకు నైవేద్యాలు పెడతారు. అందరు తిని తాగి డప్పు మోత లతో నృత్యం చేస్తూ ఆనందిస్తారు. "పచ్చపండుగ చేసు కొని ఎదురు బియ్యం బదులు సన్నబియ్యం వండకున్నం.

అది మొదలు మాకా పోడు గొట్టుడుబాధ దప్పింది. కడుపుల నీల్లు గదలకుండ బతక బట్టినం." (పోరువనం, శిరంశెట్టి కాంతారావు, జీవన్మరణం, పు.105) "పంట ఇంటికొచ్చిన తరువాత ఇప్పసారా తాగి సంతోషంగా గడుపుతారు." (అడవిలో వెన్నెల, బి.ఎన్.రాములు, అడవిలో వెన్నెల, పు.66)

భూమి పండుగ :

గూడెంకి దగ్గరలో ఉన్న భూమిని సాపుచేసి పంచు కొంటారు. భూమిని పంచుకొని విత్తనాలు వేస్తున్న సందర్భంగా అందరూ తిని, తాగి ఆనందిస్తారు. కోయలు ఈ పండుగను బాగా ఆచరిస్తారు. "కోయ తెగకు ప్రధాన మైన పండుగ. తొలకరి వానలు మొదలుకాగానే భూమిని పూజిస్తూ కోయలందరూ సంబరం చేసుకొంటారు. వ్యవ సాయం చేసే కాలం మొదలైందనే దానికి సూచనగా ఈ పండుగ చేస్తారు. ఆరోజు పురుషులందరూ వేటకు వెళ్లి, అడవి జంతువులను వేటాడి తెస్తారు. తెగ మొత్తం కలిసి కట్టుగా భోజనం చేస్తారు." (భద్రాచలం మన్యం కథలు, ఎ.విద్యాసాగర్, పు.179). "ఆ టెంక మా రొండూరోల్లను గూసుండబెట్టి తలా ఇంత భూం జేసుకొని బతకమని అద్దులుపెట్టి పంచిండు. అప్పుడు మేమంతా భూం పండుగ చేసుకొని అరకలు గట్టినం." (పోరువనం, శిరంశెట్టి కాంతారావు, జీవన్మరణం, పు.105). గిరిజనులు ఆరాధించే కోతలపండుగ, మామిడి పండుగ, తీజ్‌పండుగ మొదలైన

ప్రకృతి పండుగలు గిరిజన కథల్లో ప్రస్తావించ బడినాయి.

జాతర :

ఒక నిర్ణీత దినంనాడు దేవునికి చేసే ఉత్సవాలకు జాతరలని పేరు. పిల్లాపెద్ద, స్త్రీ పురుషులు జాతరలో పాల్గొంటారు. ఈ జాతర సమయంలో సంతలో అమ్ము తున్న పూసలు, పిన్నులు, పువ్వులు కొంటారు. రాత్రంతా దేవతల కథలు చెప్పుకుంటారు.

అకయ జాతర :

కోయలందరు అకయదేవరకి మొక్కి బలులు అర్పించి సంతోషంగా జాతరలో పాల్గొంటారు. జాతర సమయంలో సంతకు వచ్చిన వివిధ రకాల ప్లాస్టిక్ పూలు, రిబ్బన్లు, పూసల దండలు కొంటారు. స్త్రీలు పురుషులు తలకు నెమలీకలు ధరించి నృత్యం చేస్తారు. అకయదేవరకు సాయంత్రం వరకు పూజలు చేస్తారు. ఈ సమయంలో పెద్దల శరీరంలోకి దేవత వచ్చి కోయల భవిష్యత్తును చెప్తారు. కోయలు ఇక్కడ ఉండడం క్షేమంకాదని ఇంకా అడవిలోకి వెళ్ళండని దేవర చెప్పినట్లు పలుకుతాడు. దేవర ఆజ్ఞ ప్రకారం ఆ ప్రాంతం వదిలి వెళ్లిపోతుంటారు. అకయ జాతర విధానం ఆక్రమణం కథలో కనిపిస్తుంది.

"ఆ రోజు జాతరలో రంగయ్య తెచ్చిన సామాన్లు తొందరగానే అమ్ముడుపోయాయి. రంగయ్య తెచ్చిన ఖాళీ బస్తాలు సజ్జలు, జొన్నలతో నిండిపోయాయి. ఆడవాళ్ళు, మగవాళ్ళు పిల్లలు కొన్న పూసలు పేర్లను దండలను అలంకరించుకున్నారు. ఆడవాళ్లు రంగు రంగుల రిబ్బన్లను కొప్పుల్లో చుట్టుకొన్నారు. ఇంతకు ముందు అడవిలో దొరికే తాజా పూలను మాలలుగా గుచ్చి అలంకరించుకొనేవారు. ఇప్పుడు ప్లాస్టిక్ పూలను పెట్టుకున్నారు. ముఖాలకు ఒంటికి తాము వేటాడిన జంతువులను కొవ్వును పూసుకోవడంతో వాళ్ళు చామన చాయగా నల్లగా ఉన్న శరీరాలు నిగనిగ మెరుస్తున్నాయి. ఆడవాళ్ళు పొడగాటి గుడ్డను మొలచుట్టూ చుట్టుకొని ఆ గుడ్డలోని కొంత భాగాన్ని పైకి లాగి రొమ్ములను కప్పుకొన్నారు. మగవాళ్ళు చిన్న గుడ్డను నడుముకు గొచి లాగా కట్టుకున్నారు. వేరే ఏ బట్టలు వాళ్ల ఒంటిమీద లేవు. ఆడవాళ్లు, మగవాళ్లు నెమలి ఈకలను తలకు అలం కారంగా ధరించారు. ఆ రోజు సాయంత్రం వరకు అకయకు పూజలు జరిగాయి. తమకు పండిన ధాన్యాన్ని ఆ దోవర ముందు పెట్టారు. వచ్చే యోడు మీరిక్కడ వుండొదదురా ఇంక అడివిలకు దూరంగా పొండ్రి అక్కడ మీకు మన్తుగ పంటలు పండుతయి. ఏ భయ

ముండదు.'' అంటూ అకయ జాతర ఉంటుంది. (ఆక్ర మణం, ముదిగంటి సుజాతరెడ్డి, మింగుతున్న పట్నం, పు.91)

బాయమ్మతల్లి జాతర :

మర్రి చెట్టుకింద కట్టిన అరుగు మీద పాతిన కర్ర బాయమ్మతల్లి. ఈ జాతర పున్నమి నాడు వస్తుంది. గిరి జనులందరు ఈ దేవతకు మొక్కి విందులు, వినోదాలు చేసుకుంటారు. బాయమ్మతల్లి కథను చెప్పేవాళ్ళు రాత్రంతా జాతరలో పాల్గొని, తెల్లారి ఇంటికి చేరు కుంటారు. ''మోకాలు మంటి మురికి నీళ్ళు గుండా వాగు దాటుతుంటే చిర్రెత్తించే ఏదో మురుగు వాసన ఊపిరి సలుపనివ్వడం లేదు. ఒడ్డున చేరాం. ఈ వాగు ఒడ్డున ఒక పెద్ద ఊడలు దిగిన మర్రి చెట్టు ఉంది. మర్రి చెట్టు అడుగున మట్టితో కట్టిన గద్దె. దానిమీద ఒక కర్ర పాతి ఉంది. ఇదే బాయమ్మ దేవత. పంటలు కోతలు మొదటి పసలు చేతికొచ్చినంక ఇక్కడ జాతర జర్గేది. నా చిన్నప్పుడైతే ఆ జాతర ఎంత సంబరముండేదో పున్నమి నాడు వస్తది. ఆ జాతర పిండిలాంటి వెన్నెల్లో అన్ని గూడేల వాళ్లు అక్కడ చేరుకొనేటోల్లు. నా చిన్నప్పటి రోజులు నాకింకా గుర్తున్నాయి. అప్పుడు పండుగంటే ఎంత సంబరం ఉండేదో. తుడుం మోతలు దుప్పి కొమ్ముల బాకాలు, రాత్రంతా బాయమ్మ తల్లి కథ చెప్పె టోళ్లు. తెల్లంగ తెల్లారే వరకు జాతర సాగేది. ఇప్పుడు ఆ జాతరలు లేవు. ఆ సంబరం లేదు. లచ్చిరెడ్డి మొఖంలో ఏదో విచారం.'' (హత్య, పి.చందు, భూనిర్వాసితులు, పు.24). మరెన్నో జాతరలు కథల్లో కనిపిస్తున్నాయి.

గిరిజనుల నృత్యరూపాలు :

గిరిజన నృత్యాలలో స్వేచ్ఛగా సాగే అవయవచాలనం ప్రధానం. ఏరకమైన అడ్డంకులూ లేకుండా ప్రవహించే భావ స్రవంతి ఇక్కడ అంగ చలనాన్ని నడుపుతుంది. ఆనందం నుండి విచారం వరకూ ఉండే అన్ని రకాల భావచ్ఛాయలూ ఇక్కడ స్పష్టంగా భాసిస్తాయి. చూసేవారికి నృత్యాలు కళాఖండాలుగా కనిపించినా, వాటిని ప్రవర్తించే వారికి అవి ఆచారంలో భాగం. తెలంగాణ రాష్ట్రంలో గిరిజనులకు ఎవరికి వారికి ప్రత్యేకమైన నృత్య పద్ధతు లున్నాయి. నృత్యాలను స్థూలంగా మూడు రకాలుగా విభజించవచ్చు. మత, సాంఘీక, వినోదాత్మకమైన నృత్యాలు. నృత్యం చేయడానికి కాలికొమ్ము (తూటు కొమ్ము) కొమ్ముడప్పు, కొమ్ముబూర, డప్పు, డోలు, డోలు కొయ్య, తూర్పులి, దస్కా, పారా వంటి సంగీత సాధనాలు వాడతారు. డప్పు దరువు అనుసరించి నృత్యం చేస్తారు.

గోండుల గుస్సాడి నృత్యం :

ఆదిలాబాద్ జిల్లాలోని రాజగోండులకు దీపావళి చాలా పెద్దపండగ. అప్పటికి పంట యింటికి వచ్చి వాతా వరణం చల్లగా ఆహ్లాదకరంగా ఉంటుంది. గోండులు రంగు రంగుల వస్త్రాలు ధరించి, ఆభరణాలు వేసుకుని, గుంపుల గుంపులుగా చుట్టుపక్కల పల్లెలకు పోయి సామూహికంగా భోజనాలు చేస్తారు. ఊరుని, ఊర్లోని పిల్లపెద్దా చల్ల గుండాలని ఆశీర్వదిస్తారు. ఈ గుంపుల్ని దండారి గుంపులంటారు. లేదా గుస్సాడిలంటారు. ఒక్కోగుంపుకు 20 నుంచి 40 వరకూ మనుష్యు లుంటారు. ఈ పెద్ద గుంపు నుంచి అంతర్భాగంగా ఇద్దరుగానీ, అయిదురుగానీ చేరి మరోగుంపు కడతారు. పౌర్ణమినాడు మొదలై తిరిగి బహుళ చతుర్దశి వరకూ ఈ నృత్యాలు కొనసాగుతాయి. ప్రతివాడూ నెమలి యూకలు పొదిగిన, పెద్ద తలపాగా ధరించి, జింక కొమ్ములీ, కృత్రిమమైన మీసాలనూ, గడ్డాలను తగిలించుకుంటారు. ఒంటికి మేక చర్మం చుట్టుకుంటారు. వీళ్ళకు సహాయంగా డప్పు, తుడుం, పిప్రి, కాలికొమ్ము వంటి వాద్యాలు మోగు తుంటాయి. గుమేలా ధ్వనిస్తుండగా దండారీ గుంపు క్రమ విన్యాసంతో లయబద్ధంగా అడుగులు కదుపుతూ నృత్యం చేస్తుంది. న ృత్యం పరాకాష్ట నందుకున్న తరుణంలో గుస్సాడి గుంపు హఠాత్తుగా మధ్యకు జొరబడుతుంది.

నాయకుడు మొదట గొంతెత్తి పాడతాడు. మొత్తం గుంపుదాన్ని అందుకుంటూ నృత్యాన్ని కొనసాగిస్తారు. దండారీ వలయం చెదిరిపోగా, చూసే వాళ్ళకు బెదురు

కలిగేంత భీకరంగా పెద్దపెద్ద అంగలు వేస్తూ, గంతులతో, పొలికేకలు పెడుతూ నృత్యాన్ని నిర్వహిస్తారు. వలయం చుట్టు మూగివున్న ప్రేక్షకుల దగ్గరకి కూడా వచ్చి వాళ్లను తమ చేతుల్లో ఉన్న కర్రలతో తాకి వాళ్ళకు గిలిగింతలు కలిగిస్తారు. చిన్న పిల్లల్ని భయభ్రాంతుల్ని చెయ్యడం పెద్దవాళ్లను తమ కొంటె చేష్టలతో నవ్వించడం ఇవ్వన్నీ నృత్యంలో భాగాలే. న ృత్యం అయిన తరువాత గ్రామ స్థులు వారి కాళ్ళు కడిగి గౌరవం చూపుతారు. దండారీ కథలో గుస్సాడీ న ృత్య ప్రస్తావన కనిపిస్తుంది. "ఈ లాంఛవాలు గుసాడీలు వెళ్లే ప్రతి వూళ్లో జరుగుతాయి. ఇవి పూర్తయిన తర్వాతే గుసాడీల నృత్యం". (దండారి, ఫణికుమారం, ఇప్పపూలు, పు.55)

తుడుం కొట్టడం :

నగారాని తుడుం అంటారు. ఇది ఒక చర్మ సాధనం. తుడుం మోగితే గిరిజనులకు ప్రమాదం జరగబోతుందని సూచన. దాంతో గిరిజనులందరు జాగరూకులవుతారు. గూడేలన్నీ సమైక్య బాట నడవడానికి ఉపయోగపడే సాధనం. తుడుం కొట్టడం కూడా ఒక కళ. తుడుంమోత ఇంటింటికెళ్లి మనిషి పిలిచినట్లు ఉంటుంది. పంచాయితీ ఏర్పాటు చేసుకొని సమస్యలను పరిష్కరించుకోడానికి గిరిజనులందరిని ఒక్కచోట చేరుస్తుంది. "తుడుం పట్టు కొని - కొండమీదికి పరుగెత్తాడు. మరో పదినిమిషాల్లో ఖాకి బట్టలోల్లు గూడెంలో ప్రవేశించడం నగారా మోగడం ఒక్కసారే జరిగాయి. తుడుం టట్టర మోగుతూనే ఉన్నది. ప్రమాదాన్ని సూచిస్తూ గూడెంలోకి అడుగు పెట్టిన ఖాకి బట్టల వాళ్ళ నాయకుడు బెదిరి బెదిరి చూశాడు తుడుం ఆగిపోయింది. మళ్లా దూరంగా ఎక్కడో తుడుం మోత అతని ఉబ్బు చెంపలమీది కంటా చెమట అసహ్యంగా కారు తుండగా బిక్విక్-గుడిసెల్లో వెతకండి అర్డరేశాడు." (తుడుం, అల్లం రాజయ్య, అడవిలో వెన్నెల, పు.85)

గూడెం పటేల్ (పెద్ద) ఎగోదిరావు ఇస్రూని తుడుం కొట్టమంటాడు. పంచాయితీ ఏర్పాటుకు తుడుం మోగిస్తారు. "ఇంకా తిండికాలేదురా- తుడుం గొట్టుకో-పంచాది మర్సినవా? అన్నాడు. ఇస్రూ నీళ్ళు గటగటతాగి తుడుం తీసుకొని బొగడమీది బంగళా దిక్కు పరుగెత్తాడు టట్టర...టట్టర...టరటర..టరటర... తుడుం మోగుతోంది. గాభర గాభరగా కాకుండా ఉండీ ఉండీ గుడిసె గుడిసెకు మనిషిబోయి పిలిచినట్లుగా తుడుం మోగు తుంది. గోండు గుడిసెల్లో కలకలం. ఒక్కొక్కరే ఎము కులు తేలిన వాళ్ళు- చిరిగిన బట్టల వాళ్ళు. కంపలాటి నెత్తులున్న స్త్రీలు- పిల్లలు నెత్తుకొని ఒక్కొక్కరే బొగడ మీద చేరుతండ్లు- తుడుం మోత వినవచ్చినంత మేరకు చుట్టు పక్కల గూడేల వాళ్ళు ఆ ఊరికేసినడువ సాగిండ్లు." (రగల్ రాజ్జెం మైసివాకట్, తొడుసంజంగు, అడవిలోవెన్నెల, పు.98)మరికొన్ని కథల్లో తుడుం కొట్టడం ఉంది.

వేట :

గిరిజనులు వేటపై ఆధారపడతారు. పక్షులు, జంతు వులను వేటాడేటప్పుడు పలు రకాలైన వేట సామాగ్రిని ఉపయోగిస్తారు. అవి గండ్రగొడ్డలి, గద, గుణపం, గేలం, గుప్పిడి (వడిసెల), బొడంకర్ర, (చేపలు పట్టే కర్ర), విల్లం బులు, బాణాలు మొదలైనవి, పులి, ఎలుగుబంటి వాటి నుండి రక్షించుకోడానికి చురకత్తుల్ని ఉపయోగిస్తారు. దొడిశెను కోతుల్ని పిట్టల్ని చప్పుడు చేసి తరమడానికి ఉపయోగిస్తారు. వేటలో మంచి నైపుణ్యం కలిగుంటారు. ఒక్క బాణంతో పులిని చంపే వీరులు గిరిజనుల్లో కని పిస్తారు. అరణ్యరోదన కథలో కొర్స ఈరయ్యకు వేటా డటంలో ఉన్న ప్రావీణ్యం తెల్పబడింది. "సారూ గీ వీని పేరు కొర్సు ఈరయ్య మంచి వేటగాడు, గురిచూసి బాణం యిడ్సి పెట్టిండంటే చిటారు కొమ్మన కూసున్న పిట్ట తలకాయల ఉన్న కన్ను ఊడి పడాల్సిందే." (అరణ్య రోదన, దిలావర్, ఇప్పూలు, పు.260). గిరిజనులకే ప్రత్యేక మైన వేటలు కనిపిస్తున్నాయి.

గిరిజన ఆచార వ్యవహారాలు విలక్షణమైనవి. గిరి జనులు ప్రకృతిని దైవంగా భావిస్తారు. ప్రకృతికి హాని

చేయకుండా, ప్రకృతిని పరిరక్షించుకుంటే ప్రకృతే దేవుడుగా వారిని కాపాడుతుందని విశ్వసిస్తారు. గిరిజన తెగలోని గోండులు హిడింబి సంతానం అని గొప్పగా చెప్పుకుంటారు. గ్రామ దేవతల్ని ఆరాధిస్తారు. గిరిజనులకే ప్రత్యేకమైన పండుగలున్నాయి. అడవి దేవతల పట్ల అచంచల భక్తి. జాతరలు భక్తి శ్రద్ధలతో చేస్తారు. పెళ్లంటే గూడెం మొత్తానికి విందు ఉంటుంది. స్త్రీలకు వివాహ సేచ్ఛ వుంది. పునర్వివాహం అపచారం కాదు. వారికే ప్రత్యే మైన నమ్మకాలున్నాయి. గిరిజనుల జీవితాలపై ఎక్కు వగా ప్రాబల్యంవున్న శకునాలు ఆచరిస్తారు. ఇలాంటి ఆచార వ్యవహారాలు గిరిజనులకే ప్రత్యేకంగా తెలంగాణ గిరిజన కథాసాహిత్యంలో కనిపిస్తున్నాయి.

ఉపయుక్తగ్రంథ సూచిక :

1. గీతాంజలి. బచ్చేదానీ (కథలు). హైదరాబాద్ : గోదావరి ప్రచురణలు, 2003.
2. తిరుమలరావు,జయధీర్, జీవన్. ఇప్పపూలు (గిరిజన సంచారతెగల కథలు). ఖమ్మం : ప్రతిభా ప్రచురణలు, 2009.
3. ఫణికుమార్. గోదావరి గాథలు. గుంటూరు : శ్రీనాథపీఠము, 1989.
4. భూపాల్. కొమురం భీము (ఒక గిరిజన వీరుడి కథ). హైదరాబాద్ : బాలసాహితి బుక్ ట్రస్ట్, 1994.
5. మల్లయ్య,కాలువ (సంపా). తెలంగాణ కథలు. హైదరాబాద్ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2005.
6. రాజయ్య, అల్లం. కథా కెరటాలు. (విరసం కథలు). విజయవాడ : విరసం ప్రచురణ, 2001.
7. రాంబాబు,నూనావత్. తెలుగులో గిరిజన కథలు- వస్తు,శిల్ప వైవిధ్యం. హైదరాబాద్: గిరిజన సాంస్కృతిక శాఖ, తెలంగాణ ప్రభుత్వం, 2017.
8. విద్యాసాగర్,ఎ. భద్రాచలం మన్నెం కతలు. హైదరాబాద్ : ప్రియదర్శిని ప్రచురణలు, 1993,
9. శైలమ్మ,జి. తెలుగు కథాసాహిత్యం - గిరిజన జీవితం. కుప్పం : ద్రావిడ విశ్వవిద్యాలయం, 2011.

కర్నూలు జిల్లా గిరిజనుల బాంధవ్య గేయాలు – పరిశీలన

– డా॥. కె. వెంకటరమణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయనశాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం గలది. భిన్నమైన భాషలు, విభిన్నమైన జాతులు, ఉపజాతులు, కులాలు, ఉపకులాలు, వివిధ మతాలు దేశంలో నెలకుని వున్నాయి. కొన్ని జాతులు తమ ఆస్థిత్వాన్ని నిలుపుకుంటూ జీవనం సాగిస్తుంటే, మరి కొన్ని జాతులు తమ ఉనికిని ప్రశ్నార్థకంగా మార్చుకుంటున్నాయి. కారణమేదైనా భారత దేశంలో వున్న ప్రజానీకం తమ అస్థిత్వాన్ని కోల్పోకుండా వుండాల్సిన అవసరం వుంది. మన దేశంలో వివిధ గిరిజన తెగలు సమాజానికి దూరంగా నివశిస్తున్నాయి. వారు తమ జీవనానికి అడవినే ఆసరాగా చేసుకున్నారు. వీరు ప్రత్యేక జీవన విధానాన్ని కల్గివుంటారు. వీరి వేషభాషలు, సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార్య వ్యవహారాలన్నీ భిన్నంగా కన్పిస్తాయి. ఈ కోణంలో కర్నూలు జిల్లా గిరిజనుల్లోని బాంధవ్య గేయాల్ని పరిశీలించడం ఈ వ్యాసోద్ధేశ్యం.

సమాజంలో కుటుంబమే ప్రాథమిక మానవ విభాగం. కుటుంబ సభ్యుల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనురాగం, ఆత్మీయత నెలకుని వుంటాయి. కుటుంబంలోని వ్యక్తుల మధ్య నెలకున్న బాంధవ్యం కారణంగా కుటుంబ వ్యవస్థకు ఒక ప్రత్యేకత వుంది. గిరిజనుల్లో కూడా కుటుంబ వ్యవస్థ ప్రాథమికమైంది. వారి జీవనంలో నెలకునే కష్ట సుఖాలకు కుటుంబం కారణభూతంగా నిలుస్తుంది. వీరి మధ్య గల సంబంధాలను తెల్పే గేయాలు విరివిగా వున్నాయి. ఈ విధంగా వుండే గేయాలను గిరిజన జానపద గేయాలుగా పేర్కొనవచ్చు.

గిరిజనుల బాంధవ్య గేయాల్లో చెప్పుకోదగ్గవి భార్య భర్తలు, తల్లి సంతానం, అన్నాచెల్లెలు, అక్క బావా మరదళ్ళకు సంబంధించినవి. కుటుంబంలో మొదట చెప్పుకోదగ్గవి భార్యాభర్తలకు సంబంధించిన గేయాలు. కుటుంబానికి వీరు మూలాధారం. వీరి మధ్య నెలకునే ప్రేమానురాగాలు కుటుంబంపై ప్రభావం కలిగిస్తాయి. కుటుంబంలో భార్యా భర్తల మధ్య సమస్యల కారణంగా కలహాలు వస్తుంటాయి. గిరిజన కుటుంబాల్లో భార్యాభర్తల మధ్య ప్రేమానురాగాలతో పాటూ కలహాలు కూడా వుంటాయి.

కుటుంబ భారాన్ని మోస్తూ భర్త వేధింపులకు గురయ్యే ఒక గిరిజన స్త్రీ బాధను ఈ గేయం పేర్కొంటుంది.

"కూలీకి నేను బోయి నాలుగు రూకలు
సంపాయించి నేను తెస్తినమ్మ
పండక్కు వాడికి అంగితెస్తె
సంతలోని అంగని తిడతాడు
కాయ కష్టం చేసి పంచె తీసుకొస్తె
పాతాది పంచని కొడతాడు
అవ్వులు కాసి జీతాము తీసుకొస్తె
తాగనీకు యిమ్మనె, కూరాకుయిమ్మనె
కాదంటె నడ్డిమీద తంతాడు
ఎట్టాగ ఏగేది చేసేది సంసారమమ్మ"
(పాడింది తులసీబాయి, గట్టుతాండ, వెలుగోడు)

పై గేయంలో మగవాడి ఆధిపత్యం, స్త్రీ ఔన్నత్యం అవగతమవుతుంది. గిరిజన స్త్రీ సంసార భాద్యతనంతా తన భుజాలపై వేసుకొని నిర్వర్తిస్తుంటే భర్త ఆమెకు సహకరించాల్సింది పోయి కర్కషంగా ప్రవర్తించడం పై గేయంలో చూడవచ్చు. దీన్ని బట్టి గిరిజనుల్లో త్రాగుడు లాంటి దుర్వ్యసనాలు ఉన్నట్టు తెలుస్తుంది. ఈ వ్యసనాలతో మహిళలపై వేధింపులు, దౌర్జన్యాలు వున్నట్లు విదితమవుతుంది. ఈ వేధింపులకు తట్టుకుని గిరిజన మహిళలు సంసారాన్ని నెట్టుకువస్తున్నట్లు పై గేయం ద్వారా అర్థమవుతుంది.

మరొక స్త్రీ వివాహానంతరం అత్తవారింటి పోరు పడలేక తన కష్టాలను గురించి చెప్పే గేయం యిలా వుంది.

"గొప్పేదొ సెప్పుతారు ఓలమ్మో
పెళ్ళంటే నూరేండ్ల పంటని - ఓలమ్మో
ఆడదాని బతుకు అత్తింట్లో - ఓలమ్మో
సూడాలి దాని కష్టాలు - ఓలమ్మో
పగలు రేయి కష్టం అత్తింట్లో - ఓలమ్మో
మొగునితో వేధింపులు అత్తింట్లో - ఓలమ్మో
మాటికి చాడీలు సెప్పు ఆడపడచు - ఓలమ్మో
అత్తతో బాధలు అంతింత కాదు - ఓలమ్మో
అరటాకు బతుకాయె అత్తింట్లో - ఓలమ్మో
తీరేది ఎప్పుడు అగచాట్లు - ఓలమ్మో"

(పాడింది యశోద కర్నూలు)

యిలా వివాహమయినప్పటి నుండి అత్తవారింట కలిగే బాధలను ఆమె వ్యక్తపరుస్తుంది.

పురుషాధిక్య భావజాలం సృష్టించిన సమస్యే స్త్రీకి అత్తింటి కష్టాలు. పెళ్ళంటే నూరేళ్ళపంటని, దాన్ని కాపాడుకోవాలంటే కోడలు మాత్రమే అణగి మణగి వుండాలని ఈ భావజాలం శాసిస్తుంది. పెళ్ళయ్యే వరకు తల్లి దండ్రుల ప్రేమను పొందిన స్త్రీ, వివాహమైన తర్వాత ఆ ప్రేమ స్థానంలో అత్తారింటి పెత్తనం చోటు చేసుకుంటుంది. ఈ స్థితి ఆధునిక సమాజంలో లాగా గిరిజన సమాజంలో కూడా వుందని పై గేయం వల్ల వెల్లడవుతుంది.

కుటుంబంలో అన్నా చెల్లెలు మధ్య భాందవ్యం ఎనలేనిది. ప్రతి అన్నకు చెల్లెలు అంటే అభిమానం సహజంగా వుంటుంది. ప్రతి చెల్లి తన అన్నను గౌరవిస్తుంది, ప్రేమిస్తుంది. తనకు ఏ ఆపద వచ్చినా, కష్టమొచ్చినా అన్న ఆదుకుంటాడు. గిరిజన కుటుంబాల్లో కూడా అన్నా చెల్లెళ్ల మధ్య ఆధరాభిమానాలు వుంటాయి. ఉదాహరణకు చెంచు కుటుంబాల్లో అన్న వివాహం రోజున చెల్లెలు ఎంత దూరంలో వున్నా ఆరోజు వచ్చి కాళ్ళు కడగాలి అనే సంప్రదాయం ప్రాచీన కాలం నుండి వుంది.

చాలా రోజుల తర్వాత పెళ్ళైన తన చెల్లెను చూడ్డానికి వెళ్ళిన అన్నయ్యను ఉద్ధేశించి చెల్లెలు బాధాకరమైన మాటలు మాట్లాడే గేయం కింది విధంగా వుంది.

"ఏమిరా అన్న బావుండవా బావుండవా
సూసేదానికి సమయమిపుడు వచ్చెనా
పెండ్లైయితెనే మరచి పోయారా
ఏమన్న పెట్ట వలసి వస్తుందన్న
బాధతో రాలేదో యీ యింటివేపు
బావగారు బాధపడతారని తెలియలేదా
అమ్మ తలుచుకోలేదో నా కాపురాన్ని
వదినెమ్మ సెప్పలేదో చూసిరమ్మని
ఎందుకు గుర్తుంటాను మీకు నేను
తీరిందిగా బాధ పెండ్లితోనే"

(తులసీబాయి, గట్టు, తాండ, వెలుగోడు)

(వివాహమై అత్తింటికి వెళ్ళిన స్త్రీకి అక్కడి పరిస్థితులతో బాటు, కుటుంబంలోని వారంతా కొత్తవారే. ఆమె అక్కడ బెరుకు బెరుకుగా చాలా అభద్రతతో జీవిస్తుంటుంది. భర్తతో పాటు కుటుంబ సభ్యులంతా ప్రేమగా దగ్గరకు చేరిస్తే ఆ అభద్రత తొలగిపోతుంది. అదే విధంగా తన పుట్టింటి వారుకూడా తరచుగా వచ్చి తన క్షేమ సమాచారాల్ని చూడాలని ఆమె కోరుకుంటుంది. అపుడే తనకు అత్తవారింట గౌరవం పెరుగుతుందని ఆమె భావిస్తుంది. తనను చూడడానికి రావడం ఆలస్యం చేసిన అన్నను గిరిజన మహిళ ప్రశ్నించడం పై గేయంలో కన్పిస్తుంది.)

సంతానం కలగాలనే కోరిక వివాహమైన ప్రతి స్త్రీకి వుంటుంది. మాతృత్వం ఒక వరంగా భావిస్తారు. తల్లికి తన సంతానంపై గల ప్రేమ అపారం. వివాహమైన స్త్రీకి సంతానం కలక్కపోతే ఆ స్త్రీ పడే మనోవేదన అంతులేనిది. సంఘంలో సంతానం వున్న స్త్రీకి లభించే గౌరవ మర్యాదలు గొడ్రాళ్లకు లభించవు. సంతానం లేని స్త్రీలను ఎటువంటి శుభకార్యాలకు రానివ్వరు. ఒక గిరిజన స్త్రీ సంతానం లేని కారణంగా తనకు కలిగే కష్టాలను గురించి యిలా బాధపడుతుంది.

"పేరంటాలకు పిలవరు తాండాలో - నాయకు
పిల్లను ఎత్తుకో అదృష్టం లేదు - నాయకు
సంబరాలకు నోచుకోలేదు - నాయకు
యీధీలో తలచుకుంటే దిగులు - నాయకు
బతుకేమి పిల్లలులేని బతుకు - నాయకు
మరియాదలేని గొడ్డురాలి బతుకు - నాయకు"

నేటి సమాజం ఆధునికమైంది. ఈ సమాజాభివృద్ధికి విద్యే మూలకారణం. ప్రస్తుతం తల్లిదండ్రులంతా తమ పిల్లలకు మంచి విద్య అలవడాలని ప్రయత్నిస్తుంటారు. గిరిజనులు కూడా తమ పిల్లలకు ఉన్నత చదువులు అబ్బాలని ప్రయత్నించడం గమనించదగ్గ విషయం. ఒక గిరిజన స్త్రీ తన కొడుకును ఏ విధంగానైనా చదివించాలని భావిస్తుంది. ఆ ఉద్ధేశ్యంతో చదువువల్ల కలిగే మంచినీ, చదవక పోవటం వల్ల కలిగే కష్టాలను గురించి తల్లి కొడుకుతో చెప్తుంది. ఈ విషయం గేయంలో,

"సదువుకో కొడకా సదువుకో - వెంకటరమన
సదివి సదివి పెద్ద కొలువు సేయాలి - వెంకటరమన
నువు బావుంటే మేము సంతసిస్తాం - వెంకటరమన
రోజు బడికి పోతే నీకు రూపాయిస్తా - వెంకటరమన
నాలుగు సిత్తుల నిండ బుడ్డలుపోస్త- వెంకటరమన
బడికి పోకుంటే తప్పదురా నెత్తిమోపు - వెంకటరమన
పోయేది తప్పదురా అడవికి పండ్లాకు - వెంకటరమన
ఊరూరు తిరిగి తిరిగి అమ్మాలిరా - వెంకటరమన
మనకు వుండాది ఆవుల మంద - వెంకటరమన
పగలంత తిరిగి తిరిగి కాయాలి - వెంకటరమన"

(నాగుబాయి - సుగాలిమెట్ట, పాణ్యం)

చదువు వ్యక్తిని చైతన్య పరిచి, అభివృద్ధి చేస్తుందనే, స్పృహ గిరిజనుల్లో వుందని క్రింది పై గేయం వల్ల తెలుస్తోంది.

గిరిజనుల్లో ప్రతి తల్లికి మగ సంతానం మీదే కాకుండా ఆడ పిల్లల మీద కూడా అధికప్రేమ వుంటుంది. సహజంగా తల్లీ కూతుళ్ల మధ్య దాపరికాలుండవు. తన కూతురు తప్పులు చేసినా కడుపులో దాచుకుంటుంది. ఈ తల్లీ కూతుళ్ళ మధ్య అనురాగానికి గిరిజనుల గేయాలు మంచి ఉదాహరణలు. కూతురుకి పెళ్లిచేసి అత్తింటికి పంపే సమయంలో తన కూతుర్ని. తల్లి వేడుకునే గేయం కింది విధంగా వుంది.

"పోయి రావమ్మా ఏడవకమ్మ
వుండాడు నీకు మొగుడు యీదినము
తోడు వాడే నమ్ము యిక నుంచి నీకు
మరవాలి మమ్ముల యికనుంచి
అత్తింటి వారె దిక్కు నీకమ్మ
మెలకువగ సెయ్యాలి సంసారమమ్మ
అనగి మనగి వుండవమ్మ ఆడపడుచులకు
అత్తవారు నీకు యిక నుంచి తల్లియెమ్మ
సెప్పీన పనిని చేసుకుంటు
తెవ్వాలి పుట్టింటి వారిపేరు
చెడ్డపేరు లేకుండా మంచిగ వుండవమ్మ
మంచి గొనముతో పెంచాలి బంధాన్ని
తెలివిగ మసలుకోవమ్మ నీవు"

(గడ్డం శేషమ్మ, మంగంపేట తాండా అవుకు)

పెళ్లయి అత్తవారింటికి వెళ్ళే స్త్రీ ఆ యింట అణిగి మణిగి వుండాలని తల్లి ఆమెకు బోధిస్తుంది. కారణం, అలా అణిగిమణిగి వుండడంలోనే కూతురి జీవితానికి భద్రత వుందని తల్లి భావిస్తుంది. అందుకే అలా బోధిస్తుంది. పరుషాధిక్య భావజాలం గిరిజనుల్లో కూడా వుందని ఈ గేయం వల్ల తెలుస్తోంది.

ప్రస్తుత సమాజం ఆధునికమవుతోంది. దీంతో గిరిజనులు సైతం ఆధునికులుగా మారుతున్నారు. వీరు కూడా అడవిని వదలి పట్టణ ప్రాంతాలకు చేరుకుంటున్నారు. దీంతో గిరిజనుల ఆచార వ్యవహారాలు పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి ప్రస్తుతం వుంది. సంప్రదాయాల్లో భాగంగా పాడుకునే గేయాలు అంతరించిపోయే పరిస్థితి దాపురించిందని చెప్పాలి. కుటుంబ

సంబంధాల్లో భాగంగా కుంటుంబాల మధ్య నెలకున్న భాందవ్య గీతాలు ప్రస్తుతం ఆధునికమైన గిరిజనులకు దూరమయ్యాయి. వీటి పట్ల పరిశోధనలు జరగడం మంచి పరిణామమే కాక భవిష్యత్తరాలకు అవసరం.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు జానపద గేయ గాథలు - నాయని కృష్ణమూర్తి.
2. పల్లె పదాల్లో ప్రజాజీవనం - వెల్లండ రఘుమారెడ్డి.
3. కర్నూలు జిల్లా గిరిజనుల జానపదగేయాలు - విమర్శనాత్మక పరిశీలన - చవ్వా వెంకటేశ్వర్లు, ప్రకాశం జిల్లా.
4. గిరిజన సంస్కృతి సాహిత్యం - జిల్లా శ్రీనివాసులు.
5. జానపద కళాసంపద - తుమాటి దొనిప్ప.

లంబాడీలు – వివాహ ఆచారాలు

– డా. వై. విజయానంద రాజు, శాఖాధ్యక్షులు, తెలుగు విభాగం, పి.బి.సిద్ధార్థ కళాశాల, విజయవాడ.

భారత దేశంలో గిరిజనులు రకరకాల పేర్లుతో పిలవ బడుతున్నారు. ఆంగ్లంలో వీరిని 'ట్రైబల్స్' అని, ప్రాచీన తెలుగు సాహిత్యంలో వనచరులని, హిందీ సాహిత్యంలో ఆదివాసీలని పిలవడం కన్పిస్తుంది. ఇంకా ఈ జాతులకు ఆటవీకులనీ ఆదిమ జాతులనీ సంచార జాతులనీ పర్యాయ పదాలున్నాయి.

సమైఖ్యాంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో షెడ్యూల్డు తెగల జనాభా సుమారు 50 లక్షల పైచిలుకుగా గుర్తించారు. వీరి జనాభాను 33 తెగలుగా వర్గీకరించారు.1. ఆంధ్, 2. బగత్, 3. భిల్, 4. చెంచు, 5. గదబ, 6. గోండు, 7. గవుడు, 8. హిల్‌రెడ్డి, 9. జాతావు, 10. కమ్మర, 11. కట్టునాయకర్, 12. కోలామి, 13. కొండ దొర, 14. కొండ కాపు, 15. ఖోండ్, 16. కోటియా, 17. కోయా, 18. కులియా, 19. మౌలీ, 20.మన్నెందొర, 21. ముఖదొర, 22. నాయర్/నూకదొర/నాయకపోడు, 23. పర్ధాన్, 24. పొరజ, 25. రెడ్డిదొర, 26.రొనా (రణా), 27. సవర, 28. సుగాలి/లంబాడా, 29. తోటి, 30. వాల్మీకి, 31. కొండ రెడ్డి, 32. యానాది, 33. ఎరుకల. ఇందులో లంబాడీల వివాహ ఆచారాలను తెలియజేయటం ఈ వ్యాస ప్రధానోద్దేశం.

లంబాడీలను తెలంగాణ ప్రాంతంలో 'బంజారాలు' అని పిలుస్తారు. ఇతర ప్రాంతాలలో 'సుగాలీలు' లేక 'సుకాలి' అని పిలుస్తారు. సంచార, దేశ దిమ్మరులైన వీళ్లు భారతదేశం అంతటా వ్యాపించి ఉన్నారు. మన ఆంధ్ర ప్రదేశ్‌లోని కోస్తా ప్రాంతమైన కృష్ణ, గుంటూరు జిల్లాలోను, రాయలసీమలోని కర్నూలు, కడప, అనంత పురం జిల్లాల్లోను, తెలంగాణలోని ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, మహబూబ్ నగర్, నల్గొండ జిల్లాలోను, హైదరా బాద్ జంట నగరాల్లో కన్పిస్తారు. వీరి ప్రధాన వృత్తి పశు వులను మేపటం. గ్రామాల్లోని పశువులను తోలుకొని వెళ్లి అడవుల్లో, కొండ ప్రాంతాల్లో మేపుతూ వీళ్లు అక్కడే నివసిస్తారు. వీరి నివాస ప్రాంతాలను 'తండాల'ని పిలుస్తారు.

బంజారాలు ఒకచోటనుండి ఇంకొక చోటికి తమ సరుకులను మోసే ఎద్దులతో దేశ దిమ్మరుల వలె తిర గడం వల్ల వీళ్లను వనచరులని పిలటం జరిగింది. కాల క్రమంలో ఈ వనచర శబ్దం వనచార, వంజార, బంజార గా మార్పుచెందిందని పరిశోధకుల అభిప్రాయం.

లంబాడీలను కొన్ని ప్రాంతాలలో 'సుగాలి' అని పిల వటం కన్పిస్తుంది. హిందీ భాషలో ఆవులను 'గాయ్' అని అంటారు. సు+గాయ్ అంటే మేలు జాతి ఆవు అని అర్థం. వీరు ఆవులను పెంచుతారు కాబట్టి సుగాలి, సుకాలి అనే పేర్లు వచ్చి ఉండవచ్చునని మరికొందరి అభిప్రాయం.

వివాహం / పెండ్లి పద పరిచయం :

వివాహం అనే పదంలో 'వి' అనే ఉపసర్గ 'వహ్' అనే ధాతువుకు 'హం' చేరింది. 'మోసుకొని పోవుట' అని అర్థం. వరుడు వధువును ఇంటికి మోసుకొనిపోవుట అని తెలుస్తుంది.

'పెండ్లి' అనే పదంలో 'పెణ్' అంటే స్త్రీ 'ఇల్' అంటే ఇల్లు. ఈ రెండు పదాలను కలసి పెండిలి/పెండ్లి/పెళ్లిగా మార్పు చెందాయని పరిశోధకుల అభిప్రాయం.

మన దేశంలో వివిధ కులాలు, తెగలు, మతాలకు సంబంధించిన వారు ఒక్కొక్కరు ఒక్కో విధంగా వివాహం చేయటం కన్పిస్తుంది. ఇది వారివారి సాంస్కృతిక, పర్యావరణ పరిస్థితిని బట్టి ఆయా వివాహ ఆచారాలు అమల్లోకి వచ్చాయి.

లంబాడీల వివాహలకు సాధారణంగా పురోహితు లుండరు. మంత్రతంత్రాలు ఉండరు. తండాలోని పెద్దల సాక్షిగా వివాహకార్యక్రమం జరుగుతుంది. వీరు మొదట

గోత్రనామాలను తెలుసుకొని పెళ్లి ప్రయత్నాలు మొదలు పెడతారు. స్వగోత్రం వారిని వివాహం చేసుకోరు. ఒకే గోత్రం అయితే సోదర భావం కలిగి ఉంటారనే ఉద్దేశం. కాబట్టి వేరే గోత్రం వాళ్లతో సంబంధాన్ని కలుపుకుంటారు.

పెళ్లి ఖాయం చేసుకొన్న తరువాత తండా నాయకుడు సూది మొనను కాల్చి పెళ్లికొడుకు ఎడమ భుజంపై ముద్ర వేస్తారు. ఆ సమయంలో మంత్రం ఏడుసార్లు జపిస్తారు. ఇలా చేయటం వలన ఇతనికి ఒక అమ్మాయితో నిశ్చ తార్థం అయ్యిందని అర్థం. అందువల్ల మరొకరిని మోసం చేయడానికి ఆస్కారం ఉండదు.

వరుని దేహ దారుఢ్య పరీక్ష :

వరుని దేహం పరీక్ష చేసే ఆచారం ఉంది. స్త్రీలు జిల్లేడు, మోదుగు కర్రలతో, రోకళ్లతో కొడుతూ మా కూతురిని బాధిస్తావా? బూతులు తిడతావా? అంటూ ప్రశ్నిస్తారు. బావమరుదులు చిన్నచిన్న రాళ్లు చెవిలోపెట్టి మా అమ్మనాన్నని తిడతావా? మాచెల్లిని బాధిస్తావా అంటూ చెవులు నలపడం చేస్తారు. అప్పుడు వరుడు ఎలాంటి నొప్పి అనిగాని, బాధ అనిగాని అనకూడదు. ఈ విధానం వరుని శరీర పటుత్వాన్ని, సహనాన్ని, ఓర్పుని పరీక్షించటానికి అని తెలుస్తుంది. ఈ అవస్థలను భరించినవాడే వధువుకు సరియైన వరుడని, సమర్థుడని వారి నమ్మకం.

తాంబూలాలు పుచ్చుకొనుట :

వివాహ నిశ్చయ ఆచారానికి 'సగాయి'అని పేరు. ఆపదం 'సెగె' అనే హిందీ శబ్దం నుండి వచ్చింది. మగ పెళ్లివారు తమతోపాటు తాండాలోని పెద్దల్ని, బంధువుల్ని తీసుకొని అమ్మాయి ఇంటికి వెళ్లతారు. మగ పెళ్లివారు తమతోపాటు బెల్లం, ఎండికొబ్బరి, కల్లు, సారా, ఆకు, వక్కలు తీసుకొని వెళ్లి తండాలో అందరికి పంచుతారు. ఆరోజు సాయంత్రం కులదేవత సన్నిధిలో ఇరువర్గాలు తాంబూలాలు ఇచ్చి పుచ్చుకుంటారు.

పెళ్లిరోజు ఉదయాన్నే పెళ్లికొడుకు పెద్దలు ఊళ్లో అందరికి తాంబూలాలిచ్చి పెళ్లికి ఆహ్వానిస్తారు. పెళ్లి కూతురు ఇంటి దగ్గరే పెళ్లి జరుగుతుంది. పెళ్లి కూతురు ఇంటి ముందు పందిరి వేసి అందులో పీటలు వేసి వధూవరులకు స్నానం చేయించి వరుడితో పెళ్లి కూతురు మెడలో తాళికట్టిస్తారు.

రోకలి చుట్టూ ప్రదక్షిణం :

వధూవరులను రోకలి చుట్టూ ప్రదక్షిణం చేయించ డాన్ని 'పెరా పెరా' అంటారు. పెళ్లి పందిరిలో వధు వరూ లను పాతిక రోకళ్లు చుట్టూ ప్రదక్షిణ చేయిస్తారు. తండా పెద్ద ఒకరు ఈ కార్యక్రమాన్ని జరిపిస్తారు. వరుని చేతిలో ఒకరూపాయి బిళ్లా పెట్టి వధువు చేతిని జోడించి ఏడుసార్లు ప్రదక్షిణ చేయిస్తారు.

కట్న కానుకలు :

వీరిలో కట్నాలు లేకపోయినా 500 రూపాయలు వధువు తండ్రికి వరుడు తండ్రి ఇస్తాడు. వధువు తల్లి దండ్రులు ఆవునుగాని, గొర్రెనుగానీ మేకనుగాని ఇస్తారు. అలాగే ఆడపిల్ల వారికి మగపిల్లవాడు ఇచ్చే 'ఓలి' వేరే విధంగా ఉంటుంది. నాల్గు గేదెలు, నలుబది ఐదు రూపాయలు ఇస్తారు. పెళ్లి కూతురు వారు వధువుకు ఆరులంగాలు ఆరు ముసుగ గుడ్డలు ఇస్తారు. పెళ్లి కొడుకు తల్లికి మంచి అద్దాల దుస్తులు ఒక జత ఇస్తారు. పెండ్లికొడుకు తల్లిదండ్రులు గాజులు, చెంపకు వేసు కునేది 'షుగిరి' తెస్తారు. వీటిని లంబాడీలు మంగళ సూత్రంగా భావిస్తారు. ఒక ఆవు పెయ్యను, వధువు వస్తువుల గోనె సంచెను ఇచ్చి అత్తగారి ఇంటికి పెండ్లి కూతురును పంపుతారు.

దూత (లేరియా) :

పెండ్లి కుమారుడు పెండ్లి కూతురు ఇంటికి బయలు దేరే ముందు అతని వెంట ఒక సమర్థుడైన వ్యక్తిని పంపు తారు. అతనినే లేరియా(దూత) అంటారు. ఇతడు ఒక విధంగా తోడి పెండ్లి కొడుకుగా భావించాలి. ఎన్ని రోజులు పెండ్లి కొడుకు అత్తారింట్లో ఉంటే అన్ని రోజులు అతనిని చూచుకుంటారు. ఈ దూతగా వెళ్లేవాడు వివాహితుడై ఉండాలనే నియమముంది.

పెళ్ళి కుమార్తె అలంకరణ :

పెళ్లి కుతురు పెటియా, కాంచలి, చాంటియా, తలకు కాళ్లకు గజ్జెలు, రెండు చెతులకు గాజులు (బలియా) ముక్కుకు భూర్యా, చెంపలకు జడలు అల్లి జడ కుచ్చులుగా ఉండు షుగిరి, టోపలి ఆండ్ కాంట్ అనేవి అలంకరిస్తారు. ఈ సందర్భంలో ఆమెకు ఆనందం కంటే దు:ఖం ఎక్కువ. ఎందుకంటే అత్తగారింటికి వెళుతున్నందుకు ఆనందం కన్నా కన్నవారిని విడిచి వెళుతున్నందుకు దు:ఖము ఎక్కువగా ఉంటుంది.

విందు :

లంబాడీల విందును 'గోట్' అని వ్యవహరిస్తారు. ఇది పెండ్లి కుమారుడే ఇవ్వాలని ఆచారముంది. ఆరోజు మేకల్ని బలిస్తారు. రక్తాన్ని పాత్రలో పట్టి 'సోళోయ్' వండుతారు. సోళోయ్‌ని చింతపండు పులుసు, ఉప్పు, రక్తం కలిపి తయారుచేస్తారు. కల్లు, సారాయితో సాయంత్రం అందరిని వరుసగా కూర్చోబెట్టి సోళోయ్‌ని వడ్డించి, మత్తుపానీయాలు సేవిస్తారు. ఆతరువాత అందరూ భోజనాలు చేస్తారు.

ఏడుపు :

పెండ్లికి వారం రోజుల ముందునుండే తండాలోని స్త్రీలందరూ కలిసి వధువు పంపక సమయంలో ఏడ్చేవిధానాన్ని నేర్పుతారు. దీనినే 'ఢావ' అంటారు. ఈ సంప్రదాయం మరే ఇతర కులాల్లో కన్పించదు. ఈ కార్యక్రమం మూడు విధాలుగా ఉంటుంది. ఏడ్పును నేర్పించే ఆచారాన్ని 'ఢావళో' అని, పంపక సమయంలో అందరిని కౌగిలించుకొని ఏడవటాన్ని 'మళేరో' అని, ఎద్దుపై నిల్చొని తన పుట్టింటి వారు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ పాడేపాటను 'దావేలి' అని అంటారు.

అప్పగింతలు :

వధువు ఏడుపుతో ఇంటినుండి బయటకు తీసుకు వచ్చి అద్దాలగుడ్డలతో, గవ్వలతో అలంకరించబడిన ఎద్దుపై నుంచోబెడతారు. ఆమె కావలసిన దుస్తులు, ఆభరణాలు అన్ని గోనె సంచిలో సర్ది బయటపెడతారు. దానిని 'తాండ్డి' అంటారు.

వధువును సాగనంపడం :

వధువును అత్తగారింటికి సాగనంపడాన్ని 'తాండ్డి మేలేరో' అంటారు. ఒక్కొక్కరు వారికి తోచనంత డబ్బును వధువు ముసుగు గుడ్డ చివరన ముడి వేస్తారు. వధువు తన అత్తవారింటికి అడుగులు వేస్తూ వెళ్ల లేక వెళుతుంది.

నూతన జంటను ఇంట్లోకి ఆహ్వానించుట :

నూతన వధూవరులు అత్తవారింటికి వచ్చినప్పుడు ముత్తైదువులు పాటలు పాడుతూ, చమత్కారమైన ప్రశ్నలు అడుగుతూ ఇంట్లోనికి ఆహ్వానిస్తారు. ఆడపడుచులు గుమ్మం దగ్గర హారతి పళ్లెం పడతారు. అందులో పెళ్లికొడుకు ఎంతోకొంత సొమ్ము వేయాలి. మళ్లీ లోపలి నుంచి బయటకు వచ్చేటప్పుడు ఆడపడుచులు మళ్లీ గుమ్మం దగ్గర అడ్డగిస్తారు. ఈసారి వధూవరులు ఒకరి పేరు మరొకరు చెప్పాలి.

విడాకులు :

లండాడీల్లో ఇరుపక్షాల భార్యాభర్తల సమ్మతితో విడాకులు ఉంటాయి. విడాకులకు కొన్ని ప్రత్యేక కారణాలు ఉంటాయి. ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే తండా పెద్దలు పంచాయితీలో విడాకులు మంజూరు చేస్తారు. విడాకుల తరువాత ఇరువురు మరల వివాహాలు చేసుకోవడానికి అనుమతి ఉంది. ఆ జంట విడిపోయే పక్షంలో వారి సంతనాన్ని ఎక్కువ సందర్భాల్లో తండ్రితోనే ఉంచుతారు. ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే తల్లితో ఉండేందుకు పంచాయితీ అనుమతిస్తుంది.

ముగింపు :

పైన చెప్పిన అంశాలను గమనిస్తే లంబాడీల వివాహ ఆచారాలు మిగతా కులాలకన్నా కొంత ప్రత్యేకంగా కన్పిస్తాయి. దానికి కారణం వారి సాంస్కృతిక, ఆర్థిక కారణాలే. అయితే సంస్కృతీకరణ పట్టణీకరణ, ప్రపంచీకరణ క్రమంలో వారి ప్రత్యేకతలు కనుమరుగయ్యే ప్రమాదం

ఉంది. కాబట్టి వివిధ ప్రజాసంఘాల ద్వారా, జాతీయ సదస్సుల ద్వారా వారి సంప్రదాయాలను, ఆచారాలను పరిశీలించటం, పునర్ సమీక్షించడం వల్ల ముందు తరాల వారికి వారి ప్రత్యేకతలను తెలియపరచవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. కృష్ణాజిల్లా లంబాడీల సాంస్కృతిక జీవన వికాసం, డా॥బి.సరస్వతి, 2015.
2. బంజారా చరిత్ర - (సంస్కృతి-ప్రగతి), బి.చీనియానాయక్, 1998.
3. బంజారాల సంస్కృతి-సాహిత్యం, డా॥కె.ఓబిరెడ్డి, 1991.
4. భారతదేశము-గిరిజన సముదాయాలు, డా॥ఎం.సూర్యనారాయణ, 1998.

"బంజారా స్త్రీలు – ఆభరణాలు"

– దేవరపు ఈశ్వరరావు, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

భారతదేశంలో బంజారాలు విశ్వవ్యాప్తంగా కనిపిస్తున్న 'రోమాజిప్సీల' సగోత్రులు. వీరి స్వస్థలం రాజస్థాన్. అయినా వీరు ఈనాడు దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ కనిపిస్తున్నారు. కానీ ఉత్తర, పశ్చిమ, దక్షిణ భారత దేశంలోనే అధికంగా వ్యాపించి ఉన్నారు. వీరిది ఒక బహుజన సమాజం. బంజారా అన్నది ఒక కులం కాదు సామాజిక సమూహం. వారిలో 'గోర్ బంజారాలు' రాజస్థాన్‌లోని రసపుత్రులతో సగోత్ర సంబంధం గలవారనీ రక్త పరీక్షలు నిరూపించాయి. వాణిజ్యకారులే బంజారాలని, లమన్ విక్రేతలే లంబాడీలని, మంచి ఆలకాపరులే సుగాలీలని శ్రీ చీనియా నాయక్ గారు తమ పరిశోధనలో తెలిపారు.

ఈ బంజారాలను గిరిజనులని ఒక చోట, వెనుకబడిన వారని, మరొకచోట దళితులని ఇంకోచోట వర్గీకరించి పరిగణిస్తున్నారు. ఈ బంజారాలు దేశంలోని ఏ ప్రాంతంలో ఉన్న దాదాపు ఒకే 'గోర్‌బోలి' భాషలో మాట్లాడుతారు.

బంజారాలు గురించి డా॥ టి.వి. సుబ్బారావు గారు ఈ విధంగా చెప్పారు. ''పాండవ వీరవంశం అభిమన్యునితో అంతరించిపోకుండా శ్రీకృష్ణభగవానుడు కాపాడాడు. ఉత్తర గర్భంలోని పరీక్షిత్తును రక్షించాడు. ధర్మరాజు తరువాత పరీక్షిత్తు పట్టాభిషిక్తుడయ్యాడు. పరీక్షిత్తు కొడుకు జనమే జయుడు. అతనికి వ్యాస శిష్యుడైన వైశంపాయనుడు మహాభారత గాధను సవిస్తరంగా వివరించాడు. పాండవులు మహాప్రస్థానం చేసేనాటికే కలియుగం వచ్చేసింది. పరీక్షిత్తు - జనమేజయుల వంశంలోని వాడే మహావీరుడు పృథ్వీరాజు. జనమేజయుని నుండి పృథ్వీరాజు వరకూ గల వంశవృక్షం బయటపడింది. భారతదేశాన్ని భారతీయ సంస్కృతిని కాపాడటానికి ప్రాణాలొడ్డిన శూరశిఖామణి పృథ్వీరాజు. అతడు రసపుత్రవీరుడు. అలాగే తరువాతి కాలంలో మొగలాయి చక్రవర్తులపై తిరుగుబాటు చేసిన రాణా ప్రతాప్‌సింగ్ రసపుత్ర వీరుడు. ఈ మహావీరుల సంతతి వారే బంజారాలు'' అని బంజారాల నేపధ్యంను తెలిపారు.

బంజారాలు భారతదేశంలోనే అత్యధిక సంఖ్యలో ఉన్న ఒక జన సముదాయం. తమ రక్షణ కోసం అడవుల్లో జీవిస్తూ, ఆ ప్రాంత భాషలను నేర్చుకుంటూ, వారితో కలిసిపోయి, వాళ్ళ సంస్కృతిని పాటిస్తూ వారి తొలి వృత్తులయిన వ్యాపార వాణిజ్యాలను, పశుపోషణను వదలకుండా, ఊళ్ళకు దూరంగా ఉంటున్నా తమదైన సంస్కృతిని వదలకుండా వారసత్వంగా పాటిస్తూ తరతరాలుగా రక్షిస్తూ వస్తున్నారు.

ఇక వీరి భాష గురించి తెలియపరచుకుంటే ఇంతకు ముందు తెలిపినట్లు వారు మాట్లాడే భాషను 'గోర్‌బోలి' అని పిలుస్తారు. 'బోలి' అనే మాటకు ఒక ప్రత్యేకమయిన అర్థం ఉంది. ఈ భాష మాండలికం కాదు. ఎన్నో ప్రాంతీయ భేదాలున్న ఒక జాతి భాష అని అర్థం. వీరి వ్యవహారంలోని భిన్న ప్రాంతాల్లోని పదాలను పోల్చి చూస్తే దాదాపు 9-11 శతాబ్దాల నడుమ రాజస్థానీ - హిందీ - గుజరాతీల మూలరూపం ఏది ఉంటుందో - అదే బంజారాలు ఈనాడు మాట్లాడే భాష అని తెలుస్తుంది. కాబట్టి నిస్సందేహంగా బంజారా భాష హిందార్య కుటుంబానికి చెందిన ఒక ''చారిత్రక భాష'' అని ప్రొ॥ హెచ్.యస్. బ్రహ్మానందగారు తెలియపరిచారు.

ఇక విషయంలోకి వస్తే... బంజారా సంస్కృతిలో స్త్రీలు ధరించే దుస్తులు, అభరణాలు ఒక ప్రత్యేకతను కలిగి ఉంది. వీరు ఒకప్పుడు క్షత్రియ వంశస్తులు, రాజపుత్ర స్త్రీలు వేసుకొనే దుస్తులు, వజ్రవైఢూర్యాలతో పొదగ బడినవి ఉండేవి. కాని కాలక్రమేన వారి ఆర్థికపరిస్థితులు

తారుమారైనవి, రాజ్యాలు పోయినవి. అడవులపాలై తినుటకు తిండే కరువైనది. కాబట్టి వీరి వస్త్ర, ఆభరణాలు ప్రకృతిలో చౌకగా లభించే వివిధ వస్తువులతో తయారైనవే ధరించేవారు.

బంజారా స్త్రీలు ధరించే ఆభరణములు :

1. భూర్య :

ఇది బంగారంతో చంద్రుని ఆకారంలో 1/2 తులం నుండి ఒక తులం వరకు రకరకాల డిజైనులతో తయారు చేసుకొని ఉంటారు.

2. కన్యా :

ఇది చెవులకు ధరిస్తారు. పూర్వం బంగారం వాడే వారు ఇప్పుడు వెండితో రింగు తయారు చేసి వాటికి వేలాడుతున్నట్లుగా గొలుసులు కలిగి కింద భాగంలో వెండి గజ్జలు అమరుస్తారు.

3. మెడలో :

ముఖ్యంగా దీన్ని హాంసలి అంటారు. ఇది వెండితో తయారుచేసినది. సుమారు 3 లేదా 4 కేజీల నుండి 1 కేజి బరువు కలిగి గుండ్రంగా కడియం మాదిరిగా ఉండి ఎద భాగములో రెండింటిని కలుపుటకు కొక్కెము - ఆ కొక్కెమునకు రెండు వైపుల 2 లేక 3 అంగుళాల దూరం వరకు వెండి తీగను భద్రంగా అలంకారంగా చుట్టి ఉంటారు మరియు దానికి త్రికోణాకారంలో వెడల్పుగా బిళ్ళలు వేలాడదీసి, వాటికి కింద వేలాడుతున్నట్లుగా వెండి గొలుసులు గజ్జలు కలిగి ఉంటాయి.

మరియు మెడలో రంగు రంగుల పగడములతో మధ్య మధ్యలో వెండి బిళ్లలు కలిగి ఉండి ఎద కింద భాగము వరకు వేలాడుతూ ఉంటుంది. ఈ దండలు కనీసం రెండు మూడు రకాలు ధరించి ఉంటారు.

చేతి వేళ్లకు, బొటన వేళ్లకు వెండి బిళ్లలతో తయారు చేయించి రకరకాల డిజైనులతో ఐదు వేళ్లకు ఉంగరములు ధరిస్తారు.

కాలి వేళ్లకు పూతియా, వించువా, చటిలో అని రక రకాల పేర్లతో అన్ని వేళ్లకు ఉంగరం తొడిగి ఉంటారు మరియు కాళ్లకు వెండి గజ్జలు, తుంకాయ గొలుసులు, వెండి కడియం తొడిగి ఉంటారు. ఇది రాయలసీమ ప్రాంతంలోని సుగాలీలు వేసుకొను సొమ్ములు, తెలంగాణంలో కాళ్లకు వెండిని కాకుండ కంచు, ఇత్తడితో తయారు చేసి ఝాంజరీయా, కస్సే బోదలు అనునవి తొడుగుతారు.

బంజారా స్త్రీ హిందూ స్త్రీలాగా జడ వెనుకకు దువ్వరు. ఎందుకనగా స్త్రీ యొక్క అందం ఆమె చెంపల మీద, చేతుల ద్వారానే ఆకర్షించబడుతుంది. పూర్వం మహమ్మదీయుల కాలంలో స్త్రీలను చాలా హింసించేవారు. వారి బారి నుండి తప్పించుకొనుటకు బంజారాలు ఒక పద్ధతిని కనిపెట్టారు. దానినే బంజారా స్త్రీ ఈనాటి వరకు అవలంభిస్తున్నారు. మొత్తం తలవెంట్రుకలను 5 భాగములుగా చేస్తారు. 1) చోటి 2) చోటాకు రెండు సన్నవి జడలు వీటికి వెండి గజ్జలు కూడ అల్లుకుంటారు. 3) చెంప ముందు భాగములు 4) మూళో సన్నని జడ వెనుక భాగము అనగా తన చెంపలు కనిపించకుండా తన వెంట్రుకలతో కప్పుకొనుట. అలా కప్పుకొనుటకు ఎలా సాధ్యపడుతుంది. అందుకని వాటిని బరువు ఉండేందుకు ఘగరి, టోప్లి అను వెండితో తయారు చేయబడిన ఆభరణం వాటిని తమ చంప భాగంలోని వెంట్రుకలకు వెడల్పుగా దువ్వి, వెంట్రుకలు చెల్లాచెదురు కాకుండా కొద్ది వెంట్రుకలతో సన్నని జడలల్లి చెంప దగ్గర నుండి కొన్ని వెంట్రుకలను తీసి ఆ సన్నని జడకు కలిపి, ఉన్న వాటిని జడలో కలిపి రెండు పక్కలా అల్లుతారు. చోటి అనగా తలపై సుడి మధ్యభాగంలో ఉన్న కొన్ని వెంట్రుకలను తీసుకొని జడ అల్లించుకొని దానితో రెండు చెంపల మధ్య భాగంలో నుండి వచ్చిన రెండు జడలు కలిపి కొప్పు జడతో మొత్తం ఒక జడగా తయారుచేస్తారు. ఈ విధంగా చిన్న, పెద్ద, మునలి వాళ్లు అందరు వేసుకొంటారు. బంజారా స్త్రీలలో గమనించవలసిన విషయం ఒకటున్నది. బంజారా స్త్రీలకు జడలే, మత్తైదువు వేసుకొనే ఆభరణం అనగా పెళ్ళి అయిన వారికి, భర్త జీవించిన

వారికి జడకు ఎదురుగా గుండ్రంగాను ఎత్తుగా వెండితో చేయబడిన ఘగరికి ఎర్రటి గురిగింజను మధ్యలో పొదిగి ఉన్నది మరియు రెండు టోప్లిలు రెండు పక్కల వేలాడు తున్న ఆమె ముత్తైదువు అని అర్థం. భర్త చనిపోయిన, పెళ్ళికాని ఆడపిల్లలకు ఈ ఘగరి ఉండదు. వెండితో చేసిన రెండు టోప్లిలు మాత్రం కింద వేలాడుతూ ఉం టాయి. వాటికి వెండి గొలుసులతో గజ్జెలు కింద వేలా డుతూ ఉంటాయి. ముత్తైదువులకు గగరి, టోప్లిలు ఉంటాయి. పెళ్ళికాని, భర్త పోయిన ఆడవాళ్లకు టోప్లిలు మాత్రమే ఉండును. మహారాష్ట్రంలోని విదర్భ మరియు ఖందేష్ భాగంలోని బంజారా స్త్రీలు, తమ జడలలో ఆయుధాలను ధరించారు. విదర్భ ప్రాంత స్త్రీలు, జడ కొప్పులో పదునైన రెండు కత్తులను ధరించేవారు, అవి ఇప్పుడు కొమ్ము కుప్పలు లేక రెండు పుల్లలను ఉంచు తారు.

ఖందేష్ భాగములోని స్త్రీలు, తలపై భాగమున ఒకటింకాలు మూర పొడవైన కొనలో లావుగా గుండ్రంగా ఉండునట్లు ఇనుపరాడ్డును ధరించేవారు. ఇప్పుడు అది పొడగాటి కట్టె ముక్క అయినది పూర్వం ఆపద సమయంలో వాటిని ఉపయోగించేవారు.

ఈ జడలకు పై భాగమున కంటి దగ్గర నుండి చెవిపైవరకు వెండితో తయారు చేసిన గొలుసుల పట్టి, వాటికి గజ్జలు వేలాడుతుంటాయి. వాటిని ఆడ్‌కాంట్ అంటారు. మన ఆడవాళ్ళు మాటీలు అంటారు. వాటిని ధరిస్తున్నారు.

నొసట కనిపించకుండ తల మధ్య పాపిడి నుండి వెండితో, బంగారంతో చేసిన టీక్లి (నెక్లీసు) వేలాడుతుంది. బంజారా స్త్రీ తన చేతుల ద్వారా వచ్చే అందమును బలియా అను వాటితో కప్పుకొంటారు. ఇవి రెండు రక ములు 1) చూడేరీబలియా 2) బలియా. చూడేర్ బలియా అనగా పెళ్ళి అయిన ముత్తైదువు తన మోచేతికి పైన ధరించినది. పెళ్ళి కాని వారు, భర్తలేని వారు పెళ్లి అయిన వారు మోచేతికి కిందచేతి నిండా బల్యా ధరించుతారు. వీటికి ముందు భాగంలో మణికట్టు దగ్గర బోదులు, లేక కోల్‌డా అనగా వెండి కడియం వేసుకొంటారు.

వీరు వారి అందమును ప్రదర్శించుటకు మోచేతి దగ్గర మందంగా లావుగా కసోటియా అని వేసుకుంటారు. ఇది రంగురంగుల దారంతో సీసంతో పోసిన గజరా అనువాటిని కుట్టి వాటికి రెండు వైపులా గవ్వలను కుట్టి కిందికి సుమారు ఒక అడుగు పొడవు వేలాడుతూ పూలకుచ్చులుగా అందంగా ఉంటాయి. ఇది వారు పెళ్ళిల్లలోను, వేరే గ్రామాలకు ప్రయాణమై పోయినప్పుడు వేసుకొని ఉంటారు.

ఈ విధంగా ప్రతి బంజారా స్త్రీ సుమారు 14 కేజీల వరకు బరువు మోసుకొని ఎటువంటి ఇబ్బందిని శ్రమను కనిపించకుండా ధరించి ఉందురు.

ఇంత భద్రముగా తన అందమును దాచి ఉంచినను ఇంగ్లీషువాళ్ళు వచ్చిన తరువాత వారు కూడా బంజారా స్త్రీలను చెరపట్టటం జరిగినది. వారి నుండి కాపాడుటకు బంజారా స్త్రీలు ముఖమునకు రెండువైపులా నొసటి దగ్గర, గడ్డమునకు చిన్ని చిన్న చుక్కలుగా పచ్చపొడిపించుకొనుట జరిగినది. చేతులకు కాళ్లకు కూడా పచ్చపొడిపించడం జరిగినది. ఎందుకనగా ఇంగ్లీషువారికి పచ్చ అంటే గిట్టదు. ఈ విధంగా బంజారా స్త్రీలు కొన్ని శతాబ్దాల నుండి తమ గౌరవమును కాపాడుకొంటూ వచ్చారు.

ఆధార గ్రంథాలు :

1) బంజారా చరిత్ర (సంస్కృతి-ప్రగతి) - బి. చీనియా నాయక్
2) భారతీయ గిరిజనులు - నదీం హస్‌నైన్

గిరిజనుల వివాహ పద్ధతులు

– భూక్య జ్యోతి, తెలుగు అధ్యాపకులు, యస్.ఎల్.యన్. డిగ్రీ కళాశాల, దువ్వూరు.

ఆదిమ మానవజాతి నుండి నేటి ఆధునిక మానవుని దాకా మనుషులు అనేక తెగలుగా వర్గాలుగా ఏర్పడి జీవించారు. ఈ వర్గాల వారు ఆయా ప్రాంతాలకు అనుగుణంగా తమ వేష, భాష, ఆచార, సాంప్రదాయాలను విభిన్నంగా సృష్టించుకొని జీవిస్తూ ఒక సంస్కృతిని సృష్టించుకొన్నారు. అలాగే ఉపఖండమైన భారతదేశంలో కూడా ఆర్యులు, ద్రావిడులు తమ సంస్కృతిని చాలా గొప్పగా నిర్మించుకుంటూ ఐక్యమత్యంతో మెలుగుతున్నారు. ఇందులో ఇండో ఆర్యన్ భాషా కుటుంబానికి చెందిన రాజస్థాని ఉపశాఖకు చెందిన సుగాలీ భాషా వ్యవహర్తులు ఆనాదిగా భారతదేశంలోనే జీవిస్తూ తమ ఉనికి కాపాడుతున్నారు.

మానవ సమాజంలో కుటుంబం, వివాహం అతి ముఖ్యమైన ప్రాచీన సామాజిక సంస్థలుగా గుర్తించ బడ్డాయి. సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించడానికి, లైంగిక నడవడికను నియంత్రించడానికి ఇవి రెండూ చాలా అవసరం. సామూహిక, వైయక్తిక, నైతిక విలువల్ని వివాహ వ్యవస్త సంరక్షిస్తుంది. సుగాలీలు జీవితంలో పెళ్లికి ఎక్కువ ఇతర గోత్రాల వారిని వివాహం చేసుకోవాల్సిందే. గోత్రాలను పరిశీలించిన తర్వాత, తమకు కావల్సిన అమ్మాయి ఇంటికి నేరుగా వెళ్లకుండా, ముందు అమ్మాయికి చెందిన తండా నాయకునింటికి వెళ్ళి రాం, రాం అని చెప్పి పరిచయం చేసుకుంటారు. తర్వాత తండా నాయకుని అనుమతితో అమ్మాయి ఇంటికి వెళతారు. ఇరువర్గాల కుటుంబపరిస్థితులు, ఆస్తిపాస్తులు పరిశీలించుకుని, బ్రాహ్మణుని సంప్రదించి జాతకాలు చూసుకొని పెళ్లికి మూహుర్తం నిర్ణయించుకుంటారు. తర్వాత తాంబూలాలు పుచ్చుకుంటారు. దీనినే 'సగాయిర్ నొక్తా' అంటారు.

సగాయి :

తాంబులాలు ఇచ్చి పుచ్చుకోవడాన్ని సగాయి అంటారు. మగ పెళ్ళివారు తమ బంధువులు మిత్రులు మరియు తాండే పెద్దలను తీసుకొని పెళ్ళికూతురు ఇంటికి వెళతారు. మగపెళ్ళివారు పెళ్ళి కుమార్తె తల్లి దండ్రులు, బంధువులు మరియు పెళ్ళి కుమార్తె ఊరి పెద్దలను పిలుచుకొని సాయంకాలం వేళల్లో ఊరి బయట విశాలమైన ప్రదేశంలో ఇరు వర్గాల వారు అందరూ కూర్చోని తాండా నాయకులు లేక ఇతర పెద్దల చేత కార్యక్రమం చేయడానికి సన్నదపరుస్తారు. ఇందుకోసం బెల్లం, ఆకువక్క, బీడీలు, సారాయి మరియు పసుపు రంగు నీళ్ళు తీసుకువచ్చి అందరూ వలయాకారంలో కూర్చుంటారు. తీసుకువచ్చిన ఒక్కొ వస్తువులని ఒక వ్యక్తి మొదట ఊరి పెద్దమనిషి అంటే "నాయక్"తో మొదట ఇచ్చుకుంటూ అందరికి పంచుతారు. ఆ వ్యక్తి ఒక్కో వస్తువుకి ఇచ్చుకుంటూ పోతూవుంటే "అంగ్‌లో" "అంగ్‌లో" అని చెబుతారు. (అంగ్‌లో అంగ్‌లో అంటే ముందు వారికి ఇవ్వు అని అర్థం. ఈ కార్యక్రమం పూర్తి అయిన తరువాత అందరూ పసుపు రంగు చల్లుకుంటారు. ఇలా సంబంధం కుదుర్చుకుంటారు.

వదాయి :

"వదాయి" అంటే పెళ్ళి ముందు పెళ్ళికుమారుడు ఇంట్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. వారి భాషలో పదాయి అంటే "పెరగటం" అని అర్థం. మగపిల్లవారు పెరిగి పెద్దవాడై వైవాహిక జీవితంలో అడుగు పెట్టడానికి పితృ దేవతలు అనుమతి కొరుతూ ఈ కార్యక్రమం చేస్తారు. తండా నాయకుడు, సూదిని ఎర్రగా కాల్చి వరుని కుడి భుజంపై గుర్తుపెట్టి తరువాత అతని తమ్ముడు అంటే అతనికి గుర్తు పెడతారు. తమ్ముడు లేకపోతే గోనెసంచికి గుర్తు పెడతారు. తరువాత రెండు మేకపోతులను బలి

ఇచ్చిఆ మాంసాన్ని ఉప్పు లేకుండా వండుతారు. దానికి తోడు "బోటి" రాగిపిండి లేక సజ్జల రొట్టె తయారు చేస్తారు. ఆ మాంసాన్ని మరియు రొట్టెలను మొదట పితృ దేవతలకు పెడతారు ఆ తరువాత ఊరి పెద్ద మనుషులకు బంధువులకు పంచి పెడతారు. అలా పదాయి పూర్తి చేస్తారు.

"హయ" అంటే పెళ్ళి :

ఈ కార్యక్రమం మాత్రం హిందూ సాంప్రదాయం ప్రకారం పండితులను అడిగి పెళ్ళి తేదీలను ఖారురు చేస్తారు. ఇద్దరి పెళ్ళి కుమారుడు మరియు పెళ్ళి కుమార్తె పేరు ఫలాల ప్రకారం తేదీలను ఖారారు చేసి పెళ్ళి మూహుర్తం నిర్ణయిస్తారు. పెళ్ళి ముందు రోజు పెళ్ళి కుమారుడు మరియు పెళ్ళి కుమార్తెలకు వక్క (తాంబులం) ఇచ్చి తాండాలో అందరికి కాళ్ళకు నమస్కరించి ఆహ్వానిస్తారు. ఆ తరువాత పెళ్ళి మూహుర్తంలో వివాహం నిర్వహిస్తారు.

వివాహం అయిన తరువాత అప్పగింతల కార్యక్రమం నిర్వహిస్తారు.

డాలో :

పెళ్ళికి వారం రోజుల ముందు నుండి తాండాలోని స్త్రీలందరూ కలిసి వధువుకి పంపక సమయంలో ఏడ్చే విధానాన్ని నేర్పిస్తారు. దీన్నే "డాలో" అంటారు.

ఈ కార్యక్రమంలో వధువు తన పుట్టింటి బాల్యాన్ని తల్లిదండ్రుల ప్రేమానురాగాలను తలుచుకొని దు:ఖించే విధం తాండాలోని అందరికి కంటనీరు తెప్పిస్తుంది. ఆడ పుట్టుక పుట్టిన తరువాత అత్తవారింటికి వెళ్ళవలసిందేనని వధువు నిశ్చయించుకోని పుట్టింటి వారు క్షేమంగా వుండాలని కోరుకుంటుంది. వధువురాలు పెద్దలకు నమస్కారం చేసి తాంబూలం ఇచ్చి వారి నుంచి ఆశీర్వాదం తీసుకొని వరుని ఇంటికి బయలు దేరుతుంది.

గోట్ :

పెళ్ళి అయిన తరువాత "గోట్" అనే మాంసాహార విందును తండాలోని ప్రజలందరిని ఆహ్వానించి ఇస్తారు. ఈ కార్యక్రమానికి అయ్యే ఖర్చును వరుని తరుపువారే భరిస్తారు.

ఈ కార్యక్రమంలో మేకపోతును తెచ్చి బలిచ్చి దాని రక్తంలో "సోలి" వండుతారు. వండిన తరువాత తాండాలోని పెద్దమనుషులను పిలిపించి వారి సాంప్రదాయం ప్రకారం "బోటి, సోలి, సారాయి"ని వరుడు అందరికి పంచి పెడతారు. వారి ఆశీర్వాదం తీసుకొంటాడు. తాండాలోని అందరిని పిలిచి భోజనం పెడతారు.

వితంతు పునర్వివాహం :

సుగాలీ సమాజంలో వితంతు పునర్వివాహం ఆచరణలో ఉంది. అయితే వితంతు వివాహం, సాధారణ వివాహ పద్ధతుల్లో నిర్వహించరు. వివాహం చేసుకునే వారిని ఒక చోట సమావేశపరచి, ఆ వితంతు స్త్రీని ముత్తైదువుగా అలంకరిస్తారు. బెల్లం, నెయ్యి, బియ్యప్పిండిలో చేసిన 'చుర్మో'ను వారికి తినిపిస్తారు. సాధారణంగా వితంతు స్త్రీని వివాహం చేసుకోవడానికి అవివాహిత పురుషులు ఇష్టపడనందువలన వితంతువులైన స్త్రీ, భార్య చనిపోయిన పురుషులకు వివాహం జరిపిస్తారు. ఈ వివాహన్ని 'భాంగ్ కరణ్ ఘూలేరో' అంటారు.

విడాకుల తర్వాత పునర్వివాహం :

భార్యభర్తలు విడిపోవడానికి సిద్ధపడిన తర్వాత గోర్ పంచాయితీని సంప్రదించి తండా నాయకుడు మరియు ఇతర పెద్దల ఆమోదంతో విడాకులు తీసుకుంటారు. సుగాలీ సమాజంలో స్త్రీ విడాకులు తీసుకున్న తర్వాత మరొక వ్యక్తిని వివాహం చేసుకొనవచ్చు. దీనినే సుగాలీలు 'ధనసానిన్ ఘులేరో' అంటారు.

ముగింపు :

గిరిజనులలో సుగాలీల/లంబాడీల వివాహ పద్ధతులు చాలా భిన్నంగా వుంటాయి. వివాహ వేడుకలు ప్రస్తుతానికి / పూర్వం అనేక మార్పులు జరిగాయి. పూర్వం సుగాలీల వివాహాలు వారం, పదిరోజులు జరిగేవి. కాని ప్రస్తుత కాలంలో హిందూ సాంప్రదాయం ప్రకారమే ఒకటి లేక

రెండు రోజుల పెళ్ళి జరుగుతున్నది. ఒకప్పుడు గిరిజనుల పెళ్ళి పండుగలా జరిగేది. అందరిని ఆహ్వానించి వైభవంగా జరిపేవారు. కాని ప్రస్తుత కాలంలో వారి బంధుమిత్రులతో కానిచ్చేస్తున్నారు. ప్రస్తుతకాలంలో సమయం, ధనం తగ్గించుకోనడానికి అందరూ ప్రయత్నిస్తున్నారు. మానవతా విలువలు తగ్గిపోతున్నాయి.

ఆధార గ్రంథాలు :

1. Socio-Cultural profile of tribal of Andhra Pradesh.
2. డా॥ శ్రీ బి. చిన్నయ్య నాయక్, వ్యాససంపుటిక.
3. డా॥ శ్రీ గొనే నాయక్, వ్యాససంపుటిక.
4. డా॥ శ్రీమతి బి. జ్యోతి, సుగాలీ మౌఖిక సాహిత్యం, వ్యాస సంపుటిక.

సంస్కృతి సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం – బంజారాలు

– కె. అశోక్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, రాజధాని కళాశాల (ప్రెసిడెన్సీ కాలేజి), చెన్నై, తమిళనాడు.

అనేక జాతులకు నిలయమైన భారత ఉపఖండంలో అనేక గిరిజన తెగలు నివసిస్తున్నాయి. గిరిజనులు తమదైన ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయం, సామాజిక విలువలను కలిగి ఉంటారు. గిరిజనులు నివసించే ముఖ్య రాష్ట్రాలు : ఒడిషా, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, మిజోరం, అండమాన్ నికోబార్ దీవులు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లో నివసిస్తున్న ఒక ముఖ్యమైన గిరిజన తెగ బంజారా. వారి సంస్కృతిని తెలుసుకోవడమే ఈ వ్యాసం.

బంజారాలు, సుగాలీలు, లంబాడాలు, ఇలా అనేక రకాలుగా పిలువబడే వీరు రాజస్థాన్‌కు చెందిన రాజవంశీయులు. వెయ్యేండ్ల క్రితం మహమ్మదీయుల అరాచకాలకు బలై దేశంలో నలుదిక్కులకు పోయి సంచార జీవులుగా జీవనం సాగిస్తున్నారు. అదే విధంగా బంజారాలు మంచి దైవభక్తులు కూడ.

నిజాం కాలం కంటే పూర్వం నుండే ఆదిమ గిరిజన లంబాడీలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఉన్నారు. నిజాం పరిపాలన కాలంలో లంబాడీలుగా ఉన్నారు. 1857 సిపాయిల తిరుగుబాటు కంటే ముందు నుండే లంబాడీ గిరిజనులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అడవులలో జీవనం కొనసాగిస్తున్నారు. ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం వాళ్ళు, వారి యొక్క దేశానికీ వెళ్ళడానికి రవాణాకు రైళ్లు వేయాలని, అడవిలో రైలు పట్టాలు వేయడానికి పనులు ప్రారంభించారు. గిరిజనులలో మూఢనమ్మకాలు ఎక్కువ కాబట్టి అప్పుడు కొంతమంది గిరిజన ప్రజలు బ్రిటిష్ వారిపై తిరగబడ్డారు. మా నివాసాలను మా అడవిని నాశనం చేయడానికి ఎవరో వచ్చారు అని భావించిన లంబాడి గిరిజనులు కొంతమంది బ్రిటిష్ వారిని చంపేశారు. ఈ మూఢనమ్మకాలు ప్రస్తుతం తండాలలో కూడా కనిపిస్తుంది. లంబాడీలు శారీకంగా భారీ మనుసులు. దృడమైన శరీరం కలిగి ఎత్తుగా ఉంటారు. వారిని చూసిన బ్రిటిష్ ప్రభుత్వం "long bodies" అని పేరు పెటింది. దీని నుండి లంబాడి అనే పేరు వచ్చింది.

భారతదేశం మొదలుకొని ప్రపంచవ్యాప్తంగా గిరిజనులు అమాయకులు. వారి పై ఎవరు దాడి చేసిన మా ప్రజలను, మా సమాజాన్ని నాశనం చేస్తారేమోనని పోరాడుతారు. ఈ సిద్ధాతం లంబాడి తెగ కూడా పాటించింది. ఆలా బ్రిటిష్ వారి నుండీ పారిపోయిన గిరిజనులు అడవులలో సంచార జీవనం కొనసాగించి, సంచార తెగగా లంబాడిలు పిలవపడుతున్నారు. ఒక లంబాడీలు మాత్రమే కాదు, ఏ తెగవారు ఐనాసరే ఆహారం, జీవన మనుగడ కోసం సంచరిస్తూనే ఉంటారు. ప్రస్తుతం తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లలో తండాలు, గూడాలు నిర్మించుకొని స్థిరనివాసం ఉంటూ వ్యవసాయం చేస్తున్నారు.

లంబాడీల సంస్కృతీ సంప్రదాయాలు, కట్టుబాట్లు ఎంతో గొప్పవైనవి, ప్రత్యేకమైనవి. "లంబాడీ" సుగాలీలు గిరిజనులలో 28వ తెగ. వీరినే లంబాడ, బంజారాలు అని కూడా అంటారు. హైదరాబాదులోని బంజారా హిల్స్ వీరి పూర్వీకులదేనని ఒక వాదన. వీరి నివాస ప్రాంతాలను తండాలు అంటారు. పూర్వం వరిచేలలో కుప్ప నూర్పిళ్ళప్పుడు ధాన్యం కల్లాలు తొక్కించటానికి ఆవుల్ని తోలుకొచ్చే వాళ్ళు. లంబాడీ భాషకు లిపి లేదు. 'సవర భాష' దీనికి కొంచెం దగ్గరగా ఉంటుందంటారు. ప్రస్తుత గిరిజన తెగలలో వీరు ప్రతేక తెగగా కనిపిస్తారు.

లంబాడీలలో పుట్టినప్పటి నుండీ చనిపోయేవరకు సంస్కృతీ సంప్రదాయాలు, కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు, జీవనవిధానం, పెళ్లి, చావు, అన్ని ప్రత్యేకమైనవే. వీరు గిరిజనులు కాబట్టి ఇన్ని అంశాలు ఉన్నాయి.

ప్రస్తుతం అభివృద్ధి పేరుతో వీరి సంస్కృతి, భాషా కనుమరుగవుతున్నాయి. వీరి సంసృతి సంప్రదాయాలను రక్షించడం అందరి బాధ్యత. తండాలో ఏ కార్యం జరిగినా పెళ్ళి, పుట్టుకలు, చావులు, పండుగలు అయినా సామూహికంగా తండా పెద్దలే జరిపించేవారు. పెళ్ళి అయితే ఆ తండాలో ఉన్న ప్రతి ఒక్కరూ కలిసిపోయే వారు. ఇంటిల్లిపాదీ భోజనం చేసేవారు. ప్రతి మనిషి తంతులో పాల్గొనాల్సిందే. పాటలతో లంబాడీలు తర తరాలుగా ఏడుగురు దేవతలను కొలుస్తారు. వారు మేరమ్మ, త్వళ్జ, సీత్ల, మంత్రల్, హింగ్ల, ధ్వాళ్ ఆంగళ్, కంకాళీ.

వర్షాలు కురవాలి, పంటలు బాగా పండాలి, పెళ్ళికాని అమ్మాయిలకు మంచి కాపురం దొరకాలి. సుఖ సంతోషా లతో అత్తగారి ఇంటికి వెళ్ళాలి, పంటలు పండేవిధంగా పచ్చగా కాపురం ఉండాలని మేరమ్మను కోరుకుంటారు. తీజ్ 9 రోజులు జరుపుకుంటారు. నవధాన్యాలు బుట్టలో వేసి మొలకతీస్తారు. ఏ మొలక బాగా వస్తుందో ఆ పంట వేసుకోవాలని తండాలో పెద్దలు నిర్ణయిస్తారు. శాస్త్రీయంగా విత్తనాలు వేసుకుంటారు. పంటలు పండిస్తారు. పండిన పంట ఇంటికి తీసుకొస్తే నవధాన్యాలు గుమ్మాలు, గాదెలు నిండే విధంగా ఉండాలని, కష్టాలు రాకుండా చూచుకోవాలని పూజిస్తారు. అల్లుళ్లు, బిడ్డలు చుట్టాలంతా రావాలని, కలుసుకోవాలని, కొడుకులకు, కోడళ్లకు పిల్లలు పుట్టాలని కుటుంబం సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటారు.

తండాలో ఉన్న పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు, పశుసంపద పెరగాలని, దూళ్ళకు పాలు సరిపోను ఉం డాలని, గడ్డి బాగా దొరకాలని, క్రూరమృగాల బారిన పడ కుండా ఉండాలని, అటవీ సంపద తరగకూడదని మొక్కులు తీర్చుకుంటారు. ఇతర ఊర్లలో ఉండే రోగాలు, కష్టాలు, జబ్బులు, గత్తెర లాంటివి తండాల పొలిమేర వరకు రాకూడదని శుభ్రం చేసుకుంటూ పూజి స్తారు. పుట్టే ప్రతి పిల్లతో పాటు తల్లి తండా ఆరోగ్యంగా ఉండాలని పుట్టిన ప్రతి వారు అన్ని విధాల దృఢంగా ఉండాలని తిండి, అలవాట్లు మెరుగుపర్చుకొని బిడ్డను కాపాడాలని మొక్కుకుంటారు. అడవిలో ఉండే పక్షులు, జంతువులు బాగుండాలని వన సంరక్షణలో జంతువులు కాపాడబడాలని పాలపిట్ట, పక్షి రోజు తండాకు కనబడి పోవాలని ఆరాధిస్తారు.

మానవునిపై, ధాన్యాలపై, పశు సంపదలపై ఎటు వంటి శత్రువుల దాడి, కుట్రలు జరగకుండా, దరిచేర కుండా ఉండేందుకు బాధ్యతగా చూసుకోవాలని మొక్కు కుంటారు లంబాడీలు. పెళ్ళి అయిన అమ్మాయిలకు ఒక తులం బంగారం ఒక కిలో వెండి 12 రూపాయి నాణేలతో దండ, కొంకుణాలు, చేతివేళ్ళకు మేరికలు, రైకలు, లంగాల నిండా అద్దాలు, గవ్వలు, తెల్లటి గాజులు చేతినిండా ఉండేవి. పెళ్ళి అయిన అమ్మాయి ఇంట్లోకి వస్తే లక్ష్మి వచ్చింది అనేది అనాడు లంబాడీల విశ్వాసం.

కొత్త పేర్లు, కొత్త రూపాల్లో పండుగలు తండాలలోకి ప్రవేశిస్తున్నాయి. తండా సంస్కృతిని ధ్వంసం చేయడం జరుగుతోంది. ఆర్థికంగా సామాజికంగా వీరిని మరింత ఇబ్బందుల్లో పడేసే విధంగా మూఢనమ్మకాలను నమ్మి స్తున్నారు. ఇదంతా వారి జీవన విధానాన్ని సహజీవనాన్ని ధ్వసం చేయడమే. గతంలో తండా పెద్దలు కూర్చొని ఏ కార్యం అయినా పండుగ అయినా పెళ్ళి అయినా పంచాయితీ అయినా సామూహికంగా పరిష్కరించుకునేది. కార్యం పూర్తి చేసేది. ఇప్పుడు అది లేకుండా పోయింది. తండా కట్టుబాట్లు అభివృద్ధి వైపు ఉండేవి. ఇప్పుడు బ్రాహ్మణీయ, పాశ్చాత్య సంస్కృతులు తండామీద పడు తున్నాయి. దీనితో వారి జీవన విధానం ఒక ప్రశ్నార్థకంగా మారింది. తండాపై ఇతర సంస్కృతులను రుద్దకుండా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

భారతదేశంలోని అనేక తెగలు, ప్రజల వస్త్రధారణలో అలంకరణలో లంబాడీ స్త్రీల వేషధారణనే ఆకర్షణీయంగా, అందంగా ఉంటుంది. ముఖ్యంగా అలంకరించుకొనే ఆభరణాలు ప్రాచీనతను ప్రతీకను సంతరించుకున్నాయి.

ఇప్పటికి నల్గొండ జిల్లాలోని అన్ని మండలాలలో లంబాడీల వేషధారణ దుస్తులు అలంకరణలు ఆచరణలో ఉన్నాయి. లంబాడీ పురుషులు వేషధారణలో ప్రత్యేకత ఏమీ లేదు. వారు ఆ కాలంలో ధరించే దుస్తులు మగ వాళ్లకు దోతి, ఖాది, అంగీ, తలకు 24 మూరల పెద్ద పెద్ద రుమాలు కట్టేవారు. భుజంమీద కండువా ధరించి చేతిలో చేతి కర్ర ఉండేది. చెవులకు బంగారు పోగులు, చేతికి వెండి కడియాలు ధరించేవారు. ఈ విధంగా నల్లగొండ జిల్లాలో ఇప్పటికీ ఆచరణలోనే ఉందని చెప్ప వచ్చు. లంబాడీ స్త్రీల దుస్తులు అందమైన కుట్టుపనులతో ఉంటాయి. అద్దాలు పొదిగించిన కాంచళి (రవిక), కుచ్చుల పేటియా (లంగా), అద్దాలు రూపాయి బిళ్లలతో తయారు చేసిన గుమ్‌టో (ముసుగు)ను ధరిస్తారు. లంబాడీ స్త్రీల ఆభరణాలు అందంగా ఉండటమే కాక బరువుగా కూడా వుంటాయి. వీరు ముక్కుకు భూరియా ముక్కెరను చెవులకు వివిధరకాల ములును, మెడలో హంస్‌లో గొలుసును, చేతులకు బలియ గాజులును వాంక్ డీ కడియాలును, చేతి వేళ్లకు చాస్ నగిషి కలిగినవి చల్లా నగిషిలేని మొదలైన ఉంగరాలను ధరిస్తారు. లంబాడీల్లోని సాంప్రదాయక ఆభరణాలు ఈనాడు మార్పులు ఎన్నో లోనవుతున్నాయి. ఆధునిక కాలంలోని నాగరిక ప్రభావంతో ఈ నగలన్ని అంతరించి పోతున్నాయి.

గాతే హంస్ కాంచళి గుగ్రో
గుంగ్‌టో బళియా డోరి వాంక్‌డీ

లంబాడీ ప్రజలలో ఇప్పుడు పాత ఆచారాలు పోయి కొంతవరకు దుస్తులలోను, పెళ్ళి సామ్ములలోను మను ష్యులలోను మార్పులు వచ్చాయి. అయినా లంబాడీలు మాట్లాడే భాషలలో మార్పురాలేదు. వారి గోత్రాలలో మార్పు రాలేదు. వారి గోత్రాలలో కొన్నికోడ్ నెంబర్లు ఉంటాయి. వారు వివాహాలువారి గోత్రాలకు వ్యతిరేఖ గోత్రాల తోనే పెళ్ళి చేసుకోవాలి. ఈ పెళ్ళి ఆచారాలను తెలుగు ప్రజలు చూసి లంబాడీ మానవుడు అని అంటారు. పెళ్ళి అయినవరు అత్తవారింటికి రావడం బహు అరుదు. ఈ లంబాడీలు ఏ ప్రదేశంలో ఉన్నా, ఏ ప్రాంతంలో ఉన్నా వరుసకు వీరు అన్నా చెల్లెలు అవుతారు. ఇలా ఎన్నో ఆచార కట్టుబాట్లు ఉన్న వీరికి ఆదేశాలు, పట్టుదల, పంతాలు కూడా ఎక్కువే. లంబాడీలు శిశువు జన్మించిన మూడవ రోజు లేదా ఏడవ రోజు పురుడు చేస్తుంటారు. పూర్వం తల్లికి పాపకు పసుపు, ఆవుపేడతో ఒళ్లు రుద్ది స్నానం చేయించేవారు. ఈ రోజు కూడా సబ్బులకు బదులు పశువుల పేడను ఉపయో గించడం కన్పిస్తుంది. ఆరోగ్యరీత్యా పరిశీలిస్తే పేడలో అమ్మోనియా, పసుపులో క్రిమిసంహారక శక్తి ఉందని విజ్ఞాన శాస్త్రం తెలుపుతుంది.

పురిటిరోజే జలమాత పూజ చేస్తారు. దీనిని లంబాడీలు దళయాదోకావేరో అంటారు. ఇంటికి తూర్పు దిక్కున తీసిన గుంతలో నీటిని నింపుతారు. ఈ పూజా కార్యక్రమం తెలంగాణా స్త్రీలు 21వ రోజు సంతానం లేని స్త్రీలను బావి దగ్గరకు తీసుకొనిపోయి వీపుపై నీళ్లు కుమ్మరించే ఆచారంతోపోలి వుంటుంది. మూడు ఇత్తడి చెంబులను మరికొన్ని ప్రాంతాల్లో ఒకే చెంబును సున్నం, బొగ్గు, పసుపు బొట్లతో అలంకరిస్తారు. మొదటి చెంబులో పసుపు నీళ్లు నింపుతారు. దరిచేవని విశ్వసిస్తారు. అలంకరించిన చెంబులను ఐదేండ్లు దాటని ముగ్గురు బాలురతో ఇద్దరు బాలికలతో బాలింత తలపైన పెట్టిస్తారు. సౌభాగ్యవతులు బియ్యాన్ని లేదా మొక్కజొన్నలను అక్షింతలు చల్లుతూ, చ్వారికి, చోరా, చ్వారికి, చోరా అని పాడుతూ చెంబులను గుంత దగ్గర నింపుతారు. సన్ సుతిలిసువోలేన్ వర్ అయేస్ అంటూ పాటలను పాడుతారు. ఆడపిల్లలకైతే సూధి దారం తీసుకొనివెళ్లు, మగపిల్లాడికైతే జనుం, సుత్తి, డబ్బనం తీసుకొని వచ్చేయి. అని ఈ పాట అర్థం (జనప నారతో చేసిన సన్నటి తాడును సుతిలి అని, గోనో సంచిని కుట్టే సూధిని డబ్బనం అని అంటారు) ఈ పాటలో లంబాడీల జీవిత విధానం ప్రతిబింబిస్తుంది. లంబాడీ స్త్రీలు కనువిందును కలిగించే కళాత్మకమైన దుస్తులను కుట్టడంలో నేర్పరులు. కాంచలి (రవిక) గాగ్రా (పరికిణి)

కుట్టడం నేర్చుకున్న తరువాతనే ఆడపిల్లలకు పెళ్ళి చేస్తారు. ఆకంచలి అంటే అద్దాలతో కుట్టిన రవిక, గాగ్రా అంటే పరికిణి, అందుకేఆడల్లిలకు ఉపకరించే కుట్టు పరికరాలను కానుకలుగా సమర్పించడం.పుట్టిన బిడ్డలకు మొదటిసారి తలవెంట్రుకలను తీయడాన్ని లంబాడీ భాషలో లట్టాకాడేర్ అని అంటారు. లంబాడీల్లో ఒక్కరికే కాకుండా జంటగా పుట్టు వెండ్రుకలు తీయడం ఆచారం, ఒక్కరికే తీయవలసి వచ్చినపుడు పక్కన ఓక్రాను పెడ తారు. ఓక్రా అంటే చిన్న గోనె సంచిలో మెత్తని గడ్డి నింపి కుట్టిన దిండు లంబాడీలు సామాన్యంగా తుల్జాభవాని దేవత ఎదుట వెంట్రుకలను తీస్తుంటారు. ఒకవేళ బాలాజీ భగవానునికి గానీ, వేముల వాడ రాజన్నదేవునికి గానీ మొక్కుకున్నట్ల యితే రెండు పిలకలుంచుతారు. లంబాడీల్లో ఋతుమతి అయిన అమ్మాయిలకు ప్రత్యేక ఉత్సావాలు చేయరు. అయితే ఈ రోజుల్లో కొంతమంది లంబాడీలు తెలుగువారి సంస్కృతి ప్రభావంతో ఉత్సవాన్ని జరుపుకుంటున్నారు.

వీరి వేషధారణలో, స్త్రీలు ప్రత్యేకమైన దుస్తుల్ని ధరి స్తారు. లంబాడీలను చూచిన వారికి వారి వేషధారణ విదితమే. వీరు తెలంగాణా ప్రాంతంలో ఎక్కువగా వున్నా, ఆంధ్రప్రదేశ్లో కూడా వున్నారు. స్త్రీలు న ృత్యం చేస్తారు. వీరి న ృత్యంలో ముఖ్యంగా చేతులు చూపించటం, వలయా కారంగా తిరగటం చేస్తారు. ఈ న ృత్యాన్ని స్త్రీ పురుషులిరువురు కలిసే చేస్తారు. ఒక పురుషుడు ప్రత్యేకంగా డప్పు కొడతాడు. డప్పు వరుసలకు అను కూలంగా స్త్రీలు రక రకాల అడుగులు వేస్తూ గుండ్రంగా తిరుగుతారు. వీరి నృత్య బృందంలో 10 మంది వరకూ పాల్గొంటారు. వారి సంప్రదాయ దుస్తుల్ని ధరిస్తారు. కాళ్ళకు గజ్జెలు కడతారు. చప్పట్లు చరుస్తూ వలయా కారంగా శబ్దానికి అనుగుణంగా నృత్యం చేస్తారు. లయ ప్రకారం చప్పట్లు చరుస్తూ వుంటే మిగతా వారు పాటలను ఆలాపిస్తారు. వీరి పాటలన్నీ వారి గురువైన "సేవలాల్ మీదనే పాడతారు. ప్రధమంగా అందరూ నిలబడి ముందుకు వంగి చేతులతో చప్పట్లు కొడుతూ ఈ విధంగా పాడతారు.

కోయినారియే కోచళో సోసో
కోయినారియే కూణిన చోడో
కోయినారియే శంక్రనచోడో
కోయినారియే కాయ్ అంకుదీచ
కోయినారితే రవియ్యదీచ

అంటూ గిర్రున తిరిగి శరీరాన్ని క్రిందికి పైకి వంచుతూ లేస్తూ చేతుల్ని పైకెత్తి చప్పట్లు కొడుతూ గుండ్రంగా తిరుగుతూ అదే సమయంలో పాడే పాటను ఒకరు పాడుతుండగా, మిగిలిన వారంతా ఈ విధంగా వంత పాడతారు.

బాలే పెంచనే వెంటాపర్ రెడి బోలిరీచ
రెడి బోలరీచక్ జినండేకరేచ
సావుకార్ భీకియ్యార్ రోరలూటోరేచ
బాయే పెంచనే వెంటాపర్ రెడి బోలిరేచ
రెడి బోలిరీచక్ జనండేకరేచ
సావుకార్ హనుమంత రెడ్డిర్ చోర లూటోరేచ

అంటూ పాటలు పాడుతూ నృత్యం చేస్తారు.

ఈవిధంగా గిరిజన సంస్కృతిలో ఒక ప్రత్యేకతను కలిగిన బంజారాలు నేడు అభివృద్ధి పేరుతో తమ సంస్కృతి సాంప్రదాయాలకు దూరమవుతున్నారు. ఇకనైనా బంజారా సంస్కృతిని, సాహిత్యాన్ని ప్రతి ఒక్కరూ కాపాడ వలసిన బాధ్యత వున్నది.

ఆధార గ్రంథాలు :

1. బంజార చరిత్ర - బి. చీనియా నాయక్
2. బంజార పండుగలు సాహిత్యం - హంసావత్ నాగేంద్ర

అడవి బిడ్డల నాగోబ జాతర – సాహిత్య సాంస్కృతికాంశాలు

- కె. గంగాధర్
పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.

- కె. సరిత
పరిశోధక విద్యార్థిని, తెలుగు విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.

నాగోభా జాతర ప్రపంచంలోని అతి పెద్ద గిరిజన జాతరలో ఒకటిగా చెప్పవచ్చు. సర్పజాతిని పూజించడమే ఈ పండుగ ముఖ్య ఉద్దేశ్యము. అమావాస్య రోజున తమ ఆరాధ్య దైవమైన నాగోబా (శేషనారాయణమూర్తి) పురి విప్పి నాట్యమాడుతాడని ఈ గిరిజనుల నమ్మకం. ఈ రోజున సరిగ్గా సాయంత్రం ఏడుగంటల నుండి రాత్రి పన్నెండు గంటల మధ్య కాలంలో గిరిజన పూజారులకు తను ఆరాధ్య దైవం ఆదిశేషువు కనిపిస్తాడని, వారందించే పాలు తాగి ఆశీర్వదించి అదృశ్యమవుతాడని గిరిజనులు విశ్వసిస్తారు. అదిమ గిరిజనుల్లో మెస్రం వంశీయుల (గోండుల) ఆరాధ్యదైవం నాగోబా. ఈ నాగోబా దేవాలయం ఆదిలాబాద్‌కు 40 కిలో మీటర్ల దూరంలో ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ దగ్గర కెస్లాపూర్ గ్రామంలో ఉంది. కెస్లాపూర్ జనాభా అతి తక్కువ కాని పండగనాడు లక్షలాది మందితో అది జనారాణ్యంగా మారుతుంది. ప్రతి సంవత్సరం పుష్యమాస అమావాస్య రోజున ఈ జాతర ప్రారంభమవుతుంది. జనవరి 25 నుంచి 29 వరకు నాలుగు రోజుల పాటు గిరిజనులు ఈ పండుగను జరుపుకుంటారు.

తెలుగు రాష్ట్రాలతో పాటు, ఒడిశా, చత్తీస్‌ఘడ్, మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర నుండి భారీ సంఖ్యలో వచ్చే గిరిజనులతో కళకళలాడిపోతుంటుంది. ఇది దేశంలోనే అతి పెద్ద గిరిజన జాతర. ఈ పూజలు ఒకే వంశస్తుల చేతుల మీదుగా జరగడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. ఆదివాసీ తెగల్లో గొండు, ప్రదాన్ సమాజానికి చెందిన మెస్రం వంశీయుల్లో బాయిగోతా అనే విభాగానికి చెందినవారు పూజలు చేస్తారు. మెస్రం వంశానికి చెందిన ఏడుగురు అన్నదమ్ములు వూరు విడిచి పశువుల పాకలో మకాం పెట్టారట. 12 సం॥ల పాటు అక్కడే వుండి ఏవో పనులు చేసుకుంటూ డబ్బు సంపాదించారు. తిరిగి కెస్లాపూర్ వెళ్లాలని నిర్ణయించుకుని దార్లో ఉన్న మేనమామ ఇంటికి వెళ్ళారు. కష్టాల్లో ఉన్నప్పుడు సాయం చేయలేదనే కోపంతో తన తండ్రిని చంపడానికే వాళ్ళు వచ్చారేమో అనుకంటుంది మేనమామ కూతురు ఇంద్రాదేవి. అందుకే పెద్దపులిగా మారి ఆరుగురు అన్నదమ్ముల్ని చంపేస్తుంది. ఆఖరి వాడు మాత్రం నాగేంద్రుడిని వేడుకోవడంతో ప్రాణాలతో బయటపడి కెస్లాపూర్ చేరుకుంటాడు. తనను కాపాడి నాగదేవతను గ్రామంలో కొలువుతీరాలని వేడుకుంటాడు. అలా 550 సం॥లు కిందట అక్కడ వెలసిన నాగోభా తనతో పాటు 16 ఆడ, 18 మగ విగ్రహాలను ప్రతిష్టించి మేస్రం వంశీయుల్లో బోయగొట్టే వారు పూజలు చేయాలని ఆదేశిస్తుంది. నాగోభ ఆజ్ఞ ప్రకారం ఈ గిరిజనులు 125 గ్రామాలను సందర్శించి స్థానికంగా ఉన్న హస్తిన మడుగులో స్నానమాచరించి ఏటా పుష్య అమావాస్య రోజున అభిషేకం చేసి, ఏడు రకాల నైవేద్యాలు సమర్పించడం ఆనవాయితిగా మారింది. పూర్వం మెస్రం కుటుంబానికి చెందిన నాగాయి మోతి రాణికి నాగేంద్రుడు కలలోకి వచ్చి సర్పరూపంలో ఆమె గర్భాన జన్మిస్థానని చెప్పాడట. అలా పుట్టిన నాగేంద్రుడికి తమ్ముడి కూతురు అయిన గౌరితో వివాహం జరిపిస్తుంది. మోతిరాణి, అత్త ఆజ్ఞ ప్రకారం గౌరి తన భర్త నాగేంద్రుడిని బుట్టలో పెట్టుకొని, గోదావరిలో స్నానానికి వెళ్లగా నాగేంద్రుడు మనిషిగా మారాడట, అప్పుడు భార్యను పేరు ప్రతిష్టలు కావాలో, సంప్రదాయాలు కావాలో తేల్చుకోమనగా ఆమె సంప్రదాయాలనులెక్క చేయకపోవడంతో

నాగేంద్రుడు పొలిమేర గుట్టలోకి వెళ్లిపోయి అక్కడ నాగోబా వెలిశాడంటారు.

నాగోబా, కేస్లాపురత పేన్ అంద్
నాగోబామాక్ చొకట్ మందన
మారిమియడ్ చోకట్ మందన
పంట, పొలం చొక్కట్ మందన

జాతర ప్రారంభానికి ముందు పుష్యపౌర్ణమి రోజున మెస్రం వంశీయులు ప్రత్యేక పూజలు చేస్తారు. ఆ పూజలకు అవసరమయ్యే మట్టికుండల్ని కూడా తరతరాలుగా ఒకే వంశస్థులు చెయ్యడం ఆచారంగా వస్తోంది. తర్వాత మెస్రం వంశస్థులు వారం రోజుల పాటు జాతర ప్రచారం నిర్వహించి గంగాజలం కోసం కేస్లాపూర్ నుండి బయలు దేరుతారు. కాలినడకన 125 కిలోమీటర్లు దూరం ప్రయాణించి జన్నారం మండలం కాలమడుగు గ్రామ సమీపంలోని హస్తి మడుగులోని నీటిని ఓ కళశంలో నింపుకొని తీసుకొచ్చి గ్రామ శివారులోని మర్రిచెట్లకింద బస చేస్తారు. అక్కడే మెస్రం వంశీయుల్లోని 22 తెగల్లో స్వర్గస్తులైన పితృదేవతలకు కర్మకాండ పూజలు నిర్వహిస్తారు.

సూడ అవ్వల్, విజ్జ పీస్సివాతోం
జైజై కార్ సీం
చోకట్ పంట ఆయన
బత్తయ్ డువ్వల్ తరస్ సిలెవెర్రమన్వ
కేడ, కొడి వెలిమర్ మంత
మాక్ చొకట్ యిరన
కైకాల్కు చోకట్ యిరన.

అనంతరం డోలు, సన్నాయిలు వాయిస్తూ నాగోబా ఆలయానికి బయలుదేరతారు. నాగోబా జాతర సమయంలో చేసే పూజల్లో మెస్రం వంశ ఆడపడుచులు అల్లుళ్ళకు ప్రత్యేక స్థానం ఉంటుంది. ఆలయంలో పుట్ట తయారు చేసే మట్టిని బేకు కర్రతో అల్లుళ్ళు తవ్వితే, ఆడపడుచులు పురాతన బావి నుంచి తీసుకొచ్చిన నీటితో మట్టిని మెత్తగా వేసి పుట్టలా చేస్తారు. వీటికి పూజారి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆడపడుచులు చేసిన పుట్ట ఐదు రోజుల పాటు పగలకుండా ఉంటే ఆ ఏడాది పంటలు బాగా పండుతాయని, తల్లిదండ్రులు, తోబుట్టిన వారు బాగుంటారనేది వారి నమ్మకం జాతర సమయంలో 22 తెగలకు చెందిన కొత్త కొడళ్ళందరికీ కులదేవతను పరిచయంచేసి మొక్కులు తీర్చడం, కులపెద్దలను పరిచయం చెయ్యడం మరో ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో పాల్గొనే వరకు కోడళ్ళు నాగోబాను పూజించకూడదనే నియమం ఉంది. చివరగా ఆటపాటలతో, కర్రసాముతో, సంప్రదాయ నృత్యాలతో వేడుకను ముగిస్తారు. ఈ పూజలతో పాటు ఏటా అక్కడ ఏర్పాటు చేసే దర్బార్‌కు ఎంతో విశిష్టత ఉంది. దీనికి రాష్ట్ర మంత్రులతో పాటు, జిల్లా కలెక్టర్ ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా హాజరవుతారు.

గిరిజనులు తాము ఎదుర్కొంటున్న సమస్యల వినతి పత్రాలను అందచేస్తే అధికారులు వాటిని అక్కడికక్కడే పరిష్కరిస్తారు. ఇంగ్లండ్‌కు చెందిన మానవ పరిణామ శాస్త్రవేత్త హైమన్‌డార్ఫ్ 1946లో ఈ ప్రజాదర్బార్‌కు శ్రీకారం చుట్టారు. అప్పటి నుండి ప్రభుత్వం దీన్ని ఆచారంగా పెద్ద పండుగలా నిర్వహిస్తుంది.

ఉపయుక్త గ్రంథాలు :

1. ఆదివాసి గొంతుక - మాస పత్రి
2. రాజ్‌గొండుల సంస్కృతి - హైమన్‌డార్ఫ్
3. తెలంగాణ చరిత్ర సంస్కృతి - తెలుగు అకాడమి.

గిరిజనుల ఆర్థిక పరిస్థితులు – జీవన విధానం

– కనపాల జోసఫ్, శాఖాధిపతి, తెలుగు విభాగం, ఆంధ్ర క్రైస్తవ కళాశాల, గుంటూరు.

అభివృద్ధి సాధారణంగా మార్పు యొక్క ఒక అంశంగా భావించబడుతుంది. ఇది విస్తృతంగా ప్రభుత్వ చర్య ద్వారా ప్రణాళిక చేయబడింది మరియు నిర్వహించబడుతుంది. ఈ విధంగా, అభివృద్ధి, భావన(ఎ) మార్పు యొక్క ఒక అంశం; (బి) ఒక ప్రణాళిక లేదు ఫ్రిడిక్షన్; (సి) ఆ ప్రణాళిక సాధించినందుకు ప్రభుత్వ ప్రమేయం లేదా goal హించిన లక్ష్యం. "అభివృద్ధి" అనే పదాన్ని అనుమతించే ప్రక్రియ కోసం కూడా ఉపయోగిస్తారు. వారి స్వంత ఆకాంక్షలను తీర్చడానికి ప్రజలను ప్రోత్సహిస్తుంది. అందు వల్ల ఇది తప్పనిసరిగా సంబంధం కలిగి వుంటుంది.

"అభివృద్ధి"అనే పదం మానవ కార్యకలాపాల యొక్క అన్ని అంశాలను కలిగి ఉంటుంది. ఇంకా విస్తృత సందర్భంలో, దేశాలు అభివృద్ధి చెందినవి లేదా అభివృద్ధి చెందుతున్నవిగా నిర్వహించబడ్డాయి. కానీ దాని ఎలా సమర్థించవచ్చు ఒకటి అభివృద్ధి చెందాల్సిన వారి కంటే అభివృద్ధి చెందింది. ఈ ప్రశ్నలు ఉన్నాయి ఈ రోజుల్లో కొన్ని గోళాలలో అభివృద్ధి చెందని వాటిని కనుగొన్నప్పుడు లేదా చాలా సున్నితంగా మారుతుంది. మరొకటి ప్రతి చోటా, ఉదాహరణకు, ఒక సమాజం లేదా దేశం మరింత అభివృద్ధి చెందవచ్చు. ఆర్థికముందు; ఏదేమైనా, ఇది సామాజిక ముందు అభివృద్ధి చెందకపోవచ్చు. కాబట్టి, ఒకరు చేయలేరు. కొన్ని అంశాలలో మాత్రమే అభివృద్ధిని నిర్వచించండి; బదులుగా, దీనిని బహుమితీయంగా చూడాలి. యాభైలలో మరియు అరవైల ప్రారంభంలో ఉన్న అభివృద్ధి యొక్క ఇరుకైనా భావన తీవ్రంగా ప్రశ్నించ బడింది మరియు ఆర్థికేతర అంశాలను కూడా చేర్చడానికి విస్తరించింది.

భారతదేశంలో విధాన రూపకర్తలు, నిర్వాహకులు మరియు సామాజిక శాస్త్రవేత్తలు మరియు చర్చను అడ్డుకున్నారు. వారి సామాజిక - ఆర్థిక పరివర్తన యొక్క అర్థం, పాత్ర మరియు దిశపై కొనసాగుతుంది. అంతకు ముందు మానవ శాస్త్రవేత్తలు మరియు ఇతర సామాజిక శాస్త్రవేత్తలు జరిపిన అధ్యయనాలు వివిధ గిరిజన వర్గాలలో నిరంతరం వివిధ సమస్యలకు ఎత్తి చూపారు. గిరిజన అభివృద్ధి మరియు మంచి ఫలితాలను తీసుకు రావడానికి సూచనలు ఇచ్చింది. కమిటీల నివేదికలు మరియు గిరిజన అభివృద్ధిపై అధ్యయనాలు, ప్రయత్నాలు తరువాత జరిగాయి వివిధ రకాల నిబంధనలను అందిచడం ద్వారా గిరిజన పరిస్థితిని మెరుగుపరచడానికి మరియు పథకాలు అయినప్పటికి, దురదృష్టవశాత్తు, గిరిజనులు తగినంతగా పొందలేకపోయారు ప్రణాళిక బద్ధమైన అభివృద్ధి యొక్క ఈ ప్రక్రియ నుండి ప్రయోజనం. గిరిజన అభివృద్ధి అనేది నిజం దేశంలో సమస్యను మూసపోత దృగ్విషయంగా పరిగణించలేము. ఇది మారుతుంది ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మరియు మొత్తం దేశంలో గిరిజన జనాభా ఉంది. తీవ్రమైన ఆర్థిక మినహాయింపును ఎదుర్కొంటున్న అత్యంత అణగారిన మరియు హాని కలిగించే సంఘం. కొన్ని రాజ్యంగ భద్రతలు అందించినప్పటికీ, ఆర్థికంగా లేదు. ఈ సమాజాలలో సామాజిక మరియు రాజకీయ చైతన్యం. షెడ్యూల్ కులాలకు విరుద్ధం మరియు ఇతర వెనుకబడిన కులాల కారణంగా కొంత స్థాయిలో పురోగతి సాధించారు. ప్రభుత్వ రక్షణ వివక్ష విధానాస్త్రాలు,షెడ్యూల్డ్ తెగలు అలాగే ఉన్నాయి.

ఆంధ్ర ప్రదేశ్‌లోని గిరిజన సమూహాలు :

అధికారికంగా షెడ్యూల్డ్ తెగలుగా నియమించబడిన 35 వర్గాలకు ఆంధ్ర ప్రదేశ్ ఉంది. (ఎస్టీలకు)2001 జనాభా లెక్కల ప్రకారం వారి సంఖ్య 50,24,104.35

ఎస్టీలలో, ఇటీవల రెండు కమ్యూనిటీలు, అవి నక్కల/కుర్వికరన్, ధులియా / పైకో / పుటియా (జిల్లాల్లో విశాఖపట్నం మరియు విజయనగరం) రాష్ట్రంలో సూచించబడ్డాయి. పన్నెండు తెగలు, అవిబోడో గడాబా, గుటోబ్ గడాబా, బోండో పోరాజా, ఖొండ్ పోరాజా, పరంగి పెర్జా, చెంచు డొంగారియా ఖొండ్స్, కుట్టియా ఖండ్స్, కోలం, కొండారెడ్డిస్ కొండా సవారస్ మరియు తోటిని ఆదిమ గిరిజన సమూహాలు (పిటిజి)గా గుర్తించారు.

రాష్ట్రంలో అధికారికంగా గుర్తించబడిన షెడ్యూల్డ్ తెగ సమూహాల జాబితా

1. బగాటా (విశాఖపట్నం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలు)
2. భిల్ (శ్రీకాకుళం మరియు విజయనగరం జిలాల్లాల ఏజెన్సీ ప్రాంతాలు - ఉత్తర తీరం ప్రాంతం)
3. చెంచు (కర్నూలు, ప్రకాశం మరియు ఏజెన్సీ ప్రాంతాలు, గుంటూరు జిల్లాలు - నల్లమల అడువులు.
4. గదాబాస్, బోడో గడాబా, కల్లాయి, గడాబా, పరంగి గడాబా, కథెరా గడాబా, కపు గదాబ్ (విశాఖపట్నం జిల్లా ఏజెన్సీ ప్రాంతాలు - ఉత్తర తీరం ప్రాంతం)
5. గౌడు (పశ్చిమగోదావరి జిల్లాలు)
6. హిల్ రెడ్డిస్ (తూర్పు మరియు పశ్చిమగోదావరి జిల్లాలు)
7. జాతపస్ (శ్రీకాకుళం మరియు విజయనగరం జిల్లా ఏజెన్సీస్ ప్రాంతాలు - ఉత్తరం తీరం ప్రాంతం)
8. కమ్మారా (తూర్పు మరియు పశ్చిమ గోదావరి జిల్లాలు)
9. కొండా ధోరస్, కుబి (తూర్పు మరియు పశ్చిమ గోదావరి జిల్లాలు)
10. కొండా కపుస్(తూర్పు మరియు పశ్చిమ గోదావరి జిల్లాలు)
11. కొండా రెడ్డిస్ (తూర్పు మరియు పశ్చిమ గోదావరి జిల్లాలు)
12. కొండ్స్, కోడి, కొడు, దేశయ కొండ్స్, డోంగ్రియా కొండ్స్, కుట్టియా కొండ్స్, టికిరియా కొండ్స్, యెనిటీ కొండ్స్, కువింగా (నార్త్ కోస్టల్ ఏరియా యొక్క ఎజన్సీ ట్రాక్ట్స్)
13. కొటియా, బెంతో ఒరియా, బార్టికా, దులియా, హోల్లా, సాన్రోనా, సిధోపెకో (ఏజెన్సీ ట్రాక్ట్స్)
14. కోయ, డోలీ కోయా, గుత్తా కోయ, కమ్మారా కోయ, ముసర కోయ, ఒడ్డి కోయ, పత్తిడికోయ, రాజా, రాషా కోయ, లింగాధారి కోయ (సాధారణ), కొట్టు కోయ, టైన్‌కోయా, రాజ్ కోయ (తూర్పు మరియు పశ్చిమ గోదావరి జిల్లాలు)
15. కులియా (ఉత్తర తీర ప్రాంత ఏజెన్సీ ప్రాంతాలు)
16. మన్నాధోరా (ఖమ్మం)
17. ముఖధోరా, నూకా ధోరా (తూర్పు మరియు పశ్చిమ గోదావరి జిల్లాలు)
18. నాయకులు (ఏజెన్సీ ట్రాక్ట్స్ నార్త్ కోస్టల్ ఏరియాలో)
19. పోర్జా, పరంగి పెర్జా (విశాఖపట్నం జిల్లా మరియు ఉత్తర తీరంలోని ఏజెన్సీ ప్రాంతాలు ప్రాంతం)
20. రోనా, రెనా (నార్త్ కోస్టల్ ఏరియా యొక్క ఏజెన్సీ ప్రాంతాలు)
21. సవారస్, కాపు సవారస్, మాలియా సవారస్, ఖుట్టో నవారన్ (శ్రీకాకుళంలోని ఏజెన్సీ ప్రాంతాలు మరియు విజయనగరం జిల్లాలు - ఉత్తర తీర ప్రాంతం)
22. సుగాలిస్, లంబాదాస్, బంజారా (అదిలాబాద్, వరంగల్, నిజామాబాద్, ఖమ్మం)
23. వాల్మీకి (విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనాగ్రామ్, షెడ్యూల్డ్ ప్రాంతాలలో తూర్పు మరియు పశ్చిమ గోదావరి జిల్లాలు)

24. నక్కల కుర్వికరన్ (శ్రీకాకుళం మరియు విజయనగరం జిల్లాల ఏజెన్సీ ప్రాంతాలు - ఉత్తర తీర ప్రాంతం)
25. ధులియా, పైకో, పుటియా (విశాఖపట్నం మరియు విజయనగరం జిల్లాల్లో)

గిరిజనుల జీవనంలో పోడు సాగు :

కొండప్రాంతాలలో నివసిస్తున్న భారతదేశ గిరిజన వర్గాలు పొరుగు ప్రాంతాల కొండలపై అటవీ పాచెస్ కత్తిరించి కాల్చడం ద్వారా సాగు పద్ధతిని అనుసరిస్తాయి. 'పోడు', 'దహి' మరియు 'పమ్' వంటి వివిధ స్థానిక పదాలలో ఇది తెలుసు. ఆంగ్ల పత్రాలలో దీనిని స్వీడన్ లేదా స్లాష్ మరియు బర్న్ లేదా షిఫ్టింగ్ సాగు అంటారు. ఇది గిరిజన ఆర్థిక వ్యవస్థ యొక్క ఆసక్తికరమైన అంశం. ఈ పద్ధతి రెండు లేదా కనీసం మూడు వార్షిక పంటలను అనుమతిస్తుంది. మరియు రెండవ నింపడానికి అనుమతించటానికి చెట్టు మళ్ళీ తగినంతగా పెరిగే వరకు ఆ భూమిని వదిలివేస్తాయి. మట్టి మరియు విత్తనం లేకుండా భూమి కొట్టుకుపోయే వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. అటవీ వృద్ధి సాధ్యంకాదు. ఇది చివరకు వదిలేయబడుతుంది మరియు ముళ్ళు, లత మరియు ముతక గడ్డిని మాత్రమే ఉత్పత్తి చేసే ఏ ప్రయోజనం కోసం పనికిరాని కొండచిలువ ఉంది. తూర్పు కనుమల లోని కొండ గిరిజన రైతులు 'పోడు' సాగును ఆచరించే సంప్రదాయాన్ని కలిగిఉన్నారు.

పోడు భూములలో సాధారణంగా పండించే పంట రాగి, రెడ్‌గ్రామ్, ఛాంపు, ఖరాసా, జుడెంగా, కంగు, ఖోసాలా, హార్స్‌గ్రామ్, కాస్టర్, సుమా మరియు కొర్రా. ఎకరాల పోడు భూమిలో ప్రతి పంట సగటు దిగుబడి 15-20కిలోలు, , 8-10కిలోల కాయధాన్యాలు. మొత్తం యైల్డ్ 20-25 కిలోలు, మైదానాల్లోని లోతట్టు దేశంలో ఎకరానికి సగటు ఈల్డ్ 40-50కిలోలు. వాణిజ్య పంటలు సాధారణంగా కొండలపై పెరగవు కాబట్టి కొండపై ఉన్న పంట విలువ సమాన విస్తీర్ణంలో సాదావశంలో పండించిన దానిలో సగం ఉంటుంది.

పోడు సాగు చాలా కాలంగా సానుకూల చెడుగా పరగణించబడుతున్నప్పటికీ, దానిని పరిమితం చేయడానికి లేదా నిర్మూలించడానికి ప్రణాళికాబద్ధమైన ప్రయత్నం చేయలేదు. వ్యవసాయం, అడవులు మరియు వర్షపాతం యొక్క దృక్కోణాలకు పోడు సాగు హానికరం అని పాక్షికంగా Wxcluded ప్రాంతాల కోసం కమిటీ నిర్ణయించిన అభిప్రాయం. రాబోయే కాలంలో దీనిని పూర్తిగా తొలగించడానికి తీవ్రమైన ప్రయత్నాలు చేయాలి. ఈ ప్రయోజనం కోసం ప్రభుత్వం ఒక సీనియర్ సబ్-డిప్యూటీ కలెక్టర్ పర్యవేక్షణలో సంయుక్తంగా పనిచేస్తారు. ఈ అధికారులు పోడు సాగును పూర్తిగా ఎంపిక చేసిన ఒక చిన్న ప్రాంతంతో ప్రారంభించడానికి ఒక కార్యక్రమాన్ని రూపొందించాలి. వారు ఒక పోడును ప్రత్యేకంగా మరియు పాక్షికంగా జీవించే ప్రజల జనాభా గణనను తీసుకోవాలి మరియు పోడు సాగు కింద సూమారు ఎకరాలు. ఈ ప్రజలకు మొదటి ఐదేళ్ళకు అంచనా లేకుండా ఉచితంగా ఇవ్వవలసిన సాగు భూముల సగటును వారు సిఫార్సు చేయాలి. ఈ సాగు భూములను మైదాన ప్రాంతాలలో లేదా కొండల అడుగున ప్రారంభించాలి. సహకార సంఘాల ఏజెన్సీ ద్వారా లేదా గిరిజనులకు ఎద్దులు మరియు వ్యవసాయ పనిముట్లను అందించడానికి ఎస్టేట్ ద్వారా బకాయిలు వసూలు చేయడానికి అనువైన ఏ ఇతర ఏజెన్సీ ద్వారా వారికి రాయితీలు లేదా రుణాలు పొందటానికి చర్యలు తీసుకోవాలి. కొండ శిఖరాలపై అటవీ భూములను పరిరక్షించడానికి చట్టాలను ఉల్లంఘించిన నేరస్థులకు అపరాధ శిక్షను అందించడానికి అవసరమైన శాసన చట్టాలను ఆమోదించాలి.

డా. పి. రమేష్‌నారాయణ గారి "గిరిజన సంస్కృతి సాహిత్యం – ఒక పరామర్శ

– కనుమల మునిస్వామి, పరిశోధక విద్యార్థి, తెలుగు & తులనాత్మక సాహిత్యశాఖ, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురము.

భారతీయ సంస్కృతి ప్రపంచ దేశాల్లో తలమానికమై, తనదైన విశిష్ట నేపథ్యం కలిగివున్న సంస్కృతి. ప్రాచీన నాగరికతా కాలం నుండి వేలాది సంవత్సరాలుగా ఎన్నో ఒడిదుడుకులను అనుభవించినప్పటికీ తన అస్తిత్వాన్ని అది ఏనాడు కోల్పోలేదు. భారతీయ సంస్కృతి, సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని సంతరించుకున్న పలు అంశాల్లో ప్రముఖంగా తనదైన విలక్షణాలను, ప్రత్యేకతను కలిగివున్న ఒక అంశం గిరిజన సంస్కృతి.

భారతదేశంలో వేలాది సంవత్సరాలుగా పర్వత సానువులు, అరణ్యాలకు మాత్రమే పరిమితమైపోయి, నాగరిక ప్రపంచంతో సంబంధం ఏమాత్రం లేని మానవ సమూహాలు గిరిజనులు. అనాది కాలం నుండి ఎంతో ప్రాచీనతను సంతరించుకున్న వీరిని "ఆదివాసి" అని వాడుకలో వ్యవహరిస్తారు. సభ్యసమాజానికి దూరంగా, పూర్తిగా తమదైన ప్రత్యేకతగల జీవన విధానంతో ప్రకృతితో మమేకమై జీవించే జీవన రీతుల్ని గిరిజనులు కలిగి వున్నారు. గిరిజనులు సాధారణంగా అరణ్యాలు, పర్వతాలు, నదీతీరాలు వంటి ప్రాంతాల్లో నివాసం వుంటారు. తెగలుగా వుండటం వల్ల వారు 'పర్వతీయులు', 'వన చరులు', 'ఆటవికులు' అనే పేర్లతో పిలువుబడుతున్నారు.

ప్రస్తుత నా పరిశోధనా వ్యాసం **డా. పి. రమేష్‌నారాయణ గారి "గిరిజన సంస్కృతి - సాహిత్యం"** అనే విమర్శాగ్రంథ పరామర్శ. ఋగ్వేదకాలం నుంచి నేటి ఆధునిక యుగం వరకు తెలుగు సాహిత్యంలో గిరిజనులను గురించి చర్చించిన అంశాలను, గిరిజనుల మూలాలను, నేటి వారి స్థితిగతులను "గిరిజన సంస్కృతి - సాహిత్యం" (భారతీయ గిరిజన సంస్కృతి - తెలుగు సాహిత్యంలో గిరిజన ప్రశంస) అన్న పేరుతో 2015లో ఒక విమర్శా గ్రంథంగా తీసుకొచ్చారు. అందులో ఆయన తెలుగుసాహిత్యంలో గిరిజనుల ప్రశంస చేసిన విధానం, దాని మూలాలను మీ ముందుంచే ప్రయత్నం చేస్తాను. ముందుగా రచయిత గురించి సంక్షిప్తంగా నాలుగు మాటలు ప్రస్తావించడం సబబు. డా. పతికి రమేష్ నారాయణ అనంతపురం జిల్లా ప్రముఖ సాహితీవేత్త. అనువాదకుడు. ఆయన ఆగస్టు 27, 1947లో అనంతపురంలో జన్మించారు. తండ్రి పి.ఎల్. నారాయణరావు. తల్లి రాజ్యలక్ష్మి. బాల్యం నుండి విద్యాభ్యాసం అనంతపురం పట్టణంలోనే కొనసాగించి జంతుశాస్త్రంలో స్థానిక ప్రభుత్వ కళాశాల నుండి బి.ఎస్సీ (1963-1966) డిగ్రీని, తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి ఎం.ఎస్సి (1966-1968) డిగ్రీని పొందాడు. ఉద్యోగ నిర్వహణ కాలంలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నుండి జంతుశాస్త్రంలో పి.హెచ్‌డి. (1987), అన్నామలై విశ్వవిద్యాలయం నుండి బి.యిడి. (1985), ఎం.యిడి(2004) డిగ్రీలు పొందారు. విద్యాభ్యాసానంతరం ఉపాధ్యాయ వృత్తిపైగల అపారమైన గౌరవంతో సమకాలీనంగా ఉన్నతస్థాయి ఉద్యోగావకాశాలన్నింటిని వదులుకొని 1968లో అనంతపురం శ్రీసాయి బాబా నేషనల్ జూనియర్ కళాశాలలో జంతుశాస్త్ర అధ్యాపకుడుగా ప్రవేశించారు. అదే విద్యాసంస్థలో 38 సం॥లు పఠన, పాఠన, పరిపాలనలు చేసి (1968-2005) 2005లో పదవీ విరమణ గావించారు. పదిహేడు సం॥లు పైగా (1989-2005) జూనియర్ కళాశాల మరియు ఉన్నత పాఠశాల ప్రధానాచార్యులుగా సంయుక్త బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించాడు.

డా. పి. రమేష్‌నారాయణ వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు, ప్రవృత్తిరీత్యా ఒక సాహితీ ప్రియుడు. సామాజిక

కార్యకర్త. వక్త. వివిధ సంస్థల్లో జీవితకాల సభ్యుడిగా, కార్యనిర్వాహక సభ్యుడిగా నాలుగు దశాబ్దాల పైగా చైతన్యవంతమైన విశేషపాత్ర పోషిస్తున్నారు. సమాజ సేవలో భాగంగా అంతర్జాతీయ లయన్స్‌క్లబ్ సంస్థలో ప్రముఖ సభ్యుడుగా 1973 నుంచి 45 సంవత్సరాలకు పైగా ఎన్నో విశిష్ట బాధ్యతలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు. అంతర్జాతీయ సేవాసంస్థ రోటరీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ 'పాల్ హారిస్ ఫెలో'గా, అనంతపురము సెంట్రల్ రోటరీ క్లబ్ గౌరవ సభ్యుడిగా, ఆం.ప్ర. ప్రభుత్వ నియామకంతో అనంతపురం జిల్లాస్థాయిలో జువైనల్ వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ (2009-2012), అనంతపురంలోని ఆరుబయలు కారాగారం సలహాసంఘం సభ్యులుగా (2010-2013), ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటి సలహా సంఘం సభ్యుడు (2014)గా ఉన్నారు. డా. పి. రమేష్‌నారాయణ విశేష పుస్తక ప్రియత్వంగల సాహితీ ప్రియుడు. ఆంధ్రాంగ్ల భాషలపై మంచి పట్టుకూడా వుంది. ప్రాక్పశ్చిమ పురాణవాఙ్మయం, భాషా సాహిత్యాలు, శాస్త్ర విజ్ఞానం, ఆధ్యాత్మికవాదాలకు సంబంధించిన అపారమైన ఆసక్తిగల చదువరి. అనంతపురం జిల్లాలో సాహిత్య రచయితగా 2011 నుంచి పూర్తిస్థాయిలో దర్శనమిస్తారు. "రిఫ్లెక్షన్ ఆన్ హ్యూమన్ నేచర్" అనే ఆంగ్ల రచనతో తన సాహితీ ప్రస్థానాన్ని మొదలు పెట్టిన ఆయన 2013-2018 వరకు తులనాత్మక సాహితీ ధోరణితో గిరిజన సంస్కృతి, చేనేత వ్యవస్థ, వేశ్యావ్యవస్థ వంటి అంశాలు, జానపద సాహిత్యంలో యక్షగానాలు, అక్కదేవర్ల పాటలు, మాధవరాజులు వంటి అంశాలు, సర్పారాధన వైశిష్ట్యము వంటి విశేషాంశాలు గల గ్రంథాలు, జీవనచిత్రణలు, ఆధ్యాత్మికరచనల వంటివి డెబ్భై వరకు రచనలు చేశారు. ఆయన గావించారు. అనువాదసాహిత్యంలలో ప్రవేశించి దీర్ఘకావ్యాలు, కవితా సంకలనాలు, నానీలు, రెక్కలు వంటి రచనలను ఇరవై దాకా ఆంగ్లానువాదం గావించారు. తెలుగు సాహిత్యంలో భిన్న అంశాలపై ప్రాక్పశ్చిమ భావజాల నేపథ్యంలో విలువైన సమగ్ర సమాచారాన్ని అందించే పరిచయ గ్రంథాలుగా ఆయన రచనలు వుంటాయి.

డా. పి. రమేష్‌నారాయణ గారి "గిరిజన సంస్కృతి - సాహిత్యం" :

డా. పి. రమేష్‌నారాయణగారి "గిరిజన సంస్కృతి - సాహిత్యం" (భారతీయ గిరిజనసంస్కృతి - తెలుగు సాహిత్యంలో గిరిజన ప్రశంస) 104 పుటల చిన్న పుస్తకం. రాశిలో చిన్నగా కనిపిస్తున్నా, వాసిలో మాత్రం ఎంతో విలువైనదిగా చెప్పుకోవచ్చు. ఎందుకంటే భారతీయ సాహిత్యంలో సాంస్కృతిక, సామాజిక నేపథ్యాల్లో గిరిజనుల ప్రస్తావనను ఋగ్వేదకాలం నుండి నేటి ఆధునిక కాలంవరకు చాలా విపులంగా ఆయన చర్చించారు ఆయన. ఐతరేయ బ్రాహ్మణం, పురాణ సాహిత్యం, ప్రాచీన కావ్యాలు వంటి అర్వాచీన సంప్రదాయ ధోరణులు మొదలుకొని, ఆధునిక యుగంలో పురాతత్త్వ, మానవ విజ్ఞాన, సామాజిక శాస్త్రాలు దాకా గిరిజనులను చర్చించారని తన గ్రంథంలో పేర్కొన్నారు. అంతేగాకుండా కాశ్మీరం నుంచి కన్యాకుమారిదాకా, తూర్పున బంగాళాఖాతం మొదలు, పశ్చిమాన అరేబియా సముద్రం దాకా గిరిజనుల జీవన రీతులు, అస్తిత్వాలు ఉన్నాయని సహేతుకంగా, సప్రమాణికంగా నిరూపించారు.

గిరిజన సాహిత్యం :

"ఉత్తమ సాహిత్యం లౌకిక జీవితానికి వెలితిగా, విడిగా మడికట్టుకొన్న ప్రత్యేక ప్రపంచం కాదు. అది సమాజ జీవితంలో ఒక భాగం. మానవ మానసిక జీవితంలో ఒక అంతర్భాగం. సంస్కారవంతుల మేధా కార్యకలాపాల్లో ఒక కీలకభాగం. ఉత్తమ సాహిత్యానికి జన్మస్థానం సమాజ జీవితమైనట్లే దాని గమ్యస్థానం కూడా సమాజ జీవితమే" అని 'సంవేదన' వ్యాస సంకలనంలోని 'లక్ష్య నిర్వచనం' అన్న సంపాదకీయ వ్యాసంలో సుప్రసిద్ధ సాహిత్య విమర్శకులు రాచమల్లు రామచంద్రారెడ్డిగారు అంటారు. ఈ నేపథ్యంలో గమనిస్తే భారతీయ గిరిజన

ప్రశంస అనాదికాలం నుండీ సాహిత్యంలో ఎంతో విశేషంగా, ఎంతో ఉదాత్తంగా కనిపిస్తుంది. నభ్య సమాజానికి అనాగరిక, ఆటవిక జీవనులుగా కనిపిస్తున్నప్ప టికీ గిరిజనులు మన భారతదేశ మూలవాసులుగా పురాణకాలం నుండి గుర్తించబడిన జాతులుగా చెప్పక తప్పదన్న వాదాన్ని ఈయన తన గ్రంథంలో బలపరిచారు.

తెలుగు సాహిత్యంలో గిరిజన ప్రశంస :

తెలుగు సాహిత్యంలో గిరిజన ప్రశంసలు గమనిస్తే అమరకోశం, రామాయణ మహాభారతాలు, వీటి అను వాదాలు, ప్రబంధ కావ్యాలు మొదలు కథా కావ్యాలు, యక్షగానాలు, నాటకాల్లో గిరిజనుల ప్రస్తావన విశేషంగా వుంది. పంచతంత్ర కథలు, కథాసరిత్సాగరం, విక్రమార్క కథలు, అమరకోశము వంటి వాటిలోనూ, కథ - నవలా సాహిత్యంలోనూ విశేషంగా గిరిజన జీవితాలు కనిపిస్తాయి. గిరిజనులను గురించి వ్యవహారికంగా ఎన్నో రకాల జాన పద కథలు కూడా దేశవ్యాప్తంగా ఎన్నో వ్యాప్తిలో వున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత కాలంలో చెంచులు, కోయలు, ఎరుకలు, సుగాలీలు, యానాదులు అంటూ సాధరణంగా మనం గమనించే పేర్లేకాకుండా భిల్లులు, కిరాతులు, వాల్మీకులు, బోయలు, నిషాదులు, వ్యాధులు, పుళిం దులు, శబరులు వంటి పదాలు సైతం గిరిజనుల ఉ నికిని విస్తారంగా తెలియజేస్తున్నాయి.

తెలుగు, సంస్కృత సాహిత్యాల్లో అగుపడే గిరిజన ప్రశంస వారిని ఎంతో ఉదాత్తంగా చిత్రీకరిస్తుంది. భార తీయ పురాణ సాహిత్యంలో ముఖ్యంగా మహాభారత గాథలో మనం గమనించే ఏకలవ్యుడు, ధర్మవ్యాధుడు వంటివారు గురుభక్తికి, సచ్ఛీలతకు, త్యాగానికి, మూఢ భక్తికి, అచంచలమైన విశ్వాసానికి ప్రతీకలుగా వర్ణించ వచ్చు. పాండవ మధ్యముడైన అర్జునుడి పాశుపతాస్త్ర సంపాదనగాథలో పరమేశ్వరుడు కిరాతుని రూపంలో అర్జునున్ని పరీక్షించిన కిరాతార్జునీయగాథ మనకు తెలి సిందే. అంతేకాకుండా శివపార్వతుల కుమారుడు కుమార స్వామి భార్య శ్రీవల్లి గిరిజన కాంత కావడం సాహిత్యంలో మనం గమనించిన అంశమే.

భారతీయులకు ఆరాధనీయమైన రామాయణ మహాకావ్యంలో సీతారామలక్ష్మణులను గంగానదిని దాటించిన గుహుడు నిషాదరాజు. శ్రీరామునకు వనవాస కాలంలో ఎంగిలి చేసిన ఫలాలను అందించిన శబరి, వనచరజాతులైన సుగ్రీవుడు, జాంబవంతుడు, హను మంతుడు, అంగదాదులు వంటివారు మానవజాతికి ఆదర్శవంతమైన ఎన్నో ఉదాత్తమైన గుణాలకు ఉదా హరణలుగా మనకు కనిపిస్తారు. నిర్మలమైన సేవకు గుహుడు, శబరి, గురుభక్తికి ఏకలవ్యుడు, వీరత్వానికి ఘటోత్కచుడు గిరిజన ప్రతీకలుగా సాహిత్యంలో శాశ్వతంగా నిలిచిపోతారంటారు డా. రమేష్ నారా యణగారు.

భారతీయ పురాణాలలోని ప్రముఖ వ్యక్తులతో తమకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని గిరిజనులు తమకు తాము ఎంతగానో గర్విస్తారు. రామాయణాన్ని రాసిన వాల్మీకి సంతతివారమని వాల్మీకులు, పాండవ సోదరుల్లో తాము భీముడు సంతానమని కోయలు, శ్రీశైల భ్రమరాంభ బిడ్డలమని చెంచులు, శ్రీకృష్ణుడి యాదవ కులం నుండి తాము వచ్చామని గొడులు, గొల్లలు, యాదవులు, తాము రావణుడి సంతానమని, ఘటో త్కచుని వారసులమని, పార్వతీమాత తమ పూర్వీకులను పెంచిందని గోండులు భావిస్తారు. శ్రీరామునితో సంబంధం గలవారిగా బంజారాలు తమ్ముతాము తెలుపు కుంటారు. ముండాతెగ గిరిజనుల్లో గల "మనుయానో" అనే పద ప్రయోగం వారికి ధర్మశాస్త్రకర్త అయిన మనువుతో సంబంధం వుందన్న భావనను సూచిస్తుందని డా. పి. రమేష్‌నారాయణగారు తమ గ్రంథంలో సవివరంగా వివరించారు. అంతేకాకుండా భక్తిసాహిత్యంలో ప్రసిద్ధి చెందిన 'శ్రీకాళహస్తిమహాత్మ్యం' గ్రంథంలో ధూర్జటి మహాకవి చెంచుతెగలకు చెందిన తిన్నడిని కథానాయ కుడిగా చిత్రించాడని, ఆ చెంచు వీరుని ముగ్ధమైన మూఢభక్తికి మెచ్చి పరమశివుడు ఇంతవరకు ఏ భక్తునికి కూడా అనుగ్రహించని విధంగా "పార్వతీదేవి కుడిచేయి

చిటికెన వ్రేలును పట్టుకొని, దేవతాధి మునిపుంగవులు అర్చిన్తూ, కీర్తిస్తుండగా, ప్రశాంతమైన వదనంతో, తేజోవంతమైన ముఖవర్చస్సుతో" పరమశివుడు తిన్ననికి సాక్షాత్కరించాడని ధూర్జటి మహాకవి వర్ణించడం చూస్తే, ఆ గిరిజన చెంచు తిన్నడి ప్రాధాన్యత చెప్పకనే చెబుతూ వుంది, అలాగే వైష్ణవ సాంప్రదాయ సాహిత్యంలోని శ్రీనార సింహావతారగాథలో చెంచులక్ష్మి కథ అగుపడటం, కలి యుగదైవం శ్రీ వేంకటేశ్వరస్వామి కొంతకాలం తిరు మల సప్తగిరులలో గిరిజన జీవితం గడపటం, తాను ప్రేమిం చిన పద్మావతీదేవికి ఎరుకలసాని రూపంలో సోది చెప్పడం, మహంత్ బావాజీతో శ్రీ స్వామివారు స్వయంగా పాచికలు ఆడటం వంటి జనబాహుళ్య ప్రసిద్ధిగాథలు గిరిజన సంస్కృతికి సంబంధించినవని రమేష్ నారాయణ గారు ఎత్తిచూపారు.

ప్రాచీన తెలుగు కావ్యాల్లో ఎంతోమంది తెలుగు కవులు గిరిజనజాతుల పేర్లను ప్రస్తావించినట్లుగా భార తీయ గిరిజనసంస్కృతి - తెలుగు సాహిత్యంలో గిరిజన ప్రశంసలో రమేష్‌నారాయణగారు ఉదహరించారు. తిక్కన సోమయాజి ఆంధ్రమహాభారతంలో బోయ, శబర, కిరాత, నిషాద శబ్దాలు, నన్నెచోడుని కుమార సంభవంలో శబర, పుళింద, నిషాద, ఎరుక, ఆటవిక శబ్దాలు, పోతనా మాత్యుని ఆంధ్రమహాభాగవతంలో "లుబ్ధకులు" అన్న పదం, ప్రబంధ కావ్యాల్లో ప్రసిద్ధి చెందిన అల్లసాని పెద్దన మనుచరిత్రలో పుళిందులు, చెంచులు, ఎరుకలు, మృగ యులు అన్న పద ప్రయోగాలతో పాటు, స్వరోచితో పాటుగా ఎరుకలు గావించిన వేటనైపుణ్యాలు వర్ణించిన తీరు, ఆముక్తమాల్యదలో యమునాచార్యుడు రాజనీతిని గురించి వివరించే సందర్భంలో "పాలకప్రభువులు గిరి జనులను తమ వశంలో వుంచుకోవాలని, భిల్లుల ప్రతి కూలత రాజ్యానికి ఇబ్బందికరంగా వుంటుందని, విశ్వస నీయతకు భిల్లులు పేరుపొందినవారని చెప్పే సందర్భం, అయ్యలరాజు రామభద్రుడి రామాభ్యుదయంలో దశరథ మహారాజు వేటకాలంలో చెంచులు ఆయనను అను సరించారచి చెప్పడం, రఘునాథనాయకుడి వాల్మీకి చరిత్రములో నిషాదశబ్దం, తరిగొండ వెంగమాంబ రచించిన చెంచునాటకం యక్షగానం, మట్ల అనంతరాజు "కుకుత్స విజయం"లో ఎరుకల శబ్దం మొదలైనవి గిరిజన తెగలను గురించి ప్రాచీన తెలుగు కావ్యాల్లో వర్ణించిన వివరాలుగా తేటతెల్లం చేశారు.

అంతేకాకుండా సాహిత్య నిఘంటువుల్లో సైతం గిరిజన ప్రస్తావనను కూడా రమేష్‌నారాయణగారు చర్చించారు. సాహిత్య నిఘంటువుల్లో అగుపడే "మ్లేచ్ఛ" శబ్దం పుళిందులు, శబరులు వంటి గిరిజనులకు చెందిన పదం. అమరకోశంలో అగుపడే "వ్యాధుడు, లుబ్ధకుడు, మృగవ ధాజీవుడు, మృగయుడు" అన్న పదాలు బోయ వారిని సూచిస్తున్నాయి. గిరిజన తెగల్లో కిరాత, శబర, పుళింద, మ్లేచ్ఛ జాతులున్నాయని అమరకోశంలో పేర్కొన్నట్లు ఆయన వివరించారు. బ్రౌన్ నిఘంటువుల్లో ఎరుకలు "కిరాతుడు, వ్యాధుడు, విచ్, వెంచ్, జిప్సిలు" అనే పేర్లతోను, "దైవజ్ఞులు"గాను తెలుపబడ్డారంటాడు.

తెలుగు సాహిత్యంలో మనం గమనించే ప్రసిద్ధ చారి త్రక కావ్యాలు, సైతం రాజరికానికి సంబంధించిన గిరి జనుల ప్రశంస అగుపడుతుందని, దుర్భాక రాజశేఖర శతావధాని రచన 'రాణా ప్రతాపసింహ చరిత్ర' గిరిజనులు భిల్లులు అనే వారి రాజు "భీమచాందు" అని మనకు తెలుపుతుందని, గడియారం వేంకట శేషశాస్త్రిగారు రచించిన "శివభారతం"లో గిరిజనులు మావళా వీరులుగా ప్రశంసించబడినట్లుగా, సహ్యాద్రి అడవులు వారి నివాసమని, "తానాజి" వారి ప్రభువని వర్ణించబడింది. కిరాతులు మాల్యవంత పర్వతాల్లోని బేతాళనగర పాలకు లని, "కొఱవిగోపరాజు" సింహాసన ద్వాత్రింశిక తెలుపు తోందని, నన్నెచోడుని కుమారసంభవంలో ఆటవికులను, పిల్లలమర్రి పినవీరభద్రుని శృంగార శాకుంతలంలో పుళిం దులను రాజ్యపాలకులుగా ప్రస్తావించారని డా. పతికి రమేష్ నారాయణగారు ఉదహరించారు.

ఆధునిక తెలుగు సాహిత్యంలో కూడా గిరిజన

సంస్కృతి, సాహిత్యాలపై ఆసక్తిని కనబరిచిన ప్రసిద్ధ రచయితలు ఎందరో ఉన్నారు. సురవరం ప్రతాపరెడ్డి "ఆంధ్రుల సాంఘిక చరిత్ర" తెలుగు సాహిత్యంలో ఆంధ్రుల చరిత్ర, సంస్కృతికి సంబంధించిన ప్రసిద్ధి గ్రంథం. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ, నోరి నరసింహశాస్త్రి నవలలు, ప్రజాశక్తివారు ప్రచురించిన చిత్తజల్లు వరహాలరావుగారి 'వర్ణవ్యవస్థ' మొదలగునవి ఈ కోవలోనికే వస్తాయని, ఎంతోమంది తెలుగు రచయితలు నవలా సాహిత్యం, కథారచనలు, వ్యాసాలు వంటి సాహితీ రూపాల్లో గిరిజన సంబంధమైన విశేషాలను ఎన్నింటినో ప్రజాబాహుళ్యానికి సన్నిహితం చేసారని వీటితో పాటుగా తెలుగు, ఆంగ్ల, మరియు ఇతర భారతీయ భాషా పత్రికలు సైతం గిరిజనుల అభివృద్ధికి దోహదం చేసే విధంగా వార్తా కథనాలను వెలువరిస్తున్నాయని రమేష్ నారాయణగారు గ్రంథంలో విశేషమైన ఉదాహరణలతో ఉదహరించారు.

గిరిజన సంక్షేమం - ప్రభుత్వ వైఫల్యాలు :

గిరిజనుల సంస్కృతి, సంక్షేమానికి సంబంధించి భారత రాజ్యాంగవేత్తలు మన రాజ్యాంగంలో కొన్ని ప్రోత్సాహకాలను కల్పిస్తూ చట్టాలను చేశాయని, భారత జాతీయ నాయకుల్లో జాతిపిత మహాత్మాగాంధీ, ప్రథమ రాష్ట్రపతి డా. బాబూ రాజేంద్రప్రసాద్, ప్రథమ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ వంటివారు గిరిజన సంస్కృతి పరిరక్షణకు వ్యక్తిగతంగా సైతం ఎంతో ఆసక్తిని కనబరచి, చట్టపరంగా ఎన్నో విధాయకనిర్ణయాలు తీసుకొని గిరిజన సంక్షేమానికి సహాయ సహకారాలందించారని, ఆ స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వాలు కూడా గిరిజన అభివృద్ధికి ముందుకు కదిలిందంటారు. ప్రస్తుత కాలంలో కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో 1999వ సం॥ నుండి దేశంలో అన్ని రంగాల్లో గిరిజన సమగ్రసంక్షేమానికి కావలసిన చర్యలు కొనసాగుతున్నాయని, అయితే వర్తమానకాలంలో దేశంలో సర్వతోముఖాభివృద్ధి పేరుతో చేపట్టబడిన పారిశ్రామికీకరణ, భారీ పరిశ్రమలు, భారీ విద్యుత్ నీటి పారుదల ప్రాజెక్టులు, ఆధునికీకరణ విధానాలు గిరిజన జీవితాలను నిరాశ్రయులను చేస్తున్నాయన్న ఆవేదనను సైతం ఈ పుస్తకంలో వ్యక్తపరిచారు. గిరిజనులకు అందాల్సిన విద్య, వైద్య సదుపాయాలు సక్రమంగా అమలు కావడం లేదని, కార్యక్షేత్రంలో వాటిని సవరించాల్సిన అవసరం ఎంతైనా వుందని, గిరిజనుల సమగ్రాభివృద్ధికి ప్రతిఒక్కరు కృషిచేసినప్పుడే వారి సంక్షేమం సాధ్యమవుతుందన్న ఆశాభావాన్ని ఈ పుస్తకంలో వ్యక్తపరిచారు.

ముగింపు :

డా. పి. రమేష్‌నారాయణ గారి "గిరిజన సంస్కృతి - సాహిత్యం" ఒక పరామర్శ అన్న ఈ వ్యాసం ప్రాచీనకాలం నుండి నేటి ఆధునికయ యుగం వరకు సాహిత్యంలో గిరిజనులను గురించి, వారి సంస్కృతిని గురించి జరిగిన చర్చకు ప్రతిరూపం. దాంతో పాటుగా గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకొంది, వారి అభివృద్ధికి అడ్డంకులేమిటి? వాటిని ఎలా పరిష్కరించాలన్న అంశాలను ప్రస్తావించడం గమనార్హం.

ఆధార గ్రంథాలు :

1. నదీంహస్‌నైన్ - భారతీయ గిరిజనులు, ఓరియంటల్ లాజ్మన్, హైదరాబాదు-1995
2. డా. ఎం. గోనానాయక్ - భారతదేశంలో బంజారాలు, తెలుగు అకాడమీ ప్రచురణ, హైదరాబాదు-2005
3. ఎం. సూర్యనారాయణ - ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన సముదాయాలు, తెలుగు అకాడమీ ప్రచురణ - 2005
4. డా. కొప్పుల హేమాద్రి - శాస్త్రవేత్తలను ఆకర్షిస్తున్న గిరిజన వైద్యం - ట్రైబల్ కల్చరల్ రీసర్చ్ & ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్, ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, మాసబ్‌ట్యాంక్, హైదరాబాదు - 1994.
5. డా. పి. రమేష్ నారాయణ - గిరిజన సంస్కృతి సాహిత్యం, అనంతపురము - 2015.
6. మిట్ట వేణుగోపాల్ - ప్రాచీనాంధ్ర సాహిత్యంలో గిరిజన జీవన చిత్రణ, హైదరాబాదు - 2008.

"లంబాడోళ్ళ రాందాసు" నవల – సామాజిక చైతన్యం

– భూక్యా కాశీరాం, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.

ఉపోద్ఘాతం :

'లంబాడోళ్ళ రాందాసు' నవలలో ప్రధాన ఇతివృత్తం గూడెంలో జీవించే లంబాడీలు చదువుకోకపోవడంతో మూఢ నమ్మకాలను నమ్మి అనాగరికంగా జీవిస్తుంటారు. ఈ మూఢనమ్మకాలతో చివరికి ఎంత హింసాత్మకంగా మారుతారన్నది నవల వస్తువును కళ్ళకు కట్టినట్లుగా రచయిత వివరించారు. ఈ నవల 'లంబాడోళ్ళ రాందాసు' తెలుగులో మొదటి గిరిజన నవలగా గుర్తించబడుతుంది.

రచయిత నేపథ్యం :

డాక్టర్ కొర్రెపాటి గంగాధరరావు 1922 మే 10వ తేదీన కృష్ణాజిల్లా మచిలీపట్నంలో జన్మించారు. గంగాధరరావు కుటుంబ సభ్యులంతా విద్యావంతులే. ప్రాథమిక విద్య మచిలీపట్నం ఏలూరులో, ఉన్నత విద్యా మద్రాసులో సాగింది. వైద్యవృత్తి చేస్తూ ఆలోపతి డాక్టరుగా మంచిపేరు సంపాదించారు. 1948లో నాటకరంగం మీద ఆసక్తితో బాపట్లలో వైద్యవృత్తి అక్కడ కొనసాగించారు. గంగాధరరావు 'కళావని' అనే నాటక సంస్థను 1955 వ సంవత్సరంలో స్థాపించారు. ఈ సంస్థ వల్ల ఎందరో నటుల్ని తయారుచేశారు. నాటక రంగానికి ఎంతోగానో కృషిచేశారు.

గంగాధరరావు గారికి 'రంగ రచనా ప్రవీణ', 'కళాప్రవీణ' అనే బిరుదులు ఉన్నాయి. ఆయనకి రచయితగా, నటుడిగా ఎన్నో బహుమతులు వచ్చాయి. 'యథాప్రజా - తథా రాజా' నాటకానికి సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు.

గంగాధరరావు నాటకాలు, నాటికలు, ఏకాంకికలు, నవలలు, వ్యాసాలు, కథలు, పద్యాలు రేడియో నాటికలు, సినిమా నాటకలు రాశారు. సుమారు 130 పైబడి నాటకాలు, నాటికలు రాశారు. గంగాధరరావు రాసిన నవలలో 'లంబాడోళ్ళ రాందాసు' నవల అతి ముఖ్యమైనది. ఈ నవల 1972 లో ఉగాది పోటీలలో ఆంధ్రపభ సచిత్ర వారపత్రిక వారు మూడవ బహుమతి ఇచ్చి సీరియల్ గా వెలువరించారు.

'లంబాడోళ్ళ రాందాసు' నవల - సామాజిక చైతన్యం :

ఈ నవలలో ప్రధాన పాత్ర 'రామదాసు'. 'చుక్కీ' అనే లంబాడీ యువతి నాయకురాలు.

అంతా చీకటి. అంధకారంగా ఉన్న కొండలు. ఆ కొండలు మధ్య ఊరు ఉంటుంది. ఆ ఊరి మధ్యలో ఒక 'దీపపు సమ్మె' ఉంది. ఆ ఊరిలో లంబాడి తండాకు పెద్ద 'సింగం నాయుడు'. తాండా ప్రజలు అందరూ అతని మాటను అనుసరించి నడుచుకుంటారు. లంబాడీ తండాలో అందరూ నిరక్ష్యరాసులు కావడంతో అనాగరికమైన జీవితాన్ని గడుపుతుంటారు.

ఆ తండాలో రోజు లంబాడీలు భజన చేస్తుంటారు. ఆ భజనలో రాందాసు కూడా పాల్గొని భాష రాకున్నా, భజనా తెలియకపోయినా తాళంతో పాటు గొంతు కలుపు తాడు. రాందాసు లంబాడీ కాదు. గిరిజనేతరుడు. కాని అదే ఊరిలో పాలేరు పని చేస్తుంటాడు. రాందాసు రాగం తప్పుగా పాడినప్పుడు తండా వాళ్ళతో తిట్లు తింటాడు.

రాందాసు ఒక పాలేరు. ఇతను రోజూ పోలాలకి కపలా కాస్తూ రాత్రిళ్ళూ అక్కడే పడుకుంటాడు. ఒక రోజు రాత్రి లంబాడీ యువకులు కాలూ, జగ్గూ, భీమా, మల్లు నలుగురు కలిసి ఊళ్ళో ఉన్న 'రమాపతి' ఇంట్లో దొంగతనం చేసి వస్తుంటారు. అదే సమయంలో రాందాసు పోలానికి పడుకోవడానికి వెళ్తుంటే లంబాడీ యువకులను చూసి వాళ్ళకి మంచి మాటలు చెప్పి పాలంలో నులక మంచంపై పడుకుంటాడు. కానీ లంబాడీ యువకులు మాత్రం రాందాసు ఎక్కడ దొంగతనం బయటికి చెప్పేస్తా

డనే భయంతో రాందాసు పడుకున్నా నులక మంచాన్ని తాడుతో కట్టి, ఒక తాటాకికి నిప్పు అంటించి మంచం కింద పడేసి వెళ్ళిపోతారు. ఉదయాన్నే రాందాసుని చూసి ఇతను కాలలేదంటే ఇతని దగ్గర మహాత్యం ఉందని నమ్ముతారు.

రమాపతి తండాకు వచ్చి దొంగతనం ఎవరు చేశారో చెప్పండని, దొంగతనం చేసిన వారి అడుగు ముద్రలు ఉన్నాయని తండా నాయకుడు అయిన సంగం నాయకుడికి ప్రశ్నిస్తారు. దొంగతనం తండాలో ఎవరు చెయ్యలేదని అతనితో వాదిస్తాడు. భజనకి వచ్చిన వాళ్ళ ముద్రలు అయ్యి ఉండవచ్చని పంపిస్తాడు. సింగం నాయకుడు కాలూ ఇంటికి వెళ్తాడు. తాగి పడివున్న కాలూను కొడతాడు. నీ వల్ల తండాకెన్ని తిప్పలు వచ్చాయో చూడు అంటూ ఏడుస్తాడు.

రమాపతి దొంగలు ఎవరో తెలిసేదాకా లంబాడోళ్ళను పచ్చి మంచినీళ్ళకైనా ఊళ్ళోకి రావద్దని ఆజ్ఞాపిస్తాడు. మంచినీళ్ళు చెరువుకు కాపలా పెడతారు. దీనంతటికీ కారణం రాందాసు అని అతనికి ఏదైనా చెయ్యాలని కాలు తన స్నేహితులతో అనే సరికి రాందాసు విషయములో జోక్యం చెయ్యకూడదని అతనిలో ఏదో శక్తి ఉందని అందరూ తప్పించుకుంటారు. కాని కాలు మాత్రం పగతో రగిలిపోతాడు.

లంబాడీ తండాలో చుక్కీ అందమైన ఆడపిల్ల రాళ్ళు చెక్కి మంచాన ఉన్న తల్లిని పోషిస్తుంటుంది. చుక్కి ఇంట్లో తాగడానికి నీళ్ళు లేకపోవడంతో తండాలో తిరిగిన నీళ్ళు దొరకదు. ఎలాగైనా ఊళ్ళో చెరువు దగ్గరికి వెళ్ళి నీళ్ళు తీసుకు రావాలని కుండ తీసుకుని బయలు దేరుతుంది. చుట్టూ అంతా చూసి చెరువులో శబ్దం రానివ్వకుండా కుండలో మంచినీళ్ళు తీసుకుంటుంది. ఒక్కసారి కాపలాదారుడు పట్టుకుంటాడు. భయంతో కుండను కింద పడేస్తుంది. కాపలాదారుడు చుక్కీని బూతులు తిడుతుంటాడు. అటూ నుంచి చెరువుగట్టుకు వస్తున్నా రాందాసు భయపడుతున్నా చుక్కీని చూసి ఆమెను నీళ్ళూ తీసికెళ్ళానీ మనసబు గారితో నేను మాట్లాడుతా అని చుక్కీని పంపిస్తాడు. చుక్కీ మిగిలిన నీళ్ళతో తండాలో కొందరికి పంచి మిగిలినవి ఆమె ఇంట్లో వాడుకుంటుంది.

మరునటి రోజు ఉదయాన్నే రాందాసుని పిలిచి లంబాడీ పిల్లను నీళ్ళు తీసుకెళ్ళిచ్చినందుకు నిలదీస్తారు. రాందాసు తాను చేసింది తప్పేనని ఒప్పుకొని "భగవంతుడు ఇచ్చిన నీళ్ళూ వద్దని చెప్పడానికి మనం ఎవరు? ఎవరో ఒకరు చేసిన తప్పుకు అందర్నీ శిక్షించటం మంచిది కాదు అని, దొంగతనం చేస్తే వారికి మంచి బుద్ధులను నేర్పాలే గాని ఈ నీళ్ళు ఇవ్వకుండా తండా ప్రజలను ఇబ్బంది పెట్టడం మంచిది కాదని" గట్టిగా అంటాడు. రాందాసుని ఇక నుంచి లంబాడీ వాళ్ళ దగ్గర వెళ్ళి పో, వాళ్ళకు మంచి బుద్ధులు నేర్పించిరా అప్పుడు మంచి నీళ్ళు గురించి ఆలోచిద్దాం అంటాడు మునసబు. రాందాసు కోపంతో లంబాడీలలో మార్పులు రావాలని ఆశించి తండాకి బయలుదేరుతాడు. వాళ్ళని మంచి మాటలు చెప్పి లోకజ్ఞానాన్ని తెలియజేయాలని అనుకుంటాడు. అప్పటికే తండా వాళ్ళు రాందాసు మీద పగతో రగిలిపోతుంటారు. దీనంతటి కారణం రాందాసేనని కాలు అందరిని మనసులో పడేలా చెప్పేసరికి రాందాసుని కొట్టాలనే ప్రయత్నంలో ఉంటారు. రాందాసు తాండా మధ్యలోకి ధైర్యంగా వెళ్తాడు. కాని అతనిని చూసి ఎవరు ఏమి అనకుండా ఉంటారు. రాందాసు తనకు నోటికి వచ్చిన పాట అందుకునే సరికి అక్కడి తండా ప్రజలకు భక్తుడిగా, ప్రవక్తగా, సందేశ మిచ్చే వ్యక్తిగా, మంత్రగాడిగా అనుకుంటారు. సింగం నాయకుడు రాందాసు కాళ్ళ మీద పడి మీరు రోజు వచ్చి మాకు మంచి మాటలను నేర్పించాలని వేడుకుంటాడు. రాందాసు తన మాట వింటే తప్పకుండా వస్తానని చెప్పేసరికి లంబాడీలందరూ సంతోషిస్తారు. రాందాసు లంబాడీ తండాలో కొన్ని ఆజ్ఞలు విధిస్తాడు. ప్రతిరోజు అందరూ నిద్రలేచి స్నానం, దైవ ప్రార్థన చేయాలి, ఆ ప్రాంతమంతా శుభ్రంగా ఉంచాలి.

ఇల్లంతా చక్కగా తీర్చిదిద్దుకోవాలి. గుడ్డలన్ని ఉతికి ఆరవేసుకోవాలి అని చెబుతాడు. ఈ విధంగా దినచర్యను పాటించేలా చేస్తాడు. లంబాడీలందరూ రాందాసు మాట ప్రకారమే నడుచుకుంటారు. దాంతో అక్కడి వాళ్ళలో 'సమైక్యత' భావం ఏర్పడుతుంది. రాందాసు అనుకున్నట్టే లంబాడీల్లో మార్పులు వస్తుంది. ఇదంతా చేస్తున్న రాందాసుని దైవ స్వరూపుడిగా భావిస్తారు.

లంబాడీ తండాలో ప్రధాన సమస్య మద్యం. ఎలాగైన తాగుడికి బానిస అవుతున్నా వారిని మార్చాలనే ఉద్దేశ్యంతో రాందాసు తాండ స్త్రీలందరితో ఒక ఉపాయం చెప్తాడు. "భర్తలు తాగి వస్తే తిండి పెట్టకండి, తాగి బురదలో పడిన వాడిని బయటికి లాగమాకండి వాళ్ళని ఊరి అందరి ముందు పరువుతీయండి" అంటూ స్త్రీలలో చైతన్యాన్ని రగిలిస్తాడు. రాందాసు మాట ప్రకారమే కల్లు, సారా దుకాణం మీద దాడి చేసి తాగిన భర్తలకు కఠినంగా శిక్షలు వేస్తారు. భార్యల మాట ప్రకారం భర్తలు తాగకుండా ఉంటారు. ఈ విధంగా రాందాసుపై మరింత నమ్మకం కుదురుతుంది. మరసటిరోజు నుంచి ఊరిలో కల్లు దుకాణం తెరవకుండా ఉంటారు.

కాలు రాందాసుపై పగతో అతని స్నేహితులతో కలిసి రాందాసుకు ఎలాగైనా సారా తాపించాలని ఒకరోజు రాత్రి అతని మీద దాడి చేసి బలవంతంగా తాగించి గాడిద మీద వేసి కొండపై తీసుకువెళ్తారు. ఇదంతా చుస్తున్నా చుక్కీ రాందాసుకు ప్రమాదం జరుగుతుందని ఆమె కూడా పరిగెత్తుతుంది. రాందాసు కొండ చివరన పడి ఉంటాడు. చుక్కీ అతని ఓడిలో పడుకోబెడుతుంది. రాత్రంతా అక్కడే ఉంటారు. ఉదయాన్నే గ్రామస్థులు చూసి వీరి మధ్య ఎదో సంబంధం నడుస్తుందని ఊరిలో అందరూ అనుకుంటారు. రాందాసుని 'లాంబాడోళ్ళ రాందాసు' గా పిలుస్తారు. ఇదంతా చూసి రాందాసు "నరే నేను లంబాడోళ్ళ రాందాసునే .... ఇక నుంచి తప్పేంలేదు ... మునిగి పోయింది. అంతకంటేలేదు ఈ నాగరికులకంటే ఆ లంబాడోళ్ళే చాలానయం ఆళ్ళు చెప్పిన మాట వింటారని" అంటాడు.

తాండా వాళ్ళందరూ కలిసి చందాలు వేసుకొని రాందాసుకి, చుక్కీకి పెళ్ళి చేస్తారు. అప్పటినుండి పూర్తిగా "లంబాడోళ్ళ రాందాసు"గా మారుతాడు. రాందాసు తన సంసారాన్ని సాఫీగా సాగిస్తూ, తండా వాళ్ళకి మంచి మాటలు చెప్పి జ్ఞానోదయాన్ని కల్గిస్తుంటాడు. రాందాసు, చుక్కీ ప్రతిరోజు రాత్రి రాళ్ళ చెఱువు దగ్గరికి వెళ్ళి గడిపి వస్తుంటారు. ఇద్దరూ తమలోని భావాలను అర్థం చేసుకుంటూ ఉంటారు. కొన్నాళ్ళకు రాందాసుకు కొడుకు పుడతాడు.

ఒకరోజు సింగ నాయకుడి ఆవు తప్పిపోతుంది. ఎంత వెతికినా దొరకదు. రాత్రిపూట రాందాసు, చుక్కి రాళ్ళ చెరువు నుంచి వస్తుండగా ఆవు కనిపిస్తుంది. అదే విషయాన్ని సింగనాయకుడికి చెబుతాడు. తాండాలో కొంత మంది వెళ్ళి చూస్తే నిజంగా ఆవు ఉంటుంది. దాంతో తాండాలో రామదాసు నిజంగా దేవుడనే నమ్మకం కలుగుతుంది.

తాండాలో లంబాడీలందరూ రామదానుకి మాయాలు, మంత్రాలు వచ్చునీ, మహాత్మ్యాలున్నాయనీ అందరూ నమ్ముతారు. లక్ష్మణ నాయకుడి విషయంలో కూడా రాందాసుకి అనుకూలంగా జరుగుతుంది. లక్ష్మణ నాయకుడికి ఇద్దరు పెళ్ళాలు ఉన్నా ఒకేసారి ఇద్దరూ కాన్పులకు రావడంతో మూడవ పెళ్ళికి సిద్ధం అవుతాడు. ఆ విషయం ఇద్దరు భార్యలకు తెలిసి రామదాసుని పరిష్కారమార్గాన్ని చూపించాలని అంటారు. లక్ష్మణ నాయకుడిని తాండాలో అందరి ముందు పిలిచి అడుగుతాడు.

"నా ఇష్టం సేసుకొంటాను. పెట్టి పోశించనోణ్ణి అయితేగా! వందమందిని చేసుకుంటానోయ్ వద్దనే వాళ్ళెవరు" అని అంటాడు. అదేరోజు రాత్రి లక్ష్మణ నాయకుడు సారా దుకాణంలో తాగి ఆలోచిస్తాడు. పెళ్ళి చేసుకుంటే అతనికి వచ్చే నష్టాలను గుర్తుచేసుకుంటాడు. అంద రినీ కాదని ఊరిలో తిరగగలనా అంటూ పెళ్ళి వద్దని నిర్ణయం తీసుకుంటాడు. లక్ష్మణ నాయకుడి

మార్పు చూసి, వారి భార్యలు పుట్టిన పిల్లలకు 'రాందాసు' అనే పేర్లు పెట్టుకుంటారు.

రాందాసు ముట్టుకుంటే జబ్బులు నయం అవు తుందని తాండాలో అందరూ నమ్ముతారు. రాందాసు తనకి రాదని, వైద్యం తెలియదని చెప్పినా వినకపోవడంతో వాళ్ళ నమ్మకం కోసం వైద్యం, మంత్రాలు చేస్తుంటాడు. ఒకరోజు కొండపై సింగం నాయకుడి కొడుకు లోయలో పడి మరణిస్తాడు. రాందాసు దగ్గరికి తీసుకువెళ్తే అతని మంత్రాలతో బ్రతుకుతాడని ఊరిజనం అందరూ సింగం నాయకుడి కొడుకు శవంతో రాందాసు ఇంటికి చేరుతారు.

రాందాసు కొడుకుతో ఆడుకుంటూ ఉండగా ఒక్క సారి ఊరిజనం చూసి ఏమైందని అడిగితే సింగనాయ కుడి కొడుకు మరణించాడు ఎలాగైనా నీ మంత్రాలతో బతికించు అని ఊరి జనం మూర్ఖంగా ఆలోచిస్తారు. బ్రతికించకపోతే తనని చంపేస్తామని అంటారు. రాందాసు ఎంత చెప్పినా తనకి ఎలాంటి మంత్రాలు రావు అని ప్రాధేయపడతాడు. చుక్కీ కూడా అందరినీ బ్రతిమాలు తుంది. కానీ ఊరి జనం ఒక్కసారిగా రాందాసు మీద దాడికి దిగుతారు. రాందాసు కొండలవైపు పరిగెడుతాడు. దారి మధ్యలో చూస్తున్న కాలూ ఊరి వాళ్ళని రాందాసు సామాన్య మానవుడే అని చెప్పాలని వాళ్ళ వెనకాల పరిగెత్తుతాడు. చుక్కీ కొడుకును చంకనబెట్టుకొని పరిగెత్తు తుంది. అంతలోనే ఊరి జనం గడ్డ పలుగులతో, గున పాలతో రాందాసును అతి కిరాతకంగా పొడుస్తారు. రాందాసు రక్తం మడుగులో పడి మరణిస్తాడు. చుక్కీ చూసి కొడుకుతో సహా కొండలోయలో పడి మరణిస్తుంది. ఒక్కసారిగా అంతా చీకటి అయిపోతుంది. కాలు చలించి పోయి ఊరి వాళ్ళని "ఎంత పని చేశార్రా మోడు ఎదవ ల్లారా! రాందాసు దేముమంట్రా, దేవుడయితే మాత్రం పోయిన ప్రాణాలు మళ్ళ తెచ్చి పొస్తాడ్రా! పోతే మాత్రం కలకాలం అందరం బతికే ఉంటారా - మతిలేని గాడిద ల్లారా! పోయిన పేణం కోసం నిండు పేణాన్నే తీత్తారంట్రా పేణాలు తీత్తే పేణాలు వత్తాయంట్రా! ఎర్రి ఎదవల్లారా మంచిమాటలు సెప్పినందుకు కాలి పోతోందో! ఎదవని తాగుబోతు ఎదవని కచ్చలో కళ్ళు పోయినోణ్ణి, కసికట్టి మతిపోయినోణ్ణి నేను కూడా పేణాలు తిద్దామనుకోలేదురా ఇంతవరకు" అంటూ కన్నీరు కారుస్తాడు.

ముగింపు :

ఈ విధంగా రాందాసు పాత్ర ద్వారా ఈ నవలలో సామాజిక చైతన్యాన్ని కల్పించారు రచయిత. తాండాలో లంబాడీలకు మార్పు రావాలంటే వాళ్ళకి మంచి మాటలు నేర్పించాలని ఉద్దేశంతో పాలేరుపని వదిలి తాండాలలో మార్పు కోసం వచ్చి, స్త్రీలందరినీ చైతన్యపరచి మద్య నిషేధం చేయిస్తాడు. ఎప్పుడైతే స్త్రీలు చైతన్యవంతులుగా మారారో వారి భర్తలు కూడా మారిపోతారు. లంబాడీలో సమైక్యతను నెలకొల్పుతాడు. అందరినీ ఏకతాడుపై తీసుకురావాలని ఎంతో ప్రయత్నించి చివరికి తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా మరణిస్తాడు.

ఉపయుక్త గ్రంథాలు :

1. లంబాడోళ్ల రాందాసు-డా. కొర్రపాటి గంగాధరరావు
2. తెలుగు నవలా వికాసం-మొదలి నాగభూషణ శర్మ
3. కొర్రపాటి గంగాధరరావు నవలానుశీలన-డా. జి. వెంకట్‌లాల్
4. తెలుగు నవలల్లో లంబాడీల జీవన చిత్రణలు-డా.జి. వెంకట్‌లాల్
5. నవలా శిల్పం-వల్లంపాటి వెంకట సుబ్బయ్య

గిరిజనుల వివాహ పద్ధతులు – ఒక పరిశీలన

– శ్రీవల్లి కత్తి, పరిశోధక విద్యార్థిని, తెలుగు విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

ఉపోద్ఘాతం :

ప్రకృతిలో గిరిజనులు ఒక భాగం ఆ రకంగా గిరిజన స్వభావమే వేరు. ప్రకృతి నుండి దూరమైన గిరిజనులు కొందరు వున్నారు. వారు మిగతా గిరిజనులకు భిన్నం. ఒకరి బతుకుల్లోకి మరొకరు తారాట్లాడడం వల్ల కొన్ని సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. కాని ఎవరి భౌగోళిక వారిదే, ఎవరి రూపు, భాష,సంస్కృతి వారివే, గిరిజనుల మధ్య విభేదాలు శత్రుపూరిత స్థాయిలో లేవు. కాని అందరి మీద ఆధిపత్యం వహించే ఒక సర్కారీ సంస్కృతి వారిని ఏమారుస్తున్నది. దాని వెనుక ఉన్నది భూస్వామ్య సామ్రాజ్యవాద సంస్కృతే ఈ సంస్కృతి గిరిజన వ్యతిరేకం. గిరిజనులలో గొప్పగుణం ఏమంటే సామూహికతే మంచో, చెడో అందరు కట్టుగా నిలవడం. ఈ భావనే వారిని పోరాట శీలురుగా నిలిపింది. అయినా తమని తాము నిలదొక్కుకోవడానికి ప్రయత్నాలు వారిని ఇంకా కలిపి ఉంచేవి భాష, సంస్కృతి, నమ్మకాలు, విశ్వాసాలు, పండగలు, వివాహం, బాంధవ్య సంబంధాలే. గిరిజన సంస్కృతి ఆచార సంప్రదాయాలలో ఒక భాగమైన గిరిజనుల వివాహ పద్ధతులను గురించి తెలుసుకుందాం.

గిరిజనుల వివాహ పద్ధతులు :

స్త్రీ, పురుష సంబంధం సృష్టిలోనే పుట్టింది. ఇది పరమేశ్వరుని ఉద్దేశ్యమని దేవునిపై నమ్మకం ఉండేవారు అంటారు. అది నిజం కాదు. అసలు దేవుడు లేడు, స్త్రీకి పురుషుడికి ఉండే ఉత్పత్తి అంగాలు, వాని స్వరూపం స్త్రీ పురుషులిద్దరినీ కలియునట్లు ప్రేరేపిస్తుందని ఈశ్వరుడు లేడని వాదించేవారు. చెప్పేమాట వాస్తవమైనా, ఒకదానికి మరొకటి పొందైన అంగాలు ఉన్నాయన్నా విషయం సత్యమే. ఈ సంబంధానికీ ఎటువంటి ప్రోద్బలంగానీ, నిర్భంధంగానీ అవసరం లేదు. మేఘాలు వర్షించునట్లు, పండిన పండ్లు నేల రాలునట్లు, పశువులు బిడ్డలకు పాలను ప్రసాదించునట్లు సహజధోరణిలో యుక్తకాలం వచ్చినంతనే ఈ కలయిక ఏర్పడుతూ ఉంటుంది. చాలా అరుదుగా తప్ప ఈ శాసనాన్ని ధిక్కరించు వారు మానవకోటిలో తరచుగా ఉండరు. అందువల్లనే స్త్రీ,పురుషుల కలయిక కేవలం సహజమైన శారీరక సంబంధమేనని అనేకుల అభిప్రాయం.

వివాహం స్త్రీ పురుషుల సంబంధానికి ఏర్పడ్డ సాక్ష్యం. అదేవిధంగా సంఘం మొదట కుటుంబంతో ప్రారంభించబడింది. కుటుంబంలో భార్య, భర్త, పిల్లలు ఉండేవారు. కొన్నాళ్ళకు సన్నిహితులైన అల్లుళ్ళు, బావ, మరుదులు చేరసాగారు, కొన్నాళ్ళకు వీరు నాయకులై తరచుగా భూమి తగాదాలలోనూ పొలిమేర్ల తగవుల్లోనూ ఒకరికొకరు గొడవపడుతూ చిన్న చిన్న ముఠాలుగా ఏర్పడ్డారు. ఈ ముఠాల ఏర్పాటులో ఒకే ఇంటి పేరున్నవారంతా తండ్రి పక్షాన ఉన్నావారు. అందరూ కలిసిమెలిసి ఉండటం ఒక పద్ధతి. ఒకే నాయకుడి కింద అనేక గోత్రాలవారు అనేక ఇంటిపేర్లవారు కలిసి ఉండటం మరో పద్ధతి. కుటుంబం గట్టిగా నిలబడటానికి 'తన' అనే భావం ఎంతో అవసరం. ఒకే గోత్రానికి అందరూ కట్టుబడి ఉండటానికి 'మన' అన్న భావం తప్పనిసరి. ఈ రెండు భావాల్లో ఉండే పరస్పర స్నేహం కానీ, వైరుధ్యం గానీ సంఘం యొక్క మేలుకూ, కీడుకూ పునాదులు వేస్తుంది. కుటుంబాన్ని సరైన కట్టుబాట్లలో పెట్టగలిగింది వివాహం, ప్రపంచంలోని ఆదివాసీల్లో కొందరికి ఉన్న వివాహపద్ధతులు మరి కొందరికి లేవు. కొన్నిజాతుల్లో ఒకే భార్యకు అనేక మంది భర్తలు ఉన్నారు. కొందరిలో ఒకే భర్తకు అనేక మంది భార్యలు ఉంటారు. మరి కొన్నిచోట్ల కొన్ని గంటలసేపుకు, కొన్ని దినాల వరకూ చట్టసంబంధమైన వివాహాలు జరుపుకోవచ్చు. మరికొందరిలో ఒకసారి వివాహం అయిన

వారుజీవితాంతం వరకూ మరొకరిని వివాహం అడటానికి వారి సంఘంలోని చట్టం ఒప్పుకోదు. మరి కొందరిలో అటు, వివాహం తంతు కానీ నామమాత్రంగా కూడా అనేక వింతలు, వేడుకలు జరుగుతూ ఉంటాయి. ఇందులో కొన్ని వికారంగా కూడా ఉండేవి. కొన్ని జాతుల్లోని దంపతుల్లో భార్యకు ఉన్న హక్కు అధికారం భర్తకు లేదు. మరికొందరిలో భర్త భార్యను ఎవరికైనా బానిసగా అమ్మినా తప్పుగా పరిగణించేవారు కాదు.

మధ్యప్రదేశ్‌లోని గోండు జాతిలో తాత మనువరాలిని, మనుమడు అవ్వను వివాహం చేసుకొనే ఆచారం పూర్వం ఉండేది. అన్న చెళ్ళెళ్ళు కలుసుకున్న సంబంధాలు కూడా ఉన్నాయి. కానీ అవి చాలా అరుదుగా ఉండేవి. ఒరిస్సాలోని బోండో జాతివార స్వగ్రామాల్లో పిల్లలను వరించరాదు. ప్రతి ఊరు కొసన యువతీ - యువకుడు సల్లాపాల కొరకు దట్టమైన ఆకులతో కప్పబడిన నలుచదరపు గుంటలు ఉండేవి. లోపలకు దూరడానికి చిన్న కంతలు ఉండేవి.

లేడిపిల్ల వలె అమ్మాయి పరిగెత్తుతుంది. బాణం వలె పిల్లవాడు తరుముతూ ఉంటాడు. వీరు అడవిలో పరిగెత్తుతుంటే రెండు పక్షాల ఆదివాసులు ఒకరిపై ఒకరు వరుసగా పాటలు పాడుతూ ఆనందిస్తుంటారు. పిల్లను కౌగిట్లో చిక్కించుకున్న తరువాత పెండ్లికొడుకు అడవిలో చెట్లు మాటున ఆమెను లాక్కొనిపోయి క్రీడల్లో తన్మయుడౌతాడు. కొంతసేపటికి ఇద్దరు బంధువులను కలుసుకొన్న తరువాత స్త్రీలు పెండ్లి కుమార్తెను అలంకరిస్తారు. మనువు మాట్లాడుకోడానికి వచ్చినవారు పెండ్లి కుమార్తె ఇల్లు చేరగానే చేతి కర్రలను పోగుచేసి ఒక మూల ఉంచుతారు. ఇంటివారు సమ్మతించినట్లైతే అందుకు సూచనగా కర్రలను లోపలకు తీసుకుపోతారు. కొందరు స్త్రీలు వెంటనే కూజాలతోనీళ్ళు తెచ్చి అతిథుల పాదాలను కడిగి వేటాడే వలలు పరచి కూర్చోబెడతారు. నిద్రపోవడానికి గ్రామంలో వేరువేరు వసారాలు ఉంటాయి. పెండ్లైన పిల్లలకు పాతివ్రత్యంలో హంసపాదులు ఉండకపోయినా అంతకు పూర్వం రాసక్రీడలు రసవంతపు సౌఖ్యాన్ని అనుభవించని అబలలు అరుదుగానే ఉంటారు. గ్రామంలో ఒక్కొక్క రంభకు ఎవరో ఒక నలకుబేరుడు ఉండనే ఉంటాడు.

ఆదివాసీలలో సామాన్యంగా పెండ్లింద్లు యుక్త యవస్సు వచ్చిన వెంటనే జరుగుతాయి. అంతే కాకుండా భర్త భార్యకంటే పెద్దవాడుగా ఉంటాడు. ఒక వేళ భార్య వితంతువుగా ఉండినా భర్త ఆమెకంటే సామాన్యంగా వయస్సులో పెద్దవాడై ఉంటాడు. పెళ్ళిళ్ళను ఇరుపక్షాల తల్లిదండ్రులే చేస్తారు. తల్లిదండ్రులు లేని పక్షాన ఆయా కుటుంబాల సమక్షంలో బంధువులలో పెద్దవారు కానీ, మరీ సన్నిహిత బంధువులు కానీ, ఆప్తులలో ఉండే పెద్ద వారు గాని పెద్దలుగా ఉండి వివాహాలు జరిపిస్తారు. అనేక కుటుంబాల్లో వివాహమైనట్లు చిహ్నంగా పెండ్లి కుమార్తెలు ఏదో ఒక వస్తువును ధరిస్తారు కొన్ని కుటుంబాల్లో ఒక యువతి ఒకే భర్త ఉండటానికి నిదర్శనంగా ఏదో ఒక వస్తువును ఆమెకు ధరింపచేసే అలవాటు కూడా వుంది.

అత్తవారింటిలో అడుగుపెట్టిన కొత్త కోడలు మొదటి దినమే వడ్లుదంచవలసి ఉండేది. రెండో రోజు చేతులు పట్టాల్సి ఉంటుంది. మూడవ దినం కట్టెపుల్లలను సేకరించాల్సి ఉంటుంది. నాలుగవ రోజు ఆకులను కోసి ఇంటికి తేవాల్సి వుంటుంది. ఐదవ రోజున మామగారు కొడుకును తోడుగా ఇచ్చి మర్యాదతో కోడలను సత్కరించి పుట్టింటికి పంపుతారు. ఈ విధంగా వారి వారి హోదాలను అనుసరించి సకల మర్యాదలు రెండు కుటుంబాల మధ్య జరుగుతూ ఉంటాయి.

గోదావరీ తీరంలోని కొండరెడ్ల - వివాహ పద్ధతులు:

గోదావరీ తీరంలోని కొండరెడ్లలో పెళ్ళికుమార్తెను బలవంతంగా ఎత్తుకుపోయే ఆచారం ఉండేది. ఈ తరహా రాక్షస వివాహ పద్ధతి హిందూదేశ చరిత్రలో ప్రసిద్ధి చెందింది. వేల సంవత్సరాల క్రిందట పృథ్వీరాజ్ వంటి వీరపురుషుడు కూడా జయచంద్రుని కుమార్తె అయిన

సంయుక్తను కాపుకాచి తీసుకుపోయాడు. శ్రీకృష్ణుడి వివాహం అందరూ ఎరిగిన విషయమే. ఈ విధంగా తీసుకుపోబడిన యువతిని అతిశీఘ్రంగా వివాహం చేసుకొనుట అందరూ అనుసరించే అలవాటే. బాలిక మొదట ఎదురుతిరిగినా కొంతసేపటికి తప్పదని తెలిసి లొంగిపోవుట అందరికీ తెలుసు. ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు పోట్లాటలు పంచాయితీలు, తీర్పులు, జరిమానాలు ఉండవు. కోయలలోనూ, కొండరెడ్లలోనూ జరిమానాలు, తీర్పులు లేకపోలేదు,కోయలలోనూ, కొండరెడ్లలోనూ గాఢంగా ప్రేమించుకున్న యువతీ యువకుల జంటల విచిత్ర గాధలు చాలా ఆశక్తికరంగా ఉంటాయి. పెండ్లి కుమార్తె తండ్రికి అల్లుడు సమర్పించే 12 రూపాయల్లో 3 రూపాయలు మామాగారు, 5 రూపాయలు అత్తగారు, 2 రూపాయలు పెండ్లి కుమార్తె 2 రూపాయలు పెండ్లి కుమార్తె అమ్మమ్మ పంచుకుంటారు.

రసవంతమైన ప్రేమ కలాపాలు సాగించడంలో సంతాలులు ఎవరికీ తీసిపోరు, జాతర్లలోనూ, తిరునాళ్ళలోనూ, ఇతర వేడుకలు జరుపుకొనేటప్పుడు ఆ వివాహితులైన స్త్రీలు కుర్ర వయస్సులోఉండే పురుషులతో సరస సల్లాపాలు కొంచెం హెచ్చుగానే సాగించడం వారికి అలవాటు శకుంతల - దుష్యంతుల నాటి నుండి వచ్చిన ఈ ఆచారంలో ఉన్నదంతా ఒప్పేగానీ తప్పంటూ ఏమీ లేదని సంతాలుల అభిప్రాయం. సంతాలుల ప్రేమ జంటలు ప్రేమ పాఠాలను వల్లెవేసేది వెన్నెల రాత్రుల లోనూ, అడవి పొదల్లోనూ, దట్టమైన అడవి చెట్లలోనూ, భార్య వ్యభిచరించినప్పుడు, పుట్టింటినే అంటిపెట్టుకొని ఉన్నప్పుడు పిల్లలు పుట్టనప్పుడు, పెనిమిటి పెండ్లి సంబంధాన్ని తెగతెంపులు చేసుకొని భర్తను వదిలివేసే హక్కు ఉంది. వ్యభిచారం రుజువైతే తప్పుచేసిన మగవారు సైతం అధిక జరిమానాలు పంచాయితీలకు కట్టవలసిందే.

ఒకొక్కప్పుడు చంటిబిడ్డల వలే భర్తలను ఎత్తుకు తిరిగే బలిష్టమైన భార్యలను చూడగలం. నిద్రమత్తులో మైమరచిన పురుషుణ్ణి ఎండవచ్చిన తర్వాత భార్య లేపేది కాలితోనే. ఇక్కడ ఆదివాసీల్లో కష్టపడేది స్త్రీలు మాత్రమే. సుఖించేది పురుషుడు. ఇంటి చుట్టూ కాచే అరటిపండ్లను, స్త్రీలు కోసి, ఏరి, బుట్టలకు పెట్టిన పిమ్మట పురుషులు పట్టణాలకు మోసుకుపోయి అమ్మి స్త్రీలకు ఇస్తారు. అటువంటి పరిస్థితుల్లో గిరిజనుల కుటుంబ జీవన విధానం కొనసాగుతూ ఉంటుంది.

ముగింపు :

ప్రస్తుత కాలంలో గిరిజనుల ఆచార వ్యవహారాలు చాలా వరకు విస్మరిస్తున్నారు. మనిషి పుట్టినది మొదలు మరణించే వరకు జరిగే పోడష సంస్కారాలలో వివాహమొకటి. స్త్రీ,పురుషుల నిద్దరిని చతుర్వర్గ సాధన కోసం కలిపే పవిత్ర సంస్కారం. ఇలా అనేక సంస్కృత, సంప్రదాయాలు ఉన్నప్పటికీ కుటుంబానికి మూలం వివాహం కాబట్టి వివాహం గురించిన కొన్ని సంఘటనలను మాత్రమే ఈ పత్రంలో నిరూపించే ప్రయ్నతం చేసాను. ఇటువంటి ఆదివాసీల సంస్కృతీ ఆచార సాంప్రదాయాలు నేడు ఎన్నో కనుమరుగౌతున్నాయి. కాలాన్ని కాబట్టి వాటిని గుర్తు చేసుకోవటం అవసరం.

ఉపయుక్త గ్రంథాలు :

1. సుబ్బమ్మ, మల్లాది 1998 మనము - మన సంస్కృతి.
2. హనుమంతరావు, బి.యస్.ఎల్. భారతీయ సంస్కృతి ఒక పరిశీలన.

బంజారా గేయ సాహిత్యం

– ఆళ్ల అనిత, పరిశోధక విద్యార్థిని, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

బంజారా అనే శబ్దం భారతదేశం అంతటా ఒక విస్తృతమైన అర్థంలో చెప్పబడింది. ఇతర గిరిజన తెగలకు బంజారా తెగకు భిన్నమైన తేడాలు ఎన్నో కనిపిస్తాయి. ప్రపంచం మొత్తం మీద దాదాపు ఒకే భాష ఒకే సంస్కృతి ఆచార వ్యవహారాలుగా కనిపించే భారతీయ గిరిజన తెగలలో అతి పెద్ద తెగ బంజారా అని చెప్పవచ్చు. బంజారా సాహిత్యం ఒక హిమబిందువు. బంజారాల గేయ సాహిత్యంలోని స్త్రీల గేయాలు, శ్రామిక గేయాలు, బాల గేయాలు, శృంగార గేయాలు, దేవతా సంబంది గేయా లపై తెలుగు భాషా ప్రభావం అధికంగా ఉంది. బంజారా గేయాలలో తెలుగు పదాలు గుర్తించలేనంతంగా బంజార భాషా పదాలతో కలిసిపోయి ఉన్నాయి.

ఉదా : తారి మారి జోడి మల్లెపూలేరి వాడి - నారలేరి వనం అపణ్ వాయారో జనం

ఈ గేయ చరణాల్లో "మల్లె" పూలు అనే తెలుగు పదాలు లంబాడి భాషలో పాలలో నీరు వలె కలిసి పోయాయి.

అది మానవుడు సమిష్టిగా జీవించాడు. ప్రకృతి కాల గమనంలో ఆటుపోట్లను ఎదుర్కొంటూ వికాసదశవైపు సాగాడు. "సామాజిక జీవనం వల్ల తనభావాలను అనుభవా లను తోటి వారితో చెప్పుకోవలసిన అవసరం ఏర్పడింది. సైగలతో, సంకేతాలతో ప్రారంభమై క్రమంగా శబ్దాన్ని ఉపయోగించం, ఆ శబ్దాలకు రూపకల్పన చేయడం మేధా శక్తికి, ఆలోచనలకు పదను పెట్టడం ప్రారంభమైనది. సుఖయో, దుఃఖయో అనుభవించినప్పుడు అతని ఉద్విగ్న హృదయం నుండి లయాన్వితమైన గేయమో, గేయ పాదమో వెలువడుతుందని, ఇది ప్రజలనోళ్ళలో నాని పెరిగి తిరిగి స్వయంభువుగా నిలుస్తుంద"ని ఆచార్య బి. రామరాజు గారు వివరించారు.

కుటుంబ సంబంధి గేయాలు :

భార్య, భర్త, పిల్లలు గల సమూహాన్ని కుటుంబమని అంటారు. అమరకోశకారుడు కుటుంబ శబ్దమునకు పరివాహము, సంతతి మొదలైన అర్థాలను చెప్పాడు. మోనియర్ విలయమ్స్ సంస్కృత ఆంగ్ల నిఘంటువులో కుటుంబం అనగా "a house hold" n" memebers of a house hold అని family చెప్పడం జరిగింది.

పూర్వం కుటుంబంలో భార్య భర్త ఉన్న సమూహము తోనే ప్రారంభమయిందని చెప్పవచ్చు. కుటుంబం యొక్క ఉద్దేశము సంతాన సృష్టి కనుక సంతానమును పొందిన స్త్రీ, పురుషులు కలిసినప్పుడే కుటుంబం ఏర్పడుతుంది. కుటుంబ వ్యవస్థలో ఆర్థిక, సాంఘిక, భౌగోళిక, సాంస్కృ తిక విభేదాలు ఉండవు. ఇది అనాది కాలం నుండి వస్తున్న కుటుంబ వ్యవస్థ.

బంజారా కుటుంబ వ్యవస్థలో అనురాగాలు, అను బంధాలు, మనసులో కలిగిన భావాలు పాటలుగా పరవళ్ళు తొక్కుతూ తరతరాల నుండి మౌఖికంగా ప్రచార మవుతూ కుటుంబ సభ్యులను సంబోధిస్తూ పాడేపాటలు సభ్యుల అనురాగాలను, అనుబంధాలను తెలుపుతాయి. బంజారా కుటుంబంలో భార్య భర్తల మధ్యఉండే సర సాలు, విరసాలు, బాధ్యతలు, వదినమరదళ్ళు, అక్కా బావలు, అత్తా కోడళ్ళు మధ్యన ఉండే మధురమైన చలోక్తులు, తల్లీ కూతుళ్ళ మధ్య ఉండే అనురాగం ఆత్మీయతలు, వాటి నుండే అభిప్రాయభేదాలు, అన్నా చెల్లెళ్ళ మధ్య ఉండే అప్యాయత, తల్లిలేని పిల్లల యొక్క అప్యాయత అనురాగాల నుండి రూపుదిద్దుకున్నవే గేయాలుగా మనం చూడవచ్చు.

భార్యా, భర్తల సంబంధ గేయాలు :

కుటుంబంలో భార్యా భర్తల పాత్ర చాలా ముఖ్యమై

నది. భార్య భర్తలు కలిసి మెలిసి జీవిస్తూ, ఒకరికొకరు ప్రేమాభిమానాలను ఇచ్చిపుచ్చుకుంటూ, కష్టసుఖాలలో పాలు పంచుకుంటూ అన్యోన్యంగా ఉండాలి. కొందరు పరస్పరము పోట్లాడుకుంటూ, మనస్పర్థలను పెంచుకుంటూ వాళ్ళ జీవితాలను, అటు వారి కుటుంబ జీవితాన్ని నరకం చేసుకునే వారుంటారు. జానపదుల ప్రేమానురాగాలను, సుఖదుఃఖాలను, కోపతాపాలను బంజారాలు తమ పాటలలో వ్యక్తీకరిస్తారు. తన మాట వినని భార్య గురించి భర్త తన తల్లిదండ్రులతో తమ పాటలతో వ్యక్తీకరిస్తారు. తన మాట వినని భార్య గురించి భర్త తన తల్లిదండ్రులతో చెప్పేటప్పుడు పాడే పాట ఇది.

"కామ కరేన జోకటో యాడి కలెంక ఘాలుకర ఉలాడాయి మారు కర పాని భరేన జోకలో బాపు పాని భరేని కచ
ఓరో టొంకణో ఉంపడేని కచ
ఏ బాపు తార బ్వాడి మార వాత మానేని కాంయి కరూ
ఏ యాడి తార బ్వాడి మార వాతమానేని కాంయి కరూ ॥ కామ ॥
వాయకరోజేన వరస హూయో కోని యాడి ఊ ధాంటి ధాంటి హిండుచ
మన దూర కరు కన కచ
వాడి తోడేన జోకలో బాపు తడకో లాగకనే కచ
మార హత బల కన కచ
వాడి తోడేన జోకలో బాపు తడకో లాగకన్ కచ
మార హత బల కన కరచ
మోట ఘరేర్ భేటి కన బాపు మాజె కరూ కన కరమే వాలె కరు కరచ ॥ ఏ యాడి ॥

భావం :

ఈ గేయంలో అబ్బాయి తన భార్య గురించి అమ్మా నాన్నలకు వివరించడం జరిగింది.

"అమ్మా ! నీ కోడలు పనికి వెళ్ళమంటే, తను ఎండలో తిరిగి పని చేయనంటోంది, చేనుకు వెళ్ళి మిరపకాయలు తెంపుదాం రమ్మంటే నాకు చేతులు మండుతాయని, మంచినీళ్ళు తీసుకురమ్మంటే నాకు చాతకాదు అని, పెళ్ళయి సంవత్సరం కూడా కాలేదు ఎక్కడెక్కడికో తిరుగుతున్నది, నేను పెద్దింటి అమ్మాయిని, ఏ పని చేయక ఇంట్లోనే ఉంటానని అంటోంది.

భార్య భర్తల అనుబంధం గురించి ఒకరినుండి ఒకరు. అందిపుచ్చుకునే ఆప్యాయతానురాగాల గురించి ఈ గేయంలో తెలపడం జరిగింది.

"సాతె పెర టేర వాళో మాటిరే
లూరి వాటేన ఝారరీచు దాడిరే
వాడి సారీ లూరి నామ జడేపర లఖియాయి.
తారే వాసు మార దళ్ళ పూలేమ గోకి ఆయి
తాండో సారి తారె వాసు హయితి దుండియాయి
అత్త ఒత్త మీ తారో జాడ కాడియాయి
కత్తి తారో జాడ ఛేని మాటిరే
దిటి తారె వాసు అంకీయా హసుతి దాడిరే"

భావం :

ఈ గేయంలో భార్య తన భర్త గురించి రోజు ఎదురు చూస్తూ తన ఆవేదనను భర్తకు తెలుపుతుంది. 'నీ వెంట ఏడు అడుగులు తిప్పి, నన్ను విడిచి ఎక్కడికి వెళ్ళావు? నీ కోసం ఊరూరా తిరిగినా నీ జడ కనబడలేదు. నీ కోసం మన చోట చెట్లన్నింటిమీద నీ పేరు రాశాను. నీ కోసం నా మనసును పూలతో నింపాను. తండా మొత్తం తిరిగి నీకోసం బాధతో వెతికాను. కాని నీవు నాకు కనబడలేదు. నాకు నీ మీద బెంగతో ఏడుపు వస్తున్న"దని దీని భావం.

అత్తా కోడళ్ళ సంబంధ గేయాలు :

కోడలు అనగా కుమారుని భార్య, కోడలు అనే పదము కోడి - ఆలు అనే పదాలు కలయికతో అయింది. దీన్ని బట్టి వయసులో ఉన్న స్త్రీగా ఇంటికి వచ్చి ఇంటి వారిలో ఒకరిగా చేరిన యువతి అని అర్థం. కొత్తకోడలు అత్తవారింటికి వెళ్ళగానే కొత్తలో ఆ ఇంటికి నూతన శోభ

ఏర్పడుతుంది. సమిష్టి కుటుంబంలో అత్తామామలు, బావమరదళ్ళు, ఆడపడుచులు, తోడికోడళ్ళు అందరూ కొత్తవారే. ఈ వాతావరణంలో కొత్తగా వచ్చిన కోడలికి బంగారు పంజరంలో చిలుకవలె అనిపిస్తుంది. కుటుంబ వ్యవస్థలో తెలుగువారి ఇళ్ళలో కనబడే మాదిరిగా అత్తాకోడళ్ళు మధ్యకనబడే పగా ప్రతీకారాలు, అప్యాయత, అనురాగాలు, కసి, కక్ష్య, సహజంగా ఉంటాయి.

ఈ గేయంలో అత్తాకోడళ్ళ మధ్య సామరస్యము చాలా తక్కువగా ఉండటం వర్ణించబడింది.

"బ్వాడియో బ్వాడియో మారె బెటారి టాండరి
కాచ్చో దుదెపర తరి చేరి కసేన
తాటో దూదేపర నూని కసన ఛేని
తేలేమారి గిన్నాపర ప్యాసడ కసన ఛేని
సాసు ఏ మారుసాసు కాచ్చో దుదె పర తరికత్తి
తాటో దూదె పర కత్తి నూని రగ
తెలమారి గిన్నపర కత్తి ప్యాసడ రక
వర పరేరి యాడియె తమే దేకతో
మార సాసు హరమత్ లేరి యే బాయ్యే"

భావం :

కొత్తగా వచ్చిన కోడలిని అత్త తన చెప్పు చేతలతో ఉంచుకనే ప్రయత్నం ఈ గేయంలో చూపించడం జరిగింది. "ఓ నా కోడలా ! పచ్చిపాలలో మీగడ ఏది? వేడి పాల మీద వెన్న ఏది? గిన్నెలోని నూనెలో నురగఏది? అని అత్త అడగుతుంది. దానికి బదులుగా కోడలు "పిచ్చి పాలలో మీగడ ఉంటుందా? వేడి పాలలో వెన్న వుంటుందా? అలాగే గిన్నెలోని నూనెలో నురుగు ఎక్కడైన ఉంటుందా?" అని సమాధానం ఇచ్చి ఇరుగు పొరుగు వారికి తన అత్త పెట్టే బాధను చెప్పుకుంటుంది.

బావ మరదళ్ళ గేయాలు :

బావ మరదళ్ళ పాటలు, వదిన మరదళ్ళ పాటలు భలే హస్యాన్ని కల్గిస్తాయి. బావను ఆటపట్టించడంలోను, అత్తా కోడళ్ళ సంవాదంలోను, వదినా మరదళ్ళ వేళా కోళంలోను ఆడపడుచుల అవకతవక పనుల్లోను, భార్యా భర్తల శృంగార చేష్టలోను... ఇలా అనేక రూపాల్లో బావను మరదళ్ళు ఆటపట్టిస్తూ హాస్యపు జల్లులు కురిపిస్తూ ఉంటారు.

"కతకన దుండు చ్వారారే మారె దళ్ళెన మారరోచిరే
కుకనబులు తోన రే మారి దలేమ హలరోచిరే
ఆంకిర ఆంగ కునిరతి తోనతో కేలేరిరే
ఎకలి కత్త జావూరితే లూరీ ద్యానేమి పడజారి
మారి మన్నేటి మన్నేటి మనసుమా రేగొరే"

భావం :

ఈ గేయంలో మరదలు తన బావను గుర్తు చేసుకుంటూ "నన్ను విడిచిపెట్టి నువ్వు ఎక్కడికి వెళ్ళావు? నీ జ్ఞాపకాలు నా మనసులో చెరగని ముద్రను వెశాయని, ఎవరిని చూసినా నువ్వే గుర్తొస్తున్నావని, ఒంటరిగా ఎక్కడికి వెళ్ళినా నీ జ్ఞాపకాలు నన్ను వెంటాడుతున్నాయన, నా మనస్సులో నీ స్థానం ఎన్నటికీ పోదని, నువ్వు ఎప్పుడు వస్తున్నావని, ఎక్కడవున్నా తన దగ్గరకు దయచేసి తొందరగా రావాలని తను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని" అతని కోసం పరితపిస్తున్నట్లు ఈ గేయం ద్వారా తెలియపరచడం జరిగింది.

సోదరీ సోదరులు గేయాలు :

చిన్ననాటి నుండి ఒకే చోట పెరిగిన వారు ఎలాంటి భేదాలు లేకుండా అనుబంధాన్ని పెంచుకుంటూ పెరుగుతారు. అలాంటి అక్కా చెల్లెళ్లు వివాహమయిన తరువాత అత్తింటికి వెళ్ళినప్పుడు అన్నదమ్ములపై ఉన్న మమకారము, ప్రేమానురాగాలకు కొరత ఏర్పడుతుంది.

ఈ గేయంలో తన సోదరి పెళ్ళిసంబంధమైన ఆచార సంప్రదాయం వారి అలంకరణ గురించి సంస్కృతి గురించి తెలపడం జరుగుతుంది.

"భీయా ఓరే జాతెరో హళదేరో టికో
మనకోని సావరె భీయావో
భీయ సురె జాతెరో హళదేరో టెకో

మారి బావ జీన్ సావిరే భీయావో
భీయా వోరే చందాణేరో టికో
లూరి బ్యానేన సావె భీయువో''

భావం :

అమ్మాయి అన్నలు ఎవరైనా ఐదుగురు తలపాగ చుట్టుకొని అమ్మాయికి పెండ్లి కుమారునికి బొట్టు పెట్టడం బంజార సంస్కృతి అయితే అమ్మాయికి బోట్టు పెట్టనివ్వకుండా తోటి అడపిల్లలు పై విధంగా పాడు కుంటూ అడ్డుకుంటారు. అయినా ఎలగైనా ప్రయత్నించి బోట్టు పెడుతారు. పెళ్ళి సందర్భంలో ఏ విధంగా ఉండాలో బంజారాలు తమ సంస్కృతీ సంప్రదాయాలు ఎలా పాటించాలో చక్కగా ఈ పాటలో వివరించడం జరిగింది.

ఉపయుక్త గ్రంథాలు :

1. బంజారాల చరిత్ర, సంస్కృతి - డా॥ గుగులోత్ వీరన్న
2. గిరిజన సాహిత్యం - ఆచార్య ఎం. గోనానాయక్
3. బంజారా సంస్కృతి ప్రదర్శన కళలు - జి. శంకర్‌నాయక్
4. బంజారాల తీజ్ పండుగ - ఆచార్య భట్టు రమేష్
5. గిరిజన సాహిత్యంలో లంబాడీ స్త్రీల జీవన చిత్రణ - డా॥ లావుడ్య సుజాత
6. బంజారా గేయ సాహిత్యం - తెలుగు ప్రభావం - డా॥ లూనావత్ నెహ్రూ నాయక్.

ఘోషిస్తున్న గిరిజనం

– డా॥. పి. కుమారి నీరజ, సహాయాచార్యులు, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు.

'గిరి' అంటే 'కొండ'. కొండల్లో నివశించే వారు గిరిజనులు. వీరినే 'Tribes' అని పిలుస్తారు. భిన్న జాతుల సమాహారమైన భారత ఉపఖండంలో అనేక గిరిజన సముదాయాలు నివసిస్తున్నాయి.ఆదివాసీలు తమ ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయం, సామాజిక విలువలను కలిగి వుంటారు. పరిసరాలతో సహజీవనం చేస్తూ ఆర్థికంగా వెనుకబడి వుంటారు. వీరి ఆచార కర్మకాండలు మొరటు అనుకుంటారు. వీరి భాషకు లిపి ఉండదు. నిరక్ష రాస్యులు.

గిరిజనులు అడవిబిడ్డలు. అడవిలో దొరికే వాటిని స్వేచ్ఛగా అనుభవిస్తూ అమాయకంగా జీవనం సాగించే వారు. ఎలాంటి కల్మషం లేని బతుకులు వీరివి. వీరి కంటూ ప్రత్యేక జీవన విధానాన్ని ఏర్పరచుకొని బతుకు తున్న వాళ్ళు వీళ్ళు. ఇలాంటి అడవితల్లి బిడ్డలకు ఇప్పుడు చాలా కష్టం వచ్చింది. మానవ జాతికి, సంస్కృతికి ఆధారం గిరిజన తెగలు. వీరు నేడు ఎదుర్కొనే సమస్యలు అనేకం.

ప్రభుత్వం తీసుకొచ్చిన అటవీ చట్టాలు, పారిశ్రామికీ కరణ, ప్రాజెక్టుల నిర్మాణం ఒకలాంటి సమస్యలైతే, నక్సలైట్లు, పోలీసులు, భూస్వాములు, ఇతర ఉద్యోగులు మొదలైన గిరిజనేతరులవల్ల ఎదురయ్యే సమస్యలు మరోరకం. వైద్యసదుపాయం, రహదార్లు, రవాణా, కరెంటు మొదలైన సౌకర్యాలు లేకపోవడం మరో రకం సమస్యలు. వెరసి మనుగడే ప్రశ్నార్థకం.

గిరిజనుల అమాయకత్వం గిరిజనేతరుల ఆదాయ మార్గమైంది. ఫ్యాక్టరీల వల్ల నాగరిక సంప్రదాయాలు అల వాటయ్యాయి. సంప్రదాయాన్ని నిలుపుకోవడానికి జరిమా నాలు కూడా విధించుకునేవారు. సంప్రదాయాన్ని అతి క్రమిస్తే దేవత ఆగ్రహిస్తుందని నమ్మేవారు. వరదలు వచ్చి నప్పుడు గోదారి, కృష్ణమ్మ తల్లుల కడుపులో ఎన్ని ప్రాణాలు బలైనప్పటికీ ఆ ప్రాంతాలను వీడరు.

కరెంటు, విద్య, వైద్యం, రోడ్డు రవాణా మొదలైన సౌకర్యాలు అందుబాటులో లేక అడవి మధ్యలో జీవితాన్ని వెళ్లదీస్తారు. జంతువులనుండి, గిరిజనేతరులనుండి, పోలీ సుల నుండి, ఫారెస్టు అధికారులనుండి వచ్చే సమస్యలు ఎదుర్కొంటున్నారు. జంతువులకంటే గిరజనేతర మాన వున్ని చూస్తే చాలా భయపడతారు.

భారతదేశంలో 294 గిరిజన తెగలు నివసిస్తున్నాయి. భారతదేశంలో 10 కోట్లమంది గిరిజనులు నివసిస్తున్నారు. ఖనిజ నిక్షేపాలు పుష్కలంగా ఉన్న రాష్ట్రాల్లోని దట్టమైన అడవుల్లో వీరు మనుగడకోసం పోరాడుతూ దుర్భర జీవనం గడుపుతున్నారు.

అటవీ హక్కుల చట్టం 2006 ప్రకారం 2005 డిసెం బరు 13కి పూర్వంనుంచి అడవిలో నివసిస్తున్న గిరిజను లకు వారి అనుభవంలో వున్న భూమిలో నివసించే హక్కు వుంటుంది.

ఆదివాసీలు ఎక్కువగా ఒడిసా, మధ్యప్రదేశ్, ఛత్తీస్ ఘడ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, మిజోరం, అండమాన్ నికోబార్ దీవుల్లో నివసిస్తున్నారు.

తెలంగాణా – ఆంధ్ర ప్రదేశ్‌లలో గిరిజనులు :

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఖమ్మం, వరంగల్, ఆదిలా బాద్, మహబూబ్‌నగర్ జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో చిన్న చిన్న ఆవాసాలున్నాయి. ఆదివాసీ గిరిజనులను పంచమ జాతివారుగా శూద్రుల కింద వచ్చే వర్ణంగా, అంటరాని వారుగా భావిస్తారు. మానవ మూలం వీరినుండే ఆవిర్భ వించిందంటారు.

తెలుగు రాష్ట్రాల్లో గిరిజన తెగలు :

తూర్పు కనుమలు, నల్లమల కొండలోయలు అడవీ

ప్రాంతాల్లో నివాసముంటున్నారు. జిల్లాలవారీగా ఆదిలాబాద్, విశాఖపట్నం, నల్లగొండ, రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో ఎక్కువగా వున్నారు.2001 జనాభా లెక్కల ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో గిరిజనులు 50.24 లక్షలు. రాష్ట్రజనాభాలో 6.6%. తెలుగు రాష్ట్రాల్లో 33 గిరిజన తెగలున్నాయి. 1.ఆంధ్ 2.భగత 3.భిల్లులు 4.చెంచులు 5. గదబ 6.గోండులు 7.గౌడ ఏజెన్సీ తెగ 8.కొండ రెడ్లు 9.కొండకాపులు 10. జాతపు 11.కమ్మర 12.కట్టునాయకన్ 13.కోలామ్ 14.మన్నెదొర 15.కొండదొర 16.ఖోండులు 17.కోటియా 18.కోయ 19.కులియా 20.మాలి 21.ముఖదొర 22.ప్రధానులు 23.పోర్జా 24.రెడ్డిదొరలు 25.రోనా 26.నవర 27.తోటిలు 28.వాల్మీకి 29.ఎరుకలు 30.యానాది 31.బంజారా 32.దులియా 33.నక్కల కురివకరన్.

ఏళ్ళతరబడి గిరిజనులు అడవుల్లో నివాసాలు ఏర్పరచుకున్నారు. ఒక్కో గూడెంలో పది, పదిహేను గుడిసెలుంటాయి. అడవుల మధ్యలో కొండచరియల అంచుల్లో రహదారి లేకపోవడం ఇబ్బందులకు గురిచేస్తుంది.

దారిలేకపోవడం :

'పాడేరులో వున్న 11 మండలాల్లో 3497 గిరిజన గ్రామాలున్నాయి. వాటిలో 1473 గ్రామాలు కొండ దిగువనున్నాయి. మిగతా 2026 గ్రామాలు కొండలపైనున్నాయి. జనాభా విషయానికొస్తే 503874 మంది. ఇందులో 461000 మంది కొండలపైన మిగతా వాళ్లు దిగువనున్నారు. నాలుగు లక్షలమంది కొండ ఆవాసాలకు చెందిన వారే. వీరి గూడేనికి వెళ్లాలంటే గుర్రాలమీద వెళ్తారు. గుర్రం బ్రిటీషువారి పాలనా కాలంనుండి ఉపయోగిస్తున్నారు. రహదారి ఈ ప్రాంతాన్ని తొంగి చూళ్లేదు. ఎర్రబస్సులు ఈ ప్రాంతాన్ని చూడలేదనడానికి రహదారి లేకపోవడం. ఆదివాసీల అడవి ఓడ గుర్రం'. అంటారు మానేపల్లి సంజీవరావు 'ఆదివాసీల అడవిఓడలో'.

చిత్తూరు జిల్లా పెద్దమండ్యంలో నివాసముంటున్న గూడెంకి ఎటువంటి రహదారి లేదు.పెద్దేరు నది ఉధృతంగా ప్రవహిస్తున్నా కనీస అవసరాలకోసం పెద్దమండ్యం చేరాలంటే గిరిజనులు నదిలో ప్రయాణం చేయాలి.

'డిసెంబరు 2005 పెద్దమండ్యం దాటుతూ బండ్రేవు గ్రామం దళితవాడకు చెంది పెద్ద మల్లయ్య అనే వ్యక్తి మృతి చెందాడు. దీంతో గిరిజనులు ఆవేదన చెందారు. పెద్దమండ్యం ప్రాజెక్టు నీరు వస్తుండడంతో ఏరు దాటాలంటే మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు'. ప్రమాదమే..... ప్రయాణం చేయక తప్పదు అంటారు 'ఈనాడు'లో.

కరువు :

కరువుకాలంలో గిరిజనులు పిల్లాపెద్దా తేడాలేకుండా అందరు పస్తులే. గ్రాసం దొరక్కపోవడంవల్ల పశువుల పరిస్థితి అంతే. తిండిగింజలకోసం అప్పులు చేసి తీర్చలేక చివరకు భూమిని అప్పులిచ్చినవారికి స్వాధీనం చేస్తున్నారు. కరువులో తిండికే కాక నీటికోసం పడే ఇబ్బందులు దుర్భరం.

'ప్రాథమిక అవసరమైన నీరు సమృద్ధిగా లభించక పోవడంతో వలసబాట పడ్తున్నారు. చెలమల్లోని కలుషిత జలాలే దిక్కు ఆదిలాబాద్ జిల్లాలో ఏజెన్సీలోని 44 మండలాల్లో వందల గ్రామాల్లో గుక్కెడు మంచినీళ్లు లేక అల్లాడుతున్నారు.....కెరిమెరి మండలంలోని చాల్‌బాడీ గ్రామం నీటికోసం కొండదిగి మూడుకిలోమీటర్లు నడిచి అసిఫాబాద్ వెళ్లాలి. మూడు గంటల సమయం పడుతుంది. ఈ కష్టాలు తట్టుకోలేక వలస బాటపడ్తున్నారు. 'ఏజెన్సీకి దాహం ఈనాడు'లో.

వైద్యం :

గిరిజనులు తినే తిండి, తాగే నీళ్లు సరిగా లేకపోవడం వల్ల అనారోగ్యం పాలైతే అడవుల్లో వైద్య సదుపాయాలూ లేనందున వివిధ రోగాలతో మరణశయ్యను ఆశ్రయిస్తున్నారు.

'ఏజెన్సీ ప్రాంతంలో మలేరియా జ్వరంతో బాధ పడుతూ సరైన వైద్య సౌకర్యం అందక మరణిస్తున్నారు. ఈగలు వాలిన, కుళ్లిపోయిన పళ్లుతిని అనారోగ్యం పాలవు తున్నారు. విశాఖ మన్యం ఏజెన్సీలో 11 మండలాల్లో పోస్టులు ఏళ్లతరబడి ఖాళీగా వున్నాయి. వైద్యబృందం లేకపోవడంవల్ల జ్వరం సోకిన గిరిజనులు థిసారీని (నాటు వైద్యున్ని) ఆశ్రయిస్తున్నారు. మన్యానికి మందేది' ఈనాడులో ప్రచురితం.

గిరిజనుల్లో నిరంతరం శిశుమరణాలు, ప్రసూతి మర ణాలు అధికం. విషజ్వరాలు, మెదడువాపు, అంటు వ్యాధులు మలేరియా, టిబి, రక్తహీనత వంటి వ్యాధులు గిరిజనుల్ని పట్టి పీడిస్తున్నాయి. మద్యపానం ఒకప్పుడు ఇప్పసారా తయారు చేసుకుని తాగేవీరు బ్రిటిషు ప్రభుత్వం తయారీని నిషేధించడంతో ఉన్న డబ్బును కల్తీసారా కోసం వెచ్చించి ప్రాణాలకు ముప్పు తెచ్చు కుంటున్నారు.

'బ్రిటిషువారు గిరిజన ప్రాంతాల్లోకి ప్రవేశించి నప్పటినుండి మద్యం సేవించడంపై ప్రవేశపెట్టిన కొత్త పద్ధతులు గిరిజన జీవితంలో మార్పు తీసుకొచ్చాయి. సారా అమ్మకాన్ని ప్రభుత్వ ఆదాయానికి మార్గంగా చేసిన బ్రిటిషు వారు గిరిజనులను తీవ్రంగా దెబ్బతీసారా' **నదీం హస్‌నైన్** 'భారతీయ గిరిజనులు' గ్రంథంలో సినింగ్టన్ అభిప్రాయం.

ఎలుగుబంట్ల దాడులు, పాములు, విషపురుగుల కాట్లు వంటి ఎన్నో సమస్యలు, ఎయిడ్స్, మెనింజైటిస్, డయేరియా వంటి రోగాలు వీరి ప్రాణాలమీద కొస్తున్నాయి.

ఉద్యోగులతో ఇబ్బందులు :

గిరిజనులు నక్సలైట్లకు ఆశ్రయమిస్తున్నారని పోలీ సులు వారిని హింసించడం వారికి నివాసం లేకుండా చేయడం జరుగుతోంది.

'ఛత్తీస్‌గడ్‌లో పోలీసులకు నక్సలైట్లకు జరుగుతున్న పోరాటానికి గిరిజనులు పునరావాస గుడిసెలకి నిప్పం టించారు. 26 మంది గిరిజనులను ఊచకోత కోశారు' 'నక్సల్స్ నరమేధం' ఈనాడులో.

పారిశ్రామికీకరణ :

గిరిజనులు అభివృద్ధికి దూరంగా వున్నారు. ఈ ప్రాంతంలో లభిస్తున్న ముడి సరుకులకు అనుగుణంగా ఫ్యాక్టరీలు నిర్మిస్తున్నారు. ఈ ఫ్యాక్టరీలవల్ల గిరిజనుల జీవితాలకు ప్రమాదం నీరు, గాలి కలుషితమవుతున్నాయి. యురేనియం, గ్రానైట్, సిమెంటుఫ్యాక్టరీలు ఇవన్నీ గిరి జనుల పాలిట శాపాలు.

సాహిత్యంలో గిరిజన సమస్యలు :

ఎరుకల, యానాది, బంజారా, గోండులు, చెంచులు, కోయలు మన మధ్యనే నివసిస్తున్నారు. వీరికీ సాహిత్యం వుంది కానీ మౌఖికం. పాటలు, కథలు, పుక్కిటి పురా ణాలు, సామెతలు, పొడుపుకథలు, నీతి వాక్యాలున్నాయి.

తెలుగు సాహిత్యంలో గిరిజనులపైన లిఖితరూపంలో కొన్ని ప్రక్రియలొచ్చాయి. అవి గిరిజన నవలలు, నాట కాలు, కథలు, గేయాలు, పాటలు, పద్యాలు, కవితలు.

గిరిజనులు పోడు వ్యవసాయం చేసుకునే భూముల్ని లాగేసుకున్నారు. అటవీ చట్టాలు తెచ్చి ఆదివాసులవల్ల అడవులు పాడవుతున్నాయన్నారు. పరిశ్రమలు, వివిధ రకాల ఖనిజాలు వీటికోసం అడవి బిడ్డల్ని తరిమే ప్రయత్నాలు, ప్రాజెక్టుల నిర్మాణం వల్ల ముంపుకు గురౌతారని అక్కడినుండి తరిమేయడం మరోరకంగా వీరిని దెబ్బతీస్తోంది.

పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులైన గిరిజనుల గురించి, మాయమౌతున్న వారి సంస్కృతిని గురించి కవి **పి.విద్యాసాగర్** 'ముంపు' దీర్ఘకవితలో

'చెట్టు తొర్రల్ని జ్ఞాన నేత్రాలుగా మలుచుకుని
రాతి గుహల్లో కలల్ని జెండాలుగా ఎగరేసినవాడ్ని' అని తమ గత చరిత్రను గిరిజనులు తెలియజేస్తున్నారు. తమను గోదావరి నదినుండి దూరం చేయడాన్ని భరించ లేక

'నీళ్ళు లేనితనమంటే
నాగరికత లేనితనమే' అని గిరిజనుల గత చరిత్రను, నాగరిక జీవితాన్ని తెలియబరుస్తున్నారు.

పోలవరంవల్ల ఆదివాసులకు ఒరిగేదేమీ లేదని, ఎన్ని సార్లు చెప్పినా ఒక్కటే నినాదం. పాపికొండలు మునిగిపోతే
'పూలై విచ్చుకోలేక
మొగ్గలై రాలి
ఎవరి దాహాలకో సామూహిక దు ఖాన్నై ప్రవహిస్తున్న
మనిషి ఆదివాసి'.

పులులు భయపెడితే జంతువు కదా! అని నరి పెట్టుకున్నాడు. మనుషులు భయపెడితే ఎక్కడికి పరు గత్తాలో తెలియక ఆకాశమంత ఎత్తుకు అరుస్తున్న ఆది వాసులు కన్పిస్తున్నారు.

అడవులు – చట్టాలు :

'అటవీ చట్టాల వల్ల లాభపడింది కాంట్రాక్టర్లు, ఫారెస్టు అధికారులు. అనేకసార్లు గిరిజనులు దాడులు ఎదుర్కొ న్నారు. పేపరు మిల్లుకోసం వెదురు నరికే కూలీలుగా మారిపోయారు. గిరిజనేతరులు అడవినుండి విస్తారంగా కలప తీసుకెళుతున్నా ప్రభుత్వాధికారులు పట్టించు కోవడంలేదు. గిరిజనులు పొట్టకూటికోసం వెదురు నరికితే కేసులు బనాయిస్తున్నారు. తమ మట్టుకు తాము కూసున్న కొమ్మను కొట్టుకునే వాళ్ళంకాము' అంటారు 'భద్రాచలం మన్యం కథల్లో' **విద్యాసాగర్**.

ఈ మాటలనుబట్టి గిరిజనులు అడవిని నసింప జేసేలా కనిపించరు. నిజంగా ఈ రోజు అటవీ సంపదను దోచుకుంటున్నవారెవరో మనందరికీ తెలుసు.

అరుణ 'ఎల్లి' ఎరుకల జీవితాన్ని ప్రతిబింబిస్తే, **కేశవరెడ్డి** 'అతడు అడవిని జయించాడు' నవల గిరిజనుడి గూర్చి రాసింది. జీవనాధారమైన పంది, దాని పిల్లల్ని అడవిలో పోగొట్టుకుని వచ్చిన వ్యక్తి దీనగాథ ఇది.

అడవిలో పోడు వ్యవసాయం చేసుకునే గిరిజనుల భూముల్ని ఆస్వాములు ఆక్రమించుకుని వారిని బికా రుల్ని చేసే కథలు, అడవిని నాశనం చేస్తున్నారని గిరిజనుల్ని అడవినుండి బయట పంపాలనుకున్న ఫారస్టాఫీసర్ల కథలు ఎన్నో. అందులో 'ఆక్రమణం' **ముదిగంటి సుజాతారెడ్డి**, 'తల్లీకూతుళ్లు', 'పంట', 'బుగతోడు గూడుబండి' **ఎ. అప్పల్నాయుడు**, 'బిగిసిన ఆ విడికిళ్ళు' **శిరంశెట్టి కాంతారావు**, 'మన్యం మండుతోంది', 'దాడి' **పి. విద్యాసాగర్** కథలు.

అడవిలో లభించే ఫలసాయాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన దుకాణంలో అమ్మాలన్నా అవి వారి నివాసాలకు దూరంగా ఉండటంవల్ల గిరిజనులు తమ పంటను అక్కడికి చేర్చలేకపోతారు. దళారీల చేతిలో మోసపోతారు. ఇలాంటి కథే **గోపి భాగ్యలక్ష్మి** 'బతుకు పయనం'.

ప్రభుత్వ చట్టాల వల్ల జీవనోపాధి కోల్పోయిన యానాది తెగ యాతనామయ బతుకుల్ని **డా.వి.ఆర్. రాసాని** 'కుబుసాలు' కథలో చిత్రించాడు. గిరిజన తెగలు ఏ ప్రాంతంలో నివాసమున్నా ఏదో కారణంతో ఖాళీ చేయిస్తూ వారి మనుగడకు గండి కొడుతున్న వైనాన్ని 'వేట' కథలో **వి.ఆర్. రాసాని** చిత్రీకరించారు. అడవిలో పక్షుల్ని వేటాడుతూ జీవించే నక్కలోళ్లను ప్రభుత్వం వేటాడకూడదని శాసనం చేస్తుంది. అడవినుండి తరి మేస్తుంది. వారి జీవనం సంక్షోభంలో పడిన కథ **వి.ఆర్. రాసాని** 'పయనం'.

ప్రాజెక్టుల నిర్మాణం :

అభివృద్ధి అంటే భారీ నీటి ప్రాజెక్టుల పేరుతో లక్షలాది మందిని నిరాశ్రయుల్నిచేసి ఒక వర్గప్రజల ఆదాయాలను పెంచడం కాదు.

ప్రాజెక్టు నిర్మాణంవల్ల గిరిజన సంస్కృతి, ప్రకృతి అందాలు అంతరించిపోతాయి. చారిత్రక పవిత్ర స్థలాలు మునిగిపోయే ప్రమాదముంది. 'పోచవరం, దుర్గంకోట, రాజుపేట, ఏలూరుపాడు, చిగురుమామిడి, టేకూరు, కాకతీయుల కాలంనాటి చారిత్రక కట్టడాలు మునిగి పోతాయి'. 'పోలవరానికి పునాది, గిరిజన ప్రాంతానికి సమాధిలో'.

గోదావరీ పరీవాహక జనావాసాల్లో ప్రభుత్వం నీటి పారుదల ప్రాజెక్టు నిర్మించదలచింది. దీనివల్ల ఎంతో మంది ప్రజలు నిరాశ్రయులౌతారని తెల్పే కథ **జాతశ్రీ** 'అమానుషం'.

జలయజ్ఞం పేరుతో ప్రాజెక్టు నిర్మించి గిరిజన గూడేలను ఖాళీ చేయించి, పునరావాసం కల్పించినా ప్రయోజనం లేని వైనాన్ని చిత్రించిన కథలు **దిలావర్** 'అరణ్య రోదన', **నల్లూరి రుక్మిణి** 'నెగడు', **శిరంశెట్టి కాంతారావు** 'పోరువనం', **యస్. శ్రీదేవి** 'రూపాయి చొక్కా'.

ప్రకృతి వైపరీత్యాలు :

భూకంపాలు, వరదలు, తుఫాన్లు వచ్చినప్పుడు గిరిజన జీవితం స్తంభించిపోతుంది. ప్రకృతి కన్నెర్రజేస్తే గిరిజనుల జీవితాలు అల్లకల్లోలమవుతాయి. ఇలాంటి వాటిని చిత్రించిన కథలు **ఫణికుమార్** 'వరదలలో నాగారం', **విద్యాసాగర్** ఇటు 'కిన్నెరసాని అటు కిన్నెరసాని' కథలు.

గిరిజన స్త్రీలు :

గిరిజన సమాజాల్లో స్త్రీలు నిరక్షరాస్యులు, అమాయకులు. నిరంతరం వ్యాపార నిమిత్తం, అటవీ పరిరక్షణ నిమిత్తం, ప్రాజెక్టుల నిర్మాణ పథకాల నిమిత్తం వస్తున్న గిరిజనేతర ఇంజనీర్లు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు గిరిజన స్త్రీలను మోసం చేసి వెళ్లిపోతున్నారు. కొందరు స్త్రీలు నక్సలైట్లుగా మారిపోతున్నారు. నక్సలైట్లు ప్రభుత్వ వ్యతిరేకులని, వారికి ఆశ్రయం ఇవ్వడం నేరమని పోలీసులు దాడులు చేయడం, గిరిజన స్త్రీలపై అత్యాచారం చేయడం చేస్తుంటారు.

ఇలాంటి జీవితాల్ని చిత్రించిన కథలు **గంటేడ గౌరునాయుడు** 'కొండమల్లె', **విద్యాసాగర్** 'కోయకన్నె', **సువర్ణముఖి** 'గోరపిట్ట', **పెన్మెత్స శ్రీకాంత్** 'చుక్కి', **భూషణం** 'నమ్మిక', **పొట్లూరి సుబ్రహ్మణ్యం** 'వేటకుక్క', **బోయ జంగయ్య** 'ఎర', **జాతశ్రీ** 'నెత్తురు కూడు'.

ఇన్ని కష్టాలు బాధలను తట్టుకుని బతకడం కష్టం. ప్రభుత్వ సహాయ సహకారాలూ అంతంత మాత్రమే. ఈ గిరిజనుల ఆత్మఘోషను పట్టించుకుంటే, వారికి సకల సౌకర్యాలు కల్పిస్తే మన మూలాలు మనకు దక్కుతాయి. కొందరైనా మనం నాగరికమనుకుంటున్న ఈ కుళ్లు సమాజానికి దూరంగా హాయిగా బ్రతగ్గలుగుతారు.

❁❁❁

బంజారాల ఆరాధ్య దైవం – సంత్‌సేవాల్ జయంతోత్సవాలు

– యం. బీపిక, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ, అనంతపురము.

పరిచయం :

భారతదేశం భిన్నత్వంలో ఏకత్వ దేశం. ఇక్కడ విభిన్నమైన కులాలు, మతాలు, జాతులు, తెగలు నివసిస్తూ వేటికవే తమ ప్రత్యేకతను చాటుకుంటున్నాయి. వీటిలో గిరిజనులు అన్నది ఒక ప్రత్యేక తెగ. వీరినే ఆదిమ వాసులు అంటారు. భిన్న జాతుల సమాహారమైన భారత ఉపఖండంలో అనేక గిరిజన సముదాయాలు నివసిస్తున్నాయి. వీరికి నాగరికత పోకడలు తెలియదు. పచ్చని అడవులే వీరికి ఆలవాలాలు ఆ అడవి తల్లి ఇచ్చే సంపదే ఆహారం. సెలయేటి నీరే వీరికి అమృతం. ఇలాంటి గిరిజనుల దేశ జనాభాలో ఉన్నది 7% అయిన ప్రతి రాష్ట్రములోనూ వీరు నివసిస్తూ తమ ఉనికిని చాటుతున్నారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా దాదాపుగా 33 గిరిజన తెగలు ఉన్నాయి. వీరిలో ఒకరు సుగాలీలు వీరినే బంజారాలు అను కూడా వ్యవహరిస్తారు. వీరి ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్. ఈయన జయంతోత్సవాల ఈ వ్యాస సారాశం.

బంజారాల నేపథ్యం :

క్రీ.శ. 6-11 శతాబ్దాల మధ్య ఉత్తర హిందుస్థాన్‌ను పాలించిన బంజారాలు మాతృభూమి సంరక్షణలో ఎన్నో కష్టాలు పడి అడవులపాలైనారు. మహమ్మద్ ఘోరీకి వ్యతిరేకంగా పృథ్వీరాజ్ చౌహాన్, రాణాప్రతాప్‌ల పక్షాన పోరాడిన చరిత్ర బంజారాలకుంది. తర్వాత ఈ ఇద్దరు రాజులు పతనం కావడంతో వీరు దక్షిణ భారతానికి జీవనోపాధి కోసం వచ్చి స్థిరపడ్డాడు. రసపుత్ర వంశానికి చెందిన 'వీర జాతి'నే నేడు సంచార జాతి అయిన బంజారాలుగా చెప్పుకొంటున్నారు. సంచార జీవితం గడుపుతూ వర్తక వాణిజ్యాలు నిర్వహించే తెగ బంజారాలు. బంజార అనే పదానికి "వ్యాపారి" అని అర్థం. బంజారాలను వివిధ ప్రాంతాల్లో ఒక్కో రకంగా పిల్చుకుంటారు. ఉదాహరణకు ఆంధ్ర ప్రదేశ్‌లోని రాయలసీమలో సుగాలి, సుకాలీలని, తెలంగాణాలలో లంబాడిలని, కర్ణాటకలో లమాణీలని, ఉత్తరాది రాష్ట్రాలలో బంజారాలని, ఇంకా వనజార, బలదియా, బంజారి, బ్రిజ్‌వాసి, లమాన్, లవాని, లంబాడ, లబాన్, బలాడియ, బల్దియా, నుగాలి, గోరియా, గమాలియ, గరియకాంగ్ సియా, పాండ, షిర్కబాండ్, సింగాళి బంజార రామాబంజార అనే పేర్లతో పిలుస్తారు. లంబాడిలు గిరిజనులలో 28వ తెగకి చెందిన వారు. రవాణా సౌకర్యాలు లేని కాలంలో జంతువులతో సరుకులు రవాణా చేసేవారు. లిపి లేని 'గోర్‌బోలి' వీరి భాష రాజ పుత్రుల వంశాలలో కనిపించే మార్వాడీ, గూర్జారీల (తెగలు) సగాలీలలో స్పష్టంగా గోచరించడం వల్ల రాజ పుత్రులలో ఒక శాఖ సుగాలీలంటారని తెలుస్తుంది. ప్రముఖ చరిత్రకారుడైన 'పటేల్' అభిప్రాయం ప్రకారం మరాఠి భాషలో బంజారా వంశంపై చేసిన పరిశోధనలో "లంబాడీలు పూర్వ కాలంలో రాజపుత్రులు, క్షత్రియ వంశస్థులనీ" నిర్ధారించారు. అలాగే మరొక చరిత్రకారుడు ఇర్విన్ ప్రకారం "లంబాడీల జన్మస్థలం రాజస్థాన్ అని, వీరు రాజపుత్ర వంశస్థులనీ" చెప్పారు.

వీరు గ్రామాలకు, జనావాసాలకు దూరంగా ఒకటి లేదా రెండు మైళ్ల దూరంలో చిన్నచిన్న గుడిసెలు నిర్మించుకొని జీవనం కొనసాగిస్తూ ఇతర కులస్థులతో కలవకుండా వారి ప్రత్యేకతను కాపాడుకుంటూ వస్తున్నారు. వీరి ఆవాసాలను తండాలని అంటారు. అనంతపురం జిల్లాలో 545 తండాలు ఉన్నాయి. భారతదేశంలోని వివిధ తెగలలోని ప్రజల వస్త్రధారణ, అలంకరణ కంటే ఈ బంజారాల స్త్రీల వేషధారణ, అలంకరణ ఎంతో ఆకర్షణీయంగా, అందంగా ఉంటుంది. సుగాలీలు దేశం మొత్తంలో విస్తరించివున్న వీరి భాష, వేషం, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలు మాత్రం మొత్తం దేశమంతటా ఒకే రకంగా వుండటం ఆశ్చర్యం. బంజారాలు ఇప్పటికీ కూడా తండాలలో తమ ఆచార

సంప్రదాయాలను పాటిస్తూనే ఉన్నారు. బయట ఎంత గొప్ప వారైనా తండాలో వచ్చి ఎలాంటి కొత్త పద్ధతులు సిద్ధాంతాల వీరిపై రుద్దడానికి వీలు కాలేదు- అలాంటి ప్రయత్నాలు కూడా చేయరు. కాబట్టే బయటి మనుషులను దాదాపు తమ తండాలలో ప్రవేశం కల్పించరు తండా నాయక్ (తండా పెద్ద) ఏమి చెబితే అదే లంబాడీ గిరిజన ప్రజలకు వేదం. బంజారాలలో పుట్టినప్పటి నుంచి చనిపోయే వరకు సంస్కృతి, సంప్రదాయాలు, కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు, జీవన విధానం, పెళ్ళి, చావు, అన్నీ, ప్రత్యేకమైనవే. ప్రస్తుతం ఆధునిక నాగరికత పేరుతో వీరి సంస్కృతి, సంప్రదాయాలు, భాష కనుమరుగవుతున్నాయి. వీరి సంస్కృతి సంప్రదాయాలను రక్షించడం మన అందరి బాధ్యత అని తెలియచేసుకుంటూ...? బంజారాల సంస్కృతికి అద్దం పట్టే శ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంత్యుత్సవాలను గూర్చి తెలుసుకుందాం.

సంత్‌సేవాలాల్ మహారాజ్ చరిత్ర :

బంజారాలను ఏకదాటిపైకి తీసుకువచ్చిన గొప్పవ్యక్తి. సాంఘిక అణచివేతకు వ్యతిరేకంగా పోరాటాలు చేసిన యోధుడు, బంజారాలను ముందుండి నడిపించిన నేత, సంత్‌సేవాలాల్ మహరాజ్, బంజారాలను మూఢన్మకాలు, మద్యపానానికి బానిసలు కాకుండా సన్మార్గంలో నడిపించి అహింసా సిద్ధాంతానికి పునాదులు వేశారు. బంజారాలకు విద్య, వైద్యం అందించడంతోపాటు, సంచార జీవితం సాగిస్తున్న వీరికి తండాల రూపంలో స్థిర నివాసం అలవాటు చేశారు. పశుపోషణ, ప్రకృతి పట్ల ఆరాధన భావన వీరిలో పెంపొందించారు. తన జాతి ప్రజలు సన్మార్గంలో నడవడానికి జ్ఞానోపదేశం చేస్తూ భారతదేశ మంతటా తిరిగిన మహాజ్ఞాని, తత్త్వవేత్త సంఘ సంస్కర్త సేవాలాల్ మహరాజ్. సుగాలీలకు ఒక ధర్మశాస్త్రాన్ని రూపొందించి పెళ్ళిళ్ళు, పూజా విధానాలను వివరించి వారు ఏ విధంగా కలిసికట్టుగా జీవించాలో విధి విధానాలను రూపొందించాడు.

ఈయన 280 ఏళ్ళ కిందట జన్మించి ఎన్నో మహిమలను చూపి, సుగాలి జాతి జాగృతి కోసం ఆరాటపడిన మహోన్నత వ్యక్తిగా గుర్తింపు పొందిన మహానుభావుడుగా బంజారాలు భావిస్తుంటారు. బంజారాల చేత పూజలందుకుంటున్న సేవాలాల్ జన్మ స్థానం అనంతపురం జిల్లా గుత్తి మండలంలోని చెర్లోపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సేవాఘడ్ 1739 సంవత్సరం ఫిబ్రవరి 15న బర్మిణీ బాయి, భీమ్లా నాయక్ దంపతులకు జన్మించారు సేవాలాల్. ఈ దంపతులు 12 సం॥లుగా సంతానం లేక బాధ పడుతుండగా మేరమ్మగా పిలవబడే జగదాంబదేవి ప్రత్యక్షమై సంతానం ఇస్తానని కాని, తిరిగి 12 సం॥రాలకు అబిడ్డను తనకు సేవకునిగా ఇవ్వవలసిందిగా ఒప్పందం చేసుకొని వారికి సంతానాన్ని ప్రసాదిస్తుంది. తిరిగి 12 సం॥లకు జగదాంబదేవి ప్రత్యక్షమై సేవాలాల్‌ను నాకు అప్పచెప్పమని భీమ్లానాయక్‌ను అడుగగా అందుకు సేవాలాల్ ఒప్పుకోరు. నేను శాఖాహారిని. జగదాంబ మాంసాహారి కనుక ఆమెకు నేను ఎలాంటి జీవులను బలి చేయదలుచుకోలేనని చెప్పగా అప్పుడు జగదాంబ దేవి సేవాలాల్‌ను ఎన్నో కష్టాలకు గురి చేస్తుంది. అయిన చలించరు. చివరికి తండావాసులని, అమాయక జీవుల్ని బలిచేస్తుంటే చూడలేక తానే అమ్మవారికి బలైపోతానని ప్రజల సమక్షంలో తలను ఖండించుకొంని అమ్మవారి కాళ్ళ దగ్గర పడేసి నా రక్తాన్ని నైవేద్యంగా స్వీకరించి బంజారాలకు వరాలు ఇచ్చి ఆదుకోమని ప్రార్థిస్తారు. అప్పుడు అమ్మవారు సేవాలాల్ శిరస్సును అతని శరీరానికి జోడించి జీవం పోస్తుంది. ఇన్నాళ్లు నేను పెట్టే పరీక్షలో నెగ్గావు, నిజమైన భక్తుడు, సమజానికి సేవకుడు, అయిన ఇతని నాయకత్వంలో ప్రయాణించండి అని జగదాంబదేవి ఆశీర్వదిస్తుంది. అప్పటి నుంచి సేవాలాల్ జగదాంబ మాతనే తన మార్గదర్శకురాలిగా గురువుగా స్వీకరించి అన్ని విద్యలను నేర్చుకొని బంజారాల సేవలో నిమగ్న మయి ఎన్నో మహిమలు చూపిన మహానుభావుడు శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్.

శ్రీ సంత్ సేవాలాల్ ఉత్సవాల వివరణ :

12 కోట్ల మంది బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ జయంతి రోజున ఉత్సవాలను ఎంతో ఘనంగా బంజా

రాల సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా జరుపు కుంటారు. ఈ ఉత్సవాలకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారు.

ఈ ఉత్సవాలను మూడు రోజుల పాటు నిర్వహిస్తారు. మొదటి రోజున సేవాఘడ్‌లోని శ్రీ జగదాంబ ఆలయంలో ముందుగా పూజలు నిర్వహిస్తారు. ఉదయం నుంచే మహాగణపతి పూజ, కలశపూజ, శాంతి హోమాలు, పంచామృతాలతో అభిషేకాలు చేయించి పుష్పాలతో అలంకరించి ఆరాధన చేస్తారు.

రెండవరోజున జగదాంబ మాతకు, సేవాలాల్ మహారాజ్‌కు అభిషేకాలు, అర్చనలు ఉదయాన్నే చేస్తారు. సాయంత్రం పల్లకి ఊరేగింపు జరుగుతుంది. సేవాలాల్ పూజలో ఎన్నో పాటలు పాడుకుంటారు.

ఉదా : మంగళ హారతి పాట

సేవా గడేశ్వరా సేవా, ఉదకర్పూర హారతివే....
మంగళ హారతిదే
ఉజగముల నేతే అంభా భవానీ సేవా మీరూ!
సత్య ధర్మంబులు నిలుపంగ నెంచి
శ్రీ సేవాగడ్ నందుశ్రీ సేవాబాయీ -
వెలసితివయ్యా - ఓదేవదేవ...

అదే రోజున భీమా నాయక్ కట్ట వద్ద ప్రత్యేక పూజలు జరుగుతాయి. పూర్వం ఇక్కడ సేవాలాల్ తండ్రి భీమ్లా నాయక్ గ్రామానికి పెద్దగా వ్యవహరిస్తూ పంచాయితీ తీర్పులు చెప్పేవాడని, ఇందుకు రచ్చకట్ట నిర్మించడంతో ఆ కట్టపై కూర్చొని తీర్పులు చెప్పేవాడని కథనం. ఈ విధంగా కట్ట ప్రాచుర్యాన్ని పొంది నేటికీ ప్రశంసలందు కుంటోంది.

అదే రోజున భీమా నాయక్ కట్ట ఎదురుగా ఉన్న బావిలో గంగపూజ చేసి గంగ హారతిని ఇస్తారు. ఇక్కడ బావిలో సంత్ సేవాలాల్ స్నానం చేసే వారిని, అందువల్ల ఆ బావిని పవిత్ర కోనేరు (కళా కుండో)గా పిలుస్తారు.

ఆనాడు పశుపోషణ ప్రోత్సహించి ఎన్నో గోవులను సేవాఘడ్‌లో పెంచి వాటిని కాపాడేవారు. దానికి ప్రతీకగా "గోపూజ"ను కూడా నిర్వహిస్తారు. అదేరోజు సాయంత్రం అతిథులు ఇచ్చే సందేశాలతోపాటు బంజారాల సంప్ర దాయరీతిలో నృత్యాలు, సాంస్కృతిక భజన కార్యక్రమాలు కూడా కొనసాగుతాయి. మహిళలు బంజార సంప్రదాయం ఉట్టిపడేలా దుస్తులు ధరించి నృత్యాలు చేస్తారు. ఈ రోజు సాయంత్రం ఎంతో నిష్టతో 41 రోజులు స్వామివారి మాలలు ధరించిన భక్తులు కాలినడకన సేవాఘడ్‌కి వచ్చి ఉత్సవాలలో పాల్గొంటారు.

చివరి రోజున ఉదయం 101 మంది కన్యలతో దేవా లయంలోని కళాకుండో (కోనేరు) నుండి కడవలతో నీటిని నింపుకొని వాటిని పసుపు కుంకుమ పూలతో అలంకరించి స్వామివారికి అభిషేకాలు నిర్వహిస్తారు. దీనిని "జలభోగ్" అంటారు. ఇలా 101 మంది కన్యలు, స్వామి మాల ధరిం చిన భక్తులు, మిగిలిన భక్తజనం మధ్య స్వామివారి చిత్ర పటాన్ని పల్లకిలో గుడిచుట్టూ ఊరేగింపుగా 3 ప్రదిక్షణలు చేసి అందరూ కలసి సామూహికంగా అత్యంత కీలకమైన "మహాభోగ్"ను నిర్వహిస్తారు. ఇందులో 5 లేదా 6 రకాల కట్టెలు, నెయ్యి, కర్పూరం ఊద్ (సాంబ్రాని), పసుపు, కుంకుమ, పూలు వేసి అగ్నిగుండం వెలిగిస్తారు. పంచ భూతాల్లో ఒకటైన అగ్నికి ఇవన్నీ సమర్పిస్తే నేరుగా దేవునికి అందుతుందన్నది ఇందులోని పరమార్థం. గిరిజనుల ప్రత్యక్షదైవంగా ప్రకృతిని ఎక్కువ ఆరాధిస్తారు. ఇలా ప్రకృతికి దైవానికి అనుసంధానం చేయడం వీరి యొక్క ప్రధాన ఉద్దేశం. ఈ మహాభోగ్‌లో బంజారాలు అంతా కలసి "కోరునన్, గోరున్, సాయి వేసాయ్'..... అంటూ తమ భాషలో తమ జాతిని మిగతా ప్రజలందరని కాపాడమని దేవున్ని వేడుకుంటారు.

ముగింపు :

పై విధంగా తమ జాతి సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా, వాటిని మర్చిపోకుండా నేటికి కూడా ప్రతి సం॥ ఎంతో ఘనంగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తూ తమ ఉనికిని చాటుకుంటున్నారు బంజారాలు.

మానవ జీవన పరిణామక్రమం – గిరిజనుల ఆచార వ్యవహారాలు సాంప్రదాయాలు – ఒక పరిశీలన

– నారాయణదాసు మంజులాదేవి, లెక్చరర్, తెలుగు & సంస్కృత విభాగం, నాగర్‌కర్నూల్, తెలంగాణ.

సమాజం ఒక పరిణామ శీలమైనది. పూర్వం నుంచి కూడా సమాజంలో ఆవిర్భవించిన తర్వాత మానవుడు మొదట సంచారజీవి. ఆహారాన్వేషణ చేస్తూ సాగిపోతూ వేటాడుతూ జీవించేటటువంటి వాడు. కొండల్లో, కోనల్లో, చెట్ల తొర్రలో నీటి ప్రవాహం వెంట సంచరిస్తూ బ్రతికేవారు. "వారికి స్థిర నివాసం అంటు ఏమి ఉండదు." లార్వ ద్వారా ఆవిర్భవించినట్లుగా శాస్త్రవేత్తలు పరిశీలించి చెప్పారు.

మానవుడు హోమినిడే కుటుంబములో హోమోసెపియన్స్ అనే క్షీరదాల స్పిసిసుకు చెందినవాడు. రెండు పాదాలమీద నడిచే ఏఫ్ ఆధునిక మానవుడు హోమోసెపియోన్స్‌గా నిర్వచించబడినాడు. ఈ జాతిలోను హోమోసెపియాన్స్ సెపియన్స్ అనబడే ఉపజాతిగా ఇప్పటి మానవుడు వర్గీకరించబడ్డాడు.

మనువు పుట్టుక :

హిందు పురాణాల ప్రకారం ఒక మనువు యొక్క పాలనా కాలాన్ని మన్వంతరం అంటారు. ఒక్కొక్క మన్వంతరము 30,84,48,000 సంవత్సరాల పాటు జరుగుతుంది. ఒక బ్రహ్మ దినములో 71 మన్వంతరాలు, 15 మన్వంతర రాత్రులు ఉంటాయి. ప్రతి మన్వంతరము 71 యుగాలుగా విభజించబడినది. ప్రస్తుతము మనము ఏడవ మన్వంతరము అయిన "వైవస్వత మన్వంతరము" నడుస్తుంది. మనువు మానవుని జీవన, ఆచార, సాంప్రదాయ, అలంకరణలు, కష్ట కాలము, రాత్రి, మనువు వైవస్వత మనువు, అర్ధమాసము, మాసము, ముహూర్తము, గ్రహణం, పంచాంగం (తిథి, వార, నక్షత్ర, కరణ యోగము) మొదలైన నియమాలు తెలియజేసాడు.

ఈ విధంగా మానవ జీవన పరిణామ క్రమంలో ఆచరణ, ఆమోదయోగ్యమైన జీవన, ఆచారాలను ప్రవేశపెట్టాడు. అయితే మానవుడు జీవన పరిణామ క్రమంలో మొదట ఒంటరిగా జీవిస్తూ సంచరించేవాడు. యుగ విభజన దశలో పరిశీలిస్తే...

1. ప్రాచీన శిలాయుగం
2. మధ్య ప్రాచీన శిలాయుగం
3. ఉత్తర ప్రాచీన శిలాయుగం

అయితే పై మూడు దశలలో ఏ ఒక్క దానికి కూడా ప్రత్యేక పరిధి అంటూ ఏది లేదు. పరిణామ క్రియలో పాత సంప్రదాయాలు కొనసాగుతూ ఉంటుంటే వాటితో పాటు కొత్త సంప్రదాయాలు కూడా ఆవిర్భవించి పాత వాటితో కొనసాగుతాయి.

1) మధ్య శాలాయుగం
2) ప్రాచీన శిలాయుగం
3) నవీన శిలాయుగం

పూర్వ ప్రాచీన శిలాయుగంలో వలె ఈ సంస్కృతికి చెందిన ప్రాచీన మానవ జాతి సమూహాలు కూడా సంచార జీవితం గడుపుతూ దేశ దిమ్మరులుగా తిరిగే వారు. పచ్చి మాంసభక్షణతో మొదలై నిప్పును కనుగొని వండుకొని తినడం ఆరంభించారు. ఒకరికి ఒకరు కలసి కట్టుగా జీవించడం ప్రారంభించారు. ఒకరి తోడు ఒకరికి అవసరం అయింది. కలిసి జీవించడం ఆరంభించారు. అయితే మానవ జీవనంలో గిరిజనుల గురించి ప్రస్తావిస్తే ఎక్కువ ఆటవికులు. వీరు అడవిలో జీవిస్తూ ఉంటారు. ఇంక సమాజంలో వారితో కొంత సత్ సంబంధాలు ఉన్నప్పటికీ వీరి ఆచార వ్యవహారాలు వేరు. గిరిజనుల పాత్ర విశిష్టమైనదిగా పేర్కొనవచ్చును. వీరు ఆటవికులు

ప్రధానమైన వృత్తి వ్యవసాయం, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ, వీరి ఆచార వ్యవహారాలు సంప్రదాయాలు, కట్టు, బొట్టు, ఆహారం, వృత్తి, కళలు, గృహ అలంకరణ సామాగ్రి, గృహం, మొదలైనవి అన్ని వారి వారి ఆవాస నివాసాలకు అనుగుణంగా ఆచార వ్యవహారాలకు అనుగుణంగా ఉంటాయి. ఉమ్మడి కుటుంబంలో పెద్దగా తండ్రి వ్యవహరిస్తాడు. ఒకరికి ఒకరు చేదోడు, వాదోడుగా కలసికట్టుగా శ్రమైక జీవన చిత్రంలో భాగస్వామ్యం అవుతారు. కలసికట్టుగా పని చేస్తారు. వీరు వివాహ వ్యవస్థను పరిశీలించినట్లయితే గిరిజన సాంప్రదాయ పద్ధతిలో పెద్దల అనుమతి మీద వారి పూర్వ ఆచార సాంప్రదాయాన్ని బట్టి అందరి అనుమతితో నిర్వహిస్తారు.

సమాజంలో కుటుంబ వ్యవస్థ అత్యంత కీలకమైంది. వివాహం సమాజాభివృద్ధికి మూలం వివాహ వ్యవస్థలో ఉంది. అయితే వివాహం సామాజిక ఆమోదంతో లేదా చట్టపరమైన అంగీకారంతో స్త్రీ, పురుషులిద్దరూ కలసి జీవించడం వారి మధ్య సామాజిక బంధాన్ని ఏర్పరచుకునే పద్ధతిని వివాహం అంటారు. భార్యభర్తల మధ్య ఉండే సంబంధ బంధావ్యాలను ముఖ్యంగా శారీరక సంబంధాలను తద్వారా సంతానాన్ని పొందడం వారిద్దరి ఉమ్మడి నివాసాన్ని వివాహం ద్వారా సమాజం ఆమోదిస్తుంది.

ఆదిమ నివాసుల్ని "Aboriginals" అంటారు. వీళ్ళు చిన్న ముఠాలుగా నివసిస్తారు. వీళ్ళు అనాగరికులు. వీళ్ళ ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు పద్ధతులు అన్ని భిన్నంగా ఉంటాయి. ఆంగ్లంలో వీళ్ళని "Tribes" అంటారు. ఆంగ్లంలో కులం అంటే "Caste" డా॥.అయ్యప్పన్ హిందూమతం అవలంబించే వాళ్ళని "Caste" అనే పేరుతో మిగిలిన వాళ్ళని "Tribes" అని పిలిచారు.

"Any Primitive or barborous people under a chief a Common language and Sense of Solidarity and Who Trace thier descent from a common ancestor" అనే శాస్త్రకారుని వివరణ "Tribes" అన్న పదానికి సరిపోతుంది. శ్రీ సోమసుందరం గారు తమ "మానుషశాస్త్రం ఆదిమనివాసులు అని గ్రంథంలో ఆదిమ నివాసుల్ని గురించి వివరిస్తూ ఆదిమ నివాసులంటే "ఆర్యాక్రమాను పూర్వం మనదేశమందు నివసించుచూ ఆర్యులచేత తరుమబడి కొండగుహల యందును అరణ్య ప్రాంతములలోను తలదాచుకొని ప్రస్తుత నాగరికతా ప్రపంచమునకు దూరులై,మన కంటికి కేవలము మృగతుల్యుల వలె నగుపించుచు ఆర్యుల తాకిడి వలన సభ్య సంబంధము వలన, తమతమ ప్రత్యేక ఆచార, సాంప్రదాయ విశిష్టతలను కోల్పోక చిన్ని చిన్ని గుంపులుగా కాలము వెళ్ళ బుచ్చుకొనుచున్న జాతులు అని నిర్వచించారు. మానవ శాస్త్రవేత్తలు "Tribes" గురించి చేసిన వివరణాత్మక అధ్యయనాన్ని "Etnngraphy" అంటారు. విదేశీయ భావములతో పొత్తు కలవకుండా జాతీయ ప్రాంతీయ బావావేశము గల "సాంఘిక గణము" లేదా "జాతి" ఆదిమజాతిగా పేర్కొనబడి ఉండవచ్చును. లేదా అట్ల పేర్కొనబడి ఉండక పోవచ్చును. సంపూర్ణమగునో అసంపూర్ణమగునో నాగరికత ప్రభావమునకు లోబడి ఉండవచ్చును.

ప్రత్యేక సంస్కృతి కలిగిన సమాజాలను "Tribes" అని పిలవచ్చును. ఈ సంస్కృతి గ్రామీణ, నగర సంస్కృతుల కంటే భిన్నంగా ఉంటుంది. సమాజంలో రక్త సంబంధానికి అధిక ప్రాధాన్యం కనిపిస్తుంది. వ్యక్తుల మధ్య సంబంధం అధికంగా ఉంటాయి.

ఆదిమవాసుల్లో కన్పించే మరో విశిష్ట లక్షణం ఏమిటంటే ఒక్కో తెగకి చెందిన వాళ్ళలో కొన్ని విశిష్టమైన శారీరక లక్షణాలు కన్పిస్తాయి. ఈ లక్షణాలు ఇతర తెగల నుంచి వీళ్ళను వేరు చేస్తాయి. దీని వల్ల వీళ్ళు ఏ తెగకు చెందిన గిరిజనులో నిర్ధారించడానికి వీలవుతుంది.

జాతుల పునరుద్ధరణ నిమిత్తం వారి సాంస్కృతిక నాగరికత దశలను బట్టి చేయబడ్డ వర్గీకరణాన్ని అనుసరించి వీళ్ళు మూడు వర్గాల వారుగా విభజింప బడ్డాయి.

1. సాంస్కృతిక గ్రామీణ నాగరిక కుటుంబాల వారితో ఎలాంటి పొత్తులేని జాతులు.
2. నాగరికత ప్రభావానికిలోనై దానివల్ల సంభవించిన సమస్యల్ని ఎదుర్కొంటున్న జాతులు.
3. గ్రామీణ నాగరిక జనులతో పొత్తు ఉండి, తత్ఫలితంగా ఏర్పడ్డ బాధల్ని, సమస్యల్ని అధిగమించే నేటి గ్రామీణ నాగరిక సంస్కృతితో పొత్తు కలసిన జాతులు.

మన సంస్కృతిలో మూడు రకాలైన దశలు కన్పిస్తాయి.

1.అరణ్య జీవనస్థితి 2. అనాగరికస్థితి 3. నాగరికస్థితి, వీటిలో జానపదులు అనాగరికస్థితికి చెందినవారు, వీళ్ళు నాగరికులు కాదు ఆటవికులు కాదు, గ్రామాల్లో నివసించేవారు. అనాగరికస్థితులకు భిన్నంగా అడవుల్లో కొండల్లో నివసిస్తూ జానపద నాగరిక సమూహాలకు దూరంగా ఉంటు ప్రత్యేక లక్షణం కలిగిన వాళ్ళే ఆదిమ వాసులు. వీళ్ళ మీద ప్రకృతి ప్రభావం అధికంగా కనిపిస్తుంది. వీళ్ళు కొండలు గుట్టలు, లోయల్లో నివసిస్తూ గ్రామీణ, నాగరిక సంస్కృతులలో ప్రభావానికి లోనుకాక తమదే అయిన ప్రత్యేక సంస్కృతిని నిలుపుకొని సంస్కృతి ఆదిమవాసుల సంస్కృతి వీళ్ళకు తమదే అయిన నడవడులు, కట్టుబాట్లు, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, సాహిత్యం, మాండలిక భాషలు ఉన్నాయి. వీళ్ళ సమిష్టి జీవనాన్ని ఆకాంక్షిస్తారు.

సవరలు, కొదులు, చెంచులు, ఎరుకలు, ఏనాదులు, లంబాడిలు మొదలైన ఆదిమ నివాసులు నాగరికత, విజ్ఞానము, లేని పశు ప్రాంతీయులవలె మనకు కనబడుతున్నారు. కాని మనకు కనపడనంత అనాగరికులు, అజ్ఞానులు కారు, ప్రాచీన కాలమందు శబరులు ఆర్యులకు చేరువగానే ఉండి, ఆర్యుల విజ్ఞానమును కొంత వరకు అన్ని విషయములను గ్రహించిన వారని చెప్పగలము. అందులో చాలా భాగము నేటి వరకు సవరలలో నిలిచియున్నది. వైద్య విషయములో సవరలు చెంచులు, ఎరుకలు, కొంత జ్ఞానము, అనుభవము గలవారు. నాగరికులయిన మనవారు కొందరు వారి మందులు పుచుకుంటున్నారు. వారి మంత్రాల వల్ల రోగములు కుదుర్చుకొనుకున్న, భూత పిశాచముల బాధ తొలగించుకొనుటకున్ను ప్రయత్నిస్తున్నారు. వేట విషయములో ఈ ఆదిమ నివాసులు ప్రజ్ఞావంతులన్న విషయము సంస్కృతాంధ్ర కావ్యాములందు పెక్కుచోట్ల వర్ణించడము కనబడుతుంది. సత్యము పలుకుటలోను పాతివ్రత్య విషయములోను సవరలు మొదలైన ఆదిమ నివాసులు మంచి పేరు పొందినారు.

గిరిజనుల్లో ఆత్మారాధన పద్ధతులు అధికంగా కన్పిస్తాయి. చనిపోయిన వాళ్ళ ఆ ఆత్మలతో సంభాషించడం, వారి ఆత్మలను తమ కాయాలలోనికి ప్రవేశింప చేసుకోగల శక్తి సవరలలో కొందరికి ఉందట. అప్పుడు వారు మాట్లాడే మాటలన్ని ఆ ఆత్మలే మాట్లాడుతూ ఉన్నట్టు భావించి ఆ చనిపోయిన వారి ఆత్మలో ఇతరులు కొంతసేపు ప్రసంగించి తెలుసుకోవలసిన విషయాలను తెలుసుకొంటారట, ఆదిమవాసులకి మరణించిన తరువాత వాళ్ళ మీద భయభక్తులు అధికం, ఈ భయభక్తుల వలె ప్రాచీన మానవ సంఘంలోని మత వ్యవస్థలు ఆవిర్భవించి ఉంటాయి.

చెంచులు ఆకాశమ్మ, భూమి అమ్మ, అమ్మతల్లి (అమ్మవారు) ముఖ్యదేవతలు, ఆకాశదేవత, అన్ని దేవతలపై దేవద అని వీళ్ళ నమ్మకం. వీళ్ళు సూర్యుణ్ణి కూడా ఆరాధిస్తారు.

ఆదిమ నివాసుల్లో చెప్పదగ్గ మరోజాతి ఏనాదుల జాతి. అనాది శబ్దం నుంచి ఏనాది శబ్దం ఉంటుందన్న అభిప్రాయం ఉంది. ప్రకృతి శక్తుల్ని దేవతల్లా భావించి పూజించడం, రోగాల్ని, క్షుద్రదేవతల కోపాల వల్లె కలుగుతాయనీ చిల్లంగి ప్రయోగాల వల్ల కూడా రోగాలు, మరణాలు కలుగుతాయనీ వీళ్ళు పూర్తిగా నమ్ముతారు, గిరిజనుల్లో ప్రతివ్యక్తి తాను తయారు చేసే వస్తువుల్ని ఇతరులకి పంచి పెడతాడు. దాని మూలంగా సాంఘిక జౌనత్యాన్ని పొందడానికి ఇష్టపడతాడు. ఇదే వాళ్ళ ఆర్థిక

విధానం అని చెప్పొచ్చు. ఈ ఆదిమవాసుల ఆర్థిక వ్యవస్థనుంచే జానపద ఆర్థిక వ్యవస్థ ఏర్పడిందనవచ్చు.

గిరిజనులు పండుగ పబ్బాల సమయంలో అందరు కలసి పండుగ చేసుకుంటారు. విందులు, వినోదాల్లోను, నాట్యం చేయడం, మందు సేవించడం పాటలు పాడడం లోను వీళ్ళ సమిష్టిజీవనం వ్యక్తమవుతుంది. ఆడవాళ్ళు, మగవాళ్ళు కలపి నాట్యం చేస్తారు. గోబ్బి తట్టుతూ నాట్యం చేయడం సవరలు, చెంచులు మొదలైన జాతుల్లో కన్పి స్తుంది. చెంచువాళ్ళలోనే నెమలి ఆట, కొండముచ్చుల ఆట కూడా ప్రధానమైనవి. గొండు జాతుల్లో దున్నపోతు కొమ్ముల విన్యాసం ముఖ్యమైనవి. భద్రాచలం, పోల వరం, మొదలైన అరణ్య ప్రాంతాల్లో నివసించే కోయల వివాహ సమయాల్లో ఈ నృత్యం ప్రాధాన్యం వహిస్తుంది. గ్రామంలో ఉన్నవాళ్ళంతా ఈ నృత్యంలో పాల్గొంటారు. గిరిజనుల్లో నృత్యం ప్రధానమైన వ్యాయామక్రీడగా బాసిస్తుంది. కొండరెడ్లు మామిడి నృత్యం అరకు లోయ లోని థింసా నృత్యం, లంబాడి నృత్యం, సిద్ధి నృత్యం మొదలైనవి. మరికొన్ని గిరిజన నృత్యాలు మనకు కని పిస్తాయి.

గిరిజనుల్లో వాళ్ళ నిర్మాణం విశిష్టంగా కనిపిస్తుంది. ఏనాదులు గుడిసెల్ని వెదురుతోను, తాటికమ్మలతోను కట్టుకొంటారు. మీదికి కొనదురిన పెద్దపిట్ట గూడులాగ గుడిసె కన్పిస్తుంది. లోపలికి వెళ్ళడానికి ఒక్కటే ద్వారం ఉంటుంది.

గిరిజనులు వేటాడడంలో ఆరితేరిన వారు తేనే పట్టడం కొంత మందికి వృత్తిగా కన్పిస్తుంది., పాముల్ని పట్టి ఆడించడంలో ఏనాదులు ప్రసిద్ధులు.

గిరిజనుల్లో శునకాల మీద నమ్మకం, విశ్వాసం కన్పి స్తుంది. ఖోందుల్లో శునకాల మీద విశ్వాసం అధికం వేటకు బయలు దేరినప్పుడు స్త్రీలు ఎదురుగా రాకూడదు. భార్య ఋతుమతిగా ఉన్నప్పుడు భర్త వేటకు వెళ్ళరాదు. గుడ్లగూబ అరుపు అశుభం, చిరుతపులి ఎదురవుతే శుభసూచకం.

గిరిజనులు పండుగల్లో కమ్మరుల గంగాదేవి పండుగ లేక ఇటుకల పండుగ, నందిపండుగ వ్యవసాయపు పండుగలైన కొర్రకోత, బుడమకోత పండుగలు, కొండ దొరల పూసపండోయి పండుగ, గదబల చైత్రపర్వం, బలి జత్ర, పుష్యపండుగలు చెప్పుకోదగ్గ పండుగలని పేర్కొన వచ్చు.

గిరిజనుల సాహిత్యం ఏ సాహిత్యానికి తీసిపోదు ప్రాచీన సంస్కృత సారస్వతంలో చెప్పబడ్డ శబరవంశం వాళ్ళే సవరలన్ని అభిప్రాయం ఉంది. ఈ శబరులు ఆర్యులకంటే, ద్రావీడులకంటే ముందు మనదేశంలో ఉన్నట్టు తెలుసుంది. శబర మంత్రాల ప్రసిద్ధి ప్రాచీన సంస్కృతి సారస్వతంలో కన్పిస్తుంది. వేదఋక్కులాగా వీరి పాటలు కూడ 3, 4 స్వరాలతో ఉన్నాయి.

గిరిజన కథలు, సామెతలు, పొడపు కథలు చేర్తాయి. సాంఘికాచారాలలో పుట్టుక, పెండ్లి, మరణం మొదలైన సంస్కారాలకు చెందిన ఆచార వ్యవహారాలు, సంప్రదా యాలు, పండుగలు, క్రీడలు, వినోదాలు, వైద్యం, మతం, నమ్మకాలు, విశ్వాసాలు ప్రాధాన్యం వహిస్తాయి. వస్తు సంస్కృతిలో చిత్రకళ వాస్తుకళ, వృత్తుల పరికరాలు, దుస్తులు ఆభరణాలు ఆహార పానీయాలు మొదలైనవి. భాగంగా ఉంటాయి. వివిధ రకాలైన నృత్యాలు గిరిజన నృత్యాల్లో ప్రాధాన్యం వహిస్తాయి. మాండలికాలు, నుడి కారాలు, తిట్లు, ఒట్లు మొదలైనవి గిరిజన భాషలో ముఖ్య మైనవి.

గిరిజన ఆచార వ్యవహారాలు పండుగలకు సంబంధిం చిన వివరాలు కొన్ని కేంద్రప్రభత్వం వారు ప్రచురించిన "The census of India vol.ll, part - vll, B Fairs and Fertivalsof Andhra Pradesh" అన్ని గ్రంధంలో లభిస్తాయి.

కన్నీటికే 'విలువ' కట్టే 'రుదాలి'

– శ్రీమతి మూరుతి, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.

నేపథ్యం :

మనిషి తను వచ్చిన దారినే తానే మార్చిపోతున్న ప్రస్తుత తరుణంలో, అలాంటి మానవ జీవన పరిణామ క్రమంలో మొదటగా వుండే గిరిజనుల గురించి పట్టించు కునేవారు ఉన్నారంటే ఆశ్చర్యమేయక మానదు! అలాంటి గిరిజనుల వ్యదార్థ జీవిత, యదార్థ దృశ్యాల్ని చూసి చలించిన, అనుభవాల ద్వారా అసంఖ్యాక హృదయాల్ని కథల రూపంలో తట్టిలేపిన రచయిత్రి మహాశ్వేతాదేవి. ఈమె జనవరి 14 -1926న జన్మించారు. తర్వాత వీరు పశ్చిమ బెంగాల్ లో స్థిరపడ్డారు, ఈమె సుప్రసిద్ధ నవల రచయిత, సామాజిక కార్యకర్త. మహాశ్వేతాదేవి తల్లి దండ్రులు కూడా గొప్ప పేరు పొందిన రచయితలు, తండ్రి మనీష్ ఘటక్ కవి, నవలాకారుడు. తల్లి ధరిత్రిదేవి రచయిత, సామాజిక కార్యకర్త. ఈమె రవీంద్రనాథ్ టాగూర్ స్థాపించిన "శాంతినికేతన్" విశ్వభారతి విశ్వవిద్యా లయంలో ఆంగ్లంలో డిగ్రీ తీసుకున్నారు. దేశంలో వున్న అన్ని రకాల అత్యున్నత అవార్డులను, సాహిత్య అకడామీ, పద్మశ్రీ, పద్మభూషణ్, జ్ఞానపీఠ పురస్కారం, రమాన్ మొగసేసే అవార్డు ఈమె సొంతం చేసుకున్నారు. మహాశ్వేతాదేవి ఇప్పటివరకు 100 నవలలు, 20 కథ సంపుటాలను రచించారు. మొట్టమొదటి నవల "ఝాన్సీ రాణి" 1956లో రచించారు, తర్వాతి కాలంలో ఈమె రచనలు చాలా సినిమాలుగా రూపొందాయి. 'హజారి చరౌసీ కీ మా(1998)' 'రుదాలి(1993)' లాంటివి అందులో గొప్ప సినిమాలు.

ఈమె తర్వాతి కాలంలో 'బోర్తికా' అనే పత్రిక సంపాద కత్వ బాధ్యతను నిర్వహిస్తూ అనేక రకాల సమస్యల్ని వెలికితీస్తూ, విశ్లేషణలతో ఆయా రంగాల్లో NGOలకు, సంఘాలకు, కార్యకర్తలకు స్ఫూర్తినిస్తూ ముందుకు నడిచారు. ఆమె 1980 నుండి తన పోరాటాన్ని ఉధృతం చేసారు. ఆదివాసులు, భూములు లేని గ్రామీణ పేద ప్రజలు, కూలీలు నగరాల్లో మురికివాడల వారు, పుట్పాత్ జీవులు ఈ విధంగా అణగారినవారి పక్షాన నిలబడి పిటిషన్లు, మెమోరండంలు, వినతిపత్రాలు, కోర్టులు, కేసులు తన జీవితంలో ఒకభాగం చేసుకున్నారు. సనాతన బ్రాహ్మణ కుటుంబం నుంచి వచ్చిన "ఒక పౌరురాలిగా, రచయిత్రిగా, సామాజిక కార్యకర్తగా నాదంటూ ఏమిలేదని అంత ప్రజలదేనని" అని అంటూనే తన రచనల్లో ఒక సామాజిక కార్యకర్తగా, ఒక మనిషిగా, ఒక పౌరురాలిగా, ఒక మాననతవాదిగా ప్రతిబింబిస్తూనే ఉన్నారు.

'రుదాలి : కథ పరిచయం :

రుదాలి అనగా బెంగాలీ భాషలో "ఎవరైనా మరణిస్తే డబ్బులు తీసుకొని ఏడ్చేవారు" అని అర్థం. ఈ కథలో రచయిత్రి ఏడవడమే ఒక వృత్తిగా చేసుకుని జీవితం సాగిస్తున్న'శనిచరి' జీవితాన్ని సమగ్రంగా మన కళ్ల ముందు నిలిపింది మహాశ్వేతాదేవి. చలికాలపు ఎండలో గిన్నె నిండా బెల్లం, సత్తూ (పిండి) కలుపుకొని తింటూ కూర్చోవాలి అన్న అతి సాధారణమైన కోరిక శనిచరిది. క్షయ వ్యాధి సోకి కొడుకు మరణించాడు. తినడానికి ఏమైనా పెట్టండి అని అరుస్తూ ఆమె అత్తగారు చని పోయింది. శివలింగానికి అభిషేకం చేయగా అ కల్తీ మురుగు పాలు తాగి భర్త చనిపోయాడు. తిండిలేక కోడలు ఎవరితోనే వెళ్లిపోయి చివరికి వేశ్యా వాడలో తేలింది. దొరల వెట్టి పని చెయ్యలేక మనవడు ఊరు విడిచి పారిపోయాడు. ఇలా తన జీవిత కాలంలో తన అనుకున్న వారందరిని పోగొట్టుకొని చివరకు తన అస్తిత్వాన్ని నిలుపు కోవడానికి 'దుఃఖన్నే' ఒక పనిగా చేసుకొని, అసలు జీవించడం అంటే ఏంటో నేర్పిన ఒక గొప్ప పాత్ర శనిచరి.

ఇలా దొరల కుటుంబంలో ఎవరైన చస్తే ఏడవడానికి కిరాయికి వెళ్లి వికృతంగా, వైనవైనాలుగా ఏడ్చి దొరల ప్రతిష్టను పెంచేది. అందుకు వేశ్యా వాడల నుంచి ఏడ్చే వాళ్లని కుదిర్చి పెట్టేది. చివరికి వాళ్లందర్నీ సంఘటితపర్చే ప్రయత్నంలో రుదాలి కథ ముగుస్తుంది. రుదాలి బెంగాలీలో రచించబడి, తెలుగులోకి వచ్చిన అనువాద కథ సంకలనం. రుదాలి అనేది ఈ సంకలనంలోని ఓ కథ. దీనిని కలేకూరి ప్రసాద్ తెలుగులో అనువదించారు. ప్రజలు తమ బతుకు కోసం ఎంతగా కష్టపడుతున్నారో చూపడం, బహుముఖ రూపాలుగా వ్యాపించిన దోపిడీ వర్గాలను గురించి ప్రపంచానికి తెలియజేయాలన్నదే లక్ష్యంగా కథ రచన చేసేవారు మహాశ్వేతాదేవి .

ఒక గొప్ప జీవన పోరాటం :

ఎలాంటి ఆధారం లేకుండా నిస్సహాయ స్థితిలో ఉన్న ఒక గిరిజన స్త్రీ జీవితం, తన జీవిత గమనంలో ఏ విధమైన అటుపాట్లకు లోనవుతూ, చివరి దశలో తన అస్తిత్వం నిలుపుకోవడం కోసం చేసిన పనులు రుదాలి కథ రూపంలో ఉన్న శనిచరి పాత్ర ద్వారా తీర్చిదిద్ద బడింది. 1980ల ప్రాంతంలో భారతదేశంలో ఒక మారు మూల గిరిజన గ్రామంలో పరిస్థితులు ఏ విధంగా వున్నా యనే విషయాన్ని, బుధువా తండ్రి కల్తి అయిన అభిషేకపు పాలు త్రాగడం వల్ల, కలరా వచ్చి మరణించడం, అప్పటి బ్రిటిష్ అధికారులు, వైద్య పరిస్థితులు అన్నింటిని ఈ కథ ద్వారా స్పష్టంగా తెలియజేశారు రచయిత్రి.

రచయిత్రి కొన్ని సందర్భాల్లో "నీ కొడుకేమన్నా శ్రీ రామచంద్రుడా.....ఇసుకతో పిండం పెట్టడానికి (రామాయణంలో శ్రీరాముడు అరణ్య వాసంలో వుండగా దశరథుడికి నది ఒడ్డున గల ఇసుకతో పిండం పెట్టిన సంఘటన) (పుట 2)" అలాగే "ఏమో ....ఎవరకి తెలుసు... పున్నమి ముందు చచ్చిపోతే నేరుగా స్వర్గానికి వెళతారు, లేకపోతే యుధిష్టిరుడులాగా ముందు నరకానికి వెళ్ళాల్సి వుంటుంది (పుట 24)" భారతంలో, రామాయణంలో గల సంఘటనలను ప్రస్తావించడం వల్ల వాటి ప్రభావం అక్కడి గిరిజనులపై ఎంతవరకు ఉందో ఒక రకంగా మనం చూడవచ్చు. వాటి మీద నమ్మకాలతో వారి నిజ జీవితం ఏ విధంగా మూడిపడి ఉందో రచయిత్రి తెలియ జేశారు.

"బుధువా పెరిగి పెద్దవాడు అయిన, తన తండ్రిలాగే దారిద్ర భారాన్నంతటినీ భూజాల మీదకేత్తుకున్నాడు (పుట 4)" అని అనడంలో అక్కడ ఉన్న భూస్వాములు, పెద్ద పెద్ద వడ్డీ వ్యాపారుల వల్ల ఒక మమూలు మనషులు ఎన్ని తరాలు మారిన వెట్టిచాకిరీ, బానిసత్వం లాంటి పనులలోనే ఉంటున్నారు. వారిని అణచివేసేభూస్వామ్య, జమిందారులను రచయిత్రి చిత్రించింది. తన భుజాల మీద బుధువా పేదరికాన్నే కాదు తన జాతి, కులం, మతం అనే వాటిని కూడా తనకి తెలియకుండానే పైకేత్తు తున్నాడు. శనిచరి లాగానే బిఖినీ కూడా "మెడలో చేతులకి ఏ నగలు లేవు. పచ్చబొట్లు తప్ప మరేమీ లేవు,చెవులకీ పోగులకి బదులు బెరడుముక్కలు పెట్టుకున్నారు యిద్దరి జుట్టు ఎండి పీచుకట్టి, రేగిపోయి వుంది శనిచరి బిఖినీకి ఒక బీడి ఇచ్చింది(పుట 9)" అని కొన్ని మాటలతో శనిచరి, బిఖినీ ఇద్దరి వృద్ధ గిరిజన స్త్రీల యొక్క రూపు రేఖల్ని, వారి పరిస్థితిని కళ్ళముందు వుంచగాలిగారు - రచయిత్రి.

కథ మొత్తంలో వేశ్యల పరిస్థితి గురించి మామూలు స్త్రీలు వేశ్యలుగా మారుతున్నపరిస్థితులు, వీళ్ళంతా వేశ్యలుగా మారడం వెనుక ఉన్న సామాజిక, అర్థిక నేపథ్యాన్ని అవి ఎలా తీర్చిదిద్దబడుతున్నాయనే మౌలికమైన అంశాలను బహిర్గతం చేసారు. మొదట వడ్డీ వ్యాపారస్తులు, భుస్వాముల కోరికలకు బలైన స్త్రీలు తర్వాత వారి జీవనం గడవడానికి ఒక వేశ్యగా మారిపోతున్నారు. నివేశ్య ఐదు రూపాయల నుండి ఐదు పైసల వరకు దిగజారుతూ వచ్చింది (పుట13)" అంటే అప్పటి పరిస్థితి ఎంత దారుణంగా ఉందో మనం గమనించవచ్చు. కథ చివరలో వారు శనిచరి అధ్వర్యంలో రుదాలి పనికి దిగినపుడు వారిలో ఒక రకమైన సంఘటిత శక్తి బయటపడుతుంది.

రచయిత్రి రుదాలి కథలో తనని తను 'దూలాన్' పాత్ర ద్వారా ప్రతిబింబించేలా చేసుకొని, ప్రతి సంద

ర్భంలో తాను సమాజానికి చెప్పదలచుకున్న విషయాన్ని స్పష్టంగా, వ్యవస్థను విమర్శనాత్మకంగా తెలియజేసారు. అలాగే శనిచరి పాత్రకు మొదటినుంచి ఎన్నో సలహాలు ఇస్తూ, శనిచరి జీవితానికి మార్గనిర్దేశం చేసే పాత్రగా కథ చివర్లో "బొగ్గు గని కూలీలకు యూనియన్ ఉంది. నువ్వు రుదాలిలకు, వేశ్యలకి యూనియన్ ఎందుకు పెట్ట కూడదు? (పుట 19)" అని సలహా ఇస్తారు. ఇందులో అప్పటికాలంలో దేశంలో అప్పుడప్పుడే యూనియన్స్ సంఘాలు ఏర్పడే పరిణామాలు రూపొందే కాలంలో కార్మికులు సంఘటితం అవటం, వారిని సంఘటిత దృష్టితో ధృడంగా తయారు చేయాల్సిన అవసరాన్ని రచయిత్రి గుర్తించారు.

బిఖిని, శనిచరి చిన్ననాటి స్నేహితులు, చాలా ఏళ్ల తర్వాత వృద్యాప్యంలో మళ్ళీ ఒకరినొకరు కలుసు కుంటారు. అ సమయంలో వారు ఎవరూ లేని అనాధ లుగా ఉండటం వల్ల కలిసి జీవించాలనే నిరయించు కుంటారు. ఇందులో ఒక జాతిగా నివసించే మనషులు మధ్య ఎటువంటి సహకార సంబంధలేర్పడుతాయో చెప్పటానికి వీరిద్దరి స్నేహం ఒక మంచి ప్రతీక. ఎవ్వరు లేని వయస్సులో ఒకరికోసం ఒకరు తోడుగా నిలబడి జీవితాన్ని ముందుకు సాగించారు. కథ మొత్తంలో దులాన్ పాత్ర హేతుబద్దమైన వాదన చేస్తూ, సెంటిమెంట్లకు వారి మూడ నమ్మకాలనూ విమర్శిస్తూ ఉంటుంది. అక్కడి భూస్వాములూ, వడ్డీ వ్యాపారులు, ఇతర ఉన్నత వర్గాల వారిపై విమర్శలను ఆరోపణలునూ వారి విధానాలను ఖండిస్తూ ఉంటుంది. వారి ఆలోచనలోని దుర్మార్గపు తత్వాన్ని బయటపెడుతుంది. అ విధంగా చేయడం ద్వారా దులాన్ పాత్ర సమాజం పట్ల, విమర్శనాత్మకంగా స్పందిస్తూనే వారి జాతిని రాజకీయంగా చైతన్యపరుస్తుంది.

కథలో క్రిందిస్థాయి వారు అయినా, పై స్థాయి వారైనా వివిధ ఆచారవ్యవహారాల సమయంలో సంస్కృతి పాటించేటప్పుడు, మరణం తర్వాత చేసే వివిధ రకాల కార్యక్రమాలు వాటి ద్వారా గిరిజనులు ఏ విధంగా బానిసలుగా మిగిలిపోతున్నారు. భర్త దినకర్మల కోసం 20 రూపాయలు అప్పుచేసి, 50 రూపాయలు అయిన అప్పును చెల్లించడం కోసం 5 సంవత్సరాలు పాటు వెట్టి చాకిరి చేయాల్సిన అవసరం గురించి తెలియజేస్తుంది కానీ అదే సమయంలో భూస్వాములు, వడ్డీ వ్యాపారులు, యాజమానులు, వారి అంత్యక్రియల కోసం వేలకు వేలు ధారపోయటం వారిలో వారు అది ఒక హెూదాగా గౌరవంగా భావిస్తారు. రుదాలిలను ఎవరైనా మరణించి నపుడు కిరాయికి తెచ్చుకోవడం అనేది చివరికి ఒక సంస్కృతిగా మారిపోయింది. మొదటగా పెద్ద పెద్ద యజ మానులు మాత్రమే వీరిని ఉపయోగించుకుంటారు కాని తర్వాత కాలంలో చిన్నచిన్న వడ్డీ వ్యాపారులు సైతం రుదాలిలను పెట్టుకోవడం ఒక సంస్కృతిగా ఆచారంగా రావడం గమనించవచ్చు. ఈ విధంగా పైస్థాయిలోఉన్న సంస్కృతి సంప్రదాయాలను, సమాజంలో క్రింది స్థాయి వారు ఎప్పుడూ తమకి ఆపాదించుకోవాడనికి ప్రయత్నం చేస్తూనే ఉంటారన్న విషయాన్ని రచయిత ఈ కథ ద్వారా తెలియజేశారు.

రుదాలి కథలో మహాశ్వేతాదేవి శనిచరి అనే గిరిజన స్త్రీ పాత్రను ఎలాంటి ఆధారం లేని నిస్సహాయ స్థితి నుండి తనని తాను ఎలా నిలదొక్కుకొని ఈ సమాజంలో నిలబడగలిగింది, అనే ఇతివృత్తంతో దీని రచన సాగింది. ఇందులో రచయిత్రి అనేక రకాల విషయాల్ని తెలియ జేశారు. ఇద్దరు స్త్రీల మధ్య పెరిగిన ప్రేమను అను బంధాన్ని చిత్రించింది. శనిచరి, బిఖినీ కాక మిగతా స్త్రీలు కూడా పరస్పరం ఎంతో సహకార సంబంధాలను కలిగి ఉంటారు. తల్లి లేని బిడ్డకు పాలు ఇవ్వడం, అలాగే ఆహారం కలిసి తినడం, మిగతా విషయాల్లో సహాయ సహకారాలు కింది జాతి వారిలో ఏ విధంగా ఉంటాయో మనకు కన్పిస్తాయి. ఇందులో ముఖ్యంగా ఏ వర్గానికి చెందినప్పటికీనీ స్త్రీలు వివక్షకు గురి అవుతున్న వాస్తవాన్ని మరోసారి తెలియజేశారు. సమాజంలో పురుషులు, ఆడ పిల్లలని కన్నందుకు ఎంత హీనంగా చూస్తున్నారో, మగ

పిల్లల్ని కన్న ఆడవారిని ఏ విధంగా గౌరవిస్తారో, ఆదరిస్తారో చెబుతుంది.

అన్ని రకాల కష్టాలకు స్త్రీలు కారణం అనే నెపన్ని వారిపై మోపే ఒక దారుణమైన వివక్షను స్త్రీలు ఏ విధంగా ఎదుర్కుంటున్న తీరును వివరిస్తుంది. రుదాలి కథలో స్త్రీ పాత్రల్లో అరుదైన సున్నితత్వం, స్పందన, ఒక తల్లి ఆవేదన, ఒక స్త్రీ తపన, మొదలైన జీవితంలోని సున్నిత అంశాలతో మనస్సును స్పర్శించేలా వాటిని తీర్చిదిద్దారు.

కథలో మొత్తంలో మనకు ఒక నిరంతర పోరాటం కనిపిస్తుంది. చివరలో పోరాటంలో విజయం సాధించిన వ్యక్తిగా శనిచరి నిలబడింది. తనలో ఆత్మ విశ్వాసం, తనపై తనకు నమ్మకం కలిగేలా చేసింది రచయిత్రి. సగటు మనిషి జీవితంలో ఉండే వాస్తవికతను చిత్రించ డానికి మహాశ్వేతాదేవి తన ప్రత్యేక శైలిలో, పాత్రలకు అనుగుణమైన భాషను వాడుతూ ఈ కథలను చిత్రిం చారు. రచయిత అక్కడి సమాజంతో ప్రత్యక్షంగా పరి చయం పెట్టుకోవడం వల్లనే, అ అనుభవాల ద్వారా రచయిత తన రచనలో సందరాసుసారంగా, పాత్రలను బట్టి వ్యావహారికం, గిరిజన మాండలికం, చాలా సుల భంగా వాడగలిగారు. మహాశ్వేతాదేవి ఈ కథలన్నిటిని ప్రథమ పురుష (సర్వసాక్షి దృష్టి కోణంతో) తెలియజేసారు. రచయిత్రి కథలను అందులో ఉండే పాత్రలు ముఖ్యంగా ఒక గిరిజన స్త్రీ యొక్క జీవితాన్ని తన చుట్టూ ఉన్న సమాజాన్ని, వాటిని తీర్చిదిద్దబడిన తీరు ఎంతో అద్భు తంగా వుంది. నాగరిక కథలతో పోలిస్తే ఆమె తన కథల్లో వర?న, కాల్పనికతను ఎక్కువగా ఉపయోగించలేదు. ఆమె చెప్పదలచుకున్న విషయాన్ని సూటిగా, స్పష్టంగా చెప్పగలిగారు. ఈ ప్రక్రియలో అన్ని పాత్రలను సమానంగా, సందర్భనుసారంగా వాడుకున్నారు.

"సాహిత్యాన్ని కేవలం శైలి, శిల్పం అనే గీటు రాళ్ళతో కొలవటం తప్పు, సాహిత్య విలువల్ని చారిత్రక దృష్టితో పరిశీలించాల్సి వుంటుంది. ఒక రచయిత రచనని, అతను దాన్ని వ్రాసే కాలాన్ని బట్టి అంచనా వెయ్యకపోతే, అ రచనకు న్యాయం చేకూరదు. నేను ప్రాచీన కథలని, పౌరాణిక పాత్రలని, సంఘటనలను, వర్తమాన కాలం దృష్ట్యా నా కథల్లో వాడతాను. నిజానికి జానపద కథల్లో గతమూ, వర్తమానమూ కలిసి ఒకే ప్రవాహం లాగా కనిపిస్తాయి. ఈ ప్రవాహాల కపోల కల్పన కాదు. కులం గురించిన పట్టింపులూ, పొలాల మీదా, అడవుల మీదా అధికారమూ, ముఖ్యంగా అధికార వర్గం తమ అధికారాన్ని విస్తరింపజేసుకోటానికీ, నిలుపుకోటానికీ, తాపత్రయ పడుతూ బలహీనవర్గం వాళ్ళని పీడించే వ్యవస్థ గురించిన చరిత్రే ఇది" ('శ్రేష్ఠ గాల్స్' కథసంకలనంలో ముందు మాట) అని ఈ మాటల ద్వారా తన రచనల యొక్క ఉద్దేశాన్ని స్పష్టంగా తెలియజేశారు. దీనిని బట్టి మనం కథకు వున్నా కోణాన్ని మరింత బాగా అర్థం చేసుకోవచ్చు. మహాశ్వేతాదేవి తన కథల్లో, నవలల్లోనూ, ఎన్నుకున్న అభివ్యక్తి ఒక పక్క వాస్తవాన్ని అద్దం పట్టి చూపుతూనే, ఇంకోపక్క చరిత్రలో నిరంతరం జరిగే మార్పులని కూడా ఎత్తిచూపుతుంది. ఇలా తన చివరి శ్వాస వరకు అణగారిన ప్రజల పక్షాన నిలబడిన మహాశ్వేతాదేవిగారు జూలై 2016లో తన జీవన గమనాన్ని ముగించారు.

ఉపయుక్త గ్రంథసూచి :

1. జర్మనీ-ఫ్రాంక్ ఫర్ట్ బుక్ ఫెయిర్ లో ముఖ్య అతిథిగా పాల్గొన్న భారతీయ రచయిత్రి మహాశ్వేతాదేవి 21 అక్టోబర్ 2006న చేసిన ప్రారంభోపన్యాసం.దినపత్రిక వ్యాసం.
2. మహాశ్వేతాదేవి ఉత్తమ కథలు, మూలం: మహాశ్వేతాదేవి (1990) తెలుగు అనువాదం: నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా, 2001.
3. మహాశ్వేతాదేవి. రుదాలి (కథలు). తెలుగు అనువాదం(కలేకూరి ప్రసాద్) హైదారాబాద్ బుక్ ట్రస్ట్. 1998.
4. హజార్ చరౌసి కి మా (బాలీవుడ్ మూవీ) డైరెక్టర్: గోవింద్ నిహలని, మార్చి 20, 1998.

గిరిజనుల నృత్య రీతులు

– ఐ. మేరికుమారి, శాఖాధ్యక్షులు, తెలుగు విభాగం, జె.యం.జె. కళాశాల, తెనాలి.

గిరిజనులు లేక ఆదివాసీలు భిన్న జాతుల, సమాహార మైన భారత ఉపఖండంలో అనేక గిరిజన సముదా యాలు నివసిస్తున్నాయి.

గోదావరి జిల్లా ప్రకృతి అందాలే కాకుండా అక్కడి ప్రజల సంస్కృతి సంప్రదాయాలు, పండుగలకు చాలా ప్రాధాన్యం ఉంది. అందులో భాగమే గోదావరిజిల్లా గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహా రాలు గిరిజనుల భాషలు, పండుగలు, వివాహాలు, అల వాట్లు, గృహ సంబంధ విషయాలు ఇలా అనేక విషయా లలో కొంత భిన్నత్వం కనబడుతుంది. అడవిని కాపా డుతూ, ఆ అడవి తల్లి ఒడిలోనే సేదతీరుతున్న అడవి బిడ్డలు ఈ గిరిజనులు. తెలుగుదేశంలో ముఖ్యంగా కొండ ప్రాంతాల్లో, అడవి ప్రాంతాల్లో ఉన్న ఆదిమ జాతుల గిరిజన నృత్యాలు ఆంధ్రప్రజలకు ఏమి తెలి యవు. వారు ఆంధ్రదేశంలో బ్రతుకుతున్నా అవి వారి వారి ప్రాంతాలకే పరిమితమై పోయి వారికితప్ప ఇతరు లకు తెలియకుండా పోయాయి. అందుకు కారణం వారి బ్రతుకంతా అడవులకే పరిమితమై ఉండటం ఇతరులతో ఏవిధమైన సంబంధాలు లేక పోవడమే.

గిరిజనుల కళారూపాలు :

ఆంధ్రదేశంలో అటు రాయలసీమ నుండి ఇచ్ఛాపురం వరకు అన్ని ప్రదేశాలలోను మొత్తం 38 గిరిజన జాతులు వున్నాయి. వీరి జనాభా 13 లక్షలు.

ఆదిలాబాదు జిల్లాలో గోడులు, కొలాములు, మధురాలు, ప్రధానులు, ఆంధ్రులు ముఖ్యజాతులు. నాయక పోడులు ప్రధానంగా కరీంనగర్ జిల్లాలో కన్పిస్తారు. వరంగల్, ఖమ్మం, ఉభయ గోదావరి జిల్లాల ఏజెన్సీ ప్రాంతాలలో కోయులు, కొండరెడ్లు ఎక్కువ. విశాఖపట్టణం, శ్రీకాకుళం జిల్లాల కొండ ప్రాంతాలలో బగతులు కొండదొరలు, వాల్మీకులు, మూల దొరలు, సామంతులు, గదబలు, మమ్మంటి, కోటియాలు ఎక్కువ కన్పిస్తారు. శ్రీకాకుళం జిల్లాలో జాతపు దొరలు, సవరలు మాత్రమే కొండ ప్రాంతాల్లో వున్నారు. కర్నూలు జిల్లాలోని నల్లమల అడవులలో మహబూబ్‌నగర్ జిల్లాలోని అమరా బాద్ పీఠభూమి ప్రాంతంలో చెంచులు నివసిస్తున్నారు. రాష్ట్రంలో అనేకచోట్ల కనిపించేజాతి బంజారులు వీరినే సుగాలీలని, లంబాడీలని, లబానీలు అని కూడా పిలు స్తారు. ఎరుకలు, ఏనాదులు మైదాన ప్రదేశాలలోనే నివా సాలు ఏర్పరచుకొన్నవారున్నారు. గిరిజనులకు సంవత్సరం పొడుగునా వ్యవసాయమే జీవనాధారం. గోడులు, కోయులు, బగతులు, వాల్మీకులు స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుని భూములను సేద్యం చేసుకుంటారు. కొండరెడ్లు, కొండ దొరలూ, సామంతులూ, సవరలూ నిలకడగా ఒకచోట కాక తమకు తోచిన ప్రదేశాలకు పోయి వ్యవసాయం చేసుకుంటారు. అందువల్ల దీనిని ఈటెల పండుగ అంటారని ఆంధ్ర ప్రభుత్వ గిరిజన సాంస్కృత సంస్థవారు తెలియజేశారు.

చైత్రమాసంలో గిరిజనులు చైత్రపర్వం చేసుకుంటారు. అన్ని తెగల వారు మహోత్సాహంతో ఉత్సవంలో పాల్గొం టారు. అందరూ ఒకచోట చేరి విందు చేసుకుంటారు. యువతీ యువకులు ఒళ్ళు తెలియని ఆనందోత్సాహా లతో తెల్లవార్లూ సంగీత నృత్యాలతో కాలక్షేపం చేస్తారు. అన్ని వయసుల వారు రోజుల తరబడి అడవులలో గడు పుతూ తృప్తిగా వేటాడతారు.

దింసానృత్యం :

అరకు లోయలో ప్రసిద్ధమైన నృత్యాలలో దింసా నృత్యం ఒకటి. యువకులు ధనికులు, పేదలు అనే తేడా లేకుండా అన్ని వర్గాల వారు దింసా నృత్య కార్య

క్రమాలలో పాల్గొంటారు. కష్ట జీవులైన గిరిజనులకు, ఈ కార్యక్రమాలు అంతులేని ఆనందాన్నిస్తాయి. ఈ నృత్యము గ్రామీణ ప్రజలమధ్య సఖ్యతను సుహృద్భావాన్ని పెంపొందిస్తుంది. దింసా నృత్యాన్ని చైత్ర పర్వంలో, వివాహ సమయంలోను, పండుగ దినాలలో ప్రదర్శిస్తారు. దింసా నృత్యాన్ని చైత్రపర్వంలో, వివాహ సమయంలోను, పండుగ దినాలలో ప్రదర్శిస్తారు. దింసా నృత్యంలో విలక్షణమైన సంగీత, వాయిద్యాలు వున్నాయి. తుంట, మోరి, డప్పు మొదలైన సంప్రదాయ వాయిద్యాల సహకారంతో లయబద్ధంగా సాగుతుంది ఈ నృత్యంలో కళాకారుల్ని ఉత్తేజపరచటానికి మధ్య మధ్య జోడుకొమ్మ బూరలను ఊదుతారు.

గోడుల గుసాడి నృత్యం :

అదిలాబాదు జిల్లా రామ గోండులకు దీపావళి పెద్ద పండుగ. చలికాలం ప్రారంభమయ్యే సరికి పంటలన్నీ చేతికి వచ్చి ఉంటాయి. తాము చెమటోడ్చి తీసిన కష్టం ధాన్యం లక్ష్మిగా నట్టింట చేరి వుంటుంది. గోడులందరూ ఆటపాటలతో కాలక్షేపం చేసేరోజులు ప్రారంభమౌతాయి. రకరకాల వస్త్రాభరణాలు వేసుకొని యువజనులు సంగీత వాయిద్యాలతో అతిథులుగా పొరుగు గ్రామాలకు తరలి వెళతారు. కొమ్ములూదుతూ తప్పెట్లు వాయిస్తూ యాత్ర సాగిస్తారు. గోడు యువకులు 20 నుంచి 40 మంది దాకా చేరి చేసే దండారీ నృత్యంలో గుసాడి నృత్యం ఒక భాగం. దీపావళి నెలలో ఈ నృత్యం జరుగుతుంది. పౌర్ణమినాడు కార్యక్రమం ప్రారంభమై చతుర్థశి వరకు జరుగుతుంది. గుసాట నర్తకునికి కావలసిన సామాగ్రిలో ముఖ్యమైనది నెమల పించంతో తయారు చేసిన తలపాగా ఇందులో గొర్రెపోతు కొమ్ములను కూడ అమర్చుతారు. కృత్రిమ గడ్డాలు, మీసాలతో వేషం కడతారు. మేకతోలు కప్పుకుంటారు. సంగీత వాయిద్యాలను గుసాడి నృత్య పరికరాలను గోండులు పరమ పవిత్రంగా భావిస్తారు.

దండారి కోలాట నృత్యం :

మరింత లయబద్ధమూ, క్రమ బద్ధమూ అయిన దండారి నృత్యం గుసాటినృత్యంలో భాగం. దండారి నృత్యం చేస్తున్న బృందంలోకి గుసాడి బృందం అకస్మాత్తుగా ప్రవేశిస్తారు. గోడు భాషలో గుసాడి అంటే అల్లరి అని అర్థం. దండారి నృత్యం గుమేలా అనేది బుర్ర కథ ఒక్క శబ్దాలకు అనుగుణంగా లయబద్ధమై వుంటుంది. వలయాకారంగా చేరి దండారి బృందం లోపల వైపుకు తిరిగి నిలుచుంటారు. ఎడమవైపుకు నెమ్మదిగా అడుగులు వేస్తూ, అడుగులు వేసినప్పుడల్లా కుడి పాదాన్ని ఎడమ కాలుమీదికి వూగిస్తుండటంతో నృత్యం ప్రారంభమౌతుంది. ప్రతినర్తకునికి చేతిలో రెండు కోలాటం కర్రలు ఉంటాయి. నర్తకులు తమ చేతుల్లోని రెండు కర్రలను ఒకదానితో మరొకటి దానిని తాకిస్తారు. తరువాత కుడివైపున ఉన్న నర్తకుని కర్రను కొడతారు. ఇలా అడుగులు వేస్తూ కోలాటమాడుతూ నర్తకులందరూ వంగి కర్రలను నేలకి తాకించి నాలుగు దిక్కులకు అడుగులు వేస్తారు.

దండారీ నృత్యంలో గుసాటీల ప్రవేశం :

దండారీ నృత్యం కొనసాగుతుండగా నలుగురైదుగురు గుసాటీలు హఠాత్తుగా దండారీల వలయంలోకి చొచ్చుకుని వస్తారు. తలకు నెమలి పించాలను ధరించి కృత్రిక గడ్డాలు, మీసాలు, శరీరంపై మేక చర్మము ధరించి వచ్చే గుసాటీల చేతిల్లో కర్రలుంటాయి. మెడలో గవ్వల హారాలు, తుంగకాయ హారాలు ఉంటాయి. నడుముకు, మణికట్టుకు చిరుగజ్జెలు ఉంటాయి. కంటి చుట్టూ తెల్లరంగు పూసుకుంటారు. మొలకు నారింజ రంగు లంగోటీలు తప్పించితే శరీరంపై ఇతర ఆచ్ఛాదన ఉండని గుసాటీలు వేషం వింతగా వుంటుంది.

సామంతుల మయూర నృత్యం :

సామంతులు మాత్రమే ఈ మయూర నృత్యం చేస్తారు. సామంతులనే గోండులని కూడా అంటారు.

సామంతులు ఎంతో వెనుకబడిన గిరజనులు. విశాఖ పట్టణం, శ్రీకాకుళం జిల్లాలలో దుర్గమ్మ కొండ ప్రాంతపు అడవుల్లో ఈ గిరిజనులు కన్పిస్తారు. గోండుల వివాహ సందర్భాలలో ఏప్రిల్ నెలలో వచ్చే చైత్ర పర్వదిన సందర్భా లలోనూ, ఈ మయూరి నృత్యం చేస్తారు. సామంతులు ఖరీదైన వస్త్రాలంకరణల జోలికి పోరు. తెల్లదోవతి కట్టుకుంటారు. నర్తకులందరూ పాదాలకు గజ్జెలు కట్టుకుంటారు. తలకు తోయంగ అనే తలపాగా ధరి స్తారు. తుంగడిడ్డతో చేసిన పాగాకు రంగుల గుడ్డ పీలక లను కుచ్చులుగా కడతారు. నడుము వంచినప్పుడు ఫించము విప్పిన నెమలి వలె కన్పించే తట్టు నెమలి ఫించముల గుత్తిని నడుముకు వెనుక బిగించుకుంటారు. నోటితో నెమలి అరుపున పోలిన శబ్ధము చేస్తారు.

జోడియా :

ఈ నృత్యాన్ని కొండ్య మట్టియా, జోడియా అనే జాతుల వాళ్ళు చేస్తారు. ఈ నృత్యాన్ని పూలకమ్మ, గంగాదేవి, గసురమ్మ మొదలైన పండుగల సందర్భముగా చేస్తారు. ఇది ఆడ, మగ కలిసి చేసే బృంద నృత్యం.

పూలపండ్లు :

ఇది శ్రీకాకుళానికి చెందిన సవర జాతి చేసే గిరిజన నృత్యం. దీన్ని పెళ్ళిళ్ళ సందర్భములో, దీవి పూజల సందర్భముగా చేస్తారు. ఇది ఆడ, మగ కలిసి చేసే బృంద నృత్యం.

చెంచునృత్యం :

మహబూబ్‌నగరుకు చెందిన చెంచుజాతివాళ్ళు, పెళ్ళిళ్ళ సందర్భముగా చేసే నృత్యం. ఇది ఆడ, మగ కలిసి చేసే బృంద నృత్యం.

లంబాడి :

లంబాడి హోలి నృత్యం. నల్లగొండకు చెందిన లంబాడి జాతివారు హోలి పండుగ సందర్భంలో చేస్తారు. దీన్ని హోలి నృత్యం అని కూడ అంటారు.

కోయ నృత్యం :

ఇది ఖమ్మం జిల్లాకు చెందిన కోయజాతి వారు విత్తనాలు నాటే సందర్భంలో చేసే నృత్యం. వరిపంట చేతికి వచ్చిన సందర్భంలో చేసే నృత్యం.

మామిడికోత నృత్యం :

కొండరెడ్లకు అత్యంత ప్రతీకరమైనవి మామిడి పండ్లు. మామిడిపండ్లు ఆ ప్రాంతంలో ఎక్కువగా లభిస్తాయి. మామిడి పండ్లు కోసే ముందు కొండరెడ్లు ఆనందోత్సవం జరుపుకుంటారు. తప్పెట వాయిద్యాల శబ్దానికి అను గుణంగా లయబద్ధమైన నృత్యంచేస్తారు. రాత్రిపూట ఈ నృత్యం ప్రారంభమౌతుంది మొదట వాయిద్యాలను నెమ్మదిగా మ్రోగిస్తారు. ముగ్గురు నలుగురు స్త్రీలు చెట్ట పట్టలు వేసుకుని చేతుల్లో గలగల శబ్ధం చేసే ఎండు కాయల గుత్తులను ధరించి నృత్యంలో పాల్గొంటారు.

వరంగల్ జిల్లా బంజారా ఉపే తెగాల వృత్తులు

– మూడ్ రాజు, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

భారతీయ సమాజం బహు ముఖ్యమైనది. విభిన్న సంస్కృతుల విశిష్ట ఆచారాలకు అది ఆలవాలం. దేశం మొత్తంగా ప్రాచీన కాలం నుండి కొనసాగుతూ వస్తున్న అంచెకుల వ్యవస్థతో పాటు వివిధ తెగలు, విభిన్న జాతులు సమ్మిళితంగా సహజీవనం కొనసాగిస్తున్నారు. అదే సమయంలో అవి తమదైన సంస్కృతీ సభ్యతలను కలిగి వున్నారు. దేశంలోని, రాష్ట్రంలోని వివిధ సమాజాల ప్రత్యేకత.

వివిధ జాతులు, తెగలు, తమ జీవనం ప్రారంభమైన ప్పటి నుండి ఎదుగుతున్న క్రమంలో, విస్తరిస్తున్న దశలలో వివిధ నాగరికతలను తమలో కలుపుకొంటూ, తమ ఆచార సంప్రదాయాలను వారిలో విస్తరింపజేస్తూ కొన సాగుతున్నాయి. అప్పుడు మాత్రమే సరియైన సమాజ జీవన శైలీ, లౌకిక భావన వెల్లివిరుస్తాయి.

తెలంగాణ రాష్ట్రంలోని గిరిజనులు ఎక్కువగా వున్న వాటిలో వరంగల్ జిల్లా ఒకటి. ఈ జిల్లాలో లంబాడలు అధికంగా ఉన్నారు. కాబట్టి లంబాడ ఉప తెగల ప్రధాన వృత్తులు, జీవన విధానం చెప్పడమే ఈ ముఖ్య ఉద్దేశ్యం.

వృత్తి కులాలు :

భారతదేశంలో స్వయం సమృద్ధి ఆర్థిక వ్యవస్థ కొనసాగుతున్న క్రమంలోనే బంజారాలు కూడా తమ కనీస అవసరాలు తీరుటకు పనిముట్లపై ఇతరులపై ఆధార పడకుండా తమ కులంలోనే కొద్ది మందిని తమకు కావా ల్సిన అభరణాలను తయారి కోసం కొద్ది మంది నైపుణ్యం కలిగిన వారిని వారు ఆయా వృత్తులను కొనసాగిస్తూ బంజారాల అవసరాలు తీరుస్తున్నారు.

సనార్ (కంసాలి) (గోల్డ్ స్మిత్) :

వీరు లంబాడ స్త్రీలకు, పురుషులకు సంబంధించిన అభరణాలను తయారు చేయువారు. స్త్రీల అభరణాలు అవి : టోప్లి, హంస్లో, టికి, భూరియా, పూల్లి, రఫియార్ హార్, అంగుతల చట్టికి, బాజు బంద్, వంకిడి మొ॥ ధరిస్తారు. పురుషులకు సంబంధించిన అభరణాలు అవి : రూపేర్ కొల్ల, వింటి, కణోదోర్ అనేవెండి మొలత్రాడు. చెవులకు రింగులు ధరిస్తారు.

మొ॥ వాటిని తయారు చేయు వారిని సనార్ (బంజారా) అని పిలుస్తారు. అలాగే దేవత విగ్రహాలను తయారు చేస్తారు. అవి : మేరమా యాడి, తుల్జా భవాని, విగ్రహాలను తయారు చేస్తారు. వీరు ఆచారములో కూడా కొంత మార్పు ఉంటుంది. లంబాడి తండాల్లోనే వీరు నివాసాలను ఏర్పాటు చేసుకుంటు జీవిస్తున్నారు. కొన్ని చోట్ల వీరు 'సనార్ తండ' అని పేరు పెట్టి అందులో దాదాపు మొత్తం కుటుంబము అంతయు సనార్ వాళ్ళుంటారు. కాబట్టి "సనార్ తండ" అని అంటారు.

సనార్ వాళ్ళ ఇంటి పేర్లు అవి : 1) మాలి 2) ముండావర్ 3) తుంగార్ 4) మౌర్య 5) జువల్ 6) ఖాత్రి 7) సాదె వాద 8) అద్దానియా 9) ఖాతారియా 10) భీమర్ 11) గోగనాథ్ 13) రువ్వాల్ 14) దాసనియా 15) మన్నాన్ 16) చేమాల్ 17) ఠాగూర్ మొ॥ గోత్రాల వారు ఉన్నారు. వీరు గోర్ బోలి, బంజారా భాషనే మాట్లాడుతారు. నేడు మారుతున్న కాలానుగుణంగా బంజారాలు తమ పూర్వము ఆచారముగా వున్న అభరణా లకు ఇప్పుడు అంత ప్రాముఖ్యత లేని కారణము వీరి వృత్తికి తీవ్రమైన అవరోధము ఏర్పడినది. నేడు ఎక్కడో ఒకటి, రెండు కుటుంబాల వారు మాత్రమే బంజారాలకు ఎక్కువగా ఇష్టపడి పూర్వపు అభరణాలను తయారు చేయించుకోదలుచుకుంటే వారి ఇష్టా ఇష్టాలను బట్టి తయారు చేస్తున్నారు.

భాట్ (భట్టు) :

ఈ బంజారా ఉప తెగ వారు పూర్వీకుల చరిత్రను కథలు, పాటలు, నాటకాల రూపంలో కచేరిలు చేసి మెప్పుపొంది పైకం పొందుతారు. ప్రధానంగా వీరు తండాలో జీవనం గడుపుతూ సంచార జాతులుగా జీవిస్తున్నారు. బంజారాల చరిత్ర, పుట్టు పూర్వోత్తరాలు వారి దేవతల గురించి వారి ప్రాముఖ్యతను గురించి వివరిస్తూ బంజారాలు ఇచ్చుధనం, ధాన్యములను బహుమానాలుగా స్వీకరిస్తారు. వీరి ఆచార సంప్రదాయాలు దాదాపుగా కనుమరుగవుచున్నదని చెప్పవచ్చును. ఎంత ఎదిగినను మిగతా బంజారా కుటుంబాల వారు వీరిని భాట్‌లాగానే వివక్షతోనే చూస్తున్నారు. వారి గత చరిత్ర తెలిసి ఉంటే తప్ప గుర్తించటం కష్టతరం.

ఢాడీ :

సంగీత కచేరాలు చేసే ఒక ఉప తెగ లంబాడీల ఈతరం ఢాడీలు ఇప్పుడు సంగీత పరికరాలు వీణా వాయిద్య పరికరాలు ఢాడీలు వాడటం లేదు. ఆధునిక నాగరికథలో ఇవి కనుమరుగాయ్యాయి. సంగీతం మౌఖిక సాహిత్యాన్ని కలిగి వుంటారు. ప్రధాన గోత్రములుగా ఉన్న బంజరాల వారి మనన్నలను పొంది వారి ఇచ్చు ధనధాన్యములను స్వీకరిస్తూ జీవిస్తున్నారు. విచిత్రమేమంటే వృత్తి కులాల వారికి, సేవా కులాల వారికి మధ్య సమానంగా కలిసి ఆహారం భుజించటం జరగదు. భాట్ బంజారలు వండింది మాత్రం దాని కంటే క్రింది కులాల వారైన ఢాడి, డఫ్డియా భుజిస్తారు. ఈ విధంగా బంజారా జాతులల్లో కూడా వివక్షతను గమనించవచ్చు. వీరి వంశస్థులు పూర్వం దేమాగురువుకు బంజారాలకు మధ్య వార్తా హరులుగా వ్యవహరించారని తెలుస్తున్నది.

డాపిడియా :

లంబాడీల ఉప తెగ వారు డప్పు కొట్టువారిని 'డాపిడియా' అంటారు. తీజ్ పండుగ, ఉత్సాహాలలో, వివాహాల వేడుకలలో డప్పు కొట్టి పైకం ఆడుకునేవారు. బంజారా సేవక కులాల్లో డఫ్డియా లంబాడీలు అత్యంత క్రింది తరగతికి చెందిన వర్గం వారు. డఫ్డియా అనగా డప్పు కొట్టువారని అర్థం. ఒక్క మాటలో చెప్పాలంటే వీరు అన్ని శుభ, అశుభ కార్యాలలో పాల్గొంటారు. మనిషి చనిపోయినపుడు డప్పు వాయిద్యముతో పాల్గొని దహన సంస్కారములను నిర్వర్తించుట వరకు అన్నింటిని దగ్గరుండి కార్యమును జరుపుదురు. హిందూ సమాజంలోని మాదిరిగా అంతరాని వారిని దరి చేయని విధంగా, డఫ్డియా వారిని కూడా బంజారాలు అంతే వివక్షతో చూస్తారు. వీరు తండాలోని ప్రజలకు, ఇతర తండాల నాయకునికి వీరు సమాచారం ఇచ్చే వార్తా హారులుగా / సేవకులుగా డఫ్డియా వారు డఫ్డియాలను పెళ్ళి చేసుకుంటారు. డప్పు కొట్టి ధనధాన్యాలను తీసుకుని బ్రతుకుచున్నారు.

డాఫ్డియా వాళ్ళ ఇంటి పేరు అవి : 1) చించావత్ 2) పాపవత్ 3) జనావత్ 4) సంగ్లోత్ 5) పాలపోలె 6) కట్టా 7) గోడిపోలె 8) పోగులోవ్ 9) జాన్లాగడ్డ 10) ముచావత్ 11) తాల్‌వారియా. వీరి గోత్రాల మధ్య వైవాహిక సంబంధాలు ఏర్పాటు చేసుకుంటారు. డఫ్డియా (బంజారల) వృత్తికి నేడు ఆదరణ తగ్గటంలో పట్టణాలకు వలస వెళ్లి కూలీలుగా జీవిస్తున్నారు. తండాల్లో ఉన్న డఫ్డియా లంబాడీలు వ్యవసాయ కూలీలుగా, కొంత మంది ఉన్నత చదువులు చదువుకొన్న ఉద్యోగాలలో స్థిరపడుచున్నారు.

నావి (మంగలి) :

వీరు లంబాడీలకు కటింగ్ (క్షవరం) చేసే ఒక బంజార ఉప తెగ. వీరు తండాలోనే జీవిస్తారు. 'నావి' వారు పిల్లలకు, పెద్దలకు కటింగ్ చేస్తూ, శుభ కార్యాలలో పాల్గొంటూ, వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తారు. బంజారా సంస్కృతి సంప్రదాయలకు వీరు కట్టుబడి ఉంటారు. వీరు పండుగ, పెళ్ళిలలో 'నావి' వారి పాత్ర చాలా ముఖ్యమైనది. హిందూ సంప్రదాయం ప్రకారం బంజారాల పెళ్ళి వేడుకలలోని నావి (మంగళి) 'మైల

పోలు' తీయుట వీరి ఆచారంగా వస్తుంది. గోర్ బంజారా ఇచ్చే ధన, ధాన్యాలను తీసుకుని అలాగే సారాయిని సేవించి సంతోషంగా, ఉల్లాసంగా నావి తన ఇంటికి వెళ్ళిపోతాడు. నేటి ఆధునికా కాలంలో 'నావి' తన వృత్తిని దాదాపు కొంత మేర వరకు 'క్షవరం' చేసుకుంటూ జీవిస్తున్నారు. నేటి సమాజంలో ఆధునిక సెలూన్ షాపులు రావటం వల్ల వీరికి జీవనోపాధి దాదాపు కష్టతరం అయింది. వీరి పాత్ర గోర్ బంజారాలో చాలా ముఖ్యమైనది.

ఖాత్తి (వడ్రంగి) :

లంబాడీల ఉప తెగ, పూర్వ కాలంలో వ్యవసాయ పని ముట్లలను, రైతులకు కావల్సిన మంచం, గడెంచ్చ, బండి, నాగలి, గోరు, కాని, ఘుటక, పాలె, ధంత్య, మోట బావికి సంబంధించిన గీరక ఇలా ఎన్నో రకాల వస్తువులను తయారి చేసి ఇచ్చే వారిని 'ఖాత్తి' అనే వారు ఇప్పుడు 'ఖాత్తి' బంజారా దాదాపు తమ వడ్రంగి పనికి పని లేక వ్యవసాయదారులుగా, కౌలు రైతులుగా జీవిస్తున్నారు.

రంగార (బంజార) :

వీరు బంజారాలకు సంబంధించిన దుస్తులను అంగడిలోను, జాతరలోను, తండాలలోను తిరుగుతూ, రంగు రంగుల దుస్తులను, ధారాలను, బట్టలను అమ్ముదురు. కాబట్టి ఈ ''రంగార బంజార' అని పిలుస్తారు. వీరు నెక్కొండ, కేసముద్రం, మహబూబాబాద్, తొర్రూరు, నర్సంపేట, డోర్నకల్ ప్రాంతంలో జీవిస్తున్నారు. ఇప్పుడు చాలామంది రంగార వృత్తిని చేయడం లేదు. ఎందుకనగా బంజారల దుస్తులు ఇప్పుడు కనుమరుగాయి బంజారాల సంస్కృతి,సంప్రదాయాలకు ముఖ్య నిలయం 'బంజారా దుస్తులు'' ఆ దుస్తువులను చూసి బంజార (లంబాడ) స్త్రీలను గుర్తుపట్టడం చాలా సులభం.

బంజారా స్త్రీలు ధరించే ముఖ్యమైన వస్త్రాలు అవి : పేట్యా (లంగా), కాంచ్లీ (రవిక), టుక్రీ (ముసుగు), పాఠ, ఘూంక్టో, పేట్టి, బాజుబంధ్, ఘుర్రసాని, ఝూజుర్, ఘుగరారి జోడి, బల్యా, టోప్లి, కాసే, రాల్లిడి, క్వాడీ, కాచ్చే, దోరా, రంగు రంగుల దారాలు మొ॥ వస్తువులను రంగారా వాళ్ళు అమ్మేదురు. పురుషులకు కావల్సిన దుస్తువులు అవి పాంగ్డీ, దోతి, రూమాల్ మొదలగు దుస్తులు అమ్మెదరు.

లంబాడీ స్త్రీలు ధరించే వస్త్రాలపై ఎక్కువగా అద్దాలు పొదగబడి ఉంటాయి. వాటిని అందం దృష్ట్యా చూసే చాలా బాగుంటాయి. అలాగే వస్త్రాలపై కుట్టబడిన అద్దాల మీద సూర్యకాంతి ప్రసరించి మళ్ళీ వికేంద్రీకరణం (తీవటశ్రీవఱిఱశీఅ) చెంది ఆ అద్దాలు కాంతిని వెద జల్లడతో ఈ లంబాడీ స్త్రీలపై జంతువులు, మృగాలు దాడి చేయకుండా, ఆ వెలుతురును చూసి పారిపోతాయని వీరి ప్రగాఢ విశ్వాసం.

ఈ బంజారాల సంస్కృతి సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను కలిగి గోర్ బంజారుల ఉప తెగల వృత్తులు ఇప్పుడు దాదాపుగా కనుమరుగాయ్యాయి.

ఉపయుక్త గ్రంథాలు :

1. బంజారాల చరిత్ర, సంస్కృతి - డా॥ గుగులోత్ వీరన్న
2. బంజారాల వివాహ ఆచార పద్ధతులు - డా॥ అజ్మీర సిల్యానాయక్
3. లంబాడీ - డా॥ కె. శ్యామల
4. బంజారా (పండుగలు - సాహిత్యం) - హంసావత్ నాగేంద్ర
5. గిరిజన సాహిత్యం - ఆచార్య ఎం. గోనా నాయక్
6. ఆధునిక సమాజంలో గిరిజన భాష - సంస్కృతులు - డా॥ భూక్య తిరుపతి
7. బంజారా మౌఖిక కథలు - డా॥ జె. రాజారాం
8. బంజారా సంస్కృతి - ప్రదర్శన కళలు - జి. శంకర్ నాయక్.

అతడు అడవిని జయించాడు – నవలలో ఎరుకల జీవన శైలి

– విజయలక్ష్మి నూకల, పరిశోధక విద్యార్థిని, తెలుగు శాఖ, రాజధాని కళాశాల, చెన్నై, తమిళనాడు.

ఉపోద్ఘాతము :

ఆధునిక యుగంలో పాశ్చాత్య ప్రభావం చేత వెలువడిన కొత్త ప్రక్రియ నవల. మొదటి దానిని వచన ప్రబంధం అన్న పేరుతో పిలచేవారు. కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రి గారు దానికి నవల అన్న పేరును సూచించారు. ఆంగ్లంలో 'నావెల్'కి సమానార్థం నవల. ఆంగ్ల సాహిత్యం తరువాత తెలుగు సాహిత్యంలోనే ఎక్కువ నవలలు వచ్చాయి. ఇది మధ్య తరగతి ఇతిహాసం కావడంతో దీనిని ఎక్కువ మంది ఆదరించారు. తెలుగు సాహిత్యంలో వచ్చిన మొదటి నవల "శ్రీరంగరాజ చరిత్ర" అని అనుకున్నప్పటికి కందుకూరి వారి "రాజశేఖర చరిత్ర" మొదటి నవలగా పరిగణించబడింది.

గిరిజనుల ప్రస్తావన మొదట "శ్రీరంగరాజ చరిత్ర"లో ఉన్నది. అనంతర కాలంలో వచ్చిన తొలి తెలుగు గిరిజన నవల 1972లో కొర్రపాటి గంగాధరరావు గారు రాసిన "లంబాడోళ్ళ రాందాసు" ఇది గిరిజనులయిన లంబాడీల జీవితాన్ని ఇతివృత్తంగా తీసుకొని రాసిన నవల. అతడు అడవిని జయించాడు. గిరిజన జీవితాన్ని గురించి వచ్చిన నవలల్లో మూడవది. "తెలుగు నవల-గిరిజన జీవన చిత్రణ" "సిద్ధాంత గ్రంధకర్త" జరుపుల రమేష్ (పుట. సంఖ్య 33)లో పేర్కొన్నారు. తెలుగులో మొదటి గిరిజన రచయిత అయిన ఏకుల వెంకటేశ్వర్లు "వెన్నెల నవ్వు" అనే నవలను 2011వ సంవత్సరంలో రాశారు. దీనిలో యానాదుల సంస్కృతిని గురించి చిత్రించారు.

రచయిత :

డాక్టర్ కేశవరెడ్డి గారు 10-03-1946 సంవత్సరంలో చిత్తూరు జిల్లా "తలుపుల పల్లి" అనే గ్రామంలో జన్మించారు. వీరిది రైతు కుటుంబం వృత్తిరీత్య వైద్య నిపుణులుగా ఉండి కూడా ప్రవృత్తి రిత్యా రచయితగా ఎదిగారు. వీరు రచించినవి ఎనిమిది నవలలు, వీరు రాసింది తక్కువ నవలలైనప్పటికిని పాఠకులనుంచి విశేషాదరణ పొందాయి. కేశరెడ్డి గారు తీసుకునే ఇతి వృత్తం సామాన్యుల ఊహకు అందనిది చాలా క్లిష్టమైనవి కూడా. తెలుగు సాహిత్య చరిత్రలో తొలి సారిగా ఎరుకల తెగకు చెందిన వ్యక్తిని నాయకుడిగా చేసి నవల ఇతివృత్తం ఎన్నుకొని రచన చేయడం అభినందించదగ్గ విషయం. అంతేకాక మనం అన్యహించుకునే పంది చుట్టు కథ అల్లి ఆ కథను ఏకబిగించి చదివించే ఒక గొప్పగుణం ఈ నవలకు ఉన్నది. పంది సలుగులను చందమామలుగా చూడటం రచయిత కళాదృష్టికి, ఉన్నతమైన ఆలోచనలకు ఒక నిదర్శనం. సింహవలోకనంలో డా॥సంజీవ్ దేవ్ గారు "పందిలో నందిని సందర్శించ కలిగేడు. నైచ్యం అనబడే దానిలో ఔన్నత్యం చూడకలిగేడు. హేయంలో ప్రేయం అనుభూతించాడు. దీన్నే కర్పూరపు సురూపం అంటారు. రసద్రష్టకు లోకంలో ఏదీ కురూపం కాదు అంతా సురూపమే. ఏదీ కునాదం కాదు. అంతా సునాదమే. (పుట: 106 అతడు అడవిని జయించాడు) అని రచయిత అత్యున్నత భావాల గురించి చెప్పారు. ఈ నవలలో ప్రకృతిని ఇంత లోతుగా పరిశీలించి అడవిలోని చెట్లను పరిచయం చేయడం ప్రకృతి వర్ణనలను చేయడం ఇంకా ఏ తెలుగు నవలల్లోను కనిపించదు ఇదే మొదటి తెలుగు నవల. ఈ నవలలను 1984వ సంవత్సరంలో "ఆంధ్ర వార పత్రిక"లలోను 1985లో పుస్తక రూపంలో వచ్చింది. 1988లో పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం వారు ఎంపిక చేసిన ఉత్తమ నవల. ఇంగ్లీష్‌లో మాక్మిలన్, ఆక్స్‌ఫర్డ్ వంటి ప్రముఖ సంస్థలు ప్రచురించాయి. నేషనల్ బుక్ ట్రస్ట్ వారు ఈ నవలని 14 భాషలలోకి అనువదించారు. 13-02-2015న కేశవరెడ్డి గారు తుది శ్వాస విడిచారు.

కథా ఇతివృత్తం :

పందులను మేమడమే వృత్తిగా కలిగిన ముసలివాడు ఇరవై పందులకు యజమాని. అందులో రెండు సుక్క పందులు కూడా ఉన్నాయి. మొదటి సుక్క పంది నాలుగు రోజుల క్రితం పన్నెండు సలుగులను కన్నది. రెండో సుక్క పంది ఈనటానికి సిద్ధంగా ఉన్నది. ముసలివాడికి నలతగా ఉండటంతో పందులను మేపటానికి మనుమడ యిన గోపాల్ మేతకు తీసుకువెళ్తాడు. పొద్దుగూకటంతో పందుల జాడ తెలియక అతడు బయలుదేరగా మధ్యలో మేతకు వెళ్లిన పందులు కనిపిస్తాయి. కాని అందులో సుక్క పంది లేదు. దాన్ని వెతకటానికి ముసలి వాడు అడవిలోకి వెళ్ళి చెట్ల పొదలు, పుట్టలు గాలిస్తాడు. చివరికి అర్ధరాత్రి తోటి గువ్వ అరుపుల సహాయంతో సుక్క పంది ఉన్న పొదను తెలుసుకుంటాడు. సుక్క పంది చంద మామలాంటి పది సలుగులను కంటుంది. వాటిని చూడ టానికి ప్రయత్నించగా సుక్క పంది ముసలివాడిని గాయ పరుస్తుంది. ఇంతలో పురిటి వాసనను పసిగట్టి నక్కలు సలుగులను ఎత్తుకెళ్లటానికి వస్తాయి. వాటిపై సుక్క పంది దాడిచేయగా అవి మరణిస్తాయి. అప్పుడా ముసలివాడు దాని మీద పాట పాడాలని గుర్తుకు తెచ్చుకుంటాడు. కాని లోకంలో నెమిలి మీద, హంసమీద పాటలు ఉన్నాయి. నీ మీద ఎవ్వరు పాట రాయలేదు అని భారతంలో భీమసేనుని పై గల పాటలను గుర్తుకు తెచ్చుకొని దానిని భీమసేనునితో పోల్చుతూ పాటపాడు తాడు. కొంత సేపటికి యాభై నక్కలు దాడికి రాగ మెరుపు లాంటి ఆలోచనతో సుక్క పందిపై ఈటెను విసురుతాడు. ఆ దెబ్బకు అది మరణించింది. దాని పిల్లలను త్వరగా గుడిసెకి చేర్చాలని తలచి గంపను నెత్తిమీద ఉంచుకొని త్వరత్వరగా అడవిని దాటాలని ప్రయత్నిస్తాడు. కాని గాయంతో, నీరసంతో రాత్రంతా అడవిలో ఉండటంచేత స్పృహ తప్పుతాడు. తిరిగి మెలుకువ వచ్చేసరికి రాబం దులు గంప పై వాలి సలుగులను తినేస్తాయి. గుడిసెకు వచ్చి ఈటెకత్తిని జారవిడిచి ఇది నా జీవితంలో చివరి రోజు కాదు. నేను చెయ్యవలసిన పనులు చాలా ఉన్నాయి అని తలచి నిద్రిస్తాడు. బండి చప్పుడికి పిల్లవాడు మేలు కుని చూడగా వాకిలి వద్ద ఈటెకత్తి కనిపిస్తాయి. మెల్లగా ముసలివాడి పాదాల దగ్గర నుంచుంటాడు. ఇది కథ.

ముసలివాడు చిత్తశుద్ధితో, దృఢ సంకల్పంతో పట్టు దలతో పోరాడాడు. తాను యువకుడిగా ఉన్నప్పుడు తాను సాధించిన విజయాలను తలుచుకుంటూ ఉత్సా హవంతుడై ముందకు నడిచాడు. తాను ప్రేమించిన పంది కోసం సలుగుల కోసం, తన ప్రాణం కోసం పోరాడి వాటిని పోగొట్టుకొని కూడా తాను ప్రాణాలతో వచ్చాడు. రేపటి తరానికి ప్రతినిధియైన గోపాల్‌కు తన ఆస్తి అయిన విద్యను వేట రహస్యాలను చెప్పి, జీవితాన్వేషణ అనే యుద్ధాన్ని తన మనవడు ప్రారంభించ బోతున్నాడు చెప్పకనే చెప్పాడు. అందుకని అతడు అడవిని జయిం చాడు అని మనం భావించినట్లయితే అతనికి విజయం వరించింది. జీవితాన్వేషణ అనే యుద్ధం ఎప్పటికి జరుగుతూనే ఉంటుంది.

ఎరుకల జీవనశైలి :

తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద గిరిజన జాతి ఎరుకల జాతి. వారిని కుర్రు, కైకాడి, ఎరుకల వంటి పేర్లతో పిలు స్తారు. ఎరుక అంటే తెలిసినవారు అని అర్థం. అలాంటి వారి జీవన శైలి అతడు అడవిని జయించాడు నవలలో ఎలా ఉన్నదో చూద్దాం.

ఎరుకల నమ్మకాలు :

1. ఈ పూట చాలా ఆనందంగా ఉంది. నోట్లో చక్కెర పోసినట్లుగా ఉంది కడుపులో పాలు పోసినట్లుగా ఉంది. ఉదయం లేచి ఎవరి ముఖం చూశానో మరి (పుట.59) అనుకున్నాడు.
2. నామతి మండినట్లే ఉంది. నేను ఉదయం లేచి చూసింది సుక్క పందినే అని అనుకుంటాడు.
3. తన ఆహారంగా చంపిన కుందేలును చూసి ఈ రోజు నీవు ఎడం ప్రక్క నుంచి నిద్రలేచవు అనుకుంటాడు. ఇలా ఇతర కులాలలోని వారు

అనుకున్నట్లే వీరికి కూడా నమ్మకాలు ఉన్నాయి.

దేవతలు :

ఎరుకల వారు ప్రకృతిని పూజించడం, అంతేకాక వారి దేవతలు గంగమ్మ, పోతులయ్య, పెద్దమ్మ మొదలైన వారు. ఈ నవలలో పిల్లవాడి గురించి ముసలివాడు ఒక చోట "నా క్షేమం కోసం పందులక్షేమం కోసం వేయి దేవుళ్ళకు మొక్కుకుని ఉంటాడు." (పుట. 93) అని అనుకున్నాడు.

తాగుడు ఆచారాలు :

గిరిజన తెగయిన ఎరుకల తెగవారు చిన్నపెద్ద అందరు కలిసి తాగుతారు. బిడ్డపుట్టిన తొమ్మిదవరోజు స్నానం చేయించి సారాయి తాగిస్తారు. సుక్క పంది ఈనిన రోజు ముసలి వాడు పిల్లవాడితో కలిసి కల్లు తెచ్చుకొని చిత్తుగా తాగారు. పిల్లవాడు హరయించుకోలేక వాంతులు చేసుకోగా ముసలివాడు బొక్కెనతో నీళ్ళు తెచ్చి వాడి తలమీద కుమ్మరించి మరొక కల్లు ముంతను అందిస్తాడు.

నివాసం :

ఎరుకలు పూర్వం సంచార జీవితం గడుపుతుండేవారు. అందువలన వారికి అనువైన చోట గుడిసెలు వేసుకొని జీవించేవారు. కాని ఇప్పుడు సామాన్య జనులతో కలిసి ఊరికి దూరంగా గుడిసెలు వేసుకుంటున్నారు. అతడు అడవిని జయించాడు నవలలో కూడా ముసలివాడు ఊరికి దూరంగా తన గుడిసెలో నివసిస్తూ ఉంటాడు. గుడిసెలు ప్రస్థావన ఇందులో చాలా సార్లు వచ్చింది.

1. అతడు నిద్రిస్తున్న గుడిసె బయట ఉన్న పందుల్ని ముసలి వాని మనవడు మేతకై తోలుకు పోయి ఉన్నాడు. (పుట. 14)
2. తలుపు మూసిన తెరిచినా గుడిసెలోపల కావలసినంత వెలుతూరు ఉంటుంది. గుడిసె కప్పు సగానికి ఎగిరిపోయి ఉన్నది. గోడలు పగిలి అక్కడక్కడ నెరియలు చీలి ఉన్నాయి. ఆ నెరియల గుండా సూర్య కిరణాలు లోపలికి చొచ్చుకుని వస్తున్నాయి. (పుట. 16)

ఇక్కడ రచయిత ముసలివాని ఆర్థిక పరిస్థితి గిరిజనులు అనుభవిస్తున్న పేదరికాన్ని ఈ గుడిసె ద్వారా మనకి చెప్పాడు. దీనిని బట్టి వారు ఎలాంటి జీవితాలను అనుభవిస్తున్నారో మనం చెప్పవచ్చు.

ఆహారపు అలవాట్లు :

ఎరుకల వారు అడవుల్లో, కొండ ప్రాంతాల్లో ఒకప్పటి సంచార జీవులైన వీరు అడవుల్లో దొరికే ఆహారం కందమూలాలు, ఆకులు, అలములు తింటారు. అంతేకాక "మాంసహారం" వీరికి చాలా ఇష్టం.

ముసలివాడు అడవిలో కుందేలుని వేటాడి బూరుగ చెట్టు క్రింద కుందేలును దించి బూరుగ కాయలోని దూదిని తీసి తన బలమైన అరచేతుల మధ్య నలిపి కణిక రాళ్ళతో నిప్పు పుట్టించి ఎండు పుల్లలను ఏరి పెద్ద మంటను చేసి కుందేలును దానిలో పడేశాడు. అది బాగా కాలక దానిని బయటకు తీసి ముక్కలుగా కోసి కిల్చలి చెట్టు కాయలు బద్దలుగా కోసి పుల్లటి రసాన్ని మాంసపు ముక్కల మీద పిండాడు. ఆ ముక్కలను బుడితతో అద్దుకుని తిన్నాడు. మిగిలిన ముక్కలను మూటకట్టుకొని అరచేతులను తన తొడలకు తుడుచుకున్నాడు. ముసలివాడు తిన్న పద్ధతి అంత ఎరుకల వారి ఆహారపు అలవాట్లు.

వృత్తి విద్యలు :

వీరి ప్రధాన వృత్తి పందుల పెంపకం, గంపలు అల్లడం. పందుల పెంపకం గురించి రచయిత చెప్పడం జరిగింది. ముసలివాడు ఇరవై పందులుకు యజమాని. పందులపై ఉన్న ప్రేమను ముసలివాడు అనేక సందర్భాలలో ప్రస్తావించాడు. పందిని భీముడితోను, సలుగులను చందమామతోను పోల్చడంతో అతనికి దానిపై ఉన్న ప్రేమ మనకి తెలుస్తుంది.

వేట :

ఇందులో వేట ప్రస్తావనలో పిల్లవాడు పంగల కర్ర ప్రయోగించడంలో అఖండుడు. ముసలివాడు తాను చిన్నప్పుడు ఎంత చిటారు కొమ్మ మీదున్న ఉడుతనైన, ఎంత వేగంగా ఎగురుతున్న పిట్టనైన కొట్టి క్రింద పడవేసే వాడను అని తలుచుకుంటాడు.

ఆటపాటలు :

సుక్క పంది ఈనిన వార్త విన్న ముసలివాడు పిల్లవాడు ఏల కథలు పాడుతు ఆనందంతో బూతు పాటలు పాడుతు పిల్లవాడు ముసలివాడై, ముసలివాడు పిల్లవాడై దొర్లారు.

వైద్య విధానం :

ఎరుకల వారు వనమూలికలను పేరు పేరున గుర్తు పట్టి రోగనివారణ చెయ్యగలరు. మంత్రాలు, తంత్రాలు, పూజలు వైద్యంలో ఒక భాగం అని నమ్ముతారు. సుక్క పంది ఈనిన రోజు ఆటపాటలతో రాత్రంతా గడపడంతో ముసలి వాని గొంతు రాచుకుపోయింది. వొంట్లోని కీళ్ళన్ని పచ్చిపుళ్ళయి పోయాయి. నొప్పులకు నిప్పులతో కాల్చిన కళ్ళి కొమ్ములను తొక్కాడు. కీళ్ళకు చింతాకు పట్టు వేశాడు. మూడు రోజులయ్యిన కీళ్ళ నొప్పులు తగ్గలేదు. కాని వాపు తగ్గింది. గొంతు మండడం లేదు గాని మాటలు సరిగా రావడం లేదు.

పందికి వీపు మీద గాయం కాగా దానికి చీము పట్ట కుండా ఉప్పునీటితో కడిగి "వెంపలాకు" పత్రిని కట్టు కడితే గాయం మానుతుంది అని అనుకుంటాడు.

ముగింపు :

మానవ జీవితంలో బందాలు అనుబంధాలు ఒక్క మానువులకేకాక, ప్రకృతిలో మిగతా జీవులకు కూడా ఉంటుంది. ఇక్కడ ఒక దానిపై ఒకటి మమతానురాగాలు ఆత్మీయతను పెంచుకొని ఉన్న కూడా చివరికి మనిషి ఒంటరిగా పోరాడవలసిందే. ఈ పోరాటం ధర్మబద్ధ మైనపుడు, దృఢ సంకల్పం, చిత్తశుద్ధి, దృఢ నిచ్చయంతో అతడు పోరాడాడు. అతడు తన పోరాట పటిమను చూపించాడు కాబట్టి ఓడినా గెలిచినట్లే. అతని తదనం తరం మనమడు జీవనమనే పోరాటం కొనసాగిస్తాడు. కాలచక్రంలో ఈ పోరాటం ఎప్పుడు కొనసాగుతూనే ఉం టుంది. అని రచయిత ఈ నవల పరంగా తెలియ చెప్పారు. అందుకనే అతడు అడవిని జయించాడు.

ఆధార గ్రంధాలు :

1. తెలుగు నవల గిరిజన జీవన చిత్రణ - జరుపుల రమేష్, సిద్ధాంత వ్యాసం.
2. తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలు (వ్యాస సంకలనం) - ఆంధ్ర సారస్వత పరిషత్తు.
3. అతడు అడవిని జయించాడు - డా॥ కేశవరెడ్డి, నవచేతన పబ్లికేషన్స్.
4. ఆంధ్రప్రదేశ్‌లో గిరిజనులు, సంస్కృతి, ప్రగతికి సవాళ్ళు - డా॥ పిరాట్ల శివరామకృష్ణ.

గిరిజనుల విషాద గేయాలు – పరిశీలన

– పి. ఇందిర, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

మానవుడు సంఘజీవి. నిరంతరం ప్రవాహం లాంటిది అతని జీవితం. సుఖదుఃఖాలు సర్వసాధారణం. పుట్టింది మొదలు చనిపోయేవరకూ వివిధ అనుభవాలు, అనుభూతులుంటాయి. వీటి వల్ల కల్గిన సుఖదుఃఖాలను సహచరులతో పంచుకోడానికి ప్రయత్నిస్తాడు. ముఖ్యంగా తనకు విషాదం కల్గించిన సంఘటనలను ఇతరులతో పంచుకుంటే ఊరట కల్గుతుందని నమ్ముతాడు. ఉదాహరణకు తనకు ఆత్మీయమైన వారు మరణించినపుడు వారిని స్మరించుకుంటూ వివిధ గేయాలను పాడుకుంటాడు. వాటిని విషాద గేయాలు అంటారు. ఈ విధమైన గేయాలు జానపదుల్లోనే కాకుండా గిరిజన కుటుంబాలలో కూడా అధికంగా కన్పిస్తాయి. ఈ క్రమంలో గిరిజనులు వివిధ సందర్భాల్లో తమకు ఎదురైన బాధాతప్త సందర్భాలను గేయాలుగా పాడుకుంటారు. వాటిని పరిశీలించడం ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశ్యం.

గిరిజన కుటుంబాల్లో వివాహానికి ప్రాధాన్యం వుంది ఈ కార్యక్రమంలో వివిధ ఆచారాలను పాటిస్తారు. వాటిలో అప్పగింతలపుడు పాడే పాటలు. ఎందుకంటే ఈ పాటలు భిన్నమైనవి. విషాధభరితంగా వుంటాయి. అత్తారింటికెళ్లే ఆడపడుచు తమకు దూరమవుతుందని పుట్టింటి వారు గేయరూపంలో పాడేపాటలున్నాయి. పెళ్లికూతురు అత్తింట్లో ఏ విధంగా మసులుకోవాలో ఒక గిరిజన స్త్రీ ఆమెకు హితబోధచేస్తుంది. ఆ హితబోధకు సంబంధించిన గేయం,

పోయి రావమ్మ సుభద్రమ్మ
నీకు మంచి జరుగు యీరోజు
అత్తింటి శుభము కలుగునీకమ్మ
కొత్తగా మెట్టింట అడుగుపెడతున్నావు
అత్తగారికి అణకువగ మసలుకోవమ్మ
బావగారికి భయపడుతు వుండవమ్మ
మామగారికి సేవలతో మెప్పించవమ్మ
మొగుని మాటలకెదురు సెప్పొద్దమ్మ
.....
నీ మంచి తనము నిన్ను కాపాడునమ్మ
పుట్టింటి పేరు తీసుకురావమ్మ

పురుషాధిక్య సమాజంలో స్త్రీని పుట్టినప్పటి నుండి చనిపోయేంత వరకు అభద్రత వెంటాడుతుంది. అందుకు బాల్యంలో, యవ్వనంలో తల్లిదండ్రుల అదుపాజ్ఞలో పెరగాలి. వివాహమైన తర్వాత అత్తింటి ఆధిపత్యంలో బానిసగా జీవించాలి. వృద్ధాప్యంలో సంతానం అజమాయిషీలో జీవచ్ఛవంలా జీవించాలి. ఇదే భావాన్ని పై గేయం ద్వారా ఒక గిరిజన మహిళ పెళ్ళయిన స్త్రీకి హితబోధచేస్తోంది.

గిరిజన కుటుంబాల్లో ఆప్యాయతలకు కొదవలేదు. తల్లిని కోల్పోయిన ఆడపిల్లను అపురూపంగా తండ్రి పెంచి పెద్దచేస్తాడు. తల్లిలేని లోటును పూడ్చుతాడు. తన కూతురు తండ్రిని పట్టించుకోకుండా మరో యువకుడితో వెళ్ళిపోతే అవమాన భారంతో, దుఃఖంతో ఒక తండ్రి యిలా అంటాడు.

కూతురొ నొవ్వు పొట్టిన యొరోనెల్లోనె
నేయెమ్మ కాలొమొందే నాకూతురొ
పాలొకె తల్లడెల్లెతె పాలొబోసి తేనేకో
కోలెనోళె సేసె డబ్బాలతో సెచ్చితేనో
యెడవిలో వొండె తెనో సెచ్చితే
పాలోతాగె నీవో యెదిగే యెదిగే
పెద్దోగాయె నీవో యెంటీ పక్కాలోవాడెతో
నొట్టనడరేతెరె కొలసెబోతివో
నోకు సెప్పకుండో ఎక్కోడెకే బోతెవో

కూతురో ఊరంతా ఎతికెనో నోను
కూతురో ఊరంతా ఎతికెనో నోను
(పాడింది: వెంకటన్న అబ్రాసుకుంట, వెలుగోడు)

ఈ గేయం ద్వారా ఒక తండ్రి తన కూతురు వల్ల కల్గిన ఎడబాటును అర్థం చేసుకోవచ్చు. ఒక తల్లి తన కూతుర్ని కోల్పోయిన విషాద సంఘటనను గేయ రూపంలో వ్యక్తపరుస్తుంది.

తలుసు కుంటే గుండెల్లో బాధ కలుగుతాది
మూడేళ్ళ కింద జరిగిన విషయం - దేవుడా
జాతరా జాతరంటు వెళ్ళితే మేము
మాయదారి తిరునాళలో మాయమైనాది
నా ముద్దుల బిడ్డ సక్కాని కూతురు
గంగలో సానము చెయ్య నేను
గంగమ్మ వొడిలో కూర్చుబెట్టి
గంగపాలు చేసిందే గంగమ్మ నాబిడ్డను
ఏటిపాలు సేసిందే గంగమ్మా

చనిపోయిన తన కూతుర్ని తల్చుకుంటూ తల్లి విషాదంగా పాడిన గేయమిది. ప్రాణంగా పెంచుకున్న కూతురు హఠాత్తుగా మరణిస్తే తల్లి తట్టుకోలేదు. జాతర్ల సందర్భంగా చేసే గంగా స్నానాలు శుభ్రాన్ని కలిగిస్తాయని జానపదుల నమ్మకం. అలాంటి జాతర్లలో త్రొక్కిసలాటలో నీళ్లలో మునిగిపోయి చాలామంది మరణిస్తారు. ఈ జాతర్లను ప్రభుత్వాలు ముందుకు వచ్చి ప్రోత్సహిస్తాయి. ప్రజల్లో మూఢవిశ్వాసాలు ఎంత బలంగా వుంటే తాము అంత భద్రంగా వున్నట్లు ప్రభుత్వాలు భావిస్తాయి. ఇలాంటి జాతరకు వెళ్లి గంగలో మరణించిన కూతుర్ని తలుచుకుంటూ తల్లి ఆవేదన చెందడాన్ని పై గేయం వ్యక్తం చేస్తుంది.

భార్యాభర్తల అనుబంధం పవిత్రమైంది. వీరిద్దరూ కలసిమెలసి వుంటేనే కుటుంబం ఆనందమయమవుతుంది. గిరిజన కుటుంబాల్లో ఎక్కువగా మగవారు వేటకు వెళ్తారు. ఆ సందర్భంలో ఓ గిరిజన మహిళ వేటకు వెళ్లి తిరిగిరాని తన భర్తను తలుచు కుంటూ పాడిన గేయం.

ఓయెన్నో ఓయెన్నో ఏటాకు వెళ్ళినోడొ
యెడవికీ ఏటాకు ఎళ్ళినోడో
నో మొగొడొ బోమె దాటొంది మూడురోజులో
యెడొవికె ఎటాకు పాయెనోడో
గూడెంకో రోలేదో, గుడె సెకో రాలేదో
తిన్నోడో ఏసులొన్నోడో యెడవిలో
యెడవిలో పాలెమెన్న పొంసి సూసిందో
సూడో లేదో ఏమొన్న నో మొగొడొ
పాలె ఏమెన్న కాసేసిందో నో మొగొడొ
పోయే రోరోసె యెడవీకి మెరో

పై గేయంలో గిరిజన స్త్రీ బాధ అర్థమవుతుంది. వేటకు వెళ్ళిన గిరిజనుల కష్టాలు అన్నీయిన్నీకావు. క్రూరమృగాల భారి నుండి తప్పించుకోవాలి. సరీసృపాల నుండి తప్పించుకోవాలి. వేటాడేటప్పుడు జాగ్రత్తగా వుండాలి. మొత్తం మీద వేటాడమంటే అంత తెలికైన విషయంగాదు. వేటకు వెళ్ళిన భర్తకోసం ఎదురుచూసే భార్య తన భర్తకు మంచి జరగాలని కోరుకుంటుంది. గిరిజనులైన సుగాలీల వృత్తి పశుపోషణ. వీరి జీవనం ఆవుల పెంపకం మీద ఆధారపడి వుంది. వీరిలో ఎక్కువగా స్త్రీలు ఆవులను మేపుతారు. ఆవులను మేపడానికి వెళ్లిన ఒక సుగాలీస్త్రీ యింటికి సమయానికి రాకపోవడంతో ఆమె భర్త విషాదంగా పాడిన గేయం.

మాయింటి మహాలక్ష్మి మందాతో
పోయింది యెడవికి పోయింది
తాండలోని నాయక్ పొద్దేమో
దాటింది తిరిగే రాలేదు నాయక్
ఒంటి మీద నకిలీసు ఏసుకొని
పోయినాది యడవికి కాయటానికి
దొంగలు పడినారో దోచినారో
తాండాలోని నాయక పొద్దేమో
దాటింది తిరిగే రాలేదు నాయక్

సద్దిని తీసుకొని సంటెన్న బాయికీ
నీళ్ళకు పోయి కాలు జారిందో
నీళ్ళల్లో పడిందో పొద్దేమో
పోయింది తిరిగే రాలేదు నాయక్.

గిరిజనులు కుటుంబం అంతా పనిచేస్తే కాని మూడు పూటలు గడవడం కష్టం. కుటుంబంలో ఏ ఒక్కరు సమయానికి రాకపోయినా మరొకరికి దిగులు, బాధ. గిరిజనులైతే అడవికి వెళ్ళి తిరిగి వచ్చేంత వరకు కత్తి మీద సామే. ఓ గిరిజన మహిళ పశువులను కాయడానికి అడవికి వెళ్ళి రావడం ఆలస్యం కావడంతో భర్త ఆవేదనే పై గేయం.

ప్రేమించుకున్న యువతీయువకులు ఒకర్నివిడిచి మరొకరు వుండలేరు. వీరు మాటల ద్వారానో, పాటల ద్వారానో తమలోని ప్రేమను వ్యక్తపరుస్తూ ఎవరికీ తెలియ కుండా కలుసుకుంటారు. ఇలాంటి ప్రేమ వ్యవహారాలు గిరిజన ప్రజల్లో స్వచ్ఛంగా వుంటాయి. ఒక గిరిజన యువతి తన ప్రియుడి కోసం ఎదురు చూస్తుంది. ప్రియుడు చెప్పిన చోటుకి రాకపోతే ప్రియురాలు తనకు కల్గిన ఎడబాటును ఈ గేయంలో వ్యక్తపరుస్తుంది.

బాపనోడి బాయి వద్ద బాపాడి
తోటకాడికి రమ్మంటె రాకపాయెనె
మా పాటికి నేను చేరుకుంటినె
మల్లెపువ్వా నిను చూసి సిగ్గాయెనె
ఏవూరు పోయినాడు ఏ సందుకో
పోయినాడు సూసిసూసి విసుగాయనె
చూస్తాను వుండి పోతినె పువ్వా నిన్ను
మల్లెపువ్వా నిను చూసి సిగ్గాయెనె
ముందూగ సెప్పినాను మునుపాల
చెయ్యమాకని మల్లమాట తప్పినాడె
చూడవే పొద్దేమో పోతుంది పువ్వా
మల్లెపువ్వా నినుచూసి సిగ్గాయనె

తోటలోని మల్లెపూవుతో తన ఎడబాటు విన్నవించు కుంటున్నట్లు ఈ గేయం స్పష్టపరుస్తుంది. ఈ విధంగా గిరిజన గేయాల్లో విషాద భరితమైన గేయాలు కన్పిస్తాయి.

ఆధార గ్రంథాలు :

1. పల్లె పదాల్లో ప్రజాజీవనం - వెల్లండ రఘుమారెడ్డి.
2. జానపద కళాసంపద - తుమాటి దొనిప్ప.
3. కర్నూలు జిల్లా గిరిజనుల జానపదగేయాలు - విమర్శనాత్మక పరిశీలన - చవ్వా వెంకటేశ్వర్లు ప్రకాశం జిల్లా.
4. గిరిజన సంస్కృతి సాహిత్యం - జిల్లా శ్రీనివాసులు.
5. తెలుగు జానపద గేయ గాథలు - నాయని కృష్ణమూర్తి.

చివరి గుడిసె నవల – గిరిజన జీవన చిత్రణ

– పి. మనోహర్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

చివరిగుడిసె నవలలో భూస్వామికి, ఆహారాన్ని ఎరుకు తినే సంచార తెగ యానాదుల మధ్య సంఘర్షణను రచయిత అద్భుతంగా రాశాడు. ఊరి చివర గుడిసెల్లో చెట్లు, పుట్టల మధ్య జీవిస్తూ ఉండే యానాదుల జీవనవిధానం, వారి వేట, ఆయుధాలు, ఆహార సేకరణ, ఒడిదుడుకులను రచయిత సునిశితంగా పరిశీలించి సందర్భానుసారంగా చిత్రించాడు రచయిత కేశవరెడ్డి గారు. ఈయన చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలంలో ఉన్న "తలుపులపల్లె" గ్రామంలో 1947 మార్చి 10వ తేదిన ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించాడు. కేశవరెడ్డి గారి నవలల్లో సమాజంలో పాతుకుపోయిన, అస్పృశ్యతా (అణగదొక్కబడిన కులాలు), అగ్రకుల పీడనా, దోపిడి గురియైన నిమ్నకులాల గురించి రచయిత చిత్రించిన తీరు సహజంగా ఉంటుంది.

చివరిగుడిసె నవల చదువుతుంటే సమాజంలో పుట్టుకతో నేరస్థులుగా పరిగణింపబడటం తీవ్రనిరాశ అవమానాలు ఎదుర్కొంటున్న యానాదుల జీవితాలు మనకు కళ్ళముందు ఆ పాత్రలు నడుస్తున్నట్లుగా అనిపిస్తుంది. నవలలో ఆ ఊరి మునసబు మణియం అనే భూస్వామి యానాదుల శ్రమను, అస్తిత్వాన్ని వారి అందరిని దొంగలుగా ముద్రవేసి వారిని ఊరి నుండి తరిమి వెయ్యటం తర్వాత వారి పొలాలు భూస్వామి మునసబు సొంతకావడం జరిగేది. యానాదుల 20 కుటుంబాలలో చివరగా ఉన్న ఒక గుడిసెలో ఒక కుటుంబం మాత్రమే మిగిలింది. వాళ్ళు 'మన్నుగాడు'. ఇతని కొడుకు చిన్నోడు ఈ రెండు పాత్రలతో ఈ కథ నడుస్తుంది. మన్నుగాడు భార్య 'రాజీ'. వీరికి నలుగురు కొడుకులు అయితే 'చిన్నోడు' తప్ప మిగిలిన పిల్లలు చిన్నప్పుడె చనిపోయారు. చిన్నోడు పుట్టిన మూడు ఏండ్లకే 'రాజి' చనిపోయింది. భార్య పేరును పెంచుకొనే కుక్కకు పెట్టుకొన్నాడు. సరిగ్గా ఇరభై ఏళ్ళ కిందట 'మణియం' (మానెగాడు) అనే భూస్వామి తన మేకల మందలో పదిమేకలు పోయినాయని మన్నుగాడిని పిలిపించి రెండు సంవత్సరాలు జైల్లో పెట్టిస్తాడు. మన్నుగాడు జైలు నుండి తిరిగి వచ్చే సరికి చేనులో నాగళ్ళు తిరుగుతూ ఉంటాయి.

ఒక రోజు మన్నుగాడికి, చిన్నోడికి బ్రహ్మంగారి లాగా తత్వాలు చెప్పే బైరాగి పరిచయం అయ్యి వారి దగ్గరే ఉండటానికి నిశ్చయించుకొంటాడు. ఎవరో దొంగలు పడి భూస్వామి పొలంలో వడ్లు ఎత్తుకు పోతే దానికి కారణం మన్నుగాడు పైన అనుమానంతో చావకొట్టి ప్రాణం తీస్తాడు. చిన్నోడు చెట్టుకు ఉరివేసుకొని చస్తాడు. చివరిలో 'బైరాగి', 'రాజీ' బాధ, దుఃఖం భరించలేనిది.

నవల ప్రారంభంలో రచయిత సూర్యోదయంతో ప్రకృతి వర్ణనలు, పక్షుల అరుపులతో ప్రారంభించాడు. ఊరికి చివర తూర్పుగా ఉన్న చింతచెట్లు, జిల్లేడు చెట్ల కవతల ఒంటరిగా యానాది గుడిసె ఉన్నది. గుడిసెలో మన్నుగాడు, చిన్నోడు నిద్రపోతున్నారు. కొన్ని ఋతువులలో ఆతడు రాత్రంతా మేల్కొని పగలు నిద్రిస్తాడు. వీరి జీవనోపాదులు ఉడతలు, ఎలుకలు, పాములు పట్టడం. మన్నుగాడి పెంపుడు కుక్క రాజి మొరుగుతుంటే మన్నుగాడు గుడిసె బయటికి వచ్చి చూశాడు. గుడిసెకు ఇరవై గజాల దూరాన విశాలమైన రోడ్డు ఉన్నది. సిపాయిలు లెఫ్ట్, రైట్ అని వరుసగా వెళ్తున్నారు. ఆ శబ్దాలకు చిన్నోడు లేచి బయటకు రాబోయి సిపాయిల్ని చూసి భయపడి తండ్రి రెక్కను పట్టి గుంజుతూ "నాకు భయంగా ఉంది నాయనా లోపలికొచ్చెయ్. ఒకరా ఇద్దరా? ఎంత మంది ఉండారో సూడు వాళ్ళ కండ్లల్లో పడితే ఇంగమనం అతమై పోతాం లోపలకొచ్చెయ్" అన్నాడు.

తండ్రి ఎంతసేపటికి కదలక పోయేటప్పటికి వెదురు తడికెను ద్వారానికి అడ్డంగా పెట్టి లోపలకు వెళ్ళి ఒక మూలన తడిసిన పిట్టవలె కూర్చున్నాడు. మన్నుగాడు సిపాయిల దండును కను మరుగయి పోయేదాక చూస్తూ నిలబడ్డాడు. తరువాత పెరట్లో వెళ్ళి చేతులు, ముఖం కడుకున్నాడు. "సిన్నోడా? ఓరి సిన్నోడా" అని పిలిచాడు. అతని పిలుపుకు సమాధానం రాలేదు. మన్నుగాడు లోపలికి వచ్చి "పిలస్తా ఉంటే పలక్కుండా ఈడ కూసో నుండా వేందిరా?" అన్నాడు.

పోలీసోళ్ళు ఉండారా? ఎల్లిపోయినారా? అన్నాడు చిన్నోడు. మన్నుగాడు వాళ్ళు పోయి చాలాసేపు అయ్యింది. నువ్వులేచి మొకం కడుక్కో అని కుందేళ్ళను, ఉడతలను పట్టడానికి ఉపయోగించే సామాగ్రిని తీసుకొనబోతుంటే చిన్నోడు కూర్చొని "నాయినా" అన్నాడు. మన్నుగాడు తన పని చేసుకొంటూనే "ఏందిరా?" అన్నాడు. "చిన్నోడు నాయినా ఈ పొద్దు మనం బయటకు పోవద్దే నాకు భయంగా ఉంది" అన్నాడు. భయమెందుకురా మనమేన్నా తప్పు చేసినామా? అదురు నాకొడకా అని ఒక దెబ్బ వేశాడు. కొట్టొద్దు నాయనా నీతో కూడా వస్తా నువ్వుండగా భయమెందుకు నాకు" అని వేటకు బయల్దేరాడు. కొడుకు నిక్కరకు తేమ అయి ఉండటం చూసి "ఏందిది రాత్రికూడా పడకలోనే పోసుకుంటివా" అని మన్నుగాడు కొడుకుని అడిగాడు. లేచి పెరట్లో పోయినా, గొడ్ర కప్పలు, అరస్తా ఉండినాయి భయమయింది అట్టనే పోయి పడుకున్న అన్నాడు. వాడి బెదురుకు మన్నుగాడు తిట్టి "యానాది పుట్టుక ఎట్టపుట్టినావురా" అంటూ నడుస్తున్నవాడు చెట్లో ఉడత కనిపిస్తే ఆగాడు. కింద వలవేసి కొడుకును కుక్కను కావలి పెట్టి చెట్టెక్కి కొమ్మల్ని విదిలించాడు. రెండు ఉడతలు కిందబడ్డాయి. రాజి ఒక ఉడతను పట్టుకుంది. ఇంకోటి చిన్నోడిని కొరికి పారిపోయింది. "తెలివిలేని నాకొడకా ఉడతను వది లేస్తివి గదరా" అని చెంపపైన ఒకటిచ్చాడు. చిన్నోడు చెంపను రెండు అరచేతులతో కప్పుకొని, ఇసుక మీద కూర్చొని ఏడుస్తున్నాడు.

ఒక బైరాగి అక్కడికి వచ్చాడు. అతడు కాషాయ బట్టలను, మెడలో రుద్రాక్షమాలను ధరించి ఉన్నాడు. నుదుట ఎరుపు, తెలుపు రంగులలో నామం ఉన్నది. అతని ఎడమ భుజం నుండి జోలె వేలాడుతున్నది. కుడిచేతిలో తంబుర ఉన్నది. మన్నుగాడిని చూస్తూ వల పన్నుండారే ఏమన్నా పడినాయా ఎవురా పిలగోడు ఎందుక తిడుతున్నావన్నా అన్నాడు. "మన్నుగాడు నా కొడుకు సామి నన్ను కూసోపెట్టి సాకాల్సినోడు నామెడకు గుడిబండ మాదిరి తయారైనాడు" అన్నాడు.

బైరాగి చిన్నోడిని బాగా చూసి బలిష్టంగా ఉన్న వాడి కండలను చూసి పిలగోడు పిడిగిత్త మాదిరుండాడు కదన్నా ఎందుకు తీసిపారేస్తావుండావు" అన్నాడు.

మన్నుగాడు "పిడిగిత్త మాదిరుండి ఏం లాభం సామీ, తలకాయలో ఓ గురిగింజంత మెదడు లేదు" వాడికి ఇరవై ఏళ్ళు దాటిన ఇలాగే ఉండాడు. వాడికి పది సంవత్సరాల వయసులో కాయిలా పడినాడు, అప్పటి నుండి మెదడు అట్లాగే ఉంది" అన్నాడు బైరాగితో. నెత్తురు చూసినాడంటే కళ్ళు తిరిగి పడిపోతాడు. రాత్రుల్లో కూడా కలవరిస్తాడు సామీ అన్నాడు. బైరాగి చిన్నోడికి ధైర్యం చెప్పు నీకు నాయనే కాదు తాత కూడా ఉండాడు. భయపడొద్దు అని చిన్నోడి బెదురు పోగొట్టడానికి ప్రయత్నించాడు. "తాతా నువ్వుకూడా మాతో గుడిసెలో ఉండిపో అని బైరాగిని బ్రతిమిలాడతాడు." బైరాగి మన్నుగాడితో చిన్నోడికి తొరగా పెండ్లి చేసేయ్ పిల్లని చూడన్నా అని బైరాగి అంటే "వీడి శరీరం పెరిగింది కాని బుర్ర పెరగలేదు, పిల్ల నెవరిస్తారు అంటూ నిరాశగా మేం యానాదోల్లం, మాకు కయ్యలు, కాలవలు లేవు. తెగవ, ధైర్యం ఇవే మా ఆస్తిపాస్తులు. ఇవి వీడికి బొత్తిగా లేవు. వీడికి పిల్లనెవరిస్తారు" అన్నాడు.

బైరాగి కాలం మారతా ఉంది గదన్నా, 'యానాదోల్లు' ఉడతలు, పాములు, పట్టే బతకాలని ఏముంది? సెద్దిం పన్లు చేసుకోవచ్చు గదా, పిలగోనికి కాలుచెయ్యి సుద్దంగా ఉండాది. గవర్నెంటోడు పట్నం నుంచి రోడ్డేయిస్తున్నాడు.

కాట్పడి దాక అయింది, ఇప్పుడు పీలేరు దాకా వేస్తారంట. చిన్నోడిని రోడ్డు పనిలో పెట్టెయ్. ఎవరో ఒకరు పిల్లను ఇస్తారు అని బైరాగి సూచన బట్టి పట్నం నుండి పేర్ల నమోదు కోసం వచ్చిన మేస్త్రీ దగ్గరకు చిన్నోడిని తీసుకు పోయాడు మన్నుగాడు. చిన్నోడి శరీర సౌష్టవం చూసి మేస్త్రి ఇట్టాటోళ్ళు ఊరికి నలుగురు దొరికితే చాలు డెబ్భై పదకొండు రోడ్లు ఏయిద్దును అని పేరు చెప్పు అని మున సబు (మణిమయం) ను అడిగాడు. వాడు యానాదోడు. నువ్వు కొంచెం యామారినావంటే నీ భుజం మీద తుండు గుడ్డ మాయమైపోతుంది. కన్ను అట్టుండగానే కంటి పాపను కత్తిరించేటోల్లు యానాదులు అని మణిమయం చెప్తాడు. ఈ యానాదోళ్ళు వృత్తి దొంగతనం అని జిల్లా గెజిట్‌లో కూడా రాసి ఉంది. అప్పుడు "మేస్త్రీ వీడు దొంగ యితే మనకేవి? దొరతై మనకేవి పన్జేస్తే సత్తా మనకు కావాల్సింది. ఒక వేళ వీడేమైనా అడ్డం దొడ్డం పనులు చేసినాడంటే అప్పుడు చూసుకుందాం వివరాలు చెప్పు అని మేస్త్రీ అంటాడు." మణిమయం "నీ యిష్టం రాసుకో", పేరు యానాది చిన్నోడు, వయసు ఇరవైరెండని రాయి, తండ్రి పేరు యానాది మన్నుగాడు" అన్నాడు. చిన్నోడిని శుక్రవారం రోడ్డు పనిలో వచ్చి చేరమన్నాడు.

మన్నుగాడు, చిన్నోడి అభ్యర్థన మేరకు బైరాగి వాళ్ళతో పాటు గుడిసెలో ఉండటానికి నిశ్చయించుకొన్నాడు. ఇంతవరకు నాకు ఎవరు లేరు. నా బతుకు దిక్కులేని వానిలాగాఏ రాలిపోవాల్సిందే అనుకొంటే ఈనాటికి తల కొరివి పెట్టె మనవడు దొరికాడు అని అక్కడ ఉండి పోవాలనుకొన్నాడు బైరాగి. రోడు పనిలో పిలగోడిని తీసు కున్నారు. ఇంగేమి ఒక సంవత్సరానికి పాలం కొనొచ్చు. కాపోళ్ళకు వచ్చిన మతింపు వస్తుంది. తెగవ ఉండే పిల్లని చిన్నోడికిచ్చి చేద్దాం అని బైరాగి ఆశ కల్పించాడు". మన్ను గాడు ఆలోచించాడు, కళలు కన్నాడు. చిన్నోడు పెళ్ళి, కోడలు, పంటకు అలుమగలు కావలికాయటం, పంట ఇంటికి బండిలో తేవడం, ఇవన్నీ ఆలోచించి బైరాగితో ఇవన్నీ కలలుగానే దానికి, మాట్లాడుకోవడానికీ బాగుం టాయి సామి. మేవు యానాదోల్లం, ఇట్టాటివి మాబతు కుల్లో జరగతాయా సామీ" అన్నాడు. బైరాగి యానాదోల్లో యితే ఏమైందన్న యానాదోడు సేద్దం పనులు చేయ గూడదని శాస్త్రాల్లో రాసుండాదా యేంటి? అన్నాడు.

మన్నుగాడు ఒకప్పుడు నాకు కూడా సెంటు తక్కువ కాకుండా రెండు ఎకరాల నేల ఉండేది. గెద్ద తన్ను పోతే కోడిపల్ల మాయమైనట్టు మాయమైపోయింది సామీ... అని పాత విషయాలుబైరాగితో చెప్పాడు. బైరాగి ఒళ్ళంత చెవులు చేసుకొని వినసాగాడు. "ఇప్పుడైతే ఊర్లో యానా దోన్ని నేనొక్కడినే గాని, ఒకప్పుడు మేవు ఇరవై కుటుం బాలు సామీ". మాకు తలొక గుడిసె ఉండింది. నేను తప్ప ఒక్కొక్కరే ఊరిడ్చి పోయిరి. వాళ్ళు పోంగానే వాళ్ళ గుడిసెలు ఒక్కొటొక్కటీ కూలిపోనాయి" అని బైరాగితో గుడిసెలు చూపించాడు.

మన్నుగాడు ఈ పాయకట్టుకు జార్జి అనే తెల్లదొర కలెక్ట్రుగా ఉండేవాడు. ఆయన మా యానాదోళ్ళను పిలిచి తలా రెండు ఎకరాల నేల పట్టా చేసిచ్చినాడు. ఆ పొలాలు ఉండేది "యానాది మిట్ట" అంటారు.

కానీ "మనేగాడి" (మణియం) కన్ను మా పొలాలపైన పడింది ఊర్లో ఏదొంగతనం జరిగినా యానాదోళ్ళ మీదే మోపెటోడు. పలానా యానాదోణ్ణి ఈడ్చుకరండిరా అనే టోడు. రాతిరి స్తంబానికి కట్టేసి చింత బరికెలతో కొట్టేవాడు. ఆ దెబ్బలకు భయపడి ఒక్కరొకరే గుడిసెల్ని వదలి అడవుల్లోకి పారిపోయే వాళ్ళు. వాళ్ళు భూముల్ని 'మానే గాడు' ఆక్రమించుకొనేవాడు. గుడిసెలు సెదులెక్కి పోయేవి." నన్ను కూడా మేకల దొంగతనం కేసులో రెండేళ్ళు జైల్లో పెట్టించాడు. జైలు నుండి నేను తిరిగి వచ్చేసరికి నా భూమిని కూడా ఆక్రమించుకొన్నాడు. మిగతావాళ్ళ మాదిరి నేను కూడా అడవుల్లోకి పోదామంటే అప్పటికి చిన్నోడికి మూడేళ్ళు నిండతా ఉండాయి. నా పెండ్లాం రాని పోని రోగాలతో మంచం ఎక్కింది. ఈళ్ళను తీసుకొని అడవుల్లో యట్టబోదు? ఇంగ ఈ గుడిసెను అంటి పెట్టుకొని ఇట్టనే ఉండిపోయినాను సామీ అని మన్నుగాడు చెప్పాడు.

మానేగాడు (మణియం) గుర్రంపైన పోతావుంటే మన్నుగాడు బైరాగికి చూపించాడు. మానేగాడు నేరుగా యానాది మిట్టకు వెళ్లాడు. అక్కడ వరిపొలంలో ఎలకలు, గువ్వల వల్ల జరిగే నష్టం గురించి కావలోడు చెప్పాడు. చుట్టు పక్కల దొంగల పోరుకూడా ఉంది. త్వరగా వరికోతలు చేయిస్తే మంచిది అని కావలోడు చెప్పాడు. మానెగాడు రోడ్డు పని వచ్చిన తర్వాత కూలోళ్ళ దొరకడం కష్టమయిపోయింది. ఇకరెండు రోజులు నాకు కుదరదు. ఈ లోపల యానాదోన్ని పంపిస్తాను. ఎలకలు పట్టిస్తే గింజలు రాలిపోవడం కొంత తగ్గుతుంది అని ప్రయాణ మయ్యాడు.

మణియం గుర్రం మీద మన్నుగాడి గుడిసె దగ్గర ఆగి 'ఏం జేస్తా ఉండావురా మన్నుగా' అన్నాడు. "వినయంగా తలపాగ చంకలో ఇరికించుకొని 'దండాలు దొరా' అని చేసేదానికి ఏముంది దొరా అన్నాడు.

అంతేలే, దొరికితే ఎలుకలో, యంటవలో కొట్టి తినటం తప్పితే యానాదోడు కలెక్టర్ పని చేస్తాడా? ఏమి? సరేగాని వరిమడిలో ఎలకలు పట్టాలి. ఈ రాతిరికి బయలుదేరు అన్నాడు మానేగాడు. మన్నుగాడు, చిన్నోడు బయలుదేరారు. మాటుకుండలు, బొగ్గులూ, వరిపొట్టు తట్టులో ఎత్తుకొన్నారు. యానాదిమిట్ట చేరారు.

ఎలకల బొక్కలన్ని గుర్తుపెట్టి మాటుపెట్టడం ప్రారంభించి అన్ని బొక్కలకు పెట్టారు ఇద్దరు కలిసి ఒక్కొక్క బొక్క తవ్వడం మొదలు పెట్టారు. మన్నుగాడు ఒకటి రెండు బొక్కలు తవ్వేసరికి నీరసంతో చేతకాక చిన్నోడా వీటికత నువ్వు చూడరా అని కావలి దగ్గరకు వెళ్ళి పోయాడు. కావలి వాడితో మాటల్లో పడ్డాడు మన్నుగాడు. వాడికి పెళ్ళి చేసేయ్ వాడి జాతకమే మారిపోతుంది అని మన్నుగాడికి ధైర్యం చెప్పాడు. యానాది మిట్ట ఒకప్పుడు మావే అని ఆ 'భూమికత' కావలి వానికి చెప్పాడు.

చిన్నోడు ఎలక బొక్కలన్నీ తవ్వి ఎలుక దాచుకున్న వరికంకుల్ని, ఎలకల్ని, ఎంటవల్ని చెరొక తట్టలో వేసుకొని కావలి వాడి దగ్గరకు వచ్చాడు. చాలానే దొరికినాయి. ఈ రోజు మీకు పండగనే అని కావలి వాడు ఒక దుత్తకల్లు తీసుకొని పొండని చెప్పాడు. గుడిసెకి వచ్చి చిన్నోడు ఇప్పుడే పండగ చేసుకుందాము అని తొందరపెట్ట సాగాడు. వీడు ఆగెట్టు లేడు అని మన్నుగాడు ఎలకల్ని కోసి, ముక్కుల్ని దారానికి కట్టాడు. యంటవల్ని కోసి పాత్రలో వేసి పొయ్యి ఎక్కించాడు. ఈ లోపల చిన్నోడు వడ్లు దంచి, కడిగి పొయ్యిమీద పెట్టాడు. వంట అయ్యే లోపు వీరు బైరాగితో కలిసి కల్లుదుత్త ఖాళీ చేశారు. బైరాగి, చిన్నోడు, మన్నుగాడు. ఎగిరారు, దూకారు, పాటలు పాడారు, అలసిపోయి వేడి వేడిగా కూడు వేసుకొని తిని చెట్టుకిందనే పడుకొన్నారు.

కావలోడు తూర్పున చుక్క పుట్టినప్పుడు లేచి అలా వరిపైరు కయ్యల్ని ఒకసారి చూశాడు. మూడు ఎకరాల్లో వరిదొంగతనం జరిగింది. అప్పటికప్పుడు పరుగుతీశాడు. మానెగాడి ఇల్లు చేరి యానాది మిట్ట మీద జరిగిన దొంగతనం గూర్చి చెప్పాడు. మానెగాడు వెంటనే గుర్రాన్ని ఎక్కి చీకటిలోనే మన్నుగాడి గుడిశ దగ్గరకు వచ్చాడు. ఏందిరా నువ్వు చేసిన పని ఎవర్ని పిల్చుకొచ్చి వడ్లు దొంగలించినావు. చెప్పు అని కొట్టాడు. మాకు తెలవదు దొర ఎలకలు తెచ్చుకొన్నాము అంతే తెలుసు. వడ్లు గురించి నాకు తెలియదు. నేనాపని చెయ్యలేదు దొరా" అని కాళ్ళ వేళ్ళా పడిన వదలకుండా మన్నుగాడిని చావగొట్టాడు. చిన్నోడు భయపడి పరుగెత్తి పాదల్లో దాక్కొన్నాడు. 'రాజీ' గుడిసె గుంజకు తాడుతో కట్టేసి ఉండి అరుస్తా ఉంది. మన్నుగాడు దెబ్బలకు తట్టుకోలేక పడిపోయాడు. పక్కన బైరాగిని చూసి మానెగాడు "ఎవరు నువ్వు ఏం పనిక్కడ?" అని గద్దించాడు. నాది అరవదేశం అడుక్కొంటూ తిరిగేటోణ్ణి. ఈ రోజు ఈ చెట్టుకింద ముడుచుకున్న దొర అని అంటాడు బైరాగి. సరేకాని వాడు లేస్తే కొన్ని నీళ్ళు ఇవ్వు. నేను మళ్ళ వస్తాను. నిజం కక్కిస్తాను అని గుర్రం ఎక్కి వెళ్ళి పోయాడు మానెగాడు.

మన్నుగాడు కదులుతున్నాడు. బైరాగితో సామి గుడిసెలో పడుకోబెట్టు నా ప్రాణం అక్కడే పోని అని చెప్తే బైరాగి మన్నుగాడిని గుడిసెలోకి కష్టంగా తీసుకెళ్ళాడు. నేను వైద్యున్ని తీసుకొస్తాను అని బైరాగి వెళ్తుంటే

వద్దు సామి. ఈ దెబ్బలు వైద్యానికి పనిచేయవు. నా ప్రాణం పోవాల్సిందే. చిన్నోడిని నీ చేతుల్లో పెడుతున్న.

యానాది గుట్ట వరుసన కానుగాకులు తెచ్చి వాటిపైన నన్ను పడుకోబెట్టు సామి నాకు మంటలు తగ్గుతాయి. దెబ్బలు మంట బెడుతున్నాయి అంటాడు. బైరాగి బయలుదేరి చిన్నోడ అని అరుచుకుంటూ వెళ్తాడు. చెట్ల పొదల్లో ఉన్న చిన్నోడిని నాతోరా అని పిలుసుకొని వెళ్తాడు. చిన్నోడు ఎక్కడికి తాతా 'రాజీ' అరుస్తు ఉంది. నాన్నకు ఏమైంది అంటున్నాడు. నువ్వు నాతోరా అని అట్టే పిల్చు కెళ్తుంటే రాజీ తాడు తెంచుకొని వాళ్ళను కలుసుకొంది. బైరాగి కానుగచెట్టు ఎక్కి నేను కొమ్మలు నరుకుతా నువ్వు ఏరి ఆకులు కట్టకట్టు అని చెప్తాడు. దూరంగా మణియం (మానేగాడు) గుర్రంపైన వస్తూ ఉంటాడు. యానాది గుట్ట చేరుకొని చెరువు దగ్గర మానేగాడు దిగుతాడు. చిన్నోడు భయపడి పొదల్లో దాక్కొంటాడు. రాజీ బైరాగి దగ్గర నిలబడి చూస్తూ ఉంటుంది. బైరాగి రాజీకి చెవిలో "ఇసుకో, ఇసుకో" అని మానేగాడిని చూపిస్తాడు. 'రాజీ' ఎగిరి దూకి మానేగాడి భుజాన వాలి పీక ఒకవైపున కొరికేసింది. మానెగాడు దబ్బున ఇసుక మీద పడి లేయబోయే సరికి మళ్ళీ అతని కుడి భుజంపైదూకి సగం పీక కొరికి తెంచింది. తెగిన పీక ఏకదాటిగా నెత్తురు చిమ్ముతూ ఉంది. ఆ నెత్తురు కాలువలో కలిసి కాలువలో నీళ్ళకు బదులు నెత్తురు ప్రవహిస్తున్నట్లుగా అగిపిస్తున్నది.

చిన్నోడు బైరాగి పక్కన నిలబడ్డాడు. క్షణకాలంపాటు చూశాడు. కెవ్వున కేకలేసి, కండ్లు మూసుకొని, నెత్తురు నెత్తురు దొర ఇంక నన్ను చంపేస్తాడు అని బైరాగికి కని పించనంత దూరంగా చెట్లలోకి పరుగెత్తుకొంటూ వెళ్ళాడు. వెళ్ళి చూస్తే బైరాగి చిన్నోడా నేనున్నాను రా నీకేం భయం లేదు అని పిలుస్తు వెనకాల వెంకటపడ్డాడు. చిన్నోడు కనిపించలేదు. రాజీ ఎక్కడో అరుస్తున్న శబ్దం వినిపించి అంతలోపే చిన్నోడు ఒక చెట్టుకు ఉరివేసుకొని ఉన్నాడు. అతని భారానికి చెట్టుకొమ్మ వంగి ఉన్నది. నాలుక నోటి నుండి వ్రేలాడుతున్నది. 'రాజీ' కింద నిలబడి మొరపైకెత్తి మొరుగుతూ ఉంది.

బైరాగి మన్నుగాడి దగ్గరకు వెళ్ళి అంతా అయిపోయిం దన్న మన చిన్నోడు మన మీద మన్ను వేస్తాడు అను కొంటిమి వాడికి అల్పాయువు ఉందనుకోలేదన్నా అని ఏడుస్తూ ఉన్నాడు. అప్పటి మన్నుగాడు కన్నులు మూస్తూ తెరుస్తూ ఉన్నాడు. చివరికి కనురెప్పలు కొట్టుకోవడం లేదు. అతని ముఖంపైన చీమలు తిరుగుతున్నాయి.

రైలుబండి లయబద్ధంగా చప్పుడు చేసుకొంటూ దక్షిణ దిశగా దూసుకు పోతూ ఉంది. రైలు పెట్టె ప్రయాణికులు కాళ్ళ సందున తలుపు నానుకొని బైరాగి కూర్చొని ఉన్నాడు. సర్వము కోల్పోయినట్లు అతని ముఖంఉంది. ఒకరాత్రి, ఒక పగలు మాత్రమే ఆ స్వల్ప వ్యవధిలోనే రచయిత నవలలో ఇంత విషాదంతో ముగించాడు.

రాజి రేయింబవళ్ళు గుడిసె పరిసరాలలో తిరుగుతూ ఉంటుంది. దాని శరీరం చిక్కిపోతుంది. ప్రతి రాత్రి నక్షత్రాలకేసి చూస్తూ, సుదీర్ఘంగా, హృదయ విదారకంగా అరుస్తుంది. అలా రాత్రి ఆ శబ్దాన్ని దూరం నుంచి విన్న వారికి భయము, చిరాకు, గగుర్పాటు కలుగుతాయి. ఒక రోజు గుడిసె దాపున నడుస్తుండిన రైతు మడమన కరిచింది. దానికి పిచ్చి పట్టిందని ఊరి కుర్రోళ్ళు రాళ్ళతో, కర్రలతో దానిని వీదులు తిప్పించి చంపి పాడుపడిన బావిలో పడేశారు. నిర్మానుష్యమైన ఆ చివర గుడిసెలో గబ్బిలాలు, పాములు, స్థిర నివాసం ఏర్పరచుకొన్నాయి. కొన్ని రోజులకు, వర్షాలకు, గోడలు నీటితో నాని మెత్త బడ్డాయి. మొండిగోడల మధ్య జిల్లేడు చెట్లు, ఉమ్మెత్త చెట్లు పెరిగాయి. ఈ నవలను రచయిత అద్భుతంగా, భయానకంగా, తీవ్ర విషాదంతో ముగించాడు. ఈ నవ లలో భూస్వామ్య వ్యవస్థను, దోపిడికి గురైన యానాదుల జీవితాలను ఎంతో చక్కగా రూపొందించాడు రచయిత.

ఆధార గ్రంథాలు :

1. చివరి గుడిసె - కేశవరెడ్డి - విశలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

కొన్ని గిరిజన కథలు – జీవన చిత్రణ

–పోతగాని సత్యనారాయణ, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

నేడు చాలా మంది కథకులు, ఉద్యమాలు, వాదాల నేపథ్యంలో కథలు రాస్తున్నారు. ఆవశ్యక సామాజికాంశాలను ఇతి వృత్తాలుగా గ్రహించి అద్భుతమైన కథల్ని సృజిస్తున్నారు. ప్రస్తుతం తెలుగు కథ సంపూర్ణంగా సాంఘికమై నిర్మాణ శిల్పరహస్యాలను ఆవిష్కరిస్తూ సమిష్టి ప్రయోజనాలను ఆశించి రాయడం శుభ పరిణామమని చెప్పవచ్చు.

తెలుగు కథా వైవిధ్యాన్ని బట్టి వెలమల సిమ్మన్నగారు సాంఘిక కథలు, రాజకీయ కథలు, జానపద కథలు, దళిత కథలు, విప్లవ కథలు, స్త్రీవాద కథలు, రైతు కథలు ఇత్యాదిగా 66 రకాల కథల్ని వింగడించి చూపారు. ఈ వర్గీకరణలో 'గిరిజన కథల్ని' చేర్చవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

తెలుగు కథా సాహిత్యం ఇంత విస్తారంగా అన్ని రంగాలలోనూ వేళ్ళూనుకున్నప్పటికీ గిరిజనుల ఆచార వ్యవహారాలు, సంస్కృతీ సంప్రదాయాలు, జీవన స్థితి గతులు, అసలు ఉనికే ప్రశ్నార్థకమవుతున్న దశలో వారి జీవన్మరణ పోరాటాల గురించి చెప్పకోదగిన సంఖ్యలో కథలు రాకపోవడం ఒక లోపంగా చెప్పుకోవచ్చు. దీనికి గిరిజనుల జీవనాల పట్ల రచయితలకు అవగాహన లేక పోవడం ఒక కారణమైతే, ఆసక్తి కూడా లేకపోవడం మరొక కారణం.

గిరిజన సంచార జాతి తెగల జీవితం, అందులోని ఆటుపోట్లను తమతమ అవగాహన మేరకు నిజాయితీగా చిత్రించిన కథా రచయితలు కూడా వున్నారు. వీరిలో కొందరు ఉద్యమ సానుభూతితో, తాము పనిచేసిన ప్రాంతాలలోని ఆదివాసీల కడగండ్లను చూచి చలించి రాసిన అధికారులూ ఉన్నారు. అయితే ఇలా సానుభూతితో రాసిన కథల్లో చాలా వరకు గిరిజనుల జీవన చిత్రణను, వారెదుర్కొంటున్న వివక్షతల్ని అసమానతల్ని, అభివృద్ధి పేరుతో గిరిజన సంస్కృతిపై మైదాన ప్రాంత సంస్కృతి చేస్తున్న దాడిని, ఆర్థిక దోపిడీలను వాటి విపరిణామాలను సమగ్రంగా వివరించలేక పోయాయి.

నాగరిక సమాజం నుండి ఏనాడో దూరంగా విసరివేయబడిన గిరిజనుల దుర్భర జీవితాలను, సంచార తెగలు అనుక్షణం అనుభవిస్తున్న జీవన్మరణ సమస్యల్ని బాధ్యత గల రచయితలు అలసత్వంతో ఉదాసీనంగా చూస్తూ ఉండిపోయారనడంలో నిందారోపణ లేదు. అభివృద్ధి, పారిశ్రామికీకరణ నెపంతో స్వదేశీ విదేశీ కంపెనీలు వాటి లాభాలకోసం ప్రాజెక్ట్‌లు నిర్మించడానికి, పరిశ్రమలు నెలకొల్పడానికి, ఖనిజ సంపదను కొల్ల గొట్టడానికి గిరిజన ప్రాంతాలను ఎంచుకుంటున్నాయి. వారిని అమానుషంగా నిర్వాసితుల్ని చేస్తున్నాయి. ఈ సందర్భంలో గిరిజనులపై దాడులు, హింసాత్మక సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో వారి మనుగడే ప్రశ్నార్థకంగా మారుతున్నది. ఈ భయానక అనాది ఆదివాసి నాగరికత విధ్వంసాన్ని నిజాయితీగా చిత్రించబూనుకున్న రచయితలు అల్ప సంఖ్యలోనే ఉన్నారు.

"వెయ్యేండ్ల తెలుగు సాహిత్యంలో అచ్చుకాని లక్షల రాతప్రతులు తాటాకుల్లో, కాగితపు గొలుసుకట్టు రాతల్లో, అచ్చయిన మూడు లక్షల పుస్తకాలలో భూతద్దాలు వేస్తేనే వాళ్ళ గురించి రవ్వంతైనా కనిపిస్తుంది. గిరిజనులకు సంబంధించి విద్రోహ చింతన అనకూడదేమోగానీ అలాంటిదేదో తెలుగు సాహిత్యంలో జరిగిపోయిందని విచారించనైనా విచరించక తప్పదు." ('ఇప్పపూలు' గిరిజన సంచార తెగల కథా సంకలనం ముందుమాట. పుట.8)

విద్యాత్మక పరిశోధనల్లో ఒకప్పటి మూస పద్ధతి పటా పంచలయ్యాక సమాజంలోని వివిధ వర్గాల నుంచి వచ్చిన

విద్యార్థులు వైవిధ్యభరితమైన పరిశోధన అంశాలను ఎన్నుకోవడం మొదలైంది. ఈ కొత్త పరిశోధనా ఫలితాల మూలంగా సమాజంలోని అసమానతల్ని, హెచ్చుతగ్గుల్ని ఎత్తిచూపడం ప్రారంభమైంది. ఇటువంటి పరిశోధనలు అనేక ఉద్యమాల నుండి స్ఫూర్తి పొంది సంస్కృతి, సాహిత్యాలలో గిరిజన శ్రమజీవులకు స్థానం కల్పించాయి. ఈ నేపథ్యంలో కొంతమంది కథకులు 33 గిరిజన జాతులపై దృష్టి పెట్టారు. 1980 దశకం నుండి 1990 దశకం వరకు వెలువడిన సాహిత్యంలో ఈ విధమైన మార్పు స్పష్టంగా కనిపిస్తుంది.

తొలి గిరిజన కథ - కథకుడు :

తొలి గిరిజన కథ 'చెంచి'. తొలి గిరిజన కథకుడు గూడూరు రాజేంద్రరావు.

"చింతా దీక్షితులే తొలి గిరిజన కథకుడని అంటుండే వారు. కానీ ఆయన కన్నా దశాబ్దంపైగా ఎంతోముందే 'చెంచి' (భారతి, 1932) కథని గూడూరు రాజేంద్రరావు అనే రచయిత రాశాడు. ఇదే తొలి గిరిజన కథ అని, అతని రచనలు సంకలనం చేసిన పి. గోపాలకృష్ణ నిర్ధారించారు. (ఇప్పపూలు ముందుమాట, పుట ౨౨)

తెలుగు కథా సాహిత్యంలో తొలి గిరిజన కథ 'చెంచి' ఈ కథా రచయిత గూడూరు రాజేంద్రరావు ఇది 1932 అక్టోబర్ నెలలో 'భారతి' పత్రికలో అచ్చయ్యింది. ఈ కథలో నాయకి నాయకులకు వారి కులం పేరునే ఒంటి పేర్లుగా నిర్ణయించాడు రచయిత.

నిజానికి ప్రతీ గిరిజన తెగలోని వ్యక్తికి ఒక ఇంటి పేరు, ఒంటి పేరు ఉంటాయి. అయినా వారి కులం పేరునే వారికి చెంచి, చెంచిగాడు అని నిర్ణయించడం ఆక్షేపణీయం.

గిరిజనుల అమాయకత్వాన్ని, పేదరికాన్ని అవకాశంగా తీసుకొని నాగరికులు వారిని ఆర్థికంగా, శారీరకంగా దోచుకోవడం, చేయని నేరాలను గిరిజనులకు అంటగట్టి శిక్షలు పడేటట్లు చేయడం అనే అంశాలను భూమికగా చేసుకొని విషాదాంతంగా రాయబడిందీ కథ.

చెంచిగాడు చెంచిని పెళ్ళాడటానికి, కొత్తబట్టలు కొనడానికి కాబూలీ దగ్గర అప్పు చేస్తాడు. జీవనం గడపడానికి భార్యభర్తలిద్దరూ కరణం పంతులు ఇంట్లో పని చేస్తుంటారు. వీరిరువురు అన్యోన్యంగా జీవిస్తుండగా చెంచిగాడికి తీవ్రమైన కంటిజబ్బు చేస్తుంది. వైద్యం చేయించడానికి డబ్బు కావాలని పంతులుని అడుగుతుంది చెంచి. చేయించుకున్న సేవల్ని మరచి కరణం పంతులు వొట్టి చేతులతో వెళ్ళగొడతాడు. ఇది ఇలా ఉండగా అప్పిచ్చిన కాబూలీ బాకీ వసూలు కోసం ప్రతిరోజూ ఇంటిచుట్టూ తిరిగి వేధిస్తుంటాడు. ఒకరోజు చెంచిగాడికి కంటిచూపు పూర్తిగా పోతుంది. గుడ్డివాడైన భర్తకు అన్నం అడుక్కు రావడానికి ఊళ్ళోకి వెళ్ళిన చెంచిని కాబూలీ ఇంట్లోకి లాక్కుపోయి అత్యాచారం చేస్తాడు. ఆ అవమానాన్ని భరించలేక చెంచి వాగులో పడి ఆత్మహత్య చేసుకుంటుంది. కాబూలీ, మునసబు, కరణం పంతులు కూడపలుక్కొని చెంచి ఆత్మహత్యకు చెంచిగాడే కారణమని చెప్పి పోలీసులకు అప్పగిస్తారు. ఈ కథలో గిరిజనుల జీవనాన్ని, వారి స్వభావాలను పరిశీలిస్తే వారు లోకం తెలియని అమాయకులని, ఆత్మాభిమానం గలవారని, దుర్నీతిని, అణిచివేతల్ని ఎదుర్కోలేని నిస్సహాయులని, నిత్యం ఏదో రకమైన దోపిడీలకు గురికాబడుతుంటారని, నాగరిక సమాజం వారిని మనుషులుగా చూడడం లేదని తెలుస్తుంది.

'సృజన' పత్రికలో 1982 ఫిబ్రవరి ప్రచురితమైన గిరిజన కథ 'రక్తపింజెర' ఈ కథా రచయిత 'సాహు' ఈ కథలో పాత్రలు శిడాంశితృ, మల్కుబాయి, డోబి, శర్మ, నాగురావ్, బొజ్జు. కథానేపథ్యం, గూడేలు, గుడిసెలు, అడవి.

గోండు జాతి గిరిజనుల జీవన చిత్రణలో భాగంగా, వెదురు బొంగులు కొట్టించి, లారీలకెత్తించి శ్రమశక్తిని దోచుకోవడం, అడ్వాన్సుగా డబ్బులిచ్చి అనారోగ్యం కారణంగా కూలికి హాజరు కాని గిరిజనులను విచక్షణా రహితంగా కొట్టడం, తిట్టడం, వారిని బానిసలుగా చేసి

అవమానించడం వంటి దురాగతాలను సహజమైన భాషౌచిత్యంతో చిత్రించాడు రచయిత.

శిడాంశిత్, మల్కుబాయి, గోండుజాతి గిరిజన ఆలు మగలు, గాలికి కప్పులెగిసిపోయిన గుడిసె, చలికి కప్పు కోవడానికి పాత సంచి బొంత, చమురు లేక వెలిగించని దీపం, సిగ్గు దాయడానికే సిగ్గుపడే పీలికలైన బట్టలు, ఆకలి తీర్చుకోవడానికి నాలుగు ఎర్ర మిరపకాయలు, గుటికెడు ముక్కిన బియ్యపు గంజి, పాము కరిస్తే వైద్యం చేసుకోవడానికి ఆకుపసర్లు, ఇవే వారికున్న నదు పాయాలు.

చుట్టూ వెదురుపొదలే ఉన్నా గుడిసె కట్టుకోవడానికి నాలుగు బొంగులు నరుక్కునే హక్కులేదు. కంపినోళ్ళకు మాత్రం లారీలకు లారీలు బొంగు తరలించుకు పోవడా నికి అనుమతులు. బొంగు నరికే కూలికిపోతేనే ఆ మాత్రపు గటకైనా గుటక పడుతుంది. శిత్ తన భార్య చిరిగిన బట్టలతో అవస్థపడుతుంటే చూడలేక చీర కొనుక్కు రావడానికి అంగడికి పోతాడు. అతని భార్య మల్కుబాయి, కుతూరు బొంగు నరికే కూలీకి పోతారు. సూపర్‌వైజర్ శర్మ దగ్గర అడ్వాన్స్ తీసుకున్న వాళ్ళంతా రోగమొచ్చినా, నొప్పొచ్చినా కూలీకి వచ్చి తీరాలి. లేకుంటే జ్వరమొచ్చి మూల్గుతున్నా బొజ్జను లాక్కొచ్చి చితకబాదినట్టు బాదు తాడు శర్మ.

లారీలు తిరిగేందుకు రోడ్డు వేయడానికి అడ్డంగా ఉన్న బండను దొర్లిస్తుంటారు కూలీలు. మల్కుబాయి కూడా ఓ చేయి వేస్తుంది. ఆ సందర్భంలో బండకింద నున్న "రక్తపింజెర" పాము కరుస్తుంది. అక్కడున్న కూలీల ఆకుపసర వైద్యం వికటించి మల్కుబాయి చనిపోతుంది. మల్కుబాయి వైద్యానికిచ్చిన అరుకును పరీక్షించి శర్మ చేయి కాల్చుకుంటాడు. ఆ చిరాకులో కూలీలకు డబ్బుల్లో కోతపెట్టి వెళ్ళిపోతాడు. అందరూ అన్యాయమని గొణుక్కుంటారు. ఇంతలో నాగురావ్ సంఘపోళ్ళిచ్చిన ఎర్ర కాగితం పట్టుకొస్తాడు. కంపినోళ్ళ మోసాలను గురించి చదివి వినిపిస్తాడు. తెలివి తెచ్చుకున్న గోండు గిరిజనులు పనికిపోవడం మానేస్తారు.

శర్మ తన చేతికైన గాయాన్ని చూపించి గోండుల వలన తనకు ప్రాణహాని ఉందని, అమీనుకు లంచమిచ్చి కేసు ఫైల్ చేయిస్తాడు. పోలీసులు గోండు గూడేలను ధ్వంసం చేసి బీభత్సం సృష్టిస్తారు. గోండుల ముఖాలు ఎర్రబడి పోరాటానికి సిద్ధమవుతారు.

ఈ కథలోని ఇతి వృత్తాన్ని బట్టి గోండు గిరిజనులు, అమాయకులు, నిరక్షరాస్యులు, నిరుపేదలు, ఆత్మాభి మానులు, శ్రమ దోపిడికి, ఆర్థిక దోపిడికి గురవుతున్న వాళ్ళు. ప్రభుత్వ సాయం అందక నిర్లక్ష్యం చేయబడుతున్న వాళ్ళు, శక్తి వంచన లేకుండా పనిచేసినా గంజికైనా గతిలేని వాళ్ళు.

ఈ కథ గిరిజనులపై జరిగే అరాచకాలను, మోసాలను, ఎదురించడానికి సంఘటితమై, అక్షరాస్యతతో చైతన్యపడి, హక్కుల సాధనతో సుఖజీవనం సాగించాల్సి ఉందని తెలియజేస్తున్నది.

1993లో ప్రచురించబడిన "శ్వేతరాత్రులు" కథా సంకలనంలో గోపి భాగ్యలక్ష్మి రాసిన మరో గిరిజన కథ "జంగుబాయి" ఈ కథ గోండు గిరిజనుల ఆచార వ్యవహా రాలు, కట్టుబాట్లు, మూఢనమ్మకాలను గురించి వివరి స్తుంది. గిరిజనులపై జరిగే ఆర్థిక దోపిడీలు, అస్పృశ్యత మొదలైన అంశాలను ఆధారం చేసుకొని అడవి, గోండు గూడేలు, గుడిసెల నేపథ్యంలో సాగింది. ఈ కథను చక్కని కథా కథనంతో, భాషౌచిత్యంతో చాలా ప్రతిభా వంతంగా గిరిజన జీవన చిత్రణను ఆవిష్కరించింది రచయిత్రి.

పదహారేళ్ళ వయస్సున్న జంగుబాయి బహిష్టయి నప్పుడు ఆమెను దూరంగా ఏ సదుపాయాలు లేని గుడిసెలో ఒంటరిగా ఉంచి, అన్నపానీయాలను ఎత్తి పోయడం, ఆమెను రచయిత్రి తన ఇంట్లోకి పిలవడం వల్ల, ఆ రాత్రి పులి వచ్చి మేక పిల్లను కొట్టిందని గూడె పోళ్ళు గోల చేయడం వంటివి గిరిజనుల ఆచారాలు, నమ్మకాలను వెల్లడిసున్నాయి.

జంగుబాయి అక్క పెళ్ళికి తండ్రి చేసిన 700 రూపాయలు వడ్డీతో కట్టమని, లేదంటే పొలం రాసివ్వమని షావుకారు తిష్టవేయడం, విధిలేక పొలం రాసి ఇవ్వడం గిరిజనులు మాటతప్పనితనానికి ఆర్థిక దోపిడీకి, గురవు తున్నట్లు తెలియజేస్తున్నది.

జంగుబాయి అక్కకు కొడుకు పుడితే మూడో రోజే తలగొరిగే ఆచారాన్ని పాటించడం వలన, ఆ పిల్లవాడు కత్తిగాట్ల కారణంగా చనిపోతాడు. ఈ సన్నివేశ కల్పనలో గోండు గిరిజనులు ప్రాణాలు తీసేవైనా, నమ్మకాలను మాత్రం పదిలంగా కాపాడుకుంటారని బోధపడుతుంది.

గోండు పిల్లల్ని మాల, మాదిగలతో కూర్చోబెట్టి నందుకు మాస్టారును అధిక్షేపించడం వారిలోనూ అంటరానితనాన్ని పాటించే అవలక్షణం ఉందని తెలియ జేస్తుంది.

బాల్య వివాహమైన జంగుబాయి తన కంటే తక్కువ ఎత్తున్న భర్తను కాదని తప్పకట్టి (దండుగ) తనకు ఇష్టమైన వ్యక్తిని పెళ్ళి చేసుకోవడాన్ని బట్టి, గోండు గిరిజనులు దండుగలు కట్టి కట్టుబాట్లను గౌరవిస్తారని, స్వతంత్రించి ఆత్మాభిమానంతో బతకడానికి ఇష్టపడతారని గుర్తించవచ్చు.

జంగుబాయి స్నేహితురాలు కమల బంజార యువతి. తన ఊరికి బట్టలు అమ్మడానికి వచ్చిపోయే యువకుడిని ప్రేమిస్తుంది. గర్భవతిని చేసి ఆమెను పెళ్ళి చేసుకోకుండా మోసం చేస్తాడు ఆ యువకుడు. దాంతో కమల ఉరిపెట్టు కొని ఆత్మహత్య చేసుకుంటుంది.

ఈ ఉదంతంతో అమాయకంగా మోసపోవడం, కొద్ది పరిచయానికే కొత్తవారిని నమ్మడం, గిరిజనులు విషయంలో జరుగుతుంటాయని అవగతమవుతుంది.

పై కథావివరణలను బట్టి గిరిజనులు అమాయకులు, ఆత్మాభిమానం గలవారు. ఆచారాలను, నమ్మకాలను, సంస్కృతీ సంప్రదాయాలను సమిష్టిగా ప్రాణపదంగా కాపాడుకుంటారు. అవిద్యతో, పేదరికంతో అభివృద్ధికి నోచుకోనివారు, ఆర్థిక శారీరక, దోపిడీలకుగురవుతూ నిత్యం మనుగడకోసం పోరాడుతుంటారు అని గిరిజన కథా సాహిత్యంలో చిత్రించబడ్డారు.

ఆధార గ్రంథాలు :

1. 'ఇప్పపూలు' గిరిజన సంచారతెగల కథలు - (సం) డా. జయధీర్ తిరుమలరావు, జీవన్; ప్రతిభా ప్రచురణలు, ఖమ్మం.
2. తెలుగు సాహిత్య చరిత్ర-ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న; దళిత విద్యాపీఠం.

కర్నూలు జిల్లా గిరిజనుల ఆహారపు అలవాట్లు – పరిశీలన

– మూర్తల భవన్ కుమార్ రెడ్డి, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

కర్నూలు జిల్లా రాయలసీమలోని జిల్లాల్లో ఒకటి. కర్నూలుజిల్లా ఉత్తర అక్షాంశం 14^0-54^0-16^0-11^0 డిగ్రీల మధ్య తూర్పు రేఖాంశం 76^0-58^0-78^0-25^0 డిగ్రీల మధ్య వ్యాపించి ఉంది. జిల్లాకు ఉత్తరాన మహబూబ్ నగర్ జిల్లా, దక్షిణాన అనంతపురం కడప జిల్లాలు, పడమట కర్నాటక రాష్ట్రం, తూర్పున ప్రకాశం జిల్లా సరిహద్దులుగా ఉన్నాయి. కర్నూలు జిల్లా మొత్తం వైశాల్యం 17.568 చదరపు కిలోమీటర్లు. కర్నూలు జిల్లాలో తెలుగు భాషతో పాటు ఉర్దూ, లంబాడీ, మరాఠీ, హిందీ, ఎరుకల భాషలు మాట్లాడేవారున్నారు. అలాగే అక్కడక్కడ కన్నడభాష మాట్లాడేవారు ఉన్నారు.

జిల్లాలో ప్రధానమైన కులం అంటూ ఏది లేదు. ముస్లీం, రెడ్డి, బలిజ, గౌడ మొదలగు కులాలు ప్రధానంగా ఉంటూ సుమారుగా 60 కులాలు ఉంటాయని తెలుస్తున్నది. అడవులు 19.6% ఆక్రమించి ఉన్నాయి. నదులైన తుంగభద్ర, హంద్రి, కుందు, పడమటి కనుమలలో పుట్టి తెలంగాణాను, ఆంధ్రాను వేరు చేస్తూ కృష్ణా నదిలో కలుస్తున్నాయి. నల్లరేగడి భూమిలో వరి, వేరుశనగ, చెఱకు, జొన్న, మిరప, పత్తి, టమోట, గోంగూర పంటలు పండిస్తున్నారు. పుణ్యక్షేత్రాలైన శ్రీశైలం, మహానంది, మంత్రాలయం, అహోబిలంలు జిల్లాలో ప్రధానమైన తీర్థాలుగా చెప్పవచ్చు.

కర్నూలు జిల్లాలో సుగాలీలు, ఎరుకలు, చెంచులు, ఏనాదులు, కుంచెపురి ఎరుకలు మొదలైన గిరిజన జాతులు జీవిస్తున్నాయి. వీరి జానపదశైలి ఎంతో వైవిధ్యంతో కూడుకొన్నది. ప్రకృతితో మమేకమై ఎంతో ఆనందంగా, ఆహ్లాదంగా జీవించే ఈ జాతుల ఆహారపు అలవాట్లు కూడా వైవిధ్యమే. ఆదివాసులైన వీరు నేటి ఆధునిక మానవునికి ఆదర్శప్రాయులని చెప్పవచ్చు. ఎందుకంటే పట్టణాల్లో నివసిస్తున్న ఆధునిక మానవుడు సైతం మెల్ల మెల్లగా తమ ఆహారపు అలవాట్లను మార్చుకొంటూ తిరిగి ప్రాచీనకాలపు ఆదివాసుల ఆయుర్వేద వనమూలికలవైపు మక్కువ చూపుతున్నట్లు మనం గమనిస్తున్నాం. ఆధునికకాలంలో సేంద్రీయ ఎరువుల వాడకం తగ్గి రసాయనక ఎరువులు, క్రిమి సంహారక మందుల వాడకం పెరిగింది. దీనివల్ల సంభవించే అనర్థాల గురించి మనందరికి తెలిసిన విషయమే. ఈ నేపథ్యంలో గిరిజన ఆహారపు అలవాట్లను అధ్యయనం చేయడం, పరిశోధించడం ఎంతో ఆవశ్యకం.

సుగాలీలు :

కర్నూలు (జిల్లా)లో సుగాలీలు నివసించే ప్రాంతాన్ని ప్రత్యేకంగా 'తాండ' అని పిలుస్తారు. జిల్లాలో వీరి నివాసాలు గ్రామీణ, అటవీ పరిసర ప్రాంతాల్లో కనిపిస్తాయి. వీరు పూర్వం ఉప్పును, ధాన్యాన్ని ఎద్దులబండిపై అమ్ముకొంటూ తమకు అవసరమైన ఆహారాన్ని సమీకరించుకొనేవారు. అడవి ప్రాంతాల్లో లభించే సీతాఫలాలు, రేగిపండ్లు, ఎలక్కాయలు, ఉసరిక, ఈత పండ్లను సేకరించి వాటిని గ్రామాల్లో విక్రయించి తమ కుటుంబాలను పోషించుకొనేవారు.

అడవిలో వెదురు నరకడానికి కూలీలుగా పురుషులు, స్త్రీలు వెళ్ళేవారు. దానిద్వారా వచ్చే ప్రతిఫలంతో జీవనం సాగించేవారు. అలాగే కొందరు స్త్రీలు అడవిలోని వంట చెరుకును మోపులుగా తీసుకొచ్చి గ్రామాల్లో అమ్మి, వచ్చిన డబ్బుతో జీవనం కొనసాగించేవారు. మరికొంతమంది పంటపొలాల్లో కలుపు, నారు, కోత వంటి పనులకు వెళ్ళేవారు. అడవిలో లభించే దుప్పి (జింక), కణతలు, కుందేళ్ళు మొదలగు జంతువులను వేటాడి చంపి ఆహారంగా తీసుకొనేవారు. సుగాలీల ఆహార సేకరణలో అవుల పోషణ ప్రధానంగా ఉన్నది అని తెలుస్తున్నది. అలాగే మరికొన్ని ప్రాంతాల్లో అటవి సంపద అయి

నటువంటి టేకు, జిట్టేగి, నల్లమొద్దిలను తీసుకొచ్చి వాటిని అమ్మటం ద్వారా వచ్చిన డబ్బుతో జీవనం కొనసాగించే వారు కూడా ఉన్నారు.

ఎరుకల :

ఎరుకల జాతివారు ఎక్కువగా సంచార జీవితాన్ని గడిపేవారని చెప్పవచ్చు. మద్రాసు పరిసర ప్రాంతంలో ఎరుకలను 'కొరవలు, కొరచలు' అని పిలుస్తారు. 'ఎరుక' చెప్పి తమ ఆహార ధాన్యాన్ని సేకరించుకొనేవారు. 'ఎరుక'నే 'సోది' చెప్పటం అని కూడా అంటారు. ఎరుకల జాతిలో పందుల పెంపకం ఎక్కువగా కనిపిస్తుంది. వీరు 10 నుండి 15 వరకు గల పందుల గుంపును కలిగి వాటిని పోషిస్తూ మాంసాన్ని అమ్ముకొంటూ జీవనం కొనసాగించేవారు. వీరు పంది మాంసాన్ని ఆహారంగా తీసుకొంటారు. ఈత ఆకులతో తడికలు, గంపలు, బుట్టలు, చాపలు చేసి అమ్ముకొంటారు. వీరు వరి అన్నం, సంగటి, రొట్టె, అంబలి మొదలగు వాటిని ఆహారంగా తీసుకొంటారు.

కొన్ని ప్రాంతాల్లోని ఎరుకలు ఎలుకలను పట్టడం ప్రత్యేక వృత్తిగా చేసుకొని జీవనం కొనసాగిస్తున్నారు. పంట పొలాల్లో ఎలుకలు పంటను నాశనం చేస్తుంటాయి. వాటి బారి నుండి పంటను కాపాడుకోవడానికి రైతులు వీరిని ఆశ్రయించి ఎలుకలను పట్టించేవారు. దానికి రైతులు ఎరుకలకు ఆర్థిక సహాయం చేసేవారు. ఇలా పంట పొలాల్లోకి కూలీలుగా వెళ్ళేవారు. ఈ జాతిలో ఎక్కువ మంది ఉన్నారు.

కుంచెపురి ఎరుకల :

కుంచెపురి ఎరుకలవారు ఎక్కువగా మాంసాన్ని తినటానికి ఇష్టపడుతారు. అందుకోసం నిరంతరం అన్వేషణ కొనసాగిస్తూ జీవనం గడుపుతారు. మాంస సేకరణలో భాగంగా పక్షులకు ఉచ్చులను, అడవి పందులకు వలలను ఉపయోగిస్తారు. పక్షిని బట్టి ఉచ్చును వేస్తారు. ఎర్రకారం తినటానికి ఇష్టపడతారు. వీరు సోది చెప్పి దాని ద్వారా వచ్చే ఆహారపు గింజలతో జీవనం గడుపుతూ వస్తారు. వివాహాది శుభకార్యాలకు వెళ్ళి పనిచేసి అక్కడ మిగిలిన ఆహారాన్ని ఇంటికి తీసుకొనివచ్చి ఇంటిల్లిపాది తింటారు. వీరిలో కొంతమంది కష్టపడి వచ్చిన డబ్బును సారా తాగడానికి ఉపయోగిస్తారు. కాని ప్రస్తుత కాలంలో వీరి జీవన శైలిలో మార్పులు కనిపిస్తాయి.

చెంచులు :

కర్నూలు జిల్లా గిరిజన తెగలలో చాలా వెనుకబడిన తెగగా చెంచులని చెప్పవచ్చు. ఎందుకంటే అటవీ ప్రాంతంలో నూటికి 75% మంది జనాభా ఉన్న కుటుంబాలు చెంచు జాతివారు కావడం, సమాజంలో ఇతర ప్రజల జీవన విధానంతో సంబంధం లేకుండా కేవలం అడవిలో సంచార జీవితాన్ని గడపుతూ ఉంటారు.

చెంచులు బలవర్ధకమైన ఆహారం తీసుకొంటారు. అడవిలో లభించే ఆకులు, పూలు, పండ్లు, దుంపలే వీరి నిజమైన ఆహారంగా చెప్పవచ్చు. అడవి జంతువులైన దుప్పి, కణతలు, కుందేళ్ళు, అడవిపంది, అడవి కోళ్ళు మొదలగు వాటిని వేటాడి చంపి వాటి మాంసాన్ని ఆహారంగా తీసుకోవటం ప్రాచీన కాలం నుండి నేటి వరకు చెంచుజాతిలో కనిపిస్తుంది. వీరి నివాసాలు వలయాకారంగా ఉంటాయి. వీరి గుడిసెలను 'గూడెం'గా పిలుస్తారు.

ఏ పూటకు ఆపూట గడిస్తే చాలని అనుకొనే మనస్థత్వం ఉన్న వ్యక్తులుగా చెంచులను చెప్పవచ్చు. రేపటి గురించి ఆలోచన వీరికి ఉండదు. అటవీ ప్రాంతంలో లభించే ప్రకృతి సంపద అయిన పండ్లు, తేనె, మైనము, జీడిగింజలు, సిరుమాను, బంక, యిప్పపువ్వు, చింత పండు, కుంకుళ్ళు, ముష్టిగింజలు మొదలైన వస్తువులను సేకరించి అమ్ముకొని జీవనం నెట్టుకొని వస్తున్నారు. వీరి జీవన విధానాన్ని గమనిస్తే కటిక దారిద్ర్యంలో ఉన్నారని తెలుస్తుంది.

యానాదులు :

ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా నల్లమల అడవుల నుండి నెల్లూరు సముద్ర తీరప్రాంతం వరకు విస్తరించి ఉన్న సంచార గిరిజన తెగ యానాదులు. యానాదులు

సామాజిక పరిణామంలో ఆహార సేకరణకు చెందినవారు. ఆధునికకాలంలో సమాజం సాంకేతికంగా అభివృద్ధి చెందినప్పటికి యానాదులు ప్రాచీన ఆర్థిక విశ్వాసాలకే కట్టుబడి ఉండిపోయారు. చెంచుల వలె యానాదులు కూడా అనాగరిక జీవితాన్ని గడుపుతున్నారు. వీరు భిక్షాటన చేస్తారు. పంట పొలాలకు కావలి ఉంటూ తమకు అవసరమైన ఆహారాన్ని తీసుకొంటారు. చెంచు జాతితో ఏనాదులు వివాహ సంబంధాలు కలుపు కొంటారు.

ఆయుర్వేద వనమూలికలను యానాదులు తమ జీవితంలో విరివిగా ఉపయోగిస్తారు. సర్వగంధి సుగంధి పాలు, సునాముఖి చూర్ణం, మారెడు గుజ్జు, ఉత్తరేని, అతిమధురం, బాహ్మినిచూర్ణం, తిప్పతీగ, నేలవేము, అశ్వగంద, కరక్కాయ, తానికాయ మొదలైన వాటిని గురించి వీరికి బాగా తెలుసు. యానాదులు తమ భార్యలకు నవమాసాలు నిండిన సమయంలో వారు అడవికి వెళ్ళి పదిరకాల వేర్లను తెచ్చి భద్రపరుస్తారు. పురిటి నొప్పులు ప్రారంభం కాగానే ఆవేర్లను ఒక కుండలో వేసి కషాయంగా కాచి తాగిస్తారు. ఇందుకు ఆకు చెముడు, ఎర్రవాలుడు, నల్లమునుకుడు, విషబుద్ధి, నేలవేము, నేలగుమ్మడి, బిల్ల బాలింత సందుమి చెక్కలు మొదలైన మూలికలను ఉపయోగిస్తారు. ప్రసవించిన తర్వాత బాలింతగా ఉన్న స్త్రీ పదిరోజుల వరకు ఈ కషాయాన్ని తాగుతుంది.

ఎలుకలు, ఉడతలు, పాములు, కుందేళ్ళు, ముంగీసలు, యంటవల్ని ఆహారంగా తింటారు. ఎలుకలను పట్టడానికి మూటుకుండలు, బొగ్గులు, వరిపొట్టును ఉపయోగించేవారు. నేలను సాగు చేస్తూ జొన్నలు, సజ్జలు, కందులు లాంటి ఎలిపైర్లను పండించేవారు. సంవత్సరంలో ఆరు నెలలు ఈ పంటలతోనే పొట్ట నింపుకొనే వారు.

యానాదులు అడవుల నుండి సేకరించే పదార్థాలు

ఆకులు :

బొద్దిఆకు, కలిశ, బీర, గడనెల్లి, దేవదారు, తాబేటి, పొన్నగంటి, నెల్లి, గొట్టిగడ్డల, సన్నపాయ, గున్నంగి, పాదయాత్ర, తూటాకు, నీరుగబ్బ మొదలైన అరుదైన ఆకులను సేకరించి అమ్ముతారు.

గడ్డిదినుసులు :

గిట్టిగీ గోరుచుట్లూ, గొట్టిగడలు, ఇంజేటి, కొండలోరా కొండెల్లి, పూరిఎల్లి, అడవి పెండలం, భూచక్రగడ్డ, పెన్నేరు, పెద్దీత, చిట్టీత, కొండీత, మొగశెరి, కన్నెకోమల, అల్లి మొదలైన వాటిని ఎంతో కష్టపడి సేకరిస్తారు.

విత్తనాలు :

చారపప్పు, పొగడ, గొట్టి, తంబ, పొన్నగాని, అల్లి, బీర, ఊటి.

ఫలాలు :

పొగడ పండ్లు, గుత్తి, బీరకాయ, కలీపండ్లు, కొండ ఈతకాయలు, మోవి, అల్లిదేవదారు, తుమ్మెద, వానకలే, చారపప్పు సేకరించేవారు.

ఆధార గ్రంథాలు :

1. కర్నూలు జిల్లా గిరిజనుల జానపదగేయాలు - విమర్శనాత్మక పరిశీలన - డా॥ చవ్వా వేంకటేశ్వర్లు
2. యానాది భాగవతం - రంగస్థల అధ్యయనం - డా॥ తూప్రాన్ శ్రవణ్ కుమార్
3. చివరిగుడిసె - కేశవరెడ్డి
4. ప్రాచీనాంధ్ర సాహిత్యంలో - గిరిజన జీవన చిత్రణ - డా॥ విట్ట వేణుగోపాలు
5. కొండ కోనల్లో తెలుగు గిరిజనులు - శివరామకృష్ణ
6. ఆంధ్రప్రదేశ్‌లో గిరిజనులు - సంస్కృతి, ప్రగతికి సవాళ్లు - పిరాట్ల శివరామకృష్ణ
7. తెలుగు కావ్యాల్లో గిరిజన సంస్కృతి - బి. రామాచార్యులు

ఆదివాసులు వారి ప్రాశస్త్యం – ఒక పరిశీలన

– పెద్దోజు నరేష్, మరిపెడ బంగ్లా, మహబుబాబాద్ జిల్లా, తెలంగాణ.

సువిశాల భారతదేశంలో, చరిత్ర నిర్మాణంలో, సంస్కృతి నిర్మాణంలోనూ భారతదేశంలో నివసించే గిరిజనుల పాత్ర విశిష్టమైనదిగా పేర్కొనవచ్చును. గిరి+జనులు = గిరిజనులు, గిరి = కొండ, జనులు = జనులు, ప్రజలు, అంటే కొండ ప్రాంతంలో నివసించే వారు. కొండ, కోన, అటవిక ప్రాంతాలలో నివసిస్తారు. కాబట్టి ఆటవికులు అంటారు. వనపుత్రులు, గిరిపుత్రులు, గిరిజనులు, సహజంగా వీరు ప్రకృతి ప్రేమికులు, ప్రకృతి ఆరాధకులు మరియు ప్రకృతి పరిరక్షకులు. ఆదివాసులు అడవులే అమ్మ ఒడిగా కొండ, కొనలే తోడునీడగా జీవిస్తారు. వాళ్ళు రేయింబవళ్ళు ప్రకృతిని బాగా పరిశీలిస్తారు. ఏవి తినాలో ఏవి తినకూడదో చెప్పారు. అట్లా చెప్పడానికి వాళ్ళు ఎన్నో ప్రయోగాలు చేశారు. వాటిని రుచి చూశారు. ఆయా ప్రయోగాలతో కొన్ని సందర్భాలలో కొందరు ప్రాణాలను కూడా వదిలారు. జంతువుల మాంసం తినడానికి ముందు ఆయా జంతువులను పరిశీలించినారు. ఆ జంతువుల ఆహారపు అలవాట్లపైన దృష్టి పెట్టారు. ఆ తరువాత ఇది తినవచ్చు అని చెప్పారు. వాళ్ళ పరిశీలన, శ్రమ, త్యాగం ఎంత గొప్పవో! కోయలు, గోండులు, చెంచులు మొ॥ గిరిజన ప్రకృతి విజ్ఞానం అంత గొప్పది. చెట్లను గురించి వాళ్ళకు తెలిసినంతగా ఎవరికీ తెలియదనటంలో అతిశయోక్తి కాదు. వాళ్ళు శాస్త్రజ్ఞులే. రోగాల బారిన పడ్డప్పుడు చెట్ల మందులతోనే ఆరోగ్యాన్ని తిరిగి పొందారు. ఇట్లా వనమూలికలతో చేసే వైద్యమే ఆయుర్వేదం. పూర్వం యుద్ధాల్లో గాయపడిన వారికి కూడా ఈ వైద్యం చేసేవారు. ఈ విషయాల్లో వారు గురువులై పరిశోధకులై తరువాత తరాలకు తోవ చూపారు.

గిరిజనుల్ని వివిధ పదాలలో పిలిచేవారు. వనవాసి, గిరిజన్, ఆదిమజాతి లాంటి పదాలు ఉపయోగించేవారు. పురాణాల్లోను ఇతిహాసాలలోను గిరిజనుల గురించి ముఖ్యంగా ''దండకారణ్యం'' గురించి వివరాలు ఉన్నాయి. గిరిజనుల నాగరికత చాలా పురాతనమైనది. వారికి రాజ్యాలు ఉండేవి. కోటలు ఉండేవి. వారికి భాష ఉంది. సంఖ్యా పరిజ్ఞానం, మాసాలు, ఋతువులు లాంటి లెక్కలు కూడా వున్నాయి. సాహిత్యం, సంగీతం, వాయిద్య సహకారం అత్యున్నత స్థాయికి చేరుకుంది. స్వయంపాలన వారి సంస్కృతి ఔనత్యాన్ని, క్రమశిక్షణను చాటుతుంది. వారి భాషకు లిపి లేదు. అందువల్ల తర తరాలుగా వారి సంస్కృతి మౌఖికంగానే తర్వాత తరాలకు అందజేయబడుతుంది. భారత సంస్కృతికి అనేక మూలాలు గిరిజన సంస్కృతిలో కన్పిస్తాయి.

ప్రాచీన సాహిత్యంలో కూడా ఈ గిరిజనుల ప్రస్తావన కన్పిస్తుంది. నన్నయ్యభట్టు ఆది, సభా, అరణ్య పర్వాల్లో శబర, పుళింద, కిరాత, నిషాద, లుబ్ధ శబ్దాలతో పాటు పర్వత నివాసులు, అరణ్య నివాసులు పార్వతీయులు మొ॥ శబ్దాలను గిరిజనుల్ని గూర్చి ప్రయోగించారు. భారత పంచమాశ్వాసంలో ''ఏకలవ్యుని'' వృత్తాంతాన్ని నన్నయ్య తెలియజేశాడు. ఏకలవ్యున్ని ఉత్తమోత్తమ శిష్యునిగా నిర్మలమైన గురుభక్తికి ప్రతీకగ చిత్రించాడు. ఈ ఏకలవ్యుడు హిరణ్య ధన్వుదమ ఎరుకల రాజు కుమారుడు. ద్రోణాచార్యుని ప్రసిద్ధిని విని అతడు విలువిద్యను నేర్పమని ద్రోణున్ని ప్రార్థిస్తాడు. నిషాద పుత్రుడనే కారణం చేత ద్రోణుడు ఏకలవ్యుని కోరికను నిరాకరిస్తాడు. కాని ఏకలవ్యుడు పట్టు వదలకుండా ద్రోణుని ప్రతిమను గురువుగా సృష్టించి అనేక విద్యలు అర్జునున్ని మించే విలువిద్యాపారంగతుడు. తనను తాను మల్చుకున్నటు వంటి ఉత్తమోత్తమ శిష్యుడు, కానీ రాజుల యొక్క పక్షపాతి ఐన ద్రోణాచార్యుడు పాండవులను మించి విలు విద్యకారులు ఎవరు ఉండరాదనే కుత్సితబుద్ధితో దురాభిమానంతో ఏకలవ్యుని దగ్గరకు వెళ్ళి తన విలువిద్యకు

మెచ్చి దుష్ట పన్నాగంచే ఏకలవ్యుని యొక్క బొటనవేలును గురుదక్షిణగా స్వీకరిస్తాడు. అక్కడే ఆదివాసుల పతనానికి నాంది పలికినట్లుగా చెప్పవచ్చు.

అలాగే అరణ్యపర్వంలోని పంచమాశ్వాసంలో "ధుర్యోధనుని" వృత్తాంతం కలదు. ఇతడు మిథిలా నగరవాసి అయిన ఇతడు కౌశికుడని బ్రహ్మణుని ఉపదేశం వల్ల సకల నీతి ధర్మం పారంగతుడౌతాడు. మనిషి గొప్పతనానికి గుణం ముఖ్యం కాదని కులం ప్రధానం కాదని ధర్మవ్యాధుని వృత్తాంతం ద్వారా నన్నయ్య తెలియజేశాడు.

అలాగే నన్నెచోడుడు "కుమార సంభవం"లో ఆట వికుల వేషధారణ విలాసాన్ని గూర్చి వివరించాడు. అలాగే పాల్కురికి సోమన "పండితారాధ్య చరిత్ర"లో వివిధ భక్తులను గురించి వివరిస్తూ చెంచు, ధర్మాత్ముల నడకల్ని పేర్కొన్నాడు. శ్రీశైలం మల్లయ్యను దర్శించడానికి బయలుదేరిన చెంచులు మార్గమధ్యంలో దాన ధర్మాలు చేస్తూ సద్భక్తులైనారు అని వారి యొక్క భక్తి తత్పర జీవనాన్ని పేర్కొన్నారు.

తిక్కన సోమయాజితో భారత శాంతిపర్వ తృతీయాశ్వాసంలో లుబ్ధకపోతోపాఖ్యానంలో ఆ వేటగాని కోసం ఆ పావురాలు చేసిన ప్రాణత్యాగానికి బోయవాని పరివర్తనం ఈ కథ యందలి ఆకర్షణీయాంశమైన సంఘటనలను మనం ఇందులో కనిపిస్తుంది.

శ్రీనాథుడు "శివరాత్రి మహాత్మ్యం" లో సుకుమారుని వృత్తంతాన్ని వర్ణిస్తూ శబర, కిరాత, భిల్ల మొదలైన గిరిజన జాతుల్ని కూడా ప్రస్తవించాడు అలాగే "హరివిలాసం"లో "కిరాతార్జునీయ ఘట్టం" వర్ణించబడింది. అర్జునుని అర్జుని తపోవన ప్రాంతానికి ప్రాంతానికి వచ్చారు. ముకాసురుడు వరహారూపం ధరించి, ప్రమదగణాలు చెంచులుగా మారి వచ్చారు. పందికి బాణం వేస్తారు. ఇక్కడ నేను చంపేను అంటే నేను చంపాను అని కిరాతుకుణికి అర్జునునికి జరిగే యుద్ధాన్ని శ్రీనాథుడు ఆద్యంతం చక్కగా వర్ణించాడు. ఇక్కడ (శివుడు) చెంచుగా మారిన, చెంచితగా మారిన (పార్వతి)ని చక్కగా రూప సౌందర్యమును, వారి కట్టు, బొట్టు రూప గుణాలను శ్రీనాథుడు అద్భుతంగా వర్ణించడం మనం గమనించవచ్చు.

పిల్లలమర్రి పిన వీరభద్రుడు "శృంగార శాకుంతల" లో గిరిజనుల వేషధారణ, వస్తు సేకరణ, వేట మొదలైన వాటిని వర్ణించాడు. పుళిందులు అడవిలోని వివిధ వస్తువులని తెచ్చి దుశ్యంతునికి కానుకగా ఇచ్చి, దుశ్యంతుని వేటకై రావలసిందని కోరుతారు. వారు దుశ్యంతునితో కలిసి వేటలో పాల్గొంటారు. దీని బట్టి వీళ్ళు ఎంతటి విలుకారులో, యుద్ధ నైపుణ్యం, వేట నైపుణ్యం కలిగిన వారుగా, సంచార జీవులుగా, ఆటవిక జాతులుగా పేర్కొన వచ్చు. అంటే రాజుకు కూడా ధైర్య సాహసాలలో సమవుజ్జీ కలవారు అని పేర్కొనవచ్చు.

కొఱవి గోపరాజు "సింహసన ద్వాత్రింశిక" లో పందొమ్మిది, ఇరవై ఎనిమిదో కథలో చెంచుల్ని గూర్చి వర్ణించాడు.

అల్లసాని పెద్దన తన "మను చరిత్ర" లో గిరిజన తెగలోకి ఎరుకుల వేటను గూర్చి విపులంగా వర్ణించాడు. "స్వరోచి ఆటవిక సేనతో రాజ్యపాలనం చేస్తుండగా రాజు వచ్చి అడవి వస్తువులుగా భావించడాని, స్వరోచికి వేటయందు ఉత్సాహం కలుగునట్లుగా అడవి జంతువులను గూర్చి, పక్షుల్ని గూర్చి చాలా చక్కగా వివరించాడు. స్వరోచి వేటకు రాగా, ఎరుకలు కూడా వెంట వెళ్ళి జంతువుల్ని వేటాడుచూ తమతమ నైపుణ్యాన్ని ప్రదర్శించారని తెలియజేశాడు.

శ్రీ కృష్ణదేవరాయలు కూడా తన "అముక్తమాల్యద" లో ఆటవికులైన బిల్లుల స్వభావం వారిని ప్రస్తావించడం జరిగింది.

అయ్యలరాజు రామభద్రుడు రాసిన "రామాభ్యుదయం" లో చెంచుల వేషధారణ, చెంచులు సేకరించిన వస్తువులు, వాళ్ళ ధైర్యసాహసాలు మొదలైన వాటిని వర్ణించాడు. గుహుడు నిషాదుడని చెప్పబడెను. ద్వితీయాశ్వాసంలో "చెంచులు దశరదుని వద్దకు వచ్చి తాము

సేకరించిన వస్తువుల్ని కానుకలుగా సమర్పించారని, వేటకు తగిన సమయం కావడం వల్ల వేటకై రావలసింది అని చెప్పగా ధశరదుడు మృగయా విహారానికి వెళ్ళారని చెంచులు కూడా వివిధ వేట వస్తువులతో ధశరదుని వెంట వేటకు వెళ్ళారని" వర్ణించబడింది. కాబట్టి దీనిని బట్టి చూస్తే రామాయణంలో కూడా ఆటవిక జాతులు అయిన "చెంచుల" ప్రస్తావన ఉండటాన్ని గమనిస్తే వీరి చరిత్ర ఆది నుండి ఉన్నదని చెప్పవచ్చు. అంటే ధశరదునితో సమానంగా వేటకు వెళ్ళారంటే అత్యంత బలవంతులు, సమర్థులు అని అవగతం అవుతుంది.

ధూర్జటి "శ్రీ కాళహస్తి మహత్యం" లో గిరిజనులని గూర్చి విపులంగా వర్ణించాడు. రాజులని, చెంచుల వేష ధారణ, జాతర, వేట మొదలైన వాటిని చక్కగా వివరించాడు. అయితే తిన్నని కథ గిరిజన సంస్కృతి అద్దం లాంటిది. గిరిజనుడైన తిన్నని కథ సుమారు 130 పద్య గద్యాల్లో వర్ణించబడినది.

రఘునాధ నాయకుడు - గిరిజనుడైన వాల్మీకి వృత్తాంతాన్ని "వాల్మీకి చరిత్రం" అను పేర పద్యకావ్యాన్ని రచించాడు. వాల్మీకి పెద్దపీట వేసినట్లయింది. "తమసానదీ తీరంలోని అడవి మధ్య ఉన్న బోయపల్లెలో నివసించు కిరాతుడు. అతని అసలు పేరు రత్నాకరుడు. దారి దోపిడి చేస్తూ భార్య పిల్లల్ని పోషించేవాడని, మిక్కిలి కఠినాత్ముడు" కఠోర రాక్షసుడు, ఒకనాడు సప్తర్షులు దారి తప్పి బోయపల్లె వైపు రాగా ఆ కిరాతుడు వాళ్ళను అడ్డగించి ధనమునకై అనేక విధాలుగా హింసించాడని మునులు ఇప్పుడు నీవు ఎంత కష్టపడి ఇంత మందిని ఇబ్బంది పెట్టి ధనార్జన చేస్తున్నావు కదా! నీవు చేసిన పాపం వల్ల ఎవరికి కీర్తి వస్తుంది. ఎవరికోసం నీ భార్యకు పిల్లలకోసం సంపాదిస్తున్నావు కదా! నీవు సంపాదనకు నీ భార్య పిల్లలు జీవిస్తారు. కాని నీవు చేసిన పాపంలో నీ భార్య పిల్లలకు అందులో భాగం ఉంటుందా! అని మహర్షులు అడిగితే వెంటనే వస్తా ఉండడి అని చెప్పి వెళ్ళిపోతాడు. ఇంటికి వెళ్ళిన రత్నకరుడు భార్య పిల్లల్ని నేను చేసిన పాప పుణ్యంలో మీకు వస్తుందా? అంటే అప్పుడు భార్య పిల్లలు నీవు ఇంటి యాజమానిగా పోషించడం నీ బాధ్యత, నీవు చేసిన కర్మలకు మేము బాధ్యులం కాదు అని చెప్తారు. తిరిగి మహర్షుల దగ్గరకి వస్తాడు. మునులు వానికి రామమంత్రాన్ని ఉపదేశించి వెళ్ళిపోతారని నాటి నుండి కిరాతకుడు అన్ని బంధాలు తెంచుకొని తపోనిష్టలో ఉండిపోతాడని, వానిని తపస్సు నుండి మరల్చడానికై భార్య బిడ్డలు శతవిధాల ప్రయత్నించారని, రంభా ఊర్వశిలు కూడా వాని తపోభంగానికి విఫల ప్రయత్నం చేశారని, సప్తర్షులు తిరిగి వస్తు కిరాతుని గుర్తించారని కిరాతుడు వాల్మీకం నుండి బయటకు వచ్చి మునులను సేవించగా ఆ మునులు కిరాతకునికి "వాల్మీకి"అని నామధేయం చేసి వెళ్ళిపోయారు. వాల్మీకి తపస్సును మెచ్చి శ్రీరాముడు ప్రత్యక్షమయ్యి తన చరిత్రను రచించమని కోరగా వాల్మీకి లోక కళ్యాణ కారకమైన రామాయణ కావ్యాన్ని రచించాడని వర్ణించబడింది.

పురాణాల కాలం నాటి నుండి కూడా ఆటవిక జాతులు అయిన గిరిజనులు, చెంచులు, బోయలు, గోండులు, జంగాలు, జక్కులవారు, దాసర్లు, దొమ్మరులు, మొదలైన వారి ప్రస్తవన మనకు కనిపిస్తుంది. గిరిజనులు మన సంస్కృతికి మూలపురుషులు అని పెద్దలు చెప్పినది అక్షర సత్యమని పైన తెలిపిన కావ్యాల ద్వారా మనకు ప్రస్ఫుటంగా తెలుస్తుంది. వారి ద్వారానే సంస్కృతి నేటికి పరిఢవిల్లుతుందని ఘంటాపథంగా పేర్కొనవచ్చును. నేటికి కూడా వారు ఆచార వ్యవహార శైలి కొనసాగుతూనే ఉంది.

తూర్పుగోదావరి జిల్లా, మారేడుమిల్లి మండలం "గిరిజన గేయాలు – విశ్లేషణ

– శ్రీమతి అనుమోలు రామలక్ష్మి
సహాయ ఆచార్యులు, విభాగాధిపతి, హిందీ విభాగం,
శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల,
విజయవాడ.

– డాక్టర్ యశోద పూర్ణచంద్రరావు
సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం,
పి.బి. సిద్ధార్థ ఆర్ట్సు & సైన్సు కళాశాల,
విజయవాడ.

జానపద విజ్ఞానాన్ని గురించి, జానపద సాహిత్యం గురించి ఎంతో పరిశోధన విశ్వవిద్యాలయాల స్థాయిలో జరుగుతుంది. జానపద సాహిత్యానికి పెట్టింది పేరుగా, జానపద బ్రహ్మగా కీర్తిని గడించినవారు శ్రీ నేదునూరి గంగాధరం. జానపద సాహిత్యంపై, జానపద విజ్ఞానంపై విశేషంగా కృషి చేయడమే కాకుండా, పరిశోధనలు జరిపించి భవిష్యత్తు తరానికి విలువైన గ్రంథాలను అందించినవారిలో ముఖ్యులు ఆచార్య బిరుదురాజు రామరాజు, ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు, ప్రొఫెసర్ ఆర్వీయస్ సుందరం, ప్రొ. జి.ఎస్.మోహన్, శ్రీ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి మొదలగువారు ఎన్నదగినవారు.

ఇటు గిరిజన సాహిత్యాన్ని అభివృద్ధి పరచటానికి గాను ఆచార్య బిరుదురాజు రామరాజు విశేషమైన కృషి చేశారు. వీరి పర్యవేక్షణలో పి. శివరామకృష్ణ 'తెలుగు గిరిజన గీతాలు' అనే అంశంపై పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథాన్ని, ఆచార్య కడప రమణయ్య పర్యవేక్షణలో పిరాట్ల సుబ్రహ్మణ్య శాస్త్రి "గిరిజన గేయాలు-సామాజిక పరిశీలన' తూర్పు గోదావరి జిల్లా, మారేడుమిల్లి మండలం" అనే అంశంపై ఎం.ఫిల్. లఘు సిద్ధాంత వ్యాసాన్ని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి సమర్పించి పట్టం పొందారు. ఇంకా గిరిజన సాహిత్యంపై ఎంతో కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.

ద్రవిడ జాతికి చెందిన గిరిజనులు మధ్య భారతంలోని మధ్యప్రదేశ్, చోటా నాగపూర్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల్లో ఎక్కువగా వ్యాపించి వున్నారు. /భారతదేశం గిరిజన సముదాయాలు, తెలుగు అకాడమీ, 9వ ముద్రణ/. భారతదేశంలోని గిరిజన సమాజాల మధ్య సారూప్యం, తారతమ్యం సహజంగా కన్పిస్తుంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని సవర, బగత, గోండి, కోయవంటి జాతులతోపాటు తెలుగు మాతృభాష వున్న గిరిజనులు ఖమ్మం, పశ్చిమ, తూర్పుగోదావరులు, విశాఖ ప్రాంతాల్లో చాలమంది వున్నారు. కాబట్టి గిరిజన విజ్ఞానం ఆంధ్రప్రదేశ్‌లో అపారంగా వుంది. గిరిజన విజ్ఞాన సంపదను విశ్లేషింప బూనుకున్న వారికి తెలుగునాడు అమూల్యమైన ఆకరం, ఒక్కొక్క గిరిజన సముదాయం అందించే సమాచారం జానపద విజ్ఞానవేత్తలకు, మానవ శాస్త్రజ్ఞులకు, సమాజ శాస్త్రజ్ఞులకు చాల విలువైంది. ఒక్క మారేడుమిల్లి మండలానికి చెందిన గిరిజన సాహిత్యంలో ఎంత వైవిధ్యముందో మనం తెలుసుకోవాలంటే, ఆ మారేడుమిల్లి మండలంలోని గిరిజన గేయాల్లోని వైశిష్ట్యాన్ని పరిశీలిస్తే మన సంస్కృతీ సాహిత్య సంపద మనకు అర్థమౌతుందని చెప్పవచ్చు.

తూర్పు గోదావరిజిల్లాలోని గంగవరం, మారేడుమిల్లి, దేవిపట్నం, రాజఒమ్మంగి, రంపచోడవరం, అడ్డతీగల, వై.రామవరం ఈ మండలాల్లో గిరిజన గేయ సంపద వుంది. ముఖ్యంగా వీటిల్లో మారేడుమిల్లి, వై.రామవరం మండలాలు గిరిజనులకు ఆటపట్టులు. మారేడుమిల్లి మండలాన్ని మూడు భాగాలు పరిశీలించి, పరిశోధించినట్లైతే మారేడుమిల్లి మండలంలోని గిరిజన గేయాల్లోని వైశిష్ట్యాన్ని పరిశీలిస్తే మన సంస్కృతీ సాహిత్య సంపద మనకు స్పష్టమౌతుంది. తాడేపల్లి, వెలమలకోట, మద్దివీడు / మొదటిభాగం/, కుందాడ, గుజ్జుమామిడి /రెండోభాగం, బోదులూరు, బొడ్లంక, పుల్లంగి ప్రాంతాలు /మూడో

భాగం/ వున్నాయి. ఈ ప్రాంతాల్లో గిరిజనుల తెగలు ఇలా వున్నాయి : వాల్మీకులు, కోయలు, కొండదొరలు, కొందరెడ్లులుగా చోటు చేసుకున్నారు. వాల్మీకులు వ్యవహార విజ్ఞానం గలవారు. వీరు తగవులు తీర్చడంలో నేర్పులు. వీరు రామాయణ, భారతాలను ప్రచారం చేసిన వారు కావడం విశేషం. ఈ గిరిజనులకు చారిత్రక నేపథ్యం వుంది. గిరిజనుల ఉద్యమాలు ఇలా వున్నాయి. దార బందాల చంద్రయ్య పితూరి, రంప పితూరి. ఆంగ్లేయులపై దౌర్జన్యం శ్రీ అల్లూరి సీతారామరాజు పితూరి (1840-1920) రేకపల్లి నుండి పాడేరు వరకు సాగిన విషయం అందరకు తెలిసిన విషయమే.

జానపదుడికన్నా గిరిజనుడు మొదటివాడైనట్లే జానపద సాహిత్యం కన్నా గిరిజన సాహిత్యం పురాతనమైంది. ఏ భాషల్లోనైనా గేయంతోనే సాహిత్యం ప్రారంభమౌతుంది. జానపద గేయాల్లోని 'తకిట కిటతక' అనే లక్షణం గిరిజన గేయాలను పోలి వుంటుంది. మారేడుమిల్లి మండలం గిరిజన గేయాల్లో కథాగేయాలు తక్కువ. ఒకటి అరా వున్న కాలగర్భంలో కలిసిపోయాయి. /విశాఖ జిల్లాలో ఈ కథాగేయాల్లో 'నందిపదం' విస్తృతమైన ప్రచారం జరుగుతుంది. దీన్ని విశేషంగా చెప్పుకోవచ్చు./

గిరిజన గేయాలు త్రిస్రగతి, మిశ్రచాపంలో వుంటాయని, 'తకిట తకధిమి' అనే లయ ప్రధానంగా సాగుతాయని శ్రీ బాలాంత్రపు రజనీకాంతారావు తెల్పారు.

ఉదా : "మంచిదోయ్ మరదలమ్మి మంచిదోయ్ కోడలమ్మి
కయ్యులేరు వాలారి మొగ్గ ఇప్పుడె ఏర చూడలేద
అచ్చు కోడల, లేలలేల"

అనే రెండు పల్లవులే అన్ని గిరిజన గేయాలకు పల్లవులుగా కన్పడతాయి. వీటిని అనుసరించి సాగే చరణాలు తదనుగుణంగా వుంటాయి. ఈ రెండు రకాల పల్లవులే మారేడుమిల్లి మండలంలోని అన్ని గిరిజన గేయాల్లో పల్లవులుగా వుంటాయి - పెళ్లిళ్లలో పాడే పాటలు పండుగ దినాల్లోను, పండుగ దినాల్లో పాడే పాటలు పెళ్లిళ్లలోను పాడటం సర్వసాధారణం.

గిరిజన గేయాలను నాల్గు విధాలుగా చెప్పవచ్చు. అవి: 1. పండుగ గేయాలు 2. పెళ్లి గేయాలు 3.కోపు గేయాలు 4.లేల గేయాలు. వాటిని పరిశీలిద్దాం-

పండుగ గేయాలు :

సమాజంలో పండుగలు సాంస్కృతిక మూల్యాలు. ఇవి జాతి జీవనంలో ఉదాత్తమైన భావనాబలాన్ని నైతికంగాను, సామాజికంగాను, తాత్వికంగాను కల్గించే క్రమంలో ప్రధాన భూమిక వీటివే.

"కానివాడ దేవుడికి నీలములో / ఏమేమి ఓరెలు నీలములో
కొత్త కుండ ఓరెలు నీలములో / కోనేటి పళ్లీలు నీలములో
ఒరుదొప్ప సేనులు నీలములో / అడ్డాకు పళ్లేరు నీలములో..."

అంటూ ప్రకృతి శక్తుల్ని ఆరాధిస్తాడు గిరిజనుడు. / అలౌకిక శక్తుల్ని ప్రసన్నం కోసమే ఈ పండుగ గేయాలు.

ఉదా : కొలుపులు, జాతరలు, పండుగలు/

"కొండంత దేవుడికి కొండంత పూజ" చేయలేమని మానవునికి తెలుసు. కాబట్టి గిరిజనుడు తాను వేటాడిన జంతువుల మాంసాన్ని చిన్నచిన్న తునకలుగా ఒక ఆకులో ప్రకృతికి నివేదన చేస్తాడు. /భూమి పండుగ/

"సత్తెము గల్ల భూమిదేవి కాచి కాపాడు
భూమి దేవికి లెంకలు పూజలు చాయగమతుల వారు..."

అనే ఈ గేయంలో భూమిదేవి అవతారాన్ని వర్ణించి పూవులతో, పిందెలతో, కాయలతో తమకు కల్గిన ఔజాన్ని కొలువు చేస్తామనే చిన్న విన్నపాన్ని ధ్వనింప జేస్తాడు గిరిజనుడు.

పెళ్లి గేయాలు :

భారతీయ సంస్కృతిలో ఆటవికులైనా నాగరకులైనా జానపదులైనా దాంపత్యధర్మం ఆదర్శవంతమైందిగా నమ్మడం వుంది. ఉదా:పార్వతీ పరమేశ్వర్లు, సీతా రాములను ఆదర్శంగా భావిస్తారు. గిరిజనుల్లో మగపెళ్లి వారికి, ఆడపెళ్లివారు అతిథులు. వరుని తల్లిదండ్రులు పిల్లను అడిగి పెళ్లి చేసుకోవాలనేది మనకు గిరిజన పెళ్లి గేయాల్లో అర్థమౌతుంది-

"పెళ్లనగ వింతిమిగాని పెళ్లి చప్పుడెన్నడెరుగము
తిరిగెండ్లందుము మరిగెండ్లందుము.."

దీన్ని బట్టి పెళ్లి జరుగుతున్నదంటే ఊరువాడ తెలియాలి.

"ఊరెరుగని పెండ్లి - వాడెరుగని తద్దినం" వంటిది గిరిజనుల నానుడి. గిరిజనులకు 'సాద' అవసరం.

ఉదా : "సాదలేని సోముడిపెళ్లికి ముక్కల వాయిద్యం" అనేది స్పష్టం. ఆడపెళ్లివారు మగపెళ్లివారిని ఎద్దేవ చేస్తూ

"బొంగు విత్తుల గంగుపెండ్లికి / ఇంటికి ఏనుం బియ్యం తెండి
రెండిళ్లకో మనిషి రండి / కారు బచ్చలి కూర తెండి
కడుపు నిండ తినిపొండి"

అన్న గేయాన్ని బట్టి ఏవిధంగా ఆడపెళ్లివారు, మగ పెళ్లివారిని ఆట పట్టిస్తారనేది, ఇంకా హంగూ, ఆర్భాటం మనకు తెలుస్తుందని భావించవచ్చు.

కోపు పాటలు / జానపదుల్లో కోలాటపు పాటలు :

ఇవి 'కానివాడ' ప్రాంతంలో ఎక్కువగా పాడు కుంటారు - వీటిల్లో హాస్యం, సరసం ఎక్కువ. శృంగార పరంగా వుంటాయి గనుక వీటిని కూడ పెళ్లి గేయాల్లో పాడుకుంటారు.

"కొండ క్రింద కడారి కోట - కోకలిచ్చి మేమే కొన్నాం
ఊరి కింద ఉరుముల కోట - ఉమ్మిలిచ్చి మేమే కొన్నాం
సత్తె వెనుక గువ్వల కొండ - గువ్వలిచ్చి మేమే కొన్నాం
కొత్తాది తాడేపల్లి కోవలిచ్చి మనమే కొన్నాం
రావికింద రోలు వేసి రావోయిచాన సామలు దంచనూ"

దీన్ని బట్టి మనకు అర్థమైంది - గిరిజన స్త్రీలు మగ వారిని ఉడికిస్తారు - కోకలిచ్చి, గువ్వలను ఇచ్చి సొంతం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు -

లేలపాటు :

మారేడుమిల్లి మండలంలో గిరిజనుల్లో 'లేలపదాలు' పున్నమి రోజుల్లోనూ పండుగ దినాల్లోనూ పాడుకుంటారు -

"లేల లేల లేలెమ్మారో ఓలే లేల లేల / లేల లేల లే లెయ్యారొ ఓలే లేల లేల"

ఉదా : సత్తెము గల్ల ముత్తాలమ్మ కాచి కాపుడు / కొక్కెర కోడి కూసే వేళ కోడి లేచెడి వేళ
ఊరకోడి కూసేవేళ ఊరు లేచిడి వేళ / చంద్రూడు జంగములను ఏలేటి వేళ
సూర్యుడు చుక్కుల సుడి తిరిగేటి వేళ / సత్తెము గల దేవతలకు పచ్చి బద్దలు శరణు
కోపములేని మాయమ్మకు కోటి గద్దెలు శరణు / పసిబిడ్డ బాలపాప చల్లంగ చూడవాలె"

అంటూ సాగుతుంది. దీన్ని బట్టి గిరిజనుడు నిద్ర నుండి తేరుకొనే సమయాన్ని గేయంలో పాడుకుంటాడు. చంద్రుడిని, సూర్యుణ్ణి గేయంలో తెల్పుతూ 'దేవత' సత్యము కలదని వివరించడంలో తనకు తెలియకుండా కొంత ఔచిత్యాన్ని పాటిస్తాడు గిరిజనుడు.

పైన తెల్పిన గిరిజన గేయాల్లోని అంశాలన్నీ పరిశీలిస్తే దాని వైశిష్ట్యం మన సంస్కృతీ సాహిత్య సంపద మనకు విశదమౌతుందని చెప్పవచ్చు.

ఆధార గ్రంథాలు :

"గోదావరి గాథల్లో గిరిజనుల జీవన చిత్రాలు"

– రుద్రపాక జితేంద్ర కుమార్, తెలుగు అధ్యాపకులు, పి.బి.సిద్ధార్థ కళాశాల (స్వయం ప్రతిపత్తి), విజయవాడ.

ఏ దేశమేగినా.... ఎందుకాలిడినా .....
పొగడరా ... నీతల్లి భూమి భారతిని...
ఏ పీఠమెక్కినా .... ఎవ్వరేమనినా ....

నిలపరా ... నీజాతి నిండు గౌరవము... తెలుగు కవి మాటల సాక్షిగా గర్వించదగిన జన్మను ఇచ్చిన, అది తెలుగు వాడిగా జన్మను ఇచ్చిన మాతృభూమి భరతభూమికి నా నమస్సులు. ప్రాచీన తెలుగు సాహిత్యములో పలు కావ్యాలలో గిరిజనుల జీవనశైలి కనిపిస్తుంది. రామాయణ, భారత, తదితర కావ్యాలలో ఎరుకలు, చెంచులు మొద లైన గిరిజన తెగల ప్రస్తావన అధికంగా కనిపిస్తున్నది. అదే విధముగా తెలుగు సాహిత్యములో కథ, నవల, కవిత్వము, గేయము, వ్యాసములలో కూడా గిరిజన తెగల ప్రస్తావన కనిపిస్తున్నది. సుమారుగా భారత దేశంలో 570 గిరిజన తెగలు ఉండగా మన ఆంధ్రదేశము నందు 35 గిరిజన తెగలు ఉన్నట్లు అంచనా కలదు.

భిన్నమైన సంస్కృతి సంప్రదాయాలు, భాష, ఆచార వ్యవహారములు, నమ్మకాలు, వేడుకలు, విశ్వాసాలు కలిగినటువంటి గిరిజన తెగలను పరిశీలిస్తే కొండకాపు, కొండరెడ్డి, కొండదొర, ఎరుకల, కొలాము, కోండు, కోటియా, కోదులు, కోయ, జాతాపు, కులియా గౌడు, గోండు, చెంచు, గదబ, నాయక్, ప్రధానులు, బగతలు, భిల్లులు, మన్నెదొరలు, సవరలు, మూకదొర, నూక దొరలు, రెడ్డి దొరలు, యానాదులు, వాల్మీకులు, సుగాలీలు, ఒరియా, దోనలు, తోటీలు వంటి పలు గిరి జన తెగలు కనిపిస్తాయి.

ఇటువంటి గిరిజన తెగల మనుగడకి భారత దేశాన తగిన రక్షణ లేకపోవుట వలన పేదరికము, దారిద్ర్యము, రుణభారములతో గిరిజన తెగలు పలు సమస్యల వల యంలో చిక్కుకొని అంతరించిపోయే ప్రమాదం ఉంది.

గోదావరి గాథలలో గిరిజనుల జీవన చిత్రాలు - పరిశీలన :

ఫణికుమార్‌గారు వ్రాసినటువంటి గోదావరి గాథలు తెలుగునాట ఆంధ్రప్రభ దినపత్రిక సారస్వతానుబంధంలో ముద్రించబడినాయి. వస్తువు పరంగా గోదావరి గాథలు పరిమితిలో చాలా చిన్నవి. గోదావరి గాథలను జీవిత చరిత్ర శకలాలని చెప్పవచ్చును. గోదావరి గాథలు గిరిజన ప్రాంతాలలోని ప్రజల జీవన సమస్యలను విపులంగా తెలియజేస్తున్నాయి. "గోదావరి గాథలు కథలు కావు. సజీవ చిత్రాలైన గిరిజనుల జీవిత చరిత్రలు".

- చింతా సాలక్క
- వాళ్ళ అల్లుళ్ళూ వద్దు, కోడళ్ళూ వద్దు
- గోండ్వానా భీష్ముడు

గోదావరి గాథల్లో - చింతా సాలక్క గాథ - భూ ఆక్రమణ సమస్య :

ప్రభుత్వ ఉద్యోగిగా గిరిజన ప్రాంతాలలో సహాయ సహకారాలు అందిస్తున్న సమయంలో ఫణికుమార్‌గారి అనుభవాలలోని ఓ గిరిజన కుటుంబ సమస్యను తెలియ జేసేదే చింతాసాలక్క గాథ.

"కంతన పల్లి గ్రామం గిరిజనులతో కూడుకొన్న గ్రామం గోదావరి తీరంలో వరద ముప్పుకు దగ్గరగా ఉన్న ఈ గ్రామంలో గిరిజనులైన కోయజాతి వాళ్ళ కాలనీలు నిర్మించే పనిలో భాగంగా సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలను చర్చించే సమయంలో గిరిజన మహిళ చింతాసాలక్క మా భూమి 8 ఎకరాలు గుంటూరు బడాబాబులు లాక్కున్నారు. చివరికి చేసేది లేక నాభర్త నేను ఊరు వదిలి దూరంగా ఉన్న చెలపాక గ్రామంలో ఉన్నాము. మేము తిరిగి మా ఊరు వచ్చే మార్గములేదా? బడాబాబుల భూ ఆక్రమణలను ఎవ్వరూ ఆపలేరా? మా

సొంత భూమి మాకు ఇప్పించలేక పోతే, మీఇళ్ళు ఎవ్వరికి కావాలి? మీ ఇతర సాయం ఎవ్వరికి కావాలి అని నిల దీయగా గ్రామ సర్పంచ్ వీరయ్య జరిగిన కథంతా ప్రభుత్వం వారికి తెలియజేశాడు. చింతాసాలక్క భర్త గుంటూరువారి దగ్గర భూమిని తాకట్టు పెట్టి, కొంత భూమిని చట్ట వ్యతిరేఖంగా అతి తక్కువ ధరకు గుంటూరు వారికి అమ్మటం వల్ల అర్థబలంతో, అంగబలంతో గిరిజన భూములను గుంటూరు వారు కాజేయటం వల్ల సుమారు ఒక్క గ్రామంలోనే 70 ఎకరాల భూములను పోగొట్టుకొని గిరిజనులు నష్టపోయారు. గుంటూరు ఆయన కబ్జా నుండి తన భూమిని ఇప్పించమని కోరగా ప్రభుత్వ ఉద్యోగులు ఎంతో శ్రమించి తిరిగి చింతాసాలక్కకు భూమిని ఇప్పించినా, మళ్ళీ నెలరోజులలోనే గుంటూరుఆయన హైకోర్టు నుండి స్టే ఆర్డరు తేవటం వల్ల కంతనపల్లి గ్రామంలో చింతా సాలక్క కుటుంబం మళ్ళీ సమస్యల్లో చిక్కుకుంది.

ఈ గాథలో నిరక్షరాస్యులైన గిరిజనులను, భౌతిక ప్రపంచమంతగా పరిచయములేని గిరిజనులను నాగరికత తెలిసిన మనుషులు అంగబలంతో, అధికార బలంతో, అర్థబలంతో వారి భూములను ఆక్రమించి ఇబ్బంది పాలు చేయటం మనల్ని కదిలిస్తుంది.

గోదావరి గాథల్లో వాళ్ళ అల్లుళ్ళూ వద్దు .. కోడళ్ళూ వద్దు గాథ -

వైవాహిక సంబంధాలు – సామాజిక సమస్య :

కొత్త గూడకు చెందిన మండల అధ్యక్షుడు గిరిజనుల పెద్ద శ్రీ వెంకటయ్యగారు మాట్లాడుతూ " గిరిజనేతరులు గిరిజన స్త్రీలను బలాత్కరించటము తెలియని విషయము కాదు. ఒక చోట గిరిజనేతరులు గిరిజన స్త్రీలను వివాహము చేసుకొని పని మనుషుల కన్నా హీనముగా చూడటం మనకు తెలియనివిషయం కాదు. గిరిజన స్త్రీకి అనాదిగా జరుగుతున్న అన్యాయం మనకు తెలియనిది కాదు. ఇప్పుడు గిరిజనేతరుల అమ్మాయి మన గిరిజన అబ్బాయిని ప్రేమించి పెళ్ళాడితే మనం కాదనకూడదు. ఇన్నేళ్ళు మన గిరిజన స్త్రీలు వాళ్ళకు భోగవస్తువులు అయితే వాళ్ళ అమ్మాయిలు మనింటికి కోడళ్ళుగా రావటాన్ని మనం అంగీకరించాలి. అంతే కాదు ఈ మార్పుని మనం మరింతంగా ప్రోత్సహించాలి" అని అన్నారు. ఇలా మాట్లాడటానికి కారణం కొత్తగూడకు చెందిన గిరిజన యువకుడు చెలవాయి గ్రామ గిరిజనేతర కన్యను పెళ్ళి చేసుకోవటానికి ప్రభుత్వపెద్దల అనుమతిని, సహాయాన్ని కోరగా అభ్యుదయ వాది అయిన శ్రీ వెంకటయ్యగారు ప్రోత్సహించారు. కాని నేను (ఫణి కుమార్) గిరిజనేతరులు ఈ దశలో గిరిజనులను పెళ్ళాడితే గిరిజనుల భూములపై ఆక్రమణ జరిగి గిరిజన సమాజంలో సమస్యలు తలెత్తే ప్రమాదము ఉందని, ఎందుకనగా గిరిజనేతరులు బంధువులుగా వివాహ సంబంధాల వలన గిరిజన గ్రామాలలోకి అడుగు పెట్టి వారి ఆస్తులను ఆక్రమించే అవకాశము ఉండటం వల్ల గిరిజనేతరులు గిరిజనులను పెళ్ళిచేసుకోవటం ఈ దశలో చారిత్రాత్మకంగా మంచిది కాదని, బలంగా ఉన్న గిరిజన సమాజం మరింత బలంగా ఉండాలంటూ శ్రీ వెంకటయ్యగారి ఆలోచనలకు భిన్నంగా గిరిజనుల సమావేశంలో ఆవేశంతో మాట్లాడాను.

ఫణికుమార్ గారి మాటల్లో గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలని ఒక తపన ఈ వ్యాసంలో మనకు కనిపిస్తుంది.

గోదావరి గాథల్లో గోండ్వానా భీష్ముడు గాథ -

సామాజిక, ఆర్థిక, విద్యా, ఆహార, తీవ్రవాద సమస్యలు :

గోండుతెగకు సంబంధించిన రాజకుటుంబం అత్రాం వారిది. గాదిగూడ యందు ఆదిలాబాద్ జిల్లాలో ఒక రాజకుటుంబం ఉంది. ఈ గోండు కుటుంబ పెద్ద గోండు సమాజంలోనే భీష్ముడిగా పరిగణించబడే 80ఏళ్ళ వృద్ధుడు అత్రాం భీమ్‌రావ్‌పటేల్ అన్నది గౌరవవాచకం. ఆదివాసీయులకులాగానే గోండులలో కుల పంచాయితీలకు ప్రాధాన్యత ఎక్కువ. కుల పంచాయితీల కన్నా ఒక

గ్రామానికి చెందిన సర్వజన సమావేశానికి మరింత ప్రాధాన్యత కలదు.

దేవ్‌ధన్ కమిటి – గోండ్వానా భీష్ముడు నిర్మాణాత్మక మార్గాలు – సూచనలు :

'భీమ్‌రావ్‌పటేల్ ఆలోచనలు గిరిజనలశ్రేయస్సురిత్యా నిర్మాణాత్మక మార్గాలు, నినాదాల మార్గాలు కాదు' అన్న ఫణికుమార్‌గారి మాటలను గమనిస్తే గిరిజన గోండ్ తెగల నాయకుడు భీమ్‌రావ్ పటేల్ అమోఘమైన తెలివితేటలు కలవాడని తెలుస్తున్నది. గిరిజనుల సమస్యలపై మంచి అవగాహన ఉన్నవాడని తెలుస్తున్నది.

గిరిజనుల ఆహార సమస్యలను తీర్చేందుకు కోతలు అయిన తరువాత తలాయింత ధాన్యం ఒక చోట పోగు చేసి వాటిని గాదెలలో నింపి అవసరమైన వారికి సహాయంగా ఇచ్చి మరల వారినుంచి ఆ ధాన్యాన్ని 10శాతం ధాన్యంతో కలిపి తీసుకొని దేవ్‌ధన్ కమిటీ గిరిజనులకు అండగా నిలబడతున్నది. అయితే ఈ దేవ్‌ధన్ కమిటీ కార్యకలపాలు గిరిజనుల ఆహార సమస్యలకు మాత్రమే పరిమితం కాకుండా ఆర్థిక, విద్యా, వైద్య, తదితర సమస్యలను తీర్చే కమిటీగా తయారు చేయాలని ప్రభుత్వానికి భీమ్‌రావ్‌పటేల్ ఇచ్చిన సలహాను గమనిస్తే భీమ్‌రావ్‌పటేల్ ముందు చూపు గిరిజనుల సంక్షేమం పట్ల ఆయనకున్న అవగాహన నిజంగా ప్రశంసించదగినవి.

ముగింపు :

'గోదావరి గాథలు' అన్న ఫణికుమార్ గారి వ్యాసాలు గిరిజన ప్రజల సంస్కృతి సంప్రదాయాల కోణంలోనే కాక సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా, వైద్య సమస్యలను బాహ్యప్రపంచానికి కళ్ళకు కట్టినట్లు చూపిస్తున్నాయి. మధురాంతకం రాజారామ్ గారు అన్నట్లుగా గోదావరి గాథలు గిరిజన ప్రాంతాలనే చీకటి కోణాలపైన ప్రసరించే కాంతికిరణాలు అని చెప్పవచ్చును.

ఆధార గ్రంథాలు :

1. గోదావరి గాథలు - ఫణికుమార్
2. తెలుగు కథ - దళిత, మైనారిటీ, గిరిజన బహుజన జీవితం, (వ్యాస సంకలనం) - డా॥వి.ఆర్. రాసాని.



'జానకీ రాఘవము'లో ఎరుకల సానిగా పార్వతీదేవి

– ప్రభాకరరావు సగ్గుర్తి, పరిశోధక విద్యార్థి, తెలుగు & ప్రాచ్యభాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

జానకీ రాఘవ ప్రబంధ రచయిత పరిచయం :

ఐదు అశ్వాసాలు 679 గద్య పద్యాలతో కూడిన కావ్యం. దీని రచయిత బేతపూడి కృష్ణయామాత్యుడు. కమ్మవారికంకితమైన కావ్యాలలో ఈ జానకీ రాఘవము ఒకటి. ఇతడు ఆర్వేల నియోగి బ్రాహ్మణుడు. శ్రీవత్స గోత్రుడు. ఆపస్తంబ సూత్రుడు, ఇతడి తండ్రి పేరు కాళయ, తల్లి పరమాంబ.

ఈ జానకీ రాఘవము కాక కవి మరి రెండు కావ్యాలు రాశాడు. అవి 1. అలివేలు మంగా వివాహము. ఇది జగన్నాథునికి అంకితము, 2. పండిత మనోభిరామము. ఇది ధవళాద్రిరాయన కంకితము.

జానకీ రాఘవము కావ్య విశేషములు :

కృష్ణయ కవి కూడా రామాయణములోని సీతా కళ్యాణము వరకు గల కథను రచించాడు. కవి కాలానికి అధిక ప్రచారంలో ఉన్న మను, వసు చరిత్రల ప్రభావంతో కవి దీనిని 'బహుకల్పనా కల్పబంధురసూక్తుల'తో రచించాడు. తెలుగు సాహిత్యంలో పిల్లవసుచరిత్రలుగా పేరు గాంచిన కూచిమంచి తిమ్మకవి రసికజన మనోభిరామము, అడిదము సూరకవి కవిజన రంజనము, కనుపర్తి అబ్బయామాత్యుని కవిరాజ మనోరంజనము, కృష్ణకవి శకుంతలా పరిణయము, అద్దంకి గంగాధరకవి తపతీ సంవరణోపాఖ్యానముల సరసన దీనిని కూడా చేర్చ వచ్చును.

ఈ కావ్యంలో సీతాదేవి శృంగార ప్రబంధ నాయిక అయ్యింది. కవే స్వయంగా ఆశ్వాసాంత గద్యలో దీనిని శృగార కావ్యంగా పేర్కొనటం విశేషం. వర్ణనలు ప్రబంధోచితంగా ఉన్నా, కథలో విశ్వామిత్రుని చేత సీత సౌందర్యవర్ణన చేయించుటలోను, పార్వతీ దేవిని ఎఱుకల సానిగా చేసి సీతకు సోది చెప్పించుటలోని ఉచితజ్ఞత కన్పించదు.

పూర్వకవి సందర్భం :

శ్రీనాథుడి కావ్యాల్లో కూడా హరవిలాసంలోను, శివ రాత్రి మహాత్మ్యంలోను దేవతలు వేరు వేరు కులాల వృత్తుల రూపాలను ధరించిన వర్ణనలు కన్పిస్తాయి. హరవిలాసంలో శివుడు కిరాతుడై వచ్చినప్పుడు పార్వతి ఆయన వెంట ఎరుకలసాని వేషంలో వచ్చిందని వర్ణిస్తాడు. వెంకటాచల మహాత్మ్యం నుంచి ఎరుకలసాని వేషము, హరవిలాసం నుంచి పార్వతి చద్మ[1] (మారు వేషము) గ్రహించి కవి కొత్త పాత్రను సృష్టించాడు.

ఉదాహరణకు వెంకన్న సోది వేషం :

శ్రీనివాస కళ్యాణంలో పద్మావతిదేవి శ్రీనివాసుడు తనను వివాహం చేసుకుంటాడా? అని దిగులు పడుతున్నపుడు, విష్ణువు స్వయంగా సోది చెప్పే ఎరుకలసానిగా వచ్చి పద్మావతికి భవిష్యత్తును వివరించి, ధైర్యం చెప్పిన కథ వెంకటాచల మహాత్మ్యం కథల్లో ప్రసిద్ధంగా ఉంది.

తరిగొండ వెంగమాంబ వెంకటాచల మహాత్మ్యం (పద్యకావ్యం)లోను ఈ కథ ఉంది. ఆ శ్రీనివాసుడి ఎరుకలసాని కథను అనుకరిస్తూ చేసుకొని కవి ఈ వృత్తాంతాన్ని కల్పించి వుంటారు.

ఎరుకల జన్మనివాసం :

ఆంధ్రప్రదేశ్‌లోని ఆదిమజాతుల గురించి మొదట చెప్పుకోవాలి. ఆదిమజాతులందరు తెలుగు మాట్లాడేవారు కాదు. అయినా వీరి సంప్రదాయాలు, నమ్మకాలు, జీవన విధానం వల్ల మన ప్రాచీనులను గురించి అనేక సంగతులు తెలుస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లాలలో గిరిజన జన సంఖ్యలో, విశాఖపట్నం జిల్లాకే అగ్రస్థానం, మొత్తం 33 గిరిజన జాతుల్లో ఈ జిల్లాలో 23 జాతుల వారున్నారు. ఇందులో ఎరుకల వాళ్ళూ ఉన్నారు. శ్రీకాకుళం, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు ప్రాంతాలలో వీరు నివాసం ఉంటున్నారు.

వెంకటేశ్వర విశ్వవిద్యాలయం సామాజిక మానవ విజ్ఞానానికి చెందిన కథనాన్ని బట్టి దక్షిణ భారతదేశంలో దక్షిణాగ్రం నుంచి ఉత్తర ఆర్కాటు జిల్లాలు దాటి ఉత్తరంగా వీరు వ్యాపించి ఉండేవారనీ, వీరిని ఎరుకల వాళ్ళనీ, కోర్చావాళ్ళనీ పిలుస్తారనీ అని డా॥ జి.వి. సుబ్బారెడ్డి గారు చెప్పారు.

భవిష్యత్తు కోసం :

ప్రతి మనిషికీ రాబోయేకాలం గురించి తెలుసు కోవాలనే ఆరాటం సామాన్యంగా ఉంటుంది. నేటి కాలంలో విజ్ఞాన, శాస్త్రవిషయాల వల్లా, సామాజికంగా విశ్లేషించటం వల్లా కాస్త తగ్గినా పూర్తిగా పోలేదు. బిడ్డ పుట్టిన రోజే జాతకం రాయించే వారు ఎంతో మంది వున్నారు. పూర్వరాజులకూ, సంస్థానపతులకూ జమీందార్లకూ, ఆస్థాన జ్యోతిష్కులు ఉండేవారు. ఏ కార్యం ప్రారంభించాలి అన్నా జ్యోతిష్కుల అభిప్రాయం తీసుకోకుండా ఏ పనీ చేసే వారు కారు. జ్యోతిష్కులు రాజాస్థానాలకు పరిమితమైతే పేదలకంతా ఎరుకల స్త్రీలే సోదె ద్వారా వారి వారి భవిష్యత్తులో చెబుతూ వుంటారు.

ఎరుకల స్త్రీ గురించి కొంత పరిచయం :

ఎరుక అంటే జ్ఞానం. జరగబోయే విషయానికి సంబంధించిన జ్ఞానమే ఎరుక. ఇది చెప్పే కులం వారె ఎరుకుల వారు అయితే ఇది రూపాంతరం చెంది, ఎరుక ఎరుకలగా మారి, అది ఒక జాతి పేరుగా, ఎరుకల జాతియై, ఎరుకల వాళ్ళుగా ప్రఖ్యాతి వహించారు. ఎరుక చెప్పే వారి జీవిత భవిష్యత్తు ఏమిటో ఎరుకల వారికి తెలియకపోయినా, ఇతరులకు మాత్రం ఎరుక చెప్పి జీవిస్తున్నారు.

వారొక విచిత్ర వేషంతో వస్తారు. ఇప్పటికి కూడా పల్లెలోను, పట్టణాల్లో, బస్తీ ప్రాంతాలలోను 'సోదోయమ్మ సోది సోదడగరమ్మ సోది' అంటూ వీధి వీధి తిరుగుతూ సోదమ్మి కన్పిస్తుంది. ఈమె నెత్తిమీద ఒక బుట్ట పెట్టుకుంటుంది. ఆ బుట్టలో నాలుగు పలకలు గల గవ్వలతో కుట్టిన ఒక వస్తువు ఉంటుంది. దానినే వాక్కు నిచ్చే దేవతగా ఆరాధిస్తారు. ఆ దేవతను, పసుపుకుంకాలతో అలంకరిస్తారు. ఒక చేతిలో తంబురా, చంకలో పిల్లవాడు, మరో చేతిలో మంత్రశక్తి కలిగిన పుల్లను పట్టుకుని ముఖాన పెద్ద కుంకుమబొట్టు పెట్టుకుని వయ్యారంగా వీధిలో నడుస్తూ, సోదమ్మో సోదో అంటూ సోది చెప్పించుకునే వాళ్ళ వద్దకు వెళ్ళి, వారి చేత చేటలో బియ్యం తెప్పించి, ఎరుక చెప్పించుకునే వారి చేయిచూస్తూ, తమ వేళ్ళతో వారి చేయి సరిచేస్తూ, కుడిచేతి లోని చిన్నకర్రను నుదిటికి, పాపటికి, తగిలించుకుంటూ సంకేతంగా ఉన్న వారి భాషలో రాగయుక్తంగా ఎరుక చెప్తుంది. ఎరుకలసానిగా ఈ కావ్యంలో పార్వతీదేవి కన్పిస్తుంది.

ఎరుకలసానిగా పార్వతీదేవి :

ఆ జాతి పద్ధతిని కవి చాలా సహజంగా వర్ణించారు. సీత రాముడు విల్లు ఎత్తగలడా? పెండ్లి అవుతుందా? అని భయపడుతున్నప్పుడు, మరుసటి రోజు వరకు ఆమెకు ధైర్యాన్ని కలిగించటానికి సీతకు ఆరాధ్యదైవమైన పార్వతే ఎరుకలసానిగా వచ్చింది. మా ఇంటి దగ్గర సోది చెప్పే ఆమె ఎలా ఉంటుందో స్వభావోక్తిలో కవి వర్ణిస్తారు.

సీ॥ నిండుచందురులోన నుండు కందోయన
ముద్దమోమునఁ బచ్చబొట్టు మెఱయ
మిసిమి మబ్బున మించు మించన నౌదల
మట్టుగా రతనంపు బుట్ట తనరఁ
దాపించకుంభ సన్మధువాను తేఁటినాఁ
జనుఁద్రాగు బిడ్డ చంకను చెలంగఁ
గల కంఠ సద్ఘంటి కాదామమో యనఁ
గాంచన మణికాంచి కటినిఁదనర

గీ॥ లలిత మంజీరములు పాదములను దనరి
విమల కల్పలతాలవాలము లనంగ
రాజహంస యనంగ నా రాజవీధి
వెంట నేతెంచె నెఱుకత వేడ్కదనర

సోదికత్తె వెంట పురుషుడు ఉండడు కాని, శివుడు కూడా చెంచులాగా ఆమె వెంటరావటం కవి చేసిన చమత్కారం.

హరవిలాసంలో అర్జునుడిని పరీక్షించిన పరమేశ్వరుడు వెంట కిరాతవేషంలో ఉన్నప్పుడు భారతంలో లేని పార్వతి హరవిలాస కావ్యంలో వచ్చింది. అలాగే పరమేశ్వరుడు చెంచు వేషంలో పార్వతి వెంట ఉన్నట్టు కవి చమత్కరించాడు. వర్ణన కావ్య ధర్మాన్ని అనుసరించి అనుకూలమైన తత్వం కవి సహజంగా వర్ణించాడు.

గీ. ఫాలమున మణి పిడికిటి కేలుఁజేర్చి
యెఱుక పూఁబోణి చేఁబైఁడి చిఱుత కఱ్ఱ
రత్నములు వేడ్కగైకొని రాజసమున
నెఱుక చెప్పంగ బూని తానిట్టులనియె 32

గీ॥ కంచి కామాక్షి బెజవాడ కనకదుర్గ
మధుర మీనాక్షి భ్రమరాంభ మాహురమ్మ
అన్నపూర్ణ విశాలాక్షి యాదిలక్ష్మి
లలిని వాక్కీయరమ్మ కొల్లాపురమ్మ 33

చ॥ అనుచు నాగేంద్రకన్య(తన) యందు దయాపరిపూర్ణ చిత్తయై
వనచర కాంతరూపమున వచ్చి రఘూద్వహుడే ప్రియుండుగా
ననుమతిఁజెప్పినీదు హృదయంబునఁజెందు కలంతఁబాసెఁబో
యనెఁగమలాలయాది విబుధాంగనలన్ గృపనిట్లు చూచెనే 34

ఈ పద్యాలలో పార్వతీదేవిని ఎరుకలసానిగా సహజ సిద్ధముగా వర్ణించిన సందర్భము. ఎలాగంటే సోదెమ్మ సోదో అంటూ నెత్తిమీద ఒక బుట్ట పెట్టుకుని ఇంతకు ముందు చెప్పిన విధంగా వీధిలో నడుస్తూ చూపరులకు ఏవో అతీత శక్తులు కలిగిన స్త్రీ దేవతామూర్తిగా కన్పించి ఆమె ఇట్లు చెప్ప ప్రారంభించింది.

కంచి కామాక్షమ్మ పలుకు, విజయవాడ కనకదుర్గమ్మ పలుకు, మధురమీనాక్షీ పలుకు, భ్రమరాంభ పలుకు, వుయ్యూరు వీరమ్మా పలుకు, అన్నపూర్ణమ్మ పలుకు, విశాలాక్ష్మి పలుకు, ఆదిలక్ష్మమ్మ పలుకు, పలకవే తల్లి అని దేవతలందరిన్నీ కళ్ళు మూసుకొని భక్తి భావంతో స్తుతించి చేతిలో ఉన్న పుల్లను సీతమ్మ వారి చేతి కందిస్తూ, ఎరుకలసానిగా శ్రీరాముడే నీకు ప్రియుడుగా వచ్చి నీ మనస్సునందు కలుగు సందేహాన్ని తీరుస్తాడని చెప్తుంది.

ముగింపు :

ఎరుకలసాని సంతోషకరమైన విషయములు చెప్పేటప్పుడు సంతోషంగానూ, విచారకరమైన విషయాలు చెప్పేటప్పుడు దీనాతిదీనంగా హృదయాలను ద్రవింపచేసే విధంగానూ, కొన్ని ఆసక్తికరమైన విషయాలనూ, కొన్ని ఆశను రేకెత్తించేవిగానూ, మరికొన్ని అత్యాశను కలిగించేవిగాను, మరికొన్ని వారి వారి మనసుల్లో ఏముందో అదే భావాన్ని చెపుతూ, వారికి అభిరుచి గల విషయాలను చెపుతూ, వారితో ఆమోదింపచేస్తూ, భవిష్యత్ వర్తమానాల గురించి జోశ్యం చెపుతూ, సీత సందేహాల నివృత్తి కొరకు ఓపికగా సమాధానాలు చెపుతూ, జరిగిందీ, జరగబోయేదీ చెపుతూ, తాను చెప్పిన విషయాలతో సీతని తన్మయత్వం చేస్తూ, శ్రోతల యొక్క అనుభూతినీ, సానుభూతినీ అనుసరించి సోదమ్మి చేర్పులూ కూర్పులూ కలిపి రస వత్తరంగా సోదె ముగుస్తుంది. ఈ విధంగా కావ్యంలో కృష్ణయకవి వర్ణించిన తీరు అమోఘం, అద్వితీయం, అత్యద్భుతం.

ఆధారగ్రంథాలు :

1. బేతపూడి కృష్ణయామాత్యుడు - జానకీరాఘవము
2. తరిగొండ వెంగమాంబ - వెంకటాచలమహాత్మ్యము
3. ఆర్వీయస్ సుందరం - ఆంధ్రుల జానపద విజ్ఞానం
4. బహుజనపల్లి సీతారామాచార్యులు - శబ్దరత్నాకరము
5. తెలుగు వికీపీడియా

'సంఘం' నవల – ఆదివాసుల జీవన చిత్రణ

– శశికళ యస్., పరిశోధక విద్యార్థి, తెలుగు & ప్రాచ్యభాషా విభాగం, మద్రాసు విశ్వవిద్యాలయం, మద్రాసు, తమిళనాడు.

ఉపోద్ఘాతం :

భారతదేశంలో స్వాతంత్ర్యం వచ్చి కూడా గిరిజన జీవితాల్లో ఎటువంటి మార్పులు రాలేదు. గిరిజనులు కేవలం అడవులకే పరిమితం కావడంతో ప్రభుత్వాధికారులు తమ స్వలాభం కోసం అమాయకపు గిరిజనులపై పెత్తనం చలాయిస్తూ వారి సంపదను దోచుకోవడం, అడ్డు వస్తే చంపేయడం చేస్తారు. ప్రపంచం దినదినాభివృద్ధి చెందుతున్న నేటికీ గిరిజనులు అడవులలోనే ఉంటూ అనాగరికంగా జీవిస్తున్నారు. గిరిజనులకు తమ హక్కులను పొందనీయకుండా పెత్తందారులు అడ్డుపడుతుంటారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన నేటికి గిరిజన బతుకులు యధావిధిగానే ఉన్నాయి. వారి అభివృద్ధికి పాటుపడే ప్రభుత్వాలు కొంతమంది దళారీలు అన్యాయాలను, అక్రమాలను చేస్తూ వారిని హింసిస్తూనే ఉన్నారని చెప్పవచ్చు.

నవలా పరిచయం :

ఈ 'సంఘం' నవలలో కూడా ఆదివాసుల జీవన శైలి ఏ విధంగా ఉందో, ఆదివాసుల మీద జరుగుతున్నా, అన్యాయాలను, అక్రమాలను, దౌర్జన్యాలను, వడ్డీ వ్యాపారుల పెత్తనాలను గిరిజనులపై జరుగుతున్నా దాడులను రచయిత 'చిన్నప్ప భారతి' ఈ సంఘం నవలలో కళ్ళకు కట్టినట్లుగా ప్రస్తావించారు. రచయిత గిరిజన ప్రాంతంలో జరిగిన విషయాలను స్వయంగా చూసి, వారి దగ్గర నుండి సమాచారం సేకరించి నవల రాయడం జరిగింది.

రచయిత పరిచయం :

రచయిత 'చిన్నప్ప భారతి' 1953 లో జన్మించారు. హైస్కూల్లో చదివే రోజుల్లోనే తమిళనాడు అభ్యుదయ ఉద్యమాలలో సంబంధాలను కలిగి ఉన్నారు. కళాశాల విద్యార్థిగా ఉన్నప్పుడే 1954 లో "భూస్వామ్యం ఎప్పుడు ప్రారంభమైంది" అనే కవితా సంకలనంతో తమిళ సాహిత్య రంగంలో ప్రవేశించారు. 1970 లో ఆయన "సెమ్మలర్" అనే తమిళ అభ్యుదయ సాహితీ మాస పత్రికను స్థాపించి సంపాదకులుగా వ్యవహరించారు. 'చిన్నప్ప భారతి' రాసిన మొదటి నవల "దాహం". ఈ నవల తమిళ నవలల్లో పద్ది అత్యుత్తమ నవలల్లో ఒకటిగ విమర్శకులు పరిగణించారు. రెండవ నవల "సంఘం". ఈ నవల ఆంగ్లంలోను, తెలుగులోను వెలువడింది. మళయాళం, హిందీ, కన్నడం, బెంగాలీ భాషల్లో కూడా అనువదించబడింది. సంఘం నవల మద్రాసులోని ప్రసిద్ధ సాహిత్య సంస్థ 'ఇలక్కియి చింతనై' పురస్కారాన్ని 1987 లో అందుకుంది.

'సంఘం' నవల - ఆదివాసుల జీవన శైలి :

ఈ నవల 'కొల్లిమలై' అనే కొండ ప్రాంతంలో నివసిస్తున్నా ఆదివాసుల జీవన విధానాన్ని, వారు అనుభవిస్తున్నా కష్టాలను తెలిపే నవల ఇది. ఈ నవలలో ప్రధాన పాత్రలు తిరుమన్, తిరుమి, సడయన్, శ్రీరంగన్, పెరస్వామి, పిడారి. ఉదయమే కొండకు దూరంగా చలిని తప్పించుకోవడానికి ఎండలో నిలబడతాడు 'సడైయన్'. రోడ్డు వైపు చూస్తే జీప్ లో నుంచి ఇద్దరు అధికారులు వస్తుంటారు. వాల్లని చూసి సడయన్ భయంతో వణికిపోతాడు. అక్కడి నుండి పారిపోతే వారి నుంచి తప్పించుకోలేను అని అక్కడే నిలబడతాడు. అధికారులు వచ్చి పరిచయం చేసుకుంటారు. మీ తండ్రి కోసం వచ్చామని చెప్పి పిలుచుకొని రమ్మని చెప్తారు. సడయన్ తల ఊపి అక్కడి నుండి తండ్రి కోసం పోలం వైపు వెళ్ళి, తండ్రితో సర్కారోళ్ళు వచ్చారని చెప్తాడు. గిరిజనులకు సర్కారు వాళ్ళు అంటే అటవీశాఖాధికారులు, పోలీసులు అని మాత్రమే తెలుసు. తిరుమన్ భయపడుతూ వారి దగ్గరికి

వెళ్ళి వారికి నమస్కరించి ఇంట్లో కూర్చోపెడతాడు. తిరుమాన్ ని చూసి అధికారి సహాయకుడు తిరుమాన్ విచారించి "తమకు నాలుగు పనస పళ్ళు, రెండు అరటి గెలలు, ఇరవై ఐదు అనాస పళ్ళు కోశి తీసుకురా! సరకు మంచిదిగా ఉండాలని ఆదేశిస్తారు[7]." తిరుమాన్ కొడుకుని తీసుకు వెళ్ళి తన పండిన పంటలో కొసుకొని వచ్చి ఇస్తారు. వాటిని జీపులో పెట్టమని చెప్పి 'నిజంగా నీ పంటనే' అని అడిగేసరికి తిరుమాన్ భయంతో కాళ్ళ మీద పడి ఆ పళ్ళన్నీ తన పొలంలో పండించనవేనని వేడుకుంటాడు. అక్కడి నుండి అధికారులు వెళ్ళిపోతారు. ఇదంతా చూస్తున్న సడయన్ కి ఏమిచేయాలో అర్థంకాదు. తిరుమాన్ ఈ విషయం భార్యతో చెప్పకుండా కొడుకు కూడా చెప్పవద్దని దాచిపెడతాడు. చెబితే గందరగోళం చేస్తుందని తిరుమాన్ అనుకుంటాడు.

తిరుమాన్ భార్య తిరిమి తమ పొలంలో పండిన పళ్ళను సంతలో అమ్మివేసి తన కూతురికి చీర, ఓణి కొనాలని, ఉన్న కొద్ది అప్పులను తీర్చుకోవాలని భవిష్యత్ కలలు కంటుంది. ఆమె పంది పిల్లలను పెంచుతూ ఉంటుంది. వాటిని అభివృద్ధి చేస్తే డబ్బులు బాగా వస్తాయని ఆశతో తిరిమి పంది పిల్లలను తన బిడ్డలతో సమానంగా చూసుకుంటుంది. వీటి ద్వారా వచ్చే డబ్బుతో కొడుకు పెళ్ళి చేయాలని అనుకుంటుంది. కూతురిని ఎవడో ఒకడు (ఓలి) ఎదురుకట్నం ఇచ్చి చేసుకుంటాడని అభిప్రాయం పడుతుంది.

తిరుమాన్ తెల్లావారి మైదాన ప్రాంతంలో సంతకు తన సరకుల చేరుస్తాడు. మొదట అతని సరుకు నలభై రూపాయాలకు అడుగుతారు. కాని తిరుమాన్ అమ్మకుండా ఇంకా మంచి ధర వస్తుందనే ఆశతో ఇవ్వడు. చివరికి ఇరవై ఐదు రూపాయలకు ఆ సరకు అమ్ముతాడు. వచ్చిన డబ్బుతో కొంత ఇంట్లో సరుకులకు అయిపోతాయి. మిగిలిన ఐదు రూపాయలతో తన కూతురి బట్టలు రావని తన స్నేహితుడు దగ్గర అప్పుచేసి (పిడారి) కూతురికి మార్కెటు చీర, ఓణి కొంటాడు. తిరుమాన్ కు అప్పుచేశాననే బాధ మనస్సులో పడతాడు.

'కొల్లిమలై' ప్రాంతంలో 'ధర్మకర్త' అనే అతను ఉంటాడు. గూడెంలో ఎదైనా సమస్య ఉంటే ధర్మకర్త ముందు రోజు చాటింపు వేయిస్తాడు. గోపాల్ భార్యను 'పెరియస్వామి' అనుభవిస్తాడు. అది చూసిన గోపాల్ తనకు న్యాయం చేయాలని ధర్మకర్త దగ్గర అడుగుతాడు. ధర్మకర్త ఇద్దరిని పిలిచి విచారించినప్పుడు పెరియస్వామి తనకు ఏలాంటి సంబంధం లేదని వాదిస్తాడు. తన గురించి గోపాల్ భార్య చెప్పదులే అనే నమ్మకంతో పెరియస్వామి ఉంటాడు. కాని గోపాల్ భార్య తన భర్త మీద నమ్మకంతో తాను చేసిన తప్పును ఒప్పుకుంటుంది. అప్పుడు ధర్మకర్త పెరియస్వామిని శిక్షిస్తాడు.

ఈ కొండ ప్రాంతంలో ఉన్న ఆదివాసుల స్త్రీలుగాని, భర్తలు గాని శాశ్వతంగా ఒకరి దగ్గర ఉండరు. పిల్లలు పుట్టిన తర్వాత మరొక వ్యక్తిని చేసుకోవడం చేస్తారు. గూడెంలో తప్పు చేసి అబద్ధం అడితే పెద్దశిక్షలు అమలు చేస్తారు. పెరియస్వామి చేసిన తప్పు ఒప్పుకోవడం పెద్ద శిక్షవేస్తారు.

సడయన్, పెరియసామి, అండే ముగ్గురు స్నేహితులు. పెరియసామి గోపాల్ భార్యతో ఉన్న సంబంధాన్ని స్నేహితులతో కూడా చెప్పడు. గూడెం ప్రజలకు ప్రభుత్వం కొన్ని రాయితీలను ప్రకటిస్తుందని వాటిని తెలియ జేయడానికి సభను కొండ ప్రాంతంలో ఏర్పాటు చేసి ఆ సభలో నారింజ, నిమ్మ, ఎరువులను, పురుగుల మందు సగం ధరకే పలుకుతుందని అధికారులు మాట్లాడి వెళ్ళి పోతారు.

ధర్మకర్త ఒకరోజు కోర్టుకేసులో సాక్ష్యం చెప్పడానికి తిరుమాన్ ను పట్టణానికి తీసుకువెళ్తాడు. తిరుమాన్ తన జీవితంలో మొదటిసారిగా పట్టణం రావడంతో అక్కడ బస్సులను, రోడ్డులను చూసి భయపాడుతాడు. లాయరు ఇంట్లో కుళాయిలోంచి వేడి నీళ్ళు రావడం చూసి ఆశ్చర్య పడతాడు. సినిమాకి వెళ్ళినప్పుడు గుర్రాల సన్నివేశాన్ని చూసినప్పుడు అని తన మీద పడడానికి భయపడి బయటికి పారిపోతాడు. దాని వల్ల అతనికి జ్వరం వస్తే

డాక్టర్ సూది వేస్తానంటే భయపడి పారిపోతాడు. ఇక తను పట్టణంలో ఉండలేనని ధర్మకర్తతో ప్రాధేయపడి కొండప్రాంతానికి చేరుకుంటాడు.

కొండ ప్రాంతంలో ఒక సంవత్సరం వర్షాలు పడక, కరువు సంభవిస్తుంది. తాగడానికి చివరికి పశువులు కూడా నీళ్ళు దొరకవు. తిరుమాన్ రెండురోజులుగా పశువులను చూడడు. తన పశువులలో ఒక పశువుకు రోగం వస్తే మూలిక వైద్యంతో బాగు చేయిస్తారు. ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న 'పేడజాతర' వస్తుంది. ఆ జాతరలో యువతీ, యువకులు తమకు జంటకోసం ఒకర్ని ఒకరు వెతుకుంటారు. నచ్చిన వాళ్ళు ఎదురైతే పెండ్లి చేసుకుంటారు. పిడారి తన చూపులను 'చక్రవర్తి' అనే యువకుడి మీద పడుతాయి.

ఈ చక్రవర్తి కూడా సడయన్ మిత్రుడే. తమ ఇంటికి వచ్చినప్పుడు పిడారిని చూసి ఇష్టపడతాడు. చక్రవర్తి పిడారిని (ఓలి) ఎదురుకట్నం ఇచ్చి పెండ్లి చేసుకుంటాడు.

'శుక్ర పళ్ళన్' అనే వడ్డీ వ్యాపారి కొండప్రాంతంలో గిరిజనులకు అప్పులను వడ్డీకి ఇస్తాడు. శుక్రపళ్ళన్ తిరుమాన్ ఇంటికి వస్తాడు. శుప్రళ్ళన్ అప్పు ఉండటంతో అతను వచ్చిన సమయానికి తిరుమాన్ దగ్గర డబ్బులు ఉండకపోవడతో సతమతమౌతాడు. శుక్రపళ్ళన్ కు డబ్బులు ఇవ్వకపోతే అందమైన ఆడవాళ్ళను తన ఇంటికి తీసుకువెళ్తాడు. మళ్ళీ డబ్బులు ఇచ్చినప్పుడే వదులు తాడు. అంతవరకు అతని ఇంట్లోనే ఉండి అతని కామా కోరికలు తీరుస్తుండాలి. అతడు ఏమి చేసినా మళ్ళీ తిరిగి అడగకూడదు. తిరుమాన్ ఇంట్లో శుక్రపళ్ళన్ కళ్ళు పిడారిపై పడతాడు. ఎలాగైనా పిడారిని అనుభవించాలని అనుకుంటాడు కాని, తిరుమాన్ తన కూతురి జీవితం కాపాడాలని ధర్మకర్త దగ్గర డబ్బులు తీసుకొని శుక్రపళ్ళన్ ను ఇస్తాడు. శుక్రపళ్ళన్ అక్కడితో ఆగకుండా 'వెళ్ళయన్' కి ఇచ్చిన డబ్బులు అడుగుతాడు. ప్రస్తుతం తన దగ్గర లేదని కొన్ని రోజుల తర్వాత ఇస్తానని చెప్పినకూడా వెళ్ళయన్ భార్య 'కరమాయి'ని తన ఇంటికి తీసుకు వెళ్ళిపోతాడు. కరుమాయి ఆ సమయంలో ఆరు నెలల్ల బాలింత అయిన కనికరించాడు శుక్రన్. వెళ్ళయన్ ను అందరూ ఓదార్చుతారు. శుక్రన్ కు ఏమి అనలేక ఆ ఘోరాన్ని చూస్తూ ఉండిపోతారు గిరిజనులు. ఎలాగైనా తన భార్యను తీసుకురావాలని అనుకొని శ్రీరంగన్ సహాయంతో కొన్ని రోజులు తర్వాత తన భార్యను శుక్రపళ్ళన్ ఎత్తుకెళ్ళాడని పోలీసు స్టేషన్ లో కేసు పెడతాడు.

శ్రీరంగన్ ఉద్యమాలలో పాల్గొని జైలు కూడా వెళ్ళాడు. కాని శుక్ర పళ్ళన్ పోలీసులకు డబ్బులిచ్చి ఇద్దరికి బాగా కొట్టిస్తాడు. వెళ్ళయన్ అనవసరంగా తనవల్లే దెబ్బలు తిన్నాడని శ్రీరంగన్ బాధపడతాడు.

కొండప్రాంతంలో జరిగే ఘోరాలను తెలియ జేయడానికి శ్రీరంగన్ 'సంఘం' వాళ్ళని కలుసుకుంటాడు. దానికి వాళ్ళందరిని కలుపుకొని సంఘంగా తయారు చేయడానికి సలహాలు ఇస్తారు. ఒకరోజు ఫారెస్టు రేంజర్ అడవికి వస్తే అడవిలో మేస్తున్న పశువుల్ని చూసి వారి మీద (దండుగ) జరిమానా కట్టించుకుంటాడు. కట్టని వాళ్ళని పోలీసులకు అప్పజెబుతాడు. అలా కట్టని వారిలో సడయన్, శ్రీరంగన్, పెరియసామి. పాతకక్షల కారణంగా సడయన్, శ్రీరంగన్ ను ఒక సంవత్సరం పాటు జైలు శిక్ష విధిస్తారు. వీళ్ళని వదిలేస్తే కొండ ప్రాంతమంతా చైతన్యవంతులవుతారని పోలీసులు భావిస్తారు.

'వేలుస్వామి' అనే అతను సంఘానికి నాయకుడు. అతని సహాయంతో పెరియసామి తన భార్యను తెచ్చు కుంటాడు. వేలుస్వామి అధికారుల దగ్గర మంచి అభి ప్రాయం కలవాడు. 'సంఘం' అంటే శుక్రపళ్ళన్ కు భయం. పెరియసామి కొండ సమస్యలను వేలుసామితో వివరిస్తాడు. సంతను మైదానప్రాంతంలో జరిపితే అగ్ర కులం వాళ్ళు తమకు ఇష్టం వచ్చిన ధరలకే కొంటారు. అదే ధరకు ఇవ్వకపోతే బెదిరిస్తారు. అదే సంత కొండ మీద జరిపితే గిరిజనులకు లాభం ఉంటుందని చెప్తాడు. పెరియసామితో గిరిజనుల సమస్యలను తెలుసు కుంటాడు వేలుస్వామి.

సడయన్, శ్రీరంగన్ ఇద్దరు జైలు జీవితం గడుపు తుంటారు. తిరుమాన్ కొడుకుని చూడడానికి మధ్య మధ్యలో పోలీసుస్టేషనుకు వెళతాడు. సడయన్ మొదట జైలులో చాలా ఇబ్బంది పడిన తర్వాత అలవాటు చేసు కున్నాడు. శ్రీరంగన్ కు జైలుజీవితం కొత్తకాదు. జైలులో వీరిద్దరికి 'కుమార్' అనే సంఘ నాయకుడు పరిచయం అవుతాడు. అతని దగ్గరే అక్షరాలు నేర్చుకుంటారు. కుమార్ కి వేలుస్వామి ద్వారా వీరిద్దరూ పరిచయం అవుతారు. కొన్నిరోజుల తర్వాత జైలు నుంచి విడుదల అవుతారు.

సడయన్, శ్రీరంగన్ ఎలాగైన సంతను కొండమీదకు జరిపితే గాని తమకు న్యాయం జరుగుతుందని లేదంటే తమ కష్టం దళారులకు చెందుతుందని అనుకొని సడ యన్ మిత్రులతో గిరిజనుల ప్రాంత ప్రజలను చైతన్యం చేయాలని అన్ని గిరిజన ప్రాంతాలకు తిరిగి తమపై జరుగుతున్న మోసాలను, దౌర్జన్యాలను వివరిస్తూ అంద రినీ ఏకతాటిపైకి తీసుకురావాలని ప్రయత్నిస్తారు. సడ యన్ చేస్తున్న పనులు అధికారులకు తెలియడంతో తిరుమాన్ అరటితోటను ధ్వంసం చేస్తారు ఇదంతా తమకే కష్టం వస్తుందని తిరుమాన్ కన్నీరు కారుస్తాడు. కొడుకు వల్లే ఇదంతా జరిగిందని తిడతాడు. అయినా సడయన్ లెక్కచేయకుండా తన కర్తవ్యమే ముఖ్యమని అను కుంటాడు.

చివరికి కొండమీద సంతను ఏర్పాటు చేస్తారు. వేలు స్వామి ద్వారా కలెక్టర్ స్వయంగా సంత ప్రారంభోత్సవానికి వస్తున్నాడని, అధికారులు తమకు సంతను ఏర్పాటు చేయకుండా బాధలను పెడుతున్నారని వాటన్నింటిని తట్టుకోవాలని కొండ ప్రజలకు సంఘనాయకులు చెబు తారు.

తాము అనుకున్నట్లే కొండ నాయకులు సంతని కొండపై జరుపుతారు. కలెక్టర్ బోణి చేస్తాడు. పోలీసుల సహాయంతో అక్కడ సంతను సిద్ధం చేస్తారు. వెంటనే భూస్వాములు భూ ఆక్రమణ కార్యక్రమం చేపడతారు. సడయన్ గాంధీమార్గంలో రిలే నిరాహారదీక్ష చేస్తాడు. అటవీ అధికారులు గిరిజనుల భూములలో తమ జెండాను పెడతారు. చివరికి తిరుమాన్ పొలంలో కూడా జెండా నాటేసరికి తిరుమాన్ తమకు తరతరాల నుంచి వస్తున్న భూములు, అవి ఎట్లా ప్రభుత్వానిది అవుతుందని ప్రశ్నిస్తాడు. ఎంత కాళ్ళా వేళ్ళా పడినా ఆ భూములు ప్రభుత్వానివేనంటూ మాట వినకుండా చెట్లు నరికే యండి? అని కూలీలను పంపుతారు. వెంటనే కొడవలితో తిరుమాన్ కూలీల ముందుకెళ్ళి "ఒరేయ్! నన్ను చంపిన తర్వాతే ఆ చెట్టు మీద గొడ్డలేయాలి. ఇంకో దెబ్బ చెట్టు మీద వేశారంటే మీ తల నేలమీద దొర్లుతుంది జాగ్రత్త" అని అరుస్తాడు. అక్కడే ఉన్న కొండ ప్రజలను తిరుమాన్ కి ఇంత ధైర్యం ఎలా వచ్చిందని అనుకుంటారు. తిరు మాన్‌ని పోలీసులు వ్యానులో ఎక్కిస్తారు. తిరుమాన్ పొలం జప్తు చేయడానికి వచ్చినప్పుడు శ్రీరంగన్ నాయకత్వంలో గిరిజనులందరూ ఏకం అవుతారు. ఈ భూమి మాత్రమే కాదు. ఈ పర్వత ప్రాంతాలన్నింటినీ సాధించటం మీ సాధ్యం కాదని చెప్తాడు శ్రీరంగన్. గిరిజనులు ఏకం అవడం చూసి అధికారులు భయంతో వెనకడుగేస్తారు. సడయన్ అధికారులు పాతిన జెండాలను పీకేస్తాడు. ఇదంతా చూస్తున్న తిరుమన్ మనసులో సంతోషంతో తనను బంధించిన సంకెళ్ళు అతనికి ఎండుటాకుల్లా తోచాయని, తన కొడుకు వల్లే తనపొలం మిగితా గిరి జనుల పొలాలు దక్కాయని అనుకుంటాడు. ఈవిధంగా గిరిజనుల పట్ల ప్రభుత్వాధికారుల తీరును ఈ నవలలో ప్రస్తావించారు రచయిత చిన్నప్పభారతి.

ఆదివాసుల - ఆచార సంప్రదాయాలు :

ఈ 'సంఘం' నవలలో కొలిసులై ప్రాంతం ఆదివాసు లకు కొన్ని ప్రత్యేకమైన ఆచారాలు కలిగి ఉన్నాయి.

పేడజాతర :

ఈ జాతర ఆదివాసులు వర్షాలు పడినప్పుడు ప్రకృతిని ఆరాధించి యువతీ, యువకులను ఒకటిగా చేసి మట్టి బానను తీసుకుని ఆడుతూ, పాడుతూ ఇంటింటికీ వెళ్ళి అంబలిని సేకరిస్తారు. ఆ అంబలి బానను తెచ్చి గుడి ముందు వుంచి దానిలో ఉప్పు వేయకుండా అందరూ

తాగుతారు. అందరూ బయలుదేరి గంపలు గంపలుగా పేడను తెచ్చి వినాయకుని విగ్రహం కనబడకుండా దానిపైన పేడను దట్టిస్తారు. వర్షం కురవలేదనే తమ ఆగ్రహాన్ని వ్యక్తీకరించటానికి వారు పీఠం నుండి పేడను గట్టిగా విసురుతారు. అమ్మాయిలు గొబ్బిళ్ళు తడుతూ వినాయకుని చుట్టూ తిరుగుతూ పాడుతారు. అంతే కాకుండా యువతి, యువకులు నిలబడి తమకు నచ్చిన వ్యక్తిని పెళ్ళి చేసుకునే అవకాశం కూడా ఉంటుంది. పిడారి, చక్రవర్తి వివాహం ఇలానే జరుగుతుంది.

అంతేకాకుండా గిరిజన ఆచార సంప్రదాయాలు దాటితే శిక్షలు కఠినంగా ఉంటాయి. ''ఏరువాక ముహూర్తం రోజు'' ఎవరైనా కట్టుబాట్లు అతిక్రమిస్తే శిక్ష పడుతుంది. తిరుమాన్ తన చేను కందన్ పాలంలో ముళ్ళు నరికి నిప్పుపెట్టి కాల్చిండని జరిమానా విధిస్తారు. అలాగే 'కాళి' భార్య పొన్నమ్మ ప్రసవ సమయంలో బిడ్డ పుట్టడానికి ఇబ్బందయితే, పెళ్ళి కాకముందు ఆ పొన్నమ్మ మరొక వ్యక్తితో లైంగిక సంబంధం కలిగి ఉందని అందుకే కాన్పు కావడంలేదని గ్రహించి తిరిమి పొన్నమ్మను ప్రశ్నిస్తే అప్పుడు ఆ వ్యక్తి పేరు చెప్పేసరికి ప్రసవం జరుగుతుంది. ఇటువంటివారికి శిక్షలు కూడా వేస్తారు.

ఈవిధంగా తమ ఆచార కట్టుబాట్లను అతిక్రమిస్తే వారికేదో కీడు సంకిస్తుందని భావిస్తారు. కాబట్టి తప్పు చేసినవారికి శిక్షలు కఠినంగా ఉంటాయి.

ముగింపు :

ఈ విధంగా 'సంఘం' నవలలో గిరిజనుల జీవనశైలిని రచయిత వివరించారు. ప్రభుత్వాధికారుల వల్ల వారు ఎన్ని కష్టాలు అనుభవించారో తెలియజేశారు. వారి ఆహారపు అలవాట్లు, కట్టుబాట్లు, ఆచార సంప్రదాయాలు అన్ని కూడా 'కొల్లిమలై' ప్రాంత గిరిజన జీవితాలను రచయిత కళ్ళకు కట్టినట్లుగా చూపించారని చెప్పవచ్చు.

ఉపయుక్త గ్రంథాలు :

1. 'సంఘం' నవల - చిన్నప్ప భారతి.
2. తెలుగు నవలావికాసం - మొదలి నాగభూషణ శర్మ.
3. ఆధునిక సమాజంలో గిరిజన భాష - సంస్కృతి - భుక్యా తిరుపతి.
4. తెలుగు కథ సాహిత్యం - గిరిజన జీవితం - జి.సైలమ్మ.

తెలుగు గిరిజన సంస్కృతి – సాహిత్యం

– దొడ్డి శ్రీదేవి, పరిశోధక విద్యార్థి, తెలుగు & ప్రాచ్యభాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

భారతదేశం విలక్షణ సంప్రదాయాలకు సంస్కృతీ, సంపదకు భిన్న భిన్న ఆచార వ్యవహారాలకు పుట్టిల్లు. ప్రతీరాష్ట్రానికి ఒక ప్రత్యేక వస్త్రధారణ, ప్రత్యేక పండుగలు, ప్రత్యేక ఆహార పద్ధతులు ఉంటాయి. అయినా ఇన్ని రకాల పద్ధతుల్లోనూ అంతర్లీనంగా పూలమాలలో దారంలా ఒక ఏక రూపత ఉంటుంది. అది మన భారత దేశం యొక్క గొప్ప విశిష్టత. అలాంటి విలక్షణమైన సంస్కృతీ, సంప్రదాయాలకు నెలవు అయిన వారిలో ఒకరు గిరిజనులు. వీరిలో ఎన్నో ఆసక్తికరమైన అంశాలుంటాయి. వారు చేసే ప్రతీ పనిలో సంప్రదాయం తొంగి చూస్తుంది. అందులో ఏదో ఒక అర్థం పరమార్థం దాగి ఉంటుంది.

సంస్కృతి అనేది ఒక తెగ, ప్రాంతం, జాతికి సంబంధించిన జీవన విధానం. గిరిజనులు ఎక్కువగా అటవీ - కొండ ప్రాంతాల్లో నివశించడం, వారి ప్రాంతాలకు ఈ మధ్య వరకు బయటి ప్రాంతాలతో ఎక్కువగా సంబంధాలు లేకపోవడం వలన వారికంటూ ఒక ప్రత్యేక జీవన విధానం మనుగడలో ఉండడానికి ఆస్కారం ఏర్పడింది. వారిది ప్రకృతితో ఉన్న సంబంధాల ఆధారంగా తరతరాల అనుభవాలతో తయారైన సంస్కృతి.

సంస్కృతి ఒక జీవనదిలాంటిది. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే విధంగా ఉంటుంది. వారి జీవన విధానం, వేషధారణ, భాష, సంప్రదాయాలు, పండుగలు ప్రత్యేకంగా ఉంటాయి. అడవులలో ఉండే ప్రకృతి సౌందర్యం ఒక ఎత్తైతే అక్కడ నివశించే కోయ, కొండరెడ్లు, గుత్తికోయ, గోండులాంటివారి జీవన విధానం అబ్బురపరుస్తూ ఉంటుంది.

ఆధునిక సమాజ గతకాలపు ఆనవాళ్ళు గిరిజనులు సమిష్టి జీవన పద్ధతులు, సహజీవనం, పారదర్శకతకు నిలువెత్తు సాక్షులువీరు. బ్రతుకు పోరాటంలో అరితేరిన వారు గిరిజనులు. లింగ వివక్షతలేని స్వచ్ఛమైన సంప్రదాయాలు గిరిజనుల ప్రత్యేకత.

ఒక ప్రాంత ప్రజల యొక్క సంస్కృతి, సాంప్రదాయాలు, వారి యొక్క జీవన విధానాన్ని గూర్చి తెలుసుకోవాలంటే ముందుగా ఆ ప్రజలు నివసిస్తున్న ప్రాంతం యొక్క చారిత్రక, భౌగోళిక ప్రాధాన్ని గురించి తెలుసుకోవడం ఎంతైన అవసరం. ఎందుకంటే ఆ ప్రాంత పరిస్థితులు అక్కడ నివశిస్తున్న ప్రజలపై ఎంతో ప్రభావాన్ని చూపుతాయి. అదేవిధంగా మన తెలుగు రాష్ట్రాలలో గిరిజనుల సంస్కృతి - సంప్రదాయాలు వారి జీవన విధానంపై నివశిస్తున్న ప్రాంతాల ప్రభావం ఉంటుంది. మన తెలుగు రాష్ట్రాలలోనే సుమారు 35 గిరిజన తెగల వాళ్ళు నివసిస్తున్నారు. ఈ గిరిజన తెగలలో ఒక్కొక్క తెగకు వివిధ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, వివాహపద్ధతులు, పండుగలు, ఉత్సవాలు, వేషధారణ ఒక్కొక్క విధంగా ఉంటాయి. ఎవరి సంప్రదాయం వారిదే. ఏ గిరిజన తెగ సంస్కృతి, సంప్రదాయాన్ని చూసినదేనికదే వాటి వాటి ప్రత్యేకతను సంతరించుకుని ఉంటాయి. ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాలలో చూసినట్లయితే అటవీ ప్రాంతంలో నివశించే గిరిజనుల యొక్క ఆచార వ్యవహారాలు, మైదాన ప్రాంత గిరిజనుల కంటే భిన్నంగా ఉంటాయి. ఉదాహరణకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పు గోదావరి జిల్లా అటవీ ప్రాంతంలో నివశిస్తున్న గిరిజనులను చూసినట్లయితే అక్కడ ఎక్కువగా గిరిజన తెగలలో ఒక తెగ అయినటువంటి కొండదొరలు నివశిస్తుంటారు. అలాగే మరొక తెగ అయిన కొండరెడ్లు కూడా ఎక్కువగానే జీవనం సాగిస్తూ ఉన్నారు. ఈ గిరిజన తెగలు ఇప్పటికీ వారివారి సంస్కృతి - సంప్రదాయాలను కాపాడుకుంటూనే ఉన్నారు.

గిరిజనుల జీవన విధానం :

గిరిజనులకు వ్యవసాయమే ప్రధాన వృత్తియైనా,

తమకు కావలసిన వస్తువులను తయారు చేసుకోవడం లోను, సమకూర్చుకోవడంలోను వీరికి వీరేసాటి. వ్యవసాయ పనిముట్లతో ఇతరుల మీద ఆధార పడకుండా స్వంతంగా తయారు చేసుకోవడం వీరి ప్రత్యేకత. వివిధ రకాల పంటలు పండించటానికి కొండపోడు మీద ఆధార పడినప్పటికి వర్షాధారిత పంటలను కూడా పండిస్తున్నారు. వాగులు, వంకలు, సెలయేళ్ళు నీరు వృధాగా పోనివ్వకుండా అడ్డుకట్టలు వేసుకొని ధాన్యం పండిస్తున్నారు. అధునాతన పద్ధతులు, ఎరువులు వాడకుండా సేంద్రీయ పద్ధతుల ద్వారానే పంటలు పండించి తమ ఆరోగ్యాలను కాపాడుకుంటున్నారు.

కొండ దొరలు :

"దొర" అంటే అధిపతి అని అర్థంకాదు. కొండ ప్రాంతంలో నివశించే ఆదివాసులు ఎక్కువగా ఒక ప్రాంతంలో నివశించేటట్లైతే తామే 'దొర'లమని సంభోదించుకుంటారు. కొండదొరలు అందరి కంటే తామే అధికులమని మిగతా తెగల వాళ్ళందరూ వీరి కంటే తక్కువ వారని భావిస్తున్నారు. వీరు సంగీత ప్రియులు. సంగీతం వారి జీవన విధానంలో ఓ భాగం. వారు తమ సంగీత వాద్యాలతో పండుగలు, ఉత్సవాలు, చావులు జరుపుకుంటారు. అందరూ ఒకే రకమైన సంగీత వాద్యాలను ఉపయోగిస్తారు. వారికి కావలసిన సంగీత వాద్యాలను వారే తయారు చేసుకుంటారు. కిరిడి, డప్పు, డోలాకు (మృదం), తాళాలు, తుడుంగం, నగరాలు, వేణువు, సన్నాయి, అందెలు మొదలైనవి.

కొండ దొరల జీవన విధానం :

కొండదొరల ముఖ్య జీవనాధారం వ్యవసాయం. అదే పోడువ్యవసాయం. ఇంకా అటవీ ఉత్పత్తుల సేకరణ ద్వారా జీవనాన్ని కొనసాగిస్తారు. వీరు పండించే ప్రధాన పంటలు కొర్రలు, సామలు, జొన్నలు మొదలైనవి. వీరు ప్రతీ పంటకి పండుగ చేసుకుంటారు. సంగీత వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ గ్రామంలోని వారంతా ఆడ, మగ, పిల్లలు అనే తేడా లేకుండా అందరూ కలసి ఈ పండగలో పాల్గొంటారు. కొండ దొరలు తాము కొండరెడ్ల కంటే మిగతా గిరిజన తెగల అందరి కంటే తామే ఎక్కువ వారమని అనుకుంటారు.

కొండ రెడ్లు :

కొండ రెడ్లు అనడంలో వీరికి మైదాన ప్రాంత రెడ్లతో ఏమాత్రం సంబంధం లేదు. వీరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పు గోదావరి జిల్లాలోని గిరిజన తెగకు సంబంధించిన అనాదిగా ఉంటూ వస్తున్న ఆదివాసీలు ఈ కొండ రెడ్లు. వీళ్ళు పాండవులను పూజిస్తారు. కాబట్టి తమ పేర్లను 'పాండవ రెడ్లు' అని 'రాజ రెడ్లు' అని పిలుస్తారు. వీరికి ప్రత్యేకమైన భాష అంటూ ఏమి లేదు. కొండ భాష యాసలోనే తెలుగు భాషను మాట్లాడతారు. వీరు ఆహారాన్వేషకులుగా, వేటగాళ్ళుగానే జీవిస్తున్నారు. కొండ రెడ్లు పర్వత ప్రాంతాల్లోను, గోదావరి నదిలోయల్లోను నివశిస్తున్నారు. గోదావరి నది పరివాహక ప్రాంతాలలో నివశించే వారి సంఖ్య ఎక్కువ. సామాజికంగా తోటి గిరిజన తెగ కోయవారి కన్నా తామే అధికులమని భావిస్తారు.

కొండ రెడ్ల జీవన విధానం :

కొండ రెడ్ల ముఖ్య జీవనాధారం వేట. దీనితోపాటు వ్యవసాయం కూడా చేస్తారు. వీరు చేతి వృత్తి పనివారు కూడా. చేటలు, బట్టలు, తట్టలు, చీపుర్లు, తయారు చేసుకుని వారం వారం జరిగే సంతల్లో తమకు లభించిన వస్తువులను విక్రయించి వాటికి బదులుగా తమకు కావలసిన వస్తువులను తెచ్చుకుంటారు. కొండరెడ్లు శారీరకంగా బలంగా ఉంటారు. సగటు ఎత్తుతో ఉంటారు. స్త్రీలు సన్నగా, పొట్టిగా ఉంటారు. ఒకప్పుడు పురుషులు (గిరిజనులందరు) గోచీలు మాత్రమే ధరించేవారు. ప్రస్తుత కాలంలో ధోవతలు, చొక్కాలు ధరిస్తున్నారు. స్త్రీలు రవికలు వేసుకొనేవారు కాదు. చీరను చుట్టుకునేవారు. ఇప్పుడు రవికలు వేసుకోవడం అలవాటు చేసుకున్నారు. కొండ రెడ్ల స్త్రీలు అల్యూమినియం, ఇత్తడి ఆభరణాలు ధరిస్తారు. కాలానుగుణంగా వీరిలో మార్పులు వచ్చాయి. ప్రభుత్వాలు ఎన్నో సంవత్సరాల కృషివల్ల విద్యను అభ్యసించి ఉద్యోగాలను సంపాదించి గిరిజనేతరులతో

పరిచయాలు ఏర్పడి ప్రస్తుతం పట్టణ నాగరికతను అవలంభిస్తున్నారు.

కొండ రెడ్ల వివాహవ్యవస్థ :

కొండ రెడ్లలో వివాహం మూడు రకాలుగా జరుగుతుంది. సాంప్రదాయ సిద్ధమైన పూజారిని వీరు 'దేసరి' అంటారు. 'దేసరి' మరియు వరుని తండ్రి, కొంత మంది కుల పెద్దలు అమ్మాయి ఇంటికి వెళ్ళి వివాహం కుదుర్చుకుంటారు. చోడిపిండితో చేసిన 'మడ్డికల్లును' అమ్మాయి ఇంటికి బహుమతిగా తీసుకువెళ్తారు. దీపావళి పండుగతో ప్రారంభమైన వివాహ సన్నాహాలు సంక్రాంతి రోజుల వరకు కొనసాగి సంక్రాంతి రోజుల్లో వివాహం జరుగుతుంది. వరుని తండ్రి మడ్డికల్లు, పంది, కొంత బియ్యం, వెదురుపెట్టె దానిలో గాజులు, పూసలు, కొన్ని సంగీత వాయిద్యాలు తెస్తాడు. వధువు పెళ్ళి కుమారుని ఇంటికే వివాహానికి వెలుతుంది. వివాహం పూజారి అయినటువంటి 'దేసరి' పర్యవేక్షణలో జరుగుతుంది. ఆ రోజు పెళ్ళికి వచ్చిన వారందరికి మడ్డికల్లు, మాంసాహారపు విందును ఏర్పాటు చేస్తారు. తల్లిదండ్రులు కుదిర్చే ఈ వివాహం మొదటి రకం వివాహం. ఇందులో 'ఓలి' ఉంటుంది. ఓలి అంటే కన్యాశుల్కం. ఆ ఓలిని వధువు తండ్రికి ఇస్తారు.

రెండవ రకం వివాహాన్ని తెచ్చుకోవడం లేదా ఎత్తుకు పోవడం అంటారు. వధూవరుల వివాహానికి తల్లి దండ్రులు అంగీకరించకపోతే ఈ రెండవ రకం వివాహం జరుగుతుంది. దీనికి సామాజిక అనుమతి లభించాలంటే అబ్బాయి తండ్రి అమ్మాయి తండ్రికి 'ఓలీ' ఇవ్వాలి.

మూడవ రకమైన వివాహం సేవా వివాహం. దీన్ని మనం ఇల్లరికం అంటాం. సాధారణంగా పెళ్ళి కుమారుడు ఓలి ఇవ్వలేని పరిస్థితిలో ఉంటే కొన్నాళ్ళు అతడు ఆ అమ్మాయి ఇంటిలో ఉండి సేవ చేసి వారి మెప్పును సంపాదించుకుని వివాహం చేసుకుంటాడు.

కొండ రెడ్ల మతం :

మత సంబంధమైన నమ్మకాలు ఆదివాసులందరికి ఎక్కువే. కొండ రెడ్లు ప్రకృతి ఆరాధకులు. కొండరెడ్లు ప్రకృతి గత చెట్లను గూర్చి ఈ విధంగా పాడతారు.

రెలా రెలా రెలా, రెలా, రెలా రెలా, రెలా రెలా,
చింత చెట్టు వనమూలాన, పువ్వేనువన్న నాగదరిలోన
ఈ పువ్వు ఎవరన్న సాంగిరెడ్డన్న నాగదరిలోన.....

పాటంత చింతచెట్టు, తాటిచెట్టు, చిక్కుడుచెట్టు, మామిడిచెట్టు, ఈతచెట్టు - వాళ్ళ జీవితాలలో పెనవేసుకున్న చెట్లు అని పాడుకుంటారు.

వీరికి ఎన్నో రకాలైన పౌరాణిక కథలు, జీవితంలో ముడిపడి ఉన్నాయి. వీరు గంగమ్మతల్లి, భూదేవి, ముత్యాలమ్మ, కొండతమ్మరాజులను కొలుస్తారు.

పోడు వ్యవసాయం :

గిరిజనులకు వ్యవసాయమే ప్రధాన వృత్తి. వీరు చేసే వ్యవసాయం పోడు వ్యవసాయం. అడవిలో కొంత భూభాగాన్ని చదునుచేసి వ్యవసాయం చేయడం పోడు వ్యవసాయం. వీరు ముఖ్యంగా వ్యవసాయాధార పంటలైన జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు మొదలైన పంటలు పండిస్తారు. పంటలు పండించడానికి ఆధునిక పద్ధతులు, ఎరువులు వాడకుండా సాంప్రదాయ పద్ధతిలోనే వ్యవసాయం చేస్తారు.

ముగింపు :

ఈ విధంగా మన భారతదేశం సంస్కృతీ, సంప్రదాయాలకు నిలయమైనప్పటికి గిరిజనుల విషయంలో ప్రత్యేక స్థానం సంతరించుకుంది. గిరిజనుల యొక్క భాష, యాస, కట్టు, బొట్టు, ఆహారం, ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలు వేటికవే ప్రత్యేకతను చోటు చేసుకున్నాయి. ఏది ఏమైనప్పటికి గిరిజనుల జీవన విధానశైలికి, మైదాన ప్రాంత ప్రజల జీవన విధానానికి నేటి ఆధునిక కాలంలో మార్పు ఉన్నప్పటికి సాంకేతిక పరిజ్ఞానం మెరుగు పడుతున్న కాలంతోపాటు గిరిజనులలో నేటి తరంవారిలో కొంత మంది విద్యావంతులు కావడం ఆనందకరమైన విషయమేనని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

గిరిజనుల కళారూపాలు – పరిచయం

– నలసాని శ్రీలత, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం జిల్లా,

నేడు లలిత కళలుగా పిలువబడుతున్నకవిత్వం, సంగీతం, నాట్యం, చిత్ర లేఖనం, శిల్పం అనే కళా రూపాలు ప్రాచీనకాలం నుండే ప్రజా కళలుగా వర్ధిల్లా యని చెప్పవచ్చు. వీటిలో శిల్పకళ అనేది రాజుల పోషణలో జీవం పోసుకున్నదన్న విషయం అందరికి తెలిసిందే. కాబట్టి ఈ లలితకళలుప్రజల సామాజిక జీవితానికి దర్పణం పడుతూ సాంస్కృతిక చైతన్యానికి ప్రతీకలుగా నిలిచాయి. ప్రపంచంలోని ఏ ప్రాంతంలోని కళలైనాప్రధానంగా రెండు రకాలుగా ఉంటాయి. అవి 1) ప్రజాకళారూపాలు, 2) సాంప్రదాయ కళారూపాలు. ప్రస్తుతం ఈ వ్యాసంలో చర్చనీయాంశం గిరిజన కళా రూపాలు కాబట్టి ఈ కళా రూపాలు ప్రజా కళారూపాల్లో భాగంగానే గుర్తించవచ్చు. తెలుగునాట గిరిజన కళా రూపాల పుట్టుక వికాసానికి సంబంధించిన విషయంలో తెలుగు రాష్ట్రాలలో ఒకటైన తెలంగాణకుఒక ప్రత్యేకత ఉంది. ఈ దృష్టితో పాట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం వారు వరంగల్‌లో గిరిజన-జానపద పీఠాన్ని ఏర్పాటు చేసినట్లుగా భావించవచ్చు.

సాధారణంగా ఈ కళారూపాలు శ్రమనుండి పుడ తాయి. శ్రమజీవన సౌందర్యంలో ఆరాటం, పోరాటం అనే అంశాలు ప్రధాన భూమికను పోషిస్తాయి. 'డార్విన్' అన్నట్లు జీవన పోరాటంవల్లనే నాగరికత ఉనికి, మనుగడ ఉంటుంది. మిగతా ప్రాంతాలతో పోలిస్తే, తెలుగు ప్రాంతాల్లో ఈ పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయి. అందు వల్ల ఇక్కడ బతుకు, ఆరాటం, పోరాటం అనే సంఘర్షణ చారిత్రకయుగంనుండి కనిపిస్తుంది. ఇదే ఇక్కడి గిరిజన కళారూపాల్లో ప్రతిఫలించింది. దీని ప్రభావం సంప్రదాయ కళలపై కూడా ప్రబలంగా ఉంది. ఈ కారణం చేతనే ఇక్కడి కళారూపాలన్నీ ప్రజా కళారూపాలుగా వర్ధి ల్లాయన్నది చారిత్రక సత్యం.ఈ విషయాన్నే''నేను చిందు యల్లమ్మను"అనే గ్రంథంలో డా?కె. ముత్యం ఇలా వ్యక్తం చేశారు. ''ఏ కళారూపమైనా సమాజ ఆమోదాన్ని గుర్తింపునూ సంతరించుకోవాలంటే దానికి ఓ సుదీర్ఘ చరిత్ర, ప్రత్యేక నేపథ్యాలు కారణంగా ఉండాలి. ఇలా ఏ కళారూపమైనా తలెత్తడానికి భౌతిక పరిస్థితులు, పరిసరాల నేపథ్యాలతోబాటు వ్యక్తీకరణ అవసరాలేవో బలంగా ముందుకు రావాలి. ఆనాటి ప్రజల సాహిత్య, కళారంగాల అవసరంగా కళారూపం రూపొందుతుంది" అన్నారు.

క్రీ.శ.13వశతాబ్దంనుండి ఈ కళారూపాలు నిర్వహించిన పాత్రకు సంబంధించిన ఆనవాళ్లు పాల్కురి సోమనాథుని రచనల్లోనూ, విద్యానాథుని ప్రతాపరుద్రయశోభూషణం అలంకార గ్రంథంలోనూ, జాయపసేనాని నృత్త రత్నావళి, క్రీడాభిరామం రూపకం, సుగ్రీవ విజయం అనేయక్షగానం ఇత్యాది గ్రంథాల్లో కనిపిస్తాయి. వీటిని చారిత్రక పరిణామ క్రమంలో లోతుగా పరిశీలిస్తే ఒకప్పుడు ప్రకృతి అనుకరణరూపాలుగా పురుడుపోసుకున్న ఈ కళా రూపాలు సామాజిక జీవిత ప్రతిఫలన రూపాలుగా ప్రజా చేతనకు చేసిన దోహదం ఎంత అమూల్యమైందో వ్యక్త మవుతోంది.

ఈ దృష్టి కోణంలో గిరిజన కళారూపాలను పరిశీలించ వలసి ఉంది. అయితే ఇప్పుడు గిరిజన కళారూపాలు అని చెప్పుకుంటున్న వాటి ఆవిర్భావ వికాసాల వెనుక సామాజిక పరిణామాల నేపథ్యం ఉంది. కాబట్టి వాటి చారిత్రక వాస్తవాన్ని మనం గుర్తించాలి. నేడు సామాజిక అనుకరణ రూపాలుగా వుంటున్న కళలన్నింటికి మూలం 'అరిస్టాటిల్' అన్నట్లు ప్రకృతి అనుకరణ రూపాలైన కళలే. కాబట్టి ఈనాటి నాగరిక కళారూపాలన్నీ ఆదిమ సమా జంలో గిరిజన కళారూపాలుగా ఆవిర్భవించి, మనిషి గ్రామ జీవితాన్ని రూపొందించుకున్న తరువాత శ్రమలో

భాగంగా జానపద కళారూపాలుగా రూపాంతరం చెంది, నేడువిశ్రాంతవర్గ కళా రూపాలుగా విస్తరించాయని చెప్పవచ్చును.అయితే ఈ విధమైన పరిశీలనకు ఈ వ్యాస పరిధి సరిపోదు. పరిశోధనాంశంగా కృషి చేయవలసి ఉంది. ఈవ్యాసం కేవలం గిరిజన కళా రూపాల పరిచయం వరకే పరిమితమని తెలియజేస్తున్నాను.

గిరిజన కళారూపాలు :

ఆంధ్ర దేశంలో అటు రాయలసీమ నుండి ఇటు ఇచ్ఛాపురం వరకూ అన్ని ప్రదేశాల్లోనూ కలిపి మొత్తం ముప్పై ఎనిమిది గిరిజన జాతులున్నాయనీ, వీరి జనాభా పదమూడు లక్షలనీఅంచనా. వీరు వివిధ సందర్భాలలో వివిధ కళారూపాలను ప్రదర్శిస్తుంటారు. సాధారణంగా కష్టజీవులైన గిరిజనులకు, ఈ కార్యక్రమాలు అంతులేని ఆనందానిస్తాయి.వీరురెండు తెలుగు రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాలలో ప్రదర్శించే కళా రూపాలలో కొన్నింటిని ఈ వ్యాసం ద్వారా పరిచయం చేయదలిచాను.

థింసా నృత్యం :

గిరిజనుల సాంప్రదాయ నృత్యాలలో థింసా నృత్యం ప్రసిద్ధమైనది. దీనిని అరకులోయలో నివసిస్తున్న గిరిజనులు, ముఖ్యంగా విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతాలలోని గిరిజనులు సామూహికంగా నర్తించే నృత్యంగా చెప్పవచ్చు. వాల్మీకులు, బగతలు, కోటియా, ఖోండ్, కోలాములు, మూఖ దొరలు లాంటి సుమారు 18 తెగలకు చెందిన గిరిజనులు ఈ సంప్రదాయ నృత్యంలో పాల్గొంటారు.

వృద్ధులూ, యువకులూ, ధనికపేద అనే తేడా లేకుండా, అన్ని వర్గాల వారు థింసా నృత్య కార్యక్రమాలలో పాల్గొంటారు. థింసా నృత్యం అందరినీ అలరించడమే కాక, గ్రామీణ ప్రజల మధ్య సఖ్యతనూ, సుహృద్భావాన్ని పెంపొందిస్తుంది. థింసా నృత్యాన్ని చైత్రపర్వంలోనూ, వివాహ సమయంలోనూ, పండుగ పర్వదినాలలోనూ ప్రదర్శిస్తారు. థింసా నృత్యంలో విలక్షణమైన, సంగీత వాయిద్యాలున్నాయి. తుండి, మోరి, డప్పూ మొదలైన సాంప్రదాయ వాయిద్యాల సహకారంతో లయ బద్ధంగా సాగుతుంది. ఈ నృత్యంలో కళాకారుల్ని ఉత్తేజ పర్చటానికి మధ్య మధ్యలో జోడు కొమ్ము బూరలను ఊదుతారు. స్త్రీ పురుషులందరూ సాంప్రదాయకమైన ఆభరణాలు ధరించి, రంగు రంగుల దుస్తులను అలంకరించుకుని నృత్యానికి హాజరవుతారు. థింసా నృత్యంలో ఎనిమిది రకాలున్నాయి.ఇక కోయలు, బగతలు, వాల్మీకులు, కోలాములు, నాయక పోడులు, కోటియాలు, మూఖ దొరలు మొదలైన గిరిజనజాతులు కూడా పోడు వ్యవసాయం ద్వారా, అదనపు ఆదాయాల కోసం ప్రయత్నిస్తారని డి.ఆర్. ప్రతాప్ గారు వ్రాశారు. అలా గిరిజనులు జీవిత విధానాలను సాగించుకుంటూ ఆనందం కోసం, నృత్యాలకు వాయిద్యాలను జోడించి ఎన్నో కళా రూపాలను సృష్టించుకున్నారు.

గోండుల గుసాడి నృత్యం :

అదిలాబాదుజిల్లా గోండులకు దీపావళి పెద్దపండుగ. ఈ పండుగ చలికాలం ప్రారంభంలో వస్తుంది.అప్పటికే పంటలన్నీ చేతికి వచ్చి వుంటాయి. తాము చెమటోడ్చి చేసిన కష్టం, ధాన్యం లక్ష్మిగా నట్టింటచేరి వుంటుంది. గోండులందరూ ఆటపాటలతో కాలక్షేపం చేసే రోజులు ప్రారంభ మౌతాయి. రకరకాల వస్త్రాభరణాలు వేసుకుని యువజనులు సంగీత వాయిద్యాలతో అతిథులుగా పొరుగు గ్రామాలకు తరలివెళతారు. కొమ్ములూదుతూ, తప్పెట్లు వాయిస్తూ యాత్రలు సాగిస్తారు. గోండుల పురాణ గాథలలోని దండారియారౌడ్, సిసిసెర్మారౌడ్ అనే కథా నాయకులను అనుసరిస్తూ ప్రతి సంవత్సరం నృత్యాలు చేస్తారు. గోండు యువకులు 20 నుంచి 40 మంది దాకా చేరి చేసే దండారీ నృత్యంలో గుసాడి నృత్యం ఒక భాగం. గుసాడి నృత్యంలో ఎందరైనా పాల్గొనవచ్చు. దీపావళి నెలలో సాంప్రదాయకమైన ఈ గుసాడినృత్యం జరుగుతుంది, పౌర్ణమినాడు ఈ కార్యక్రమం ప్రారంభమై చతుర్దశి వరకు జరుగుతుంది. గుసాడి నర్తకునికి కావలసిన సామగ్రిలో ముఖ్యమైనది నెమలి పించంతో

తయారు చేసిన తలపాగా. ఇందులో గొర్రెపోతు కొమ్ములను కూడా అమర్చుతారు. కృత్రిమ గడ్డాలు మీసాలతో వేషం కడతారు. మేకతోలు కప్పుకుంటారు. ఇక వాయిద్యాలు, డప్పు, తుడుము, పీక, బాక, కలికొయ్ (తప్పెట) మొదలైనవి వాద్య బృందానికి హుషారు నిస్తాయి. సంగీత వాయిద్యాలను, గుసాడి నృత్య పరికరాలను గోండులు పరమ పవిత్రంగా భావిస్తారు. నాట్యారంభానికి ముందు వాటికి పూజ చేస్తారు.

దండారి కోలాట నృత్యం :

దండారి నృత్యాన్ని గుసాడి నృత్యంలో భాగంగానే చెప్పవచ్చు. దండారి నృత్యం చేస్తున్న బృంధంలోకి గుసాడి బృందం అకస్మాత్తుగా ప్రవేశిస్తారు. గోండుభాషలో గుసాడి అంటే 'అల్లరి' అని అర్థం. దండారి నృత్యం లయబద్ధమై ఉంటుంది. వలయాకారంగా చేరే దండారి బృందం లోపలి వైపుకు తిరిగి నిలుచుంటారు. ఎడమ వైపుకు నెమ్మదిగా అడుగులు వేస్తూ, అడుగులు వేసినప్పుడల్లా కుడి పాదాన్ని ఎడమ కాలు మీదికి వూగిస్తుండడంతో నృత్యం ప్రారంభమౌతుంది. ప్రతి నర్తకునికి చేతిలో రెండు కోలాటం కర్రలు వుంటాయి. నర్తకులు తమ చేతుల్లోని రెండు కర్రలను ఒకదానితో మరొక దానిని తాకిస్తారు. తరువాత కుడి వైపున వున్న నర్తకుని కర్రను కొడతారు. ఇలా అడుగులు వేస్తూ కోలాటమాడుతూ నర్తకులందరూ వంగి కర్రలను నేలకి తాకించి నాలుగు దిక్కులకు అడుగులు వేస్తారు. దేవతలందరికీ ప్రణమిల్లడానికి ఇలా నాలుగు దిక్కులకు అడుగులు వేస్తారు. దేవతలకు మ్రొక్కిన తరువాత వలయాన్ని సరిచేసుకుని కర్రలను పాదాల వద్ద వుంచి, పాటకు అనుగుణంగా చేతులతో చప్పట్లు కొడతారు. ఒక బృందం ఒక చరణాన్ని ముగించగానే రెండవ బృందం రెండవ చరణాన్ని అందుకుంటూ బృంద గానం చేస్తారు.

దండారీ నృత్యంలో, గుసాడీల ప్రవేశం :

పై విధంగా దండారీల నృత్యం కొనసాగుతుండగా నలుగురైదుగురు గుసాడీలు హఠాత్తుగా దండారీల వలయంలోకి చొచ్చుకుని వస్తారు. తలకు నెమలి పింఛములను ధరించి, కృత్రిమ గడ్డాలు మీసాలు, శరీరంపై మేక చర్మం ధరించి వచ్చే గుసాడీల చేతుల్లో కర్రలుంటాయి. మెడలో గవ్వల హారాలూ, తుంగ కాయల హారాలూ వుంటాయి. నడుముకు మణి కట్టుకు చిన్న గజ్జెలు వుంటాయి. కంటి చుట్టూ తెల్ల రంగు పూసుకుంటారు. మొలకు నారింజ రంగు లంగోటీలు తప్పించితే శరీరం పై మరే ఇతర అచ్ఛాదన ఉండని గుసాడీల వేషం వింతగా వుంటుంది.గుసాడీలు ప్రవేశించగానే దండారీలు చెల్లా చెదురౌతారు. ఇది ప్రేక్షకులకు ఎంతో వినోదాన్ని కలిగిస్తుంది.

సామంతుల మయూర నృత్యం :

సామంతులనే గోండులని కూడా అంటారు. సామంతులు ఎంతో వెనుకబడిన గిరిజనులు. విశాఖపట్టణం, శ్రీకాకుళం జిల్లాలోని దుర్గమ్మ కొండ ప్రాంతపు అడవుల్లో ఈ గిరిజనులు కనిపిస్తారు. సామంతులు తరతరాలుగా కాపాడు కొంటూ వస్తున్న సాంస్కృతిక సంపదలో మయూర నృత్యం ఒక భాగం. గోండుల వివాహ సందర్భాలలోనూ,ఏప్రిల్ నెలలో వచ్చే చైత్ర పర్వదిన సందర్భంలోనూ, సాధారణంగా ఈ మయూర నృత్యం చేస్తారు. ఈ నృత్యంలో 'పిరోడి' అనే మురళి కాళ్ళకు కట్టుకునే 'గజ్జెలు' ముఖ్యమైనవి. సామంతులు ఖరీదైన వస్త్రాలంకరణల జోలికి పోరు. తెల్లదోవతి కట్టుకుంటారు. నర్తకులందరూ పాదాలకు గజ్జెలు కట్టుకుంటారు. వీటిని సామంతులు 'ముయ్యంగా' అంటారు. తలకు 'తోయంగ' అనే తలపాగా ధరిస్తారు. తుంగ గడ్డితో చేసిన పాగాకు రంగుల గుడ్డ పేలికలను కుచ్చులుగా కడతారు. నడుము వంచినప్పుడు పింఛము విప్పిన నెమలివలె కనిపించేటట్టు నెమలి పింఛముల గుత్తిని నడుముకు వెనుకబిగించుకుంటారు. మొదట నర్తకులందరూ రెండు వరుసలలో నిలుచుంటారు. నోటితో నెమలి అరుపును పోలిన శబ్దం చేస్తారు. వలయాకారంగా నిలిచి నాట్యం చేస్తున్న మయూరం పద్ధతిలో మోకాలిపై ముందుకు వంగుతారు.

భూమాతకు సూర్య భగవానుడికి మ్రొక్కి న ృత్యం ప్రారంభిస్తారు.

లంబాడి నృత్యం :

దీనిని రంగారెడ్డి జిల్లాలోని వేడ్చల్ ప్రాంతపు లంబాడీలు చేస్తారు. ఇది పండుగల సందర్భంగా ఆడ వాళ్ళు చేసే బృంద న ృత్యం. ఈ నృత్యాలను గిరిజనులు చేసేటప్పుడు డప్పు మొదలైన డోలు, కొమ్ము, సన్నాయి మొదలైన వాయిద్యాలూ, కిన్నెర మెట్ల, కిన్నెర, డోలు కామారో ఇత్యాది తీగ వాయిద్యాలు ఎక్కువగా వాడు తారు. అలంకరణ దుస్తులు, సాంప్రదాయ పద్ధతుల్లో వుంటాయి.

కొండ రెడ్ల కళా సంస్కృతి :

వీరు నాగరికత ప్రపంచానికి అతి దగ్గరగా ఉన్నారు. అలా తూర్పు గోదావరి జిల్లాలో అటు రాజమండ్రికి,ఇటు భద్రాచలానికిదగ్గరగా వున్న మారేడిమిల్లి, అడ్డతీగల మొదలైన సమితుల్లో అధిక సంఖ్యలో ఉన్నారు. వీరి మాతృభాష తెలుగే. అయితే కొంచెం యాసగా వుంటుంది. ప్రధానంగా వీరు పోడు వ్యవసాయం చేస్తున్నప్పటికీ వేటా డటం, చెట్లు నరకటం,చేపలు పట్టటం వీరి జీవనాధారం. చెట్ల వేర్లు, ఆకులూ, జీలుగ, బెరడూ,మామిడి జిడి వీరి ఆహార పదార్థాలు. కొండ రెడ్లు పంటలు బాగా పండాలనీ, తమకు వ్యాధులు రాకుండా కాపాడమనీ రకరకాల దేవత లను కొలుస్తారు. వీరి పండుగలలో మామిడి కోత పండుగ, భూదేవి పండుగ, గంగమ్మ దేవత పండుగ ముఖ్యమైనవి. ముత్యాలమ్మ, గంగమ్మ, గంటమ్మ, సారెలమ్మ, పాండవులను వీరు అతి భక్తి శ్రద్ధలతో కొలుస్తారు.

మామిడి కోత నృత్యం :

కొండరెడ్లకు అత్యంత ప్రీతికరమైనవి మామిడిపండ్లు. మామిడిపండ్లు ఆప్రాంతంలో ఎక్కువగా లభిస్తాయి. మామిడి పండ్లు కోసే ముందు కొండ రెడ్లు ఆనందోత్సవం జరుపుకొంటారు. తప్పెట్ల వాయిద్యాల శబ్దానికి అను గుణంగా లయ బద్ధమైన న ృత్యం చేస్తారు. రాత్రి పూట ఈ న ృత్యం ప్రారంభమౌతుంది. మొదట వాయిద్యాలను నెమ్మదిగా మ్రోగిస్తారు. ముగ్గురు నలుగురు స్త్రీలు చెట్టాపట్టాలేసుకొని చేతుల్లో గల గల శబ్దం చేసే ఎండు కాయల గుత్తులను ధరించి నృత్యంలో పాల్గొంటారు.

ముగింపు :

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాలలోని ఆయా ప్రదేశాల్లో వున్న కళారూపాలు మాత్రమే వెలుగులో కొచ్చాయి. అలా వెలుగులోకి వచ్చి ప్రచారమై ప్రజల నాకర్షించినవి మాత్రమే మనకు తెలుసు. కానీ భారత దేశంలో ఎక్కడో మారుమూల గిరిజన ప్రాంతాల్లో వున్న కళారూపాలు మాత్రం ప్రజల కెవ్వరికీ తెలియకుండా అజ్ఞాతంగానే వుండి పోయాయి. అక్కడి ప్రజలకు బయటి ప్రపంచంతో సంబంధమే లేదు. ఈ నాగరిక ప్రపంచానికే దూరమైన అజ్ఞాత జీవితాలు వారివి. అమాయక ప్రజలు నిర్మలమైన మనస్సులు, నిష్కల్మష హృదయాలు, మాయ మర్మాలు వీరికి అస్సలు తెలియవనే చెప్పాలి.వ్యాసానికి ఉన్న పరిమితి దృష్ట్యా నేను గిరిజనుల కళారూపాల పరిచయాన్ని మాత్రమే ఈ వ్యాసంలో వివరించాను.

ఆధార గ్రంథాలు :

1. సుందరంఆర్వీయస్. ఆంధ్రుల జానపద విజ్ఞానం, హైదరాబాదు:పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 2004.
2. ముత్యం.కె. నేను చిందు యల్లమ్మను, హైదరాబాదు:2006.
3. రాధాకృష్ణ మిక్కిలినేని. తెలుగువారి జానపద కళా రూపాలు, హైదరాబాదు : 2006.
4. ననుమాసస్వామి, జానపద పురాణాలు, హైదరాబాదు: ఉదయశ్రీ పబ్లికేషన్స్, 2008.

శ్రీశైల చెంచులు

– పూషడపు సుభ్భిరెడ్డి, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, అవనిగడ్డ, కృష్ణా జిల్లా.

"నమో హరికేశాయోపవీతినే పుష్టానాం పతయే నమ:"
(నమకము)

(ఆకుపచ్చని వృక్షాలు, సస్యములు శిరోజాలుగా, ఉపవీతముగా, ఉత్తరీయములుగా ధరించి అరణ్య ములకు అధిపతియైన రుద్రునకు నమస్కారము.)

యజుర్వేదమునందలి రుద్రాధ్యాయము అనే రుద్ర సూక్తము కైలాసగిరి పై శయనించి ఉన్న శివుని పలుమార్లు స్తోత్రము చేస్తున్నది. ఈ భూమి మీద పర్వతమే భగ వంతుని తొలి నివాసము. శివుడే ఆదిగిరిజనుడు. జంతు చర్మాలు ధరించి, పుఱ్ఱెల దండలతో, జడలు కట్టిన తలతో, ధనుర్బాణాలతో ఉండేవాడిగా, శివుని నిషా దునిగా, వేటకుక్కలతో తిరిగేవాడిగా వేదాలు వర్ణించాయి. సింధు నాగరికతలో పశుపతిగా కొలవబడినది శివుడే.

నది నంటి నాగరికతలు పురుడు పోసుకున్నాయి. తియ్యటి నీటి ధారల ఉద్గమస్థానాలైన పర్వతాలు సతత హరితంగా ఉంటూ సంవత్సరం పొడవునా జీవులకు ఆహా రాన్ని రక్షణను ఇచ్చాయి. ఆదిమానవుల ఉనికికి ఆట పట్టయ్యాయి. వేల సంవత్సరాల క్రితం మన పూర్వీకులు గీసిన వర్ణచిత్రాలను కొండలు తమలో నేటికీ దాచి పెట్టుకుంటున్నాయి. ఆహారాన్వేషణలో కొన్ని మానవ గణాలు మైదానాలకు దిగి వచ్చాయి. కొందరు పశుపోషణ, వ్యవసాయం నేర్చి నాగరికతవైపు నడక సాగించారు. మరికొందరు ప్రథమ స్థావరాలను వదిలిపెట్టలేక ఉన్నారు. ప్రకృతితో మానవునికి ఉన్న బలమైన సంబంధం అలాం టిది. నేటి వనవాసులలో అధిక భాగం అక్కడి మూల వాసులు. మిగిలినవారు మైదానాల నుండి వచ్చి చేరిన వారు.

భారతీయ సాహిత్యం – గిరిజనులు :

ప్రపంచ ప్రఖ్యాత తత్వవేత్తల చేత విశేషంగా కీర్తించబడున్న మన ఉపనిషత్తులన్నీ అరణ్యాలలో నివసించిన ఋషులు మనోఫలకాలపై దర్శించి వచించి నవే. భారత ఉపఖండపు ప్రజల సంస్కృతి, నాగరికతలను శాశ్వతంగా శాసించే ప్రసిద్ధ ఇతిహాసమైన రామాయణాన్ని గిరిపుత్రుడైన వాల్మీకి మహర్షి వ్రాశాడు. గిరి, గిరిజన వర్ణన లేకుండా ఏ భారతీయ కావ్యం సంపూర్ణమవ్వదు. ఆయు ర్వేదం, ధనుర్వేదం, ఖనిజశాస్త్రం, కావ్యసౌందర్యం, అశ్వ గజాధిపత్యం అడవుల నుండే భారతీయులు పొందారు.

ప్రపంచంలో రెండో అతి పెద్ద గిరిజన జనాభా గల భారతదేశంలో తొలి రాజ్య వ్యవస్థ చిగురించిన గణ రాజ్యాలన్నీ గిరిజన తెగలవే. భిల్ల, శబర, పుళింద, నిషాద వంటి గిరిజన తెగలను ప్రాచీన భారతీయ సాహిత్యం తరచూ ప్రస్తావించింది. ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర మహాత్మ్యంలోతిన్నని వృత్తాంతం గిరిజనం జీవితాలను చక్కగా వర్ణించాయి. గిరిజనులను ప్రధానంగా 1) పర్వతా రణ్యవాసులు 2) మైదాన, నీటివనరుల సమీపంలో ఉండేవారు 3) అందరితో కలిసి పట్టణాలు, నగరాలలో ఉండేవారిగా విభజించవచ్చు. దేశం మొత్తం మీద పెద్ద గిరిజన సమూహాలైన 'గోండులు', 'సంతాలులు' మొదలు అత్యల్ప సంఖ్యాకులైన 'జార్వా'ల వరకు 573 కు పైనే తెగలు మనుగడ సాగిస్తున్నాయి. అలాగే 93,846 గిరిజన గ్రామాలున్నాయి.

దేశంలో అనాదిగా ఆదిమ జాతులు, తెగలు ఉనికిలో ఉన్నా క్రీ.శ. 1874లో బ్రిటీష్ ప్రభుత్వం షెడ్యూల్డు జిల్లాల చట్టం తెచ్చింది. 1919, 1935 భారత ప్రభుత్వ చట్టాలు దీనిని కొనసాగించాయి. 1894లో ఆధునిక భారతదేశంలో బ్రిటీష్ ప్రభుత్వం నూతన అటవీ విధా నాన్ని ప్రకటిస్తూ గిరిజనుల భూమిపై ప్రభుత్వ అజ మాయిషీకి నాంది పలికింది. దీనికి కొన్ని మార్పులు చేస్తూ 1952లో స్వతంత్ర్య భారత దేశం కొత్త అటవీ విధానాన్ని

రూపొందించింది. 1931లో మన దేశంలో తొలిగా ఆదిమ తెగల జనాభా లెక్కించబడింది. 1935 భారత ప్రభుత్వ చట్టంలో బ్యాక్‌వర్డ్ ట్రైబ్స్ అన్న పదం వాడబడింది. 1950 జనవరి 26 నుండి షెడ్యూల్డు తెగలు అని కొన్ని వర్గాలను అధికారికంగా గుర్తించడం జరిగింది.

దక్షిణ భారత గిరిజన తెగలలో ఆంధ్రప్రదేశ్‌లోని తెగలు ప్రధానమైనవి. అందులో 33 తెగలు ముఖ్యమైనవి. ప్రస్తుత నవ్యాంధ్రప్రదేశ్‌లో 25 గిరిజన తెగలు, కులాలు ఉనికిలో ఉన్నాయి. వీరిని 1) చత్తీస్‌ఘడ్, ఒడిస్సాల మీదుగా తూర్పు కనుమలలో పశ్చిమ గోదావరి జిల్లా వరకూ ఉన్నవారు 2) కృష్ణానదికి ఉభయ పార్శ్వాల ఉన్న నల్లమలలో నివశించేవారు 3) శేషాచల అరణ్యాలు, పులికాట్ (ప్రళయ కావేరి) సరస్సులోని వారు. 4) కోస్తా తీరం వెంబడి, నీటి వనరుల దగ్గర ఉన్నవారు. 5) అన్ని వర్గాలతో కలిసి సాధారణ జనావాసాలలో ఉండేవారు.

నవ్యాంధ్రప్రదేశ్‌లో ప్రధాన గిరిజన తెగలు :

1. భగత 2. చెంచు 3. కొండరెడ్డి 4. కొండ కాపు, 5. సవర 6. జాతాపు 7. లంబాడి 8. ఎరుకల 9. యానాది 10. కోయ 11. బోయ 12. గదబ 13.ఖోండు 14. ఖోటియా 15.కులియా 16. మన్నెదొర.

ఉభయ తెలుగు రాష్ట్రాలలోనూ వ్యాపించిన నల్లమల అడవులలో ప్రాచీనకాలం నుండే చెంచులు నివసిస్తున్నారు. వీరికంటూ ప్రత్యేక వేషధారణ ఆహారపు అలవాట్లు, కట్టుబాట్లు ఉండటం వలన మిగిలిన గిరిపుత్రులతో వీరు భిన్నంగా మనగలిగారు. పూర్వాచారవంతులైన చెంచులు నేటికీ పెద్ద సంఖ్యలోనే ఉన్నా వారి సంప్రదాయ ఆహార్యం పండుగలకు తప్ప మనం చూడగలిగే పరిస్థితి నేడు లేదు. అటు అహోబిలం నుండి ఇటు శ్రీశైలం వరకు నేటికీ తమ ఉనికి చాటుకుంటున్నఈ విలక్షణ తెగ గురించి తెలుగులో తొలి సాక్ష్యాలు వెల్లడి చేసినది వీరశైవోద్యమ సాహిత్యాక్షరశాలకు అధినాధుడు పాల్కురికి సోమనాధుడు. సంస్కృతీకరణమనే మబ్బుల మాటున దాగిఉన్న ఎన్నో కాంతి రేఖలు ఆయన క్రాంతదర్శత్వం వల్లనే మన మీద ప్రసరించగలిగాయి. చెంచులు నల్లమల అరణ్యమంతా మంచి పట్టున్న తెగ కావడంతో ఆ ప్రాంతంపై ఆధిపత్యం పొందిన ప్రతి రాజవంశం వారు వీరిని లొంగదీసుకొని అదుపులో ఉంచారు. అహోబిల నారసింహుడు చెంచులక్ష్మిని వివాహమాడి వారికి అల్లుడయ్యాడు. ఇక శ్రీశైల మల్లికార్జునుడు చెంచువాడిగానే భావించబడుతున్నాడు. శ్రీపర్వతలింగం ఉన్నచోటు ఆదిమానవుల కాలం నుండి వారికి నివాస స్థలంగానూ, ఆరాధనా స్థలంగానూ ఉందని పురాతత్వ శాస్త్రవేత్తల గట్టి నమ్మకం. కృష్ణవేణి నదిలోనేగాక, శ్రీశైల ఆలయ ఆవరణలో (15 ఎకరాలు) నేటికీ 5, 6 అడుగుల లోతులోనే ''బుగ్గ''లలో సంవత్సరమంతా నీరు ఊరుతుండడాన్ని మనం గమనించవచ్చు. ఆలయ అభివృద్ధిలో చాలా వాటిని మూసివేశారు. అభిషేకోదకం కోసం మల్లి కాగుండం లాంటివి మరలా ఇటీవల పునరుద్ధరించారు. పుష్కలంగా ఆహారం నీరు ఉన్న తావులలో చెంచులు స్థిరనివాసులై వేలేండ్లుగా జీవించారు. వీరి ఆవాసాలను 'పెంట' లంటారు. త్రిమూర్తులలో ఇద్దరు చెంచులతో ప్రత్యక్ష సంబంధాన్ని పొందడం ఎన్నో చారిత్రక పరిణామాలకు, సామాజిక అవసరాలకు ప్రత్యక్ష నిదర్శనంగా మనం భావించాలి.

మల్లికార్జున పండితారాధ్య చరిత్ర - చెంచులు :

అరవై ముగ్గురు నాయనారుల వృత్తాంతములను, భక్తి అంతఃసూత్రముగా గుది గుచ్చి, దేశకాలమాన పరిస్థితులను తేటతెల్లం చేస్తూ తెలుగున తొలి విజ్ఞాన సర్వస్వముగా ప్రసిద్ధమైన ఈ గ్రంథం సోమన అద్వితీయ ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది. దీనిలోని ద్వితీయ సంపుటిలో మల్లికార్జున పండితారాధ్యుడు శ్రీపర్వత లింగాన్ని దర్శించిన వేళ అక్కడకు వచ్చిన నానాజాతి భక్త సందోహాన్ని సోమన యథోచితంగా వర్ణించాడు. అందులో చెంచులను ధర్మాత్ములని ఉదహరించడాన్ని మనం గుర్తుపెట్టుకోవాలి.

చెంచు ధర్మాత్ముల నడకలు :

ఎల్లదేశాల యాత్రికులు తమ ఇంటికి వచ్చిన అతిథుల వలే చెంచులు భావించి వారికి తమకు తోచిన రీతిన సాయమందించేవారని ఇందులో వివరించబడి ఉంది. ఆనాటి చెంచులు వ్రతములు పూని పరమేశ్వరుని దర్శనానికి వచ్చే వారు కొందరైతే, కఠిన ఉపవాస దీక్షాపరులైన వారు కొందరున్నారు. వారు గొడుగులు, కాళ్ళకు చెప్పులు ధరించి, ఒంటికి గట్టి గుడ్డలు, కంబళ్ళు చుట్టుకున్నారు. విభూతి, రుద్రాక్షలు ధరించి ఉండే చెంచులు యాత్రికులకు నూనెబుడ్లు, శివ సూత్రములు, నీరుకావి వస్త్రములు, విసెనకర్రలు, గంధపు చెక్కలు, సానలు, గంధపు చిప్పలు, వెదురు పలికలు, పీటలు మొదలగు అనేక ఉపకరణాలను "పెఱికి" కావళ్ళు కట్టి తెచ్చి మార్గాల కిరువైపులా నిలిచిఉండేవారు. ఎవరికి కావలసిన ఆహార పదార్థాలు, వస్తు సామాగ్రిని వారికి సమకూర్చేవారు. స్త్రీలకు మరుగులు నిర్మించేవారు. చలిపందిరులు, సత్రశాలలు, విడుదులు ఏర్పాటు చేసేవారు. నీటి గుండములు, చెలమల వద్దకు దారి చూపేవారు. జంగమారాధనను మరువక చేసేవారు అని సోమనాథుడు వారి నడకలు (యాత్ర తీరుతెన్నులు) గురించి హృద్యంగా వర్ణించాడు. సంవత్సరమంతా శ్రీ శైలేశుణ్ణి దర్శించుకోవడానికి ఒకప్పుడు ప్రకృతి అనూకలించలేదు. అక్కడ ఎల్లవేళలా కనిపెట్టుకొని ఉన్నది జంగములు, చెంచులే. కాకతీయ, రెడ్డి సామ్రాజ్యాలు వర్ధిల్లిన రోజుల్లోనూ శ్రీశైలం ఒక సామంత రాజ్యంగా భాసిల్లింది. అంతకు ముందు పలనాటి బ్రహ్మనాయుడు కోడిపోరులో ఓడి, నల్లమల ప్రవేశించిన తరువాత తన "సామంతరాగోల"ను శ్రీశైలరాజ్యపాలకుని వద్దే కుదువ పెట్టి తెచ్చిన ధనంతో మేడపి లో పరివారానికి విడుదులు నిర్మించాడు. పలనాటి యుద్ధంలో చెంచు సైన్యం పాల్గొన్నది. శ్రీకృష్ణదేవరాయల కాలం నాటికి విజయనగర సామ్రాజ్య "గడి" (సరిహద్దు) దేశములలో శ్రీశైలం ఒకటి. రెడ్డి మన్నీ దొరలు మక్కువతో పాతాళగంగ నుండి శ్రీశైలానికి, ఎగువ అహోబిలానికి నిర్మించిన సోపాన పంక్తుల గురించి కవిసార్వభౌములు, ప్రబంధ పరమేశ్వరులు సువర్ణాక్షర పంక్తులు లిఖించారు. కానీ ఆ బండ లెత్తడంలో కరిగిపోయినవి చెంచూ కండలేనన్నది మనం విస్మరించరాదు. కాకతీయుల ఆడపడుచు మల్లన్నకు క్రొత్త దేవళం నిలబెట్టినప్పుడు, పంచమశాలు భక్తజనానికి నీడ నిచ్చినప్పుడు, ప్రౌఢ దేవరాయలు ప్రాకారం పెట్టించినపుడు, శ్రీకృష్ణదేవరాయలు తన కీర్తిని గోపురంగా కట్టించినప్పుడు ఎంత మంది చెంచులు ఒరిగిపోయారో మల్లన్నకే తెలియాలి. కైలాస ద్వారం నుండి శివలోకము చేరినవారు, వీరశిరోమంటపంలో విచ్చుకత్తుల మధ్య తలలను బలితర్పణమిచ్చినవారు ఎంత మందో సాక్షి గణపతి వ్రాసుకునే ఉంటాడు. భక్తిపూర్వకంగా చెంచులు సమర్పించిన రక్తం భ్రమరాంబ రుధిరగుండంలో తడి ఆరకుండా కాపాడి ఉంటుంది. ఇలా త్రికరణములూ చెన్న మల్లి కార్జున సేవలో అర్పించిన చెంచులకు దక్కిన గౌరవ మెంతో విజ్ఞులే నిర్ణయించాలి.

అటు నుండి ఇటు నరుక్కురావడం :

ఆంగ్లశకం 1790 ప్రాంతంలో అమరావతి జమిందారుగా బలవంతుడైన వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు ప్రభుత్వం చేశాడు. ఆయన కాలంలో "పాపానాయక్" నేతృత్వంలో శ్రీశైలం, వినుకొండ ప్రాంతాల చెంచులు ఊళ్ళ మీదపడి దోచుకోవడంతో జమిందారు వారిలో ముఖ్యులను పట్టుకొని, వరుసలుగా నిలబెట్టి, తలలు నరికించాడని చరిత్రలో చాలా సాక్ష్యాలున్నాయి. ఇక్కడ బలి అయ్యింది అమాయక చెంచులేగానీ వారిని నడిపించిన వారు కాదని నేడు చాలా మంది పెద్దలంగీకరిస్తున్నారు. ముందు వరుసలో నిలబడ్డవారు మరో ప్రక్క నుండి నరకమని ప్రార్థిస్తే నాయుడు అటు నుండి నరకమన్నాడట. ఎలాగైతే నింద చెంచుల మీద పోయింది. ఆ తరువాతి రోజుల్లో ఆంధ్రదేశంపైబడి నానా అరాచకాలు సృష్టించిన పిండారీలకు ఇలాంటి శిక్షలు వేసిన

మొనగాడు లేడు. కాంచి కామకోటి పీఠం పరమాచార్య, నడిచే దైవంగా పసిద్ధులైన చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి శ్రీశైల మహాక్షేత్రాన్ని దర్శించే నాటికి కూడా ఆయన బృందానికి దారి చూపి, రక్షణగా నిలిచిన వారు చెంచులే. ఆర్తితో ఆదిశంకరుని శివానందలహరిని శ్రీశైల పర్వతంపై గానం చేసిన చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహా స్వామి, ఆ భాగ్యం తనకు కల్పించిన చెంచు బృందాలకు క్రొత్తబట్టలు పెట్టి తృప్తి చెందారు.

చెంచులకు దక్కినవి, మిగిలినవి :

నేటికీ శ్రీశైలంలో మహాశివరాత్రి పర్వదినాన చెంచు గుఱవయ్యలు తలపై నెమలీకలు, ఒంటిపై పులితోలు ధరించి పిల్లన గ్రోవులూదుతూ కొలువు చేస్తునే ఉన్నారు. (ఐ.టి.డి.ఎ. వారు చెంచు పెంటల అభివృద్ధి గురించి ఇక్కడ చర్చించడం లేదు). చెంచులు దేవాలయంలో చిన్నా, చితకా ఉద్యోగాలు దక్కించుకున్నారు. తమకు తెలిసిన మందులు, మాకులు అమ్ముకుంటున్నారు. ఎందరో వీధిబిచ్చగాళ్ళుగా కంచుపళ్ళాలు మ్రోగించు కుంటూ, నెమలి ఈకలు అమ్ముకుంటూ ఊరూరా తిరుగుతున్నారు. (నేడు ఆ కంచు పళ్ళాలను అమ్ము కున్నారు). శ్రీశైలం దేవాలయంలో మాత్రం ఉపాలయాల్లో పరివార దేవతలకు అలంకరణ చేసే భాగ్యం, రథోత్సవం నాడు తేరులాగే అదృష్టాన్ని మిగుల్చుకున్నారు.

ఆధార గ్రంథ సూచి :

1. మల్లికార్జున పండితారాధ్య చరిత్ర - పాల్కురికి సోమనాధుడు - తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ - 1990.
2. రుద్రసూక్తము - కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్య - వరల్డ్ టీచర్స్ ట్రస్ట్ ప్రచురణ - విశాఖపట్టణం-1997.
3. గార్డన్ మెకంజి - కృష్ణాజిల్లా మాన్యువల్.
4. చాటుపద్య మణిమంజరి (2వ భాగం) - వేటూరి ప్రభాకరశాస్త్రి - 1988.
5. నా స్వీయపరిశీలనలు.

తెలంగాణ బంజార గేయ సాహిత్యం – సాంస్కృతిక జీవనం

– బానోత్ వెంకటేశ్వర్లు, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, కాకతీయ విశ్వవిద్యాలయము, వరంగల్, తెలంగాణ.

భారతదేశంలో నివశిస్తున్న అనేక ఆదిమ జాతులలో "బంజార" ఒక విశిష్టమైన గిరిజన తెగ, బంజారాల జీవన విధానం చాలా విలక్షణమైనది, వైవిధ్యభరితమైనది. వీరి జీవన విధానం, వీరి సంస్కృతికి ఆనవాళ్ళు. తెలంగాణ రాష్ట్రంలో బంజారాలు ఒక విభిన్నమైన బాషను, సంస్కృతిని కలిగి తెలుగు వారితో సహజీవనాన్ని కొనసాగిస్తూ ప్రత్యేకమైన సంతతిని కలిగి ఉన్నారు.

గిరిజన తెగలలో పోల్చుకుంటే లంబాడీ తెగ ప్రత్యేకంగా కనిపిస్తుంది. రూపురేఖలు వేశభూషణలు, ఆచార వ్యవహారాలు, జీనవ విధానాల విషయంలో ఇతర గిరిజనుల కంటే లంబాడీలకు కొన్ని ప్రత్యేకతలున్నాయి. రాష్ట్రంలో వీరి ఉనికి, వలసలను పరిశీలిస్తే లంబాడీలు ఉత్తర భారత దేశంలో ఉండేవారని, ఆయా కారణాల రిత్యా క్రమంగా ధక్షిణ భారతదేశానికి వలస వచ్చారని చరిత్రకారులతో పాటు లంబాడీలు కూడ చెప్పుకుంటున్నారు. వీరి వంశ నేపథ్యాన్ని గమనిస్తే ప్రధానంగా వీరు రాజ పుత్రులుగా పేర్కొనబడ్డారు. బంజారాల వంశ చరిత్ర, కట్టు బొట్టు, పండుగలు, ఆచార వ్యవహారాలు కూడా రాజపుత్రుల నేపధ్యాన్ని సూచిస్తాయి. ఈ విధంగా వీరి సంస్కృతి, సాంప్రదాయాలను, పండుగలను ప్రతి ఆంశాన్ని మౌఖిక సాహిత్యం ద్వారా తెలియజేస్తారు. బంజారాలు నిరక్షరాస్యులు అయిన కూడా విరి సాహిత్య పాత్ర చాలా విశిష్టమైనది.

తండాలల్లో చిన్న చిన్న నివాస ప్రాంతాలలో వీరు నివసిస్తున్నప్పటికీ వీరి ప్రతి పండుగలను వివిధ కార్య క్రమాల్లోను వీరి సంస్కృతి, సాంప్రదాయలకనుగుణంగా పాటలు పాడటం, కథలు చెప్పడం, జానపద గేయాలను ఆలపించడం జరుగుతుంది. ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటంటే వీరు నిరక్షరాస్యులు అయినప్పటికిని, వీరి తాత, తండ్రులను అనుసరిస్తూ ఒక తరం నుండి మరొక తరం ప్రజలు వీరి గేయాలను పాటలను, కథలను సామెతలను, పొడుపు కథలను నేర్చుకుంటారు. వారి సంస్కృతిని సాంప్రదాయాలను తరం మారిన, తత్వం మార్చకుండా ఉంటారు.

బంజారాలు వీరి పండుగలకు ప్రకృతికి ప్రత్యేక సంబంధాలు ఉంటాయి. వీరు నిర్వహించే ప్రతి కార్య క్రమాలు సంస్కృతిలో భాగంగా ప్రతి అంశాన్ని గేయాలతో ఆలపిస్తూ వారి కార్యక్రమాలను నిష్టతో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. ఈ విధంగా వీరి ప్రతి అంశంలో ప్రతి చేసే పనిలో సాహిత్యాన్ని చూడవచ్చు. అందుకే గిరిజన సాహిత్యంలో అనేక కోణాలు ఆవిర్భావిస్తున్నాయి. గిరిజన సాహిత్యంలో అనేక ఆదిమ జాతులు, వివిధ గిరిజన తెగలుఉన్నాయి. అయితే ఇందులో "బంజారా జాతి" విశిష్టమైన సాహిత్యాన్ని సంతరించుకుంది.

బంజారాలు పండుగలను సామూహికంగా జరుపుకోవడం ఆచారం. వారు జరుపుకునే పండుగల్లో వారి పూజ విధానం ఒక విలక్షణమైన రీతిలో ఉంటుంది. వారి పూజలు తమ క్షేమాన్ని, తండా క్షేమాన్ని, పాడిపంటల క్షేమాన్ని, ప్రకృతి క్షేమాన్ని కోరి చేసేవి. వీరు పూజించే దేవతలు హిందూ దేవతలైనప్పటికీ, పూజించే విధానం అటవి సాంప్రదాయాన్ని కలిగినట్టిది.

పండుగలు సమాజంలోని సాంస్కృతిక, సామాజిక, నైతిక, ఆధ్యాత్మిక, తాత్విక, చరిత్రవాదులకు, ఆచార సాంప్రదాయాలకు అద్దంపట్టే అణిముత్యాలు, బంజార ప్రకృతి దేవతలతో పాటు స్త్రీ దేవతలను తమ ఆరాధ్య దైవాలుగా కొలుస్తున్నారు. సీత్లా, తొళజ, మేరమా, హింగళ, మొదలైన వాటిని తమ పశువులను తమ సంతానాన్ని కాపాడే దేవతలుగా భావిస్తారు. వీరు ఎన్నో రకాల

పండుగలు, ఉత్సవాలు జరుపుకుంటారు. వీటిలో శీత్లా, తీజ్, దీపావళి, హోళి మొదలగు పండుగకు, ఉత్సవాలకు గేయాలను ఆలపిస్తూ, పాటలు పాడుతూ వారి సంస్కృతిని వారి అస్థిత్వాన్ని పండుగ ప్రాముఖ్యతను గేయలా రూపంలో ఆలపిస్తారు.

కుణేసే నాయేకేరో టాండో ఝంపూ డేవజనేరో?
భల్లూ నాయేకేరో టాండో ఝంపూవాళో డేవజనేరో!
కిమెతో లాదో టాండో ఝంపూవాళో డేవజనేరో?
శ్యారేన లాదో టండో ఝంపూవాలో డేవజనేరో!
కాయీ భరలాయో టాండో ఝంపువాలో జేవజనేరో?
ఘపూ భరలాయో టాండో ఝంపువాలో జేవజజేరో!
కి మతో ఢాళో టాండో ఝంపువాళో డేవజనేరో?
చ్వాడే మా ధాలీయాయే టాండో ఝంపువాలో డేవజనేరో!
కాయీ పూజరేచే టాండో ఝంపువాళో డేవజనేరో?
సీత్లా పూజరేచే టాండో ఝంపువాళో డేవజనేరో!

తండా గొప్పదనాన్ని నాటకీయ ఫక్కీలో పాడుకోవడం పాటలోని విశేషం.

సీత్లా యాడీ నికళి మలక దేకేన
జగజగ నందియా ఝాంకరేచయే
ఓన యాలే మ దనియా ధారేచ
సీత్లా యాడీ ని కళి మలక దేకేన

విశ్లేషణ :

సీత్లాదేవి తాను సృష్టించిన ఈ ప్రపంచాన్ని చూద్దామని బయలు దేరింది. అప్పుడు ఎక్కడ చూసినా నందీశ్వరులు ధగధగ మెరుస్తున్నారు. దేవి ప్రకాశానికి అందరూ ఆశ్చర్యచకితులై వేనోళ్లా పొగిడారు అని ఈ పాటలో అర్థం, సీత్లాదేవి అంటే చల్లని తల్లి. అందరి కోర్కెలు తీర్చే కల్పవల్లి.

ఘేవూలారయే తోన శారేతీ మంగాయీ
ఘేవూలారయేతోన టపారే మా గోకి
ఘోవూలారయే తోన నంగరిమా గోకీ
ఘోవూలా ఘుమకోరోళ్ ఏ కయే నయ్యు
ఘోవూలారయే తోన ఝరలే మా గోకి
ఘేవులారయే తోన టోకణీ మా గాళీ
ఘేవూలారయే తాతి టోకణి వెరాదు
ఘేవూలా ఘుమ కోరోళ్ ఏకయో నయ్యు

విశ్లేషణ :

ఓ గోధుమా! నిన్ను పట్నం నుండి తెప్పించాను. నిన్ను పెట్టెలో భద్రపరిచాను. అలాగే మా నంగరిలో ఉంచాను. ఆ తర్వాత టోకణి (సర్వ)లో నానబెట్టి ఆ సర్వతో పాటే నిన్ను నిమజ్జనం చేస్తాను అని భావం. ఈ పాట పూర్తగా గోధుమలను సంబోధిస్తూనే కొనసాగడం విశేషం. గోధుమలు నానబెట్టి 'పిలోణీర్ వేళ్ళీ' (దుసేరు తీగ)తో ఆడ పిల్లలు స్వయంగా చిన్న చిన్న బుట్టలను అల్లుతారు. చక్కగా స్నానాలాడి పుట్టమట్టిని తెస్తారు. ఆ మట్టిలో మేక ఎరువును కలుపుతారు.

శీత్లా యాడీ బోరాయీ తీజ్, బాయూ తారో పాలేణ,
సోనేరో డాక్ళో ఘలాన, బాయూ తారో పాలేణ,
రూపేరో పీట ఘలాన, బాయూ తారో పాలేణ,
సోనేరో డాండియా ఘడాన, బాయూ తారో పాలేణ,
నవదాడేరీ నవసే తెవాళ్, బాయూ తారో పాలేణ.

విశ్లేషణ :

ఓ చెల్లెలా! నీ కోసం బంగారు పందిరి వేసి, వెండి పీటను వేసి, బంగారు బుట్టలో సీత్లా మాత పండిచింది తీజును (గోదుమ మొలకలు). పై విధంగా పాడుతూ కట్టెల సహాయంతో ఒక మంచె (డాక్ళో) తయారు చేస్తారు. గోధుమలు చల్లిన బుట్టలను ఆ వేదికపై పెట్టి నీళ్ళు పోస్తారు.

దండియాజీ బోరాయూ తీజ్, బాయూ తారో పాలేణ
దండియాడితి రాజీ యేగి తీజ్, బాయూ తారో పాలేణ
మారీ హూంసణ గౌరీ తీజ్, బాయూ తారో పాలేణ
మారీ సాతణతి రాజీ యేగి తీజ్, బాయూ తారో పాలేణ
మారి సంగరీతి రాజీ యేగి తీజ్, బాయూ తారో పాలేణ

సోనేరి డాకళో గలాన్ తీజ్ బాయూ తారో పాలేణ

విశ్లేషణ :

తీజ్ పండుగను 'దండియాడి' (మేరా మా భవాని) జరిపిస్తుందని, ఆ దేవత ఈ పండుగతో రాజీ పడిందని, బంగారు మంచె మీద తీజ్ బుట్టలను పెట్టించి దేవతనే స్వయంగా ఈ పండుగను జరిసిస్తుందని ఈ పాట సారాంశం. తీజ్ పండుగ జరిగే ఈ తొమ్మిది రోజులంటే లంబాడీ బాలికలకు అగ్ని పరీక్షే ఎన్నో కఠోర నియమాలను పాటించవలసి ఉంటుంది. ఈ రోజుల్లో ఆడపిల్లలు ఉప్పుకారం లేని అన్నం తింటారు. తీజ్ పండుగ సంద ర్భంలో వారు ఆచరించే పూజావిధానం అంతా సామూహి కంగా జరుగుతుంది. కన్యలు పండుగ ఆచారాలను ఆచరిస్తుంటే వారి సహచరులు వినోదంగా చూస్తుంటారు.

సేవా భాయ బోరాయో తీజ్, బాయూ తారో పాలేణో
సేవా భాయతి రాజీ యేగి తీజ్, బాయూ తారో పాలేణో
మేరా మా యాడి బోరాయీ తీజ్, బాయీ తారో పాలేణో
మేరా మా యాడీతి రాజీ యేగి తీజ్, బాయూ తారో పాలేణో
దండీ యాడీ బోరాయీ తీజ్, బాయీ తారో పాలేణో
దండీ యాదీ బోరాయీ తీజ్, బాయీ తారో పాలేణో
నవ దాడేరి నవసె తెవార్, బాయూ తారో పాలేణో

విశ్లేషణ :

తీజ్‌లను సేవాభాయా, మేరా మాయాడిల పేరున భక్తి విశ్వాసాలతో పెంచినందున అవి వారితో రాజీ అయ్యాయి. ఆ తీజ్‌లను తొమ్మిది రోజులే పెంచిన్పటికీ తొమ్మిది వందల రోజులూ తాము ఆ పనిలో పాలు పంచుకున్నామని, తమకు తీజ్‌లు సంతృప్తిని మిగిల్చా యని తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చుతున్న వైనం ఆ పాటలో ఉంది. తీజ్ నిమజ్జనానికి ముందు తండా వాసులందరూ తలపాగలు కట్టుకొని వలయాకారంగా కూర్చుంటారు. కన్యలు తీజ్ నారును అత్యంత భక్తితో తెంపి మొదట తండా నాయకుని తలపాగకు కడ్తారు. తరువాత మిగతావారి తలపాగల్లో అమరుస్తారు.

దేకేస్ యాడీ! యా తొళ్జా యాడి!!
దేవునితాండేర్ జన్ యాడి,
దసరాయేర్ తోన ధారేచ యాడి,
కచా బచ్చాన సాయూ వేస్ యాడి,
ఉందేర్ ధరేన హరో భరో రకాడేస్ యాడి,
దొక్ష్వాళేతి దూర్ రకాడేస్ యాడి,
ఘరే మ హాండి భరీ రకడేస్ యాడి,
సావుకారేన సమ్నుక్ రకాడేస్ యాడి,
కచ్చేరిన దూర్ రకాడేస్ యాడి,
సాయీ వేస్ సవాయి రకాడేస్ యాడి.

విశ్లేషణ :

తండావాళ్లంతా నిన్ను కొలుస్తున్నారని, పిల్లాపాపల్ని చల్లగా చూడమని, ఇళ్ళను పచ్చగా స్రంచమని, రోగాలకు దూరంగా ఉంచుమని, ఇళ్ళలో కుండలు నిండుగా ఉంచమని, ధనవంతుణ్ణి అన్నింటికీ ముందుంచుమని, కాని పంచాయతీకి మాత్రం దూరంగా ఉంచుమని వేడు కుంటారు. భవానీని పూజించేవారు ఉపవాసం ఉండాలి. బంజారాలకు భవానీపై అమితమైన భక్తి విశ్వాసా లున్నాయి. వారు తమను చల్లగా చూసే తల్లి తొళ్జా మాత అని నమ్ముతారు. తొళ్జా మాతను కొలిచేటప్పుడు పాడే గేయం.

అస్సీ ధరతీ పరే రామన్ లచమణ్ చాలగే,
అస్సీ ధరతీ పరే రామన్ లచమణ్ చాలగే,
ఓతో చాలా చాలగే సీతా మాతో,
ధర్తీ టోపర్ భాయి భాయిరా,
ధరతీ టోపర్ భాయి భాయిరా
ధరతీ టోపర్ గమ్మతేది, ధరతీ టోపర్ డాలేతి.

విశ్లేషణ :

ఈ భూమిపైన రామలక్ష్మణులు, సీతామాత నడి చారు. వారు మనకు మంచి నడవడిని చూపారు. సంతో షంగా, ఉత్సాహంగా హోళి ఆడాలి మనమంతా. బంజా రాల ఇష్టదైవం రాముడు. వారు రామభక్తుడైన హను

మంతుని వారసులమని తలుస్తారు కనుకనే వారు ఎవరైనా ఎదురైనప్పుడు గాని, ఇంటికి ఎవరైనా వచ్చినప్పుడు గాని "రాం! రాం!!' అంటారు. రాముని మాటే హనుమంతునికి వేదం. ఆ హనుమంతుని వారసులమని తాము భావించడం వల్ల రామలక్ష్మణుల దారిలో తాము నడవాలని లోకానికి టాచి పెప్తున్న వైనం ఈ పాట ద్వారా తెలుస్తున్నది. రామలక్ష్మణులు, సీతామాత ఎప్పుడో మనకు ఒక దారిలో నడవమని చెప్పారు. వారి అడుగు జాడల్లో నడవడమే మన పని అన్నట్లుగా ఈ పాట అర్థాన్ని ఇస్తుంది. హోళిని ఒక పండుగగా జరుపుకోవడమే కాక, మహాపురుషుల వల్ల బంజారాల సాహిత్య ప్రయోజనం ఎటువంటిదో మనకు తెలుస్తుంది.

ఉపయుక్త గ్రంథ సూచి :

1. భారతదేశం - గిరిజన సముదాయాలు - మజుందార్, 1986
2. సుగాలి సంస్కృతి, భాషా సాహిత్యాలు, సిద్ధాంత గ్రంథం, డా. ఎం. గోనా నాయక్, 2002.
3. నల్లగొండ జిల్లా జాతరలు - ఒక పరిశీలన, డా. చింతల యాదయ్య, 1995.
4. ఆంధ్రుల జానపద విజ్ఞానం, ఆర్వీయస్ సుందరం, 1983
5. నల్లగొండ జిల్లా బంజారా సాహిత్యం - జీనవచిత్రణ, డా. సూర్యాధనంజయ్, 2009.

తెలుగు ప్రబంధాలలో గిరిజన సంస్కృతి

– తంత్రవహి శ్రీరామమూర్తి, తెలుగు అధ్యాపకులు, పి.ఆర్. ప్రభుత్వ జూనియర్ కళాశాల, కాకినాడ.

తెలుగు కావ్యాలలో గిరిజన సంస్కృతి వర్ణన అక్కడ క్కడ కనిపిస్తాయి. విస్తారంగా, వివరంగా ఉన్న సంద ర్భాలు అరుదనే చెప్పాలి. దీనికి కారణం కావ్యా సంప్రదాయంలో లాక్షణికులనిర్ణయం ప్రకారం 'రాజు' మాత్రమే కథా నాయకునిగా ఉండటం ఒక కారణం అయితే రఘునాథనాయకుని వాల్మీకి చరితము వంటివి వీటికి మినహాయింపు. అష్టాదశ వర్ణనలో మృగయావర్ణన కూడా ఉండటంవలన ఎక్కువగా ఈ వేటవర్ణన మాత్రమే కనిపిస్తుంది. వేట అడవిలో జరగడంవలన, వేటలో సిద్ధహస్తులు గిరిజనులు కావడంవలన 'రాజు'తో పాటు వారు వేటపాల్గొన్న వర్ణనలే కనిపిస్తున్నాయి. అక్కడక్కడ గిరిజన స్త్రీ పురుషుల వేషధారణ, స్వరూపవర్ణనలు ఉన్నాయి అవన్నీ ఒకేవిధంగా ఉండి గిరిజన తెగలలో ఉన్న విభిన్న వర్గాల సంస్కృతిని మనం గుర్తించడానికి కష్టమవుతుంది. శబర, పుళింద, కిరాత, బోయ పదాలు పర్యాయపదాలుగానే ప్రయోగించడం కనిపిస్తుంది. గోండులు, సవరలు, చెంచులు, కోయలు, కొండరెడ్లు, ఎరుకలు, యానాది, లంబాడి ఇలా భిన్నమైనవారి చరిత్ర సంస్కృతి గుర్తించలేకపోతున్నాము. ఆధునిక నవల,కథా సాహిత్యంలో కూడా ఇంకా విస్తృతమైన సృజన జరగవలసి వుంది. ప్రాచీనకాలమునుండి ఆధునిక గిరిజన తెగలను గుర్తించే విధంగా పరిశోధనలు జరగాలి. దానికి మరింత అధ్యయనం చేయవలసి ఉందని నమ్ముతూ నా దృష్టికి వచ్చిన కొన్ని అంశాలను తెలపడమే ఈ పత్రసమర్పణ ఉద్దేశం.

గిరిజన పురుషుల వేషధారణ :

మ. చమరీవాలములున్ మయూరవర పింఛ వ్రాతముల్ గండశృం
గములున్ సూకర వేణు నాగ ఘన ముక్తా జాలముల్ బుక్క చ
ర్మములున్ సింహ నఖంబులున్ మధువులున్ మాంసంబులున్ దాల్చి రౌ
ద్రముతోవచ్చు పుళిందులం గనిరి కాంతారాంత రాళంబులన్.

(కుమార సం.6-39)

పార్వతి తపస్సునకు వనానికి చెలికత్తెలతో వెళుతూ ఎరుక స్త్రీలను చూసింది, తరువాత భయంకరులైన కిరాతు లను చూసిందని నన్నెచోడుడు వర్ణించాడు. చమరీ మృగాల తోకలు, నెమలి పించాలసమూహాలు, పెద్ద కొమ్ములు, పంది కోరల నుండి, వెదురుల నుండి, ఏను గుల నుండి పుట్టిన ముత్యాలు, ఎలుగుగొడ్ల చర్మాలు, సింహాల గోర్లు ధరించివున్నారు, మద్య మాంసములు సేవించి భయంకరాకారులై వస్తున్నారు.

గిరిజన స్త్రీల వేషధారణ, గృహకార్యం :

సీ. హరినీలమణులకు నాయువు వచ్చె నా
గమనీయమగు తనుకాంతు లెసగ,
మెరుగుఁదీగలు గండుమీలపై నెలసె నా
దృగ్భాసుర ద్యుతుల్ తేజరిల్లఁ
జమరీ సుకేశ పాశములఁ దుమ్మెదపిండు
తగిలె నాఁ గుటిల కుంతలము లమరఁ,
గాంచన కుంభముల్ కరికుంభ కర్కశ,
మెనసె నాఁ బాలిండ్లు పొనరి తనరఁతే.
బాపవశమున శాపంబు పడి విహీన
జనులసంగతికర్హమై పొనరఁ గన్న
యమరసతులొకో యన దర్శనార్హలైన
యెఱుకులేములఁ గాంచె శైలేంద్రతనయ.

(కుమార సం. 6-43)

తపస్సుచేయడానికి అరణ్యంలోనికి వెళుతున్న పార్వతీ దేవి, చెలికత్తెలకు కనిపించిన గిరిజన స్త్రీలను నన్నె

చోడుడు ఇలా వర్ణించాడు. వారు వెదురుల నుండి పుట్టిన ముత్యములు ధరించారు, వారు ఇంద్రనీల మణులకు చైతన్యము వచ్చెనా అన్నట్లు మనోహరమైన నల్లని దేహకాంతికలవారు. చూపులు కాంతివంతములై చమరీ మృగాలవలె నల్లనివై తుమ్మెదల గుంపువలె వుంగరాలు తిరిగిన జుట్టుతో సర్వాంగసౌందర్యముతో శాపాన్నిపొంది వనములోపుట్టిన దేవతా స్త్రీలవలె ఎరుకతలువున్నారు. పటికరాతి రోటిలో ముల్లువెదురుబియ్యం చక్కగాపోసి ఏనుగుదంతపు రోకటితో దంచుతూ పెక్కురాగాలు పాడు తున్నారు. (కుమార సం. 6-47)

గిరిజనులు పంటకాపుకై దిష్టిబొమ్మలుంచుట :

మ. అగురుక్ష్మారుహ కాష్ఠఖండములు సర్వాంగంబులం
జేసి, మై
మృగనాభిన్ మసిపూసి, చామరము ధమ్మిల్లంబుగాఁ
జుట్టి, యే
నుఁగు కుంభమ్ములలోని ముత్యములఁ గన్ గ్రుడ్డుల్
వినిర్మించి, భి
ల్ల గజేంద్రుల్ వెఱబొమ్మలం దవిఁదచేలం జేయు
దుర్ కాపుగన్. (శ్రీకాళ.మ.3-7)

వెఱబొమ్మ శరీరంలో అన్ని అవయవాలను అగరుచెట్ల చెక్కముక్కలతో నిర్మిస్తారు. ఆపైన కస్తూరిమృగం బొడ్డు నుండి జారిన కస్తూరిని తెచ్చి, ఆ బిమ్మకు ఒళ్ళంతా దట్టంగా పూస్తారు. చమరీమృగం తోకలను తెచ్చి, ఆ బొమ్మలకు వెనుక విరబోసుకున్న జుట్టులాగా అమ రుస్తారు. ఈ చామరంకూడ నల్లటిదే. ఆ బొమ్మకు కను గ్రుడ్లను ఏనుగుల కుంభస్థలంలోని ముత్యాలతో జాగ్రత్తగా నిర్మిస్తారు. కనుగుడ్లు తెల్లగా ఉండాలి కాబట్టి ముత్యాలతో కూర్చారు. మొత్తం కారునలుపు శరీరంతో తెల్లటి కనుగుడ్డు కూడ భయం కలిగిస్తుంది. ఇలా తయారు చేసిన వెఱబొమ్మలను భిల్లగజేంద్రులు తమ రాగిపంట చేలలో కాపుగా నిలుపుతున్నారు.

గిరిజనుల వేట సన్నాహం :

సీ. విండ్లుగోలలును జద్దుండ్లు బల్లెములు కే
లను బూని మొనలుగాఁ జనెడువారు
గదలు చేకత్తులు గండ్ర గొడ్డండ్లు స
య్యన బూని యెడలేక యరుగువారు
చిక్కముల్ వలలును జివురు గండెలు నురుల్
బోనులు గొని వడిఁ బోవువారు
కౌజు పిట్టలు జలాగండెలు పూరేండ్లు
డేగలు గైకొని యేగువారు

గీ. పటకుటీరంబులకు రుచిపాకములకు
వలయు వస్తువులెల్లఁ గావడులఁ బండ్ల
నెడ్ల తలమూపులను వీక నెత్తి యెత్తి
మించు వేడ్కల వడి నడిపించువారు
(శకుంతలా పరిణయం ఆ-1)

చేతితో ధనుస్సులు, బాణాలు, గట్టిగానాటుకునే వేట సాధనాలు, ఈటెలు పట్టుకుని గుంపులుగా వెళ్తున్నారు. గదలు, చేతిలో అమరే చిన్నకత్తులు, పెద్దపెద్ద గొడ్డళ్ళు ధరించి, ఒకరిని ఒకరు రాసుకుంటూ క్రిక్కిరిసి వెళ్తున్నారు, కొందరు చిక్కాలు, వలలు, పక్షులను పట్టుకోవడానికి ఉపయోగించే జిగురుగండెలు అనే వేటసాధనాలు, ఉచ్చుత్రాళ్ళు, బోనులు తీసుకొని వేగంగా వెళ్తున్నారు. మరికొందరు వేటనిమిత్తంగా కపింజలం అనే పక్షులు, జలాగండెలు అనే పక్షులు, పూరేడు అనే పేరుగల పక్షులు, డేగలు తీసుకొపోతున్నారు. ఇవి తర్ఫీదు ఇచ్చిన పెంపుడు పక్షులు. వీటితో అరిపించి ఆయా పక్షిజాతులను రప్పించి అవి జిగురుకండెలో ఉచ్చులలో తగులుకుంటే పట్టు కుంటారు. ఇంకొందరు డేరాలను వేయడానికి, రుచి కరంగా వంటలు చేయడానికి అవసరమైన వస్తువులన్నిం టిని ఉత్సాహంగా కావళ్ళలోనూ, బండ్లమీద, ఎద్దుల తలలమీద, మూపులమీద, ఎత్తి వేగంగా తోలుకుంటూ వెళుతున్నారు.

అడవి దున్నను వేటాడుట :

తే. ఒక్కఁ డడుగెత్తి గొఱక వేయుచును డాఁచి
న ట్టరిగి టెంకిఁ గని వీఁకఁ బట్టుటయును
మృగయు లందఱుఁ జని వెల్వరించి నిశిత
కాండములఁ జెండి రొక పెద్ద కారుపాతు.
(మను చరిత్ర. 4-48)

వరూధినీ కుమారుడైన స్వరోచి ఆటవికులకు రాజు అయ్యాడు బలిసిన వరాహ సింహ మృగము పంటలను పాడుచేస్తున్నాయని చెప్పగా స్వరోచి వేటకు వెళ్ళాడు పెద్దన దీనిని విస్తారంగా వర్ణించాడు. అందులోని ఒక వర్ణన ఇది. ఒక బోయవాడు మెల్లగాఅడుగెత్తి కారుపోతు ఉన్నచోటికి దానివలె అరుస్తూ వెళ్ళి, అంతకుముందు అక్కడ దానిని దాచివుంచినట్లే పట్టుకున్నాడు తక్కిన బోయలంతా కలిసి ఒకేసారి దానిని కొట్టారు.

గిరిజన బాల క్రీడలు :

సీ. చిట్లపొట్లాకాయ, సిరిసింగణావంతి,
గుడుగుడుగుంచాలు, కుందెనగుడి,
డాఁగిలిమ్రుచ్చులాటలు, గ్రచ్చకాయలు,
వెన్నెలకుప్పలు, తన్నుబిల్ల,
తూరనతుంకాలు, గీరనగింజలు,
పిల్లదీపాలంకి, బిల్లగోడు,
చిడుగుడువ్వలపోటి, చెండుగట్టిన బోది,
యల్లియుప్పనఁ బెట్టె, లప్పళాలు,

గీ. చిక్కనాబిల్ల, లోటిళ్ళు, చిందఱాది
యైన శైశవక్రీడా విహార సరణిఁ
జెంచుకొమరులతో నుద్దులించు కాడుఁ
దిన్నఁ డభినవ బాల్య సంపన్నుఁడగుచు.

(శ్రీ కాళహస్తి మ.3-33)

బోయపల్లె అయిన ఉడుమూరులో తిన్నడు ఆడిన ఆటలను ధూర్జటి వర్ణించాడు. తిన్నడు తోటి బాలురతో కలిసి చిట్లపొట్లకాయ, గుడిగుడి గుంచాలు, కుందెనగుడి, దాగుడుమూతలు, గచ్చకాయలు, వెన్నెల కుప్పలు, తన్ను బిల్ల, తూరనగోల, గీరనిగింజలు, బిల్లగోడు, చెడుగుడు, ఉప్పనపట్టెలు, మొదలైన బాల్య క్రీడలు ఆడాడు. వీటిలో గిరిజనులకే కాక జానపదులకు కూడా తెలిసిన కొన్ని ఆటలున్నాయి. కొన్ని వాడుకలో ఉన్నాయి, కొన్ని పేర్లే కాని ఆడే విధానం తెలియటంలేదు.

గిరిజన వైద్యం :

సీ. కోకపొట్లం బావి గొన సూఁది యొత్తుచుఁ,
గషణోష్ణ కరభ భాగమునఁ గాఁచి,
నెత్తి తంగేడాకు మిత్తి, రేచకి నిమ్మ
వంచి నీరున నూఱి పట్టు వెట్టి,
తెల్లదింటెన పువ్వుఁ దెచ్చి తద్రస మిడి,
కలివెపువ్వులు తోసి నలఁచి పిడిచి,
పేరిననెయి వెట్టి, పెరుఁగువత్తులు వైచి,
చనుబాలతో రాచి, సంకు చమిరి,

గీ. విన్నమందులు, తా సరి కన్నమందు,
లడిగి తెచ్చిన మందులు, నడవిమందు
లెన్ని చేసిన మానక, యిందుమౌళి
కన్ను వొడిఁబడి, నెత్తురు గాఱుటయును.

(శ్రీ కాళహస్తి మ 3-121)

శివుని కన్నుల వెంబడి ఆగకుండా నీరుగారుతుంటే తిన్నడు నోటి గాలితో వేడి చేసిన బట్ట తడుపుతూ కంటిని అద్దాడు. రాపిడి చేసి వేడెక్కించిన మనికట్టు మొదలుకొని చిటికెన వ్రేలు వరకు గల చేతి వెలువలి పక్క భాగంలో వేడి పట్టించాడు. తల మీద తంగేడాకు దట్టంగా రుద్ది పసరు పట్టించాడు. కరక్కాయ నిమ్మ పండు రసంతో నూరి పూసాడు. తెల్ల దింటిన పువ్వుల పసరును కంటిలో పిండాడు. కలిపె పువ్వుల పసరు కూడా కంటిలో పిండాడు. పేరిన నెయ్యి రాసాడు. పెరుగులో ముంచిన దీపపు పత్తు లాంటి గుడ్డ పీలికల్ని పైభాగంలో అతికించాడు. చనుబాలతో రాసాడు. శంఖంతో నిమిరాడు. తాను విన్న మందులు, స్వయంగా తెలిసిన మందులు, ఇతరులను అడిగి తెచ్చిన మందులు, అడి మందులు, ఇలా ఎన్నోరకాల వైద్యంచేసాడు.

గిరిజన జాతర – వినోదము :

తిన్నడి తండ్రి నాథనాథుడు కాట్రేనికి జాతర జరుగుతుందని చాటింపు వేయించాడు. తరువాత మంగళవారం బోయలు జాతరకు బయలుదేరారు. కిరాత కాంతలు రకరకాలుగా అలంకరించుకున్నారు. నివ్వర బియ్యంతో తయారు చేసిన ఉపాహారాలు, చమరీ మృగాల పాలు, కునుకుబ్రాలు కలిపి వండిన పాయసం, వెదురు బియ్యపు పిండితో చేసిన కుడుములు, అడవి ఆకుకూరల

వంటకాలు, బెల్లం, ఇప్ప, తాటి, గరక తాటి మద్యాలు, అడవికోళ్లు, అడవి దున్నలు, అడవి మేకపోతులు, కొండ గొఱ్ఱెలు మొదలైన వాటితో కాట్రేని గుడికి పయన మయ్యారు. ఆ సమయంలో తప్పెటలు, గుమ్మెట, సొరకాయ బుర్రలతో చేసిన కిన్నర, కొమ్ము వాద్యాల ధ్వనులు మిన్నుముట్టాయి. నాథనాథుడు, అతని భార్య తండె ఒంటిపూట ఉపవాసం చేసి నెలయేటిలో స్నానం చేసి అలంకారాలు ధరించి కుమారుణ్ని చక్కగా అలం కరిచారు. తిన్నడు స్నానంచేసి అలంకారాలు ధరించి, కుమారుణ్ని చక్కగా అలంకరించారు. తిన్నడు స్నానం చేసి విభూతి రాసుకొని రక్షాబంధం కట్టుకున్నాడు. మూలికతో కూడిన పూల దండలను కడియాలుగా ధరిం చాడు. తలమీద నల్లటి వెండ్రుకలను లేత తీగలతో చుట్టి చేతిలొ విల్లమ్ములు ధరించి తల్లిదండ్రులతో కాట్రేని కోనకు బయలుదేరాడు.

(శ్రీ కాళహస్తి మ.3-36,37,38)

వ. చని, మృగయాధి దైవతము సన్నిధి బాణ శరాసనాది సా
ధనములు నిల్పి, యెఱ్ఱ విరిదండల, నివ్వరిప్రాల,
రక్తచం
దనమున గుగ్గిలంపుఁబొగ, దట్టు పునుంగున, నెత్తి
జోతులన్,
ఘన వివిధోపచారములఁ, గానుకల్ శబరాళి గొల్వ
ఁగన్. (శ్రీ కాళహస్తి మ.3-39)

కాట్రేని సన్నిధిలో విల్లంబులు మొదలయిన ఆయు ధాలు వుంచారు. ఎర్రపూలదండలు వేసారు.నివ్వరి బియ్యం, ఎర్రచందనంతో పూజించారు.గుగ్గిలపు ధూపం వేసారు. తట్టుపునుగు సమర్పించారు. జోతులెత్తి వివిధ మైన సేవలు చేసారు. కానుకలు అర్పించారు. దైవానికి నమాస్కారాలు చేసి, వేటలు పట్టి, బోయపల్లెలో దంపతు లతో అన్నపానాదులు స్వీకరించారు. అప్పుడు బోయ లందరూ విహరించారు. కొందరు పాటలు పాడేరు. స్త్రీ పురుష భేదం లేకుండా అందరూ మద్యం సేవించారు, అందరు సంతోషముతో క్రీడించి సాయంకాలానికి ఇళ్లకు బయలుదేరారు.

(శ్రీ కాళహస్తి మ.3-40, 41)

ఆధార గ్రంధాలు :

1) కుమార సంభవము-ప్రథమ భాగము- నన్నెచోడుడు - పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.2006
2) మనుచరిత్రము-అల్లసానిపెద్దన-ఎమెస్కో-2013.
3) వర్ణనరత్నాకరము-తొమ్మిదొవ సంపుటము-దాసరి లక్షణస్వామి-యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్ అండ్ ఎమెస్కో-2014.
4) శ్రీ కాళహస్తి మాహాత్మ్యము- ధూర్జటి- ఎమెస్కో-2009.

భద్రాద్రి గిరిజనుల వ్యవసాయ పండుగలు

– అన్నపరెడ్డి వీరకుమారి, అర్థశాస్త్ర అధ్యాపకురాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చింతలపూడి, పశ్చిమ గోదావరి జిల్లా.

పెద్ద కడవలో కాచిన పాలలో ఒకింత మీగడ పేరి నట్లు, గతకాలం నుండి వచ్చిన మంచే మన సంప్రదాయా లని సి.నా.రే. అభిప్రాయపడ్డారు. ఆ సాంప్రదాయాన్ని నిలబెట్టుకోవడం కోసమే, తోటి మానవులు చంద్ర మండలం మీదకు ఎగిరిపోతున్నా తాము చెట్టు పుట్టా పట్టుకు వ్రేలాడుతున్న పుడమితల్లి బిడ్డలు గిరిజనులు. గిరిజన గ్రామం ఒక కుటుంబం వంటిది. అడవి అంద రిది. ఏ కూలీకి అయినా భోజనమే బహుమతి. గిరిజనుడు ప్రకృతి మాత పాలుతాగే పసివాడు. భారతదేశం వ్యవ సాయాధార దేశం. మన దేశంలో వ్యవసాయం ఋతు వులు, పశువులు మీద ఆధారపడి ఉంది. గిరిజనులలో కొందరు వ్యవసాయం చేస్తారు. కొందరు ఫలసాయం సేకరణ చేస్తారు. గిరిజనులకు జీవనాధారం అడవి (ప్రకృతి). అందుకే వీరు ఆ ప్రకృతిని కృతజ్ఞతా భావంతో భక్తిగా ఆరాధిస్తారు. ప్రకృతినే వన దేవతగా, గంగమ్మగా భావించి పండుగలు జరుపుకుంటారు.

చరిత్రలోతులకు వెళ్ళినకొద్దీ అంతా గిరిజనుల చుట్టూ అల్లుకున్న గాథలే కానవస్తాయి. అమెరికా రెడ్ ఇండియన్లు, శ్రీలంక వెడ్డాలు, కాంగో పిగ్మీలు, ఆఫ్రికా బుష్‌మెన్లు, అండమాన్‌లో జారవాలు, భారత ప్రధాన భూబాగంలో కిరాత, నిషాద, బోయి, గోండి, శబర, సంతాల, చెంచు మొదలైన ఎందరో ఆధునికి భారతీయ సంతతికి పూర్వీకులని చరిత్ర చెబుతుంది. ఆంధ్ర, ఒడిస్సా, చత్తీస్‌ఘడ్, తెలంగాణాలో పోటో ఆన్ర్ లాయిడ్స్‌కి చెందిన కోయ, కొండరెడ్లు అధిక సంఖ్యలో జీవనం సాగిస్తున్నారు.

ద్రావిడ భాషలో "కోయతూర్" అనగా కొండ ప్రాంత మనిషి. కోయలు అనగొంది[1]లో కోడిని కత్తితో కోయరు. నేలకేసి కొట్టి చంపి సేవ[2] ఇస్తారు. కోడిని కోయని వారు కావున "కోయలు" అయ్యారని ఒక వాదం. "కొయ్య" ను తమ దేవతగా ఆరాధిస్తారు కావున కోయలు అని మరొక వాదన.

కోయలలో లింగధారి, రాచకోయ, డోలికోయ, కమ్మరి కోయ, గొమ్ము కోయ, గట్టు కోయ, గుత్తికోయ అనే తెగలు వృత్తులు ఆధారంగా ఏర్పడ్డాయి. వీరు అనేక పండుగలు జరుపుకుంటారు.

చిక్కుడు పండూం :

జనవరిలో చిక్కుడు కాయలు కోసే ముందు చేసే పండుగ (పండుగను పండూం అని స్థానికంగా పిలుచు కుంటారు).

ఇంటి పండుగ (ఇలకట్టు) :

ఒకే ఇంటి పేరుగల కుటుంబాలు జరుపుకునే పండుగ. వేసవి, తొలకరి నెలల్లో చేస్తారు. కుటుంబ సభ్యులు, పాడి పశువులు మంచిగా ఉండి చీడ, పీడ, గాలి, ధూళి నుండి రక్షణ కోసం చేస్తారు. ఈ పండుగలో ఆడపడుచులకన్నా ఇంటి కోడళ్ళకే ప్రాధాన్యత ఎక్కువ అలాగే ఈ పండుగ ఖచ్చితంగా కుటుంబ పెద్ద ఇంటి వద్దే జరుగుతుంది.

విత్తనాల పండుగ (సుంకీ పండూం) :

తమ పంటలు బాగా పండాలని ఈ పండుగ చేసు కొంటారు. వేసవి నెలల్లో జరుగుతుంది. పండుగ జరుపు కోవడానికి వసూలు చేసిన చందా - ఖర్చులకు పోగా మిగిలితే "సుంకు" నిధిగా ఉంచుతారు. మూడు పిడికళ్ళ చొప్పున ఇప్ప ఆకులతో సుంకు[3] ఇంటికి తెచ్చి దాచి భూమి పండగలో నాగలి కట్టిన రోజు సుంకు విత్తనాలు తొలిగా చల్లుతారు. ఆ రోజు వ్యవసాయ పనులు ఆరం భిస్తారు.

భూమి పండుగ :

తొలకరి నెలలో చేస్తారు. విజ్జు పండుగ అంటారు. 3 రోజులు చేస్తారు.

1వ రోజు : సాలూ పండుగ. మేకని బలి ఇచ్చి కొండదేవత పేరు మీద పండుగ చేస్తారు.

2వ రోజు : ప్రతి ఇంటి నుండి విజ్జ (విత్తనాల) బుర్రలో వరి విత్తనాలు, కాడి, మోకు, ముల్లుకర్ర పట్టుకుని వెళతారు. గేదె కొమ్ముతో ఊదుతారు. ఇది పండుగ సంకేతం.

3వ రోజు : వేటకి వెడతారు. అడవిలో ఏదో ఒక జంతువుని వేటాడి తేవాలి.

పచ్చ పండుగ :

బీర, సొర, ఆకుకూరలు కోయడానికి చేసే పండుగ. ఇది చేయకుండా వాటిని మనుషులు తింటే వారి ఆవులు, మేకలను పులి తింటుంది అని వారి నమ్మకం.

లెలె పండుగ :

అక్టోబర్ నెలలో జరుపుతారు. పండుగ నెల రోజులు చేస్తారు. రాత్రిళ్ళు ఇత్తడి తాళాలు కొడుతూ ఆడతారు. ప్రజలు క్రొత్త పోడుకి పోయిన చోటుకే వారి దేవతలు కూడా వస్తారని తెలియజేస్తూ ఆడతారు.

దోసాల పండూం :

ప్రతి నెలా భూమి దోషాలు అడవి కట్టు రాకాసి దోషాలు నివారణార్థం చేసేది. ఆనాడు పాలం పని నిషేధం. నెలకి రెండుసార్లు దానుగుడు మావెలి అమ్మ తల్లికి మొక్కుతారు (పండూం చేస్తారు).

జొల్ద పండుగ :

చీడపీడల పాలు కాకుండా పాలంలో "కస్మి కర్రలు" పాతుతారు. పోడు చేసేపుడు అడవిని నరికిన తరువాత చెట్ల మోడులకు అగ్గులు పెట్టిన 15 రోజులకి భూమి పండుగ చేస్తారు. గంగాలమ్మ పండుగ తరువాత కాలిన మానులు గుట్టలుగా చేసి తగులబెడతారు. మోడు తీసేటపుడు పచ్చిక పండుగ చేస్తారు.

పంది బారి నుండి పంట కాపాడమని చేసేది బడ్డి పండూం. పోడు చేసేటపుడు మూడు సం॥ల పంట తరువాత సున్నం వలన నేల చౌడుబారిపోవడం వలన దిగుబడి తగ్గును. దాంతో ఆ పాలం వదిలి పోడుకు అనువైన క్రొత్త చోటుకి వెళ్ళి సాగు చేసుకుంటారు. ఇళ్ళు కూడా క్రొత్త పాలం దగ్గరకి చేరిపోతాయి. ఈ పోడు రెండు రకాలు (1) కొండపోడు - కొండ ప్రాంతాల మీద పోడు చేయడం, (2) సాగుపోడు - కొండపాదతలంలో చేసేది.

పిండి, పప్పులు పండుగలు చేసుకోని గ్రామాలలో వారు, ఈ పండుగ చేసుకున్న గ్రామంలో ఆ పంట తినరాదు. "దేశవిడి" (సంక్రాంతి) తో ఈ ఆటంకం తీరిపోతుంది. తానం పండుగ నుండి గంగాలమ్మ పండుగ వరకు కల్లు బాగా దొరుకుతుంది. తానం పండుగలో నృత్యం లయ తప్పుతుంది. అంత మత్తులో ఉంటారు మరి.

కాయలు, కూరలు ముదిరే వరకు తెంపరాదనే బాసలు ఆధునికులకు శిరోధార్యాలు. బాగా పండిన తరువాతే ఏదైనా పుష్టినిస్తుంది. లేత కాపు తెంపరాదు. ఈ రోజు అన్ని పండ్లు, కూరగాయలు త్వరగా పక్వానికి రావాలని ఇంజెక్షన్లు ఇచ్చి రసాయనాలు కలిపేవారు వీరిని చూసి బుద్ధి తెచ్చుకోవాలి.

మహాశివరాత్రికి చివురించి గంగమ్మ పండుగ నాటికి విరిసే రెల్లపూలను అమ్మవారికి సమర్పించకుండా ఎవరూ ధరించరు. వీరి సౌందర్య స్పృహకిది నిదర్శనం.

మామిడి కొత్త పండుగ :

గురమామిడి - ఇది అడవి దున్నలు మరిగిన మామిడి. వర్షాకాలంలో మామిడి పళ్ళు రాలినపుడు దానిని ఆకు మామిడి అంటారు. రాలినపండ్లు పులిసినప్పుడు వాటిని అంబలి మామిడి అంటారు. ఈ పులిసిన పండ్లు నేలలో కలిసి కల్లు వాసన పుట్టిస్తాయి. ఆ వాసనకు నత్తలు వస్తాయి కనుక అప్పుడు కాచే మామిడి పండ్లను నత్తల మామిడి అంటారు. ఈ పండుగ చేయక ముందీ

చెట్టు కింద కూర్చుని కల్లుకూడా త్రాగరు. కల్లులో మామిడి పూత పడుతుందేమోనని వీరి భయం.

టెంకల పండుగ :

మామిడి టెంకలు తినే ముందు చేస్తారు.

"దూలవిడికి మామిడి దులదుల రాలును (మే)
పెద్దవిడికి పేరు లేకుండా పోతుంది" (జూన్) అని వీరి సామెత

గిరిజనులకు తల్లిపాలు కన్నా మిన్న కల్లు. పాండవుల ఫలవృక్షం అని తాడిని వీరు గౌరవిస్తారు. వీరికింత ప్రియమైన తాటిచెట్లపై చిగురు, మొదలు పన్నులను బ్రిటీష్‌వారు వేశారు.

చెదభూమిలో పంటలు పండవు. భూమికి గంగదేవి (మానవులకు ఆటలమ్మలాగ) చెద పట్టిందంటారు. జాంబవంతుడు భూమికి పురుడు పోశాడని నమ్ముతారు. భూమి పండుగ దినాన పందిని "సేవ" ఇస్తారు. వేటలో ఎలుగు, పంది దొరికితే పంటలు బాగా పండుతాయని నమ్ముతారు.

దసరాకి వరికి వెన్నులు కట్టి రాజుల పండుగ చేస్తారు. నగరిబసలో వండుకు తింటారు. పోడు వ్యవసాయం కోసం వివిధ ప్రాంతాలకు వలస పోయిన ఒకే గ్రామ ప్రజలు మరల ఒకచోట కలుసుకుని పండుగ చేసుకోవడాన్ని "నగరిబస" అంటారు.

పండుగ తీరడం :

1. పచ్చిమాంసం - దేవుడికి, 2. కాల్చినది - పితరులకు పెడతారు. ఏ పప్పులైనా పండుగకు ముందు ఉడికించి తింటారు, తరువాత వేయించి తింటారు.

తల్లి పండుగ :

ఈ పండుగ తరువాత "మసిగర్రలు" ఏరాలి. పండుగ తీరినాక వేటకెళతారు. దానిని కొలువుల పండుగ అంటారు. వ్యవసాయ పనులారంభించడాన్ని నంది పండుగ అంటారు.

కొత్తల పండూం :

కొర్ర కొత్త, కంది కొత్త, సామ కొత్త, మామిడి కొత్త, పనస కొత్త పండూంలు ఆయా పంటలు పండిన తర్వాత కొత్తల పండుగ జరిపే వరకు ఆయా పంటని కోసి ఎవరూ తినరు, వండరు. తొలి పంట కొర్ర కొత్తలో గుమ్మడి కాయ కూర వండి అందరూ సమానంగా పంచుకుతింటారు. దీనిని ఆగస్టులో చేస్తారు.

జీడి పండూం :

జీడి కాయలు అమ్మిన తరువాత వచ్చిన సొమ్ముతో చేసుకునే పండుగ మే లో జరుగుతుంది. జీడి పండుతో సారా కాస్తారు.

పుట్ట పండూం :

పుట్టగొడుగులు వర్షాకాలంలో ఉరుముల శబ్దానికి పుట్టలలో లభిస్తాయి. ఇవి బలమైన శ్రేష్టమైన ఆహారం. పుట్ట గొడుగులు తెంపడానికి ముందు చేస్తారు.

ఇప్పపూల పండూం :

ముందుగా భద్రాచల శ్రీరామునికి కోయలు ఇప్ప పూలు సమర్పణ చేస్తారు. పూలు బాగా ఎండిన తరువాత పండుగ చేస్తారు. శ్రీరామగిరి కళ్యాణోత్సవంలో దొంగల దోపు ఉత్సవం జరుపుతారు. వర్షాకాలం కప్పల పండుగ చేస్తారు. చీడపీడల నివారణకు పీడముక్కదాన్ పండూం చేస్తారు.

పుష్ప పండూం :

రేల చెట్టు వద్ద జల ఉంటుంది. జలే ప్రాణాధారం కావున వీరు రేల చెట్టుని ఆరాధిస్తారు. రేల పువ్వులే కాదు ఏ పువ్వులైనా పుష్ప పండూం చేసి అమ్మవారికి సమర్పించాకే స్త్రీలు వాటిని వాడుతారు.

అభోజ్యపికలు :

1.అనగొంది : పూజగది, 2. సేవ : బలి, 3. సుంకు : విత్తనాలు, 4. విజ్జ : విత్తనాలు.

ఉపయుక్త గ్రంథాలు :

1. నాగుల శ్రీరాములు (గిరిజన కథా గాయకుడు) - తూర్పుగోదావరి జిల్లా, చింతూరు నివాసి చెప్పిన అంశాలు.
2. పి. కన్నారావు, బి. అరుణ్ కుమార్, రవ్వా పవన్ కళ్యాణ్ - తూర్పుగోదావరి జిల్లా చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు చెప్పిన అంశాలు.
3. ఐ.టి.డి.ఎ. భద్రాచలం వారు ప్రచురించిన కోయ సంస్కృతి పుస్తకం -2015.
4. శివరామకృష్ణ - కొండ కోనల్లో తెలుగు గిరిజనులు - 2007.

చెంచుల సంస్కృతి – ఆదర్శనీయం

– డా॥ ఖర్రు అశోక్, పోస్ట్ డాక్టరల్ ఫెలో, తెలుగు అధ్యయనశాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

భారతదేశంలో ప్రాచీనకాలం నుండి నేటివరకు నాగరిక సమాజానికి దూరంగా ఉంటూ, అడవులని ఆవాస కేంద్రాలగా చేసుకుని, తమదైన సంస్కృతి సంప్రదాయాలను పాటించేవారు ప్రధానంగా గిరిజనలు. ఇరు తెలుగురాష్ట్రాలలో సుమారు 33 గిరిజనతెగలు ఉన్నాయి. ప్రతి గిరిజనతెగకు కొన్ని సారుప్యతలు ఉన్నప్పటికి ఏతెగకు ఆతెగకు సంబంధించిన కొన్ని ప్రత్యేకమైన సంస్కృతులు ఉన్నాయి. వీరు ఆచారాలలో కొన్ని మూఢమైనవి ఉన్నప్పటికి నవ నాగరిక సమాజం అనుసరించాల్సిన ఆదర్శనీయమైన ఆచారాలు చాలానే ఉన్నాయి. వాటిని సాహిత్యలోకానికి తెలియచేయడమే ఈ పత్ర ప్రధాన ఉద్దేశం.

చెంచుల ఆచారాలను తెలునుకునే ముందు చెంచులు గురించి ప్రాథమిక విషయాలు తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా వుంది. చెంచులు ఆంధ్ర ప్రదేశ్‌లోని కర్నూలు, ప్రకాశం, గుంటూరు జిల్లాలోని నల్లమల అటవిప్రాంతంలో జీవిస్తున్నారు. మరియు తెలంగాణలోని మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలలో కనిపిస్తారు. వీరు ప్రధానంగా అడవిచెంచులు, ఊరచెంచులు అని రెండురకాలు. ఐన నల్లమలలో ఉన్న ముఖ్య చెంచు సముదాయాలు 4 అవి. 1. తెలుగు చెంచులు 2. అడవి చెంచులు 3. కృష్ణ చెంచులు 4. బొంత చెంచులు. ఈ చెంచులను భారత ప్రభుత్వం "ఆదిమ గిరిజనులుగా" గుర్తించారు. చెంచులు నేటికి తమదైన సంస్కృతి వల్ల దుర్భరమైన దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారు.

వీరు ఆహారసంపాదన కోసం ప్రధానంగా వేటమీద ఆధారపడతారు. పొడు వ్యవసాయం, పశుపోషణ మీద పాక్షికంగా ఆధారపడతారు. ఋతువులను బట్టి అడవిలో దొరికే పండ్లు, దుంపలు కూడా వీరి ఆహారంలో ఒక భాగం. ఇకవీరు తమ జీవన భృతికోసం అడవి సంపదైన పండ్లు, కుంకుడుకాయలు, తేనె, ఔషధసంబంధ మూలికలు మొదలైన వాటిని పరిసర సంతలలో అమ్మకుంటారు. ఇవేకాక వెదురుతో బుట్టలు, తడికెలు తయారు చేసి అమ్మి వచ్చిన డబ్బుతో తమ ఇంటికి కావలసిన సరుకులు కొంటారు. చెంచు స్త్రీలు పరిసర గ్రామాలలో సోది లేదా ఎరకు చెప్పి జీవనం గడుపుతారు. వీరు వుండే ప్రాంతాన్ని "పెంట" మరియు గూడేంలు అంటారు.

సమాజం దృష్టిలో చెంచులు :

సమాజం మరియు ప్రభుత్వం దృష్టిలో చెంచులు అనాగరికులు, అటవికులు. ఈ విధమైన భావన చెంచుల మీద సమాజానికి ఏర్పడడానికి పలుకారణాలు ఉన్నాయి. ప్రధానంగా చెంచులు నిరక్షరాసులు అవ్వడం, ఈ నాటి వ్యవసాయం ఇతర వృత్తులు చేపట్టకుండా నాగరికత సమాజానికి దూరంగా అడవిలో జీవించడం, ప్రభుత్వం వీరికోసం చేపట్టే అభివృద్ధి చర్యలకు దూరంగా వుంటూ దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించడం, వీరికి వచ్చే అనేక జుబ్బులకు శాస్త్రియ్యమైన కారణాలు తెలియక నాటు వైద్యం, మూఢ నమ్మకాలతో ప్రాణాలు పోగొట్టు కోవడం, నల్లమలలోని దిగువమెట్ట మొదలైన ప్రాంతాలవారు తిండిలేని రోజులలో దారిదోపిడీలకు పాల్పడడం మొదలైన అనేక కారణాలవల్ల వీరిని అనాగరికులుగా సమాజం చిన్నచూపు చూస్తుంది. ఇది నాణానికి ఒకవైపు మాత్రమే. చెంచుల ఆచారాలలో నవసమాజానికి ఆదర్శవంతమైన విషయాలు అనేకం ఉన్నాయి. వాటిని తెలుసుకోవాలంటే చెంచుల జీవనశైలిని లోతుగా అధ్యయనం చేయాలి.

చెంచుల జీవనశైలి :

చెంచుల జీవన శైలి విభిన్నమైనదేకాదు విశిష్టమైనది

కూడా. చెంచులు ప్రధానంగా స్వేచ్ఛాప్రియులు మరియు ప్రకృతి ప్రేమికులు అందకే ప్రకృతికి ఆలవాలమైన అడవు లను వదలి వారు రారు. చెంచుల జీవనశైలిలో ఆదర్శ వంతమైన విషయాలలో ప్రధానంగా చెప్పుకోవలసింది స్త్రీ సాధికారితగురించి.

చెంచుల సంస్కృతిలో స్త్రీలు :

చెంచుల సంస్కృతిలో స్త్రీకి ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా పూర్తి స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు ఉన్నాయి అనడం సత్యదూరంకాదు. నాగరిక సమాజంలో స్త్రీ ప్రధానంగా వివక్షకు గురికావడానికి స్త్రీకి ఆర్థికస్వేచ్ఛ లేకపోవడం ప్రధానకారణం. స్త్రీ తన అవసరాల కోసం బాల్యంలో తన కుటుంబంపైన, పెళ్లైన తర్వాత భర్తమీద ఆధారపడాల్సిన పరిస్థితి. చెంచు స్త్రీలు తమ ఆర్థిక అవసరాల కోసం పురుషుల మీద పెద్దగా ఆధారపడరు. పురుషులతో సమానంగా కష్టపడి పనిచేస్తారు. తమ ఆహారసంపాదన పిల్లల పోషణ వారి స్వశక్తితోనే జరుపు తారు. రాజకీయంగా గూడెం పెద్దకు ఎంత అధికారం ఉంటుందో వారి భార్యకు కూడా అంతే అధికారం ఉం టుంది.

ఇక వివాహ విషయంలో చెంచు స్త్రీలకు పూర్తి స్వేచ్ఛ ఉంది. తమకు నచ్చినవారిని చెంచుస్త్రీలు వివాహం చేసుకుంటారు. భర్త ఏదైనా కారణం చేత నచ్చకపోతే వారి కుల పంచాయితీ ద్వారా విడాకులు తీసుకుంటారు. ఇక్కడ విడాకులు తీసుకోవడం అంటే భర్త నుండి విడిపోయి వేరుగా జీవనం సాగించడమే. ప్రధానంగా వీరి వివాహాలు మూడురకాలుగా జరుగుతాయి.

1. పెద్దలుకుదిర్చిన వివాహాలు
2. లేచిపోయి పెళ్ళి చేసుకోవడం
3. కలుసుకోవడం

పెద్దలు కుదిర్చిన వివాహాలు :

చెంచులలో పెద్దలు కుదిర్చిన వివాహాలు ఎక్కువగా జరుగుతాయి. అవి కూడా మేనరిక సంబంధమైనవి. మొదటగా అబ్బాయి తరపున వారు అమ్మాయి ఇంటికి వెళ్ళి పిల్లని అడుగుతారు. అమ్మాయికి, వారి ఇంటివారికి అబ్బాయినచ్చితే సంబంధం కాయపరచుకొని పెళ్ళి జరిపిస్తారు. అయితే చెంచులు అబ్బాయితరపున వారు అమ్మాయి కుటుంబానికి "ఓలి" కట్నం చెల్లించడమనే ఆచారముంది. ఎక్కువ మటుకు ఈ ఓలి వస్తురూపంగానే ఉంటుంది. బంగారం, వెండి, గొర్రెలు, మేకలు, లేదా ఎద్దులు వంటి వాటిని ఓలిగా ఇస్తారు. వరకట్నమనే దురా చారం చెంచులలో లేదు. మన సమాజం శాస్త్ర సాంకేతి కంగా ఎంత అభివృద్ధి చెందిన, పురుషులతో పాటు స్త్రీలు అన్ని రంగాలలో రాణిస్తున్నా పెళ్ళి విషయంలో అబ్బాయి తరుపువారి కోర్కెలు తీర్చాల్సిందే. ఎంత అందం ఉన్నా, చదువున్నా అమ్మాయి తరపువారు అబ్బాయి కుటుంబానికి అడిగినంత కట్నం, లాంచనాలు ఇవ్వవలసిందే. ప్రభుత్వం ఈ దురాచారాన్ని రూపుమాపడం కోసం వర కట్న నిషేదం మీద అనేక చట్టాలు చేసిన నేటికి వరకట్న సమస్య ఎన్నోకుటుంబాలను పట్టిపీడిస్తుంది. పెళ్లైనా అత్తింటివారి వరకట్న దురాశకు తమ జీవితాలను బలి తీసుకున్న అభాగినులు ఎంతమందో. ఈ విషయంలో నాగరిక సమాజంతో పోల్చుకుంటే చెంచులు ఎంతో ఉన్నతులుగా కనిపిస్తారు.

లేచిపోయి పెళ్లిచేసుకోవడం :

అమ్మాయి, అబ్బాయి ఒకరినొకరు ఇష్టపడిన సంద ర్భంలో ఎవరికి చెప్పకుండా గూడెం నుండి లేచిపోయి పెళ్ళిచేసుకుంటారు. దీనినే రాక్షస వివాహం, ఎత్తుకుని పోయి పెళ్ళి చేసుకోవడం అనేపేర్లుకూడా ఉన్నాయి. ఇలా పెళ్ళి చేసుకున్న జంట కొన్ని రోజుల తర్వాత గూడేనికి వస్తే పెద్దలు వారి పెళ్ళిని అంగీకరించాలి. అయితే వచ్చిన తర్వాత అబ్బాయి తరపున వారు అమ్మాయి కుటుంబానికి ఓలిని మాత్రం తప్పని సరిగా ఇవ్వాలి. ఒకవేళ పెళ్లైన స్త్రీని ఎత్తుకుని వెళ్ళి మారు వివాహం చేసుకుంటే పెళ్ళి కొడుకు అమ్మాయి మొదటి భర్తకు ఓలి ఇవ్వాలి. మొదటి భర్త ఈ పెళ్ళిని ఆక్షేపించే అధికారం లేదు. స్త్రీని భోగ వస్తువుగానో లేదా తన సొంత సొమ్ముగా భావించే

సంస్కృతి చెంచులలో లేదు. చెంచు స్త్రీలకు వైవాహిక, లైంగిక స్వేచ్ఛ పూర్తిగా ఉందనడానికి పైన చెప్పిన ఉదంతాలే నిదర్శనం.

స్త్రీ కోరుకుంటే తనకు పెళ్ళైనా భర్తను వదలి పరాయి మొగాడితో కలసి లేచిపోయి వెళ్ళి పెళ్ళి చేసుకోవచ్చు. దానిని చెంచులు తప్పుగా చూడరు. అందుకే చెంచు సమాజంలో స్త్రీల మీద అత్యాచారాలు నాగరిక సమాజంతో పోల్చుకుంటే చాలా తక్కువ. అంతేకాదు వీరు విందులు, జాతరల సమయాలలో చెంచుస్త్రీలు పురుషులతో పాటు మద్యాన్ని సేవించి నృత్యం చేస్తారు. కాని స్త్రీ మద్యం తాగడం, ఇష్టంలేని భర్తను ఒదిలివేయడం. వేరొక మగవాడితో వెళ్ళిపోవడం అనేది నాగరిక సమాజంలో పెద్ద తప్పుగా భావిస్తారు. అలాంటి స్త్రీలను చాలా హీనంగా చూస్తారు. కుటుంబ సభ్యులు కూడా వారిని అంటరానివారిలాగా భావించి దూరంగా ఉంచుతారు. ఇక అబ్బాయి అమ్మాయి కులాలు వేరైతే పరువు కోసం హత్యలు చేసే ఉదంతాలు నేటికి మనం అనేకం పత్రికల్లోను, టీవిల్లోను అనుదినం చూస్తునే ఉన్నాం. వివాహ విషయంలో స్త్రీ స్వాతంత్ర్యానికి, లైంగికంగా స్త్రీ స్వేచ్ఛకు చెంచులు అధిక ప్రాధాన్యమిస్తారు.

కలుసుకోవడం :

పెళ్ళై భర్త చనిపోయిన స్త్రీలు తమకు ఇష్టమైన మగ వారితో ఎకాంతంగా కలవడాన్ని కలుసుకోవడం అంటారు. వీరి ఇద్దరిమధ్య ఎటువంటి ఒప్పందాలు ఉండవు. ఇష్టమైనంతకాలం కలుస్తారు. నచ్చక పోతే విడిపోతారు. అంతేకాని ఈ విషయంగా గొడవలు పడడం పంచాయితీలు పెట్టడం ఉండవు. పెళ్ళికాని అమ్మాయి అబ్బాయిలు కూడా ఇష్టపడి కలుసుకుంటారు. నచ్చకపోతే ఎవరికి వారుగా విడిపోయి వేరు వివాహం చేసుకుంటారు గాని ఆవిషయంగా కక్షలు, కార్పణ్యాలకు పోరు. ఒక వేళ అబ్బాయివల్ల అమ్మాయి గర్భందాలిస్తే అపుడు మాత్రం ఆ అబ్బాయి అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలి. పెళ్ళి కాకుండా గర్భం దాల్చడం కూడా చెంచు సమాజంలో ఆమోదయోగ్యమే.

పైన చెప్పిన వివాహ పద్ధతులు చెంచు సమాజంలో స్త్రీ కున్న ప్రాధాన్యాన్ని వారికున్న గౌరవానికి నిదర్శనంగా చెప్పవచ్చు. నాగరికులమైన మనం మాత్రం ఈ నాటికీ స్త్రీని ఒక భోగవస్తువుగానో, వంటింటి కుందేలుగానో, పనిచేసే యంత్రంలాగానో భావిస్తున్నాం. స్త్రీలపై జరిగే మానభంగాలు, అత్యాచారాలు స్త్రీల విద్య, వివాహం వంటి విషయాలలో వివక్ష చూపిస్తున్న నేటి సమాజం చెంచుల సంస్కృతి నుండి అనేక విషయాలను స్వీకరించాలి.

పర్యావరణ పరిరక్షణ :

చెంచుల నుండి నాగరిక సమాజం నేర్చుకోవల్సిన మరొక విషయం పర్యావరణ పరిరక్షణ ముందే చెప్పుకున్నట్లు చెంచులు ప్రకృతి ప్రేమికులు. ఇది వీరి ఆవాసాలను చూస్తేనే అర్థమౌతుంది. వీరు సిమెంటు ఇటుకులతో నిర్మితమైన పక్కాగృహాలలో కాకుండా అడివిలో దొరికే వెదురుతో తడికెలు, తలుపులు తయారుచేసి చుట్టు గుడిసెలు వేసుకుంటారు. ఇంటిపైకప్పుగా అడవిలో దొరికే ఒకరకమైన గడ్డిని వాడతారు. వీరు తమ ఆవాసాల కోసం చెట్లను కొట్టివేయరు. మైదాన ప్రాంతంలో తమ గుడిసెలను నిర్మించుకుంటారు. అంతేకాకుండా వీరు గృహనిర్మాణంలో ప్రధాన వస్తువైన కలప కోసం పచ్చని చెట్లను నరకరు. ఎండు చెట్ల నుండి వచ్చే కలపే ఎక్కువగా ఉపయోగిస్తారు. వరదలు వచ్చి ముంపునకు గురైన, కార్చిచ్చు రగిలి గుడిసెలు అంటుకున్న సందర్భంలో చదునుగా ఉన్న మరొక ప్రాంతంలో తమ ఆవాసాలను ఏర్పరుచుకుంటారేగాని వారి అవసరం కోసం అడవి ప్రాంతాన్ని చదును చేయరు.

అడవిలోని వివిధ చెట్లు, జంతువులనుండి తమ పితృ దేవతలు పుట్టారని విశ్వసించి వాటిని పూజిస్తారు. అరుదైన పక్షులు, జంతువులు తిరిగే ప్రాంతాలను దేవభూములుగా పరిగణించి అక్కడ వేట చేయరు. ఆ ప్రాంతాన్ని పరమపవిత్రంగా చూస్తారు. చివరికి ఆ దేవభూములలో

మల, మూత్ర విసర్జన చేయరు. చివరికి కాలికి చెప్పులు వేసుకొని వెళ్లడం లాంటివి కూడా చేయరు. ఈ విధంగా అరుదైన వన్య ప్రాణులు మరియు పక్షుల సంరక్షణలో చెంచులు తమదైన పాత్ర పోషిస్తారు. ఇక వీరు నమ్మిన దేవతలు శాకాహారులైనందున పశువులను బలి ఇచ్చే సంప్రదాయం చెంచుల సంస్కృతిలో లేదు. చెంచులు కేవలం వీరి ఆహార సంపాదన కోసం మాత్రమే వేటాడుతారు. అదికూడా చుంచు ఎలుక, ఉడుత, బల్లి, ఉడుము, కుందేలు, తాబేలు పిచుకులు వంటి చిన్న చిన్న జంతువులను మాత్రమే వేటాడతారు. వినోదం కోసం కాని, బలిపేరుతో కాని తమతో సహజీవనం చేసే జంతు జాలానికి హానికలిగించరు. ఈ సందర్భంలో వీరికి సంబంధించిన ఒక చిన్న విషయం ప్రస్తావించుకోవాలి ప్రపంచంలో అత్యధిక జనాభా తినే ఎద్దు లేదా దున్న మాంసం వీరికి నిషిద్ధం. అంతేకాకుండా సర్వసాధారణంగా తినని కోతులు మరియు కొండముచ్చులు మాంసం వీరికి ఇష్టమైన ఆహారం.

సామాజిక సమానత్వం :

చెంచులలో కనిపించే మరొక గొప్ప విషయం వీరి సామాజిక జీవనం. చెంచుల ఆర్థిక పరిస్థితి ఇంచుమించు అందరిది సమానంగానే ఉంటుంది. ఉన్నవాళ్ళు, లేని వాళ్ళు అనే భేదభావం ఉండదు. వీరిలో భవిష్యత్తుకోసం పొదుపు చేసుకోవాలి. దాచుకోవాలి అనే స్వార్థపూరిత ఆలోచనలు ఉండవు. ఏరోజు తిండి ఆరోజే వెతుక్కుంటారు. మోసం, నమ్మక ద్రోహం, కుట్ర వీరిలో కనపడవు. అవేశంలో వీరు ఎవరిపైనైనా దాడులు చేస్తే ఒప్పుకుంటారు గానీ అబద్ధం మాత్రం చెప్పరు. కలుసుకోవడమే వారి కట్టుకోవడం నచ్చకపోతే గుట్టుగా విడిపోవడమే రచ్చలు రావిళ్ళు లేని విడాకులు. హత్యలు, అత్యాచారాలు అరుదు. సత్యసంధత, నిష్కపటత్వం వీరికి పెట్టని భూషణలు. ఏదైనా చెంచుపెంటలో కరువు ఏర్పడి వనరులు, త్రాగేనీరు తగ్గిపోయి కొన్ని కుటుంబాలు తమ బంధువుల పెంటకు వస్తే. వారిని ఆ పెంటలోని ప్రజలు ఆహ్వానిస్తారు. వారు వినియోగించే వనరులలో వచ్చిన వారికి కూడా గ్రామస్థుల అంగీకారంత కొంత భాగం కేటాయిస్తారు. ఉన్నదాన్నే అందరూ పంచుకుని బ్రతకాలి అనే ధర్మాన్ని పాటిస్తారు. స్త్రీ స్వేచ్ఛ, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సమా నత్వం ఇలా చెప్పుకుంటూ పోతే చెంచుల సంస్కృతి నుండి నేర్చుకోవలసిన విషయాలు అనేకం ఉన్నాయి. ఈ ఆచారాలు, కట్టుబాట్లు చెంచుల సంస్కృతి ఆభరణాలే కాదు నవ సమాజానికి, నాగరిక ప్రజలకు ఆదర్శనీయం కూడాను.

ఆధార గ్రంథాలు :

1. ఫ్యూరర్ హైమండార్ఫ్, సి.వి. 1982 "దిట్రైబ్స్ ఆఫ్ ఇండియా - ది స్ట్రగుల్ ఫర్ సర్వైవల్', న్యూఢిల్లీ : ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్.
2. పిరాట్ల రామకృష్ణ, 1998, "కొండ కోనలలో తెలుగు గిరిజనులు" శక్తి ఫౌండేషన్, హైదరాబాద్.
3. డా.కె. శ్యామల, 2011 "చెంచు - గిరిజనమాలక" ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.
4. నదీం హస్‌నైన్, 2013, "భారతీయ గిరిజనుల" ఓరియంటల్ బ్లాక్ స్వాన్, హైదరాబాద్.
5. మిర్యాలజ్యోతి 2010, "చెంచు కళారూపాలు - గేయసాహిత్యం" సిద్ధాంత వ్యాసం, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
6. గిరిజన సంస్కృతి సంచిక - 27 జూలై, 2009, ట్రైబల్ కల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, హైదరాబాద్.

మనుచరిత్ర, రామాభ్యుదయాలలో గిరిజన సంస్కృతి

– డా॥. బ్రహ్మానందరెడ్డి, పోస్ట్ డాక్టొరల్ ఫెలో, తెలుగు అధ్యయనశాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

ప్రపంచంలోని విభిన్న సంస్కృతులకు మూలం ఆయా ప్రాంతాలలోని గిరిజన సంస్కృతే అనడంలో సందేహం లేదు. మానవజాతి పరిణామక్రమంలో మొదటి దశ ఆటవిక జీవనమే. కొండల్లో, అడవుల్లో స్వేచ్ఛగా తిరుగుతూ, నిర్మలమైన మనసుతో, కల్లాకపటం లేకుండా ఆనంద జీవనాన్ని ఆస్వాదిస్తూ సంచార జీవనం చేసేవారే ఆటవికులు లేదా గిరిజనులు. కొన్ని కావ్యాల్లో ఈ గిరిజనులను కఠిన హృదయులుగా, దారిదోపిడీ చేసేవారుగా, రాక్షసులుగా వర్ణించడం జరిగింది. అయితే కొన్ని కావ్యాల్లో గిరిజనులను మంచి మనసున్నవారిగా, వేటగాళ్ళుగా, రాజులుగా చిత్రించారు.

గిరిజనుల సంస్కృతిలో కన్పించే వివిధ అంశాలను ఆధారంగా చేసుకుని వీరిని ప్రత్యేక తెగలుగా విభజించడం జరిగింది. శబర, పులంద, బోయ, కిరాత, భిల్ల మొదలైన శబ్దాలను ఒకే జాతికి అన్వయించడం జరిగింది. గిరిజనుల సంస్కృతిని గురించి ఎక్కువగా చెప్పిన ధూర్జటి చెంచుల్ని గురించి చెబుతూ చెంచు, శబర, ఎఱుక, భిల్ల, పుళింద, వ్యధ, లుబ్ధ, వనచర, ఆటవిక శబ్దాల్ని ప్రయోగించినాడు.

మానవుని క్రమపరిణామాన్ని గూర్చి చెబుతూ నాయని కృష్ణకుమారి గారు "అతను సంస్కృతి పథంలో పయనించిన ప్రస్తానాన్ని మూడుదశలుగా విభజించుకోవడానికి వీలుంది. అందులో మొదటిది ఆటవికత (Savagery) రెండవది మోటు జీవితం (Barbarism) మూడవది నాగరికత (Civilization) అను తన పరిశోధన వ్యాసంలో పేర్కొంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 33 జాతుల గిరిజనులున్నట్లు వెన్నెలకంటి రాఘవయ్య తన 'యానాది' అనే గ్రంథంలో పేర్కొన్నారు. అవి "చెంచు, కోయ, గోండు, భగత, గదబ, జాతపు, కమ్మర, కట్టునాయక, కొండ దొర, కొండకాపు, కొండరెడ్డి, ఖోండు, కొటియ, బెంతొలరియ కులియ, మాలి, మన్నెదొర, ముఖదొర, పొరజు, రెడ్డిదొర, రోన, సవర, సుగాలి, యానాది, ఎరుకుల, అంధ్, భిల్లు, నాయకపోడ్, కోలం, పర్ధాన్, తోటి, గౌడు, నాయకవాల్మీకి జాతులని పేర్కొన్నారు.

గిరిజనుల జీవన విధానాన్నిబట్టి మూడు విభాగాలుగా వర్గీకరించవచ్చని కె.బాలగోపాల్ తన 'గిరిజన స్రవంతి' లో పేర్కొన్నారు. అవి వేటమీద (Hunting) ఆహార సేకరణ (Food gathering) మీద ఆధారపడి జీవించేవాళ్ళు. పశుపోషకులు (Pastoral tribes) ఆహార ఉత్పత్తి చేసే వాళ్ళు (Food producers).

తెలుగు కావ్యాల్లో గిరిజనుల జీవన సంస్కృతి గురించి వివరించడం జరిగింది.

ఆంధ్రభోజుడిగా కీర్తికెక్కిన శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో గిరిజన సంస్కృతిమీద అధికంగా పట్టు కల్గిన వ్యక్తి మహాకవి ధూర్జటి. ఇతని శ్రీకాళహస్తి మాహాత్మ్యంలో ఆ విషయం బోధపడింది. ఇదే కాలానికి చెందిన అల్లసాని పెద్దన తన మనుచరిత్రలో, అయ్యలరాజు రామభద్రుడు తన రామాభ్యుదయంలో గిరిజన సంస్కృతికి సంబంధించిన విషయాలను పేర్కొనడం జరిగింది.

మనుచరిత్ర, రామాభ్యుదయంలోని గిరిజన సంస్కృతి :

అల్లసాని పెద్దన మనుచరిత్రలో పుళింద, ఎఱుక, శబర, చెంచు, మృగయులు, వేటకరులు మొదలైన శబ్దాల్ని ప్రయోగించారు. అయ్యలరాజు రామభద్రుడు 'రామాభ్యుదయం'లో చెంచు, బోయ, నిషాద, మృగయ శబ్దాల్ని చర్చించడం జరిగింది.

పెద్దన 'మనుచరిత్ర'లో ఎఱుకులు ధైర్యసాహసాలు కలవారని వర్ణించాడు. స్వరోచిని వేటకు రావలసిందిగా

ఆహ్వానిస్తూ చెప్పిన మాటల్లో వారి ధైర్యసాహసాల్ని ఉటంకించారు.

"సటవెత్తుకొని యొత్తు కిటినైన మోటాన
పడియేయ బొడుతు నీపాదమాన
కలగుండు వడజెండు కరినైన జెవిపట్టి
బలిమియై దెత్తు నీ పాదమాన
సెలనొప్పుకొని రొప్పు పులినైన బీడించి
పడవైతు జొచ్చు నీపాదమాన
తెరదూఱి వెఱబాఱు గురుపోతు పైనైన
బడియెక్కి పొడుతు నీ పాదమాన
ఇతర దుర్బల మృగ పంక్తులేమిలెక్క
కండగరువంపు మాటలుగావు సుమ్ము
చూడు మమ్మని పంతంబు లాడుకొనుచు"

అడవిపంది, ఏనుగు, పులి మొదలైన క్రూర జంతువుల్ని అవలీలగా చంపివేయగలమని, అల్ప మృగాలు లెక్కలేదని గిరిజనుల నమ్మకం. తమ ధైర్య సాహసాలపై గిరిజనులకు ఆత్మవిశ్వాసానికి ప్రతీక పై పద్యం.

అయ్యంరాజు రాయభద్రుని 'రామాభ్యుదయం'లో చెంచుకుమారుల, స్త్రీల సాహసాల్ని ప్రస్తావించారు. దశరథుని దర్శించిన చెంచులు వేటకు రావలసిందిగా ఆహ్వానిస్తూ తమ కుమారుల ధైర్యసాహసాల్ని ఇలా చెప్తారు. చెంచుకుమారులు చిఱుతపులుల్ని పొట్టేళ్ళులా భావించి వానిపైకి ఎక్కి ఆటలాడుకుంటారు.

"ఓడక చిఱుతపులి మొత్తము
నేడిక పొట్టేళ్ళరీతి నెదిరి నిరూఢిన్
గ్రీడింతురెక్కి యాడుచు
జొడంగవలచటి చెంచు చుంచుం గొమరుల్"

చెంచు పురుషులేకాక స్త్రీలు కూడా వీరరసం ఉట్టిపడే స్వభావం కలవారే. జీవితమే అడవుల్లో కాబట్టి అడవుల్లో చరించే సింహశార్దూలాది క్రూరజంతువుల్ని కూడా లెక్క చేయకుండా తిరుగుతారని చెంచులు దశరథునితో చెప్పిన తీరును గమనిస్తే తెలుస్తుంది.

"హాళి గురంగపాళి శరభాళి నదల్చి కదల్చి కేసరి
శ్రీల దృణీకరించి చమరింబులినమ్ముల నొత్తి మత్తళుం
డాల ఘటోపకారకలనన్ దగియందు జరింతు రెంతకుం
జాలరు వీరవిభ్రమ రనంబులెనంగు మిటారి బోయెతల్"

'మనుచరిత్ర' లో ఎఱుకలవేటను వర్ణించారు. ఎఱుకరాజు స్వయంగా వేటకై స్వరోచిని ఆహ్వానించి వేట సామగ్రిని సిద్ధం చేస్తారు. వాటిలో నీలిదిండ్లు, సెలకట్టెలు, విల్లుల, మోటకత్తులు, అమ్ములు వున్నట్లు క్రింది పద్యంలో తెలుస్తుంది.

"కట్టిన నీలిదిండ్లు సెలకట్టియు విండ్లును విండ్లగొసెనల్
చుట్టి నొసళ్ళపై నిడిన జుంజుఱు బల్ల సిగల్‌కటి తటిం
బెట్టిన మోటకత్తులు మేనులగార్కొను కప్పలేర్చి చే
బట్టిన వేటయమ్ములును బాగగువాగురికుల్ మహాధ్వనిన్"

వలల సాయంతో వేటాడిన జంతువులను 'స్వరోచి' కిచ్చిన విషయం ఈ పద్యంద్వారా తెలుస్తుంది.

"వల బాఱిన వానిని భటు
లలుగుల పాలాడిరధిపుకై పట్టిరి బె
బ్బులి మహిష యెలుగు కిటిదో
డెలు మొదలగు వానిగొనిటిని వేటకరుల్"

ఒక కిరాతుడు తన చేతిలోని సెలకట్టితో పక్షిని (జెముడు కాకిని) చంపిన విషయాన్ని పరిశీలిస్తే

"మొలదట్టి చెఱగు జెక్కుచు
బలుదిట్ట కిరాతుడొకడు పటువగు ముష్టిన్
సెలకట్టె బట్టె వేఱొక
సెలకట్టెన్ గొట్టివైచె జెమరుంగాకిన్"

రామాభ్యుదయంలో వాల్మీకి వేటకు వెళ్ళడానికి చెంచులు సర్దిన వేట సరంజామా

"వలలుంబోనులు చిక్కముల్చులుదులున్ వాకట్టు మందుల్ తెరల్
సెలగట్టెల్ తడవిండ్లు నమ్ముల పొదుల్ చే కత్తులుం బల్లియం
బులు పందీటెలు నీలిదిండ్లు పిడియంబుల్పూని లీలన్ విశృం
ఖలవృత్తిన్ దెర వేటకాండ్రు గొలువంగ వచ్చె రాజున్నతిన్"

చెంచులు వేటాడటమేగాక తోటపనుల్ని కూడా చేస్తారని రామాభ్యుదయంలో చెప్పబడింది. నిజానికి ఈ రెండునూ చెంచుల జీవితంలో అంతర్భాగాలు

"పడుచులు పైదలు మేమున్
బడివాయక వేట తోట పనులను మీ వెంట
బడిదిరుగుచు గములనే
యిడుములు లేకుండ నుందమే యెడలందున్"

గిరిజనులు ఆటవిక వస్తువుల్ని సేకరించి అమ్ము కోవడం ప్రాచీన కాలంనుండి ఉన్న ఆచారంగా చెప్పు కోవచ్చు. పెద్దనగారి మనుచరిత్రలో

"ఒక్క యెఱుక జేడు నక్కకొమ్మును నిట్టి
గోఱజంబు జున్ను జాఱపప్పు
బీలిగఱుల యంపకోలలు సెలవిండ్లు
గానుకిచ్చి కరయుగంబు మొగిచి"

రామాభ్యుదయంలో

"పులిగోరుల్ పెరతేనె కస్తూరి మెకంబుల్ పున్గు జవ్వాజి పిల్లుల గోరోచన మిఱ్ఱులున్ బికిలిపూలున్ జల్లులున్ మావి పండులు గుండేళ్ళును జాఱపప్పు సెలవిండ్లున్ బారవాతంపక
ట్టెలు గైకొనుకలిచ్చి బోయదొరబిడ్డల్ గాంచిరావిభున్"

ఈ విధంగా నాగరికులకు గిరిజనుల సాయం అడుగడుగునా మన సాహిత్యంలో కనిపిస్తుంది. అయితే నేడు గిరిజనులు కూడా విద్యనేర్చి ఉద్యోగ జీవితాలు ప్రారంభించడం వల్ల కొంత సంస్కృతిలో మార్పు వచ్చిన మాట నిజమే. కాకపోతే అడవుల్లో వున్నటువంటి వారి జీవితాలు ఇప్పటికీ అడవితల్లిలా, అడవి పూలులా స్వచ్ఛంగా, నిర్మలంగా సువాసనలను వెదజల్లుతూనే ఉన్నాయి.

గురికల ఎరుకల మొనగాడు

– డా॥ పి.ఎ. సత్యనారాయణ, సహాయ ఆచార్యులు, తెలుగు & ప్రాచ్యభాషా విభాగం, ప్రభుత్వ కళాశాల (అటానమస్), రాజమహేంద్రవరం.

ఉపోద్ఘాతం :

యుద్ధ భూమిలో విజయమో, వీర స్వర్గమో తేల్చు కోవసిన రాజులు, రాజ్య సంక్రమణం మీదో, ప్రజా సంరక్షణ మీద దృష్టి పెట్టాల్సిన, క్షత్రియులు గతి తప్పి వ్యసనాన్ని వినోదం చేసుకోవడం అధర్మం.

స్వకీయ మార్గం వదలి దారితప్పిన పెంపుడు కుక్క పెంపుడు బుద్ధితో సంక్రమిత ఆక్రమణ స్వభావంతో, గురితప్పని తపస్సులోని విలుకాడిని గురి తప్పేలా ఇబ్బంది పెట్టడం, ఎదురులేని, బాణానికి అది గురి అయ్యేంతగా విలుకాడిని విసిగించడం, భయ పెట్టడం చేసేసరికి కరవొచ్చే కుక్క నోట్లో ఏడు బాణాల్ని ఏక కాలంలో గంపగుత్తగా విసిరాడు. దెబ్బ తగిలితే కాని దారికి రాని కుక్క దిక్కున్న చోట చెప్పుకోవటానికి దారి వెతుక్కుని దెబ్బకి దారిలో పడింది.

బెత్తెడంత నోటిని ఏకకాలంలో గురి చేసుకున్న ఆరు నొక్క అస్త్రాల విన్యాసం, యువరాజులు పంచెలు తడుపు కునేలా చేసింది. మీసాలు మెలేసే పొగరుబోతు గర్వం నిలువెత్తు ప్రతిభముందు మోకరిల్లేలా చేసింది. నివ్వెర పోయేలా చేసింది. ఆత్మన్యూనతలోకి నెట్టేసింది. చివరికి తోకముడిచేలా చేసింది.అసూయతో రగిలిపోతూ కుట్రలు పన్ని నిలువునా దిగజారిపోయేలా చేసింది. మాత్సర్యపు మచ్చ మహా ప్రస్థానం చేసినా వెంటాడేలా చేసింది.

రాగ ద్వేషాలు లేని స్థిత ప్రజ్ఞతగల గురుస్థానం పక్ష పాతం ఊబిలోకి దిగబడిపోయేలా చేసింది.

'కపటి' కళంకాన్ని చచ్చినా పోకుండా చేసింది.

దెబ్బతిన్న కుక్క సంగతి వదిలేసి ధీరులు భీరులై దిమ్మతిరిగిపోయేలా చేసిన అస్త్ర విన్యాసం గురించి ఆరాతీస్తున్నారు.

వివరాలు తెలుసుకుని కుటిల గురువుకు విలుకాడిని వెన్నుపోటు పొడిచే దురాగత పథకానికి ఒడికట్టారు. కులం తక్కువ వాడయితేనేం గుణం కలవాడు. వర్ణం తక్కువ యితేనేం వందనం ఉన్నవాడు. చదువులేకపోతేనేం సంస్కారం ఉన్నవాడు. వేలు తెగిన చేతిలో బాణాల గురి తప్పినా 'గురి' కలవాడు.

ద్రోణుడి కౌటిల్యాన్ని, అర్జునుడి మాత్సర్యాన్ని, సంప్రదాయం సమర్థిస్తుంది. ముందు చూపుతో లోకోద్ధరణ కోసం, ధర్మ సంస్థాపనార్థం, వేలు తీయవలసి వచ్చింది. ప్రతిభను కుంటుపరచాల్సిన అగత్యం వచ్చి పడింది అంటుంది.

వాళ్ళు చేసేవి, చెప్పేవి మాత్రమే ధర్మం. మిగిలిన వాళ్ళది అధర్మం అని వకల్తా పుచ్చుకుంటుంది.

యుద్ధం చేయడం రాజధర్మం. ఆక్రమణ కోసమైనా, ఆత్మ రక్షణ కోసమైనా ! కాని యుద్ధ కళను వినోదం కోసం మూగ జీవాల్ని బలి తీసుకోవడం ఏంధర్మం !

వెన్నుచూపడం, వెన్ను పోటు పొడవడం రాజధర్మమా?

మాయకత్వంతో దొంగ దెబ్బ తీయడం, అదను చూచి వలపన్ని వేటు వేయడం, గురికి చిక్కిన జంతువు తోలు తీసి కాల్చుకు తిని కడుపు నింపుకోవడం వేటగాడి వృత్తి ధర్మం.

కానీ ఇక్కడ బళ్ళు ఓడలు, ఓడలు బళ్ళు అయ్యాయి. వేటగాడి లక్షణాలు యువరాజులకు యువరాజు లక్ష ణాలు వేటగాడికి పరస్పరం బదిలీ అయ్యాయి. వేటగాడు జంతువులపట్ల మాయల మారిగా ఎత్తులు వేయాల్సిందే! లేకపోతే జంతువు ఎరకు చిక్కదు. కడుపు నిండదు.

కాని యుద్ధభూమిలో జిత్తులమారితనం, దొంగ దెబ్బ తీయడం యుద్ధనీతి కాదు. గెలవడమంటే ఎలాగయినా గెలవటం కాదు. అది ధర్మవిజయం కావల్సిందే ! అలాగే యుద్ధ రంగంలో గెలుపుకే విలువ ప్రాణానికి కాదు! అక్కడ

వీర స్వర్గమే ముఖ్యం కాని, వెన్ను చూపించి బతికి బట్టకట్టడం అధమం.

కాని ఇక్కడ ఏకలవ్యుడి ఏడు బాణాల అస్త్ర విన్యాసానికి, చాకచక్యానికి, అరితేరిన విల్లు కళాకౌశలానికి రాకుమారులకు అస్త్ర సన్యాసం చేసేంతపనయ్యింది. తలపడకుండానే తలవంచుకోవలసి వచ్చింది. అనన్య సామాన్య ప్రతిభకు సలామ్ చేయాల్సి వచ్చింది.

అందుకే కుక్క తోకపట్టుకుని ఏకలవ్యుణ్ణి వెతుక్కుంటూ వెళ్ళవలసివచ్చింది.

దిమ్మ తిరిగి పోయేలా చేసిన ఆ విల్లు కళాకోవిదుడి దర్శనభాగ్యానికి సంభ్రమాశ్చర్యాలతో పరుగిడవలసి వచ్చింది. తీరా చూశాక వాళ్ళని అసూయ కాల్చేసింది. చివరికి విలుకాడు నేలకొరిగేలా వేలు మీద వేటు వేసింది.

ఇంద్రుడి కొమ్ముకాసిన వామనుడి మూడో పాదంలా కుటిల పక్షపాత గురువు దిగిరావాల్సివచ్చింది. దిగజారి పోవలసి వచ్చింది.

కథకుడి టోన్‌కూడా కుటిల పాత్రల్ని ఎండగట్టుతున్నట్టు ఎద్దేవా చేసినట్టు లేదు. ధీరపాత్రకు వత్తాసు పలికనట్టూ కనపడదు.

దిట్టంగా, పొడుగ్గా, నల్లని ఆకారంగా జింక చర్మం తొడుకున్న ఎరుకులవాడు అంటూ వట్టిపోయిన చప్పటి స్వభావోక్తులతో సరిపెడతాడు.

ఆంధ్రపండితులు తాము అనార్య, నిషాద జాతి వాళం కాదనినమ్మబలుక్కున్నారేమో ! అంతేకాక అభ్రమ భరిత భావజాలం పితృ పారంపర్యంగా సంక్రమించిందని సిబిడితా విమర్శకులు వాపోతున్నారు.

ఏకలవ్యుడి నిండుమూర్తిమత్వాన్ని అద్దం పట్టడానికి కనీసం ఒక ఖండకావ్యమో! పెద్ద నిడివిగల దృశ్యకావ్యమో కావల్సివస్తుంది. కాని కథకుడు రెండు పద్యాలు కాదు కదా రెండు పాదాల్లో పలుకే బంగారమయినట్టు పాదుపుగా సరిపెట్టడం విడ్డూరమేంకాదు. అది ఆనాటి యుగధర్మం. అదే చాపకింద నీరులా భారతీయత బీటలు వారేలా చేస్తుంది.

విల్లు కళలో చేయితిరిగినవాడు అనే అర్థం వచ్చే డొంకతిరుగుడు మాట ఒకటి వచిస్తాడు.

ఏకలవ్యుడు విలువిద్యలో లోటు పాట్ల గురించి చింతగలవాడు కాదు అంటే కౌశలంలో లోటులేనివాడు. అంటే విలువిద్యకు లోటు వచ్చినా (వేలుపోయినా) బాధ పడని భక్తి, గురి ఉన్నవాడని సూచ్యంగా కథకుడి ప్రసన్న కథాకలితార్థయుక్తి చెబుతున్నది.

ఏకలవ్యుడిని ఎదురులేని బాణంగా అతని దీక్షా, సాధనలు తయారు చేస్తే 'భక్తి' ఆవిధంగా మలచిందని ఛాందసులు అంటారు.

గురువుయందు గురే అతణ్ణి గొప్పవాణ్ణి చేసిందంటారు కాని గురిని ఛేదించడమే మహాపురుషుణ్ణి చేసింది. భక్తి కంటే తపస్సు, విశ్వాసం (కృతజ్ఞత) కంటే లక్ష్యచ్ఛేదన ప్రస్తుత సందర్భంలో ప్రస్తుత్యార్హాలు. ఎందుకంటే మట్టి బొమ్మ మనీషిగా మార్చజాలదు కాబట్టి.

నూరు మంది కాదు నూటైదు మంది ఒకేసారి వచ్చి తోకముడిచిన ప్రతిభకు ప్రణమిల్లేలా చేసింది సంకల్ప బలం మాత్రమే !

వేటూరి ఏకలవ్యుడు ఇలవేలుపు అయ్యాడో లేదోకాని, తిరుగులేని దీక్షకు అతడే ప్రాణం. అణగారిన యువత ఆదర్శం.

ఉపసంహారం :

కృతజ్ఞత, వినయాలు ఏకలవ్యుడిపాలిటి శాపాలయ్యాయి. అంటే బలి చక్రవర్తి బలమే బలహీనత అయినట్టు అన్నమాట. ఏకలవ్యుడి దక్షిణ అపాత్రదానం అంటారు విచేచకులు. అంటరాని వాడని వెళ్ళగొట్టిన వాణ్ణి దిక్కార స్వరంతో వెంట్రుక సమానంగా ఎంచకుండా నెత్తి కెక్కించుకున్న విధేయతే అతన్ని వికలాంగుణ్ణి చేసిందంటారు. తిరగబడే తత్వం, జ్ఞానం ఒకడబ్బసొమ్ము కాదన్న వివేచన కొరవడడంతో ఏకలవ్యుడు కుప్పకూలిపోయాడు కానీ కౌటిల్యం, మాత్సర్యాల వల్ల మాత్రం కాదు.

ఆధార గ్రంథాలు :

1. మహా భారతం - ఆదిపర్వం - నన్నయ
2. కృషి ఉంటే మనుషులు రుషులవుతారు - వేటూరు సుందర్రామమూర్తి
3. శూద్ర కవి శుభ మూర్తి వసు చరిత్ర - కొలకలూరి ఇనాక్
4. తెలుగు సాహిత్య చరిత్ర - ద్వానా శాస్త్రి

ఉత్తరాంధ్ర గిరిజన నృత్యాలు

– డా॥. సింగర కొశి, సహాయాచార్యురాలు, ఎ.పి.జె. అబ్దుల్ కలామ్ ఐఐఐటి, ఒంగోలు, ఆర్.జి.యు.కె.టి

దట్టమైన అరణ్య ప్రాంతం ప్రకృతి ఇచ్చిన వరం. ఈ అరణ్యానికే మకుటాయమానం లాంటి వారు గిరిజనులు. ఈ గిరిజనులు ప్రకృతిలో లభించే వనరులను శ్రమైక జీవనంలో అందిపుచ్చుకొంటూ తమదైన జీవన శైలిని, సంస్కృతిని కలిగి జీవిస్తున్నారు. తరతరాలుగా అడవిలోనే ఉంటూ, జంతువుల మధ్యలో తిరుగుతూ అనునిత్యం ప్రమాదాల కుంపటిలో రాజిల్లితూ రాటుతేలి రంజిల్లు తున్నారు.

ప్రాచీన గిరిజనడు వేటమీద ఆధారపడి జీవించే వాడు. జంతువును వేటాడే సమయంలో ఆ జంతువులే చిక్కి మరణం సంభవించేది. కష్టనష్టాలకు ఓర్చి సాహ సంతో జీవనాన్ని గడుపుతుండేవాడు. కొండలు కోనల మధ్య పచ్చని తివాచిలాంటి పచ్చిక బయళ్ళు, ప్రశాంత వాతావరణం వెనుక భయంకరమైన విస్పోటనం, పొంచి ఉన్న ప్రమాదాలు అన్నిటిని ఎదిరించి బ్రతుకు పయనం సాగించాడు. ఈ బ్రతుకులో మంచి వేటను సంపాధించి నప్పుడో ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకొన్నప్పుడో సంతోషంతో కూనీరాగాలు తీసేవాడు. ఆ కూనిరాగాలకు లయబద్ధంగా పాదాలను చేతులను ఆడించేవాడు. పాట పాడుతూ నృత్యం చేసేటప్పుడు పాటలో గల తాళానికి అనుగుణంగానే చిందులు వేశాడు. తాళబద్ధంగాని ఉ త్త చిందులు వేయలేదు. తాళానికి అనుగుణమైన పాద న్యాసమే నృత్తం. రాను రాను ఈ నృత్తం నృత్యంగా మారింది.

సమాజంలో నాగరికత అభివృద్ధి జరిగిన కొద్దీ మానవ మనస్సు వికసించి, మనిషి హృదయంలో నృత్యం చేయా లనే కోరిక పుట్టింది. తన చుట్టూ ఉన్న పరిసరాలను గమనిస్తూ నెమలి నడకలు, పులి వేషాలు, ఏనుగు గంభీరతను, పశుపక్ష్యాదులలోని ప్రత్యేకతను గుర్తించి దానిని అనుసరిస్తూ చేసిన నాట్యాలే రకరకాల గిరిజన, జానపద కళలుగా రూపాంతరం చెందాయి.

భారతదేశంలో అనేక గిరిజన తెగలు ఉన్నాయి. అలాగే మన ఆంధ్ర ప్రదేశ్‌లో నల్లమల్ల అడవులు, గోదావరి పరివాహక ప్రాంతాల్లోను తూర్పు కనుమల లోను అనేక రకాల గిరిజనులు నివసిస్తున్నారు. మరీ ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాలయిన విశాఖ, విజయ నగరం, శ్రీకాకుళం ఏజన్సి ప్రాంతాలలో నివసిస్తున్న గిరిజనులకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. ఈ గిరి జనులలో అనేక తెగలు ఉన్నాయి. అవి సవర, జాతావు, కొండదొర, కొండకాపు, గదబ, కొండరెడ్డి, మన్నెదొర, గౌడో, భగత, వాల్మీకి, గోండు, ఫోర్జ, కొండకమ్మర, ఖోండ్‌లు, కొఠియా, కోయ లేదా గోండు, మలియా, మాలీలు, బోండో జాతి మొదలగు గిరిజనుల తెగలు ఉన్నాయి. వీరికి తెలుగు మాతృభాష కాదు. వీరందరికీ వారివారి మాతృభాషలు ఉన్నాయి. యానాదులు, ఎరుకలు, లంబాడీలు, మైదాన ప్రాంత గిరిజనులు. మైదాన ప్రాంత గిరిజనులకు అడవులలో నివసిస్తున్న గిరిజనుల సంస్కృతి ఆచార వ్యవహారాలలో తేడా ఉంది.

ఉత్తరాంధ్ర ఏజెన్సీ ప్రాంత గిరిజనుల కొన్ని నృత్యా లను గూర్చి ఈ వ్యాసంలో తెలియజేస్తాను. అడవులకు దగ్గరలో లేదా అడవులలో గుంపుగా జీవిస్తున్న ఈ గిరిజనులలో ఉన్న కళలు సృజనాత్మకత కలిగి లయ బద్ధమై ఒక ప్రత్యేకతను కలిగి ఉంటాయి. ఈ నృత్యాలలో థింసా నృత్యం, తోంగ్‌సేన్ నృత్యం, ఇటికపండుగ, మయూర నృత్యం, కొమ్ము నృత్యం మొదలగునవి ప్రము ఖంగా చెప్పవచ్చు. వీటిలో మొదటిది థింసా నృత్యం.

థింసా ఈ పదంలోనే ఒకరిథమ్, ఊపు కలిగి ఉంది. మెల్లగా హాయిగా సాగే ఈ నృత్యం చూపరులకు

ఆసక్తి కలిగిస్తూ ఆనందాన్ని ఇస్తూ మనం కూడా చేయి చేయి కలిపి ఆ నృత్యంలో పాలుపంచుకోవాలనిపిస్తుంది. ఈ థింసా నృత్యం అనేక రకాలుగా ఉంటుంది. గిరి జనుల జీవితంలో సంభవించే సంఘటనల ఆధారంగా థింసానృత్యాలుంటాయి. వారి ఆచార సాంప్రదాయాలు ప్రతిబింబించేలా ఈ నృత్యం ఉంటుంది. పుట్టుక, పెళ్ళి, చావు, పంట వేసే ముందు,పంట కోసే ముందు, వేట సమృద్ధిగా దొరికినప్పుడో సందర్భానికి తగిన విధంగా ఈ నృత్యాలు ఉంటాయి.

థింసా నృత్యంలో సుమారు 20 నుంచి 30 మంది వరకు ఉంటారు. ఈ జట్టుకు ఒక నాయకుడు ఉం టాడు. ఈ నృత్యంలో స్త్రీలే ఎక్కువగా పాల్గొంటారు. ఒక్కొక్కసారి స్త్రీలు, పురుషులు కలిసి నృత్యం చేస్తారు. వాయిద్యాలు మగవారు వాయిస్తారు. ఆడవారు నృత్యం చేస్తారు. తుడుము, కిరిడి, డప్పు, బాకా, పిన్నల గర్ర, జోడి కొమ్ములు అనే ఈ ఆరు వాయిద్యాలు పురుషులే వాయిస్తారు. పుడమి బిడ్డలు గిరిజనులు. భూమితో ఎడతెగని బంధం కలిగి నిరంతరం జీవనోపాధి కోసం శ్రమపడే గిరిజనులు ప్రకృతి ప్రసాదించిన వనరులకు, అందాలకు నృత్యరూపంతో కృతజ్ఞత చెప్పుకొనే పద్ధతినే థింసా అని అనవచ్చు. సహజసిద్ధంగా లభించే వస్తువులే దుస్తులుగా, నగలుగా ధరించి సాంప్రదాయ రీతిలో నిర్వ హించే ఈ నృత్యం '8' నుంచి '12' రకాలుగా ఉంటుందని చెప్పవచ్చు.

1. వివాహ సందర్భంలో ఆడే థింసాను ''నాట్యా కరీయా థింసా అంటారు.
2. పండుగలలో (సంక్రాంతి, దీపావళి) చోటీథింసా, బోడే థింసా ఆడతారు.
3. గ్రామదేవత ''నిసాని దేవత'' ఉత్సవాలలో బోడేథింసాను నిర్వహిస్తారు.
4. రాళ్ళు ఏరుతున్నట్లుగా ఆడే థింసాను గొడ్డిబేట నృత్యం అంటారు.
5. అడవిలో ఆకులు సేకరిస్తున్నట్లు సూచించే నృత్యం 'పోతార్ నృత్యం'.
6. నిసాని దేవత పూనకం వచ్చినప్పుడు గణాచారి చేసే నృత్యాన్ని ''బాయ థింసా'' అంటారు. ఈ నృత్యంలో పూనకం వచ్చిన గణాచారి చుట్టూ గ్రామస్థులంతా చేరి గణాచారి ఏ విధంగా చేస్తాడో అదే విధంగా అతని చుట్టూ ఉన్నవారు చేస్తారు.
7. పాడె కదిలినప్పుడు చేసే థింసానృత్యాన్ని ''చొట్యారి థింసా'' అంటారు.
8. ''బాగ్ థింసా'' నృత్యంలో బృందంలోని సగం మంది ఒకరి చేతులు మరొకరు పట్టుకొని తల పైకి ఎత్తుతూ మునివేళ్ళపై నిల్చొని గుండ్రంగా మూగుతారు. మిగిలిన సగం మంది చకచక చుట్టూ తిరుగుతూ వారి లోపలికి వెళ్ళి పోయి చుట్ట ఆకారంలో నిలుచుంటారు.

ఈ విధంగా 'థింసా నృత్యం' రకరకాలుగా ఉం టుంది. ఈ నృత్యానే కొన్ని చోట్ల జట్టు నృత్యమని వ్యవ హరిస్తారు.

కొమ్ము నృత్యం :

విశాఖ, తూర్పు గోదావరి జిల్లాలో గిరిజనులు జరుపు కొని పండుగలలో చేసే అనేక నృత్యాలలో ఒక ప్రత్యేక నృత్యం ఉంది. అదే కొమ్ము నృత్యం. దీనినే కొమ్ముల డ్యాన్స్ అంటారు. ఈ నృత్యం కోయదొర కులస్తులకు మాత్రమే వచ్చు. ఇతర గిరిజన కులాలకు ఈ డ్యాన్స్ రాదు. ఈ నృత్యంలో పాల్గొనేవారు ప్రత్యేకమైన కొమ్ముల బుట్టను'' ధరిస్తారు. తలకు అమర్చుకొనేలా కొమ్ముల బుట్టను అందంగా ఆకర్షణీయంగా తయారు చేస్తారు. అడవిగేదె కొమ్ములను తీసుకొని తాటిచెట్టు మొవ్వలోని ఆకుల దగ్గర వలవలె ఉంటే దాని సాయంతో ఈ రెండు కొమ్ములను కిరీటం వలె కుడి చెవి దగ్గర ఒక కొమ్ము ఎడమచెవి దగ్గర ఒక కొమ్ము సమానంగా వచ్చేలా చూసి తలచుట్టు కొలతకు సరిపడేలా బుట్ట తయారు చేస్తారు. ఈ బుట్ట కనబడకుండా చీర చుడతారు. దీనికి తోడు నెమలి పురిని ఎడమకంటి పైభాగాన కిరీటపు బుట్టలో

గుచ్చుతారు. ఈ కొమ్ముల కిరీటం ఈ నృత్యానికి ప్రధాన ఆకర్షణ. ఈ నృత్యం చేసే వారి వేషధారణ కూడా ప్రత్యేకంగా ఉంటుంది. ఈ నృత్యంలో పాల్గొనే మగవారు పంచెకు బదులు ఆడవారు ధరించే పూలతో ఉన్న పరికిణీ ధరిస్తారు. పైన చేతులు లేని బనియను ధరిస్తారు. కాళ్ళకు మువ్వలున్న పట్టీలు, కొమ్ముల కిరీటం ధరిస్తారు. ఈ నృత్యంలో వాయించే వాయిద్యం కూడా ప్రత్యేకమైనదే! 1.5 అడుగుల వెడల్పుతో 3 నుంచి 4 అడుగుల పొడవుతో డోలు ఉంటుంది. దీని బరువు 10 కేజీల పైనే ఉంటుంది. ఈ నృత్యం చేసే విధానం కూడా ప్రత్యేకంగానే ఉంటుంది. 15 నుంచి 20 మందిలో ఒకరు పాటగాడు ఉంటాడు. అతని చేతిలో కర్ర ఉంటుంది. డోలు వాయించే కర్రకు మువ్వలున్నట్లుగా ఈ కర్రకు మువ్వలు ఉంటాయి. ఈ పాటగాడు నాయకుడిగా ఉంటాడు. అతను చెప్పినట్లుగా అందరు సంగీతాన్నికి అనుగుణంగా కుడికాలు ముందుపెట్టి దానిమీద డోలు ఉండేలాగా చూసుకొని ఎడమకాలు కాస్త దూరంలో ఉంచి అందరూ సమానంగా కాళ్ళు కదుపుతూ డోలు వాయిస్తూ గుండ్రంగా తిరుగుతూ నృత్యం చేస్తారు. మధ్య మధ్యలో ఈ డాన్స్ చేసేవారిలో ఇద్దరు వేగంగా ముందుకు వచ్చి కొమ్ములతో డీకొట్టుకొంటారు. చిందులు వేస్తూ ఉత్సాహంగా పాటకు లయబద్ధంగా డాన్స్ చేస్తారు. ఈ నృత్యం చూసేవారికి కొమ్ములతో కొట్టుకొనే సన్నివేశం చూసినప్పుడు భయంతో ఒళ్ళు గగుర్పాటు కలుగుతుంది. మధ్య మధ్య వీరు వేసే చిందులుచూపరులను బాగా ఆకట్టుకొంటుంది. ఈ నృత్యం మధ్యలో ఎవరైన డబ్బులు నేలపై వేస్తే వాటిని చేత్తో తీసుకోరు. కొమ్ములతోనే తీసుకొంటారు. గిరిజన గూడెంలో శుభకార్యాలు జరిగినప్పుడు ఈ నృత్యాన్ని ప్రదర్శిస్తారు. శుభకార్యం జరుగుతున్న కుటుంబం వీరికి సారా ఇచ్చి మంచి భోజనం పెడుతుంది. డబ్బులు తీసుకోరు. అయితే రాజకీయ నాయకులు వచ్చినప్పుడో, తీర్థాలు, తిరునాళ్ళు సమయంలో ఈ నృత్యాన్ని ఏర్పాటు చేసి వారికి సారా, భోజనం ఏర్పాటు చేసి డబ్బులు ఇస్తారు. వారిని తీసుకురావటానికి, పోవటానికి వాహనం ఏర్పాటు చేస్తారు. ఇది తరతరాలుగా కోయ కులస్థులు ఈ నృత్యాన్ని ఆడుతున్నారు. కాని నేటి తరం ఈ అద్భుతమైన నృత్యాన్ని నేర్చుకోవటానికి ఆసక్తి చూపటం లేదు. నామోషిగా భావిస్తున్నారు. ఇది అంత మంచి పద్ధతి కాదు. నేర్చుకోవాలి అనుకొనేవారికి వంశ పారంపర్యంగా గాని, జాతిపరంగా వచ్చే కళలు ఉండవు. కాని కొంతమందికి ఉన్నప్పటికి నేర్చుకోవాటానికి సిగ్గుపడుతున్నారు. ఇది శోచనీయం. ఇది ఇలాగే కొనసాగితే ఈ కళ కూడా కనుమరుగై పోతుంది. కాబట్టి ప్రభుత్వం, ప్రజలు ఈ కళను ఆదరించి కాపాడుకోవాలి.

మయూర నృత్యం :

ఖోండ్‌లు లేదా సామంతులు తెగవారు చేసే మయూర నృత్యం కూడా ప్రసిద్ధి చెందిందే. వివాహ సమయంలో వీరు ఈ నాట్యం చేస్తారు. ఈ నాట్యంలో పాల్గొనేవారు తెల్లటి దోవతి కట్టుకొంటారు. తలపాగా చుడతారు. కాళ్ళకు గజ్జెలు కడతారు. తలపాగాను తోయంగం అని, గజ్జెలను ముయ్యంగం అని పిలుస్తారు. తుంగ గడ్డితో ఈ తలపాగాను తయారు చేస్తారు. ఈ తలపాగాకు రంగు రంగుల గుడ్డపీలికలు కుచ్చులుగా కడతారు. నడుము వెనుక నెమలి పింఛం గుత్తిని కట్టుకొంటారు. రెండు వరుసలలో నిల్చొని నెమలి కేకను పోలిన శబ్దం చేస్తూ నాట్యం చేస్తారు. చేసే ముందు భూదేవికి సూర్య భగవానుడికి మ్రొక్కిన తర్వాత నాట్యం ప్రారంభిస్తారు.

తొంగ్‌సేన్ నృత్యం :

గిరిజనులు ఆరుకాలాల పాటు సాగుచేసి పంట పండించి, ఆ పంట చేతికొచ్చే ముందు అంటే తొలిపంట అందుకొనే ముందు ఈ తొంగ్‌సేన్ నృత్యం ద్వారా ఆ ప్రకృతికి కృతజ్ఞతగా ఈ నృత్యం చేస్తారు. అంతేగాక వారి సంస్కృతి సంప్రదాయాలు ఆచార వ్యవహారాలు ప్రతిబింబించేదే ఈ నృత్యం. పంట చేతికొచ్చే సమయంతో

పాటు వివాహాలు మరేదైన శుభకార్యాలప్పుడు ఆనందంగా ఆటపాటలతో తమ సంస్కృతికి అద్దంపట్టే ఈ సాంప్రదాయ తొంగ్‌సేన్ నృత్యాన్ని గిరిజనులు ప్రదర్శిస్తారు. పంట పండించి తొలి ముద్దను తినేముందు తమ ఆరాధ్య దేవతలకు మొక్కులు చెల్లించి పంట పేరుతో పండుగలు చేయడం గిరిజనుల ఆనవాయితి. కొండలను పంటలకు అనుకూలంగా బాగు చేసి పోడు వ్యవసాయం చేస్తారు. కొర్రలు, సామలు, ఊదలు, జొన్నలు, గంటెలు, బోడి, కందులు మొదలైన చిరు ధాన్యాలు పండిస్తారు. పండిన పంటను దేవతలకు నైవేద్యంగా పెట్టి తొంగ్‌సేన్ నృత్యం ద్వారా వారు పడిన శ్రమను మరచిపోతారు. గిరిజనులు దేవతలు డొక్కి దేవత, బాబుంగ్ దేవత, కత్తుపుర్ దేవతలను కొలుస్తారు. గిరిజనులు ఎక్కువగా మార్చి, జూన్ నెలలో పెళ్లిళ్ళు జరుపుకొంటారు. వీళ్లు చుక్క ముహూరం పెట్టుకొంటారు. పెళ్లి సందర్భంగా పెళ్లికూతురు ఇంటికి వెళ్ళినప్పుడో, అత్తారింటికి తెచ్చినప్పుడో, ఆటపాటలతో, వారి వాయిద్య పరికరాలతో వెళ్తారు. శుభ, అశుభకార్యాలను, బాధ, విచారం, ఆనందం తదితర అన్ని అంశాలను ఈ నృత్యాన్ని ప్రదర్శించి ఆయా సందర్భానికి తగిన విధంగా జీవం పోస్తూ ఈ తొంగ్‌సేన్ నృత్యాన్ని చేస్తారు. ఈ నృత్యం ఇప్పుడు క్షీణదశలో ఉంది.

సవరుల నృత్తాలు :

సవరులు వీరు సంక్రాంతి, దసరా పండుగలలో తుడుము, సన్నాయి, డప్పు మొదలగు వాయిద్యాలతో స్త్రీ, పురుషులు వచ్చి జట్లు జట్లుగా ఆడతారు. గ్రామస్థుల దగ్గర ధాన్యం, బియ్యం, బట్టలు, డబ్బులు దండుతారు. ఇప్పుడు వీరెవరు గ్రామాలలోకి రావటం లేదు. ఈ నృత్యాలు కూడా బాగా తగ్గిపోయాయి.

పూర్వం గిరిజనులు నిరక్షరాస్యులై గోచీలు కట్టుకొని అర్ధనగ్నంగా ఉన్నా, కష్టాలెన్ని ఎదుర్కొన్న కలిసి మెలిసి జీవించారు. ప్రకృతిలో మమేకమై జీవించారు. అడవిలో దొరికే వెదురు మొదలగు కర్రలతో వారికి కావలసిన పనిముట్లు, వ్యవసాయ వస్తువులు సంగీతసాధనాలు తయారు చేసుకొనేవారు. సొరకాయ, గుమ్మడి కాయలలోని గుజ్జు తీసి వాటిలో అన్నం, గంజి, నీళ్ళు మొదలైనవె వేసికొని తీసుకొని వెళ్ళేవారు. తమ కష్టాలను మరచిపోవడానికి ఇప్పసారా తాగి తుడుం దరువులకు నృత్యం చేశారు. రానురాను గిరిజన తండాలలో ఆధునికత ప్రవేశించింది. అక్షరజ్ఞానం కలిగింది. నాగరికత పెరిగింది. ఉద్యోగాలు చేస్తున్నారు. ఇదంతా మంచి పరిణామమే, మంచిదే. కానీ తమ సంస్కృతిని, సంప్రదాయాలను, గిరిజన కళలను విస్మరిస్తున్నారు. ఈ ఆటపాటల వల్ల ఆడ, మగ, పేద గొప్ప తేడా లేకుండా అందరూ పాల్గొని ఆనందించే ఆనందాన్ని కోల్పోతున్నారు. తమ భాషను తమ కళలను, పండుగులను మరచిపోతున్నారు. తమ ఉనికిని కోల్పోతున్నారు. ఇది అంత మంచి పరిణామం కాదు.

ఆధార గ్రంథాలు :

1. తెలుగువారి జానపద కళారూపాలు - మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి.
2. ఉత్తరాంధ్ర జానపదకళలు - బద్రి కూర్మా రావు.
3. రాయలసీమ జానపదకళలు - పేట శ్రీనివాసరెడ్డి.
4. విశాఖపట్నం ఆదివాసీ విజ్ఞానం - ఆచార్య జర్రా అప్పారావు.

రఘునాథనాయకుని వాల్మీకీచరిత్రము – గిరిజన సంస్కృతి

– జి. నాగభూషణరెడ్డి, అధ్యాపకులు, తెలుగు విభాగం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, బి.కాంప్, కర్నూలు.

తెలుగు సాహిత్య చరిత్ర అధ్యయనక్రమంలో క్షీణ యుగం లేదా దక్షిణాంధ్ర యుగానికి నాయకునిగా నిలిచే వాడు రఘునాథ నాయకుడు. ఈయన విజయనగర రాజుల దగ్గర పెరిగిన సంస్కారం, వారితో బంధుత్వం వల్ల కలిగిన వారసత్వం ద్వారా గొప్ప రాజ్యనిర్మాణమే గాక, అద్భుత సాహిత్య సృష్టిలో కూడా అందెవేసిన చేయిగా నిలిచాడు. అతను స్వయంగా రాసినవి మూడుగ్రంథాలు. అవి మూడు కూడా శ్రీరామచంద్రునికే అంకితం ఇచ్చాడు. రఘునాథనాయకుడు గొప్ప, శ్రీరామభక్తుడు. తానొక రామాయణం రాయడమే గాకుండా శ్రీమద్రామాయ ణాన్ని రచించిన ఆదికవి వాల్మీకి జీవిత చరిత్రను కూడా గ్రంథస్థం చేయడం అతనిలోని మానవీయ కోణాన్ని ఆవిష్కరిస్తుంది. ఒక మహాకవి చరిత్రను ఇతివృత్తంగా తీసుకొని తెలుగులో కావ్యంలో రాసిన కీర్తిమంతుడు రఘునాథ నాయకుడు. రామాయణం రాయడం వల్లనే రఘునాథనాయకునికి వాల్మీకిపై గౌరవం కలిగిందా! లేక ఒక గిరిజనుడైన బోయవాడు ఎలాంటి పండిత వాసన లేనివాడు అసమాన్య కావ్యనిర్మాణం ఎలా చేయగలిగాడో లోకానికి వివరించాలని 'వాల్మీకి చరిత్రము' రాశాడో ఆలోచిస్తే రెండో కారణమే నిజమనిపిస్తుంది. వాల్మీకి చరిత్ర నేడు అందరికీ తెలుసు. కానీ దక్షిణాంధ్ర యుగంలో ఒక గిరిజనుని చరిత్రను ఒక రాజు రాయడం సాహిత్యచరిత్రలో కూడా అదే ప్రథమం అనిపిస్తుంది.

ఈ వాల్మీకిచరిత్రకు ఆధారం సంస్కృత ధర్మఖండం. అందులోని ఒక చిన్న కథను తీసుకొని రఘునాథ నాయ కుడు వర్ణనలతో, కల్పనలతో పెంచి మూడాశ్వాసాల ప్రబంధంగా తీర్చిదిద్దినాడు. ఈ మూడు ఆశ్వాసాల ప్రబంధమే సంపూర్ణమా? లేక ఇది అసంపూర్ణ కావ్యమా? అనే సందేహం కూడా కలగక మానదు. ఎందుకంటే మూడో ఆశ్వాసాంత గద్యను పరిశీలిస్తే 'రఘునాథ నాయక ప్రణీతంబైన వాల్మీకిచరిత్రంబను మన ప్రబం ధము నందు తృతీయాశ్వాసము' అని ఉండటం వల్ల ఇది సంపూర్ణ కావ్యంకాదు, నమ్మకం. అంతేగాకుండా తృతీయా శ్వాసంలో కిరాతుడైన తాను వాల్మీకి అవ్వడం వరకే ఉండటం. తదుపరి అతని చరిత్ర లేకపోవడం ఆ అనుమానాలకు తావిస్తున్నాయి. ఒకవేళ రఘునాథ నాయ కుడు ఇంతవరకే రాసి ఉన్నట్లయితే ఆటవికులు కూడా 'కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు' అనే నానుడికి దగ్గరగా రాసినట్లు ఊహ చేయవచ్చు.

నేడు ట్రైబ్ (Tribe) అనే పదాన్ని 'గిరిజన' అనే అర్థంలో వాడుతున్నాం. ఈ 'గిరిజన' అంటే గిరిలో నివసించే ప్రజలు. గిరులు అంటే కొండలు, వాటితో పాటే అడువులు కూడా ఉంటాయి కాబట్టి ఆటవికులు కూడా గిరిజనులే. ప్రాచీనాంధ్ర సాహిత్యంలో ఈ గిరిజన జాతులకు సంబం ధించిన అనేక మౌలిక పరిజ్ఞానం గలిగిన కావ్యాలు వచ్చాయి. అలాంటి కావ్యాల్లో వాల్మీకి చరిత్రము ఒకటి.

'వాల్మీకి చరిత్రము'లో ద్వితీయా శ్వాసంలో మాత్రమే ఈ ఆటవికజాతి అయిన బోయ జాతి వర్ణన ఉంది. బోయ జాతిని కిరాతజాతి అని కూడా ప్రాచీనసాహిత్యంలో వ్యవ హరించినట్లు మనకు తెలుస్తుంది. బోయజాతిని నేడు బి.సి. కులంగా రాజ్యాంగం గుర్తించినా వారు వాల్మీకి తమ జాతివాడు కాబట్టి తాము ఎస్.టి.లుగా గుర్తించాలని విన్నవించుకోవడం చూస్తుంటాం.

ఆదికావ్యం రాసిన ఆదికవి వాల్మీకి బోయజాతి వాడుగా ఇంత సహేతుకమైన కారణాలు దొరుకు తున్నాయి కాబట్టి ఈ బోయలు కూడా ఆదివాసీలుగా గుర్తించి తీరాలి. ఆదివాసీలుగా ఆనాడు ఉన్న ఆటవిక జాతులను ప్రాచీన కావ్యాలు నిషాదులుగా ప్రస్తావిం చాయి. వీరి వృత్తి వేట.

రఘునాథనాయకుడు రాసిన వాల్మీకిచరిత్రలో ద్వితీయాశ్వాసంలో బోయపల్లె, వర్ణన చాలా సహజంగా ఉంటుంది. సప్తర్షులు తీర్థయాత్రలు చేసుకొంటూ మండువేసవిలో 'తమసానది' తీరంలో ఒక బోయపల్లెను చూస్తారు.

సీ. తోరణంబులుగ వీధులనార గట్టిన
యుప్పుగండలకు నొండొండ దిరుగు
పులుగుల ఱెక్కగాడ్పుల జాల నెగిరెడు
పసరంపు బొలకంపు ముసురుకొనగ
బసివట్టి నలుగడ బఱచిన మొకముల
పచ్చితోళ్ళను బండ్ల గ్రుచ్చి పెఱికె
బలు బాగిలంబుల భౌభౌ రవంబుల
గొంకి పంకములోన ఘర్ఘరించి

గీ. పరువులిడు నూరబందుల ముఱికి గవుల
చేప తట్టల గదురుతో బెనసి చుట్ట
గూత వెట్టిన జనుల వాకొలుప జేయ
భయము గొల్పెడు నొక బోయపల్లి గాంచి
(2 - 91)

ఆ బోయపల్లెలో వీధులమ్మిటి ఉప్పు కలిపిన మాంసం తోరణాలుగా ఆరబెట్టారు. ఆ నీసు వాసనకు కొన్నిరకాల ఈగలు వచ్చి వాలుతున్నాయి. జంతుచర్మాలను రాబందులు లాంటి పక్షులు తమ పండ్లతో గుచ్చి పెరుకుతున్నాయి. కుక్కలు భౌ భౌ అని శబ్దాలు చేస్తుంటే, బురదలోని ఊరబందులు ఘర్ఘరిస్తున్నాయి. చేపలు వెదురు తట్ల మధ్యలో ఇరుక్కపోయి అరస్తుంటే అలాంటి వాతావరణం గల పల్లెను చూసిన సప్తర్షులు చుట్టు జంతువులు ఎముకలు చూసి ఆందోళన చెందుతూ ఇదంతా తమ విధికృతమని భావిస్తూ, ముందుకు వెళ్ళారు. ఈ దుర్గందానికి ముక్కులు మూసుకొని ముందుకు సాగుతున్నారు.

ఇంతలో వాళ్ళను దారిలో ఒక కిరాతుడు ఆపాడు.

నిలునిలువుడు మీ చేతన్
గల సొమ్ముల వెల్ల నిచ్చి కదలుడు నాతో
జలపట్టిన మిము నందఱ
బలు చుట్టలమీద నుతికి పారన్‌వైతున్ (2 - 99)

అంటు బెదిరించాడు. అ కిరాతుడు ఎవరో కాదు అప్పటికి బోయగా ఉన్న వాల్మీకి. తన వృత్తి దారిన పోయే వారిని దోపిడీ చేసి భార్యాబిడ్డలను పోషించడం. స్వాతంత్ర్యం రాకపూర్వం బ్రిటిష్ వారు కూడా ఈ ఆటవిక జాతుల్లో కొన్ని జాతులను దోపిడీ దొంగలుగా, నేరగాళ్ళగా గుర్తించే వారు. ప్రాచీన కాలం నుండి ఆటవికుల్లో జాతులు ఇలాంటి వృత్తులు అవలంభించినట్లు అవగతం అవుతుంది.

బోయవాడు సప్తర్షులు చేత శ్రీరామమంత్రాన్ని ఉపదేశించుకొని తపస్సు చేసుకుంటున్నప్పుడు ఆ కిరాతుని కుటుంబం అతని దగ్గరికెళ్ళి తపోభంగం చేయించడానికి ప్రయత్నించారు. తమను పోషించే నాథుడు ఈ విధంగా అడవిలో మౌని అవ్వడం ఆ కిరాతుని భార్యకు నచ్చలేదు. బిడ్డలతో కలసి ఆ బోయ యువతి భర్త తపస్సు ఆచరిస్తున్న ప్రాంతానికి పోయి "ఈ తపస్సు చేయడం బోయ జాతికి తగదని హితువు పల్కింది. ఆ కిరాతుణ్ణి కుటుంబంలోని వాళ్ళంతా తపస్సు నుండి మరల్చడానికి ప్రయత్నించారు. తమను వదలి ఈవిధంగా తపస్సుచేసుకోవడం మంచిది కాదన్నారు. ఇలా బోయ వనిత తమ పెంపుడు జంతువులు గురించి చెబుతూ గండబేరుండ పక్షులు, సింహపు పిల్లలు, వేటకుక్కలు పులిపిల్లలు వంటివి చెప్పడం వల్ల బోయలు ఆనాడు క్రూరమృగాలను మచ్చిక చేసుకొని పెంచుకునే వాళ్ళని అర్థమవుతుంది.

అలాగే వింతరుచి గల్గిన పిట్టలు, తేనెపట్టులు తెచ్చి తినేవారని పిట్ట వర్ణించబడింది.

క. గువ్వకఱకుట్లు మెకముల
క్రొవ్వుల బొరుగులును గునుకు గుడుములు నేయున్
నివ్వరి కూడును నింటన్
బువ్వంబున గుడువ కిట్లు పోక్కం దగనే (2-138)

అని అనడం వల్ల గువ్వల మాంసాన్ని కాల్చుక తినేవారని, క్రొవ్వులను బాగా ఎండబెట్టి వరగులు లాగా చేసుకొని తినేవారని అర్థమవుతుంది.

అదేవిధంగా రఘునాథ నాయకుడు కిరాత స్త్రీని గురించి చెబుతూ ఇలా వర్ణించాడు.

సీ. కులుకు గుబ్బలతోనె కురవింద పేరులు
గునియుచు బెనగొన గొండ్లి చూప
దంతంపు గమ్మల తళుకులు పలుచని
చెక్కుటద్దంబుల జికిలి సేయ
బగడల రతనాల బవిరెలు పికిలిపూ
దండ కొండొడ కైదండ యొసగ
వదలుకొప్పన జుట్టు జెదరిపాఱెడు మల్లె
మొగ్గలు తెలినిగ్గు మ్రుగ్గులిడగ

గీ. నడవి దడవిల్లు గైకొని యమ్ము దొడిగి
పొంచి మైవంచి నిను నెచ్చరించి మంచి
మొకము బడనేసి నిచ్చలు మెచ్చ జేయు
నట్టి నాయకురాలి బాయంగ దగునె (2 - 140)

గురవిందలు కాసులపేరువలె ఉన్నాయి. దంతాలతో చేయబడిన కమ్మలు మెరస్తుండగా, పగడాలు, రతనాలు కొప్పునిండా మల్లెమొగ్గలు తురుముకున్న ఆమె జడతో బప్పారుతున్న బోయ వనిత విల్లుపట్టి ఒక మృగాన్ని చంపగల శక్తిని గలదని కవి వర్ణించాడు. బోయవనిత ఆహార్యాన్ని ఎంతో సహజం కవి వర్ణించాడు. అంతే గాకుండా బోయ జాతి స్త్రీలు వేటాడటంలో పురుషులకు ఏమాత్రం తీసిబోడని ఈ పద్యం ద్వారా అర్థమవుతుంది.

ఈ విధంగా సాగిన రఘునాథ నాయకుని రచన ప్రాచీన గిరిజన సంస్కృతికి అద్దంపట్టేది వాల్మీకిచరిత్ర. బోయపల్లె వర్ణనలో గానీ, తాపసిగా మారిన కిరాతుని మనస్సు మరల్చడానికి ప్రయత్నించిన అతని కుటుంబం గురించి వర్ణించటంలో రఘునాథనాయకుని పరిశీలనా దృష్టి ఆవిష్కరించబడుతోంది. ఒకప్పుడు వేట ప్రధాన వృత్తిగా ఉన్న బోయజాతి నేడు నాగరిక జాతుల్లో ఒకటిగా మారి ఆర్థికపరిపుష్టిని సాధించి విద్య, రాజకీయరంగాల్లో ముందడగులో ఉంది. కానీ ఇంకా ఈజాతికి సంబంధించిన కొన్ని కుటుంబాలు వెనుకబడే ఉన్నాయనడంలో సందేహం లేదు. అందుకే వీరిని బి.సి.లుగా రాజ్యాంగం గుర్తించినప్పటికీ తమ వెనుకబాటు కారణం దృష్ట్యా ఎస్.టి.లుగా గుర్తించమని వారు విన్నవించు కొంటున్నాయి.

ఆధార గ్రంథాలు :

1. వాల్మీకిచరిత్రము - రఘునాథనాయకుడు.
2. తెలుగు వైజ్ఞానిక త్రైమాసికపత్రిక (ఏప్రిల్ - జూన్ 2012) - తెలుగు అకాడమి.
3. శబ్దరత్నాకరం - బహుజన పల్లి సీతారామాచార్యులు.

గిరిజనుల అణచివేత, అస్తిత్వ పోరాటాలు

– పులి చెంచయ్య, పరిశోధక విద్యార్థి, తెలుగు & ప్రాచ్యభాషా విభాగం, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ విశ్వవిద్యాలయం, తిరుపతి.

భారతదేశంపై ఆర్యుల దాడి వరకు ఆదిమ తెగల చరిత్ర గురించి మనకు తెలిసింది తక్కువే.

- ప్రచస్ (1973) అభిప్రాయపడ్డాడు.

"షెడ్యూల్డ్ తెగ" పదం పుట్టుక :

భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన 1950 సం॥ జనవరి 26వ తేది తర్వాత మాత్రమే తెగలను తెగలుగా జీవించే వర్గాలను "షెడ్యూల్డు తెగలు"గా గుర్తించవలసిన అవసరం కలిగింది. 1935 సం॥ భారత ప్రభుత్వ చట్టం వీరిని "వెనుకబడిన తెగలు" అనే పదం ప్రయోగం జరిగింది. దేశంలో ఆదిమ తెగలలో జాబితాను తయారు చేయడానికి మొట్టమొదటి గట్టి ప్రయత్నం 1931 సం॥ జనాభా లెక్కల సేకరణ సమయంలో జరిగింది. గిరిజనులను నిర్ధారించే విషయంలో 342వ అధికరణ రాష్ట్రపతికి ప్రత్యేక అధికారాలు కల్పించింది.

గిరిజనుల పట్ల బ్రిటిష్ పాలకుల వైఖరి :

యుగయుగాలుగా భారతీయ గిరిజనులు భౌగోళికంగా ఇతర ప్రాంతాలతో సంబంధం లేకుండా జీవించారు. ఎ.బి.వర్ధన్ (1977 సం॥) అభిప్రాయం ప్రకారం గిరిజనులు శక్తి సామర్థ్యాలు తెలిసినవారు కావడం వల్లనే బ్రిటిష్ సామ్రాజ్యవాదులు వారిని ఇతర ప్రజలతో కలవకుండా జాగ్రత్త పడ్డారు. విదేశీ పాలకులకు వ్యతిరేకంగా మొట్ట మొదట పోరాడింది గిరిజనులేనని పేర్కొన్నారు. వారిని గుర్తించనంతవరకు, వారు చేసిన అపార త్యాగాలను గమనించనంతవరకు గిరిజనులకు న్యాయం జరుగదు. స్వాతంత్ర్యోద్యమంలో గిరిజన పాత్ర గురించి చాలా మంది చరిత్రకారులు నిర్లక్ష్యం చేశారు. కొంతమంది అవి స్థానిక తిరుగుబాట్లు అని, ఉనికిని కాపాడుకోవడం కోసం జరిగిన పోరాటాలని కొట్టిపారేశారు. ఈ సందర్భంగా గిరిజన సోదరుల వీరోచితమైన పోరాటాలు, వారు చేసిన త్యాగాలను స్మరించుకోక తప్పదు. గిరిజనుల అణచివేత, తిరుగుబాట్లలో కొన్ని ముఖ్యమైన వాటిని ప్రస్తావించాలి.

గిరిజనుల అణచివేత :

ఋగ్వేద కాలంలో (క్రి.పూ. 2000-1000) ఆర్య తెగలు తండాలు తండాలుగా భారతదేశంపై దండెత్తి వచ్చారు. మొదట ప్రవేశించిన ఆర్యులు తమ ఆధిపత్యం సుస్థిరం చేసుకోవడానికి ఆదిమ తెగలతో ప్రాణాంతకమైన యుద్ధాలు చేశారు. వజ్రాయుధం కలిగిన ఇంద్రుడు పిడుగులు కురిపించాడు. దస్యుల కోటలను నుగ్గునుగ్గు చేసాడు. పరుష్నినది ఒడ్డున నివసించే పర్వతులు అనే తెగలను సరస్వతి నాశనం చేసింది. అలాగే విష్ణువు, ఇంద్రునితో కలసి శంబరుని కోటలను నాశనం చేశాడు. సురేష్ సింగ్ (1964) వాఖ్యానం ప్రకారం భారతీయ గిరిజనులు చైతన్యరహితంగా పడి వుండలేదు. ప్రాచీన సాహిత్య గ్రంథాలను మధ్యయుగాల నాటి చరిత్ర గ్రంథాలను, బ్రిటిష్ వారి రికార్డులను పరిశీలించి కొన్ని అంశాలను పరిశీలిద్దాం.

చరిత్ర తొలిదశలో చక్రవర్తులు, విదేశీయుల దాడులు చేసి గిరిజనులను అణచివేశారు. అజాతశత్రువు వైశాలి గిరిజనజాతి రాజ్యాన్ని సర్వనాశనం చేసాడు. అలెగ్జాండర్ వాయువ్య భారతదేశంలోని గిరిజన తెగలను రూపుమాపాడు. తన రాజ్యంలో గిరిజన తెగలను కరుణతో చూస్తానని అశోకుడు వాయువ భారతంలో గిరిజన తెగలు తిరుగుబాటు చేస్తే వచ్చే పరిణామాలు వేరేవిధంగా వుంటాయి అని హెచ్చరించాడు. షాషబాద్ ప్రాంతం నుంచి "చేరో" గిరిజన తెగను అణచివేసి పర్మార్ రాజపుత్రులు రాజ్యాన్ని నిర్మించారు. బీహార్‌లోని దక్షిణ మోంఘీర్ జిల్లాలో "భోయిస్యా" తెగను అణచివేసి చండేలాలు అధికారాన్ని స్థిరపరచాడు. క్రీ.శ. 1661లో

పలమాపూర్‌లోని "చెరో" గిరిజనులను దావూద్ ఖాన్ అనే సైన్యాధ్యక్షుడు ఓడించాడు.

ఆదివాసీ తిరుగుబాట్లు :

మహాభారతకాలం నాటికి అస్థిత్వంలో ఉన్న తెగలు యుద్ధాలకు తెగబడ్డాయి. భిల్లు యువకుడైన మహా వీరుడు ఏకలవ్యుడిని గురుభక్తితో మోసగించి బొటనవ్రేలు కోరడంలో ఆ వీరుని యొక్క శక్తి సామర్థ్యాలను వారు గుర్తించారు. ముండా, నాగా తెగలు పాండవులకు వ్యతిరేకంగా, కౌరవుల పక్షాన వీరోచితంగా పోరాడాయి. భీమునికి గిరిజన యువతి హిడింబికి జన్మించిన ఘటోత్కజుడు యుద్ధంలో తన సమూహంతో కలిసి పోరాడి గెలిచేంత పోరాటం చేశాడు. కుయుక్తితో ఆ వీరుని మేఘనాధుడు హతమార్చాడు. నాగరాజు కుమార్తె చిత్రాంగదను అర్జునుడు వివాహం చేసుకున్నాడు. గోండులు తాము రావణుని వారసులం అని చెప్పుకున్నారు.

బ్రిటిష్ వారి చర్యలపై భారతీయ గిరిజనులలో చెలరేగిన అసంతృప్తి :

క్రైస్తవ మతం బ్రిటిష్ వారి మద్దతుతో గిరిజన ప్రాంతాల్లోకి చొచ్చుకునిపోయింది. దీనివలన గిరిజన ప్రాంతాల్లో పునరుజ్జీవన ఉద్యమాలు వ్యాపించాయి. అపారమైన సహనశీలురైన గిరిజనులు దోపిడి విపరీతం కావడంతో 18వ శతాబ్దంలో తిరుగుబాట్లకు కారణం అయింది. 18వ శతాబ్దం చివరభాగంలో పహరీయుల తిరుగుబాటు, ముండాల తిరుగుబాటు (1789-1901) సంథాల్ తిరుగుబాటు (1855-56), భిల్లుల తిరుగుబాటు (1879-80) బస్తర్ తిరుగుబాటు (1910-11), గోండుల తిరుగుబాటు (1940), ఖోర్వార్ ఉద్యమం (1871-80), సర్ధారీ ఉద్యమం (1881-95), బిర్సా ఉద్యమం (1920-35) సంభవించాయి. గిరిజనులలో క్రమంగా చైతన్య విప్లవ ఛాయలు విస్తరించడానికి ఈ తిరుగుబాట్లే పునాది, అడవి సంపదను తమ తల్లి ఆస్థిగా నమ్మి బ్రతికిన గిరిజనులు కూడా భారతదేశంలో అనేక ప్రాంతాల్లో బ్రిటిష్ పరిపాలన వల్ల అనేక కష్టాలు గురైనారు. ముఖ్యంగా 1857సం॥కి పూర్వం దేశంలో ఉన్న ప్రధాన ట్రైబల్ తెగల్లో "కోలి" (మహారాష్ట్ర), తమల్, చిరో బొగటం (పలమౌ) (చోటా నాగ్‌పూర్) మెంటి, (అస్సాం), కోల్ (బీహార్), నాయక్ (గుజరాత్), ఖోండ్‌లు (ఒరిస్సా) సంథాల్ (బీహార్) పేర్కొనదగినవి.

బిల్ గిరిజనుల తిరుగుబాటు (1817-19) :

మార్క్యూస్ హేస్టింగ్స్ గవర్నర్ జనరల్‌గా పనిచేస్తున్న రోజుల్లో పశ్చిమ కనుమల్లోని ఖాందేశ్ ప్రాంతంలో నివసించే, బిల్ తెగ గిరిజనులు ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనను నిరసిస్తూ తిరుగుబాటు చేశారు. రెండో పీష్వా బాజీరావ్, అతని సేనాధిపతి "త్రియంబిక్ జీ డాంగ్లియా" బిల్ తెగ వారిని రెచ్చగొట్టారని బ్రిటిష్ వారు ఆరోపించారు. క్రొత్త పాలకుల పరిపాలనలో వ్యవసాయం చేసుకునే బిల్ తెగ గిరిజనులు కష్టాలపాలవుతారని భీతిల్లారు. వారిలో అభద్రతాభావం ఏర్పడింది. బ్రిటిష్ సైన్యం నిర్ధాక్షిణ్యంగా అణిచివేసాయి. బర్మాయుద్ధంలో బ్రిటిష్ సేనలు ఎదురుదెబ్బ తినగానే మరోసారి 1824-25లో "బిల్"లు "సేవారాం" నేతృత్వంలో తిరుగుబాటు లేవదీసారు. బిల్ తెగవారు తమ పోరాటాన్ని 1846 వరకు కొనసాగించారు.

రమోసే తెగ తిరుగుబాటు (1822) :

భారతదేశంలోని పశ్చిమ కనుమల్లో నివసించే అటవిక గిరిజన తెగల్లో "రమోసీ"లు కూడా ముఖ్యులు. వీరు బ్రిటిష్ పరిపాలన వల్ల నష్టపోయినందు వల్ల తిరుగుబాటు చేయడానికి సిద్ధపడ్డారు. "చిత్తూర్ సింగ్" నాయకత్వంలో రమోసీ తెగవారు 1822 సం॥ తిరుగుబాటు చేశారు. సతార్ పరిసరాల్లో దాడులు చేసి భీభత్సం సృష్టించారు. 1825-26, 1829సం॥ లలో కూడా "రమోసీ"లు తిరుగుబాటు లేవదీసారు. కాని బ్రిటిష్ సైన్యాలు వీటిని అణచివేశాయి.

కోల్ గిరిజనుల తిరుగుబాటు :

బ్రిటిష్ పాలకుల చట్టాలను, ఆర్థిక దోపిడిని గిరిజనుల సామాజిక ఆచార వ్యవహారాల్లో జోక్యాన్ని నివసిస్తూ గొప్ప తిరుగుబాటును 1831-32 సం॥ల్లో కోల్ తెగవారు చేశారు.

దీనివల్ల బీహార్‌లోని రాంచీ, సింగ్‌భమ్, హజారీబాగ్, పలమా ప్రాంతాలు విశేషంగా ప్రభావితమైనాయి. శిక్కు, ముస్లిం, వర్గాలకు చెందిన వారిని గిరిజన గ్రామాలపై పెత్తందార్లుగా ప్రభుత్వం నియమించింది. వీరు గిరిజనులు సాగుచేస్తున్న భూములపై భూమిశిస్తును ఇష్టారీతిలో పెంచి, బలవంతంగా వసూలు చేయసాగారు. శిస్తు చెల్లించని గిరిజన రైతులను, పెత్తందార్లు, కంపెనీ పోలీసులు అనేక రకాలుగా హింసించారు. దీనితో విసుగెత్తిన "కోల్"లు 1831లో తిరగబడ్డారు. పెంత్తం దార్లుపై దాడులు చేశారు. వారి ఆస్తులను దోచుకున్నారు. ఇళ్ళను దగ్ధం చేశారు. కోల్ తిరుగుబాటుకు రాంచీ ప్రధాన కేంద్రమైంది. గిరిజనేతరులు, పెత్తందార్లు, అధిక సంఖ్యలో హతులయ్యారు. 'కోల్'ల హింసాత్మక చర్యలు అదుపుతప్పడంతో కంపెనీ అధికారులు ఆ ప్రాంతాల్లో సైనిక చర్యను ప్రారంభించాయి. అనేక మంది 'కోల్'లు ప్రాణాలు కోల్పోయారు. 1832 మార్చి నెల నాటికి 'కోల్' తిరుగుబాటు పూర్తిగా అణిచివేయడం జరిగింది 'కోల్' తిరుగుబాటు స్థానికమైనప్పటికి అంతిమ లక్ష్యాన్ని సాధించినప్పటికీ కంపెనీ అధికారుల్లో దడ పుట్టించింది.

ఒరిస్సాలో ఖోండ్ గిరిజనుల తిరుగుబాటు :

సర్ హెన్రీ హర్డింజ్ భారతదేశంలో గవర్నర్ జనరల్‌గా పనిచేస్తున్న కాలంలో ఒరిస్సాలోని 'బోద్ దస్‌పల్లా' రాజ్యల పరిసరాల్లోని ఖోండ్‌మల్ పర్వతశ్రేణుల్లో నివసించే 'ఖోండ్' తెగ గిరిజనులు పెద్ద తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటుకు ప్రధాన కారణం బ్రిటీష్ అధికారులు ఖోండ్‌ల సామాజిక, మత విశ్వాసాల్లో జోక్యం చేసు కోవడమే. నరబలులు ఇవ్వడం, శిశు హత్యలు మొద లైనవి. ఖోండ్ తెగల వారి ఆచారాలు వీటిని నిషేదిస్తూ 1837 సం॥లోనే కంపెనీ అధికారులు చట్టాలు చేశారు. దీనితో ఖోండ్‌లలో తీవ్ర వ్యతిరేకత చెలరేగింది. బోద్ ప్రాంతాన్ని "మెజర్ మాక్‌ఫర్‌సన్" అనే సైనిక పర్యవేక్షణలో ఉంచింది. అతి కొద్దికాలంలోనే ఇతను తమను అధిక పన్నులు విధించడం, వెట్టి కూలీలుగా మార్చడానికి ప్రయత్నించడాన్ని గ్రహించారు. 1846 సం॥లో ఎదురు తిరిగారు. వీరి మెరుపు దాడి ఎదుర్కొనడంలో "మాకఫర్ సన్" విఫలమయ్యారు. బ్రిటీష్ ఆధీనంలో ఉన్న 170 మంది ఖోండ్ బందీలను విడిపించారు. అలాగే "మాక్‌ఫర్ సన్" ఆధీనంలో వున్న ఖోండ్ రాజును విడిపించుకున్నారు. చక్రబిసాయ్ నేతృత్వంలోని మద్రాసు నుంచి వచ్చిన సిపాయిల దళాన్ని వీరు ఎదుర్కొన్నారు. బాణాలతో, గొడ్డళ్ళతో తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సుమారు రెండేళ్ళపాటు ఇరుపక్షాలు పోరాడినాయి. ఖోండ్‌లు మాత్రం ధైర్యం వీడక గెరిల్లా పద్ధతిలో వీరోచితంగా తిరగబడ్డారు. 1848 సం॥ వరకు ఇదే పరిస్థితి. తరువాత కంపెనీ వారు వ్యూహాన్ని మార్చి ఖోండ్ రాజైన "సామ్‌బిసాయ్"ను తిరిగి ఖోండ్‌ల రాజుగా ప్రకటించారు. దీనితో ఖోండ్‌లు చాలావరకు తృప్తి పడ్డారు. తిరుగుబాటు ముగిసింది.

సంథాల్ గిరిజన తెగవారి తిరుగుబాటు (1855 - 56) :

లార్డ్‌డల్ హౌసి పాలన చివరి దశలో సంథాల్ తెగ గిరిజనుల తిరుగుబాటు జరిగింది. బ్రిటీష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా జరిగిన గిరిజన తిరుగుబాట్లు అన్నింటికెల్ల గొప్పది. శక్తివంతమైనది. బీహార్‌లోని భగల్పూర్, రాజ్‌మహల్ జిల్లాలలోని పర్వత శ్రేణుల దగ్గరగా వున్న మైదాన ప్రాంతాలలో సంథాల్ తెగ వారు భారీ సంఖ్యలో నివాసం ఉండేవారు. సంథాల్ తెగపై కంపెనీ సమర్థకులైన గిరి జనేతరులు జరుపుతున్న దౌర్జన్యాలకు, అత్యాచారాలకు వ్యతిరేకంగా సంథాలులు పెద్దఎత్తున తిరగబడ్డారు. జమీందారులు, పోలీసులు, పన్నులు వసూలు చేసే అధి కారులు గిరిజనులపై పెత్తనం చెలాయించేవారు. కఠోర నిర్ణయాలతో వారిని హింసించారు. వడ్డీ వ్యాపారులు కూడా అధిక వడ్డీలతో కృంగదీశారు. వీరిని శ్రమకూలీ లుగా మార్చారు. ఈ దోపిడీని సహించలేక ఇద్దరు సాహసోపేతమైన నాయకులు "కాను" - సిద్ధముర్ము" - ముందుకు వచ్చి తిరుగుబాటుకు నాయకత్వం వహిం

చారు. 1855 సంలో జూన్ నెలలో ఒకరోజువేలాదిమంది సంథాల్‌లు సమావేశమై దోపిడిదారులను తమ ప్రాంతం నుంచి వెళ్ళగొట్టాలని నిర్ణయించుకొన్నారు. తమ ప్రాంతం నుంచి ప్రభుత్వ సిబ్బందిని, భూస్వాములను, వడ్డీ వ్యాపారులను, బ్రిటీష్ వారిని వెళ్ళిపోయి ప్రాణాలు రక్షించుకోవలసినదిగా సంథాల్‌లు హెచ్చరించారు. మొదటి దశలో అక్కడక్కడ బ్రిటీష్ వారిని హతమార్చడం జరిగింది. తరువాత తీవ్రరూపం దాల్చి విషయుక్త భాణాలతోను, కత్తులతోను, ఈటెలతోనూ, సంథాలులు పోరాడారు. బ్రిటీష్‌పాలన చిహ్నాలన్నింటిని రూపుమాపాలని పట్టుదలతో వున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు నాశనం చేశారు. చిన్నా, పెద్ద, స్త్రీ, పురుష బేదం లేకుండా కనిపించిన వారందరినీ క్రూరంగా చంపనారంభించారు. పరిస్థితి తీవ్ర రూపం దాల్చడంతో బ్రిటీషు ప్రభుత్వ అత్యున్నత అధికారులను పిలిపించి తిరుగుబాటును నిర్ధిక్షిణ్యంగా అణిచివేయాల్సిందిగా ఆదేశాలు జారీ అయ్యాయి. సైన్యం సంథాల్‌ల గ్రామాలపై పడి నేలమట్టం చేసింది. గ్రామాలకు గ్రామాలు తగులపెట్టారు. కొద్దికాలం తరువాత ఇద్దరి నాయకులను అరెస్టు చేశారు. దీనితో తిరుగుబాటు 1856 సం॥ చివరి నాటికి కాస్త చల్లబడింది.

ఈ తిరుగుబాటుపై కొందరి చరిత్రకారుల అభిప్రాయాలు :

ఇది కేవలం బ్రిటీష్ పరిపాలకులు పరోక్ష మద్దతు ద్వారా భూములు అన్యాక్రాంతమయ్యాయి, అందువల్లనే సంథాల్‌లు పెద్ద ఎత్తున తిరుగుబాటు చేశారని అభిప్రాయపడ్డాడు.

- రెవరెండ్ డబ్ల్యూ.జె.కుల్షా

గిరిజను జీవిత పద్ధతులను కాపాడుకోవడం, తమ తెగను రక్షించుకోవడం అనే రెండు అంశాలు అత్యంత ప్రధానమైనవి. పితృ దేవతలు అంగీకరిస్తే తప్ప భూమిని వదలు కోవడం జరుగదు. ఏడు నెలల గిరిల్లాయుద్ధం తర్వాత 1856 తిరుగుబాటును అణిచివేయగలిగారు అని "నోట్స్ అన్ ఇండియన్ హిస్టరీ" లో అనే గ్రంథంలో ప్రస్తావించారు.

- కార్ల్‌మార్క్స్

ముండా తిరుగుబాటు :

బ్రిటీష్ వారి నియంతృత్వానికి, దోపిడికి గిరిజనులు చేసిన తిరుగుబాటుకు ముండా తెగకు చెందిన గిరిజనులు బిర్సా నాయకత్వంలో తిరగబడ్డారు. వీరు చోటా నాగపూర్ ప్రాంతంలో ఎక్కువగా జీవనం సాగించేవారు. ఈ ముండా తిరుగుబాటును కూడా భారతదేశంలో జరిగిన అతిపెద్ద తిరుగుబాట్లలో ఒకటిగా పేర్కొన్నారు. ముండాల తెగ నాయకులను సర్దార్‌లని పిలిచేవారు. క్రమంగా బ్రిటీష్‌వారు దోపిడిదారులకు సహాయం చేయడంతో ముండా గిరిజనులకు ఆగ్రహం వచ్చింది. ఇటువంటి ఉద్విగ్న పరిస్థితి కొంతకాలం కొనసాగి చెదురు ముదురు ఘర్షణలు ప్రారంభమయ్యాయి. ఈ సమయంలో జనాకర్షక శక్తి ఉన్న "బిర్సా" అనే ముండా నాయకుడు రంగప్రవేశం చేశాడు. ముండాలను గిరిజనేతురుల నుంచి విముక్తం చేయమని మరియు ముండాల అవసరాల తీర్చడానికి సాక్షాత్తూ భగవంతుడు నన్ను పంపించాడని నాకు అతీంద్రియా శక్తులు వున్నాయని ముండా తెగ గిరిజనులను నమ్మేటట్లు ప్రచారం చేశాడు. తుపాకులు, బుల్లెట్లు అంటే భయం వీడాలని 'బిర్సా' బోధించాడు. 1895 సం॥ నాటి 'బిర్సా' అంకితభావంతో పనిచేసే దాదాపు 6 వేల మంది ముండాలను పోగుచేయగలిగాడు. బ్రిటీష్ వారి ఆధిపత్యాన్ని పోగోట్టాలని గిరిజనేతరులను తరిమివేయాలని, స్వతంత్ర్య ముండా రాజ్యాన్ని స్థాపించాలని బిర్సా పిలుపునిచ్చాడు. ముందే వేసుకున్న పథకం ప్రకారం భూస్వాములపైనా, క్రైస్తవ మత ప్రచారకులపైన, అధికారులపైన దాడులు ప్రారంభించాడు. ఘోరనమైన ఘర్షణలు జరిగాయి. ప్రజలలో బిర్సాను అందరు "బిర్సా భగవాన్"గా వ్యవహరించడం మొదలైంది. ఇది ఇలా ఉండగా బిర్సాను అరెస్టు చేసి రాంచీ జైల్లో పెట్టారు. కొద్ది నెలలు తరువాత బిర్సాను అనివార్యమైన పరిస్థితుల్లో

వదిలివేయడం జరిగింది. అయిన బయటకు వచ్చిన బిర్సా తన తిరుగుబాటును ఆపలేదు. 1897 క్రిస్టమస్ రోజున దాడి జరపాలని నిర్ణయించాడు. ఆ రోజు మొత్తం క్రైస్తవ మత ప్రచారకులపైన, వారి స్థావరలపైన, భూస్వాముల ఇళ్ళపైనా, దాడును నిర్వహించి మరణ హోమం సృష్టించారు. ఈ దాడిలో క్రైస్తవ మతం తీసుకున్న ముండాలపై కూడా దాడులకు పాల్పడ్డారు. ప్రధానంగా పోలీసు స్టేషన్లపై దాడులు జరిగాయి. పరిస్థితిని గమనించిన బ్రిటీషు ప్రభుత్వం రాంఛీ నుంచి సైన్యాన్ని రప్పించి తిరుగుబాటును అణచివేశాయి. ''బిర్సా''ను మరియు అతని అణుచరుడు "గయా" "ముండా" అరెస్టు చేసి రాంఛీ జైలులో ఉంచారు. కొద్ది రోజులు తరువాత బిర్సా అనారోగ్యం రాంఛీ జైల్లోనే మరణించాడు. దీంతో తిరుగుబాటు అణిచివేయబడింది. తిరుగుబాటు అణిచివేయబడిన ముండా తెగలకు సంబంధించిన కొన్ని సంక్షేమ కార్యక్రమాలు బ్రిటీషు ప్రభుత్వం చేయడాన్ని బట్టి ఇది "బిర్సా" ఉద్యమ ఫలితమే అని చరిత్ర కారులు అభివర్ణించారు.

నాగా తిరుగుబాటు :

గిరిజనులు స్వేచ్ఛాప్రియులు, స్వయం ప్రతిపత్తిని కోరుకునేవారు బ్రిటీష్ వారు 200 సం॥ల పాలించిన కూడా గిరిజనులను పూర్తిస్థాయి అణచలేక పోయారు. భారతదేశ కొసన వున్న ఈశాన్య ప్రాంతాల్లో నాగాలు, మిజోలు సుదీర్ఘమైన తిరుగుబాట్లు నిర్వహించారు. బర్మా సరిహద్దుల్లో ఉన్న రాష్ట్రం నాగాలాండ్ ఇక్కడే అనేక నాగా తెగలు వున్నాయి. అంగామీ నాగా, ఓనాగా, సెంగ్మానాగా, కొన్యాక్ నాగా మొదలైనవి చెప్పుకోదగ్గ నాగా తెగలు. వీరు ఎంతో పేదరికంలో ఉన్న వీరికి సంస్కృతి పట్ల మక్కువ ఎక్కువ. పోడు వ్యవసాయం లేక జుమ్ వ్యవసాయ పద్ధతిని వారు అనుసరిస్తారు. నాగాలు ఎవరికి తల వంచరు. ఆఖరికి వారి తెగనాయకుడు కూడా తలవంచరు. నాగాలు బ్రిటీష్ వారు తమ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోకుండా చాలా ప్రతిఘటించారు. వందేళ్ళపాటు రక్తపాతం, అణచివేత, దౌర్జన్యము జరిగాయి. వీరు బ్రిటీష్ వారికి మునుపే పాలించిన మొఘలులుపైన, అహోమ్ చక్రవర్తులపైన కూడ నాగాలు తిరగబడ్డారు. తమ సంప్రదాయం ప్రకారం ఈటెలు, కత్తులు, విల్లంబులతోనే యుద్ధాలు చేసేవారు. అయితే దేశంలోని గిరిజనుల కంటే ముందుగానే నాగాలు తూపాకులతో యుద్ధాలు చేయడం నేర్చుకున్నారు.

నాగా ఉద్యమనేత ''జపు ఫిజో'' ఆయన సన్నిహిత అనుచరులను రాజకీయాల్లో ప్రవేశపెట్టి శిక్షణ ఇచ్చాడు. సర్ చార్లెస్ ఫాసియే. జపు ఫిజోపై ఫాసీ ప్రభావం వుంది. 1947 జపు ఫిజో భారతదేశంలో నాగాలాండ్ భాగంగా ఉండదని బెదిరించాడు. పండిట్ నెహ్రూ ఈ బెదిరింపుని జీర్ణించుకోలేక నాగాల యొక్క డిమాండు ''తెలివి తక్కువది, ఆచరణ్య యోగ్యం కానిది, అయోద యోగ్యం కానిది అని విమర్శించారు. గెరిల్లా యుద్ధ పద్ధతుల్లో శిక్షణ పొందిన ఫిజో అతని అనుచరులు ఆ పోరాటం వైపు ముందుకు నడిపించాడు. ఈ ఉద్యమానికి నాగా ప్రజల మద్దతు బాగా లభించింది. ఈ గిరిల్లా ఉద్యమం ఒక దశాబ్దం పాటు ఉధృతంగా సాగింది. ఇది ఇలా ఉండగా 1962లో ప్రత్యేక నాగారాష్ట్రం ఏర్పడింది. భారత ప్రభుత్వం నాగాలకు సంబంధించి కొన్ని ప్రయోజన కార్యక్రమాలు చేయడం మొదలైన తరువాత నాగాల వైఖరిలో కొంత మార్పు వచ్చింది. క్రైస్తవమత ప్రచారకుల అకుంఠిత ప్రచారం దీక్షలవల్లనే ఈ కొండజాతి ప్రజల్లో అక్షరాస్యత శాతం భారతదేశం కంటే ఎక్కువగా వుంది.

మిజో తిరుగుబాటు :

బర్మా, బంగ్లాదేశ్‌లకు ఆనుకునివున్న భారతదేశ సరిహద్దుల్లో లుషాయిలనే తెగ నివసిస్తున్నది. తాము నివసించు ఈ ప్రాంతాన్ని వీరు "మిజోరం" అని పిలుచుకుంటారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో జపాన్ సైన్యం అస్సాంపై దాడిచేసినప్పుడు 300 మంది మిజో తెగలు పెద్దలు బ్రిటీష్ వారికి అన్ని విధాలా సహాయ మందించినట్లు రికార్డులను బట్టి తెలుస్తుంది. మిజోలా

తిరుగుబాటు పూర్తిగా రాజకీయ పరమైనది. సంథాల్, ముండా తిరుగుబాట్లు లాంటివి కాదు. వీరు బయట నుంచి ఎటువంటి రాజకీయ జ్యోక్యాన్ని సహించేవారు కాదు. వారు నివసించే ప్రాంతాలు గిరిజన్ల పోరాటాలకు అనువుగా వుంటాయి. షిల్లాంగ్ చుట్టూ ఉన్న అస్సాంలోని కొండ జిల్లాలతో కలిపి "మిజోలాండ్" ఏర్పాటుచేయాలని మొదట ఒక ఉద్యమం జరిగింది. 1954 సం॥లో "తూర్పు భారత గిరిజన సంఘం" ఏర్పాటుతో ప్రత్యేక రాష్ట్రానికి బీజం పడింది. అటు తర్వాత "అఖిల పక్ష కొండ జాతి నాయకుల సమావేశం"గా ఇది రూపాంతరం చెందింది. "లాల్ డెంగా నాయకత్వంలో మిజో నేషనల్ ఫ్రంట్" ఏర్పాటు అయింది. కాంగ్రెస్‌లో కొన్ని వర్గాలు సహకరించాయి. క్రమంగా ఈ ఫ్రంటు విచ్ఛిన్నకర కార్యక్రమాలను చేపట్టింది. మిజోలకు "ప్రత్యేక దేశం" కావాలనే ఉద్యమాన్ని ఉధృతం చేసి గెరిల్లా పోరాట పద్ధతులను మొదలు పెట్టింది. అస్సాంలో కొంత భాగాన్ని విడదీసి 1970 సం॥లో ఏప్రిల్‌లో మేఘాలయ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు. బ్రిటీష్ వారి సైన్యంలో మిజోలకు మంచి గుర్తింపు వుంది. లాల్ డెంగా ప్రవాసంలో ప్రభుత్వం ఏర్పాటుచేసి తానుమాత్రం కొంతకాలం మిజోకొండల్లో అజ్ఞాతవాసం చేశాడు. మిజోలు భారత సైన్యం పట్ల శత్రుత్వం వైఖరి విడనాడారు. క్రమంగా మిజోలు జాతీయ స్రవంతిలో కలిసిపోయారు.

ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని గిరిజన పోరాటాలు :

బ్రిటీష్ వారు రూపొందించిన అడవి చట్టాలు, భూశిస్తు విధానం ఆంధ్రప్రదేశ్ గిరిజనులలో బ్రిటీష్ వ్యతిరేక భావాలను పెంపొందించాయి. పరదేశీ ప్రభుత్వ క్రూర చట్టాలకు వ్యతిరేకంగా గిరిజనులు తిరగబడ్డారు.

విశాఖపట్నం గిరిజనులు తిరుగుబాటు :

బ్రిటీష్ పాలకుల స్వార్థపూరిత చట్టాల వల్ల 1832వ సం॥లో విశాఖపట్నం జిల్లాలో ప్రారంభమైంది. ప్రభుత్వం వారు వారి విశ్వాసపాత్రులైన వారిని అధికారులుగా నియమించారు. కాశీపురం, పయకరావుపేట, పాలకొండ జమిందారులలో గిరిజనులు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటును అణిచివేయడానికి "జార్జ్ రుస్సెల్" అనే అధికారిని నియమించారు. ఇక్కడ గిరిజనులు అనేక సం॥లుగా "ఫితూరి" రూపంలో తిరుగుబాట్లు కొనసాగించారు. క్రీ.శ.1917లో మద్రాసు ప్రభుత్వం ఈ గిరిజన ప్రాంత నాయకుల వ్యతిరేకతను గుర్తించారు. గిరిజనులకు అనుకూలంగా "ది ఏజన్సీ ట్రాక్ట్ - ఇంటరెస్ట్ అండ్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్ - ఆక్ట్‌ను రూపొందించింది. దీంతో పోరాటం సద్దుమణిగింది.

రంపా తిరుగుబాటు :

తెలుగు ప్రాంతాల్లో జరిగిన అతి ముఖ్యమైన గిరిజన తిరుగుబాటు రంపా గ్రామం (ఏజెన్సీ ప్రాంతం) తిరుగుబాటు. అతి ముఖ్యమైన కారణం ఆంగ్లేయుల క్రూరమైన రెవెన్యూ విధానం వారు ప్రోత్సహించిన హింసా విధానం. రంపా ఏజెన్సీ ప్రాంతానికి అధికారి "మున్సబ్‌దార్" ఉండేవాడు. వీరికి సహకరించడానికి అనేక మంది "ముత్తాదార్లు" ఉండేవారు. వీరు భూమిశిస్తు, ఇతర పన్నులు వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లించేవారు. శాంతి భద్రతలను కాపాడేవారు. 1835 సం॥లో రంప మున్సబ్‌దారైన రామభూపతిదేవ్ మరణించాడు. తరువాత వచ్చిన "మాధవతి రామభూపతి" పాలనపట్ల గిరిజనుల్లో వ్యతిరేకత వచ్చింది. తీవ్ర అసంతృప్తులు చెలరేగాయి. ఇదే సమయంలో మద్రాస్ ప్రభుత్వం కొండజాతుల వారికి తాడిచెట్ల నుంచి కల్లుతీసే హక్కులను రద్దుచేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ చర్య రంప గిరిజన నాయకులు చంద్రయ్య, సర్దార్ జంగన్, పులికాంత సాంబయ్య, కారు తమ్మన్న దొర మొదలైనవారు నేతృత్వంలో తిరుగుబాటు లేవదీశారు. ఈ తిరుగుబాటు ఏజన్సీతో చాలా ప్రాంతాలకు విస్తరించింది. అడ్డతీగల పోలీస్ స్టేషన్‌పై చంద్రయ్య దళం దాడిచేసి దగ్ధం చేసింది. అగ్రహించిన బ్రిటీష్ ప్రభుత్వం "సల్లెవన్" అని అధికారిని ఏజెన్సీకి పంపింది. విషయం తెలుసుకున్న ప్రభుత్వ అల్లర్లుకు కారణమైన "మాధవతి రామభూపతిని" తొలగించింది. నాయకులను నిర్భందించింది. దీంతో తిరుగుబాటు చల్లబడింది.

మరికొన్ని గిరిజన తిరుగుబాట్లు :

1922-24 సం॥ల్లో అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో కోయలు తిరుగుబాటు చేశారు. చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై దాడిచేసి ఆయుధాలు దొంగిలించారు. బాస్టియన్ అనే తహశీల్దారు రోడ్డు నిర్మాణానికి, గిరిజనుల వెట్టి చాకిరికి గురిచేయడంతో గిరిజనులు తిరగబడ్డారు. ఈ పోరాటంలో గిరిజనులు చాలా కష్టాలకు గురైనారు. రూదర్‌ఫోర్డ్ అనే బ్రిటీష్ అధికారిని నియమించి నమ్మక ద్రోహంతో రామరాజును కాల్చి చంపడంతో తిరుగుబాటు అణిచివేయబడింది.

1940 సం॥లో కొమురం భీం నాయకత్వాన ఆదిలాబాద్ జిల్లాలో గోండ్, కోలాం నివాసాలను బలవంతంగా ఖాళీ చేయించడంతో ఉద్యమం మొదలైంది. నిజాం ప్రభుత్వం అనేక గిరిజన గ్రామాలను తగులబెట్టింది. బ్రిటీష్ వారు కొమురం భీంను మరియు అనేకమంది గిరిజనులను కాల్చిచంపారు. ఈ ఉద్యమం తరువాత గిరిజనుల అశాంతిని తగ్గించడానికి హైమండార్స్ సలహాలను అనుసరించి భూపంపకాలు, విద్యాసంస్థలు మొదలైన సంక్షేమ కార్యక్రమాలకు ఈ ఉద్యమం ప్రభావమే కారణం. 1959 సం॥లో గిరిజన రైతాంగ ఉద్యమం మండ గ్రామంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పల్లెరాములు గిరిజనులపై ఆ ప్రాంత మున్సబ్, కరణాలు చేస్తున్న దోపిడీని చూసి గిరిజనులను సంఘటితం చేశాడు. ఇతని ప్రేరణతో గిరిజనులు చైతన్యవంతమైనది. ఈ సంఘం 200 గ్రామాలతో ఏర్పడింది. ఈ "గిరిజన రైతు కూలీ సంఘం" ఫారెస్టు ఉద్యోగుల సమస్యలపై, వడ్డీ వ్యాపారులపై పోరాటం సాగించారు. ఈ 1968 సం॥ వరకు సాగింది. ఈ ఉద్యమం అనేక విజయాలను సాధించింది.

నక్సలైట్ ఉద్యమాలు నక్సల్బరీ ఉద్యమ స్ఫూర్తితో ప్రారంభమయింది. రుణగ్రస్తత, భూములు అన్యాక్రాంతమైన, పీడనకు గురైన గిరిజనులు నక్సలైట్లు ఉద్యమానికి సహకరించారు. గిరిజన రైతాంగ ఉద్యమం బాగా ఊపందుకున్న తరుణంలో "కోరన్న, మంగన్న"ను పోలీసులు కాల్చిచంపారు.

ముగింపు :

గిరిజనులు తిరుగుబాట్లుకు కారణాలు సంస్కృతి, సాంప్రదాయాలపై గిరిజనేతరుల వలన నాశనం అవుతుందని భావించారు. బ్రిటీష్ పాలకులు తమ స్వార్థ్యంతో అధికారులను నియమించుకున్నారు. క్రూరమైన భూమిశిస్తు విధానం, వడ్డీ వ్యాపారుల దోపిడీ, రాజకీయ పరమైన అంశాలు, స్వయం ప్రతిపత్తిని కోరుకోవడం వంటి అనేక కారణాల వలన గిరిజనులు అసంతృప్తికి గురై ప్రకృతి బిడ్డలు విధలేని పరిస్థితుల్లో తమ ఉనికిని, అస్థిత్వాన్ని కాపాడుకోవడం కోసమే అనేక తిరుగుబాట్లు చేయవలసిన పరిస్థితులు బ్రిటీష్‌వారు మరియు గిరిజనేతరులు సృష్టించారు.

కె. వరలక్ష్మమ్మ గారి "ఆనకట్ట" కథ– గిరిజనుల సామాజిక చిత్రణ

–పోతురాజు దుర్గాదేవి, పరిశోధక విద్యార్థిని, తెలుగు & ప్రాచ్యభాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

ఉపోద్ఘాతం :

గిరిజన సమాజాలు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల లోనూ ఉంటాయి. కొన్ని ప్రాంతాలలో గిరిజన తెగలు ఈ నాటికీ వెనుకబడి ఉండగా మరికొన్ని దేశాలలో కొంత అభివృద్ధిని సాధించాయి. ఒకే ప్రదేశంలో నివసిస్తూ ఒక పేరూ ప్రత్యేకమైన సంస్కృతి, ఒకే భాషా, ఒకే పరిశ్రమ, ఒకే రకమైన సంప్రదాయాలు కలిగి ఉండడం, కొన్ని సందర్భాలలో ఒకే నాయకుని కలిగి ఉండేది గిరిజన సమాజం. సాధారణంగా గిరిజన సమాజాలు నిరక్షరాస్యతా సమాజాలు. అయితే ఇటీవల కాలంలో గిరిజనులకు అనే విద్యాకార్యాక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. గిరిజన సమాజాలు మిగిలిన సమాజాల కన్నా పురాతనమైనవి. అందువల్ల వీటికి సుధీర్ఘ చరిత్ర ఉంటుంది. గిరిజన సమాజాలలో కొన్ని కుటుంబాలు కలిసి ఒక వంశాలుగా ఒక గోత్రంగా, కొన్ని గోత్రాలు కలిసి ఒక గోత్ర కూటమిగా ఏర్పడతాయి. కొన్ని కొన్ని సమాజాలలో ద్విశాఖ లుంటాయి. ఇవన్నీ కలిసి ఒక తెగగా ఏర్పడతాయి. గిరి జన సమాజాలకు ప్రత్యేక సంస్కృతి ఉంటుంది. ఒక గిరిజన సమాజ సంస్కృతికీ మరొక గిరిజన సమాజ సంస్కృతికీ మధ్య చాలా తేడా ఉంటుంది. గిరిజన సమా జాలలో ఆర్థిక వ్యవస్థలు భిన్నంగా ఉంటాయి. కొన్ని గిరి జన సమాజాలలో ప్రజలు వేట, చేపలు పట్టడంపై ఆధార పడి జీవిస్తారు. కొన్ని గిరిజన సమాజాలు ఆహార సంగ్రాహక దశలో ఉంటాయి. మరికొన్ని గిరిజన సమాజాలు తోటల పెంపకంపైనా, పశుపోషణపైనా ఆధారపడి జీవిస్తూ ఉన్నాయి. గిరిజన సమాజాలు ఒక నిర్ణీత భౌగోళిక ప్రదేశంలో నివసిస్తూ ఉంటాయి. ఈ గిరిజనులకు టోటెమ్ టాబూ (కులచిహ్నాలు నిషేధాలు) అనే ఆచారాలుం టాయి. గిరిజన సమాజాలలో ఏకరూపత కనిపిస్తుంది. ఆచారాలలోనూ, జీవన విధానాలలోనూ ఏకరూపత ఉంటుంది. గిరిజన సమాజాలు సామాన్య దశలో ఉం టాయి. అందువల్లనే వారిలో సూక్ష్మమైన సాంకేతిక పరి జ్ఞానం ఉంటుంది. గిరిజన సమాజంలో జరిగే ఉత్పత్తి వాళ్ళ అవసరాల్ని తీర్చడం కోసమే. కానీ మార్కెట్‌లో విక్ర యించడానికి మాత్రం కాదు. గిరిజన సమాజాలలో రాజ కీయ వ్యవస్థ స్వయం ప్రతిపత్తిపై ఆధారపడి ఉంటుంది. మరే ఇతర సమాజాలకూ వీరి రాజకీయ వ్యవస్థపై అధి కారం ఉండదు. కొన్ని గిరిజన సమాజాలలో నాయకత్వం వంశపారంపర్యంగా సంక్రమిస్తూ ఉంటుంది. గిరిజన తెగలలో అనేక విషయాలలో మతం, మూఢనమ్మకాలు, మాయాజాలం ప్రముఖ పాత్రను నిర్వహిస్తూ ఉంటాయి.

ఆధునిక సమాజాలలో వస్తువులు విలువ కట్టడానికి డబ్బును ఎక్కువగా వాడతారు. ఇది ఆదిమ సమాజాలలో లేదనే చెప్పాలి. ఆదిమ సమాజాలు సాధారణంగా వస్తు మార్పిడి (బూటర్) పద్ధతిపై ఆధారపడి ఉంటాయి. ఆర్థిక కార్యకలపాలలో లాభాన్ని సంపాదించాలనే ఆలోచన ఉండదు. పరస్పరం సహకరించు కోవాలనీ, ఒకరి అవ సరాలలో మరొకరు పాలు పంచుకోవాలనీ సమాజ సమగ్రతను కాపాడుకోవాలనీ ఆదిమ తెగలు భావిస్తు న్నాయి. కొత్త కొత్త విధానాల్ని కనిపెట్టడం లేక ఉపయో గించడం జరగదు. అందువల్ల ఆదిమ తెగల ఆర్థిక వ్యవస్థలో అభివృద్ధి నిదానంగా జరుగుతుంది. ఆదిమ తెగలలో దైనందిన మార్కెట్ల వ్యవస్థ ఉండదు. అయితే వారం వారం జరిగే సంతలూ పండుగలలో జరిగే తీర్థాలు ఉంటాయి. కె. వరలక్ష్మిగారు ఇలాంటి గిరిజన సంతను కథా వస్తువు చేసుకొని నేటి సమాజ పరిస్థితికి అన్వయిస్తూ రాసిన కథే "ఆనకట్ట" ఈ కథ ఆంగ్లములోకి కూడా అనువాద యోగ్యత పొంది, అనువాదించబడినది.

రచయిత్రి పరిచయం :

కె. వరలక్ష్మిగారు 24 అక్టోబర్ 1948 తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేటలో శ్రీపల్లా వెంకట రమణ, బంగారమ్మ దంపతులకు జన్మించారు. ఎం.ఎ. తెలుగు చదివారు. వివిధ పత్రికలలో 140కి పైగా కథలు, 4 నవలికలు, కవితలు, వ్యాసాలు, నాటికలు, ప్రచురణ, ప్రసారం అయ్యాయి. చాలా కథలు, కవితలు, వివిధ సంకలనాల్లో చోటు చేసుకున్నాయి. "జీవరాగం, మట్టి-బంగారం, అతడు - నేను, క్షతగాత్ర, పిట్టగూళ్లు కథాసంపుటాలు", "ఆమె" కవితా సంపుటి వెలువడ్డాయి. "విహంగ" వెబ్ మేగజైన్‌లో వీరి ఆత్మకథ నెలనెలా వస్తోంది. వీరి సాహిత్య ప్రతిభకుగాను వీరికి ఎన్నో అవార్డులు లభించాయి.

ఆనకట్ట కథ-వివరణ :

"ఆనకట్ట" అనే కథలో ఆనకట్టలు ప్రజాసంక్షేమానికే కానీ, వాటి వలన ప్రభావితమయ్యే బడుగు జీవులు ఆదివాసులు. ఒక ఆదివాసీ గ్రామంలో జరిగే సంతను వర్ణించడంతో మొదలైన ఈ కథ ముంపు గ్రామానికి చెందిన కుర్రవాడితో ముంపుకు చెందని ఆదివాసి కుర్రదాని పెళ్లి ఆగిపోయి. ఉంగరం తిరిగి ఇచ్చేయ్యడంతో ముగుస్తుంది. ఆదివాసీ సంత అక్కడ అమ్మే వస్తువులు, నాగరికత, ఆదివాసీల వస్త్రధారణ మీద వేస్తున్న ముద్రలు, చిన్న చిన్న సంతోషాలు, ఆదివాసీ యువకులను ఉద్యోగాల పేరుతో మోసం చేసే దగా కంపెనీలు, డబ్బు నష్టపోయి ఆత్మహత్యలకు పాల్పడే యువకులను ఇట్లా ఎన్నో విషయాలను ఈ కథలో చొప్పించారు. అభివృద్ధి ప్రక్కనే ఉన్న విధ్వంసాన్ని వివరించారు.

కథ ఇతివృత్తం :

అడవి మార్గానికి దగ్గరలో చింతచెట్టు క్రింద ఒక బల్ల మీద రంగు పానీయాల వ్యాపారం చేసే రాంబిల్లి కొడుకు సకల. తన తండ్రి హయం నుండి ఎవరూ లేక రాంబిల్లి దగ్గరే పనిచేసే అంజి. ఇప్పుడు తండ్రి ఆర్యోగం బాగోక సకల కూలుడ్రింకుల వ్యాపారం చూసుకుంటున్నాడు. సంత ప్రారంభం అవ్వడం వలన ప్రక్కనే కూరగాయలు సర్దుకుంటూ పాపారావు. ఆ చింత చెట్టుకు కొంచెం దూరంలో రంగూనోడి టీ పాక. సకల సబ్జాలు నాన బెడుతూ రంగు నీళ్ళ సీసాలు బల్లపై సర్దుతూ ఉంటాడు. మరోప్రక్క మస్తాను తాత సేమ్యాకావిడి తెచ్చి దించుకున్నాడు. సకల నవ్వు చూసి "ఆళ్ల బాబులాగే ఈడూ మంచి కళైనోడు" అనుకున్నాడు మనస్సులో. బల్లమీద సీసాలు సర్దుతున్నా సకల చూపులు మాత్రం అడవిలోంచి జనం సంతలో కొచ్చే కాలిబాటమీదే ఉన్నాయి.

అన్నీ సర్దేక బల్లని అన్ని వైపుల్నించీ పరిశీలించి చూశాడు. ఏదో తోచినట్టై ఆచివర ప్లాస్టిక్ పూలమ్మే మరియమ్మ దగ్గర కెళ్ళి ఒక పూలగుత్తి కొనక్కొచ్చి బల్ల మీద పెట్టాడు. "ఎన్నెల ఈ బల్లని చూచి సేనా బాగుందనుకోవాలి" అని వెంటనే సకలకు క్రితవారం సంతకు వచ్చినపుడు ఎన్నెల ఎలా ఉందో గుర్తొచ్చింది. (ఎన్నెల - ఆదివాసిస్త్రీ) పచ్చని పూల పరికిణీ మీద ఎర్రవోణి ఏసుకొని పక్కకి అల్లిన జడతో ఎర్రని మందారపువ్వోకటి చెంప మీదికి వాలేలాగ తురుముకొని వొచ్చింది. సంతలో తిరుగుతూ సకలను దొంగచూపులు చూస్తూ చూడనట్టు నటించింది. తనకి తెలీకుండానే తన చూపులు ఆ పిల్ల వెంటే తిరిగాయి. అడవి నుంచి జనం కమలాఫలాల గంపల్తో, చింతపండు కావిళ్లతో, కుంకుడు కాయల మూటల్తో రావడం ఆరంభమైంది. యువతరం గిరిజనుల కట్టుబొట్టుమీద టీవీల, సినిమాల ప్రభావం కొట్టొచ్చినట్లు కన్పిస్తుంది. పాతతరం వాళ్లు కొప్పుల్లో తరుముకున్న అడవిపూల సుగంధం వాళ్ళకన్నా ముందే సంతలోకి వచ్చి వ్యాపిస్తుంది. జనాన్ని చూస్తున్న మస్తాన్ కుంపటిపొయి వెలిగించి సేమ్యాబిందెను కుంపటీ మీద కెక్కించాడు. సకలకు మస్తాన్ తాత సేమ్యా అంటే చాలా యిష్టం అప్పట్లో మస్తాన్‌ని అందరూ కలకత్తా సాయెబు అనేవోళ్లు, మస్తాన్‌కి ఒక కాలు కొయ్యకాలు మిలట్రీలో ఉండగా యుద్ధంలో కాలు పోయిందని గర్వంగా చెప్తాడు. గంపెడు సంసారం, పిల్లాజెల్లాతో ఈ అడవిలో కొచ్చి ఎందుకు కాపురం పెట్టాడో ఎవరికీ తెలియదు.

అప్పుడే కర్రూతం పట్టుకొని మెల్లిగా నడిచొస్తున్నాడు గండిపోశయ్య. గండిపోశయ్యను సకల పెద్దయ్య అని పిలుస్తూ గౌరవించి మర్యాదలు చెస్తాడు. పోశయ్య కళ్ళకు చేయి అడ్డు పెట్టుకొని ఏటి మత్తానయ్యేనా! బాగున్నావా సాయెబా? పిల్లాజెల్లా అందరూ బాగున్నారా అనడిగాడు. ఎంబాగయ్యా, ఆడపిల్లలకి పెళ్ళి చేసి పంపించేతలికి దేముడు కనిపించాడు. ఇంక మొగకుర్రోళ్లు రెక్కలొచ్చి ఎవడి దారిని అడెగిరెల్లిపోయాడు. నాకు మాత్రం ఈసేమియు కుండ ఎవ్వారం తప్పలేదు. నేను మా బూబమ్మ కలోగెంజోతాగలకదా మరి" అన్నాడు మస్తాను. ఇంతలో సకల టీ తీసుకొచ్చి పోశయ్యకిచ్చి అవి తాగగానే పోశయ్య కోసం తెచ్చిన చుట్ట అయన నోట్లో పెట్టి అగ్గిపుల్ల గీసి వెలిగించాడు. పోశయ్య మొహం ఆనందంతో వెలిగిపోయింది. ఆపైన కొడుకు గుర్తొచ్చి కళ్లల్లో నీళ్ళురాలయి. అది చూసి సకలకుగతం గుర్తొచ్చి కళ్లు చెమర్చాయి. పోశయ్య చుట్టు పొగని రెండు మూడు దమ్ములు పీల్చి తృప్తిగా తలాడించి, చుట్టని బల్లకేసి రుద్ది ఆర్పి ముక్కుదగ్గర పెట్టు కొని అపురూపంగా వాసన పీల్చి మొలగుడ్డలో చుట్టి భద్రంగా దాచుకున్నాడు. "మీయయ్య ఎలాగున్నాడా సకిలియ్యా" అనడిగేడు సకల వైపు చూసి. ఏవుంటం అలాగే మంచంలో మాయమ్మకి సెతులెత్తి దణ్ణవెట్టాల ఆడితో అలాగ సాగులాడుతున్నందుకు అవునవును మీ అమ్మ సేనామంచిబొట్టి. అది రాంబిల్లి సేసుకున్న పున్నెం అనుమంటి బారియా దొరకడం నీలాంటి కొడుకుట్టడం అంటాడు.

ఇన్నావా పోసియ్యబాబా, పాపికొండల కాడ అడ్డకట్ట కడతన్నారంట. మనకేసి ఊళ్లన్నీ ముణిగిపోతాయంట అన్నాడు మస్తాను. పోశయ్య భారంగా తల ఊపాడు. మన బతుకుల మీద అడ్డకట్టలు లేందెప్పుడు? పోతే పోనీయ్ మస్తాన్, మనిసికేది శాసితం? ఇయాల్రేపు కొండలు కొండలే మాయవైపోతున్నాయి. నాసిన్నప్పుడు ఎక్కడదాకా అడవి ఎక్కడికొచ్చిందోసూడు కాపోయినా ఎవడ్రా లోకువంటే అందరికీ మనవే అంపడతాం. మన పట్టాన్ని నిలబడ్డానికి మీసమున్న మొగొడేడి ఉప్పుడు? అరెక్కడికి పొమ్మంటే అక్కడికే పోదారి. ఎవడికో ఒకడికి మేలు జరగనియ్‌లే" అని ఎటూ పొందకుండా మాట్లాడేడు. ఈ ముసలాయిన్లో రోసం పూర్తిగా సచ్చిపోయింది అని సణుకున్నాడు మస్తాను. అవునోరే సకిలియ్యా నువ్వింకా మనవాడవేట్రా? ఏటో అంతా మారిపోయింది. పాతికేళ్ళొచ్చినా మనువులాడరు. మరింక ముసలి కాలానికి బిడ్డల్ని కంటారో ఏటో" సణుక్కుంటూ లేచి నిలబడ్డాడు. అతని మోకాళ్లు పటపటమన్నాయి మళ్లీ.

తొరలోనే పప్పన్నం పెట్టబోతున్నాడు సకల. మీకింకా తెల్దేటి? అన్నాడు మస్తాను "ఓరి ఓరి ఓరి అవునంట్రా మాబాబే మా నాయినే" అని సకల తలమీద చెయ్యేసి నిమిరేడు పోశయ్య. "ఎవనుకోకు పెద్దయ్యా ఎండన బడిరాలేవని పెద్దల బోయినాలనాడు మీగూడేనికేసి రాలేదు" అని చేతులు నలుపుకున్నాడు సకల. పర్లేదు పర్లేదులే నాయినా" అన్నాడు పోశయ్య. "జేగర్త పెద్దయ్యా, ఎండనబడి తిరక్కు సల్లనేళలోనే ఇంటి కెల్లిపో" అన్నాడు సకల. సరేనని తలవూగిస్తూ సకలని చూసి ఆప్యాయంగా నవ్వేడు పోశయ్య. ముసలాయన్ని కొంత దూరం వెళ్లనిచ్చి "ఎవరండీయన, అంత మరియాద సేస్తన్నారు? అన్నాడు జోగులు అతనీ మధ్యనే ఈ సంతకొస్తున్నాడు. ఏటి ఆయన్నే ఎరగవా? అన్నాడు మస్తాను. అతనెవరనుకుంటున్నావు. ఒకప్పుడీ సీతారం అడవికి పులి. ఈసుట్టు పక్కల గూడేల తండాలన్నింటికీ ఆయనే పెద్ద. ఏ కొండవాలులో ఎవరెంత పొడెగ సాయం సేసుకోవాలో ఆయనే సెప్పాల ఏ ఇంట ఏ తగువొచ్చినా ఆయనే ఇప్పాలా, ఈ ఏరియాలో కొండ పాదాలు భూముల్ని సదును సేసి మాగాణి ఎగసాయం ఎలాగ సేసుకోవాలో గిరిజన్లకి నేర్పిందాయనే. పక్కనే పారుతున్న గోదారి నీళ్లతో ఎలాగ బంగారం పండించి గిరిజన భూముల్ని మాగాణి భూములుగా మార్చిందాయనే. మస్తాను తెడ్డెను బిందె మీద పెట్టి గుంజుతున్న కుడిచేతిని ఎడం చేత్తో నొక్కున్నాడు. అలాంటి పులిలాంటోడు కొడుకు సేసిన

యెవ్వారానికి పిల్లిలాగె పోయేడు. ఉప్పుడింక వొయిసూ లేదు, వొంట్లో సత్తువాలేదు'' అంతకాని యెవారం ఏంజేసేడేండి కొడుకు? అన్నాడు శ్రద్ధగా వింటున్న జోగులు. పోశయ్యకు సింతాలు అనే కొడుకు ఉండేవాడు. కన్న బిడ్డకాదు బొడ్డుడుని పసివాడ్ని వదిలేస్తే వీళ్ళు తెచ్చి పెంచుకున్నారు చాలా గారబంగా పెంచారు. రంపచోడ వరంలో సింతాలు 11 చదువుతున్నప్పుడు 10 చదివిన వాళ్ళకీ ఉద్యోగాలిస్తామని ఉన్నపంప్లెట్ చూసి ఇంక చదవను ఉద్యోగం చేస్తానని మారం చేసేసరికి ఉన్నదంతా అమ్మి వాళ్ళు కట్టిందే కాక వీళ్ళను చూసి ఊళ్ళో చదువుకున్న కుర్రోళ్ళు అందరు కట్టారు. అదిగో అప్పుడే లచ్చనవైన బూవులన్నీ గిరిజనుల సేతుల్లోంచి జారిపోయాయి. నీమూలాన్నే మేవిలాగ నష్టపోయాము అని ఇటుకేసి జెనమందరూ పోసియ్య పెద్దని పట్టు కున్నారు. ఈ పెద్దాయన వొంచిన తల ఎత్తితే ఒట్టు. అటు సదువుకీ సెడిపోయి. ఉన్న కాడికి బూమీపోయి ఇటు తండ్రి పరువూ పోయిందని ఏవాలో సించుకున్నాడో సింతాలు పైవోడికి తెలాలి. ఊరిసివర చింతచెట్టుకి ఉరేసుకున్నాడు. ''అయ్యో ఎంతపన్జరిగిందే'' అన్నాడు జోగులు''. నాకు తెలకడుగుతాను. ఈ సంతకూడా ములిగిపోద్దంటున్నారు? నిజమేనేటండి? ఏమో ఆపైవాడి కెరుక అన్నట్టు రెండు చేతులు పైకి చూపించాడు మస్తాను. అతని మొహంలో సన్నని విషాదం.. మెల్లమెల్లగా సంతలోకి జనం రాక ఎక్కువైంది. చుట్టుపక్కల గిరిజన గ్రామాలన్నింటికి వారానికో రోజు జరిగే సంత అది కొండ కోనల వెనకనించి కాలి బాటల్లో, రంగు రంగుల కోకల్ని మీగాళ్ల మీదికి కట్టి చంకన బుట్టల్లో అడవి దినుసులో, కోళ్లో వేసుకుని వస్తున్నారు. ఆడంగులు రావడం రావడమే తెచ్చిన సరుకులు మారుబేరగాళ్లకి అమ్మేసి వాళ్లచ్చిన పదో పరకో తీసుకొని నచ్చినవి కొనుక్కోడానికి దుకాణాల మధ్య తిరుగుతున్నారు.

సకల డ్రింకుల అమ్మకం జోరందుకుంది. కొత్త మావాస ముందు ఎండ చుర్రుమని కాల్తోంది. శివరాత్రి వెళ్ళిన కాణ్ణుంచీ కొత్తమావాస సందడి ముందుగా సంతలోనే ప్రారంభమవుతుంది. జోగులకి ఈ రోజు బేరం బాగుంది. ఎంతపని తోందర్లో ఉన్నా సకల మనసంతా ఎన్నెల ఊహాలో నిండిపోతుంది. ఎన్నెలను మార్గ మధ్యలో రెండు మూడు సార్లచూడటం ఒకరితో ఒకరు మాట్లాడు కోవడం ఒకరినొకరు ఇష్టపడటం ఎన్నెల పెద్ద లతో మాట్లాడమని చెప్పడం అన్నీ గుర్తొస్తున్నాయి సకలకి. సకల కూడా ఆలస్యం చేయకుండా తల్లిని తండ్రిని వాళ్ళ గూడేనికి పంపించి పెళ్లిమాటలు జరిపించాడు. పెద్దల భోజనాలు జరిగిపోయ్యేయి. ''రాములోరీ పెళ్లాయ్యాక లగ్గాలు'' అన్నారు పెద్దలు. సకల ఎన్నెల వేలికి వెండి ఉంగరం తొడిగాడు. సకల కళ్లు సంతంతా వెతుకు తున్నాయి కాని జాడలేదు. ఇవాల్టికి రాదేమో? ఒంట్లో బాగోలేదేమో ఇలా రకరకాల ఊహాలతో భయాలతో సకల మొహం కళ తప్పిపోయింది. వెంటనే వెళ్ళి ఏమైందో కనుక్కోవాలని అనిపించింది. కాని చీకట్లో అడవి దారి పులిపుట్రా ఎదురౌతాయని భయం. దిగులు మొహం వేసుకొని సామాన్లన్న గూడు రిక్షాలో సర్దుకుని ఇంటిదారి పట్టాడు. రాత్రంతా నిద్రపట్టక అటూ ఇటూ మసల్తూనే ఉన్నాడు. మర్నాడు వేకువనే లేచి చప్పుడు కాకుండా సైకిల్ బైటికి తీసేడు. పొద్దు నడినెత్తికి చేరేసరికి ఎన్నెల గూడేనికి చేరుకున్నాడు. ఊళ్లో గంగానమ్మ సంబరం జరుగుతా ఉంది. నులక మంచమీద ఉన్న ఎన్నెల దిగ్గున లేచి గుడిసలోకి వెళ్ళి ఒక మూలన మోకాళ్ళమీద తల పెట్టె కూర్చోని ఏడుస్తుంది. అలా చూడగానే మనసు కరిగి పోయింది. వెళ్ళిపక్కన చతికిల పడ్డాడు. ఎన్నెలెక్కిళ్లు పెడతానే ఉంది. ఏటైంది, నిన్నెవరింత బాదించినోళ్లు, ఎందుకేడుస్తున్నావు'' చనువుగా ఆమె చెయ్యందుకున్నాడు మూసిన గుప్పెట్లోంచి తనిచ్చిన ఉంగరం అతని చేతిలోపెట్టింది. అతను నివ్వెరపోతూ '' ఏటాది? అన్నాడు ''మనమనువు జరగదంట? అయినా సరే'' ''అయినా సరేనా ఏవంట? అంత కొంపలేం ములగేయంట'' అవును కొంపలు ములగడమే, మీ ఇల్లు వాకిళ్లు, భూమిపుట్రాలు పోలారం అడ్డకట్ట నీటి నిలవ కింద ములిగిపోతాయంట.

మీరు తండాలనించి దూరంగా ఎక్కడికో ఎల్లిపోతారంట. అందుకే మా అయ్య నన్ను నీకియ్యడంట'' బోరుమంది ఎన్నెల.

ముగింపు :

అభివృద్ధి అందరి అభివృద్ధికాదు. అది కొందరి జీవితాలతో చెలగాట మాడుతుంది. కొందరి జీవితాలను వీధిలో పడేస్తుంది. అభివృద్ధి కొందరి జీవచ్ఛవాల మీదగా నడిచి వస్తుంది. ఉద్యోగాల పేరిట మోసపోయిన పోశయ్యా, ఆనకట్ట వలన సర్వం పోగొట్టుకోబోయిన సకల ఎన్నో ఆశలు పెంచుకొని మనువు జరిగిద్దని కలలు కన్నా ఎన్నెల ఆనకట్టు తమ మనువుకు అడ్డుకట్ట అయ్యిందని భోరున విలపించడం చూడవచ్చు. గిరిజనుల వస్త్రధారణ, వారి ఆర్థిక వనరులు గురించి ఈ కథలో రచయిత్రి చాలా చక్కగా వివరించారు. సంత వర్ణన చదువుతుంటే పాఠకుడికి సంతలో ఉన్న భావం కలుగుతుంది. గిరిజనులు కళ్ళముందు ప్రాణం పోసుకు తిరుగుతున్నారా అన్పిస్తుంది. ఈ కథ కూడా భావితరాలకు 'గిరిజనుల సంత' అనేది ఎలా ఉంటుందో తెలుసుకోవడానికి ఒక ఉదాహరణ కాగలదు. సర్వకాల సర్వావస్థలో అభివృద్ధి ప్రక్కనే అంటి పెట్టుకు ఉండే చీకటి కోణాలను సునిశిత దృష్టితో పరిశీలించి రచయిత్రి రాసిన ఈ ''ఆనకట్ట కథ'' ప్రాచీన తరాలకు భావితరాలకు మధ్య ఆనకట్ట కాగలదు.

ఉపయుక్త గ్రంథ సూచిక :

1. భారతీయ సమాజం
2. అతడు-నేను కథా సంపుటి కె.వరలక్ష్మి



తెలంగాణ గిరిజన కథలు – సామాజిక జీవనం

– డా॥ అంకెం శివజ్యోతి

ఆంగ్లంలో గిరిజనులకు సమానార్థకం "TRIBE" ఈ పదం "TRIBUS" అనే లాటిన్ పదం నుండి ఏర్పడింది. భారత రాజ్యాంగంలో గిరిజనుల ఉనికి ప్రస్తావించబడి ఉంది.

ఆచార సంప్రదాయాలు ప్రతి జాతికి సంస్కృతికి మూలాధారాలు. ఇవి ఒక తరం నుండి మరొక తరానికి సంక్రమిస్తూ సామాజిక జీవితాన్ని నియమ నిబంధనలతో నడిపిస్తూంటాయి.

భారతదేశంలో మనకు 3 రకాల గిరిజన జాతులు కనిపిస్తాయి. 1.దట్టమైన అటవీ ప్రాంతాల్లో, పర్వత ప్రాంతాల్లో జీవించువారు. 2.అటవీ ప్రాంతాల్లోనే వ్యవసాయ ప్రాధాన్యతను కలిగినవారు. 3.మైదాన ప్రాంతాల్లోని గిరిజన సమూహాలు.

గిరిజనుల జీవన విధానం విలక్షణమైంది. వైవిధ్య భరితమైంది. తెలంగాణలోని గిరిజనులు ఒక విభిన్నమైన భాషనూ, సంస్కృతినీ కలిగి తెలుగువారితో సహజీవనం సాగిస్తున్నారు.

తెలంగాణ గిరిజన తెగలు-నివసించు జిల్లాలు, భాషలు :

1. నాయక్‌పోడ్లు-ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం-తెలుగు.
2. అంధ్, ఆదిలాబాద్-మరాఠీ, తెలుగు.
3. హిల్‌రెడ్డి-ఖమ్మం జిల్లా తెలుగు.
4. చెంచులు-మహబూబ్‌నగర్.
5. ప్రధానులు-ఆదిలాబాద్-మరాఠి, తెలుగు.
6. కొండరెడ్లు-ఖమ్మం-తెలుగు.
7. ఎరుకలు-తెలుగు రాష్ట్రాలలోని అన్ని మైదాన ప్రాంతాలలో నివసిస్తున్నారు, తెలుగు.
8. గోండు/నాయక్, ఆదిలాబాద్-గోండి, తెలుగు.
9. కోయలు-ఖమ్మం, తెలుగు, వరంగల్.
10. లంబాడీలు-తెలుగు రాష్ట్రాలలో అన్ని జిల్లాలు.
11. కొలామిలు-ఆదిలాబాద్, తెలుగు.
12. తోటి-ఆదిలాబాద్-గోండి, తెలుగు.

భాషకు, సంస్కృతికి దగ్గరి సంబంధం ఉంది. ఏ జాతి సంస్కృతి అయినా అది ఆ జాతి, వారి భాష ద్వారా వ్యక్తమవుతుంది.

ఆధునిక తెలంగాణా సాహిత్యంలో నవల, కథ, కవిత్వం, నాటకం ప్రధాన ప్రక్రియల్లో గిరిజనుల సమస్యలను చిత్రిస్తూ పలువురు తెలంగాణా గిరిజనులతో పాటు గిరిజనేతర రచయితలు అల్లం రాజయ్య, ఉప్పల నరసింహం, కాలువ మల్లయ్య, గీతాంజలి, జాతశ్రీ జీవన్, బోయ జంగయ్య, బి.ఎస్.రాములు, ముదిగంటి సుజాతా రెడ్డి, తుమ్మేటి రఘోత్తమరెడ్డి, దిలావర్, పి.చంద్, పైడి చంద్రలత, శెట్టి కాంతారావు, శనిగరం వెంకటేశ్వర్లు (సాహు), పెద్దింటి అశోక్ కుమార్, గోపిభాగ్యలక్ష్మి, ప్రొ॥శ్రీమతి సూర్యధనుంజయ, తెలంగాణా ప్రాంత గిరిజనుల జీవితాలను కథావస్తువుగా తీసుకొని అనేక కథలు రచించారు.

ఆధునిక తెలంగాణ కథా సాహిత్యం విస్తృతంగా వ్యాప్తిలోకి వచ్చింది. గిరిజన సమస్యలు, గిరిజన స్త్రీ ఎదుర్కొంటున్న సమస్యలు ప్రధాన ఇతివృత్తాలుగా తీసుకొని తెలంగాణ కథా రచయితలు గీతాంజలి, జాతశ్రీ, బోయ జంగయ్య, బి.ఎస్.రాములు, ముదిగంటి సుజాతారెడ్డి, తుమ్మేటి రఘోత్తమరెడ్డి, పి.చంద్, శనిగరం వెంకటేశ్వర్లు (సాహు), గోపిభాగ్యలక్ష్మి మొదలైన వారు స్త్రీల కథా సాహిత్యాన్ని వెలువరించారు. కొంతమంది తెలుగు ప్రాంత రచయితలు తెలంగాణ ప్రాంత గిరిజన స్త్రీల జీవితాలను ఇతివృత్తాలుగా తీసుకొని రచనలు చేశారు. వారిలో

ఎ.విద్యాసాగర్, ఫణికుమార్, కేశవరెడ్డి మొదలైనవారు ముఖ్యులు. ఇంకా పూర్తిగా గిరిజన సంస్కృతి, చరిత్ర, సాహిత్యంపైన పరిశోధనలు, రచనలు రావాలి.

'యాడి' కథను గీతాంజలి రాశారు. పేదరికం కారణంగా ఒక లంబాడీ కుటుంబం పదేళ్ళ పాపైన చిట్టిని ఉద్యోగస్తుల ఇంట్లో పనిచేయడానికి పెట్టడంతో, ఆ పాప పడే కష్టాలు, తల్లిని చేరుకోడానికి చేసే ప్రయత్నాలు మనకు కంట తడిపెట్టిస్తాయి.

పి.చంద్ రాసిన 'హత్య' కథలో మానభంగానికి గురై హత్యచేయబడిన ఆదివాసి జంగుబాయి కన్నీటి కథ. గిరిజనులపై జరుగుతున్న హత్యలు ఎవరు చేశారో, ఎందుకు చేస్తున్నారో తెలియని పరిస్థితులను ఈ కథ వివరిస్తుంది. హత్యకథ 'భూనిర్వాసితులు' కథా సంపుటిలోనిది.

మహిళలు వ్యభిచారంలోకి నెట్టబడటానికి ప్రధాన కారణం పేదరికం. కుటుంబ పోషణ భారం, కరువు ఏర్పడటం, చేతివృత్తులు నశించటం వల్ల బలవంతంగా వ్యభిచారంలోకి నెట్టబడుతున్నారు. గిరిజన ఆడపిల్లలు బొంబాయివంటి పెద్ద పట్టణాలలో వ్యభిచార కేంద్రాలకు అమ్మబడుతున్నారు. పేదరికాన్ని జయించడానికి మాత్రమే గిరిజన స్త్రీలు వ్యభిచారులుగా మారుతున్నారు.

'బురద' కథను అల్లం రాజయ్య రాశారు. ఈ కథ 'శ్వేతరాత్రులు' కథాసంపుటిలోనిది. కొండమీదకి పెట్టుబడిదారి పరిశ్రమ విస్తరించి కృత్రిమ కరువు సృష్టించింది. అడవిలో నివసించే మనుషులు అడవిపై ఆధారపడి జీవిస్తుంటే అడవి అంతరిస్తుందని అక్కడున్న గిరిజనుల్ని బయటకు తరిమారు ఫారెస్టు అధికారులు. ఫలితంగా పట్టణాలకు వలస వచ్చిన గిరిజన స్త్రీ గోండుబాయి మాట్లాడేవారులేక పొట్టకూటికోసం దారి తప్పుతుంది. మూడురోజుల పసికందును బిడ్డలు కోల్పోయిన రైతు దంపతులకు 50 రూపాయలకు అమ్మేస్తుంది. గోండు యువకుడు ఆమెను గుర్తించి తమతో తీసుకెళ్లాలనుకుంటాడు కానీ ఆమె కనిపించదు. ఎవరూ రక్షించలేని పట్నం బురదలో కూరుకుపోతుంది ఆ స్త్రీ.

అప్పుల ఊబిలో కూరుకుపోతున్న తీరు సాహు "ఐదు రూపాయల కథ"లో చిత్రీకరించారు. ఆదిలాబాద్ గోండు గూడెంలో జరిగిన దాన్ని ఇతివృత్తంగా తీసుకొన్నారు. పేదరికం కారణంగా ఆర్థికంగా వెనుకబడి ఉన్నాయి. అమాయక గిరిజనుల కష్టాన్ని అప్పు పేరుతో దోచుకొంటుంటాడు. కొమరం జంగు కొడుకు రాంసావుకి అప్పు ఉరిబిగిసింది. తండ్రి చేసిన అప్పు ఐదువందలు చెల్లించాలని, చెల్లించకపోతే జైల్లో వేస్తానని షావుకారు బెదిరిస్తాడు. రాంసావు భయపడి బాకీ చెల్లించడానికి సిద్ధపడతాడు. గోండు తెగలమీద వచ్చిన కథల్లో విశిష్టమైనది ఐదు రూపాయల కథ.

పోడు వ్యవసాయం చేసుకొంటూ సంచార జీవనం గడుపుతున్న గిరిజనుల భూమిని గిరిజనేతరులు కబ్జా చేసిన తీరును చిత్రించిన కథ "ఆక్రమణం". రచయిత ముదిగంటి సుజాత రెడ్డి. దీనిలో ఆకయ దేవర జాతరను చక్కగా వివరించారు.

కోయల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని భూమిని గిరిజనేతరులు కాజేస్తారు. భూమిని తిరిగి సంపాదించుకోవాలన్న చైతన్యాన్ని, భూస్వాములపై తిరుగుబాటుని శిరంశెట్టి కాంతారావు "బిగిసిన ఆ పిడికిళ్ళు" కథలో చిత్రించారు. కోల్పోయిన భూమిని తిరిగి పొందే వరకు పిడికిళ్ళు బిగిస్తామని పోలీసులకు, అచ్యుతరామయ్యకు చెప్తారు. ఇందులో గిరిజన చైతన్యం కనబడుతుంది.

ప్రభుత్వం అటవీ సంరక్షణలో భాగంగా గిరిజనుల భూమిని ఆక్రమించి, తుమ్మచెట్ల ప్లాంటేషన్స్‌గా మారుస్తున్న భూమిని రక్షించుకోడానికి, గిరిజన రైతుకూలి సంఘం చేసిన పోరాటాన్ని వివరించిన కథ "భూమికోరకు". ప్రభుత్వం, షావుకార్లు గొడౌన్లలో ధాన్యం దాచుకొంటూ పేదవారికి పంపిణీ చేయకుండా, అన్యాయం చేస్తున్న వారిని శిక్షించకుండా, అడవుల్లో భూమిపైన ఆధారపడి జీవించే వారిని శిక్షిస్తోందని సాహు వివరించారు.

గిరిజనులు ఐక్యమై పోరాటానికి సిద్ధమైన తీరు అల్లం రాజయ్య "మరట్‌తుండుం పాయానా"లో వివరించారు.

భూములు ఖాళీ చేయాలని నోటీసులొచ్చిన విషయం గూడెమంతా పాకిపోతుంది. గూడెం పెద్ద సోనేరావు గిరిజన రైతు కూలీ సంఘం నడిపిన లింగుతో భూమిని దక్కించుకోవాలని, లింగు గిరిజన రైతుకూలీ సంఘం ద్వారా సాధించిన విజయాలు, నక్సలైట్లు భూమిని దక్కించుకోడానికి సహాయపడిన తీరుని వివరిస్తాడు. గిరిజనులందరు ఐక్యమత్యంగా పోరాడాలని డా॥అల్లం రాజయ్య చెప్పారు.

శ్రమకు తగిన ఫలితం లేదని రిక్షా శ్రామికుడి శ్రమని "ఘర్మజలానికి.. ఖరీదు కట్టే షరాబు" కథలో కాలువ మల్లయ్య స్పష్టం చేశారు. ఒకతను రిక్షాలో మర్చిపోయిన బ్యాగ్‌ని తిరిగిచ్చినందుకు, రతన్ దొంగతనం చేసాడని పోలీస్ స్టేషన్‌లో అప్పగిస్తాడు. ఇరవై రూపాయలు చెల్లించి విడుదలవుతాడు. రిక్షాలో ముగ్గురు ప్రయాణికుల్ని ఎక్కించుకొని చెమటలు కారుస్తూ ప్రమాదాలు తప్పించుకుంటూ వెళితే, ఐదు రూపాయిలకు మూడున్నర రూపాయిలు ఇస్తాడు. ధర్మంగా చిందించే ఘర్మ జలానికి సరైన ఫలితం ఎవరు చెల్లించగలరు?. నిజాయితీకి విలువలేదని వాపోతూ నిరాశతో వెళ్లిపోతాడు.

గిరిజనేతరుల చేతిలో మోసపోతూ జీవనం సాగిస్తున్న వైనాన్ని గోపిభాగ్యలక్ష్మి "బతుకు పయనం"లో చిత్రీకరించారు. గోండుల్లో వెనుకపడిన పరదాన్ల తెగకి చెందిన సోము ఎద్దుల బండి నడుపుతాడు. గిరిజనేతర సమాజం చేతిలో మోసపోతూ సాగిస్తున్న అడవి బిడ్డల జీవనయానమే "బతుకు పయనగాథ".

కష్టపడుతున్నా ఫలితం లేకపోవడం, గోండులు నివాసముంటున్న ప్రాంతంలో గిరిజనేతరులైన మరాఠాలు, దళితులు వచ్చి కొంత భూమిని సంపాదించుకొని షావుకార్లుగా చలామణి అవుతుంటారు. జగ్గయ్య షావుకారుగా ఈ ప్రాంతంలో గోండులనే పాలేర్లుగా నియమించుకొని ముగ్గురు భార్యలతో, ధనధాన్యాలతో తులతూగుతుంటాడు. ఆదిలాబాద్ అడవుల్లో ఉన్న గోండు తిరుగుబాటు వారి జీవితంలో తిరిగిన మలుపు చుట్టు పక్కల వ్యాపించింది, అని గొండు తెగల గురించి డా॥ అల్లం రాజయ్య మలుపు కథలో స్పష్టం చేశారు.

కష్టాల నుండి బయట పడటానికి తిరుగుబాటు ధోరణి పరిష్కారంగా భావించిన తీరు బి.ఎస్.రాములు "అడవిలో వెన్నెల"లో చూపించారు. రిజర్వు ఫారెస్టులో ఫారెస్టు అధికారులు ఇస్రూ ఇంటిపై దాడి చేస్తారు. ఇస్రూ కుర్దూని ఆశ్రయిస్తాడు. కుర్దూ కామ్రేడ్ అన్నని ఆశ్రయిస్తాడు. కామ్రేడ్ అన్నల చేతిలోని తుపాకి అడవి జంతువుల్నే కాదు, పీడించే మనుషుల్ని చంపగలదని గిరిజనులందరు అనుకొంటారు. ఇదే అడవిలో ఎదురౌతున్న సమస్యలు ఎదుర్కోడానికి వారికి పరిష్కారం దొరికినట్లౌతుందని రచయిత వివరించాడు.

పోలీసులు కాల్పులు జరుపుతున్నా బెదిరిపోకుండా పోలీసులను గూడెం నుండి తరిమిన తీరుని అల్లం రాజయ్య "తుడుం" అన్న కథ చిత్రించింది. తుడుం మోత వినపడిన ప్రతివ్యక్తి కర్రలు తీసుకొని పోలీసులు చుట్టు గుమికూడుతారు. గిరిజనులు ఏమాత్రం భయపడక పోలీసులకు దారి చూపటానికి వచ్చిన గిరిజనేతర వ్యక్తుల్ని ద్దర్ని కొండ తిరిగే దాకా తరిమి తరిమి కొడతారు. పోలీసులు భయపడి పారిపోతారు. గిరిజనులలో చైతన్యం తీసుకురావడానికి ఇటువంటి కథలు దోహదపడతాయి.

తండాలోని లంబాడీలను పోలీసులు చితకబాదిన వైనాన్ని "ముట్టడి" కథలో ముదిగంటి సుజాత రెడ్డి చిత్రించారు. మెగ్యానాయక్, తండా నివాసులందరూ పోలీసులు చేసిన గాయాలతో బాధపడుతుంటారు. రాత్రి తుపాకులతో వచ్చిన వాళ్లు ఆచూకీ చెప్పమని పోలీసులు వేధిస్తారు. అందరు వాళ్ళు ఎక్కడుంటారో తెలియక మౌనంగా ఉంటారు. లంబాడీల నుండి సమాధానం రాకపోయేటప్పటికి గుడెసెల్లోని వస్తువులు, ఆహార పదార్థాలను ధ్వంసం చేస్తారు. అడ్డువచ్చిన వారిపై లాఠీలు ఝళిపించిన వైనాన్ని రచయిత్రి వివరించారు.

అడవిలో నివసిస్తున్న గిరిజనులు నిరంతరం జంతువుల దాడులతో, ప్రకృతి వైపరీత్యాలతో సతమతమవు

తుంటారు. దానికి తోడు వైద్య సౌకర్యం అందుబాటులో లేక నిస్సహాయంగా ప్రాణాలు కోల్పోతున్న దీన గాథను ఉదయమిత్ర ''దాడి'' కథలో చిత్రించారు. వాగు నీటి ప్రవాహం చూసి పెద్దోడు భుజాలు మీద గంగారాంని ఎక్కించుకొని చిన్నోడ్ని పట్టుకొని ముగ్గురు కలిసి వాగులో దిగుతారు. ఈ స్థితిలో గంగారాం చేయినొప్పిని మరిచి పోతాడు. కడకు అందరు నీటి ఉధృతిలో కలిసిపోతారు. ప్రాజెక్టులు గిరిజనుల నివాస ప్రాంతంలో ఏర్పాటు చేయడం వల్ల గిరిజన సంస్కృతి అంతరించే ప్రమాదం ఉంది. ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిన తర్వాత పునరావాసం చూపకపోవడం వల్ల గిరిజనుల మనుగడ అగమ్య గోచరంగా తయారవుతోంది. పునరావాసం కల్పించి నప్పటికీ గోదావరి జిల్లా పాపికొండల్లోనే మరణించడానికి సిద్ధపడేకోయల గాథ ''అమానుషం''. రచయిత జాతశ్రీ. ప్రభుత్వ నిర్ణయంలో మార్పురాకపోతే అక్కడే ప్రాణాలు వదలి మరుజన్మలో చేపలమై ఆ జిల్లాల్లోనే తిరుగాడు తుంటామని అంటాడు. గిరిజనులకు పోలవరం ప్రాంతంతో ఉన్న అనుబంధాన్ని జగన్నాథంకి బుచ్చి రాములు లేఖ ద్వారా వివరిస్తే, గోపాలం బస్సు ప్రయాణంలో వివరిస్తాడు.

జలయజ్ఞం పేరుతో ప్రాజెక్టు నిర్మించదలచిన ప్రభుత్వం గిరిజన గూడేలను ఖాళీ చేయించింది. పునరావాసం కల్పించి ఇబ్బంది పడుతున్న తీరుని చిత్రించిన కథ దిలావర్ ''అరణ్యరోదన''. ప్రాజెక్టువల్ల మానవ సంబంధాలు, సంస్కృతి అంతరిస్తున్న తీరుని గూడెం వదలిన గిరిజనులు పట్టణంలో ఎలా మోసగింపబడుతున్నారో తెల్పుతుందీ కథ.

ప్రాజెక్టు నిర్మాణం పనులు చేపట్టడానికి ప్రభుత్వాధికారులు చేసిన దాడిలో ప్రాణాలు కోల్పోయిన కొండవాసి దీనగాథ, యుద్ధభూమిగా మారిన పోలవరం తీరుని రచయిత శిరంశెట్టి కాంతారావు ''పోరువనం'' కథ చిత్రీకరించింది. ముత్తెంరెడ్డి చనిపోయిన వెంటనే కొండరెడ్లను పోలీసులు బంధిస్తారు. ముత్తెంరెడ్డి మరణం ప్రాజెక్టు నిర్మాణం ఆపకలిగితే ఎంతో మంది గిరిజనుల జీవితాలు ప్రకృతి పచ్చగా ఉంటాయని వివరించారు.

తిండికి లేక పోయినా గౌరవంగా జీవించాలనుకొనే గోండు వ్యక్తి గాథ ఫణికుమార్ రచించిన ''రాజాసాబ్''. ఫణికుమార్ గిరిజనుల సిద్ధాంతాల్ని, ఆచారాల్ని గౌరవించాలని తెలుసుకొంటాడు. తినడానికి తిండిలేక పోయిన రాజవంశానికి చెందినవారు కావడం వల్ల ఎవరిని ఆశ్రయించరు.

గిరిజనుల సమస్యకు చక్కని పరిష్కార మార్గాలు సూచించిన వయోవృద్ధుని సేవను, అభిప్రాయాలను వ్యక్తీకరించిన కథ ''గోండ్వానా భీష్ముడు'', ఫణికుమార్ రచించారు. పదోతరగతి చదివిన గిరిజనులనే పాఠశాల అధ్యాపకులుగా నియమిస్తే మంచి ఫలితం ఉంటుందని సూచిస్తాడు.

గోండుల జీవన యానంలో వ్యవసాయపు పని ప్రారంభమైనప్పటి నుండి పంట చేతికొచ్చే దాక ప్రతి పనికి కోడిని బలివ్వడం సంప్రదాయం. నిరుపేదలయినా అప్పోసప్పో చేసి సంప్రదాయాన్ని కొనసాగించటానికి బద్దుడై అప్పుల ఊబిలో కూరుకుపోయే తీరుని ''కాయిదా'' కథలో సాహు చిత్రించారు. ఈ కథలో గోండుల సంస్కృతి, సంప్రదాయాలను చక్కగా వివరించారు.

ఆదిలాబాద్ మరియు బస్తర్ జిల్లాల్లో గోండు గిరిజనులు మాట్లాడే భాష గోండు భాష. గోండులతో సహవాసం చేసే కొలాములు తమ భాష కొలామీయే కాక గోండు భాష కూడా మాట్లాడగలరు. ప్రతి సంవత్సరం జనవరి 27న గుంజాల గోండీ లిపి దినోత్సవం జరుపుతున్నారు. ఆదిలాబాద్ ఉట్నూర్ ప్రాంతంలో ప్రొ॥జయధీర్ తిరుమలరావు పర్యవేక్షణలో గుంజాల గ్రామంలో గోండు భాషా ఉద్యమం జరిపారు.

తరతరాలుగా వస్తున్న అలవాట్లు, ఆచారలన్నీ అంతర్ధానమౌతున్న నేపథ్యంలో పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ కులపతి ఆచార్య పేర్వారం

జగన్నాథం జనవరి 1995లో ''జానపద గిరిజన విజ్ఞాన పీఠానికి'' అంకురార్పణ చేశారు.

సమాజంలో గిరిజనులు పలురకాల సమస్యలను ఎదుర్కొంటున్నారు. గిరిజనులకు గిరిజనేతర వ్యక్తులతో సంబంధం ఏర్పడినప్పటి నుండే సమస్యలు ప్రారంభ మయ్యాయి. జంతువులకంటే గిరిజనేతర మానవున్ని చూస్తే చాలా భయపడతారు. గోండు తెగలోని వివాహ సంప్రదాయం కొనసాగించలేక పడుతున్న అవస్థలను సాహు ''పెళ్ళికావాలి'' అన్న కథలో చిత్రించారు.

గిరిజనుల సంస్కృతి, గిరిజన పోరాటాలు, గిరిజన సమస్యలు, తెలుగు కథా సాహిత్యంలో గిరిజన జీవితా లను చిత్రించిన కథల ఇతివృత్తాల పరిశీలన చేయడం జరిగింది.

తెలుగు సాహిత్యంలో ఆదివాసీల రచయితలు అతి తక్కువగా ఉండటానికి కారణం- ప్రపంచీకరణ, అవిద్య, మూఢనమ్మకాలు, నాగరికతకు దూరంగా ఉండటం లాంటివి. గిరిజన యువతలో తమ సాహిత్యం పట్ల, సంస్కృతి పట్ల అభిరుచిని, గౌరవభావాన్ని పెంపొందింప జేయాలి. ఇందుకుగాను విద్యావంతులు, గిరిజన సంఘాలు, సాంస్కృతిక శాఖలు, పాఠశాలలు, సాహిత్య సంస్థలు కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైన ఉంది. అంతరించిపోతున్న ఆదిమ సంస్కృతి, మానవీయ ఆచార సంప్రదాయాలు, నేపథ్యంతో రచనలు రావాలి. గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలు, భాష రోజు రోజుకీ అంతరించి పోతుంది. ఈ సంస్కృతిని పరిరక్షించు కోవడం కొరకు గిరిజనులు, ప్రజా ప్రతినిధులు మరియు తదితరులు నడుము బిగించాలి.



'పునరావాసం' – గిరిజనుల స్థితిగతులు

– డా॥ డి. నల్లన్న, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి.

ఆధునిక సాహిత్యంలో నవలకు ఎంతో ప్రత్యేకత ఉంది. ప్రాముఖ్యత ఉంది. నవల జీవితాన్నేగాక సమ కాలీన సమాజాన్ని కూడా చిత్రిస్తుంది. తద్వారా ఎన్నో విషయాలను ఆకళింపు చేసుకొనేందుకు దోహదం చేస్తుంది.

స్వాతంత్ర్య పూర్వ నవలలు ఆయా కాలానికి సంబం ధించిన జీవన విధానాన్ని ఆవిష్కరిస్తే, స్వాతంత్ర్యానంతర నవలలు స్వతంత్ర భారతంలో చోటుచేసుకొంటున్న ప్రాకృతిక, భౌతిక, మానసిక మార్పులను చిత్రించే యత్నం చేశాయి. సామాన్యుడి ఆలోచనా విధానానికి, గొంతుకు, ప్రాతినిధ్యం వహించేందుకు ప్రయత్నించాయి. ఈ వరుసలో వచ్చినవే స్త్రీవాద నవలలు, దళితవాద నవ లలు, మైనారిటీ వాద నవలలు. వాటికి కొనసాగింపుగా గిరిజన నవలలు కూడా వచ్చాయి. ఈ నవలలు సామాన్యులకు చేరువ కావడానికి కొన్ని సుప్రసిద్ధ పత్రికలు దోహదపడ్డాయి. అలాంటి వాటిలో 'చతుర' మాసపత్రిక చెప్పుకోదగింది. ఒకప్పుడు చతురలో ప్రకటితమైన 'పునరావాసం' అనే నవలను గురించి సమాలోచించడమే ఈ పత్రోద్దేశం.

వార్తాపత్రికలు, రేడియోలు, టీవీలు మొదలైన ప్రసార మాధ్యమాల్లోనూ ప్రభుత్వం వారి కార్యక్రమాలను వార్త లుగా వస్తున్నాయి. ఈ వార్తల్లో చాలావరకు సంక్షేమ పథ కాలకు సంబంధించినవే. ఆర్థికంగా, సామాజికంగా బాగా చితికిపోయిన వారిని గురించి, వారి వెనుకబాటుతనాన్ని, దారిద్ర్యాన్ని పొగొట్టడం గురించి ప్రభుత్వాలు ఆలో చిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ పథకాలు అమలు జరిగే తీరు, లబ్ధిదారులకు జరిగే మేలు ఇటువంటివెన్నో ప్రసార మాధ్యమాల కథనాలుగా వస్తున్నాయి. ఇవన్నీ గమనించినప్పుడు ఎవరికైనా కొంతైనా ఆనందం కలుగక మానదు. అంతా సుభిక్షంగా ఉందని అనిపించక మానదు. అయితే దురదృష్టవశాత్తు వార్తలకు, వాస్తవానికి చాలా తేడా ఉందని కొందరు రచయితలు తెలియజేసేందుకు ముందుకు వచ్చారు. కథలల రూపంలోనూ, నవలల రూపంలోనూ, నాటకాల రూపంలోనూ, కవితల రూపం లోనూ తాము చెప్పదలచుకున్న వాటిని చాలా స్పష్టంగా చెప్పేందుకు ప్రయత్నించారు. అలాంటి వారిలో శ్రీకా కుళం ప్రాంతానికి చెందిన ఎ. అప్పల్నాయుడుగారు ఒకరు.

అప్పల్నాయుడు 'పునరావాసం' అనే నవల రచించాడు. దీనిలో గిరిజన జీవన విధానాన్ని, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను, వారి గూడెల స్థితిగతు లను, మైదానం నుంచి వెళ్ళేవారు గిరిజనులను దోచుకొనే వైనాన్ని తెలియజేసేందుకు ప్రయత్నించారు. ఇక్కడ గిరిజనులంటే పర్వతాల మీద నివసించేవారనే మాత్రమే గాక పర్వత ప్రాంతారణ్యాలలో నివసించేవారని కూడా చెప్పుకోవలసి ఉంటుంది. చెంచులు, గోండులు, ఎరు కలు, యానాదులు, ఇరళవారు, సుగాలీ వారు గిరి జనులు (ST) గానే పరిగణింపబడటం అందరికి విది తమే.

పర్వతాల మీద, పర్వతారణ్యాలలోనూ నివసించే గిరిజనులకు ప్రభుత్వం ఎన్నెన్నో ఆశలను కల్పించింది. వాటిలో గృహ నిర్మాణం పథకం ఒకటి. గిరిజనులకు ఉచితంగా ఇల్లు నిర్మించి ఇవ్వాలనో, ఎక్కువ రాయితీతో తక్కువ వడ్డీకి ఋణసదుపాయం కల్పించి ఇల్లు నిర్మింప చేయాలనేది ఈ పథకం సారాంశం. ప్రభుత్వం వారి ప్రకటనలు గిరిజనుల మనస్సుల్లో కొత్త ఆశలు మొలకెత్తిం చాయి. స్వంత ఇంటికలను నిజం చేసుకోవాలనే తపన కలిగించి రగిలించాయి. పర్యవసానంగా స్వగృహం కోసం

చాలామంది దరఖాస్తులు పెట్టుకున్నారు. వారికి ఇల్లు మంజూరయ్యాయి. ప్రభుత్వం కొంత ద్రవ్యాన్ని మొదట మంజూరు చేసింది. లబ్ధిదారులు కూడా మొదట కొంత పెట్టుబడి పెట్టుకొంటే గృహ నిర్మాణం పూర్తయ్యాక ప్రభుత్వం దానికయ్యే ఖర్చు తిరిగి ఇవ్వబడుతుందని తెలియజేసింది. గృహాల నిర్మాణం ప్రారంభమైంది. అయితే అది సజావుగా సాగలేదు. కారణం గిరిజనులు నిరుపేదలు. పెట్టుబడికి కావలసినంత డబ్బు వారి దగ్గర లేదు. అందువల్ల అవి ఆగిపోయాయి.

ప్రభుత్వం చేపట్టే పథకాలు ప్రారంభ దశలోనే ఎలా నిర్వీర్యమైపోతున్నాయో, ఆశించిన ఫలితాలు ఎందుకు రావడం లేదో ఈ నేపథ్యం ద్వారా తెలుసుకోవచ్చు. పథక రచనలోనే లోపమున్నట్లు దీని ద్వారా గ్రహించవచ్చు.

ఆ గూడెంలోనే ఒక తెలివి గలిగిన బాలిక ఉంది. ఆమె పేరు బంతి. ఆమెకు ఒక అద్భుతమైన ఆలోచన తట్టింది. సూపర్‌వైజర్ రాజబాబును కలిస్తే ఫలితం ఉండవచ్చునని ఆమె పెద్దలకు సూచించింది. వారు ఆమె సూచన మేరకు రాజబాబును కలిశారు. తమ దీనావస్థను విన్నవించుకున్నారు. రాజబాబు మనసులో గూడెం మెదిలింది. గూడెంలోని యువతి బంతి మెదిలింది. వారికి సహకరిస్తే బంతిని ఆకర్షించవచ్చని తోచింది. కాంట్రాక్టర్ జగ్గారావుతో చెప్పి మెప్పించాడు. ఇళ్ళ పనులు సజావుగా సాగాయి. గృహాల నిర్మాణం పూర్తయింది.

ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా చేరటానికి అవకాశం లేని వ్యవస్థలో మధ్య వ్యక్తులు స్వప్రయోజనం కోసం, అది ధనం కోసం కావచ్చు, మరే ఇతర ప్రయోజనం కోసమైనా కావచ్చు. ఆ అవకాశాన్ని నేర్పుగా ఉపయోగించుకొంటారని రాజబాబు పాత్ర బోధపరుస్తుంది. గిరిజనులలో యుక్త వయసు వచ్చిన వారు, యుక్త వయసులో ఉన్న అవివాహిత యువతులను వివాహం కోసం ఎత్తుకు పోవడం ఆచారం. ఆ యువతికి ఎత్తుకుపోయిన యువకుడు నచ్చితే వివాహం చేసుకొంటుంది. నచ్చకపోతే ఆ సంగతి అక్కడే తెగేసి చెప్పి స్వగృహానికి వచ్చేస్తుంది. ఈ ఆచారాన్ని కూడా అప్పల్నాయుడు గారు చక్కగా చిత్రించారు. భీముడు బంతిని పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు. ఆమె ఒంటరిగా నీళ్ళకోసం వెళుతున్నప్పుడు పట్టుకున్నాడు. తమ ఇంటికి ఎత్తు కెళ్ళాడు. అయితే బంతికి భీముడి మీద మనసు లేదు. ఆ విషయాన్నీ ఆమె అతడికి స్పష్టీకరించింది. ఇంటికి వచ్చేసింది. ఆమె తాత కంఠుడు విషయం తెలుసుకొని బాధపడ్డాడు. పట్టణ ప్రభావం వల్ల తమ గిరిజనుల ఆచారాలు అడుగంటిపోతున్నాయని విచారించాడు. బంతి భీముడిని వివాహం చేసుకోవడానికి సుముఖత వ్యక్తపరిచే ఉంటే బాగుండేదని అతని అభిప్రాయం. ఇక్కడ గిరిజనుల ఆచారాలను, గిరిజనుల సంస్కృతిని పరిరక్షించుకోవడం పట్ల వారికి గల మనోధైర్యాన్ని ఈ సంఘటన తెలియజేస్తుంది.

పదవ తరగతి చదువుకొన్న బంతి మైదానం నుంచి వచ్చిన సూపర్‌వైజర్ రాజబాబు ఆకర్షణకు గురైంది. అది ప్రేమగా భ్రమించింది. పట్టణంలో ఏదైనా ఉద్యోగం తీసిస్తానీ బంతి తాత కంఠుడికి చెప్పి రాజబాబు అతణ్ణి ఒప్పించాడు. బంతిని తనతో తీసుకువెళ్ళి తమ ఆఫీసులోనే నీళ్ళు తెచ్చి ఇచ్చే ఉద్యోగంలో పెట్టాడు. అప్పుడు బంతికతడు దేవుడిలాగే కనిపించాడు. అతనితోడిదే తన లోకమని ఆమెకు అప్పుడు అనిపించింది. అతనితో కలిసి సినిమాలకు వెళ్ళింది. షికార్లు తిరిగింది. లాడ్జీలకు సైతం వెళ్ళింది. అతను చెప్పినట్లాల్లా చేసింది. పర్యవసానంగా గర్భవతి అయ్యింది. విషయం తెలుసుకొన్న రాజబాబు ఆమెను తప్పించుకొనే ప్రయత్నం చేశాడు. కొన్నేళ్ళపాటు కనుమరుగయ్యాడు. బంతికి ఏమి చేయాలో పాలు పోలేదు.

అవివాహిత అయిన బంతి గర్భవతి అయిన వార్త గూడెంలో గుప్పుమంది. పంచాయితీ ఏర్పాటైంది. బంతి గర్భవతి కావడానికి కారణమెవరో చెప్పమని ఆమెను నిలదీశారు. ఆమె చెప్పలేకపోయింది. అయోమయ స్థితిలో పడిపోయింది. అప్పుడు అక్కడే వున్న భీముడు ఆమెను

ఆదుకున్నాడు. ఆమె గర్భానికి తానే కారణమని అందరి ముందుకు వచ్చి చెప్పాడు. తద్వారా బంతికి రానున్న ముప్పును తప్పించాడు. భీముడి సౌజన్యం బంతి కళ్ళు చెమర్చేలా చేసింది. బంతి భీముల వివాహం జరిగింది.

అమాయకులైన ఆడపిల్లలను ఏదోవిధంగా ఆకర్షించి తమ పబ్బం గడుపుకోవడం ఇప్పటికి సమాజంలోని అన్ని వర్గాలలోనూ కనిపిస్తుంది. అయినప్పటికి నిమ్నకులాల వాళ్ళను వంచించడం సులభమని రాజబాబు నిరూపించి నట్లయింది. అమాయకులైన నిమ్నకులాలవారు ప్రలోభానికి గురై అగ్రకులాల వారి వలలో సులభంగా, తొందరగా పడతారని ఈ సంఘటన తెలియజేస్తుంది. భీముడు స్వచ్ఛమైన మనస్సు కలవాడు. బంతి మీద ప్రగాఢాను రాగం ఉన్నవాడు. అందువల్ల ఆమెకు రాబోయే ఆపదను పసిగట్టి రక్షించాడు. ఈ సంఘటనల ద్వారా ఏదైనా తప్పు జరిగినప్పుడు గూడెం పెద్దలంతా సమావేశమై దోషిని శిక్షించేవారని తెలుస్తుంది. భీముడు ఆమెను ఆదుకోక పోయి వుంటే బంతి వాస్తవం చెప్పి వుంటే వారి కుటుంబాన్ని గూడెం నుంచి వెళివేసి వుండేవారు. అనేక ఇక్కట్లకు గురిచేసి ఉండేవారు. ఇది గిరిజనుల కట్టుబాట్లను తెలియజేస్తున్న అంశం.

గిరిజనుల గూడెలకు స్కూల్లు వచ్చాయి. టీచర్లు వచ్చారు. ముగ్గురు పనిచేసే స్కూళ్ళల్లో ఒక్క టీచరు మాత్రమే వచ్చేవాడు. తక్కిన వాళ్ళు ఎప్పుడో వచ్చి సంతకాలు పెట్టేవారు. వారు చిత్తశుద్ధితో తాము చేయవలసిన వృత్తి ధర్మాన్ని గంగలో కలిపి స్వగ్రామాల్లోనే స్వలాభం కోసం వ్యవసాయమో, వ్యాపారం చేసుకొంటూ వుండేవారు. గిరిజన విద్యార్థుల హాస్టల్ వార్డన్లు కూడా తమకు బదులుగా స్వల్ప పారితోషికం ఇచ్చి మరొకరిని తమ పనిలో నియమించేవారు. వీరు వార్డను జీతంతో బాటు అదనంగా ఆదాయాన్ని పెంచుకొనేందుకు శ్రమించేవారు. వార్డన్ల తరపున నియమింపబడిన వారు కూడ విద్యార్థుల సేవలో చిత్తశుద్ధి కనబరచేవారు కాదు. వారి చేతనే పనులు చేయించుకొనేవారు. ఎంతో కొంత మొత్తం మిగిలించుకునేవారు. గిరిజనుల సంక్షేమాధికారులు, నక్సలైట్లు అప్పుడప్పుడు వచ్చి వారిని హెచ్చరించి వెళ్ళేవారు. అయినా ఫలితం ఉండేది కాదు. గిరిజన గ్రామాల్లోని వారు నిరక్షరాస్యులు. చదువుపట్ల శ్రద్ధలేని వారు. చదువు ప్రయోజనం తెలియనివారు. వారి అజ్ఞానాన్ని ఆసరాగా తీసుకొని ఉపాధ్యాయులు, ఇతర అధికారులు ఎంత విచ్చిలవిడిగా ఎలా మసలుకొనేవారో ఇక్కడ గ్రహించవచ్చు. గిరిజనులను బాగు చేయడానికి, పైకి తీసుకు రావడానికి ప్రభుత్వం చేసే ప్రయత్నాలు ఏ విధంగా విఫలమవుతున్నాయో బోధపడుతూ ఉంది.

బంతి గౌరునాయుడు అనే టీచరు ప్రోత్సాహంతో ఇంటర్మీడియట్ పూర్తిచేసింది. సంగీతం నేర్చుకుంది. సంగీతం టీచరుగా తమ గ్రామంలోని పాఠశాలకే వచ్చింది. ఆమెను గిరిజన సంక్షేమాధికారి మెచ్చుకున్నాడు. వారిద్దరూ కలిసి పాఠశాల అభివృద్ధికి పాటుపడసాగారు. గిరిజన సంక్షేమాధికారి ఆదరణ చూరగొన్న బంతి అంటే తక్కిన టీచర్లకు భయం పట్టుకుంది. ఆమె తమ మీద రిపోర్టు చేస్తుందేమో అన్న భయంతో పాఠశాలకు సక్రమంగా రాసాగారు. అయితే ఇది ఎన్నో రోజులు సాగలేదు. బాధితులయిన టీచర్లు గిరిజన సంక్షేమాధికారికి బంతికి అక్రమ సంబంధం అంటగట్టారు. తమ పలుకుబడితో అధికారిని అదిలాబాద్‌కు బదిలీ చేయించారు. తమ పూర్వకార్యకలాపాలను మళ్ళీ కొనసాగించారు.

దీన్నిబట్టి అవినీతిపరులు నీతిపరులను సహించలేరు. అక్రమాస్తులు తమ అక్రమ సంపాదనకు అడ్డుపడేవారిని ఏ విధంగానైనా అడ్డు తొలగించే ప్రయత్నం చేస్తారు. స్త్రీ పురుషులకు అక్రమ సంబంధాన్ని అపవిత్రంగా అంటగట్టేందుకు కూడా వెనుకాడారని అవగతమవుతుంది.

భీముడితోపాటు కొందరు గిరిజనులు తమకు మంజూరైన లోను కోసం బ్యాంకుకు వెళ్ళారు. బ్యాంకులో పని చేస్తున్న దఫేదారు వారిని చూసి అసూయపడ్డాడు. అవమానకరంగా మాట్లాడాడు. వారు బాగుపడరని ఎద్దేవా చేశాడు. గిరిజనేతరుల మనస్తత్వాన్ని యథాతథంగా

ఆవిష్కరించేందుకు అప్పల్నాయుడు రాసిన ఈ దఫేదారు సంభాషణ ఎంతగానో ఉపకరిస్తుంది.

"అదృష్టమంటే మీది కాదా? జీడితోటా మీదే! జీడిపిక్కా మీదే! అది పెంచినందుకు సొమ్ము! ఆహా! ఏం అదృష్ట జాతకులురామీరు! గేదెల్ని మీకిచ్చి ఆడికి కుడితే, గడ్డి గూడా యిచ్చి ఆటిపాలు తాగటానికి రేపు మీకు జీతా లిచ్చే రోజులొచ్చినా వస్తాయి! అయినా మీరు బాగుపడరు. గోసిగుడ్డ మారదు. ఎలాగర్రా మీరు బాగుపడతారు? ఒక పని చెయ్యండ్రా... మా యినబ్బీరువా వొట్టికెలిపోయి మీ ఇళ్ళలో పెట్టుకొండ్రా.... బాగుపడతారు".

కాంట్రాక్టరు జగ్గారావు గిరిజనుల పేర్ల మీద గెదేల లోను తీసుకొన్నాడు. లంచాల ఎర చూపడమో బ్యాంకు అధికారులు కూడా ఈ విషయంలో అతనికి సహకరిం చారు. జీడిమొక్కల లోను కోసం వెళ్ళిన గిరిజనులను ఆ లోను కట్టవలసిందిగా అధికారులు బెదిరించారు. వారిచేత వేలిముద్రలు వేయించుకున్నారు. జీడిమొక్కల కోసం మంజూరైన ఋణం గేదెల లోనుకు జమ చేసు కుంటున్నామన్నారు. గిరిజనులు వట్టి చేతులతో తిరిగి వచ్చారు. ఈ విషయం విన్న బంతి బాధపడింది. అన్యాయా నికి ఎదురు తిరిగింది. అధికారుల దగ్గరికి వెళ్ళి నిల దీసింది. జిల్లా గిరిజన సంక్షేమాధికారి బంతిని విమర్శిం చాడు. టీచరువా? లీడరువా? అని ఎద్దేవా చేశాడు. నక్సలైట్లు తరఫున ఎవరో రాసిన ఉత్తరాన్ని బంతి రాసిం దని ఆమె మీద నేరం మోపాడు. ఆమె ఉపాధ్యాయిని ఉద్యోగాన్ని ఊడబెరికించాడు.

చదువుకున్నవారు, సంస్కారం వున్నట్లు ప్రదర్శించు కొనే అధికారులు అవివేకంగా, అమానుషంగా అమాయకు లను ఎలా ఇబ్బంది పెడతారో ఈ సంఘటన తెలియ జేస్తుంది. న్యాయం ప్రశ్నించిన వారిని ఏ మేరకు దిగతొక్కేందుకు ప్రయత్నిస్తారో బోధపడుతుంది. న్యాయం గురించి మాట్లాడేవారు ఎంతటి అన్యాయానికి గురవుతారో బంతి ఉదంతం బహిర్గతం చేస్తుంది.

జగ్గారావు గిరిజనుల భూములను అక్రమంగా స్వాధీనం చేసుకున్నాడు. పంటవేశాడు. గిరిజనులు తమకు జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వంతో మొరపెట్టు కున్నారు. అయినా సంబంధిత అధికారులలో ఎటువంటి స్పందనా లేదు. జగ్గారావు తనకు ఎదురులేని విధంగా గిరిజనుల పొలాల్లో పంట పండించుకున్నాడు. పంట ఇంటికి తీసుకువెళ్ళే సమయంలో గిరిజనులు మూకుమ్మడిగా వెళ్ళి అతణ్ణి అడ్డుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు వెళ్ళింది. రక్షక భటులు వచ్చి న్యాయం కోసం నిలబడిన గిరిజనుల మీద కాల్పులు జరిపారు. భీముడితో పాటు అయిదుగురు గిరిజనులు అక్కడికక్కడే మరణిం చారు.

గిరిజనుల పట్ల మైదానంలోని గ్రామీణులు ఎంత అవాంఛనీయంగా వ్యవహరించేవారో దీన్ని బట్టి తెలు స్తుంది. పోలీసులు లంచాలు పుచ్చుకొని అక్రమాస్తులకు, అక్రమార్జనపరులకు ఏ విధంగా కొమ్ముకాసేవారో, జగ్గా రావుకు వాళ్ళిచ్చిన మద్దతును బట్టి బోధపడుతుంది.

పాలక పక్షంవారు వచ్చి మృతుల కుటుంబాలను సానుభూతి పూర్వకంగా పరామర్శించారు. వెలకట్టజాలని మృతుల ప్రాణాలకు నామమాత్ర పరిహారంగా చెక్కులిచ్చి వెళ్ళారు. తమకు ఓట్లు వేసి గెలిపిస్తే గిరిజనుల సమస్త సమస్యలను పరిష్కరిస్తామని ప్రతిపక్షాలవారు చెప్పి వెళ్ళారు. గిరిజనులను ఆస్తి నష్టానికి, ప్రాణనష్టానికి గురి చేసిన వారి మీద పగ తీర్చుకుంటామని నక్సలైట్లు భరోసా ఇచ్చి వెళ్ళారు. వారన్నట్లే సమయం చిక్కినప్పుడు జగ్గారావును కాల్చి చంపారు. పోలీసులు హంతకులను పట్టుకోలేక గిరిజనుల గూడెలమీద పడ్డారు. దొరికిన వారినల్లా చితకబాదారు. బీభత్సం సృష్టించారు. భయ భ్రాంతులైన గూడెం ప్రజలు అడవుల్లోకి పారిపోయారు. బంతికూడ తన తాత కంఠుడిని వెంటబెట్టుకొని అడవి లోకి వెళ్ళిపోయింది. మార్గమధ్యంలోనే కంఠుడు కన్ను మూశాడు. బంతి మాత్రం ఎలాగో ఒకలాగా బంతి నాయ నమ్మగారి పుట్టింటికి చేరుకోగలిగింది.

"పునరావాసం" నవలలోని ఇతివృత్తాన్ని బట్టి గిరిజనుల ఆర్థిక స్థితిగతుల్లో ఎటువంటి మార్పు రాలేదని అవగతమవుతుంది. గిరిజనుల కోసం ప్రభుత్వంవారు ప్రకటించే పథకాలు కూడా సత్ఫలితాలను ఇవ్వకపోగా, దుష్ఫలితాలనే ఇస్తున్నాయని బోధపడుతుంది. ప్రభుత్వం పథకాలను చిత్తశుద్ధి, నిజాయితీలేని అధికారులు ఏ విధంగా నిర్వీర్యం చేస్తున్నారో కొట్టొచ్చినట్లు గోచరిస్తుంది.

గిరిజనుల పట్ల, గిరిజనుల సంస్కృతిపట్ల, వారి పరిస్థితుల పట్ల సదవగాహన పెంపొందించుకొని, సంస్కారవంతులు, విజ్ఞులు అయిన అందరూ వారి సర్వతోముఖాభివృద్ధికి సర్వవిధాలా పాటుపడవలసిన ఆవశ్యకతను నవలా రచయిత ఎ. అప్పల్నాయుడుగారు ఈ నవలద్వారా బోధపరచేందుకు ప్రయత్నించి కృత కృత్యులయ్యారు.

ఆధార గ్రంథాలు:

1. అప్పల్నాయుడు, ఎ. - పునరావాసం.
2. దక్షిణామూర్తి, పి. - తెలుగు నవల.
3. నాగభూషణశర్మ, ఎం. - తెలుగు నవలావికాసం.
4. వెంకట సుబ్బయ్య, వి. - నవలాశిల్పం.

గోండు – పాటలు

– ఎస్. లలిత, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, తెలంగాణ సారస్వత పరిషత్ ఓరియంటల్ కళాశాల, హైదరాబాద్, తెలంగాణ.

గిరిజనులను వివిధ రకాల పేర్లతో పిలుస్తున్నారు. ఆదివాసులని, అనాగరికులని, కొండజాతులని వివిధ రకాలుగా పిలుస్తున్నారు. గిరి అంటే కొండ. పర్వత ప్రాంతాలలో అడవులలో నివసిస్తున్న ప్రజల సమూహాన్ని గిరిజనులు అంటారు. భారతదేశంలో గిరిజనులను వివిధ రకాల పేర్లతో పిలుస్తారు. హిందీలో 'ఆదివాసి' అని, ఆంగ్లంలో 'tribe' అని పిలుస్తున్నారు. Tribe అంటే తెగ, సమూహం అని అర్థం. ఈ గిరిజనులు ఆదిమ కాలం నుంచి తమ సంస్కృతిని పరిరక్షించుకోవటానికి నాగరిక ప్రపంచానికి దూరంగా కొండకోనల్లో, అడవుల్లో నివసిస్తూ తమ సాంప్రదాయాలను పాటిస్తున్నారు.

భారతీయ గిరిజనుల్లో గోండులను ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. ఈ గోండులు చారిత్రకంగా, సాంస్కృతికంగా, సంఖ్యాపరంగా అన్ని విధాలా ఇతర గిరిజనుల కంటే ఉన్నత స్థితిలో ఉన్నారు. పూర్వం వీరు మధ్య భారత దేశంలోని గోండ్వానా ను పరిపాలించారు. అయితే కాల క్రమంలో మహారాష్ట్ర, మహమ్మదీయ దండయాత్రల వల్ల వీరి రాజ్య వ్యవస్థ విచ్ఛిన్నమై, వీరంతా వివిధ రకాల ఉప కులాలుగా విడిపోయి, దేశంలోని వివిధ ప్రాంతాలలో అత్యంత దయనీయ స్థితిలో అనాగరికంగా జీవిస్తున్నారు. అత్యంత పురాతన గిరిజన జాతులలో ఒకటిగా చెప్పబడే గోండు జాతివారికి విశిష్టమైన మత సంస్కృతి, ఆచార వ్యవహారాలు ఉన్నాయి.

సంఖ్యాపరంగా గమనిస్తే, భారతీయ గిరిజన జాతుల్లో గోండు జాతి పెద్ద తెగ. గోండులు దేశంలోని, వివిధ రాష్ట్రాల్లో వివిధ పేర్లతో పిలవబడుతున్నారు. అయితే ప్రధానంగా గోండులను నాలుగు వర్గాలుగా చెప్పవచ్చు. రాజ్ గోండులు, దుర్వే గోండులు, మరియ గోండులు, మురియ గోండులు. మన తెలంగాణ రాష్ట్రంలోని అదిలాబాద్ జిల్లాలో రాజ్ గోండులు ఎక్కువగా నివసిస్తున్నారు. ఈ రాజ్ గోండులలో నాలుగు, ఐదు, ఆరు, ఏడు సగల వారు మాత్రమే ఈ ఆదిలాబాద్ జిల్లాలో నివసిస్తున్నారు. ఆర్యుల దండయాత్రల తర్వాత హరప్పా, మొహంజోదారో ప్రజలు చెల్లాచెదురయ్యారని చరిత్ర ద్వారా మనకు తెలుస్తుంది. ఈ విధంగా చెల్లాచెదురైన ప్రజలలో శబరులు, మూతిబులు పులిందులు, నిషాదులు మొదలైన వారున్నారు. అయితే 'ఐతరేయ బ్రాహ్మణం'లో ఈ పులిందులే గోండులుగా చెప్పబడ్డారు. ఈ గోండులు మధ్య భారతదేశంలోని గిరిజనులను ఏకం చేసి రాజ్య పాలన సాగించారు. నేడు గోండులు వివిధ ఉపకులాలుగా విడిపోయి భారతదేశంలో అన్ని రాష్ట్రాలలో కనిపిస్తున్నారు. గోండులు చారిత్రక, సామాజిక నేపథ్యం వల్ల భారతదేశంలోని ఇతర గిరిజనుల కంటే ఎంతో ప్రాముఖ్యతను సంపాదించుకున్నారు. గోండులు ద్రావిడ జాతికి చెందినవారు. గోండి భాష 'మధ్య ద్రావిడ భాషా' కుటుంబానికి చెందినది.

కోయతూర్ నామౌచిత్యం :

ఆదిలాబాద్ జిల్లాలోని గోండులు తమను తాము 'కోయతూర్', అంటే కోయ వంశస్థులుగా చెప్పుకుంటారు. అయితే వరంగల్ భద్రాచలంలోని కోయలు తమను తాము కోయరాజులు గానే చెప్పుకుంటారు. గోదావరి నదీ తీర ప్రాంతాలైన ఈ జిల్లాలోని గిరిజనులు పూర్వపు గొండ్వాన ప్రజలే. వీరి వంశ గోత్రాలు, భాషా స్వరూపాలకు చాలా దగ్గరి సంబంధాలు ఉన్నాయి. గోండులలోని 'కుయువ్ పురాణ గాథ' ఆధారంగా వీరు కుయువ్ వంశీయులై, 'కోయతూర్లు' గా పిలవబడ్డారు. కోయతూర్ అంటే 'పశువుల వధకులు' అని అర్థం. పూర్వం గోండులు పశువులను ఎక్కువగా బలి ఇచ్చేవారు. నేటికి కూడా

గోండులు తమ మత సంస్కృతిని తెలిపే సందర్భాలలో పశువులను బలి ఇవ్వటమనేది గోండులలో అనాదిగా వస్తున్న ఆచారం. అదేవిధంగా కాల్చిన ఇప్ప పువ్వును గోండులు 'కోయంగ్' అని పిలుస్తారు. గోండులు పండుగలు, జాతర్లు, ఉత్సవాలు జరుపుకునే సంద ర్భాలలో ఇప్పపువ్వు సారాను ఎక్కువగా ఉపయోగిస్తారు. వారి కుల దైవాలకు ఇప్పపువ్వు సారాను నైవేద్యంగా అర్పిస్తారు. అందువల్ల కూడా వీరికి 'కోయతుర్' అనే పేరు వచ్చి ఉండవచ్చు. ఏది ఏమైనా ఆదిలాబాద్ జిల్లాలోని గోండులు తమను 'కోయతూర్లు'గా చెప్పుకుంటారు.

గోండులు :

ఆదిలాబాద్ జిల్లా 'కోయ వికాస్ పరిషత్' అధ్యక్షుడైన సిడామ్.అర్జు గారి అభిప్రాయం ప్రకారం గోండులు అంటే- Gondwana దేశంలోని ప్రజలే 'గోండులు' అని, వారే 'గొండియాలు'గా, కాలానుగుణంగా 'గోండులు'గా పరిగణించబడ్డారని వివరించారు. గోండుల పుట్టు పూర్వోత్తరాల గురించి సమాజంలో విభిన్న కథనాలు ప్రచారంలో ఉన్నాయి. కథనాలు, శైలి భిన్నంగా ఉన్నా వాటి సారాంశం మాత్రం ఒకటిగానే ఉంది.గోండుల ఆశ్రిత కులస్థులైన (ఉపకులాలైన) పర్ధాన్, తోటిలు గోండుల సంస్కృతి, పుట్టుపూర్వోత్తరాలను, మౌఖికంగా అద్భుతంగా గానం చేస్తారు.

గోండుల రాజ్య పరిపాలన వ్యవస్థ :

గోండులు ఆత్మాభిమానం, స్వతంత్ర భావాలు కల వారు. తమపై ఇతరుల ఆధిపత్యం ఎంత మాత్రం సహిం చరు. నాటి ఆర్యుల నుంచి నేటి నిజాం వరకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం పోరాడిన ఘనత వీరిది. క్రీ.శ. 870 లోనే గోండుల నాయక వ్యవస్థ ఏర్పడింది. క్రీ.శ. 1220 లో 'కొల్బిల్' అనే గోండు యోధుని నాయకత్వంలో రాజ్యం ఏర్పడింది. ఇతని పాలన దండకారణ్య గిరిజనులను సమైక్య పరిచింది. రాజ్యాలను స్థాపించి రాజులుగా గోండులు చరిత్రలో స్థానం పొందారు. తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లాలో గోండు వంశీయులు ఎక్కువగా ఉన్నారు. ఈ ప్రాంతంలో వీరి చరిత్రను చాటే కోటలు, దేవాలయాలు మనకు నేటికీ దర్శనమిస్తున్నాయి. పూర్వం ఈ ప్రాంతం చాందా ఆత్రం రాజుల ఆధీనంలో ఉండేది. ఈ ప్రాంతంలో వీరికి 22 దుర్గాలుండేవి. క్రీ.శ. 1220 లో కోల్బిల్ స్థాపించిన రాజ్య వ్యవస్థను క్రీ.శ. 1751 వరకు గోండు రాజులు పరిపాలన చేశారు.

గోండు రాజ్యాలు :

ఛత్తీస్‌ఘడ్, చాంద మాణిక్ ఫేజ్, మాండ్ల, ఉట్నూర్, గార్హ, బల్లార్హ, నాగపూర్ మొదలైన రాజ్యాలను గోండులు పరిపాలించారు. 15వ శతాబ్దంలో నర్మదా నదీ పరివాహక ప్రాంతమైన జబల్‌పూర్ దగ్గరలోని గార్హా లోని గోండు రాజులు మొఘల్ రాజు అక్బర్ ను ఎదిరించి పోరాడారు. చివరికి ఓడిపోయి మొగలుల సామంతులుగా ఉండి పోయారు. 1707లో ఔరంగజేబు మరణానంతరం గోండులు ఢిల్లీ పాలకులను ఎదురించి కప్పం చెల్లించడం మానేసి స్వతంత్రులయ్యారు. అయితే వీరిలో వీరు కలహించుకునేవారు. క్రీ.శ. 1749 లో నాగపూర్ రాజైన 'రఘోజి భోంస్లే' గోండులపై దాడులు చేసి వారిని చిన్నాభిన్నం చేసి, వారి రాజ్యాలలో తన దేశముఖ్‌లను నియమించాడు. మహారాష్ట్రుల దండయాత్రతో గోండుల పరిపాలన అంతమైపోయింది. తరువాత ఉట్నూరు, మాణిక్ ఘడ్ వంటి గోండు రాజ్యాలు మహారాష్ట్ర నుంచి విడిపోయి బ్రిటిష్ సామ్రాజ్యంలో విలీనమయ్యాయి. వార్ధా నది కి పడమరన ఉన్న మాణిక్ ఘడ్, రాజురా, ఉట్నూర్ మొదలైన ప్రాంతాలు దక్కన్‌లో సుబాలో చేర్చ బడి, నిజాం పలుకుబడిలోకి వచ్చాయి.

పాట :

మనిషి జీవితం లయాత్మకం. అతను తన జీవితంలో అనుభవించే సుఖదుఃఖాలు అన్నింటిని పాటలుగా మార్చుకుని ఆడుతూ, పాడుతూ తృప్తి పొందుతాడు. గోండులు తమ సంస్కృతిని నృత్య గీతాలలో ప్రతి బింబిస్తారు. నృత్యగీతాల ఇతివృత్తం మానవుని జీవితాన్ని

అన్ని కోణాల నుంచి పరిశీలించి, అతని సంతోష సంబరాలను, బాధలను, ఆచార సాంప్రదాయాలన్నింటిని పాటగా తనలో ఇముడ్చుకుంది. గోండులు సంవత్సర మంతా ఏదో ఒక ఉత్సవాన్ని జరుపుకుంటూనే, అందులో నృత్య గీతాలు ప్రదర్శించి ఆనందం పొందుతారు. భాష ఎంత ప్రాచీనమైనదో పాట కూడా అంతే ప్రాచీనమైనది. మానవుడు సమిష్టి జీవితాన్ని ప్రారంభించినప్పుడే భాషకు బీజాలు పడ్డాయి. భాషాభివృద్ధి మానవుని సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక వికాసానికి తోడ్పడింది. ముఖ్యంగా తన కూని రాగాలకు, తనలోని భావాలను జత చేసి పదాలను కూర్చి పాటగా పాడాడు. పాట ఆవిర్భావాన్ని కచ్చితంగా చెప్పటం కష్టమే అయినా, పనితోనే పాట పుట్టిందని చెప్పవచ్చు. ఆనాడు అటవికులకు ప్రతినిత్యం ఆహార సమస్య ఘోరంగా ఉండేది. ఆహార సేకరణ కోసం సమూహాలుగా వెళ్లేవారు. ఆహార సాధనలో భాగంగా సమూహాలుగా వెళ్ళినప్పుడు ఆ సమూహాల మధ్య తగాదాలు వచ్చి పొట్లాడుకునే వారు. అందులో గెలిచినవారు ఆనందంగా అరుస్తూ, గెంతులు వేస్తూ పాటలు పాడేవారు. ఈ విధంగా ఆదిమ మానవ జాతుల్లోని నృత్య గీతాలు ఆవిర్భవించాయని చెప్పవచ్చు. పగలంతా కష్టపడి, రాత్రి ఒక చోట చేరిన ఆదిమ జాతులు వెన్నెల్లో ఉల్లాసంగా పాటలు పాడుకుంటూ రోజంతా తాము కష్టపడిన శ్రమను మర్చిపోయి సేదతీరేవారు. పాటే వాళ్ళ అలసిన జీవితానికి ఊరటనిచ్చేది. ఆచార్య బిరుదరాజు రామరాజు గారు 'జానపద గేయ సాహిత్యం' అనే తన గ్రంథంలో పాటను ఈ విధంగా నిర్వచించారు.

"తన దైనందిక జీవితంలో సుఖాన్నో, దుఃఖాన్నో అనుభవించినప్పుడు అతని ఉద్విగ్న హృదయం నుంచి లయాన్వితమైన పదమో, గేయమో వెలువడుతుంది. ఇది వారి నోళ్లలో నాని పెరిగి స్వయంభువుగా నిలుస్తుంది".

డా॥ ఆర్వీయస్ సుందరం గారు 'ఆంధ్రుల జానపద విజ్ఞానం' అనే తన గ్రంథంలో పాటను ఈ విధంగా నిర్వచించారు.

"ఆదిమానవుడు వేటాడిన తర్వాత తనలో కలిగిన భావోద్వేగాలతో నృత్యం చేస్తూ, మాట్లాడిన భాష లయబద్ధమై పాటగా రూపుకట్టింది".

గోండుల గేయ లక్షణాలు :

- గోండుల గీతాలు అజ్ఞాత కర్తృత్వం.
- గీతాలు మౌఖికంగానే ప్రచారంలో ఉన్నాయి.
- గోండుల గేయాలు సమిష్టి గీతాలు.
- గోండుల గేయాల్లో పల్లవులు, చరణాలు రెండుసార్ల కంటే ఎక్కువసార్లు పునశ్చరణ ఉంటుంది.
- గోండుల గేయాల్లో ఆధ్యాత్మికత, మత సాంస్కృతిక పురాణ గాథలు ఎక్కువ.
- పాట ముందు 'రేలా రే రేలా' అనే సాకితో సామూహిక శృతి చేసుకుంటారు.
- గోండుల గేయాల్లో ప్రకృతి వర్ణన సహజసిద్ధంగా ఉంటుంది.

గోండుల గేయ స్వరూపం :

సహజంగా గేయానికి మొదలు పల్లవి ఐతే, గోండుల గీతాల్లో మాత్రం కొంత విలక్షణత కనిపిస్తుంది. ప్రతి గేయానికి ముందు, పల్లవి కంటే ముందు 'రేలా రే రేలా' అనే పదాలు గోండు గీతాల్లో కనిపిస్తాయి. గోండులు పాడే పాటలకు 'రేల' సాకియే అందం. ఇంకా చెప్పాలంటే గోండుల పాటలకు 'రేల' పదం ప్రాణం పోస్తుంది. గోండు సాహిత్యంలో గేయాలకు విశిష్ట ప్రాధాన్యత ఉంది. వీరి జీవితంలో ప్రతి పనికి అభివ్యక్తిగా సాధనంగా పాటనే ఎంచుకుంటారు. పుట్టినప్పటి నుంచి గిట్టే వరకు జరిపే వివిధ షోడశ సంస్కారాలలో, పండుగలు, ఉత్సవాలు, జాతరలు జరుపుకునే సందర్భాలలో, పాటలు పాడుకుంటూ, నృత్యాలు చేస్తూ, తమదైన విశిష్ట సంస్కృతిని తెలియజేస్తారు. అటువంటి విశిష్టమైన గోండు సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను తెలియజేసే కొన్ని గోండు పాటలను, భావాలను నాకు తెలిసిన మేర ఈ పత్రంలో పొందుపరిచాను.

నామకరణం :

గోండులలో శిశువు జన్మించిన సంవత్సరం లోపు ఈ ఉత్సవాన్ని ఎప్పుడైనా చేసుకోవచ్చు. దీనికి ప్రత్యేకమైన రోజంటూ ఏమీ ఉండదు. వీరి సాంప్రదాయంలో శిశువు పేరును అత్తామామలు పెడతారు. అత్తమామలు వచ్చి తల్లీబిడ్డలకు కొత్త బట్టలు పెడతారు. తమతో తెచ్చిన కొత్త తాడుతో ఊయల కట్టి, శిశువును అందులో పరుండబెట్టి, పేరు పెట్టి ఉయ్యాల ఊపుకుంటూ పాటలు పాడతారు. ఈ పాటలు వారి వారి వంశాల పై ఉంటాయి.

పాట :

పట పాసుడి దుసాలే దుసాలే బాయినా
పాసుడి దుసాలే దుసాలే
నక పాట వారేటే వారేటే
నక జోలికి మూటే కిముటే మాతివో
నక జోలికి మూటే కిమూటే
లికు పాజ బాదే యాతి ఓ... బాలునా
జైతెయి కమల యాతిన బాయినా
జైతేయి కమల యాతిన
నకా పొరెల ఈరాటే నక పొరెల ఈరాటే
యతిరా నక పొరల ఈరాటె

భావం :

నాలుగు వంశాల పిల్ల, ఆయా వంశాల అత్తల్ని పిలిపించి ఉయ్యాల కట్టిస్తారు. కొత్త తాడు, దుప్పటి ఊయలలో వేస్తారు. అత్త పేరుతో పాట పాడుతారు.

పెళ్లి పాటలు :

గోండులు వివాహ మహోత్సవాన్ని ఎంతో సాంప్రదాయకంగా ఆనంద ఉత్సాహాలతో జరుపుకుంటారు. వీరి పెళ్లి మూడురోజుల పండగగా చెప్పవచ్చు. వివాహం వరుని ఇంటి వద్ద జరుగుతుంది. వధువు తాలూకు బంధువులకు వారి సగాల వారి ఇంట్లో విడిది ఏర్పాటు చేసి, వారికి ఏ లోటు రాకుండా చూస్తూ విందులు, వినోదాలు సమకూర్చుతారు. తమ ఊరికి వధువు వచ్చినప్పటి నుంచి ఈ నృత్య గానాలను మొదలు పెడతారు. గోండులు వివాహ సందర్భంలో ఎక్కువగా థింసా నృత్యాలను, గీతాలను ఆడుతూ పాడుతూ ఆనందిస్తారు. సాధారణంగా పెళ్లికి ముందు, పెళ్లి అయిపోయాక ఈ నృత్యాలను చేస్తారు.

పాట :

ముది దియానంగ్ కోయ మర్మింగ్
ఉంది దియుర మేరుకట్ మరెడ్ థింసా
ఉంది దివొనే అవనాగ వాకట్
అగ సొండ్ ఉట్టేడ బాగే కీకట్
అంగె బాటోన్ అగ్గెన్ నీజి కికట్
దాదల్ తమ్ముల్ సోతమిరే మాతటే
నెలడ్ తక్క సోయిలే మీరే మాతడే
కుసి రాజులే మరట అక్షిదం వాటుక్
మరాటే థింసా ముది దియానాంగ్

భావం :

మూడు దినాలు కోయ పెళ్లి. ఒకరోజు మనం థింసా నృత్యం చేస్తాం. ఒకరోజు పోచమ్మ దగ్గరికి వెళ్తాం. అక్కడ పసుపు బట్టలు పెడతాం. వదిన, బావా అక్కడ మొక్కుతారు. బంధువులమంతా కలిసాము. సంతోషంతో అక్షింతలు వేద్దాం.

పై గేయంలో గోండుల పెళ్లి సాంస్కృతిక నేపథ్యం కనిపిస్తుంది. మూడు రోజులు జరుపుకునే పెళ్లిలో ఒకరోజు థింసా నృత్యం చేసి, రెండవ రోజు పోచమ్మ దగ్గర పూజలు చేసి వదిన, బావ మొక్కుతారు. గోండుల పెళ్లిలో వధువుకు వదిన సహాయకురాలిగా, వరునికి బావ సహాయకునిగా ఉంటారు.

అప్పగింతల పాట :

బత్తాంగ్ బత్తంగ్ తిన్ వాల్ బాయిన జీవ
సుపారి తిన్ వాల్ బాయిన్ జీవ
సూపారి టుమో మాత బాయిన ఈవ

వీడకి తిన్వాల్ బాయిన జీవ
అచోటల్ మాయూ టూటే మాత బాయిన జీవ
సోంపు తినవాల్ బాయిన జీవ
అచోటల్ మాయ టూటే మాత బాయి జీవ
సాడేడారి తిన్వాల్ బాయిన జీవ
బాద బాయినెన్ వల్లాదే ముగ్రింపు గాంత్ జాతర్ నే

భావం :

"తమలపాకులు, వక్కలు, సోంపు, శనగపప్పు చాలా ఇష్టంగా తినేది. కానీ, ఇప్పుడు పెళ్లి తర్వాత అత్తవారింట్లో ఇలాంటి తిండి తినలేదు" అని పెళ్లి కూతురు స్నేహితురాలు పెళ్లికూతురు గురించి బాధతో పాడే అప్పగింతల పాట ఇది. పెళ్లికూతురి అభిరుచులు, అలవాట్లు ఈ సందర్భంలో అత్తమామలకు తెలియజేస్తారు. పెళ్లి కూతురుతో, ఇకనుంచి భర్త అడుగుజాడలలో నడవాలని- ఈ సందర్భంగా తెలియజేస్తారు. తల్లిగారి ఇంట్లో ఎంతో గారాబంగా, స్వతంత్రంగా పెరిగి అత్తగారింటికి పోయాక ఆమె అణకువగా ఉండాల్సి వస్తుంది. తన అలవాట్లను, అభిరుచులను చంపుకోవాల్సి వస్తుంది. మెట్టినింటిలో అడుగు పెట్టబోయే తన స్నేహితురాల్ని తలుచుకుంటూ స్నేహితురాళ్లు బాధపడుతూ పాడే పాట ఇది.

పోలాల పండగ పాట :

గూడెంలోని పశువుల కాపరులు ఈ పండుగ సందర్భంగా ప్రతి ఇంటికి, మరగాళ్ళపై అంటే వెదురుకర్రలపై నడుచుకుంటూ వెళ్లి పాట పాడుకుంటూ దాన్యం, పప్పు, పూలను సేకరిస్తారు.

పాట :

పెరినక్ తుంగన్ తాకు విజసిమ్
పెంగుక్ తుంగాన్ తో మ్
మేమెట్ దొర్ కలిర్

భావం :

"మేము పశువుల కాపరులం. పోలా దేవునికి పూజ చేయటానికి వెళ్తున్నాం. మాకు దానం చేయండి" అని ఈ పాట అర్థం. ఇలా సేకరించిన వస్తువులను, ధాన్యాన్ని తీసుకొని ఊరి బయట ఉన్న దేవత దగ్గర వండి టేకు ఆకులలో ఆ దేవతకు నైవేద్యం పెడతారు. ఈ పొలాల పండుగకు ముందు పొలిమేర దేవత శివ అవ్వాల్ పూజ చేస్తారు. భూ దేవత ఆయన ఓర్తి దేవత పూజలు జరపడం గోండుల ఆనవాయితి. ఉదయాన్నే శివ అవ్వాల్కి పూజలు నిర్వహించి సాయంత్రం రాజుల పూజలు చేస్తారు.

శివ అవ్వాల్ పూజ :

రాజుల పెన్ పూజకు ముందు గోండులు తమ పొలిమేరలో సమావేశమవుతారు. అక్కడ పొలిమేర దేవత అయినా శివ అవ్వల్ కు కోడిని కోసి ఈ విధంగా పాట పాడతారు.

సురా డటుర్ అవ్వల్ టోస్ కొట్ మందాన
పైంగ్ ముర్రాంగ్ నెటల్ టోస్కాట్ మందాన
కైకా ల్ ఐవ

భావం :

ఓ తల్లి భూదేవి మమ్ములను చల్లగా చూడాలి. ఈరోజు నుంచి మా పశువులను అడవికి పంపుతున్నాము. వాటికి ఏ హాని కలగకుండా చూడు అని ఈ పాట అర్థం. శివ అవ్వల్ పూజ అయిపోయిన తర్వాత తమ పశువులను అడవికి పంపే కార్యక్రమాన్ని చేపడతారు.

ముగింపు :

అదిలాబాద్ జిల్లాలోని గోండులు ఈ విధంగా పండగలు, వివాహాలు, ఉత్సవాలు జాతరలు మొదలైన సందర్భాలలో, సంతోష సమయాలలో ఆడుతూ పాడుతూ వివిధ రకాలైన గీతాలను ప్రదర్శిస్తారు. అయితే నేడు పాశ్చాత్య సంస్కృతి, ప్రపంచీకరణ వల్ల గోండుల కళలు అంతరించే పరిస్థితులు వచ్చాయి. కాబట్టి ప్రభుత్వం గోండు కళాకారులను ప్రోత్సహించి, వారి సంస్కృతిని, కళలను పరిరక్షించి, వాటిని ప్రదర్శించేందుకు అవకాశం ఇవ్వాలి.

ఆధార గ్రంథాలు :

- Chambers Twentyfifth Century Dictionary_A.M. MacDonald.
- Gonds of the Central India High Lands-B.H. Mehatha.
- The Gondwanas and The Gonds -Indrajith Singh.
- ద్రావిడ భాషలు, పి.ఎస్. సుబ్రమణ్యం
- భారతదేశ చరిత్ర సంస్కృతి-గోండు రాజులు. బి.ఎన్.శాస్త్రి
- గోండుల పుట్టుపూర్వోత్తరాలు, గంగా సింగ్
- జానపద విజ్ఞానం-గోండుల ఆచార వ్యవహారాలు, కామెర రాజారాం
- గోండు సంస్కృతి, మెస్రం మనోహర్
- జానపద గేయ గాథలు, డా॥ నాయని కృష్ణకుమారి
- జానపద గేయ సాహిత్యం, ఆచార్య. బిరుదురాజు రామరాజు
- ఆంధ్రుల జానపద విజ్ఞానం, డా॥ ఆర్వీయస్ సుందరం.
- జానపద నృత్యకళ, ఆచార్యచిగిచర్ల కృష్ణారెడ్డి.

గోండుల సంస్కృతి – ఆచారాలు – సాంప్రదాయాలు

– నల్ల యామిని, కరీంనగర్, తెలంగాణ.

భారతదేశంలోని ఆదివాసుల్లో గోండులకు ప్రత్యేక స్థానం, ప్రాధాన్యత ఉన్నాయి. మిగతా గిరిజనులకన్నా భిన్నమైన సంస్కృతిలో ఉన్న గోండులు తమను తాము 'కొంకుతూర్' లుగా చెప్పుకునేవారు. గోండుల పురాణ గాథల ప్రకారం పూర్వం భారత దేశాన్ని 'కుయువ' లేదా 'కురువ' దేశమని పిలిచేవారు. అందువలనే వీరు తమను తాము 'కోరుతుర్' లుగా పరిచయం చేసుకుంటారు. కోరుతూర్ అనే పదం తరువాతి కాలంలో 'కొంకుతూర్' అయివుండవచ్చు. గోండి భాషలో ఇప్పపువ్వును 'కోయాంగ్' అంటారు. వీరి పురాతన గాథల ప్రకారం 'కయువు' తన రాజ్యాన్ని 'గణ్'లుగా విభజించి పాలించే వాడు. ఆ గణ్‌లలో నివశించే ప్రజలను గణ్‌లు లేక గోణ్‌లు అని పిలిచేవారు. అదే కాలక్రమంలో గోణ్డ్ లేక గోండు అయిందని చెప్పవచ్చు. కానీ గోండులు మేం కోయతూర్లు అని చెప్పుకోవడం విశేషం. గోండులు తాము 'హిడింబి' సంతానంగా భావిస్తారు. గోండులలో ప్రధానంగా నాలుగు తెగలు ఉన్నాయి. 1. రాజ్ గోండ్, 2. మురియాగోండ్, 3. మడియాగోండ్, 4. దుర్వేగోండ్. ప్రసిద్ధ మానవ శాస్త్రవేత్త హెమండార్స్ పరిశోధనల ప్రకారం భారతదేశం లోని గోండులు నాలుగు వంశాలకు చెందిన 41 ఉప కులాలు వారు అని తెలుస్తుంది. ప్రస్తుతం ఆదిలా బాదులో నివశిస్తున్న రాజ్ గోండ్‌ల అభిప్రాయం ప్రకారం గోండ్‌లలో 12 ఉపకులాలు ఉన్నాయి.

వీరి భాష 'గోండి'. ఈ భాష ద్రావిడ భాషా కుటుం బానికి చెందినది. వీరు ఒకరినొకరు 'కోయతుర్' అని పిలుచుకుంటారు. గోండులు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఎక్కువగా ఉన్నారు. మహా రాష్ట్రలోని చందాను పరిపాలించిన శక్తివంతమైన గోండు రాజుల ఆస్థానం తెలంగాణాలోని ఆదిలాబాద్ జిల్లా వరకు వ్యాపించి ఉండేది. బ్రిటిష్ వాళ్ళు భారతదేశాన్ని వదిలి వెళ్లిన తరువాత గోండు సంస్థానాలన్నీ మధ్యప్రదేశ్ రాష్ట్రంలో విలీనం అయ్యాయి. గోండుల ప్రాచీన చరిత్ర గురించిన చారిత్రక ఆధారాలు చాల తక్కువ. గోండులు నిశసించే ప్రాంతాన్ని గోండ్వానాగా వ్యవహరిస్తారు. మధ్య భారతదేశంలో ఈ భూభాగం ఉంటుంది. ఆదిలాబాద్ జిల్లా గోండ్వానా ప్రదేశంలో అంతర్భాగం. ఈ ప్రాంతంలో ఎక్కువగా రాజ్‌గోండులు నివశిస్తూ ఉంటారు. ఇక్కడి రాజ్ గోండ్‌లు స్వతంత్రప్రియులు. వీరి స్వతంత్ర ఆలోచనా విధానమే వీరిని నాయకులుగా తీర్చిదిద్దింది. మహారాష్ట్ర నుండి ఇక్కడికి వచ్చి పరిపాలించిన రాజులు స్థానికేతరులు. వీరి పెత్తనాన్ని ఎదిరించి తమ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకోవడానికి తిరుగుబాటు చేశారు. తిరుగుబాటు నాయకుల్లో కొల్బిల్, భీం బల్లీల్ సింగ్, ఖుర్జే బల్లీల్ సింగ్, హీర్ సింగ్, అండియా బల్లీల్ సింగ్, తల్వార్ సింగ్, కేసర్ సింగ్ వంటి వారు ప్రము ఖులు.

గోండులు నివశించే ప్రాంతాలన్నీ చిన్న చిన్న గూడేలుగా ఉంటాయి. ప్రతి గూడేనికి పటేల్ అనే గ్రామ పెద్ద ఉంటారు. గూడెంలో జరిగే ప్రతి పనికి తానే దగ్గర ఉండి బాధ్యత వహిస్తాడు. వీరు "గోటుల్" దగ్గర సమా వేశమవుతారు వారి పంచాయితీలు సమస్యలు ఉంటే. తప్పు ఉంటే జరిమానాలు విధించే సాంప్రదాయం ఉంది వీరిలో. గోండులలో పెళ్ళి అయిన వాళ్ళు మాత్రమే పూజరులుగా ఉంటారు. వివాహం సామాజిక - సాంస్కృ తిక విధానం. దీని ద్వారా స్త్రీ, పురుషులిద్దరూ కుటుంబ జీవితానికి నాంది పలుకుతారు. కుటుంబ వ్యవస్థకు ఆధారం వివాహమే. గోండులు ఒక్కటి గోత్రం ఉన్న వారిని వివాహం చేసుకోరు. వీరు కేవలం గోండులను

మాత్రమే వివాహం చేసుకుంటారు. ఇతర కులాల వారిని చేసుకోరు. వీరిలో మగపెళ్లి వారికి పెళ్లి అనేది చాల ఖర్చుతో కూడుకున్నది. గోండులకు ఆత్రం, సిడాం, అంక, కొమురం, సోయం, మాది, గెడాం వంటి ఇంటి పేర్లు ఉంటాయి. గోండుల్లో కూడా పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీలు పడే బాధలకు నిదర్శనంగా కనిపిస్తాయి. మడియా గోండులలో స్త్రీ ఒక సరుకుతో సమానము. ఆడది ఇంట్లో ఉంటే కన్న వాళ్ళకు డబ్బులు ఉన్నట్టే. ఎందుకంటే ఇక్కడి ఏ స్త్రీని అయితే వివాహం చేసుకోవాలి అనుకుంటారో ఆ యువతికి 'జీవపారె' (కన్యాశుల్కం) ఇవ్వాలి. వీరిలో ఇల్లరికం తెచ్చుకునే సాంప్రదాయం ఉంది పెళ్లికి ముందే ఇల్లరికం తెచ్చుకుంటారు. 'లామ్' అంటే ఇల్లరికం. ఇల్లరికం వచ్చిన వాళ్ళని 'లామడే' అని పిలుస్తారు. పెళ్లి చేసే సమయంకి గోండు యువతికి లామడే ఇష్టం లేకపోతే తనకు నచ్చిన వ్యక్తి ఇళ్లుచోరబడవచ్చు. ఆ ఇల్లు చొచ్చిన వ్యక్తి మెడలు వంచి 'వోలి' వాసులు చేసే పెద్దమనుషులు అంటారు. ఇళ్లుసొచ్చిన యువతి దొరికితే చితకబాదుతారు. గోండులలో బహుభార్యత్వం ఉంది. గొట్టేకులంలో పెళ్లి అయిన స్త్రీకి భర్త నచ్చకపోతే నచ్చే భర్త కోసమని అనేక ఇబ్బందులు పడుకుంటూ భర్త కి దొరకకుండా తిరుగుతుంటారు. వీరిని 'కేర్‌మూడేనటి' (ఒంటరిగా భర్తనుండి తప్పుకొని తిరగడం), 'కేర్ధే' (భర్తను వదిలి మరొసంబందం వెతుక్కునే ఆడది) అని అంటారు. పిల్లలు కాని స్త్రీని 'పంజాన్చడ్' (గొడ్రాలు) అంటారు. వీరిలో వివాహం మూడు పద్ధతులలో జరుగుతుంది. అవి అన్ని గోండు సమాజం గుర్తించినవే. 1. సంప్రదింపుల ద్వారా వివాహం (ఖాజేఖోభే), 2. సేవల ద్వారా వివాహం (లాంసడైమర్మి), 3. దొరకబుచ్చు కోవడం ద్వారా వివాహం (పియిసి వాట్వల్ మర్మి). గోండులు పెళ్లిలల్లో డోలు వాయిస్తూ నృత్యం చేస్తారు. వీళ్ల పాటలన్ని 'రేలా-రేలా-రేలారి' అనే పల్లవితో మొదలవుతాయి.

గోండులలో పెళ్లికాని యువతులు మాత్రమే లంగా, ఒణీలు, చీరెలు కట్టుకుంటారు. పెళ్ళి అయిన స్త్రీలు తప్పకుండా పైన ఏ అచ్చాదన లేకుండా నడుముకు ఒక తుండుగుట్ట మాత్రమే చుట్టుకోవాలనేది వాళ్ళ ఆచారం..! గోండు కులంలో స్త్రీలకు బహిష్టు పెద్ద సమస్యగా మారింది. ఆ ఐదు రోజులు ఎవరికి కనబడ రాదు, ఎవరిని ముట్టుకోవద్దు. ఆ పరిస్థితిలో స్త్రీని పట్టించు కునే వాళ్ళే కరవవుతుంటారు. తనకు కన్న తల్లి కూడా ఆ ఆచారాన్ని జవదాట వద్దంటుంది. వర్షాలు పడినా, విపరీతమైన ఎండలు కొట్టిన ఆ స్త్రీకి గూడెంకు దూరంగా, తన కుటుంబానికి దూరంగా ఐదు రోజులు ఉండాల్సిన పరిస్థితి ఈ గోండు సంప్రదాయంలో ఉంది. బహిష్టు సమయంలో ఉండే గదిని 'కుర్మలోన్' (ముట్టుగది) అంటారు. సాంప్రదాయానికి విరుద్ధంగా ఉంటే పంచాయితికి దండుగ కట్టాల్సిందే. అయితే ఈ విషయంలో ఇప్పుడిప్పుడే మార్పు వస్తోంది.

గోండులకు అడవిలో ఉండేవి వాళ్ళ ప్రధాన ఆహారం. జొన్న అన్నం, కారం వీటిలో ముఖ్యంగా ఉండే ఆహారం. ఇవి కూడా ఎక్కువ రోజులు దొరకదు. ఇప్పపూల అంబలి కాచుకొని తాగుతారు. వెదురు బియ్యం ఆహారంగా వినియోగిస్తారు. ఇంకా దుంపలు ఆకులు తింటారు. ఇప్పుడిప్పుడు కొంత అన్నముకి అలవాటు పడుతున్నారు. వీరిది ప్రధానంగా పోడు వ్యవసాయం. అంటే అడవులను నరికి కొమ్మలను, రెమ్మలను కాలబెట్టి చదునుచేస్తారు. ఆ భూమిలో కాలానికి వాతావరణానికి తగ్గ పంటలు వేస్తారు. ముఖ్యంగా జొన్నలు, గోధుమలు, నువ్వులు, మొక్కజొన్న, వరి మొదలైనవి. వీరి వ్యవసాయం అంతా వర్షంపైనా ఆధారపడి ఉంటుంది. వీరు వ్యవసాయం కాకుండా తవిసబంక, తునికాకులు, తునికి పళ్లు, ఇప్పపువ్వు ఇలా కొన్ని ఇతర రకాల పళ్లపై ఆధార పడతారు. గోండులు ముఖ్యంగా వేట పశుపోషణ వీరి జీవనాధారం.

గోండుల అతిపెద్ద జాతర నాగోబా జాతర (కేస్లాపూర్ జాతర). నాగోబా జాతర ప్రతి సంవత్సరం పుష్య పూర్ణిమ నాడు జరుగుతుంది. ఆ రోజు గోండులు హిందువులాగే

నాగుల పంచమి పండగ చేస్తారు. ఆ రోజు నాగోబా లేదా శేషనాగును పూజిస్తారు. మెస్రంవంశం (ఎడ్వెన్ గుంపు) వారికి నాగోబా కులదైవం. ఇప్పటి కేస్లాపూర్ ను ఒకప్పుడు 'బొర్మాచ్వా' అని పేరు. కేస్లా అంటే గొడ్డలికర్ర. ఈ కర్రను దామన్/కేస్లా కర్రతో తయారు చేస్తారు.

నాగోబా చరిత్రను గురించి రకరకలుగా చెప్పుకుంటారు. పూర్వం రాజా జాజీకీయాల్, రాణి రుకేదేవి వారి కోడలు సోన్దేవి, కొడుకు వద్దేవ్. వారికి ఏడుగురు సంతానం. వాళ్ల పసితనంలో ఒక అంటువ్యాధి ప్రబలింది. ఈ ఏడుగురుతప్ప అందరూ చచ్చిపోయారు. వారు ఆ ఊరు వదిలిపెట్టి ఏడుకొట్టాలలో తలదాచుకున్నారు. అక్కడికి ప్రతిరోజు పులివచ్చి పశువులను చంపేది. వీరు వచ్చిన రోజు పులి రాలేదు. ఊరివారు సంతోషించి ఈ పిల్లలను దత్తత తీసుకున్నారు. 12 యేళ్ళు వారి పశువులను కాచి, సంపాదించుకున్న పశుసంపదతో పాత గ్రామం బొరమాన్వాకు వస్తారు. దారిలో వారి మేనమామ సగటి రాజు ఇల్లు వచ్చింది. పనోర్లు బాలలుగా కష్టాలు పడుతున్నప్పుడు అతడు ఏ సాయం చేయనందువల్ల వారు ఇప్పుడు దండిస్తారేమోనని భయపడ్డాడు. మేన మామని బెదిరించి వారిలో పెద్దవాడు సగటిరాజా కూతురును చేసుకుంటాడు. ఆ కూతురు తన తండ్రిని అగౌరవ పరిచినందుకు, తన భర్త మీద కక్షగడుతుంది. అడవిలోకి వెళ్ళినప్పుడు పులిగా మారి అతనిని చంపి తింటుంది. ఊళ్ళోకి వచ్చి తన తండ్రికి భర్త అడవిలో ఉన్నాడు అని చెప్పింది. చాలకాలమైనా అతను తిరిగిరాలేదు. తరువాత సగటిరాజు అడవిలోకి వెళ్ళితే అల్లుడిని తన కూతురు చంపింది అని చివరికి నిజం తెలుసుకుంటాడు. వారిలో చివరి అతనికి నిజం తెలుస్తుంది. అతడు శేషనాగుకు మొరపెట్టుకున్నాడు. ఇలా ఇంకో కథ పూర్వం మేస్రం కుటుంబానికి చెందిన నాగాయిమోతి రాణికి నాగేంద్రుడు కలలో కనిపించి సర్పం రూపంలో ఆమె గర్భాన జన్మిస్తాడని చెప్పాడని, ఆ కల నిజమైందని గోండుల నమ్మకం. సర్పరూపంలో నాగేంద్రునికి తల్లి అంటే రాణి తన తమ్ముడి కూతురు గౌరితో వివాహం జరిపించింది. అత్త ఆజ్ఞ మేరకు గౌరి భర్తను బుట్టలో పెట్టుకొని గోదావరికి ప్రయాణం కాగా, ఒకచోట పాము ఉడుం రూపంలో కనిపించగా ఆ ఊరు ఉండుంపూరైంది. ఆ తరువాత గౌరి ధర్మపురి వద్ద గోదావరిలో స్నానం చేయడానికి వెళ్లగా ఆమెను చూసి నాగేంద్రుడు మనిషి రూపంలోకి మారాడని, అయితే పేరు ప్రతిష్టలు కావాలో, సంప్రదాయం కావాలో తేల్చుకోమనగా గౌరి సంప్రదాయాలు లెక్కచేయక పోవడంతో తిరిగి పాముగా మారాడని కథ. ఇలా రకరకాలుగా నాగోబా జాతర పూర్వ కథలు ఉన్నాయి.

పుష్యమాసంలో వచ్చే పౌర్ణమినాడు మేస్రం వంశీయులు 20 మంది గిరిజనులు వెంటరాగా కొత్త కుండలతో కడెం మండలంలోని గొడిసిర్యాల పరినర ప్రాంతాల్లో ప్రవహిస్తున్న గోదావరి జలాన్ని తీసుకు వచ్చేందుకు బయలుదేరుతారు. దీంతో జాతర ప్రారంభమైనట్టే. ఆ జలాన్ని తీసుకురావడానికి కెస్లాపూర్ నుంచి గోదావరి దాకా కాలినడకన 80 కిలోమీటర్లు వెళ్తారు. కెస్లాపూర్ చేరుకొని జాతర ప్రాంగణంలోని గిరిజనులు చెప్పుకునే ప్రాశస్త్యం గల మర్రి చెట్టు కింద విడిదిచేసి అమావాస్య రోజు రాత్రి నాగోబాకు కొత్త కుండల్లో గోదావరి నుంచి తెచ్చిన నీళ్లతో శుభ్రం చేస్తారు. ఆలయాన్నంతా శుద్ధి చేస్తారు. బాజా భజంపుతీలతో ఆలయ ప్రాంగణంలో పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. ప్రత్యేక పూజ సమయంలో మొలకెత్తిన నవధాన్యాలను తెస్తారు. ఒక రాగి చెంబులో పాలను తీసుకుంటారు. నవధాన్యాలు, మొలకలు, పాలు అన్నిటికీ ఒక కొత్త రుమాలుతో కప్పి పుట్టపైన ఉంచుతారు. పుట్టమీది రుమాలు 'పైకెత్తినట్లు' కనిపిస్తే పూజా కార్యక్రమాన్ని ఆరంభిస్తారు. ఇప్పటికీ నాగేదేవుడు రాగి చెంబులోని పాలు తాగుతాడనే విశ్వాసం వారిలో ఉంది. పూజా కార్యక్రమంలో పాట్లాల్, గయిక్ వాడి, హవాల్ దార్లు పాల్గొంటారు. 3 సంవత్సరాలకొకసారి పూజారిని మార్చడం

ఆనవాయితీ. జాతరకు వచ్చే మేస్రం వంశీయులు వేలాది మంది ఉన్నా వారు వంట చేసుకునేది మాత్రం 22 పొయ్యిలమీదే. ఈ పొయ్యిలు ఎక్కడపడితే అక్కడ పెట్టడానికి వీల్లేదు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రహరీ గోడకు చుట్టూ దీపాలు వెలిగించేందుకు ప్రత్యేక అరలు (దుగుడు) ఉన్నాయి. ఆ దీపాల కాంతుల వెలుగులో 22 పొయ్యిల్లో మేస్రం వంశీయుల వంతుల వారిగా వంటలు చేసుకుంటారు.

దండారి ఆట గోండులు ఆశ్వీయుజమానంలో దీపావళి (దివాడి) పండుగ సందర్భంగా జరుపుకునే వేడుక 'దండారి ఆట' ఈ దండారి ఆట దీపావళికి పది రోజుల ముందు నుంచి మొదలు పెడతారు. ఈ సమయంలో గ్రామస్తులందరు మొక్కజొన్న పంటతో, ఎక్కువ తీరికగా వుంటారు. 'దంద' గోండులదే అయినా కొలాం, తోటితెగలుకూడా ఈ ఆటలో పాల్గొంటారు. ముఖ్యంగా ఈ ఆట 'దండ్రియారాపురి' సిపి సేమరాపుర్' ల పేర్ల మీదుగా జరుపుతారు. వీరిని గోండు సమాజంలో పురాణ పురుషులుగా పూజిస్తారు. కావున వీరిని 'ఎత్మసార్ పేన్ (గోండుల నృత్యదేవుళ్ళు) గా భావిస్తారు. ఆషాడమాస పూర్ణిమరోజున 'ఆకాడి' పండుగ చేస్తారు. ఈ సందర్భంగా గ్రామ పూజారి (దేవరి) సంగీత వాద్య పరికరాల (ఆకర) పై కోడిని కోసి, దాని రక్తాన్ని వాటిపై చిలకరించి పూజ చేస్తాడు. అయితే 'ఆకాడి' పండుగ రోజున ప్రత్యేకంగా పిచ్చుక (కొట్కుపిట్టె) ను కోసి, ఆకుడి పేన్ కు అర్పించి, దాని మాంసాన్ని దండారిబృందం ఉంటారు. ఈ రోజు నుండి గ్రామంలో జరిగే ఏ శుభకార్యానికైనా ఈ వాద్యాలను (ఆకర) వాయిస్తూ, ఆటలు ఆడవచ్చు. దండారి ఆటలో పాల్గొనదలచిన వారందరు ఈ పండుగ రోజున పూజకు హాజరవుతారు. ఈ పూజలో దండారి ఆట సభ్యలకు ఎటువంటి హాని జరగకూడదని, మంచి ఆరోగ్యం కలిగి వుండాలని రాపూర్ సోదరులను వేడుకుంటారు. గోండులు దీపావళి (దివాటి) కి పది రోజుల ముందుగా భోగి పండుగ జరుపుకుంటారు. దీపావళి తర్వాత జరుపుకునే 'కోలబొడి' పండుగవరకు ఈ దండారి బృందం వివిధ గ్రామాలను సందర్శిస్తుంటారు. ఈ పండుగ రోజున పూజారి (దేవరి) అన్ని రకాల సంగీత వాద్యపరికరాలు, కర్రలు (కోలాలు), గుస్సాడిటోపిలను తెల్లని వస్త్రంపై ఉంచి పూజచేస్తారు. ఈ పూజ ప్రతి గ్రామంలోని గ్రామ పెద్ద (పొట్లల్) ఇంటిముందు జరుపుతారు. ఇత్తడి పళ్ళెంలో కొంచెం అన్నం, జొన్న ఆకులు, ఆగర్‌వత్తులు వెలిగించి, 'రాపూర్ సోదరులకు' తలచుకొని కొబ్బరికాయ కొడతారు. పూజకు వచ్చిన ప్రతి ఒక్కరు వాద్యపరికరాలకు నమస్కరించి వెళతారు. పూజారి 'ఆకి పేన్', పాడి అవ్వల్లకు కూడా పూజ నిర్వహించిన తర్వాత ఆటజట్టు దండారి ఆట ప్రారంభసూచకంగా వాద్యాలను వాయిస్తూ ఆటలాడుతారు. ఆ రోజు సాయంత్రం నుండి దండారి ఆటబృందం, గుస్సాడిలు, గుమ్మెల పోరి (గోండి స్త్రీ వేషం ధరించే యువకులు) అందరు తమతమ వేషాలు ధరిస్తారు. ఈ దండారి బృందం తమ గ్రామం నుండి వేరొక గ్రామానికి అతిథులుగా వెళతారు. అదే విధంగా వేరేగ్రామ దండారి బృందాన్ని తమ గ్రామానికి ఆహ్వానిస్తారు. ఒక గ్రామానికి చెందిన బృందాన్ని వేరొక గ్రామం వారు ఆహ్వానించినట్లయితే తర్వాత సంవత్సరం ఆతిథ్యం స్వీకరించిన గ్రామాన్ని వారు తప్పకుండా సందర్శించాలి. ఈ విధమైన స్నేహపూర్వక సంబంధాలు గ్రామాల మధ్య పెంపొందించడం దండారిచేడుకలో ఒక భాగం.

గోండులు ఎంతో భక్తిభావాలతో గుస్సాడివేషం ధరిస్తారు. గుస్సాడీలు తప్పనిసరిగా కొన్ని కఠిన నియమ నిబంధనలు పాటిస్తారు. 'దీవాడి' పండుగ అయ్యేవరకు కఠిన బ్రహ్మచర్యం పాటిస్తూ నేలపై పడుకుంటారు. 'భోగి' నుండి 'కోలబోడి' వరకు స్నానం చేయకుండా దీక్షగా ఉంటారు. కాళ్ళకు చెప్పులు కూడా ధరించరు. దండారి ఆటలో ఎక్కువగా చూపరులను ఆకట్టుకొనేది 'గుస్సాడి' ల వేషధారణ. గుస్సాడి వేషం వేసేవారు తలకు నెమలి ఈకలతో చేసిన టోపిలు ధరిస్తారు. దీనిని 'మాల్జాలీన టోపి' అంటారు. వీరి శరీరమంతా బూడిద, సున్నం, మని

మొదలైనవి పూస్తారు. శరీరమంతా నల్లని, ఎర్రని బొట్లు పెట్టుకుంటారు. కాళ్ళకు చేతులకు సున్నంతో దట్టమైన తెల్లనిచారలు వేస్తారు. మొలచుట్టూ తెల్లని లేదా నల్లని గొంగళి చుట్టుకుంటారు. తోలుతో లేదా నారతో చేసిన గడ్డాలు, మీసాలు పెట్టుకుంటారు. అడవిలో దొరికే రకరకాల పూసలు, విత్తనాలతో చేయబడిన గొలుసులను మెడలోనూ, కాళ్ళకు మోతేతులకు మువ్వలు, నడుము చుట్టు గజ్జెలు (గాగ్రా) ధరిస్తారు. మేక లేదా జింక చర్మాలను ఎడమవైపు భుజానికి తగిలించుకుంటారు. గుడ్డతో సంచి (జోలె) ని కూడా ధరిస్తారు. గుండ్రని వెదురుచట్టంలో నెమలి ఈకలు వరుసగా పేర్చి టోపీలా తయారు చేస్తారు. ఈ టోపీ తలకు ధరించినప్పుడు అది కదలకుండా ఉండేందుకు దాని కింది భాగంలో మొత్తని గుడ్డను చుడతారు. ఈ టోపి ముందు భాగంలో జింక కొమ్ములు లేదా మేక కొమ్ములను పెడతారు. టోపీ చుట్టూ అద్దాలు, పూసలు, గవ్వలతో అలంకరిస్తారు. గుస్సాడీలు కుడిచేతితో రెండు అడుగుల నల్లరంగు కర్రను ధరిస్తారు. దాన్ని 'రోకల్' (గంగారామ్ సోటా ల్) అంటారు. ఈ కర్రను చాల పవిత్రమైన దానిగా భావిస్తారు. గుస్సాడీలు తమ చిలిపి చేష్టలతో అందరిని నవ్విస్తుంటారు. కాని వారిని దండారిబృందంలో ఎంతో గౌరవంగా చూస్తారు. గ్రామస్తులు గుస్సాడీలను తమ జన్మస్థలం నుండి దేవుళ్ళను తీసుకువచ్చే మధ్యవర్తులుగా భావిస్తారు. అందుచేతనే వారికి భోజనం పెట్టిన తర్వాతనే ఇతరులకు పెడతారు.

గోండుల ప్రతి గూడెం శివారులో శుభసంగుదేవర ఉంటుంది. జంగుబాయమ్మ దేవెర వీళ్ల ముఖ్యదేవత. ఈ దేవేరను పూజించిన తరువాతనే ఏ పనైన మొదలు పెడతారు. గోండు సంస్కృతిలో ప్రతి రోజునీ, ప్రతి పనిని ఒక ఉత్సవంగా చేసుకోవటం ఉంది. అడవిలో తమని తాము ఒక భాగంగా భావించుకుంటూనే తమ నాగరికతని పెంచుకుంటూ వచ్చారు. ఇప్పటికీ మైదాన ప్రాంత వాసులకన్నా భిన్నమైన, వారి సొంతమైన సంస్కృతిని ఆస్తిత్వాన్ని కాపాడుకుంటూనే మనుగడ సాగిస్తున్నారు...

ఆధార గ్రంథాలు :

1) కొమురం భీమ్ - సాహు, అల్లం రాజయ్య
2) సరిహద్దు - సాధన
3) రాగో - సాధన
4) రాజ్ గోండుల సంస్కృతి - మూలం : క్రిష్టఫర్ వాన్, పూరర్ హైమాన్ డార్ఫ్,
అనువాదం : ఎస్. గంగాధర్

ఆటవికుల జీవితానికి అద్దం పట్టిన – "ఆకురాలు కాలంలోకి..."

– డొనల రమేష్, పరిశోధక విద్యార్థి, తెలుగు & ప్రాచ్య భాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

ఉపోద్ఘాతం :

నేటి ఆధునిక మానవుడు ఇంత నాగరికంగా జీవించడానికి ఎన్నో తరాలుగా మనిషి తన జీవనగతిని మార్చుకుంటూ నవనాగరికుడు అయ్యాడు.జంతువు నుండి మనిషిగా పరిణామం చెందిన తరువాత తొలి మనిషి జీవించిన విధానం ఆటవికుడి జీవితం. అడవులలో జంతువుల మధ్య జంతువులగానో, గుంపుల మధ్య మనిషిగానో పూర్తిగా పరిణితి చెందిన రీతి కనిపిస్తుంది. ఈ జనసమూహాల్లో చాలా మంది రోజురోజుకు ఆధునికతను సంతరించుకుని నాగరికుడిగా మారితే, కొన్ని గుంపుల జనాభా మాత్రం ప్రాచీన కాలం నుండి వస్తున్న తమ ప్రాచీన జీవనవిధానాన్నే అవలంబిస్తూ, అందమైన ప్రకృతి మధ్య, కొండకోనల నడుమ ప్రకృతి వనరుల మీద ఆధారపడి వీరిని ఆటవిక తెగలని సంభోధిస్తున్నాము. అలాంటి ఆటవిక తెగలు నేటి కాలంలో ఎన్నో రకాల సమస్యలను ఎదుర్కొంటున్నారు. నాగరికతకు ఆమడదూరంలో గుట్టుగా గడిపే ఈ తెగలపై నాగరికత తెలిసిన ప్రజలు దాష్టీకాన్ని ప్రదర్శిస్తున్నారు. అలాంటి వైపరీత్యాల వల్ల వారు ఎదుర్కొంటున్న సమస్యలను రచయిత కాట్రగడ్డ దయానంద్ "ఆకురాలు కాలంలోకి...." కథ ద్వారా తెలియజేశాడు.

రచయిత నేపథ్యం :

కాట్రగడ్డ దయానంద్ కష్టజీవుల కన్నీటి విలువ తెలిసిన వ్యక్తి. స్వయంగా గ్రామీణుడై యుండి,ఎన్నో శ్రమలనెదుర్కుని రచయితగా ఎదిగిన మనిషి.అంతేకాదు గ్రామీణులైన రైతులు ఎదుర్కొనే ఎన్నో కష్టాలను, దళారులు చేసే మోసాలను, వీధిబాలల గురించి మన స్ఫూర్తిగా చలించిపోయి తన ఆవేదనను కథల రూపంలోనూ, కవితల రూపంలోనూ వ్యక్తీకరించాడు. వీరి కలం నుండి జాలువారిన కథల సంపుటిలు పండుటాకు, గుండ్లకమ్మ తీరాన...కాగా, 'మెతుకు' అనే కవితా సంపుటిని కూడా రచించారు. నెల్లూరులో జన్మించి బ్రతుకుదెరువుకు చిన్న వయస్సులోనే మెదక్ ప్రాంతానికి చేరిన రచయిత తన జీవితంలో ఆటుపోటులను ఎదుర్కొన్నాడు. తను స్వయంగా ఎదుర్కొన్న సంఘటనలు, తను చూసిన సన్నివేశాలనే కథలుగా, కవితలుగా మలిచారు.అడవి అందాల నడుమ జీవించే ఆటవిక తెగలలోని స్త్రీలపై కొందరు స్వార్థపరులు చేసిన అమానుష చర్యను చిత్రించిన కథ 'ఆకురాలు కాలంలోకి.....'

ఆకురాలు కాలంలోకి...ఇతివృత్తం :

పచ్చని దట్టమైన చెట్లతో వ్యాపించి ఉన్న అడవిని ఆనుకుని ఉన్న ఎత్తైన కొండలు, కొండలకు దిగువున ఉన్న గుడెసెలలో కొందరు అటవిక తెగల ప్రజలు నివసిస్తున్నారు. వారంతా చెంచులు. చెంచు తెగ ప్రజల జీవితాలను గురించి తెలుసుకునేందుకు ఒక రచయిత గుడానికి వచ్చారు. అదే సమయానికి ఆ ప్రాంతంలో పనిచేసే టీచర్ వారికి పరిచయం కావడంతో అక్కడి విశేషాలు కొన్ని తెలియజేస్తూ వస్తున్నాడు.

అక్కడ కొందరు పిల్లలు చిన్న దబ్బలతో బాణాలతో కనిపించడం చూసి, వాళ్ళని గురించి ఆరా తీశాడు. వారిలో ఒక పిల్లాడు బయ్యన్న. దబ్బను ప్రయోగించడంలో మొనగాడు. ఒకనాడు గుడెం మొత్తాన్ని ఉద్ధరించేందుకు ఒక ఆడబిడ్డ ఆశావర్కర్‌గా పనిచేసిన విషయాన్ని, ఆమెకు జరిగిన అన్యాయాన్ని గురించి అక్కడి ఒక చెంచు వ్యక్తి రచయితకు తెలియజేస్తాడు. ఈ బయ్యన్న ఆమెకు బిడ్డ అని చెప్తాడు.ఆమె చనిపోయిన తరువాత ఆ పిల్లలు ముసలమ్మచెంత చేరారు. తన కూతురు చెంచులక్ష్మి చేసిన పోరాటాల గురించి వారికి తెలియజేసింది. తన

కూతురు గూడేం మొత్తానికి వెలుగు వంటిది. తాను చదువుకుని గూడేన్ని కూడా బాగుచేయాలని తాపత్రయ పడింది. చిన్న పిల్లలందరికి చదువు చెప్పడం, ఆరోగ్యం బాగాలేని వారికి మాత్రలిచ్చి ఎంతోమందిని చావు నుండి కాపాడింది. గూడెంలోని వ్యక్తుల బాగోగుల గురించి అధికారులకు అర్జీలు పెట్టింది. అలాంటి జీవనం సాగి స్తున్న సమయంలో ఒక నాటి రాత్రి పోలీ సులు గూడెం మీదపడి అందరిని తన్ని తరిమేశారు. ఆ వేటలో చెంచు లక్ష్మి కూడా తన ఇద్దరు బిడ్డలను సంకనేసుకొని అడవిలోకి పరుగుతీసింది. కాని మరుసటి తెల్లారి వెదకి చూస్తే రక్తం మడుగులో పిల్లలతో పడిపోయి ఉంది.కొంత కాలం వరకు ఎవరితోను మాట్లాడకుండా తన పనేదో తను చూసుకుంటున్న సమయంలో భర్త ఆమెను అను మానించి బాణం వేసి చంపేశాడు.

అనాధలైన ఆమె పిల్లలతో ఏ ఆదరణ లేక, ఎలా పెంచాలో తెలియక కనీసం అప్పుగానైనా భూమి, ఎద్దులు ఇప్పిస్తే పొలం చేసి అప్పు తీరుస్తానని వేడుకుంది 80 ఏళ్ళ గురవమ్మ.

కథలో కనిపించే ఆటవికుల సంస్కృతి :

సాధారణంగా ఆటవికులుగా భావించే ప్రతి తెగలోని ప్రజలు సామాన్య జనావాసాలకు దూరంగా, అందమైన ప్రకృతి ఒడిలో చీకు చింతా లేకుండా జీవించేవారు. ప్రత్యేకమైన ఆచారాలతో, భిన్నమైన జీవన విధానాన్ని అవలంభించేవారు వీరు. ఆ సాంప్రదాయాలు ఈ కథ లోను కనిపిస్తాయి.

వేట నైపుణ్యాలు :

వివిధ తెగలలోని ప్రజలకు ముఖ్యంగా అటవీ ప్రాంత పరిధిలో నివశించే వారికి వేటాడటంలో మంచి నైపుణ్యాలు ఉంటాయి. ఆదిమ సమాజం నుండి ఆడ, మగ తేడా లేకుండా అందరూ వేటలో పాల్గొనేవారు. కాలం మారే కొద్దీ ఈ విధానంలో మార్పులు వచ్చాయి. మగవారు మాత్రమే వేటలో పాల్గొనడం, స్త్రీలు గర్భ ధారణ సమస్యల వలన గృహాలకు పరిమితం కావడం జరిగింది. అయితే వేట నైపుణ్యాలను ఆటవికులు చిన్న తనం నుండే అలవరుచుకుంటారు. ఇదే వారికి ప్రధాన వృత్తి కాబట్టి చిన్నతనం నుండే జంతువులను వేటాడే నైపుణ్యాలను, బాణం ప్రయోగించడంలో మెళుకువలను అలవరుచుకుంటారు. ఈ కథలో చెంచులక్ష్మి కొడుకు బయ్యన్న చిన్న పిల్లవాడైనా బద్దను ప్రయోగించడంలో మంచి నేర్పు కలిగినవాడు.

మద్యపానాసక్తత :

వివిధ తెగలలోని ప్రజలు, ఆటవికులు ఎక్కువుగా మద్యపానం మీద ఆసక్తిని కలిగి ఉంటారు. పండుగ లప్పుడు, జాతర్లప్పుడు,పెళ్ళి, పేరంటాలు కార్యక్రమం ఏదైనా సరే ఆడ, మగ తేడాలేకుండా అందరూ మద్య పానం సేవిస్తారు. ఈ కథలో అదే కనిపిస్తుంది. విలేఖరి ఆ గూడేనికి వచ్చిన సమయంలో తాగి చిన్న వివాదానికే ఊరంతా కర్రలతో కొట్టుకుంటారు. మత్తు దిగాక యధామామూలుగా ఎవరిపని వారు చూసుకుంటారు. అందుకే అక్కడ పని చేసే టీచర్ విలేఖరికి ఈ విషయ మంతా చెప్పి వారు తిరిగి రాకముందే ఇక్కడి నుండి వెళ్ళిపోవడం మంచిదని వారిస్తాడు.

విద్య, ఆరోగ్యాలకు ఆమడదూరం :

ఆటవిక తెగల వారు సామాన్య జనానికి దూరంగా ఉండటం వలన విద్య, వైద్యం అనే సదుపాయాలు వీరికి ఆమడదూరంలో ఉన్నాయి. ఏ ప్రభుత్వం వచ్చినా వీరికి ఆ సదుపాయాలు కల్పించినా వాటిని ఉప యోగించుకోలేరు. దాసరి గురమ్మ కూతురు చెంచులక్ష్మి పదోతరగతి వరకు చదువుకొని గూడేన్ని అభివృద్ధి చేయాలని చాలా ప్రయత్నించింది. చాలామంది అధికారు లకు తమ గూడేనికి వసతులు కల్పించాలని అర్జీలు పెట్టింది. కొంతవరకు ఆమె కృషి ఫలించి తమ గూడెంలో కూడా ఒక బడిని ఏర్పాటు చేయించింది. గూడెంలోని వ్యక్తులకు అనారోగ్యం ఎదురైతే తనే వారికి మందులు సరఫరా చేసి, చచ్చిపోతారనుకున్న వారిని కుడా బ్రతికిం చింది. అంతేకాదు తమ పరిసరాలలో కొందరు

స్వార్థపరులు అడవిని దోచుకునే ప్రయత్నం చేస్తుండ టాన్ని వ్యతిరేకించి పోరాడింది. చివరకు ఆ స్వార్థపరులు పన్నిన కుట్రలో తను బలైపోయింది. సామూహిక అత్యా చారానికి, హింసకు గురై రక్తపు మడుగులో పడిపోయింది. ఆ తరువాత భర్త కూడా ఆమెను ఆదరించకపోగా తనే ఆమెను చంపేస్తాడు.

ఈమె మరణించిన తరువాత గూడేం పరిస్థితి యధా మూలముగా అయ్యింది.బడికి టీచర్ ఉన్నా విద్యార్థులకు నిర్భంధ విద్యను అందించలేక పోతున్నాడు. వారి ఆరో గ్యాన్ని గూర్చి పట్టించుకునే నాధుడే లేడు. విలేఖరి గూడేన్ని సందర్శించడానికి వచ్చినప్పుడు టీచర్ బయట పిల్లలు తిరుగుతున్నా వారిని బడిలోకి తీసుకు వెళ్ళక పోవడాన్ని గమనిస్తాడు. వారు బడికి రాక పోవడా నికి గల కారణాలను తెలుసుకుంటాడు.

ఆటవికులపై భౌతికదాడులు :

తరతరాలుగా యుగయుగాలుగా ఆటవికులు నాగ రికుల దాడులకు గురవుతూనే ఉన్నారు. చాలామంది ఆటవికుల ఉత్పత్తుల విషయంలో ఆర్థికదోపిడీ చేస్తుం డటం మనం గమనిస్తుంటాం. అంతే కాదు ఆటవికులపై దాడులు చేసి, ఆటవికుల గుంపులోని స్త్రీలపై అఘా యిత్యం చేసే విధానం, పురుషులపై దాడులు వంటివి చూస్తూనే ఉంటాం. ఈ విధానమే ఈ కథలో కూడా కనిపిస్తుంది.

చెంచులక్ష్మి గూడెం అభివృద్ధి కోసం పాటుపడటం, అధికారులకు అర్జీలు పెట్టడం, దళారుల మోసాలను, దోపిడీ దారులను వ్యతిరేకించడం వంటివి చేయడం వలన కొందరు తన మీద, గూడేం ప్రజల మీద కక్ష గట్టి రాత్రివేళ ఆకస్మిక దాడిచేసి అందరిని తరిమి కొట్టారు. ప్రాణాలు కాపాడు కోవడానికి ప్రతి ఒక్కరు తలా ఓ దిక్కుకు పారిపోయారు.చెంచులక్ష్మిని కూడా తరిమి విపరీతంగా కొట్టారు.

ఆటవిక తెగలలోని స్త్రీలపై ఇలాంటి అకృత్యాలు, అమానుష చర్యలు మనం చూస్తుంటాం. సాధారణంగా ఇలాంటి దాడులు స్త్రీలు, పురుషులు అందరినీ కలిపి నక్సలైట్లు తలదాచుకున్నారనో, స్మగ్లర్లు అనే అను మానాలతో పోలీసులు చేస్తుంటారు. అటు నక్సలైట్లు కూడా వీరిని ఇన్ఫార్మర్లనే నెపంతో దాడిచేసి చంపడం వంటివి తరచు పత్రికల్లో మనం చూస్తున్నాము.

ఉపసంహరణ :

పైన పేర్కొనబడిన అంశాలను బట్టి ఆటవికతెగల జీవన విధానం, వారి సమస్యలు వారి జీవన ప్రగతికి ఏ విధంగా ప్రతిబంధకాలుగా ఉన్నాయో రచయిత ఈ కథలో చక్కగా వివరించాడు. అమాయకత్వం మెండుగా కలిగిన ఆటవికులను నేటి సమాజం ఏ విధంగా చిన్న చూపుచూస్తుందో చక్కగా వివరించారు. ఎన్నో రకాల సంఘటనలు చూసి, విని, చదివి, చలించిపోయి వారి జీవన వెతలను కథల రూపంలో మలిచారు కాట్రగడ్డ.

తెలుగు సాహిత్యంలో గిరిజన దింసా నృత్యం – విశ్లేషణ

– డా॥. యస్. సరళాదేవి, అధ్యాపకురాలు, తెలుగు విభాగం, జె.యం.జె మహిళా కళాశాల, తెనాలి.

భిన్నత్వంలో ఏకత్వం ప్రతీకయైన మన దేశంలో భిన్న జాతులు, మతాలు, సంస్కృతులు ఉన్నాయి. గిరిజనులు కొండకోనల్లో జీవిస్తూ, ప్రత్యేక సంస్కృతిని, జీవన విధానాన్ని కల్గియుంటారు. కాలం మారిన వీరు సంస్కృతి సంప్రదాయాలను వదిలి పెట్టక కాపాడుకుంటూనే వచ్చారు.

గోదావరి జిల్లాలో :

ఏజెన్సీ ప్రాంతంలో అడవితల్లి బిడ్డలైన ఆదివాసులు నివసిస్తున్నారు. నాగరిక సమాజానికి దూరంగా కొండ కోనల్లో జీవిస్తున్నారు.మనిషి మనిషి కి అంతరం ఏర్పడిన నాటి కాలంలో ఈనాగరిక సమాజంలో నాటికి చెట్టుతోను, పుట్టతోను, తోటి మనిషితోను మమేకమై జీవిస్తున్నారు. వారికి నాగరిక సమాజపు గాలి పెద్దగా తగలక పోవడం వల్లనేమో గోదావరి జిల్లాల్లో గిరిజనులు ప్రకృతిలో భాగంకాగా ప్రకృతి వారి మమేకమయింది.

అడవిని నాశనం చేయకుండా అవసరాలకు ఎలా వినియోగించుకోవాలో తెలుసు. ఈ రోజు ఈ అడవి బిడ్డలు అడవి తల్లిని వదిలి నాగరిక సమాజంలోకి రావలసిన పరిస్థితి ఏర్పడింది. ప్రాజెక్టు పేరు తో అడవి నుంచి ఆదివాసులను ఖాళీ చేయించి బయటకు తీసుకు వస్తున్నారు. అక్కడి తో ఆదివాసులకు అడవి తల్లితో పెనవేసుకున్న బంధం తెగిపోతుంది. వారి జీవితం చిన్నాభిన్నం అవుతుంది. మనసు అల్లకల్లోలమై తల్లడిల్లుతుంది. వారి ఆవేదన అరణ్యరోధనే అవుతుంది. ఒరిస్సాలోని కోరాపుట్ జిల్లాలోని గిరిజన పల్లేపల్లెలలో ఈ దింసా నృత్యం ప్రారంభయైనదిగా భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎక్కువగా విశాఖపట్నం ఏజెన్సి ప్రాంతాలలోని చెదురుమదురుగా విజయనగరం ఏజెన్సి ప్రాంతాలోలని గిరిజన తెగలన్నిటిలోను ఈ నృత్యం వ్యాపించి ఉంది. ముఖ్యంగా పర్యాటక ప్రాంతమైన అరకులోయ గిరిజన సంస్కృతికి దింసా నృత్యం ఒక పర్యాయపదంగా మారిపోయింది.

సామూహిక నృత్యం :

పండుగలు, జాతరలోను, పెళ్ళిళ్ళు వంటి కార్యాలలోను, సంప్రదాయ వేడుకలలోను ఆడా, మగా, చిన్నా, పెద్ద తేడాలు లేకుండా గిరిజనులందరు సామూహికంగా ఈ దింసా నృత్యంలో పాల్గొంటారు.చైత్ర మాసంలో పెద్ద దేవర పండుగ, ఆగష్టులో బలిదేవర పండుగ, నవంబరులో దీపావళి పండుగా, జనవరి నెలలో సంక్రాంతిలో పంటల పండుగ ఆ తదుపరి నంది దేవుని పండుగ మధ్య మధ్యలో పెళ్ళి పండుగలు, సంప్రదాయ వేడుకలు ఇలా ఏడాదంతా గిరిజనులకు పండుగలే. పండుగ అంటే నృత్యాలే "నృత్యం అంటే ధింసానే" ధింసా నృత్యం చేసే వారికి వయస్సుతో పట్టింపు ఉండదు. గిరిజన బాల బాలికలు, యువతీ, యువకులు, స్త్రీలు, పురుషులు కలిసి మెలిసి సామూహికంగి ఆడతారు.ఈ ఆట వారి జీవన లాలన. అలాగే నర్తించాలనే నియమత నియమం ఉండదు. సామూహికంగా జట్టు కట్టడం అనేది ఆన వాయితీ పండుగ ఈ సందర్భం ఈ జట్లని నిర్ణయిస్తాయి.

సంగీత పద్యాలు :

ధింసా నృత్యాలలో పాట తప్పనిసరి కాదు కాని, సంగీతం మాత్రం తప్పనిసరి. ఈ సంగీతం లేకపోతే నృత్యం లేదు. ప్రతి దింసా నృత్య భేదానికి ఒక ప్రత్యేకమైన సంగీత వాదన ఉంటుంది.ఈ సంగీతం గిరిజన సమాజం, జీవితం, భౌగోళిక స్థితులపై ఆధారపడి రూపొందింప బడింది. డప్పు, గిరిజనడోలు, మోరికిరిది, తుడుము జోడు కొమ్ములు మొదలైనవి నృత్యానికి సంగీతం వాద్యాలుగా ఉంటాయి, ఉదాహరణకు ఆరుగురిలో ఉన్న ఒక జట్టు

చేసే దింసా నృత్యాలో ఆరు సంగీత వాద్యాల్ని ఏక కాలంలో వాయిస్తారు. సాధారణంగా సంగీత వాద్యాలను పురుషులు వాయిస్తుంటే స్త్రీలు నర్తింటడం జరుగు తుంటుంది.

దుస్తులు :

నృత్యంలో పాల్గొనే గిరిజన స్త్రీపురుషులు ఇరుపురూ సంప్రదాయకమైన ఆభరణాలను, పసుపు, ఎరుపు, ఆకుపచ్చ వంటి విలక్షణమైన రంగురంగుల దుస్తులను ధరిస్తారు. స్త్రీ లు చీరలను మోకాలి కింద వరకూ మాత్రమే ధరిస్తారు. నృత్యంలో ప్రధాన నాయికా, నాయకులు నెమలి చేతులతో ధరిస్తారు.

నృత్య శైలి :

సాధారణంగా 15 నుంచి 20 మంది గిరిజన స్త్రీ పురు షులు కలిసికట్టుగా వలయాకారంలో తిరుగుతూ చేతులు పాదాలు లయబద్ధంగా కదుపుతూ ఈ నృత్యం చేస్తారు. సుమారు 10ని॥లు ఈ నృత్యం కొనసాగుతుంది. నృత్యంలో పాల్గొనే గిరిజన స్త్రీ పురుషులు పొడగాటి వరుసలో బారులు తీరి వీపు వెనుక నుంచి చేతులు పోనిచ్చి ఒకరి నడుమును ఇంకొకరు పట్టుకుని లయ బద్ధంగా అడుగులు వేస్తుంటే, మరోపక్క బారులోని రెండు కొనలలో వున్న వ్యక్తులు అడుగులు ముందుకు వేస్తూ కలుసుకొంటూ, విడిపోతుంటారు. మిగిలిన ఆడ,మగా కలిసి లయబద్ధంగా వలయాలు చుడుతూ మెలికలు తిరుగుతూ నర్తిస్తారు. ఈ నృత్యం చేస్తున్న గిరిజనులు జోడు కొమ్ము బూరలను ఊదుతూ, డప్పు మొగిస్తూ సంగీతంలో ఉత్తేజపరుస్తారు. ఎంతో శోభాయమానంగా, లయబద్ధంగా సాగే దింసా నృత్యాన్ని తిలకిస్తున్న దేశ విదేశీయులు సైతం ఆ నర్తించే జట్టుతో కలిసి అడుగులు వేయాలని ఉబలాటపడుతున్నారు.

ధింసా నృత్యంలో రకాలు :

ఈ ధింసా నృత్యం బయట నుండి చూసేవారికి ఒకేల కనిపిస్తుంది. కాని అందులో 15 రకాల ఆటలు ఇమిడి ఉంది. ఒక్కొక్క రకం నృత్యానికి ఒక్కొక్క ప్రత్యేక ప్రయో జనం అవసరం ఉంది. ప్రధానంగా ధింసా నృత్యంలో ఎనిమిది రకాలను బేధాలను గుర్తించారు.

బోడా ధింసా (పెద్ద నృత్యం) :

గిరిజన గ్రామ దేవత (నిసాని దేవత)లను పూజిస్తు సామూహికంగా ఈ నృత్యం చేస్తారు. ఉధృతమైన వాయిద్య బోడా ధింసా నృత్యం ప్రారంభమవుతుంది. కుడివైపు మగవాళ్ళు, ఎడమవైపు ఆడవాళ్ళు ఒక పేద్ద వరుసలో బారులు తీరి వీపు వెనుక నుంచి చేతులు పోనిచ్చి ఒకరి నడుమును ఇంకొకరు పట్టుకుంటారు.కుడి వరుసలోని చివరి కొనలో ఉన్న పురుషుడు (నెమల ఈకల పించాన్ని పట్టుకొన్న కథానాయకుడు) ఎడమ వరుసలోని చివరి కొనలో ఉన్న స్త్రీ(కథా నాయిక) లయబద్ధంగా అడుగులు వేస్తూ ముందుకువచ్చి కలుసుకుంటారు. అప్పుడు మిగిలిన నృత్యకారులంతా పాముల వలె మెలి కలు తిరుగుతూ చేరిపోతారు. గిరిజన పల్లెలలో జనవరి నెలలో సంక్రాంతి సమయంలో ఈ నృత్యం చేయడం ఎక్కువగా కనిపిస్తుంది.విశేష ఆదరణ పొందిన గిరిజన నృత్యం ఇది.

గుండేరి ధింస(పక్షి నృత్యం) :

ధీనినే ఉస్కు ధింసా అని కూడా పిలుస్తారు. గుండేరి అనేది ఒక స్త్రీ పేరు. ఒక వరుసలో ఉన్న పురుషులు, మరో వరుసలో ఉన్న స్త్రీలను తమతో కలిసి నృత్యం చేయమని పిలుస్తున్న అర్థం లో ఒక పాటను పాడుతూ స్త్రీ వరుసలో ఉన్నవాళ్ళను ఆహ్వానిస్తారు.అందువల్లనే ఈ నృత్యాన్ని గుండేరి ధింస నృత్యం అంటారు. స్త్రీ పురుషు లిద్దరు కలిసి పక్షులను అనుకస్తూ లయబద్ధంగా వల యాలు చుడుతూ ఉద్రేకపూరితంగా చేసే నృత్యమిది.

గొడ్డి బేటా ధింసా(రాళ్ళను ఏరే నృత్యం) :

ఒరియా భాషలో గొడ్డి అంటే చిన్న రాళ్ళు.బేట అంటే ఏరుట అనే అర్థం. తలలు కిందకి దించి పైకి ఎత్తుతూ, రాళ్ళు, రెమ్మలు ఏరుతున్నట్లు అనుకరించే నృత్యం ఇది.

మంచి ఊపుతో ముందుకు వంగుతూ లేస్తూ సుమారు 25 అడుగుల దూరం ముందుకు వచ్చి అలా నాలుగైదు సార్లు నర్తించడం ఈ నృత్యంలో విశేషం.

పోతూర్ ధింసా :

పోతూర్ అంటే ఆకులు తోలా అంటే సేకరణ అడవిలో ఆకుల్ని కోస్తున్నట్లు, ఏరుతున్నట్లు అనుకరించే నృత్యం ఇది అరకు లోయలొ గిరిజనులు అడ్డ ఆకులను సేకరించే వృత్తిని సూచిస్తుంది. రెండు వరుసలలో ఒక దాని వెంట మరోకటిగా సాగుతుంది.ముందు వరుస మనుష్యుల మీద వెనుక వరుస మనుష్యులు చేతులు వేసి తలల్ని పక్కకు కదుపుతూ ముందుకు వెనక్కూ అడుగులు లయబద్ధంగా కదపడం ఈ నృత్యంలోని విశేషం.

భాగ్ ధింసా(బెబ్బులి నృత్యం) :

భాగ్ అంటే ఒరియాలో బెబ్బులి యుద్ధం అని అర్ధం. అడవిలో సంచరించడం గిరిజనుడికి ఎంత సహజమో గిరిజనుడికి పులి ఎదురుపడటం కూడా అంతే సహజం. అలాంటి సందర్భంలో పులి ఎదురుపడినప్పుడు ఒక వేటగాడు ఎలా తప్పించుకొని పోవాలని అన్న విషయాన్ని తెలుపుతూ పులి మేకను అనుకరిస్తు చేసే నృత్యం ఇది బృందంలో నుండి సగం మంది ఒకరి చేతులు మరోకరు పట్టుకొని గుండ్రంగా తిరుగుతారు. తలను పైకెత్తుతూ మునివేళ్ళ మీద నిలిచి ఉంటారు. మిగతా సగం మంది చకచకా చుట్టు తిరుగుతూ లోపల ప్రవేశించి. పాము చుట్ట ఆకారం లో అంటూ పరుచుకుంటారు. ఇలా అనేక సార్లు చేస్తారు. సామాజిక వ్యక్తీకరణలో భాగంగా ఇటు వంటి నృత్యాలను గిరిజనులు సాధన చేస్తారు.

నాటికారి ధింసా (నాట్య కార్యం) :

దీపావళి రోజున ఒకే ఒక్క వ్యక్తి చేసే నృత్యం ఇది. ముఖ్యంగా వాల్మీకులు చేస్తారు. ఇతర తెగలు కూడా ఇతర పండుగ సందర్భాలలో దీనిని చేస్తారు.

కుండ ధింసా (భుజాల తోపుడు) :

కుండా అంటే ఒకరిని ఒకరు భుజాలతో తీసుకోవడం అని అర్ధం. ఈ నృత్యం లో నర్తించే వాళ్ళు పక్కలకు ఊగుతూ తమ భుజాలతో పక్క వాళ్ళుతోయడం ప్రత్యేక లక్షంగా ఉంటుంది.

బాయా ధింసా (అతీత భావన నృత్యం) :

బాయా అంటే పూనకం,గిరిజన పల్లెలోని పూనకం పట్టిన గుదాబారి చేసే నృత్యం ఇది. మతపరమైన ఈ గిరిజన నృత్యం లో గుదాబారి తనను దేవతలు పూనటాన్ని సూచిస్తు లయాత్మకంగా ఊగుతూ ఈ నృత్యం చేస్తారు. ఈ పూనకపు నృత్యం జరుగుతున్నంత సేపు అతని చుట్టు మూగిన గిరిజనులు తలలు వంచి వినమ్రులై ఉంటారు.

ఇవే కాక ఆయా సందర్భమును బట్టి పొతార్ తోటి (పులి నృత్యం) సాంబారీ ధింసా (కణుజు నృత్యం) పోషీ చశానా ధింసా (యువతీ యువకుల నృత్యం) రంగోబోతి ధింసా (ఆనంద నృత్యం) చోటి ధింసా (కమ్మరి పని నృత్యం) మొదలగు రకాలతో కూడిన నృత్యాలు చేస్తారు.

ఈ గిరిజన నృత్యం ఏక సామూహిక లక్షణం కోట్టొచ్చి నట్లు కనిపిస్తుంది కేవలం వినోదం కోసం మాత్రమే కాకుండా జనమంత ఒకే సమాజానికి చెందిన వాళ్ళు అనే ఉదాత్త భావనను వెలికి తెచ్చే విధంగా గారాజన తెగ ప్రజలు మధ్య సౌభ్రాతత్వాన్ని పెంపొందించే విధిగా ఈ ధింసా నృత్యం తీర్చిదిద్దబడింది.

నేటి కాలంలో ధింసా నృత్యం :

మారుతున్న కాలానికి అనుగుణంగా గిరిజన జీవన విధానంలో క్రమంగా మార్పులు వస్తున్నప్పటికీ వారి సంస్కృతికి చెందిన ఈ ధింసా నృత్యవిధానంలో ఏ మిర్పు రాలేదు. ఒకప్పుడు గిరిజనులు శ్రమైక జీవనంలో వినోదకారకంగా, పండుగలలో వేడుకగా తమ పల్లెలలో తామై జీవన లాలసతో ధింసా నర్తించేవారు. కాగా ఇప్పుడు పట్టణ యాత్రీకుల కోసం అరకు లోయలో మధ్యాహ్నం సమయాలలో పురుషులు సంగీత వాద్యాలు వాయిస్తే స్త్రీలు జట్టుగా ధింసా నృత్యాలు చేస్తున్నారు.ఈ జట్లునే వివిధ ప్రాంతాలకు పిలిపించి ప్రదర్శనలు ఇప్పిస్తున్నారు అంటే సంప్రదాయమైన ధింసా నృత్యం తన మూలాల

నుండి పరాయిదై కొత్త పరాయి ప్రేక్షకుల కోసం కొత్త రూపం ఎత్తింది.ఈ కొత్త రూపానికి ఆర్థిక కోణం తోడు అయింది.ఒక సామాజిక సమూహకళ ప్రస్తుతం గుర్తింపు నకు పరిమితమైంది.ఈ నృత్యానికి మూల ప్రాంతమైన కోరాపుట్ జిల్లాలో ఒరిస్సా ప్రభుత్వం ప్రతీ ఏటా మూడు రోజుల పాటు ధింసా నృత్య ఉత్సవాలను నిర్వహిస్తుంది.

తెలుగు రాష్ట్రాలలోని గిరిజనుల పండుగలు – సంస్కృతి – సంప్రదాయాలు

– కె. ఎం. సునీల్ కుమార్, పరిశోధక విద్యార్థి, తెలుగు & ప్రాచ్య భాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

ఆటవిక యుగంలో మానవుడు గిరిజనుడుగా ఉంటూ తర్వాతి కాలంలో స్థిరనివాసాలు ఏర్పరచుకున్నాడు. సంస్కృతి, సంప్రదాయాల్ని, కట్టుబాట్లను రూపొందించుకొని జానపదుడిగా, నాగరికుడిగా అభివృద్ధి చెందాడు. కాని ఆదిమ కాలం నుంచి తమ యొక్క సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకుంటూ ఇంకా నాగరిక ప్రపంచానికి దూరంగా కొండకోనల్లోనూ, అడవుల్లోనూ నివసిస్తున్నారు. గిరిజనులు గోండులు, సవరలు, చెంచులు, తోడాలు, జగతలు, గదబ, శబరలు మొదలైన వారు భారతదేశంలో అత్యంత ప్రాచీన ఆదిమ గిరిజనులని చెప్పవచ్చు.

నామౌచిత్యం :

ఆదివాసులని, ఆటవికులని, అనాగరికులని, కొండ జాతులని వివిధ పేర్లతో, వివిధ రకాలుగా గిరిజనులు నేడు పిలవబడుతున్నాడు. గిరి + జనులు = గిరిజనులు అంటే కొండ లేదా పర్వత ప్రాంతంలో నివసించే జనులని అర్థం. గిరులపై నివసించే జనులు గిరిజనులు అని నేడు సాధారణంగా పిలుస్తున్నారు. హిందీలో 'ఆదివాసి లేదా జన్‌జాతి' అని ఆంగ్లంలో వీరిని 'ట్రైబ్' అని పిలుస్తున్నారు. 'ట్రైబ్' అనే పదానికి తెలుగులో 'తెగ' లేదా 'సమూహం' అని పెద్దలు నిర్ణయించారు.

లక్షణాలు :

- గిరిజనులు తమ పూర్వ సంప్రదాయ వారసత్వాన్ని కాపాడుకుంటూ నాగరికులకి దూరంగా జీవిస్తారు.
- మూఢ విశ్వాసాలను, నమ్మకాలను కలిగి, ఒక నిర్ణీత ప్రాంతంలో జీవిస్తారు.
- ఎక్కువగా నృత్యగాన ప్రియులై ఉంటారు.
- లిపిలేని భాషల్ని మాట్లాడుతారు.
- వీరి జీవన విధానం ఎక్కువగా ప్రకృతితో ముడి పడి వుంటుంది.
- ప్రకృతిలో సహజ సిద్ధంగా లభించే ఆహారాన్ని తింటారు.

తెలుగునాట గిరిజనులు :

భారతదేశంలో 294 గిరిజన తెగలు నివసిస్తున్నారు. వీరిలో 35 గిరిజన తెగలు మన తెలుగు రాష్ట్రాలలో నివసిస్తున్నారు. 2001 జనాభా లెక్కల ప్రకారం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర జనాభాలో గిరిజనులు 50.24 లక్షలుగా ఉన్నారు. అనగా సుమారు 6.59 శాతంగా గుర్తించారు.

గోండ్వానా మొదలుకొని గోదావరి నదీ పరివాహక ప్రాంతంలోని అడవులు, తూర్పు కనుమలలో నివసిస్తుండగా మిగిలిన గిరిజనులు మైదాన ప్రాంత ప్రజలతో సహజీవనం చేస్తూనే తమ ప్రత్యేక లక్షణాలను కొనసాగిస్తున్నారు.

గిరిజనుల నివాసాలు :

గిరిజనులు తమ ఆవాసాలను ఎక్కువశాతం దట్టమైన అడవుల్లోని ఏటవాలుగా వున్న కొండ ప్రదేశాల్లోనే ఏర్పరచుకుంటారు. కొండరెడ్లు, గదబ, గోండ్లు, కొండ కమ్మర వంటి తెగలు తమ నివాసాల్ని ఒకే వరుసలో నిర్మించుకోవడం కనిపిస్తుంది. చెట్ల పొరకతో, వెదురు కర్రలతో గోడలు నిర్మించుకొని వాటికి పేడ, మట్టి మిశ్రమంగా చేసి పూరించి అడవులో కాసే గడ్డితో పై కప్పు వేస్తారు. వరుసగా ఒకరి ఇంటిని ఆనుకుని మరో ఇంటిని పెంచుకుంటూ, దాదాపు పది, పన్నెండు కుటుంబాలు ఒకే వరుసలో ఉండటం కనిపిస్తుంది.

వృత్తులు :

వేట, ఆహార సేకరణ, పోడు వ్యవసాయం, పశు పోషణ గిరిజనుల ప్రధాన వృత్తులుగా చెప్పవచ్చు. గిరిజన సమాజాలలో నేటికి వస్తుమార్పిడి పద్ధతి ఉంది. సుగాలీలు పశుపోషణ ద్వారా, కొండరెడ్లు పోడు వ్యవ

సాయం ద్వారా జీవనం సాగిస్తే, మాలి గిరిజనులు కూర గాయలు పంటలు పండించి, సంతలలో అమ్ముకోవడం చేస్తుంటారు. కొండ కొమ్మలు, ఎరుకల వారు వృత్తి పనులు చేస్తూ జీవిస్తున్నారు. చెంచు, యానాదిలలో వ్యవసాయ వృత్తి తక్కువ.

వివాహ వ్యవస్థ :

తెలుగు రాష్ట్రాలలోని గిరిజన కుటుంబాలలో వివిధ రకాలైన వివాహ పద్ధతులు ఆచరణలో ఉన్నాయి. వీటిలో ఒక పురుషుడు ఒకరి కంటే ఎక్కువ మంది భార్యలను కలిగి వుండే బహుభార్యత్వం, ఒకేసారి ఇద్దరు అక్కా చెల్లెళ్ళను వివాహమాడే పద్ధతి. భార్య తన భర్త తమ్ముడిని వివాహమాడే కనిష్ఠ దేవర న్యాయం, తన భర్త అన్నను వివాహమాడే పద్ధతి, మేనరికపు వివాహాలున్నాయి. అదే విధంగా ఒక స్త్రీ ఒకరి కంటే ఎక్కువ మంది భర్తలను కలిగి ఉండే బహుభర్తత్వం, ఒక పురుషుడు ఒకే స్త్రీతోనే వివాహ బంధం ఏర్పరచుకునే ఏకపత్నీత్వం కూడా అమలులో ఉంది.

మతము :

మజుంధార్ గిరిజనులను మతం ప్రాతిపదికన మూడు విధాలుగా వర్గీకరించాడు. 1) హిందూమత సంపర్కం లేకుండా ఉండే గిరిజనులు, 2) హిందూమత సంపర్కంతో హిందూ మత ఆచారాలను నమ్మకాలను అలవాట్లను అలవరచుకున్న తెగలు, 3) హిందూమతాన్ని అనుసరిస్తూనే హిందూమత ప్రజలతో సాంఘికంగా దూరాన్ని పాటిస్తున్న తెగలు. బ్రిటీష్ వారు గిరిజనులలో మత మార్పిడికి పాల్పడటంతో గిరిజనులు తమ సంప్ర దాయక ప్రకృతి పూజ వ్యవస్థకు దూరమై, హిందువులుగా, క్రైస్తవులుగా, ముస్లింలుగా, బౌద్ధ, జైన మతావలం బకులుగా మారారు.

భాష :

తెలుగునాట నివసించే గిరిజన జాతుల భాషల్ని ముఖ్యంగా 3 భాషా కుటుంబాల క్రింద విభజించవచ్చు. గోండు, కోలాము, కోయ, ఎరుకల భాషలు ద్రవిడియన్ భాషా కుటుంబంగా, సవర, గదబ భాషలు ముండారి భాషా కుటుంబంగా, లంబాడాలు లేదా బంజారాల భాష ఇండో ఆర్యన్ కుటుంబానికి చెందినవిగా గుర్తించారు. కొండ కమ్మరలు, కొండరెడ్డి, గౌడు, చెంచు, నాయక పోడు, భగత, బిల్లు, మన్నెదొర, మూకదొర లేదా నూక దొర, యానాదులు, రెడ్డి దొర, వాల్మీకులు, కొండకాపులు పూర్తిగా తెలుగుభాషనే మాతృభాషగా కలిగివున్నారు. మిగి లిన గిరిజనులు వాళ్లు వలస వచ్చిన ప్రాంతాన్ని బట్టి, విస్తరించిన ప్రాంతాన్ని బట్టి ఆయా ప్రాంత భాషలతో సంబంధం కలిగి వున్నారు.

పండుగలు - జాతరలు :

మేడారం సమ్మక్క - సారక్క జాతర :

ఇది ఆదివాసీల జాతర. కాలక్రమంలో గత ఇరవై ఏళ్ళ నుంచి గిరిజనేతరులు కూడా లక్షల్లో పాల్గొంటు న్నారు. రెండు సంవత్సరాలకు ఒకసారి మాఘశుద్ధ పౌర్ణమి రోజున ఈ జాతరను గత 900 సంవత్సరాల నుండి వరంగల్ జిల్లాలో (ప్రస్తుత జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా) పస్రాగ్రామం అడవుల్లోని మేడారం గ్రామంలో గిరిజనులు జరుపుకుంటున్నారు. సమ్మక్క - సారలమ్మ గద్దెలకు బెల్లాన్ని (బంగారం) నైవేద్యంగా సమర్పించుకుంటారు. ఇది ఆసియాలోనే అతిపెద్ద జాతర. 4 రోజుల పాటు జరిగే ఈ జాతరను 'తెలంగాణ కుంబమేళా' అని కూడా పిలుస్తారు. తేది:01.02.1996న ఈ జాతరను రాష్ట్ర ఉత్సవంగా ప్రభుత్వం ప్రకటించింది. ఇచట పూజారులు కూడా గిరిజనులే.

నాగోబా జాతర :

తెలంగాణాలోని ఆదిలాబాద్ జిల్లాలో ప్రతి సంవ త్సరం పుష్యమాసంలో బహుళ అమావాస్య రోజున జరుపు కుంటారు. 'నాగోబా' అంటే నాగదేవత. పామును దేవతా రూపంలో పూజిస్తారు.

కొండగట్టు అంజన్న జాతర :

జగిత్యాల జిల్లాలో ముత్యంపేట గ్రామ సమీపంలో ఈ దేవాలయం ఉన్నది. ఒకవైపు ఆంజనేయ స్వామి,

మరోవైపు నరసింహస్వామి ముఖాలు కల్గి ఉండుటం ప్రత్యేకత.

తేజ్ పండుగ :

ప్రతీ సంవత్సరం బంజారాలు నాట్లు వేసుకునే మందు జరుపుకునే పండుగ ఇది. దేశవ్యాప్తంగానున్న బంజారాల ముఖ్య పండుగల్లో ఇది ఒకటి.

ఇటుకల పండుగ లేదా ఈటెల పండుగ :

విశాఖపట్నం ప్రాంతంలోని భగత, గదబ, గౌడు, దులియా, పైకో కులియా, వాల్మీకి, రెడ్డి దొర, పార్జ, మూకదొర, మన్నిదొర, మాలి కొటియా, కొండదొర, కమ్మర గిరిజనులు అందరూ ఈ పండుగను జరుపు కుంటారు.

ఇతర పండుగలు :

కోయ, కొండరెడ్డి నాయకపోడు తెగలవారు జరుపుకునే పండుగలలో వైవిధ్యం కనబడుతుంది. చెంచులు శ్రీ రామనవమి, ఏరువాక పున్నమి, తొలి ఏకాదశి, దసరా, మహాశివరాత్రి, దీపావళి, ఉగాది, సంక్రాంతి, శివరాత్రి, ముత్యాలమ్మ అమావాస్య, నాగులచవితి, చైత్రశుద్ధ పున్నమి పండుగలను జరుపుకుంటారు. యానాదులు దేవుడి కార్యం సాక పండుగలను జరుపుకుంటారు. నక్కలవారు స్వామి మూట జాతరను జరుపుకుంటారు.

ముగింపు :

భారతదేశంలో గ్రామీణ జానపద విజ్ఞానంపై జరిగిన కృషి గిరిజన విజ్ఞానంపై గాని, లిఖిత సాహిత్యంపై అంతగా జరగలేదు. గిరిజనులు ప్రత్యేకంగా పరిగణింపబడటానికి వారి సాంస్కృతిక, సాహిత్య జీవితమే ప్రధానమని చెప్పవచ్చు. వీరి సంస్కృతి సాంప్రదాయాలపై తెలుగు సాహిత్యంలో ప్రాచీనకాలం నుంచి నేటివరకు అనేక ప్రక్రియలపై పరిశోధనలు, రచనలు వచ్చాయి. ఇంకా రావలసిన ఆవశ్యకత ఎంతో ఉంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా గిరిజన పీఠాలు, విశ్వ విద్యాలయాలను నెలకొల్పి వీరి సాహిత్యాన్ని భద్రపరచి, వారి విద్యాభివృద్ధికి తోడ్పడాలి. వీరి భాషలకు ప్రత్యేకంగా లిపులను కనుగొని, ఆయా భాషల్ని కూడా అంతరించిపోకుండా కాపాడాలి. అదే మనం వారికిచ్చే అత్యున్నత గౌరవం.

ఉపయుక్త గ్రంథాలు :

1. భారతీయ గిరిజనులు - నదీంహౌస్ నైన్, ఓరియంట్ లాజ్మన్, హైదరాబాదు.1995.
2. ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన సముదాయాలు - సూర్యనారాయణ ఎం., తెలుగు అకాడమీ ప్రచురణ, హైదరాబాద్, 2005.
3. కొండకోనల్లో తెలుగు గిరిజనులు - శివరామకృష్ణ పి., శక్తి పబ్లికేషన్స్, హైదరాబాదు, 2007.
4. తెలుగువారి జానపద కళారూపాలు - మిక్కిలినేని రాధకృష్ణమూర్తి, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, 1992.

గిరిజనుల జీవన విధానం – స్థితిగతులు

-కైలా లోకు బంధవి, పరిశోధక విద్యార్థిని, తెలుగు & ప్రాచ్య భాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం, గుంటూరు.

భారతీయ సంస్కృతికి మూలాలు ఆదివాసి, ఆట వికులు, గిరిజనులతోనే ముడిపడి ఉన్నదనేది చారిత్రక వాస్తవంగా చెప్పవచ్చు. అయితే అలాంటి గిరిజనుల వర్త మాన స్థితిగతులు ఎలా ఉన్నాయి, వారి జీవన విధానం ఎలా ఉన్నది అనేది 19వ శతాబ్దం వరకు ఎవ్వరూ ఆలోచించలేదు. వీరు నాగరిక సమాజానికి దూరంగా కొండ కోనల్లో జీవిస్తూంటారు. వీరు వందల సం॥ల నుండి సంస్కృతిని, సంపదను కాపాడుకొంటూ జీవనాన్ని కొన సాగిస్తున్నారు.

గిరిజనుల పుట్టుపూర్వోత్తరాలు వివాహం, కుటుంబం, ఆర్థిక, మత వ్యవస్థలు సాంస్కృతిక రూపాలపై 20వ శతాబ్దంలో విశేష పరిశోధనలు జరిగాయి. కొండ కోనల్లో నివశిస్తున్న వీరిని పర్వత ప్రాంతవాసులని, ఆటవికులని, ఆదివాసీయులని అనేక పేర్లతో పిలవడం జరుగుతుంది. అయితే వీరిని భారత రాజ్యాంగం1950 జనవరి 26 నుండి షెడ్యూల్డ్ ట్రైబ్స్‌గా గుర్తించింది. వీరికి ప్రత్యేకించి ఆర్టి కల్స్‌ను కూడా ఏర్పాటు చేసి ప్రభుత్వం వీరి సంరక్షణార్థం కృషి చేస్తుంది.

మన దేశంలో దాదాపుగా 350 షెడ్యూల్డ్ తెగలను గుర్తించింది. మన ఆంధ్ర రాష్ట్రంలో 35 తెగలు ఉన్నట్లుగా చెప్పవచ్చు. వీటిల్లో 12,13 తెగలు ఆటవిక దశలోనే ఉన్నట్లుగా మనం చెప్పకోవచ్చు. అవి : 1. అంద్, 2.భగత్, 3.ఖిల్, 4.చెంచు, 5.గదబ, 6.గోండు, 7.గవుడు, 8.కొండ రెడ్డి, 9.జాతుపు, 10.కమ్మర, 11.కట్టునాయకన్, 12.కోలం, 13.కొండడొర, 14.కొండకాపు, 15.కొండరెడ్డి, 16.కోరధులు, 17.కోటియా, 18.కోయ, 19.కులియ, 20.మాలియా, 21.మన్నెదొర, 22.ముఖదొర, 23.నాయక, 24.పర్ధాన్, 25.పొరజ, 26.రెడ్డి దొర, 27.రోన, 28.సవర, 29.సుగాలి, 30. తోటి, 31. వాల్మికి, 32.యానాది, 33.ఎరుక, 34.నక్కల, 35.ధూలియా మొదలైనవారుగా మనం చెప్పవచ్చు.

నిజానికి అత్యధికంగా గిరిజనులు నివశించే ప్రాంతాలు అటవీ, ఎజన్సీ ప్రాంతాలుగానే చెప్పవచ్చు. మన ఆంధ్ర రాష్ట్రంలో 6.59 శాతం షెడ్యూల్డ్ తెగలవారు జీవిస్తున్నారు. గిరిజనుల యొక్క జీవన పరిస్థితులను, వారి ఆచారాలను, సంస్కృతి సాంప్రదాయాలను తెలిసుకునే ముందు వారు నివశిస్తున్న భౌగోళిక ప్రాంతాన్ని గురించి తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ఆంధ్రప్రదేశ్‌లో గిరిజనుల ఆవాసాలను ప్రధానంగా 5 మండలాలుగా విభజించారు. అవి 1.కోలాం ప్రాంతం - గోండులు, 2.కొండరెడ్డి ప్రాంతం - కోయ, 3.సవర ప్రాంతం - సవర ఖండో, 4.చెంచు ప్రాంతం - నల్లమల, 5. మైదాన ప్రాంతాలు ఈ ప్రాంతా లలో గిరిజనులు ఎక్కువగా జీవిస్తూ ఉన్నారు.

గిరిజనుల జీవన విధానం :

గిరిజనుల ముఖ్య జీవనాధారం వ్యవసాయం. అదీ పోడు వ్యవసాయం చైత్రోత్సవం జరుపుకొని వీరి వ్యవ సాయ సాగును కొనసాగిస్తారు. కొర్రలు, సాములు, రాగులు, జొన్నలు, వరి, మిరప తదితర పంటలతో పాటు దుంపలు కూడా పండిస్తారు. బుట్టలు,అల్లికలు లాంటి చేతి పనులు కూడా చేస్తారు. కొండకోనల్లో దొరికే ప్రకృతి సంపద కూడా వీరి జీవన విధానంలో భాగమే. అంతే కాకుండా పశువులను కూడా పోషిస్తూంటారు. వీరు ఎక్కువగా వస్తు మార్పిడి విధానాన్ని అవలంభిస్తారు.

గిరిజనుల గృహ నిర్మాణం :

వీరు నివాసయోగ్యమైన గృహాలలో జీవిస్తూన్నారు. వీరు నివశిస్తున్న కొన్ని ప్రాంతాల్లో రోడ్డు, బస్సు, కరెంటు సౌకర్యాలు కూడా లేని కొండ ప్రాంతాల్లో జీవనాన్ని కొన సాగిస్తూన్నారు. వీరి యొక్క ఇళ్ళు సంప్రదాయ గడ్డి,

వెదురు, తడికలతో నిర్మించిన ఇళ్ళుల్లో నివశిస్తున్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వం వారు నిర్మించిన ఇళ్ళల్లో కూడా నివశిస్తున్నారు. అలాగే మట్టితో అలికిన నేలగల ఇళ్ళు కూడా ఉన్నాయి.

గిరిజనుల ఆహారపు అలవాట్లు :

వీరిలో కొంత మంది శాఖాహారులు, మాంసాహారులు కూడా ఉన్నారు. అడవులు, కొండప్రాంతాల్లో దొరికే సహజ సిద్ధమైన పండ్లతో పాటు దుంపలు, కూరగాయలు, జొన్న అన్నం, రాగి సంగటి, జొన్నరొట్టెలు, వరిఅన్నంతో పాటు ఎక్కువగా తాటి, ఈత కల్లులాంటివి కూడా వీరు సేవిస్తుంటారు.

తలపాగా ధరిస్తారు. స్త్రీలు యంబ్రాయిడరీ చేసిన ముతక బట్టలు, రవికెలు, చీరలు, గాజులు, గవ్వలు, అద్దాలతో కుట్టిన వస్త్రాలను ధరిస్తారు. వీరులో కొంత మంది ట్రూకీ అనే ముసుగును కూడా ధరిస్తారు. వీరు కాలిమువ్వలు, చెవిపోగులు, ఇత్తడి రింగులు, కడియాలు ధరిస్తారు. సందర్భానుసారంగా వస్త్రధారణ ఉంటుంది.

గిరిజనుల వివాహ వ్యవస్థ :

గిరిజనులు ఈ క్రింది పేర్కొన్న పద్ధతుల్లో ఏదో ఒకదాన్ని ఎన్నుకొని వివాహాలు చేసుకుంటారు. 1.పెద్దల నిర్ణయం ప్రకారం వారు నిశ్చయించిన వారినే చేసుకోవడం, 2.అమ్మాయిని బలవంతంగా ఎత్తుకొనిపోయి పెళ్ళి చేసుకోవడం. దీనినే రాక్షస వివాహం అంటారు. 3.కాబోయే మామగారి ఇంట్లో కొంతకాలం పాటు వారికి సేవ చేసిఅమ్మాయిని పెళ్ళిచేసుకొవడం. దీనినే ఊడిగం ద్వారా వివాహం అంటారు. 4.అబ్బాయి, అమ్మాయి ఇష్ట పూర్వకంగా పెద్దలను ఒప్పించి ప్రేమించి పెళ్ళి చేసుకోవడం, 5.తల్లి దండ్రులు ఒప్పుకోకపోతే అబ్బాయి, అమ్మాయి పారిపోయి పెళ్ళిచేసుకోవడం. దీనినే పలాయనం అంటారు. వీరు సంప్రదాయ పితృస్వామిక వ్యవస్థను గౌరవిస్తారు. కట్టుబాట్లు, కుల పంచాయతీలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. వీరిలోనే వితంతు వివాహాలు, విడాకులు కూడా ఉన్నాయి.

గిరిజనుల నృత్య ప్రదర్శన రీతులు:

వీరు సంప్రదాయ పండుగలైన విజయదశమి, సంక్రాంతి, ఉగాది, హోలి, బాలాజీ స్వామి రధోత్సవాలతో పాటుగా శ్రావణ, ఆషాడ, కార్తీక మాసాలలో నోములు వ్రతాలు వంటివి కూడా చేస్తారు. అలాగే పంట కోతకి వచ్చాక తొలిపంటను వారి ఇష్టదైవానికి సమర్పించి చెంచమ్మ, ఎల్లమ్మ, పోచమ్మ, మహాలక్ష్మమ్మ, సమక్క, సారాలమ్మ జాతర్లు కూడా జరుపుకుంటారు.

మామిడికోత పండుగలో, నృత్యములో చిక్కుడు కొమ్మల్ని ఉపయోగిస్తారు. పెళ్ళిళ్ళప్పుడు ఆడుతూ పాడుతూ రెండు మూడు సమూహాలుగా ఏర్పడి నృత్య గానాలతో కుడిచేతిలో నెమలి ఈకను పట్టుకుని నాట్యం చేస్తారు. తప్పెట్లు, వాయిద్యాల శబ్దాలకు అనుగుణంగా లయబద్ధంగాగిల్లికాయల గుత్తులను ధరించి నృత్యం చేస్తారు.

గిరిజనుల సంగీత వాయిద్య పరికరాలు :

గిరిజనులు అనేక సంస్కృతిపరమైన నృత్యాలు గేయాలల్లో వాయిద్య పరికరాలను ఉపయోగిస్తారు.కిరిడి అనేది మట్టితో చేయబడిన డ్రమ్ము. దీనిని రెండు కర్ర పుల్లలతో వాయిస్తారు. మమేళా ఇది దండారి నృత్యం జరిగే సమయాల్లో ఎక్కువగా వాడతారు. తుడుము ఇది అర్ధగోళాకారంలో ఉంటుంది. పైభాగాన తోలు పట్టీలతో దీనిని వాయిస్తారు. డోలు దీనిని దారువుతో డొల్లగా చేసి రెండువైపులా జింక చర్మాన్ని గాని, మేక చర్మాన్ని గాని కడతారు. రెండవ రకం డోలు ఇది కూడా దోలులాంటిదే మెడకు తగిలించు కొనిడోలును పొట్టకు ఆనించి ఒక చేతిలో వెదురు పుల్లతోను మరొకటి చేతి వ్రేళ్ళతోను అప్పుడప్పుడు అరచేతితోను వాయిస్తుంటారు. నాగస్వరం ఇది నోటితో ఊదుపాములను ఆడించడానికి ఉపయోగిస్తారు. డగుల బరాయి ఇది వెదురుతో చేసిన వాయిద్యం దీని పొడవు 16 నుండి 20 అంగుళాలు ఉంటుంది. దీనికి రెండు వైపులా పొడుగాటి రంధ్రాలు ఉంటాయి.

డంగు అనే కొయ్యముక్క సహాయంతో ధ్వనిని జనింప చేస్తారు. వెదురు పిల్లన గ్రోవి ఊదేచోట ఒక రంధ్రం మధ్య నుంచి రెండవ చివరి వరకు అయిదు చిన్న రంధ్రాలు ఉంటాయి సాధారణంగా ఇది 21 సె.మీ పొడవు ఉంటుంది. పనార్ ఈ వాయిద్యానికి ఒక వైపు మూసి రెండవ వైపు ఖాళీగా ఉంటుంది. మూసిన వైపు దీర్ఘ చతురస్రాకారంగా చిన్న రంధ్రం ఉంటుంది. తాటాకు బద్దను మైనంతో అంటిస్తారు. ఎడమచేతి బ్రొటన వ్రేలు ఇతర వేళ్ళ మధ్య పట్టుకొని పెదవుల దగ్గర ఉంచి ఈ వాయిద్యం నుండి శబ్దాన్ని ధ్వనింప చేస్తారు.

ముగింపు :

ఈ విధంగా గిరిజనులు తమ జీవిత చక్రంలో భాగంగా వివాహ వ్యవస్థలోని భాగాలను వారి ఆచారాలు, సంస్కృతి సంప్రదాయాలు ఏవిధంగా ఉన్నాయో మనకు తెలుస్తుంది. గిరిజన సంక్షేమం కోసం గత 60 సం॥లలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు ప్రవేశ పెట్టాయి. వీరు నాగరిక జీవితానికి దూరంగా ఆధునిక వసతులు లేకపోయిన తమ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకొంటూ జీవిస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖ వీరి పురోభివృద్ధికి, సంక్షేమానికిఅనేక పథకాలు ప్రవేశపెట్టిన అనుకున్న ఫలితాలను సాధించలేకపోతున్నాయి. గిరిజన ప్రాంతబాల బాలికల విద్యాభివృద్ధికి ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలు మొదలైన వాటిని ప్రభుత్వం ప్రోత్సాహకంగా అందించిన అర కొర ఆదాయాలతో, అర్ధాకలితో దినసరి కూలీలుగా బ్రతుకు బండి లాగుతున్నారు.

ఆధార గ్రంధాలు :

1. కృష్ణాజిల్లా సర్వస్వం - కృష్ణాజిల్లా రచయితల సంఘం.
2. జానపద కళావైభవం - కర్నాటి లక్ష్మీ నారాయణ.
3. గిరిజనుల సంస్క తి సంప్రదాయాలు -జానపద కళల ప్రత్యేక సంచిక.
4. గిరిజనులతో ముఖాముఖి.

చెంచు జాతి సంస్కృతి సంప్రదాయాలు

- ఆర్. లక్ష్మి ప్రసన్న కుమార్, పరిశోధక విద్యార్థిని, తెలుగు & ప్రాచ్య భాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం, గుంటూరు.

ఆంధ్ర ప్రదేశ్ షెడ్యూల్డ్ తెగల జాబితాలో మూడవ కులం చెంచులు. హరిదాసులు, బుడబుక్కలు కాటి కాపరులు, బోయ, ఎరుకుల. యానాది, లంబాడి మొద లైన ఆదిమ జాతుల్లో చెంచు కూడా ఒకటి. వీరు పూర్తిగా ఆదివాసీలు. ఆంధ్రప్రదేశ్‌లోని చెంచు తెగ ప్రాచీన సంచా తర తెగలలో ఒకటి. నల్లమల ప్రాంతంలోని కొండలు, గుట్టలే వీరి ప్రస్తుత నివాస స్థలం. కృష్ణానది పరివాహక ప్రాంతంలో చెంచులు విస్తరించి, అటు నిజాం రాజ్యానికి ఇటు బ్రిటీష్ పరిపాలనలోని మద్రాస్ ప్రెసిడెన్సీకీ సరి హద్దుగా ఉన్న కృష్ణా నదికి ఇరువైపులా ఉన్న ప్రాంతాలలో కనిపించేవారు. వీరు రింగుల జుట్టు, విశాల వదనం, చప్పిడి ముక్కు, పొడవాటి దవడలతో పొట్టిగా, నల్లగా ఉంటారు. వీరి పూర్వీకులు శరీరానికి ఆకులు చుట్టుకొనే వారు. ప్రస్తుతం ఉండే వారు మాత్రం గోచీ పెట్టుకుని సంచరిస్తూ ఉంటారు. ఆడవాళ్లు నూలు రవిక, చీర కట్టుకుంటారు. అడవి చెంచులకు పుట్టే సంతానమే నిరు పేదలుగా భారతదేశం మొత్తం ఉన్నారు. విల్లంబులు, ఒక కత్తి, గొడలి, గుంతలు తవ్వే కర్ర, కొన్ని కుండలు, బుట్టలు మరికొన్ని జింకు పాత్రలు వీరి ఆస్తిపాస్తులు.

వీరిలో వ్యక్తిగత స్వేచ్ఛ, స్వాతంత్ర్యం అనే భావన బలంగా కనిపిస్తుంది. వీరు వేటను, పళ్ళను ప్రసాదిస్తుం దని విశ్వసించే ఒక అడవి దేవతను పూజిస్తారు. అంతేగా కుండా హిందుకవు పూజించే కొన్ని లక్షణాల సారూప్యం ఉన్న ఒక ఆకాశ దేవుడ్ని కూడా వీరు పూజిస్తారు. జీవితం దేవుడి వర ప్రసాదమని నమ్ముతారు. హిందువుల సమాజ సంపర్కం వల్లే ఈ విశ్వాసాలన్నీ చెంచుల ఆలోచన విధా నాలలోకి ప్రవేశించాయి. అప్పటికప్పుడే అశువుగా పాటలు పాడుతూ స్త్రీ పురుషులు నృత్యం చేస్తారు. వీరి ఆటల్లో సింగి, సింగడు ప్రధాన పాత్రధారులు, నాయికా నాయ కులు డప్పుకు తగినట్లుగా గంతులు వేస్తారు. ఇప్ప పువ్వు సారా తాగి మైమరిచి గుప్పి గంతులు వేస్తారు. నెమలి నృత్యం వీరి నృత్యంలో ముఖ్యమైంది. చెంచుల కథలు పూర్వం ప్రసిద్ధి చెందిన జానపద కళలలో ఒకటి.

చెంచుల ఆరాధ్య దైవాలు :

చెంచులు వారి సొంత దైవాలతో పాటుగా నరసింహ స్వామి మరియు భ్రమరాంబ మల్లికార్జున స్వాముల ను ఆరాధ్య దైవాలుగా ఆరాధిస్తారు. నరసింహస్వామి సతీమణి అయిన చెంచులక్ష్మి వీరి తెగకు చెందినదిగా చెప్పు కుంటారు. దీనికి ఆధారం అహోబిలం దేవాలయ కుడ్యాల మీద చెక్కబడిన ప్రతిమలు మరియు శ్రీశైల దేవాలయాలలో జరిగే పూజా కార్యక్రమాలలో చెంచుల విశిష్టత తెలుస్తుంది.

చెంచులు దర్శించే యాత్రా స్థలాలు :

1. శ్రీశైలం
2. మహానంది
3. అహోబిలం

వివాహ కార్యక్రమాలు - విధివిధానాలు :

చెంచుల వివాహం పెళ్లికుమార్తె ఇంట్లో జరుగుతుంది. కార్యక్రమానికి పెళ్ళికుమారుడు వారి తల్లిదండ్రులతో పాటు 9మంది కన్యా దాత ఇంటికి వస్తారు. ఇరువురికి పెళ్లి సమ్మతించిన తరువాత వాళ్ళు అందరూ కలిసి సారాయి తాగుతారు. దీనితో పెళ్లి నిశ్చయం అవుతుంది. తరువాత పెళ్లి రెండు రోజులు జరుగుతుంది. పెళ్లి కుమా రుని ఇంటి ముందు కట్టెలు, ఆకులతో ఆకర్షణీయంగా పందిరి వేస్తారు. వధూవరులను ఒకే పందిరి కింది కూర్చో బెట్టి పెళ్లి చేస్తారు. ఈ రెండు రోజులు గూడెంలో వారికి బంధువులకు యేటను కోసి అన్నం చేసి భోజనాలు వడ్డిస్తూ ఒక్కొక్కరికి ఒక సీసా సారాయి ఇస్తారు.

వితంతు వివాహం :

ఈ తెగవారిలో భర్త చనిపోయిన స్త్రీ తనకు పిల్లలు ఉన్నప్పటికీ ఆమెకు ఇష్టం ఉంటే ఆమెకు నచ్చిన వారిని రెండవ పెళ్లి చేసుకోవచ్చు. 20 నుండి 40 సంవత్సరాల నడిమి వయస్సు గల స్త్రీలు ఈ విధంగా రెండవ వివాహానికి అర్హులాలు అవుతుంది.

కుటుంబ వ్యవస్థ :

చెంచు కుటుంబాలలో ఉమ్మడి కుటుంబాలు ఉండవు. వివాహం జరిగిన వెంటనే విడిగా కాపురం పెట్టుకుంటారు. చెంచులు పెళ్లి కాక ముందే ఒక గుడిసెను ఏర్పాటు చేసుకొనే ఆచారం ఉంటుంది. చెంచులు స్వేచ్ఛను కోరుకొనే మనస్తత్వం కలవారు.

చెంచుల వర్గీకరణ :

చెంచులను నాలుగు రకాలుగా వర్గీకరించారు అవి.

1. అడవి చెంచులు
2. దేవ చెంచులు
3. బొంత చెంచులు
4. కృష్ణ చెంచులు

వీరిలో అడవి చెంచులు, దేవ చెంచులు నలమల అడవి ప్రాంతాలలో బొంత చెంచులు, కృష్ణ చెంచులు లోతట్టు ప్రాంతాలలో నివసిస్తుంటారు. బొంత చెంచులు మాట్లాడే భాషను 'బొంతకొర' అని అంటారు. చెంచు

స్త్రీలు గృహోపకరణాలను మరియు వెదురు నిచ్చెనలను తయారు చేసి పట్టణ ప్రాంతాలలోని ప్రజలకు విక్రయించి వచ్చిన ఆదాయంతో జీవిస్తారు.

ఒక్కొక్క గోత్రానికి చెందిన చెంచులు తేనె తీసుకొనేందుకు వేరు వేరు ప్రాంతాలను కేటాయించుకొని రాత్రి పూట తేనెను సేకరిస్తారు. తేనె సేకరించడానికి వెళ్లినప్పుడు బామరుదులను వెంట తీసుకొని వెళ్తారు. అన్నదమ్ములను తీసుకు వెళ్ళరు. ఎందుకంటే వీరిలో అన్న చనిపోయినప్పుడు అతని భార్యను తమ్ముడు వివాహం చేసుకొనే ఆచారం ఉంది. ప్రతి గూడెంకు ఒక హద్దు ఉంటుంది. ఒక గూడెంకు ఉన్న హద్దులోకి వేరొక గూడెం వారు ప్రవేశించరు. స్త్రీలు నెలసరి వచ్చినప్పుడు వారు నివాసం ఉంటున్న గుడిసెకు దూరంగా ఉంచుతారు. ఈ సంప్రదాయం ఇప్పటకీ ఉంది.

కర్మ కాండలు :

చెంచులు గూడెంలో ఏ వ్యక్తి చనిపోయినా గూడెంలో ఉన్న మొత్తం జనాభా ఆ రోజున చనిపోయిన వారి ఇంటికి వచ్చి దహన సంస్కారాలు జరిగేవరకు ఉంటారు. చెంచు గూడెంలో చనిపోయిన వారికి పూడ్చడం కానీ లేదా కాల్చడం కానీ చేస్తారు. దహనం చేసిన తరువాత ఒక్కో గూడెంలో ఒక విధంగా 9రోజులు లేదా 11 రోజులు కర్మ కాండ నిర్వహిస్తారు. చనిపోయిన అతని పెద్దకుమారుడు గూడెంలోని అందరికీ బంధువులకు అన్నం, సాంబారు, రసం, మాంసాహారం ఏర్పాటు చేస్తాడు.

గూడెం పెద్ద :

ప్రతి చెంచు గూడెంకు ఒక పెద్ద మనిషి ఉంటాడు. అతనిని గూడెంలోని వారందరూ ఎన్నుకుంటారు. ఆ పెద్దమనిషి గూడెంలో జరిగే పెళ్లిలకు వచ్చి వధూవరులను ఆశీర్వదిస్తాడు. కర్మకాండలు జరుగుతున్నప్పుడు హాజరవుతాడు. ఆ కుటుంబ సభ్యులను ఓదార్చుతాడు. గూడెం వారితో సత్సంబంధాలు నెరుపుతాడు. చెంచులు ఒక చోట స్థిరంగా ఉండరు. ఒక్కొక్క సీజన్‌లో వేరు వేరు ప్రదేశాలకు వెళ్తుంటారు. ఇలాంటి సందర్భాలలో ఒక గూడెం ఇంకొక చోటుకు మారాలంటే స్థల నిర్ణయం కూడా గూడెం పెద్ద చెప్పిన ప్రకారం నిర్ణయించడం జరుగుతుంది.

అస్తిత్వ ప్రమాదంలో చెంచులు :

క్షయ మలేరియా వంటి వ్యాధులు మూలంగా చెంచులు మృత్యువాత పడుతున్నారు. సంతానం లేక పోవడం కూడా ఒక కారణం కావడంతో వీరి జాతి అంతరించాడానికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. మహబూబ్ నగర్, ప్రకాశం, కర్నూల్, గుంటూరు, నల్గొండ జిల్లాలోని

దట్టమైన నలమల అడవులలో వేల సంవత్సతరాలుగా వీరు జీవనం సాగిస్తూ ఉన్నారు. చెంచులు రాష్ట్రంలోని మిగిలిన జన సమూహంతో గానీ ఇతర గిరిజన తెగలతో గానీ చెంచు తెగకు దగ్గరి పోలికలు లేవు. వీరి మనస్త త్వాలు, అలవాట్లు మానసిక శారీరక స్థితిగతులు, సంస్కృతి భిన్నమైంది. నలమల అటవీ ప్రాంతంలోని 5 జిల్లాలను పులుల అభయారణ్యంగా ప్రకటించి, శాశ్వత నిర్మాణం లేని 'నో మాన్ ల్యాండ్' గా ప్రకటించారు. చెంచు పేట లను పునరావాసం పేరిట అడవి బయటికి పంపించవద్దని జి.సి.సి నిర్వహణను చెంచు యువతకు అప్పగించాలని వీరు కోరారు. వీరి వ్యవసాయ భూములు అధిక భాగం ఆక్రమించబడ్డాయి అంతేగాకుండా వీరి విలువైన వన రులు గిరిజనేతరులు చేతికి చిక్కాయి. చెంచుల ఇల వేల్పు అయిన శ్రీశైల మల్లికార్జున స్వామి, అహోబిల లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాలు వందల సంవత్స రాలుగా చెంచుల సంరక్షణలోనే ఉండేవి. చెంచులు వీటిని వారసత్వ సంపదగా భావించుకుంటారు. చెంచుల గజ్జల కొండడు, మల్లయ్య తాతదొర వంటి వారు శ్రీశైలం మల్లన్న అర్చకులు. శ్రీశైలం మల్లన్న ఆలయంలో జరిగే పూజా కార్యక్రమంలో చెంచులకు ప్రత్యేక స్థానం ఉంది. వీరు పార్వతిదేవిని తమ ఆడ పడుచుగా భావించి పూజి స్తారు. ప్రస్తుతం శ్రీశైలం మల్లన్న సన్నిధిలో ఉద్యోగాలు ఇవ్వాలని వీరు కోరుతున్నారు. చెంచుల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ పథకాలు చెంచులకు మాత్రం ఉపయోగపడడం లేదు. చెంచుల ఆధీనంలో వారు సాగుచేసుకుంటున్న భూములు వారికే చెందుతాయని కేంద్ర ప్రభుత్వం చట్టం చేసిన అటవీ హక్కుల చట్టం అమలుకునోచుకోవడం లేదు.

గిరిజనుల ఇలవేల్పులు – సమ్మక్క – సారలమ్మలు

–సోనబోయిన సతీష్, తెలుగు అధ్యాపకులు, శ్రీ విశ్వేశ్వర సంస్కృతాంధ్ర డిగ్రీ & పి.జి. కళాశాల, వరంగల్, తెలంగాణ.

భారతదేశంలోని అతిపెద్ద గిరిజనుల ఉత్సవం మేడారం సమ్మక్క - సారలమ్మ జాతర. ఈ జాతరకు తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, చత్తీస్‌గడ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు. నాగరిక ప్రపంచానిక దూరంగా ప్రకృతి అందాలతో అలరారే కీకారణ్యం మేడారం "మాఘ శుద్ధ పౌర్ణమి వచ్చిందంటే మేడారం జనారణ్యంగా మారుతుంది.

తెలంగాణ వరంగల్లు జిల్లా కేంద్రానికి 110 కిలోమీటర్ల దూరంలో అడవి ప్రాంతంలో గల మేడారం గ్రామంలో జరిగే ఈ జాతర నమ్మకాలకు, ఐకమత్యానికి, కట్టుబాట్లకు నిదర్శనం. సుమారు 700 ఏండ్ల చరిత్ర గల మేడారం జాతరకు వెళ్ళు భక్తులు ముందుగా కరీంనగర్ జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకొని (మొక్కులు అప్పజెప్పి) ఇంటికి వచ్చాక గిరిజన భక్తులు కొందరు పౌర్ణమికి నాలుగు రోజులు ముందుగా సమ్మక్క పండగ చేసుకుంటారు. ఈ పండగను బుధ, గురు, శుక్ర వారాల్లో చేసుకుంటారు. ఆ రోజు ఇండ్లు శుభ్రపరచుకొని ముగ్గులు పెట్టుకొని తలస్నానం చేసి ముత్తైదువుల పసుపు కుంకుమ బొట్లు పెట్టి, పూల దండలను కట్టి ఊదుబత్తులను వెలిగించి "పడి" పెట్టుతారు. "పడి" అంటే ఐదు విస్తర్లలో ఐదుగురికి (శివ సత్తులకు) అన్నం పెట్టుతారు. ఐదుగురు శివసత్తులు పూనకంతో వచ్చి ఆ ఇంటి శివసత్తికి ఆవహించి చేతితో ముట్టకుండా వాటితో అన్నం తింటారు. అప్పుడు శివ సత్తులు తల్లి ఆధీనంలోనే ఉంటారని, ఆమె ఏమి పలికిస్తే అదే పలుకుతారని భక్తుల నమ్మకం.

పూనకం వచ్చేసరికి (శివసత్తులు) ఒడి బియ్యం పోస్తరు. (ఒక దోసెడు గాని ఐదు దోసిళ్ళు గాని) ఈ బియ్యంలో కుంకుమ, పసుపు, నూనె, ఎండు ఖర్జూరాలు, పోకలు, కుడకలు, రవిక ముక్కలు, పండ్లు వేసి కొత్త బట్టలో పోసి ఉంచుతారు. జాతరకు వెళ్ళే ముందు కొత్త చీర, రెండు కొత్త రవికలు ధరించి ఆ బియ్యాన్ని బట్టలో పోసి ఉంచుతారు. జాతరకు వెళ్ళే ముందు కొత్త చీర, రెండు కొత్త రవికలు ధరించి ఆ బియ్యాన్ని నడుముకు గట్టిగా బిగించి కట్టుకడుతారు. ఇలా స్త్రీలతో మగవారు కూడా శివసత్తులు అంటారు. వీరు చీర, రవికలను ధరించి బొట్టు పెట్టకొని మట్టెలను ధరించి మేడారం జాతరకు బయలుదేరుతారు. వెళ్ళే మార్గంలో ములుగు ప్రధాన రహదారిపై ములుగుకు 2 కిలోమీటర్ల దూరంలో గట్టమ్మ గుడి ఉంది. కోరికలు తీర్చే తల్లిగా పేరొందిన గట్టమ్మ తల్లి ఇక్కడ చాలా సంవత్సరాల క్రితం గట్టంపల్లె గ్రామంలో వెలిసింది. నేడు అది ప్రేమ్‌నగర్‌గా పిలవ బడుతుంది. ములుగు ప్రాంతంలో ఎవరింట్లో పుణ్య కార్యం జరిగినా మొదట గట్టమ్మను దర్శించి పూజలు జరపాల్సిందే. రాజకీయ నాయకులు సైతం ఎన్నికల్లో గెలిచిన తరువాత తమకు శుభం జరిగేలా ఆశీర్వదించ మని గొర్రెలను బలిచ్చి గట్టమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకుంటారు. మేడారం జాతరకు వచ్చే భక్తులు, వారు వచ్చే వాహనాలను ఆపి గంటసేపు ఇక్కడ పూజలు చేసి మేడారం వెళ్ళుతారు.

మేడారం చేరిన తరువాత జంపన్న వాగులో స్నానం చేసేముందు ఒడి బియ్యం విప్పి తలస్నానం చేస్తారు. మరల ఒడి బియ్యాన్ని నడుముకు బిగించి కట్టుకొని మొక్కులు చెల్లించుకొని కొన్ని బియ్యం (సమ్మక్క తల్లి) దగ్గర కొన్ని బియ్యం (సారలమ్మ బిడ్డ) దగ్గర పోసి మిగిలినవి ఇంటికి తీసుకొని వెళ్తారు. తీసుకువెళ్ళిన బియ్యంలో కొన్ని ఇంట్లోని బియ్యంలో వేస్తారు. తిరుగు వారు అంటే సమ్మక్కకు ఏ రోజైతే ఇంట్లో పెట్టుకుంటారో అదేరోజు

తలస్నానం చేసి ఇల్లు శుభ్రం చేసి ఈ ఒడిబియ్యంలో బెల్లం వేసి తీపి వండుకుంటారు. ఆ రోజు వారి స్తోమతను బట్టి పొట్టేలు పిల్ల లేదా కోడిపిల్లతో ఎదురుపిల్ల అని చెప్పి తల్లికి బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. మళ్ళీ సమ్మక్క పౌర్ణమి రోజు జాతర అయిన మరునటి సంవత్సరం పౌర్ణమి రోజున కూడా వీరు ఇంట్లో సమ్మక్క పండుగ జరుపుకుంటారు.

బంగారు (బెల్లం) తూకాలు :

సమ్మక్క-సారలమ్మలకు తమ కోరికలు తీరితే భక్తులు నిలువెత్తు తూకాలు వేసి బెల్లాన్ని నైవేద్యంగా సమర్పించడం కూడా ఒక ఆనవాయితి.

ఎదురుకోళ్ళు :

సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద కోడిని ఎగురవేసే సంప్రదాయాన్ని ఎదురుకోళ్ళు అనే పేరుతో వ్యవహరిస్తున్నారు. దేవతలిరువురు గద్దె వద్దకు వచ్చే సమయంలో బలి ఇస్తామని మొక్కుకున్న కోడిని గద్దెల వద్ద ఎగురవేయడం ద్వారా దేవతలు చూశారని భావించి తరువాత కోడిని బలిచ్చి దేవతలకు నైవేధ్యంగా సమర్పిస్తారు.

సమ్మక్క-సారలమ్మలు గద్దెలకు రావడం :

మాఘ శుద్ధ పౌర్ణమి మొదటి బుధవారం ఉదయం సారలమ్మ పూజాలు గద్దెలకు ప్రత్యేకంగా అలికి ముగ్గులు వేసి శుభ్రం చేస్తారు. కన్నెపల్లిలోని సారలమ్మ దేవాలయం నుండి సారలమ్మను వెదురుబుట్టలో పెట్టి పైన "పడుగను" గద్దెకు తీసుకువస్తారు. పెట్టి అప్పటికే మొక్కులు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్న భక్తులు తన్మయత్వంతో తొక్కిసలాటను సైతం లెక్కచేయకుండా సారలమ్మ గద్దెను చేరి మొక్కులు చెల్లిస్తారు.

1. సారలమ్మ భర్త గోవిందరాజును ఏటూర్‌నాగారం మండలం కొండాయి నుండి ఆచార లాంఛనాలతో గద్దెకు తీసుకువస్తారు.
2. సమ్మక్క భర్త పగిడిద్దరాజును కొత్తగూడ మండలం, పూనుగొండి నుండి ఆచార లాంఛనాలతో డప్పుచప్పుళ్ళతో గద్దెకు చేర్చుతారు.
3. గిరిజన పూజారులు గురువారం ఉదయం తమ కార్యక్రమాన్ని చేయడం ప్రారంభిస్తారు. మేడారంలోనున్న గుడి చెంతకు చందా వంశీయులు మరియు సిద్ధబోయిన వంశీయులు పూజారులుగా సమ్మక్క గుడిలో పూజాధికాలు నిర్వహిస్తారు. జలకపు వడ్డెగా, దూపపు వడ్డెగా పిలవబడే పూజారులు గిరిజనుల లాంఛనాలతో సమ్మక్కను చిలకలగుట్ట నుండి తీసుకువస్తారు. చిలకలగుట్ట నుండి బయటకు తీసేముందు పోలీసులు అధికారిక లాంఛనాలతో గాలిలోకి మూడుసార్లు కాల్పులు జరుపుతారు. ఎప్పుడైతే మూడోసారి కాల్చిన శబ్దం వినగానే ఎదురెళ్లు మండ దగ్గర (అంటే సమ్మక్క చిలకల గుట్ట నుండి గద్దెకు వచ్చే దారి) చెలపెయ్యను (ఆవు) బలిస్తారు. ఇది రహస్యంగా భక్తులు చూడకుండా జరుగుతుంది. ఆ చెలపెయ్య చెట్టువద్ద పూజారులు పూజలు చేసి సమ్మక్కను గద్దెపైకి తెస్తారు.
4. సమ్మక్క సారలమ్మలు గద్దె వద్దకు తీసుకొని వచ్చేటప్పుడు లక్షలాది మంది భక్తులు ఊగిపోతారు. దేవతలకు ఎదురేగాలని ఎగిరెగిరి రెండు చేతులతో నమస్కరిస్తారు. ఎదురుకోళ్ళను ఇస్తారు. మరికొందరు గద్దెకు వచ్చే దారిలో అడ్డంగా పడుకుంటే వారిపై నుండి పూజారులు నడుచుకుంటూ దేవతలను తీసుకువెళ్ళుతారు. తమపై నుండి దేవతలు వెళ్తే జన్మ సార్థకమైనట్లుగా భక్తులు భావిస్తారు.

సమ్మక్క-సారలమ్మలు వన ప్రవేశం :

జాతరలో సమ్మక్క-సారలమ్మలకు మొక్కులు చెల్లించే ప్రక్రియ నాలుగో రోజుకు చల్లబడుతుంది. (శనివారం) గద్దెలపై ప్రతిష్టితులైన సమ్మక్క సారలమ్మలు శనివారం సాయంత్రం వనప్రవేశం చేయడంతో జాతర వైభవంగా ముగుస్తుంది.

మేడారం జాతరకు వచ్చిన జనం (భక్తులు) వెళ్ళిన తరువాత ఆ పల్లె మళ్ళీ నిశ్శబ్దపు ఒడిలోకి జారిపోతుంది.

చారిత్రక నేపథ్యం :

చారిత్రకంగా ఆధారాలు లేకపోయినప్పటికి స్థల పురాణాల ఆధారంగాను, జన వ్యవహారశైలి ఆధారంగాను సుమారు (700) యేండ్ల క్రింద (13వ శతాబ్దిలో) కాకతీయుల సామ్రాజ్యంలో ఓరుగల్లును ప్రతాపరుద్రుడు పరిపాలించాడు. బైయ్యక్కపేట పురంలో శ్రీధర వంశీయులు ఇంట్లో 'మాఘశుద్ధ పౌర్ణమి పుబ్బ నక్షత్రమందు సమ్మక్క జన్మించింది.

సమ్మక్క చిన్నతనం నుండి చాలా చురుకైనది. మూలిక వైద్యంలో అనేకమైన కిటుకులు తెలిసింది. పెళ్ళయిన మొదటిరోజు పాముకాటుకు సరయిన ఒక పెండ్లి కొడుకును బ్రతికించింది. బిడ్డలు లేని వారికి సంతానం ప్రాప్తి కలుగజేసింది. అనేకమైన దీర్ఘరోగాలు మూలికా వైద్యంతో నయం చేసేది. సమ్మక్క తల్లిని గిరిజనుల దేవతలా పూజించేవారు. ఆమె దయామయురాలని కోయవారు ఆరాధించేవారు.

కాకతీయ సామ్రాజ్య సామంత రాజు మేడరాజు సబ్బి మండలాన్ని (కరీంనగరాన్ని) పాలిస్తుండేవాడు. ఇతని మేనల్లుడు పగిడిద్దరాజు. పగిడిద్దరాజు యేలుబడి ఒడిలో నున్న మేడారం కూడా కాకతీయులు సామంత రాజ్యంగ ఈ పగిడిద్దరాజు యేలుబడిలో ఉంది. భార్య సమ్మక్క మేడారం గ్రామం కరువు కాటకాల వల్ల నష్టపోయింది. అందుకై పగిడిద్దరాజు కాకతీయులకు కప్పం కట్టడానికి నిరాకరించి మేడారంను స్వతంత్ర రాజ్యంగా ప్రకటించుకున్నాడు. ప్రతాపరుద్రునికి ఇది తెలిసి కోపంతో తన మంత్రి యుగందురుని నాయకత్వంలో సైన్యాన్ని పంపి పగిడిద్దరాజు అణచివేసి మేడారాన్ని వశపరుచుకోమ్మని ఆజ్ఞాపించాడు.

నేటి ములుగు తాలూకా "లక్నవరం" చెరువు వద్ద కాకతీయ సైన్యాలు స్థావరం ఏర్పరచుకున్నాయి. యుద్ధ వ్యూహంగా సంపెంగ వాగు వద్దనే కాకతీయ సైన్యాన్ని ఎదిరించాలని సమ్మక్క సూచించింది. సమ్మక్క చెప్పిన విధంగా ఆమె భర్త పగిడిద్దరాజు, కొడుకు జంపన్న కూతుళ్ళు సారలమ్మ, నాగులమ్మ మరియు అల్లుడు కొండాయి ప్రభువు గోవిందరాజులు అడబిడ్డ కోడూరు లక్ష్మమ్మ మరికొంత మంది పరివారముతో కాకతీయుల సైన్యాన్ని సంపెంగ వాగు దాటకుండా అడ్డుకున్నారు. పెద్ద సంఖ్యలో అనేక మారణాయుధాలతో ముట్టడించిన సైన్యంతో హోరా హోరి పోరు చేసి అందరూ సమరంలో మరణించారు. జంపన్న అపర అభిమాన్యుడిలా పోరాడి సంపెంగ వాగులో పడి చనిపోయినాడు. అప్పటిన ఉండి సంపెంగ వాగుకు జంపన్న వాగుగా పేరొచ్చినది. ఈ గడ్డపై పుట్టిన ప్రతి వ్యక్తి వీరరత్నం కావాలి. స్వాతంత్ర్యం కోసం పోరాడి గెలువాలి అంటూ సమ్మక్క తల్లి యుద్ధానికి సిద్ధమై యుద్ధరంగంలో దూకింది. అపార కాళిలా కాకతీయ సైన్యాలను చీల్చి చెండాడింది. సమరంలో పడిపోయిన తన భర్త పగిడిద్దరాజును తన శక్తి సామర్థ్యాలతో లేవనెత్తుకొని రక్తం చిమ్మే గాయాలతో చూసిన కోయలు ఆమెను అనుసరించారు. అడవి చివరగా ఉన్న చిలకలగుట్ట ప్రాంతంలో వారికి ఆ తల్లి కనిపించ లేదు. అక్కడ "నెమలినార వృక్షం" కింద ఉన్న పుట్టవద్ద పసుపు కుంకుమతో నిండి ఉన్న ఒక భరిణి కనిపించింది. కోయలు దానిని సమ్మక్క తల్లి గుర్తుగా ఆరాధించారు.

ప్రతాపరుద్రుని కలలో కాకతీయుల ఇలవేల్పుల ఏక వీరాదేవి కనిపించింది. మేడారం నా శరీరం నా అధికార దాహంతో నన్ను గాయపరిచావు అని కన్నీరు పెట్టిందట. పశ్చాత్తాపంతో ప్రతాపరుద్రుడు మేడారం వెళ్ళి రాజరికాన్ని నిలుపుకోవడానికి ఇంత మంది అమాయకుల ప్రాణాలు బలిగొన్నందుకు క్షమాపణలు చెప్పుకొని ప్రకటించి రెండేండ్లకు ఒకసారి సమ్మక్క తల్లి పేరు మీద మూడు రోజులు వైభవంగా జాతరను జరపడానికి ఆదేశాలిచ్చి వీటి నిర్వహణకు ప్రత్యేకంగా సమ్మక్క తల్లి పేరు మీద నిధులు కేటాయించి తాను కూడా సమ్మక్క తల్లి భక్తుడయ్యాడు.

1. కొన్ని వందల ఏండ్ల క్రింద అడవిలో దొరికిన భరణిని ఈనాటికి ఆ తల్లి గుర్తుగా రెండేండ్లకు ఒకసారి జరుపుకునే ఈ జాతరలో సమ్మక్క - సారలమ్మ గద్దెల వద్ద మూడురోజులు నిలుపు తారు.
2. ఈ జాతరను తెలంగాణలో ప్రతి ఇంట పిల్లపాప లతో బంగారం (బెల్లం) సరి సమానంగా తూకం వేసి అమ్మవారికి కానుకగా బెల్లం (బంగారం) పంచిపెడుతారు. జంతు బలులను ఇచ్చి సంతోషపెడుతారు. మళ్ళీ 2 సంవత్సరాల వరకు తాము తమ పిల్లలు ఆయురారోగ్యాలతో చూడా లని అమ్మవారికి కోరుకుంటారు.
3. తెలంగాణ ప్రభుత్వ 2014 రాష్ట్ర పండుగగా గుర్తిం చింది మరియు వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం నుండి అమ్మవారికి వస్త్రాలను తీసుకు వచ్చే ఆచారం ముఖ్యమంత్రివర్యులు తీసుకు రావాలని ఆచారాన్ని శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు తీసుకువచ్చి ప్రతిపాదించాడు.



తెలంగాణాలో ఆదివాసి గిరిజన "కోయ" తెగ వివాహ పద్ధతులు

– డా॥ ఈసం సారయ్యదొర, అసిసెంట్ ప్రొఫెసర్ ఇన్ సోసియాలోజి, గౌట్ సిటి కాలేజి, హైదరాబాద్, తెలంగాణ

భారతదేశంలో గిరిజనుల తెగలు దాదాపుగా 700 ఉన్నారు. వారు ప్రత్యేక సంస్కృతి సాంప్రదాయాలు - పద్ధతలు పాటిస్తూ జీవించుచున్నారు. వీరు 2011 జనాభా లెక్కల ప్రకారం మొత్తం దేశ జనాభాలో 8.6% కలిగి ఉన్నారు. గిరిజనులు 26 రాష్ట్రాలలో నివరించుచున్నారు. 16 రాష్ట్రాలలోని ఏజెన్సీ ప్రాంతాల్లోని ఉత్తర భారత దేశంలో 6న, షెడ్యూల్, దక్షిణ భారతదేశంలో 5న షెడ్యూల్ ద్వారా వచ్చిన హక్కులు కలిగి ఉండి కూడా వాటిని పొందలేక అరకొర జీవనాన్ని గడుపుచున్నారు. గిరి జన చట్టాలు అమలు మాట ప్రక్కన పెడితే ఇక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన తెగలు 35 ఉన్నాయి. వాటిలో ప్రధానంగా ఆదివాసి గిరిజనులు అని పిలువబడే తెగలు 9 ఉన్నాయి. వారు 1) గొండ్, 2) కోయ, 3) చెంచు, 4) కోలాం/మన్నెవారు, 5) పర్ధాన్, 6) తోటి, 7) నాయకపాడ్, 8) ఆండ్ మరియు కొండరెడ్లులుగా ఉన్నారు. వీరందరి వివాహ పద్ధతుల్లో కొద్దిగా వేరువేరుగా ఉన్నప్పటికి సాంప్రదాయాలు గోత్ర వ్యవస్థననుసరించి దాదాపుగా ఒకే విధమైన అర్థాన్ని కలిగియున్న సాంప్ర దాయ విధానాలు-పద్ధతులు కనబడతాయి. వివాహాలు మాత్రం యే తెగ ఆ తెగలోని ఆం:తర్ వివాహ పద్ధతిని పాటిస్తారు. ఇందులో ప్రత్యేకమైన వివాహ విధానాలు గిరిజన ఆదివాసి కోయ తెగకు సంబందించి ఈ అద్యా యనం పత్ర సమర్పనలో తెలుపడం జరుగుచున్నది.

ఆదివాసి గిరిజన తెగల్లో ఒక ముఖ్యమైనటువంటి తెగ "కోయ". ఈ తెగకు ప్రభుత్వం పెట్టినపేరు "కోయ" కాని వీరిని దొరలచట్టం అనే పేరుతో పిలువబడతారు. వీరు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఖమ్మం జిల్లాలో ఎక్కువగా ఉన్నారు. వీరు ఉమ్మడి జిల్లాలోని ఖమ్మం, వరంగల్, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కరీంనగర్ మరియు ఆదిలాబాదు జిల్లాల్లో ఉన్నారు. వీరికి ఒక ప్రత్యేకమైన సాంప్రదాయాలు, సంస్కృతి కలిగి ఉండి వాటిని తమ ప్రాణంగా పాటిస్తూ ఉంటారు. సంస్కృతి సాంప్రదాయాల్లో భాష, గోత్ర వ్యవస్థ ప్రధానమైనటు వంటివి. భాష విషయాలోనికి వస్తే ఈ తెగకు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఆదిలాబాదు జిల్లాలోని ఈ తెగవారికి ఖమ్మం జిల్లాలోని సగభాగం అనగా భద్రాచలం డివిజన్‌కు భాష ఉంది. ఎల్లందు డివిజన్‌నకు భాష లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోను మరియు కరీంనగర్ జిల్లాలలో భాష లేదు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్, ఆసిఫాబాద్, అదిలాబాదు, నిర్మల్ డివిజన్ లలోని ప్రాంతంలో గొండ్‌లుగా మరియు కాగజ్‌నగర్, బెల్లంపల్లి, మంచిర్యాల్ డివిజన్‌లలోని ప్రాంతంలో కోయలుగా పిలువబడతారు. ఈ రెండు తెగల మధ్య భాష కొద్దిగా బేదంగా కనబడినప్పటికి ఈ రెండు తెగల గోత్ర వ్యవస్థను చూస్తే ఒకే విధంగా ఉంటుంది. పైన గోండులుగా పిలువబడే ఆదివాసిలు ఎస్.టి.లో మీరు ఏమిటి అని అడిగితే కోయత్తూర్ అంటారు. గోండు కోయ తెగలు రెండు కూడా ఆయా ప్రాంతాలల్లో చారిత్రక నేపద్యాలు, ప్రభావాలు బట్టి వేరువేరుగా పిలువబడి నప్పటికి గోత్రం వ్యవస్థను పరిశీలిస్తే ఒక్కటేనని అర్థమౌవు చున్నది. వారి సాంప్రదాయంలో ముఖ్యమైనటువంటి వివాహ పద్ధతులు గురించి చర్చిద్దాం!

ఆదివాసి కోయ తెగ వివాహ పద్ధతుల్లో ముందుగా గోత్ర వ్యవస్థను ఖచ్చితంగా పాటించి మాత్రమే పెళ్ళిళ్ళు జరుగుతాయి. ఆయా ఆదివాసి గిరిజన తెగల్లో సంతాల్ తెగలో 100 గోత్రాలు ముండా తెగలో 50 గోత్రాలు మరియు బిల్లుల తెగల్లో 24 గోత్రాలు ఉన్నట్లు "భారతీయ సమాజం"లో శ్రీ కె. సింగయ్య గారి సంపాదకీయంలో చప్పడం జరిగింది. కానీ నేను తిరిగి సేకరించిన పరిశోధనలో కోయ గోండు తెగల్లో 5 గోత్రాలు

మాత్రమే ఉన్నాయి. ఒక్కొక్క గోత్రాల్లో ఎన్నైన ఇంటి పేర్లు ఉండవచ్చును. సాధారణంగా పెళ్ళిళ్లు ఇంటి పేర్లు ఆధారంగా జరుగుచుంటాయి. కానీ వీరి వివాహ వ్యవస్థలో మాత్రం ఇంటి పేర్లను బట్టి కాదు. గోత్రాలను బట్టి మాత్రమే పెళ్ళిళ్లు జరుగుచున్నాయి. వీరిలో గోత్ర వ్యవస్థ ఎంత ముఖ్యమంటే కోయ గూడెలల్లో దొర, పటేల్, పెరంటాలు ఏర్పాటు గోత్రం ప్రకారం జరుపుకుంటారు మరియు ఏ చిన్న పెద్ద కార్యక్రమాలు జరిగినను సాంస్కృతిక, సాంప్రదాయాలు పూర్తి స్థాయిలో పాటిస్తూ గ్రామస్తులందరు కార్యక్రమాల్లో పాల్గొంటూ ఎలాంటి ఇబ్బంది జరుగకుండా సంతోషంగా జరుపుకుంటారు. అందువలన గిరిజన తెగల్లో ముఖ్యమైనటువంటి కోయ, గోండు తెగల్లో జరిగే వివాహాలు గోత్రాల పద్ధతి ప్రకారమే జరుగుపు కుంటున్నారు. గోత్రం అనగా ఒకే వంశానికి సంబందించిన వారు అని అర్థం కాబట్టి ఒకే గోత్రం వారి ఇంటి పేర్ల మధ్య పెళ్ళిళ్లు జరుగవు. ఇది మనకు ఆధునిక సైన్స్‌గా గోచరిస్తుంది. ఎందుకనగా దగ్గరి బంధువుల మధ్య అనగా మేనరిక వివాహం చేయకూడదని సైన్స్ చెప్పుతుంది. అలాగే ఒకే వంశం వారి మధ్య పెళ్ళిళ్లు లెవని గోత్రం పద్ధతి సైన్స్ కన్న ముందునుంచే చెప్పుచున్నది కనుక గోత్ర వ్యవస్థ గొప్పదిగా చెప్పక తప్పదు. గోత్రాలను ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో గోత్రం నంబర్ మరియు గోత్రం పేర్లతో పిలుస్తారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గోత్రం పేరు మరియు దేవుళ్ళుగా పిలిచే నెంబర్లతో మరియు గోట్టుగా పిలుస్తారు.

	కోయల్లో పిలిచే గోత్రం పేరు		గోండలో పిలిచే గోత్రాలు
1.	3వ గోట్టు	- కాకేటి పూజరి గోత్రం	- మూడు దేవుళ్ళు
2.	4వ గొట్టు	- సనపగాని గోత్రం	- నాలుగు దేవుళ్ళు
3.	5వ గొట్టు	- బండాని గోత్రం	- ఐదు దేవుళ్ళు
4.	6వ గొట్టు	- బెరంబోయిన గోత్రం	- ఆరు దేవుళ్ళు
5	7వ గొట్టు	- పారేడుగట్టు గోత్రం	- ఏడు దేవుళ్ళు అని పిలుస్తారు.

ఈపైన తెలిపిన ఏ గోత్రంలో లేనటువంటి కొన్ని ఇంటి పేర్లు ఉన్నాయి. వాటిలో నాకు తెలిసినవి. దారం అలూరి, యాప, అలెం, సిద్దబోయిన, పెండకట్ల మరియు చేప/చపల ఇంటి పేర్ల వారికి ఓడ్డె గోత్రం అని వీరికి ప్రత్యేక పేరు ఉన్నది. వీరిలో కొందరు 3వ గోత్రం అని కూడా చెప్పుకుంటారు. కాని వీరికి 3వ గోత్రం వారికి ఉన్న అన్ని హక్కులు వివాహ పద్ధతి విషయంలో ఉండవు. పై గోత్రాలల్లో ఒక్కొక్క గోత్రంలో ప్రాంతాన్ని బట్టి ఎనైనా ఇంటి పేర్లు ఉండవచ్చును. ఒకే గోత్రంలోని ఇంటి పేర్ల మధ్య వివాహ వ్యవస్థ పద్ధతులు ఉండవు. వీరందరు ఒకే వంశం నకు చెందినవారిగా ఉంటారు.

ఏ గోత్రం వారికి ఎవరు వరుస అవుతారు. ఎవరు వరుస కారు అనే విషయాన్ని ఒక పట్టిక రూపంలో

1.	3వ గోట్టు - కాకేటి పూజారి గోత్రం	#	3వ గొట్టు	- కారేటి పూజారి గోత్రం
	3వ గొట్టు - కాకేటి పూజారి గోత్రం	=	4వ గొట్టు	- సనపగారి గోత్రం
			5వ గొట్టు	- బండాని గోత్రం
			6వ గొట్టు	- బెరంబోయిన గోత్రం
			7వ గొట్టు	- పారేడుగొట్టు గ్రోత్రం

2.	4వ గొట్టు సనపగాని గోత్రం	#	4వ గొట్టు	- సనపగాని గోత్రం
		#	7వ గొట్టు	- పారేడు గట్టు గోత్రం
	4వ గొట్టు-సనపగాని గోత్రం	=	3వ గొట్టు	- కాకేతి పూజారి గోత్రం
			5వ గొట్టు	- బండాని గోత్రం
			6వ గొట్టు	- బేరంబోయిన గోత్రం
3.	5వ గొట్టు-బండాని గోత్రం	#	5వ గొట్టు	- బండాని గోత్రం
	5వ గొట్టు-బండాని గోత్రం	=	3వ గొట్టు	- కాకేతి పూడి గోత్రం/ఓడ్డె గోత్రం
			4వ గొట్టు	- సనసగాని గోత్రం
			6వ గొట్టు	- బేరంబోయిన గోత్రం
			7వ గొట్టు	- పారేడు గొట్టు-గొత్రం
4.	6వ గొట్టు-బేరంబోయిన గోత్రం	#	6వ గొట్టు	- బేరంబోయిన గోత్రం
	6వ గొట్టు-బేరంబోయిన గోత్రం	=	3వ గొట్టు	- కాకేతి పూజారి గోత్రం
			4వ గొట్టు	- సనపగాని గోత్రం
			5వ గొట్టు	- బండాని గోత్రం
			7వ గొట్టు	- పారేడు గొట్టు గోత్రం
5.	7వ గొట్టు-పారేడుగట్టు గోత్రం	#	7వ గొట్టు	- పారేడుగట్టు గోత్రం
		#	4వ గొట్టు	- సనపగాని గోత్రం
	7వ గొట్టు-పారేడుగట్టు గోత్రం	=	3వ గొట్టు	- కాకేటి పూజారి గోత్రం
			5వ గొట్టు	- బండాని గోత్రం
			6వ గొట్టు	- బేరంబోయిన గోత్రం

గమనిక : పైన వివరించిన గోత్రం వ్యవస్థల్లో #, = ఈ రెండు గుర్తులు వ్రాయడం జరిగింది. వాటిని గోత్రాలు మధ్య ఉపయోగించటం జరిగింది. # ఈ గుర్తు వాడితే వారి మధ్య వివాహాలు జరగవు అని అర్థం. = ఈ గుర్తు వాడితే ఆ గోత్రాల మధ్య వివాహాలు జరుగవచ్చును అని అర్థం. కాబట్టి పైన వాడిన గుర్తుల ఆధారంగా ఏఏ గోత్రాల మధ్య వివాహాలు జరగవచ్చును. లేదా జరుగ కూడదు అనే విషయాన్ని అర్థం చేసుకొనవచ్చును. ఆదివాసి గిరిజన (కోయ) తెగలో వివాహ పద్ధతులను అర్థం చేసుకోవడానికి అందుబాట్లల్లో ఉన్న ఇంటి పేర్లను గోత్రం వారిగా ఈ పత్ర సమర్పణలో పట్టికలో తెలియ జేయటం జరుగుచున్నది.

గోట్టు - గోత్రం పేరు	ఇంటి పేర్లు
3వ గొట్టు కాకేటి పూజారి	గుమ్మడి, మోకాళ్ళ, తాటికురసం, సంగెపు, ఈసం, ముయ్యబోయిన చాట్ల, చాప, తాటిపూనెం, రేగ, ముడిగ, గొంది, తాటిఇర్పు, తాటికుంజ, బూర్క, దారం, తల్లడి, కొక్కెర, సిద్ధబోయిన, కాయం, నాలి, పెండకట్ల, నల్లబోయిన,కంటెం,తెల్లం, ఆలెం, కల్తి, గొప్ప, బర్ల, నూప, మొలకం, మచ్చ, మూతి, కొర్స, గీతపల్లి, దుబ్బ, పాయిల, తూరం, ఎదుళ్ళ, మద్దెల, బుగ్గ, ఎలుగొండ, సుతారి, ఊసం, మెట్ల, కొర్నెబెల్లి, పోదెం, కాక, ఉండం, సున్నం, పెరడ. ఓర్స, మర్రం, యాప, బోర్ర, కొడెం, తగిడి, తాటిఇర్ప, బోగ్గం, సుర్టి, అన్నె బోయిన, బట్ట, అలూరి, గుండెబోయిన, మిడియం, మొగిలిపల్లి.
4వ గొట్టు-సనపగాని గోత్రం	గుంట, కంగలి, మూటి, అర్రెం, గట్టి, మేడ, సనప, పెనక, పీరీల, సిడం, వంక, యాలం, కబ్బాక, చీమల, బొల్లి, గోపాల, పోలెబోయిన, పొడుగు, దబ్బగట్టు, దొడ్డ, బిల్లం, లోడిగ, గడిగా, ఈసాల, లోడిగ, దోబె, పర్శిక, కిన్నెర, పినబోయిన.
5వ గొట్టు-బండాని గోత్రం	చింత, కాటెం, జెజ్జరి, చుంచ, వాసం, బిజ్జ, వజ్జ, మల్లెల, మంకిడి, దనుసరి, అమిలి, చెరుకుల, బండానికురసం,సురాభాక/సువర్ణపాక, ఆగబోయిన, చేల, ఊకే, ఈక, పోనక, జోగ, కొప్పల, దాట్ల, బంగారి, ఆలం, బడె, చంద, జెమ్మ, జారె, కోటి, సోడె, దుగ్గారపు, పిడబోయన, బండ, బత్తుల, రాళ్ళపల్లి(వాసం), బచ్చల, అయిలబోయిన, గౌరెబోయిన, అలుగుబెల్లి, కొండ, కన్తి, ఇట్టం, బండ్ల, భూపతి, జిమ్మ.
6వ గొట్టు-బెరంబోయినగోత్రం	గొగ్గలి, బాడిష, సోలం, పోడెం, కోరం, బెరంబోయినవాసం, సోడెం, యట్టి, కోమురం, జవ్వ, తుర్ప, కురుసం, జోడిక, మీసాల, భూటారి, కుడుముల, పోడియం, కోడిప, గొడ్డె, జగ్గడ, కారం, కోడె, బోదెబోయిన. బొల్లెపల్లి, కుడుకుల, అన్నారపు, సోలం, గడ్డం, మైపతి, తోడసం సోంధి, యెడం, పోయి, కలేటి, కొట్నాక్, గొడ్డె, కోడె.
7వ గొట్టు-పారెడుగట్టు గోత్రం	ఇంటిపేర్లు: రాసూరి, వట్టం, కుంజ, పోయిపూనం, తోలెం, కొరం, సోయం, పులసం/పుల్సె, మడె, బీరబోయిన, చెర్ప, పడిగె, గలిగె, మట్టి, మడప, యానక, బందం, జవ్వాజి, పూసం, మిద్దబోయిన, పోయిఇర్ప, జిగట, మైత, పాయం, జిగట, ఎల్లబోయిన, యానక.

ఆదివాసి గిరిజన (కోయ) తెగలో గోత్ర వ్యవస్థను కచ్చితంగా పాటిస్తూ వివాహ పద్ధతులు కొనసాగు చున్నాయి. పైన వివరించిన విధంగా కోయ తెగ గిరిజను లకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఖమ్మం జిల్లాలోని

ఇల్లందు డివిజన్‌లలో మరియు కరీంనగర్ జిల్లాలో భాష లేకపోయినప్పటికి కోయ గిరిజన తెగకున్న మిగతా జిల్లాలో భాష ఉన్నప్పటికి భాష ఉన్నవారు లేనివారు అందరికి ఉమ్మడిగా ఖచ్చితంగా పాటించబడే సంస్కృతి సాంప్రదాయాలలో ముఖ్యమైనటువంటిదే గోత్రం పద్ధతి. ఈ గోత్ర వ్యవస్థను అనుసరించి మాత్రమే ఈ తెగలో వివాహ పద్ధతులు జరుగుచున్నాయి. వీరు గోత్ర వ్యవస్థ పద్ధతి కోల్పోయినపుడు ఈ ఆదివాసి గిరిజన కోయతెగ మనుగడ ప్రశ్నార్థకం అయ్యే ప్రమాదం ఉన్నది. అందు వలన గోత్ర వ్యవస్థ ముఖ్యమైనదిగా పరిగణించబడుతున్నది.

ఉపయుక్త గ్రంథాలు :

1. భారతీయ గిరిజనులు - నదీం హస్నైన్.
2. The Koyas of Andhra Pradesh - Sri B.R.K. Sastary, M.A. IAS.
3. Socio-Cultural Profile of Tribes of Andhra Pradesh - Dr. K. Mohan Rao (Retd)
4. భారతీయ సమాజం - శ్రీ కె. సింగయ్య, ప్రిన్సిపల్ (రిటైర్డ్), ఎస్.ఆర్.ఆర్. & సి.వి.ఆర్. ప్రభుత్వ డిగ్రి కళాశాల, విజయవాడ.
5. గిరిజనులు-సమస్యలు - డా॥ వి.ఎన్.వి.కె. శాస్త్రి (రిటైర్డ్), గిరిజన పరిశోధ సంస్థ, సంచాలకులు, హైదరాబాద్.

గిరిజనుల సంస్కృతి – గిరిజనుల మూడనమ్మకాలు

– ఆర్ల బాలస్వామి, స్నాత్తకోత్తర విద్యార్థి, తెలుగు విభాగం, పాలమూరు విశ్వవిద్యాలయం, పాలమూరు, తెలంగాణ.

ప్రతి దేశానికి తన నైసర్గిక, చారిత్రక, సామాజిక ప్రత్యేకతలు కొన్ని ఉంటాయి. భారతదేశానికి గల ప్రత్యేకతలలో 'గిరిజనులు అనేది ఒకటి. ఇతర దేశాలలో గిరిజనులు లేరని కాదు గాని, మనదేశంలో గిరిజనులకు ఒక ప్రత్యేకమయిన స్థానం ఉంది. సంఖ్యరీత్యా జనాభాలో 7 శాతమే అయినా గిరిజనులు దేశంలోని అన్ని రాష్ట్రాలలోను నివసిస్తున్నారు. బ్రిటిష్ వాళ్ళ కాలం నుండి ఇప్పటి దాకా మన దేశం సాధించిన అభివృద్ధి వల్ల అత్యధికంగా నష్టపోయింది గిరిజనులే అత్యధికంగా ఈ 150 సంవత్సరాలలో తిరుగుబాట్లు చేసింది కూడా గిరిజనులే.

గిరిజనులు అనగానే తలలో ఈకల, మొలలో గజ్జెలు ఉండే విచిత్ర జీవులని సామాన్య నాగరికులు భావిస్తారు. ఎక్కడో అడవులలో నివసిస్తూ తెల్లబట్టలు కనబడగానే పారిపోయే భయస్తులు అని కొంత చదువుకున్న వాళ్ళు భావిస్తారు. గిరిజనుల భావనలో చెప్పాలంటే వాళ్ళు తమను తాము కొండ మనుషులు గాను అడవి మనుషులు గాను భావించుకుంటారు. ఈ రకంగా చూస్తే వాళ్ళకు మనం పెట్టుకున్న గిరిజనులు, ఆటవికులు అనే పేర్లు వాళ్ల చైతన్యం యొక్క సంస్కృతీకరణే.

భౌతికంగా గిరిజనులలో మూడు రకాల తెగలుంటాయి. వేట మీద, ఆహార సేకరణమీద ఆధారపడి జీవించేవాళ్ళు పశుపోషణకులు ఆహారాన్ని ఉత్పత్తి చేసే వాళ్ళు మొదటి రకానికి చెందిన తెగలు ఇప్పుడు చాలా తక్కువ ఉన్న కొద్ది మందీ బ్రిటీష్ వలస పాలన తాకిడికి తట్టుకోలేక వృత్తి దొంగల గానో లేక అతి చకవగా పని చేసే కూలీలగానో మారిపోయారు. వడ్డెర, ఎరుకల, యానాది తెగలు దీనికి మంచి ఉదాహరణ. పశుపోషకులలో చెప్పకోదగ్గ తెగ నీలగిరి కొండలలోని తోడ తెగ. ఆహారాన్ని ఉత్పత్తి చేసే వ్యవసాయదారులయిన తెగలు మాత్రమే ఇప్పటికీ ఏదో ఒక మేరకు నిలిచి ఉన్నాయి.

ఆర్థిక, జీవితం ఏదయినా, సామాజికి సంబంధాలలో మాత్రం గిరిజనులో సమగ్రమయిన ఐక్యత ఉంటుంది. దీనికి మూలం గిరిజనులలో భూమి. తదితర ఉత్పత్తి సాధనాలలో స్వంత ఆస్తి అనేది లేకపోవడం. బ్రిటిష్ పాలకులు దేశంలో ప్రతి గుంట భూమికీ ఒక యజమానిని గుర్తించాలని ఎంత ప్రయత్నం చేసినప్పటికీ ఈ సమిష్టి ఆస్తి సంబంధాల ఛాయలు గిరిజనులను ఇప్పటికీ వదలలేదు. ఎవరి వ్యవసాయం వాళ్ళదే అయినా సమిష్టి పద్ధతిలో చేసినట్లు అనిపిస్తుంది. అందరూ వ్యవసాయం ఒకేసారి మొదలు పెడతారు. దానికి చేయవలసిన పూజలు తంతు గ్రామం అంతా కలిసి సమిష్టిగా చేస్తారు. పంట ఒకేసారి కోస్తారు. అంగడికి గ్రామం అంతా కలిసి పోతారు. పెళ్ళయినా చావయినా సమిష్టిగానే జరుపుకుంటారు. నిర్ణీత కాలంలో పండుగలూ వేడుకలూ కూడా ఉమ్మడిగా జరుపుకుంటారు. పంట వేనేటప్పుడు పండుగ, కోతలప్పుడు పండుగ, విప్పచెట్టు పూత వేసేటప్పుడు పండుగ, వేసవి తరువాత మొదటి వర్షం కురిసేటప్పుడు పండుగ, ఇట్లా వాళ్ళ భౌతిక జీవితంలో ఒక్కొక్క ప్రముఖ సందర్భంలోనూ ఒక్కొక్క పండుగ గ్రామం. అంతా కలిసి జరుపుకుంటారు. కొన్ని పండుగల విషయంలో వాటి భౌతిక ప్రాముఖ్యతను స్పష్టంగా గుర్తించగా, కొన్నిటిని భీమదేవర పెళ్ళిగానో మరొక పురాణ పురుషుడి పుట్టకగానో జరుపుకుంటారు.

గిరిజనుల జీవితంలోని ఈ కట్టడి చాలామందిని ఆకర్షిస్తుంది. ఎందుకంటే సామ్రాజ్యవాద బూర్జువా సంస్కృతి నాగరిక సమాజాన్ని ముక్కలు ముక్కలు చేసింది. పక్కవాడు మన కళ్ళముందు చనిపోయినా మనం పట్టించుకోనంత ఒంటరి వాళ్ళను చేసింది మనల్ని. అందుకే ఈ సామ్రాజ్యవాద యుగంలో భావుకులు చాలా మంది గిరిజన సంస్కృతిలోని సమిష్టితత్వానికి ఆకర్షితులవు

తున్నారు. కాని గిరిజన సంస్కృతి ఇక్కడితో ఆగిపోదు. వాళ్ళ భౌతిక జీవితానికి ఉండే పరిమితులన్నీ అందులో ప్రతిఫలిస్తాయి. వాళ్ళకు ప్రకృతి గురించి ఉండే పరిజ్ఞానం చాలా పరిమితమయినది. కాబట్టి చాలా విచిత్రమయిన భ్రమలు ఏర్పరచుకుంటారు. కదిలే ప్రతి వస్తువులోనూ (కొన్ని కదలని వస్తువులలో కూడా) తనుకున్నట్టే ప్రాణం ఉందని భావిస్తారు. గాలిలో చెట్లలో నదులలో భూమిలో పైరులో ఉన్న ఈ జీవితో మంచిగా ఉండడం అవసరం అనుకుంటారు. దానికి తిండి పెడతారు. దానికి ఏ తిండి ఇష్టం అనుకుంటారో ఆ తిండి వెతుక్కొచ్చి పెడతారు. ఇదే క్రమంగా బలులకు (నరబలులలకు సహితం) దారి తీస్తుంది. ఆ జీవిని ప్రసన్న చేసుకోవడం కోసం నృత్యాలు చేసి పాటలుపాడతారు. గిరిజనుల నృత్యాలూ పాటలూ చాలావరకు ఈ రకంగా చిల్లర దేవతలను ప్రసన్నం చేసుకోవడమే కోసమే లౌకికమైన (సెక్యూలర్) నృత్యం గాని, పాటగాని, కళగాని గిరిజనులలో అరుదు. అందుకే కొన్ని నృత్యాలు ఎప్పుడుబడితే అప్పుడు చేయమంటే చేయరు. నిర్ణీత సమయంలోనే నిర్ణీత పద్ధతిలోనే చేస్తారు.

ఒక నృత్యం మాత్రమే కాదు. అన్నీ నిర్ణీతమయిన పద్ధతిలోనే జరుగుతాయి. భయంతో బిగుసుకుపోవడం అనే నుడికారం ఉంది. గిరిజనుల జీవితం అట్లా బిగుసుకుపోయి ఉంటుంది. భయంతో కాకపోవచ్చుగాని, తమకే అర్థంకాని విశ్వాసాలతో బిగుసుకుపోయి ఉంటుంది. పుట్టుక, పెళ్ళి చావు, ఆట, పాట, వ్యవసాయం అన్ని కూడా కచ్చితమయిన, నిర్ణీతమయిన పద్ధతిలోనే జరగాలి. ఏ మాత్రం తప్పినా ఉపద్రవం ముంచుకొస్తుంది. ఈ ప్రపంచాన్ని శాసించే అదృశ్యశక్తులను ప్రసన్నం చేసుకోవడం కోసం తామే ఏర్పరచుకున్న నియమాలు తమ నుండి పరాయీకరణ చెంది ఈ ప్రపంచాన్ని నిలబెట్టే ఒక మానవాతీతమయి చట్రంగా మారిపోతాయి. ఆ చట్రాన్ని కదిపితే ప్రపంచమే కూలిపోతుంది. ఈ మానసిక స్థితిని అర్థం చేసుకోవాలంటే ఒక విషయాన్ని గుర్తించుకోవాలి. మనలో ఆస్తికులైన వాళ్ళు కూడా తమ చుట్టూ ఎల్లప్పుడూ అదృశ్య శక్తులు మూగి ఉంటాయని నమ్మరు (రాత్రిపూట తప్ప) గిరిజనులు అట్లా కాదు. వాళ్ళ దృష్టిలో ఈ ప్రపంచమంతా అద్భుతమయిన అదృశ్యశక్తులతో నిండి ఉంటుంది. చివరికి తాము కూడా చనిపోయిన తరువాత ఎక్కడో దూరంగా ఉండే కైలాసానికో వైకుంఠానికో పోరు. వివిధ పేర్లతో పిలుచుకునే వారి మరణానంతర నివాసస్థలం దగ్గరిలోనే ఉంటుంది. (సాధారణంగా నేలకింద పాతాళంలో ఉంటుంది) చనిపోయినవాళ్ళు అక్కడ జీవిస్తూ ఇక్కడి నిత్య జీవితంలో కలగజేసుకుంటూ ఉంటారు. (అందుకే భోజనం చేసేటప్పుడు ముఖ్యంగా పండగలప్పుడు - చనిపోయిన పూర్వీకులకు రెండు ముద్దలు పిండం తీసి పక్కకు పెడతారు.) ఈ అసంఖ్యాకమైన అదృశ్యశక్తులను ఎప్పటికప్పుడు మంచి చేసుకుంటూ ఉండాలి. వాటికి కోపం తెప్పించకూడదు. తమకు ఏదయినా మంచి జరిగినా అది ఈ అదృశ్యశక్తుల ఈర్ష్యకు గురికాకుండా (దృష్టి తగలకుండా) చూసుకోవాలి. కొన్ని తెగలలో పంట బాగా పండినా సరే ఆ విషయం బయటికి తెలిస్తే అదృశ్యశక్తులకు దృష్టి తగులుతుందేమోనని ఒక పూటంతా రోదిస్తూ పంట నాశనమయిపోయిందని పాట పాడుతూ నృత్యం చేస్తారు.

నవర తెగ గిరిజనులు పెళ్ళి చేసే ముందు అమ్మాయికి మొదట విల్లంబుతో పెళ్ళి చేసి, దానిని నదిలోకి పారేసి, ఆ విధంగా అమ్మాయి. విధవ అయిన తరువాతే పెళ్ళి చేస్తారు. ఈ ఆటవిక ఆచారాలు ప్యూడల్ దశలో కూడా చాలా వరకు కొనసాగాయి కాబట్టి ఇవన్నీ ఏదో ఒక రూపంలో మనకు కూడా పరిచయమే (చిన్న పిల్లలను అందరూ ముద్దు చేస్తే 'దృష్టి' తగులుతుందని భయపడి చీపురుకట్ట కాల్చి బూడిదతో బొట్టు పెట్టి వీలయినంత అందవిహీనంగా తయారు చేస్తాము). ఈ దృష్టి భయం ఎంతగా ఉంటుందంటే గిరిజనులు ఏ వ్యవహారాన్ని సూటిగా ప్రస్తావించరు. సూటిగా ప్రస్తావించడం అహంకారాన్ని సూచిస్తుంది. అది అదృశ్యశక్తుల ఆగ్రహానికి గురయి వ్యవహారం బెడిసి కొడుతుంది. (ఇది కూడా మన ప్యూడల్ సంస్కృతిలో ఇప్పటికీ ఉన్న వైఖరే సూటిగా. బిజినెస్ లైక్‌గా వ్యవహరించడం బూర్జువా

అలవాటు). ఉదాహరణకు పెళ్ళి సంబంధం కుదుర్చు కోవడానికి అబ్బాయి తల్లిదండ్రులు అమ్మాయి ఇంటికి వస్తే ఇరుపక్షాలు అసలు పెళ్ళిమాట ఎత్తురు. పక్షుల మీద, పశువుల మీద పెట్టి మాట్లాడతారు.

కళ విషయం కూడా అంతే. గిరిజనుల జీవితం చాలా కళాత్మకంగా ఉండే మాట వాస్తవమే పాట, నృత్యం, అలంకరణ వాళ్ళ జీవితాలను పెనవేసుకొని ఉంటాయి. వాళ్ళ కళకూ శ్రమకూ మధ్య ఉండే సన్నిహితమయిన సంబంధాన్ని జార్జిథామ్సన్ లాంటి వాళ్ళు గుర్తించారు.కళ వాళ్ళు శ్రమలో పొందే ఆనందాన్ని వ్యక్తం చేస్తుంది. అలసటలను మరిపిస్తుంది. శ్రమ చేయడానికి కావలసిన ఉత్తేజాన్ని ఇస్తుంది. వారి కళలలో ఉండే లయ వారి శారీరక శ్రమలోని లయనుండి పుట్టిందేనని థామ్సన్ అంటారు. ఈ కారణం చేతనే బూర్జువా సమాజంలో కళ శ్రమ నుండి పూర్తిగా వేరుపడి మార్కెట్‌లో సరుకుగా మారడంతో అసంతృప్తి చెందిన భావకులు చాలా మంది ఆటవిక జీవితాన్ని ప్రశంసిస్తారు. కాని ఇక్కడ కూడా గుర్తించుకోవలసిన విషయం ఒకటి ఉంది. గిరిజనుల నృత్యం, పాట, చిత్రలేఖనం, అలంకరణ మొదలైన కళలకు శ్రమ సంబంధమయిన ఆనందంతోను ఆలసట లతోను, ఉత్తేజంతోను ఉండే సంబంధం అవ్యక్తమయి నది కళ యొక్క వ్యక్తమయిన పాత్ర, అంటే దాని సామా జిక పాత్ర, గిరిజనుల జీవితంలో దాని ప్రాముఖ్యత వేరే ఉంది. అదేమిటంటే వాళ్ళు నమ్మిన దేవతలను ప్రసన్నం చేసుకోవడం ద్వారా గానీ మంత్రం ద్వారా గానీ శ్రమ ఫలాన్ని ఇనుమడింపజేయడం.

వేటాడే గిరిజనులు తమ ఇళ్ళ గోడల మీద జంతువు లను వేటాడి చంపుతున్నట్లు బొమ్మలు వేస్తారు. వ్యవ సాయం చేసేవాళ్ళు పంట చేతికొచ్చే సమయం ఆసన్న మయితే పంట కోస్తున్నట్లు అభినయిస్తూ నృత్యం చేస్తారు. ఇందులో తమ శ్రమకు కళాత్మకరూపం ఇచ్చుకోవడం అనే మానవీయ ప్రక్రియ అవ్యక్తమయినది. దాని వల్ల వాళ్లు పొందే ఉత్తేజం కూడా అవ్యక్తమయిన ఫలమే వీటి వ్యక్తమయిన ప్రయోజనం గిరిజనుల మూడనమ్మకాలతో ముడిపడి ఉంటుంది. వేట జంతువులను చంపుతున్నట్లు బొమ్మ వేస్తే నిజంగానే ఆ ఫలితం దక్కుతుందన్న నమ్మకం గిరిజనులలోఉంటుంది. పంట కోస్తున్నట్లు అభినయిస్తే పంట నిజంగానే పుష్కలంగా పండుతుందని ఆశిస్తారు. ఆదిమ మానవ మనస్తత్వం ఒక వస్తువుకూ ఆ వస్తువు యొక్క ప్రతి రూపానికి (అది చిత్రపటం గాని,నృత్యం అభినయంలోని దృశ్యమే గాని, చివరకి కృత్రిమంగా తాము ఏర్పారచుకున్న సంకేతాలయినా గాని) తేడా చూడదు. ప్రతి రూపానికి ఏం జరిగితే వస్తువుకూ అదే జరుగుతుందని నమ్ముతుంది. ఇది చాలా అది మమయిన మంత్రం అంటారు. (చేతబడి దీని అవశేషం). తరువాతి కాలంలో చిలవలు వలవలై అభివృద్ధి చెందిన మంత్రతంత్రాలన్నిటికీ మూలం.

గిరిజనుల కళా జీవితమంతా కూడా ఇంతే. ముగ్గులు పెట్టడంలో ఉన్న సౌందర్య దృష్టి అవ్యక్తమయింది. వాటి అసలు ఉద్దేశ్యం దుష్ట శక్తులను దూరంగా ఉంచడం. అలాగే పచ్చలు పొడిపించుకోవడంతో వాళ్ళ అసలు ఉద్దేశం చనిపోయిన తరువాత దయ్యాలు తినకుండా శరీరాన్ని కాపాడుకోవడం మరి వీటిలో కళ లేదా, సృజ నాత్మకమయిన ఆనందం ఉన్నాయి. కాని ఆ కళ, ఆ నందం వాళ్ళ విశ్వాసాల పరిభాషలోనేరూపం తీసు కుంటాయి. గిరిజనుల ఆలోచనలలో వాళ్ళ విశ్వాసాలు ఎంత బలంగా అల్లుకుపోయి ఉంటాయంటే వాళ్ళ శ్రమను, కళాకాంక్షను సృజనాత్మకతను, విశ్వాసాలను వేరు చేయడం సాధ్యంకాదు. కళను నిజంగా శ్రమ యొక్క ప్రత్యక్ష వ్యవస్థీకరణగా ఒక గిరిజనుడు సృష్టించదల్చుకొన్న అది అతని విశ్వాసాల నుడికారంలోనే రూపం తీసు కుంటుంది. అంతిమంగా ఆ నుడికారంలోనే అతనికి అది అర్థవంత మవుతుంది.

ఆధార గ్రంథాలు :

కె.బాలగోపాల్ - ఆదివాసులు, వైద్యం సంస్కృతి అణచివేత - చరిత ఇంప్రెషన్స్, హైద్రాబాద్.

ఐక్యతకు చిహ్నం తాండాల్లోని దీపావళి పండుగ

– బసినేని శ్రీనివాసులు, పరిశోధక విద్యార్థి, తెలుగు & తులనాత్మక సాహిత్య అధ్యయనశాఖ,
శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

ప్రపంచ సాహిత్యంలో ఏ సమాజానికైనా వారి ఆట పాటలకు, కళలకు మూలం జానపదులు లేక వారి సంస్కృతి మూలాధారమన్న విషయం ఎవరూ మరవ లేనిది. కాబట్టి ఈ జానపదవిజ్ఞానాన్ని అనంతమైనదిగా చెప్పడం అందరికి తెలిసిన విషయమే. ప్రస్తుతం మనం అధ్యయనం చేస్తున్న జానపదసాహిత్యం, జనపద విజ్ఞా నంలో ఒక భాగం. ఈ జానపదవిజ్ఞానం మానవ శాస్త్రం, సామాజికశాస్త్రం, అర్థశాస్త్రాలతో సమన్వయించ బడి భవిష్యత్‌లో మంచి పురోగమనాన్ని సాధించగలదని జానపద విమర్శకుల నమ్మకం.

శిష్టసాహిత్యానికన్న ముందు మౌఖికసాహిత్యం ప్రతి సమాజంలోనూ ప్రచారంలో వుందన్న విషయం అందరికి తెలిసింది. అయినా విద్యావంతులు జానపద విజ్ఞానం మరియు జానపద సాహిత్యంపై నిరాదరణ చూపడం వలన అది అనాదృత సాహిత్యమైంది. అనాదృతమైంది కాబట్టి కొందరు దీన్ని మృతసాహిత్యమని ఎద్దేవా చేస్తు న్నారు. ఇలాంటి వాళ్ళకు "జానపద సంస్కృతి, జానపద కళలు, జానపదుల ఆహారమైన నజ్జ, జొన్న, కొర్ర, సాములు, రాగులు మొదలైన చిరుధాన్యాలు ఒకప్పటి జాతికి అదిపట్టుకొమ్మలు" అనే విషయం నాగరికులకు ఇప్పుడిప్పుడే అర్థం అవుతుందని చెప్పవచ్చు.

పొరుగు రాష్ట్రమైన తమిళనాడులో మౌఖిక సాహిత్యం గ్రంథస్తమైనంతగా తెలుగులో కాలేదు. కాబట్టి అట్టడుగు వర్గాల్లోని కళాకారుల కళలు గురించి, భిక్షుకగాయకుల మూలాలు గురించి వీరి సంస్కృతి గురించి ఇంకా అధ్య యనం జరగవలసి వుంది. ఇలాంటి అధ్యయనాల వల్ల వీరే తరతరాలుగా భారతీయ సంస్కృతి మూలాల పరిరక్ష కులు అన్న వాస్తవాలు, జానపద విజ్ఞానం, జానపద సాహిత్య విజ్ఞానం ద్వారా శిష్టులకు తెలిసే అవకాశం వుంది.

భారతదేశం విభిన్న కులాల సంఘమ కూడలి. ఒక్కో సామాజిక వర్గానికి (కులానికి), ఒక్కో సంస్కృతి వుంది. ఈ భిన్న కులాల సంస్కృతీ సమాహారంలో ఏకత్వాన్ని ఆత్మగా నిలుపుకుంటూ భారతదేశం మనుగడ సాగిస్తుం దన్న విషయం కులాల సంస్కృతుల అధ్యయనం వల్ల స్పష్టం కాగలదు. కాబట్టి ఈ కులవిజ్ఞానం (క్యాస్ట్‌లోర్) జానపద విజ్ఞానం (ఫోక్‌లోర్)లో భాగం.ఈ కులవిజ్ఞానం అనే కోణంలో ఏ సమాజాన్ని అధ్యయనం చేసినా వారి వ్యష్టి సంస్కృతీ మూలాలతోపాటు భారతీయ ఉమ్మడి సంస్కృతుల మూలాలుకూడా గోచరిస్తాయనడంలో సందేహంలేదు. ఈ విషయాలు లంబాడీ సంస్కృతిలో భాగమై దీపావళి పండుగలలో ఏ విధంగా ప్రతిబింబిస్తు న్నాయో గమనిస్తాం.

హిందువులు ఏయే మాసాల్లో, ఏయే ఋతువుల్లో, ఏ పర్వదినాల్లో పండుగలు చేసుకొంటారో, అదే కాలంలో కూడా సుగాలీలు కూడా చేసుకుంటారు. హిందువులు జరుపుకొనే పండగలే కాక, రాజస్థాన్, మహారాష్ట్ర గుజ రాత్‌లలో కనిపించే పండుగలు కూడా వీళ్ళు జరుపు కోవడం కూడా కనిపిస్తుంది. హోళీ, తీజ్ లాంటి పండు గలు రాష్ట్రేతర పండుగలు అయితే దీపావళి, ఉగాది, దసరా మొదలగు పండుగలు మనరాష్ట్రానికి చెందిన పండుగలుగా గుర్తించవచ్చు. ప్రస్తుతం దీపావళి గురించి చర్చించుకుందాం.

సుగాలీల ఐక్యతకు చిహ్నం దీపావళీ పండుగ :

భారతదేశ వ్యాప్తంగా జరుపుకొనే దీపావళి పండుగ తాండాల్లోని పురుషుల హడావిడి కన్న, స్త్రీల హడావిడే

ఎక్కువ. (హొళి పండుగలు యువకుల పురుషుల హడావిడి) వీరు చేసుకొన్న దీపావళి పండగలో కొన్ని ముఖ్యమైన ఆచారాలు కన్పిస్తాయి. అవి : తమ పూర్వీకులకు ముందుగా పూజ చేస్తారు. ఈ పూజా కార్యక్రమాన్ని "ధపకార్‌దేర్" అంటారు. ఈ పూజలో ఒక జంతువును బలి ఇచ్చి పెద్దలకు నైవేద్యం పెడతారు. ఈ నైవేద్యంలో వారికి అలవాటు వున్న కల్లు, సారాయి కూడా పెడతారు. ఈ తంతును "కాళీమాస్" అంటారు. దీపావళి సాయంత్రం రోజున లక్ష్మీపూజ చేయడం వీరికి తప్పనిసరి. తదనంతరం ఆడపిల్లలు చేతిలో దీపాలు పెట్టుకొని చనిపోయిన తమ ఇంటి పెద్దల ఆత్మలకు, కులదైవాలకు పేరుపేరున యిలాగే పాటలు పాడుకుంటూ తిరుగుతారు.

మారికోదేళి ఘణదోదేళి వరసేదాడేరి
ఆయియోమారి కోదేళి
కోదవాళి వరసేదవాలి
బాపులోన మేర యాడిలోన మేర

అర్థం :

ఓ నా దీపావళీ నీవు సంవత్సరానికి ఒక్క సారి వస్తావు. మమ్మల్ని చూసి పోతావు తల్లీ! ఈ సందర్భంలో నీ సమక్షంలో మా పూర్వీకులకు దీపాలతో హరతి ఇస్తూ దీపావళి తల్లి మమ్మల్ని రక్షించుగాక. అని పైపాటకు అర్థం. అంతేగాకుండా తమ చుట్టుప్రక్కల తమకు పరిచయమైన వాతావరణాన్ని, మచ్చిక చేసుకొన్న జంతువులు వ్యవసాయ సంబంధమైన అవులు, ఎద్దులు పేర్లు కూడా ఈ పాటలో ప్రస్తావించుకోవడం పరిపాటి.

పై విధంగా పాటలు పాడుతూ, గడపగడపకు పోవటాన్ని వీరి పరిభాషలో "మేథా పరేరో" అంటారు. ఈ పాటలు పాడుతూ, తిరుగుతూ వున్నప్పుడు దేవత (దవాళీ) బంధువులని స్నేహితులని తమ దగ్గరవున్న పెంపుడు జంతువులను చుట్టుపక్కల వారిని కాపాడమని ప్రతి ఒక్కరి పేరునే కాక జంతువులను కూడా సంభోదిస్తూ కాపాడమని వేడుకొంటారు. ఆరాత్రి అందరి ఇళ్ళ ముంగిళ్ళలోనూ హారతి పడుతూ పాటలు పాడుతుంటారు. ఆ ఇంటి యజమానుల హారతి పళ్ళెంలో కానుకలు కూడా వేస్తుంటారు. ఒక వేళ ఆ రాత్రి ఇంట్లో ఎవరైనా లేనట్లైతే ఖచ్చితంగా ఉదయాన్నే వెళ్ళి వారి ఇంటిముందు హారతి పట్టి, పాడుతుంటారు. ఒక వేళ ఎవరైనా ఇంట్లో వుండి కూడా ఆ యింటి ముందు పాటలు పాడటం మరచి పోయినట్లయితే ఉదయం గ్రామపెద్ద సమక్షంలో వారిని మన్నింపుకోరి పాటలు పాడతారు. ఈ విధంగా పాడడం వారి ఐక్యతకు చిహ్నంగా భావించుకోవచ్చు. ఇలాంటి విన్నపాలు వీడుకోలు "మేరా" అనే పాటల కార్యక్రమంతో ముగుస్తుంది.

రాత్రి కార్యక్రమం ముగిసిన వెంటనే తెల్లవారుజామున చనిపోయిన పెద్దలకు పూజచేసి కొత్తబట్టలు పెడతారు. అక్కడే హోమగుండం ఏర్పాటు చేసుకొని పిండి పాయసం, నెయ్యిని తమ చనిపోయిన పూర్వీకుల పేర్లు చెబుతూ వాటిని హోమంలో వేస్తుంటారు. చివరగా కొబ్బరికాయ నైవేద్యంతో ఆ తంతు ముగుస్తుంది. ఈ విధంగా పెద్దలకు చేసే పూజలో పాటలు కూడా ఇలా పాడుకుంటారు.

ఉదే ఉదే మసకార్ బాపు!
హమేనా మసకార్ నానే మోటేర్ వెజావొ!
ఎకేర్‌వీస్ కరజీ కోడివేలెర్‌జూ, వదారజీ
దికాళ్‌మతేర్ మన్కి పంచుకజాయ
భోళ భోళ రేగేచా, మోట్ మోట్ డగరెగేచ,
పంచూక జాయా, తంమత్‌చూకో?
హమర్ వేల్ వాడిన దొక్కకాట్ సొక్కకరో
వాళ మంగళా టాళన్ దీనేజకోపూజ పూంజకర్లో!

అర్థం :

ఓ పెద్దలారా! మమ్మల్ని మా చిన్న పిల్లల్ని కాపాడండి. ఒకటికి ఇరవై అయ్యేటట్లు మా వంశాన్ని కాపాడండి. నేతి బీరకాయ తీగ ఒక్కటే అయినా కాయలెన్నో! అదే

విధంగా మావంశం అభివృద్ధి కావాలి. మేము తప్పులు చేసినా మీ పెద్దమనసుతో మన్నించండి. పిల్లలు వుండి పోయాము. పెద్దలు మీరు వెళ్ళిపోయారు. మా పశువులను తోటదొడ్డిని, కరువు కాటకాలనుండి కాపాడండి. కష్టాలు రానీకుండా చూడండి. మేము ఇస్తున్న ఈ పూజను దయతో అంగీకరించండి. ఈ మాటలు వీరి వ్యవసాయ సంస్కృతికి నిదర్శనం.

పవిత్రతకు చిహ్నం దీపావళీ :

దీపావళి రోజున సుగాలీలు చేసే పండుగ తంతులో, ఐక్యత పెద్దల పూజలో నిబద్ధత, పవిత్రత కన్పిస్తాయి. దీపావళీ రోజున వీళ్ళకు ఏమైనా శారీరక రుగ్మతలు కలిగినట్లైతే ఈ పండుగ అచ్చిరాలేదని నమ్ముతూ, మరో యేడాది చేసుకొనే దీపావళి పండుగకు తమ తప్పిదంగా జంతువును బలి ఇస్తామని మొక్కుకుంటారు. దీపావళి రోజున వారి శక్తి కొద్దీ టెంకాయలకొట్టడం వీరి ప్రత్యేకత దీపావళి పండుగను ఒక దేవతగా సంభావించడం వీరి పవిత్రకు చిహ్నం.

గో సంస్కృతికి చిహ్నం దీపావళి పండుగ :

దీపావళి రోజున పెళ్ళీడుకు వచ్చిన లంబాడీ యువతులు గో రథం పేరుతో ఉపవాసదీక్షను చేయడం కూడా వీరి ప్రత్యేకత. సూర్యోదయంతోనే స్నానం చేసి, శుభ్రమైన బట్టలు ధరించి, బుట్ట నిండా పూలు సేకరించికొని తాండాలోని ప్రతివీధి తిరుగుతారు. ప్రతి ఇంట పశువుల కొట్టంలో గొబ్బెమ్మలు పేర్చి, తమ బుట్టల్లోని పూలతో గొబ్బెమ్మలకు అలంకరిస్తారు. తరువాత పశువులను తాండా చుట్టూతిప్పి ఏవైనా తిండి పదార్థాలను (లాప్సీ) ప్రసాదంగా స్వీకరించడంతో గోరథం ముగుస్తుంది. తాండాలో జరిగే గోరథం, వారి గోసంపదను సూచిస్తుంది. అంతేకాకుండా హిందూసమాజానికి గోవు ఎంతో పవిత్రమో ఆ సమాజంలో అంతర్భాగమైన బంజారాలకు కూడా గోవు అంతే పవిత్రం అని తెలుస్తుంది. కాబట్టి దీపావళి పండుగ తండాలోని స్త్రీలకు ప్రత్యేకమైన పండగగాను, వారి ఐక్యతను నిలిపే పండగగాను భారతీయ సంస్కృతిని ప్రతిబింబింప చేసే పండగగాను భావించవచ్చు.

❁❁❁

చివరిగుడిసె నవలలో ప్రతిఫలించిన యానాది జీవన చిత్రణ

– జి. బొలచంద్రు, పరిశోధక విద్యార్థి, తెలుగు & తులనాత్మక సాహిత్య అధ్యయన శాఖ,
శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

గిరిజనులు సామాన్యంగా అడవుల్లో కొండ ప్రాంతాలలో నివసిస్తుంటారు. వీరిని ఆదివాసులు, ఆటవికులు, వనవాసులు, గిరిజనులు అని పలురకాలుగా పిలుస్తుంటారు. దేశమూల వాసులనే ధ్వనితో ఆదివాసులని కూడా వ్యవహరిస్తుంటారు.

భారతదేశంలో మొత్తం ఆటవికుల తెగలు 570 వరకు ఉన్నాయని అంచనా వేయబడింది. ప్రతి రాష్ట్రంలోనూ ఆటవికులున్నా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా, కర్ణాటక మొదలైన చోట్ల ఎక్కువ తెగలు నివసిస్తున్నారని అంచనా. ఈ రాష్ట్రాలలో ఒక్కొక్కదానిలో దాదాపుగా 60కి పైగా తెగలు నివసిస్తున్నాయి. అలాగే మనరాష్ట్రంలో కూడా దాదాపు 33తెగలున్నాయని పరిశీలకులు భావిస్తున్నారు. అందులో యానాది తెగ ఒకటి.

యానాది అనే పదం 'అనాది' అనే సంస్కృత పదం నుంచి వచ్చినట్లుగా భావింపబడుతోంది. అనాది అంటే మొదలు లేనిది అని అర్థం. నెల్లూరు, చిత్తూరు, కడప, గుంటూరు, ప్రకాశం జిల్లాలో వీరు ఉన్నప్పటికీ నెల్లూరు, చిత్తూరు జిల్లాలో కాస్త ఎక్కువగా వున్నారు. అయితే ఈ తెగల (యానాదుల) గురించి ఆధునిక తెలుగు సాహిత్యంలో కథ, నవల వంటి ప్రక్రియల్లోకథా వస్తువుగా సాహిత్యంలో చోటు చేసుకుంది. ప్రముఖ కథ, నవలా రచయిత డా. కేశవరెడ్డిగారి 'చివరి గుడిసె' నవలలోని కథావస్తువు యానాదుల జీవనవిధానం. దీన్ని తెలియ జేయడమే ఈ వ్యాసం ప్రధానోద్దేశ్యం.

రాయలసీమ ప్రాంత గ్రామీణవ్యవస్థలోని లోతు పాతుల్ని, ఒడుదుడుకుల్ని, అక్కడ జరుగుతున్న సంఘర్షణను నిశితంగా పరిశీలించి, సజీవచిత్రణ చేసిన అతి కొద్దిమంది రచయితల్లో డా॥ కేశవరెడ్డి ఒకరు. ఈయన చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలానికి చెందిన 'తలుపులపల్లె' అనే గ్రామంలో మధ్యతరగతి రైతు కుటుంబీకులు. పెనుమూరు రంగారెడ్డి, అమ్మణ్ణమ్మ దంపతులకు 1947 మార్చి 10న జన్మించాడు.

కేశవరెడ్డి తన అయిదో యేట 1952లో తలుపుల పల్లె గ్రామంలో వున్న ప్రాథమిక పాఠశాలలో చేరి అక్కడ తన కిష్టగురువైన సత్తార్ అనే ముస్లిం టీచర్ దగ్గర ప్రాథమిక విద్య పూర్తి చేశాడు. ఉన్నత విద్య కోసం తలుపుల పల్లెకి 5కి.మీ దూరంలో మండల కేంద్రమైన పూతలపట్టులో వున్న హైస్కూల్లో 1959లో చేరాడు. 5సంవత్సరాలు కాలినడకన నడిచి ఆరో తరగతి నుండి యస్.యస్.సి వరకు చదువుకున్నాడు. హైస్కూల్ దశలో కేశవరెడ్డి చురుగ్గా వ్యవహరిస్తూ, పాఠ్యపుస్తకాలతో పాటు ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, భారతి మొదలైన వార, మాస పత్రికలలోని కథల్ని సీరియల్స్‌ను ఓపిగ్గా చదివేవారు.

1965లో ఎస్.ఎస్.యల్.సి. పూర్తి చేసి తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పి. యు. సి లో చేరాడు. ఆ రోజుల్లోనే కథలు రాయడం ప్రారంభించాడు. ఇలా వుంటూ 1969లో ఉన్నత శ్రేణి మార్కులతో పి.యు.సి పాసయ్యాడు. ఆ మార్కుల ఆధారంగా ఇతనికి తమిళనాడు ప్రక్కనే వున్న కేంద్రపాలలిత ప్రాంతమైన పాండిచ్చేరిలో మెడికల్ కాలేజీలో సీటు వచ్చింది. అక్కడ మెడిసిన్ కోర్సులో చేరాడు.

ఆ తర్వాత కేశవరెడ్డికి పాండిచ్చేరిలో మెడిసిన్ పూర్తి చేశాక వెంటనే ఉద్యోగం రాలేదు. ప్రవేట్ ప్రాక్టీసు పెడదామంటే వ్యవసాయదాయంతో బతికే మధ్యతరగతి కుటుంబీకుడవడం వల్ల తగిన పెట్టుబడి పెట్టే ఆర్థిక స్తోమత లేకపోయింది. ఫలితంగా తాత్కాలికంగా కేశవరెడ్డికి

భోజనం, వసతి సదుపాయాలు వెతుకోవలసి వచ్చింది. ఒక సీనియర్ విద్యార్థి సలహా మేరకు పాండిచేరి మెడికల్ కాలేజిలో ఉన్న (ఐ.సి.ఎం.ఆర్) "ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్" అనే ప్రాజెక్టులో "రీసెర్చ్ అసిస్టెంట్"గా చేరాడు. ఆ తర్వాత రెండేళ్ళకు తెలంగాణా ప్రాంతం నిజామాబాద్ జిల్లా, డిచ్‌పల్లి లోని విక్టోరియా రాణి హాస్టల్‌లో 1977లో డాక్టర్‌గా ఉద్యోగంలో చేరాడు. తర్వాత అక్కడే ఉద్యోగంలో చేరిన ధీరమతి అనే క్రైస్తవ యువతిని ప్రేమించి, 1977లో వివాహం చేసుకున్నారు.తన జీవితంలో ఈ విధమైన అభ్యుదయ భావాలు కలిగిన కేశవ రెడ్డి రచనావ్యాసంగం మొదలెట్టాడు. 1970-71 లో కథలు రాసి, 1975లో 'ఇన్‌క్రెడిబుల్ గాడెస్' అనే మొట్ట మొదట నవల రాశారు.తర్వాత అతడు అడవిని జయించాడు, చివరిగుడిసె, మునెమ్మ, మూగవాని పిల్లనగ్రోవి, శ్మశానం దున్నేరు, సిటీ బ్యూటిపుల్, రాముడుండాడు రాజ్జెముండాది వంటి రచనలను కేశవరెడ్డి తెలుగు సమాజానికి అందించి, అనతి కాలంలోనే ఉత్తమ రచయితగా పాఠకలోకం తన స్థానాన్ని చిరస్థాయిగా నిలుపుకున్నారు. ప్రస్తుతం చివరిగుడిసె నవలలోని యానాదుల జీవన చిత్రణను చూద్దాం.

నవలా రచయిత తీసుకున్న యానాదుల జీవితం చిత్తూరు ప్రాంతానికి సంబంధించినది. ఈ ప్రాంతపు యానాదుల జీవనాన్ని, వారి ఆహార పద్ధతులు, వారి అలవాట్లు, వారు భూస్వాముల చేతులో ఏవిధంగా పీడింప బడుతున్నారో వివరించారు కేశవరెడ్డిగారు.

'చివరిగుడిసె' నవల ప్రారంభంలో **కేశవరెడ్డికి శ్రోతగా...** అన్న శీర్షికలో ప్రముఖ రచయిత వాడ్రేవు చినవీరభద్రుడుగారు నవలా ప్రాశస్త్యాన్ని గురించి, రచయిత కథా విధానం మరియు రచనా విధానాన్ని గురించి చెబుతూ "తన మొదటి కథల్లోలానే ఇందులో కూడా గ్రామంలోని అగ్రవర్ణాలకూ, నిమ్నవర్గాలకూ జరిగే సంఘర్షణే స్థూల ఇతివృత్తం. కాని ఈసారి కథాకాలం దాదాపు యాభై ఏళ్ళ వెనక్కు జరిగింది. అక్కడ నుండి మరొక ఇరవై ఏళ్ళు వెనక్కుపోయి చెప్పుకొస్తాడు కథని. అంటే సుమారు 1925 నుండి 45 మధ్యకాలంలో జరిగిన కథ. స్పష్టంగా తేదీలు ఇవ్వకపోయినప్పటికీ ఈ కథలోని ప్రతి సంఘటనా తన నిర్దిష్ట చారిత్రిక నేపథ్యాన్ని ఎంతో స్పష్టంగా ప్రకటిస్తూనే వుంటుంది" అన్నారు.

ఆంధ్రదేశంలోని నల్లమల అడవుల నుండి నెల్లూరు సముద్రతీరం దాకా విస్తరించి వున్న సంచార గిరిజన తెగ యానాదులు సామాజిక పరిణామంలో ఆహారసేకరణ దశకు చెందిన జాతి. ఏళ్ళ మీదట వారి చుట్టూతా సమాజం వివిధ ఆర్థిక దశల్ని దాటుతూ స్థిర వ్యావసాయిక జీవితంలోకి స్థిరపడిన వందల యేళ్ళ తరువాత కూడా యానాదులు తమ ప్రాచీన ఆర్థిక విశ్వాసాలకే అంటిపెట్టుకొని వుండిపోయారు" (చిన వీరభద్రుడు వాడ్రేవు - కేశవరెడ్డి శ్రోతగా - చివరి గుడిసె - పుట 3,4)

'ఒట్టి యానాదుల జీవితం గురించి, పీడన గురించి రాయడానికి మాత్రమే రచయిత ఈ కథ రాసాడనుకోను. తాను తొలి నుంచీ ప్రయత్నిస్తున్న స్థూల, సూక్ష్మ పోరాటాల అత్యంత సువిశితమయిన చిత్రణకి ప్రయత్నించడేమే ఈ ఇతివృత్తంలోని బలం. భూసామికీ, ఆహారాన్ని ఏరుకుని తినే యానాదికీ మధ్య సంఘర్షణ భూమి కథ. యానాది చేనునీ, అతని శ్రమనీ, అస్తిత్వాన్నీ, ఆత్మ విశ్వాసాన్నీ అన్నిటినీ కొల్లగొట్టాడు భూస్వామి. యానాది తన కళ్ళ ముందున్నంతకాలం తన దౌర్జన్యం తనకు గుర్తుచేస్తున్నట్లుంటాడనేమో, యానాదులందర్నీ పూరి నుంచి తరివెయ్యడం ఒ కగ్రామానికే చెందిన యాదృచ్ఛిక సంఘటన కాదు. సాపేక్ష పురోగామి సమాజాలు తమ పాత పితృసమాజాల్ని ఎప్పుడూ ఇలాగే నిర్మూలిస్తూ వచ్చాయి.

వెన్నెలకంటి రాఘవయ్య ఇలా రాస్తున్నారు "యానాదులు గురించి తెలుసుకుంటున్నప్పుడు వాళ్ళు రాజకీయంగా గానీ, సాంఘీకంగా గానీ, ఏకీకృతమైన వాళ్ళు కానీ ఒక ప్రదేశాన్ని ఆక్రమించుకోవడానికి స్వయం నిర్ణయం చేసుకోగల వాళ్ళు కానే కారని గుర్తు చేసుకోవాలి.

జీవితంలో ఒక్కలాంటి ఒడిదుడుకులే పడుతూ, సమాజం చేత నిర్లక్ష్యం చెయ్యబడి, ప్రభుత్వం పట్టించుకోని అనేక మంది వ్యక్తులు ఒక సాముదాయకమయిన పేరుతో పిలవబడుతున్న అభాగ్యులుగానూ తక్కిన సమూహాలకు చెందిన మనుషుల్తో పోటీపడలేని అశక్తులుగాను మాత్రమే వాళ్ళని బాగా అర్థం చేసుకోగలం'' (వెన్నెలకంటి రాఘవయ్య - యానాదులు - పుట : 79)

రచయిత కథను నిర్మించడానికి యానాదుల జీవితాన్ని ప్రధానంగా తీసుకున్నప్పటికీ, వారి వృత్తులను తెలుపుతూ, ఆహార సేకరణే వారి ప్రధానవృత్తి అని చెబుతారు. అందుకే మన్నుగాడు చిన్నోడితో ''పెరట్లోకి పోయి మొకం కడుక్కో మనం బిన్నె బయలుదేరాల. ఎండ బారడెక్కిందంటే ఉడతలు చెట్లు దిగేస్తాయి'' అన్నాడు. మరొక చోట చిన్నోడు ఇసుకపైన వున్న అడుగులను కుందేలువేమో అని, చూస్తుంటే మన్నుగాడు ''నీ తెలివి మండ. అవి కుందేలు అడుగులని యట్టనుకుంటివిరా'' అన్నాడు. తండ్రి మాటలను పరిశీలించిన చిన్నోడు కాసేపు ఆలోచించి, ''ఔ, నువు చెప్పేది నిజమే. ఐతే ఇవి పిల్లి అడుగులో, కుక్క అడుగులో అయ్యుండాలా'' అన్నాడు. మన్నుగాడు ''యానాది పుటక పుట్టివి. ఇరవైయేండ్లు వయసొచ్చింది. ఈనాటికీ నువ్వు పిల్లి అడుగుల్ని, కుందేలు అడుగుల్ను పోల్చుకకపోతే యట్టరా.'' అని ఒక తండ్రి తన కొడుక్కి తనకు తెలిసిన వృత్తిలో విషయాలు తెలుసుకోవల్ల అనే తపన కన్పిస్తుంది. మరో చోట కూడా ''సిగర చెట్టు ఎక్కనంటున్న చిన్నోడితో ''మన్నుగాడు కొడుకు వైపు ఉరిమి చూసి ''సిగర చెట్టు ఎక్కమంటే కొమ్మలు పెళుసంటావు. తుమ్మ చెట్టు ఎక్కమంటే ముండ్లు గుచ్చుకుంటాయంటావు. నువ్వు యానాదోని కడుపున పుట్టాల్సినోడివి కాదురా. యాడనో మారాజుల కడుపున పుట్టాల్సినోడివి.'' అంటున్న మాటల్లో కొడుకు పట్ల తండ్రి తనకున్న నిస్సహాయతను ప్రకటిస్తున్నాడు.

కానీ కొన్ని విషయాలలో చిన్నోడుని తన తండ్రి మెచ్చుకోవడం కూడా ఈ నవలలో కన్పిస్తుంది. ముణ్ణగం వరి పొలంలో ఎలుక రంధ్రాలు త్రవ్విన చిన్నోడు గురించి బైరాగికి మన్నుగాడు ఇలా చెప్పుతాడు. ''ఇంగెవడన్నా ఐతే తెల్లవారేదాకా తొవ్వుకుంటానే ఉండును. మన పిలగోడు గాబట్టి గెడిసేపిట్లో తొవ్వేసినాడు. నేను బొక్కలుండే తావులు జూపించి గునపం చేతికిచ్చినానంతే. పిలగాడు బొక్కలన్నీ పంది మాదిరి కూరాడేసినాడు'' అన్నాడు మన్నుగాడు.

యానాదుల ఆహారం కుందేళ్ళు, ఉడతలు, ఎలుకల్ని పట్టుకొని నిప్పులల మీద కాల్చి తినటం ఈ నవలలో చిన్నోడు కుందేలు మాంసం ఎలా వుంటుందో చంకలెగరేసుకుంటూ వాళ్ళ నాన్న (మన్నుగాడు)తో ఇలాఅంటాడు. ''అవి కుందేలు అడుగులయ్యుంటే ఎంత బాగుండు నాయనా. ఈపాటికి వలేసి పట్టేసుందుం. కుందేలు మాంసం తిని ఎన్నాళ్ళయింది నాయినా. ఈసారి కుందేలు దొరికితే దాని మాంసం నూనెలో వేయించి తిందం నాయనా. కమ్మగా ఉంటుంది'' అన్నాడు. (పుట-15)

మణియం వరిచేలో ఎలుకల్ని పట్టడానికి వెళ్ళిన మన్నుగాడు కావలి దగ్గర గుడిసెలో వుండగా, తన తండ్రి గుర్తు పెట్టిన బొక్కలన్నీ తవ్వి ఒక తట్టలో ఎలుకలు, మరొక తట్టలో వడ్లగింజలు తీసుకొని, చిన్నోడు సంతోషంతో పండ్లికిలిస్తూ, ''ఎలుకలే గాదు. తట్ట అడుగున నాలుగు యంటవలు గూడా ఉండాయి. ఒక్కొక్కటి పంది పిల్లలంత ఉండాయి'' అంటే కావలి వాడు ఇంకేం పండుగ చేసుకోండి అంటాడు. సంతోషంతో ఇంటికొచ్చిన మన్నుగాడు, బైరాగితో ఈరోజుమనం పండుగ చేసుకోవల సావి అంటాడు. అంతలో చిన్నోడు తట్టలో వడ్లను దోసెళ్ళతో తీసి రోట్లోపోసి దంచసాగాడు. వాడు రోటి చుట్టూ తిరుగుతూ బలమైన చేతులతో దంచుతుండగా వడ్లు బియ్యంగా మారసాగాయి.

మట్టిపాత్రలలో అన్నం కూర ఉడుకుతున్నాయి. మన్నుగాడి చిన్నోనితో ''ఒరే సిన్నోడా, నువ్వొక కుశాల పాట పాడరా అంటాడు. అంటే అంత అర్ధరాత్రి సమయంలో కూడా యానాదులు ఎంతో ఉత్సాహాన్ని చూపిస్తారు అని తెలుస్తున్నది.

"1927లో నెల్లూరుజిల్లా కలెక్టరు 200మంది యానాదులకు సులభంగా తరిసాగు కాగల బీడు భూములు కేటాయించారు. ఆ భూముల్ని సాగులో పెడితే ఎకరం వెయ్యి రూపాయలు ఖరీదు చేసే స్థితిలో వున్న, యానాదులు తమకిచ్చిన భూముల్ని ఎకరం అర్ధ రూపాయి చేసి అమ్ముకున్నారు. - (సత్యనారాయణ కంభంపాటి - ఆంధ్రుల చరిత్ర) యానాది కుటుంబాలు గ్రామంలో ఉండటం సహించలేని భూస్వాములు వారి మీద నేరారోపణలు చేసి, వారి పొలాలను ఆక్రమించుకొని ఎటువంటి విపత్కర పరిస్థితికి గురిచేస్తారో రచయిత పాఠకుల కళ్ళకు కట్టినట్లు చూపడంలోనే ఈ కథా తీరు ప్రసన్నమైతుంది.

యానాదులు ఆర్థికంగా అభివృద్ధి చెందలేదని వారు ఇంకా పేదరికంలో మగ్గుతున్నారని కేశవరెడ్డిగారు ఈ నవలలో ఆద్యంతం చిత్రించారు. అడవుల్లో కొండల్లో తిరుగుతున్న తిరుగుతున్న యానాదులు ఒక స్థిరనివాసం ఏర్పర్చుకొనేవారు కాదు. అయితే వారి సంచార జీవనాన్ని గుర్తించిన జార్జిదొర (కలెక్టరు) వారికి గుడిసెలు వేయించాడు. వారికి పొలాలు కూడా ఇప్పించి, వారి చేత సేద్యపు పనులు కూడా చేయించాడు. ఆ విషయాన్నే బైరాగితో మన్నుగాడు ఇలా అంటాడు "అవి మేము కట్టుకున్నవి కావు సామీ. నలభై ఏండ్ల కింద ఈ పాయకట్టులో ఉన్న ఒక తెల్లదొర కలెక్టుగా గా వుండె. ఆయన పేరు జార్జిదొర. ఆయనే ఈ గుడిసెల్ని కట్టించినాడు. వేవు యానాదులం గద సామీ. అడవుల్లో కొండల్లో చెట్టుకొకడు, పుట్టకొకడు, లెక్కన బతకతా ఉంటిమి. ఎలుకల్ని, పాములు, కుందేళ్ళను పట్టి పొట్టబోసుకుంటూ ఉంటిమి. మేము ఆ మాదిర నాడోడి బతుకులు బతకటం జార్జి దొరకు ఇష్టం లేదు. ఆయన మాకోసం అడవుల్లోకి వచ్చినాడు. మమ్మల్నందర్నీ ఈ ఊరికాడికి ఉడ్డేసి మాట్లాడినాడు. మేవంతా ఈ నాడోడి బతుకులు మానేసి మిగత జనం మాదిరి మతకాలవ్జెప్పినాడు. అట్ట బతికే దానికి దోవ జూపిస్తానవ్జెప్పినాడు. మమ్మల్నందరర్నీ ఈ ఊరికాడికి తీసుకొచ్చినాడు. మేము ఇరవై కుటుంబాలుంటివి సామీ. ఈడ తలా ఒక గుడిసె కట్టించినాడు. నీళ్ళ బావి తొవ్వించినాడు. తలా రెండెకరాల భూమి గూడా పట్టాజిసిచ్చినాడు" అన్నాడు. (పుట : 52)

యానాదుల పొలాలు పండించే ఆ పంటతో తమ జీవితాన్ని కొనసాగించేవారు. అలాంటి వారిని దొంగలనే ముద్ర వేయడం ఊరిలో ఎక్కడ ఏ దొంగతనం జరిగినా యానోదాన్ని ఈడ్చుకొచ్చి కట్టేసి కొట్టేవారని రచయిత చెబుతాడు.

ఈ నవలలో మణియం యానాదుల్ని దొంగలుగా చిత్రించి ఏవిధంగా హింసించేవారో మన్నుగాడు బైరాగితో ఇలా అంటాడు. "యానోదోళ్ళంతా దొంగలని ముద్దరేసినాడు సామీ. మేమంతా బందిపోటు దొంగలమని ముద్దరేసినాడు. దొంగబుద్ధిలు మాకు పుటకల్నుంచే వస్తాయని గవుర్మెంటోల్ల పుస్తకాల్లో గూడా రాయించినాడు సామీ. ఊర్లో ఏవి దొంగతనం జరిగినా దాన్ని మా మీద ఏసేటోడు. ఈ ఊర్లో ఎక్కడ దొంగతనం జరిగినా దాన్ని మేవు నెత్తినేసుకోవాల్సిందే. ఇండ్లల్లో సొత్తుగాని, కళ్ళాల్లో ధాన్యం గాని దొంగతనం జరిగిందంటే మనేగాడు ' పలాన యానాదోణ్ణి ఈడ్చుక రండిరా' అనేటోడు. తలారోడిచ్చి ఆ యానాదోణ్ణి ఈడ్చుకపోయి కచేరికాడ రాతి స్తంభానికి కట్టేసేటోడు. చింతబరికెలు తీసుకొని రాత్రి, పగలు కొట్టి, కొట్టి వొళ్ళంతా నంజర నంజర చేసోటోళ్ళు. చీటికి మాటికి ఇట్ల జరగతా ఉంటే ఈ బాద పడలేక సగం మంది యానాదోళ్ళు బూవిని, గుడిసెను వొదిలి పెట్టేసి అడవుల్లోకి, కొండల్లోకి పారిపోయినారు.

మేకలు దొంగలించినాడని చెప్పి మన్నుగానితో మణియం ఇలా అంటాడు. "యానదోడై పుట్టడం నీ తప్పుగాదురా. ఆ తెల్లదొర మిమ్మల్నందర్నీ ఊర్లోకి తీసుకొచ్చినాడు జూడు వాడిది తప్పు. నిన్నింకా ఊర్లో వుండనిచ్చాను జూడు నాది తప్పు. మేకల్నేవి జేసినావురా అంటే పుటకలూ, జాతకాలు మాట్లాడతావేందిరా" - (పుట : 75.) మణియం మాటల్లో యానాదులు ఊర్లోకి రావడం

సహించలేక పోయినట్లు కనిపిస్తుంది. ఆనాటి ప్రజలు కూడా యానాదులకు ఎటువంటి సహాయ సహకారాలు ఇవ్వలేదనిపిస్తుంది. ఇంకా ఈ నవల చివరలో 'మణియం మన్నుగాడిని చావగొడితే, చిన్నోడు చెట్టుకు ఉరేసు కున్నాడు. బైరాగి ఊరికి బయటవాడి కుక్క 'రాజి'ని ఉసిగొల్పి మణియం ప్రాణాలు తీస్తాడు. నిమ్మకులానికి పేద వర్గానికి చెందిన మన్నుగాడి రెండెకరాల భూమి కాజేసిన మణియం, పంటను కాజేసిన నేరంపై (చేయని దొంగతనానికి) అతడిని క్రూరంగా హింసించి హత మార్చాడు.

చివరి గుడిసె నవలలో కథ సూర్యోదయంతో మొదలై మరలా సూర్యోదయం లోపల ముగింపు చేయడమనేది రచయిత సమయస్ఫూర్తి . కేవలం 24 గం॥ల్లోనే కథను నిర్మించడం అనేది నేటి నవలా రచయితలకు అసాధ్యం. అదీ వాస్తవిక పరిస్థితులకు అనుగుణంగా కథను మలచడం చాలా కష్టతరంగా చెప్పవచ్చు. కేశవరెడ్డి గారు నాటి సమాజ పరిస్థితులను, ఈనాటి పరిస్థితులకు బేరీజు వేసుకుంటూ ఒక ప్రక్క పాత్రల సంభాషణలు కొన సాగిస్తూ, ఆసక్తికరమైన సన్నివేశాలను సృష్టించడం, వాటికి ఎంతో సమయం కేటాయించాలో చూసుకొంటూ కథను చెప్పుకురావడం కనిపిస్తుంది. ఈ నవలలో మన్నుగాడు, చిన్నోడు పాత్రలను పీడితులుగాను, మణియును పీడకునిగా, బైరాగి పాత్రను నిస్సహాయక పాత్రగాను చిత్రించాడు రచయిత. ఈ విధంగా యానాదులు సాములు చేత ఏ విధంగా దోచుకో బడుతున్నారో, వారి అమాయకత్వాన్ని అజ్ఞానాన్ని ఏ విధంగా సొమ్ము చేసుకుంటారో రచయిత తెలుపు తాడు. భూస్వాముల ఆదిపత్యాలు, ఆనాటి పరిస్థితుల ప్రభావం, వాటికి తగిన సన్నివేశాలు కూడా సూపించి కథను రక్తి కట్టించడంలో రచయిత చూపిన వాస్తవిక దృష్టికి చక్కటి ఉదాహరణ ఈ చివరి గుడిసెలోని కథా కథనం.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు జానపద విజ్ఞానం సమాజం - సంస్కృతి - సాహిత్యం (పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం).
2. ఆంధ్రుల చరిత్ర - డా॥ కంభంపాటి సత్యనారాయణ.
3. చివరి గుడిసె - డా॥ కేశవరెడ్డి.
4. నవలా శిల్పం - వల్లంపాటి వెంకటసుబ్బయ్య.

తెలంగాణ గిరిజన కథ – గిరిజనోద్యమం

– బానోత్ స్వామి, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయము వరంగల్, తెలంగాణ.

సాహిత్యం ఎప్పుడూ రెండు పాయలుగా విస్తరిస్తుంది. ఒక పాయ విలాసానికి, వినోదానికి, ఆనందానికి ఉప యోగపడే సాహిత్యమైతే, మరో పాయ దిశా నిర్ధేశం చేసి బ్రతుకు చిత్రాలను గీసి నిద్రపోయిన మనిషిని నిద్రలేపు తుంది. ఒక వర్గం మనిషికోసం సృష్టిస్తే, మరోక వర్గం మానవత్వంకోసం సృష్టిస్తారు. ఈ విధంగా గిరిజన సాహిత్యమంతా మనిషికి అడుగు దూరంలో ముందుండి నడిపించి, ముందు చూపును మెదడును పదునెక్కించిన సాహిత్యమే కథ. ఆ కాలంలో జరిగిన కథా రచనను ప్రభావితం చేసిన అంశాలు చాలానే ఉన్నాయి. అవన్నీ పోరట అస్థిత్వాలను చూపిన సంఘటనలే. 1778 గిరిజన రైతాంగ పోరాటం, 1967 నక్సల్‌బరి ఉద్యమం , 1970 విప్లవ రచయితల సంఘం, 1980లో గ్రామీణభూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా సాయుధపోరు, 1974లో రైతు కూలీల సంఘం, 1989లో తునికాకు రేటు పెంచాలని జరిగిన పోరాటాలు, వీటికి తోడు కళాశాలల్లో విప్లవ సంఘాల, అనుబంధ సంఘాల, యూనివర్సిటీ రాజ కీయాలు గ్రామాలకు తరలిరండి పిలుపు, మధ్య తరగతి జీవితాలలోకి విలాస వస్తువులు, బొగ్గుగని ప్రాంతాలలో భూ నిర్వాసితుల జీవితాలు చాలా ప్రభావితం చేసాయి.

ఎక్కడో అడవి మధ్యలో నివాసయోగ్యంకాని పర్వత పాద ప్రాతంలో నాగరిక సమాజానికి దూరంగా, సాంకేతిక ప్రగతికి నోచుకోని ప్రాచీన సాంస్కృతికి వారసులై అడవి తల్లి బిడ్డలుగా బ్రతికిన గిరిజనులలో ఆధునిక నాగరికత చిచ్చుపెట్టింది. విప్లవ ఉద్యమాల విస్తరణలో ప్రభుత్వ యంత్రాంగానికి, నక్సలైట్లకు మధ్య జరిగిన కుమ్ములాటలో గిరిజనులు బలైయ్యారు. ఈ పరిణామాన్ని తెలుగు కథాసాహిత్యంలో అల్లం రాజయ్య, సాహు మొదలగు కథకులు తమ కథల్లో నిక్షిప్తం చేశారు.

నాగరికులు గిరిజన ఆవాసాల్లోకి వెళ్ళడం, గిరిజనులు నాగరిక సమాజంలోకి రావడం మూలనా వారి సాంస్కృతిక జీవనంలో మార్పులు వచ్చాయి. 1990 దశకం తరువాత ప్రపంచీకరణ పరిణామాలు గిరిజనులను మరింత ఇబ్బందుల్లోకి నెట్టి వేశాయి. గిరిజన గూడాల్లోకి, తండా ల్లోకి నాగరికుల చొరబాటు ఎక్కువయ్యాక వ్యాపార సంస్కృతి తండాల్లోకి ప్రవేశించాక, గిరిజన బ్రతుకుల్లో అపసృతి దొర్లింది. నాగరికులు అడవి బిడ్డల కష్టార్జితాన్ని, ఆస్తుల్ని, అడవి సంపదను దోచుకోవడంతో గిరిజనుల బ్రతుకులు అస్తవ్యస్తం అయ్యాయి. ఈ పరిణామాల మూలంగా కథా సాహిత్యంలో సామాజికి ఉధ్యమాలు ప్రారంభమయ్యాయి. ఈ గిరిజన సమూదాయాలు స్వతహాగ నిర్మల జీవనులు, శాంతికాముకులు అయి నప్పటికినీ దశాబ్దాల తరబడి గిరిజనుల సంస్కృతి, అటవీ సంపద, ప్రకృతి వనరులు, మౌళిక వనరులు దోచుకొన బడుతూ ఉండటం ఫలితంగా గిరిజన సమాజంలో తిరుగుబాటు దోరణులు సైతం వ్యక్తమయ్యాయి. బ్రిటిష్ వారి వలస పాలనలో విదేశీ శక్తులకు వ్యతిరేకంగా పోరా డిన వారు గిరిజనులేనన్న ఒక చారిత్రక వాస్తవానికి తగి నట్టి గుర్తింపు లభ్యంకాలేదు. ఈ కోణంలో గిరిజనులను దర్శిస్తే 1855-56 సంవత్సరములలో గిరిజనులు భావించినసంతాల్ తిరుగుబాటు ఎంతో ప్రసిద్ధిచెందిన అంశం. కాని ఈస్ట్ ఇండియా కంపెనీ స్వార్థ ప్రయోజనాల కోసం ఈ సందర్భముగా గిరిజనులు దారుణంగా ఊచ కోత కోయబడినారు. ప్రసిద్ధి చెందిన చారిత్రక తిరుగు బాటు ఉధ్యమాన్ని గుర్తించడమే కాక తన "నోట్స్ ఆన్ ఇండియన్ హిస్టరీ" రచనలో ఈ అంశాన్ని ప్రస్తావించారు.

భారతదేశంలో గిరిజనులు ప్రశాంతమైన జీవనానికి, అపారమైన సహనశీలతకు, ఆప్యాయత, విశ్వాసాలకు

ప్రసిద్ధి చెందినప్పటికీ వారిపై నాగరిక సమాజం దోపిడి ధోరణులు విపరీతం కావడం వలన దేశ చరిత్రలో 18-19 శతాబ్ధి కాలంలో జరిగిన తిరుగుబాట్ల ఉద్యమాన్ని కొన్నింటిని మనం గమనిస్తాం. సంతాల్, బిల్లు, ముండా, గోండు, లంబాడీల తిరుగుబాటు ఉధ్యమాలను 1789-1940 మధ్యకాలంలో చూడవచ్చు. తెలుగు రాష్ట్రాలలో గిరిజనులు వ్యవసాయ ఆధారిత, మైదాన ప్రాంత జీవన విధానం మరియు అటవీ వనరుల - పోడు వ్యవసాయాధారిత గిరిజన ప్రజల జీవన విధానంలో కొంత మేరకు వైరుధ్యం ఉన్నప్పటికీ, భూస్వాములకు, వడ్డీ వ్యాపారులకు, రెవెన్యూ అటవీ అధికారుల ఆగడాలకు, పోలీసులకు చివరికి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పై రెండు వర్గాల ప్రజలు లేవదీసిన ఉధ్యమ రూపాన్ని చూపాయి. ముఖ్యంగా 1778-1971 వరకు భారతదేశంలో మొత్తంగా దాదాపుగా 200లకు పైగా గిరిజన, రైతాంగ పోరాటాలు జరిగాయి. ఇందులో గిరిజనుల స్వయం పరిపాలకు, జీవన విదానాలలో, అస్థిత్వానికి ఆటంకాలు కల్పించిన బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొన్ని జరిగితే, నిరంకుశ, నియంతృత్వ, భూస్వామ్య విధానానికి, సంస్థానాధీశుల ఆగడాలకు, వెట్టిచాకిరికి, హద్దుమీరిన దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా మరికొన్ని జరిగాయి.

కారల్‌మార్క్స్ అభిప్రాయం "చరిత్రంతా వర్గపోరాటల చరిత్రే" అన్నాడు. మరో మాటలో చెప్పాలంటే మూలవాసులైన గిరిజనులకు, గిరిజనేతరులకు మధ్య జరిగే పోరాటాల చరిత్ర, కాని ఇప్పటి దాకా చరిత్రంతా గెలిచిన వారు రాసుకున్న చరిత్ర వక్రీకరించబడిన చరిత్ర, గిరిజనులు ఇంకా తమ చరిత్రను పూర్తిగా నిర్మించుకోలేదు. హక్కుల కోసం జరిగిన పోరాటాలుగాని, వారి జీవనస్మరణ పోరాటల చరిత్ర రాసుకోనేలేదు. ఆ ప్రయత్నం గతంలో జరుగలేదు కాబట్టి పరిశోధకులు, మేధావులు, ఉద్యమకారులు రాయాలని కోరుకుంటున్నాను. ఆ దిశగా గిరిజనుల చరిత్రను వెలుగులోకి తీసుకురావడానికి గిరిజన బిడ్డగా, పరిశోధకుడిగా నా ప్రయత్నం చేస్తాను.

భారతదేశానికి స్వాతంత్ర్యానికి ముందైన స్వాతంత్రం తరువాత అయిన గిరిజనుల పాట్లు గత పాలకులు నిర్లక్ష్యం చేశారు. వారి నిర్లక్ష్యం వలన బారతదేశ రాజ్యాంగం గిరిజనులకు సంపూర్ణ హక్కులు చట్టాలను కల్పించింది. అవి కాగితాలకే పరిమితం కావడము వలన జల్, జంగిల్, జమీన్ పై అధికారం గిరిజనులకే దక్కాలి. అలాగే విద్యా, ఉపాది, ఉద్యోగ అవకాశాల మూలంగా గిరిజనులు తిరుగుబాటు పోరాటం చేయకతప్పలేదు. పూర్వకాలంలో ప్రపంచములో ఎక్కడ లేని విధంగా భారతదేశంలో 1778వ సంవత్సరం నుండి 1980 వరకు సుమారు గిరిజన రైతాంగ పోరాటాలు రెండు వందలకు పైగా జరిగాయి. ఇలా తిరుగుబాటు చేయడానికి ప్రధాన కారణాలు వనపుత్రులు అడవి ఫలాల మీద ఆధారపడి బ్రతుకుతున్న అమాయక గిరిజనులు అడవికి రక్షణ, అడవివారికి రక్షణ తప్ప మరొకటి ఏమి లేదు. అడవికో అద్దాల మేడకట్టుకోవాలనో, ఆస్తులను కూడబెట్టుకోవాలనో, ఇతరులకు హాని చేయాలనో అసలే తెలియని అమాయక గిరిజనులు అడవిలో ఆకు పెరినట్లు, చెట్లు పెరిగినట్లు, జంతులువులు పెరిగినట్లు స్వేచ్చగా ప్రకృతి ఒడిలో కులంకుశం లేకుండా పెరిగారు. అలాంటిది ఆత్మగౌరవంతో కూడిన స్వయం పాలన, మనుగడను గిరిజను జీవన విధానాలకు ఆటంకాలు కల్గించిన బ్రిటిషు పాలకులకు వ్యతిరేకంగా నిజాం నిరంకుశ పాలనకు మరియు భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా తరువాత వచ్చిన గత పాలకులు నిర్లక్షాన్ని ఎండగట్టడానికి ఉద్యమాలు జరిగాయి.

చరిత్రలో ఏ పోరాటం చూసిన ఏ ఉద్యమ సంఘటనలు చూసినా అమాయక గిరిజనులు సైతం పోరాటం చేస్తారంటే వారిపై పాలకులు ఎంతగా నిర్లక్ష్య వైఖరితో వివక్షత చూపించి పీడింపబడి, అణచివేతకు గురై ఉంటారో మనకు అర్థమవుతుంది. గిరిజనుల అస్థిత్వం కోసం అనాటి నుండి నేటి వరకు పోరాట ఉద్యమంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విరోచితంగా పోరా

డిన పోరాట యోదులు బిర్సాముండా, రామ్‌జీకోండు, సేవాలాల్, సమక్క సారలమ్మ, ఠానూనాయక్, కొమురం భీం, విక్షునాయక్, లక్ష్మణ్‌నాయక్, పూలిబాయి. కోలం వీరుడు లచ్చుపటేల్, కుర్రంసూరు, సోయం గంగులు, కనక హనుపటేల్ మొదలైనవారు పోరాటం చేశారు. సమకాలీన ఉద్యమాలలో తెలంగాణలో జరిగిన ఉద్యమాలు అనేకం జరిగాయి. అందులో ఇంద్రవెల్లి, పూలీబాయి, రాంజీగోండు, కొమురం భీం, పోలవరం పోరు, టైగర్ జోన్‌పై పోరు, తండాల పంచాయితీ, ఉపప్రణాళిక ఉద్యమాలు, మన్యసీమ, ఉద్యమం, అటవి హక్కు పరిరక్షణకు ఉద్యమం, బయ్యారం ఉక్కు గిరిజనుల హక్కు.

భారతదేశంలోని ఏ సామాజిక అస్థిత్వ ఉద్యమాలు చూసిన గిరిజనులు ఉద్యమంలో ముందు వరుసలో ఉండీ పోరాటంలో క్రీయా శీలపాత్ర పోషిస్తారు. దీనికి నిదర్శనం తెలంగాణ ప్రాంతంలో చూసినట్లయితే గిరిజనుల ఆత్మగౌరవ పోరాటం కోసం తమ ప్రాణాలు సైతం లెక్క చేయకుండ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, జల్, జంగల్, జమీన్.. నినాదంతో పోరాడిన పోరాట వీరుడు కొమురంభీమ్, కాకతీయుల రాజు అయిన ప్రతాపరుద్రుని కాలంలో అమాయక గిరిజనులపై పన్నులు విధించి ఇబ్బందులకు గురు చేస్తున్న తరుణంలో వారికి వ్యతిరేకంగా పోరాడిన వీరవనితలు మేడారం సమక్క సారలమ్మలది. గిరిజన అస్తిత్వం కోసం పోరాడిన యోధుడు రాంజీ గోండ్ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పోరాడి అమరుడైన ఠాను నాయక్ స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర సాధన ఉధ్యమంలో గిరిజనులు ముందు వరుసలో ఉండి తమ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా నిరసన కార్యక్రమాలు, సదస్సులు, సభలు, చైతన్య యాత్రలు, చేసి రాష్ట్ర సాధనలో కీలక భూమికను పోషించారు.

1857 - 60 సంవత్సరాల మధ్య అదిలాబాద్ జిల్లా నిర్మల్ ప్రాంతంలో రాంజీ గోండ్ న్యాయకత్వంలో 300 మంది గిరిజన గోండు ప్రజలు, తమ ప్రాంత విముక్తి కోసం మహత్తర పోరాటాన్ని లేవనెత్తారు. 1879-80 సంవత్సరాల మధ్య భద్రాచలం - రేఖపల్లి అటవీ ప్రాతంలో నాయక్‌పోడ్, కోలాం ఇతర గిరిజన ప్రజల ఉమ్మడి న్యాయకత్వంలో అటవీ చట్టాలకు విరుద్ధంగా పోడు వ్యవసాయంపై 3 రెట్లు అధికపన్నులు విధించి వసూలు చేస్తున్న ప్రభుత్వానికి, అటవీ అధికారులకు వ్యతిరేకంగా గొప్పతిరుగుబాటు జరిగినది. 1915-16 సంవత్సరాలలో భద్రాచలం - పశ్చిమ గోదావరి జిల్లా సరిహద్దున అటవీ ప్రాంతంలో కొండరెడ్లు అనే గిరిజనులు, గిరిజనేతర శావుకార్లు దోపిడీకి అటవీ అదికారులకు వ్యతిరేకంగా పెద్ద ఉద్యమం జరిగినది. 1938-40 సంవత్సరాల మధ్య అదిలాబాద్ - ఆసిఫాబాద్ - జోడేఘాట్ అటవీ ప్రాంతంలో దాదాపుగా 1000మంది గోండు, కోలాం తదితర గిరిజన ప్రజల సహాయ సహకారంతో కొమురం భీం అనే గోండు వీరుడు "జల్-జంగల్-జమీన్" అనే నినాధంతో తమ హక్కుల కోసం 12 గిరిజన గ్రామాలలో "మానేనాట్ - మావేరాజ్" అనే స్వతంత్ర అధికారం కోసం నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా మహోజ్వలమైన పోరాటన్ని సాగించారు.

ప్రపంచీకరణ నేపధ్యంలో గిరిజనులకు జరిగిన అనేక అన్యాయాలను చిత్రిస్తూ చాలా కథలు తెలుగు సాహిత్యంలో ఒక ఉద్యమాన్ని ప్రారంభించాయి. ప్రపంచీకరణ ప్రభావం చేత గిరిజనులైన లంబాడీలు సంక్షోభాన్ని ఎదురుకోవడాన్ని బోయ జంగయ్య "ఇప్పపూలు" 2004లో, శిరంశెట్టి కాంతారావు గారు "సమిధలు" 2001 , సమ్మెట ఉమాదేవి "రేలపూలు", ఫణికుమార్ "గోదావరి గాధలు", ఎ. విద్యాసాగర్ "భద్రాచలం మన్యంకథలు" దిలావర్ "కొండకోన్నల్లో" బి.యస్. రాములు - అడవిలో వెన్నెల, ఇలాంటి కథా సంపుటాలు తెలుగు సాహిత్యంలో గిరిజన జీవితాలను చిత్రిస్తూ, వారి అస్థిత్వాన్ని వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులను తెలిపాయి.

ఉపయుక్త గ్రంథ సూచి :

1. కథాంశం - రాచపాలెం చంద్ర శేఖర్ రెడ్డి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్, 2006.
2. కతకు శతమానం - గిరిజా మనోహర్ బాబు.
3. అడవిలో వెన్నెల - బి.ఎన్. రాములు
4. భద్రాచలం మన్యం కథలు - ఎ. విద్యా సాగర్
5. తెలుగు కథా ప్రాంతీయ అస్థిత్వం - వెల్డండి శ్రీధర్
5. నూడ పదేళ్ళ తెలుగు కథ - విభిన్న దోరణులు - డా॥ కాలువ మల్లయ్య
6. తెలంగాణ కథ పరామర్శ - డా॥ బన్న అయిలయ్య, కాకతీయ విశ్వవిధ్యాలయం, వరంగల్.
7. తెలంగాణ తెలుగు కథ - డా॥ పంతంగి వెంకటేశ్వర్లు, కాకతీయ విశ్వవిధ్యాలయం, వరంగల్.

గిరిజన కళారూపాలు

– ఎంబేటి అమృతేష్, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

ఉపోద్ఘాతము :

ప్రాణికోటి ఏర్పడిన కొన్ని లక్షల సంవత్సరాల తర్వాత మానవుడు ఉద్భవించాడు. అడవులలో, కొండలలో, కోనలలో తిరుగుతూ జంతువులలో జంతువుగా ఆకులు అలములు, పచ్చి మాంసాలు తింటూ ఒంటరిగా వావి వరుసలు లేకుండా జీవించేవాడు. తనలో కలిగే ఆలోచనా సరళులుని హావభావాలతో మూగ సైగలతో తెలిపే వారు. మానవుడు జీవించిన ఈ ఆటవిక స్థితినే మనిషికి ఆదిమానవుడని మానవ శాస్త్రవేత్తలు నామకరణం చేశారు. ఆది మానవుని వికాసం ఆటవిక యుగానికి దారితీసింది. కాలానుగుణంగా ఈ ఆదిమానవులు ఆదిమ గిరిజనులుగా పరిణతి చెందారు.

గిరిజనులు – లక్షణాలు :

గిరిజనులు వివిధ పేర్లతో వివిధ రకాలుగా నేడు పిలువబడుచున్నారు. ఆదిమ వాసులని, ఆటవీకులని, అనాగరికులని, కొండజాతీయులని వీరిలో భేదాలున్నాయి. గిరి అనగా కొండ అని అర్థము. జనులు అనగా ప్రజలు లేదా సమూహం అని అర్థం. గిరులుపైన వేరు జీవనం సాగించటం వలన వీరిని గిరిజనులు అని అంటారు. భారతదేశంలో గిరిజనులను వివిధ మాండలికాలలో వివిధ పేర్లతో పిలుస్తారు. గిరిజనులను హిందీలో ఆదివాసులు అని, ఆంగ్లంలో ట్రైబ్ అని పిలుస్తారు.

గిరిజనులు సాధారణంగా నాగరీకులకు దూరంగా నివసిస్తారు. వీలైనంత వరకు ఒక నిర్ణీత ప్రాంతంలో స్థావరాలను ఏర్పర్చుకొని అందులో గిరిజనులు నివాసం సాగిస్తారు. కొన్ని విచిత్రమైన మూఢ నమ్మకాలు కల్గి ఉండడం వీరి ప్రత్యేకత. గిరిజనులు మాట్లాడే భాషలకు దాదాపుగా లిపి ఉండకపోవచ్చు. వీరు నృత్య గాన ప్రియులై ఉంటారు.

ప్రముఖ తెలుగు ప్రాంతాలలోని గిరిజనుల నృత్యాలు :

ఉభయ తెలుగు రాష్ట్రాలలో అనేక రకాలైన గిరిజన జాతులు ఉన్నాయి. కేవలం ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే రాయలసీమ ప్రాంతం నుండి శ్రీకాకుళం మధ్య గల ప్రాంతంలోనే 38 గిరిజన జాతులున్నాయి. ఒక్కొక్క జాతి గిరిజనులు ఒక్కొక్క రకమైన నృత్యాన్ని చేస్తారు. అందులో ప్రముఖమైన గిరిజన నృత్యాలు.

ధింసా నృత్యం :

అరకులోయలో ప్రసిద్ధమైన నృత్యాలలో ధింసా నృత్యం ఒకటి. వృద్ధులు, యువకులు, ధనికులు, పేదలు అను తేడా లేకుండా అన్ని వర్గాలకు చెందినవారు ఈ ధింసా నృత్యంలో పాల్గొంటారు. ధింసా నృత్యం అందరిని అలరించటమే కాకుండా గ్రామీణ ప్రజల మధ్య సఖ్యతనూ, సహృద్భావాన్ని పెంపొందిస్తుంది. ఈ ధింసా నృత్యాన్ని చైత్ర పర్వంలోనూ, వివాహ సమయంలోనూ, పండుగ పర్వదినాలలో ప్రదర్శిస్తారు. ఈ నృత్యంలో తుండి, మోరి, డబ్బు మొదలైన సాంప్రదాయ వాయిద్యాల సహాయంతో లయబద్ధంగా సాగుతుంది. మధ్య మధ్యలో కళాకారులని ఉత్తేజపర్చటానికి జోడు కొమ్ము బూరలను ఊదుతారు. స్త్రీ పురుషులు ఇరువురు సాంప్రదాయ దుస్తులు, ఆభరణాలు ధరించి రంగు రంగుల దుస్తులు ధరించి ఈ నృత్యాన్ని ప్రదర్శిస్తారు.

సామంతుల మయూరి నృత్యం :

సామంతులనే గోండులు అని కూడా అంటారు. వీరు గిరిజనులలో ఎంతో వెనుకబడిన గిరిజనులు. విశాఖ పట్టణం, శ్రీకాకుళం జిల్లాలో దుర్గమ్మ కొండ ప్రాంతపు అడవులలో ఈ గిరిజనులు నివసిస్తారు. గోండుల వివాహ సందర్భంలోనూ ఏప్రియల్ నెలలో వచ్చే చైత్రమాస

పర్వదినమున ఈ మయూరి నృత్యం చేస్తారు. ఈ నృత్యంలో పిరోడి అనే మురళి కాళ్ళకు కట్టుకునే గజ్జెలు చాలా ప్రముఖ పాత్ర పోషిస్తాయి. సామంతులు కేవలం తెల్లదోవతి మాత్రమే కట్టుకుంటారు. నర్తకులందరు పాదాలకు గజ్జెలు కట్టుకుంటారు. వీటిని సామాంతులు ''ముమ్యంగా' అంటారు. తలకు తోయగం అను తల పాగా ధరిస్తారు. తుంగ గడ్డితో చేసిన పాగాకు రంగుల గుడ్డ పేలికను కుచ్చులుగా కడుతారు. నడుము వంచినపుడు పింఛము విప్పిన నెమలి వలె కన్పించే విధంగా నెమలి పింఛముల గుత్తిని నడుముకు వెనుకభాగమున బిగించుకుంటారు. నర్తకులందరు రెండవ వరుసలో నిల్చుంటారు. నోటితో నెమలి అరుపును పోలిన శబ్దం చేస్తారు. గుండ్రంగా నిలిచి నాట్యం చేస్తున్న మయూరం పద్ధతిలో మోకాలిపై ముందుకు వంగుతారు. భూమాతకు సూర్య భగవానునికి నమస్కరించి నృత్యం ప్రారంభిస్తారు.

మామిడి కోతి నృత్యం :

కొండ రెడ్లకు అత్యంత ప్రీతికరమైనవి మామిడి పండ్లు. ఈ మామిడి పండ్లు కోసే ముందు ఈ కొండరెడ్లు ఆనందోత్సవం జరుపుకుంటారు. తప్పెట్లు వాయిద్యాల శబ్దానికి అనుగుణంగా లయబద్ధమైన నృత్యం చేస్తారు. రాత్రిపూట ఈ నృత్యం ప్రారంభం అవుతుంది. మొదట వాయిద్యాలను నెమ్మదిగా ప్రారంభిస్తారు. ముగ్గురు, నలుగురు స్త్రీలు చెట్టా పట్టాలు వేసుకొని చేతుల్లో గల గల శబ్దం చేసే ఎండుకాయల గుత్తులను ధరించి నృత్యంలో పాల్గొంటారు.

గోండుల గుస్సాడి నృత్యం :

అదిలాబాదు జిల్లా రాజ గోండులకు దీపావళి పెద్దగా సంబరాలు జరుపుకునే పండుగ. శీతాకాలం ప్రారంభమయ్యే సమయానికి పంటలన్ని పండి సంపదలు కల్గి ఉండటం వలన గోండులందరు రకరకాల వస్త్రాభరణాలు వేసుకొని యువజనుల సంగీత వాయిద్యాలతో అతిథులుగా పొరుగు గ్రామాలకు తరలి వెళ్తారు. కొమ్ము లూదుతూ తప్పెట్లు వాయిస్తూ మంత్రాలు సాగిస్తారు. గోడు యువకులు 20 నుండి 40 మంది వరకు కలసి చేసే దండారి నృత్యంలో గుసాడి నృత్యం ఒక భాగం. గుసాడి నృత్యంలో ఎంతమంది అయిన పాల్గొనవచ్చు.

దీపావళి నెలలో ఈ నృత్యం ప్రారంభమవుతుంది. పౌర్ణమి నాడు ఈ నాట్యం ప్రారంభమై చతుర్దశి వరకు జరుగుతుంది. గుసాడి నర్తకునికి కావాల్సిన సామగ్రిలో ముఖ్యమైనది నెమలి పింఛంతో తయారు చేసిన తల పాగా. ఇందులో గొర్రెపోతు కొమ్ములను కూడా అమర్చుతారు. కృత్రిమ గడ్డాలు, మీసాలుతో వేషం కడుతారు. మేక తోలు కప్పుకుంటారు. డప్పు, తుడుము, పిప్రి, బాక, తప్పెట మొదలైన వాయిద్యాలను ఉపయోగిస్తారు.

కోయ నృత్యం :

ఈ నృత్యాన్ని ప్రధానంగా ఖమ్మం, వరంగల్, ఉభయ గోదావరి జిల్లాలలో ఉంటే కోయజాతికి చెందిన గిరిజనులు ప్రదర్శిస్తారు. కోయ జాతికి చెందిన పండుగలు, వివాహాలు, మొదలైన ఉత్సవాలలో ప్రధానంగా ఈ కోయ నృత్యాన్ని చేస్తారు. ఈ నృత్యంలో భాగంగా పురుషుల ఎద్దు కొమ్ములను తలపై ధరించి రంగు రంగుల వస్త్రాలను ధరించి నాట్యాన్ని ప్రారంభిస్తారు. ఈ నృత్యంలో ఉండే నర్తకుల సంఖ్య దాదాపుగా 30 నుండి 40 మధ్యలో ఉంటుంది.

లంబాడి నృత్యము :

మేడ్చల్ ప్రాంతానికి చెందిన గిరిజనులను లంబాడీలు అంటారు. ఈ లంబాడీలు చేసే నృత్యాన్ని లంబాడీ నృత్యం అంటారు. పండుగల సందర్భంగా కేవలం ఆడవారు మాత్రమే ఈ లంబాడీ నృత్యాన్ని ప్రదర్శిస్తారు. డప్పు, తోలు వాయిద్యాలను బూసారి కొమ్మ, సన్నాయి మొదలైన వాయిద్యాలూ, కిన్నెర మెట్ల, కిన్నెర, డోలు కామారు మొదలైన తీగ వాయిద్యాలు ఎక్కువగా వాడుతారు. ఈ లంబాడీలు ధరించే దుస్తులు, అలంకరణ మొదలైన వారి సాంప్రదాయ పద్ధతులలోనే ఉంటాయి.

పోతార్ తోలా :

పోతార్ అంటే అడుగులు, తోలా అంటే సేకరణ ఈ నృత్యంలో సగం మంది ప్రక్క ప్రక్కన ఒక వరుసలో నిలుచుంటారు. వెనుక ఉండే నర్తకులు ముందు ఉండే నర్తకుల భుజాలపై చేతులు ఉంచుతారు. కుడి వైపుకు, ఎడమవైపుకు ఒక్కసారిగా తలను తలను త్రిప్పుతూ బృందం మొత్తం ముందుకు వెళ్తారు. అడవిలో ఆకులు ఏరటాన్ని ఈ నృత్యం సూచిస్తుంది. అరకు లోయలో గిరిజనులు అడ్డ ఆకులను సేకరించి సంతలో అమ్ముతారు. ఈ వృత్తి చేసే వారు ఎక్కువగా పోతార్ తోలా నాట్యాన్ని ప్రదర్శిస్తారు.

భాగ్ ధింసా నృత్యం :

భగ్ అంటే ఒరియా భాషలో 'బెబ్బులి' అని అర్థం. పెద్ద పులి కన్పిస్తే ఎలా పారిపోవాలో చిన్నా, పెద్దా తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ భాగ్ ధింసా నృత్యం ఈ విషయాన్ని చమత్కారంగా తెలియజేస్తుంది. ఈ బృందంలో సగం మంది ఒకరి చేతులు మరొకరు పట్టుకుని గుండ్రంగా మూగుతారు. తలను పైకి ఎత్తుతూ మునివేళ్ళపై నిలిచి ఉంటారు. మిగతా సగం మంది వేగంగా చుట్టూ తిరుగుతూ లోపల ప్రవేశించి పాము చుట్టూ ఆకారంలో అంతా పరచుకుంటారు ఇదే విధంగా అనేకసార్లు చేస్తారు.

ముగింపు :

గిరిజనులు ప్రదర్శించే నాట్యాలలో నాటికారి కుందా, ధింసా, చాయాధింసా, పురుషుల నృత్యం సామూహిక నృత్యం మొదలైన నాట్యాలు కూడా ఆదరణ పొందాయి. సంగీతానికి శిశువులు, పశువులుకూడా స్పందిస్తాయనేది వాస్తవము. కావున మనస్సు ఆహ్లాదకరముగా ఉన్నప్పుడు సంగీతం విన్నప్పుడు దేహం పరవళ్ళు తొక్కుతూ నాట్యం చేయటం మానవ ధర్మం. ఈ నాట్యాన్ని కొండలలో నివసించే ప్రజలు చేయు విధానము వస్త్రధారణ, సంగీత వాయిద్య పరికరాలు మొదలైనవి నాగరిక ప్రజలకు కొంచెం భిన్నంగా కన్పించినాయి. ఎక్కువ ఆనందానుభూతిని కల్గిస్తుంది.

బంజారాలు – స్త్రీ దేవతా ఆరాధనలు

– ఎ. చంద్రకళావతి, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురము.

భారతీయ సంస్కృతికి సింధునాగరికత బీజాలు వేసిందన్న విషయము అందరికీ తెలిసినదే. ఆర్యుల రాకతో ఈ సింధునాగరికత ములాలు ధ్వసంమై, ఆర్య సంస్కృంతే భారతీయ సంస్కృతి అన్న భావం బలపడింది. కాబట్టి ఆర్యుల రాకపూర్వమున్న సంస్కృతే యీదేశ మూల వాసుల సంస్కృతి. ఈ దేశమూలవాసుల సంస్కృతే భారతీయ సంస్కృతీ బీజాలని చెప్పక తప్పదు. కానీ భారతదేశంలోని అట్టడుగువర్గాల ప్రజలు, అటు తమకు అనూచానంగా వస్తున్న తమ సంస్కృతీ సంప్రదాయాల్ని, ఆర్యుల రాకతో మిళితమైన అలవాట్లు కూడిన కొత్త సంస్కృతిని తమదిగా భావిస్తూ భారతీయ జీవనంలో మమేకమైపోయారు. ఒక దేశసంస్కృతి సంప్రదాయాలు రేపటి తరాలకు అర్థం కావాలంటే, అభివృద్ధి చెందిన వారి సంస్కృతీ సంప్రదాయాలతో పాటుగా, అట్టడుగు సమాజాల కళాసంస్కృతుల అధ్యయనం జరిగితేనే అది ఆ దేశ సమగ్ర సంస్కృతి అవుతుందనేది పలువురి అభిప్రాయం. కాబట్టి అలాంటి సంస్కృతిలో భాగమే గిరిజన మూలాలమయమైన లంబాడీ సంస్కృతి.

లంబాడీలను, సుగాలీలని, బంజారాలని ఆంధ్ర ప్రదేశ్‌లో వ్యవహరిస్తుంటారు. వీరు ఒకప్పుడు నగరాల్లో నివసించేవారని, కాలక్రమంలో యీ నగరాలకు దూరంగా ఏర్పాటు చేసుకున్న నివాసాలే 'తాండా' లుగా ఏర్పడ్డారన్న ఏవిషయం అర్థమౌతూనే వుంది. కానీ వాస్తవానికి "వీరు రాజపుత్రులని, రాజస్థాన్ లేదా మారవాడి ప్రాంతానికి చెందిన వారని, రాజపుత్రుల్లో కనిపించే రాథోడ్, చౌహాన్ పమార్ మొదలగు వంశనామాలు మారవాడి, గుర్జారి, వీరి వంశనామాల్లో కనిపిస్తారని పి.కె.ఖండోభా తన గ్రంథం "కర్నాటక ద లంబాణిగళు ఒందు సాంస్కృతిక అద్యయనము" (పుట- 20-25)లో పేర్కొనారు. దీనిని బట్టి వీరి మూలాలు రాజస్థాన్, మహారాష్ట్ర ప్రాంతాలల్లో వున్నాయని అర్థమౌతుంది. తదనంతరం వీళ్ళ పలు ప్రాంతాలకు వలసలుగా విస్తరించినా, మూలసంస్కృతులు మాత్రం మరచిపోకుండా జీవించడం గమనించవచ్చు. ప్రస్తుతం వీరు పూజించే స్త్రీ దేవతలను గురించి తెలుసు కుందాము. వీరి ముఖ్యంగా ఇద్దరు స్త్రీ దేవతలను ప్రధానంగా పూజిస్తారు.

1. తుల్జాపూర్ భవానీ, 2. మరియమ్మ. ఒకటో దేవతను సాంప్రదాయకమైన దేవతగాను, రెండవ దేవతను జానపద దేవతామూర్తిగాను భావించవచ్చు.

తుల్జాభవానీ పూజ :

ఈమె సాంప్రదాయక దేవత, సుగాలీలు ఆరాధించే స్త్రీ దేవతలలో తుల్జాభవానీకి ప్రాధాన్యత ఎక్కువ. ఈమె వెండి ప్రతిమ ప్రతి సుగాలి ఇంటిలో దర్శనం ఇవ్వడమే ఇందుకు సాక్షం. వీరి శక్తి మేరకు యేడాదికో, ప్రతి రెండేళ్ళకో సారి భవానీ జాతర చేస్తుంటారు. జాతర సమయాల్లో అమ్మవారి విగ్రహాన్ని బయలుపరచి, పూజించి, జంతుబలులతో ఆమెను సంతృప్తి పరచి, ఆ రాత్రి పూజ, జాగరణ చేస్తారు. దీన్నే 'భవానీ జాగరణ' అంటారు. ఈమె వారికి సకల శుభాలను కలుగచేస్తుందని కూడా నమ్ముతారు.

సుగాలీలు / లంబాడీలు/ బంజారాలకు ఈ తుల్జా భవానీ జాతర అనువంశీకంగా వస్తునట్లు చెప్పవచ్చు. తుల్జాభవానీ దేవాలయం, మహారాష్ట్రలోని షోలాపూర్ కు దగ్గరగా తోళజాపూర్ అనే గ్రామములో వుంది. వాస్తవానికి అమ్మవార్లందరూ పార్వతీ స్వరూపులే. ఈ అమ్మవారు తోళజాపూర్, ప్రాంతంలో ఉండడం మూలాన 'తోళజాపూర్' ప్రజల వ్యవహారంలో తుల్జాపూర్‌గాను,ఆ ఊరిలో వెలసిన అమ్మవారు తుల్జాపూర్ అమ్మవారు లేక తుల్జా

భవానీ గా ప్రసిద్ధి చెందిదనని అనుకోవచ్చు. ఈ అమ్మవారి ఆలయంలో, ద్వారాలు, తలుపులు, విగ్రహాలుకు బంగారుతొడుగులు వుండటం గమనార్హం. ఆ దేవాల యానికి వందల ఎకరాల మాన్యం కూడా ఉందట. ఈ అమ్మవారిని గురించి ఒక ఐతిహ్యం కూడ ఉంది. శివాజీ మహారాజుకు ఈ అమ్మవారే ఖడ్గాన్ని అనుగ్రహించిదని ఈ ఖడగ్గతోనే అనేక విజయాలు శివాజీ పొందినారని ఐతిహ్యసారాంశం. ఇదే గాకుండా శివాజీకి ఖడ్గాన్ని శ్రీశైలంలోని భ్రమరాంబిక ప్రసాదించిందని కూడా మౌఖిక ప్రచారం వుండటం గమనార్హం. ఏదేమైనా ఈ బంజారాల్లో రాథోడ్ చౌహాన్ గ్రోత్రజులు తుల్జాభవానిని తమ ఇల వేల్పుగా భావిస్తుంటారు. ఈ గోత్రాల వారిలో మొక్కుబడి వున్న వాళ్ళు మహారాష్ట్రకు పోయి భవానిని దర్శించుకొని మొక్కుబడులు తీర్చుకొంటుంటారు.

మరియమ్మ జాతర :

సుగాలీలు జరుపుకొనే మరియమ్మ పూజ లేక మరి యమ్మ జాతరలో జానపదమాలాలు ఎక్కువుగా ఉం టాయి. జానపదుల ఆరాధనల్లో భాగమైన అక్కదేవతల (సప్తమాతృకలు) ఆరాధనల్లో మరియమ్మ పూజ ఒకటి. ఈమెతో పాటు సుంకులమ్మ, పెద్దమ్మ, పోలేరమ్మ, అంకాలమ్మ, గంగమ్మ, ముత్యాలమ్మలు మరియమ్మతో కలిసి సప్త మాతృకలుగా అనేక తాండాల్లో దర్శన మిస్తుండడం గమనించవచ్చు. ఆర్థికస్థితిని బట్టి మరి యమ్మ జాతరను కూడా యేడాదికో, రెండు మూడేళ్ళకో జరుపుకోవడం ఆనవాయితీ. ఈ జాతరనే "దసరావ్" అని కూడా అంటుంటారు. లంబాడీలు అతి విశ్వాసంతో జరుపుకునే ఈ జాతరను పేదవారుకూడా ఎక్కువ డబ్బును ఖర్చుపెడుతుంటారు. సమస్త బంధువు లను ఇళ్ళకు రప్పించుకొనే పండుగ ఇది. ఈ సందర్భంలో వీరి తాండాల్లో కల్లు, సారాయిలు లింగ, వయో బేదం లేకుండా సేవిస్తారు. ప్రతి ఇంటిలోను శక్తి కొద్దీ ఒకటి, రెండు లేక మూటికన్నా ఎక్కువ స్థాయిలో యాటలు తెగుతుంటాయి.

మరియమ్మ జాతర సమయంలో చేసే పూజావిధానం కోలాహలంగా సాగుతుంది. జాతర జరిగే రోజున ముందుగా మరియమ్మ విగ్రహాన్ని ప్రతిష్టిస్తారు. విగ్రహ ప్రతిష్ట జరిగిన ప్రాంగణంలో సాయంత్రం వరకు స్త్రీలు, పురుషులు కలిసి మ్రోగుతున్న వాయిద్యాల మధ్య ఆట, పాటలతో వినోదిస్తారు.

అమ్మవారి విగ్రహ ప్రతిష్ట తర్వాత "కాపేరీ, దాదా లీలు" (కంచుకందాలు), ఝాంజ్ (తాళాలు) నగారాలతో తన్మయత్వంతో వాయించుకుంటూ కింది విధమైన పాటలు పాడుతారు.

ఏమాయాడిర్ మూండేయాంగ మూంగకేరో ఝూడర ! డర !
మూంగ కేరో ఝూడ్ మూంగ మోగరేరో ఝూడర !
ఓయి మరియతోయాడి అబ ఊటన ఆవర
రామ రామి రేళు మా ధేళుమా దేవేర్ బోలూర !
ఓయి సాతి భేనే అబ ఏక వేగిర రామ రామి ?
రేళు మా, ధేళుమా దేవేవ్ బోలూర !
ఓయి భవాని అబ తాండో ఫరచరామ రామి ?
రేళుమా, దేళుమా దేవేవ్ బోలూర !
ఓయి యాడిరో పూజ అబకరోర రామ రామి !
రేళుమా దేళుమా! దేవేవం బోలూర !

భావం :

అమ్మవారి గుడి ముందు ఒక సత్యమైన చెట్టు ఉంది. ఆ చెట్టు క్రింద అమ్మవారు ఉన్నారు ఆ మరి యమ్మ తల్లి ఇప్పుడు భవానీలు ఏకమై తాండా చుట్టూ తిరుగుతారు. ఇప్పుడు మనం భవానీలకు పూజలు చేస్తాం పదండి. ఇలా పాట పాడుతూ గుడి దగ్గరకి చేరు కుంటారు. తరువాత వారి శక్తి మేరకు అమ్మవారికి బలి కోసం యాటలను తీసుకొని వచ్చి గుడి చుట్టూ ప్రద క్షిణలు చేయించి పూజించి బలిస్తారు. ఈ కార్యక్రమాన్ని లంబాడీ పరిభాషలో "బలిదాన్" అంటారు. ఈ కార్య క్రమాలు అన్నీ తమ ఆనవాయితీ ప్రకారం తాండా పెద్దల అనుమతితోనే వారితో కలిసి చేయటం వారి ఐక్యతకు చిహ్నంగా భావించవచ్చు.

మరియమ్మ జాతర నైవేద్యం – "నళోయి" :

అమ్మవార్లకి జానపదులు పెట్టే నైవేద్యాల్లో పొంగళి అన్నాన్ని నైవేద్యంగా పెట్టడం దివ్వెలతో కూడిన సలి బిండిని పెట్టడం అలంకరణలుగా చీర, రవిక, నల్ల లేక ఎర్ర గాజులు, చవ్వాకు (చెవులకు అలకరించడానికి అనుకూల మైన ఎరుపురంగులో అద్దిన తాటియాకు) కొబ్బరి కాయ, కర్పూరం, సాంబ్రాణి, అగరత్తుల ఆన వాయితీలు ప్రధానంగా ఉంటాయి. ఇందుకు భిన్నంగా లంబాడీలు అమ్మవారికి పెట్టేనైవేద్యం కొంత భిన్నంగా ఆది ఆటవిక సాంద్రాయాన్ని పోలి వుండటం గమనించ దగ్గ అంశం. అంతేకాకుండా జంతువును బలియిచ్చిన తరువాత తలను అమ్మవారి ముందు నైవేద్యంగా పెట్టడం లేక అమ్మవారిపై బలియిచ్చిన జంతురక్తాన్ని చల్లడం కూడా ఆనవాయితీ. ఈ కార్యక్రమం తరువాత ఆ జంతు కళేబారాన్ని వారికి అనుకూలమైన సంకేత స్థలానికి తీసుకెళ్ళి ఖండించి ఆ మాంసాన్ని అందరూ పంచుకోవడం జరిగేతంతు. కానీ ఈ తంతుకు ముందు లంబాడీలు అమ్మవారికి పెట్టే నైవైద్యం కొంత వింతగాను, కొంత అంకిత నిబద్ధంగాను ఉండడం గమనార్హం. బలి జంతు కళేబారం నుంచి కొంత మాంసాన్ని తీసి ఆ మాంసాన్ని అదే బలియాట రక్తంతో కలిపి దానికి రొట్టె ముక్కను జత చేసి నైవేద్యంగా పెడతారని ఈ నైవేధ్యాన్ని 'నళోయి' అంటారని, లంబాడీలపై పరిశోధన చేసిన ఆచార్య గోనానాయక్ తన సిద్ధాంత గ్రంథాలలో పేర్కొన్నారు.

ఈ పచ్చి నైవేద్యాన్ని భక్తి పూర్వకంగా అక్కడున్న వాళ్ళంతా తినడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. బహుశా అమ్మవారి ముందు పెట్టే కుంభాన్నం, పిండితలుగులు, బోనాలు, కొబ్బరికాయలు, పొంగళ్ళ తంతులు ఆల వాటుకు రాని రోజుల్లో చేసుకున్న నైవేద్యంగా దీన్ని చెప్పుకోవచ్చు. అంతే కాకుండా పై వస్తువులు అందు బాటులో లేని రోజుల్లో చేసే తంతుగాను లేక వధ జంతు వును అమ్మవారికి సమర్పించే క్రమంలో ఇలాంటి నైవేద్యాలు ఆరంభమైనట్లుగా కూడా భావించవచ్చు.

మరియమ్మకు చేసే ప్రార్థన :

ఏ అంబా జగదంబా
సారి మలకెమా తుఛీయాడి
ధరతీయాడి తార్ ఛయండి
ఓర్ ఊపర్ హంచాయాడి
తీన్ వరసే దాడేర్ పూజా తోన్ దేరే చాయాడి
నగరీన్ హరో కరేస్ యాడి
దొఖ్‌కాటన్ సాఖ్ దేకాళేస్ మారి అంబా!
ఏనగరీన్ జన్ జనగానీన్ హరీ కరీస్ యాడి
అయోజకో పైపామణూన్ సుధోరకాడేస్ యాడి
నరమానిక్యా హంచూక జాయా తూమత్ చూకీస్ యాడి
తోన్‌దేరే జకో పూజన్ లేన్ మారి అంబా !

భావం :

ఓ అంబా జగదంబా !
ప్రపంచమంతా నీ మాయతో నిండిఉంది తల్లీ
ఈ భూదేవి నీవే నమ్మా !
నీ దయతోనే సమస్త జీవరాసులు జీవిస్తున్నాయి తల్లీ!
మూడు సంవత్సరాల పూజ నీకిస్తున్నాం తల్లీ !
మా తాండాను కరువు నుండి కాపాడు తల్లీ !
మాకు సుఖప్రాప్తికల్గించు తల్లీ !
మా పశువులకు రోగాలు రాకుండా కాపాడు తల్లీ !
వచ్చిన కొత్త బంధువులను ఆరోగ్యంగా చూడు తల్లీ!
తెలియక మేం తప్ప చేస్తే మన్నించు తల్లీ !
నీ కిస్తున్న ఈ పూజను దయతో స్వీకరించు తల్లీ !

సుగాలీలు – వారసత్వ విశేషాలు :

పాకృత మానవ సంస్కృతిలో నమ్మకాలు ఎక్కువ. ఒకసారి తనదిగా భావించిన సంస్కృతి పట్ల గాఢమైన అనుబంధాన్ని జానపదులు కలిగిఉంటారు. దీనికి జీవనో పాధి నిమిత్తం వలస వెళ్ళిన లంబాడీల పూజా విధానం ప్రబల సాక్ష్యంగా కనిపిస్తుంది. ఒక ఊరు నుంచి వలస వెళ్ళిన వారు అక్కడ కొత్తగా తమ ఆరాధ్యదేవతను

ప్రతిష్టించుకోవడం పరిపాటి. అయినప్పటికి తాము అంతకు పూర్వం నివసించిన తాండాలోని సంకేత దేవతలను పూజించి ఆ పూజాద్రవ్య ఆవశేషాలతో కొత్తగా ఏర్పరచుకున్న కొత్త తాండాలోని అమ్మవారిని పూజించడం అనేది లంబాడీలలో కనిపిస్తుంది.

పాతతాండాకు వెళ్ళి అమ్మవారిని పూజించి వండిన అన్నాన్ని నైవేద్యంగా సమర్పించి, టెంకాయలు కొడతారు. ఆ టెంకాయ నీళ్ళను మట్టితో తయారు చేసిన చిన్న పాత్ర (కోల్డి) లో పోసుకోని మిగిలిన ప్రసాదాన్ని అలకరించిన పూలమాలల్ని తీసుకొని తమ కొత్త తాండాలో ప్రతిష్టించుకున్న అమ్మవారిని ఆ మాలలతో అలంకరించి ఆ తీర్థ ప్రసాదాలను సమర్పించి, అదే ప్రసాదాన్ని నైవేద్యంగా అందరూ పంచుకుంటారు. ఆనాటి నుండి పాత తాండాలోని అమ్మవారు కొత్త తాండాలోని అమ్మవారిలో రూపు దాల్చినట్లుగా భావించి ఆ మరుసటి యేడాదినుంచి కొత్త తాండాలో అమ్మవారును దేవతగా పూజిస్తారు. ఈ తంతు లంబాడీల సమైఖ్యతారాధనికి సంకేతంగా భావించుకోవచ్చు. ఈ విధంగా లంబాడీ / సుగాలీ / బంజారాలు స్త్రీ దేవతల్ని తమశక్తి కొలది పూజించుకుంటూ వాళ్ళు తమ ఆరాధ్య దైవాలుగా సంభావించుకొని తమ ఐక్యతను, సంస్కృతిని పరిరక్షించుకుంటున్నారని పై దేవాతారాధనల వలన తెలుసుకోవచ్చు.



లంబాడీల ప్రదర్శన కళలు

– ధీరావత్ లక్ష్మణ్, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, హైద్రాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.

భారత రాజ్యాంగం ప్రకారం ఆంధ్రప్రదేశ్ లంబాడీ లను 1956 నుండి గిరిజన తెగగా గుర్తించింది. 1977 నుండి మిగతా గిరిజన తెగలతో పాటు తెలంగాణ లంబాడీలను గిరిజన తెగగా గుర్తించింది. ఆంధ్ర ప్రదేశ్ లోని లంబాడీల ప్రత్యేక సంస్కృతిని దృషిలో ఉంచుకుని వారి సంస్కృతి పరిరక్షణకు రాజ్యాంగం హామి ఇచ్చింది. కుల సమాజానికి దూరంగా జీవించిన రోజుల్లో ఒక గిరిజన తెగకు ఉండే లక్షణాలన్ని లంబాడీలకు ఉండేవి. కాల క్రమేణ మారుతున్న సమాజంలో కులాల వారితో సంబం ధాలు ఏర్పరచుకోని బ్రతకవలసిన పరిస్థితి ఏర్పడింది.

లంబాడీలు వంశపరంపరను కలిగి ఉన్నారు. ఒకే భాష అయిన లంబాడీ లోనే మాట్లాడుతున్నారు. లంబాడీ లకు ప్రత్యేక సంస్కృతి ఉంది. వారి విశ్వాసాలు, పండుగలు, పబ్బాలు వారికున్నాయి. కాబట్టి లంబాడీలను గిరిజన తెగగా భావించవచ్చు. తెగ నిర్వచనానుసారం తెగకు ఒక పెద్ద ఉండాలి. లంబాడా తండా ప్రజలకు కూడా ఒక పెద్ద ఉంటాడు. అతనిని 'నాయక్' అంటారు. అతనికి సలహా ఇవ్వడానికి సలహా మండలి ఉంటుంది. ఈ సలహా మండలిని 'కార్భారి' అంటారు. నాయక్ మరియు కార్భారీలు నిష్పక్షపాతంగా తండా బాగోగులను చూస్తారు.

లంబాడీలకు గోత్రాలుంటాయి. గోత్రాలను 'జాత్ లేక పాడ' అంటారు. ఒక గోత్రానికి చెందినవారు వేరే గోత్రానికి చెందిన వారితో వైవాహిక సంబంధాలు ఏర్పరుచు కుంటారు. లంబాడీలు తమది బంజార జాతి అని చెప్పు కుంటారు. బంజార తెగ నేడు విశాలమైన జాతిగా అభివృద్ధి చెందింది. ఆధ్రప్రదేశ్ (ఉమ్మడి) అంతటా విస్తరించి ఉ న్న బంజారాలను ఒక చోట చేర్చితే వారి జనాభా గోవా రాష్ట్ర జనాభాతో సమానమవుతుంది.

లంబాడ పదం పుట్టుక :

బ్రిటీష్ వాళ్ళు లంబాడీల ఒడ్డూ పొడుగును చూసి 'లాంగ్‌బాడిస్' అన్నారట. అప్పటి నుండి లంబాడీ పదము వాడుకలోకి వచ్చింది. అని హైద్రాబాద్ వాసి అయిన నందకుమార్ అన్నారు. లంబాడీలు ఉప్పును వ్యాపారంలో వాడారు. అమ్మకం కొరకు ఉప్పును ఎడ్ల బండ్లల్లో తీసుకుపోతారు. ఇలా తీసుకపోవడాన్ని 'నూన్ భాడ' అంటారు. నూన్ అనగా ఉప్పు, భాడ అనగా తీసుకు పోవడం. నూన్ భాడ చేస్తూ బ్రతికే వారు. కాబట్టి వీరిని నూన్‌భాడ అని పిలిచి ఉంటారు. ఈ నూన్ భాడ పదమే నంభాడ, లంబాడగా మారి ఉంటుంది. అని డా॥ జన పాల శంకరయ్య అన్నారు.

ఏది ఏమైనా ఈ రోజు లంబాడ, బంజార, సుగాలి అనే పదాలు లంబాడ ప్రజలకు పేర్లుగా స్థిరపడ్డాయి. లంబాడీ భాష ఇండో ఆర్యన్ భాషా కుటుంబానికి చెందినది అని ప్రముఖ చరిత్రకారుడు ఎడ్గర్ థరస్టన్ పేర్కొన్నాడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అత్యధిక జనాభా కలిగిన గిరిజన తెగ లంబాడీ లేదా సుగాలి. వీరు మాట్లాడే లంబానీ భాష రాజస్థానీ మాండలికం. లంబాడీల ప్రదర్శన కళల్లో ముఖ్యమైనవి నృత్యం, సంగీతం, నాటకం, గేయాలు, రంగోళి, పచ్చబొట్లు మొదలైనవి.

తండాలలో పండుగ సందర్భాలలో వివాహ మహోత్స వాలలో వీరు నృత్యం చేస్తారు. లంబాడీ నృత్యాలు ఈ విధంగా వర్గీకరించవచ్చు. అవి 1). పండుగలు మరియు వివాహ సందర్భాలలో చేసే నృత్యం, 2). తీజ్ నృత్యం, 3). లేంగి నృత్యం, 4). కిక్లీ నృత్యం, 5). కోలాటం, 6). లెజీమ్ నృత్యం

తీజ్ నృత్యం :

తీజ్ పండుగ రోజున పెళ్ళీడుకు వచ్చిన యువతులు

రకరకాల నృత్యాలు, పాటలతో దీన్ని ఘనంగా జరుపు కుంటారు. గోధుమనారుకు నీరు పోయడానికి పెళ్ళికాని యువతలు చెరువు లేదా బావుల నుంచి నీరు తీసుకు వస్తుంటారు. వారు వెళ్ళేటప్పుడు, వచ్చేటప్పుడు పాటలు, నృత్యాలతో తండాలో వాతావరణం ఎంతో ఉత్సాహంగా ఉంటుంది. 10 రోజుల పాటు జాగ్రతగా పెంచిన గోధుమ నారు బుట్టలను దేవుళ్ళ ఎదుట పెట్టి, గొర్రెను బలి ఇచ్చి, ఆ తర్వాత తీజ్ బుట్టలను తలమీద పెట్టుకుని గుంపులుగా నృత్యం చేస్తారు.

లేంగి నృత్యం :

లంబాడీ స్త్రీ, పురుషులు హోళి పండుగ సమయంలో మాత్రమే ఈ నృత్యం చేస్తూ అందమైన రంగురంగుల దుస్తులు ధరించిన లంబాడీ స్త్రీలు వలయాకారంలో ముందుకు వెనక్కి కదులుతూ లేంగి పాటలు పాడుతూ నృత్యం చేస్తారు. లేంగి నృత్యం పంజాబీ నృత్యాన్ని పోలి ఉంటుంది.

కిక్లీ నృత్యం :

ఈ నృత్యం చేసేటప్పుడు స్త్రీలు పాటలు పాడకుండా, ముందుకు వెనకకు నడుం వంచుతూ చప్పట్లు కొడుతూ పిల్లలకు సంబంధించిన పాటలను ఎంతో హృద్యంగా పాడతారు.

కోలాట నృత్యం :

దేవతలకు సంబంధించిన పాటలు పాడుతూ, రెండు చేతుల్లో రెండు చిన్న కర్రలను పట్టుకుని, లయబద్ధకంగా కొడుతూ ఈ నృత్యం చేస్తారు.

లెజీమ్ నృత్యం :

గోర్‌బోలి భాషలో 'లెజిమ్' అనగా చిన్న చిన్న గంట లతో కూడిన కోలాటం కర్ర అని అర్థం. లెజిమ్‌లను రంగు రంగుల కాగితాలతో అలంకరించి, వాటిని చేతపట్టుకుని నృత్యం చేస్తారు.లంబాడీ స్త్రీల వస్త్రాలంకరణ 3 భాగాలుగా ఉంటుంది. అవి 1. పేటియా 2. కాళీ 3. ఛాంటియా.

పేటియా :

ఎరుపు, నలుపు, పసుపు, ఆకుపచ్చ గుడ్డలతో మధ్యలో మడతలుగా కుట్టుపని చేసిన పేటియాకు చిన్న చిన్న అద్దాలతో వరుసగా ఖిలే అనే ఎంబ్రాయిడరీ చేస్తారు. నడుముకు పేటియాను ధరించడానికి వీలుగా 'సడక్' అనే మందపాటి పట్టీని కుట్టి దానిని గవ్వలతో, చిన్న గంటలతో చాలా అందంగా ఉండేట్లు కుడతారు.

కాళీ :

లంబాడీ స్త్రీలు ధరించే రవికను 'బోరవా అని కాళీ' అని అంటారు. ఈ రవిక నాలుగు భాగాలుగా ఉంటుంది. మొదట రెండు భుజాలు, పక్క భాగాలను 'పాటా' అనే పేరుతో నలుపు, ఎరుపు, పసుపు రంగులతో ఉన్న గుడ్డ లను జోడించి కుడతారు. కుట్టు కనబడకుండా ఉండ డానికి 'వేలే' అనే ఎంబ్రాయిడరీ చేస్తారు. స్త్రీలు తమ శరీర కొలతలను బట్టి రవికె ఆకారాన్ని తయారు చేసు కుంటారు.

ఛాంటియా :

ఇది లంబాడీ స్త్రీలు తలపై నుండి రెండు వైపుల ధరించే పైట. దీనిపై వివిధ ఆకారాలలో ఉన్న గాజు ముక్కలను అమరుస్తూ ఎంబ్రాయిడరీ చేస్తారు. దీనికి రెండు వైపుల లామణ్‌ను జోడించి కుడతారు. ఈ ఛాంటి యాకు తలపై నుండి రెండు భుజాలపై వేలాడుతున్నట్లు 'ఘుంగటో' అనేది తయారు చేస్తారు. లంబాడీ పురు షులు సాధారణంగా ధోవతి, రంగుల గుడ్డ తలపాగాలుగా ధరిస్తారు, నడుము నుండి మోకాళ్ల వరకు ఉండే తెల్లని ధోవతి, సగం చేతుల చొక్కా, ఎరుపురంగు తలపాగ (రుమాల్)ను ధరిస్తారు, ఎరుపురంగు అదృష్టాన్ని తెస్తుం దని నమ్ముతారు.

ఆభరణాలు :

లంబాడీలు అలంకరించుకునే ఆభరణాలు ప్రాచీన తను, ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఈ ఆభరణాలు చాలా బరువుగా ఉంటాయి. అర్ధచంద్రాకారంలో ఉన్న

ముక్కెరను 'భూరియా' అని అంటారు. చెవి కమ్మలను 'కన్యా' అంటారు. కాలి వేళ్ళకు పూలియా, చాప్, చల్లా వాంకడి, వించువా, చటికి అని వివిధ రకాల పేర్లలతో ఉంగరాలు, కడియాలు ధరిస్తారు.

రంగవల్లులు :

లంబాడీలు రంగవల్లిని 'చోకో' అని అంటారు. దేవాలయ ప్రాంగణంలో, ఇళ్ళముందు ఆవుపేడతో కళ్లాపి చల్లి ముగ్గులు వేస్తారు. ఇళ్ళలో వేసిన రంగవల్లుల మధ్య దేవుడి ప్రతిమ చేస్తారు. రంగువల్లులు వేయడం వల్ల దుష్టశక్తులు వారి దరిదాపుకు రావని లంబాడీల నమ్మకం.

పచ్చబొట్టు :

జానపదులు పచ్చబొట్టును మతసంబంధ సంప్రదాయక అలంకారిక కళగా భావిస్తారు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని మానవ సమాజాల్లోనూ పచ్చబొట్టు పొడిపించుకోవడం ఒక సంప్రదాయంగా ఉంది. లంబాడీ స్త్రీల సౌందర్య అలంకరణలో పచ్చబొట్టు ముఖ్యమైంది. వివాహానికి ముందు పచ్చబొట్టును శరీరంపై పొడిపించుకోవడం లంబాడీల ఆచారం. స్త్రీ, పురుషులందరూ తమ శరీరంపై పచ్చబొట్టును పొడిపించుకుంటారు. పచ్చబొట్టును లంబాడీలు పవిత్రతకు చిహ్నంగా భావిస్తారు.

జానపద క్రీడలు :

సంచార జీవులైన వీరు స్థిర నివాసం ఏర్పరచుకున్న తర్వాత తీరిక సమయాల్లో రక రకాల ఆటలు ఆడతారు. దాగుడు మూతలు, దయ్యం ఆట, కోడిపందెం, వేటాడటం వీరి ఆటవిడుపులు. అచ్చన కాయలు, చెమ్మ చెక్క, పులిజూదం, కోతి కొమ్మచ్చి, తొక్కుడు బిళ్ళ మొదలైన ఆటలను స్త్రీలు ఆడతారు. బొంగరాలాట, గోళీలాట, కబడ్డీ లేక బలిగూడు వంటి ఆటలను పిల్లలు ఆడతారు.

పాద సూచికలు :

1. చీన్యా నాయక్, బంజార చరిత్ర - సంస్కృతి ప్రగతి, హాథిరాం బావాజీ పబ్లికేషన్స్, అనంతపురం, 2000.
2. డా॥ జనపాల శంకరయ్య, తెలుగు లంబాడీ గేయ సాహిత్యం, జనపాల పబ్లికేషన్స్, కరీంనగర్, 2001
3. కె.శ్యామల, లంబాడీ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం, 2011.
4. డా॥ కె. శారద, ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన, గిరిజనేతర భాషలు, ఆంధ్రజ్యోతి, ఆదివారం కెరిర్ గైడెన్స్, తేది: 6.2.2000.
5. డా॥ జి. గోనా నాయక్,అనంతపురం జిల్లా లంబాడ సంస్కృతి సాహిత్యం, అనంతపురం.
6. డా॥ సూర్యాధనుంజయ్, నల్లగొండ జిల్లా బంజార సాహిత్యం - జీవన చిత్రణ, ఉస్మానియా విశ్వవిద్యాలయం.

తెలంగాణ రాష్ట్రంలో పోడు వ్యవసాయం – ఒక అధ్యయనం

– డా॥ రవి కొక్క, పరిశోధక విద్యార్థి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, కాకతీయ యూనివర్సిటి, వరంగల్, తెలంగాణ.

భారతదేశంలో 21 రాష్ట్రాలలో అడవులే తమ ప్రపంచంగా, జీవనాధారంగా మనుగడ సాగిస్తున్న మూలవాసులైన ఆదివాసి కుటుంబాలు సుమారు 23, 30 లక్షల మంది కుటుంబాలు ఉన్నాయి. అడవి-ఆదివాసిల మధ్య సంబంధం తల్లి-బిడ్డల సంబంధం తరతరాలుగ అడవి ఆదివాసులకు జీవనాధారం అవటం వల్ల సాంస్కృతి సంప్రాదయ కట్టుబాట్లు వ్యవహార సంబంధాలు కూడా పెంపొందించబడ్డాయి. అడవి, నీరు, అడవి జంతువులు ఆదివాసి సంప్రదాయంలో భాగాలు అయ్యాయి.

ముఖ్యంగా ఆదివాసులు అడవులతో అవినాభావ సంబంధం ఉంది, వారి ఆర్థిక జీవనం, సంస్కృతి కూడా అడవితో ముడిపడి ఉంది. ఆహారానికి వంట చెఱుకు, కలపకు ఇంటి నిర్మాణ పరికరాలకు, వనమూలికలకు, పశువుల మేతకు, వ్యవసాయ పనిముట్లకు అడవిని వినియోగించుకుంటున్నారు. గతంతో అటవి సంపదను, వనరులను అనుభవించేందుకు, వినియోగించుకోవడానికి ఆదివాసులకు ఎంతో స్వేచ్ఛ ఉండేది. 19వ శతాబ్ధంలో అడవులు ప్రభుత్వ యాజమాన్యం క్రిందకు వచ్చిన దగ్గర నుండి ఈ పరిస్థితి మారిపోయింది. 1914 అడవుల నిర్వహణకు సంబందించి మొదటి జాతీయ విధానాన్ని బ్రిటిష్ పాలకులు ప్రవేశపెట్టారు. ఆదివాసిలకు రెండు ముఖ్యమైన జీవన ఆధారాలు ఒకటి పోడు వ్యవసాయం రెండవది వేట మరియు మూడవది అటవీ ఉత్పత్తుల సేకరణ అటవీ ఉత్పత్తులు సిజనల్ పంట కాని పోడు వ్యవసాయంలో మాత్రం నిరంతరాయంగా పంటలు పండిస్తూ, అడవి దైవంగా వారు బావిస్తారు.

బ్రిటీష్ ప్రభుత్వం ఆదివాసి ప్రాంతాలు మాత్రం మిగిలిన ప్రాంతాల కంటే భిన్నంగా ఉంటాయని, వాటి పరిపాలన సామాన్య పరిపాలనలో కలపరాదని భావించి, బ్రిటీష్ వారు ఆయా ప్రాంతాలను షడ్యూలు ప్రాంతాలుగా (ఎజెన్సీ ఎరియాలు) 1829లోనే ప్రకటించారు, అలాగే హైదరాబాద్ నిజాం ప్రభుత్వం 1949లో నోటిఫైడ్ ప్రాంతాలుగా గుర్తించి బ్రిటీష్ వారు వీరిని హిల్ ట్రైబ్స్ అని పిలిస్తే, నిజాం ప్రభుత్వం నోటిఫైడ్ ట్రైబ్స్‌గా పిలిచారు, వీరి భూమి రక్షణకై చట్టాలు కూడా చేశారు.

కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ వారి లెక్కల ప్రకారం భారతదేశంలో 705 షడ్యూలు తెగలు వున్నాయి. వారిలో 75 పురాతన షడ్యూలు తెగలు, (9ప్రిమిటివ్ ట్రైబల్ (గ్రూప్పు)గా పిలుస్తారు. వీరు అర్థికంగా, విద్య వైద్య పరంగా, ఉద్యోగపరంగా చాలా వెనుకబడి వున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 10.42 కోట్ల షడ్యూలు తెగల జనాభా ఉంది. అది దేశ జనాభాలో 8.6 శాతం మధ్య భారతదేశం, దక్షిణ భారతదేశంలో ఆదివాసి జనాభా ఎక్కువగా ఉంది, ఈ శాన్య భారత దేశంలో షడ్యూలు తెగల జనాభా సాంద్రత ఎక్కువగా వుంది. దేశంలోని గిరిజన జనాభాలో 89, 96 శాతం గ్రామీణ ప్రాంతాలలోనే ఉన్నారు. తెలంగాణా రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం వీరి జనాభా 31.78లక్షల (9.8) ఏజెన్సీ ప్రాంతాలలో 9 తెగలు ఉండగా వీరు 1950 రాజ్యంగ సవరణ ద్వారా వచ్చిన ఆదివాసిలు, కోయ, గోండ్, నాయపోడ్, ఆద్, కోలం, పర్ధాన్, కొండరెడు, తోటి, చెంచు, మన్యవార్, జనాభా, 8,87,559 ఉండి అడవులలో నివసిస్తున్నారు. ఆదివాసుల వ్యవసాయం నాల్గు రకాలుగా వున్నాయి. 1) పోడు వ్యవసాయం, 2) సంచార పోడు వ్యవసాయం, 3) కొండపోడు వ్యవసాయం, 4) స్థిర పోడు వ్యవసాయం, ఈ నాల్గు రకాల పోడు వ్యవసాయాలతోనే వారు అనేక రకాల మెట్ట పంటలు పండిస్తారు.

పునఃసమీక్ష :

అడవితల్లిగా ఆదివాసి బిడ్డగా తరతరాలుగా పెంచు

కున్న అనుభందమే ఆదివాసి సంస్కృతిలో ముఖ్యమైన భాగంగా మరియు సంస్కృతి అంటే జీవన విధానం అని ప్రముఖ మానవ శాస్త్రవేత్త లూవిస్ పేర్కొన్నాడు. మానవుడు, ప్రకృతి, మానవాతీత శక్తుల మేలుకలయికే ఆదివాసి మతానికి ప్రాతిపదిక అని మరో ప్రముఖ మానవ శాస్త్రవేత్త విద్యార్థి పేర్కొన్నారు. ఆదివాసి ఏజెన్సీ ప్రాంతంలో స్థానిక ఉద్యోగ వారసత్వము భూమి వలసవాదుల వలన ప్రమాదం ఉంటుందని చెప్పిన మానవశాస్త్రవేత్త డా॥ బాలగోపాల్, ఆదివాసులు అడవిని దైవంగా చూస్తూ అటవి ఫలాలు మరియు పోడు వ్యవసాయం చేసుకొని బ్రతికె అమాయక ఆదివాసులు - హైమన్ డార్ఫ్.

రాష్ట్రంలో ఆడవులు 26,903.70 చ.కి.మీ ప్రకటిత అటవి ప్రాంతం వుంది. ఇది రాష్ట్ర విస్తీర్ణంలో 23.99% శాతం. దీనిలో 79.10 శాతం రిజర్వు అడవిగా తరువాత పేర్కొన్న లెక్కల ప్రకారం 95.29 శాతం రిజర్వు అడవులుగా చెప్పబడింది. 3.08 శాతం రక్షిత అడవులు, 1 శాతం ఏ విధమైన అడవులు వర్ణికరించలేదు అయితే ఆదివాసులు నివసించే ప్రాంతం 75 శాతం అడవులతో కూడుకొని వున్న ఆదివాసి ప్రాంతాలు వున్నవి అని గిరిజన శాఖ పేర్కొంది.

పోడు వ్యవసాయం :

తెలంగాణలోని ఎజెన్సీ ప్రాంతంలో చాలా వరకు పోడు వ్యవసాయంపైనే ఆధారపడుతున్నారు, పాలకులు గతం నుండి ప్రవేశపెడుతూ వచ్చిన అనేక అటవీ చట్టాలు పోడు వ్యవసాయంపై నర్భందం పెంచినపోడు వ్యవసాయాన్నే నమ్ముకొని జీవిస్తున్నారు. తెలంగాణలో వరంగల్, మహబూబ్‌నగర్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, ఉమ్మడి జిల్లాలలో సరిహద్దులలోని కొండ ప్రాంతాల్లో గోదావరి పరివాహక ప్రాంతాలల్లో నివసిస్తున్న ఆదివాసులకు చాలా కాలం నుండి నేటికి పోడు వ్యవసాయం మీదనే జీవిస్తున్నారు. గత 65 సం॥ వారితో ఎలాంటి మార్పులు రాలేదు, ఏజెన్సీ ఆదివాసులకు జీవనదారం పోడు వ్యవసాయమే, అయితే ఈ ప్రాంతానికి సంబందించిన గ్రామాల్లోని కొన్నింటిలో పోడు భూములతో పాటు, నాగలితో దున్నే పోడు వ్యవసాయ పద్ధతి కూడా స్వతంత్రం వచ్చిన తర్వాత సగకాలంలోనే కొంత అభివృద్ధి చెందినది, కొండ కాలువలను, చేల యేరులను, తోగులను మలుపుకొని కాల్వల ద్వారా వరిని పండించే అలవాటు చేసుకొన్నారు. ఈ జిల్లాలో వరితో పాటు ఇతర మెట్టు పంటలు పండించే ఆదివాసులకు ఏ బయటి వ్యక్తి గాని, సంస్థలు గాని పరిచయాలు చేయలేదు, రవాణా మార్గాలు మెరుగు పడటంతో ఆదివాసులు సమీప కేంద్ర ప్రాంతాలకు అవసరాలరిత్య సంత వస్తువులకు వచ్చిపోయే తరుణంలో అచ్చట జరుగుతున్న సాగు పద్ధతులను గమనించుటకు వీలు కలిగింది, అలా గ్రహించిన పద్ధతినే వీరు కూడా అమలులో పెట్టు కోగలిగారు.

పూర్వం నుండి పోడు భూములలో పండించే పంటలు వరి, కొర్రలు, సమాలు, అరికెలు, సజ్జలు, రాగులు, జొన్నలు, పప్పు ధాన్యాలు, గోగు పువ్వాకు ఇతర మెట్ట పంటలను కరేద(చల్లడం) ద్వారా పండించే వారు ఏజెన్సీ ప్రాంతంలో బిన్న వ్యవసాయంగా చెప్పవచ్చును. స్థిరపోడు వ్యవసాయాలుగా అభివృద్ధి చెందాయని అనుకోవచ్చు. అటవీ ప్రాంతాల్లో నివసించే ఆదివాసులు చేస్తున్న పోడు వ్యవసాయం నష్టకరమని, ప్రమాదకరమని, అటవీ అధికారులు చేప్తుంటారు, పోడు వ్యవసాయానికి ఎన్ని విరుద్ధ అభిప్రాయాలు ఉన్న కొన్ని వేల సంవత్సరాల నుండి అమలులో పోడు పద్ధతికి పరిమితులు ఎన్ని ఉన్నప్పటికి అది అమలులో ఉన్నంతకాలం అడవికి ఎటువంటి నష్టం రాలేదు. ఎందుకంటే ఆ పోడు వ్యవసాయంలో పూర్వ పద్ధతులు అటవిలో పెద్ద చేట్లను నరక కూడా చిన్న చేట్లను, మొక్కలను నరికి వాటిని కల్చి దానిలోనే తగల బెట్టి చిన్న చిన్న కమతాలు చేసి ఎదురు వచ్చే కాలువలను మలించే గట్టువేసి అమల్లలో కర్రుతో తవ్వి చేసిన వాటిలో విత్తనాలను కర్రెద (చల్లడం) ద్వారా పండించడం. అలాగే కొంతమంది ఆదివాసీలు నివసించే కొండ ప్రాంతాల్లో

వ్యవసాయం లాభసాటిగా ఉండదు. అయినా దిక్కులేని పరిస్థితుల్లో కొండ ప్రాంతాల్లో కొండ వాలులపై పోడు వ్యవసాయం చేసి జీవించవలసి వస్తుంది. ఆధునిక వ్యవసాయ పద్ధతి, పారిశ్రామిక అభివృద్ధి వల్లనే అడవులు నష్టపడ్డాయి తప్ప, ఆదివాసి పోడు వ్యవసాయం కాదు. 2006 చట్ట వచ్చిన తర్వాత పూర్తి స్థాయిలో స్థిరపోడు వ్యవసాయంగా మారింది, ప్రభుత్వం లెక్కల ప్రకారం ఆదిలాబాద్, ఉమ్మడి జిల్లాలో 1126 ఆదివాసి కుటుంబాలు 13,401 వేల హెక్టార్లు, ఖమ్మం 8,216 కుటుంబాలు 14,879 హెక్టర్లలో, వరంగల్ 7,768 కుటుంబాలు, 16,472 హెక్టార్లలో పోడు వ్యవసాయం చేస్తున్నారు.

పోడు భూమి సమస్యలు :

అడవిని నమ్ముకొని అడవిలో వున్న ఉత్పత్తులు మరియు చిన్న చేట్లను నరికి, భూమిని చదును చేసి సాగుచేస్తున్నా భూములను ఉత్పత్తులను గిరిజనేతర భూస్వాములు, పెత్తందారులు ఆక్రమించుకోవడమే కాక, వాళ్ళు పండించిన పంటలకు సరియైన ధరలు చెల్లించకూడా దోపిడి చేస్తున్నారు. వడ్డి వ్యాపారాలు ఆదివాసులకు అధికవడ్డికి రుణాలిచ్చి ఆదివాసిలను అప్పుల ఊబిలోకి దించి వారిని అనేక రకాలుగా దోపిడికి గురి చేస్తున్నారు. అయితే షడ్యూల్డ్ ప్రాంతాలలో వడ్డీ వ్యాపారాన్ని నిరోధించే ఆంధ్రప్రదేశ్ చట్టం 1917, 1959, 1963 లలో గిరిజన భూముల భూబదలాయింపు నిరోధక చట్టం 1/70 వంటి చట్టాలు, పాలకులు ఆదివాసీలను రక్షించలేక పోయారు.

నూతన అటవీ విధానం వల్ల పోడు చేసుకొనే ఆదివాసీలకు రక్షణ లేకుండా పోతుంది. 1952లో కొత్త అటవీ విధానం ప్రకటించబడింది. 1980లోనూ, 1988లోనూ ఈ విధానాన్ని సవరించి కొత్త విధానాన్ని రూపొందించడం జరిగింది. ఈ విధానాలు అడవులను సంరక్షించి వినియోగించడం.

అటవీ ప్రాంతంలో జీవించే ఆదివాసీలు తొలకరి చినుకు రాలక ముందే విత్తన పండుగలతో పోడు భూములను సాగుకు సిద్ధం చేస్తూ అట పాటలతో ఆచార సాంప్రదాయబద్ధంగా భూమి తల్లి పండుగలు చేస్తూ గూడాలలో సంబరాలు సందడి చేస్తుంటారు. గత ఐదు సంవత్సరాల నుండి గూడాలలో తొలకరి కాలం వచ్చిందంటే విత్తనాల పండుగలు, భూమి పండుగలకు బదులు హరితహారం పేరుతో వదలకుండా తెలంగాణ ప్రభుత్వం ఫారెస్ట్ అధికారులతో దాడులు, దౌర్జన్యాలు అక్రమ అరెస్టులు, పిడియాక్ట్ కేసులతో జైల్లో పెడుతూ అనునిత్యం వేదింపులతో ఆదివాసి గూడాలకు గూడాలే అందోళనతో బ్రతకాల్సిన పరిస్థితి.

గత ఐదు సంవత్సరాల నుండి ప్రభుత్వం అడవుల పెంపకానికి హరితహారం పేరుతో ఆదివాసుల సాగు చేసుకుంటున్న కొద్ది పాటి పోడు భూములను స్వాధీనం చేసుకుంటూ వ్యాపార వాణిజ్య మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అన్యాయం. ప్రస్తుతం ఉన్న అడవులను కాపాడుకుంటూ బీడు భూములలో అడవులు లేని మైదానాల్లో అడవులు పెంచే కార్యక్రమం చేపట్టకుండా అటవీ హక్కుల చట్టాన్ని కాలరాస్తూ ఆదివాసీల జీవానాధారాలను ధ్వంసం చేస్తుంది. గత 50, 60 ఏండ్లుగా ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ అటవీ ప్రాంతాలలో ఆదివాసులను వలస కూలీలుగా మారుస్తున్న దారుణ పాలన నేడు కొనసాగుతుంది. నిజాం కాలం నుండి నేటి పాలకుల వరకు ప్రజల కోసం అభివృద్ధి అని ముద్దు పేరు పెట్టి ఆదివాసులను నిరంతరం నిర్వాసితులుగా చేస్తున్నారు. వ్యాపార ప్రయోజనాల కోసం బహుళజాతి ప్రయోజనాల కోసం మైనింగ్ ఏర్పాటు భారీ నీటి ప్రాజెక్టుల నిర్మాణం మూలంగా లక్షల ఎకరాల్లో అడవులు ధ్వంసమైన అభివృద్ధి కోసమే అంటున్నారు. ఆదివాసులు పోడు భూముల్లో రాగులు, వరి, సజ్జలు, మొక్కజొన్నలు, సెనగలు పండించుకొని అటవి బిడ్డలు ఆకలి తీర్చుకుంటే అడవుల విధ్వంసకులంటున్నారు. దుష్ప్రచారం చేస్తూ పోడు భూములను లాక్కొని కేసులు పెట్టి జైల్లో పెడుతున్నారు.

ఇంతవరకు తెలంగాణ ప్రభుత్వం ఒకరికి కూడా హక్కు పత్రాలు ఇవ్వలేదు. సాగు చేస్తున్న ఆదివాసులు చిన్న సన్నకారు రైతులపై పీడియాక్ట్ కేసులు పెట్టడం దారుణం. 2006 అటవీ హక్కుల చట్టం ద్వారా 2005 డిసెంబర్, 13 ముందు సాగులో ఉన్న అటవీ భూములపై ఆదివాసులకు 10 ఎకరాల వరకు హక్కు పత్రాలను ఇవ్వాలని అటవీ హక్కుల చట్టం తెలియజేస్తుంది. ఉమ్మడి రాష్ట్రంలో గత ప్రభుత్వం తెలంగాణ ప్రాంతంలో 1,38,847 ఎకరాలల్లో పోడు భూములు ఉండగా 2,15,724 మంది హక్కు పత్రాల కోసం దరఖాస్తు చేసుకుంటే 1,42,247 దరఖాస్తులను మాత్రమే స్వీకరించి పట్టాలు ఇచ్చారు. విచిత్రం ఏమిటంటే పట్టా హక్కు పత్రాలు ఇచ్చిన పోడు భూముల్లోకి ఆదివాసీలను పోడు భూములను సాగు చేయకుండా అటవీ శాఖ వారు అడ్డు పడుతున్నారు. పోడు భూములకు హక్కుల చట్టం ప్రకారం హక్కులు కల్పిస్తారని ఆశపడ్డ ఆదివాసులకు బంగారు తెలంగాణలో భంగపాటు తప్పలేదు. పోడు భూములు సాగు చేస్తున్న పంటలను ధ్వంసం చేయడం, పోడు భూముల చుట్టూ కందకాలు తవ్వి మనుషులు, పశువులు అది దాటి రాకూడదంటూ పశువుల మేతకు రాకుండా అడ్డుకుంటున్నారు. పోడు భూములను ప్లాంటేషన్లుగా తయారుచేస్తున్నారు. బహు ప్రజల ప్రయోజనాలంటూ అభివృద్ధి పేరుతో విచ్చలవిడిగా అడవులను బహుళజాతి కంపెనీలకు అప్పగిస్తూ లక్షలాది ఎకరాలలో, అడవుల్లో వైనింగ్ ఏర్పాటుతో అడవులు తరిగి పోతున్నాయి. ఈ మధ్యనే ఫిబ్రవరి 13, 2019 రోజున దేశ సర్వోన్నత న్యాయస్థానం ఆదివాసీల సాగులో ఉన్న పోడు భూములను లాక్కునే ప్రయత్నంలో భాగంగా ఆక్రమ ఆదివాసీలు దురాక్రమణ ఆదివాసీల సాకుతో అటవీ భూముల నుండి వారిని తొలగించాలంటూ తీర్పు ఇచ్చింది.

అడవుల పెంపకం పేరుతో చిన్న సన్నకారు ఆదివాసి రైతుల పోడు భూములను దౌర్జన్యంగా లాక్కుంటూ భూసారాన్ని ధ్వంసం చేసే జామాయిల్ మొక్కలను పోడు భూములలో నాటుతున్నారు. ఈ మధ్య కాలంలో రాష్ట్రంలో చూసినట్లైయితే ఆదిలాబాద్ జిల్లాలో ఉట్నూర్ మండలంలో వేల హెక్టార్లలో హరితహారం పేరుతో భూములను లాక్కోవడం ద్వారా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. కొందరిపై కేసులు బనాయించి జైలులో పెట్టినారు. ఖమ్మం జిల్లాలో కూడా ఇల్లందు మండలంలో వందల హెక్టారులలో మొక్కలు నాటినారు. వీటిని ఆదివాసులు తొలగించే ప్రయత్నంచేస్తే వారిపై పిడియాక్ట్ కేసులు పెట్టడం, అలాగే గుండాల ఏరియాలో పోడు భూములపై పోరాటం చేసే విప్లవ ఆదివాసులను కొట్టడం, కేసులు పెట్టడం, ఇప్పటికి వందల మందిపై కేసులు పెట్టి మానసిక ఆందోళనకు గురిచేస్తున్నారు. వరంగల్ జిల్లాలో ఎక్కువ దాడులు కొత్తగూడ, తాడ్వాయి మండలంలో పోడు భూములు లాక్కొని అందులో వున్న మొక్కజొన్న పంటను ధ్వంసం చేసి కేసులు పెట్టి చిత్రహింసలకు గురి చేస్తున్నారు. టైగర్ జోన్ల పేరుతో ఆదిలాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలో కావ్వాల్, ఏటూరునాగారం, నల్లమల్ల అడవులలో యురేనియం, బాక్సైట్ ఏరియాలుగా ప్రకటించి అక్కడి ఆదివాసులను నిర్వసితులను చేయడం, ఇలా ఆదివాసులను భయభ్రాంతులు చేస్తూ వారి జీవన విధానాన్ని విధ్వంసం చేస్తున్న ప్రభుత్వం.

చట్టాలు - సమస్యలు :

ఏజెన్సీ ప్రాంతంలో నిజాం నవాబు తన సొంత రెవెన్యూ పెంచుకొనేందుకు విస్తారంగా ఉన్న అటవీ భూములపై వేలం పాటలు నిర్వహించి, మైదాన ప్రాంత ప్రజలను ప్రవేశపెట్టారు. జమీందారి, మొఖాసా పద్ధతులు అమలు చేసినారు. ఆ విధంగా గిరిజనేతర ప్రజలు వలస ప్రారంభమైనది. అటవీ జంతువుల (రక్షణ) చట్టం, 1972 ఈ చట్టం ప్రకారం అభయారణ్యాలను ప్రకటించవచ్చు. ఈ చట్టం ద్వారా పుల్లారి పన్ను ఎక్కువగా ఆదివాసులు కట్టేవారు. 1980లో కేంద్ర ప్రభుత్వం అటవీ (సంరక్షణ)

చట్టం ఈ చట్టం ద్వారా అటవీ వ్యవహారాలన్నీ కేంద్ర పరిధిలోకి వెళ్ళిపోయాయి. ఈ చట్టం ద్వారా ఆదివాసులు గిరిజనేతరులు చాలా కష్టాలు పడినారు, జాతీయ అటవీ పాలసీ 1988-రిజర్వు అడవులు ఆభయారణ్యాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వానికి వెళ్ళవలసిన విధానంలో పెద్ద మార్పు 1990 సంయుక్త అటవీ యాజమాన్యం ప్రకటించింది అటవి పరిసరాలలో ఉన్న గ్రామాలలో వనరక్షణ సమితులు ఏర్పాటు 1993 రాష్ట్ర అటవీ పాలసీ, సామాజిక అటవీ పాలసీ 2002, ఈ పాలసీలన్ని ఎజెన్సీ ఏరియాలో జరగ లేదు. ఈ ప్రాంతంలో మొత్తం విప్లవ ఆదివాసి ఉద్యమం వుండడం వల్ల అటవీ అధికారులు ఆదివాసుల జోలికి వెళ్ళేవారు కాదు. పోడు భూములపై కేసులు పెట్టేవారు కాదు, ఆదివాసి ప్రాంతాలలో చట్టాలు కొంత అమలు కాలేదని చెప్పవచ్చు. తెలంగాణ రాష్ట్రాలలో 3 లక్షల ఎకరాలు ఆదివాసిల ఆదినంలో వుంది, ఈ పోడు భూములను స్వాదిన పర్చుకోవడానికి ప్రభుత్వానికి సద్యపడలేదు. ఇవన్నీ గమనించిన తర్వాత 2004లో ఎన్నికల ముందు యు.పి.ఎ.ఎన్నికల మేనిఫెస్టోలో అటవీ హక్కుల పరిరక్షణ చోటు చేసుకొంది. దీని ద్వారా అటవీ హక్కుల చట్టం 2006 వచ్చిన పోడు భూములకు పట్టాలు అంతంత మాత్రమే వచ్చిన ఈ చట్టం ద్వారా వలస పాలన కాలంలో కాని, స్వతంత్రం వచ్చిన తర్వాత కాని ప్రకటించిన రిజర్వు అడవుల్లో పూర్వీకుల కాలం నుండి ఉన్న గ్రామాలు భూముల మీద ఆదివాసులకు, సాంప్రదాయకంగా అడవుల్లో నివసించేటమే ఈ చట్టం లక్ష్యం. ఈ చట్టం ద్వారా పోడు భూములపై హక్కులను గుర్తించి వారికి అవి సంక్రమించే విధంగా రికార్డులు తయారు చేయడం గుర్తింపు కల్పించడం.

ముగింపు :

ఆదికార మార్పిడి అనంతరం 1952లో కొత్త అటవీ విధానం ప్రకటించబడింది. 1980లోను, 1988లోను ఈ విధానాన్ని సవరించి కొత్త విధానాన్ని రూపొందించడం జరిగింది. ఈ విధానాలు అడవులను సంరక్షించి వినియోగించడం కన్నా అడవులను కొల్లగొట్టి నాశనం చేయడానికే తోడ్పడ్డాయి, విక్షణం రహితంగా అడవులను నరికివేయడం జరిగింది. రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్లు, ఆదికారులు కుమ్మక్కయి అడవులను ధ్వంసం చేస్తున్నారు. ఈ అటవి విధానాలు అటవి సంపదపై సంప్రదాయకంగా వస్తున్న ఆదివాసి హక్కులను క్రమేణ హరించివేస్తూ వచ్చాయి. ఆదివాసులను అన్యాయానికి గురిచేస్తున్నాయి. అయితే ఆదివాసులు అడవులు ధ్వంసం చేసే వారిగా చిత్రికరించడం జరుగుతున్నది. వాస్తవంగా వారు పంట చేరుకు, చిన్న అటవీ ఉత్పత్తులకు, ఇంటి అవసరాలకు మాత్రమే అతి కొద్ది మొత్తంలో (మోయగలిగినంత) తీసుకురాగలరు. అయినా అటవీ అధికారాల దౌర్జన్యాలకు, లంచగొండి తనానికి, వెట్టి చాకిరికి ఆదివాసీలు బలవుతున్నారు. అడవులను లీజుల పేరుతో రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్లు, స్మగ్లర్లు ఆధునాతన పరికరాలతో, రవణా సౌకర్యాలతో వందల మంది కూలీలను వినియోగించి, ఆదికారులకు లంచాలు మేపి అడవులను నిత్యం లూటి చేస్తున్నారు. అడవులు ధ్వంసం అయిపోవడానికి ఇదే అసలు కారణం, అడవీలో పోడు వ్యవసాయం వల్ల అటవి చాలా ధ్వంసం అవుతుందని చెప్పడం సిగ్గుచేటు. చెట్లను జంతువులను ఆరాధించే ఆదివాసి అడవులకు నష్టం కలిగించే పోడు వ్యవసాయం మానిపించాలని ప్రయత్నిస్తే ఆదివాసులు మరింత దుర్భరం అవుతారు. ప్రభుత్వానికి అభివృద్ధి చేయాలనే చిత్తశుద్ధి ఉంటే హరితహారం పేరుతో మొక్కల పెంపకంలో ఆదివాసులను భాగస్వామ్యం చేస్తూ అటవి భూములలో పండ్ల మొక్కల పెంపకం చేపట్టి వాటిపై వచ్చే ఆదాయం ఆదివాసీలకే చెందేటట్లు చేయాలి. ఆదివాసీ భూములలో భూసారాన్ని పూర్తిగా ధ్వంసం చేసే యూకలిప్టస్ లాంటి చెట్లను పెంచకుండా 2005 నుండి సాగు చేస్తున్న పోడు భూములకు అటవీ హక్కు పత్రాలు ఇవ్వాలి. ఆదివాసి పోడు వ్యవసాయంను అభివృద్ధి చేసి భూమి చదును

చేయడం, విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు ఉచితంగా అందించి పోడు వ్యవసాయమును స్థిర వ్యవసాయంగా అభివృద్ధికి తోడ్పాటు అందించాలి.

సూచనలు :

గిరిజన ప్రాంతాలన్నిటిలోను సమగ్రంగా భూమి సర్వే చేసి భూమి నిర్ధారణ చేపట్టాలి. పోడు భూములలో హక్కుల నిర్ధారణ అటవీ చట్టం 1967 ప్రకారం సర్వే జరిగి గిరిజనులకు శాశ్వత హక్కులు కల్పించాలి. ఇప్పుడు ఆదీనంలో ఉన్న పోడు భూములన్నిటికి అటవీ హక్కుల చట్టం, 2006 ప్రకారం అన్ని ఆవాసాలలోను గ్రామ సభలు నిర్వహించి, సామాజిక, వ్యక్తిగత హక్కులు నిర్ణయించి పట్టాలు ఇవ్వాలి. ఇంతకు ముందు తిరస్కరించిన దరఖాస్తులన్ని మళ్ళీ పరిశీలించాలి, అప్పటి వరకు వారిని భూమి నుంచి తొలగించరాదు. పట్టాలిచ్చిన వారందరికి భూములు చూపాలి, భూములున్న వారికందరికి పట్టాలు ఇవ్వాలి.

గ్రంథ సూచిక :

1) ఆదివాసి గోంతుక, త్రైమాసిక పత్రిక, జనవరి 18 - జూన్ 2019.
2) రాష్ట్రంలో గిరిజనులు - సమస్యలు డా॥ వి.ఎన్.వి.కె.శాస్త్రి,
3) భారతీయ గిరిజనులు-గుహ
4) ఫారెస్ట్ ట్రైబల్ కల్చరల్ ఇన్ ఏసియన్, లూవిస్.
5) ట్రైబల్ రిజియన్స్ ఇన్ ఇండియా - విద్యార్థి.
6) 2011 జనాభా గణన తెలంగాణ గణాంకాల శాఖ, 2014.
7) "ఆదివాసిస్, నక్సలైట్స్ అండ్ ఇండియన్ డెమోక్రసి" వారపత్రిక - రామచంద్ర గూహ, ఆగస్టు 2011.
8) ఆదివాసుల విధ్వంసం, 2010 డా॥ బాలగోపాల్.
9) స్ట్రగుల్ ఫర్ సర్వైవల్, 1985, హైమన్ డార్ఫ్.
10) ల్యాండ్ ఎలిగేషన్ ఇన్ ట్రైబల్ ఏరియాస్-ఎ కెస్ స్టడి ఇన్ ఆంధ్రప్రదేశ్ 1987, ప్రో॥ బియ్యాల జనార్ధన్ రావు.

గిరిజనుల జీవిత సజీవ దర్పణం – వసంతరావు 'అడవి'

– డా॥. కోలా శేఖర్, లెక్చరర్, తెలుగు విభాగం, ఆంధ్ర లొయోల కళాశాల, విజయవాడ.

వసంతరావు దేశపాండే రాసిన నవల 'అడవి'. అడవిలో స్వేచ్ఛగా జీవించే గిరిజనులను అనేక విధాలుగా కట్టడి చేయటం, నాగరిక ప్రజలనుకొనే వాళ్లు అడవిలా అనాగరికంగా ప్రవర్తించడం, వారిపై హక్కుదారులు తిరగబడటం, దోపిడీదారుల దౌర్జన్యాల నుంచి సామాన్యుడు తరాలు మారినా, శతాబ్దకాలమైనా తప్పించుకోలేక పోవటం చిత్రితమైన నవల ఇది. నిరంకుశ ప్రభుత్వమైనా ప్రజాస్వామ్య పాలనైనా గిరిజనుడి బ్రతుకు వెతల నుంచి తేరుకోకపోవటం చూస్తే, ఒక ప్రక్క నాగరిక ప్రపంచపు మానవుడు అభివృద్ధిచెంది అంతరిక్షాన్నీ అదుపు చేస్తూ ఉంటే మరో పక్క మనిషిని నీచంగా హీనంగా దోచుకొనే దౌర్భాగ్యపు దిగజారిన పరిస్థితి కనిపిస్తూంది.

నవలలో ఇతివృత్తం ముఖ్యంగా గోండులు, నాయకపోళ్ల పర్దాములు కొలాములు వంటి గిరిజన సమూహాలు వారి గూడేలు అదిలాబాద్ అడవిలో ఉన్నాయి. వ్యాపారుల, నిజాం నవాబు అధికారుల, భారత ప్రభుత్వ అటవీ అధికారుల హింస, మోసం, దౌర్జన్యం, దోపిడీలకు ఆ గిరిజనులు నశించటం భయంకర వాస్తవం. దశాబ్దాల తరబడి జరిగిన హింస దౌర్జన్యాలకు గురై కొమరం భీం నాయకత్వంలో తిరగబడ్డారు. దానిని నిజాం ప్రభుత్వం అణచి వేసింది. ఆ తర్వాత 1980లలో చైతన్యవంతమైన గిరిజన సమూహం ఇంద్రవెల్లిలో సభను ఏర్పాటు చేసుకోవటానికి ప్రయత్నించి భారత ప్రభుత్వ అణచివేతకు గురయ్యారు. నేటికీ మారని వెతల తలరాతల వ్యధకు అక్షర రూపమే అడవి నవల.

'అడవి' నవలే అయినా చారిత్రక వాస్తవ జీవిత ఘట్టాల ప్రోదికూడా. నిజాం నవాబు పాలనలో అదిలాబాద్ అడవులలో ఉన్న గోండ్లు కొలాములు తదితర గిరిజనులు ఎన్నో ఇక్కట్లకు గురయ్యారు. దారుణ హింసకు, క్రూరమైన గోపిడికి గురయ్యారు. జంగు అనే వ్యక్తి ఇటువంటి హింస నుంచి పారిపోయి పక్కనున్న బాబెఝరి గూడేనికి వెళ్లినప్పుడు అక్కడి కొలాములు తమ బంధువు, సిద్ధిక్ అనే భూస్వామిని చంపి, పారిపోయి చాలా ఏళ్లకు ప్రపంచాన్ని చూసిన జ్ఞానంతో తిరిగి వచ్చిన కొమురం భీంని గుర్తు చేసుకొన్నారు. అతన్ని కలుసుకొన్నారు. వెతలను చెప్పుకొన్నారు. బాబేఝరికి వచ్చిన భీం చుట్టు పక్కల 12 గూడేల గిరిజనులు భూమి కోసం పడే కష్టాలను తెలుసుకొని వారిని ఏకం చేశాడు. వీరు సర్కారు పేరిట అధికారులు చేసే దౌర్జన్యాన్ని నిజాం నవాబుకు విన్నవించాలని ప్రయత్నించి విఫలమయ్యారు. అడవులు నరకటం నేరమనే సర్కారు మాటను, పోడు వ్యవసాయదారులైన గోండ్లు పెడ చెవినపెట్టి నరికారు. అడగడానికి వచ్చిన అధికారులు చేసే దౌర్జన్యం పై భీం ఆధ్వర్యంలో గిరిజనులు తిరగబడ్డారు. అందులో భీం గాయపడ్డాడు. వారు వెనుదిరిగి వెళ్లి తిరిగి పెద్ద సేనతో వచ్చారు. ఈ లోపు భీం నాయకత్వంలో గిరిజనులంతా కలిసి సైన్యంగా ఏర్పడి 'సాముగారడీ నేర్చుకోసాగారు. కర్రతిప్పడం, వడిసె విసరడం, బరిసెలిసరడం' (140) నేర్చుకొన్నారు. భీం నాయకత్వంలో తలెత్తిన తిరుగుబాటును అణచివేసేందుకు అసఫ్‌జాహి సైనికులు జొడెన్‌ఘాట్ చేరారు. కొండపైనున్న గొండ్లతో పోరాటం కష్టం అయ్యింది. సబ్ కలెక్టరును నిజాం పరిధికి పంపాడు. అది విఫలం అయ్యింది. సెప్టెంబరు ఒకటి 1940న అబ్దుల్ సత్తార్ నాయకత్వంలో నిజాం సైనికులు దాడి చేశారు. ఘోర పోరాటంలో, సైనికుల తుపాకుల ముందు గోండ్ల బరిసెలు ఈటెలు నిలువలేకపోయాయి. వారి తుపాకి దెబ్బకు కొమరం భీం నేలకు ఒరిగాడు, గోండ్లు నీరుకారి పోయారు.

భీం నాయకత్వంలో జరిగిన తిరుగుబాటు అనంతరం ఒక సంవత్సరానికి నిజాం ప్రభుత్వం గిరిజన సంక్షేమశాఖ సలహాదారైన హేమన్‌డార్ఫ్‌న్ అనే జర్మనీ దేశస్థుడిని వారి స్థితిగతులను తిరుగుబాటుకు కారణాలను అధ్యయనం చేయటానికి నియమించాడు. అతడు రెండేళ్ల తర్వాత నివేదిక సమర్పించాడు. ఇది నవలలో ఉన్న అంశం.

ఇతని పూర్తి పేరు క్రిస్టోప్ వాన్ ఫరెర్ హైమన్‌డార్ఫ్. నిజానికి ఇతడు ఆస్ట్రియా దేశస్తుడు. జర్మన్ శాస్త్రజ్ఞుడు. నిజాం ప్రభుత్వానికి తన నివేదిక ఇచ్చాడు. ఇతను భారత దేశంలోని గిరిజనులపై ఎంతో కృషి చేశాడు. దాని ఫలితం గానే ప్రామాణిక గ్రంథం వెలువడింది. ఆ రచనలో చాలా నిశితంగా గిరిజన జీవితాన్ని అధ్యయనం చేసి వాస్తవాలు వ్యక్తం చేశాడు.

గిరిజనులు అయిన గోండ్లు కొలాములు తదితరులపై అడవులలో జరిగే అరాచకం అనంతం. వారిపై జరిగే దోపిడి బహుముఖాలతో సాగుతుంది. అడవి పుత్రుల అమాయకత్వం, అజ్ఞానం, విపరీతంగా కష్టించే స్వభావం వారికే శిక్ష అయ్యింది. దోపిడీకి కారణం అయ్యింది.

అడవులలో ఉండే వారికి నిత్యజీవిత వస్తువులు కొన్నే లభ్యమవుతాయి. ఇతర విషయాలకు గిరిజనులకు వ్యాపారస్థులపై ఆధారపడవలసిందే. వారి అమాయ కత్వాన్ని ఆసరా చేసుకొని వారిని ఎంత దోచుకోవాలో ఎన్ని విధాల దోచుకోవాలో అన్ని విధాలా దోచుకొన్నారు. గిరిజనులకు దొరకని ఉప్పును తెచ్చి వస్తు మార్పిడిగా ఉప్పు బెల్లం కిరసనాయిలు అగ్గిపెట్టెనిచ్చి వారు కష్టించి పండించిన అడవిలో సేకరించి తెచ్చిన సారపప్ప నువ్వులు దూదినీ తీసుకొనేవారు. వ్యాపారి ఇంటి నుంచి ఒక బండితో సరుకులు వస్తే, మూడు బండ్లతో సరుకులు ఇంటికి చేరుతాయి. అది గిజనుల అమాయకం. 'ఆల్లకు ఏం గావాల్నో తెలుసుకొని అవి దుకాణంల నిండుకోకుండ సూడాల. అట్లుంటే నాలుగేళ్లలో నలపై ఎకరాల ఆసామి గావచ్చు. ఇల్లు మీద ఇల్లు గట్టొచ్చు' (39). ఇది వ్యాపారి తెలివి, దోపిడీ గోండ్లు చేసే వ్యవసాయంలో కొంత భాగం పొందటం కాక పన్ను రూపంలో ఎంతో రాబట్టారు. వారు అడవిలో సేకరించిన వంట చెరకుకు మాత్రమే 'అరక' దుంపపట్టి, వ్యవసాయానికి దుంపపట్టి వసూలు చేశారు. ఇంతే కాదు ఇప్పపువ్వు సుంకం, గడ్డి పన్ను, సారపప్పకు పన్ను, బంక మన్నుకు పన్ను, ఎడ్ల పశువుల సంఖ్యను బట్టి పన్ను, అడవిలో తెచుకొన్న వెదురుకూ పన్ను, చివరికి పెళ్లి పందిరికి వేసిన కర్రలకూ పన్నే. రోజులు గడిచే కొద్దీ అధికారుల గడుసుదనం పెరిగే కొద్దీ, పన్ను వసూలు జాబితాలోకి ఎన్నో వస్తువులు వచ్చి చేరి గిరిజనులను కుంగదీశారు.

గోండ్ల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని వారి భూమిని వివిధ రకాలుగా స్వాధీనం చేసుకొన్నారు. పిట్ట బంగారం గూడెంలో అత్రం రామారావు చనిపోయాడు. అతని కూతురు దేవుబాయి తమ్ముడు పేరిట శిస్తు కట్టినా చిన్నవాడు కాబట్టి శిస్తు కట్టలేడని భూమి మళ్లీ కావలసి నప్పుడు ఇప్పిస్తానని వారికి నచ్చచెప్పి వారి వేలి ముద్రలు తీసుకొని ఆ భూమిని స్వాధీనం చేసుకొన్నాడు. పటేలు మహమూద్ ఆలీ. గోండ్ల పట్టా భూమిని, ఎవరైనా చని పోతే వారసులున్నా లేకపోయినా పట్టా నుంచి వారిని తప్పించి 'ఖరీజ్‌ఖాతా'లో కలిపేసి, తర్వాత దానిని బినామీ పేరిట పట్టా చేసుకొంటాడు. ఇది ఒక విధమైన దోపిడి-గిరిజనుల అజ్ఞానాన్ని ఆసరా చేసుకొని.

లౌక్యంగా మోసం చేయటమే కాదు, దౌర్జన్యంగా కూడా భూమిని స్వాధీనం చేసుకోవటం ఉంది. మోకాషిది ఒకప్పుడు రాజరికం చేసిన వంశం. నాగోరావు గోండు పెద్ద. 500 ఎకరాల యజమాని. 50 ఎకరాల పంట పండిస్తూ, మిగిలిన భూమిని 'పడోత్'గా వదిలేశాడు. జంగ్లాత్ వాళ్లయిన అమీన్ సేరేదార్ చౌకీదార్‌లకు డబ్బు కట్టాల్సిందే. పంట పండించటం లేదు. కనుక మిగిలిన భూమిని అడవి భూమిలో కలిపేస్తాన్నారు. మోకాషి ఎంతో ముట్ట చెప్పినా కొంత వదిలేసి మిగిలినదంతా అడవి భూమిగా కలిపేసి హద్దు రాళ్లు మోకాషి లాంటి వారి నుంచి ఆక్రమించిన స్థలంలో నాటేశాడు. వారి వేడి

కోళ్లు అరణ్యరోదనే అయ్యాయి. ఇలా గోండ్లు వారి పట్టా భూములనూ అధికారుల దౌర్జన్యాల ఫలితంగా కాపాడు కోలేక పోయారు.

అటవీ అధికారులు వ్యాపారులు పటేలులాంటి గ్రామాధికారులు, నాడు భూమిని గోండ్ల నుంచి దోచు కోవటంలో ఎప్పటికప్పుడు వినూత్న పద్ధతులను కనుగొని మరీ హింసిస్తూ ఉండటం ఒక చారిత్రక వాస్తవం.

ఆర్థిక దోపిడి భూ దోపిడీనే కాదు. గిరిజనుల శ్రమను దోచుకోవటం అధికారుల దౌర్జన్యానికి నిదర్శనం. నాయక పోళ్లు పోడు వ్యవసాయం దొంగచాటుగా చేసుకొంటూ జాలిమ్‌సింగ్ అనే చౌకీదారుకు దొరికిపోయారు. అప్పటికి వారు వేసిన జొన్న కొర్రచేను సానుల పంటలు ఏపుగా ఎదిగాయి. వారిని కొట్టి వారు ఏడుస్తున్నా బతిమాలు తున్నా వినకుండా వారు పండించిన పంటను వారితోనే కోయించి నేలమట్టం చేయించాడు, వాళ్లలో యువకులు ముగ్గురిని తన దగ్గర ఉంచుకొని, మామూలిచ్చి విడిపించుకెళ్లమన్నాడు. ఆ దౌర్జన్యంలో వారిలోని 'శాడిజం' విరాట్ రూపంలో కనిపిస్తుంది.

'లైంగిక దోపిడి' దోపిడీలోనే పరాకాష్ఠ. నిర్లజ్జగా వ్యవహ రించటం గిరిజనుల విషయంలో బాహాటంగా బయట పడింది. పన్ను వసూలు వేయటానికి వచ్చి, దేవూబాయిని ఆకలి చూపులతో తడమటం చేయి పట్టటంలో కని పిస్తుంది. అతని చేయి విదిలించి దేవూబాయి తప్పించు కొంది. సే రేదార్ 'చౌబినా వసూలుకొచ్చి కొలాములను పిలిపించి వారికి తుపాకీ ఎక్కుపెట్టి శ్యామ్‌కొలాము బిడ్డ పద్నాలుగేళ్ల మోతిపై అత్యాచారం జరిపాడు. ఆ పసి దానిపై ఒకరి తర్వాత ఒకరుగా చౌకీదారు జవాను, మరో జవాను దాడి చేశారు. మరణించిన మోతీని తీసుకెళ్లి తప్ప తాగి ఒళ్లెరగకుండా పడి ఉన్న సేరేదార్ పక్కన ఉంచారు. మేల్కొన్న సేరేదార్ మృతదేహాన్ని చూసి, భయపడ్డాడు. అక్కడ నుంచి అందరూ దొంగల్లా పారిపోయారు. గిరిజను లతో పాశవికంగా ప్రవర్తించే పశు ప్రవృత్తి ఈ అధికారులది.

గిరిజనుల స్వాభావికతకు సంస్కృతికి ఇది అద్దం పట్టినా, దోపిడికి పరాకాష్ఠను ఈ నవలలో చూడగలం. అమాయకులు కష్టజీవులు అయిన గిరిపుత్రులను, నాగ రికులని భావించే మానవ మృగాలు, అవి రూపుదిద్దిన వ్యవస్థ ఎంత నీచంగా హీనంగా అన్యాయంగా తరాల తరబడి శారీరక మానసిక లైంగిక హింసకు దోపిడికి గురి చేశాయో అద్దం పట్టిన నవల. బలవంతుడిదే రాజ్యం అనే ఆటవిక న్యాయం ఆడవిలో కనిపిస్తుంది. అణచి వేతను ఎక్కువ కాలం కొనసాగించలేరు. తిరుగుబాటు తప్పదు. రాజ్యాంగం ఇచ్చిన చల్లని నీడ కూడా గిరిపుత్రుల వ్యధలను తొలగించలేకపోవటం బాధాకరం. ప్రభుత్వ విధనాలు తెలియకపోవటం, అవిద్య గిరిజనుల నేటి దురవస్థకు కారణం. వారు విద్యావంతులై అధికారులై జాతిని బాగు చేసుకోవాలసిన బాధ్యత ఎంతైనా ఉంది.

భారతీయ ఆదివాసీలు – వివాహ పద్ధతులు

– డా॥ లింగదొరి బాబు, తెలుగు అధ్యయనశాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

భారతదేశం విభిన్న మతాలకు, కులాలకు, జాతులకు, తెగలకు పుట్టినిల్లు. అనాది కాలం నుండి నేటివరకు ఎన్నో మతాలవారు, వర్గాలవారు నాగరికతను సాధించి సామాజిక, ఆర్థిక, రాజకీయంగా ఎంతో అభివృద్ధిని సాధించారు. కానీ భారతదేశ మూలవాసులైన ఆదివాసులు/ గిరిజనులలోని ఎన్నో తెగలు ఈనాటికీ నాగరిక సమాజానికి దూరంగా ఉంటూ తమదైన సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తున్నారు. దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారు. ప్రభుత్వం మరియు కొన్ని స్వచ్ఛంద సేవా సంస్థలు వీరి అభివృద్ధి కోసం ఎన్నో చర్యలు చేపట్టినప్పటికీ అవి పూర్తిగా సఫలం కాలేదు. దీనికి ప్రధాన కారణం భారతీయ గిరిజనుల ఆచారాలు, కట్టుబాట్లు. ఇవే మిగిలిన నాగరిక సమాజం నుంచి ఆదివాసులను వేరు చేస్తూ నాగరిక సమాజంచే వివక్షకు గురికావడానికి కారణం అవుతున్నాయి. అటువంటి ఆచారాల్లో వివాహ వ్యవస్థ ఒకటి. వీరి వివాహ వ్యవస్థలోని విశేషాలను, ప్రత్యేకతలను నాగరిక సమాజానికి తెలియ చేయడం ఈ పత్ర ప్రధాన ఉద్దేశం.

భారతీయ వివాహ వ్యవస్థకు ప్రపంచంలోనే విశిష్ట స్థానం ఉంది. హైందవ ధర్మం ప్రకారం వివాహం అనేది భారతీయులకు ధార్మిక కార్యం. హైందవ ధర్మానికి దూరంగా ఉన్న గిరిజనులకు వివాహం అనేది ఆయా పరిసరాల స్థితిగతులకు, ఆర్థిక, సామాజిక పరిస్థితులకు లోబడి చేసుకునే ఒక కట్టుబాటు లేదా ఒప్పందం.

భారతీయ వివాహ వ్యవస్థ ప్రధానంగా రెండు రకాలుగా కన్పిస్తుంది. ఒకటి ఏకపత్నివ్రతం. అంటే ఒక స్త్రీని ఒక పరుషుడు వివాహం చేసుకుని జీవితాంతం ఆ వివాహ ధర్మానికి కట్టుబడి వారిద్దరు కలిసి జీవించడం. రెండవది బహుభార్యత్వం. ఇది ప్రధానంగా ఆర్థికంగా, రాజకీయంగా ఉన్నత వర్గాల్లో ఉంది. ఇందులో ఒక పురుషుడు తన అధికారం, దర్పాన్ని ప్రదర్శించడానికి అనేకమంది స్త్రీలను వివాహం చేసుకుంటాడు. ఎంత మంది స్త్రీలను వివాహం చేసుకుంటే సమాజంలో అతని కీర్తి ప్రతిష్టలు అంతగా పెరుగుతాయని ఒక విశ్వాసం. స్వాతంత్ర్యానికి పూర్వం రాచరిక వ్యవస్థ నుండి జమిందారీ వ్యవస్థ వరకు ఈ సంప్రదాయం ఎక్కువగా కొనసాగింది. స్వాతంత్ర్యానంతరం హిందూ వివాహ చట్టం వలన బహుభార్యత్వం అనేది నేడు చాలా తగ్గిపోయింది. కానీ హిందేతర మతాలలో బహుభార్య వ్యవస్థ కనిపిస్తుంది.

ఇప్పటివరకు మనం భారతదేశంలోని ప్రధాన వివాహ పద్ధతులను గురించి చెప్పుకున్నాం. ఇందులో స్త్రీకి పునర్వివాహాలు, విధవ వివాహాలు ఒకప్పుడు నిషిద్ధం. నేటికి కూడా కొన్ని సామాజిక వర్గాల్లో ఈ పద్ధతులు నిషేధం. కానీ వీటన్నింటికీ భిన్నమైనవి భారతీయ ఆదివాసుల వివాహ పద్ధతులు. వాటిని గురించి ఇక్కడ చర్చించుకుందాం.

భారతీయ ఆదివాసుల వివాహ పద్ధతులు :

భారతీయ గిరిజన తెగల్లో ఒక్కొక్క తెగకు ఒక్కొక్క ప్రత్యేక వివాహ పద్ధతి కనబడుతుంది. ఐతే భారతీయ గిరిజన తెగలన్నింటి వివాహ పద్ధతులను సమిష్టిగా కలిపి చూసినపుడు ప్రధానంగా తొమ్మిది(9) రకాలుగా వీరు వివాహ పద్ధతులు ఉన్నాయి. అవి

1. పరిగ్రహణ లేదా రాక్షస వివాహపద్ధతి
2. వినిమయ వివాహపద్ధతి
3. కన్యాశుల్క వివాహపద్ధతి
4. సహపలాయన వివాహపద్ధతి
5. సేవా వివాహపద్ధతి

6. అనాహుత వివాహపద్ధతి
7. ప్రయోగ వివాహపద్ధతి
8. పరస్పర అంగీకార వివాహపద్ధతి
9. పరీక్షావధి వివాహపద్ధతి

ఈ వివాహ పద్ధతులను గురించి చర్చించే ముందు భారతీయ గిరిజనుల వివాహ వ్యవస్థను గురించిన కొన్ని ప్రాథమిక వివాహ విషయాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. అందులో ప్రధానమైంది కన్యాశుల్కం. భారతీయ సమాజంలో అన్ని మతాల్లోనూ, అన్ని కులాల్లోనూ అమ్మాయి తరుపు వారు పురుషుడికి వరకట్నం ఇవ్వడ మనేది ఆచారంగా ఉంది. ప్రస్తుతం అది సామాజిక సమస్యగా పరిణమించింది. కానీ భారతీయ గిరిజనుల్లో అధికశాతం మంది వరకట్నానికి భిన్నంగా స్త్రీకి కన్యా శుల్కం ఇచ్చి పెళ్ళి చేసుకునే పద్ధతి నేటికీ అమలులో ఉంది.

ఈ విధంగా కన్యకు శుల్కం ఇవ్వడం అనేది ఆమె యొక్క యోగ్యత, అమ్మాయి కుటుంబం యొక్క సామాజిక స్థితిగతుల మీద ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా ఈ ఓలీ (కన్యాశుల్కం) పద్ధతిలో డబ్బుకంటే కూడా వస్తు రూపంగా (వెండి, బంగారం, మేకలు, ఆవులు) శుల్కం ఇస్తారు. ఇది సాధారణంగా అన్ని తెగలలో కనబడుతుంది. ఈ కన్యాశుల్కం అనేది వీరి వివాహ పద్ధతుల్లో ముఖ్య భూమికను పోషిస్తుంది. హిందూ సమాజంలో స్త్రీ పునర్వివాహాలు, విధవ వివాహాలు నిషేధమైతే ఈ తెగల్లో మాత్రం స్త్రీ పునర్వివాహాలు, విధవ వివాహాలు చాలా కాలం నుండి అమలులో ఉన్నాయి. బాల్య వివాహాలు చాలా తెగల్లో అమలులో లేవు. ఈ తెగల్లో అంతర్వివాహాలు (ఒకే గోత్రంతో ఉన్నవారు) నిషేధం.

గిరిజన వివాహ పద్ధతులు :

పరిగ్రహణ లేదా రాక్షస వివాహ పద్ధతి :

ఒక పురుషుడు ఒక స్త్రీని ఆమె గ్రామం నుండి బలవంతంగా ఎత్తుకుపోయి పెళ్ళి చేసుకోవడం. ఈ పద్ధతిని ప్రధానంగా నాగా తెగ (ఈశాన్యభారతం) కు చెందిన వారు, మధ్య భారతంలోని 'హో', 'గోండు', 'సంతాల్', 'ఖారియా', 'చెంచు' మొదలైన తెగల్లో నేటికి ఈ ఆచారం అమలులో ఉంది. దీనికి ప్రధానంగా రెండు కారణాలు కన్పిస్తాయి. మొదటిది శుల్కం ఇవ్వలేని పరిస్థితుల్లో ఉన్న పురుషుడు తన సమీప గ్రామంలోని స్త్రీని తీసుకు పోయి వివాహం చేసుకోవడం. రెండవది తమ వీరత్వాన్ని లేదా తెగ వీరత్వాన్ని తెలియ చేయడం కోసం మరొక తెగకు చెందిన స్త్రీని తీసుకొచ్చి వివాహం చేసుకోవడం. అయితే నేడు ఇది కొన్ని తెగలలో ఆచారంగా మారింది. బలవంతంగా ఎత్తుకురాకుండా ముందుగానే పెద్దలు వివాహాన్ని కుదిర్చినప్పటికీ పై సంప్రదాయాన్ని నిలబెట్టడం కోసం అమ్మాయి తరుపు వారు అమ్మాయిని సంకేత స్థలానికి పంపించి అక్కడ నుండి అమ్మాయిని ఎత్తుకువెళ్ళి పెళ్ళి చేసుకోవాల్సిందిగా అబ్బాయికి వర్తమానం పంపుతారు. ఆ సమయంలో అమ్మాయి కేవలం ఆచారం కోసం అబ్బాయి ఎత్తుకు వెళ్తుంటే రానని నిరాకరిస్తుంది. మధ్య భారతంలోని గిరిజన తెగలలో ఈ పరిగ్రహణ వివాహ పద్ధతి శాంతియుతంగానే జరుగుతుంది. కానీ ఈశాన్య రాష్ట్రాలైన నాగాలాండ్, అస్సాం రాష్ట్రాల్లోని గిరిజన తెగలలో ఒకనాడు పైశాచికంగా జరిగేది.

ఇలా అమ్మాయిని తీసుకు వెళ్ళి పెళ్ళి చేసుకున్న అబ్బాయి తిరిగి గూడేనికి వచ్చిన తర్వాత అమ్మాయి తరుపు వారికి నష్టపరిహారం చెల్లిస్తాడు. లేని సందర్భంలో గ్రామస్థులందరికి విందును ఏర్పాటు చేస్తాడు.

నిజంగానే బలవంతంగా అమ్మాయిని తీసుకెళ్ళి వివాహం చేసుకుని తిరిగి ఇంటికి వచ్చిన వారిని కూడా గ్రామస్థులు, తెగవారు సాదరంగానే ఆహ్వానిస్తారు. వారి వివాహానికి ఎటువంటి ఆక్షేపణలు విధించరు.

వినిమయ వివాహ పద్ధతి :

వినిమయ వివాహ పద్ధతిలో పరస్పరం రెండు కుటుంబాలు తమ పిల్లలకు పెళ్ళి చేస్తారు. ఏ విధంగా అంటే అబ్బాయి తరుపు వారు అమ్మాయిని పెళ్ళి చేసుకున్న

తర్వాత అమ్మాయి సోదరుడికి అబ్బాయి సోదరిని ఇచ్చి పెళ్ళి చేస్తారు. ఇది ఒక రకంగా కన్యాశుల్కం ఇచ్చుకోలేని కుటుంబాలు అనుసరించే పద్ధతిగా భావించవచ్చు. మేఘాలయలోని ఖాసితెగ ఈ ఆచారాన్ని తిరస్కరిస్తుంది.

కన్యాశుల్క వివాహ పద్ధతి :

ఈ పద్ధతిలో పెద్దలే వివాహాన్ని కుదురుస్తారు. అబ్బాయి తరుపు వారు అమ్మాయిని చూసిన తర్వాత అమ్మాయి యోగ్యతను బట్టి శుల్కాన్ని చెల్లించి పెళ్ళి జరిపిస్తారు. ఇందులో చాలా వరకు అమ్మాయి కోరినంత శుల్కం ఇవ్వవలసి ఉంటుంది. ఇది కొన్ని సార్లు అబ్బాయి తరుపు వారి తాహత్తుకు మించి ఉంటుంది. అటువంటి సమయంలో అప్పు చేసైనా శుల్కాన్నిచ్చి పెళ్ళి చేస్తారు. ఈనాటికి ఈ విధంగా శుల్కం ఇవ్వలేని ఆర్థికంగా వెనుక బడిన కుటుంబాల్లోని పురుషులకు, స్త్రీలకు ఇద్దరికి ఒక రకంగా అన్యాయం జరుగుతోంది. అది ఎలా అంటే పురు షుడు శుల్కం ఇవ్వలేని స్థితిలో ఉంటే అతడు ఆజ న్మాంతం బ్రహ్మచారిగా గడపాలి. అదే స్త్రీ శుల్కం పుచ్చు కోకుండా పెళ్ళి చేసుకోవడం అనేది ఆమె కుటుంబ పరువుకు చెందిన విషయం. శుల్కం తీసుకోకుండా అమ్మాయికి పెళ్ళి చేస్తే అమ్మాయిలో ఏదో లోపం ఉండటం కారణంగా శుల్కం తీసుకోకుండా పెళ్ళి చేశారని ఆ కుటుంబాన్ని తెగవారు వివక్షతో చూస్తారు. ఈ భయంతో అమ్మాయి కుటుంబం వారు అమ్మాయికి పెళ్ళి చేయకుండా ఉంటారు కానీ శుల్కం వద్దని చెప్పరు. దీని కారణంగా స్త్రీ అవివాహితురాలుగా జీవితం గడపడం దుర్భరంగా ఉంటుంది. ఇటువంటి వారు ఆ తెగలో మంత్రగత్తెగానో లేదా దైవ కార్యాల్లో పని చేసే జోగినులు గానో ఒంటరి జీవితం గడుపుతారు. ఈ వివాహ పద్ధతి ముండా, ఓరాన్, సంతాల్, రెంగ్మా మొదలైన తెగల్లో ఉంది.

సహపలాయన వివాహ పద్ధతి :

ఒకరినొకరు ఇష్టపడిన జంట వారి పెళ్ళికి పెద్దల అంగీకారం లభించని సమయంలో ఇద్దరూ కలిసి పారి పోయి పెళ్ళి చేసుకుంటారు. దీనికి కూడా ప్రధాన కారణం కన్యాశుల్కమే. శల్కం ఇవ్వలేని స్థితిలో అబ్బాయి ఉండి అమ్మాయి అబ్బాయిని ఇష్టపడితే ఇక వారు లేచిపోయి పెళ్ళి చేసుకోవడం తప్పితే మరో మార్గం లేనందున ఈ సహపలాయన వివాహ పద్ధతిని పాటిస్తారు. అయితే పెళ్ళి చేసుకొని తిరిగి వచ్చిన జంట వివాహాన్ని ఆ తెగవారు ఆమోదిస్తారు. కన్యాశుల్క ఆచారం ఎక్కువగా ఉన్న చోటా నాగపూర్ ప్రాంత గిరిజన తెగల్లో ఈ సహ పలాయన వివాహ పద్ధతి ఎక్కువగా ఉంది. అలాగే ఆంధ్ర ప్రదేశ్ లోని నల్లమల్ల అడవి ప్రాంతంలో ఉండే చెంచు తెగల్లో కూడా ఉంది.

సేవా వివాహ పద్ధతి :

కన్యాశుల్కం ఇవ్వలేని స్థితిలో పురుషుడు తనకు కాబోయే అమ్మాయి ఇంటికి వెళ్ళి అతడు అత్తామామలకు కొన్ని రోజులు / సంవత్సరాలు సపర్యలు చేసిన తర్వాత అమ్మాయిని వివాహం చేసుకుంటాడు. మణిపూర్‌లోని గిరిజన తెగలు ఈ వివాహ పద్ధతిని ప్రధానంగా పాటిస్తారు. వీరు ఈ పద్ధతిని మాత్రమే సంప్రదాయ వివాహ పద్ధతిగా భావిస్తారు. ఈ ప్రాంతంలో పురుషుడు కనీసం మూడు సంవత్సరాలైనా అమ్మాయి ఇంట్లో ఆమె తల్లిదండ్రులకు సేవ చేయాలి. కొన్ని ప్రాంతాల్లో ఈ సపర్యలు చేసినందుకు అబ్బాయికి అమ్మాయినిచ్చి పెళ్ళి చేయడంతో పాటు కొంత ధనాన్ని కూడా ముట్టచెబుతారు. ఆ ధనాన్ని వారు అప్పుగానే భావిస్తారు. పెళ్ళైన తర్వాత విడతల వారిగా అబ్బాయి తీసుకున్న ధనాన్ని తిరిగి అమ్మాయి తరుపు వారికి శుల్కంగా చెల్లిస్తాడు. పురుమ్, బిర్హోర్ తెగల్లో ఈ వివాహ పద్ధతి అమలవుతుంది.

అనాహుత వివాహపద్ధతి :

గిరిజన వివాహ పద్ధతుల్లో మొదట చెప్పుకున్న పరి గ్రహణ / రాక్షస వివాహ పద్ధతికి పూర్తి భిన్నమైంది ఈ అనాహుత వివాహ పద్ధతి. ఈ పద్ధతిలో అబ్బాయికి అమ్మాయి నచ్చని సందర్భంలో అమ్మాయి మాత్రం ఆ అబ్బాయినే ఇష్టపడితే ఆ అబ్బాయి కుటుంబంలో

కోడలిగా తాను చేయవలసిన సపర్యలు వారికి ఇష్టం లేకపోయినా చేస్తుంది. ఇటువంటి సందర్భంలో అబ్బాయి తరుపు వారి కుటుంబం అమ్మాయిని చాలా అనాదరణతో చూస్తుంది. అందుకే దీనికి అనాదరణ వివాహ పద్ధతి అని కూడా పేరుంది. అబ్బాయి తరుపువారు అమ్మాయిని శారీరకంగా, మానసికంగా ఎంత హింసించినా ఎన్ని ఇబ్బందులకు గురి చేసినా ఆ అమ్మాయి వారిని వదిలి వెళ్ళకుండా స్థిరంగా ఆ అబ్బాయే కావాలని అదే ఇంట్లో ఉంటే కొన్ని రోజులకు ఆ తెగవారు ఆ అమ్మాయిని ఆ అబ్బాయికే ఇచ్చి పెళ్ళి చేస్తారు. ఈ వివాహ పద్ధతి చాలా తక్కువ తెగల్లో మనకు కనబడుతుంది. చోటానాగపూర్ లోని బిర్హోర్, హో తెగలతో పాటు మరికొన్ని తెగల్లో ఈ వివాహ పద్ధతి ఉంది.

ప్రయోగ వివాహ పద్ధతి :

ఈ వివాహ పద్ధతి ప్రధానంగా పురుషుడియొక్క వీరత్వానికి, ధైర్యసాహసాలకు ప్రతీక వంటిది. ఈ పద్ధతిలో అబ్బాయి తన వీరత్వాన్ని ప్రదర్శించి తను కోరుకున్న స్త్రీని వివాహం చేసుకుంటాడు. ఈ వివాహ పద్ధతిలో పండుగలు లేదా జాతర్ల సమయాల్లో పెళ్ళి వయసు వచ్చిన యువతులందరూ ఒక చెట్టు లేదా స్తంభం చుట్టు చేరి వర్తులాకారంలో లయబద్ధంగా "గోల్‌గాదేతో" అనే నృత్యాన్ని చేస్తుంటారు. ఆ చెట్టు కొమ్మకు లేదా స్తంభానికి చివర బెల్లం మరియు కొన్ని రకాల ఆహార దినుసులు కలిపి మూటగా కడతారు. వీరు నృత్యం చేస్తున్నపుడు అబ్బాయి వీరి నుంచి తప్పించుకుని ఆ వృక్షం / స్తంభం దగ్గరకి చేరి దాన్ని ఎక్కి ఆ మూటను చేజిక్కించుకోవాలి. అలా చేజిక్కించుకున్న పురుషుడికి ఆ తెగలో ఏ అమ్మాయి నచ్చితే ఆ అమ్మాయిని వివాహం చేసుకునే అధికారం వస్తుంది. అయితే యువతుల నృత్యాన్ని తప్పించుకుని ఆ చెట్టు / స్తంభాన్ని దగ్గరకు చేరుకోవడం అంత సులువు కాదు. అలా వెళ్ళే సందర్భంలో యువతులందరూ కలసి నిరోధించడానికి అతన్ని తోయడం లేదా కొట్టడం లాంటి చర్యలు చేస్తారు. వాటిని తట్టుకొని ఆ అబ్బాయి ఆ మూటను సాధించాలి. భిల్ తెగలో ఈ ఆచారం ఎక్కువగా దర్శనమిస్తుంది.

పరస్పర అంగీకార వివాహ పద్ధతి :

హిందూ సమాజంతో ఏర్పడిన సాన్నిహిత్యం మూలంగా గిరిజనులు పాటిస్తున్న వివాహ పద్ధతే పరస్పర అంగీకార వివాహ పద్ధతి. ఇది అబ్బాయి, అమ్మాయి తరుపు కుటుంబాల మధ్య పరస్పర అంగీకారంతో నిర్ణయమవుతుంది. దీన్ని పెద్దలు నిర్ణయించిన వివాహంగా చెప్పవచ్చు.

పరీక్షావది వివాహ పద్ధతి :

ఈ పద్ధతి ప్రస్తుతం పాశ్చాత్య సమాజంలో కన్పించే డేటింగ్ పద్ధతితో సామ్యాన్ని కల్గి ఉంది. ఇందులో అమ్మాయి, అబ్బాయి ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి కొన్ని రోజులు కలిసి జీవిస్తారు. ఒక వేళ అబ్బాయికి అమ్మాయికి వ్యక్తిగత విభేదాలు వస్తే వారు వివాహాన్ని రద్దు చేసుకుని తమకు నచ్చిన మరొకర్ని వివాహం చేసుకుంటారు. ఈ పద్ధతిలో వారి మధ్య శారీరక సంబంధం ఆమోద యోగ్యమైంది. వీరికోసం సామూహిక యువ సైనాగారాలు ఏర్పాటు చేస్తారు. ఒక వేళ పెళ్ళి నిశ్చయం అయిన తర్వాత ఈ వివాహం వద్దనుకుంటే అమ్మాయి తరుపువారు అబ్బాయికి కొంత నష్టపరిహారం చెల్లించాలి. అమ్మాయి గర్భవతి అయితే అప్పుడు ఖచ్చితంగా అబ్బాయి అమ్మాయిని వివాహం చేసుకోవాల్సిందే. ఇటువంటి సమయంలో అమ్మాయి తరుపు వారు శుల్కాన్ని తగ్గిస్తారు లేదా పూర్తిగా రద్దు కూడా చేయవచ్చు. గిరిజన తెగల్లో చాలా వరకు కన్యత్వానికి పెద్దగా ప్రాధాన్యం ఇవ్వరు. పెళ్ళికి ముందు స్త్రీ పురుష సంబంధాలను వారు ఆమోదిస్తారు. దీనికి నిదర్శనం ఈ పరీక్షావది వివాహ పద్ధతి. అరుణాచల్ ప్రదేశ్‌లోని కుకీ తెగలో ఈ వివాహ పద్ధతి బాగా వాడుకలో ఉంది.

గిరిజన వివాహాల్లో విశేషాంశాలు :

పైన తెలిపిన తొమ్మిది వివాహ పద్ధతులే కాకుండా గిరిజన తెగ వివాహాల్లో కొన్ని ప్రత్యేకాంశాలు చోటు

చేసుకున్నాయి. వాటిని ప్రధానంగా (1) అంతర్వివాహాలు (2) దేవర న్యా వివాహాలు (3) భార్య భగిని వివాహాలు గా చెప్పవచ్చు.

అంతర్వివాహాలు :

అంతర్వివాహాలు ప్రధానంగా కుటుంబంలోని ఆంత రంగిక బంధుత్వాల్లో జరుగుతాయి. వీటిలో మేనరికాలు, సమాంతర పితృీయ సంతతి వివాహం అని రెండు రకాలు ఉన్నాయి. ఈ పద్ధతులు భారతదేశంలోని గోండు, ఖారియా, ఖాసా, ఖాదార్ తెగల్లో కనబడతాయి. హైందవ సమాజంలో కన్పించే మేనరిక వివాహాలే గిరిజన తెగల్లోని అంతర్వివాహాల్లో భాగంగా ఉన్న మేనరిక వివాహాలగా పేర్కొనవచ్చు. ఇక్కడ అన్నాచెల్లెళ్ళ పిల్లలు మేనరిక సంబంధంగా వారి సంతతి మధ్య వివాహాలు జరుగు తాయి. సమాంతర పితృీయ సంతతి వివాహాలు అన్నా తమ్ముడు (పెద్దనాన్న, చిన్నన్న) లేదా అక్క చెల్లెలు (పెద్దమ్మ, చిన్నమ్మ) సంతతి మధ్య జరుగుతాయి. ఇది హైందవ వివాహం ప్రకారం దోషంగా పరిగణించ బడుతుంది. కానీ గిరిజన తెగల్లో సర్వసాధారణం. ఈ వివాహ పద్ధతికి కూడా ప్రధాన కారణం కన్యాశుల్క ప్రభావ మేనని చెప్పవచ్చు. ఒకే కుటుంబంలోని వారు పెళ్ళి చేసు కోవడం ద్వారా కుటుంబ ఆస్తి బయటి వారికి పోకుండా ఆ కుటుంబంలోనే ఉంటుందనే విశ్వాసం కారణం.

దేవర న్యాయ వివాహం :

గిరిజన వివాహ పద్ధతుల్లో ఈ దేవర న్యాయ వివాహ పద్ధతి ఇతిహాసమైన భారతంలో కన్పిస్తుంది. ఇది రెండు విధాలు. మొదటి దానిలో ఒక స్త్రీ ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములందరికి భార్యగా ఉండటం. దీనినే బహు భార్యత్వం అని కూడా చెప్పవచ్చు. భారతంలో పాండవులకు, ద్రౌపదికి జరిగిన వివాహం ఈ దేవర న్యాయ వివాహానికి చక్కటి ఉదాహరణ. ఈ పద్ధతిలో అన్న పెళ్ళాడిన స్త్రీనే మిగిలిన తమ్ముల్లు కూడా భార్యగా స్వీకరిస్తారు. ఈమె ఒక్కొక్కరి దగ్గర నిర్దిష్టకాలం వరకు ఉంటుంది. ఒకరితో ఉన్నపుడు సోదరులలో మిగిలిన వారు ఆమెను తాకరాదు. ఇందులో జేష్ఠ దేవర న్యాయ వివాహం, కనిష్ట దేవన్యాయ వివాహం అని రెండు రకాలు న్నాయి. అన్నను అడ్డుతొలగిస్తే ఆయన భార్య తనకు భార్య అవుతుందనే ఉద్ధేశంతో సోదరుణ్ణి చంపిన ఉదంతాలు చాలానే ఉన్నాయి. ఈ కారణంతో నేడు చాలా తెగల్లో ఈ జేష్ఠ మరియు కనిష్ట దేవర న్యాయ వివాహాలను నిషేధిస్తు వస్తున్నారు.

దేవర న్యాయ వివాహ పద్ధతిలో ఒక స్త్రీ వేరువేరు పురుషులకు భార్యగా ఉండటం కూడా ఒక పద్ధతి. ఇందులో ఆ స్త్రీ యొక్క భర్తలు అన్నదమ్ములు కాకుండా వేర్వేరు కుటుంబాలకు చెందిన వారై ఉంటారు.

భార్యా భగిని వివాహ పద్ధతి :

ఈ వివాహ పద్ధతిలో పురుషుడు తన భార్య యొక్క సోదరిని వివాహం చేసుకున్నట్లైతే దాన్ని భార్యా భగిని వివాహ పద్ధతిగా చెప్పవచ్చు. ఈ వివాహం తన భార్య సజీవంగా ఉన్నా లేదా చనిపోయినా కూడా ఆమె సోదరిని భాగస్వామిగా స్వీకరిస్తారు. దీన్నే బహు భార్యత్వంగా కూడా చెప్పవచ్చు. పురుషుడు భార్య యొక్క సోదరిని కాకుండా ఇతర స్త్రీలను కూడా పెళ్ళి చేసుకోవడం ఈ వివాహ పద్ధతిలో భాగమే.

ఐతే పైన చెప్పకున్నట్లు అంతర్వివాహాలు, దేవర న్యాయ వివాహాలు, భార్యాభగిని వివాహాలు మూడు కూడా ప్రధానంగా ఆర్థికపరమైన హోదాతో ముడిపడి ఉంటాయి. ఉమ్మడి ఆస్తి వేరొకరి సొత్తు కాకుండా వారి మధ్యే ఉండాలనుకున్నప్పుడు ఈ వివాహ పద్ధతులను ఎక్కువగా పాటిస్తారు.

విడాకులు :

గిరిజన తెగల్లో హైందవ సంప్రదాయంలాగా వివాహం అనేది ధార్మిక కార్యం కాదు కాబట్టి వీరి విడాకుల పద్ధతి చాలా సహజంగా కన్పిస్తుంది. భర్తకు కానీ, భార్యకు కానీ ఏదైనా విషయాల్లో విభేదాలు వచ్చినపుడు లేదా వేరొకర్ని

మనువాడాలనుకున్నప్పుడు విడాకులు తీసుకుంటారు. ఇవి కేవలం వారి తెగ పంచాయితీల ద్వారా జరుగుతాయి. విడాకులు తీసుకోవడంలో స్త్రీ, పురుషులిద్దరికీ సమాన స్వేచ్ఛ ఉంటుంది. చెంచు వంటి తెగల్లో భార్య భర్తను వదలి వేరొకర్ని వివాహమాడాలంటే ఆ రెండవ భర్త మొదటి భర్తకు శుల్కాన్ని చెల్లించాలి. వీరి వివాహ రద్దుకు పెద్దగా ఆంక్షలు ఉండవు. భార్య భర్తలిద్దరి మధ్య ఒప్పందం కుదిరితే విడిపోవడమే. పెళ్ళైనవారే కాక అవివాహితులు కూడా తనకిష్టమైన వాడితో కావాల్సినన్ని రోజులు కలిసి జీవించి వద్దనుకున్నపుడు వదిలేయవచ్చు. ఇది అన్ని గిరిజన తెగల్లో సాధారణ విషయమేకాక ఆమోదయోగ్యమైంది కూడా. ఈ విధంగా భారతీయ గిరిజన తెగల్లోని వివాహ పద్ధతులు వారి ప్రత్యేకతను చాటి చెబుతున్నాయి.

ఆధార గ్రంథాలు :

1. భారతీయ గిరిజనులు - నదీం హస్‌నైన్, 1995, ఒరియంట్ బ్లాక్‌స్వాన్, హైదరాబాద్
2. మనుగడకోసం పోరాటం ఆంధ్ర ప్రదేశ్ ఆదివాసులు - విన్సెంట్ ప్యూరర్ హైమండార్ఫ్, 2000, హైదరాబాద్ బుక్‌ట్రస్ట్, హైదరాబాదు.
3. ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన సమస్యలు - సంక్షేమం, 2002, తెలుగు అకాడమి, హైదరాబాద్.
4. తెలుగు కథాసాహిత్యం - గిరిజన జీవితం - డా॥ కె. శైలమ్మ, 2011, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.
5. చెంచు గిరిజన మాలిక - డా॥ కె.శ్యామల, 2011, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.
6. ఆదివాసుల చట్టాలు - అభివృద్ధి - కె. బాలగోపాల్, 2018, పర్‌స్పెక్టివ్స్, హైదరాబాద్.



కోయ గిరిజనుల వేటలు, ఆటలు, మూడ నమ్మకాల – పరిశీలన

– నోముల రొజ్జ, పరిశోధక విద్యార్థి, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, జానపద గిరిజన పీఠం, ఓరుగల్లు, వరంగల్, తెలంగాణ.

అనాదిగ అడవులు, కొండలు, గుట్టలను నది తీరాలనే ఆవాసాలుగా చేసుకొని జీవిస్తున్నవారు ఆదివాసులు. అలాంటి "ఆదివాసులను మన స్వాతంత్ర్యానికి ముందు వనవాసి, గిరిజన్, ఆదిమ జాతి లాంటి పదాల తోపిలు చెవారు. వీరిని గురించి పురణాలలోను, ఇదిహాసలలోను గమనించవచ్చును. ఆధునిక నాగరిక, పారిశ్రామికీకరణ వలన క్రమంగా అడవులు అంతరించిపోతున్నాయి. అంతే గాక అక్కడ నివసించె జాతులు ఒక్కొక్కటిగ అంతరించి పోతున్నాయి. అలా అంతరించిపోతున్న గిరిజన తెగల్లో ఒకటి కోయజాతి.

ఈ కోయ వారు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణలో నివసిస్తున్న ఒక గిరిజన ఆదివాసి తెగ. ఈ కోయ వారు ప్రకృతిని ఒడిగ చేసుకుని హాయిగ జీవిస్తారు. ఏ నాగరిక ప్రపంచ ఒత్తిడిలువారికి తెలియవు. వారు ప్రశాంతత అనె పదానికి దర్పణంగ జీవించెడి వారు. కోయలు ఆరాదించె దైవం ప్రకృతి కనుక వీరు ప్రకృతిసిద్ధమైన గాలి, నీరు, భూమి మరియు అడవి సంపదలపై సర్వ హక్కులు కూడి వారు జీవిస్తారు. వీరు ఇంద్రవటి, గోదావరి, శబరి, సీలేరు నదుల ప్రాంతంలలో మరియు బస్తర్, కోరపూట్, వరంగల్, ఖమ్మం మరియు కరీంనగర్ ఉభయ గోదావరి జిల్లాలోని దట్టమైన తూర్పు కనుమలలో వీరు పూర్వం నుండి కనిపిస్తున్నారు. వీరు వీరి గృహాలను అడవి కర్రలతో ఎత్తైన ప్రాంతాలలో నిర్మించి గుంపులుగ గూడెం లను నిర్మించుకుంటారు. కోయలుకూడా అతిపెద్ద గిరిజన తెగల్లో ఒకరు. ముఖ్యంగ వీరు ఏజెన్సీ ప్రాంతాల్లోనే నివసిస్తారు.

కోయ జాతిని భారతదేశంలోని జి.వో. నెం. 24ను అనుసరించి 1950లో "రాజ్యాంగం నందుగల ఆర్టికల్ 342 ప్రకారం రాష్ట్రపతి ప్రకటించిన గిరిజన తెగలు కాని, సమాజాలు కాని, వాటిలో భాగాలు కాని, గిరిజన తెగల గుంపులను షెడ్యూలు తెగలుగా గుర్తిస్తారు[3]. అంతేగాక భారతీయుల కుల వర్గీకరణ ప్రకారం వీరిని ఎస్.టి. (షెడ్యూల్డ్ ట్రైబ్) ఎస్.ఎల్.నెం. 18 జాబితాకు చెందిన వారు. వీరు మనదేశంలో 1880లో బ్రిటీష్ వారి పాలనకి వ్యతిరేకంగా పోరాటం చేశారు. అది అప్పటి ఉమ్మడి ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ జిల్లా విశాఖపట్నంలోని అరకు దగ్గర వున్న "రంప" అను ఏజేన్సీ ప్రాంతం నుండి అల్లూరి సీతారామ రాజు నాయకత్వంలో జరిగింది. కోయజాతి భాషకు లిపి లేదు. ఈ కోయ భాష ద్రావిడ భాష నుండే పుట్టింది కనుక ఇది తెలుగును పోలి ఉంటుంది. వీరి సాహిత్యం అంతయు మౌఖికంగా ఉంటుంది.

కోయ గిరిజనుల వేటలు :

కోయ జాతి గిరిజనుల యొక్క ప్రధాన ఆహారం పోడు వ్యవసాయం మరియు అదే విధంగ వేటలు చేసి ఆహారం సమకూర్చుకుని భుజించడం జర్గేది. అయితే కోయ వారు వేటలో భాగంగ పక్షులను జంతువులను, క్రూరజంతువులను, సరిసృపాలను, చీమలను ఉసిళ్లను, తేనె పట్టులను, చేపలను, ఉభయ చర జీవులను, కొన్ని రకాల పండ్లను,గడ్డలను, పూలను, ఆకులను, ఆకు కూరాలను, కూరగాయలను వెటాడి సేకరించి తెచ్చు కుటింటారు. వీరు ఇతరుల కింద పని చేయుటకు ఇష్టపడదరు. ఇతరుల సొమ్ముకోసం సాహసించరు. దాదాపుగ వారికి కావల్సినవి వారె తయారు చేసుకుంటారు. కాని నేడు కొంత వస్తు మార్పిడికి, కొనుగొళ్ళకు కొద్ది కొద్దిగ అలవాటు పడుతున్నారు.

కోయలు వేట చేస్తున్న పక్షుల పేర్లు - వేటతీరు:

అడవి కోడి : దీనినె క్యార్‌కోడి అంటారు. ఈ కోడి మన ఇండ్లలలో పెంచుకునే నాటు కోడి కంటె లావుగ,

అందంగా ఉండి, చాలా వేగంగ పరుగెడుతుంది. అంతేగాక దీని మాంసం రుచిగ ఉంటుందని వారు కాల్చుకుని మరియు వండుకుని రెండు రకాలుగ తింటారు. అయితే పక్షులను వీరు వేటాడుటకు వేటకుక్కలు, లద్దలు, ఉచ్చులు, గులేరు, రాళ్ళు, కర్రలను సాధనాలుగా వాడుకుంటారు.

సమర కాకి : వీరు సమరకాకిని పైన తెల్పిన సాధనాల ద్వారా వేటాడి కాల్చికుని మరియు వండుకొని తింటారు. అయితే దీనిని తినడం చేత వెన్నుపూస మరియు ఇతర శరీర భాగాలను గట్టిగ చేస్తుందని వారి భావన.

నెమలి : స్వాతంత్ర్యానికి ముందు అనగా పూర్వం నుండె వీరు నెమలిని వేటాడం చేస్తున్నారు. వీరు దీనిని తినడానికి అమితంగా ఇష్టపడి పైన తెల్పిన సాదనాల ద్వారా వేటాడి పొందుతారు.

పూరేడు పిట్ట : ఇది ఒక చిన్న పక్షి. ఇది ఎక్కువగా పంట పొలాలొ తిరుగుతాయి. వాటిని కోయ వారు పైన తెల్పిన సాదనాల ద్వారా పట్టుకుని ప్రీతితో కాల్చుకు తింటారు.

గూబ : గూబ అనేది కూడా చిన్నపాటి పక్షి దీనిని కూడా కోయలు వేట చేసి కాల్చుకుని వండుకుని తింటారు.

పొలుగపక్షి : ఇది గువ్వ అనె పక్షిలాగ ఉండి కొంచెం పెద్దగ శరీరం కలిగి ఉంటుంది. దీనిని కూడా వీరు వేటాడి తింటారు.

గోరెంక : వనాలలో తిరుగుతు ఎగిరె పక్షి గువ్వ అను పక్షి దీనిని కూడ కోయ వారు వేట చేసి కాల్చుకుఇన మరియు వండుకుని తింటారు.

చిలుక : రామచిలుకమ్మ అను పేరుతో మనము పిలుస్తాము. దీనిని కూడా వారు వేట చేసి తింటారు.

కౌజుపిట్ట : వీరు కౌజుపిట్టను వేటాడి ఆహారంలో భాగం ఒకసారి కాల్చుకుని తింటారు. మరొకసారి వండుకుని కూడా తింటారు.

చెదలకోడి : ఈ చెదల కోడి అను పక్షి మన కోడి కంటె కొంత బలంగా ఉండి, అందంగ ఉంటుంది. దీనిని కూడా వేట చేసి తింటారు.

కోయల అడవి జంతువుల వేటలు - వాటి పేరులు:

అడవులలో జీవించేటువంటి జంతువులుమరియు క్రూర జంతువులను కోయవారు వేటాడి తింటారు. అయితే వీటిలో వేటలో చిన్న, పెద్ద జంతువులు ఏవైన సమయ సందర్భాలను బట్టి కొన్నిసార్లు కాల్చుకు తింటారు. కొన్ని సార్లు వండుకుని తింటారు. మరి కొన్ని సార్లు పులుసులు పెట్టి, ఇంకొన్ని సార్లు వరుగులు చేసి ఎక్కువ కాలం వరకు ఉండేటట్లుగా నిల్వ చేసి వేట దొరకని సమయాలలో వీటిని తిరిగి భోజనంలో తీసుకుంటారు. ఇలా అడవి జంతువులలో వేటి వేటిని వేటా చేసి తింటారు క్రింద చూడవచ్చును.

కొండగొర్రె : ఇది అడవిలో జీవించె జంతువు. ఇది సాధారణ మనవద్ద గొర్రెకంటె బలంగాఉండి, వేగంగ పరుగెడుతుంది. దీని మాంసంను కోయల రుచిగ ఉందని తింటారు. దీనిని కోయలు వేటాడునపుడు జాగ్రత్తలు తీసుకుంటారు. ఎందుకంటె అది ప్రమాదాలు చేయు జంతువు. కనుక వీరు వేటకు వెళ్ళునప్పుడు బరిసెలు, వలలు, ఉచ్చు, బాణాలు, గొడళ్ళు, కర్రలు మొదలగు వాటిని ఆయుదాలుగా చేసుకుని వేటాడి చంపి వండుకుని తింటారు.

మెకం : ఇది కూడా అడవి జంతువె, ఇది మన వద్ద గల ఎద్దును పోలి ఉంటుంది. దీనిని కూడా పైన తెలిపిన వేటాడు ఆయుద సాధానాలతో వేట చేస్తారు. దీని శరీరం బారీగ ఉంటుంది. దీనిని వేటాడునప్పుడు చాకచక్యంగా ఉండె ఎక్కువ వేటగాళ్ళు అవసరం.

కనుజు : ఈ కనుజు అను జంతువు నల్లగ బర్రెను పోలి ఉంటుంది. దీని మాంసను కూడా చాలా ప్రీతిగ తింటారు. కనుజు వేటను కూడా పైలాగానె సాధనాలు ఉపయోగిస్తారు.

దుప్పి : దుప్పి అను అడవి జంతువును కూడ కోయలు వేటాడి తింటారు. అయితె దీనికి కొమ్ములు కల్గి ఉండటం చేత వేటాడునప్పుడు ప్రాణహాని కలుగె ప్రమాదం ఉంది. కనుక జాగ్రత్తలు పాటించాలి.

జింక : జింక వేగంగ పరుగెడుతుంది. కనుక తగు విధంగ పరిగెత్తె ఆయుధ సామాగ్రి గల వేటగాళ్ళు వేట చేసి దానిని చంపి ఆహారంగా తింటారు. నేడు జింకలను చంపడం అనేవి అవగాహనలు కల్పించడం చేత తగ్గించ బడ్తున్నాయి.

అడవిపిల్లి : ఇది మన ఇంటి పిల్లి కంటె పెద్దగ, బలంగా ఉండి వేగంగా పరుగెడ్తుంది. దీనికి బోణులు, చిక్కాలు వేసి పట్టుకుని వండుకుని మరియు కాల్చుకుని తింటారు.

ఉడుము : ఉడుములు అడవిలో పట్టినప్పుడు ఉచ్చులు, వలలు, కుక్కల సాయంతో పట్టుకుని తింటారు. ఇది తొండను పోలి ఉంటుంది.

ఎంటుక : ఇది అడవిలో జీవస్తున్న జంతువు. ఇది పందికోక్కు, ముంగీసను పోలి ఉంటుంది. దీనిని కూడా ఉచ్చు, కుక్కల సాయంతో పట్టుకుని తింటారు.

జాలుగ : ముంగీసలాగ ఉండి, పాములగ మలుచు కొని భూమిని తోడి అందులో పండుకుంటుంది. రాత్రంత తిరుగుతుంది. దీనిని కోయవారు వేట చేసి చంపుకు తింటారు.

కొండముచ్చు : దీనినె కొండెంగ అంటారు. ఇది కోతి లాగ ఉండి, కొతి కంటె పెద్దగా ఉంటుంది. దీనిని కూడా వేటాడి కాల్చుకుని మరియు వండుకుని తింటారు. వీటితో కోయవారు అడవిలో క్రూర జంతువుల్ని వేటాడి తింటారు. అవి

కోయలు వేటాడితినే అడవిలోని క్రూర జంతువులు:

అడవిపంది : ఇది ఊరపందిలాగ ఉన్నను చాలా పెద్దదిగ ఉండి, కోరలు కలిగి బలంగా ఉంటుంది. దీనిని బరిసెలు వలలు, ఉచ్చులు, సిల్లలు, బానాలు, కర్రలు సాహాయంతో పట్టుకుని చంపి వండుకుని తింటారు.

ఎలుగుబంటి : దీనినె గుడ్డేలుగు అంటారు. దీనినికూడా పైన తెలిపిన ఆయుదాలలో పట్టుకుని వండుకు తింటారు. అందు ముఖ్యంగ నిప్పురవ్వలు వెలిగించి పట్టుకుంటారు.

గురాబర్రె : దీనినే అడవి బర్రె అంటారు. ఇది చలా బలంగా ఉండి పెద్ద పెద్ద వాటిని పడేస్తుంది. ప్రమాద కరమైంది కూడా దీనినికూడా వీరు సమర్థవంతంగా పట్టుకు తింటారు.

కోయ గిరిజనులపై వాటిని మాత్రమే గాక ఆహారంగ, చీమలను, పట్టు తేనెలను, కొన్ని రకాల చిగుర్లను, జిగుర్లను, ఆకులను, కూరగాయలను, ఆకుకురలను, నీటిలో దొరికె కొన్ని రకాల ప్రాణులను కప్పలను, పండ్లను, దుంపలను మొదలగు వాటిని ఆహారంగా తీసు కుంటారు.

కోయ గిరిజనుల యొక్క ఆటలు :

కోయల యొక్క ఆటలు ఎక్కువగ వారి సాంప్రదాయ మును అనుసరించి వచ్చాయి. అందు స్త్రీల ఆటలు ఎక్కువగా ఉంటాయి అవి :

కర్రసాము : కోయ వారు వివాహ వేడుకల్లో భాగంగా పెళ్ళికొడుకుని ఎదుర్కొళ్ళు సమయంలో పెళ్ళి కొడుకు తరపున ఒక స్త్రీ, పెళ్ళి కూతురు తరపునొక స్త్రీ వచ్చి ఇద్దరు ఎదురు ఎదురుగ నిలబడి కర్రసాము చేస్తారు. ఇది ఒక బల, నైపుణ్యానికి సంబందించిన ఆటగ పరిగ నించి, నేర్పుతున్నట్లుగా సంప్రదాయంలో ఉంటుంది.

ఇయ్యపురాళ్ళ ఆట : ఈ ఆటకూడ ఇద్దరు ఇయ్యపు రాండ్లు పైన తెల్పినట్టు పెళ్ళికొడుకు ఎదుర్కొళ్ళ సమ యంలో ఇద్దరు రెండు చేతుల్లో మామిడి ఆకులు ధరించి కోలాటం లాగ ఆడుతు పాడుతారు. ఇది ఒక రకమైన స్త్రీల ఆటనే.

దువ్వెనాట : ఈ దువ్వెనాటను వదిన, మరదళ్ళు

ఇద్దరు ఎదురు ఎదురగ ఉండి దువ్వెనలు ఒకోరికి ఒకరు ఎదురంగ తలలకు తాకిస్తూ ఆడుతూ సంతోషంగా పాడు కుంటారు. ఇది ఒక పాటలో కూడిన ఆట.

తుంబూస ఆట : తుంబూ ఆట అనునది కూడా వదిన - మరదళ్ళ ఎదురు ఎదురుగ పిక్కలపై కూర్చుని గెంతుతు, ఆర్ధవంతమైన బూతులు తింటుకుంటారు. ఈ ఆట మరదలకు వదిన విలువలు తెలిపే విధంగా ఉంటుంది.

రేస్ ఆట : ఈ రేస్ ఆట జానపదులు ఆడుకునే ఆటనే వారు కూడ ఆడుతారు. ఎందుకంటె కోయలు కొంత సాంప్రదాయం, భాష, ఆటలు తెలుగు వారి లాగె ఉంటుంది.

కోతికొమ్మ ఆట : జానపదుల లాగె కోయలు కూడా ముఖ్యంగా చిన్నపిల్లలు ఈ ఆట ఆడ్తారు. కొమ్మలెక్కిన వారిని దొంగ దొరక పట్టుట ఆట ఇది.

జిల్ల గోనె : దీనినే చిర్ర - గోనె ఆట అంటారు. దొంగ అయిన వారిని, దొరలు గోనెతో చిర్రను కొడ్తు బద్దికి రాకుండ చూస్తారు. ఓడిన (దొంగ) వాడు మాత్రం బద్దికి రావాలని సిర్ర విసురుడుతాడు.

పండుగల ఆటలు : కోయలు వారి పండుగల సమయంలో స్త్రీ - పురుషులు కాళ్ళ చేతులు ఇతర శరీర అవయవాలు ఊపుతూ ఆటలు ఆడుతారు.

జాతరలో ఆటలు : కోయల జాతరలు జరిగె సమయంలో కోయల ఆటలు అడుకోవడం కూడా ఒక ఆనవాయితే.

గోలీల ఆటలు మొ॥ : సీసం గోలిల ఆటలను కూడా పిల్లలు ఆడుకుంటారు. వీటితో పాటు కోయలు నాగరిక ప్రపంచంలోకి వస్తున్న కొద్ది ఆటలలో కూడా మార్పులు వచ్చిర క్రొత్త ఆటలు అనేకం నేర్చుకున్నారు.

కోయల మూడ నమ్మకాలు :

కోయ వారు తమ సంస్కృతి సాంప్రదాయంలో ఆహారంలో భాగంగ వేటలు, పొడు వ్యవసాయం, ఆటలు, పాటలు, మరి అంతే గాక నమ్మకాలు మూడ నమ్మకాలను కల్గి ఉంటారు. వాటిని ఈ క్రింద మనము గమనించవచ్చును.

చేతబడులు - భాణమతులు : కోయలు ఎక్కువగ చేతబడులు - బాణమతులు అను వాటిని భాగ నమ్ముతారు. చేతబడులు చేయడం వలనే మనష్యుల ఆరోగ్యం చెడిపోతుందని, చనిపోయారని వారు నమ్ముతారు. దానికి తిర్గు మంత్రంకై మంత్రగాని వద్దకు వెలుతారు.

చిన్న పిల్లలను శక్తి దేవతలకు భలిచ్చె నమ్మకం : గూడెం దేవతలకు పాత కాలంలో గూడెం బాగుండాలని వంతుల వారిగ చిన్న పిల్లలని కుటుంబాలు భలిచ్చేవారు. నేడు మాత్రం అలాంటి ఆచారం అడగంటి పోతుంది.

నడకతీరు - చేయి ఊపుడు తీరును చూసి పెళ్ళి కూతుళ్ళ ఎంపిక జరుగుట : పాత కాలంలో పెళ్ళి జరిగె సమయంలో అమ్మాయికి పెళ్ళి చూపుల జరిగినప్పుడు పెళ్ళికొడుకు బంధువులు అమ్మాయిని నడిపించి, చేతులను నడుస్తు ఊపమని చెప్తారు. అలా చేసిన దానిని బట్టి ఆ అమ్మాయి యొక్క ఆయుష్షు ఆరోగ్యాలను గుర్తించవచ్చనె ఒక నమ్మకం వారికి ఉంది.

పండుగలకు - జాతరలకు జంతువులను బలిచ్చె ఆచారం : పండుగలకు - జాతరలకు గనక జంతువులను బలిచ్చినట్లయితే వారి వారి మనస్సులలోని కోరికలు తీరుతాయని, తీరిన కోర్కెలకు గాను బలి ఇవ్వాలని వారికి గల నమ్మకం అపారం.

దయ్యాలు- భూతాలు ఉన్నాయని భావిస్తారు : అనారోగ్య కారణాల వల్ల కోయలు చనిపోయిన, వాతావరణం వల్ల ఆరోగ్యం చెడిపోయిన దయ్యాలు - భూతాల వ్లలనె ఈ ఆటంకాలు, దుఃఖాలు, చావులు జరుగుతున్నాయని వారి భావన ఉంటుంది.

దేవుని తీర్థ - ప్రసాదాలుతప్పకుండ తీసుకోక పోవడం పాపం : దేవుళ్ళకి మ్రొక్కిన తీర్థాలు - ప్రసాదాలను కోయలు తీసుకోకపోతే ఏదో అనర్థాలు జరుగుతాయి అని

వారు భాగ విశ్వసిస్తారు. అందుకని వారు తప్పకుండ స్వీకరించల్సి ఉంటుంది.

వితంతువుకు పునర్వివాహం జరగరాదు : భర్త చని పోయిన స్త్రీకి వయస్సునుబట్టి, తన ఇష్టాన్ని బట్టి పునర్వి వాహం జానపదులలో, నాగరికంగ జరిగినప్పటికి కోయలు మాత్రం నేటికి దీనికి అంగీకరించడం లేదు.

ఇతర కులస్థులతో వివాహం చేసుకోవడం తప్పు : కోయ వారు నేటికి కూడా ఇతర కుస్థులతో వివాహం చేసుకోవడం ఇష్టపడరు. వారి కులంలోని అమ్మాయిని, అబ్బాయిని అది కూడా వరుసలు కుదిరిన వారిని మాత్రమే స్వీకరిస్తారు. అలా గనుక చేసుకోకుంటె కులం నుండి వెలివేస్తారు.

దేవుని మొక్కులు చెల్లించకపోతే - అనర్థాలు జర్గుతాయి అనే భావన : కోయలు గతంలో ఏవైన మొక్కులు మొక్కి కోర్కెలు తీరాక ఆయా మొక్కులు దేవుడికి / లేదా దేవతకి తీర్చకపోతె అనార్థలు జరుతాయని లేదా జరిగాయని భావించి భయపడుతారు.

పచ్చబొట్లు పొడిపించుకోవడం : కోయలు వారి జాతికి, వంశానికి ఆనవాలుగా మరియు శరీరంలోని నొప్పులు తగ్గడానికి గాను పచ్చబొట్లు పొడిపించుకుంటె మంచిదని వారు నమ్మకంగ పొడిపంచుకుంటున్నారు. దాని ద్వారా క్యాన్సర్ లాంటి అనార్థలె ఎక్కువ అవుతున్నాయి.

గుడ్లగూబ ఇంట్లో వొస్తె ఇల్లుని వదిలేస్తారు : కోయలు వారు నిర్మించుకున్న చిన్నపాటి గుడిసెలలో పొరపాటున గుడ్ల గూబ సొచ్చినట్లయితే అరిష్టంగ భావించి వారు ఇల్లునే వదిలేస్తారు.

అడవి జంతువులను తలచుకొని దేవుళ్లగ మ్రొక్కు తారు : వీరు ఉడుము, ముల్లపంది, తాబేలులను వారి వారి దేవతలగ కొలచుకొని పూజిస్తారు.

సికారి బాగా దొరికితె - కోర్కె తీర్చిన దేవునికి క్రమొక్కులు చెల్లించడం : వేటకు పోయేప్పుడు కోయలు వారి ఇష్టదైవంకు, లేదా గూడెం దైవంకు మ్రొక్కి భయలు దేరగ వేటలో పలు జంతువులు బాగా దొరికితే లేదా పెద్ద జంతువు దొరికితె దేవునికి మ్రొక్కిన కోర్కెలు తీర్చు కుంటారు.

పెళ్ళికాని వారు చస్తె బొందపెట్టుట - పెళ్ళయిన వారు చస్తే కాల్చుటనె పాటిస్తారు : కోయవారిలో పెళ్ళి కాని స్త్రీ పురుషులు గతించితె బొంద పెట్టాలని నమ్మకం, అలాగె పెళ్ళైన వారు గతిస్తె కాలపెట్టాలని వారి నమ్మకం లేదంటె ఏదో కీడు జరుగుతది అని వారి నమ్మకం.

దింపుడు గళ్ళం చివరి పిలుపు : చనిపోయిన వారి కుటుంబ సభ్యులు కాటికి లేదా బొందల గడ్డకు శవాన్ని తీసుకుపోత్ను దారిలో ఒక చోట పాడె దింపుతారు. అలా దింపిన పాడెలోని తమ కుటుంబ సభ్యుడి శవాన్ని చెవిలో చివరి పిలుపులు వరుసతో పిలుస్తారు. చనిపోయిన వ్యక్తి ఒక వేల తిరిగి బ్రతికి వస్తారని నమ్మకం వారికి ఉంది.

జ్యోతిష్యం, పంచాంగం, జాతకాలు, పూనకాలను నమ్ముట : కోయలు ముఖ్యంగ పూనకాలు, జాతకాలను నమ్ముతారు. అదే విధంగ జ్యోతిష్యం, పంచాంగాలను నమ్ముతారు. వీరు కూడా ఇతరులకు చెయి చూసి జాత కాలు చెప్తారు. అంటె వాటిని నమ్ముతారు అని అర్థము.

మూలికలు - నాటు వైద్యాలపై నమ్మకం : కోయలు చెట్టు వేర్లు నుండి మూలికలు, అదే విధంగ చెట్లకొమ్మల నుండి ఆకులు, క్రమొక్కల నుండి ఆకు పసర్లను తీసి నాటు వైద్యాలు చేస్తారు. దానిని వారు భాగ విశ్వసిస్తారు.

మగువల - మరుగు మందులపై నమ్మకం : పురుషున్ని ఇష్టపడిన - స్త్రీ అతడిని ఎలాగైనా పొందు పొందాలని ఆశించిన వారు కొన్ని రకాలైన మ్రొక్కల ఆకు పసర్లను శరీరాలకు రాసి వారిని వశపరుచుకోవచ్చు అను నమ్మకం వారిలో ఉంది.

వనభోజనాలు - వానలు : కోయలు వర్షాలు బాగా కూరువాలంటె, ప్రకృతి పచ్చగ ఉండాలంటె, వానల వల్ల పంటలు పండి ప్రాణులు చల్లగ ఉండాలని వారు వన

భోజనాలకు వెలుతారు. వారు వెలితేనే వానలు బాగ పడుతాయి అని వారి నమ్మకం. నేటికి నాగరికపు మనిషిని నమ్మక పోవడం : కోయలు పూర్తిస్థాయిలో నేటికి నేటి నాగరిక మనిషితో సరిగా కలిసి రావడం లేదు. అసలు నాగరికపు సమాజాన్నే వారు నమ్మరు. నాగరికులు మోసగాళ్ళు అని వారి నమ్మకం.

క్షేత్రస్థాయి పర్యటన – ఉపయుక్త గ్రంథాలు :

1. తాటికాయల గణేష్ (కోయ) - మరిపెడ గిరిజన డిగ్రి కళాశాల - మరిపెడ - మహబూబాబాద్
2. పరిశోధక విద్యార్థి (కోయ) - చందా మహేశ్వరరావు
3. ఆదివాసి ఆత్మగానం - డా॥ వి.ఎన్.వి.కె. శాస్త్రీ - నవచైతన్య బుక్ హౌజ్
4. రాష్ట్రంలో గిరిజనులు - సమస్యలు - డా॥ వి.ఎన్.వి.కె. శాస్త్రీ - ప్రజాశక్తి బుక్ హౌజ్
5. తాటిరాములు - సమ్మక్క, మొట్లగూడెం, బయ్యారం, మహబూబాబాద్ (భద్రచలం ఐటిడిఏ పరిది)

ఆదివాసుల జీవన విధానం – సామాజికాంశాలు

– పి. రమ్యశ్రీరెడ్డి, పరిశోధక విద్యార్థిని, తెలుగు & ప్రాచ్య భాషా విభాగం, ఆచార్య నాగార్జున యూనివర్శిటీ, గుంటూరు.

'గిరిజనులు' పదంలో ''గిరి'' అంటే కొండ అని ''జనులు'' అంటే ప్రజలు అని గిరిజనులు అంటే కొండ ప్రాంతంలో నివసించే వాళ్ళని అర్థం. ఉత్తర భారతీయ భాషల్లో గిరిజనులను ఆదివాసిలంటారు. ''ఆది'' అంటే ''మొదటి'' అని ''వాసీలు'' అంటే ''నివాసం'' ఉన్న వాళ్ళు అని అర్థం. ఆదివాసీలు, గిరిజనులు ఏ దేశానికైనా మూలవారసులన్నది మానవ శాస్త్రవేత్తల భావన ప్రస్తుత భారత జనాభాలో దాదాపు 8-9 శాతం ప్రజలు వివిధ గిరిజన సమూహాలకు చెందిన వారే భారతీయ సమాజంలో గిరిజన సమూహాలన్ని ప్రత్యేకమైన విశ్వాసాలను కలిగి ఉన్నాయి.

ప్రాచీన మానవుల జీవనవిధానం అనేక రకాలుగా సాగింది. ప్రాచీన మానవులు జీవన విధానమే ఆదివాసీల జీవన విధానంగా చెప్పవచ్చు. ఆనాటి పరిస్థితులను తెలుసుకునేందుకు ఆదివాసీల జీవన విధానంలో సాంఘికాంశాలు ఎంతో ప్రాధాన్యత కలిగిస్తాయి.

ఆదివాసుల జీవన విధానం – సామాజికాంశాలు:

గృహనిర్మాణం :

ప్రాచీన కాలంలో ఆదివాసీలు తలదాచుకోవడానికి కొండ గుహలు, చెట్ల తొర్రలు వెతుకున్నారు. పశుపోషణ, వ్యవసాయం చేపట్టిన కొన్ని తెగలు మైదానాల్లో నివసించాల్సి వచ్చింది. అప్పుడే చిన్న చిన్న గుడిసెల్ని నిర్మించుకోవడం మొదలుపెట్టాడు. తర్వాత గృహ నిర్మాణానికి ఇటుకల్ని ఉపయోగించడం మొదలుపెట్టాడు. గృహ నిర్మాణానికి ఎక్కువగా కలప, దబ్బగడ్డి, ఈతగడ్డి, తాటాకు, కోపరిగడ్డి వంటి వస్తువుల్ని వినియోగించుకొన్నాడు.

ఆదివాసీలు ఇల్లు నిర్మించుకోవడానికి ముందుగా అడవి నుండి కలపను సేకరిస్తారు. పైకప్పుకి ఈతగడ్డి, టేకాకు, కోపరిగడ్డి, తాటాకు మొదలైనవి సమకూర్చుకుని ఇంటి నిర్మాణాన్ని ప్రారంభిస్తారు. ఇంటి నిర్మాణానికి నైపుణ్యం గల వ్యక్తుల్ని పిలుస్తారు. వీరిలో కొందరు గుడిసెలను, మరికొందరు చుట్టూ పాకలను, నిట్రాటి పాకలను నిర్మించుకుంటారు. ఈ పాకల చుట్టూ కర్రలు దగ్గరగా పాతి వెదురు బద్దతో దడిగా కట్టి దానిపై మట్టిని మెత్తి గోడలుగా చేసుకొంటారు. వాన నీరు పాకలోకి రాకుండా చుట్టూ కాలువలు తవ్వుతారు. జంతువల నుండి రక్షణ కోసం దడిలాగా చుట్టూ గోడ కడతారు.

ఆహార పానీయాలు :

ఆదివాసీలు ముఖ్యంగా రుచులు గురించి అంతగా పట్టించుకోరు. సమయానికి ఏదోరకంగా కడుపునింపుకోవడమే వారికి కావాల్సింది. రుచుల కోసం భుజించడం కోసం పుట్టినవారు కానప్పటికీ కొత్తన్నమో, కొర్రన్నమో, గువ్వకూరో, కోడికూరో, పిట్టకూరో, జంతువు కూరో ఆహారంగా కుదిరితే ఆ రోజు వారికి పండుగే. ఆదివాసీలు అడవిలో పెరిగే ఆకులు, దుంపలు, జంతువులపై ఆదారపడి, పండిన కొద్దిపాటి పంటను జాగ్రత్తగా వాడుకొని తమ జీవితాన్ని నెట్టుకొస్తారు.

పిండివంటలు :

కుడుములు, అరిసెలు, జంతికలు, సున్నుండలు వంటి పిండి వంటలు ఉల్వపిండితోను, చోడిపండితోనూ తయారు చేస్తారు.

కూరలు :

గుమ్మడి చిగుళ్ళకూర, చెంచలకూర, బలసుకూర, చామకూర, సీకాయ చిగురు పచ్చడి, గొడ్డుకూర, గురంకూర, కంద దుంపలకూర, గుమ్మడికాయ కూర, పనస పొట్టు కూర, ఉలవచారు, చోడి అంబలి, వెదురు కొక్కుల కూర, చెవుల పిల్లికూర, చేపల కూర, పీతల పులుసు, అడవి ఎలుక మాంసం కూర మొదలగునవి కలవు.

పానీయాలు :

జీలుగు కల్లు, వంటసార, గొరగకల్లు, మడ్డిసార, తాటికల్లు, ఈతకల్లు, విప్పకల్లు, బెల్లపు కల్లు మొదలగు పానీయాలు కలవు.

పండుగలు :

ఒక జాతి జాతీయతకు పండుగలు ప్రతీకలవుతాయి. అందుకే ఏ పండుగా పబ్బంలేని దేశంగానీ, రాష్ట్రంగానీ, జాతిగానీ, మతంకానీ, లేదంటే అతిశయోక్తి కాదు. పండుగ అనే శబ్దానికి అర్థం ఫలించటం అంటే కోరికలు ఫలించిన వేళ, శుభవేళ, ఉత్సవవేళ,వేడుక వేళ, ఇవన్నియూ పండుగకు సమానార్థాలే.

పండుగలు ఋతువును బట్టి, కాలాన్ని బట్టి, పండే పంటను బట్టి, ప్రకృతి ధర్మాలను బట్టి కలవు. అవి సంక్రాంతి పండుగ, భూమి పండుగ, కొత్తల పండుగ, పలకం పండుగ, మామిడికాయ పండుగ, పచ్చిక పండుగ, మామిడి టెంకల పండుగ, కొర్రకొత్త పండుగ, బుడమల పండుగ, దారి పండుగ, లక్ష్మీదేవి పండుగ, భూదేవి పండుగ, గంగాలమ్మ పండుగ, సమ్మక్క జాతర మొదలగునవి కలవు.

ఈ పండుగలు ఆదివాసీల జీవనవిధానాన్ని, ఆనాటి పరిస్థితులను, వారి ఆహారపు అలవాట్లను, సంస్కృతి సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను తెలియజేస్తున్నాయి. ఈ పండుగలకు కొన్ని కథలు కూడా కలవు. పండుగను బట్టి కథలు కూడా వ్యాప్తిలోకి వచ్చాయి. ఈ పండుగలే ఆదివాసీలకు ప్రత్యేకతను తెలిజేస్తున్నాయి.

వైద్యం :

పూర్వకాలం నుండి అనేకుల అనుభవ ఫలితమే ఆదివాసీ వైద్యం. ఆదివాసీలు శారీరక రుగ్మతల్ని, బాధల్ని పోగొట్టుకోవడానికి ప్రకృతిని ఆశ్రయించి ఎన్నో గొప్ప విషయాలను తెలుసుకున్నాడు. ఆదివాసీల వైద్యం పూర్తిగా ప్రకృతిలో సహజసిద్ధంగా దొరికే ఆకులపైన, చెట్ల బెరళ్ళపైన, వ్రేళ్ళపైన ఆదారపడి ఉంది.

కడుపునొప్పి :

పాలచెక్కతో పాటు కొద్దిగా ఉప్పును, మామిడి చెక్కను కలిపి నూరి పట్టించాలి. చేదు వేపాకులు చిన్న ముద్ద మింగాలి లేదా చిట్టి పాల కప్పు చూర్ణంతో తింటే కడుపు నొప్పి తగ్గుతుంది.

పచ్చకామెర్లు :

డక్కి చెక్క మిరియాల గింజలు, ఆవాల్ని నూరి తాగాలి, ఆ రసాన్ని తాగిన తర్వాత మూడు పూటలు పత్యం చేయాలి.

దగ్గు : బర్నిక చెట్టు నుండి వచ్చే పాలు తాగితే దగ్గు తగ్గుతుంది.

గజ్జి : పసుపు, పరుదొండ ఆకుల్ని నలిపి ఆ రసాన్ని రాస్తే గజ్జి తగ్గుతుంది.

నమ్మకాలు :

తరతరాల నుంచి పునరావృత్తి పొందుతూ సామూహిక మైన సమ్మతిని పొందే మానసిక స్థితిని నమ్మకం అన వచ్చునని ఆర్.వి.యస్. సుందరం గారి అభిప్రాయం. తొలి మానవుడు ప్రకృతిని అర్థం చేసుకొనే సమయంలో కలిగిన భయాలు, ఆందోళన, ఆనందాల సమ్మిళితం నమ్మకాల పరంపరగా రూపుదిద్దుకున్నాయి. ఈ నమ్మకాలు అనేక రకాలుగా ఉన్నవి.

గృహ సంబంధిత నమ్మకాలు :

1. ఇంట్లో పొయ్యి ఈశాన్యం వైపు ఉండకూడదు. అలా ఉంటే అన్నం కలసిరాదని, కుటుంబ జీవితంలో కష్టాలు, నష్టాలు, గొడవలు వస్తాయని నమ్మకం.
2. ఆకాశంలో మెరుపులు వచ్చేటప్పుడు ఇంటి గుమ్మం దగ్గర నిలబడకూడదంటారు. అలా ఉంటే ఆ వ్యక్తి చనిపోతారని వీరి నమ్మకం.
3. ఎవరైనా ఇంటికి వచ్చి డబ్బులుగాని, నీళ్ళుగాని అడిగితే గుమ్మం బయటకు వచ్చి ఇవ్వాలి. అలా

ఇస్తే లక్ష్మీదేవి వారిని వదిలి వెళ్ళిపోకుండా వుంటుందని నమ్మకం.

4. ఇల్లు కట్టేటప్పుడు ఆ ఇంటికి గుమ్మం తూర్పున ఉండాలి. అలా ఉంటే సూర్యకిరణాలు ఆ ఇంట్లోకి ప్రవేశించి అందరూ ఆరోగ్యంగా ఉంటారని వారి నమ్మకం.

వ్యవసాయ సంబంధిత నమ్మకాలు :

1. రాత్రిపూట భూమిని అరక కట్టి దున్నకూడదు. అలా దున్నిన వ్యక్తిని పాము కరచి చనిపోతాడని నమ్మకం.
2. విత్తనాల్ని రాత్రిపూట చల్లరు. అలా వేస్తే దయ్యాలు వచ్చి విత్తనాల్ని తినేస్తాయని, అవి సరిపోక మనుషుల ప్రాణాలు కోరతాయని నమ్మకం.
3. పంట కల్లంలో చేటల్ని బోర్లా పడుకోబెట్టకూడదు. చెప్పులు వేసుకొని కల్లంలోకి వెళ్ళకూడదు. అలా చేస్తే పంట దిగుబడి తగ్గిపోతుందని నమ్ముతారు.
4. పంటను ఇంటికి తెచ్చే ముందు మేకనుగాని, కోడినిగాని బలి ఇచ్చి, అక్కడే అందరూ కలిసి భోజనం చేసి, ఆ తర్వాత పంటను తీసుకొస్తారు. అలా చేయకపోతే దెయ్యాలు వాటిపై ఆశపడతాయని నమ్ముతారు.

ఆధార గ్రంథాలు :

1. ఆంధ్రుల జానపద సాహిత్యం -ఆంధ్ర శేషగిరిరావు.
2. కొండరెడ్డి గిరిజనుల జీవన విధానం - పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, వరంగల్.
3. జానపద విజ్ఞాన వ్యాసావళి - జి.యస్.మోహన్.

గిరిజన తండావాసుల జీవిత చిత్రణ – "రేలపూలు"

–పెద్దపల్లి తేజస్వి, పరిశోధక విద్యార్థిని, తెలుగు విభాగం, ఉస్మానియా విశ్వ విద్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.

కథ ఒక సాహితీ ప్రక్రియ. తెలుగు అకాడమీ నిఘంటువు ప్రకారం కథ ఒక సత్యాంశంతో కూడిన కల్పిత గద్య గ్రంధం. ఇతర భారతీయ భాషలలో కొత్త కథ పుట్టి సుమారు నూరేళ్ళయింది. ఈ నూరేళ్ళల్లో సుమారు లక్షకు పైగా కథలు రచింపబడినట్లుగా ఒక అంచనా. ఎక్కువగా కథల్లో నీతి, ధర్మం, సాహసం, ఔదార్యం, శృంగారం వంటి విషయాలు ప్రధాన వస్తువుగా కనిపిస్తాయి. సాంఘిక జీవన చిత్రణకు ప్రతీక అయిన కథాసాహిత్యంలో నేడు గిరిజన జీవితాలు ఇతివృత్తాలుగా కథలుగా రాయడం కనబడుతున్నది. గిరిజన సాహిత్యాన్ని రెండు రకాలుగా విభజించాల్సి ఉంటుంది.

ఒకటి : గిరిజన భాషల్లో లభించిన మౌఖిక సాహిత్యం

రెండు : ఆ జీవితాలపై తెలుగులో వచ్చిన సృజన సాహిత్యం

ఇప్పటి వరకు తెలుగు గిరిజన సాహిత్యంలో సహానుభూతికి చెందిందే ఎక్కువ. మొదటి గిరిజన కథను రాసింది చింతాదీక్షితులు అనుకుంటున్న సమయంలో గూడూరు రాజేంద్రరావు అనే రచయిత రాసారని "ఇప్పపూలు"కథా సంకలనం ద్వారా ప్రపంచానికి తెలిసింది. ఈ సంకలనం ద్వారా గిరిజన కథలు రాసే రచయితలు బయటికొచ్చారు. అందులో కరుణకుమార, సాహు, బి.ఎస్.రాములు, అల్లం రాజయ్య, పెద్దింటి అశోక్ కుమార్ మొదలైనవారు ఈ సంకలనంలోని కథా రచయితలు. వీరితోపాటు బమ్మిడి జగదీశ్వరరావు, పలమనేరు బాలాజీ, సమ్మెట ఉమాదేవి మొదలైన వారు గిరిజన కథలు రాశారు. భారత సమాజంలో ఆదివాసీలు మూలవాసులు. తమమీద జరుగుతున్న అణచివేతకీ, సంపదల పరిరక్షణకోసం దోపిడీ, పీడనలను ఎదుర్కొంటున్న పోరాటయోధులు. అదే సమయంలో ఆచారాలు,సంస్కృతీ, సాంప్రదాయాల ప్రత్యేక వారధులు. "సమ్మెట ఉమాదేవి" రచించిన "రేలపూలు" కథా సంపుటిలో గిరిజన తండావాసుల జీవితాల్లోని ఎన్నో కోణాలను ఆవిష్కరించారు.

సమ్మెట పోతరాజు, లక్ష్మీ తులసీబాయి గార్ల కుమార్తె "సమ్మెట ఉమాదేవి". ఖమ్మం జిల్లాలోని వివిధ మండలాల్లో ఉపాధ్యాయురాలుగా పనిచేసిన ఉమాదేవి గారి తొలి సంకలనం "అమ్మ కథలు". రెండవది "రేలపూలు". ఇప్పటిదాక సుమారు డెబ్భై కథలు రాశారు. "రేలపూలు" కథలన్నీ గిరిజన నేపధ్యానికి సంబంధించినవి. గిరిజన తండావాసుల జీవన విధానాన్ని, జీవన పోరాటాలను ఇందులో అక్షరీకరించారు. వారి స్థితిగతులను, జీవన నేపధ్యం తెలుపుతూ ఆలోచింపచేసే ఈ కథా సంపుటిలో మొత్తం 17 కథలున్నాయి. గిరిజనుల్లో అక్షరజ్ఞానం చేసే వారు తక్కువ. గుర్తింపు కార్డుల్లో పేరు నమోదు చేసుకునేటప్పుడు ఉన్నపేరే ఎవరైనా చెప్తారు. ఒక్క పేరు మార్పు వల్ల విద్య, వైద్య, వివాహ విషయంలో ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఇబ్బందులకు గురయ్యే పరిస్థితులు కనిపించే కథ "అస్తిత్వం". ఈ కథలో లంబాడీల యొక్క సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతిబింబాలైన "దాటోడి" మరియు "తీజ్" పండుగల వైశిష్ట్యాన్ని చక్కగా చిత్రీకరించారు.

చిన్నారులు పాఠశాలకు వెళ్ళినప్పుడు ఉపాధ్యాయులు చెప్పిన విషయాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసే సమయం రాత్రి. ఈ సమయంలో "బిజిలి" లేకపోవడం వల్ల చిన్నారి సాల్కి సతమతమయ్యే తీరు కంటతడి పెట్టిస్తుంది. ఎన్నో ఆశలు, ఆశయాలు కలిగి ఉన్న చిన్నారి జ్ఞానసముపార్జన కోసం పాఠశాలలో కంప్యూటర్ నేర్చుకుంటున్న సమయంలో "బిజిలీ" వల్ల ఆటంకం ఏర్పడితే

చిన్నారి పడే మనోవ్యధ మాటల్లో చెప్పలేనిది. ఈ కథలోని సాల్కి సోషల్ ఉపాధ్యాయురాలు ఎన్నికల గురించి పాఠం బోధిస్తున్న సమయంలో చిన్నారి అడిగే కొన్ని ప్రశ్నలు ఆలోచనల పర్వంలోకి తీసుకెళుతుంది. ముగ్గురున్న ఓటర్ల కోసం తొమ్మిది మంది ఉద్యోగులు పని చేయవలసి వచ్చిందని ఉపాధ్యాయురాలు చెప్తున్నప్పుడు..

మా తండాల్లో 80 మంది వరకు ఉంటాం.. మా ఓటర్లు, మా జీవితాలు ప్రభుత్వానికి విలువైనవి కాదా? సర్కారు తండాలకు రోడ్లు ఎందుకెయ్యదు? బిజిలీ (కరెంటు) ఎందుకియ్యదు? దావాఖానా ఎందుకు బెట్టదు..? వారి తండాల్లో బిజిలి కారణంతో ఒక బాలుడు రాత్రి నడుచుకుంటూ వెళుతుంటే పాము కాటుకు గురై మరణించడం జరుగుతుంది. అదే బిజిలీ కారణంతో సాల్కి ఒక కన్ను పోగొట్టుకోగా వారి కుటుంబ సభ్యులు ఏడుస్తుంటే.. "దేవుడు నాకు ఒక కంట్లనే బిజిలీ తీసిండు గానీ.. ఇంకో కన్ను ఉన్నదిగా ..! సుక్కలు సూడనీకి.. పాఠాలు సదవనీకి" అంటూ.. తండావాసుల బిజిలి కష్టాలను వివరిస్తూ.. ఆత్మస్థైర్యంతో ముందుకు సాగిన కథ "బిజిలి".

"చాంది" కథలో చాంది అనారోగ్యంతో తన తల్లిని పోగొట్టుకున్న ఐదవ రోజే తన తండ్రికి మరోపెళ్లి చేస్తామన్న పెద్దలకు "కష్టం చేసి మమ్ముల సాదుడు రాదుగాని. తాగుడుకు బానిసైన వ్యక్తి మళ్లీ పెళ్లి చేసుకొని మరో ఆడదాన్ని సాదుతడా..?" అంటూ.. పెద్దలను ధైర్యంగా ప్రశ్నిస్తుంది. చాంది పెండ్లి సంబంధానికి తనను చూడడానికి వొస్తున్న వారు ఇంటికి రాకముందే వారికి ఎదురుగా ధైర్యంగా వెళ్లి "పూర్యా కూతుర్ని చేసుకోను వొస్తున్నది మీరేనా? పూర్యా కూతురు చాంది నేనే.. మా తండాను వొదిలి నీనేడికీ రాను. మా తమ్ముడు, చెల్లెళ్ళని చూసుకోవాలే.." అంటూ వొచ్చిన వారిని వెనక్కి పంపిస్తుంది. బడికి వెళ్తూ చదువుకుంటూనే.. బాధ్యతగా ఆలోచిస్తూ.. తన తోబుట్టువులను విద్యావంతుల్ని చేసే ఆలోచనను ఆదర్శవంతంగా చిత్రీకరించారు. స్కూల్ విద్యార్థిని తీసుకున్న ఈ నిర్ణయం పాఠకుని హృదయాన్ని పులకించేలా చేస్తుంది "చాంది"కథ.

ప్రకృతి అందాలను ఆరాధించే అమాయకమైన లేడికూన కథ "దివిలి". పురుషుడు స్త్రీని నయవంచన చేసి పెళ్లి కాకుండానే తల్లిని చేస్తే... ఆ స్త్రీ పడే మానసిక క్షోభ మరియు కుటుంబ సభ్యుల కృంగుబాటు "దివిలి" కథలో కనిపిస్తుంది. మరియు అస్పష్టంగా, తండా ప్రజల ఆర్థిక అవసరాలను, జీవన సంవేదనల్ని తగ్గించేందుకు జరిగే మతమార్పిడిలోని సంఘర్షణను పార్వతి పాత్ర ద్వారా చక్కగా వివరించారు రచయిత్రి.

నర్సుగా చేస్తున్న రజని ఆమె జీతంతో సంబంధం లేకుండా చుట్టుపక్కల తండావాసుల ఆరోగ్య అవసరాలను చూసుకుంటూ వారి కష్ట సుఖాలను ఆలకిస్తూ అందరికీ సహాయం చేసే మనస్తత్వం.. ఒకరోజు యాక్సిడెంట్‌కి గురైన రజనికి డబ్బులు అవసరమైన పక్షంలో గణేష్ పండుగను పురస్కరించుకుని పోగు చేసిన డబ్బులను ఆమె ఆరోగ్యం కుదుటపడడం కోసం ఖర్చు చేయడం.. తాండావాసుల ఆత్మీయత, అనురాగాలకు అద్దం పడుతుంది. ఒకరికొకరికి కష్టాలు ఎదురైనప్పుడు మానవుడే దేవుడవుతాడని నిరూపించిన కథ జై జై గణేశా.!!

గిరిజన యువకుడు ఎన్నో కష్టాలను అనుభవించి బ్రతికుండగానే సజీవదహనంతో నరకయాతన అనుభవిస్తున్న కేస్లాకు తన మిత్రులు ప్లాస్టిక్ సర్జరీ చేపించి మనోధైర్యాన్ని కోల్పోకుండా గమ్యాన్ని చేరే విధంగా రచయిత్రి చిత్రీకరించిన కథ "కేస్లా".

గిరిజనవాసుల్లో ఎక్కువగా వ్యవసాయం మీద ఆధారపడే వారే ఎక్కువ. ఏ పంట వేసినా నాటు నుండి కోత వరకు పంటను చెమటోడ్చి కాపాడుకుంటుంటే.. చేతి కొచ్చిన మొక్కజొన్నలను దొరకు ఎదురు చెప్పకుండా ఇస్తే... వాటికి సరైన గిట్టుబాటు ధర లేకపోతే రైతు పడే బాధను వివరిస్తూ.."మనుషుల కంటే మూగప్రాణులు

మిన్న" అనే సందేశాన్ని "తావుర్యా" కథలో ఇచ్చారు రచయిత్రి.

ఒక విద్యార్థి ఇంటి పాలం పనులు చూసుకుంటూ... బడికి వెళ్లి చదువుకోవడం కష్టం.. బాగా చదువుకొని ఉన్నతమైన ఉద్యోగం చేయాలనే ఆశయాన్ని కలిగిన దేవ్లా ఇంటి ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోవడంతో చదువుకోవాలన్న తపనకు, బ్రతుకు అగచాట్లకు మధ్య గుండెల్లో రేగే సంఘర్షణ "పాలబుగ్గల చిన్ని రైతా.!"

ఉప్పొంగిపోతున్న వానలో మాలవాడకు చెందిన పిల్లలు తడుస్తూ ఉంటే తట్టుకోలేకపోయిన సోమ్లా తండాలోని వారి ఇంట్లో ఆశ్రయం కల్పిస్తే... ఆ పసి మొగ్గలు వెరే కులానికి చెందిన వారని తండావాసులు చూపించే "వర్ణవివక్షత" కలిగిన కథ "వాన".

ఆడ, మగ మధ్య వివక్ష పూరితమైన ధోరణి సమాజంలో ఎక్కడ చూసినా కనిపిస్తుంది. గర్భంలో ఉన్నది అమ్మాయి అని తెలియగానే పసికందుల్ని బయటికి రాకుండానే చిదిమేస్తున్నారు. ఈ రకమైన హింస వివాహానంతరం కుటుంబసభ్యుల్లో ఎవరో ఒకరి వల్ల మహిళలు అనుభవిస్తూనే ఉన్నారు. ఈ పరమైన హింస "కమ్లి"కి అత్త "మాన్సీబాయి" వల్ల వేధింపులను కలగజేస్తే... భర్త చూపించే ప్రేమ వల్ల ఆ బాధ నుండి విముక్తి పొందే దిశగా "కమ్లి" కథను చిత్రీకరించారు రచయిత్రి.

ఒక స్త్రీ పెళ్లికి ముందు తల్లిదండ్రుల వద్ద అల్లారు ముద్దుగా పెరిగి.. తన కన్నవాళ్ళు ఏ ప్రేమైతే చూపించారో అదే ప్రేమను తన భర్త దగ్గర ఆశిస్తుంది..పెళ్లయ్యాక ఎప్పుడో ఒకసారి జాలా... తనను చూడటానికి వొచ్చిన తమ తండా వాసుల మీద తన భర్త తార్యానాయక్ చూపించే వివక్ష వల్ల తట్టుకోలేకపోయిన జాలా, ఆధునిక పోకడలకు మక్కువ చూపించే భర్తతో విడిపోవడానికి సిద్ధపడి పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెడితే "వారు అడిగిన ప్రశ్నలకు "అతను మగవాడే కాని మన వాడు కాదు"అని జాలా చెప్పే సమాధానం పాఠకున్ని ఆలోచించేలా చేస్తుంది "గిరికాన దీపం కథ"

చిన్నప్పుడు అమ్మానాన్నలకు దూరమైన చీనా... తన చెల్లెలు తాన్యను పోగొట్టుకోవడం వల్ల తన చెల్లెలి పిల్లలను చూసుకునే బాధ్యతను తీసుకోవడంతో తన భార్య తాన్యకు నచ్చకపోవడం వల్ల ఇద్దరు ఒకరికొకరు దూరంగా ఉండటం జరుగుతుంది. చివర్లో తాన్య ఆ చిన్నారులను తనపిల్లలుగా స్వీకరించే మనసున్న మనుషులు గురించి వివరించిన కథ "చీనా"

స్వచ్ఛంద సంస్థలు ఎన్నో ప్రభుత్వ పాఠశాలకు విరాళాలు ఏదో ఒక రూపంలో అందజేస్తుంటాయి. అమెరికా నుండి తమ పాఠశాలకు ఒక సంస్థ వారు బూట్లు పంపిస్తున్నారని ఎంతో ఆశతో ఎదురు చూసిన చిన్నారులు దానిలోని నాణ్యత లోపిస్తే వారు పడే బాధ ఈ కథలో కనిపిస్తుంది. విద్యార్థుల కోసం సేవ చేసే కొన్ని స్వచ్ఛంద సంస్థలు ఎంతవరకు వారి అవసరాలు తీర్చుతున్నారు అనే దిశగా "ఆశలు" కథ ద్వారా వివరించారు రచయిత్రి.

"మూగజీవాలు" ఈ పేరు వినబడితే చాలు వాటి మీద మానవత్వం చూపించే వారే కరువైపోయారు. ఒక వ్యక్తి చేసే మంచి నలుగురిని ప్రేరేపితం చేయాలి. ఆ మనస్తత్వమే మనకు "హథీరామ్" వల్ల తండావాసులను మార్చి అందరూ కలిసికట్టుగా "వాంద్రి బచావో.. కోతులను కాపాడండి" అనే నినాదంతో చక్కని సందేశం ఇచ్చిన కథ "హథీరామ్".

అమ్రు భర్త మంగ్యా ఉన్నతమైన ప్రభుత్వ ఉద్యోగిగా పని చేస్తున్న సమయంలో అనారోగ్యరీత్యా చనిపోవడం వల్ల ఇద్దరు ఆడపిల్లలు కలిగిన అమ్రు తన భర్త స్థానంలో వాచెమెన్ పోస్టులో చేరిన తర్వాత వేటకుక్కల్లా మారిన మగబందీ జనం వల్ల లైంగిక వేధింపులను అనుభవించి.. చాకచక్యంగా వాటి నుండి తప్పించుకొని తన పిల్లల సహకారంతో పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించి.. వాచ్ మెన్ స్థాయి నుండి అటెండర్ ఉద్యోగం సంపాదించి, మహిళా నాయకురాలిగా ఎన్నికై స్త్రీలందరికీ ఆదర్శంగా నిలిచి, వారి మీద జరిగే ఆగడాలను ఎదిరించి మహిళల్లో ఆత్మస్థైర్యం కలిగించిన అద్భుతమైన కథ "అమ్మ." సమ్మెట ఉమాదేవి రచించిన "రేలపూలు" కథల్లో దిగువ

తరగతి గిరిజన తండాల్లోని జీవిత చిత్రణతో పాటు ఒక ఆర్ద్రత, ఒక ఆవేదన, ఒక అస్థిత్వ పోరాటం పరుచుకొని పాఠకుని మనసులో ఒక సంచాలనాన్ని కలిగించాయి. గిరిజన తండా వాసుల బతుకు వెతలు ప్రతీ పాఠకుణ్ణి కన్నీటి పర్యంతం చేస్తాయి. కథల్లోని ప్రకృతి అందాల వర్ణన మంత్రముగ్ధుల్ని చేస్తాయి. తన కథల శైలిని పదునుపెట్టుకుంటూ మాండలికంలో సరళమైన బాణీలో అక్షరీకరించారు.

నవలా సాహిత్యంలో గిరిజన జీవన చిత్రణ

– కె. పుష్పవతి, పరిశోధక విద్యార్థిని, తెలుగు & ప్రాచ్య భాషా విభాగం, ఆచార్య నాగార్జున యూనివర్శిటీ, గుంటూరు.

ఆధునిక తెలుగు సాహిత్యంలో నవల, కథ, కవిత్వం, నాటకం, ప్రధాన ప్రక్రియలుగా వెలుగొందుతున్నాయి. కాలక్రమేణ ఎన్నో మార్పులకు గురైన గిరిజన జీవన చిత్రణ ఈ నూతన ప్రక్రియలతో అనుసంధానించబడి గిరిజన జీవన చిత్రణ కళ్ళకు కట్టినట్టుగా దర్శనమిస్తున్నాయి. తెలుగు సాహిత్యంలో గిరిజన జీవిత చిత్రణకు సముచిత ప్రాధాన్యం లభించింది. గిరిజనుల జీవితాలకు దగ్గరగా అన్వయించి రచన చేయడం ఈ మధ్యకాలంలో ఎక్కువగా కనబడుతుంది. గిరిజనుల జీవితాన్ని, వారి సంస్కృతిని, జీవన సరళిని వస్తువుగా స్వీకరించి నవల, నాటకం, కథ, కవిత, గేయం ఇలా అనేక సాహితీ ప్రక్రియలు చోటు చేసుకున్నాయి. వాటిని సమగ్రంగా పరిశీలిస్తే గిరిజనుల జీవన విధానం, సంస్కృతి చాలా వరకు అవగతం అవుతుంది.

నవలా సాహిత్యం – గిరిజన జీవన చిత్రణ :

'నవల' అనగానే సమాజ చిత్రణ ఉంటుంది. సామాజిక జీవనానికి అద్దంపట్టే ఈ ప్రక్రియలో గిరిజనులకు సంబంధించిన అంశాలతో నవల రచించబడితే అది కొత్త పుంతలు తొక్కుతుంది. ఆ కోవలో చాలా నవలలు గిరిజనులకు సంబంధించిన అంశాలతో రాయడం జరిగింది.

నరహరి గోపాలకృష్ణమశెట్టి 1872లో "శ్రీరంగ రాజ చరిత్ర" రచించారు. దీనికే సోనాబాయి పరిణం అనిపేరు కూడా ఉంది. ఇందులో విద్యానగరాన్ని ఏలిన రంగమరాజు లంబాడీ తెగకు చెందిన సోనాబాయిని ప్రేమించి పెళ్ళిచేసుకుంటాడు. తరువాత సోనాబాయి తన అత్త కూతురే అని తెలుసుకుంటాడు. ఇది మొదటి నవలగా స్థానాన్ని పొందినప్పటికి గిరిజనుల ప్రస్తావన వచ్చిన మొదటి నవలగా కూడా శ్రీరంగరాజ చరిత్రను చెప్పవచ్చు. అలాగే 1972లో కొర్రపాటి గంగాధరరావు రాసిన "లంబాడోళ్ళ రాందాసు" ఎస్.మోహన్ రాజ్ "తాండా" నవలలు గిరిజనులకు సంబంధించినవే.

'లంబాడోళ్ళ రాందాసు' నవలలో రాందాసు, చుక్కి ఒకరినొకరు ప్రేమించుకుంటారు. తాండావాసులంతా చందాలు వేసుకొని పెళ్ళిచేస్తారు. అప్పటి నుండి గిరిజనేతరుడైన రాందాసు 'లంబాడోళ్ళ రాందాసు'గా పిలవబడతాడు. ఈ విధమైన సంస్కృతి అంగీకృత సంస్కృతి ఎందుకంటే ఒక జాతి జీవన విధానంలో మరో జాతి జీవన విధానాన్ని స్వీకరించడం వలన ఆధునిక కాలంలో సంస్కృతి మార్పు అనేది నిరంతరం మారుతూనే ఉంటుంది. రాందాసు గిరిజనేతరుడైనా గిరిజన సంస్కృతిని అంగీకరించాడు. అంటే రాందాసు మార్పును కోరుకున్నాడు. కాని గిరిజనులు మారినట్లు మారి చివరికి తమలో దాగి ఉన్న మూఢాచారాల వల్ల రాందాసును హత్య చేస్తారు. అంటే గిరిజన గిరిజనేతర సంస్కృతిని తిరస్కరించినట్లేనని చెప్పాలి.

గిరిజనులు తమ అనుభవాల్ని స్వేచ్ఛాయుత వాతావరణంలో వ్యక్తీకరించగలిగే పరిస్థితులు రాగలిగినపుడు మిగిలిన సమాజంలో వారివలే వీరూ పరిగణన పొందుతారు అయినప్పటికీ, గిరిజనేతరులు కేవలం గిరిజనుల్లో అంగీకృత సంస్కృతినే గ్రహిస్తున్నారు గాని అనంగీకృత సంస్కృతిని గ్రహించడం లేదు. అంటే వారి సంస్కృతిని వారు గౌరవించుకుంటున్నారన్నది ఈ నవల ద్వారా అర్థమవుతుంది.

'తాండా' నవలలో ఆధునిక జీవితానికి అనుగుణంగా గిరిజనుల జీవిన విధానంలో కూడా అనేక పరిణామాలు సంభవిస్తున్నాయని తెలుస్తుంది. సమకాలీన పరిస్థితులకు గిరిజనులు కూడా తమ సాంప్రదాయాల్ని సంస్కరణాత్మకంగా అంగీకరిస్తున్నారని స్పష్టమౌతుంది. గిరిజనేతర

పద్ధతిలో పెళ్ళి చేసుకున్న హరి పూర్తిగా గిరిజన సాంప్రదాయానికి విరుద్ధంగా ఉంటాడు. హరి తండ్రి సోమల్య నాయక్ హరి పద్ధతిని మొదట్లో వ్యతిరేకిస్తాడు, అయితే స్కూలు మాష్టారి సలహాతో సోమాల్యానాయక్ హరిని అంగీకరిస్తాడు. ఇక్కడ హరి ఉన్నత చదువులు చుదువుకుని మూఢ సాంప్రదాయాలను విడవాలనే దృక్పథంలో ఉంటాడు. అలాగే కొనసాగుతాడు. కాని మొదట్లో అంగీకరించని తన కుటుంబం తరువాత అంగీకరించడంలో మార్పును కోరుకున్నట్లు తెలుస్తుంది. ఈ నవల మానవ జీవితంలోని సంస్కరణాభిలాష గిరిజనుల్లోనూ ఉందనేది గుర్తించింది. వారికి అందరిలాగానే అనుభూతులు, ఆకాంక్షలు ఉంటాయని వాటిని వ్యక్తం చేయడానికి సరైన పరిస్థితులు ఏర్పడడం అవసరమని ఈ నవలలోని సంఘటనలు ఆధారంగా తెలుసుకోవచ్చు.

గిరిజన సంస్కృతి ఈ నవలలో ఎక్కువగా కనబడుతుంది. ఆహార అలవాట్లు, దుస్తులు, వేషధారణ, జీవన విధానం, భాషలో, భావంలో గణనీయంగా మార్పు వస్తుందని నిరూపణ అవుతుంది. అయినా గిరిజనులు ఆధునిక ఆహార అలవాట్లకు లోనయినప్పటికీ, తమ సంప్రదాయ ఆమారానికే ప్రాముఖ్యత నిస్తున్నారు. నేడు ప్రపంచీకరణ నేపథ్యంలో ఆడవారు మార్పును అంగీకరిస్తున్నారు. నేడు గిరిజన సంస్కృతి ప్రపంచ సంస్కృతి అందులో భాగమైన భారతీయ సంస్కృతిలో సమానమైన గుర్తింపును పొందలేక పోయినా, సినిమాల్లో, టి.వి.ల్లో, సభల్లో, సమావేశాలలో గుర్తింపును పొందుతుంది.

పైన చెప్పిన నవలల్లో గిరిజన జీవితాల్లో ఉండే భిన్న పార్శ్వాలను కొంతవరకైనా వివరించడానికి ప్రయత్నించాయని నిస్సందేహంగా చెప్పవచ్చు, ప్రస్తుత గిరిజన నవలలు గిరిజనుల జీవితాల్లోని ప్రాథమిక దశనే ఎక్కువగా చిత్రీకరిస్తున్నాయనిపిస్తుంది.

తెలుగు సాహిత్యంలో గిరిజన జీవితం ప్రతిబింబించే నవలలు చాలానే ఉన్నాయి. కేశవరెడ్డి రచించిన 'చివరి గుడిసె' నవలలో గిరిజన తెగ అయిన 'యానాదుల' జీవితం గురించి వారి సంస్కృతిలో గల వైవిధ్యం, ఆచారాలు, నమ్మకాలు మొదలైన విషయాలు ఈ నవలలో విశ్లేషించడం జరిగింది. యానాదులు జీవన విధానం చాలా మార్పును సంతరించుకుంది. సంచార జీవులుగా ఉండి స్థిరనివాసాలు ఏర్పరచుకున్న యానాదులు నేటికీ ఆహార సేకరణలోనే ఉన్నారు. యానాదుల కులవృత్తి ఎలుకలు, కుందేళ్ళు, ఉడతలు మొదలైనవి వేటాడి బ్రతకడమే వీరి ప్రధాన వృత్తి. ఈ నవలలో చిన్నోడు ప్రతిదానికి భయపడటం అనేది మున్నగారికి నచ్చదు. అందుకే అంటాడు 'నువ్వు యానాదోడి కడుపున పుట్టాల్సినోడివి కాదురా, యాడనో మారాజుల కడుపున పుట్టాల్సినోడివి' (చివరి గుడిసె, కేశవరెడ్డి 2012. పుట : 22) అంటాడు. ఈ నవలలో యానాదుల కులవృత్తి గురించి వారిని భూస్వామ్య సమాజం దొంగలుగా ఏ విధంగా మార్చారు అనే విషయాలు ప్రస్ఫుటంగా చిత్రించారు.

యానాదుల వస్త్రధారణ గురించి ఈ నవలలో ఒక చోట ప్రస్తావించబడింది. మున్నుగాడు, చిన్నోడు మరియు బైరాగి ముగ్గురు కలిసి పాటలు పాడుతూ కల్లుతాగుతున్న సమయంలో మన్నుగాడు "పాట నేను పాడతాను నువ్వు దరువెయ్యి సావి మనం పాట పాడితే దుమ్ములేచి పోవాల" (చివరి గుడిసె, కేశవరెడ్డి 2012. పుట : 103) అని అతడు తలపాగాను, గోచీని బిగించి కట్టుకొని పాయ్యిల చుట్టు లయబద్ధంగా ఎగురుతూ పాడతాడు. ఇలా ప్రతీ పాత్రలో గిరిజన సంభాషన, జీవన శైలి దర్శనమిస్తుంది. అలాగే మున్నుగాని వేషధారణ, తలపాగాను, గోచీని చిత్రించాడు కవి.

ఈ చివరి గుడిసె నవలలో యానాదుల ఆహారపు అలవాట్లు కూడా మనకు ప్రస్ఫుటమవుతాయి. యానాదులు పూర్తిగా మాంసాహారులు వీరు వేటాడుతూ ఉడుత, కుందేలు మాంసం, మేక మాంసం, గొర్రె మాంసం, చేపలను తింటారు. "ఈసారి కుందేలు దొరికితే

దాని మాంసం నూనెలో వేయించి తిందాం నాయనా కమ్మగా ఉంటుంది". (చివరి గుడిసె, కేశవరెడ్డి 2012. పుట : 15) అలాగే "ఎండ బారడేక్కెందంటే ఉడతలు చెట్లు దిగేస్తాయి". (చివరి గుడిసె కేశవరెడ్డి, 2012, పుట:13) అనే మాటలను బట్టి వీరు మాంసప్రియులని తెలుస్తుంది.

యానాదుల జీవన విధానం కూడా ఈ నవలలో కనిపిస్తుంది. వీరి జీవన విధానం పూర్తిగా ప్రకృతిపై ఆధారపడి వుంటుంది. ఈ యానాదుల జీవనం నిరంతరం సమరమే. వీరు వేటకు అధిక ప్రాధాన్యతనిస్తారు. కన్నాలలో ఎలుకలను పట్టడం చిన్న చిన్న జంతువలను వేటాడటం, ఉడతలను పట్టడం వంటివి చేస్తుంటారు. వీరి జీవన విధానం ఏరోజుకి ఆరోజు అన్నట్లు ఉంటుంది. ఉదయం వారి ఆకలి కేకలు మొదలై రాత్రిక ఆరిపోతాయి. లేదా రాత్రి మొదలై ఉదయానికి తీరిపోతాయి. వీరి జీవనంలో ఆహార సేకరణకే అధిక భాగం గడిచిపోతుంది. లోకం పోకడ కానీ, ధనం అంతస్తుల గోల గానీ వారికి తెలియవు.

వసంత దేశ పాండే రచించిన 'అడవి' నవలలో అడవిలో గోండుల జీవిత పరిస్థితులు, ఆనందమోహన రాసిన 'వసంత గీతం' నవలలో గిరిజన పోరాట నేపథ్యం కనిపిస్తుంది. సాధన గారి 'రాగో' నవల గోండ్రు స్త్రీల పట్ల అనుసరిస్తున్న కట్టుబాట్లు, అణచివేతలను, ఆచారాలను వ్యతిరేకిస్తూ సాగుతుంది.

ప్రస్తుతం నేటి ఆధునిక కాలములో కాలంతోపాటు వస్తున్న మార్పును ఆస్వా దిస్తున్న గిరిజనులు కూడా ఆధునిక కాలంలో ప్రపంచీ కరణకు లోనౌతున్నారు. వీరు నూతన అలవాట్లకు అను గుణంగా ఆధునిక యుగంలో నూతన శకాన్ని ఆరంభించి అనేక దశలుగా వివిధ రంగాలలో అభివృద్ధి చెందు తున్నారు. గిరిజన జీవన విధానం సంస్కృతీ, సంప్ర దాయాలతోపాటు ప్రస్తుతం గిరిజన జీవన విధానంలో వస్తున్న మార్పులను కూడా అన్వయిస్తూ తెలుగు సాహిత్య ప్రక్రియలలో అనేక రచనలు చేయడం వలన గిరిజనుల ఆధునిక జీవన చిత్రణను కూడా వెలుగులోనికి తీసుకు రావచ్చు.

ఆధార గ్రంథాలు :

1. కొర్రపాటి గంగాధరరావు - లంబాడోళ్ళ రాందాసు.
2. డా॥కేశవ రెడ్డి - చివరి గుడిసె, 2012.

నిబద్ధతకు, జాతీయ సమైక్యతకు, మత సామరస్యాలకు ప్రతీకలు – లంబాడీల పండుగలు

– జలిపిగాల రామాంజనేయులు, పరిశోధక విద్యార్థి, తెలుగు & తులనాత్మక సాహిత్య అధ్యయనశాఖ,
శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

ఒక సమాజాన్ని గురించి సమగ్రంగా అధ్యయనం చేయాలంటే వారి ఆహారపు అలవాట్లు, జీవననేపథ్యం, మనిషి పుట్టినప్పటినుంచి చనిపోయేంత వరకు చేసుకొనే సంస్కారాలు, వారు పాటించే ఆచారవ్యవహారాలు, జరుపుకొనే పర్వదినాలు, చేసుకొనే పండుగలు ప్రాధాన్యతను సంతరించుకుంటాయి. ఒక జాతి సూచనా ప్రాయంగా జరపుకొనే తంతులు, సంస్కారాలు ఆ జాతి మూలబీజ ప్రాధాన్యాన్ని తప్పక చెబుతాయి. ఒక జాతి సంస్కృతి ఎంత ఆధునీకరించబడినప్పటికీ తమ సంస్కృతి సంప్రదాయాలను దాటి మారని వారు గిరిజనులైతే తమ సంస్కృతీ సాంప్రదాయాలనుంచీ వలస సంస్కృతికి సులభంగా ఆకర్షితులయ్యేవారు గిరిజనేతరులు. ఈ గిరిజనేతురలనే నాగరికులు లేక మైదాన ప్రాంతాల వారని కూడా చెప్పుకోవచ్చు.

ఆంధ్రప్రదేశ్‌లో 33తెగల గిరిజనజాతులున్నారని పరిశోధకుల అంచనా. వీరిలో స్థిరకాపురస్తులు వున్నారు, సంచార తెగలున్నారు. లంబాడీ/సుగాలీ/బంజారాలు, సవరలు, గోండులు, చెంచులు మొదలైనవారు దాదాపు స్థిరకాపురస్థులుగా ఆధునిక కాలంలో జీవిస్తున్నారని, ఎరుకలు, యానాదులు, షికారీలు (గువ్వలు కొట్టే వాళ్ళు) మొదలైన వారు. ఇప్పటికీ దాదాపుగా సంచార జీవనాన్ని కొనసాగిస్తున్నారంటే ఆశ్చర్యం కలుగకమానదు.

పై రెండు గిరిజనవర్గాలలో కాస్తో, కూస్తో మిగతా వర్గాలకన్నా సాంఘిక, ఆర్థికస్థాయిని దాటి ఆత్మ విశ్వాసంతో ప్రకృతిని నమ్ముకొని బ్రతికేవారుగా సుగాలీ/బంజారా/లంబాడీతాండాలను ప్రధానంగా చెప్పుకోవచ్చు. వీళ్ళు తమను తాము పృథ్వీరాజ్ చౌహాన్ వారసులుగా చెప్పుకొంటారు. తురుష్క దండయాత్రలలో సోదరుని వంచనవల్ల పృథ్వీరాజ్ ఓడిపోవడం, తురుష్క సైన్యాలకు భయపడి తమ జాతిమొత్తం అరణ్యాలకు పారిపోయినట్లును, రాణాప్రతాప్ మరణానంతరం నిరాశ్రయులైన వీరు దక్షిణ (మలవా) భూములకు తరలి వచ్చారని ఆచార్య ఎం. గోనా నాయక్‌గారు తమ పిహెచ్.డీ సిద్ధాంత గ్రంథం (పుట:16-19)లో పేర్కొన్నారు. అంటే తురుష్కుల బారినుండి తమను తాము రక్షించుకోనే నిమిత్తం అడవుల పాలయ్యారని ఆత్మవిశ్వాసంతో ప్రకృతి ప్రేమికులై ప్రకృతిని నమ్ముకొని జీవించడం వల్ల కొండలలో, కోనలలో అటవీభూములకు పరిసర ప్రాంతాల్లో తమ నివాసం ఏర్పర్చుకున్నారని కాలక్రమేణా ఆ ఆవాసాలే తాండాలయ్యాయని కూడా పై సిద్ధాంతవ్యాసం పేర్కొంటోంది.

ఏది ఏమైనా లంబాడీ/బంజారా/సుగాలీ అనే జాతులు రాజస్థాన్, మహారాష్ట్ర, గుజరాత్ ప్రాంతాలనుంచి చెల్లాచెదురైన తెగలనే తెలుస్తూవుంది. తదనంతరం వీళ్ళు స్థిరనివాసం ఏర్పర్చుకున్నా మూల సంస్కృతిని మరచిపోకుండా స్థానిక సంస్కృతులలో కలగలసి తమ ఆత్మగౌరవాన్ని, తమ జాతి సమైక్యతను భారతదేశ ఔన్నత్యాన్ని కాపాడుకుంటూ వస్తున్నవారని కచ్చితంగా చెప్పవచ్చు. ఇలాంటి మూలవాసుల సంస్కృతిని అధ్యయనం చేయాలంటే వారు చేసుకొనే పండుగలని ఒకసారి పరామర్శించుకోవడం తప్పనిసరవుతుంది. ఈ బంజారాలు ప్రధానంగా దీపావళి(దవాళీ), హోళీ, దసర్గా, తీజ్ పండుగ (మొలకల పున్నమి) తుల్జా భవాని, మరియమ్మ, పోలేరమ్మ, కసంజిస్వామి జాతరలను, బాబయ్యస్వామి ఉత్సవం మొదలైన పండుగలను జరుపుకొంటారు.

ప్రస్తుతం నిబద్ధతకు, నిభక్తికి నిదర్శనంగా జరుపుకొనే తీజ్ పండుగ స్థానికతపై మమకారం పెంచుకొనే కసంజి స్వామి జాతర జాతీయసమైక్యతను, మతసామరస్యాన్ని తెలిపే బాబయ్యస్వామి ఉత్సవాలను గురించి తెలుసుకుందాం.

తీజ్ పండుగ :

బంజారాలు జరుపుకొనే తీజ్ పండుగను కర్ణాటక, మహారాష్ట్రలలో గౌరీపూజ అంటారు. ఆంధ్ర ప్రాంతంలో తీజ్‌గా వ్యవహరించే ఈ పండుగ కొన్ని తెలుగు ప్రాంతాల వాళ్ళు జరుపుకొనే మొలకలపండుగ/మొలకలపున్నమి లాంటిది. తీజ్ పండుగను సుగాలీలు దసరావ్ అంటారు. రాజస్థాన్ ప్రాంతంలో అతిముఖ్యమైన పండుగ తీజ్ కాబట్టి అక్కడనుంచి వలస వచ్చినవారికి ఈ పండుగ చేయడం సాంప్రదాయంలో భాగమైపోయింది. కాబట్టే తీజ్ బుట్టను గోధుమలతో నింపుతున్నారని భావించవచ్చు. ఈ తీజ్ పండుగ వినాయకచవితి తరువాత వస్తుంది. తీజ్ పండుగ ఉత్సవాలను స్త్రీ, పురుషులు సమానంగా పంచుకొని ఆనందిస్తారు. తీజ్ పండుగ వేడుకలు వారం లేక10 రోజులు పాటు జరుపుకుంటారు. తీజ్‌కు మారుపేరైన మొలకల బుట్టను వినాయకునిలాగా 10వరోజు నిమజ్జనం చేస్తారు.

తీజ్ పుట్టుక - ఐతిహ్యం :

తీజ్ పండుగ గురించి ఒక ఐతిహ్యం కూడా వుంది. అబ్బు, గబ్బు అనే అన్నదమ్ములకు 500కు పైగా పాడి ఆవులు ఉండేవట. అవి ఒకనాడు గోదుమచేలు మేసి ఒక బండపైన పేడ వేసాయట. ఆ పేడలోని గింజలు మొలకలెత్తి రాతిలోపలకు వేర్లు దిగినాయట. ఈ వింత చూసిన అన్నదమ్ములు తీజ్ సత్యమైనదని మరియమ్మ దేవత రూపంలో తమకు దర్శనమిచ్చిందని భావించి ఆమెకు పూజలు చేసి జంతుబలి ఇవ్వాలని అనుకున్నారట. అప్పటినుండి గోధుమ గింజలు మొలకలు వచ్చిన రోజును పర్వదినంగా పరిగణించి తీజ్ పండుగ జరుపుకుంటున్నారని ఐతిహ్యం చెబుతుంది.

మూఢనమ్మకాల ప్రతీక తీజ్ పండుగ :

తీజ్ పండుగ సందర్భం ఒక రకంగా పెళ్ళికాని పిల్లలకు వేదనలాంటిదని కూడా చెప్పవచ్చు. పెండ్లికాని అమ్మాయిలు వెదురు లేదా ఈతకర్రలతో చేసిన బుట్టను కొంత మట్టితో నింపి తాండా నాయకుని చేత ఆ మట్టిలో గోధుమలు పూడిపిస్తారు. ఆ నాయకుని పేరే పెట్టిన బుట్టను ప్రాణానికి ప్రతిరూపంగా చూసుకొంటారు. మరికొంత మంది నాయక్ భార్యచేత బుట్టలో విత్తనాలు చల్లించి ఆ బుట్టకు మరియమ్మ పేరు పెట్టి ఆ గోధుమనారును జాగ్రత్తగా పెంచుతారు. అలా పెరిగిన గోధుమనారు పసుపువర్ణంలో ఏపుగా పెరగనట్లయితే వివాహానికి పూర్వమే బుట్టపట్టుకున్న అమ్మాయి శీలం చెడిందని శంకిస్తారట. ఈ కారణం చేత అమ్మాయిలు ఆ 10రోజులు ఉప్పు, కారం, పసుపు వేసిన పదార్థాలు కాకుండా చప్పిడి అన్నం మాత్రమే తీసుకుని వ్రతం చేస్తారట. అంటే ఆ 10 రోజులు పూర్తి శాఖాహారులుగా మారిపోతారని అర్థం. ఈ నియమాలను ఉల్లంఘిస్తే గోధుమనారు పెరగదని, గోధుమ నారుకు తన శీలం బలి అవుతుందని వారి నమ్మకం. 9వ రోజు సాయంత్రం బుట్టలను పరీక్షించిన నాయక్‌నారు ఏపుగా పెరగని బుట్టగల అమ్మాయిని అనుమానంతో చూస్తారట. సదరు అమ్మాయిని శీలం కోల్పోయినదిగా భావించి దానికి విరుగుడుగా ఆ అమ్మాయిని తండా భగత్ దగ్గరకు తీసుకొని పోయి "మా అమ్మాయి చేసిన తప్పును మన్నించండి. మా తప్పుకు ప్రతిగా గొర్రెలను, మేకలను బలి యిచ్చి శాంతి నిమిత్తం అమ్మవారికి పూజలు జరిపిస్తామని" మొక్కుకుంటారట. ఆ విధంగా మొక్కుబడులు చేసుకున్నవారు మరియమ్మ పేరుతో జాతరలు చేయడం వారి ఆనవాయితీగా కూడా తెలుస్తోంది.

ఈ జాతర సమయంలో కొత్త, పాత తేడాలు లేకుండా అందరూ మత్తుపానీయాలు సేవిస్తారట. సేవించని వారికి దోషమట. ఈ సేవనంలో భాగంగా అలవాటు లేని వారు కనీసం సారాగ్లాసులో కుడిచేతి వేలు అద్ది భూమిపైన విదిలిస్తే దోషపరిహారం అవుతుందని కూడా వాళ్ళు నమ్ముతారు. ఈ వ్రత కాలంలో పెళ్ళీడుకు వచ్చిన యువతులు ముఖ్యంగా పెద్దలైన తండానాయక్‌లతో పాటలు నేర్పించుకొని పాడుకుంటారట. వచ్చే యేడాది కంతా తాము పుట్టిన వూరిలో వుంటామో, లేదో నని కూడా ఆ సమయంలో బెంగపడటం చూడవచ్చు. బహుశా ఈ దోషపరిహార ఘట్టం అనాదినుంచి వచ్చిన సాంప్ర

దాయంగా భావించుకోవచ్చు. ఎందుకంటే ఆదిమ సమాజం నుంచి నిన్న, మొన్న వరకున్న జానపద జీవితాలకు మద్యపానం తప్పుకాదు. అప్పట్లో వీళ్లు ప్రకృతి నుంచి సేకరించిన పూలు, కాయలు, దుంపలు, వేర్లు, కొన్ని రకాలైన చెట్లు మూలాల నుంచి వాళ్ళకు అవసర మైనంతమేర మాత్రమే మద్యం తయారు చేసుకొని సేవించేవారు. పైగా ఈ అలవాట్లకు వారు బానిసలు కారు. శారీరక శ్రమను మర్చిపోవడానికి అటవీసమీపంలో వున్నవారికి ఈ మధ్యపానసేవనం ఒక ఆటవిడుపు మాత్రమే. కానీ నేడు ప్రకృతినుంచి సేకరించిన వస్తువుల మద్యంతయారీ సొంతానికి కాకుండా అమ్మకాల వరకు పోయి, ఈ అమ్మకాల నిమిత్తంలో రసాయనాలు చేరడం, గిరిజనుల మద్యానికి నకిలీ మద్యాలు రావడం, పోలీసుల నిర్భందాలు, కంపెనీ తయారు చేస్తున్న సీమపానీయాల రాక, తర్వాత గిరిజనులు సొంత తయారీ మద్యానికి ఆటంకం ఏర్పడి ఆ అలవాటు గణనీయంగా తగ్గి పోయింది. కాబట్టి గిరిజన సాంప్రదాయాలను మద్యం తప్పుకాదని అభిప్రాయాన్ని పైన చెప్పిన దోషపరిహార ఘట్టం చెబుతోంది. ఏది ఏమైనా పై రెండు ఘట్టాలు మూఢనమ్మకాలను బలపరిచేవిగా ఉన్నాయి.

తీజ్ నిమజ్జనం – స్త్రీ పాత్ర :

తీజ్ పండుగను మొలకలపండుగని ఇదివరకే తెలుసు కున్నాం. 10రోజుల వరకు బాగా పెరిగిన గోధుమనారు బుట్టలను నీటిలో కలపడాన్ని తీజ్ నిమజ్జనం అంటారు. ఈ నిమజ్జనానికి ముందు జరిగే కార్యక్రమాలలో ప్రధాన పాత్ర వహించేది పెళ్ళికాని బంజారా యువతలే.

తీజ్ బుట్టలను ఉపవాస దీక్షతో నెత్తిన పెట్టుకొని మోసుకొంటూ కులదేవత ముందు పెట్టి గొర్రెనో, మేకనో, పొట్టేలునో బలి ఇస్తారు. ఆ తలను అమ్మవారికి ఆగా రంగా (ఆహార్యం/నైవేద్యం)పెట్టి పూజిస్తారు. తరువాత యువతులు తీజ్ బుట్టలను నెత్తిన పెట్టుకొని అనుభవం ఉన్న పెళ్ళైన స్త్రీలు లేక ముసలివారి పర్యవేక్షణలో నృత్యాలు చేస్తారు. ఆ నృత్యం ముగింపుదశకు వచ్చేసరికి అందరూ గ్రామపెద్ద ఇంటిముందు గుమిగూడుతారు. నాయకుని బుట్టలోని నారను కోసి తన తాండాలలోని ప్రతి దేవతకు నైవేద్యంగా సమర్పిస్తారు. ఆ నారును బంధువుల, స్నేహితులకు తలపాగాలు పెట్టి వినోదిస్తారు. తమ తాండాలకు వచ్చిన బంధువులకు పండుగ గుర్తుగా "డబ్బులు యిస్తున్నాము, తీసుకో" అంటూ గోధుమ నారును తలపాగాలకు అలంకరిస్తారు. ఈ ఘట్టాన్ని 'గరూరోహియా' అంటారు. అక్కడే ఆడపిల్లల ప్రధాన ఘట్టానికి తెరతీయబడుతుంది. తర్వాత అవివాహితులైన అమ్మాయిలందరూ పెద్దలదగ్గరికి వెళ్ళి ఆశీర్వాదాలు తీసుకొని రేపటి సంవత్సరానికి ఊళ్ళో వుంటామో లేదోనని తమకు పెళ్ళిళ్ళై వెళ్ళిపోతామనే బాధను వ్యక్తపరుస్తారు. తర్వాత ప్రతి బుట్టలోని నారును అక్కడున్నవారందరికి సమానంగా పంచుతారు. పెళ్ళికాని యువతులు తమ పెద్దవారిని పట్టుకొని ఏడ్చుకొనే ఘట్టాలని 'మలెరో' అంటారు. పెళ్ళైన తరవాత అంపకాల సమయంలో కూడా ఇలాంటి రోదన కనిపించదేమో అన్న స్థాయిలో ఈ ఏడుపు ఘట్టాలుంటాయి. చివరిగా మిగిలిన తీజ్ బుట్టలోని నారును తమకు సమీపంలో వున్న నీటి గుంటలో నిమజ్జనం చేసి తిరిగి చూడకుండా ఇండ్లకు వెళ్ళిపోతారు. ఇదే తీజ్ నిమజ్జనంలోని ఆఖరి ఘట్టం.

జాతీయ సమైక్యతకు చిహ్నం – కసంజిస్వామి జాతర :

కసంజిస్వామిని కృష్ణజీ, కసంజీ, కిసన్, కసన్, కసన్+జీ అనే పేర్లతో పిలుస్తారు. ఈ జాతరను ఫిబ్రవరి మాసంలో జరుపుతారు. ఈ జాతర గురించి ఒక ఐతిహ్యం వుంది. పూర్వం ఒక రోజు ఈ బంజారాలో ఒక తెగవారికి పాడిఆవులు ఎక్కువుండేవట. ఒకసారి కరువుకాటకాల వల్ల ఆవులకు స్థానికంగా గడ్డికరువైందట. గ్రాసంకోసం శ్రీశైలం అడవులకు (నల్లమల అడవులకు) మేతకోసం ఆవులను తోలుకెల్లారు. అక్కడ అంతుబట్టని వ్యాధితో రోజుకు పదులసంఖ్యలో ఆవుల మరణించాయట. తమ జీవనానికి దిక్కైన గోసంపద నశిస్తున్న సమయంలోనే ఒక కొలను (భీముని కొలను) దగ్గరకు ఆవులను తోలుకొని పోయినారట. అక్కడ ఒక గొల్లపిల్లవాని దగ్గర ఆవులమంద

తమ ఆవులకన్నా ఆరోగ్యంగా వున్నట్లు గమనించారట. అపుడు ఆ పిల్లవాని ఆవుల ఆరోగ్యరహస్యాన్ని చెప్పమని ఈ లంబాడీలు ప్రాధేయపడి, తమ ఆవులకు చికిత్స మార్గం చెప్పమన్నారట. అతను మూడు రకాల ఆకులను తీసుకొని వీరి మందలపై చల్లారట. అంతుచిక్కని ఆ వింత వ్యాధి మటుమాయమైందట. ఈ సంఘటన జరిగిన మూడురోజులకు ఆ గొల్లపిల్లవాడు కొలను మధ్యలో కూర్చోని తపస్సు చేస్తున్నాడట. ఈ గోకాపరు లందరూ ఆ వింతను చూసి అతను గొల్లపిల్లవాడు కాదని దేవుడిగా భావించి దర్శనభాగ్యం కల్పించమన్నాడట. అప్పుడు ఆ పిల్లవాడు శ్రీకృష్ణుని రూపంలో బయటకు వచ్చాడని, ఆవులదొడ్డిలో రెండున్నరమీటర్ల వెదురుకర్రను పాతి, దానికి ఒక పచ్చగుడ్డను జెండాగా కట్టి తన రూపంగా భావించి పూజలు చేయమన్నాడట. అంతేగాకుండా పచ్చజెండా ప్రక్కన తురక శిష్యునికి ఆనవాలుగా ఎర్ర జెండాను కూడా కట్టి పూజించుకోమని చెప్పి అదృశ్యమై య్యాడట. అప్పటినుండి పమార్ గోత్రానికి చెందిన ఝరపలవారు ప్రతి యేటా కసంజీ జాతరను ఆన వాయితిగా జాతర జరుపుకుంటున్నారని ఈ ఐతిహ్యం చెబుతుంది. ఇప్పటికి కూడా తమ పెంపుడు జంతువుల దొడ్లల్లో అందరికి కనిపించే విధంగా జెండాలు కడతారని ఆచార్య ఎం. గోనానాయక్‌గారు 'సుగాలీ సంస్కృతీ - భాషా, సాహిత్యాలు' అనే పిహెచ్.డీ గ్రంధంలో వివ రించారు.

లంబాడీల మతసామరస్యానికి ప్రతీక బాబయ్య స్వామి ఉత్సవాలు :

ఈ బాబయ్యస్వామి ఉత్సవానికి కూడా కసంజీ స్వామితో ముడిపెట్టిన ఐతిహ్యాన్ని చెబుతుంటారు. బాబయ్యస్వామి తురకు కులస్తుడు, కసంజీ స్వామికి భక్తుడు. ఒక రోజు బాబయ్య తాను భోజనాన్ని ఏర్పాటు చేస్తానని, ఆ భోజనాన్ని మారుమాట్లాడకుండా భోం చేయ్యాలని స్వామి దగ్గర మాట తీసుకున్నాడట. కసంజీస్వామి శిష్యుని షరతుకు అంగీకరించి స్నానం చేసుకొని భోజనానికి వెళ్ళేసరికి ఒక ఆవుదూడ మాంసాన్ని వండి దానిపై తెల్లవస్త్రాన్ని కసంజిస్వామిని భోజనం చేయమన్నారట. కసంజిస్వామి ఆ మాంసంపై వున్న గుడ్డను తొలగించగానే ఆ మాంసం, ఆవుదూడై నిలి చాయట. బాబయ్య ఆశ్చర్యం నుండి తేరుకొనే లోపే "నా భోజనమెక్కడ" అని అడిగాడట. గురువు మహిమకు ఆశ్చర్యపడిన భక్తుడు బాబయ్యతో ఇలాగ అన్నాడట. తనపై భక్తితో ఆవుదూడ మాంసాన్ని వండిపెట్టిన బాబయ్యస్వామికి, అప్పటి నుండి తనతోపాటుగా లంబాడీ ఆవులదొడ్లలో ఒక జెండాగా నిలబడి పూజలు అందుకుంటాడని వరమిచ్చాడట. అప్పటినుండి కసంజీజెండాతోపాటు బాబయ్యజెండా కూడా లంబాడీ ముంగిట్లో పూజలందుకొంటున్నాయని స్థానికుల కథనం.

బాబయ్యస్వామి ఉత్సవాన్ని లంబాడీలు జరుపుకునే సమయం మధ్యాహ్నపైన కాలం. హలాలు చేస్తూ బాబయ్య ముందు బలిస్తారు. బలిచ్చేముందు దాని ముఖంపై తెల్లని బట్టకప్పుతారు. మధ్యలో ఆ బట్టకు గీతగీసి నీళ్ళుపోస్తారు. బలికార్యక్రమాన్ని కసంజీస్వామి చూడకూడదనే ఉద్దేశ్యంతో ఆ జంతువుపూ బట్టకప్పా లనేది వారి ఉద్దేశ్యం. తర్వాత బలి జంతుమాంసాన్ని వండి మట్టిచిప్పలలో బాబయ్యకు నైవేద్యం పెడతారు. ఈ నైవేద్యం పేరు 'కందూరి'. ఈ నైవేద్యంపై బాబయ్య స్వామి ఆనవాళ్ళుగా ఎర్రనిబట్టని కూడా కప్పుతారు. మరుసటి రోజు తెల్లవారుజామున ఆ బట్టను తీసి అక్కడున్న మాంసపు అవశేషాలు తొలగించడంతో బాబయ్యస్వామి జాతర ముగుస్తుంది.

సోదరభావంతో జరుపుకొనే బాబయ్యస్వామి ఉత్సవం మతసామరస్యానికి సాక్ష్యం, తమను హిందూ రాజులుగా భావించేకొనే భక్తిభావంతో జరుపుకొనే కసంజీస్వామి జాతర జాతీయసమైక్యతకు చిహ్నం. తీజ్ పండుగ నిబ ద్ధతకు, నమ్మకానికి, సంస్కృతికి ఆనవాలుగా చెప్పు కోవచ్చు.

గిరిజన వైద్యం – చర్మ సంబంధిత వ్యాధుల నివారణ

– సాలి రాజు, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమండ్రి.

గచ్చాకు పుచ్చాకు వైద్యం అంటాం సాధారణంగా, అది కేవలం నానుడికాదు. అది ప్రకృతి వైద్యం. మానవ జీవన స్థితిని, పరిణామదశను గమనిస్తే ప్రాథమిక మానవునికి ప్రకృతే పాఠశాల, ప్రయోగశాల అయింది. ప్రకృతిని చూసే ప్రతీ విషయంలోనూ విజ్ఞానాన్ని పొందాడు ప్రాథమిక మానవుడు అందుకే జలుబు చేసిన, దగ్గు వచ్చినా, జ్వరం వచ్చిన, చలి వచ్చినా తాను తిరిగిన ప్రాంతంలో ఉన్న ఆకు, అలము, బెరడు, పసరు వైద్యంలో భాగాలయ్యాయి. అదే అనుభవంతో వైద్య శాస్త్రంలోకి ఎక్కి అవి ఉపశమనాన్ని ఇచ్చి రోగనివారణతో పాటు ఆయుష్షుని నిలబెట్టాయి. అందుకే గిరిజనుల వైద్యంపై పరిశోధనలు జరగాలి.

గిరిజన ప్రాంతాల్లో వారి ఆహారపు అలవాట్లుకు తగ్గట్టుగా రోగనిరోధక శక్తి ఉంటుంది. అనారోగ్య పరిస్థితుల్లో దరిదాపుల్లో ఉండే ప్రకృతి వృక్ష సంపదే ఆరోగ్య రక్షణకు ఆశ్రయం అవుతుంది. అందుకే ప్రధానంగా గిరిజనులు చర్మసంబంధ వ్యాధుల నివారణకు వారు అవలంబించే వైద్య పద్ధతులు, ఉపయోగించే ప్రకృతి సంపదను గూర్చి తెలియచేయడమే ఈ పరిశోధన పత్రం ముఖ్య ఉద్దేశం.

వ్యాధి అంటే ఏమిటి :

శరీరానికి మరియు మనస్సుకు అసౌకర్యం లేక బాధ కలిగించేదే వ్యాధి. వ్యాధి కల్గటానికి అసాత్మేంద్రియా సంయోగం అనగా జ్ఞానేంద్రియాలకు, మనస్సుకు అవి చేసే పనుల్లో సంబంధం లేకపోవటం, అతిగా సంబంధం, అస్వాభావిక సంబంధం కలగటం.

పరిణామం :

ఋతువుల యొక్క ప్రభావం ఆరోగ్యం మీద, అనారోగ్యం మీద ఉంటుంది. ప్రకృతి సమస్థితిలో లేకుంటే జరిగే పరిణామాలు మీరు చూసే ఉంటారు. అతి చల్లగా ఉండటం, అతి ఉష్ణంగా ఉండటం, అతి వర్షాలు కురుస్తుండటం అనేవి ఆయా ఋతువులలో తక్కువగా, అధికంగా, అస్వాభావికంగా ఉండటం వలన దోషాలు ప్రకోపిస్తాయి.

ప్రజ్ఞాపరాధం :

సరియైన సమయంలో సరియైన నిర్ణయం తీసుకోక పోవటం వాక్, మానసిక ప్రక్రియల్లో కలిగే హీన, అతి, మిథ్యా యోగాలను ప్రజ్ఞాపరాధం అంటారు.

సాధారణంగా కొండ ప్రాంతాలలో నివశించే గిరిజన ప్రజల శాతం ఎక్కువగా ఉన్న ప్రదేశాలలో వారికి అనేక ఋతుసంబంధమైన చర్మవ్యాధులు కల్గుతుంటాయి. వారు వాటిని వారికి అందుబాటులో ఉన్నటువంటి వన మూలికలను తగు మోతాదులో ఔషధంగా సేవించడం ద్వారా ఉపశమనం పొంతున్నారు. అటువంటి వాటిలో ముఖ్యమైన చర్మ వ్యాధులు మరియు వారు వినియోగించే వనమూలికలు ఔషదాలు గురించి వివరించే ప్రయత్నమే ఈ వ్యాసం ముఖ్యోద్దేశ్యం. సాధారణంగా చర్మ వ్యాధులలో అందరికి కన్పించేవి దద్దుర్లు, సోరియాసిస్, శోభి, చెమటకాయలు, గజ్జి, తామర, సెగ్గడ్డలు, చుండ్రు, కాళ్ళ పగుళ్ళు వంటి వాటిని గూర్చి ముఖ్యంగా చెప్పుకోవచ్చు. వీటిని గురించిన లక్షణాలు, వ్యాధి నిర్ధారణ, వ్యాధి నివారణకు వినియోగించే వనమూలికలను గురించి తెలుసుకుందాం.

దద్దుర్లు :

శరీరానికి సరిపడని ఆహార పదార్థాలను సేవించినప్పుడు లేదా శరీరానికి సరిపడని పదార్థాలు వలన కలిగే వ్యాధియే దద్దుర్లు లేదా శీతపిత్తము (Urticaria) అంటాం. ఎలర్జీ అనేక కారణాల వలన వస్తుంది. 1) పీల్చేగాలి,

2) తినే ఆహార పదార్థాలు, 3) కొన్ని రకాల మందుల వలన, 4) కొన్ని రకాల ఇంజెక్షన్ల వలన, 5) క్రిమికీటకాల వలన, 6) పెంపుడు జంతువుల వలన, 7) పూల పుప్పొడి వలన, 8) సెంట్స్ వలన, 9) దుమ్ము / ధూళి వలన, 10) చర్మానికి సరిపడని కాస్మోటిక్స్ వలన, 11) గిల్ట్‌నగల వలన, 12) తలకు వేసుకునే డై ల వలన ఎలర్జీ వస్తుంది.

దద్దుర్లు వ్యాధి లక్షణాలు :

1) దద్దుర్లు శరీరం అంతటా లేదా ఏదో ఒక ప్రాంతంలోనే రావచ్చు.
2) ఇవి గులాబి రంగులో ఉంటాయి.
3) దద్దుర్లు ఉన్న ప్రాంతం ఎర్రగా ఉబ్బుగా కన్పిస్తుంది.
4) దురద, చికాకు ఎక్కువగా ఉంటుంది.
5) సూదులతో గ్రుచ్చినట్లు బాధ ఉంటుంది.

ఔషధ చికిత్సలు :

1. తులసీ పత్రములు వేప ఆకుల పత్రాలు చందనం మరియు పసుపు కలిపి మెత్తగా నూరి శరీరం మొత్తం రాసిన దద్దుర్లు తగ్గుతాయి.
2. వేప ఆకులు మరియు ఆమలకీ (ఉసిరి) చూర్ణ ములను 3 గ్రాములు కలిపి నెయ్యి (ఘృతము)తో కలిపి రోజుకు 2 సార్లు సేవించాలి.
3. తిప్పతీగ మరియు వటాల (చేదు పొట్ల) పత్రముల రసం 20 మి.లీ రోజుకు 2 సార్లు తాగాలి.
4. తిప్పతీగ, పసుపు (హరిద్రా) పల్లేరు (గోక్షుర), అతిమధురం (యిష్టిమధు) మరియు వేప త్వక్‌లను సమంగా కలిపి 10 గ్రాములు తీసుకొని 1 గ్లాస్ (250. మీ.లీ.) నీళ్ళలో వేసి బాగా మరి గించి 30 మీ.లీ. ఉదయం, సాయంత్రం రోజుకు 2 పూటలు సేవించాలి.

సోరియాసిస్ :

సోరియాసిస్ దీనినే చేప పలుసులు వ్యాధి అంటారు. మొండి వ్యాధుల్లో సోరియాసిస్ ఒక్కటి. చర్మంలో కణ విభజన అధికంగా జరగటం వలన ఇది ఎండిపోయి పొలుసుల్లాగా విడిపోతాయి. చర్మానికి రంగునిచ్చే మెలినిన్ అస్తవ్యస్తము ఏర్పడి తెలుపుదనము ఎక్కువ అవుతుంది. ఇలా ఏర్పడిన పొలుసులే (తెలుపు కణాలే) వెండి పొలుసులుగా ఏర్పడతాయి. మానసిక ప్రశాంతత లేని వారిలో ఇది ఎక్కువ వస్తుంది. దుస్తులు బిగువుగా కట్టుకోవడం దెబ్బలు తగలటం, అధిక మధ్యపానము త్రాగే వారిలో ఈ వ్యాధి ఎక్కువగా కనిపిస్తుంది. ఇది వాతకఫ ప్రధాన వ్యాధి.

సోరియాసిస్ వ్యాధి లక్షణాలు :

1) మొదటి చిన్న చిన్న మచ్చలతో మొదలై అవి పెద్ద సైజులోకి మారి తల, వీపు, ఛాతి, పొట్ట, మోకాళ్ల వెనుక, పాదాలమీద అరచేతుల్లో కూడా మచ్చలు ఏర్పడతాయి.
2) పొలుసులు బలవంతంగా తీసివేస్తే అవి ఎక్కువ అవుతాయి.
3) కొందరిలో దురద ఉండి రసి కారుతూ ఉంటుంది. అవి ఎండిపోయి చర్మము దళసరిగా తయారవుతుంది. ఈ దశలో గోకితే తెల్లని వెండి పొలుసులు రాలిపడతాయి. వీటిని గోకితే ఇన్ఫెక్షన్ కలుగుతుంది.

చికిత్సా విధానం :

1) కానుగ గింజల నూనె మరియు నింబతైలం లేదా మరి చాది తైలములను కలిపి పై పూతగా రోజుకు 2 సార్లు రాయాలి. లేదా పారిశ ఫల రసం రాసిన ఉపయుక్తంగా ఉండును.
2) వేప ఘన సత్వాన్ని 500 మీ.లీ. రోజుకు 3 సార్లు సేవించిన ఉపయుక్తంగా ఉన్నట్లు పరిశోధనలో గమనించారు.
3) **శోభి (Tinea Versicolor) :** అతి సాధారణమైన చర్మవ్యాధి శోభి. ఇది కూడా ఫంగస్ వల్లనే సంక్రమిస్తుంది. మన చర్మంపై ఏర్పడే ఒక రకమైన బూజులాంటి పదార్థమే శోభి. ఈ వ్యాధికి కారణ

మయ్యే ఫంగైని Dermato phytes అంటారు. ఇది స్త్రీలలో కంటే పురుషులలో ఎక్కువ.

వ్యాధి లక్షణాలు :

శోభి మచ్చలు శరీరం మీద ఎక్కడైన రావచ్చు. మచ్చలు క్రమ పద్ధతిలో లేకుండా ఒక సైజు లేకుండా ఉంటాయి. మచ్చలు తెల్లగా కాని లేక గోధుమ రంగులో ఉంటాయి. చెమటగా ఉన్నప్పుడు చికాకు, దురద, మండలు కలిగిస్తాయి.

ఔషధ చికిత్స :

1) ప్రత్తిగింజల తైలం, కసింద వేరు, రేల ఆకులను కలిపి మెత్తగా నూరి రాసిన మచ్చలు తొలగును.
2) ముల్లంగి గింజలను మెత్తగా నూరి ప్రత్తి ఆకు రసముతో కలిపి అందులో మజ్జిగ చేర్చి శరీరానికి రాసిన మచ్చలు తొలుగుతాయి. నిమ్మరసం నందు కొబ్బరి నూనె కలిపి రాసిన మచ్చలు తగ్గు ముఖం పడతాయి.
3) చందన చూర్ణం నందు గంధకం మరియు హారతి కర్పూరం కలిపి రాసిన మచ్చలు తొలగుతాయి.
4) పత్తి గింజల తైలము/సోమరాజి తైలము శోభి మచ్చలపై రాసిన ఉపయుక్తంగా ఉండును.
5) మిరియాలు మెత్తగా నూరి తులసి రసము నందు కలిపి రాసిన శోభి తగ్గును. ఉసిరి గగ్గలు (గుగ్గిలము) యవక్షారములను కలిపి మెత్తగా నూరి మజ్జిగతో కలిపి రాసిన మచ్చలు తగ్గును.

చెమట కాయలు, ఊష్మజపిటికా :

వేసవి నందు అధికంగా వేడి వలన మరియు సిల్క్, జీన్స్, టెరికాట్, మరియు బిగుతైన దుస్తులు వాడటం వలన గాలి అధిక బాగా చెమట పట్టి దానికి తోడు శరీరంపై ఉన్న మలినాలు కూడా కలసి చిన్న చిన్న తెల్లటి నీటి పొక్కులు గుంపులు, గుంపులుగా ఏర్పడి దురద, చికాకు కలగచేసే వ్యాధియే ఊష్మజపిటికా.

చికిత్సా విధానం :

1) చందనాన్ని గంధం తీసి ఒళ్ళంతా రాసిన చల్లగా ఉంటుంది.
2) చందనం, వట్టివేళ్ళు, పచ్చకర్పూరములను శరీరానికి రాసి చల్లని గాలిని అనుభవించాలి.
3) శిరీషా, లోధ్రా, వట్టి వేర్లు మొదలైన ఔషధాలను మెత్తగా నూరి పన్నీరులో కలిపి శరీరానికి లేపనంగా వాడాలి.

గజ్జి - పామా :

చర్మ వ్యాధుల్లో జగమొండి దురద పెట్టి బాధపెట్టె వ్యాధి గజ్జి. గజ్జిని కలిగించే క్రిమిని అకారన్ స్కేబియ అందురు. దీనిని "Itchmite" అని అంటారు. ఈ క్రిమి మానవుని యొక్క బాహ్య చర్మాన్ని ఆశ్రయించి ఉంటుంది. దీని ఫలితంగా విపరీతమైన దురద పెడుతుంది.

వ్యాధి లక్షణాలు :

1) గజ్జి పొక్కులు ముఖ్యంగా వ్రేళ్ళ సంధుల్లో, మోచేతులు, మోకాళ్ళలో పిఱుదులు, తొండలు, చంకలు, రొమ్ములపైన, పురుషాంగం మరియు వృషణాల మీద కూడా వచ్చును.
2) కొందరికి ముఖం మీద కూడా గజ్జి వస్తాయి.
3) విపరీతమైన దురద ఉంటుంది.

వ్యాధి చికిత్స విధానం :

1) వేప చెక్క, కరక్కాయ, ఉసరిక కలిపి మెత్తగా నూరి 3 గ్రాములు రోజుకు 2 సార్లు సేవించాలి.
2) వేప ఆకులు మెత్తగా నూరి ముద్దగా చేసుకుని 3-4 గ్రాములు ఉదయం, సాయంత్రం సేవించాలి.
3) గన్నేరు (కరవీర) మూలత్వక (Root bank) తో చిక్కగా కషాయము కాచి అందులో సర్షపతైలము (ఆవనూనె) కలిపి గజ్జి కురుపులపై రాయాలి.
4) అర్క (జిల్లేడు) ఆకులరసము, పసుపు (హరిద్రా) లను కలిపి ముద్దగా చేసి అందు సర్ష తైలము (ఆవనూనె) కలిపి తైల పాకము విధిగా కాచి దానిని పై పూతగా రాసిన గజ్జి తగ్గుతుంది.
5) చక్రమర్ధ మూలకం (ముల్లం) గింజలు ఆవాలు, పసుపు, శిగ్రు సరల జిగురు, త్రికటు (పిప్పళీ,

శుంఠి, మిరియాలు) చూర్ణము, మరియు విడంగం కలిపి గోమూత్రంతో నూరి ఆ లేప నమును రాసిన గజ్జి యందు ఉపయుక్తంగా ఉండును.

తామర :

జీవితంలో ఏదో ఒక సమయంలో తామరకు గురికాని వ్యక్తి ఉండకపోవచ్చు. ఇది ఒక రకమైన ఫంగస్ వ్యాధి. వాడుక భాషలో దీనిని తామర అంటారు. తామర శరీరంలో ఏ భాగానికైనా రావచ్చు. అలాగే కొందరికి నోట్లో, ప్రేగుల్లో ఊపిరితిత్తుల్లో కూడా వస్తుంది. శరీరం లోపల భాగాన వచ్చు తామరను (Systamatic mycosis) అంటారు. శరీరంలో ఏదో ఒక తామరకు గురి అయిన భాగాన్ని టీనియా అంటారు. తామర తడి లేదా చెమ్మగా ఉండే ప్రదేశాన్ని ఆశ్రయించి వ్యాధి లక్షణాలను కలుగ చేస్తుంది.

వ్యాధి లక్షణాలు :

1) శరీరము మీద వచ్చే తామర రింగులు రింగు లుగా వుంటుంది. గుండ్రని మచ్చలు వచ్చి వీటి యొక్క అంచులు ఉబ్బి ఉంటాయి.
2) విపరీత దురద ఉంటుంది.
3) గోళ్ళకు తామర సోకితే గోళ్ళువంగిపోతాయి. తర్వాత పుచ్చిపోతాయి.
4) తామరను నిర్లక్ష్యం చేయకూడదు. నిర్లక్ష్యం వలన మచ్చలున్న ప్రాంతం ఎండిపోయి గట్టిగా మారి నల్లటి మచ్చలు ఏర్పడతాయి.

వ్యాధి చికిత్సలు :

1) విపరీతమైన చెమట చేరి తడిగా ఉండి తామర వ్యాధికి దారి తీస్తుంది. చెమట బాగా పట్టే ప్రదేశాలలో కొన్ని రకాల యాంటిఫంగల్ పౌడర్స్ వాడాలి.
2) స్నానం చేసిన తర్వాత శరీరాన్ని తడి లేకుండా బాగా తుడవాలి. ముఖ్యంగా చంకలు, గెజ్జలు, మర్మావయవాల దగ్గర బాగాలను తడి లేకుండా చక్కగా తుడుచుకోవాలి. స్నానం తర్వాత ఒళ్ళును, ఆరపెట్టుకుంటే మంచిది.

పై పూతలు :

1) ఆరగ్వద (రేల) ఆకులను మెత్తగా నూరి అందులో నిమ్మరసం మరియు తిల తైలం (నువ్వుల నూనె) కలిపి రింగ్ వర్మ్ వచ్చిన చోట రాయాలి. లేదా రేలాకులను గంజితో నూరి రాసిన ఉపయుక్తంగా ఉండును.
2) ములగాకు (శిగ్రు) ను మెత్తగా నూరి ఆ రస మును రాసిన ఉపయుక్తంగా ఉండును. లేదా ముల్లంగిని మెత్తగా నూరి రసం తీసి చక్రమర్ధ బీజ చూర్ణం కలిపి రాసిన ఉపయుక్తంగా ఉం టుంది.
3) వేప (నింబ) హరిద్రా (పసుపు) ఖదరా (చెండ్ర) హింసలను మెత్తగా నూరి రాసిన ఉపయుక్తంగా ఉండును. ణవతీఎశీఝుజూ రాఱత్వఎవత్ ను రాసిన ఉపయుక్తంగా ఉండును. సోమరాజు తైలము/దద్రుఘ్ని మాలా హరములను తలకు సోరాజీ తైలము/దదుఘ్న మలాహారములను రాయవచ్చు.

సెగ గడ్డలు : (ఫరంకుల్స్) బోయిల్స్ :

చీము పొక్కులు, సెగ గడ్డలు అతి సాధారణంగా కనిపించే వ్యాధి దీనిని కూడా అంటువ్యాధి క్రిందనే పరిగణించాలి. ఇది బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ వలన కలుగు తుంది.

మధు మేహరోగుల్లో ఇది ఎక్కువగా కలుగుతుంది. రక్తంతో పిత్తంతో కలిసి వాతంతో కలిసి వచ్చే వ్యాధినే విస్ఫోటమంటారు. ఇది శరీరం మీద ఎక్కడైనా రావచ్చు.

వ్యాధి లక్షణాలు :

1) వేడి నీళ్లతో కాపటం పెట్టటం వలన సెగగడ్డలు తగ్గుతాయి.
2) అపరిశుభ్రమైన సూదులతో / నీడిల్స్‌లో చీము లాగటం చేయకూడదు.

వ్యాధి ఔషధ చికిత్స :

1) గంధక రసాయనం 250 మి.లీ. రోజుకు 2 సార్లు పాలతో ఇవ్వాలి.
2) రస సిందూరం 125 - 200 మి.లీ. రోజుకు 2 సార్లు ఇవ్వాలి.
3) రేగు (బదర) ఆకులను మెత్తగా నూరి రాసిన ఉపయుక్తంగా వుంటుంది. లేదా కుటక బీజములను బియ్యపు కడుగు నీటిలో నూరి రాసిన ఉపయుక్తంగా ఉండును.

కాళ్ళ పగుళ్ళు - పాద దారి :

ఇతి అతి సాధారణ వ్యాధి స్త్రీలలో ఎక్కువగా కనిపించేది వ్యాధి ఎలాంటి పాదరక్షలు లేకుండా తిరగటం వలన కాళ్ళు ఒత్తిడికి లోనై చాలా కఠినంగా మారటం లేదా పగుళ్ళు. ఏర్పడతాయి. కొన్ని సార్లు కాళ్ళతో పాటు చేతులు కూడా ఈ విధంగా మార్పు చెందుతాయి. దీనినే పాదచారి అంటారు. ఇది వాప్రకోపం వలన కలిగే వ్యాధి.

వ్యాధి లక్షణాలు :

1) చర్మం దళసరిగా మారటం కొన్నిసార్లు చర్మము పగిలి చాలా మొరటుగా / గరుకుగా మారటం.
2) కాళ్ళలో పగుళ్ళు.
3) దురద, మంట మరియు చర్మం కందిపోయి కనిపించటం మొదలగునవి వ్యాధి లక్షణాలు.

వ్యాధి చికిత్స :

1) గంధక రసాయనం 500 మి.లీ. రోజుకు 3 సార్లు.

లేపనములు :

1) కాళ్ళను వేప మరియు పసుపు కలిపి తయారు చేసిన కషాయంతో కడగాలి.
2) సింధూరాది లేపం లేదా ణవతీఎశే ణుజూ మొదలైన వాటిల్లో ఏదైనా ఒకటి పగుళ్ళున్న చోట రాయాలి.
3) జెముడుపాలు (స్నుహీక్షీరం) నందు నువ్వుల నూనె (తిలతైలము) కలిపి దానియందు సైంధవ లవణం కలిపి పైకి రాసిన అతి భయంకరమైన కాళ్ల పగుళ్ళు తగ్గుతాయి.

చుండ్రు - దారుణకం : Dandruf :

శరీరంలో ఉండే సెబేషియస్ గ్లాండ్స్ ఒకరకమైన జిడ్డు పదార్థాన్ని తయారు చేస్తాయి. దీనినే సిబయ్ అంటారు. అధికంగా విడుదలయ్యే సీబమ్ వెంట్రుకల కుదుల్లో చేరి ఎండిపోయి తెల్లని పొట్టులాగా పొలుసుల్లా ఏర్పడును. దురద, రూక్షత, చికాకు కలిగించి ఉండే వ్యాధే చుండ్రు. ఇవి కఫ వాత ప్రకోపం వలన కలుగుతుంది.

ఔషద చికిత్స :

1) వేప (నింబ) మరియు గోరింటా ఆకులను మెత్తగా నూరి తలకు పట్టించి 2 గంటల తర్వాత స్నానం చేస్తే భయంకరమైన చుండ్రు తగ్గును.
2) బృంగరాజ (గుంటగలగరా) ది తైలము తలకు రాసిన జుట్టు ఏపుగా పెరుగుతంది. చుండ్రు తగ్గుతుంది.
3) కొబ్బరి (నారికేళం) నూనె యందు నిమ్మరసం కలిపి దానిని వెంట్రుకల కుదుళ్ళకు బాగా పట్టించి 1 గంట తర్వాత షీకకాయలో కలిపి స్నానం చేసిన చుండ్రు తొలగుతుంది.
4) నారింజ తొక్కలను ఎండించి అందులో ఉసిరికాయ, కుంకుడుకాయ, షీకాయ మొదలగువానిని సమంగా కలిపి వేడి నీళ్ళలో మరిగించి చల్లారిన తర్వాత దానిని వడకట్టి దీనితో తలస్నానం చేస్తే చుండ్రు తగ్గుతుంది.
5) పుల్లటి మజ్జిగను తలకు పట్టించి 1 గంట తర్వాత షీకాయను వేసి నీళ్లలో వేసి బాగా ఉడికించి అందులో ఉసిరికాయ కుంకుడు కాయ మరియు నారింజ తొక్కలను కలిపి చక్కగా ఉడికించి వస్త్రగాలితం చేసి తలస్నానం చేసిన చుండ్రు తగ్గుతుంది.

6) మామిడి (ఆమ్రఫలం) జీడి, కరక్కాయ (హరీతకీ) చూర్ణమును సమంగా కలిపి మెత్తగా నూరి పాలతో కలిపి తలకు రాస్తే చుండ్రు తగ్గుతుంది.

ఈ విధంగా ఆరోగ్య పరిరక్షణలో భాగంగా చర్మ సంబంధ వ్యాధులకు గిరిజనులు ఉపయోగించే ఆకులు పసరులు, బెరడులు ఎంత నివారణనిస్తున్నాయో తెలుస్తుంది. గిరిజన వైద్యం పైన విస్తృతంగా పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉంది.

ఆధార గ్రంథాలు :

1) కొప్పుల హేమాద్రి - ట్రైబెల్ మెడిసెన్.
2) లొల్లా రామ్‌జి - నాటు వైద్యం.
3) రొయ్యల కోటేశ్వరరావు 70 సం॥ తో ముఖాముఖి.



గోండుల ఆచార సంప్రదాయాలు

– సిహెచ్. నాగమణిలక్ష్మి, అధ్యాపకురాలు, తెలుగు విభాగం, సి.ఆర్.రెడ్డి కళాశాల, ఏలూరు.

భారతదేశంలో గిరిజన ప్రాంతాల్లో నివసించే తెగల్లో గోండులకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. వీరికి ఒక చరిత్ర సంస్కృతి ఉంది. భారతదేశ గిరిజన తెగల్లో అధిక జనాభా కలిగిన వారు గోండులు. వీరు ఆహార ఉత్పాదక ఆర్థిక వ్యవస్థకు మంచి ఉదాహరణగా నిలుస్తారు. ఒకప్పుడు ప్రత్యేక రాజ్యాలుగా విస్తరిల్లిన గోండ్వానాలే గోండులు. వీరికి రాజ్యపాలన చరిత్ర ఉంది. జిల్లాలో కూడా రాజ్ గోండులు ఉన్నతంగా కనిపిస్తారు. వీరికి ప్రత్యేక గోత్రాలు, పూజా పద్ధతులు. సాంఘిక మత వ్యవస్థ, బంధుత్వ నియమాలు, నృత్య సంప్రదాయలు చాలా భిన్నంగా కనిపిస్తాయి. షెడ్యూల్డ్ తెగలుగా పరిగణింపబడుతున్న గోండుల ఆచార సంప్రదాయాలు, సంస్కృతి సంపదను వివరించే ప్రయత్నమే ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

చారిత్రక నేపధ్యం :

గోండులు భారతదేశంలో అధిక జనాభా గల గిరిజనులుగా పిలువబడుతున్నారు. వీరు మధ్య భారతదేశంలో ఎతైన ప్రదేశాల్లో ఉండే గిరిజనులుగా చెప్పబడుతున్నారు. ప్రముఖ మానవ శాస్త్రజ్ఞుడైన బి.హెచ్. మెహతా రాసిన "మధ్య భారతదేశంలో ఎతైన ప్రదేశాల్లో గొండులు" అనే గ్రంథంలో వీరిని 6 విభాగాలుగా విభజించాడు. చత్తీస్ ఘడ్, ఒరిస్సా, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ వంటి అటవీ కొండ ప్రాంతాల్లో ఉండే గోండుల సాంఘిక, ఆర్థిక రాజకీయ పరిశీలనతో గోండుల కోసం మంచి సమాచారాన్ని ఇచ్చాడు.

భారతదేశంలో మహమ్మదీయులు రాకముందే గోండులు ఇక్కడ రాజ్యపాలన చేసినట్టు చారిత్రక సాక్ష్యాలు ఉన్నాయి. దానికి ఉదాహరణగా మధ్య ప్రదేశ్‌లో గోండ్వానాగా పిలువబడుతున్న రాజ్యాలు కనిపిస్తాయి. ఆదిలాబాద్‌లో ఉన్న ఉట్నూర్‌లో ఉంటున్న రాజ్‌గోండులును పరిశీలిస్తే గోండు రాజ్యాల ఉనికి కనపడుతుంది. అక్కడ రాజ్‌గోండుల సంఖ్య ఎక్కువగానే కనిపిస్తుంది. వీరు తమ పితరులకు ఉత్తమ సేవలు చేసి గోండ రాజ్యంలో ఒక మంచిపేరు సంపాదించుకున్నారు. ఆ తరువాత జరిగిన మహమ్మదీయులు, మరాటా రాజుల దాడిలో గోండు రాజ్యాలు పతనమై పోయాయి. ఆ తరువాత చరిత్ర గమనిస్తే ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న రాజ్ గోండులు నాయక్ పాట్ లను కూడా గోండులుగానే పరిగణించడం కనిపిస్తుంది. ప్రస్తుతం ఇప్పుడు వీరంతా షెడ్యూల్డ్ తెగలుగా పరిగణింపబడుతున్నారు. వీరిలో అనేక ఉప తెగలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న గోండులు ఒకప్పుడు మధ్య భారత దేశానికి చెందిన వారే అనేది చారిత్రిక సత్యం.

గోండుల భాష :

ద్రావిడ భాషా కుటుంబంలో గోండి భాష ఒకటి. ప్రముఖ భాషా శాస్త్ర వేత్త గ్రిగర్సన్ అభిప్రాయం ప్రకారం గోండి ద్రావిడభాషా కుటుంబానికి చెందిందిగా గుర్తించాడు. ద్రావిడ భాషలు 5వ భాషగా దాన్ని పేర్కొన్నాడు. ఇది తెలుగు భాష కంటే తమిళ, కన్నడ భాషకు చాలా సన్నిహితంగా ఉంటుంది.

ఆచార సంప్రదాయాలు :

గోండులలో అనేక గోత్రాలు కనిపిస్తాయి. వాటిలో ముఖ్యమైనవి నాలుగు. వీరి వంశాలను బట్టి వాటి గోత్రాలు ఉంటాయి. పూర్వీకులను అనుసరిస్తూ వారిని వారి సాహసాలను, విశ్వాసాలను స్మరించుకుంటూ కథలు కథలుగా చెప్పుకుంటూ వారిని పూజిస్తుంటారు. గోత్ర సమూహాలను వీరు "సాగ" అంటారు. ఈ పదం బ్రాహ్మణ

క్షత్రియుల నుండే అనుసరించి నట్లు తెలుస్తుంది. సంస్కృత పదమైన శాఖ నుంచే "సాగ" వచ్చినట్టు తెలుస్తుంది. వీరిలో ఒక్కొక్క శాఖ వారికి ఒక్కో రంగు జెండా ఉంటుంది. ఉట్నూరు ప్రాంతంలో ఉన్న గోండు లకు ఎర్ర జెండా ఉంటుంది. గొండి భాషలో దాన్ని "రగల్ జెండా" అంటారు. వీరిది పితృస్వామ్య వ్యవస్థ. ఇంటి బయట తండ్రిదే పెత్తనం, పై చేయి. తండ్రి ఇంటిపేరే పిల్లలకు సంక్రమిస్తుంది. గోండుల శాఖల్లో ప్రత్యేకత కనిపిస్తుంది. ఒక్కొశాఖకు లేక గోత్రానికి రంగుల జెండాలున్నట్లే దైవసోదర సమూహాలుగా పిలువబడుతున్న చందీకార్, కుమ్మకార్, సీతాగోండీ కార్, సిరిపూర్‌కార్ అనే గోత్రం లేక ఆత్రం చెందిన వారు తాబేలు, మొసలి, కోతి జంతువులను దైవంగా భావించి పూజిస్తారు. ఈ జంతువులు వారికి రక్షగా ఉంటాయని నమ్ముతారు. ఈ జంతువులకు ఎట్టి పరిస్థితిల్లోను హాని తలపెట్టరు. అలాగే ఈ నాలుగు గోత్రాలు వారు ఒకసారి నది దాటుతుండగా షిపూర్‌తీగ వారికి సాయపడిందట. అప్పటి నుండి వారికి సాయపడిన షిపూర్ తీగను కూడా ఆరాధ్య దైవంగా భావిస్తారు. ఆ తీగకుకు ఎవరు హాని తలపెట్టినా నరికినా వారిని శిక్షిస్తారు. అలాగే అరుదైన సోదర సమూహాలైన బొమ్మికార్ వెకోడోకార్, కాజుల్‌కార్, పంగినికార్ అనే ఈ నాలుగు గోత్రాలు వారికి పులి, నాగుపాములను ఆరాధ్య దైవంగా భావిస్తారు. ఈ గోండీ తెగల సమూహాలు ప్రతీ శాఖకు ఒక ప్రత్యేకత కలిగి ఉంటారు. పూర్వీకులను ఆరాధించడంలోను, స్మరించుకోవడంలోను, నమ్మకం కలిగి ఉండటంలోను ఒక రకమైన భక్తి భావనను కలిగి ఉంటారు. వీరికి ఆరాధ్య దైవమైన జంతువులను వీరు "తాడో" అని పిలుస్తారు. తాడో అంటే తాత అని అర్థం. పూర్వీకులను తలచనిదే ఏ పని చేయ్యరు గోండులు.

గోత్రాల్లో భందుత్వాల్లో అరుదైన సంప్రదాయం :

గోండులు వారి పేర్లకు ముందు గోత్రాల పేర్లను చేర్చుకుంటారు. ఈ గోత్రాల వల్లె వివాహాలు, బంధు త్వాలు కుదుర్చుకుంటారు. ఇద్దరు గోండులు కలిసి నపుడు వారినోట వచ్చే మొట్టమొదటి మాట "మీ గోత్రం ఏమిటి" అని. అప్పుడు సగోత్రం అయితే అక్కడి నుండి సంబంధ బంధవ్యాలు చిగురించడం మొదలవుతాయి. దాన్నే గోండీభాషలో 'బేటాల్ పాడి" అంటారు. అలా పిలిచినపుడు సన్నిహిత బంధువులమని నమ్మి ఆతిథ్యాన్ని స్తారు. స్త్రీలు పెళ్లి అయిన తరువాత వారి గోత్రాన్ని విడిచిపెట్టి భర్త గోత్రనామంతో కుటుంబంలో కలుస్తుంది. వివాహం అయిన మరుక్షణమే తండ్రి గోత్రం పూర్తిగా తెగిపోతుంది. ఒకవేళ భర్త చనిపోయిన తరువాత ఆమె మళ్లీ వివాహం చేసుకోవాలనుకుంటే ముందు ఉన్న భర్త తాలుకూ గోత్రం గల వారినే పెళ్లి చేసుకోవల్సి ఉంటుంది. ఇది ఖచ్చితమైన నిబంధన. ఇతర గోత్రాలవారిని చేసు కోవడం నిషిద్ధం. అలా జరిగితే గ్రామ బహిష్కరణే ఉం టుంది. గోండులకు ప్రతీ గోత్రానికి ప్రత్యేక దేవుడుం టాడు. ఆయాశ్రానికి చెందిన వారు ఆగోత్రానికి చెందిన వారు ఆ దేవుణ్ణే పూజించాలి. అక్కడ వంశానికి చెందిన గోత్రానికి చెందిన దేవుణ్ణి పూజించేటప్పుడు అందరూ కలిసి సమూహికంగా వెళ్లవలసిందే.

కుటుంబ వివాహ సంప్రదాయాలు :

గోండులు సాధారణంగా ఏకపత్నీవ్రత ధర్మాన్ని పాటి స్తారు. కాని ధనవంతులు మాత్రం ఎంతమందినైనా చేసు కోవచ్చు. ఎంతమందిని చేసుకున్నా మొదటి భార్యకే అధి కారం ఉంటుంది. స్త్రీలు కష్టపడి పనిచేస్తారు. వారు వ్యవ సాయంలో భర్తకు సహకరిస్తారు. భూమి దున్నడంలో మాత్రం స్త్రీలు పాల్గొనరు. అది అవమానంగాను నిషిద్ధంగా భావిస్తారు. పెళ్లికి ముందు స్త్రీ సాగత్యం నిషిద్ధంగా భావి స్తారు. ఒకే శాఖకు, గోత్రానికి చెందిన వారితో వివాహం నిషిద్ధం. మేనరికపు వివాహాలు ఎక్కువగా ప్రోత్సహిస్తారు. ఆడపిల్లలు రజస్వల కాకముందే వివాహం చేసుకోవాలి. ఇప్పటికీ బాల్య వివాహాలు గోండులలో కొనసాగు తున్నాయి. గోండులు వివాహాలను గమనిస్తే కొన్ని కొత్త సంప్రదాయాలు గుర్తుకు వస్తాయి. వీరు గోండి భాషలో పెళ్లిని "మార్మింగ్" అంటారు. వయసురాగానే యుక్త

వయసులోనే వివాహంచేసుకుంటారు. పెళ్లి కానివారిని పరిపూర్ణ వ్యక్తిగా భావించరు. చిన్న చూపుతో చూస్తారు. గ్రామ దేవతలకు బలులు ఇచ్చేటప్పుడు, పూజాకార్య క్రమాలు నిర్వహించేటప్పుడు వివాహితులకు మాత్రమే అర్హత ఉంటుంది.

గోండుల వివాహ పద్ధతులు :

గోండుల వివాహ పద్ధతులు 5 రకాలుగా విభజించ వచ్చు.

1) ఖాజాకోస్రా మార్కింగ్ : దీనినే సంప్రదింపుల వివాహం అంటారు.
2) లమ్‌సాడే మార్కింగ్ : దీనినే సేవావివాహ పద్ధతి అంటారు.
3) పిసివత్వాల్ మార్కింగ్ : దీనినే పరిగ్రహణ వివాహం అంటారు.
4) సివాశిరిగ్వాల్ మార్కింగ్ : దీనినే పురుషుడి ఇంట్లో అమ్మాయి నివశిస్తూ అతన్ని పెళ్లి చేసు కునే పద్ధతి.
5) పినోడితాల్ మార్కింగ్ : దీనినే వినిమయ వివాహ పద్ధతి అంటారు.

గోండులు ఇంకా నాగరీకరణ చెందలేదు. కొండ ప్రాంతాల్లో నివాసం ఉండటం వల్ల నిరక్షరాస్యత ఇంకా అలాగే ఉంది. వీరికి 'ఓలి" తీసుకునే ఆచారం ఉంది. పెళ్లికొడుకు పేదరికంలో ఉంటే కొంతకాలం అతడు పెళ్లికూతురి ఇంట్లో పనిచేయవలసిందే. ఒప్పందం తీరిన తరువాత అమ్మాయిని తీసుకుని వెళ్తాడు. డబ్బులేని పేదలు పెళ్లికూతుర్ని బలవంతంగా ఎత్తుకుపోయి వివాహం చేసుకునే సంప్రదాయం గోండులలో ఉంది. గోండుల ఆచారాల్లో "కల్మార్‌మడ్" ఒకటి దీనినే కాళ్లు కడగడం అంటారు. బలవంతంగా అమ్మాయిని ఎత్తు కొచ్చిన తరువాత అబ్బాయి తల్లి ఆ అమ్మాయి కాళ్లు కడుగుతుంది. అలా కడిగితే పెళ్లి అయినట్లే భావిస్తారు. ఆ తరువాత ఆ అమ్మాయికి పెళ్లి తంతు మొదలవు తుంది. అక్కడితో ఆ ఇంటికి కోడలవుతుంది. అమ్మాయికి అబ్బాయి నచ్చితే, అబ్బాయికి ఆమె నచ్చకపోతే ఆ అమ్మాయి అబ్బాయి ఇంటిలో దగ్గర తిష్టవేస్తుంది. ఎంత చెప్పినా ఇంట్లో నుంచి బయటకు వెళ్లదు. అప్పుడు తల్లి తండ్రులు పెద్దల సమక్షంలో తప్పకుండా ఇద్దరికి పెళ్లి చేస్తారు. ఇది ఒక వింత ఆచారంలా కనిపించినా గోండుల వివాహ వ్యవస్థలో ఒక భాగమే.

విడాకులు - వితంతు వివాహాలు :

భర్త చనిపోయినా, భార్య చనిపోయినా గొండీలలో ఆమెకు ఆదరణ చూసే విధంగా కొన్ని సంప్రదాయాలు ఆచారంగా వస్తున్నాయి. వాటిలో కొన్ని విచిత్రంగా కనిపిం చినా అది గొండీల ఆచార సంప్రదాయాల్లో భాగంగా గోండీ సంస్కృతికి చిహ్నాలుగా కనిపిస్తున్నాయి. వాటిలో కొన్ని పరిశీలిద్దాం.

అన్న చనిపోతే వదినను తమ్ముడు తప్పగా వివాహం చేసుకోవాలి. దీన్ని గొండి భాషలో సాట్ అంటారు. దీనివల్ల ఆమే మరిదిని పెళ్లాడతెనే ఆమెకు భర్త ఆస్థి వస్తుంది. అధికారం ఉంటుంది. దాంతోపాటు కుటుంబ గౌరవం కూడా ఉంటుంది. ఇవి వారి ఆచారాల్లో ఒక భాగం.

విడాకులు పొందడం గొండీలలో చాలా తేలిక దీనినే పాదికత అంటారు. వ్యభిచారం, నపుంసకత్వం, గొడ్రాలి తత్వం, కుటుంబ కలహాలు, వల్ల విడాకులు పెద్దల సమక్షంలో పొందవచ్చు. విడిపోవచ్చు.

ఒకవేళ ఒకస్త్రీ ఇతర వ్యక్తితో లేచిపోయినట్లయితే మొదటి భర్త చెల్లించిన సొమ్మును తీసుకుపోయిన వాడు మొదటి భర్తకు చెల్లించాలి. గొండీలలో ఏప్రిల్ నెలలో వేటలకు వెళ్ళడం, పెళ్లి వేడుకలను చేసుకోవడం మొదలవుతుంది అక్కడ "నిద్రశాలలు" ఉంటాయి. ఈ శాలల్లో రాత్రులు పడుకుంటారు. ఈ నెలల్లో పడుచు పిల్లలు రాత్రులప్పుడు జట్టుగా వెళ్లి నృత్యం చేసి పొరు గూరి వాళ్ళతో హాయిగా గడుపుతారు. ఇది వీరి ఆచా రంలో భాగం.

మత సంప్రదాయాలు :

గొండీలు మత సాంప్రదాయాలు వారి తెగలను బట్టి

ఉంటాయి. వీరిలో అనేక ఉప తెగలు కూడా ఉన్నాయి. వీటిలో ముఖ్యంగా, 1) చార్‌దేవ తెగ. ఇది నలుగురు అన్నదమ్ముల తెగ, 2) పాంచ్‌దేవ ఇది ఐదుగురు అన్న దమ్ముల తెగ, 3) షాదేవ ఇది ఆరుగురు అన్నదమ్ముల తెగ, 4) సాత్ దేవ ఇది ఏడుగురు అన్నదమ్ముల తెగ, ఈ తెగలకు అనేక కుదుర్లుగా విభజిస్తారు. ఏకుదురుకు వారే వంశకర్తలుగా ఉంటారు. పూర్వీకులును బట్టి ఇవి వుంటాయి. చాల్ దేవలో 14 కుదుర్లున్నాయి. వీరి కుల దేవతలు తాబేలు మొసలి, పాంచదేవలో 21 కుదుర్లు న్నాయి. వీరి కుల దేవతలు పెద్దపులి, పాము సాత్ దేవలో 7 కుదుర్లున్నాయి. వీరికులదేవత పాము, ముళ్లపంది ప్రతికుదురుకు ఒక దేవుడు తననే పెర్సపిన్ అంటారు. అతన్నే పెద్ద దేవుడు అంటారు. దీనికి ఒక ప్రత్యేక పూజారి అతడే పటేలు. అతణ్ణి గ్రామ పటేలుగా వ్యవహరించి గౌరవిస్తారు. వీరి గ్రామ దేవత సత్ అవాల్ ఈయనకు ప్రతి ఏటా పూజలు నిర్వహించి బలులు సమర్పించి భక్తిగా మొక్కుతారు, జంతుబలి ఎక్కువగా ఉంటుంది.

ఈ విధంగా గొండీలు ఆచారవ్యవహారాలు సంస్కృతీ సంప్రదా యాలు కనిపిస్తాయి. ఇంకా వారిలో నిరక్షరాస్యత పోవాలి. విజ్ఞానం వికసించి ఆధునిక సమాజంలో కలిసి ఆరోగ్య, ఆర్థిక మార్పు కోసం శ్రమించాల్సిన అవసరం ఉంది. భవిష్యత్ తరానికి సంస్కృతిని పరిచయం చేసే దిశగా ప్రయత్నిద్దాం.

ఆధారగ్రంథాలు :

1) బి.హెచ్. మెహతా - గాడ్స్ & గోడ్డెస్ వానా లాండ్.
2) డా.ప్రతాప్ - ది ట్రైబెల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్.
3) వి.రాఘవయ్య - ది ట్రైబెల్ ఆఫ్ ఇండియా.

రాసాని 'విషప్పురుగు' కథా సంపుటి – గిరిజన జీవితం

– డా॥ తొండాటి రాజశేఖర్, పోస్ట్‌డాక్టోరల్ ఫెలో, ప్రాచ్య పరిశోధన సంస్థ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

ఆధునిక తెలుగు సాహిత్యం అధ్యయనం చేసే క్రమంలో మనకు ప్రధానంగా కనిపించేవి సాహిత్యోద్యమాలు. ఆ క్రమంలోనే 1980వ దశకంలో వచ్చిన దళితవాదం, స్త్రీవాదం తెలుగు సాహిత్యంలో సంచలనాన్ని సృష్టిస్తే, వాటికి తోబుట్టువులా వచ్చిన మైనార్టీవాదం ఒక స్థానాన్ని సంపాదించుకుంది. ఆ మార్గంలోనే ఇప్పుడిప్పుడే గిరిజనవాదం పురుడుపోసుకుంటోంది. ఇప్పటి వరకు గిరిజన, సంచార జాతులు అడవుల్లో, కొండకోనల్లో, ఏజెన్సీ ప్రాంతాల్లో అడవులకు దగ్గరగ ఉన్న మైదాన ప్రాంతాల్లో ఉన్నారని మాత్రం గుర్తించిన సాహిత్యం ఇప్పుడిప్పుడే వారి ఆర్తిని, ఆవేదనను బ్రతుకు పోరాటాన్ని ఆధునికకోణంలో అధ్యయనం చేస్తూ సాహితీలోకంలో చలనం తేగలుగుతోంది. ఆకోవలో కథా సాహిత్యానిది అగ్రస్థానం అనడంలో సందేహంలేదు. 1921లో సుగాలి కుటుంబం చింతాదీక్షితులచేత రాయబడి 'సాహితీ' పత్రికలో ప్రచురింపబడిన కథ తొలి గిరిజన నేపథ్యంతో వచ్చిన కథ అని అక్కిరాజు రమాపతిరావు తెలియజేసారు. ఆ పరంపరలో నెల్లూరుజిల్లాకు చెందిన గూడూరు రాజేంద్రరావు 'చెంచి' కథ ప్రచురించినట్లు తెలుస్తోంది. అవి తొలిదశలో వచ్చిన గిరిజన కథలైతే ఆ తర్వాత బోయ జంగయ్య, కొలకలూరిఇనాక్, వాడ్రేవు వీరలక్ష్మీదేవి, పెద్దింటి అశోక్‌కుమార్, ఎ. విద్యాసాగర్, అప్పల్నాయుడు, శిరంశెట్టి కాంతారావు, భుక్యా తిరుపతి వంటి వారు నేటికీ గిరిజన, సంచార తెగల జీవితాలను తమదైన వాణిలో కథానికులుగా వెలువరిస్తున్నారు. ఈ క్రమంలో ఎ. విద్యాసాగర్ రాసిన 'భద్రాచలం మన్నెంకథలు' అనే కథా సంపుటి గిరిజన జీవన నేపథ్యంతో వచ్చిన తొలి పుస్తకం. ఆ తర్వాత వేదగిరి రాంబాబు సంపాదకత్వంలో వచ్చి 'మన్నెంకథలు'దానికి కొనసాగింపుగా భావించవచ్చు. గిరిజన జీవితాలపైన జయధీర్ తిరుమలరావు, జీవన్‌లు కలసి తెచ్చిన 'ఇప్పపూలు' కథా సంపుటి, మల్లిపురం జగదీశ్ కూర్చిన 'శిలాకోల' కథాసంపుటాలు గిరిజనుల బతుకు పోరాటాలకై చేసిన పోరాటాన్ని తెలుపుతున్నాయి. ఈ కోవలో రాయలసీమ నుండి ఆ ప్రాంత గిరిజన నేపథ్యంతో డా॥ రాసాని వెంకట్రామయ్య రాసిన కథా సంపుటి 'విషప్పురుగు'.

'విషప్పురుగు' కథా సంపుటికి రెండు ప్రత్యేక లక్షణాలున్నాయి. ఒకటి రాయలసీమ ప్రాంతం నుండి గిరిజన నేపథ్యంతో వచ్చిన తొలి కథా సంపుటి కాగా, రెండోది ఒకే రచయిత రాసి ఒక కథా సంపుటిగా వచ్చిన తొలి గిరిజనకథా సంపుటి. రచయిత వివిధ సందర్భాల్లో రాసిన గిరిజన కథలను వివిధ పత్రికల్లో, కథా సంపుటాల్లో ప్రచురింపబడిన కథానికలను ప్రజాశక్తి బుక్ హౌస్ వాళ్ళు ఒకే కథా సంపుటంగా తీసుకొచ్చి సాహితీలోకం ముందుంచడం అభినందనీయం. ఈ కథలు రాసిన కథా రచయిత డా॥ రాసాని వెంకట్రామయ్య. అంతులేని ప్రాంతీయ అసమానతలకు నిలయమైన మన భారత దేశంలో, అందులోనూ వెనుకబాటుకు గురైన రాయలసీమ అస్థిత్వాన్ని నిలుపుతూ, తన సాహిత్యమంతా బడుగు బలహీనవర్గాలు, దళిత, గిరిజన నేపథ్యాల్ని ప్రస్తావిస్తూ అది తన సామాజిక బాధ్యతగా భావించిన రచయిత ఆయన. 'రాసాని సాహిత్యమంతా బహుజనులదే' అని ఒక్క మాటలో ఆయన సాహిత్యాన్ని పరిచయం చేయవచ్చు. చరిత్రంటే రాజులు, వారి పాలన కళాపోషణ, వారి సాధించిన ఘనకార్యాలే కాదు, వాటితో పాటూ సామాన్యుల జీవితాలు కూడా చరిత్రేనని నమ్మిన వ్యక్తి రాసాని. ఆ సదుద్దేశ్యంతోనే ఆయన సాహిత్యమంతా సాగుతుంది. ప్రస్తుత పరిశోధనాంశం అయిన 'విషప్పురుగు' కథా సంపుటిలో నాలుగో నాటకం (2008), విషప్పురుగు (2011), కీడు (2006), వేట (2006), నల్ల పూసలు

(1998), కుబుసాలు(2006) నిప్పు (2014) పయనం (2007), అదృశ్య విద్వసం (2015) తిరిగిరాని తిరుమల (1993), ఎన్‌కౌంటర్ (2000) నేరం (2006) పొగిడింపు (2017) అనే మొత్తం పదమూడు కథలు ఉన్నాయి. ఈ కథలన్నింటిలో గిరిజనల్లోని అవిద్య, అజ్ఞానం, అమాయ కత్వం, నిత్యదారిద్ర్యం, ప్రభుత్వ చర్యలవల్ల వారిలో వ్యక్తమవుతున్న అలజడి, ఆరాటం, బ్రతుకు పోరాటం, వాళ్ళు దోపిడీకి గురవుతున్న తీరు, అణచివేతకు గురవుతున్నవైనం వంటి వాటి మూలంగా కలిగే అభద్రతా భావం కళ్ళకుకట్టినట్లు రాసాని చిత్రించాడు.

"సాహిత్య సమాజానికి ప్రతిబింబమైతే కథా సాహిత్యం ఆయా కాలాల నాటి సాంఘిక జీవితానికి ప్రతీక" అన్న రాసాని మాటలను బట్టి చూస్తే ఆయన కథా సాహిత్యం పట్ల అయనకున్న దృక్పథం అర్థం అవుతుంది. ఆయన దాదాపు అన్ని పక్రియల్లోను రచన చేసినప్పటికి కథా ప్రక్రియను ప్రత్యేకంగా అభిమానించే వ్యక్తి. ఆయన రాసిన 'విషప్పురుగు' కథా సంపుటికి బండి నారాయణ స్వామి ముందు మాటరాస్తూ 'గిరిజన' సంచారతెగల సాంస్కృతిక రాయబారిని రాసాని 'అన్న మాట వాస్తవం. వారి జీవితా లను, జీవననేపథ్యాన్ని, కులవృత్తులను, ఆర్థిక స్థాయిలను అక్షరీకరించి మన ముందుంచారు.

నవ్య వారపత్రిక 2008లో నిర్వహించిన కథల పోటీలో ప్రత్యేక బహుమతిపొందిన కథ 'నాలుగో నాటకం'. ఇది యాచకకులాన్ని గురించి వివరించే కథ. పరస్పరం అనుబంధం కలిగిన మూడు సంచార యాచకకులాల సంగమం ఈ కథలోని ఇతివృత్తం. గొర్రెలు కాసే కురవ కులానికి సాంస్కృతిక అనుబంధకులం గొరవయ్య లకులం. ఆ గొరవయ్యలు చేసే గొరవనృత్యానికి కావా ల్సింది ఎలుగుబంటి చర్మంగల టోపి. ఎలుగుబంటి చర్మం యాచక కులమైన ఎలుగ్గోడ్డొళ్ళ దగ్గర ఉంటుంది. ఇలా మూడు కులాలు మధ్య సాంస్కృతిక నేపథ్యాన్ని ఈ కథ వివరిస్తుంది. శ్రీశైలంలో ఉండే శివయ్య పేరు మీద పెండ్లికాని మగవానికి దీక్షనిచ్చి గురవయ్యను చేస్తారు. జంగమదేవర్లు తొడుక్కునే నల్లగౌను తగిలించి, నడుముకు గవ్వలపట్టీ కట్టి, నెత్తిన ఎలుగుబంటి చర్మంతో తయారు చేసిన టోపీతో గురవయ్య నృత్యం చేస్తాడు. ఎలుగ్గొడ్డు చర్మం కోసం ఎలుగ్గొడ్డోని దగ్గరకు వెదు క్కుంటూ గురవయ్య వస్తాడు. ఆర్నెల్లు యాచకత్వం కోసం బయట తిరుగుతున్న ఎలుగ్గోడ్డోణ్ణి గురవయ్య కలసి మాట్లాడుతాడు. అతడితో పాటు తోడుగా ఉంటున్న ముడ్డిగంటోనితో కలసి వారి గేరికి వెళుతూ ఈ కథ ముందుకు సాగుతుంది. ఆ గురవయ్య పేరడిగిన సందర్భంలో "అయ్యో పేరడగితివా, మా గేర్లో శానా మందికి పేర్లుండవన్నా. ఎవరు ఏ పనిచేస్తే వాడికదేపేరు. అద్దో ముందు బోతా వుండ్లా వాడు ముడ్డికి గంట కట్టుకుని ఆడతాడుగాబట్టి వాడిపేరు ముడ్డి గంటోడు". అని చెప్పడంబట్టి వాళ్ళు గిరిజన సంచారీ తెగల వాళ్ళకు నాగరికమైన పేర్లు వుండవని అర్థమవుతుంది. అలాగే వారికళలకు కూడా ఆదరణ తగ్గిపోతుందని రచయిత ఆవేదన వ్యక్తంచేస్తూ ఆ పాత్రల ద్వారానే చెప్పిస్తాడు. ప్రసారమాధ్యమాలు ప్రజల జీవితాల్లోకి వచ్చాక జానపద కళలలుకు, యాచకుల కళలలకు ఆదరణ తగ్గుతోందని రాసాని ఆవేదన ఈ కథ ద్వారా అర్థమవుతుంది. అలాగే ఎక్కడో అడవిలో ఒక బండపైన ఆవాసాలు ఏర్పరుచు కున్న ఎలుగ్గోడ్డోని గేరిలోని వాళ్ళ జీవితాలన్నీ క్వారీ రూపంలో ఎలా మింగేసిందో ప్రపంచీకరణ ఎలా గిరి జనుల జీవితాలను చిద్రం చేస్తుందో తెలిపేకథ ఇది.

పూడు బాములి, నక్షత్రతాబేళ్ళును స్మగ్లర్లకు అమ్మే ప్రయ్నంలో పోలీసులకు చిక్కిన గిరిజనలను గురించి 'విషప్పురుగు' కథలో రాసాని చిత్రించాడు. చిత్తూరు జిల్లా ఎర్రచందనం స్మగ్లింగుకు ప్రసిద్ధి. తర్వాతిస్థానం పూడ బాములకు ఉంది. ఆ నేపధ్యంతో సాగే కథ ఇది. అసలు ప్రపంచంలో పూడుబాములకు, నక్షత్రతాబేళ్ళకు ఉండే గిరాకి, వాటి ఖరీదు, వాటి ఉపయోగం గురించి అసలు గిరిజనులకు అవగాహనే ఉండదు. కానీ జీవన పోరాటంలో అది కొందరికి వ్యసనంగా ఉంటుంది

ప్రకృతిలో ఉన్న విషప్పురుగుల కాటుకు మందు ఉంటుంది కానీ ప్రపంచీకరణ విషప్పురుగు కాటుకు మందు లేదని ఇది సమాజంలోని మనుషలందరినీ కాటువేసి మానవ విలువలు, ప్రేమాభిమానాలు, దయాదాక్షిణ్యాలును చంపివేస్తుందని ఇదే అసలైన విషప్పురుగు అని రచయిత ఈ కథ ద్వారా సమాజానికిచ్చిన సందేశం ప్రపంచీకరణ పట్టణాల్లో నుండి గిరిజనుల గేరీల్లోకి ప్రవేశించి వారి మధ్య ఎలా చిచ్చుపెడుతుందో కూడా అర్థం చేసుకోవచ్చు.

గ్రామాల్లో ఆశ్రిత కులానికి చెందిన మెండోళ్ళ జీవన విధానం గురించి వివరించేకథ కీడు. ఈ మెండోళ్ళు మొండికేసి మరి రైతుల దగ్గర, కోమట్ల దగ్గర భిక్షను పెట్టించుకుంటారు. నానా ఆగింతం చేసి మరి వారి మెండి తనాన్ని చూపిస్తారు. జరగకూడనది జరిగితే కీడు అని భావించే నమ్మకమున్న వ్యవస్థలో మనం బతుకుతున్నాం. ఆ నమ్మకంలో భాగంగా నిండు గర్భిణి ఎదో కారణం చేత చనిపోతే ఆమెను అలాగే ఖననం చేయకూడదని తల్లి బిడ్డను వేరుచేసి పూడ్చాలనేది కొందరి ఆచారం. ఆ పని చేయగల ఒకే ఒక కులం మెండోళ్ళ కులం. కీడు కథలో నిండు చూలాలిగా ఉండి చనిపోయిన రత్నమ్మ గర్భాన్ని కోసి బిడ్డను వేరుచేసే సమయంలో మెండోడు శవాన్ని కళ్ళకద్దుకొని" ఇందులో నా తప్పేమీ లేదు తల్లీ. నా వృత్తి నేను చేస్తావుండా. మన్నించు మహాతల్లీ! "అనడం వెనుక మెండోళ్ళ యాచకత్వం మన కళ్ళముందు కనిపిస్తుంది. లక్షరూపాయలిచ్చినా ఆపని వేరేకులంవాళ్ళు చేయలేరు. కానీ మెండోళ్ళు తమ బ్రతుకు పోరాటంలో భాగంగా ఆ పని చేయక తప్పదు.

అడవికి దగ్గరలో రోడ్డుపక్కన వున్న గిరిజనుల నివాసాలను రోడ్డు విస్తరణల పని నెపంతో ఎలా నేలమట్టం చేశారో తెలిపిన కథ వేట. ఈ కథలో ప్రధాన పాత్ర వెంకట స్వామిది. ఆ పాత్రద్వారా ఉడుతను బట్టే పథకాన్ని, పుట్ట నుంచీ ఇసుళ్ళు సేకరించే పని తనాన్ని రచయిత మనకళ్ళముందు బొమ్మకట్టిస్తాడు. అలాగే ప్రభుత్వం చేసే పనుల వల్ల యానాదులు ఎలా నష్టపోయారో కూడా ఈ కథ వివరిస్తుంది. తిరుపతి నుండి భాకరాపేట దాకా వచ్చిన డబుల్ రోడ్డుకు మీ ఇండ్లే అడ్డమని ప్రభుత్వాధికారులు జె.సి.బి.తో కూల్చివేస్తే ఎవరికి చెప్పుకోవాలో తెలియక, మరో గూడు ఎలా ఏర్పాటు చేసుకోవాలో ఆలోచిస్తూ యానాదులు పడే ఆవేదనను తెలిపే దృశ్యకథ ఇది. నాగరికుల సౌకర్యాలు యానాదుల ఆక్రందనలకు కారణం అవుతున్నతీరును ఈ కథలో రచయిత తెలియజేశాడు.

తరతరాలుగా మగవాడి చేతిలో ఆడవాళ్ళు మోసపోతున్న వైనం ఒక్క నాగరిక ప్రపంచంలోనే కాదు, అడవి బిడ్డల్లో కూడ ఉందని తెలియజేసేకథ నల్లపూసలు. ఓలి బతుకులు పేరుతో తొలత అచ్చయిన ఈ కథ 'ఓలి' ఒకప్పటి ఆచారమై తరువాత దురాచారమై ఎలా ఆడవారి జీవితాలతో చెలగాటం ఆడిందో ఈ నల్లపూసల కథ చర్చిస్తుంది.

ఒకప్పుడు పాములొ బట్టి వాటిని ఆడించి బతికిన ఇర్లోళ్ళకు జీవకారుణ్య చట్టం ఎలా అడ్డంకిగా మారిందో వివరించే కథ కుబుసాలు. ఎన్నో యేండ్లుగా పాములు పట్టుకొని వాటిని కళాత్మకంగా ఆడిస్తూ జీవనం సాగించే ఇర్లవాళ్ళు ఆ వృత్తే కనుమరుగైపోయి తమ చిందు భాగవతాన్ని ప్రదర్శిస్తూ ఎలా భిక్షగాళ్ళగా మారిపోయారో రాసాని కుబుసాలు కథ వివరిస్తుంది. గవర్నమెంటు నిర్ణయంతో పాములు పట్టే నేర్పరితనం, ఆడించే విద్య ఎలా వదులుకొని మరోవృత్తిలోకి వెళ్ళే సందర్భంలో వాళ్ళు పడే మానసిక క్షోభ, అనుభవించే వేదన ఈ కథలో వివరించారు. ప్రత్యేక సందర్భంలో పాము కుబుసం వదిలే విధంగా ప్రభుత్వ చట్టాలతో వాళ్ళు తమ వృత్తులు వదులుకోవల్సి వస్తుందనే విషయాన్ని రచయిత తెలిపాడు.

జీవన పోరాటంలో భాగంగా ఒక యానాది కులస్తుడు ఒక తమిళప్రాంతపు ఎర్ర చందనం స్మగ్లర్‌తో కలిసి తిరుమల కొండల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నాడో

తెలిపేకథ నిప్పు. ఎర్రచందనం స్మగ్లింగ్‌పై తెలుగు సాహిత్యంలో వచ్చిన మొట్టమొదటి కథ ఇది.

రాయలసీమ ప్రాంతంలో ముఖ్యంగా చిత్తూరు జిల్లాలో నివసించే మరో సంచారతెగ నక్కలోళ్ళు. స్వతంత్ర భారతావనికి డెబ్భైఏళ్ళు నిండుతున్న ఒక స్థిరనివాసం ఏర్పాటు చేసుకోలేని దీనమైన జీవితాన్ని గడుపుతున్న ప్రాచీనమైన తెగ గురించి వచ్చిన మొట్టమొదటికథ పయనం. ''నక్కలోల్ల జీవితానికి సంబంధించి పది వాక్యాలు దొరుకుతాయంటే అది రాసాని పయనం కథల్లోనే'' అన్న డా॥ పి.సి. వెంకటేశ్వర్లు మాటలు వాస్తవం. వారి చరిత్రను పుటల్లోకి ఎక్కించింది రాసానే. నాగప్ప అంజప్ప ప్రధాన పాత్రలు కలిగిన 'పయనం' కథ అడవిలో ఉన్నటువంటి ఉల్లింజ, పరిగ, గేదార, బందార, చీకి, మంగ వంటి చెట్లగురించి నేటి తరానికి తెలియని ఎన్నో విషయాలు రచయిత తెలియజేస్తాడు. అలాంటి చెట్ల మధ్యనివసించే నక్కలోళ్ళు ఉడతల్ని, నక్కల్ని, అపారయకరమైన తోడేళ్ళను తమ తుపాకీలతో చంపి చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు ఎంతమేలు చేస్తున్నారనే విషయాన్ని నాగరిక ప్రపంచం గుర్తించలేదంటాడు రచయిత ఇంకా నక్కలోళ్ళ ఆడవారిపై ఫారెస్ట్ అధికారుల అకృత్యాలు, అడవిమధ్యలో ప్రశాంతంగా బతుకుతున్న నక్కలోళ్ళ మధ్యలోకి కొందరు పెట్టుబడిదారులు అంగళ్ళు పెట్టి వారి జీవితాలను నాశనంచేసే తీరును రచయిత నర్మగర్భంగా వివరించాడు. ప్రతికులానికి ప్రత్యేకమైన వృత్తి ఉండటం మన సమాజంలో ఉంది. ఆ వృత్తికి సంబంధించిన ఆయుధాలు ఉపయోగించటం ఆకుల ధర్మం. నక్కలోళ్ళ వృత్తి వేట. దానికి సంబంధించి తుపాకీ కలిగి ఉండటం వారి కులధర్మం. ప్రభుత్వం మారణాయుధాలు ధరించి తిరగటం తప్పని తేల్చడం మూలాన వారు వృత్తిని చేసుకోవడం కష్టమైపోయింది. అందువల్ల వాళ్ళుపడే ఆవేదన, వారి సహజ సంస్కృతిని వదులుకునేటప్పుడు పడే పరివేదన వర్ణనాతీతం.

నేడు 'సర్కస్'గా మనకు పరిచయమున్న దొమ్మరాటలతో ప్రజలను ఆనందింపజేసి, పొట్టపోసుకునే యాచకకులం గురించి వివరించే కథ అదృశ్యవిధ్వంసం. ఆ వృత్తితో పొట్ట పోసుకునే వెంకటస్వామి కుటుంబం పట్నం ప్రదర్శించే సర్కస్‌ఫీట్లు ప్రాణాలతో చెలగాటం. అలా ప్రాణాలతో చెలగాటం ఆడినా వారి ఆకలి మంటను ఆర్పలేని ఆటలు అవి. గుండెలపై బండలు పెట్టుకొని పెద్ద సమ్మెటతో కొట్టించుకోవడం, ఒళ్ళంతా ఊనం చేసుకుంటూ జాటీలతో కొట్టుకోవడం ఆకుటుంబంలో ఎందరుంటే అందరూ సర్కస్‌ఫీట్లు చేస్తేగానీ మనలాంటి నాగరికులు ఆనందించి అర్ధరూపాయి వెయ్యలేరు. ఈ కథలో సన్నటితీగపై నడచి, వెంకట స్వామి భుజాలపైన ఎత్తయిన వెదురు కట్టెమీద పడుకొని కళ్ళుతిరిగే పడిపోయే చిన్నబిడ్డ 'జయను' చూస్తే ఒళ్ళు గగుర్పాటుకు గురవుతుంది. దొమ్మరి వాళ్ళు జీవితాలు కళ్ళకు కనిపించకుండా ఎలా విధ్వంసానికి గురువుతున్నాయో రచయిత వివరించిన తీరు కళ్ళలో నీళ్ళు తెప్పిస్తుంది.

సుగాలీవారు ఒకప్పుడు అడవిపైన ఆధారపడి జీవిస్తూ ఉండి ప్రస్తుతం మైదాన ప్రాంతంలోకి వచ్చిన వారు. అసలు దారిద్ర్యం ఎలా ఉంటుందో చూడాలంటే వీళ్ళలోనే చూడాలి. నిత్యం కరువు ప్రాంతమైన అనంతపురం జిల్లాలో వలసలు ఎక్కువ. మరి భూమి ఉన్నోళ్ళే వలసలు వెళ్తుంటే సెంటు భూమిక్కూడా నోచుకోని సుగాలీల పరిస్థితి చెప్పాల్సిన పనిలేదు. మద్దిలేటి కరువుకు భయపడి తన రెండవ భార్య సాలమ్మను, మొదటి భార్యకొడుకు తిరుమలను తీసుకొని చిత్తూరు జిల్లా ఓ గ్రామీణ ప్రాంతానికొచ్చి సుబ్బరాయడనే లారీడ్రైవరు దగ్గర చేరి భిక్షాటన చేసుకుంటూ కాలం వెళ్ళదీస్తుంటాడు. ఒకరోజు భిక్షాటనకు బయల్దేరిన మద్దిలేటి ప్రాణాలొదిలేస్తాడు. అదే కులానికి చెందిన శీనప్ప మద్దిలేటికి దహన సంస్కారాలు చేసి సాలమ్మతో పరిచయం పెంచుకొని ఆమెను లేవదీసుక పోతే 'తిరుమల' అనాథగా మిగులుతాడు. అప్పటినుండి లారీడ్రైవరు సుబ్బరాయుడు ఆదరిస్తాడు. శెట్టిగారి

చిల్లరంగడిలో చేయనితప్పకు పోలీసుల చేత దెబ్బలు తింటాడు. అంతతో ఆగక సుబ్బరాయుడు కూడా బెల్టుతో కొట్టడంతో గాయపడిన పసి హృదయం ఆ ఇంటిని కూడా వదిలేసి వెళ్ళిపోతాడు. వలస జీవితాలు ఎంత దుర్భరంగా ఉంటాయో వివరించిన కథ ఇది.

అలాగే మరో సుగాలి కుటుంబకథ 'నేరం'. ఒకప్పుడు రాజస్థాన్ లాంటి సుసంపన్న ప్రాంతంలో సుగాలీలు రాజ్యమేలారు అంటాడు బండి నారాయణస్వామి. అన్ని పోగొట్టుకొని అడవులంటూ వలసలుపోయి సంచార జాతులుగా స్థిరపడ్డారట. కన్నబిడ్డల్ని సాకలేక ఒక చేయని నేరాన్ని పిల్లాడిపైన నెట్టించి తిండికోసం వాళ్ళను బాల నేరస్థుల జైళ్ళకు పంపే దయనీయస్థిని నేరం కథలో మనం చూడవచ్చు. పిల్లవాడికి విడుదల సమయం వచ్చినా పిల్లవాడి తండ్రి వచ్చి మరికొంత కాలం జోవెనైల్ హోమ్‌లో కొనసాగించమని అర్థించడం వెనుక సుగాలీ కుటుంబాలు ఎంత ఘోరంగా ఉన్నాయో ఆలోచించ వచ్చు.

ఎన్‌కౌంటర్ కథ యానాదులకథ. ఇది ప్రభుత్వ చట్టా లను ఆలోచింపచేసేకథ. అగ్రకులస్థుడైన చౌదరికి మంత్రులు, పోలీసుల్లో పలుకుబడి ఎక్కువ. ఆ పలుకబడితో యానాదుల భూములను దోచుకోవాలని చూస్తాడు. ఆ సందర్భంలో ప్రతిఘటించిన యానాదుల ప్రతినిధి గంగుజ్జను 'తుపాకీ' కలిగి ఉన్నాడనే నెపంతో నక్సలైటుగా చిత్రించి ఎన్‌కౌంటర్ చేయిస్తాడు చౌదరి. తమకులానికి సంబంధించిన పన్నిముట్లు కలిగి ఉండటం అన్ని కులాల్లో తప్పకాదు గానీ గిరిజనుల విషయంలో ఎందుకు తప్పో 'రాజ్యాంగం' ఆలోచించాలి.

ఒకప్పుడు తంబురను, గుమ్మెతను కొడుతూ వీర గాధల్ని పాడి బతికే జంగమోళ్ళు గురించి తొట్టతొలిగా కథ రాసింది రాసానే. అదే "పొగిడింపు". చనిపోయిన వారిని స్మరించు కోవడానికి, ఆ వ్యక్తి వివరాలు చెబితే అప్పటికప్పుడు పాటను కవికట్టి 'పొగడటం' వీళ్ళ ఆచారం. ఆ వృత్తి నానాటికి నశించి, ఆదరణకరువై, చివరకు తిండిలేక తమ వాయిద్యాలనే పగలగొట్టుకొని వట్టి చేతులతో సంచారం వెళ్ళిన కథ ఇది. ప్రపంచీకరణ ప్రభావంతో జంగముల కులవృత్తి ఎలా నిరాదరణకు గురైందో ఆలోచింపజేసే కథ ఇది.

వృత్తిరిత్యా అధ్యాపకుడైన రాసాని కేవలం పుస్తకాల పఠనంతో పాటు తమచుట్టుఉన్న అతి దుర్భర దారిద్ర్యం అనుభవిస్తున్న గిరిజన తెగలను గురించి కూడా అధ్య యనం సాగించాడు. ఇలా గిరిజన, సంచార, యాచకుల జీవితాలకు సంబంధించిన కఠోర వాస్తవాలకు అక్షరరూపం ఇచ్చాడంటే, ఆయకున్న లోకజ్ఞానం, భావుకత ఏ పాటివో అర్థంచేసుకోవచ్చు. గిరిజన సమాజ సంస్కృతిని ప్రత్యేకంగా ఒక కథాసంపుటి ద్వారా తెలుగు సాహిత్యానికి అందించిన ఘనత.

ఆధార గ్రంథాలు :

1. విషప్పురుగు కథా సంపుటి - డా॥ వి.ఆర్. రాసాని.
2. లోచూపు - డా॥ వి.ఆర్. రాసాని.
3. రాసాని సాహిత్య సమాలోచన - డా॥ ఎన్. కృష్ణారెడ్డి, డా॥ పి.సి. వెంకటేశ్వర్లు.

గిరిజన సమూహాల్లో కనిపించే ప్రత్యేక సంస్కృతి సంప్రదాయాలు

– గుల్ల దుర్గాదేవి, తెలుగు అధ్యాపకురాలు, బాలయోగి గురుకుల కళాశాల, కుమారదేవం - దొమ్మేరు.

మానవ సమాజంలో ఎన్నో కొత్తకొత్త మార్పులు కనిపిస్తుంటాయి. కాలానికి తగట్టుగా మార్పులు రావడం సహజమైన అంశం. కాని కొన్ని సమాజాల్లో భిన్నమైన కట్టుబాట్లు విచిత్రమైన సంప్రదాయాలు ప్రత్యేకంగా కనిపిస్తూ ఆశ్చర్యాన్ని కల్గిస్తాయి. మానవ సమాజంల్లో భిన్న దృక్పథాలు ఆయా సమూహాలను బట్టి ఏర్పడటం జరుగుతుంది. అలాగే భాషా విషయంలోను ఆచార సంప్రదాయాల్లోను వస్తు సంస్కృతిలోను విజ్ఞాన వినోద క్రీడా రంగాల్లోను తమదైన ముద్రతో ఒక సొంత గొంతుగా నిలబడి ఇది తమదే అని చెప్పుకునే ప్రత్యేక అంశంగా కనిపించే సందర్భాల్లో ప్రతీ సమూహాల్లోను కనిపిస్తాయి.

ఆదిమ సమాజం నుండి ఆధునిక సమాజం వరకు వేలవేల సంవత్సరాల చరిత్ర దాగివుంది. అందులో ఎన్నో మలుపులు ఎన్నో కొత్త కోణాలు, చిత్రవిచిత్రమైన ఆవిష్కరణలు అడుగడుగునా కనిపిస్తాయి. వీటిలో గిరిజన సమూహాల్లో ఉండే ప్రత్యేక సంస్కృతి సంప్రదాయాలు వీటిని గూర్చి వివరించే ప్రయత్నమే ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

గిరిజన సంస్కృతి :

ఇప్పుడు సంస్కృతి కోసం పరిశీలిస్తే ఏ దేశ సంస్కృతి ఆ దేశానికి, ఏ జాతి సంస్కృతి ఆ జాతికి గొప్ప సంపదగానే భావిస్తాం. సంస్కృతి మంచిదా చెడ్డదా అని ప్రశ్నిస్తే సమాధానం శూన్యం. ఎవరి సంస్కృతి వారికి గొప్ప. అది వారికి పుట్టుక నుండి వారసత్వ సంపదగా వచ్చిన సొత్తుగా భావిస్తాం. సంస్కృతిని పరిశీలిస్తే సాంఘిక శాస్త్రాల్లో సాధారణంగా సంస్కృతి అంటే సామాజిక సంపద. సోషల్ హెరిటేజ్ అని అర్థం ఉంది. సమాజంలోని సభ్యులకు లభ్యమయ్యే విజ్ఞానం, నమ్మకాలు, ఆచారవ్యవహారాలు, నైపుణ్యాలు, సామాజిక సంపదగా పరిగణిస్తారు. అది ఆ ప్రజలకు నిర్దుష్టమైన విలక్షణమైన చారిత్రక సంఘటనల ఫలితమే సామాజిక సంపదగా భావించాలి. 19వ శతాబ్దంలో జర్మన్‌లో సంస్కృతి అంటే నైతిక పరమైన మేధా పరమైన ఆదర్శభావనగా పరిగణింపబడింది. అంతే కాకుండా ఆ జాతి యొక్క లేక ఆ యుగం యొక్క ప్రత్యేక అసాధారణ ప్రతిభను సంస్కృతిగా భావించారని తెలుస్తుంది. క్రోబర్ మానవశాస్త్రానికి తలమానికంగా సంస్కృతిని అభివర్ణించాడు. అంతేకాదు మానవ శాస్త్రం మనుగడ నిలుపుకోవాలంటే మానవ సమాజాన్ని నిరంతరం అధ్యయనం చేస్తుంటే అందులో కనిపించే మొట్టమొదటి అధ్యయన అంశం సంస్కృతి అని చెప్పవచ్చు.

నిర్వచనాలు :

సాంఘిక శాస్త్రవేత్తల నిర్వచనల్లో చెప్పుకోతగిన వారు క్లైడ్‌క్లుక్ హాన్, రచించిన మిర్రర్ ఆఫ్ మోన్ గ్రంథంలో క్లిష్టోఫర్‌శీర్డ్ సమకూర్చిన నిర్వచనాలు అతి ప్రధానమైనవి. వాటిలో కొన్ని పరిశీలిద్దాం.

1) ఒక ప్రజల సంపూర్ణ జీవిత విధానమే సంస్కృతి
2) వ్యక్తులు తమ సమూహాల నుండి సమూపార్జించిన సామాజిక వారసత్వ సంపదే సంస్కృతి
3) ఒక సమూహంలో ఉండే ప్రజల అభ్యాసనతో అధ్యయన ప్రవర్తనే సంస్కృతి
4) చరిత్ర అపక్షేపమే సంస్కృతి, వీరితో పాటు రాల్ఫ్ లింటన్, మలినో విస్కీ నిర్వచనాలు గమనిస్తే సంస్కృతి అంటే జాతి వారసత్వంగా వచ్చిన సామాజిక అంశాలన్ని సంస్కృతిలో భాగం అంటారు.

ఈ నిర్వచనాలను పరిశీలిస్తే ఏ జాతి సంస్కృతి ఆ జాతికి అత్యంత గౌరవ ప్రథమైన ఉదాత్తమైన వారసత్వ సంపదగా గుర్తించాల్సిన అవసరం ఉందని తెలుస్తుంది.

గిరిజన సంస్కృతి సాంప్రదాయాల్లో కనిపించే ప్రత్యేకత :

సంస్కృతికి మూలం ఆదివాసి జీవనశైలి. అందులో అరణ్య జీవన వ్యవస్థ నుండి క్రమక్రమంగా మేధో సంపదలో అభివృద్ధిచెంది ఆధునిక సమాజానికి ముందు ఒక ప్రత్యేక సమూహాలతో సమాజాన్ని నిర్మించుకుని తమ కంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్న జాతి గిరిజన జాతి, కొండల్లో నివాసముంటూ ప్రకృతిని ప్రేమిస్తూ అనుకరిస్తూ విజ్ఞానాన్ని పెంపొందించుకుని అవసరాలకు తగ్గట్టు పని ముట్లును ప్రత్యేక ముద్ర వేసుకున్న సమూహాల సంస్కృతే గిరిజన సంస్కృతి. అందులో అంతర్భాగమే కట్టుబాట్లు, ఆచారాలు.

గిరిజన ప్రాంతాల్లో కనిపించే కట్టుబాట్లు ఆచారాలు వింతగా కనిపిస్తాయి. కట్టుబాట్లనే ప్రయోజనాత్మక కట్టు బాట్లని, నిషేదాత్మక కట్టుబాట్లని, సంఘటిత నిషేదాత్మక కట్టుబాట్లని విభజించవచ్చు. ప్రముఖ సామాజిక వేత్త మాలినోవిస్కీ నిర్వచనం ప్రకారం కట్టుబాట్లు అంటే "క్రమ బద్ధమైన సామాజిక జీవనానికి ఆదాన ప్రధానత పునాది వంటివి. అవి వారికి అత్యంత ప్రాధాన్యతను ఉనికిని తెలియజేస్తాయి అంటారు.

ప్రయోజనాత్మక కట్టుబాట్లు :

ఇవి గిరిజన తెగల్లో ప్రధానంగా కనిపించే కట్టుబాట్లు సమూహాలు ఐక్యంగా ఉండటానికి స్నేహపూర్వకంగా మర్యాద పూర్వకంగా ఉండటానికి ఉపయోగపడేవి. పండగల్లోను, ఇళ్లల్లో జరిగే శుభ, అశుభకార్యాల్లో జరిగే పద్ధతులు ఇచ్చిపుచ్చుకోవడంలోను వివాహ సందర్భాల్లోను కనిపించేవి. సామకొత్త, మామిడికొత్త, మిరపకొత్త వంటి పంటలకు సంబంధించిన కట్టుబాట్లు దేవుళ్లకు, దేవత లకు పెట్టకుండా ఏదీ ముట్టక ఉండటం. అలా చేస్తే ఆ పంట మొత్తం వదిలేస్తారు. ఇవి సామాజిక ప్రయోజ నాన్ని కలిగి ఉంటాయి.

నిషేదాత్మక కట్టుబాట్లు :

ఇవి గిరిజన తెగల్లో బలంగా నాటుకుపోయిన కట్టుబాట్లు. ఇందులో తారతమ్య బేధాలు ఉండవు. చిన్నాపెద్ద తేడా ఉండదు. పెద్దలు నిర్ణయించిన కట్టు బాట్లు. ఇవి దిక్కరిస్తే మరణ దండన వరకు ఉంటుంది. గిరిజనులు మూఢనమ్మకాలు గలవారేకాదు. ప్రాణాన్ని త్యాగం చేయడానికి తలతెగ గొట్టించుకోడానికి వెను కాడరు. ఇందులో మందలింపు, ఆదేశం, ప్రబోధం, సలహా, హెచ్చరికలు రూపంలో ఉంటాయి. ఇది చండ శాసనంగా నిర్ధారిస్తుంది. ఇందులో సంఘటిత, అసంఘి టిత నిషేదాజ్ఞలుంటాయి. ఉదహరణకు వేరువేరు సమూహాల నుండి సొకర్యాలు పొందకుండా నిషేధిస్తారు. అలా జరిగితే ఆ ఇద్దరిని కులంనుండి, గూడెం నుండి నిర్దంద్వంగా బహిష్కరిస్తారు. దేవతల బలుల విషయంలో కూడా కట్టుదిట్టమైన కట్టుబాట్లు పాటిస్తారు. నాలుక కోసుకోవడం, కంఠాలకు శూలాలు గుచ్చుకోవడం, తడి బట్టలతో 5 రాత్రిలు గడిముందు పడుకోవడం, తప్పు చేస్తే వాళ్లను దండించడం, దుష్టశక్తులను వశపరచు కోవడం, చేతబడి, షిల్లంగి వంటి శిక్షలు, ఒక పిండి బొమ్మను చేసి దానికి మేకులు గుచ్చడం, బాణంతోను, కత్తితో గాయపరచడం చేస్తారు. అ దెబ్బలు, గాట్లు తప్పు చేసిన వాళ్ళకు కట్టుబాట్లను ఉల్లంఘించిన వారికి వర్తిస్తా యని శిక్షపడుతుందని నమ్ముతారు.

వెలివేయడం ఖచ్చితంగా పాటిస్తారు. దీన్ని గిరిజనులు ఇప్పటికే అమలు చేస్తూ వారిని ఊరికి దూరంగా పొలిమేర వరకు రకరకాలుగా శిక్షిస్తూ వెళ్లగొట్టడం చేస్తారు. ఇది ఆదిమ తెగలనుండి కొనసాగుతుంది.

ప్రమాణాలు – కట్టుబాట్లు :

ఈ సంప్రదాయం గిరిజన తెగలనుండి నేటి వరకు కొనసాగుతూనే ఉంది. తప్పులకు శిక్ష పడటం సహజమే. పిల్లమీద, దేవతలమీద, మాతృమూర్తులమీద ప్రమా ణాలు చేయించడం పరిపాటి అలా అబద్ధం అడినా నాశనం వస్తుందని సమ్మకం కలిగి ఉంటారు. యుండావ రావన్ జాతివారు ఒక విచిత్రమైన ప్రమాణం చేయిస్తారు.

పులి చర్మం మీద లేదా పులిదవడ, ఎముకమీద చేయి వేయించి సాక్షిచేత ఒట్టు వేయిస్తారు. అలా అబద్ధం ఆడితే పులి వాతపడుతుందని, వ్యక్తి చనిపోతాడని నమ్ముతారు. దొంగతనం చేసి పసరు పోస్తారు. అబద్ధం ఆడితే చెడు కుళ్లు పోతుందని నమ్ముతారు. చేతిలో కాగే నూనెను పోస్తారు. అబద్ధం ఆడితే కాలుతుందని లేకపోతే కాలదని నమ్ముతారు.

కఠిన శిక్షలు :

కఠిన శిక్షలు విధించడం మనం ఆదిమ గిరిజన తెగల్లోనే కాదు పౌరాణిక కాలం నుండి చూస్తునే ఉన్నాం. అరచేతిలో నిప్పులు పెట్టడం, నిప్పుల మీద నడిపించడం, ముళ్లమీద నడిపించడం, నూనెలో చేతులు పెట్టడం, వంటివి చేస్తారు. అలాగే ఒక గిరిజన తెగల్లో ఒక వింత ఆచారం ఉంది. దోషిగా ఉన్నవాణ్ణి ముందుగా పరీక్షించి చేతులు శుభ్రంగా బట్టతో తుడిచి కాగుతున్న నీటిలో ఒక చెంబు వేసి దాన్ని తీయమంటారు. అదితీసిన తరువాత చేతులను చల్లని నీళ్లలో ముంచి పొడిబట్టతో కట్టేసి ఆ రాత్రంతా ఒక గదిలో బందిస్తారు. వంటరివిగా ఉన్న అతణ్ణి తెల్లవారు జామున వేళ్ల కట్లు విప్పి పరీక్షిస్తారు. బొబ్బలు లేకపోతే నిర్దోషి అని తీర్పు ఇస్తారు. కాకపోతే అదే పెద్ద శిక్షగా భావిస్తారు.

ఈవిధంగా గిరిజన తెగల్లో నేటికీ వివిధ రకాలైన కట్టుబాట్లు కొనసాగుతూనే ఉన్నాయి. వారి విశ్వాసాలు, నమ్మకాలు సంస్కృతి సంప్రదాయాల్లో భాగంగా కనిపిస్తాయి. వీటిపై పరిశోధనలు జరగాలి. గత చరిత్రను సంస్కృతిని వెలికితీయవలసిన అవసరం అందరూ గుర్తించాలి. గిరిజనుల నమ్మకాలు, కట్టుబాట్లు విస్తృత అధ్యయనంతో పాటు పరిశోధనలు జరగాలని ఆశిద్దాం.

ఆధారగ్రంథాలు :

1) డబ్ల్యు మలినోస్కబ్రోనస్లో - సైంటిఫిక్ థీయరీ ఆఫ్ కల్చర్.
2) మోబిల్ ఇ.ప - మేన్ ఇన్‌ది ప్రెమెటీవ్ వరల్డ్.
3) క్లైడ్‌క్లుక్‌హన్ - మిర్రర్ ఆఫ్ మాన్.

నగారావలె ధ్వనిస్తున్న శబ్దాలు

– డా॥ ఎం. విజయశ్రీ, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, జె.కె.సి. కాలేజి, గుంటూరు.

"నగారావలె ధ్వనిస్తున్న శబ్దాలు" ఆదివాసీ కవితా సంపుటి. ఆదివాసీ సమాజ ప్రతిబింబం.

ఇప్పటికీ ప్రకృతి ఒడిలో పసిపిల్లలుగా జీవిస్తున్న గిరి జనుల జీవిత చిత్రణపై వచ్చిన, వస్తున కవిత్వం చాలా తక్కువనే చెప్పాలి. అందునా వారి జీవనం గురించి పూర్తిగా తెలిసీ, అనుభవించి, రాసింది మరీ తక్కువ. ఆ సమాజంలోనే పుట్టి, ఆ సమాజంలోనే పెరిగి, వారితో జీవనం సాగించి, వారి స్థితిగతులను తానూ అనుభవించి, అనుభూతి పొంది, ఆర్ద్రహృదయంతో రాసిన కవిత్వంలో గాఢత ఎక్కువగా ఉంటుంది. దీనికి ఉదాహరణే **"నిర్మలా పుతుల్"** సంతాలీభాషలో రాసిన కవితా సంగ్రహం. **"నగాడేకీ తరహ్ బజ్‌తే శబ్ద్"** అనే పేరుతో అశోక్‌సింహ్ గారి హిందీలోకి తర్జుమా చేశారు. దానిని నగారావలె ధ్వనిస్తున్న శబ్దాలు"గా డాక్టర్ వేమకోటి చంద్ర శేఖర్ రావు గారు తెలుగులోనికి అనువదించారు.

మాయా వర్మం లేని స్వచ్ఛమైన ప్రకృతి బిడ్డలు ఆది వాసీలు. వారి కట్టు, బొట్టూ ప్రత్యేకం. వారిదైన జీవనశైలి వారిది. అలుపెరుగక ఆరుకాలాలు శ్రమించి జీవనం సాగించే శ్రమైక జీవనం వారిది. మోసపోయే వారే గానీ మోసగించే వారు ఆ సమాజంలో ఉండరు. నాగరిక సమా జానికి దూరంగా ప్రకృతిలో మమేకమై జీవిస్తున్నారు. ఆది వాసీలు.

నేడు ఆదివాసీల జీవనం ప్రశార్ధకంగా మారుతున్నది. నవనాగరికులుగా పిలువబడుతున్న కొంతమంది నయ వంచకుల బారినపడి ఆదివాసీలు అనే దుర్భర అవస్థలకు గురి అవుతున్నారు. వ్యాపార, వ్యవహారాలలో అనునిత్యం ఏదో ఒక రూపంలో మోసపోతూనే ఉన్నారు. వారి ధన, మాన, ప్రాణాలకు రక్షణ కరువైన పరిస్థితి ఏర్పడుతున్నది.

ఆదివాసీల జీవన విధానం వారి స్థితి, గతులపట్ల ఉన్న ప్రత్యక్ష అవగాహనతో వారు ఎటువంటి జీవనం గడుపుతున్నారు. వారి జీవన విధానంలో చోటు చేసు కుంటున్న మార్పులూ, ఆర్థిక పరిస్థితులు, ఆదివాసీ స్త్రీల జీవనం, వారిపై జరుగుతున్న అమానవీయ దాడులూ, పురుషుల్లో వ్యసనాలకు బానిసగా మారిన పరిస్థితి, వ్యాపా రులూ, కాంట్రాక్టర్లూ మొదలైన వారి మోసాలూ ఈ కవితా సంకలనంలో చక్కగా చిత్రించబడినారు.

శతాబ్దాల నుండి
తన ఇంటిని వెదకుతూ
వ్యాకులమైన ఒక స్త్రీకి
ఆమె ఇంటి చిరునామా
చెప్పగలరా?

అని ప్రశ్నించిన రచయిత్రి ప్రశ్నలో స్త్రీ అస్తిత్వంతో పాటూ, ఆర్థిక స్వాతంత్ర్యం కావాలనే విషయాన్ని తెలియజేశారు.

"వంట" మరియు **"పడక"** గదుల...

వ్యవహారాలను మించి - ఒక స్త్రీ గూర్చి మీకేం తెలుసు అంటూ స్త్రీకి తనదైన వ్యక్తిత్వం తనకుండాలని చెప్పిన మాటలు ప్రతి ఒక్కరినీ ఆలోచింప చేస్తాయి.

2వ కవిత **"భూమిని వెతుక్కుంటున్న వ్యాకులిత వనిత"**లో నగటు స్త్రీ యొక్క వ్యాకులత కనబడుతుంది. స్త్రీకి...

ఒక స్వేచ్ఛాయుత ఆకాశం
శబ్దాలకు అతీతంగా
ఒక తోడుగా రాని తోడుగా
స్వంత మయ్యేలా ప్రకాశించాలి.

అంటూ స్త్రీకి స్వయంప్రతిపత్తి, సొంతంగా ఆర్థిక స్వేచ్ఛ అనేది ఎంత అవసరమో తెలియజేయబడింది.

"బాహా మ్రుని" (అమాయకురాలు) కవితలో వారి సహజ స్వరూపం చిత్రించారు.

"కటిక నేలమీద కూర్చొని
చాపలు నేస్తున్నప్పుడు
విసన కర్రలు కడుతున్నప్పుడు
నీ నల్లని శరీరం నుండి రాలే - చెమట చుక్కలు
నిన్ను ఎగతాళి చేస్తున్నాయ్".

ఆదివాసీలు తయారు చేసిన వస్తువులు ఆగ్రా వరకు చేరి అమ్ముడవుతుంటాయ్. కానీ వాటిని తయారు చేసిన చేతులు మాత్రం అడవిని దాటి ఎరుగవు.

"కుమారై మూర్మూకోసం" కవితలో కాలంతో పరిణామం పొందాలని వివరించారు.

"నీ చుట్టూ ముసురుకుంటున్న చీకట్లను
ఎదురు తిరిగి - లే !
నీ వెనుకనే సాగుతున్న దగా, కుట్ర, వంచనలను
వ్యతిరేకిస్తూ - లే"

ప్రపంచీకరణ ద్వారా వస్తున్న మార్పును గమనించి అవసరమైతే తిరగబడి, తమ హక్కులను కాపాడుకోమని చెప్పిన మాటలు ఆలోచనను రేకెత్తించేవిగా ఉన్నాయి.

"సంధాల్ పరగణాలు" కవితలో ఒకనాటి పచ్చని కొండలు నేడు ఎలా తరిగిపోయి, భూమి-భూమి పుత్రుల చేతుల నుండి భూ కామాందుల చేతుల్లో పడి కొత్త రూపు సంతరించుకొనే విధానాన్ని ఈ విధంగా చెప్పాడు.

"బాటిళ్ళలో నిషా
నిషాలో తేలుతూ, పుష్టిగల దేహంతో
ఎందరో ఎందరో
ఆదివాసీ ఆడపిల్లలు!
వారి కళ్ళల్లో ఎన్నో ఎన్నో తీరని కోరికలు
కలసి రాని ఆశల స్వప్నాలు"

రచయిత భావ వ్యక్తీకరణలో గొప్ప నేర్పు చూపారు. **"దుఃఖిస్తున్న ధరణి"** కవిలో ఎప్పుడైనా విన్నావా స్వప్నాలతో మెరుస్తున్న గొడ్డళ్ళ భయంతో, చెట్ల ఆక్రందనని? అని ప్రశ్నించారు. అదే విధంగా, నీవే చెప్పు, ఇదెలా సాధ్యం? కళ్ళుండీ కబోదిలా ఉండగలనా? రాత్రి పగలుగా ఎలా చెప్పగలను? రక్తాన్ని నీరుగా ఎలా వ్రాయగలను?

"కొండకోమలి" "పర్వత పురుషుడు" "పహడీ పిల్లలు" మొదలైన కవితలలో ఆదివాసీ స్త్రీల, పురుషుల జీవన సహజత్వాన్ని నిర్మలత్వాన్ని రూపుదిద్దిన విధం ప్రకృతి, ప్రజల యొక్క సత్సంబంధాన్ని కొండలాంటి శరీరం, కొండలాంటి ఛాతీ, కొండలాంటి రంగు.... అని వర్ణించడంలో సహజత్వం ఉంది.

'ఢేపచా - బాబూ' కవితలో రచయిత నిశిత పరిశీలనా శక్తి వ్యక్తమౌతుంది.

"పంచాయితీ పెట్టి, తలనొరిగి
నగ్నంగా నాట్యం చేయించేవారూ....
నిష్కారంగా మాటలాడుతూ....
ముఖాన ఉమ్మేసేవారు !"

ఈ కవిత ఒక్కటి చాలు, ఆదివాసీ సమాజంపై మరీ ముఖ్యంగా ఒంటరి స్త్రీ జీవనంపై అనేక శక్తుల దాష్టీకత ఎలా ఉంటుందో నిరూపితం కావడానికీ, గోముఖ వ్యాఘ్రాల విశ్వరూపం అర్థమవడానికీ.

"అంత దూరం ఇవ్వద్దు బావా" కవితలో ఎక్కడైతే రోడ్లమీద మనుషుల కంటే ఎక్కువగా మోటారు కార్లు పరుగెడుతుంటాయో, ఎక్కడైతే విశాలమైన వాకిలి ఉండదో, కోడికూత వినిపించి ఎక్కడైతే తెల్లవారదో అలాంటి చోటికి నన్ను పెళ్ళి చేసి పంపు అంటుంటే - మానవ సంబంధాలలో వస్తున్న మార్పుతో పాటు, నాగరికత పేరుతో కుంచించుకు పోతున్న వ్యక్తిత్వాలు వ్యక్తమవుతున్నాయి.

"నేను మీరనుకున్నలాంటి దాన్ని కాను" కవితలో మనిషిని మనిషిగా గుర్తించలేని సమాజాన్ని ఆదివాసీ స్త్రీలపై జరిగే నాగరిక ముసుగు మురికితనాన్ని చిత్రించిన తీరు సమాజ పరిశీలనకు ప్రతిబింబం.

"తమ్ముడా - మంగళ్ బీసరా" కవితలో సమాజంలో స్త్రీల దుస్థితి ఆదివాసీ స్త్రీలపై జరిగే లైంగిక దాడులను గూర్చిన ఆలోచనా పూర్వక కవిత. **"నూతన ఝార్ఖండ్"** రాజ్య ప్రకటన కబురు విన్న సమయంలో వ్రాయబడిన కవిత.

"నిశ్చింతగా
నిద్రలోకి
జారిపోకు తమ్ముడా"

అనే సంభోధన ద్వారానే స్త్రీ యొక్క అబలత్వాన్ని చెబుతూ సమాజస్థితిని వివరించిన తీరు ఆలోచింపదగినదిగా ఉంది.

అంత రాష్ట్రీయ మహిళా దినోత్సవ సమ్మేళనానికి ఆహ్వానం అందుకున్నప్పుడు - అంతర్జాతీయంగా జాతీయంగా గొప్ప సభలు జరుగుతున్నా సామాన్య స్త్రీల జీవన స్థితిలో మార్పు లేదు అనే నిజమైన పరిస్థితిని "మరొక్కసారి" కవితలో నిర్భయంగా వివరించారు.

"వాళ్ళకు నా సర్వస్వం అయిష్టమే" కవితలో వర్ణవ్యవస్థ యొక్క రూపచిత్రణ దాని వికృత రూపం చెప్పబడింది. 'మీ నల్లని శరీర ఛాయ వాళ్ళకు అసహ్యం, మా భాషపట్ల హేళన, మీ నడత, ఆచార వ్యవహారాలు వారికి నచ్చవు. శూద్రజాతి వారిగా పరిగణించే వారి శ్రమ మాత్రం అగ్రవర్ణాలకు కావాలి గానీ, వారికి సామాజిక గౌరవం ఇవ్వడం మాత్రం అగ్రవర్ణాలకు పట్టదు. ఇది నాగరికారణ్యంలో ఉంది అనడంలో సందేహం లేదు. చివరకు యవ్వనంలో ఉన్న స్త్రీ శరీరం శూద్రురాలిదైనా వారికి కావాలి' అనేది మనిషిగా చూడని మృగ సమాజానికి సూచికగా చెప్పవచ్చు.

ఈ కవితల ద్వారా ఆదివాసీల జీవన స్థితిగతుల అస్తవ్యస్తమవుతున్నాయని, అర్థమవుతున్నది. అందువల్ల నీరు, భూమి, అడవి హక్కుల కోసం పోరాటాలు మొదలు అయ్యాయి. స్వంత పొలాల్లోనే వారు కూలీలుగా మారుతున్నారు. వారి జీవనం, ఉనికి ప్రశ్నార్థకమై పోయాయి. వారి అభివృద్ధి, వికాసాల పేరుతో వినాశక చర్యలు ఆరంభమయ్యాయి. ఫలితంగా ఆదివాసీల జీవనం అన్ని విధాలుగా దుర్భరంగా దయనీయంగా మారుతుంది. పోరాటాలు అణచివేయబడుతున్నాయి.

ప్రభుత్వం నుండి సరైన సహాయ సహకారాలు అందడం లేదు. వారికి నిరాశ, నిస్పృహలే మిగులుతున్నాయి. నెమ్మది నెమ్మదిగా ఆదివాసీల బుద్ధి వ్యాపకమైంది. తమకు జరుగుతున్న అన్యాయాలను, దోపిడీలను గమనించి, ప్రశ్నించేతత్వం మొదలైంది. బాణం పట్టే చేతులు కలం పట్టి, పోరాటాలకు సిద్ధమైనాయి. ఫలితంగా ఎందరో రచయితలు, కవులు, రచయిత్రులు, కవయిత్రులు, విమర్శకులు, విశ్లేషకులు వారిలో ఆవిర్భవించారు. వారి సాహిత్యం, ఈనాడు బహుముఖంగా వెలువడుతుంది. అందులో ఆదివాసీల గుండెచప్పుడు ఇంకా వినబడాల్సి ఉంది.

నేను కోరుకుంటాను
నగారా వలె మ్రోగుతున్న
నా శబ్దాలను విని
ప్రజలు తమ తమ ఇళ్ళ నుండి
రోడ్లపైకి రావాలని !

ఆధార గ్రంథసూచిక :

1. "నగారావలె ధ్వనిస్తున్న శబ్దాలు" - ఆదివాసి కథా సంపుటి (అనువాదం) - డాక్టర్ వేమకోటి చంద్రశేఖరరావు.

తెలుగులో గిరిజన సంస్కృతి, సాహిత్యం

భారతీయ ఇతిహాసాలు – గిరిజన సంస్కృతులు

– మల్లికార్జున పి., పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు, తెలంగాణ.

పరిచయం :

మానవ సమాజంలో నాగరికతను అవగాహన చేసు కొని జీవించేవాళ్ళు, నాగరికతతో సంబంధం లేకుండా కొండగుహల్లో, అడవులలో కాలం గడుపుతూ జీవించే వాళ్ళు. నాగరికతతో సంబంధం ఉన్న వాళ్లకు విజ్ఞానం సర్వతోభివృద్ధికి దోహదం చేస్తుంది. నాగరికత సంబంధం లేని వారికి ఎలాంటి ప్రగతి కనిపించదు. నాగరికత తెలుసుకొని జీవించే వారిని నాగరికులని, నాగరికత తెలి యని వారిని అనాగరికులంటారు. ఈ అనాగరికులే మన దేశంలో దస్యులు, ఇతర ఆదివాసులుగా చెప్పవచ్చు.

గిరిజనులు అను పదములో గిరి అంటే కొండ, జనులు అంటే ప్రజలు కొండలలో నివసించే జనులు గిరిజనులుగా చెప్పవచ్చు. ఆంగ్లములో ట్రైబల్ అను పదమునకు ఆదిమజాతి, ఆదిమవాసి, ఆదివాసి, గిరిజన అనే పదాలు పర్యాయ పదాలుగా చెప్పవచ్చు.

గిరిజనులు ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, మిజోరం, గుజ రాత్, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, మహారాష్ట్ర, జార్ఖండ్, అండమాన్ నికోబార్ దీవులు, ఛత్తీస్‌ఘఢ్, మధ్య ప్రదేశ్, ఒడిశా మొదలగు ప్రాంతాలలో ఉన్నారు.

గిరిజనులు - తెగలు :

1) నాగాలు - అస్సాం, మయన్మార్‌లోని గిరిజనులను పోలి ఉంటారు.
2) ఒడిశా - శంతల, సొర, కంధాస్, భూమిహార్, గ్వాండియ
3) మేఘాలయ గిరిజనులు - ఖాసీలు
4) జార్ఖండ్ మరియు పశ్చిమ బెంగాల్ ఆదివాసీలు - సంతాలు

వీరే కాకుండా గొండు, కోలం, ప్రధాన్, తోద, ఆంద్, మన్నెవార్, చెంచు, ఎరుకల, కోయ, సుగాలి, కొండరెడ్లు ఇలా మొత్తము 32 తెగలు కలవు.

భారతీయ ఇతిహాసాలు - గిరిజనులు :

రామాయణం :

ఆర్యులు ఉత్తర భారత దేశము జయించిన తరువాత దక్షిణ భారత దేశములో ద్రావిడులు, అసురులు ఉండే వారు. ఆర్యుల ద్రావిడుల మధ్య యుద్ధ సమన్వయము వలన రాజీపడని కొంత మంది కొండలలో, అడవులకు పోయి స్వేచ్ఛగా జీవితాన్ని గడిపారు. రామాయణములో

1) వాల్మీకి
2) గుహుడు
3) శబరి
4) వానరులు ప్రధానముగా చెప్పవచ్చు.

వాల్మీకి :

వాల్మీకి జంతువులను వేటాడే ఒక కిరాతకుడు. నార ధుని ప్రబోధం వలన ఋషిగా మారతాడు. లోక నిందకు భయపడిన రాముడు గర్భావతిగా ఉన్న సీతను వాల్మీకి ఆశ్రమములో వదిలిపెట్టేస్తాడు. కొంత కాలమునకు సీత లవకుశలకు జన్మనిస్తుంది. వారు అటవీ ప్రాంతంలోనే పెరిగి పెద్దవారైతారు.

గుహుడు :

గుహుడు ఒక బోయరాజు. సీతరాములు వనవాస సమయంలో పడవ ద్వారా గంగానదిని దాటిస్తాడు. చేసిన సహాయానికి రాముడు గుహుని కౌగిలించుకుంటాడు.

శబరి :

మహాభక్తురాలయిన ఆటవిక వనిత శబరి. ఈమె

సవరజాతికి చెందినది. అడవులలో ఉంటూ రాముని కొరకై ఎదురుచూసిన వనిత. రుచికరమైన పళ్ళతో రామునికి ఆదిత్యంబు ఇచ్చి తన జన్మను సార్థకము చేసుకున్నది.

వానరులు :

వాలితో పోరు జరిగిన తరువాత ప్రాణభయంతో సుగ్రీవునితో సహా వానరులు ఋష్యమూక అటవిక ప్రాంతములో జీవించారు. కొంత కాలము తరువాత రాముని సహాయంతో సుగ్రీవుడు రాజయ్యెను.

మహాభారతం :

మహాభారతంలో అటవీ ప్రాంతాలలో నివసించిన వారిలో

1) ఏకలవ్యుడు
2) హిడింబ
3) శరబుడు ప్రధానముగా చెప్పవచ్చు.

ఏకలవ్యుడు :

విలు విద్యకోసం ద్రోణాచార్యుని దగ్గరకు వెళ్ళిన ఏకలవ్యుడు తిరస్కర భావంతో మరలి ద్రోణుని ప్రతిమను గురువుగా భావించి, విలువ విద్యలను అభ్యసించి గురు దక్షిణగా బ్రొటనవేలును సమర్పించిన ఆటవికుడు.

హిడింబ :

హిడింబ అరణ్యవాసి. బకాసురుడి చెల్లెలు వనవాస సమయంలో కుంతి ఆజ్ఞ మేరకు భీముడు హిడింబను వివాహమాడతాడు. భీమునికి, హిడింబకు పుట్టినవాడే ఘటత్కోరుడు. ఇతను కూడా ఆటవిక రాజే.

శబరుడు :

ఇతడు ఆటవిక రాజు. శ్రీకృష్ణ నిర్యాణానానికి ముందు ఒక చెట్టు కింద సేద తీరుతున్న కృష్ణుని బొటన వ్రేలికి బాణం వేసి, కృష్ణుని నిర్యాణానికి కారకుడైనాడు.

గిరిజనులు – సంస్కృతులు :

గిరిజనుల నివాసాలు, ఆర్థిక వ్యవస్థ, వివాహ వ్యవస్థ, పండుగలు, మతము, భాష లాంటివి సంస్కృతులుగా చెప్పవచ్చు.

నివాసాలు :

గిరిజనులు అను మాటలోనే కొండలలో నివసించే వారని స్పష్టమవుతుంది. వీరు దట్టమైన అరణ్యాలలో, ఎత్తైన ప్రాంతాలలో నివసిస్తారు. గిరిజనులు ఎదురు కట్టెలతో గోడల మాదిరిగా కట్టి మట్టితో కాని, పేడతో గాని పూస్తారు. అడవిలో ఉండేటటువంటి కాసె గడ్డి ద్వారా కప్పుతారు. గదబ, గొండు, కొండ కమ్మర, గిరి జనులు ఒకే వరుసలో నిర్మించుకుంటారు. గొండ్లు, కోలాం, నాయక్ పోడ్‌లు ఇండ్లు వర్తులాకారంగా ఉం టాయి. చెంచుల ఇండ్లు అడవులలో దూరం దూరంగా ఉంటాయి.

ఆర్థిక వ్యవస్థ :

వేట, వ్యవసాయం, ఆహార సేకరణ, పోడు వ్యవ సాయం, పశుపోషణ గిరిజనుల ఆర్థిక వనరులుగా చెప్ప వచ్చు. అటవీ ప్రాంతములలో నివసించే గిరిజనులు అడవులలో లభించే పండ్లు, దుంపలు, వేర్లు మొదలైన ఆహార సేకరణకు ఉపయోగ పడగా, తేనే, జిగురు, ఔషదాలు మొదలైనవి అమ్మకానికి ఉపయోగపడతాయి. సుగాలీలు ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి పశు పోషణ కోసం తరలి వెళ్ళేవారు. కొండరెడ్లు పోడు వ్యవ సాయంలో దిట్ట. కొండకమ్మరలు, ఎరుకల వారు వృత్తి పనులు చేస్తూ జీవిస్తున్నారు. మాలీ గిరిజనులు సంతలో కూరగాయలు అమ్ముకుంటారు. లంబాడాలు పశుపోషణ చేస్తూ సంచార జీవనం సాగిస్తారు.

వివాహ వ్యవస్థ :

ఒకపురుషుడు ఒక స్త్రీతోనే వివాహ బంధం ఏర్పరుచు కోవడం. మేనరికపు వివాహాలు, ఒక స్త్రీ కంటే ఎక్కువ స్త్రీలు వివాహం చేసుకోవడం, ఒక పురుషుని కంటే ఎక్కువ పురుషులను స్త్రీ వివాహం చేసుకోవడం, భర్త చనిపోయిన స్త్రీ భర్త తమ్ముడిని వివాహం లేదా సహజీవనం చేయడం, రాక్షస వివాహం (బలవంతంగా కన్యను ఎత్తుకురావడం) లాంటి మొదలైనవి గిరిజన జాతులు అనుకరిస్తున్నాయి. కులగోత్రాలకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. చెంచులది

గతంలో రాక్షస వివాహం. ఎరుకల తెగలో పెళ్ళి జరగాలంటే మేనమామ అనుమతి తప్పనిసరి. కుమ్మర గిరిజనులలో ప్రేమించి వివాహం చేసుకుంటే యాత్రకు వెళ్ళడం అంటారు. కొండ దొరలలో 3 సంవత్సరాల వయస్సు పిల్లలకు వివాహం చేస్తారు. కొండరెడ్లలో మరియు కొందులలో స్వతంత్రంగా భర్తను ఎంపిక చేసుకునే హక్కు కలదు. నాయక్ పోడ్‌లలో ఏకపత్నీత్వమే శిరోధార్యము. సుగాలీలు మాత్రము అంగరంగ వైభవముగా వివాహము చేసుకుంటారు.

మతము :

కోయ గిరిజనులు సమ్మక్క, సారలమ్మ, పగిడిదరాజు, ముత్యాలమ్మ దేవతలను పూజిస్తారు. కులియా గిరిజనులు సింహాచలపు అప్పల నరసింహాస్వామి, పూరి జగన్నాథ స్వామి, గంగదేవుడు, భైరవుడు మొదలగు దేవతలను పూజిస్తారు. కొండరెడ్లు ముత్యాలమ్మ, భూదేవి, గంగమ్మ దేవి, సారెలమ్మ దేవతలను పూజిస్తారు. నాయక పోడులు భీముడు, కృష్ణుడు, మైసమ్మ, ముత్యాలమ్మ, పెద్దమ్మ దేవతలను పూజిస్తారు. చెంచులు లక్ష్మీ నరసింహ స్వామిని పూజిస్తారు.

పండుగలు :

ఇండో ఆర్యన్ జాతిగా ఉన్న లంబాడి లేదా సుగాలీలు తీజ్ పండుగ, తుల్జ భవాని పండుగ, సేవాలాల్ పండుగలను జరుపుకుంటారు. మైదాన ప్రాంతాలలో నివసించే గిరిజనులు పోలేరమ్మ, పోశమ్మ, మరియమ్మ పండుగలను జరుపుకుంటారు. కోయవారు సమ్మక్క, సారలమ్మ, ఇలవేల్పు పండుగ, విజ్జు పండుగలను జరుపుకుంటారు. ఇలా ఆయా తెగలకు సంబంధించిన పండుగలను ఆయా తెగలవారు ఘనంగా జరుపుకుంటారు.

గిరిజన భాష :

గొండు, కోలాము, కోయ, ఎరుకల భాషలు ద్రవిడియన్ భాషా కుటుంబంగా, సవర, గదబ, భాషలు ముండారి భాషా కుటుంబంగా, లంబాడాలు లేదా బంజారాల భాష ఇండో ఆర్యన్ కుటుంబానికి చెందినవిగా గుర్తించారు. పొరుగు రాష్ట్రాల (మధ్య ప్రదేశ్, ఓరిస్సా) సరిహద్దులలో ప్రజలు తెలుగు, ఒరియా, మరాఠి భాషలను మాట్లాడుతున్నారు. ఎరుకలకు ఎరుకల భాష, కొండ దొరలకు కొండ భాష, కోలాములకు కోలామి భాష, గదబలకు గదబ భాష, బంజారాలకు లంబాడి భాషలు గిరిజన భాషలుగా ఉన్నాయి. చెంచులు, సుగాలీలు మాత్రము తెలుగు భాషతో సన్నిహిత సంబంధం ఉన్నప్పటికీ తమ భాషను కొనసాగించడం తమ మాతృభాషపై గల అభిమానము ఏమిటో అర్థమవుతుంది.

ముగింపు :

గిరిజనులు అక్షరాస్యులై తమ జీవన విధానాన్ని మార్పులు చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ప్రభుత్వం వీరికి చేదోడు వాదోడుగా ఉందనే చెప్పాలి. స్థిర వ్యవసాయానికి అలవాటుపడి నూతన ఆవిష్కరణలు చేస్తూ అధిక దిగుబడులను రాబడుతున్నారు. వీరు ప్రేమ వివాహాలు చేసుకుంటున్నారు. గిరిజనులు తమ పండుగలతో పాటు సంక్రాంతి, ఉగాది, హోళి, శ్రీరామనవమి, దసరా, దీపావళి, మొదలగు పండుగలను జరుపుకుంటున్నారు. వీరు భాషాభిమానం కలవారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్‌లను మాట్లాడగలుగుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందుతున్నా ఇంకా కొంత మంది గిరిజనులు కొండలలో, అడవులలోనే జీవిస్తున్నారు. సాహిత్యకవులు, రచయితలు, పరిశోధక విద్యార్థులు ప్రభుత్వ దృష్టికి తీసుకు రావలసిన బాధ్యత వున్నది.

ఆధార గ్రంథాలు :

1) ట్రైబల్ లైఫ్ - భుక్యా చిన్న వెంకటేశ్వర్లు (1994, ఆగస్టు) 2) జానపద విజ్ఞానాధ్యయనం - ఆచార్య జి.ఎస్. మోహన్.
3) తెలుగు భాషా చరిత్ర - ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి. 4) నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలు - ప్రత్యేక సంచిక (2012).

గిరిజనుల పోడు వ్యవసాయ పద్ధతులు

– ఎం. మూధఖి, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కృష్ణా విశ్వ విద్యాలయం, మచిలీపట్నం.

ప్రాచీన ఆచారాలను సాంప్రదాయాలను వీడకుండా కొండల్లో, కోనల్లో అనాగరికంగా జీవిస్తున్న తెగలను "గిరిజనలు" అని అంటారు. గిరిజనులు పదంలో గిరి అంటే కొండ అని, జనులు అంటే ప్రజలు అని భావం. కొండల మీదనే తొలుత నివాసాలు కలిగి ఆటవిక సంపదనే తమ జీవితానికి ఉపాధిగా గ్రహించిన వారిని కొండల్లో ఉండే కొద్దిపాటి చదును ప్రదేశాన్ని గుర్తించి అక్కడ ఎదిగిన చెట్లను కూల్చి పోడు వ్యవసాయం చేసుకునే వాళ్ళను కొన్ని తెగలుగా ప్రభుత్వం గుర్తించింది. వీళ్ళంతా గిరిజనలు. వీరు ఆడవితల్లి ముద్దుబిడ్డలు ఈ సమాజానికి మూల వారసులు, సంస్కృతీ, సంప్రదాయాలకు, నీతి, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం.

అడవితో ఆవాసం, జంతువులలో సహావాసం, ఎండ, వాన, చలి, వరదలు, తుఫాన్లు అన్ని రకాల ప్రకృతి భీభత్సాలు తట్టుకోవాల్సి రావడం స్త్రీ, పురుష భేదం లేకుండా గిరిజనులకు ప్రకృతితోను, జీవితంతోను సహావాసం నేర్పుతాయి. పోరాటం నేర్పుతాయి. వేటదశ, పశుపోషణ దశ, పోడు దశ అనే మూడు దశల్లో కూడా సంచారచలన జీవితం గనుక చలనంలో ఉండే ఘర్షణకు స్త్రీ, పురుషులు శారీరకంగా, మానసికంగా సంసిద్ధమౌతారు. సామూహిక జీవితం, నాలుగు గోడల మధ్యన స్థిమితం కాని జీవితం భేషజాలు లేని ప్రకృతిని, మానవ ప్రకృతికి సన్నిహితం చేసే ఒక అనుకూలత గిరిజన సమాజాలకుంటుంది.

గిరిజనులు నగరాలకు దూరంలో ఎత్తైన కొండల మధ్య కనీస అవసరాలైన నీరు, గాలి, ఆహారం మొదలైన వాటిని దృష్టిలో పెట్టుకుని నివాసం ఏర్పరచుకుంటారు. ఎత్తైన కొండలు, అడవులు, సెలయేరులు వారి జీవన విధానం పై ఎనలేని ప్రభావాన్ని చూపుతాయి. మండు వేసవిలో సైతం చల్లగా ఉంటుంది. అడవిలో కలప విరివిగా దొరకొడం వలన చలికాలంలో ఉమ్మడిగా చలి మంటలు వేసుకుని చలిబారి నుండి కాపాడుకుంటారు. వర్షాకాలం వారి జీవనానికి కావలసిన ఆహారాన్ని పండించు కుంటారు. ఈవిధంగా గిరిజనలు ప్రకృతినే దైవంగా భావించి దానిపైనే ఆధారపడి బ్రతుకుతున్నారు.

భారతీయ తెగలు ప్రాచీనకాలం నుండి వ్యవసాయం మీద ఆధారపడి జీవించేవారు. గిరిజనులు చేసే వ్యవసాయాన్ని పోడు వ్యవసాయం అంటారు. ఇది ఒక పురాతన వ్యవసాయ పద్ధతి. కొండచరియాల్లో ఉండే చెట్లను, తుప్పలను నరికివేసి వాటిని తగులబెడతారు.భూమిపై బూడిద ఉండగానే విత్తనాలు వెదజల్లుతారు. వర్షాధారంతో పంట పండుతుంది. ప్రకృతే పంటను పండించాలి. గిరిజనులు పంటలో ఎటువంటి జోక్యం కల్పించుకోరు. దీనినే పోడు వ్యవసాయం అంటారు. పోడు వ్యవసాయం వేసవికి ముందే ప్రారంభమౌవుతుంది. ఇలా ఒకే భూమిలో ఒకటి రెండుసార్లు కంటే విత్తనాలు చల్లరు. ఒకటి, రెండు పంటల తర్వాత భూమి నిస్సారమౌతుందని, భూమిని పడావుగా ఉంచాలని గిరిజనులు విశ్వసించి ఆ ప్రాంతాన్ని కాలీచేసి మరో అనుకూల ప్రాంతానికి వెళతారు. ఇలా మరో ప్రాంతంలో కొన్ని సంవత్సరాలు వ్యవసాయం చేసే సరికి మొదట పోడు వ్యవసాయం చేసిన భూమిలో చెట్లు పొదలు మళ్ళీ పుష్కలంగా పెరుగుతాయి. ఈ రకంగా గిరిజనులు భూమి, అడవి ప్రకృతిలో సమతౌల్యతను కాపాడేవారు.

క్రీ॥ పూర్వం 8000 - 10000 సంవత్సరాల నుంచే పోడు వ్యవసాయం ఉందని భావిస్తున్నారు. శిలాజయుగానంతరం ఏర్పడిన అనుకూల వాతావరణం వల్ల జన సంఖ్య పెరిగింది. దాని వల్ల వేట ద్వారా ఆహార సేకరణ

కష్టమై ఆదిమానవులు ఆహారాన్ని పండించడం వైపు మళ్ళీ ఉండవచ్చు. సంచార మానవులకు విస్తృతమైన భూమి అందుబాటులోకి ఉండేది. ముఖ్యంగా కాయధాన్యాలు, చిరుధాన్యాలు, ధాన్యం, బార్లీగింజలు గుప్పెడు తీసుకుని వర్షాకాలంలో అనుకూలమైన భూమిపై వెదజల్లడం మాత్రమే ఆదిమానవుడు చేసేవాడు.

ఈ పోడు వ్యవసాయాన్ని భారతదేశంలో రకరకాల పేర్లతో పిలుస్తారు. అస్సాం, మేఘాలయ, త్రిపుర, మిజోరాం, అరుణాచలప్రదేశాలలో దీనిని జుమ్ అని పిలుస్తారు. మధ్యప్రదేశ్‌లో బేవార్, దహ్యా అని అంటారు. ఆంధ్రప్రదేశ్‌లో పోడు అని, ఉత్తర ఒరిస్సాలో కొమన్ లేక బ్రింగా అని వ్యవహరిస్తారు. ఆంధ్రప్రదేశ్, ఈశాన్య భారతం, బీహార్, ఒరిస్సాలలో ఈ పోడు వ్యవసాయం ఇప్పటికి పాటించబడి అనేక సమస్యలను సృష్టిస్తుంది.

పోడు వ్యవసాయాన్ని ఒక పవిత్ర కర్మకాండంగా గిరిజనులు భావిస్తారు. వారి పురాణాల ప్రకారం భగవంతుడే వారిని పోడు వ్యవసాయం చేయవలసిందిగా నిర్దేశించాడు. భూమి భూదేవి అవతారం కాబట్టి అందరికీ తల్లివంటిదని నాగలితోను, కత్తితోను బాదించరాదని కొన్ని తెగలవారు భావిస్తారు. అందుకే పోడు వ్యవసాయం పద్ధతిలో భూమిని దున్నడం ఉండదు. నాగలితో వ్యవసాయం చేస్తే చివరికి మిగిలేది కన్నీళ్ళేనని నమ్ముతారు.

ఒకరి స్థలంలో పోడు చేయాలంటే అన్ని కుటుంబాల యజమానులు శుక్ర, మంగళ వారాలను మంచిరోజులుగా నిర్ణయించి తూర్పు ముఖంగా దేవతను మొక్కుకుని చెట్లమొద్దులు, మట్టిగడ్డలు తీసి భూమిని చదును చేసుకుంటారు. భూమిలో గుంటలు తీసి గుంటల్లో విత్తనాలు వేస్తారు. ఒకరి స్థలంలో పోడు చేసిన తర్వాత మరుసటి రోజు మరొకరి స్థలంలో పోడు చేస్తారు. సహాయానికి వచ్చిన వారికి ఆరోజు భోజనాలు పెడతారు. ఈ విధానం అన్ని కుటుంబాలకు వర్తిస్తుంది సామలు, రాగులు, జొన్నలు, సజ్జలు, కందులు విత్తనాలను జల్లుతారు. వాన పడినప్పుడు మొలకెత్తుతాయి. పంట చేతికొచ్చాక రెండు మూడు వారాల్లో నిప్పు పెడతారు. కాలిపోగా మిగిలిన చెట్లను కంచెగా పెడతారు.

ఆదివాసీ జీవిత చక్రంలోను, జీవనాధారాలలోను ఆదివాసీ స్త్రీలే వెన్నుముకగా నిలిచారు. తిండి పంటల సేద్యంలో పురుషులతో సమానంగా నిర్ణయాలు తీసుకునే వారు. ఇద్దరూ కలసి ఏం పంటలు వేయాలో నిర్ణయించుకునేవారు. ఇద్దరు కలసి శ్రమను పంచుకునేవారు. అన్ని రకాల తిండి విత్తనాలను స్త్రీలే భద్రపరిచేవారు. ఇచ్చి పుచ్చుకునే పద్ధతులలో సామూహికంగా కలిసి లేదా ఒకరికొకరు తోడుగా అన్ని రకాల వ్యవసాయ పనులలో పాల్గొనేవారు. గ్రామానికి సంబంధించిన సంప్రదాయ అటవీ సరిహద్దుల గురించీ, అడవి గురించి ఆదివాసి స్త్రీలకు అపారమైన జ్ఞానం ఉంటుంది. దుంపలు, కూరగాయలు, మందు మొక్కలు, ఇంటికి కావలసిన కలప, పశువుల మేత, వంట చెరకు గురించి స్త్రీలకు తెలిసినంత ఆదివాసీ పురుషులకు తెలియదు. కొన్ని ఆదివాసీ తెగలలో స్త్రీలకు వేట గురించి కూడా తెలుసు. చెంచు, స్త్రీలు పురుషులలో పాటూ తేనే సేకరించడానికి వేటకు వెళతారు. పిల్లలను వారి పెద్దల వద్ద వదిలేసి భార్యాభర్తలిరువురు ఫలసాయ సేకరణకు వెళ్తారు. చెంచులలో ఒక స్త్రీ నల్గురు లేదా ఐదుగురు మగవారితో సమానమైన శక్తి ఒక స్త్రీకి ఉందని చెంచుల నమ్మకం. వేటకు వెళ్ళినప్పుడు ఆ గుంపులు ఒక స్త్రీ లేకపోతే ఆమె బదులు నల్గురు పురుషులు వెళతారు. సవరల నానుడి ప్రకారం భూమి ఉంటే పంట, పంట ఉంటే పండగ, పండగ ఉంటేనే అడవి ఉంటుందని చెప్పుకుంటారు.

గిరిజనులు సామలు, సొళ్ళు, తెల్లజొన్న, మొక్కజొన్న, కొర్రగంతలు, గంటు బుడమలు, అలసందలు, తెవిరలు, మినుములు, అనుములు, పెసలు, కొండ కందులు, చీరమలు, గుమ్మడికాయ, దోసకాయ, బీర కాయ, చిక్కుడుకాయ, వంకాయ, టమాట, మిరపకాయ వంటి పంటలు పండిస్తారు. పంటలు పండని సమయంలో వేటకు వెళతారు. గిరిజన మహిళలు వేసవి

కాలంలో అడవిలో చీపుళ్ళు సేకరించి కట్టలు కట్టి సమీప గ్రామాలతో, సంతలలో అమ్మి ఇంటికి అవసరమైన కిరాణ సామాగ్రి తెచ్చుకుంటారు. అడవిలో లభించే చిన్న తరహా అటవీ ఉత్పత్తులైన చింతలు దులిపి పండు, గింజ వేరు చేసి అమ్ముతారు. తుమ్మ బంక, తేనె వంటి వాటి అమ్మి సొమ్ము చేసుకుంటారు.

గిరిజనుల పోడు వ్యవసాయంలో నాగలితో దున్నడానికి వీలు పడదు గనుక వొలువ (వొలువంతి) లేదా గుబ్బంతో తవ్వి విత్తనాలు చల్లుతారు. పోడు వ్యవసాయంలో విత్తనాలు చల్లడానికి, సాళ్ళు పాడుచుకోవడానికి ఉపయోగించే పరికరాన్ని వొలువంతి అంటారు. పూర్వం వీరు పండించే వరిధాన్యం సుమారు నాలుగు నెలల పదిహేను రోజుల వరకు పంట చేతికి వచ్చేది. ప్రస్తుతం పండించే పంట మూడు నెలలకే ఇంటికి వస్తుంది. గిరిజనులకు పోడు వ్యవసాయం మరియు అటవీ సంపదే జీవనాధారం.

పోడు వ్యవసాయం అనేది గిరిజనులకే హానికరమని, దాని వల్ల ఎంతో సంపద వృధా అవుతుందని అటవీశాఖ అభిప్రాయ పడుతుంది. దీనివల్ల కొండచెలయేళ్ళు ఎండిపోతాయి. పంటబూములు కోతకు గురవుతాయి భూసారం కొట్టుకుపోతుంది. విలువైన అడవులు నాశనమవుతాయి. వర్షపాతం తగ్గిపోతుంది. గిరిజనులకు అడవి నుండి రావలసిన అనేక ప్రయోజనాలు రాకుండా పోతాయి. అటవీ ఉత్పత్తులు తగ్గిపోతాయి. ఈ సందర్భంగా షెడ్యూల్డ్ తెగల కమీషన్ ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ఫారెస్ట్ కన్సర్వేటర్ నికొల్సన్ తన అభిప్రాయాన్ని ఈ విధంగా వెల్లడించాడు. "పోడు వ్యవసాయం వల్ల అడవులకు జరిగే నష్టం అపారంగా ఉంది. జనాభా తక్కువగా ఉండి కొద్ది ప్రాంతంలో పోడు వ్యవసాయం చేసినప్పుడు మాత్రమే దాని నష్టం తక్కువగా ఉంటుంది. అటవీ పరిశోధనా సంస్థ వృక్షశాస్త్రవేత్త ఎం.ఎన్.బీర్ మానవుడు అనుసరిస్తున్న పద్ధతుల్లో పోడు వ్యవసాయం ఎక్కువగా బాధాకరమైనదని అభిప్రాయపడ్డాడు. అయినా ఇప్పటికి ఆదివాసీలు పోడు వ్యవసాయం మీదనే ఆధారపడ్డారు. ఖమ్మం, విశాఖపట్నం, శ్రీకాకుళం, ఉభయగోదావరి జిల్లాలు ఇప్పటికి పోడువ్యవసాయమే చేస్తున్నారు.

పోడు వ్యవసాయం వల్ల ఎన్ని అనర్థాలు ఉన్నా దానిని ఒక్క కలంపోటుతో ఆపడం సాధ్యంకాదు. అడవులను వాళ్ళు యధేచ్ఛగా వాడుకున్నారు. అడవులు తమకు చెందినవని, తాము అడవులకు చెందినవారిమన్న విశ్వాసం వారిలో గాఢంగా ముద్రించబడి ఉంది. కావున ఈ స్వేచ్ఛను నిరోధించడానికి ఎంత చిన్న ప్రయత్నం జరిగినా గిరిజనులు తీవ్రంగా భావిస్తారు. ఈ పద్ధతిని తొలగించాలంటే చాలాకాలం పడుతుంది. ఈ తోపు క్రమబద్ధం చేయాలి. పోడు వ్యవసాయాన్ని క్రమంగా భూమిని తవ్వి వ్యవసాయం చేసే పద్ధతిగా మార్చవచ్చు. కాని పోడు వ్యవసాయం గిరిజన జీవన పద్ధతుల్లో అంతర్భాగం. భూమి నిర్మాణక్రమం వల్ల కొంత, సాంఘిక ఆచారాల వల్ల కొంత, గిరిజన విశ్వాసాల వల్ల కొంత ఈ పోడు వ్యవసాయం కొనసాగుతుంది. ఈ విధంగా ఉన్న వ్యవసాయ పద్ధతిని మార్చాలంటే స్థిర వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ గిరిజనులకు వ్యవసాయ యోగ్యమైన భూములను కేటాయించి ఇంకా సున్నితమైన ప్రత్నామ్నాయ మార్గాలను వెతకవలసి ఉంటుంది.

ఉపయుక్త గ్రంథ సూచి :

1. భారతీయ గిరిజనులు - నదీం హన్‌సైన్ 2. మనుగడ కోసం పోరాటం - హైమన్‌డాఫ్
3. తెలుగు కథాసాహిత్యం - గిరిజన జీవితం - డా.జి.శైలమ్మ
4. కొండరెడ్డి గిరిజనుల జీవన విధానం - జానపద గిరిజన విజ్ఞాన పీఠం, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యా లయం వరంగల్లు.
5. నాయకపోడు గిరిజన జీవనం, చరిత్ర, సంస్కృతి - డా॥ ద్యావన వల్లి సత్యనారాయణ, పసుల బుచ్చయ్య
6. ఆదివాసీ గొంతుక - సంపుటి-4 7. ఆదివాసీ గొంతుక - సంపుటి-6

గిరిజన భాషా సంస్కృతులు – సమగ్రాభివృద్ధి

– డా. జె. సీతాపతి రావు, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం,
రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, ఏ.పి.ఐ.ఐ.ఐ. టి., నూజివీడు, కృష్ణా జిల్లా.

అడవి తల్లి ముద్దు బిడ్డలు :

భారత సమాజంలో ఆదివాసీలు మూలవాసులు. అడవితల్లి ముద్దు బిడ్డలు. అటవీ సంపదల పరిరక్షణకై పోరాడుతున్న యోధులు. దోపిడీ, అణచివేతలను ధైర్యంగా ఎదుర్కొంటున్న ధీశాలులు. ఆచారాలు, సంస్కృతి సంప్రదాయాలకు ప్రత్యేక వారథులు. వందల ఏళ్ళు ఎన్నో అవమానాలను, కష్టాలను ఎదుర్కొన్నారు. కులవ్యవస్థకి కర్కశంగా బలయ్యారు. ఇంతకీ ఈ గిరిజనులు ఎవరు? సమాజం నుండి వివక్షతలను ఎందుకు ఎదుర్కొంటున్నారు? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు దొరకాలంటే గిరిజన తండాలకు వెళ్ళాల్సిందే. అందుకే సీతంపేట, పార్వతీపురం ఐ.టి.డి.ఎ ల పరిధిలో ఉన్న కొన్ని గిరిజన గూడేలకు వెళ్ళి పరిశీలించగా కొన్ని విషయాలు తెలిసాయి. అందులో ప్రధానమైనవి వారి వేషధారణ, విద్యా విధానం, భాష పరిజ్ఞానం. వీటిని కూలంకషంగా చర్చించి వివరించడమే ఈ వ్యాస లక్ష్యం.

గిరిజనులు - చారిత్రక నేపథ్యాలు :

ఆదిమానవుల వారసులే ఈ ఆదివాసీలు. క్రీస్తు పూర్వం నుండి వస్తుంది వీరి ప్రస్థానం. ప్రత్యేకంగా వీరికంటూ ఒక గుర్తింపుగానీ, చరిత్ర గానీ లేవు. భౌగోళిక అంశాలే ఈ తెగ పుట్టుకకు కారకాలు. నాగరికతలకు నిలయం మన దేశం. అందులో ఒకటే ఆర్య నాగరికత. ఆర్యులు భారత దేశాన్ని పాలించారు. భారత దేశ ప్రజల్ని ఓడించి వీరు రాజ్యాన్ని పొందారు. ఆ ఓడిన వారే దస్యులు గా మారారు. వారే తర్వాత ద్రావిడులు గా మారారు. ఇదంతా నాగరికత వెలసిన ప్రాంతాల చరిత్ర. కానీ అప్పటికీ ఇంకా అడవుల్లోనూ, కొండల్లోనూ నివాసముండేది ఒక తెగ. అదే గిరిజన తెగ. వీరు నివసిస్తున్న ప్రాంతాలు భౌగోళికంగా నాగరిక ప్రపంచానికి దగ్గరగా లేకపోవడం వల్ల వీరు అనాగరికులుగా మారారు. జంతువులను వేటాడటం, అటవీ సంపదలను సేకరించడం వీరి ప్రధాన విధి. దాదాపుగా 18 వ శతాబ్దం వరకు ఇదే వీళ్ళ ప్రయాణం.

ఆంగ్లేయులు భారత దేశాన్ని 18 వ శతాబ్దానికి తమ గుప్పిట్లోకి తీసుకున్నారు. దేశ సంపదంతా అడవుల్లో, కొండల్లో నిక్షిప్తమైందని గ్రహించారు. వాటిని సంపాదించడానికై అన్వేషించారు. ఆ అన్వేషణలో బయటపడ్డారు ఈ గిరిజనులు. అప్పుడు మొదలైంది వీరి నాగరిక ప్రస్థానం. అప్పట్లో వారు జంతు చర్మాలు, ఆకులు వస్త్రాలుగా ధరించేవారు. ఆచార వ్యవహారాలు సమాజానికి భిన్నంగా ఉండేవి. మూఢనమ్మకాలు పురుడు పోసుకున్నాయి. కొంత కాలం గడిశాక నాగరికంగా మారటం మొదలుపెట్టారు. ఇంకా నాగరికంగా మారడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఇక్కడ నాగరికత అంటే చదువు, డబ్బు సంపాదించడం, వస్త్రధారణ కాదు. నేటి సమాజానికి అనుగుణంగా ఆచార వ్యవహారాలు, ఆలోచనాధోరణులు మారటం. ప్రపంచంతో పోటీ పడే తత్వం అలవర్చుకోవడమే నాగరికత.

రాజ్యాంగంలో గిరిజనులు :

భౌగోళికంగా ఎటువంటి సదుపాయాలు లేవు. కొండలు, గుట్టలు, అడవులే ఆదివాసీల నిలయాలు. కుల వ్యవస్థ విజృంభిస్తున్న వేళ బాహ్య ప్రపంచంలోకి వచ్చారు. ఆ వ్యవస్థ చేతిలో కీలు బొమ్మగా మారారు. ఎన్నో అవమానాలు పడ్డారు. ఆశ్రయమే కరువౌతున్న సమయంలో ఆడుకోవడానికి నూతన భారత ప్రభుత్వం వీరి కోసం కొన్ని చట్టాలను అధికరణలను రూపొందించింది. వాటిని ఊత కర్రగా ఉపయోగించుకొని అభివృద్ధి చెందడానికి ఆసరా కల్పించింది. రిజర్వేషన్‌లు కల్పించింది.

దేశంలో గిరి పుత్రుల చరిత్ర అతి పురాతనమైనది. వారి వికాసం భిన్నమైనది. అడవుల్లో అనాదిగా ఆది వాసులు జీవిస్తున్నారు. తమదైన సంస్కృతీ సంప్రదాయా లతో విలసిల్లుతున్న గిరి పుత్రుల అభివృద్ధికి రాజ్యాంగ నిర్మాతలు వారి సంక్షేమంతో పాటు వారికి కొన్ని హక్కు లను ప్రసాదించారు. వారికోసం ప్రత్యేక చట్టాలు కూడా చేసారు.

షెడ్యూల్ :

5 వ షెడ్యూల్ - షెడ్యూల్ ప్రాంతాల పరిపాలన

6 వ షెడ్యూల్ - ఈశాన్య రాష్ట్రాలలోని గిరిజన ప్రాంతాల పరిపాలన

అధికరణలు :

16 (4) అధికరణ - ఉద్యోగాలు, చదువులలో రిజర్వే షన్ లు కల్పన.

46వ అధికరణ - హరిజన గిరిజన తెగలకు చెందిన ప్రజల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్ని రకాల దోపిడీల నుండి రక్షణ కల్పించడం.

15వ అధికరణ - విద్యాపరంగా ఆర్థికంగా వెనుక పడిన షెడ్యూల్ కులాల, తెగల ప్రభుత్వం ప్రత్యేక నిబందనలు.

244 వ అధికరణ - ఏ ప్రాంతాన్నైనా షెడ్యూల్ ప్రాంతంగా ప్రకటించే అధికారం రాష్ట్రపతికి ఉంటుంది. షెడ్యూల్ ప్రాంతాల్లో గిరిజనుల భూముల ఆక్రమణలను నిషేదించడానికి అయా ప్రాంతాల్లో శాంతిని పెంచుతూ నిబంధనలు చేసే అధికారం గవర్నర్ కు ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో గిరిజన శాసన సభ్యులతో కూడిన గిరిజన సలహా మండలి సలహాలను పొందాలి.

275 అధికరణ - రాష్ట్రంలో ఇతర ప్రాంతాలతో సమానంగా షెడ్యూల్ ప్రాంతాలలో రాష్ట్ర నికర ఆదా యాన్ని బట్టి కేంద్ర ప్రభుత్వ అనుమతితో రాష్ట్రం వివిధ పథకాలను భారత సంచిత నిధి నుండి ఖర్చు చేయవచ్చు.

330, 322, 334 అధికరణాలు శాసనసభ, పార్ల మంట్ స్థానాలను షెడ్యూల్ తెగల వారికి ప్రత్యేక కేటా యింపు.

338 అధికరణ - ప్రత్యేక అధికారి ద్వారా రక్షణ నియమాల అమలు తీరును రాష్ట్రపతి కోరవచ్చు.

339 అధికరణ - షెడ్యూల్ ప్రాంతాల పరిపాలన తీరుపై ఒక సంఘాన్ని రాష్ట్రపతి నియమించవచ్చు

342 అధికరణ - ఏ జాతినైన షెడ్యూల్ తెగల మరియు వాటి గ్రూపులుగా ప్రకటించే అధికారం రాష్ట్రపతికి ఉంటుంది

ప్రణాళికలు – చట్టాలు :

ఐదవ పంచవర్ష ప్రణాళిక (1974-1979) కాలంలో ఆదివాసీల సత్వర సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం గిరిజన ఉప ప్రణాళిక తీసుకువచ్చారు.

1975 వ సంవత్సరంలో గిరిజనుల సమగ్రాభివృద్ధికై I.T.D.A (సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ)లను స్థాపించారు.

భూరియా కమిటీ సిఫార్సుల అనంతరం దేశంలో షెడ్యూల్డ్ ప్రాంతాలలో స్థానిక పాలనను ఉద్దేశించి పంచాయతీ విస్తరణ చట్టం 1996 (పెసా చట్టం) కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది.

అటవీ హక్కుల చట్టం (2006) - గిరిజనులకు సాగు నేలపై హక్కులను కల్పించడం.

ప్రభుత్వం ఇన్ని అవకాశాలు కల్పిస్తున్నా గిరిజనులు అభివృద్ధి చెందకపోవడానికి కారణం ఇంటి దొంగలే. దానికి తోడు అవగాహనా లోపం. ఈ రెండూ మారితే గిరిజనుల అభివృద్ధి అతి సమీపంలోనే ఉంటుంది.

ఆచారాలు – వేషధారణలు :

నాగరికత ప్రభావంతో ఆదివాసీల వస్త్రధారణలో చాలా మార్పులు వచ్చాయి. ఇంతక ముందు కట్టకోవ డానికి బట్టలు కూడా లేవు. కానీ ఇప్పుడు వీళ్ళు బట్టలు కొనడానికి చేసే ఖర్చే అధికం. కొన్ని ప్రత్యేకమైన సంద ర్భాలలో గిరిజనుల వస్త్రధారణ ప్రత్యేకంగా ఉంటుంది. కొత్తగా అలంకరణలు చేసుకుంటారు. అవే వీళ్ళ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపడతాయి. శ్రీకాకుళం జిల్లా సీతంపేట పరిధిలో గిరిజనులు సంక్రాంతి పండగకి

నెయ్యి - గుర్రాలాట అని ఓ విన్నూత్న కార్యక్రమం చేస్తారు. ఇందులో ఇద్దరు వ్యక్తులుంటారు. ఒక వ్యక్తి తన ముఖంకి దిష్టి బొమ్మను పోలిన తొడుగును ధరిస్తాడు. ఇంకో వ్యక్తి వెదురు కర్రలతో చేసిన గుర్రం ఆక కృతిని ధరిస్తాడు. వీళ్ళిద్దరు ఒకరికొకరు పోటాపోటీ గా నృత్యాలు చేస్తారు.

నెయ్యి గుర్రాలాట అలంకరణలో గిరిజనుల చిత్రం

ఈ సంప్రదాయ పద్ధతి నేటి రోజుల్లో అంతరించి పోవడానికి సిద్ధంగా ఉంది. దానికి కారణం అందరికీ సరిపడా తిండి ఉంది. కావల్సిన వసతులున్నాయి. అందులోనూ ఈ నాగరిక సమాజంలోని మనుషులు ఇలాంటి వేషాలు వేయాలంటే మొహమాట పడుతున్నారు. ఇలా ఈ సంప్రదాయ ఆట మరుగునపడుతుంది. దీనిని ఓ యాచక ఆటగా చూడకుండా సంప్రదాయ కళ పరి గణించి దీని ఉనికిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఈ గిరి జనులపై ఉంది.

భారత దేశంలో అటవీ విస్తీర్ణం ఇంకా మెరుగైన స్థితిలో ఉందంటే దానికి కారణం గిరిజనులే. మర్రి చెట్టు, రావి చెట్టు, వేప చెట్టు వీరికి ప్రత్యేకమైన ఆరాధ్య దైవాలు. సంవత్సరానికి రెండు మూడు సార్లు పూజలు చేస్తారు. డప్పులు, మేలాలతో చెవులకు పసందు, కనులకు విందుగా ఈ పండగలను చేస్తారు. ఆనాటి కాలంలో ఇదో మూఢ నమ్మక ప్రక్రియగా మొదలైంది. కానీ ఇప్పుడు అదే దేశ స్థితుగతులకి ఆయువు పట్టుగా నిలుస్తుంది. చెట్లులను, జంతువులను కన్న బిడ్డలలా చూసుకొనే సంస్కృతి వీరిది. అందుకే ఇప్పటికీ అడవితల్లి ఒడిలోనే సేద తీరడానికి ఇష్ట పడుతున్నారు. మాను పండగ సందర్భంగా పూజలకు సిద్ధమౌతున్న ఆదివాసీలు

మూగ భాషే మాటగా మారింది :

భూమిపై నివసించే ప్రతి జీవికి ఒక ప్రత్యేకమైన భాష ఉంటుంది. భాష అంటే భావాలను మోసుకుపోయేది. ఇద్దరి వ్యక్తుల మధ్య సంభాషణా వారథి. పక్షులు, జంతువులు కొన్ని ప్రత్యేకమైన శబ్దాలతో తమ ఉనికిని వేరొకరికి తెలియజేస్తాయి. పుట్టుకతోనే గిరిజనులు అడవులలో ఉండటం వల్ల వీరు కూడా కొన్ని ప్రత్యేకమైన శబ్దాలతో తమ ఉనికిని వేరొకరికి తెలిపేవారు. కొంత కాలానికి నాగరిక ప్రభావం వల్ల ఈ శబ్దాలు కాస్తా మాటలుగా మారాయి. ఆ చుట్టూ పక్కల ప్రాంతాల భాషా ప్రభావం వీళ్ళ పై పడింది. శ్రీకాకుళం, విజయనగరం జిల్లా గిరిజనులపై తెలుగు, ఒరియా భాష ల ప్రభావం ఉంది. అందుకే వీళ్ళ భాషలో చాలా వరకు తెలుగు, ఒరియా పదాలు కనిపిస్తాయి.

దాహం (తెలుగు) - డా (సవర భాష)

కో (ఒరియా) - కో (సవర భాష) - (తెలుగు లో "చెప్పండి" అని అర్థం)

ఆ (ఒరియా) - ఆ (సవర భాష) - (తెలుగులో "రా" అని అర్థం)

ఇక్కడ "కో" అనే పదం పక్షుల శబ్దాల నుంచి అనుకరించింది. ఇలా చాలా వరకు పదాలు జంతువులు, పక్షుల శబ్దాలను అనుకరించి తమ భాషగా మార్చుకున్నారు.

సవర భాషా లిపి :

సవర భాషా లిపిలో ఉన్న అక్షరాలు :

సవర భాషలో మొత్తం 24 అక్షరాలున్నాయి. వీటిలో ఒక్కో వర్గానికి (ఉదా:- క-వర్గ, చ-వర్గ). ఇందులో గుణింతాలకు చోటే లేదు. అందువల్ల ఈ భాష అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఈ అక్షరాలన్నీ శబ్దాన్ని అనుసరించి ఏర్పడ్డాయి. సవర భాషను మాట్లాడే ప్రజలు దీర్ఘాక్షరాలు, సంయుక్త, ద్విత్వాక్షరాలు ఉచ్చరించలేరు. అందుకే వీళ్ళ లిపిలో అన్నీ సరళ అక్షరాలు, పదాలుంటాయి.

కొన్ని ఉదాహరణలు :

1. సూర్యుడుని సవర భాషలో ఊయుజ్ అంటారు. దానిని సవర భాషలో ఇలా రాస్తారు ఉఅయ ఉజ్ (పైన చెప్పిన లిపిలో సవర భాషతో చెప్పిన లిపితో పోల్చి చూడండి). ఊయుజ్ అని రాయా

లంటే ఊ యు కావాలి. అవి సవర భాషలో లేవు. ఇవి కొరవడం వల్లే ఈ భాష అభివృద్ధికి నోచుకోవడం లేదు.

2. ఈ భాషలో నామవాచకాలు రాయాలన్న సమస్యగా మారుతుంది. ఉదాహరణకు చిన్న బాబు సీతాపతి అని సవర భాషలో రాయాలంటే- చఇననఅ బఅబఉ సఇతఅపతఇ (చెప్పిన లిపిలో సవర భాషతో చెప్పిన లిపితో పోల్చి చూడండి). ఇందులో సంయుక్తాక్షరాలు, ద్విత్వాక్షరాలు లేకపోవడం వల్ల ఆ పేరు రాయడం సాధ్యం కావడం లేదు.

ఈ భాషా లిపిని పార్వతీపురం ITDA పరిధిలో ఉన్న గిరిజనులు ప్రతి ఆదివారం పూజలు కూడా చేస్తారు. దీని కూ (అక్షర యువ సేవ) అనే సంస్థను కూడా స్థాపించి ఈ భాషాభివృద్ధికి కృషి చేస్తున్నారు. ప్రాథమిక విద్యా స్థాయిలోనే ఈ భాషను పరిచయం చేసి గిరిజన విద్యార్థులకు ఈ జ్ఞానాన్ని అందిస్తున్నారు. ఇన్ని అవకాశాలు ఉన్నా ఈ భాష అభివృద్ధిలోకి రావాలంటే గుణింతాలను నిర్మించాల్సి ఉంటుంది. దానితో పాటుగా ద్విత్వా, సంయుక్తాక్షరాలను కూడా తయారు చెయ్యాలి. ఇలా చేస్తే ఈ భాష, దాని లిపి మనుగడలో ఉంటాయి.

విద్యా విధానం - సాంకేతిక అవసరాలు :

1975 లో ITDA లు స్థాపించారు. ఇవే గిరిజనులకు విద్యాగంధాన్ని పూసాయి. ప్రత్యేకంగా ఆశ్రమ పాఠశాలలు ప్రారంభమయ్యాయి. కానీ చదువుకోవడానికి పిల్లలే లేరు. కారణం వీరికి చదువు విలువ తెలియకపోవడం. చెప్పే వాళ్ళు లేకపోవడం. అడవులలో వేటకు జీవితాలు అలవాటు పడిపోవడం. ఈ పాఠశాలలు కళ కళలాడటానికి చాలా ఏళ్ళు పట్టాయి. ఇప్పుడిప్పుడే చదువు చక్రాలను పట్టుకోవాడని ప్రయత్నిస్తున్నారు. వీరి భాషలో పక్షులు కూతలు, జంతువుల అరుపులులా ఉంటాయి. అందు వల్ల తెలుగు చదవడానికి చాలా కష్ట పడతారు. ఇంకా అంగ్లం మాటంటే గగన కుసుమమే. అందువల్లే వీరు అభివృద్ధిలో వెనుక పడిపోతున్నారు.

సాంకేతికలో నేటి సమాజం పరుగులు పెడుతుంది. అంటే ఫేస్ బుక్, వాట్సాప్ లు కాదు. మనిషి అభివృద్ధికి సంబంధించిన, మానవ మనుగడకి వీలైన సాంకేతికత. అంటే కంప్యూటర్ నాలెడ్జ్, ఆన్ లైన్ లో వ్యాపారం, డిజిటల్ మనీ లేదా చెల్లింపులు, కోడింగ్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మెషీన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ మొదలైనవి. చదవడానికే ఇబ్బందులు పడే వీళ్లు సాంకేతికంగా ఎలా అభివృద్ధి చెందుతారు? ఇదే నేటి ప్రశ్న. కనీసం కంప్యూటర్ ని ఎలా వాడాలో తెలియదు. జి మెయిల్ అంటే కొత్తగా పెట్టిన రైలు అనుకునే పరిస్థితి వీళ్లది. ఇటువంటి పరిస్థితుల్లో ఉన్న గిరిజనులకు ప్రభుత్వం ఎన్ని రిజర్వేషన్‌లు కల్పించినా అభివృద్ధి చెందిన వాళ్లే మళ్ళీ మళ్ళీ అభివృద్ధి చెందుతున్నారు. కాబట్టి రిజర్వేషన్లు, ప్రత్యేక చట్టాలు పక్కన పెట్టి క్షేత్ర స్థాయిలో మౌలిక వసతులు కల్పించి నేటి కాలానికి అనుగుణంగా కనీస సాంకేతిక అవసరాలు కల్పిస్తే వీళ్ళు అభివృద్ధి చెందటానికి అవకాశాలు ఉంటాయి.

సాంకేతిక పరిజ్ఞానం విద్యావగాహన గిరిజనాభివృద్ధి :

ప్రభుత్వం వీరికై ప్రత్యేకంగా పాఠశాలలు స్థాపించి, అందులో ఉపాధ్యాయులుగా అరకొర చదువున్న గిరిజనులను 75% నియమిస్తుంది. దీనివల్ల విద్యార్థుల భవితవ్యం దెబ్బతింటుంది.

గిరిజనుల పాఠశాలలను జిల్లా పరిషత్తు పాఠశాలతో ఇంటర్ తో సంధానం(లింక్) చేస్తే ఫలితాలు మెరుగ్గా ఉండటానికి అవకాశం ఉంటుంది.

పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులో ఉంచే ప్రయత్నం చేయాలి. వీరి లిపిని విద్వాంసులు తయారు చేయడానికి ముందుకు రావాలి.

వీరితో మమేకం అయ్యేలా అక్కడ దగ్గర ఉన్నవారికి తగిన ఏర్పాట్లు చేయాలి. వీరు వెనుకబడి ఉన్నారు కదా అని చిన్న చూపు చూడటానికి లేదు.

గిరిజనులలో ఎంతో మంది అద్భుతమైన ప్రతిభా పాటవాలను మరింత ప్రోత్సహించాలి. ఇలాంటి వాళ్ళను మిగతా విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని అభివృద్ధి చెందటానికి ప్రయత్నించాలి. అభివృద్ధి చెందిన గిరిజనులు తోటివారి సామాజిక అభివృద్ధికి చేయూత నివ్వాలి.

అప్పుడే గిరిజనల భాషావసరాలు సంస్కృతుల్ని ఆదరించి వారిని ఆకర్షించి జనజీవన స్రవంతిలో కలుపుకొని వారి జీవితాలలో వెలుగు బాటల్ని వేయడానికి అవకాశం ఉంటుంది. తద్వారా వారి సమగ్రాభివృద్ధి సాధ్యమౌతుంది.



గిరిజన సాహిత్యం – యానాదుల జీవితం

– డాక్టర్ ఎం. మునిరత్నం, శాఖాధ్యక్షులు, తెలుగు విభాగం, సర్ త్యాగరాయ కళాశాల, చెన్నై, తమిళనాడు.

ప్రస్తావన :

ఈనాటికి కూడా దయనీయమైన దీన పరిస్థితుల్లో ఉన్న సమూహం ఏదైనా ఉందా అంటే అది గిరిజన సమూహమే అని చెప్పవచ్చు. భౌగోళికంగానైనా, ఆచార వ్యవహారాల విషయాల్లోనైనా నేటి ఆధునిక సమాజానికి కొంత దూరంగా ఏకాంతంగా జీవనాన్ని గడుపుతుంటారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, విద్యాపరంగా ఎన్నో ఇబ్బందులకు లోనవుతున్నారు. కనీస అవసరాలను కూడా తీర్చుకోలేని పరిస్థితుల్లో గిరిజనులు ఉన్నారంటే ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. గిరిజనుల జీవన ప్రమాణాలను పెంచడానికి భారత ప్రభుత్వం ఎంతో చేయూత నిస్తున్న ఫలితం మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. దీనికి ఎన్నో కారణాలు ఉన్నాయి. కడుపు గడవని పేదరికం, తీరని రుణ భారం, వెంటాడుతున్న నిరుద్యోగం, సొంత భూమి లేకపోవడం, తదితర కారణాల వలన గిరిజనులు వెనుకబడిపోతున్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు ఎంత కృషి చేసిన వారి జీవితాలు వెలుగు లేకుండానే ఉన్నాయి. గిరిజన సమాజం సామాన్యమైనది కాదు. మన ఆధునిక సమాజానికి, నైతిక విలువలకు సోపానంగా నిలిచిన భాండాగార సాహిత్య నిధికి, సంస్కృతికి ఆధారం ఆచార వ్యవహారాలకు నిలువటద్దం. మన పురజనులకు గిరిజనులే మార్గదర్శకం అని నిస్సంకోచంగా చెప్పవచ్చు. అది ఎలాగో పరిశీలిద్దాం.

"అతి ప్రాచీన కాలం నుంచి కనిపిస్తున్న సాహిత్యం, సంస్కృతికి అద్దం పడుతుంది. నైతిక విలువలకు మాట తప్పని తనానికి, అన్నదమ్ముల అనుబంధానికి, ఏకపత్నీ వ్రతానికి, రామరాజ్యానికి నమూనాగా నేటికి ప్రపంచ యావత్తు కొనియాడబడుతున్న రామాయణ మహా కావ్యాన్ని రచించిన వాల్మీకి ఒక గిరిజనుడు. బలానికి ప్రతీకగా నిలిచిన వాలి, స్నేహానికి పతాక పట్టిన సుగ్రీవుడు, మాతృత్వాన్ని కలబోసి భక్తికి శబరి ప్రతీక. అయితే ముగ్ధ భక్తికి నిరూపణం గుహుడు. శిష్య పరత్వానికి అకుంటిత దీక్షకు ఉదాహరణ ప్రాయకంగా నిలిచిన ఏకలవ్యుడు నిశాచర యుద్ధానికే, ద్వాపర యుగంలో భీమ బలునికి మించిన బల ప్రదర్శనకు ఉదాహరణగా నిలిచిన ఘటోత్కచుడు, ముక్కంటి దొరకు కన్నినిచ్చిన తిన్నడు గిరిజనుడే. మూఢభక్తికి ఇతడే తిరుగులేని ప్రతీక. భారతీయ సాహిత్యం సాక్ష్యమిచ్చే ఈ గిరిజనులంతా తమ తమ పరిధిల్లో తిరుగులేనివారే"(తెలుగు జానపద విజ్ఞాన వైభవం - సమకాలీన సమాజం,పుటలు:235-236). ఇలాంటి సమూహానికి సంబంధించిన గిరిజన ప్రజలు నేటి ఆధునిక సమాజానికి చేరుకోలేక నానాతంటాలు పడుతున్నారంటే గుండె కరిగిపోతుంది. ఈ గిరిజన సమూహానికి సంబంధించిన పరిశోధనలు పూర్తి స్థాయిలో జరగాలి. విద్య, వైద్య సౌకర్యాలు అందేటట్టు చేయడమే కాకుండా వారికి తెలిసిన నాటు వైద్యాలు, ప్రకృతి వైద్యం, ఆయుర్వేదం, సిద్ధహోమియోపతి, యునాని మొదలైన గిరిజన విజ్ఞాన సారాన్ని గ్రహించి "మన ఆధునిక వైద్యానికి ఆధారం జానపద వైద్యం"(తెలుగు జానపద విజ్ఞాన వైభవం - సమకాలీన సమాజం, పుట.61) అని మనం మరచిపోకుండా గిరిజన సాహిత్యాన్ని గురించి పూర్తిగా అవగాహన చేసుకోవాలంటే గిరిజనుల మనోభావాలు, వారి కష్టాలు వారి కడగండ్లు, వారి జీవితాలు, వారు పడే అగచాట్లు, వారి శ్రమ, వారి కుటుంబ జీవన విధానాలు, వారి సంప్రదాయాలు, వారి సంస్కృతి, వారి సాహిత్యం పూర్తిగా తెలియాలి. ఇంతకి గిరిజనులంటే ఎవరు? వారిలో ఉన్న తెగలేమిటి? వారిని గురించి తెలుసుకోవాలంటే మన పురాణాలు వివరించుకున్నాం. వారికి చరిత్ర ఉంది. వారిని గురించి పూర్తి స్థాయిలో కథలు, నవలలు, కవితా ప్రక్రియలు, సంకలనాలు పూర్తిగా

ఈనాటి సమాజానికి తెలియజెప్పడాని కోసం కవులు, రచయితలు నానా తంటాలు పడుతున్నారు. వారి జీవితాలను అవగాహన చేసుకోవాలంటే వారి భాష, వేషాధారణ, వారి పర్యావరణ గురించి పూర్తి స్థాయిలో అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉంది.

గిరిజనులను వివిధ పేర్లతో అనేక రకాలుగా ఈనాడు పిలుస్తున్నారు. ఆదివాసులని, ఆటవికులని, అనాగరికులని, కొండజాతులని అనేక రకాల పేర్లతో పిలుస్తున్నారు. గిరి+జనులు=గిరిజనులు. ''గిరి'' అంటే కొండ లేద పర్వతం అని అర్థం. జనులు అంటే ప్రజలు లేదా సమూహం అని అర్థం. గిరులపైన జీవిస్తున్నందు వల్ల వీరిని మనం గిరిజనులని నేడు సర్వసాధారణంగా పిలుస్తున్నాం.''భారతదేశంలో గిరిజనులను వివిధ మాండలికాల్లో వివిధ పేర్లతో పిలుస్తున్నారు. హిందీలో 'ఆదివాసి' లేదా 'జన్‌జాతి'గా పిలిస్తే ఆంగ్లంలో వీరిని 'ట్రైబ్'గా పిలుస్తున్నారు. ట్రైబ్ అనే పదానికి తెలుగులో 'తెగ' లేదా 'సమూహం' అని విజ్ఞులు నిర్ణయించారు.(నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభలు ప్రత్యేక సంచిక 2012, పుట.827)

''దేశంలోని ప్రజానీకంలో తొమ్మిది శాతం నుండి ఏడు శాతం వరకు ఆదివాసీ గిరిజనులు ఉన్నారు. ఆది అంటే మూలవాసి. అంటే నివాసి. అంటే ఆదివాసులు ఈ దేశ మూలవారసులన్నమాట. గిరిజనులుగా, కొండజాతులుగా వేర్వేరు తెగలుగా పిలువబడుతున్న వీరిని 1956లో అమలులోకి వచ్చిన భారత రాజ్యాంగం 'షెడ్యూల్డ్ ట్రైబ్స్'గా గుర్తించింది. తద్వారా అనుసూచిత కులాలుగా పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 13 వీరిని గురించే చెబుతుంది''(తెలుగు జానపద విజ్ఞాన వైభవం, పుటలు. 244, 247).

''20వ శతాబ్దిలో తెలుగులోకి వచ్చిన పదమే 'ఆదివాసి'. నిజానికి వనవాసి అనే పదం వారికి నచ్చదు. ఆదివారిని కించపర్చటం కిందికి కూడా వస్తుందని ప్రఖ్యాత సామాజిక వేత్త డాక్టర్ కంచె ఐలయ్య పేర్కొంటారు. ఆదివాసులకు వచ్చిన రక్షణలు, ఆచరణలో అమలు కాకపోవడంతో తర్వాత కాలంలో 1995లో వేసిన భూరియా కమిటి కూడా ఆదివాసల కోసం అలమటించింది'' (తెలుగు జానపద విజ్ఞాన వైభవం, పుట.245).

''వహారు సోనెవానె ఒక మరాఠీ ఆదివాసి కవి మరాఠీ దళిత కవుల నారాయణ్ సర్వే, బాబురావు బగుల్‌ల ప్రభావంతో కవిత్వ రంగంలోకి వచ్చిన భిల్లు నాయకుడు. 1970ల ప్రాంతం నుంచి ఆదివాసీల హక్కుల కోసం వేర్వేరు పోరాట రూపాల్లో పోరు జరుపుతున్న వహారు సోనెవానె కవిత్వ పాదాల్లో ప్రపంచ వ్యాప్తంగా చరిత్ర పొడగునా ఆదివాసీలకు జరిగిన అన్యాయాల కథనాలను విశదం చేస్తుంది. ఇప్పుడు ఆయన కవిత్వం విశ్వ విద్యాలయాల పాఠ్యపుస్తకాలుగా చేరింది. ఇంకో విచిత్ర మేమిటంటే ఆదివాసీల హక్కుల కోసం 1992 తర్వాత దేశంలోని ఆదివాసీలనంతా ఒక తాటి మీదికి తెచ్చి ఆదివాసీ జాతుల హక్కుల కోసం, పోరాడెందుకు 'ఆదివాసీ ఏక్తా పరిషత్'ను స్థాపించారు. దీని ద్వారా వందాలది పోరాటాలు చేసిన వహారు సానె వారు తన కుమారుడికి 'మాలెమా' అని పేరు పెట్టుకోవడం, మాలెమా అంటే అర్థం మార్క్స్ - లెనిన్ - మాలో' అని వీళ్ళు ఆయనకి ఇష్టమైన నాయకులట''(తెలుగు జానపద విజ్ఞాన వైభవం, పుట.244).

ఆది మానవుని జీవన స్థితి కాలక్రమంలో ప్రకృతిలో వచ్చిన పెనుమార్పుల వల్ల ఆది మానవుని ఆలోచనలు, అతణ్ణి సంఘ జీవిగా మార్చాయి. ఈ వికాస దశ మూడు యుగాలుగా కొనసాగిందని జానపద మానవ శాస్త్ర వేత్తలు అభిప్రాయ పడ్డారు. 1.ఆటవిక యుగం (ఆదిమ గిరిజనులు) 2.అనాగరిక యుగం (జానపదులు) 3.నాగరిక యుగం (నాగరికులు) అని మానవ శాస్త్రవేత్త అయిన 'మోర్గాన్' వివరించారు. ఆటవిక యుగంలోని మనిషి గిరిజనుడుగా ఉన్నాడు. ఆ తరువాత స్థిర నివాసులు ఏర్పర్చుకున్నాడు. సంస్కృతి సంప్రదాయాలను కట్టు బాట్లను రూపొందించుకుని జానపదుడిగా, నాగరికుడిగా

అభివృద్ధి చెందాడు. కాని ఆదిమ కాలం నుండి తమ సంస్కృతిని పరిరక్షించుకుంటూ ఇంకా నాగరిక ప్రపంచానికి దూరంగా కొండ కోనల్లోనూ, అడవుల్లోనూ నివసిస్తున్నారు. ఇలా నివసిస్తున్న గిరిజనుల సంఖ్య "భారత దేశంలో 427 గిరిజన సముదాయాలున్నాయని 'రాయ్ బర్మన్' గారి అంచనా. అదే విధంగా మన రెండు తెలుగు రాష్ట్రాల్లో 35 గిరిజన తెగలు - ప్రాంతాలున్నాయని సూచించారు"(నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభలు ప్రత్యేక సంచిక 2012, పుట.112).

2001 జనాభా లెక్కల ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాల్లో 35 రకాల గిరిజనుల తెగలు వారు నివసిస్తున్నట్టు ఇలా ధృవీకరించారు. 1.ఆంధ్, సాదుఆంధ్ 2.భగత 3.భిల్ 4.చెంచు 5, బోడో, పరంగి,గదబ 6.గోండులు, నాయక్‌పోడ్, రాజ గోండ్, కోయత్తూర్ 7.గౌడ్ ఏజెన్సితెగ 8.కొండరెడ్లు 9.జాతాపు 10.కొండకాపులు 11.కమ్మర 12.కట్టునాయక్ 13.కోలామ్, కోలావర్ 14.మన్నె దొర 15.కొండదొర, కుబి 16.ఖోంధ్, కోడి, ఖోందు, దెసాయ ఖోంధ్స్, డోంగ్రియా ఖోంధ్స్, కుటియాఖోంధ్, టికిరియా ఖోంధ్స్, ఏనిటి ఖోంధ్స్, కుయింగా 17.కుటియా, బెంతో ఒరియా, బరిటికా, దులియా, హాలావా, సాన్‌రోనా, సిద్ధాపైకో 18.కోయ, డోలికూయ, గుట్టకోయ, మ్మరకోయ, ముసరకోయ, ఒడ్డి కోయ, పట్టెడికోయ, రాజ, రాచకోయ, లింగదారి కోయ, కట్టుకోయ, బినెకోయ, రాజకోయ 19.కులియా 20.మాలీ 21.ముకదొర, నూకదొర 22.ప్రధానులు 23.పొర్జ, పరంగి పొర్జ 24.రెడ్డిదొరలు 25.రోన, రేనా 26.నవరలు, కాపు నవరలు, మాలియా నవరలు, కుట్టో నవరలు 27.సుగాలీ, లంబాడీలు, బంజారా 28.తోటి 29.వాల్మీకి 30.ఎరుకల, కొర్చ, దబ్బా ఎరుకల, కుంచపురి ఎరుకల, ఉప్పు ఎరుకల 31.దులియా 32.నక్కల,కురివికరన్ 33.నాయకులు, 34.పర్దాన్ 35.యానాదిలు, చెల్ల యానాదీలు, కొప్పుల యానాదీలు, మంచి యానాదీలు, రెడ్డి యానాదిలు మొదలైన గిరిజన తెగలు ఉన్నాయి.

గిరిజనుల విశిష్టత :

"రాముడి దర్శనం కోసం పడిగాపులు పడి అతడు తాను ఎంగిలి చేసిన ఫలాల్ని తినగానే జన్మ తరించిందనుకున్న శబరి సవర తెగకు చెందిన స్త్రీ. రాముడు అరణ్యాలకు పోతున్నప్పుడు దారిలో అతని సేవచేసిన గుహుడు ఛోటానాగపూర్ ప్రాంతానికి చెందిన సంథాల్, కోల్ లేక ఒరవాన్ తెగ గిరిజనుడు అయి ఉండాలి. ద్రోణుడు విలువిద్య నేర్పడానికి నిరాకరిస్తే అతని విగ్రహాన్ని ప్రతిష్టించి తానే విలువిద్య అభ్యసించి, చివరికి ఆ గురువు గారికి గురుదక్షిణగా తన బొటనవేలు ఇచ్చిన ఏకలవ్యుడు భిల్లు తెగకు చెందినవాడు. అడవిలో పడుకున్న కృష్ణుడిని దూరం నుండి చూసి మృగం అనుకుని బాణం వేసి చంపిన జండుడు (జరా) కూడా భిల్లు తెగకు చెందిన వాడే. ఈ విధంగా హిందూ పురాణాలలోకి హేయమయిన స్థానంలో ప్రవేశించడమేకాక, తమ పౌరాణిక గాథలలో సైతం గిరిజనులు వాటిని ఆమోదించిన దాఖలాలున్నాయి. కృష్ణుడిని చంపిన పాపం వల్ల భిల్లులకు విల్లంబులు వాడరాదనే శాపం తగిలిందని, అందుకే భిల్లులు విల్లంబులు వాడలేరని నమ్ముతారు. పాండవులు లక్క ఇంటి నుండి తప్పించుకొని అడవులలో తలదాచుకుంటున్నప్పుడు భీముడు హిడింబ అనే ఆటవిక స్త్రీని పెళ్ళి చేసుకొని ఆమె వల్ల ఒక కొడుకు పుట్టగానే ఆమెను తరిమేస్తాడు. మన దేశంలోని అన్ని గిరిజన తెగలలోకి అత్యధిక సంఖ్యాకులయిన గోండులు తమను తాము ఆ హిడింబ సంతానంగా భావించుకుంటారు. గోండులకు 'భీము' ముఖ్యమయిన దేవుళ్ళలో ఒకడు. 'భీము' అనేది వారిలో చాలా సామాన్యమయిన పేరు. ప్రతి సంవత్సరం భీమ హిడింబల వివాహాన్ని గోండులు విప్ప సారాతో వేడుకగా జరుపుకుంటారు. నల్లమల కొండలలో నివసించే చెంచులలో కూడా ఇటువంటి పురాణమే ఉంది. అడవులలో తిరుగుతున్న నరసింహుడు ఒక చెంచు యువతిని పెండ్లి చేసుకొని ఆమెకు చెంచులక్ష్మి అని నామకరణం చేసి వైకుంఠానికి తీసుకుపోతాడు. అక్కడి ఆదిలక్ష్మి

(మార్వాడీల లక్ష్మి) ఈ సవతిని ఒల్లకపోయేసరికి నరసింహుడు విధి లేక ఆమెను వదిలిపెడతాడు. అందు వల్ల చెంచు స్త్రీలకు అందవికారంగా ఉండాలనే శాపం కూడా ఉందని చెంచులు నమ్ముతారు. అంటే నాగరిక సమాజానికి లొంగిపోయే క్రమంలో ఆటవిక స్త్రీలు 'అంద గత్తెలు' కారన్న నాగరిక ప్రమాణాన్ని తాము కూడా ఆమో దించడమే కాక దానికి ఇటువంటి కథ ద్వారా పౌరాణిక 'వివరణ' కూడా ఇచ్చుకుంటున్నారు. సాంస్కృతిక దౌర్జన్యం ఎంత బలంగా ఉండగలదో దీనివల్ల అర్థమవు తుంది. రామాయణం రాసిన వాల్మీకి కూడా భిల్లు తెగకు చెందినవాడే. అతడు 'బందిపోటు' అనీ, రామాయణం రాసి పునీతుడయ్యాడనీ మనం చదువుకున్నాం." (ఆది వాసుల వైద్యం సంస్కృతి అణచివేత, కె.బాలగోపాల్, పుటలు 13-14) ఇలా గిరిజనుల గురించి విశిష్టమైన పురాణంతో కూడిన చరిత్ర ఉంది. గిరిజనుల సమూహాన్ని మొత్తాన్ని ఈ వాస్యంలో అధ్యయనం చేయడం నత్త నడకే అవుతుంది. అందువల్ల యానాదుల జీవన స్థితిగతులను మాత్రమే ఇందులో పొందపరచాలనుకుంటున్నాను. యానాదుల జీవితాలను గురించి తెలుసుకునే మునుపు వారి పుట్టుపూర్వోత్తరాలను, ఆ పదం యొక్క పుట్టుకను గురించి రెండు మాటలైన చెప్పుకొకుండా అడుగు వెయ్యలేం.

యానాదుల పుట్టుక :

నెల్లూరు, చిత్తూరు జిల్లాలో యానాదులు ఎక్కువ. యానాదుల రకాలను గురించి ఇంతకు ముందుగానే పేర్కొన్నాను. చిత్తూరులో 'యిరులకులు' అని, తమిళ నాడులో 'ఇరులర్' అని పిలుస్తారు. "'యానం' అంటే సముద్రపుటొద్దు ఇసుకను గురించి ఇది "ఏటిసకాయానా విసకో' అన్న వాడుక విశాఖలో ఉంది" (నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభలు ప్రత్యేక సంచిక 2012, పుట.116).

"సముద్ర తీరాన్ని ఆశ్రయించి జీవనం సాగించే వారని పురాతన కాలం నుండి ఉండుటచే 'యానాది', 'మొదలు లేనిది' అనే అర్థమిచ్చు 'అనాది' అను పదము కూడా వచ్చి ఉండవచ్చును" అని పండితులు వివరించారు. (నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభలు ప్రత్యేక సంచిక 2012, పుట.116). ఇలా యానాదుల జీవన స్థితిగతుల గురించి సూక్ష్మప్రాయకంగా తెలుసుకోవాలని ఉద్దేశమే ఈ వ్యాసం.

యానాదుల నివాసాలు :

యానాదులు తమ నివాసాలు ఏర్పరచుకోవడానికి ఎంచుకునే ప్రాంతాలు ప్రత్యేకమైనవి. ఎక్కువ శాతం యానాదులు దట్టమైన అరణ్యాలలోని ఏటవాలుగా ఉన్న కొండ ప్రదేశాలలోనే నివసిస్తుంటారు. వీరి నివాసాలు కొండ వాలులు చదునుచేసి నిర్మించుకోవడం కనిపిస్తుంది. ఇది కూడా వరుస క్రమంలోనే ఉంటుంది. సాధారణంగా చెట్ల పొరకతో, వెదురుతో గోడలు నిర్మించి మట్టి, తదీతర మిశ్రమాలతో వాటిని పూరించి గోడలు కట్టి అడవులో లభించే, కాసే గడ్డితో పైకప్పు వేస్తారు. వరుసగా ఒకరి ఇంటికి ఆన్చుకొని మరో ఇంటిని పెంచు కుంటారు. ఒక్కొక్కసారి పది పన్నెండు కుటుంబాలు ఒకే వరుసలో ఉండటం కనిపిస్తుంది. కొన్ని ఇండ్లు దట్టమైన అడవిలో దూర దూరంగా కూడా ఉంటాయి. పెండ్లయిన వెంటనే భార్య భర్తలు కొత్త గుడిసె వేసుకొని ఒంటరిగానే జీవిస్తారు. వీరి ఇండ్లు చాలా చిన్నవి. గడ్డి కప్పుతో ముచ్చటగా ఉంటాయి. "ఇలాంటి నాలుగైదు ఇండ్లు ఉంటే దాన్ని 'పెంట' అంటారు. ఎక్కువ ఇండ్లు ఉన్న వాటిని గూడెం అంటారు" (నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభల ప్రత్యేక సంచిక 2012, పుట.855). వీళ్ళు గ్రామాలకు కొద్ది దూరంలో గుడిసెలు వేసుకొని నివ సిస్తుంటారు. వీళ్ళు ఉన్న చోటును యానాది సెంటర్ అని కూడా అంటారు. ఇప్పుడిప్పుడే ఇందిరమ్మ ఇల్లులు చొరబడి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు శ్రద్ధ తీసుకొని వీళ్ళ గృహాలకోసం నిర్వీరామంగా కృషి చేస్తూనే ఉన్నారు.

యానాదుల మౌఖిక సాహిత్యం :

యానాదులు అప్పటికప్పుడు కవ్వించి ఆశువుగా ఏదో ఒక పాట పాడతారు. యానాదుల పాటల్లో స్పష్టత,

సూచితనం, జీవనశైలి, సంస్కృతి దాగి ఉంటాయి. వారు చూసిన విషయం, వారు విన్న విషయం, వారు అనుభవించిన విషయం అన్నీ కలగలిపి పాటలుగా, మాటలుగా చెబుతారు. సినిమా పాటలను కూడా తమ శైలిలో మరల్చుకొని అందుకు తగ్గట్టు వారి యాసలో పాడుకుంటారు.

విద్య :

గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో గిరిజన వసతి, బాల బాలికల గృహాలు ఏర్పాటు చేసిన ఈ వసతి గృహాల పాఠ శాలల్లో యానాది విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో చేరిన మధ్యలోనే చదువులను మానేస్తారు. ఈనాటికి కూడా చదువుమీద, ఉద్యోగం మీద శ్రద్ధ చూపించే వారి సంఖ్య తక్కువే. చదువు విలువ వీరికి తెలియదు. పనికి పోతే దుడ్డు వస్తుంది. బడికి పోతే ఏమొస్తుందని అజ్ఞానంతో దూర ఆలోచన లేకుండా విద్యా ప్రయోజనాలు తెలియకుండా నీరుగారిపోతున్నారు. విద్యాప్రయోజనాల గురించి యానాదులకు చెప్పాలి. వారిలో అక్షరాస్యత పెంచి వారి జీవితాలకు వెలుగునివ్వాలి.

వృత్తి :

యానాదులలో వ్యవసాయ వృత్తి తక్కువ. వీళ్లు అడవులలో లభించే వేర్లు, దుంపలు, కాయలు, కట్టెలు, తేనె, నేరేటి పండ్లు, ఈతపండ్లు, ఊటిపండ్లు, గొంజి పండ్లు, కళిగి పండ్లు అమ్మడం, ఈచులు, చేపలను గాలాంతో పట్టడం, నత్తలు, ఎండ్రకాయలు పట్టి అమ్మడం, తెల్ల ఎలుకలను పొలాల్లో గెణాలు కింద త్రవ్వి పట్టుకోవడం, పాములు పట్టడం, అడవి పందులను వేటాడడం, కుందేలు, తాబేల్ల కోసం ఉచ్చురీకలు వేసి పట్టుకోవడం, పూరేండ్లను, ముక్కుపిట్టలను, కొంగలను ఉండీ గోల్లతో కొట్టడం, ముంతమామిడి పండ్లు అమ్మడం, చీకురేని ఆకు దుయ్యడం, చీపురు కోసి అమ్మడం, బిల్లి కర్రలతో మంచం కోళ్లు తయారు చేయడం, తడికలు కట్టడం, పొలాలకు ముళ్ల కంప నాటడం, ఒబ్బిడి అయిన తరువాత కళ్లంలో మిగిలిన ధాన్యాలను జల్లించి అమ్మడం, అడవి కోళ్లను పెంచడం, పెళ్లి సమయాలలో పెండ్లి కోసం పాల చెట్టును అమ్మడం లాంటివి సీజన్‌కి తగ్గట్టు చేయడమే కాకుండా మావిడి తోటలకు భార్య భర్తలు ఇద్దరూ కావలి కాయడం, ఇంటి వాసాలకోసం అడవులకు వెళ్లి తేవడం లాంటి ఎన్నో వృత్తులను యానాదులు అలవరుచుకున్నారు. "ఒంట్లో సత్తువ ఉంటే ఏ మందులు లేకున్నా రోగాన్ని కొంతమేరకు తట్టుకోగలం. ఆ శక్తి ఉండాలంటే తిండి ఉండాలి. తిండి ఉంటాలంటే పని దొరకాలి, తగు మాత్రం వేతనం దొరకాలి" (ఆదివాసుల వైద్యం, సంస్కృతి అణచివేత, పుట.115). ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో చెప్పుకోవచ్చు. బ్రతుకుతెరువు కోసం ఎన్నో ఇబ్బందులకు లోనవుతున్న యానాదులను దృష్టిలో పెట్టుకొని వంద రోజులు పని మాత్రమే కాకుండా మూడు వందల అరవై రోజులు పని కల్పించేందుకు ప్రభుత్వం తగు చర్యలను చెప్పట్టాలి.

యానాది స్త్రీలు :

యానాది స్త్రీ స్వతంత్ర వ్యక్తిత్వాన్ని, ఆత్మ విశ్వాసాన్ని, ఆత్మ స్థైర్యాన్ని కలిగి ఉంటుంది. అర్ధరాత్రి, అపరాత్రి అయినా స్వేచ్ఛగా, ధైర్యంగా విహరిస్తుంది. తమ ఆనందాన్ని, ఆవేదల్ని, ఆలోచనల్ని, ఆకాంక్షలను ధైర్యంగా వారి యాసలో వ్యక్తం చేస్తుంది. వారి ఆచార వ్యవహారాలని, సంస్కృతిని మౌఖికంగా తరతరాలుగా అందిస్తూనే ఉంది. భర్తతో సమానంగా కష్టపడుతుంది. ఇంట్లో ఆర్థిక వ్యవహారాలు చూస్తుంది. సంతానమే సంపదగా భావిస్తుంది. నగ, నట్ర లేవని దిగులు చెందదు. కడుపు నిండితే అదే చాలని భర్తను బిడ్డలను ప్రేమిస్తూ జీవిస్తుంది. యానాది స్త్రీలు నేటి మహిళా లోకానికి మార్గ దర్శకం కాగలరని భావిస్తున్నాను.

పండుగలు - ఉత్సవాలు :

యానాదులు దసర, దీపావళి, శ్రీరామ నవమి, సంక్రాంతి, శివరాత్రి, నాగుల చవితి, ఉగాది వినాయక చవితి పండుగులను, ఎంతో ఉత్సాహంగా ఊరేగింపులతో 'డుబ్బాంకు' దరువులతో ఆడ మగ తేడా లేకుండా

నాటుసారా, కళ్లు, భ్రాంది తాగి లయబద్ధంగా డుబ్బాంకు దరువులకు అడుగులు వేస్తూ ఉత్సహంగా జరుపు కుంటారు. ఈ ఉత్సవాల్లో ప్రతి సంవత్సరం ఈ జాతరల సందర్భంగా తమ కులానికి గ్రామ పెద్దను ఎన్ను కుంటారు. ఇళ్ల ముందు ముగ్గులతో తంగేడ పూలతో రంగు రంగుల ముగ్గు పిండిలతో ముగ్గులు వేస్తారు. గోడలను ఆవుపేడతో పచ్చగా పూస్తారు. వాటికి ఎర్ర మట్టిని సాది అలంకారంగా మెరుగులు దిద్దుకుంటారు. ఇదంతా యానాది ఉత్సవాల్లో చూడవచ్చు. వారికి వారే అభినయంగా కోలాటం నేర్చుకొని అడుగులు వేస్తారు. ఈ సందర్భాలలో వసంతోత్సవాల్లతో నీళ్లు చల్లుకొని ఉత్సాహంగా ఉంటారు.

వివాహ వ్యవస్థ :

యానాదులలో బహుభార్యత్వం ఎక్కువే. వివాహానికి ముందు యువతి యువకులు స్వేచ్ఛగా తిరగడాన్ని వీరి సమాజం అంగీకరిస్తుంది. యానాదులలో పెండ్లిల్లు పద్నా లుగు 14 సంవత్సరానుండి 17 సంవత్సరాల వయస్సు మధ్యలోనే జరుగుతాయి. యానాది తెగలలో ఆడపడుచు వివాహం కావాలంటే ముందుగా ఆ పిల్ల మేనమామ అంగీకారాన్ని పొందాలి. యానాది స్త్రీ భర్త చనిపోయిన తరువాత ఒకరి తరువాత ఒకరిని ఏడుగురిని వివాహం చేసుకోవచ్చు. అలా చేయడం వలన ఆమెకు సంఘంలో సాంఘికంగా గౌరవం కూడా పెరుగుతుందట. ఈ సందర్భంగా యానాదోళ్ళ సామెత ''యానాదోళ్ళకు ఏడు మనువుల ఏర్నాల కావిడెత్తాలి'' వరుడు కుటుంబానికి కావలసిన వస్తు సామాగ్రితో పాటు వధువు రవిక, గుడ్డలు, పసుపు, కుంకుమ ఆరు వక్కలను ''ఏర్నాలు'' అంటారు. అంటే ఇక్కడ స్త్రీ యొక్క దాంపత్య జీవన స్వేచ్ఛా స్వాతంత్ర్యం ఉన్నదన్న విషయం అర్థం చేసుకోవచ్చు. 'యానాది లగ్నానికి ఏనాడైతే ఏమి' (పుట: 513, తెలుగు సామెతలు) వీళ్ళు అవి అన్నీ పాటించరు అని అర్థం.

యానాద స్త్రీ తన భర్త పట్ల అసంతృప్తి చెందితే మరొక మగనితో సంబంధం పెట్టుకోవచ్చు. లేదా పుట్టింటికి వెళ్ళిపోవచ్చు. ఆమె మొదటి మగడిని వదిలేసి రెండో మగనితో ఉంటే మాత్రం మొదటి భర్త రెండవ వారి దగ్గర పరిహారం కోరవచ్చు. ఆ పరిహారం తీసుకున్న తరు వాత మొదటి రెండవ భర్తలు తమని తాము అన్న దమ్ముల్ల భావించుకుంటారు.

వీళ్ల పెళ్ళిళ్ళ విషయాల్లో మరో విచిత్రమేమిటంటే అమ్మ మరొకరిని ఇష్టపడిన, నాన్న మరొకరిని ఇష్టపడిన వాళ్ల కొడుకులు, కూతుర్లే అమ్మనాన్నలకు పెండ్లి చేసిపెడతారు. అమ్మ చనిపోయి నాన్న ఉండిన, నాన్న చనిపోయి అమ్మ ఉండిన వాళ్ల తోడు కోసం మరో పెండ్లి చేస్తారు. అలా పెళ్ళి చేయకపోయిన మరోకరితో సంబంధం కలిపి ఒకరికి ఒకరు తోడుగా ఉండాలని వారు ఇష్టపడిన జంటతోనే కాపురం చేసుకోవచ్చు. అందుకు ఎవరు ఎటువంటి అభ్యంతరాలను చెప్పరు. ఈ సంఘటన చిత్తూరు జిల్లా, సత్యవేడు మండలం, దాసుకుప్పం పంచాయతీ చెన్నేరి గ్రామంలో జరిగింది. ఇలాంటి పాశ్చాత్య సంస్కృతికి మన యానాదులే మార్గదర్శకమనిపిస్తుంది.

జీవనాధారం :

అడవులలో కుందేళ్ళతో మొదలు పెట్టి అన్ని రకాలు చిన్న జంతువులను వేటాడడం, కట్టె కొట్టి తీసుకుని ఊర్లలో అమ్ముకోవడం, భూములున్న వారి పొలాలలో కూలీ చేయడం, ఇండ్లలో పాచి పని చేయడం, గ్రామా లలో కూలీ పనికి ఇచ్చే వేతనం అంతంత మాత్రమే. ఊర్లలో పని దొరికినప్పుడు అంతకంటే ఎక్కువ వేతనమే ఇస్తారు. కానీ ఊర్లలో పనిదొరకడం తక్కువ. ఒకవేళ దొరికినా దానికి పోటీ ఎక్కువ. మొత్తం యానాదులకు సంవత్సరంలో నాల్గు నెలలు మాత్రమే పని దొరుకు తుంది. మిగతా ఎనిమిది నెలలు అర్ధాకలితో బత కాల్సిందే. పోషక ఆహారం లోపం అత్యధికంగా ఉండేది మే, జూన్, జూలై నెలలోనే. మలేరియా జ్వరం, కలరా, విషజ్వరాలు అప్పుడే వస్తాయి. ఆ సమయంలో నానా ఇబ్బందులు పడతారు. ప్రభుత్వం ఇచ్చే రేషన్ బియ్యం

కొనుక్కుని ప్రభుత్వం సహాయం పొందగలరా అంటే అదీ శాపమే. పరిపూర్ణంగా కొనుక్కోలేరు. రేషన్ బియ్యం ఒకేరోజు ఇస్తారు. వేసిన రోజు 15, 20 కేజీలు కొనుక్కోవాలి. చేతిలో అంత డబ్బు లేకుండా కొనుక్కోలేకపోతే ఎంత కొనుక్కుంటే అంతే దక్కుతుంది. తరువాత ఇంటి అవసరాలకు బయట రేటు పెట్టి కొనుక్కోవాలి. ''ప్రతి ఇంటికి తెల్లరేషన్ కార్డు ఉందని ఆయా మండల ఎం.ఆర్.ఓ లే అంటున్నారు. 'ప్రతి ఇంటికి అంటున్నారే తప్ప, ప్రతి కుటుంబానికి అనడం లేదు. కార్డు ఇచ్చిన నాడు కుటుంబాలనే గుర్తించి ఉండవచ్చును. కానీ అవి ఇచ్చి ఎంత లేదన్న పన్నెండు ఏండ్లు గడిచాయి. ఇచ్చిన తరువాత 'భోగస్ కార్డులను' ఏరివేసారే తప్ప కొత్త కార్డులు ఇవ్వలేదు. ఈ పన్నెండు ఏండ్లల్లో పిల్లలు పుట్టారు. అంతకుముందు పిల్లలుగా ఉన్నవారు పెరిగి పెద్దవారై వేరుపడ్డారు. పెండ్లి చేసుకొని పిల్లల్ని కన్నారు. ఆ ఇంటికి వచ్చిన బియ్యం కోటా పెంచలేదు. పెరిగి పెద్దవారై తామే కుటుంబ పెద్దలైనా వారికి కొత్త కార్డులు ఇవ్వలేదు. ఒకనాటి కుటుంబానికి ఇంటి నెంబరు మాత్రమే చిహ్నంగా మిగిలింది. అందుకే కార్డు ఉన్నది ఇంటికే అంటున్నారు తప్ప, కుటుంబానికి కాదు''(ఆదివాసులు వైద్యం, సంస్కృతి అణచివేత, పుట.79). ఇలాంటి దయనీయమైన పరిస్థితులను కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా గుర్తించి జీవన ప్రమాణాలు పెంచడానికి ఎలా చేస్తే వారి అవసరాలు తీరగలవని ప్రభుత్వం ఆలోచించాలి.

యానాదుల వైద్యం :

'మానిందే మందు అనే ఏకైక సూత్రంపై ఆవిర్భవించిందే గిరిజన వైద్యం'. గిరిజన వైద్యాన్ని నిర్లక్ష్యం చేస్తే మన పోగొట్టుకున్నది ఏమిటో ఇంతింతని అంచనా వేయలేం. ఇది కూడా 'అమ్మ ఒడిని తల్లి నుడిని దూరం చేసుకోవడం లాంటిదే అవుతుంది'. ఎక్కువ శ్రమ అయిపోతే కాళ్లు చేతులు ఇల ఇల చచ్చుపడిపోయినట్లు ఉండినా చీపురు పుల్లలతో, ఉప్పుతో, గుండ్రని రాల్లతో, ఇటుక రాయని పగలకొట్టి దిష్టి తీస్తారు. కడుపు నొప్పి వేస్తే నామగడ్డను నూరి బొడ్డుకు వేస్తారు. శరీరంలో గుల్లలేసి అది పండడానికికోసం ఎర్రమట్టి సాది మొలకను భయటకు తీస్తారు. వాయునొప్పులకు తెల్లగడ ఉడికించి తింటారు. తలభారానికి తగిలపు ఆకును, వావిళ్లాకును, వేపాకును వేడి నీళ్ళలో మరిగించి అందులో ఇటుక రాయిని నాలుగు ముక్కలు చేసి వేడినీళ్ళలో వేసి దుప్పటి కప్పి ఆవిరి పట్టించి తలలో ఉన్న చెమట నీరును భయటకు తీస్తారు. కళ్ళలో మురికి తీయడానికి కాటుక రాస్తారు. శరీరంలో వాపు ఉంటే ఆ వాపును తగ్గించడానికికోసం 'బందేరి ఆకును' కట్టుతారు. విపరీతమైన తలనొప్పికి అడవిలో నుంచి చెక్కను తెప్పించుకుని తింటారు. చర్మరోగాలైన గజ్జి, దుద్దర్లు, తలపుండ్లు, పేను కొరకటం, మొలలకు పప్పాలి పండు తింటారు. నడుము నొప్పి, కాళ్లు నొప్పి, అరికాల్ల మంట, తిమ్మెర్లు, మూర్ఛ, పక్షపాతం, జీర్ణకోశానికి సంబంధించిన చీము, విరోచనాలు, మలబద్ధకం ఆపడానికి జీర్ణశక్తిని పెంచడానికి, కడుపులో ఉన్న నులిపురుగులు చావడానికి, మూత్రం బాగా అయ్యేటందుకు, మూత్రములో తెలుపు, స్త్రీలకు సంబంధించి ముట్టు నొప్పులు తగ్గి, ఋతుచర్యలు సక్రమంగా జరగటానికి అనేకమైన మూలికలను ఆకులను తింటారు. పంటినొప్పి, చెవిపోటు, చలిజ్వరం, కామర్లు, కంటిలో పువ్వు, రేచీగటి, మొదలైన కంటి జబ్బులకు, దగ్గు, ఆయాశం, గురక వంటి శ్వాస రోగాలకు ఎముకలు అతకడానికి పసురు ఉన్మాదం తగ్గడానికి, జ్ఞాపకశక్తి పెరగడానికి, రక్తపుష్టికి, రక్తసిద్ధికి, స్తన్యవృద్ధికి, సంభోగశక్తి ఇనుమడించడానికి, గర్భధారణకు, శుక్రవృద్ధికి, గర్భవిచ్ఛితికి, శాశ్వత గర్భ నిరోధానికి, ఇలాంటి ఎన్నో వ్యాధులకు చెక్కలు, మందులు, వన మూలిక రహస్యాలు యానాదుల దగ్గర ఉన్నాయి. తేలు పోటుకి, పాము కాటుకి, రక్తం కారిపోకుండ ఆపడానికి, విషాహారాన్ని కక్కించడానికి మూలికలకు కొదవ లేదు. ''చిన్న పిల్లలు ఎదుగదల లేక సన్నగా ఉంటే అడవి పంది

పొట్టను ఎండపెట్టి దంచి తాగిస్తారు" .(గుప్తవైద్య ప్రకాశిక) "చిన్నపిల్లలకు బొడ్డుచుట్టూ పుండు ఏర్పడితే ఎండిన కుందేలు పిచ్చుకలను నలిపి పూస్తారు" (పరిశోధన : నాడు నేడు రేపు, పుట.233). ఇలా ఎన్నో విషయాలను యానాదులలో చూడవచ్చు. ఇలాంటి మూలికావిజ్ఞానం బయట ప్రపంచానికి తెలియవలసిన అవసరం ఉంది. వీరి మీద పరిశోధన చేసినట్లయితే మనకు కావలసిన ఆరోగ్య వైద్యాలు వనమూలికలతోనే సరిచేసుకోవచ్చు. ఇందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో శ్రద్ధ తీసుకొని ఆ భాండాగార సంపదని బయటి ప్రపంచానికి తెలియ జేసినట్లయితే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది.

పరిసరాల పారిశుద్ధం :

దట్టమైన అడవులు కారణం, వర్షాపాతం నీరు ఎగుడు దిగుడుగా ఉండడం వల్ల వర్షం నీరు మడుగులలో నిలిచిపోతుంది. ప్రజలకు బహిర్భూమి మరుగు దొడ్డు కావడం వలన ఈ మడుగులు మలినానికి చోటవు తాయి. దోమలకు స్థావరం అవుతాయి. మురుగునీటి గుంటల మీద, కాలువల మీద, దోమలు పడిగాపులు కాసి కాటు వేచి మలేరియా క్రిమిని శరీరంలోకి చొచ్చుకుని పోయేలా చేస్తుంది, శరీరంలోకి ప్రవేశిస్తుంది. వాగుల నుంచి, వంకలనుంచి నీళ్లు తెచ్చుకోవడం, వాన కాలంలో బోరు దగ్గర నీళ్లు నిలిచినట్లయితే బోరునుండి తోడుకునే నీరు కలుషితమై ఉండే అవకాశం ఉంది. ఇలా ఎన్నో రకాల కారణం వలన అనారోగ్య బారిన పడుతున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 'స్ప్రే' చేసే క్రిమి సంహారక మందు అందిస్తుంది గానీ, అదికూడా సకాలంలో కుదరదు. దోమ తెరలు అందజేస్తామని ప్రభుత్వాలు హామీ ఇచ్చినా ఫలితం మాత్రం నత్త నడకే. మెదడును దెప్పతీసి చావుకు కారణం అవుతున్న మలేరియా జ్వరం ఎండదెబ్బ, వడదెబ్బ, గుండెపోటు తదీతర కారణాలకు తట్టుకోలేక మరణిస్తున్నారు. ఇలాంటి బాధకరమయిన విషయాలను సాటి మనుషులుగా గుర్తించి వారికి కూడా ఆధునిక వైద్య పరిజ్ఞానం పట్ల అవగాహన పెంచి ప్రభుత్వం చేబడుతున్న మరుగుదొడ్లను మరింత మెరుగుపరచి వారి ఆరోగ్య సూత్రాలకు ప్రామాణికంగా నిలవాలని కోరుకుంటున్నాను.

యానాదుల నృత్యం :

గిరిజనులైన యానాదులు వారి పండుగ రోజుల్లోనే కాకుండా తీరిక సమయాలప్పుడు వారి వాయిద్యమైన 'డుబ్బాంకు' వాద్యాన్ని వాయిస్తూ చిందులేసి లయ బద్ధంగా నృత్యం చేస్తూ గంతులేసి చిందులేస్తారు. ఈ నృత్యాన్ని వీలు దొరికినప్పుడల్లా వినోదంగా ఉత్సాహంతో వాళ్ల ఇంటిముందో, నడిరోడ్డులోనో గుళ్ళ దగ్గరో, రచ్చబండ దగ్గరో సారా తాగినప్పుడో 'డుబ్బాంకు' వాద్యానికి తగ్గట్టు నృత్యం చేస్తారు. ఈ నృత్యంలో ఆడ, మగ, అవ్వ, తాత అందరూ కలసి ఆనందంగా ఆడుకుంటారు. ఇలాంటి యానాది కళాకారులను ప్రోత్సహించినట్లయితే వారిలోని కళాకారుడు బయట ప్రపంచానికి తెలిసే అవసరం ఉంది.

యానాదుల సంస్కృతి :

మానవ జీవిత వ్యక్తీకరణనే సంస్కృతి అంటారు. యానాదులు తమ గృహాలను నిర్మించుకునే విధానాన్ని వారి వాస్తు సంస్కృతిని అడవిలో దొరికే, సహజసిద్ధంగా లభించే రెల్లు గడ్డి, తాటాకులు, మోదుగు ఆకులు, వాటితో గుడిసెలు నిర్మించుకుంటారు. జీవనోపాధికై అడివిలో దొరికే కట్టెలను కొట్టి కట్టలుగా కట్టి, మోపులుగా కట్టి ఊరూ ఊరూ తిరుగుతూ అమ్ముకొని జీవిస్తారు. వీళ్ళు ఆనాదిగా వస్తున్న వాళ్ల ఆచార వ్యవహారాలను, సంప్రదాయాలను మరచిపోరు. వీళ్ళు సంతోషం వచ్చినా, దు:ఖం వచ్చినా డుబ్బాంకు దరువులతో నృత్యం చేస్తూ ఆనందంగా జీవిస్తారు. ఈనాటికి కూడా తమ ఇల్లు వాకిళ్లను పేడనీళ్లతోనే కళ్లాపు చల్లుతారు. అడవి కట్టెలతో పొయ్యి మంట వేయడం యానాది వీధులకు పోతే తెలుస్తుంది. మన సంస్కృతి ఇంకా బ్రతికి ఉందనడానికి నిదర్శనంగా యానాదివారి జీవితమే అద్దం పడుతుంది.

భాష :

యానాదులు తెలుగుభాషనే మాతృభాషగా కలిగి

ఉంటారు. వీరు వలసి వచ్చిన ప్రాంతాన్ని బట్టి, విస్తరించిన ప్రాంతాన్ని బట్టి తమిళ, కన్నడ భాషలల్లో కూడా సంబంధం కలిగి ఉంటారు. యానాదులు పూర్తిగా తెలుగు భాష మాట్లాడే గిరిజనులే అయినా వాడుక భాషలోని యాస పద బంధాలు వర్తమానంలో మనం మాట్లాడే తెలుగు భాషతో పోలిస్తే చాలా భిన్నంగా ఉంటుంది. దీనికి ప్రధాన కారణం వేల సంవత్సరాలుగా ఆయా గిరిజనుల తెలుగు భాష మార్పులకు లోను కాకుండా ఉండడమే కావచ్చు.

గమనింపదగిన ముఖ్యాంశాలు :

1.ఆదివారం పస్తైయిన పడుకుంటారే గానీ పనికి మాత్రం పోరు. 2.పనికిరావడానికి ఒక్కసారి ముక్కితే (నిరాకరిస్తే) ఎంత వేడుకొన్న రారు. 3.వీళ్ళు మరొక్క తెగతో ఇమడరు. 4.ఏ ప్రాంతానికి దగ్గట్టు ఆ ప్రాంతాల జీవన స్థితిగతులు అలవర్చుకుంటారు. 5.భాషలో యాస మాత్రం ఉంటుంది. 6. అబద్ధాలు చెప్పడానికి ఇష్టపడరు. చెప్పరు. 7.పెండ్లిడ్ల విషయాల్లో పాశ్చాత్యులకు మన యానాదులే మార్గదర్శకమనిపిస్తుంది. 8.వీళ్ళలో కట్నకానుకలు కనబడవు. 9.భార్యాభర్తలు ఒకరిని వదిలి ఒకరు జీవించరు. 10.రేపటి గురించి ఆలోచించరు. వీళ్ళు అంకమ్మ, అంకయ్య, చెంచయ్య, చెంచమ్మ, దేశయ్య, దేశమ్మ, చెల్లమ్మ, కిష్టమ్మ, కిష్టయ్య పేర్లనే పెట్టుకుంటారు. ఇటీవల కాలంలో సినిమా హీరోల పేర్లు వాళ్ళ పిల్లలకు పెట్టుకోవడం అనవాయితీ అయిపోయింది. ఒకే కుటుంబంలో ముగ్గురు కుమారులకు చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్ అని పేర్లు పెట్టుకున్నారంటే వీళ్ళు సినిమా హీరోలను ఎంత ఆరాధిస్తారో వేరే చెప్పక్కర్లేదు. అమ్మాయి కంటే అబ్బాయి చిన్నవాడుగా ఉన్నా పెళ్ళి చేసి పెడతారు. ఎక్కువ శాతం వడ్డికి డబ్బులు తీసుకొని ప్రభుత్వం ఇచ్చిన భూములను కూడా పురజనులకు విక్రయిస్తారు. ప్రభుత్వం ఎన్ని సహాయ సహకారాలు చేపట్టిన వాటిని ఎలా పొందాలో అన్న విషయం కూడా తెలియదు. పెండ్లి చేయాలంటే ఒక రేడియో, ఒక సైకిల్, యాభై కేజీల బియ్యంతో అందర్నీ కలగలుపుకొని 'డుబ్బాంకు' మేళాలతో వివాహం జరిపిస్తారు. ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో విషయాలను వెలికి తీయవచ్చు.

ముగింపు :

ప్రపంచీకరణ నేపథ్యం ప్రతి పల్లెటూరికి విస్తరించిన మాట వాస్తవమే అయినా వాగుల్లో, వంకల్లో జీవిస్తున్న యానాదులు మాత్రం టి.వి.చూడటానికి, సినిమాలు చూసి డ్యాన్స్ వేసుకోవడంతోనే కాలాన్ని హృథా చేస్తున్నారే తప్ప, జీవితం గురించి, చదువు గురించి, ప్రభుత్వం ఇచ్చే సదుపాయాలు గురించి, ఏమాత్రం అవగాహన లేకుండా అజ్ఞానంతో నిరక్షరాస్యులుగానే, ఆరోగ్యానికి కాపాడుకోలేని అడవి మనుష్యులు లాగానే, జీవితాన్ని తలమానికం చేస్తున్నారు. యానాదుల యువతీ యువకులు ఆధునిక సాంకేతిక సంస్కృతిని వలకబుచ్చుకోవాలనుకున్నా అదిచేతగాక అయోమయ పరిస్థితులలో ఎటూపోలేక, వారి సంస్కృతిని కాపాడుకోలేక, వారికి తెలిసిన వైద్యసదుపాయాలను మెరుగు పరచడానికి సంకోచిస్తూ, బతుకు తెరువు కోసం పట్టణ వాతావరణంలోని పనులను చేయలేక, సంపాదించే ధనాన్ని పొదుపు చేసుకోవడం తెలియక మేము జీవిస్తున్నాం అన్నట్లుగా జీవిస్తున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని పంట పండించుకోవడానికి పట్టాభూములు ఇవ్వాలి. ఇంటి పట్టాలిచ్చి ప్రభుత్వమే ఇల్లు కట్టించాలి. ఉపాధ్యాయులే ఇంటింటికి పోయి విద్యార్థులను బడిలో చేర్పించుకొని వారిని విద్యాభివృద్ధికి పాటుపడేటట్లు చూడాలి. చదువుకుంటే కలిగే ప్రయోజనాలను చెప్పాలి. గ్రామాలలో వారికి అందుబాటులో ఉన్న చిన్న, చిన్న ఉద్యోగాలను వారికి ఇచ్చి, ప్రభుత్వమే వారిని పైచదువులు చదివించాలి. వారి తెగలో ఇంతకుముందు చదివి, ఉద్యోగాలు పొంది ఉన్నత స్థాయిలో ఉన్న చదువరుల జీవిత విశేషాలు డాక్యుమెంటరీగా చూపించాలి. విద్యార్థులు బడికి వస్తే, వారికి ప్రతిరోజు హాజరు పట్టికను చూసి ఉపకార వేతనంగా కనీసం రెండు వేలు రూపాయలు నెల నెల ఇచ్చేటట్లు ప్రభుత్వం శ్రద్ధ తీసుకొని విద్యా ప్రమాణాలు

పెంచాలి. ఇంటింటికి పోయి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో అడిగి వారికి కావలసిన మందులు, మాత్రలు ఇవ్వాలి. అధిక సంతానం వలన కలిగే నష్టాలను వివరించాలి. ఎటువంటి డాక్యుమెంట్లు లేకుండా బ్యాంకు వారి రుణాలు మంజూరు చేసి వారి ఆర్థిక పరిస్థితి మెరుగు పరచాలి. చేతుపనులను స్వచ్ఛంద సంస్థల ద్వారా మెరుగు పడేటట్లు సిద్ధం చేయాలి. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో విషయాలు బయటకు తేవడానికి ప్రయత్నించినా అది ఉడుతా భక్తిలా అవుతుందే తప్ప అన్నీ విషయాలను చెప్పడానికి సాహసించలేకపోతున్నాను.

ఆధార గ్రంథాలు :

1. నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభలు ప్రత్యేక సంచిక 2012.
2. బి.చీనియానాయక్ - బంజారా చరిత్ర - సంస్కృతి-ప్రగతి, శ్రీహాథిరాం బాలాజీ పబ్లికేషన్స్, 11/339 ఎ1, అరవింద్‌నగర్, అనంతపురం.
3. మాడభూషి సంపత్‌కుమార్ (సం.) -పరిశోధన: నాడు, నేడు, రేపు (అంతర్జాతీయ సదస్సు), పాలపిట్టబుక్స్, 16/11-20/6/1/1 403, విజయసాయి రెసిడెన్సీ సలీంనగర్, మలక్‌పేట.
4. కె.బాలగోపాల్ - ఆదివాసుల వైద్యం సంస్కృతి అణచివేత, పర్‌స్పెక్టివ్స్ సామాజిక శాస్త్రం / సాహిత్యం, హైదరాబాద్ 2015.
5. బి.రామరాజు - తెలుగు జానపద గేయ సాహిత్యము, జానపద విజ్ఞాన ప్రచురణలు, హైదరాబాద్, 1978.
6. పి.యస్.సుబ్రహ్మణ్యం - ఆధునిక భాషా శాస్త్రి సిద్ధాంతాలు, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 2004.
7. పి.యస్.సుబ్రహ్మణ్యం - ద్రావిడ భాషలు, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 2006.
8. ఆర్వీయార్ - పూర్వగాథ కల్పతరువు, ప్రతిభ పబ్లికేషన్స్, ఎల్.బి.నగర్, హైదరాబాద్.
9. నాయని కృష్ణకుమారి - తెలుగు జానపద గేయ గాథలు, తెలుగు అకాడమి, హైదరాబాద్.
10. ఇంటర్వ్యూలు - 1.మేకల యానాది కిష్టయ్య 2.యానాది పాపయ్య 3.యానిది అంకయ, 4.యానాది అంకమ్మ.
11. వి.శంకరరావు (సం.) - జానపద విజ్ఞానం - సమకాలీన సమాజం (జాతీయ సదస్సు ప్రత్యేక సంచిక ఏప్రిల్ 27, 28) తెలుగు శాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం, 2013.
12. తెలుగు సామెతలు - పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 2007.

చెంచులెరుకల జీవన విధానం – వైరుధ్యాలు

– డా॥ నూనె అంకమ్మరావు

సంస్కృతి, సమాజము, భాష అనేవి ఒకదానితో ఒకటి ముడిపడి దగ్గర సంబంధం ఉన్న అంశాలు. ఆదివాసి సంస్కృతిని, వారి యొక్క గొప్పతనాన్ని వారికే తెలియ జేయాల్సిన పరిస్థితిలో నేటి సమాజం ఉంది. సమాజం నిర్మితికి సంస్కృతి మూలమైతే, ఆ సంస్కృతి మనుగడకు భాష అత్యంత ఆవశ్యకమైనది. సంస్కృతి అనేది ఒక తెగ, ప్రాంతం, జాతికి సంబంధించిన జీవన విధానం.

గిరిజనులు ఎక్కువగా అటవీ కొండ ప్రాంతాల్లో నివ సించడం, వారి ప్రాంతాలకు బాహ్య ప్రపంచంతో సంబం ధాలు లేకపోవడం వలన వారికంటూ ఒక ప్రత్యేకమైన జీవనశైలి ఏర్పడడానికి అవకాశం ఏర్పడింది. వారి సంస్కృతి అంతా ప్రకృతితో ముడిపడి ఉంటుంది. సంస్కృతి అనేది జీవనది లాంటిది. మార్పు సహజమే అయినా గిరిజన సంస్కృతిలో ఇంతకుముందున్న అంత ర్గత పరిస్థితుల వల్ల వచ్చిన మార్పులకు సమాజం ఆమోదం ఉంటుంది. గిరిజన ప్రాంతాలకు బయటి ప్రాంతాలతో ఆర్థిక సంబంధాలు చాలా తక్కువగా ఉం డేవి. "ప్రకృతి - మానవుడు - మానవాతీత శక్తుల కల యిక"గా జీవించిన గిరిజనులు నేడు చొరబాటుదారుడిగా గుర్తించబడుతున్న అమానుషత్వాన్ని నేడు మనం చూస్తున్నాం. ఆదివాసుల ప్రధాన జీవనోపాధి వ్యవ సాయంగా కనిపిస్తుంది. కానీ నేటి ఆధునిక విద్య, పట్టణీ కరణ ఆదివాసులను వారి సంస్కృతికి దూరంగా నెట్టివేయ బడుతున్నాయి. అందువలన అటవీ సంపద తరిగిపోయి ఆదివాసుల జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నాయి. అడవు లపై ఆధారపడి బ్రతికే ఆదివాసులే అడవుల నాశనానికి హేతువులని నేటి ప్రభుత్వాలు వాళ్లను బాధ్యులుగా పేర్కొంటున్నాయి. అది ఎంతవరకు సమంజసమో తేల్చ వలసిన అవసరం నేటి సమాజం ముందు, విజ్ఞత కలిగిన మేధావుల ముందు ఉంది. ఈ విధానం గిరిజనుల మౌలిక అస్థిత్వాన్ని దెబ్బతీసేలాగ కనిపిస్తుంది. దానిపై చర్చ జరగవలసిన అవసరముంది. ఇక ప్రస్తుత అంశానికి వచ్చినట్లయితే ఆదివాసుల్లో ఒక రకమైన ప్రత్యేకతను సంతరించుకున్న జాతులు చెంచు - ఎరుకుల జాతులు, వారి జీవనవిధానంలో ఎన్నో వైరుధ్యాలు కనిపిస్తాయి. ముందుగా చెంచులు గురించి ప్రస్తావించుకుందాం. హరి దాసులు, బుడబుక్కలు, కాటికాపరులు, బోయ, కోయ, ఎరుకుల, యానాది, లంబాడి మొదలైన ఆదిమ జాతుల్లో చెంచుజాతి ఒకటి. ఆంధ్రప్రదేశ్‌లోని షెడ్యూల్డు తెగల జాబితాలో 3వ కులం ఈ చెంచులు. వీళ్ళు పూర్తిగా ఆదివాసీలు. వీళ్ళు ప్రాచీన సంచార తెగలలో ఒకరు. వీరి నివాస స్థలం నల్లమల ప్రాంతంలోని కొండలు, గుట్టలు.

విశాలమైన కృష్ణానదీ పరివాహక ప్రాంతాలు చెంచులు విస్తరించి, అటు నిజాం రాజ్యానికి, యిటు బ్రిటిషు పరి పాలనలోని మద్రాస్ ప్రెసిడెన్సీకి సరిహద్దుగా ఉన్న ప్రాంతాల్లో కనిపించేవారని తెలుస్తుంది. వీళ్ళు తెలుగులో కూడా బాగా మాట్లాడతారని, రింగుల జుట్టు కలిగి, విశాల వదనంతో పాటు చప్పిడి ముక్కు, పొడవాటి దవడ కలిగి, పొట్టిగా, నల్లగా అచ్చం శ్రీలంకలోని ప్రాచీన తెగ అయిన వెద్దాలను పోలివుంటారట. ఈ జాతులు ఆడవాళ్ళు నూలు రవిక, చీర కట్టుకుంటే మగవాళ్ళు గోచీ పెట్టు కుంటారు. విల్లంబులు, ఒక కత్తి, గొడ్డలి, గుంతలు తవ్వె కర్ర, కొన్ని కుండలు, బుట్టలు మరికొన్ని చింకిపాతలు ఆస్తులుగా కలిగిన అత్యంత నిరుపేదలు చెంచులు. వేటను దైవంగా, పండ్లను ఆహారంగా తీసుకుంటారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు,కర్ణాటక రాష్ట్రాల్లో నివసిస్తున్న మరోజాతి ఎరుకుల. వీళ్ళు గిరిజనులుగా, ఆదిమవాసులుగా పరిగణించబడతారు. హిందూమత సాంప్రదాయాలను కలిగి ఎరుకుల

భాషతోపాటు తెలుగు, తమిళం, కన్నడ మాట్లాడతారు. తెలుగు ప్రాంతాల్లో నివసిస్తున్న ఈ జాతికి చెందిన స్త్రీలు ఎరుక చెప్పటం (సోది, గద్దె, జ్యోతిష్యం) ప్రధాన వృత్తిగా ఉండేదని తెలుస్తోంది. మహారాష్ట్రలో అయితే ఎరుకలను కైకాడి- కుచికొర్వే (మకడ్‌వాలా) అని వ్యవహరిస్తారు. ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ తెగల జాబితాల్లో 33వ కులంగా పరిగణింపబడ్డారు.

ఎరుకలను తమను తాము ఏకలవ్యుని వంశంగా భావిస్తారు. మహాభారతంలోని ఏకలవ్యుడు నిషాద కులానికి చెందినవాడని ఈ నిషాదులకే ఉత్తర భారతదేశంలో కిరాతులుగా పిలవబడతారని వ్యవహారంలోని ఖిల్ (విల్లు అనే పదానికి అపభ్రంశం) తెగ ఈ కిరాతులు, నిషాదులకు సంబంధం కలవారని, ఎరుకలు ఈ ఖిల్ తెగకు సంబంధించిన శాఖ అని భావిస్తారు. వాళ్ళు కూడా చెంచులు లాగా అటవీ కొండ ప్రాంతాలతో పాటు మైదాన ప్రాంతాలలో నివసిస్తారు. చెంచులులాగ వ్యవసాయం చేస్తూ జంతువులను పోషిస్తూ, చేతివృత్తులను కలిగి ఉన్నారు.

మతము :

చెంచులు "ఆకాశ దేవుణ్ణి" ఆరాధిస్తూ నరసింహ స్వామి, మలికార్జున స్వామి, భ్రమరాంబను కూడ కొలుస్తారు. హిందు దేవతలైన శివుడు, వెంకటేశ్వరుడు, నరసింహస్వామి, నారాయణస్వామి, రాముడిని ఆరాధిస్తారు. మరియు పోలిమేర దేవతలైన అంకమ్మ, కొల్లపుర, సుంకాలమ్మ, పోలేరమ్మ, ఎల్లమ్మ మొదలగు గ్రామ దేవతలను కొలుస్తారు. ఇంకా ప్రకృతి ఆరాధ్యులైన సూర్య చంద్రులతో పాటు అగ్నిని పూజిస్తారు. ఇరువురు హిందూ మత సంపర్కం వల్ల హిందూమతాన్ని పాటిస్తారు. కొన్ని ప్రాంతాలలో ఆలయ ప్రవేశం లేనందువల్ల రాతి బొమ్మలు, మట్టిబొమ్మల్ని పెట్టుకొని ఆరాధిస్తారు. అయితే ఆధునికత ప్రపంచంలో మిషనరీల ప్రభావంతో క్రైస్తవ మతాన్ని అనుసరిస్తున్నారు కొంతమంది.

వివాహము :

చెంచులు, ఎరుకలు వివాహ క్రతువును సాంప్రదాయ బద్ధంగా నిర్వహిస్తారు. కట్నాలు, ఆర్భాటాలు లేకుండా కానుకలు (ఓలి) ద్వారా జరిపిస్తారు. ఇరుపక్షాలలో విడాకులు పొందే సౌకర్యం. మళ్ళీ పెళ్లి చేసుకునే సౌలభ్యం ఉంది. చెంచుల్లో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉండదు. ఎరుకల్లో క్రమశిక్షణతో కూడిన కుల పంచాయితీలు కనిపిస్తాయి. ఏదైనా తప్పు జరిగితే నేరనిర్ధారణ పద్ధతుల ద్వారా శిక్షలను అమలు చేస్తారు. చెంచులుకు కూడా గూడెం పెద్ద ఉంటాడు. ఒక చోటే స్థిరంగా ఉండరు. ఒక్కొక్క సీజన్‌లో ఒక్కొ చోటుకు మారుతుంటారు. ఎరుకలు దాదాపు ఉన్న ప్రదేశంలోనే జీవిస్తుంటారు.

ఆహారపు అలవాట్లు :

చెంచులు అడవి పండ్లతోపాటు, జంతువులను వేటాడి ఆహారంగా భుజిస్తారు. ఎరుకలు మాంసప్రియులు. పప్పుదినుసుల్ని, బియ్యాన్ని కూడా వాడతారు. చాపలు అల్లటము, పందుల పెంపకము, బుట్టల తయారు చేయుటము, చీపుర్లు తయారు చేయటం వారి సాంప్రదాయ వృత్తులుగా కొనసాగిస్తారు. ఎరుకల స్త్రీలు భవిష్యత్తు వాణి(సోది) చెప్పటములో ప్రత్యేకముగా ఉంటారు. మరియు కుటుంబ పాలనలో తెలివిగా ఉంటారు. చెంచుల్లో సింగి, సింగడు ప్రధాన పాత్రధారులుగా ఆటలు, పాటలు, డప్పువిన్యాసాలు, ఇప్పుపువ్వు సారాతాగి కుప్పిగంతులేయటం, నెమలినృత్యం, కోతి నృత్యం వారినృత్యాల్లో కనిపిస్తాయి.

అయితే మైదాన ప్రాంతాలలో నివసించే చెంచులు, ఎరుకల తెగలపై తప్పుడు కేసులను బనాయిం, వారిని అదుపుజేయటానికి నేరస్తుల జాతుల చట్టం ద్వారా హింసించటాన్ని వ్యతిరేకిస్తూ 1940 నుండి ఆయా వర్గాల వారిలో ఆత్మవిశ్వాసం పెంచటంతోపాటు, వారి సంక్షేమానికి అనేక కార్యక్రమాలను అమలుచేసి, ఆంగ్లంలో తెలుగులో అనేక రచనలు చేసిన వెన్నెల కంటి రాఘవయ్య పౌరహక్కుల ఉద్యమానికి మూలపురుషుడు. అలాగే తెలుగు రాష్ట్రాలలో సవరల గురించి ఎంతో శ్రమించి వారికి సవర భాషను బోధించటానికి కృషి చేసిన

గిడుగు రామమూర్తి పంతులు గారిని ఈ సందర్భంగా మనం స్మరించుకోవాలి. తెలుగుజాతి గర్వించదగ్గ మరో గొప్ప మానవ శాస్త్రజ్ఞుడు, గిరిజన సంస్కృతులు పరివర్తన పేరిట గిరిజనుల మీద పరిశోధన చేసిన డా॥వి.ఎన్.వి కృష్ణశాస్త్రి గారిని కూడా జ్ఞప్తికి తెచ్చుకోవాల్సిందే.

చెంచులు, ఎరుకల ఆచార, వ్యవహారాలు, సాంప్రదాయాలు ఎంత కఠినంగా ఉంటాయో అలాంటి కన్నీటి గాథను తెలిపే కథకావ్యాన్ని గూర్చి తెలుసుకోవాలి. అదే కవిరత్న డా॥ నాగభైరవకోటేశ్వరరావు గారు రాసిన "గుండ్లకమ్మ చెప్పిన కథ" కావ్యం. హృదయాన్ని కదిలించే ఈ విషాద ప్రేమగాథ యధార్థాన్ని పరిశీలిద్దాం. అది ఒక నదితీర ప్రాంతం. అనంత గాథలకు నిలయం. అక్కడ ఒక వైపు చెంచుగూడెం, ఇంకొకవైపు ఎరుకల గూడెం. ఆ రెండింటిని విడదీస్తూ గుండ్లకమ్మ. చెంచులకు ఎరుకలకు మధ్య పచ్చగడ్డివేసిన భగ్గుమంటుంది. త్రాగేది ఒక ఏటి నీరే, కానీ జీవితంలో ఎవరికి వారే. అలాంటి ఒక గాథను పరిశీలిద్దాం.

"ప్రేమకెవ్వడు సరిహద్దు పెట్టగలడు
మమతకెవ్వడు సరిహద్దు మలచగలడు
రెండు హృదయాల మధ్య వరించి నిలుచు
వంతెనను కూల్చి యెవ్వడు వరలగలడు"

అంకి, అద్దడి కళ్ళు ఎప్పుడు కలుసుకున్నాయో వారి చూపులకు ఎప్పుడు చుట్టరికం కలిగిందో వారిద్దరికే తెలుసు. ప్రేమసాగరంలో ఎన్ని మునకలు వేశారో, ఎప్పుడెప్పుడు తేలియాడరో గుండ్లకమ్మకు మాత్రమే తెలుసు. వారి ప్రణయానికి అది సాక్షి. చంద్రుడు, గాలి, చీకటి, ఇసుక తిన్నెలు, తారలు సాక్షి. కాని అవన్ని వారి మూగ బాసలు. మూడో కంటికి తెలియవు.

ఒక రోజు చెంచుదొర సంధ్యాకాల సమయాన ఒక సమావేశం ఏర్పాటుచేసి చెంచుజాతి ఆత్మాభిమానాన్ని స్మరింపజేసి రాబోయే కార్తీక పూర్ణిమ జాతరలను గూర్చి దొర ఆదేశాలు జారీ చేశాడు. రేయెల్ల జాతర రేగాలనీ, చెంచుల నాట్యగానాలతో లక్ష్మీ పొంగారాలనీ, గాన నాట్యాలలో అంకిదే అధిపత్యమని ఆదేశాలు జారీ చేశాడు. ఈ సందర్భంలో చెంచుగూడెం నాయకుని మాటల్లో వాళ్ళ గొప్పతనం ఇలా ప్రతిధ్వనిస్తుంది.

మనది చెంచుల జాతి - ఆత్మాభిమాన
గరిమచే వెలుగొందెడి ఘనతమనది
చెంచుకులమున బుట్టి ఆసిరివెలంది
ఖ్యాతి గూర్చిన యట్టి ప్రఖ్యాత జాతి
జాతియేకాదు మనకున్న నీతి ఘనము
నీతి యేకాదు మనమున్న రీతి ఘనము
ఒకరి జోలికి పోము - వేరోకరువచ్చి
వేలుపెట్టిన సహించి విడువలేము

జాతరవేళ పున్నమరేయి తందనాలు ముగిసిన పిమ్మట అంకి అద్దడి చెంతచేరింది. వారి కలయిక ఒక చెంచెత కంటబడింది. ఇంకేముంది గూడెమంతా ఆ విషయం గుప్పుమంది. అద్దడిసహా అంకి చెట్టుకు కట్టి వేయబడ్డారు. జాతివైరి అయిన ఎరుకల యువకునితో ప్రేమ ఆమె చేసిన నేరం. అందరూ కలిసికట్టుగా వారిద్దరినీ పరాభవించారు. తీర్పుకోసం దొర ముందుంచారు. దొర నిప్పులుక్రక్కుతాడని అందరూ భావిస్తే అతడు రాతి విగ్రహమయ్యాడు. అంకి మానవతావాదానికి దొర కన్నీళ్ళు కార్చాడే తప్ప మారు మాట్లాడలేకపోయాడు. దండించే ధైర్యం చేయలేక ఆధిపత్యాన్ని వదిలి అడవి దారిపట్టాడు. అంతే ఇక అందరూ పెద్దలయ్యారు. ఎరుకల యువకుని నెత్తురు కంటచూచినారు. ఆ యువకుని విశ్వమానవ సౌహార్థాన్ని వినిపించాడు. అయినా అది అడవికాచిన వెన్నెలే అయ్యింది. ఆ క్షణం చెట్టుకు మంట పెట్టారు. ఆ జంట కాలి బూడిదయ్యింది. గాలి దేవుడు, వాన దేవుడు కూడా కోపించారు. వాన వాగుగా, వాగు నదిగా, ఆ నదే గుండ్లకమ్మగా విజృంభించింది. ఊళ్లలో ఆ జాతి గాథను ప్రచారం చేస్తూ తిరిగింది. తెల్ల వారే సరికి ఉప్పెన తీసింది. చెంచుల గూడెం, ఎరుకల గూడెం కానీ వేరే గూడెం కానీ లేవు. శాంతించిన గుండ్లకమ్మ శోకగీతాలు పాడుకొంది. ఆకాశం, చంద్రుడు, సైకతాలు,

పిల్లగాలులు, అడవి, పుడమి అన్ని ఆ గీతాలు విన్నాయి. కాలం సాగుతూనే వుంది. అంకీ,అద్దడూ ఇద్దరు లేరు. అయినా వారిప్రేమ చిరంజీవి.. దానికి ఈ నాటి పేరు అద్దంకి.

ఇది గుండ్లకమ్మ చెప్పిన కథలో కథాభాగం. అద్దంకి పేరును అంకి, అద్దడు. వారిద్దరు సంయోగ రూపంగా భావించి ఈ కథాకల్పన చేశారు. అయితే ఈ కథలో ఆ రెండు పేరులు మాత్రమే చారిత్రక సాక్ష్యాలుగా స్థానికుల నోట వినిపిస్తాయి.. ఈ నేలపై తొలిగడ్డ నెత్తినవారు అంకి, అద్దడు అనే దంపతులన్న ఆధారమే ఈ కథకు మూలం. అయితే కలిసి బ్రతికిన ఏ జంట కలకాలం లోకంపై ముద్రవేయలేదని కవి భావించాడో ఏమో ఆ ఇద్దరిని విధివంచితులను చేసి విడదీసి జాతిపట్టింపులకు బలిచేసి చిత్రీకరించారు. ఇది రెండు తెగల మధ్యగల సంఘర్షణలు కరిగిపోయిన కల.

ఈ దేశంలో నాటికి నేటికి అదే స్థితి. ప్రేమ బలి కావడానికి కానీ, సానిహిత్యం సమసిపోవటానికి గానీ, జాతి భేదముంటే చాలు, జాతి వైరం అక్కరలేదు. వైవాహిక సంబంధాల విషయంలో జాతిభేదాన్ని అంగీకరించ లేకపోవడం ఇక్కడ వైరం కన్నా వైషమ్యానికి ప్రాధాన్య మివ్వటం వలన వాళ్ళ మధ్య వైరుధ్యాలు పతాకస్థాయికి చేరి వారి జీవితాలు పతనమయ్యాయి.

"బ్రతుకు సుకముకు రాజమార్గము / ప్రేమనిచ్చిన ప్రేమవచ్చును
ప్రేమ నిలిపిన ప్రేమనిలుచును/ఇంతియే" అన్న గుర జాడ మాటలు మన్నిద్దాం. ఆ బాటలో పయనిద్దాం...

ఆధార గ్రంథాలు :

1. అవలోకన (వ్యాససంపుటి) - డా॥ వెన్నిసెట్టి సింగారావు.
2. ఆదివాసీ ఆత్మగానం - డా॥.వి.ఎన్.వి.కె శాస్త్రి.
3. ఉచిత ఉపాధ్యాయులు ఆదివాసీలు - ప్రొ॥కంచ ఐలయ్య షెపర్డ్.
4. నాగభైరవం (1) - డా॥ నాగభైరవ కోటేశ్వరరావు.
5. ఇంకా వివిధ పత్రికలు.

గిరిజనుల నృత్యరీతులు – ఆదిమవాసులు – నృత్యాలు

-వైరాగ్యం ప్రభాకర్, కరీంనగర్, తెలంగాణ.

అమాయకత్వం నిండిన చూపులు, నీతి నిజాయితీలకు నిలువుటద్దం, పరస్పర సహకారతత్వం, ఐకమత్యానికి ప్రతీకలు, అత్యాశకు ఆమడ దూరంలో జీవించేవారు, ఉన్నంతలో తృప్తిగా బతికేవారు,నాగరికతకు దూరంగా ఉన్నా నాగరికులకు ఆదర్శంగా నిలుస్తున్నారు గిరిజనులు. ఎక్కడో అడవులలో,కొండ కోనలలో మనుషులనే కర జంతువులకు దూరంగా అడవి మృగాలనే సాధు జంతువులకు దగ్గరగా జీవిస్తున్నారు. గిరిజనుల సంస్కృతిలో నాట్యం ఒక భాగం. గిరిజనులు అనేక సాంప్రదాయ నృత్యాలను చేస్తుంటారు. ఆయా ప్రాంతాలలో నివసించే వారు అక్కడి జీవన విధానానికి, పండుగలకి అనగుణంగా నృత్యాలు ఉంటాయి. అవేమిటో ఒకసారి చూద్దా.

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాలలో మొత్తం ముప్పై ఎనిమిది గిరిజన జాతులున్నట్లు.వారి జనాభా పదమూడు లక్షలున్నట్లుగా "నాట్య కళ' అనే జానపదుల కళల ప్రత్యేక సంచికలలో పొందు పరచబడింది. వీరు వివిధ ప్రాంతాలలో నివసిస్తున్నారు.జిల్లాలవారిగా చూసినప్పుడు...

ఆదిలాబాద్ జిల్లాలోని ముఖ్య జాతులు గోండులు, కొలాములు, మధురాలు, ప్రధానులు, ఆంధ్రులు. నాయకపోడులు. కరీంనగర్ జిల్లాలో, కోయలు, కొండ రెడ్లు ఎక్కువగా వరంగల్, ఖమ్మం, ఉభయ గోదావరి జిల్లాల ఏజెన్సీ ప్రాంతంలో కనిపిస్తారు. ఆంధ్రప్రదేశ్ లోని, శ్రీకాకుళం జిల్లాలోని కొండ ప్రాంతాల్లో బగతలు, కొండ దొరలు, వాల్మీకులు, మూలదొరలు, సామంతులు, గదబలు, కమ్మరులు, కోటియాలు ఎక్కువగా ఉంటారు. శ్రీకాకుళం జిల్లాలో జాతపుదొరలు, సవరలు మాత్రమే కొండప్రాంతాలలో ఉంటారు. కర్నూలు జిల్లాలోని నల్లమల అడవులలోను, మహబూబ్ నగర్ జిల్లాలోని అమరాబాద్ పీఠభూమి ప్రాంతంలో చెంచులు నివసిస్తున్నారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో కనిపించే జాతి బంజారులు. వీరినే సుగాలీలనీ, లబానీలని, లంబాడీలని కూడా పిలుస్తారు. ఎరుకలు, ఏనాదులు మైదాన ప్రాంతాలలో నివసిస్తున్నారు.

వృత్తి :

గిరిజనులకు సంవత్సరమంతా వ్యవసాయమే జీవనాధారం. గోండులు, కోయలు,బగతలు వాల్మీకులు స్థిర నివాసాలు ఏర్పరుచుకొని భూములలో వ్యవసాయం చేస్తుంటారు. కొండరెడ్లు, కొండదొరలు, సామంతులు, సవరలు ఒకచోట నిలకడగా ఉండక ఇష్టమైన ప్రదేశాలలో ఉంటూ వ్వవసాయం చేస్తుంటారు. కోయలు, బగతలు, వాల్మీకులు, కొలాములు, నాయకపోడులు, కోటియాలు ముఖదొరలు మొదలైన గిరిజన జాతులు పోడు వ్యవసాయం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందుతారు. ఇవే కాకుండా అడవి నుంచి లభించే ప్రకృతిక సంపదని వినియోగించుకుంటారు. వాటి అమ్మకం ద్వారా వచ్చే ధనంతో తమ ఇతర అవసరాలు తీర్చుకుంటారు.

గిరిజన నృత్యాలు :

గోండుల గుసాడీ నృత్యం :

ఆదిలాబాద్ జిల్లాలోని గోండులు చలికాలం ప్రారంభ సమయానికి పంటలు ఇంటికి వచ్చి చేరతాయి. ఆటపాటలతో సమయం గడుపుతారు. కొమ్ములూదుతూ తప్పెట్లు వాయిస్తూ, పురాణ గాధలలోని" దండారియా రౌడ్, సిసిసెర్మా రౌడ్" అనే కథానాయకులను అనుసరిస్తూ, సుమారు 40మంది దాకా చేరి దండారీ నృత్యం చేస్తారు. సాంప్రదాయకమైన నృత్యం దీపావళి నెలలో పౌర్ణమి నాడు ప్రారంభమై చతుర్దశి వరకు జరుగుతుంది.దండారీ నృత్యంలో గుసాడీ నృత్యం ఒక భాగం. నెమలి పింఛంతో తయారు చేసిన గొర్రె కొమ్ములను అమర్చిన తలపాగా,

కృత్రిమ గడ్డాలు మీసాలతో వేషం కట్టడం,మేకతోలు కప్పుకోవడం గుసాడి నర్తకుడికి అవసరమైన సామాగ్రి. డప్పు, తుడుము, పిప్రే, బాకా, కలికోయ్ (తప్పెట) మొదలైన సంగీత వాయిద్య, నృత్య పరికరాలను గోండులు అతి పవిత్రంగా భావిస్తారు.

దండారి కోలాట నృత్యం :

ఈ నృత్యంలో వలయాకారంగా నిలుచుని ఎడమ వైపుకు అడుగులు వేస్తూ,కుడి పాదాన్ని ఎడమ కాలు మీదకి ఊగిస్తుండటంతో నృత్యం ప్రారంభమౌతుంది. తమ చేతిలోని కోలాటం కర్రలు ఒకదానికొకటి తాకిస్తూ కుడివైపునున్న నర్తకుని కర్రను కొడుతూ, కోలాట మాడుతూ నర్తకులందరూ వంగి కర్రలను నేలకు తాకించి నాలుగు దిక్కులకూ అడుగులు వేస్తారు. ఇలా దేవతలకు మొక్కిన తదుపరి వలయాన్ని సరిచేసుకొని కర్రలను పాదాల వద్దనుంచి పాటకు అనుగుణంగా చేతులతో చప్పట్లు కొడతారు. ఒక బృందం చరణాన్ని ముగించగానే మరొక బృందం మరొక చరణాన్ని అందుకుంటుంది.ఈ నృత్యం జరుగుతున్న సమయంలో నలుగురైదుగురు గుసాడీలు దండారీల వలయంలోకి రావడంతో దండారీలు చెల్లా చెదరౌతారు. ఇది ప్రేక్షకులకు ఎంతో వినోదాత్మకంగా,ఆనందదాయకంగా ఉంటుంది.గోండు భాషలో గుసాడి అంటె అల్లరి అని అర్థం.గుసాడీల మెడలో గవ్వల తుంగకాయల హారాలు, నడుముకు, మణికట్టుకు చిరుగజ్జెలతో, నారింజ రంగు లంగోటి తప్ప ఇతర ఆచ్ఛాదనలేవీ శరీరంపై ఉండవు.

సామంతుల మయూర నృత్యం :

సామంతులు (గొండులు) తరతరాలుగా కాపాడు కుంటూ వస్తున్న సాంస్కృతిక సంపదలో మయూర నృత్యం ముఖ్యమైనది. ఏప్రిల్ నెల చైత్ర పర్వదినం సందర్భంలో చేసే ఈ నృత్యంలో పిరోడి అనే మురళి, కాళ్ళకు కట్టుకునే గజ్జెలు ముఖ్యమైనవి. తెల్లని ధోవతి కట్టుకొని, కాళ్ళకు గజ్జెలు(ముయ్యింగ) తలకు తోయంగ అనే తుంగ గడ్డితో చేసిన పాగాకు రంగు కుచ్చులు కలిగిన తలపాగ, నడుము వెనుక నెమలి పింఛాల గుత్తిని కట్టుకుంటారు. నర్తకులందరూ రెండు వరుసల్లో వలయా కారంగా నిలుచుని నోటితో నెమలిలా శబ్దం చేస్తూ మయూరంలా నాట్యం చేస్తూ మోకాలి పై ముందుకు వంగి భూమాతకు సూర్య భగవానునికి నమస్కరించి నృత్యం ప్రారంభిస్తారు.

జోడియా :

ఈ నృత్యాన్ని పులకమ్మ, గంగాదేవి, గౌరమ్మ మొద లైన పండుగల సందర్భంగా కొండ్య మట్టియా, జోడియా జాతుల మగవాళ్ళు ఆడవాళ్లు కలసి చేస్తారు పది అడు గుల కర్రమీద ఇద్దరు నిల్చోగా మిగతా బృందం నాట్యం చేయడం ఈ నృత్యం ప్రత్యేకత.

పూల పండ్లు :

పెళ్ళిళ్ళ మరియు దేవీ పూజల సందర్భంలో ఆడ మగ కలసి చేసే బృంద నృత్యం ఇది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళంకు చెందిన సవర జాతి వారు చేసే గిరిజన నృత్యం.

చెంచు నృత్యం :

తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్ నగర్ కు చెందిన చెంచు జాతి వారి పెళ్ళిళ్ళ సందర్భంగా ఆడ మగ కలసి చేసే నృత్యం.

లంబాడి నృత్యం :

తెలంగాణలోని నల్లగొండకు చెందిన లంబాడీ జాతి వారు హోలీ పండుగ సందర్భంగా చేసే నృత్యం. దీనినే హోలీ నృత్యం అనికూడా అంటారు. ఇది స్త్రీ పురుషులు ఇరువురు కలిసి చేసే నృత్యం.

కోయ నృత్యం :

తెలంగాణలోని ఖమ్మం జిల్లాకు చెందిన కోయజాతి వారు విత్తనాలు నాటుతూ చేసే నృత్యం. ఆడ మగ కలిసి చేసే బృంద నృత్యమిది.

వరికోత నృత్యం :

ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు పశ్చిమ గోదావరి ప్రాంతా లలో వరి పంట చేతికి వచ్చిన సందర్భంగా స్త్రీ పురుషులు కలిసి చేసే నృత్యం.

చెంచులు – జీవన శైలి

– డా. యన్. కొచ్. పి. కిరణ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్, ఆంధ్ర క్రైస్తవ కళాశాల, గుంటూరు.

పచ్చని అడవి తల్లి ఒడిలో హాయిగా, స్వేచ్ఛగా బ్రతికే చెంచులు అంతరించిపోతున్న గిరిజన జాతుల్లో చేరి పోతోంది. ప్రాచీన సంచార తెగలకు చెందిన వీరు తెలంగాణా ప్రాంతంలోని మహబూబ్ నగర్, నల్గొండ జిల్లాల్లో, సీమాంధ్ర ప్రాంతంలోని కర్నూలు, ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో విస్తరించిన దట్టమైన నల్లమల్ల అటవీ ప్రాంతంలో వేల సంవత్సరాలుగా జీవిస్తున్నారు. ఈ ప్రాంతాల్లోని కొండలు, గుట్టలు, చెంచులు ప్రస్తుత నివాస స్థలం. అటు నిజాం రాజ్యానికి, ఇటు బ్రిటీష్ పాలనలోని మద్రాస్ ప్రెసిడెన్సీకి సరిహద్దుగా ఉన్న కృష్ణానదికి ఇరు వైపులా ఉన్న ప్రాంతాల్లో కూడా వీరు కనిపిస్తుంటారు. లిపిలేని ఆదిమ భాషతోపాటు తెలుగు భాషా కూడా మాట్లాడుకుంటారు. ఆహార్యంలో చెంచులు రింగుల జుట్టు, విశాలవదనం, చప్పిడి ముక్కు, పొడవాటి దవడతో పొట్టిగా నల్లగా వుంటారు.పురుషులు గోచీ మాత్రమే పెట్టుకుంటారు. ఆడవాళ్ళు మోకాలు దాకా నూలు చీర కట్టుకుంటారు. ఎద భాగాన్ని చీర కొంగుతో కప్పుకుంటారు. విల్లంబులు, కత్తి, గొడ్డలి, రాతిపని ముట్లు, మట్టికుండలు, నారబట్టలు వాడుతూ వెదురు గుడిసెల్లో జీవనం సాగిస్తుంటారు. చెంచుల గురించి గుర్రం జాషువా గబ్బిలం కావ్యంలో

"విలు నమ్ముల్ ధరియించి చెంచులు తదాభీలాటవీ
మధ్య భూ
ముల కన్పట్టిన నంజలింపుము మహాత్ముండైన
భర్గుండు భ
క్తుల కిష్టార్థము లీయగోరిన గణస్తోమంబుతో మాయ పం
దుల పేటాడుచు బిల్లుడై నరుల కన్నుల్ గప్పి
క్రీడించెడిన్ - (గుర్రం జాషువా గబ్బిలం)

అని చెంచుల గురించి వివరించారు. చెంచులు వ్యక్తిగత స్వేచ్ఛను కోరుకుంటారు. ఆ భావనతో వీరు అటవీ ప్రాంతాలను వదిలి రావడానికి యిష్టపడరు. వీరు ఆహారానికి, బ్రతుకు సజావుగా సాగ డానికి కాళీ మాతను పోలివుండే దేవతను పూజిస్తారు. చావు వచ్చినపుడు దేవుడితో కలిసిపోతారని ప్రగాఢంగా విశ్వసిస్తారు. కష్టం వచ్చినా, సుఖం వచ్చినా అన్నింటికి కాళీదేవేనని ముగ్ధగా నమ్ముతారు. "ఆకాశదేవుణ్ణి" కూడా పూజిస్తారు. చెంచుల ఇలవేల్పువైన శ్రీశైలం మల్లికార్జున స్వామి, అహోభిళ లక్ష్మీనరసింహస్వామి దేవాలయాలు వందల సంవత్సరాలుగా చెంచుల సంరక్షణలోవుండేవి. ఇప్పటికీ శ్రీశైలం మల్లన్న ఆలయంలో జరిగేపూజా కార్యక్రమంలో చెంచులకు ప్రత్యేకస్థానం వుంది.

చెంచుల ఆహారపు అలవాట్లు :

అడవుల్లో దొరికే అన్ని రకాల పండ్లను ఇష్టపడతారు కొన్ని రకాల జంతువులతోపాటు బాగా యిష్టపడేది ఉడుము, అడవిపంది, తాబేలు, ముంగిసలతో పాటు నక్కలను కూడా తింటారు. రోజూ ఒకే రకమైన ఆహారాన్ని యిష్టపడరు. రుచులు కోరుకుంటారు.నోరు చప్పిడి పోయిందని అందరు కూడా పలుక్కుని వారు తినాలను కున్న ఆహారం కోసం గుంపులుగా అడవికి వెళతారు. ఆహారపు వేటలో చెంచులకు తోడుగా కుక్కకూడా భాగ స్వామ్యాన్ని కలిగి వుంటుంది. ఆహారపు వేటలో వీరు చాలా దూరం ప్రయాణం చేస్తుంటారు. మార్గ మధ్యలో వెంట తీసికెళ్ళిన పదార్థాలు అయిపొగా తాగేనీటి కూడా తీవ్ర యిబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఎదురువు తాయి. అప్పుడు తెనెను తాగడానికి యిష్టపడతారు. తేనె గడ్డలను తింటారు. ఆ ఎండల్లో తేనె తాగడం వల్ల తీవ్ర మైన దప్పిక వేస్తుంది. ఎక్కడా నీళ్లు దొరకనప్పుడు ఉసిరి కాయలను తింటారు. దీనిని తిన్నందువల్ల పులుపు ఒగరు వల్ల నోట్లో నీళ్ళువూరుతాయి. దీనివల్ల కొంత ఉపశమనం కలుగుతుంది అలాగే అడవిలో దొరికే

ఒకరకమైన చెట్టు తీగ నరుకుతారు దాని నుండి వచ్చే నీరు తాగుతారు. ఇలా దాహం తీర్చుకోవడానికి ప్రకృతిలో దొరికే అనేక మార్గాలు చెంచులకు మాత్రమే తెలుసు.

చింతగింజలు - జీడి గింజలు, జీడిపప్పులను సేవిస్తుంటారు. ఇది అందరికీ తెలిసిందే. జీవితాలను నాశనం చేసింది! చేసేది సారా! నాటుసారాను విపరీతంగా తాగుతారు. ఇదొక వ్యసనం ఏ గూడెం చూసిన ఈ వ్యసనంలో మునిగి పోయివుంటుంది. బెల్లం ఊట, తుమ్మ చెక్కతో, మురగబెట్టి నాటు సారా తయారు చేస్తారు. సారా కాసే పద్ధతి వీరికి వంశపారంపర్యంగా అలవడింది. అలాగే తీయని మత్తెక్కించే వాసనతో ఉండే విప్పలను సేకరించి సారా చేసుకుంటారు. కాలక్రమేణా అమాయకపు ఆదిమ చెంచు గిరిజనుల పాలిట నాటు సారా, మృత్యు పాశంగా మారింది. మితిమీరి తాగడం వల్ల శరీరం శుష్కించి అకాల మరణం చెందుతున్నారు. వీరి సగటు జీవన ప్రయాణం 45 ఏళ్ళు కాగా సారా మూలంగా 30సం॥రాలకే చచ్చిపోవడం వల్ల పెళ్ళయిన నాలుగేళ్ళకే ఎందరో చెంచులు భార్యలు విధవలై చంటి పిల్లలతో నరక యాతన పడుతుంటారు.

ముగింపు :

చెంచుల ప్రపంచంలో వేగంగా అంతరించిపోతున్న జాతుల్లో ఒకరు పళ్ళు, తేనె వంటి వాటిని సేకరించటం వీరి దినచర్య - కాలక్రమేణ వలస పోతున్నారు. అటవీ ప్రాంత విస్తీర్ణం రోజు రోజుకు తగ్గిపోవడం నల్లమల్ల అడవులను అభయారణ్యంగా ప్రకటించటం వల్ల అడవితల్లి ఒడి నుంచి బయటికి రావలసి వస్తోంది. సంచార జీవితం గడుపుతూ తాత్కాలిక జీవితాన్ని గడుపుతున్నారు. ఒకప్పుడు అడవితల్లి ఒడిలో హాయిగా బ్రతికి వీరంతా ప్రస్తుతం దుర్భర పరిస్థితుల్లో బ్రతుకు బండి నడుస్తోంది. ఒకప్పుడు 25వేల మంది ఉండే చెంచులు కాలంతో పాటు కరిగిపోతున్నారు. కుటుంబ పెద్ద తాగుడు వ్యసనంతో అర్ధాంతరంగా చనిపోవడంవల్ల కుటుంబ భారం స్త్రీలపై పడడం వల్ల వారి పిల్లలకు విద్య అందని ద్రాక్షగానే ఉండిపోతుంది. ప్రభుత్వాలు పెద్ద మనసుతో పాఠశాలలు ఏర్పాటు చేసినా అక్కడ తగిన మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల ఉపాధ్యాయులు క్రమంగా రాకపోవడం, పర్యవేక్షణ లేకపోవడం మొదలగు కారణాలు కూడా వీరికి విద్య దూరమౌతుంది. వైద్య సౌకర్యాలు కూడా అంతత మాత్రమే. సాధారణ రోగాలొచ్చిన దాదాపు 50మైళ్ల దూరం నడిచి సమీప ప్రభుత్వ హాస్పటల్స్‌కు వెళ్ళాల్సివస్తోంది. అలాగే ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు కూడా అందకుండానే మధ్య దళారులు చేతివాటం చేస్తున్నారు. ఆడపిల్లలకు 12,13 సం॥రాలకే వివాహం చేసే సంప్రదాయం ఈ చెంచుల జాతిలో ఉంది. అలాగే ఆడపిల్లలను దూరంగా ఉంచి చదివించే ఆర్థిక స్థోమత లేకపోవడం వల్ల వారు విద్యకు దూరమౌతున్నారు. తాత, తండ్రుల నుంచి సాగు చేసుకుంటూ వస్తున్న భూములు అన్యాక్రాంతమౌతున్నాయి. అందువల్ల ప్రభుత్వాలు, సామాజిక సేవాసంస్థలు అంతరించి పోతున్న చెంచుల జాతిని కాపాడవలసిన బాధ్యతను తీసుకోవాలి. అలాగే వారి కోసం ప్రత్యేకంగా ఆరోగ్య శిభిరాలు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పిస్తూ వాటిని వారికి చేరువగా తీసుకువెళ్ళాలి. అలాగే అప్పుడప్పుడు ఇలాంటి జాతియ సదస్సును అంతరించి పోతున్న గిరిజన జాతులను భవిష్యత్తు తరాలకు అవగాహన కలిగించే దిశగా వర్తమాన సమాజంలో విద్యార్థులకు ఇలాంటి జాతులువున్నాయనే ఆలోచన కలిగించే దిశలో సదస్సులు నిర్వహిస్తూవుండాలి. అప్పుడే వీరికి మనం కాపాడుకున్నవారమౌతాం.

ఉపయుక్త గ్రంధాలు :

1. చెంచుల జీవన మరణం అంచున : వి. వెంకటేశ్వర్లు 2. క్రీడాభిరామం : వినుకొండ వల్లభరాయుడు
3. గబ్బిలం : గుర్రం జాషువా 4. అస్తిత్వ ప్రమాదంలో చెంచులు : ఆంధ్రజ్యోతి దినపత్రిక 28.12.2008
5. చెంచులపై వ్యాసం : సాక్షి దినపత్రిక - 21.10.2008.

వలస పాలన – ఆదివాసులు

– డా.చదలవాడ విజయ కుమార్, శాఖాధ్యక్షులు, తెలుగు విభాగం, సి.ఆర్.కళాశాల, చిలకలూరిపేట, గుంటూరు జిల్లా.

మానవ పరిణామం అడవుల నుంచి ప్రారంభమైంది. కాలంతోపాటు అడవుల విస్తీర్ణం తగ్గడంతో అడవులు కాస్తా పల్లెలు, బస్తీలు మరియు నగరాలుగా విస్తరించింది. తొలి మానవుల జీవనాధారం అడవి. అందమైన జాతులను తన కడుపులో పొత్తిళ్ళలో పసిగుడ్డును దాచుకున్నట్లుగా దాచుకుంది. లాలించింది, భద్రతనిచ్చింది, భరోసానిచ్చింది. ఆ ప్రేమ పారవశ్యంతో మైమరచి స్వేచ్ఛగా బ్రతికారు ఆదివాసులు. అడవంతా తామై బ్రతికారు. ప్రతి మొక్కను, చెట్టును ముద్దాడారు. ఎంతటి క్రూరమృగన్నైనా మచ్చిక చేసుకున్నారు. కల్లాకపటం లేకుండా సమిష్టిగా బ్రతికారు. ఆహారాన్వేషణలో గుంపుగానే పోరాడారు, సాధించుకున్నారు. వాటాలు వేసుకున్నారు, తిన్నారు, తాగారు, చిందులేసారు. ఇష్టమైన దేవుళ్ళముందు ఆడామగా తేడా లేకుండా వివిధ పూజా పద్ధతులలో ఆరాధించారు. కష్టమొచ్చినా, జబ్బుచేసినా, చావొచ్చినా యిదంతా దేవుడి దయని నమ్మారు. నింద వేయలేదు. తమకు తాము నిందించుకున్నారు. నమ్మిన పద్ధతులను కట్టుబాట్లకు లోబడి జీవించారు. ఇలా అడవి అంతా తమకు భగవంతుడిచ్చిన సంపదని భ్రమించారు.

జంతువుల కంటే తెలివైన జంతువు 'మనిషనీ' పసిగట్టలేకపోయారు. తెలివైన కొన్ని మానవ మృగాలు భూమిపై ఉన్న సమస్త సంపద తమ కోసమే సృష్టించబడ్డాయని స్వార్థం నిలువెల్లా నింపుకున్నారు. దీనికి తోడు బ్రిటీష్ వలస పాలనా కాలంలో మొదలైన అటవీ ఆక్రమణ ఆదివాసుల జీవితాలను అతలాకుతలం చేసింది. అది మొదలుగా అటవీ విధ్వంసులుగా ఆదివాసులపై పడిన ముద్ర నేటికీ చెరిగిపోలేదు. 'అడవికి, ఆదివాసులకు మధ్య తల్లీబిడ్డల బంధం' అనే అంశాన్ని వలసపాలన అనంతరం పాలకులు చెప్పినప్పటికి వాస్తవంలో రూపుదిద్దుకున్న విధానాలు అందుకు అనుగుణంగా లేవని మానవ శాస్త్రవేత్తలనుకున్నారు. వీరికి జతగా పర్యావరణ పరిరక్షణ వాదులు కూడా గొంతు కలిపారు. ఆ తరువాత వచ్చిన 1952 నాటి అటవీ విధానం కూడా ప్రభుత్వాలకు లోబడి విధానాలను రూపొందించింది. చివరికి ఈ విధానాలు 'అడవే నివాసంగా జీవించే ఆదివాసీ తమ సొంత ఇంటిలోనే కలపదొంగగా, ఆక్రమణ దారుడిగా ముద్రవేసింది. తరతరాలుగా వాళ్ళ జీవనం కోసం చేసుకున్న ఏర్పాట్లన్నీ ధ్వంసం అయ్యాయి. తన సొంత ఇంటిలోనే అతనొక నేరస్థుడిగా ముద్రవేయబడ్డాడు. "Source Report of Exert Committee on Prevention of Tribal Land and Its Restoration" ఏప్రిల్ 1994లో అటవీ విధానాలపై "Center for Suspainable Development" ను, లాల్ బహుదూర్ శాస్త్రి నేషనల్ అకాడమి ఆఫ్ ఎడ్మినిస్ట్రేషన్‌లో మూడు రోజులు వర్క్ షాపును నిర్వహించారు. దీని సారాంశం, సహజమైన అడవుల స్థానంలో వ్యాపార ప్రయోజనాలకు ఉపయోగపడే వృక్షజాతులను పెంచాలని, సహజ వృక్షాలను నిర్మూలించాలని తేల్చి చెప్పారు. దీని మూలంగా ఆదివాసుల భవితవ్యం ప్రశ్నార్థకమైనది. గ్రామీణ పేదరికం నిరుద్యోగం పెరిగి సాంఘిక అశాంతి, హక్కుల కోసం ఘర్షణలు తలెత్తాయి.

ఆ తరువాత 1976లో జాతీయ వ్యవసాయ కమీషన్ "కలప కోసమే అడవి" అనే బ్రిటీష్ దృక్పథాన్ని భారత ఫారెస్ట్ సర్వీస్ 1966లో పునరుద్ధరించేటప్పటికి కూడా సాగింది. దీని మూలంగా అటవీ ఉత్పత్తుల విధానాలలోను, అమ్మకాలలోను మార్పులు చోటు చేసుకోవడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ కార్పోరేషన్ ఆదివాసుల ప్రయోజనాల కంటే "పారిశ్రామిక ప్రయోజనాలు నెరవేర్చే ముడి పదార్థాలైన యూకలిప్టస్, వెదురు లాంటి చెట్లనే అడవులలో పెంచాలని" నిర్ణయించు

కుంది. మొత్తంగా చూసినప్పుడు 1894 నుంచి 1988 వరకు అధికారికంగానే 100సం.లు అడవులపై ఆదివాసులకు ఎటువంటి హక్కు లేదనే దృక్పథాన్ని ప్రభుత్వాలు ప్రదర్శించాయి. ఈ పరిణామాలు సహజంగానే ఆటవాసులకు ఆగ్రహాన్ని కల్గించాయి. ఈ ఆగ్రహం అనేక రూపాల్లో శాంతియుత ఆందోళనల నుండి హింసాత్మక రూపం వరకు సాగాయి. ఫలితంగా దేశంలో అనేక కమీషన్స్ వేశారు. 1966లో లేబర్ కమీషన్, 1982 రాంవర్మన్ కమీషన్, సిడి పాండే కమీషన్, 1998 ముఖర్జీ కమిటీ మొదలైన కమీషన్స్ వేశారు. వీటన్నిటి సారాంశం "అటవీ ప్రాంతంలో సహితం ఆదివాసులకు పని దినాలు కల్పించి పారిశ్రామిక అవసరాలు" తీర్చే మౌలిక వనరుగా అడవిని మార్చుకోవడం జరిగిందని పేర్కొన్నారు.

1956లో భాషా ప్రయుక్త రాష్ట్రాల ద్వారా ఆంధ్ర ప్రదేశ్‌లో షెడ్యూల్డ్ కేస్ట్ మరియు షెడ్యూల్డ్ ట్రైబ్ సవరణ చట్టం ద్వారా గుర్తించిన ప్రకారం 23 ఆదివాసి తెగలు న్నట్టుగా గుర్తించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాపర్తంగా 35 తెగలున్నారు. శ్రీకాకుళంలో ప్రిమిటివ్ ట్రైబ్‌గా గుర్తింపు పొందిన 12 తెగలలో సవర, గదబ తెగలు చేరాయి. శ్రీకాకుళం జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, పాత పట్నం, పాలకొండ తాలూకాలలో ఆదివాసీ జనాభా ఎక్కువగా ఉండేది. 2001 జనాభా లెక్కల ప్రకారం నికరంగా 1,00,699 మంది రక్షణ గొడుగు వెలుపల ఉన్నారు. ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లాలో ఆదివాసీలు ప్రాథమికంగా 7 మండలాలలో మాత్రమే కేంద్రీకరించి ఉన్నారు.

వారసత్వంగా వస్తున్న ఆదివాసుల భూమి పరాయి వాళ్ళకు హస్తగతం అవుతుంది. ఈ విషయంలో వీరికి ఏమాత్రం రక్షణచట్టాలు ఉండటం లేదు. దేశరాష్ట్ర పరిస్థితులను గమనంలోకి తీసుకుంటే గిరిజనులు నిరంతరంగా భూమి నుంచి వైదొలగడాన్ని చూస్తున్నాం. ఈ మధ్య కాలంలో రక్షిత ప్రాంతాల్లో ఆక్రమణకు గురి అయిన భూనిని తిరిగి గిరిజనులకే అందజేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అంకితమైందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ Strategy Paper on Welfare of Scheduled Cste and Scheduled Tribe Papulation" ప్రకటించింది.

ఆదివాసుల దగ్గర భూమి ఉన్నప్పటికీ రోడ్లకు ఆనుకుని ఉన్న గ్రామాలలో తప్ప మిగతా కొండ ప్రాంతాలలో వ్యవసాయం చాలా పురాతన పద్ధతులలో సాగుతోంది. సరియైన ప్రభుత్వ పథకాలు అందకపోవడం వల్ల వడ్డీ వ్యాపారుల పైనే ఆధారపడవలసి వస్తోంది. అప్పులు తీసుకుంటే సరుకు వాళ్ళకే అమ్మాలి. వడ్డీ నూటికి 5రూ.లు వసూలు చేస్తారు. జీడి పిక్క మార్కెట్ ధర 100రూ. అనుకుంటే 80రూ.లకే అమ్మాల్సి ఉంటుంది. ఈ స్థితి దాదాపుగా జిల్లా అంతటా కొనసాగుతోంది. ఈ అప్పులు వడ్డీ నగదు రూపంలో ఉన్నందున సావుకారు నిర్ణయించిన ధరకే అమ్మాలి. ఈ విధంగా ఋణచట్రం నుండి ఏ గిరిజనుడు తప్పించుకోలేడు. దీని మూలంగా ఆదివాసీలు వలసబాట పట్టక తప్పడంలేదు.

1959 నుండి గిరిజన సంఘాల పుణ్యమా అని వీరికి బయట ప్రపంచంతో సంబంధాలు ఏర్పడ్డాయి. మొత్తంగా ఇప్పుడు ఆదివాసీలను పట్నం తనలోకి ఇముడ్చుకుంది. ఆదివాసీల అక్షరాస్యతా శాతం 2011 లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 31వ స్థానంలో ఉంది. ఉద్యోగాలు కేవలం 6.43 శాతమే ఉంది. వీరిలో ఎకుక్వ శాతం ఉపాధ్యాయులు. అందువల్ల ఆదివాసులపై మరిన్ని అధ్యయనాలు, పరిశోధనలు జరగాల్సి ఉంది. అలాగే ఆదివాసుల జీవనయానాన్ని విద్యార్థి లోకానికి, తద్వారా సమాజానికి పరిచయం చేయడానికి యిలాంటి జాతీయ సదస్సులు చేస్తున్న ప్రయత్నాన్ని మనం అందరం అభినందించాల్సిందే.

సంప్రదించాల్సిన గ్రంధాలు :

1. శ్రీకాకుళం గిరిజన రైతాంగ ఉద్యమం - వెంకట్

2. పాతికేళ్ళ ఆంధ్రప్రదేశ్ - ఎడిటర్ - ఎన్. వెంకటస్వామి & టి. నాగేశ్వరరావు
3. ఓల్గా నుంచి గంగ వరకు - రాహుల్ సాంకృత్యాయన్
4. మట్టి మనుషులు - కాళింది చరణ్ పాణిగ్రాహి

1. Economic Surveys of India 1970 - 2010.
2. National Agriculttural Polocy, 2000
3. National Commission on Agriculture 1976.
4. Strategy paper on Welfare of Scheduled Caste and Scheduled Tribe Papulation, Govt. of A.P.

ఖండాంతర మూలవాసుల్లో 'తెలుగు ఆనవాలు'

– డా. సగిలి సుధారాణి, పరిశోధకురాలు, తమిళనాడు.

భాషాశాస్త్రవేత్తలు, మానవ పరిణామ శాస్త్రజ్ఞులు, సామాజిక శాస్త్రవేత్తలు, చరిత్రకారుల పరిశోధనల ప్రకారం మనకు తెలియనంత సుదూరగతంలో - బహుశా కొన్ని లక్షల యేండ్ల క్రిందట ఈ భూమండలమంతా ఒక్కటిగా ఉండేది. దానిని మన పురాణాలలో 'జంబూద్వీపం'గా వ్యవహరించేవారు. మహాసంకల్ప మంత్రంలో కూడా 'జంబూద్వీప' ప్రస్తావన ఉంది.

ఆధునిక కాలంలో ఆల్ఫెండ్ వేగ్నర్ (Alfend Wegener) అనే జర్మన్ శాస్త్రవేత్త ఈ భూమండలానికి పెంజియా(pangaea)అని పేరు పెట్టాడు. ఇది గ్రీకు పదం. ప్రకృతి పరిణామక్రమంలో పెంజియా ఉత్తరం వైపు లారాసియా (Laurasia), దక్షిణం వైపు గోండ్వానా లాండ్ (Gondwanaland) అనే రెండు ఖండాలుగా విడిపోయాయి. ఒక్కటిగా ఉన్న 'గోండ్వానా లాండ్' ఉన్న భూభాగం ప్రకృతి సహజసిద్ధంగా ఏర్పడిన మార్పులతో ఆఫ్రికా, అంటార్కిటికా, ఆస్ట్రేలియా, దక్షిణ అమెరికా, ఆసియా భూభాగాలుగా విడిపోయాయని శాస్త్రవేత్తల అభిప్రాయం. ఆసియాఖండంలో భాగంగా దక్షిణాన హిందూ మహాసముద్రం, ఉత్తరాన హిమాలయ పర్వత శ్రేణులు, పశ్చిమాన అరేబియా మహాసముద్రం తూర్పున బంగాళఖాతం హద్దులుగా 'భారత ఉపఖండం' ఏర్పడింది. దక్షిణాన హిందూమహాసముద్రంలో శ్రీలంక ఒక ద్వీపంగా క్రమక్రమంగా ఏర్పడింది. సింధు నాగరికత అవశేషాలు మొహంజోదారో, హరప్పా ప్రాంతాలలో లభించాయి. అక్కడ దొరికిన లిపి ఆధారంగా ఈ భారత ఉపఖండ ప్రాంతమంతా ద్రావిడ ప్రాంతమనీ, ఆ లిపి అత్యంత ప్రాచీనమైన ద్రావిడ భాషామూలాలకు చెందినదనీ శాస్త్రవేత్తలు తేల్చిచెప్పారు. కాలగతిలో వేలాది ఏళ్ళ తర్వాత భారతదేశంలో దక్షిణ దిక్కున ఈ ప్రాచీన ద్రావిడభాష నిలదొక్కుకో గలిగింది. ప్రాచీన ద్రావిడ భాషకు నేటి శ్రీలంక ప్రాంతం ఆటపట్టుగా ఉండేది. తరువాత వేలాది సంవత్సరాల పరిణామక్రమంలో ప్రాచీన ద్రావిడ భాష నుండి ప్రాచీన తమిళం, ప్రాచీన తెలుగు, ప్రాచీన కన్నడ, ప్రాచీన మళయాళంతో పాటు తుళు, కొడగు వంటి భాషలు ఉద్భవించాయి. ద్రావిడ భాషల్లో ముఖ్యంగా తొలి నాలుగు భాషలు వాడుకతో పాటు లిపిను కూడా కలిగిఉన్నాయి. ప్రాకృత భాష కూడా ప్రాచీన ద్రావిడ భాష నుండి రూపుదిద్దుకొన్నదే. దేశంలో అత్యధిక భాగం ప్రాకృత భాషే వాడుకలో ఉండేది. ప్రాచీన ద్రావిడ భాషాశబ్దాలు ప్రధానంగాను, వాటితో పాటు ప్రాకృత భాషా శబ్దాలు, పాలీ భాషా శబ్దాలు కలిసి ఈనాటి తెలుగుభాషకు ఒక 'మూల స్వరూపాన్ని' కల్పించాయి. ఈ ప్రాచీన తెలుగును ఆపేరుతో కాకుండా 'ప్రాకృత తెలుగు'గా పిలిచేవారు. ఇప్పుడు ఈ భాషలు వినేవారికి ఇందులో తమిళపదాలు ఉన్నాయనే ఒక భ్రమ కలుగుతుంది. కానీ ఇవి ప్రాచీన ద్రావిడ భాష వార సత్వంగా వచ్చిన స్వతంత్ర పదాలే. వీటితో పాటు ఆది వాసులు మాట్లాడే గోండు, సవర వంటి అనేక గిరిజన భాషలు కూడా ఉద్భవించాయి. అవికూడా అంతే ప్రాచీన భాషలు. అమెరికా, ఆఫ్రికాలలో ద్రావిడభాషకు సంబంధించిన పదాలు కోకొల్లలుగా ఉన్నాయి. వాటి మూలాలను అన్వేషించాలి.

ఈ పరిశీలనలో కొన్ని లక్షల ఏండ్ల క్రిందట ఆస్ట్రేలియా, ఆఫ్రికా ఖండాలలో నివసిస్తున్న మూలవాసుల వారసుల నాలుకలపై నానుతున్న పదాలు కొన్ని ఉదాహరణలుగా తీసుకొని తెలుగునాడులోని తెలుగు పదాలతో ఎలా పోలి ఉన్నాయో చూపుతూ పరిశీలించి వివరించడం జరిగింది.

మడగాస్కర్‌లో మన ఆనవాళ్ళు :

మడగాస్కర్, భారతదేశం ఒకప్పుడు ఏకఖండంలోని

భాగాలేనని శాస్త్రవేత్తల అభిప్రాయం. మడగాస్కర్ పూర్వ నామం 'మలగాసి'. ఇది దక్షిణ భారతభూభాగానికీ, ఆఫ్రికా ఖండానికీ మధ్యలో ఉండేది. అదికూడా 'మలబార్' నుండి విడివడి ఆఫ్రికా ఖండానికి దగ్గరగా ఒక దీవిగా 'మలగాసి'మిగిలింది. దీనిపక్కనే 'మారిషస్' ఉంది. అలాగే కేరళలోని మలబార్ - మలగాసి పేర్లమధ్య దగ్గరి సంబంధాన్ని కలిగి ఉన్నాయి. మడగాస్కర్(మలగాసి)కు చెందిన బెట్సిలియో (Betsileo) అనే జాతివాళ్ల ఆచారాలు, సంప్రదాయాలు దక్షిణ భారతదేశ సంప్రదాయాలను పోలిఉంటాయి. ఎద్దులతో జేబు(zebu) ఆటను ఆడుతారు. అది ఇక్కడి 'జల్లికట్టు' ఆటను పోలి ఉంటుంది. ఆ ఎద్దులను లొంగదీసుకొన్న యువకులకు తమ బిడ్డలను ఇచ్చి వివాహం చేసే సంప్రదాయం ఉంది. మన దగ్గర కూడా ఇటువంటి సంప్రదాయమే కొన్ని ప్రాంతాలలో ఉంది. 'మేనరికం' అనే పదం ప్రపంచంలో ఏ భాషలో కూడా లేదు. జర్మన్ భాషలో కూడా దీనిపై కొన్ని పరిశోధన పత్రాలు కూడా వచ్చాయి. తెలుగువారికి 'మేనరికం' అనేది అనివార్యం ఎంతవద్దనుకొన్నా 'మేనరికం' వీడదు. 'మేను'తో సంబంధం కలది 'మేనరికం'. 'మేనమామ' అంటే 'మేను'తో సంబంధం కలవాడని అర్థం. 'మేనరికాలు' చేసుకొనే సంప్రదాయం మనకుంది. అదే విధంగా ఆఫ్రికాలో కూడా మేనరిక సంప్రదాయం ఉంది. వీరు తమ ఆచారాలను, సంప్రదాయాలను ఈనాటికీ పదిలపరచుకోవడం విశేషం.

మలగాసిలో నివసించే ఆచార్య 'తియోడోర్ రాజకమ్మానాన' (Prof.Theodore Razakamanana university of Toliara, madagascar) ఈ పేరును పరిశీలిస్తే ఇందులోని 'రాజకమనాన' అనే పేరుతో ఒక సామాజికవర్గం కలదు. వీరు నేటి కర్ణాటకలోని బళ్ళారి ప్రాంతం నుండి తమిళనాడుకు వెళ్ళిన తెలుగుమూలాలు కలిగిన 'కంబల నాయకర్లు' అనే వాదం కూడా ఉంది. మలగాసి దేశాధ్యక్షుని(2017) పేరు "హెరి రాజవో నారియో మామ్ పియనైన" (Hery rajao nario mam pianina) ఈ పేరుని పరిశీలించినపుడు ఇందులో "రాజ, నారి, మానైన(నాయన)" అన్న తెలుగు పదాలు కనిపిస్తున్నాయి. మలగాసిలో ఒక పెద్ద నగరం పేరు 'తమతావె' (tamatave) (లేదా) 'తావుమాసిన' (toamasina) ఇవి కూడ తెలుగు పేర్లే. తావు అంటే స్థలం, ప్రాంతం అని అర్థం.

ఆస్ట్రేలియా ఖండంలో తెలుగు మూలాలు :

ఎన్నోవేల సంవత్సరాల క్రిందటే 'న్యూజిలాండ్'లో నివసిస్తున్న మూలవాసుల వారసుల నాలుకలపై తెలుగు పదాలు తరతరాలుగా ఇప్పటికీ నాట్యమాడుతూనే ఉన్నాయి. ఆస్ట్రేలియాలో ఉన్న కొన్ని కొండకోనలు, జాతుల, ప్రాంతాలపేర్లను పరిశీలించినపుడు అవి తెలుగుపేర్లకు దగ్గరి సంబంధాన్ని కలిగిఉన్నట్లు తెలుస్తుంది. వాటిలో కొన్నింటిని పరిశీలిద్దాం.

ఉదా. మావూరి, తలుంగురు, పామనాయగ, కొండ మూక, పక్కింటి, ఊరందరుజేరి, వీరందరు జేరి, నగరందరు జేరి, నాఅవ్వ, ఒక్కటైన, ఒకరితో, ఒనగూరె, ఓమారు, ఓరారి, కాకాడు, నవ్వాలబిల, వాన, గువ్వ, మరుటి(మట్టి) నవ్వాలబిల, మలకునంజ, ఊలూరు మల, కాకాడు, కొండ మొదలైనవి.

మావూరి (MAORI) :

న్యూజిలాండ్ ప్రాచీననామం అవతారియో (Aotearoa). న్యూజిలాండ్‌ను కనుగొన్నది 'కూపి'(Kupe). ఇతని భార్యపేరు 'నూకత విత'(Nukutawhiti). హవాకీ (Hawaki) దీవికి చెందిన కూపి తన భార్యతో కలసి సముద్రయానం చేస్తున్నప్పుడు, అక్కడ ఉన్న ఒక అద్భుతమైన తెల్లని మేఘాన్ని పోలిన 'పరాతు తాయ్ ఐలాండ్' (Paratu tai Island)ను అతని భార్య చూసింది. (He ao He ao He Aotearoa) హే ఆవో! హేఆవో! హే అవతారియో అని అరిచింది. అందుకే ఆ ద్వీపానికి 'అవతారియో' అని పేరు వచ్చిందని అక్కడి స్థానికులు చెబుతారు. న్యూజిలాండ్ చరిత్రకు సంబంధించిన పుస్తాకాలు ఈ విషయాన్ని బలపరుస్తున్నాయి. 'కూపి'తన గుంపుతో

నలభై, ఏభై పడవలలో అక్కడకు వచ్చి నివాసం ఏర్ప రుచుకొన్నారు. హవాకీవాసులు పసిపిక్ మహా సముద్రంలో హవాయ్(hawai) దీవులకు చెందినవారు. వీరు అక్కడి నుండి వచ్చేప్పుడు వారితో పాటు ఆహారపు గింజలు, పశుపక్ష్యాదులను తెచ్చుకొన్నారు. అమెరికాలో గల హవాయ్‌దీవులపేర్లు మౌనలోయ(MounaLoya), కైలువకోన (kailuakona), ఆకోన (Akona) వంటి తెలుగుపేర్లు కనిపిస్తాయి. వారి గుంపుకు మావూరి (MAORI) అనే పేరును పెట్టుకొన్నారు. ఇక్కడ ఆదిమ మానవుల ఆనవాళ్లను తెలిపే నివాస గుహలు, రాతి చెక్కడాలు, కనిపిస్తాయి. 'మావూరి'(MAORI) లేదా తేరో - మావూరి (Tereo - maori) అనే మూలవాసులు ఇప్పటికీ న్యూజిలాండ్‌లో ఉన్నారు.

ఒకటైన(Lake okataina)-(Bay of Plenty, North Island) :

మావూరి మూలవాసులు తాము నివసించే సమీపం లోని సరస్సుకు **'ఒకటైన'** అనే పేరు పెట్టు కొన్నారు. ఉత్తర ఐలాండ్‌లోని చుట్టు అడవులలోని వాగులలో ప్రవహించే నీళ్ళు విభిన్న రంగుల్లో ఉంటాయి. అవి ఈ సరస్సులో కలుస్తాయి. అందుకే ఈ సరస్సుకు 'ఒక్కటైన' అనేపేరు వచ్చింది. దీనికి సమీపంలోనే 'ఒకరిక' (okareka) అనే చెరువు కూడా ఉంది.

కాకాడు-(kakadu) :

'కాకాడు' అనేది ఒక పెద్ద 'జాతీయ వనం.' ఇది ఆస్ట్రేలియాలో ఉంది. 'కాకాడు'లో 'కాడు'అనేది తెలుగు పదాన్ని పోలిఉంది. కాడు అంటే అర్థం అడవి లేక తోట. ఇక్కడ మూలవాసులు సుమారు నలభైవేల సంవత్సరాల కంటే పూర్వం నివసించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఈ పార్క్‌లోని ఉబీర్(ubirr) అనే కొండపై ఆదిమ యుగానికి చెందిన చిత్రలిపి మనకు కనిపిస్తుంది. యునెస్కో వారు కూడా దీనిని గుర్తించారు. మన దక్షిణ భారతంలో కూడా ఏర్కాడు(సేలం జిల్లా) వాకాడు (నెల్లూరు జిల్లా) ఈపేర్లను పోలి ఉన్నాయి.

కొండమూక (QuandaMooka) మధ్య ఆస్ట్రేలియాలో కొండమూక జాతి వారు ఉన్నారు. 'కొండమూక' అనేపేరు తెలుగుపేరు. వీరు సంచార జాతికి చెందినవారు. వీళ్ళు డోరోడాలిక్ (Durodalic)భాషను మాట్లాడుతారు.

ఊరందరూజేరి(wurundjeri), వీరందరుజేరి (wirundjeri), నగరందరుజేరి (nagarrindjeri) వంటి తెగలు ఉన్నాయి.

చిత్తూరు జిల్లాలో శ్రీ కాళహస్తికి సమీపంలో 'ఊరం దరుజేరి' అనే ఊరు ఉంది. వీరు మాట్లడేప్పుడు విన్పించే కొన్ని పదాలు తెలుగుభాషలో మనం మాట్లాడే పదాలతో పోలిస్తే ఇంచుమించు అదే సమానార్థకంలో వాడు తున్నారు.

పశ్చిమ ఆస్ట్రేలియాలోని నవ్వాలబిల(Nauwala Bila), మలకునంజ(Malakunanja) ప్రాంతాలలో సుమారు ఏభైవేల సంవత్సరాలకు పూర్వమే మూల వాసులు (ఆదిమ మానవులు) నివసించినట్లు ఆస్ట్రేలియా చరిత్రకారులు చెబుతున్నారు. అందుకు రాతిపైన మూల వాసులు చిత్రించిన చిత్రాలే సజీవసాక్ష్యంగా నిలుస్తు న్నాయి. ఇవి విక్టోరియా ప్రాంతంలో ఉన్నాయి. ఊలూరు మల (Uluru mala) మధ్య ఆస్ట్రేలియాలోని ఒక కొండ ప్రాంతం. మలకు నంజ, నవ్వాలబిలపదాల్ని పరిశీలిస్తే బిల= గుహ, మల=కొండ అనే అర్థాలను కలిగిఉన్నాయి. మన దగ్గర కూడా తిరుమల, అణ్ణామలై, శబరిమలై మొదలైన పేర్లు ఉన్నాయి. అలాగే టాస్ మేనేయ అనే దీవిలో 'పల్లవ పరివార్' (palawapariwar) అనే పరివారం వుంది. వీరిలో నర(Nara), మర(Mara) అనే రెండు తెగలకు చెందిన వారున్నారు. వారు - మోయిని(moinee) , డ్రోమరడేన్ (Droemerden) బిడ్డలమని చెబుతారు. అంటే సూర్యచంద్రుల బిడ్డలని అర్థం. 'మోయిని' భూమి, వాగులు, వంకలను సృష్టిస్తే, 'పల్లవ పరివార్' ని డ్రోమర డేన్ సృష్టించారని చెబుతారు. ఇక్కడే 'కంబ' అనే మూల ద్రావిడ తెగ ఉండేది. ఆ తెగ పేరుమీదే ఆస్ట్రేలియాకు ప్రస్తుత రాజధానికి 'కాన్‌బెర'(Canbera) అనే పేరు

వచ్చిందంటారు. 'కంబ- కంబెర- కాన్‌బెర'గా మారిందని చెబుతారు. ఇది తమిళనాట తెలుగు వాళ్ళైన 'కంబళ' అనే తెగకు, 'కమ్మర' అనేసామాజిక వర్గానికి దగ్గరగా ఉంది.

'కంగారు' జంతువు తమ జాతికి మూలమని ఆస్ట్రేలియన్ తెగలవాళ్లు చెబుతారు. 'కంగారు' అనే జంతువు ప్రపంచవ్యాప్తంగా అందరికీ తెలిసిందే. ఈ పదం 'గుగ్గుయమిదిర్'(guuguyimidhir)అనే తెగవారినుండి వచ్చింది. వీరు మాట్లాడేది గుగ్గుయమిదిర్' భాష. 'కంగారు' అనేమాట గంగురు(gangurru) అనే పదం నుండి వచ్చింది. ఇప్పటికీ ఏదైనా విషయంలో ఆందోళన చెందవద్దు అనే అర్థంలో 'కంగారు'పడవద్దనే పదాన్ని ఉపయోగిస్తుంటాం. ఈ భాష అత్యంత పురాతనమైన భాష. కొన్నివేల సంవత్సరాల క్రిందటి పూర్వీకుల నుండి తరాతరాలుగా తరువాతి తరాలకు అందుతూ వస్తుంది. వీళ్లు పాడే ఒక జానపద గీతాన్ని పరిశీలిస్తాం.

కోల్కె పెండేల్ పెండేల్ నేనమ్మ పోతానమ్మా మీనమ్మ
నానమ్మకోల్కె పెండేల్ పెండేల్ బామమ్మకోలి
మాతిని కైకమ్మ మాతుపమ్మ
కోలిమన్ కైకమ్మ నేనమ్మ పోతానమ్మ నేనమ్మ
పోతానమ్మ
మేల్కొనిమయంతీనమ్మ కపీర్ కపీర్ కంగాయమ్మ
యార్ కామూకర్మమూర్కాకొండాతొండా
తీన్లోకోల్కె పెండేల్ పెండేల్ కోల్కె పెండేల్ పెండేల్
నేనమ్మ పోతానమ్మ పాముమ్మ నాయమ్మతీనమ్మ
నేనమ్మ పోతానమ్మ నేనమ్మ పోతానమ్మకపిర్ కపిర్
నమ్మపోతా కిందునమ్మ పెండేల్ కోల్కె పెండేల్

యుఎవం ఎశీశీన 1770 లో ఈ పాటను మొట్ట మొదటిసారిగా ఈ తెగలవారి పాటలపై రికార్డ్ చేసాడు.

నేనమ్మ పోతానమ్మా, కైకమ్మ, నేనమ్మ, పోతానమ్మా.. నానమ్మ, పోతానమ్మ, మేల్కొని, గంగారయమ్మ(కంగారు అమ్మా) మేల్కోల్(మేలుకొలుపు) కొండాల్, (కొండ) తేయో తియానో (తియ్యని)....వంటి పదలే కాక పాటలోని ఒక పాదం పూర్తిగా తెలుగు భాషలో "నేనమ్మ పోతా నమ్మ నాయమ్మ పోతానమ్మా" ఉందని మనం గమనించవచ్చు. 'కపిర్' అంటే నీళ్ళు అని వీరి పలుకుబడిలో అర్థం. మన దగ్గర కూడా 'కపిల' అంటే నీళ్ళు అనే అర్థం. ఈ పాటపై ఆస్ట్రేలియాలోని శాస్త్రవేత్తలు అనేకమంది పరిశోధనలు జరిపారు. కానీ ఎవ్వరూ ఇందులో 'తెలుగు పదాలు' ఉన్నాయన్న విషయాన్ని పట్టుకోలేక పోయారు. దీనికి గల ప్రధాన కారణం వారెవ్వరికీ తెలుగభాష పరిచయం లేకపోవడమే. ఇక్కడున్న తెగలు ఇండోనేసియా, ఆఫ్రికా తెగల భాషే మూలమనే ఒక అపోహలో ఉన్నారు. ఈపాటను తరచిచూస్తే వీరికి తెలుగు మూలాలు కూడా ఉన్నాయని తెలుస్తుంది.

కొన్ని పదాలను పరిశీలిద్దాం :

ఉదా-నగురు=నగరం(దేశం) (Naguru=contry), వారు=వారు (Waru=They), మాంర్టి=మట్టి, మన్ను (Marrnti=land) మర్లి=మనిషి, (Marli=Man) నమక=అమ్మ, (Ngamak=Mother) కాంపత= తండ్రి (Kampata = Father), విర్తు=వృద్ధ(Wirtu = Old), మురిప =బిడ్డ Murupa(Child) ఇప్పటికీ మనం చంటి బిడ్డలను 'మురిపం'గా చూసుకొంటున్నారు అని అంటుంటాం. తూగక= రాత్రి (Thungaka =night) నిద్రకు సంబంధించి 'తూగు' అనే మాటను ఉపయోగిస్తుంటాం. తివ్వండి=తవ్వండి, (Tiwandidig), పూను= మాను (Punu) (wood), పుయు= పొగ, (Puyu= smoke) పర్లు=పరువం, (Parlu = Young) కునిక=నిప్పుకనిక, (kunika, manta =fire), అల్లది=అదిగో (Alladhi = There) (అదిగో అల్లదిగో.....,) ఈ పదం మనం కూడా ఉపయోగిస్తున్నాం. కాల్ = కాలడం, (Kaall=fire) బోరి=పోరి (Boorie=clild) తెలంగాణ మాండలికంలో 'పోరి' అనేపదం వాడుకలో ఉంది. మూల=మూల్యం (Moola=money) రాక్ = కళ (Rarrk=Art)

పై పదాలను పరిశీలించినపుడు పదంలోని ఒకటి, రెండు అక్షరాలతో మనం ఉపయోగించే పదాలు

సంబంధాన్ని కలిగి, ఇంచుమించుగా అవే అర్థాన్ని ఇస్తున్నాయి. కొన్ని పదాలు తెలుగు పదాలుగా అనిపిస్తున్న వాటి అర్థాలను తరచి చూస్తే మన దగ్గర ఇప్పుడు ఆ పదాలు లేవనిపిస్తున్నాయి. నల= నేల, (Nala=earth), బదనేల= నీడ (badanela=shade) నేల పై పడే ప్రతిబింబం 'బదనేల' అయ్యి ఉండవచ్చు. కానతాన= అస్థిపంజరం (kanatana= skeleton) 'కాన' అంటే కన్పించకపోవడం అని అర్థం. జీవంలేని 'తనువు' కన్పించక పోవడం అయ్యిండవచ్చు. ఎవరైనా మరణిస్తే తనువు చాలించారని అనేపదం మనదగ్గర ప్రయోగంలో ఉంది. నంగిన = దేవకన్య (nangina=Angel) 'నంగి'నుంచి వచ్చిన అంగన 'నంగిన' అయ్యి ఉండవచ్చు. రాల = రాటు దేలిన (=rala=strong) ముందలగల్= మంద (Mundaal gal-group).

'టాస్మినియా' ప్రాంతంలో తెలుగు పదాలు :

మిన=నేను, (Mina= I, me), నిన=నువ్వు (Nina=you) మన=మన (Mana=my) వారంత=వారు (Waranta=we) నర =వారు(Nara=they)

ముగింపు :

ఒకటే నేలగా ఉన్న 'గోండ్వానా లాండ్' కాలగతిలో ఆస్ట్రేలియా, అంటార్కిటికా, ఆఫ్రికా, ఆసియా, దక్షిణ అమెరికా ఖండాలుగా విడిపోయినప్పటికీ 'గోండ్వానా లాండ్'కు మూలం 'తెలుగునేలే'. భాషావిర్భావం తరువాత భూమి భిన్న ఖండాలుగా విడిపోయింది. మనిషికి వేలి గోర్లు, వెంట్రుకలు పెరగడం ఏవిధంగా కంటికి కన్పించదో అదేవిధంగా ఈ భూమండలం ఖండాలుగా విడిపోవడం, కలుసుకోవడం మన కంటికి కన్పించదు. ఖండాలు భూభాగాలు ఒకప్పుడు కలసి ఉండేవనడానికి మరిన్ని శాస్త్రీయ ఆధారాలు లభించాయని పరిశోధకుల అభిప్రాయం. భారత భూభాగంలో ఇప్పటివరకు చూడని ఒక క్రొత్త 'మండూక' జాతిని వారు గుర్తించారు. ఈ కప్పకు సంబందించిన డి.ఎన్.ఎ.తో ఆఫ్రికాలో ఉన్న కప్పలకు పోలికలున్నట్లు గుర్తించారు. అంటే ఒకప్పుడు భారత్, ఆఫ్రికాఖండాలు కలసి ఉండేవనడానికి ఇది ఆధారంగా నిలుస్తుంది. డా.రాఘవేంద్ర రావు అనే మానవ పరిణామశాస్త్రవేత్త ఆస్ట్రేలియాలోని (AB Original) కొండజాతి వారిపై పరిశోధనలను చేసారు. వాటి ఆధారంగా జరిపిన పరిశోధనలో(DNA) వీరి రక్త కణాలకు మన భారతీయ సంతతివారి రక్త కణాలకు మధ్య చాలా దగ్గరి సంబంధాలు ఉన్నట్లు తేల్చారు.

తెలుగుభాషను మాట్లాడేవాళ్ళు మాత్రమే తెలుగు జాతికి చెందినవాళ్ళు అనడానికి వీలులేదు. మూలాలను తరచి చూడాలి. కొందరు తమ భాషను మరచిపోయి ఉండవచ్చు కాని, తమ సంస్కృతి సంప్రదాయాలను మరచిపోలేరు, మరచిపోరు కూడా. తెలుగు జాతి అనుసరించే సంప్రదాయాలు, పండుగలు, ఆచారాలు, ఆటలు, పాటలు, కర్మకాండలు, నమ్మకాలు, ఇంటిపేర్లు, అలవాట్లు మొదలైనవి వీరిని తెలుగువారిగా గుర్తించేట్టు చేస్తుంది. ఎన్నో ఏండ్ల క్రిందట తెలుగుజాతికి సంబంధించినవారు ఇతర ఖండాలలో, దేశాలలో, రాష్ట్రాలలో కుదురుకున్న కారణంగా, తెలుగు నేలపై ఉన్న తెలుగు వారితో అంతగా సంబంధ బాంధవ్యాలు లేని కారణంగా చాలావరకు తెలుగు చదవడం, రాయడం రాకపోవచ్చు కాని వారి మాటల్లో తెలుగు బతికే ఉంది. ఏభాష అయినా లిఖిత రూపానికి ముందు ఖచ్చితంగా వాడుకలో ఉంటుంది. దీనికి తెలుగు భాషకూడా అతీతంకాదు. అందుకు ఉదాహరణ మనప్రాచీన తెలుగుపదాలను, తెలుగు నుడికారాలను ఇంకా ఇతర రాష్ట్రాలలో, ఖండాంతరాలలో వ్యవహారంలో వాడుతున్నారు. కొన్నిలక్షల సంవత్సరాల పూర్వం ఉండిన ఆనాటి వాడుకభాషగా తెలుగు పదాలు ఉండేవని ఖచ్చితంగా చెప్పవచ్చు. ఆభాషలోని మూలంతోనే కావ్య నిర్మాణం జరిగింది. తెలుగునేలపై నివసిస్తున్న తెలుగువారికి ప్రాచీనకాలంలో తెలుగు సాహిత్యం లేదని చెప్పలేము. మనకు అందుబాటులో ఉన్న అనేక ఆధారాలు ఈ విషయాన్ని నిరూపిస్తున్నాయి. వైదిక వాఙ్మయ ప్రాచీన రూపమైన ఋగ్వేదంలోనే

రెండువందలకు పైగా 'ద్రావిడ' పదాలు ఉన్నట్లు టి.బరో ఉదాహరణ పూర్వకంగా నిరూపించడం జరిగింది. తెలుగు భాష, తెలుగు జాతి ప్రాచీనత మీద అనేక పరి శోధనలు జరిగాయి, ఇంకా జరుగుతూనే ఉన్నాయి. ఇప్పుడు తెలుగునేలగా చెప్పుకొనే ఈప్రాంతంలో పాత, కొత్తరాతి యుగాలకు చెందిన ఆదిమమానవులు నివ సించినట్లు అనేక ఆనవాళ్ళు దొరికాయి. మూల ద్రావిడ భాష ప్రస్తుతం ప్రత్యక్షంగా ప్రత్యేకమైన భాషగా మనకు ఇప్పుడు కన్పించకపోయినా పరోక్షంగా దానిరూపం ధ్వని పరిణామాన్ని, అర్థ పరిణామాన్ని పొంది ద్రావిడ భాషల్లో నిక్షిప్తమై ఉంది. ఒకే తల్లికి పుట్టిన బిడ్డలు ఒకే రూపాన్ని కలిగి ఉండరు. అయితే తల్లి పోలికలు కలిగిఉన్న బిడ్డలు ఏవిధంగా భిన్న రూపాలలో ఉంటారో అదే విధంగా అన్ని సజాతీయ భాషల్లో ఒకేవిధమైన పదజాలం ఉంటుందని చెప్పడం అశాస్త్రీయం. కాగా పదాలలో, పదాల అర్థాలలో పోలికలు మాత్రం తప్పనిసరిగా ఉం టాయి. ఆయా భాషలకు మాత్రమే పరిమితమైన పద జాలం ప్రత్యేకంగా ఉండవచ్చు. ఎన్నోలక్షల ఏండ్ల సంవ త్సరాల క్రిందటే ఆఫ్రికా, ఆస్ట్రేలియా, దక్షిణ అమెరికా ఖండాలలో 'తెలుగు భాష మూలాలు' విస్తరించి ఉన్నాయి. నేటికీ ఈఖండాలలో నివసిస్తున్న ఆదివాసుల నాలుకలపై తరతరాలుగా తెలుగు మాటలు నాట్యమాడు తూనే ఉన్నాయి. మావూరి, కాకాడు, తలుంగురు, పామ నాయగ, కొండమూక, పక్కింటి, ఊరందరుజేరి, నా అవ్వ, ఒక్కటైన మొదలైన పదాలను పరిశీలించడం మూలంగా వేల సంవత్సరాల క్రిందటే ఈ నేలపై ప్రాచీన తెలుగు వేళ్లునికొని ఉందని ఖచ్చితంగా చెప్పవచ్చు. అయితే నేను ఈ వ్యాసంలో చూపిన ఉదాహరణలకు ప్రధాన కారణం ఆయా పదాల్లో కొన్ని తెలుగుకు చేరువగా ఉండటం - రెండవది అవి అజంత పదాలుగా ఉండటం. అంటే ప్రతి పదం చివరి అక్షరం అచ్చులతో ముగుస్తుండటం. తమిళ, మలయాళం భాషలు హలంతాలు. హల్లులతో ముగు స్తాయి.

ప్రత్యేకంగా తమిళం గురించి ఒక ముఖ్య విషయం- తమిళభాష సంస్కృత భాషా ప్రభావానికి పూర్తిగా లోను కాలేదని చెప్పలేము. ఒకదశలో సంస్కృతంలో ఉండిన అక్షరాలన్నీ మన తెలుగులోలాగానే తమిళంలో కూడా ఉండేవి. అయితే తమిళజాతిని తీవ్రంగా కదిలించిందీ, తమిళ సంస్కృతిని సాధారణ పౌరుడు సైతం నెత్తిన పెట్టుకొనేట్టు చేసిందీ, నాటి 'సంగ' పునరుజ్జీవన ఉద్యమం. దీని ప్రభావంతో తమిళభాషలో ఆనాటి వరకు ఉపయోగిస్తున్న సంస్కృత పదాలనూ, అక్షరాలను క్రమక్రమంగా తొలగించారు. ఆ విధంగా తమిళభాషను ఒక స్వతంత్ర ద్రావిడభాషగా నిలపాలని వారు ఆశించిన ప్రయోజనం చాలావరకు నెరవేరింది. అయితే కొన్ని చారిత్రక, భౌగోళిక కారణాల వలన అలాంటి ఉద్యమాలు తెలుగు రాష్ట్రాలలోనూ, కర్ణాటక, కేరళ రాష్ట్రాలలో రాలేదు. ఏది ఏమైనప్పటికీ ఈ భాషలన్నీ కూడా ప్రాచీన ద్రావిడభాష పైనే ఆధారపడి ఏర్పడ్డాయి అనేది తిరుగు లేని నిజం. సంస్కృతం అనే పేరుగల భాషపైన ప్రాచీన ద్రావిడ భాష ప్రభావం ఎంతటిదో, ఎన్ని ద్రావిడ పదా లున్నాయో పరిశోధనలు జరుగవలసి ఉంది. సంస్కృతం ద్రావిడభాష స్థాయిలో ప్రాచీనమైనది కాదు. మనదగ్గర లేని కొన్ని వందల తెలుగుపదాలు వారి దగ్గర ఇంకా సజీవంగా నిలచి ఉన్నాయి. కొన్ని వందల, వేల సంవత్స రాల నుండి తెలుగువారు ప్రపంచంలో వివిధ ప్రాంతా లలో నివసిస్తున్నారు. అప్పట్లో సమాచార, రవాణా వ్యవస్థలు లేకపోవడం కారణంగా వీరి మధ్య సన్నిహిత సంబంధాలు ఏర్పడలేదు. ఈ విధమైన కారణాల చేత క్రమేణా ఎవరికి వారే యమునాతీరే అనే చందాన మాండలికాలు ఏర్పడ్డాయి. అవే తదనంతర కాలంలో ప్రత్యేక భాషలుగా రూపొందాయి. 'తెలుగు భాష' కూడ ఇందుకు భిన్నం కాదు. ప్రపంచంలో అభివృద్ధి చెందిన భాషల్లో తెలుగుభాష కూడా ఒకటి. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని తెలుగే కాక ద్రావిడభాషల్లోని జానపద కథ నాల్లోన్ని భాషాస్వరూపాన్ని భాషాశాస్త్రవేత్తలు ఇంకా లోతైన పరిశోధన దీనిపైనపర్యాలోచిస్తే అపూర్వ నిధి అవుతుంది.

మరిన్ని శాస్త్రీయ అంశాలు వెలికి తీయడానికి అవకాశం ఉంది. అక్కడ విశ్వవిద్యాలయాలతో సంప్రదింపులు జరిపి ఈ ప్రాంతాల భాషపై అధ్యయనం, పరిశోధన జరగాల్సిన అవసరం ఎంతైనాఉంది.

ఆధారిత గ్రంథాలు – వ్యాసాలు :

1. alfredwegner 1912-drift of continents-ISBN-13:978-0-486-61708-4 2. Social sciences-Contemporary India -1- Text Book in Geography -For Class -IX- NCERT- Publications.
2. తమిళనాట తెలుగు స్త్రీల జానపద కథనాలు- సిద్ధాంత గ్రంథం- డా. సగిలి సుధారాణి
3. తమిళనాట తెలుగు ప్రజలు-జానపద విజ్ఞానం-ప్రపంచ తెలుగు మహాసభలు-ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణ-2012-డా.సగిలి సుధారాణి-ISBN- No-81-86073-316-1.
4. గోండ్వాన లాండ్ ఎంత ప్రాచీనమైనదో తెలుగు కూడా అంతే ప్రాచీనమైనది- ప్రపంచ తెలుగు మహాసభలు-2017- తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రచురణ- డా.సగిలి సుధారాణి.
5. K.Narayanaayyar,The permanent history of Bharathavarsha (INDIA).
6. అయిదవ అఖిల భారత తెలుగు మహాసభల ప్రత్యేక సంచిక చెన్నై- అంతర్జాతీయ తెలుగు కేంద్రం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, 2007, తెలుగు భాషకు ప్రవాసాంధ్రుల సేవ.
7. Madagaskar The AMALGAMATION OF Central GondwanaAlans.
8. Ref-The caneos of kupe- ISBN-9780992247508.
9. Dorling Kindersley- Book name-Family, Encyclopedia- D.K. Condowpublications, LONDON.
10. Reader's digest-Discovering the Wonders of our World ISBN-0276421086.

సవర భాషా సాహిత్యాలు – గిడుగు కృషి

– డా॥ భూక్య తిరుపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు & అనువాద అధ్యయన శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

తెలుగు భాషా సాహిత్యాలు బహుముఖ మార్పులకు లోనైన చారిత్రక సందర్భంలో గిడుగు రామమూర్తి పంతులును మనం మరోసారి స్మరించుకుందాం. మహా కథనాలు విస్తృత ప్రాచుర్యం పొందడానికి, మహాకథనాలను తోసిపుచ్చి అనేక అస్థిత్వ ఉద్యమాలు సరికొత్త చరిత్రను సృష్టించడానికి, నిర్మించడానికీ గిడుగు దార్శనికత ఉపకరిస్తుందని నా విశ్వాసం. ఆధునికత, ప్రజాస్వామ్యం ప్రతిపాదించిన అనేక నూతన విలువలు మనకు రావు సాహేబు గిడుగు రామమూర్తి పంతులు ద్వారానే తెలుగు వ్యవహర్తలకు అందాయి.

గిడుగు రామమూర్తి పంతులు 1863 ఆగష్టు 29వ తేది విజయనగర సంస్థానంలోని పర్వతాల పేటలో గిడుగు వీరరాజు, వెంకమ్మ పుణ్యదంపతులకు జన్మించారు. ఇతను జన్మించడానికి పూర్వమే 1857లో ప్రథమ స్వాతంత్ర సంగ్రామం జరిగింది. ఈస్ట్ ఇండియా కంపెనీ పాలన రద్దయి బ్రిటన్ ప్రత్యక్ష పాలన క్రిందికి భారతదేశం వచ్చింది. అయితే, పాలనలో మద్రాసు, కొలకత్తా, ముంబాయి ప్రెసిడెన్సీలలో ఆనాటికే విద్యావిషయకంగా విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ప్రధాన పట్టణాలైన మద్రాసు, కోలకత్తా, ముంబాయి వంటి ప్రాంతాలలో ప్రాథమిక పాఠశాల, సెకండరీ విద్య, ఇంటర్మీడియట్ విద్య, ఉన్నత విద్య విస్తరించింది. కంపెనీతోపాటు క్రైస్తవ మిషనరీలు, ఫ్రెంచివారి ఏలుబడిలో ఉన్న చోట ఫ్రెంచ్ పాలకులు విద్యావ్యాప్తికి కృషిచేశారు. అందుకు అవసరమైన చట్టం రూపొందించారు.

ఆనాడు విజయనగర సంస్థానంలో తెలుగు, సంస్కృతంతోపాటు ఇంగ్లీషు కూడా ఉండేది. అదే సమయంలో యూరపు సమాజంలోని విద్యాక్షేత్రంలో భాషా, సాహిత్యం, శాస్త్రం, తత్వాన్వేషణ రంగాలలో కొత్త మార్పులు సంభవించాయి. పంతులుగారు పాఠశాలలో చేరేనాటికి ఆధునికత, సంప్రదాయం రెండూ సంఘర్షిస్తున్నాయి. రెండు విలువల మధ్య అవిచ్ఛిన్న సంఘర్షణ జరుగుతుంది. అతను యుక్త వయస్సులోకి వచ్చే నాటికి ఇది మరింత తీవ్రమైంది. గిడుగు గారికి ఆధునిక విలువలలోని తార్కికత, ప్రగతినచ్చాయి. తెలుగు సమాజంలో ఆధునిక విలువలు, ఆధునిక జీవన విధానం రావాలని కోరుకున్నారాయన. సంస్కరణోద్యమంలోని ఎగుడు దిగుళ్ళనూ, జాతీయోద్యమంలోని ఆటుపోట్లనూ ఆయన చూశారు. ఈ రెండింటికీ హేతుభూతమైన ఆధునిక భావజాలం ఆయన్ని నడిపించింది. క్రీ.శ. 1892లో రామమూర్తి పంతులు గారి దృష్టి పర్లాకిమిడి పరిసరాలపై పడింది.

పర్లాకిమిడి చుట్టూ ఉన్న కొండలలో నివసించే సవరలు విద్యావాసనలు లేని వాళ్ళుగా ఉన్నారు. వీరికి విద్యాబుద్ధులు నేర్పాలని జనజీవన స్రవంతిలోకి తీసుకురావాలని ఆలోచించారు పంతులుగారు. వారికి విద్యాబుద్ధులు నేర్పాలంటే ముందుగా వారి భాషను నేర్చుకోవాలి, సవరల కోసం బడులు పెట్టడానికి ముందు తనే ఒక సవర దగ్గర వారి భాష జీవిత ఆచార వ్యవహారాలు అన్నీ తెలుసుకోవాలనుకున్నారు. అందుకోసం సవర భాష, ఒరియా, తెలుగు తెలిసిన ఒక పానోను మనిషిని ఇంట్లో పెట్టుకొని అతని దగ్గర సవరభాషను నేర్చుకొన్నారు. "మన్యం ప్రాంతంలో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించిన రామమూర్తి గారికి అక్కడి సరవలపై ఆసక్తి కలిగింది. వాళ్ల భాష పాటలు జీవనం గురించి అధ్యయనం ప్రారంభించారు. క్రీ.శ. 1880 ప్రాంతంలోనే ఆయనలో ఈ ఆసక్తి జనించింది. ఏ విషయంలోనైనా ఆయనకున్న పట్టుదల అసాధారణమైనది. ఇటువంటి వ్యక్తులు సాధించేలేనిదేదీ ఉండదు.

"ఎంతో కష్టపడి సవరభాష నేర్చుకున్నారు. సవరల అభివృద్ధి కృషి చేశారు. 1900 ముందే సవరల కోసం బడులు పెట్టారు. సవర భాషకు తాను చేసిన కృషికి ప్రభుత్వం బహుమాన మిస్తామంటే ఆ సవరల కోసం బడులు పెట్టండి. అదే నాకు బహుమాన మన్న వ్యక్తి ఆయన" (డా. డి. చంద్రశేఖర రెడ్డి, 2013)

సవరలు గంజాం విశాఖపట్నం జిల్లాలో ఉన్నారు. అలాగే ఒరిస్సా, బెంగాల్ ప్రాంతాలలోను, సంబల్ పూర్, రాయపూర్, బిలాసపూర్, పాట్నా, కలహండి, సారంగర్, రాయగర్ మొదలైన ప్రాంతాలలో కనబడతారు. "పూర్వ కాలంలో షాహూబాదులో ఈ సవరలు ఉండేవారనిన్నీ, అక్కడనుండి రాజపుత్రులు తరిమివేయుట చేత, దక్షిణ ప్రదేశములకు పారిపోయినారనిన్నీ, నేటికిన్ని సవరలు తాలూకు కట్టడములు కొన్ని శిథిలములై షాహూబాదు జిల్లాలో కనబడుతున్నవనిన్ని రిస్లీ దొరగారు వ్రాసినారు" (సీతాపతి గిడుగు, పుట 21 : 2005)

ఈ సవర జాతి వారి గురించి ప్రాచీన కాలంలో ప్లినీ పేర్కొన్న విధంగా సుఅరి (ూఱుతీఱు) జాతివారున్ను, టాలమీ పేర్కొన్న సబరై (ూుఎుతీుఱు) జాతివారు ఈ సవర జాతివారై ఉండవచ్చునని ఊహించారు. వజ్రాలు ఎక్కువగా దొరికే గంగానధీ ప్రాంతాలలో వీరు ఉండి ఉండవచ్చునని టాలమీ అభిప్రాయం. ప్రాచీన వాఙ్మయంలో కూడా వీరి ప్రస్థావనలు ఉన్నాయి. "ఈ దేశమందలి వాఙ్మయంలో కూడా సవరజాతి పేరు ప్రాచీన కాలం నుండిన్నీ కనబడుతున్నది. ఐతరేయ బ్రాహ్మణములో ఏతే ఆంధ్రాః, పుండ్రాః శబరాః పుళిందాః మూతిబాః ఇత్యుదంత్యా బహూ భవంతి వైశ్యామిత్రాదస్యూనామ్ భూయిష్ఠా" అని ఉన్నది. ఆంధ్రులు, పుళిందులు మొదలైనవారితో సమానముగా శబరులను పేర్కొన్నారు." (సీతాపతి గిడుగు పుట 21: 2005) అలాగే భారతం శాంతి పర్వంలోను రామాయణంలో శబరి శ్రీరాములవారికి అతిథ్యమిచ్చినట్లుగాను, స్కంద పురాణములో ముఖలింగక్షేత్ర మహాత్మ్యమందు శబరులకు సంబంధించిన కథలున్నాయి. కథాసరిత్ సాగరంలోను, తెలుగు ప్రబంధాలలోను, శబర శబ్దం కనిపిస్తుంది. ఈ శబర శబ్దమే తరచుగా కవులు ప్రయోగించి ఉండుట చేత ఆటవిక జనులలో సవరల ప్రసిద్ధి, ప్రాముఖ్యం కనిపిస్తుంది. భారతం ఆదిపర్వంలో కామధేనువు తోకనుండి శబరులు పుట్టినట్లున్నది. సవరలు తమ పేరు తాము శబర అనిగాని సవర అనిగాని ఉచ్చరించరు. వారి ఉచ్చారణను స్పష్టంగా నిరూపించడం కూడ కష్టమే. సవరలు మొదటనుండి కొండలమీద నివసిస్తూ వచ్చినారా, లేక ఎప్పుడైనా పల్లపు భూములలో పల్లెలు, పట్టణములు కట్టుకొని రాజ్యాలేలినారా, అని పరిశీలించవలసి ఉన్నది.

ముఖ్యంగా పంతులుగారు సవరల కృషి గురించి పరిశీలిస్తే పంతులుగారు చారిత్రక పరిశోధనలు చేస్తున్న కాలంలో 1894లో గవర్నర్ గారు పర్లాకిమిడి వచ్చినపుడు సవరల విద్యాభివృద్ధికోసం ప్రభుత్వం వారు సవరల ప్రాంతాల్లో బడులు పెట్టాలని ఒక వినతిని సమర్పించారు. అప్పుడు గవర్నర్ సుముఖత చూపించినా, జిల్లా కలెక్టర్ అడ్డుపడినాడు. సవర భాషను పూర్తిగా నేర్చుకోవాలని ఆలోచన పంతులుగారికి కలిగింది. అందుకను గుణంగా "స్వచ్ఛమైన సవర భాషను నేర్చుకోవాలన్న కోరికను రామమూర్తిగారు తీర్చుకోదలిచారు. మామిఉన్నం కుమారస్వామి పంతులు అనే ఆయన అప్పుడు పర్లాకిమిడిలో ఉండేవారు. ఈయనకు అడవి ప్రాంతం దారులన్నీ తెలుసు. కొందరు అసలు సిసలు సవరలతో పరిచయం ఉంది. ఈయన ద్వారా ఆ సవర పెద్దలతో నేస్తం కట్టాలని రామమూర్తిగారు భావించారు. ఆ సవరలను తమ ఇంటికి ఆహ్వానించారు. వారు దానిని మన్నించారు. వస్తామన్నారు. నేస్తం ఎలా కట్టారో కూడా తెలియచేశారు. (ఆరుద్ర, పుట 180 : 2012). పంతులుగారు సవర భాషను ఇంటిదగ్గర నేర్చుకోవడమే కాకుండా సవరల మధ్య వారి ప్రాంతాలలో తిరిగి సవర భాషను, సవర పాటలు, ఆచార వ్యవహారాలు ప్రత్యక్షంగా అధ్య

యనం చేశారు. సెలవురోజులలో పంతులుగారు సవరలు ఉండే కొండ ప్రాంతాల మీదనే గడిపారు. అప్పుడే పంతులు గారికి మలేరియా జ్వరం వచ్చి మూడు మాసాలైనా తగ్గలేదు. ఫాస్ఫాఫీసులో మలేరియా జ్వరంను తగ్గించే క్వినైను అనే మందును అమ్ముతుంటే దానిని కొని తీసుకోవలసిన దానికంటె అధికమొత్తంలో మందు సేవించడం వలన అతనికి చెవుడు వచ్చింది. చెవుడు పోవడం కోసం ఎన్ని మందులు వాడినా తగ్గలేదు. రామమూర్తి జీవితంలో ప్రధాన ఉద్యమానికి నాంది 1907లో అంకురార్పణ జరిగింది. 1906లో గోదావరి, విశాఖపట్నం, గంజాం జిల్లాల స్కూళ్ళ పరీక్షాధికారిగా జె.ఎ.ఏట్సు దొర నియమితుడైనాడు. ఏట్సుదొర తప్పనిసరిగా తెలుగు నేర్చుకోవలసివచ్చింది. ఏట్సు దొర నేర్చుకున్న తెలుగుకు, పుస్తకాలలోని గ్రాంథిక తెలుగుకు ఉన్న తేడా గురించి విశాఖపట్నంలో కాలేజీ ప్రిన్సిపాల్ అయిన పి.టి. శ్రీనివాస్ అయ్యంగారిని కలుసుకొని కారణాలు అడిగినారు. అప్పుడు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ గురజాడ అప్పారావుగార్ని మరియు గిడుగు రామమూర్తి పంతులుగార్ని కలవమని సలహా ఇచ్చారు. వారు మీ సందేహాలకు జవాబులిస్తారని అన్నారు. అప్పుడు ఏట్సు దొర గురజాడ అప్పారావుగార్ని మరియు గిడుగు రామమూర్తి పంతులుగార్ని కలిశారు.

1908లో వెల్ష్‌మన్ అనే ఆంగ్లేయుడు పర్లాకిమిడికి ఫారెస్టు ఆఫీసరుగా వచ్చాడు. అడవుల్లో తిరుగుతూ సవరలతో మాట్లాడాలి కాబట్టి వాళ్ల భాషను నేర్చుకోవాలనుకొన్నాడు. అతను పంతులుగారి దగ్గర సవర భాషను నేర్చుకున్నాడు. ఆ సంవత్సరమే ప్రభుత్వం వారు రామమూర్తిగారి చేత తెలుగులో సవర వాచకాలు, సవర-తెలుగు, తెలుగు-సవర నిఘంటువులు, కొన్ని సవర కథలు, పాటలు మొదలైన గ్రంథాలు రాయించారు. రామమూర్తి పంతులుగారు నిర్మించిన తెలుగు సవర నిఘంటువు 1914లో ప్రచురితమైంది. దాని ఉపోద్ఘాతంలో ''వారు ఏ పద్ధతుల ప్రకారం ఈ రచన చేసినదీ ఇలా చెప్పారు. ఇది తెలుగు మాటలకు సరి అయిన సవర మాటలు గల నిఘంటువు. చాలా చోట్ల సవర మాటలు వాక్యములలో ప్రయోగించి అవి యేలాగున వాడుక చేయడమో కనపర్చడమైనది. కొన్ని క్రియలకు వేరు వేరు కాలములలో రూపములు ఎట్లా ఉంటవో కూడా తెలియచేయడమైనది. కొన్ని తెలుగు మాటల అదనము మాత్రం సవర మాటలలో చెప్పడమైనది. (ఆరుద్ర పుట 90,91 :2012). సవరలకు 72 మంది దేవతలున్నారు. ఉదయం నుంచి సాయంకాలం వరకు సమయాన్ని బట్టి మాట్లాడే మాటలు సవరలు వాడుకొంటారు. రామమూర్తి పంతులుగారు తన రచనల్లో సవర మాటలకు వ్యుత్పత్తి, వాక్యాలకు, సమాసాలకు, పదాలు భావం కూడా చెప్పారు. రామమూర్తి పంతులు గారు చెప్పిన నిఘంటు నిర్మాణ విషయాలు, తెలుగు నిఘంటు నిర్మాణానికి కూడా ఉపయోగపడతాయి.

1927లో మద్రాసు ప్రభుత్వం రామమూర్తి పంతులు గార్కి తెలుగులో సవర వాచకాలు, నిఘంటువులు రాసినట్లే ఆంగ్ల భాషలో కూడా సవర వ్యాకరణాన్ని సవర - ఇంగ్లీషు, ఇంగ్లీషు - సవర నిఘంటువులు, సవర మాన్యువల్ ఆంగ్ల భాషలో రచించి ఇమ్మన్నారు. అందుకు పంతులుగారు ఒప్పుకొని సీతాపతి గారికి ఆరు నెలల్లోనే సవర భాష నేర్పించి ఆంగ్లంలో సవర భాష రచనలు ప్రారంభించారు. 1931-36లో ఈ గ్రంథాలే ముండా భాషా కుటుంబపు పరిశోధనలకు మూల గ్రంథాలయ్యాయి. అమెరికాలోని విస్కాన్సిన్ విశ్వవిద్యాలయంలో 1967లో ముండా భాషలో పరిశోధనలు చేసి సిద్ధాంత వ్యాసాన్ని రాసి డిగ్రీ తీసుకొన్న 'స్టాన్లీ స్టారోస్టా' అనే విద్వాంసుడు తన గ్రంథాన్ని రామమూర్తిగారికి అంకితమిచ్చాడు. భాషాశాస్త్ర రంగంలో ఖండాంతర ఖ్యాతిని తెచ్చిపెట్టె గ్రంథాలు రాస్తున్న కాలంలోనే పంతులు గారు స్థానిక రాజకీయాలలో ప్రవేశించవలసి వచ్చింది. 1940 జనవరి 15న సంక్రాంతి రోజున రామమూర్తి పంతులుగారు తమ తుది విన్నపాన్ని తెలియ చేయాలని నీతావతిగారికి చెప్పారు. గూడవల్లి

రామబ్రహ్మంగారి ప్రజామిత్ర ఆఫీసులో పాత్రికేయులు, పాత్రికేయ సంపాదకులు, రచయితలనూ పిలిచి సమావేశం ఏర్పాటు చేశారు. అందులో వ్యావహారిక భాష గురించి, స్వరాజ్యం గురించి, ప్రత్యేకాంధ్ర రాష్ట్రం గురించి, ప్రజాస్వామిక పరిపాలన గురించి, విశ్వవిద్యాలయాలలో వ్యావహారిక భాష గురించి మాట్లాడారు. మీ చేతులలో పత్రికలున్నవి. నా ఆశయాలను మీ పత్రికల ద్వారా ముందుకు తీసుకువెళ్ళండి అని తెలియచేశారు.

ఆధార గ్రంథాలు :

1. చేకూరి రామారావు, నడుపల్లి శ్రీరామరాజు (సం.) మరోసారి గిడుగు రామమూర్తి వ్యాసాలు - లేఖలు, 2005.
2. డా. డి. చంద్రశేఖరరెడ్డి, గిడుగు వెంకటరామమూర్తి సవర కథలు 2013.
3. ఆరుద్ర - సమగ్ర ఆంధ్ర సాహిత్యం, 2012.
4. డా. భూక్య తిరుపతి - వ్యాసావళి, 2014.

యనాదులు – ఆచారాలు – సంస్కృతి

– డా॥. టి. మోహనశ్రీ, ప్రిన్సిపాల్, తెలుగు శాఖాధ్యక్షులు, శ్రీ కన్యకా పరమేశ్వరీ ఆర్ట్స్ & సైన్స్ మహిళా కళాశాల, చెన్నై, తమిళనాడు.

ఒక ప్రత్యేక భూభాగంలో నివసిస్తూ ప్రత్యేక సంస్కృతి లక్షణాలున్న ప్రజలను సమూహము, తెగ లేదా గిరిజనులుగా పరిశోధకులు పేర్కొన్నారు. వీరిని ఆదిమ జాతులు, అణగారిన జాతులని ఆర్థర్ విల్కే వర్ణించాడు. తెగ ఆటవిక, ఆదిమ ప్రజల సమూహమని, వారు తమకు ఆదిమ పురుషుడు ఒక్కడే ఉంటాడని భావిస్తారని, ఒకే నాయకుని అధికారాన్ని అంగీకరిస్తారని ఆక్స్‌ఫర్డ్ నిఘంటువులో పేర్కొనబడింది.

"A tribe is group of people in primitive or burborous stage of development acknowledge the authority of chief and usually regarding themselves us having a common ancestor"

పురాతన కాలానికి చెందిన అనాగరిక వ్యవస్థలో ఉన్నట్టి సమూహం ఒక నాయరుని ఆధిక్యతను అంగీకరిస్తూ పురాతన వారసత్వం కలిగిన తెగ.

ఆచార్య డి.ఎస్. మంజుందార్ అభిప్రాయంలో... ఒక సామాజిక సమూహం ఒక నిర్ణీత ప్రాంతానికి చెంది, అంతర్వివాహ సమూహంగా ఉండి, కొన్ని ప్రత్యేక ప్రకార్యాలు కలిగి, గిరిజన నాయకులతో పరిపాలించబడుతూ, ఒక భాషను గాని లేదా మాండలికాన్ని మాట్లాడుతూ, ఇతర తెగలతోగాని, కులాలతో గాని సాంఘిక దూరం ఏర్పరచుకొని, గిరిజన సాంప్రదాయాలకు, ఆచార వ్యవహారాలకు కట్టుబడి ఉండి, అసమూహంలోని వారందరు సజాతీయభావంతో కలసి ఉండేదే తెగ.

కమలాదేవి చటోపాధ్యాయ అభిప్రాయంలో..... తెగవారు ఒక కచ్చితమైన ప్రదేశం కలిగి, ఒక మాండలికాన్ని మాట్లాడుతూ, సజాతీయంగా సాంస్కృతికంగా ఐక్యపరిచే సాంఘిక వ్యవస్థను కలిగి, అట్లే ఉప తెగలతో పూర్వీకుల ఆరాధనలతో ప్రత్యేక మత సంస్కృతిని కలిగి ఉంటారు.

పై నిర్వచనాలు వివిధ రకాలుగా ఉన్నా అందరి అభిప్రాయాలు దాదాపుగా సమాన అర్థాన్నే సూచిస్తున్నాయి. వీరి నిర్వచనాల ఆధారంగా గిరిజన లక్షణాలను ఈ కింది విధంగా వ్యక్తీకరించవచ్చు.

గిరిజన లక్షణాలు :

1. గిరిజనులు సాధారణంగా నాగరికులకు దూరంగా జీవిస్తారు.
2. ఒక నిర్ణీత ప్రాంతంలో నివసించడం.
3. మూఢ విశ్వాసాలు కలిగి ఉంటారు.
4. లిపి లేని మాండలికాన్ని మాట్లాడుతారు.
5. నృత్యగాన ప్రియులై ఉంటారు.
6. ప్రత్యేక రాజకీయ ఆర్థిక వ్యవస్థలను కలిగి ఉంటారు.
7. పూర్వీక వారసత్వం కలిగి ఉంటారు.

ఆంధ్రప్రదేశ్‌లో నివసిస్తున్న గిరిజనుల సంస్కృతి, జీవన విధానం ప్రత్యేకమైనవిగా కనిపిస్తాయి. ముఖ్యంగా ద్రావిడ, ఇండో ఆర్యన్, ముండారి, తెలుగు భాషా కుటుంబాలకు చెందిన గిరిజనులు ఇక్కడ నివసిస్తున్నారు.

గిరిజనులలోని ఒక తెగయే యానాదులు. యానాదులలో కొన్ని ఉప తెగలున్నాయి. సముద్రాల్లో, పాలాల్లో - చెరువుల ఒడ్డున చిన్న చేపలను పట్టుకుంటూ, అటవీ ఫలసాయం పోగు చేసుకుంటూ - తప్పనిసరి అయినప్పుడు మాత్రమే కూలీకి వెళ్ళే స్వేచ్ఛాజీవులు యానాదులు. తిరుపతి వెంకన్న, పెంచలకోన నరసింహస్వామి వారి ఇష్టదైవాలు. సుబ్బరాయుడిని (నాగసర్పము) కొలవని యానాది ఉండడు. యానాది భాగోతం గ్రామ ప్రాంతాలలో ప్రసిద్ధి.

యానాదుల పుట్టిల్లు :

శ్రీశైలం ప్రాజెక్టు స్థలం నుండి రాయలసీమ ద్వారా శ్రీ వేంకటేశ్వర నివాసమైన తిరుపతి వరకు అడ్డంగా గీత గీచినట్లయితే ఏర్పడ్డ దేశమే యానాదుల అనాది ఉనికి.

నీటి సమృద్ధి నోచుకోని ప్రదేశం నీటి కాకులవలే మునకుల వేసే యానాదులకు బొత్తిగా గిట్టని భూమి. అందుకనే పొన్నేరునది మండగమనంలో సంచరించే చెంగల్పట్టు జిల్లాలోనూ, పెన్నేరు ప్రయాణించే నెల్లూరు జిల్లాలోనూ, కృష్ణ ప్రవహించే కృష్ణ, గుంటూరు జిల్లాల్లోనూ యానాదులు కుప్పలు కుప్పలుగా కనబడుతారు. తూర్పు కనుమలకు అవతల, కడప, కర్నూలు జిల్లాల్లో కూడా కవలి కాసి జీవించే యానాదులు ఉన్నారు. కాని, వారి సంఖ్య అత్యల్పం. చిత్తూరు జిల్లా యానాదుల కులదైవమైన ఏడుకొండలవారి రాజధాని కాబట్టి, అక్కడ కూడా ఊరూర వీరు దర్శనమిస్తూనే ఉంటారు.

యానాదుల్లో నాలుగు రకాలు :

1. చల్లా యానాదులు, 2. పాకీ యానాదులు, 3.మంచి యానాదులు, 4. రెడ్డి యానాదులు.

1. చల్లా యానాదులు :

శుభ, అశుభ కార్యాలలో భోజనం తిన్న ఆకులు తీయడం, ఎలుకలు, పక్షులు వేటాడి వాటి ఆహారం తినడం, చిన్న కాలువలో చేపలు పట్టి అమ్ముకోవడం వంటివి.

2. పాకీ యానాదులు :

స్మశానాల్లో పడేసిన వస్తువులు ఏరుకోవడం, చెత్త కుండీల్లోని విస్తళ్ళనుండి ఆహారం సేకరించడం వీరి వృత్తులు. వీరి వ్యవహారశైలి చల్లా యానాదులను పోలి వుంటాయి.

3. మంచి యానాదులు :

వ్యవసాయ కూలీలుగా వెళ్ళడం, కట్టెలు కొట్టడం, పైరులో కలుపు తీయడం, నారు వేయడం, పశువులు, గొర్రెలు మేపడం.

5. రెడ్డి యానాదులు :

పాలం కలిగి వుండి వ్యవసాయం చేసుకోవడం, భూస్వాముల వద్ద కాపలాగా తల మనుషులుగా వుండడం, కొంతమంది ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు చేయడం వంటివి.

వీరి జీవనశైలి సమాజంలోని ఇతర వర్గాలకు దగ్గరగా వుంటాయి. చల్లా యనాదులు, పాకీ యానాదులు పెద్దగా ఆచారాలు పాటించరు. మంచి యానాదులు, రెడ్డి యానాదులు హిందూ వ్యవహార ఆచారాలు కలిగి ఉంటారు.

మతాచారాలు – సంస్కృతి :

యానాదుల ఇష్టదేవుడు, కొండ ప్రభువు ఏడుకొండల వాడు. ఆయన అగ్రపీఠం కనపడేవరకు యానాదులు ఆయనకు మొక్కుకుంటూ ఉంగరాల వెంట్రుకలను అర్పించుకొంటూ, ఎప్పుడైనా ఒకసారి ఎగువ తిరుపతికి వెళ్ళి వస్తూ, అక్కడి సంబరాలను కులం వారికి చెప్పుకుంటూ వుంటారు. ప్రతి సంవత్సరం కోట్ల ధనాన్ని సంపాదించుకొనే వెంకన్నకు, ధనికుడు దరిద్రుడు ఒకటేనని యానాదికి బాగా తెలుసు. యానాదుల్లో వెంకయ్య పేరును ఎక్కువమంది పెట్టుకుంటారు.

దేవతలంటే ఎంత భక్తో దెయ్యాలంటే అంతే భయం యానాదికి. అమావాస్యనాడు కప్పకావిళ్ళకు వెళ్ళవలసి వచ్చినప్పుడు ఆరంభంలో మోటు ధైర్యాన్ని కనుపరచిన యానాది తీరా కుప్పను చేరగానే భూతాలకు కనపడకుండా ఆపాద మస్తకం కప్పుకొని బిళ్ళబిగుసుకుంటారు.

వేటకు వెళ్ళే గుంపు, అడవి దేవుడైన కాట్రాయుడికి (కాట్రాయుడనగా అడవికిరాజు) మొక్కుకుంటారు. అడవి యానాదులు మనిషి అరిచినట్లే అరవగలరు. కొండ గొఱ్ఱెలను, చారల పందులను, ముండ్ల పందులను, దుప్పులను కూడా ఉచ్చులలో పట్టుకొనే శక్తి భైరవయ్యకు కలదు. కాట్రాయుడు మగ దేవుడు. ఆయనకు బొమ్మలు, దేవాలయాలు ఉండవు. అడవంతటా ఆయనే కాబట్టి, ఎక్కడ పెద్ద బండ అక్కడే ఆయనకు పూజలు, హనుమంతునిపై భక్తి ఎక్కువ కాబట్టి వీరు కోతులను తినరు.

యానాదులు గృహాలలో ముఖ్యంగా సోదె చెప్పేవారి నివాసాలలో తిరుపతి వెంకన్న పేరిట ఒక చిన్న గుడిసె ఉంటుంది. భార్యాభర్తలు అందులో కలిసి నిద్రించ కూడదు. దేవతల పటాలను గోడలకు అనించి పూజలను చేస్తుంటారు. ఆ ఇంటికి మైల సోకకూడదనే కట్టుదిట్టాన్ని ఆచరిస్తారు. కగడపోయిన స్త్రీలు గాని, సూతకము తగిలిన మొగవారుకాని, దేవుని ఇంటిలోకి రాకూడదు. మామ, కోడలు ఒకే ఇంటి కప్పు కింద నిద్రించ కూడదనే ఆంక్ష ఆచారంలో ఉన్నందువల్ల కొడుక్కు కోడల్ని కట్టబెట్టిన మరునాడే మరొక గుడిసెను కట్టుకుంటారు. అన్ని శు భకార్యాలకు అభిజిత్ లగ్నమే వారికి శ్రేష్టము. శ్రీరామ చంద్రుని సీతాకళ్యాణము, అంబుకు నీడ పడని మిట్ట మధ్యాహ్నమప్పుడు జరిగినట్లు యానాదుల నమ్మకం.

యానాదుల అల్లుడు పెంచలకోన నరసింహస్వామి:

గోనుపల్లిలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామి పెళ్లి కొడుకుకై - గోనుపల్లి గిరిజన యానాది కాలనీకి వేం చేస్తాడు. యానాదులు తమ అల్లుడు పెంచల నర సింహస్వామి తమ గూడెంకు రావడంతో గిరిజనులు వేకువజామునే తమతమ ఇళ్ళముందు పందిళ్ళు వేస్తారు. స్వామివారికి పుట్టతేనె, ఇంజేటి గడ్డలు, సారపప్పు, పెద్ద మల్లెపూలు, ఆరినార మొలత్రాడును అందజేస్తారు.

యానాదుల భాగోతం - వినోదం :

దసరా పండుగల్లో నెల్లూరు జిల్లా యానాదుల ఆనం దానికి అడ్డు ఆపు వుండదు. మగవారు స్త్రీల వేషాలతో కృష్ణుడు గోపికలవలెను, శ్రీరాముడు సీతమ్మ వలెను, పౌరాణిక పాత్రలను ధరించి బజారు అంగళ్ళ వద్ద, తెలిసిన యజమానుల, పుర ప్రముఖుల ఇండ్ల వద్ద చిందులు తొక్కి, వస్త్రాలను, తిండి గింజలను బహు మానములుగా సంపాదించుకోవడం వారి ఆనవాయితి. అట్టి సమయాలలో బెండుతో చేసిన కొయ్యగుఱ్ఱాలలోకి దూరి నడుస్తున్న, సవారి చేస్తున్నట్లు అభినయిస్తూ, ఆకర్షణీంగా రంగులు పూసుకుని కూనీ రాగాలు తీస్తూ, వీధుల వెంబడి పరుగులు తీస్తుంటారు. చెంచులక్ష్మిని వెతుకుతూ పోతున్న నారసింహుని విలాపాలు, కాగితాల అట్టల గదలతో ఝడిపిస్తూ, మధ్య మధ్య బీడి పొగలను ఉషారుగా వదలి పెడుతూ, చుట్టూ మూగిన గ్రామస్థ లను ఆనందంలో ముంచుతూ తేలుస్తుంటాయి. ఔచి త్యాన్ని నీళ్ళలో కలిపే వేషగాండ్రలో, బాటా బూట్లను తొడుగుకొన్న శ్రీకృష్ణుడు, పించబోసిన ధోవతులను కట్టుకొని, పకీళ్ళ నల్ల కోట్లను తొడుక్కొని, నామాలు ధరించి నల్లకళ్ళద్దాలతో నాట్యమాడే శివుడు, విభూతి బూసిన సీతారాములళ్ళు, ప్రేక్షకులలో పొట్టలుబ్బించే నవ్వును పుట్టిస్తుంటారు.

ఒకప్పుడు జానపద కళలు మన కర్మకాండల్లో, మతా చారాల్లో, సంస్కృతిలో భాగంగా ఆవిర్భవించినట్టివే. చిత్తూరు జిల్లాలో గిరిజనులైన యానాదులు తమ పండుగ రోజుల్లో గాని, తీరిక సమయాలప్పుడు గాని "డుబ్బాంకు, డుబ్బాంకు" అని వాద్యాన్ని వాయిస్తూ చిందులేస్తుంటారు. ఈ నృత్యాన్ని ఒకప్పుడు రోజూ ఇళ్ళ ముందు కాలక్షేపం కోసం ప్రదర్శించుకొనేవారు.

వివాహాలకు, కర్మలకు అనేక కార్యాలలో యానాది మేళం పెట్టుకొని జరుపుకుంటారు. రెండవది వీరు 'కీలు గుర్రాలు' ఆటలో కడు నేర్పరులు. నెమలి నాట్యం ఆడుట వెన్నతో పెట్టిన విద్య. నెమలినే మరిపిస్తారు. పిల్లనగ్రోవి ఆలాపనలో వీరికి వీరే సాటి. హాస్యం పుట్టుకతో వచ్చిన విద్య. పక్క వాయిద్యాలను వాయిం చడంలో ప్రావీణులు. కీలుగుర్రాలతో నాట్యభంగిమ లలో, నెమలి ఆటలో హాస్య నటుని మాటలతో రక్తి కట్టించి చూపరులను ఆశ్చర్యచకితులను చేస్తారు. యానాది మేలం, కీలు గుర్రాలు బృందాలుగా ఏర్పడి, ఒక వృత్తిగా పెట్టుకొని, కొంతమంది యానాదులు జీవనం సాగిస్తారు.

ఎరుకల గద్దె - యానాది సోదె :

ఎరుకలశింగి చెప్పే "గద్దె"కు యానాది చెప్పే "సోదె"కు పోలికల కన్నా చీలికలే ఎక్కువ. ఇద్దరు

ఇష్టదైవాన్ని మొదట ప్రారంభిస్తారు. ఇరువురు జరిగిన లోపాలను రాబోయే మార్పులను సూచిస్తారు. తమ అనాదరణ వల్ల పితృతలకు, దేవతలకు కలిగిన కోపాన్ని పోగొట్టుకొనుటకు కానుకలను, పూజలను సమర్పించుటను అంగీకరిస్తారు. కాని సోదెలో చెప్పే మనిషికి, చెప్పించుకొనే అతనికి స్పర్శ సంబంధం ఉండకూడదు. గద్దె చెప్పేవారు ఎల్లప్పుడు స్త్రీలే. సోదెను చెప్పేవారు ఎల్లప్పుడు పురుషులుగానే ఉంటారు. గద్దెలో సోదెలోపలే బలకొట్టపనిలేదు. రెండింటిలోను దైవం చెప్పేవారికి పూనుతుంది. సోదె గంటలకొద్దీ జరుగుతుంది. గద్దెలో చెప్పించుకొనేవాడి ముఖంలో కలిగే మార్పులను క్షణక్షణానికి కనిపెడుతుంది శింగి. సోదెలో దాని అవసరం ఉండదు.

యానాది సోదె అర్థంలేని గొలుసు భజన. ఎవరైనా పట్టువిడుపు లేనివిధంగా కొండవీటి చేత్రాడు వలె మాట్లాడుతుంటే 'ఎందుకీ సోదె' అనే మందలింపు నెల్లూరు జిల్లాలో అనాది వాడుక. యానాది పలికిన వాక్యంలో ఒక్క కడపటి మాట మాత్రం అందుకొని, దాన్ని సాగదీసి కీచుగొంతుతో మరల అతనికి అందియ్యడమే బలకొట్టడం. బలకొట్టేది ఎప్పుడూ ఆడమనిషే. ఆమె లేకుంటే సోదె సాగనే సాగదు. సోదె చెప్పే యానాదులు ఊరికి ఒక్కరైనా ఉంటారు.

ఈ విధంగా యానాదుల జీవనం, వారి అలవాట్లు, ఆచార పద్ధతులు, మత విషయాలు, సంస్కృతిని తెలుసుకోవడం వల్ల అవి మళ్ళీ పునరజ్జీవనం పొందే అవకాశాలేర్పడగలదు. మన సంప్రదాయ జానపద కళలు మహోన్నతమైన మన దేశ సంస్కృతికి పట్టుకొమ్మలు. గత వైభవానికి ప్రతీకలై కలకాలం సజీవం చేస్తున్న మహత్తర మాతృకలు. పాతలో కొత్తను, కొత్తలో పాతను సమన్వయించుకొనే తెలుగు సంస్కృతి చిరకాలం వెలుగుతుంది.



గిరిజనులు – పండుగలు

– డా॥. లేబాకు విజయకృష్ణారెడ్డి (ఎల్వీకే), డిప్యూటీ డైరెక్టర్, విద్యార్థి సేవా విభాగం,
డా॥ బి.ఆర్. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.

విభిన్న ఆచారాలు, కట్టుబాట్ల కలబోత మన దేశం. మన పంగులు భారతీయ సంస్కృతికి ప్రతిబింబాలు. తరతరాల నుంచి ఆచరిస్తూ వస్తున్న ప్రతి పండుగకు ఒక ప్రత్యేకత, ఒక పరమార్థం ఉన్నాయి. భారతీయ సంస్కృతిలో సంప్రదాయాలు, ఆచారాలను దూరం కానీ కుండా కొనసాగించడంలో పండగలది ప్రధాన భూమిక అని చెప్పవచ్చు. మనిషిలోని ఆధ్యాత్మిక చింతనకు, ఆనం దోత్సహాలకు పండుగలు వేదికలుగా నిలుస్తున్నాయనేది అక్షరసత్యం. పండుగలు ప్రతి మనిషిలో, కుటుంబంలో, గ్రామంలో నూతనోత్సాహాన్ని కలిగిస్తాయి. రోజువారీ కార్యక్రమాలకు భిన్నంగా పండుగరోజుల్ని గడపడం వల్ల మనిషిలో రెట్టింపు శక్తి చేరుతుంది. పండుగలు పురాణేతిహాసాలకు సంబంధించినవి, ఋతువులను బట్టి చేసుకునేవి, మత, వర్గ సంబంధాలతో ఆచరించేవి ఉంటాయి. సామాజిక జీవన విధానం నుంచి వచ్చిన పండుగలు కూడా ఉంటాయి.

భారతదేశంలో కుల, మతపరమైన ఆచార సంప్ర దాయాల వల్ల జీవం పోసుకున్న పండుగలు తరతరాల నుంచి కొనసాగుతున్నాయి. ఇతరులతో పోల్చుకుంటే గిరిజన జీవితాలలో పండుగ సందర్భాలు అనేవి ఒక అపూర్వ ఘట్టాలుగా అభివర్ణించవచ్చు. పండుగల నేపథ్యంలోనే గిరిజన ఆచార సంప్రదాయాలు నేటి నాగరికులను ఆకట్టుకోవడమే కాకుండా అబ్బుర పరుస్తు న్నాయి. గిరిజనుల్లో ప్రతి తెగ తమకంటూ కొన్ని పండుగ లను ఏర్పరచుకొని తరతరాల నుంచి ఆచరిస్తూ సంప్ర దాయాల్ని కాపాడుకుంటూ వస్తున్నాయి.

కాయకష్టం చేసుకుని జీవించడం గిరిజనుల విధానం. తమ మనుగడ కోసం గిరిజనులు నిత్యపోరాటం సాగిస్తుం టారు. భిన్నమైన సంస్కృతి సంప్రదాయాలు గిరిజనుల సొంతం. బతకుపోరులోనిత్యం సమస్యలతో పోరాడే మనిషి పదుగురితో కలిసి ఆనందాన్ని పంచుకునేందుకు పండుగలు దోహదం చేస్తాయి. నాగరికతకు దూరంగా ఉండే గిరిజనులు పండుగలు నిర్వహించడంలో ఓ విభిన్న శైలిని అనుసరిస్తారు. వీరు చేసే ప్రతి పండుగ లోనూ ప్రకృతి ధర్మం ఇమిడి ఉంటుంది. ప్రకృతిలో వచ్చే మార్పులకు అనుగునంగా ప్రతినెల ఏదో ఒక రూపంలో పండుగలు చేసుకుంటారు. చెట్లు, కొండలూ, గుట్టలు, ఏర్లు, వంకలు, వాగుల్ని గిరిజనులు దేవుళ్ళుగా పూజిస్తారు. అంటే ప్రకృతిని ఆరాధించే సంస్కృతి వారిలో ఉందని చెప్పవచ్చు.

పౌరాణిక రోజుల్లోకి వెళితే తొలకరి పడగానే పంటలు వేసేందుకు తొలుత భూమిని రాజులే దున్నేవారు. అది ఒక ఉత్సవంలా జరిగేది. ఇప్పటికీ గ్రామాల్లో విత్తనాలు వేసే సమయంలో పూజ చేస్తారు. వరినారు సిద్ధం చేసే సమయంలో రైతులు పూజ చేసి పని మొదలుపెడతారు. పంట దిగుబడిలోని కొంత భాగంతో ప్రసాదం చేసి దేవునికి నైవేద్యంగా పెట్టే సాంప్రదాయం గ్రామాల్లో ఇప్పటికీ కనిపిస్తుంది. కాలంతోపాటు మార్పు, వ్యవ సాయంలో యంత్రాల వినియోగం పెరగడంతో పూర్వపు ఒరవడిలో మార్పు కనిపిస్తోంది. కానీ గిరిజన గూడేల్లో సాంప్రదాయాలు ఇంకా కొనసాగుతున్నాయి. తమ సంస్కృతిని కాపాడుకుంటూ భవిష్యత్తరాలకు అందిం చాలనే గాఢమైన భావన గిరిజనుల్లో ఎక్కువగా ఉంది. అందులో భాగంగానే ప్రాచీనకాలం నుంచి సాంప్ర దాయంగా వస్తున్న తమ పండుగల్లి గిరిజనులు ఇప్పటికీ క్రమం తప్పకుండా జరుపుతున్నారు. తమ జీవన

గమనంలో ప్రతి సందర్భాన్ని పండుగలతో ముడిపెట్టడం గిరిజనుల్లో కనిపిస్తుంది. ప్రకృతితో మమేకమై జీవనం సాగించే గిరిజనులు ఆ ప్రకృతిని దైవంగా భావిస్తారు. సాంకేతికంగా ఎంత ఎదిగినా ఇప్పటికీ సంస్కృతి సాంప్రదాయాలు గిరిజనుల్లో సజీవంగా ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 33 గిరిజన తెగలు ఉన్నట్లు ప్రభుత్వ విభాగాలు చెబుతున్నాయి. అందులో 13 తెగల జనాభా ఎక్కువగా ఉంది.

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణం జిల్లా పరిధిలో ఉండే గిరిజనులు తరాలు మారుతున్నా వారసత్వంగా పండుగల్ని అంగరంగ వైభవంగా ఆనందంగా అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరుపుతున్నారు. ఆ ప్రాంతంలోని అనేక మందితో మాట్లాడినప్పుడు పండుగల గురించి వారికున్న అవగాహనను పంచుకుంటూ తమ తర్వాతి తరానికి ఆ సాంప్రదాయాల్ని అందిస్తామని చెప్పారు. దశాబ్దాలుగా సాగుతున్న పండుగల్లో ఆధునిక పోకడలతో కొన్ని మార్పులు కనిపిస్తున్నా అక్కడి గిరిజనులు సాంప్రదాయాల్ని కొనసాగిస్తున్నారు. విశాఖ జిల్లా గిరిజనుల పండుగల గురించి రేఖామాత్రంగా పరిచయం చేయడం ఈ పత్రం ఉద్దేశం.

భూమి పండుగతో మొదలు :

ఆదివాసీ గిరిజనులు సంవత్సరం పొడవునా పండుగలు చేస్తుంటారు. ఇలా జరిపే పండుగల తీరు ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది. వీరు ఏడాదిలో వ్యవసాయానికి సంబంధించిన పండుగలు రెండు రకాలుగా జరుపుతారు. మొదటిది చైత్యమాసం (ఏప్రిల్)లో 'చెంచు భీముని మెర్మి' పండుగ (భూమి పండుగ)తో వ్యవసాయం పనులు ప్రారంభిస్తారు. పనుల ప్రారంభానికి గుర్తుగా గూడెం వాసులందరూ కలిసికట్టుగా ఒకరోజు నిర్ణయించుకుని, ఎంచుకున్న ఒక ప్రాంతంలో సంబరాలు చేసుకుంటారు.

ధాన్యరాసులకు స్వాగత సంబరాలు :

చైత్యమాసంలో వేసిన పంట శ్రావణమాసం (ఆగస్టు) నాటికి వెన్నుదశకు వస్తుంది. దీనిని బంజారాలు 'తీజ్' పండుగ పేరుతో నిర్వహిస్తారు. తమకు ఆహారధాన్యాలు అందించే పంట పొలాలు తమ జీవితాల్లో వెలుగును నింపాలని ఈ సందర్భంగా కోరుకుంటారు. భాద్రపదం (సెప్టెంబర్)లో 'పెత్రమాస' (పెద్దల పండుగ), ఆశ్వీయుజం (అక్టోబరు)లో 'దండారీ' మృగశిర (డిసెంబర్)లో కొత్త పంటలు ఇంటికి వచ్చే సందర్భంగా 'సెట్టి పండుగ' పేరుతో జరుపుతారు. ఇవేకాకుండా కాలాన్ని బట్టి 'దురాడి', మరుగోళ్ల ఉత్సవం, దాటుడి, పండుగలతోపాటు దసరా, దీపావళి, ఉగాది, హోలీ వంటి పండుగల్నీ ఘనంగా చేసుకుంటారు.

కొర్రకొత్త పండుగ :

మెట్ట ధాన్యం రాగులు, సజ్జలు, సామలు వంటి చిరుధాన్యాల దిగుబడి రాగానే గిరిజనుల 'కొర్రకొత్త పండుగ' చేస్తారు. ఒక శుక్రవారం రోజు మెట్ట ధాన్యంతో బోనం (పొంగలి) వండి గుమ్మడి కూర చేసి అందులో చింత కాయల పులుసు వేఇ పంట పొలాల నుంచి సేకరించే రకరకాల పండ్లు, కాయలు పూలతో పూజ చేస్తారు. ముందుగా గ్రామ దేవతలను పూజిస్తారు. అటు పిమ్మట ఇలవేల్పును కొలుస్తారు. అనంతరం ప్రసాదాలను భుజిస్తారు. ఇలా చేస్తే తప్ప కొత్తగా వచ్చే వ్యవసాయ ఉత్పత్తులను ఇంటికి తెచ్చి తినకూడదనే నియమం గిరిజనుల్లో ఉంది. ఈ పండుగ చేసిన రోజు ఎలాంటి వ్యవసాయ పనులు చేయరు.

జొల్డా పండుగ :

కొర్రకొత్త పండుగ చేసిన తర్వాతి శుక్రవారం 'జొల్డా పండుగ' చేస్తారు. తమ పొలాలకు చీడ, చెదలు వంటివి పట్టకుండా ఉండేందుకు చేసే పండుగ ఇది. శుక్రవారం తెల్లవారుజామునే అడవికి వెళ్లి జొల్డా కొమ్మలు (విష పూరితమైన కశింకొమ్మలు, వర్దాని కొమ్మలు) తీసుకొస్తారు. వాటిని గ్రామస్థులందరూ సావడివద్ద పెడతారు. గ్రామ పూజారి వచ్చి ఆ కొమ్మల కట్టలను వరుసగా ఉంచి పక్కన అలికి ముగ్గు వేస్తారు. ఒక కోడిని బలి ఇస్తారు. అలా

బలి ఇచ్చిన కోడి రక్తాన్ని అన్ని కొమ్మలకు అంటుకునేలా పూస్తారు. వరి బియ్యంలో కోడిరక్తం కలిపి అన్ని కుటుంబాల యజమానులకు అందిస్తారు. ఆ బియ్యాన్ని జొల్డా కొమ్మలో ఉన్న ఆకులకు నన్నని పుల్లతో అంటిస్తారు. అనంతరంలో ఇంట్లో వండిన పిండి వంటలతో తమ తమ పంట పొలాల వద్దకు వెళతారు. అక్కడ పూజ చేసి టెంకాయలు కొట్టి పంటలు బాగా పండాలని మొక్కుకుంటారు. జొల్డా కొమ్మల్ని ప్రతి పొలంలో రెండేసి నాటుకుంటారు. 'దోషం' (పూజ) కోసం ఉపయోగించిన బోనం (పొంగలి)ని పొలాల్లోని పంటలపై కొద్దికొద్దిగా చల్లుకుంటారు. ఈ తంతు పూర్తి అయ్యాక కుటుంబ సభ్యులు ఆహార పదార్థాల్ని బుజిస్తారు.

ఈటెల పండుగ :

విశాఖపట్టణం జిల్లాలోని అరకు లోయలో అత్యంత వైభవంగా ఈటెల పండుగ చేస్తారు. పురుషుల వీరత్వాన్ని ప్రదర్శించే పండుగ ఇది. గూడెంలోని పురుషులు తమ శక్తిసామర్థ్యాలు, బల ప్రదర్శనకు చిహ్నంగా ఈటెల పండుగ చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఆ రోజుల ఈటెలు, విల్లంబులతో జంతువులను వేటాడడం సాంప్రదాయం. ఈ పండుగను వేసవికాలంలో జరుపుతారు. వరునకు బావా మరదళ్లు హాస్యపూరితంగా జరిపే పండుగగా దీనికి పేరు వచ్చింది. సాధారణంగా వేసవి కాలంలో వ్యవసాయ పనులు ఉండవు కాబట్టి అందరూ సరదాగా ఈ ఈటెల పండుగ జరుపుతారు. ఈ పండుగ సందర్భంగా మహిళలందరూ ఒకవైపు చేరి కొత్త అతిథికోసం ఎదురు చూస్తుంటారు. అలా వచ్చే వ్యక్తి దగ్గర ఎంతో కొంత కానుక రూపంలో తీసుకుని గ్రామంలోకి అనుమతిస్తారు. పురుషులు అందరూ వేటకు వెళతారు. ఎవరైతే ముందుగా జంతువును వేటాడి తెస్తారో ఆ వ్యక్తిని వీరుడిలా ఊరంతా ఊరేగిస్తారు. వేటకు వెళ్లేవారు జంతువును వేటాడేవరకు అడవిలోనే ఉంటారు. ఈ పండుగ సందర్భంగా గిరిజనులు ఆకులు కట్టుకుని ఆయుధాలు పట్టుకుని నృత్యాలు చేస్తూ ఆనందంగా గడుపుతారు. అదే సమయంలో సాంప్రదాయాల్ని వదిలి పెట్టరు. వేటకు వెళ్లేవారు గ్రామ సరిహద్దులు దాటరాదనే నియమం కూడా వీరిలో ఉంటుంది.

దండారీ :

గూడేల మధ్య ఐక్యతకు, గ్రామంలో పరస్పరం ఐకమత్యంగా ఉండడానికి ఉద్దేశించినదే 'దండారీ' నృత్యం దీపావళి సందర్భంగా సాధారనంగా ఈ నృత్యం చేస్తారు. పక్క గ్రామాలు, గూడేలలో వారితో సఖ్యత పెంచుకునేందుకు అక్కడికి 'దండారీ బందాలు' అతిథులుగా వెళతారు. అక్కడికి వెళ్లి నృత్యాలు చేస్తారు. గిరిజనులు గూడేల్లో ఎవరి ఇంట్లో శుభకార్యం జరిగినా ఊరంతా కలిసి ఆడిపాడి ఆనందోత్సాహాలను వ్యక్తం చేస్తారు. గ్రామస్థులందరూ కలిపి పండిన పంటలో కొంత ధాన్యాన్ని నృత్యాలు చేసే కళాకారులకు ఇస్తారు.

సంక్రాంతి పండుగ :

మకర సంక్రాంతి, పెద్ద పండుగ, పొంగల్ వంటి పేర్లతో భారతదేశంలోని వివిధ రాష్ట్రాల్లో జనవరిలో ఈ పండుగ జరుపుతారు. సాధారణంగా అన్ని ప్రాంతాల్లో జరిగే సంక్రాంతికి భిన్నంగా గిరిజనులు ఆ పండుగను చేస్తారు. సాధారణంగా మైదాన ప్రాంతాల్లో జరిగే రోజుల్లో కాకుండా మకర సంక్రాంతి పేరుతో వేరే తేదీల్లో గిరిజనులు ఈ పండుగ చేయడం విశేషం. తాము సాగు చేసే పంటల దిగుబడి రాగానే సంక్రాంతి జరిపే రోజును గ్రామ చావడి వద్ద నుంచి గ్రామ తలారి చాటింపు వేయిస్తాడు. చాటింపు వేయగానే పండుగకోసం గూడెంవారు ఏర్పాట్లు మొదలుపెడతారు. ఇళ్లను శుభ్రం చేసుకోవడం, నూనత వస్త్రాలు సిద్ధం చేసుకోవడంలో మునిగిపోతారు పండుగ ముందురోజే ఆ క్రతువుకు శ్రీకారం చుడతారు గిరిజనులు. ముందురోజు అడవికి వెళ్లి అడ్డాకులు, అడ్డకాయలు, అడ్డతాళ్లు తీసుకొస్తారు. అడ్డతాళ్లతో ఆవులకు కొత్త కన్నెలు తయారు చేస్తారు. పులగం కుండ (ప్రసాదం వండే పాత్రకు) మట్టు (కుదురు) తయారు చేస్తారు. అడవి నుంచి సాయంత్రానికి ఇంటికి చేరుకుని

దేవతల పూజలు మొదలుపెడతారు. ఇంటి యజమాని తలంటు స్నానం చేసి 'దోషం' అని పిలిచే పూజ చేస్తారు. మనుషులు నడిచేదారిలో ముగ్గుపిండి, వరి పిండి, చోడి పిండి తీసుకుని అడ్డకాయమీద ముగ్గువేస్తారు. పంచ భూతాలకు పూజ చేసినట్లుగా ఈ తంతు సాగుతుంది. పూలతో అలంకరించి, కొబ్బరికయాలు కొట్టి అడవితల్లి, నేల తల్లి (భూదేవి), వాయుదేవుడు, గంగమ్మతల్లి తమను చల్లగా చూడాలని, భక్తిప్రవత్తులతో పూజ చేస్తారు. ఇదంతా తమను రుజుమార్గంలో నడపాలని, పొరపాట్లు చేసి ఉంటే క్షమించాలనే విధంగా సాగుతుంది. ఈ సంవత్సరం లాగే రాబోయే సంవత్సరం కూడా పంటలు బాగా వండాలని ప్రకృతి తల్లి అన్ని విధాలా ఆదుకోవాలని ప్రార్థిస్తారు. 'దోషం' పూజ పూర్తి అయ్యాక ప్రతి ఇంటి నుంచి కర్రలు సేకరించి ఆ రాత్రికి భోగిమంట వేస్తారు.

మరుసటిరోజు 'పులగం' (బియ్యం, అలసందలు, పాలు, బెల్లంతో చేస్తారు) చేసి ఇంటిల్లిపాది తలస్నానాలు చేసి కొత్త వస్త్రం, పూజా సామగ్రితో గూనకుదురు (పూజ గది)లో పూజ చేస్తారు. పులగాన్ని ఇప్పటికీ మట్టిపాత్రలో తయారు చేయాలనేది నియమంగా పెట్టుకున్నారు. ఈ ప్రసాదాన్ని అడ్డాకుల్లో దేవతలకు అర్పిస్తారు. అటు నుంచి పశువుల శాలకు వెళ్లి కాళ్లు ముఖ భాగం కడిగి సింధూరం, పసుపు కుంకమతో పూజిస్తారు. కొత్త వస్త్రాన్ని వాటిపైన కప్పుతారు. గోమాతల్ని ప్రత్యేకంగా పూజిస్తారు. పంటలు బాగా పండాయని, వచ్చే సంవత్సరం కూడా ఇదే విధంగా పండేలా దీవించాలని ప్రార్థిస్తారు. అడ్డాకు తాడుకు మండిపువ్వు, పిండి దుంప కట్టి ఆవుల మెడలో వేస్తారు. పూజ కాగానే పశువులను బయటకి వదిలిపెడతారు. ఆ తర్వాత కుటుంబ సభ్యులంతా కలిసి పులగం ఆరగిస్తారు.

ఆ మధ్యాహ్నం గ్రామ సావడికి గ్రామస్థులందరూ చేరుకుంటారు. అక్కడ అందరూ కలిసి 'గుమ్మలాట' ఆడతారు. గిరిజనుల సాంప్రదాయ వాయిద్యాలైన డప్పు, తడుము, సానాయి వంటి వాయిద్యాల్ని ఉపయోగిస్తూ లయబద్ధంగా గుమ్మలాట ఆడతారు. ఆ తర్వాత 'దంపుటి కోలాటి' ఆడతారు. ఇది కేవలం పురుషులకు మాత్రమే పరిమితం. గ్రామ పూజారి చేటలో ధాన్యం, వాటిని దంచే రోకలి, ముగ్గు వేయడానికి వరిపిండి, దీపం, కొబ్బరికాయలు తీసుకొచ్చి పూజ చేస్తారు. ఆ తర్వాత చేటలోని ధాన్యాన్ని దంచడానికి రమ్మంటూ మహిళలపై కట్టిన పటలు పాడతారు. పాట పాడుకుంటూ ప్రతి ఒక్కరి చేతిలో ఒక సన్నటి పొడవైన కర్ర పుల్లల్ని పట్టుకుని గుండ్రంగా తిరుగుతూ పుల్లల్ని ధాన్యం ఉన్న చేట దగ్గర వేస్తారు. పెద్దవారు ఒకరికొకరు భుజాలపైన చేతులు వేసుకుని గుండ్రంగా తిరుగుతూ చిన్న పిల్లల్ని పైకి ఎక్కించుకుని తిరుగుతారు.

స్త్రీలకు గౌరవం :

గిరిజనుల్లో మహిళల్ని గౌరవించే పండుగ కూడా ఉంది. ఏప్రిల్ మే నెలలో ఏదో ఒక శుక్రవారం నాగలి, కత్తి, గొడ్డలి, పార వంటి వ్యవసాయ పనిముట్లను శుభ్రం చేసి ఇంటి అరుగుపైన ఒక మూల ఉంచుతారు. నేరేడు, మామిడి ఆకులతో పూజిస్తారు. నూతన వస్త్రాన్ని కప్పుతారు. పూజ అనంతరం కుటుంబ సభ్యులు పిండి వంటలతో భోజనం ముగిస్తారు. ఆ తర్వాత పురుషులు అడవికి వెళ్లి ఊయలకోసం పొడవైన అడ్డఒడ్డు (తీగలు) తీసుకొస్తారు. వాటితో పెద్ద చెట్లకు ఊయల కట్టి మహిళల్ని ఊపుతారు. ఈ ఊయలల్లో మహిళలు మాత్రమే ఊగుతారు. ఈ విధంగా గిరిజనుల స్త్రీలకు గౌరవం ఇస్తారు. గిరిజనుల్లో ఆచారాలు, సంప్రదాయాలు వారి సంస్కృతిని ప్రతిబింబిస్తున్నా ఇటావల నాగరికపు వాసనలు వారి దరికి చేరుతున్నాయి. ఆహార్యంలో మార్పులు కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నాయి. యువతీ యువకులు ధరించే దుస్తులు పాశ్చాత్య సంస్కృతిని గుర్తుకు తెస్తున్నాయి. పండుగల సందర్భంలో రికార్డు డ్యాన్సులు పెట్టిస్తున్న సందర్భాలు ఉంటున్నాయి. ఆహారపు అలవాట్లలోనూ మార్పులు వస్తున్నాయి. అరకు వంటి ప్రదేశాల్లో పాశ్చాత్య ఆహార పదార్థాలు విచ్చలవిడిగా లభిస్తున్నాయి. మంచూరియా, పిజ్జా, బర్గర్లు అందుబాటులోకి వచ్చాయి. నూడుల్స్ నోటికందు

తున్నాయి. చిరుధాన్యాల ఆహారంతో ఆరోగ్యంగా ఉంటూ వచ్చిన గిరిజన గ్రామాల్లోకి ఆధునిక ఆహారం కొత్త అనారోగ్యాల్ని మోసుకొస్తోంది. నాగరికుల ముసుగులో గిరిజన గూడేలకు చేరుతున్న మైదాన ప్రాంతవాసులు గిరిజన సంస్కృతికి గొడ్డలి పెట్టులా మారుతున్నారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాల్ని కాపాడ్డానికి, భావి తరాలకు అందించడానికి సమాజంలోని అన్ని వర్గాలు కృషి చేయాల్సి ఉంది.

సంస్కృతీ వైవిధ్యాన్ని విలక్షణతను కాపాడుకోవడానికి గిరజనులకు ప్రత్యేకమైన పద్ధతులు, మార్గాలు లేవు. కనీసం లిపి కూడా లేని భాషలు మన గిరిజనుల్లో అనేకం వున్నాయి. అలాంటి నేపథ్యంలో.. వారు తమ విశ్వాసాలు, కట్టుబాట్లు, నమ్మకాలు, ఆచారాలు... వేటినైనా సరే.. కాపాడుకోవడం అనేది 'ఒకరినుంచి మరొకరికి' అంద జేయడం ద్వారా మాత్రమే సాధ్యం అవుతుంది. అలా సంస్కృతిని పదిలపరచడానికి వారు ఎన్నుకున్న మార్గమే పండుగలు అని మనకు అనిపిస్తుంది. అందుకే కాబోలు, వారు పండుగలకు నాగరికులకంటే ఎక్కువ విలువ ఇస్తుంటారు. వాటిని పొరబాటును కూడా వదులు కోకుండా.. కొనసాగిస్తుంటారు.

ఉపయుక్త గ్రంథాలు :

1. కొండా కోనల్లో పండుగ సంబరం.
2. Kondamma song turns into ballet - The Hindu (http://www.thehindu.com), dated 03-12-2016.
3. Telugu - Jaatharalu - Pandugalu, http://www.recruitmenttopper.com, dated April 12, 2016.
4. తెలుగు గిరిజనుల గీతాలు, డా॥. పిరాట్ల శివరామకృష్ణ పరిశోధన గ్రంథం, ప్రకాష్ ప్రింటింగ్ వర్క్స్, రాజమండ్రి, 1991.
5. మన వారసత్వం, సంపాదకులు డా॥ బాబు ఆర్. వడ్లమూడి, వాసు ఆఫ్‌సెట్ ప్రింటర్స్, విజయవాడ, 2003.

ఎరుకలజాతి వారి కథలు – జీవన చిత్రణ

– నల్లమోతు సునీత, పరిశోధక విద్యార్థిని, తెలుగు విభాగం, కాశీ హిందూ విశ్వ విద్యాలయం, వారణాశి, ఉత్తర ప్రదేశ్.

భారత దేశం వివిధజాతులు, ఉపజాతుల, తెగల సముదాయాల నిలయం. భారతీయ సమాజం ఆశ్చర్య కర, అద్భుతమైన మానవ సంబంధాలకు, ఎన్నో కులాలు, ఎన్నో భాషలు, మరెన్నో సంస్కృతులకు ఆలవాలం. ఇది సువిశాలం, వైవిధ్య భరితం. ఈ దేశ చరిత్ర అతిపురాతన మైనది. ఈ క్రమంలో గిరిజన జాతి విశేషాలు చర్చించడం ప్రస్తుతాంశం.

గిరిజన జాతి ఉనికి :

గిరిజనులు లేక ఆదివాసీలు భిన్న జాతుల సమాహారం. భారత ఉపఖండంలో అనేక గిరిజన సముదాయాలు నివసిస్తున్నాయి. ఆదివాసీలు తమదైన ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయం, సామాజిక విలువలను కలిగి ఉంటారు. ఆదివాసీలు నివసించే ముఖ్య రాష్ట్రాలుబీ ఒడిషా, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, జార?ండ్, పశ్చిమ బెంగాల్, మిజోరం, అండమాన్ నికోబార్ దీవులు.

ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరులు, ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, మహబూబ్ నగర్ జిల్లాల్లోని గిరిజన ప్రాంతాల్లో చిన్న చిన్న ఆవాసాలు (గ్రామాల కంటే చిన్నవి) ఎక్కువ. ఒక్కో పంచాయతీ పరిధిలో ఇలా అనేక ఆవాసాలు ఉంటాయి.ఈ ఆవాసాలకు గ్రామ పంచాయతి హోదా కల్పించడంతోపాటు స్వీయ నియంత్రణ హక్కుల్ని కల్పిస్తారు.(తెలంగాణరాష్ట్రం ఈ కోణంలో ముందుంది.) ఆదివాసీ గిరిజన ప్రజలు పంచమజాతి వారుగా, శూద్రుల క్రింద వచ్చే తరువాత వర్ణముగా, అంటరాని వారుగా నేటికీ రోజులు గడుపుతున్నారు. ఎరుకలు, చెంచులు, కోయలు, గోండులు వంటివారు గిరిజన జాతి జనులు. వారిలో ఎరుకలజాతి జనులు తమ నిత్య జీవన విధానంలో ఎన్నో కథలల్లకుంటారు. మానవజాతి మూలాలు గిరిజనజాతుల నుండే ఆవిర్భవించాయని చరిత్ర నిర్మాతల విశ్వాసం. గిరిజన వర్గాలకు చెందిన ఎరుకలజాతివారి రెండు కథల విశ్లేషణ ఈ వ్యాసోద్దేశం.

కథ – ప్రారంభ వికాసాలు :

భారతీయ సాహిత్యంలో 'కథ' కు ఒక ప్రత్యేకమైన స్థానముంది. తెలుగు సాహిత్యంలోనే కాక ఇతర సాహిత్యంలోనైనా కథలు ఒక విశిష్టమైన సాహిత్య ప్రక్రియగా వెలుగొందుతున్నాయి. కథల పుట్టుక ఎప్పుడు జరిగింది అనడానికి తగిన ఆధారాలు లేవు. ఈ విషయంలో విమర్శకులలో భిన్నాభిప్రాయాలున్నట్టు తెలిసిందే గదా! అయితే కథ మొదట జానపదుల్లో మౌఖికంగా మొదలై జానపద సాహిత్య ప్రక్రియగా వెలుగొంది, మానవుడు మాటలు నేర్చిననాడే కథకు అంకురార్పణ జరిగిందనవచ్చు. ఎందుకనగా కథ ఒక తరం నుండి మరో తరానికి దిగుమతయి ఉండవచ్చునని మాత్రం సాహితీవేత్తలందరూ అంగీకరిస్తారు. ఎందుకనగా కథ ఒక సన్నివేశం లేదా సంఘటనకు వ్యాఖ్యాన రూపం. మనిషి మనుగడలో ఎన్నో సన్నివేశాలు, సంఘటనలు చోటుచేసుకుంటాయి. వాటిని ఇతరులకు తెలియజేయడానికి కథాకథనం తప్పనిసరి. అందుకే అన్ని సాహిత్యాలకు మూలం జానపదమైనట్లుగానే కథకు కూడా జానపదుడే ఆద్యుడని పేర్కొనక తప్పదు.

భారతీయ జానపద కథా సాహిత్యాన్ని పరిశీలించినట్లయితే భారతీయ జానపద కథలను వాక్సంప్రదాయ కథలు, సాహిత్య కథలు అనే రెండు ముఖ్యమైన విభాగాలుగా గుర్తించవచ్చు. మౌఖిక సాహిత్యం సార్వజనీనమైనది. సాహిత్య కథలు కేవలం లిపి ఉండి సాహిత్యం

అభివృద్ధి జరిగిన భాషల వరకే పరిమితమయ్యాయి. ఋగ్వేదాన్ని ప్రపంచంలోని అత్యంత ప్రాచీన వాఙ్మయంగా గుర్తించారన్నది వాస్తవం. ఆ ప్రకారంగా శునశ్శేపుని వృత్తాంతం, సరమా సంవాదం మొదలైన వాటిని అతి పురాతన జానపద కథలుగా చెప్పవచ్చు. భారతదేశ జన జీవన చిత్రణలో గిరిజన జీవితం మొదటి ప్రాధాన్యం సంతరించుకుంది. భారతీయులుగా తమ సంస్కృతిని కాపాడుకోవాలన్న తపన ఇప్పటికీ గిరిజనులకుంది. భారత దేశంలో 560 గిరిజన తెగలు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో 35 తెగలున్నట్లు ఒక అధికారిక అంచనా. ఆఫ్రికా ఖండం తరువాత భారతదేశం గిరిజన జనాశ్రయంగా ఉందని చెప్పడంలో సందేహం లేదు.

గిరిజన జాతి పలుకుబడి :

గిరిజన తెగలు మనుగడ కోసం పడుతున్నపాట్లను గురించి, కథావస్తువుగా ఎంతోమంది రచయితలు కథలు రచించారు. తెలుగు సాహిత్యంలో గిరిజనుల ప్రస్తావన వివిధ ప్రక్రియల్లో మొదటి నుండీ కనిపిస్తూ ఉంది. గిరిజనులు కొండల్ని, గుట్టల్ని, అడవుల్ని ఆశ్రయించి జీవిస్తున్నారు. అందువల్లనే వీరిని అడవి బిడ్డలని సంబోధిస్తారు. పచ్చని చెట్లలో ఆకుల్లా,జీవిస్తూ ఉన్నదాంతో సంతోషంగా ఆటపాటలతో జీవనాన్ని వెళ్ళదీస్తారు.

గిరిజనులది ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయం. వీరు తమదైన జీవన శైలితో సమైక్య జీవనం సాగిస్తుంటారు. ప్రాంతీయ భేదాలను అనుసరించి గిరిజన మాండలిక భాషాపదాలు ప్రత్యేకతను సంతరించుకుంటాయి. వీరు దైనందిన జీవితంలో ప్రయోగించే భాషలో జాతీయాలు, సామెతలు దొర్లుతాయి. మచ్చుకు, "కొద్దిసేపు అని చెప్పడానికి - గిడకసేపు, అసుంట అనిబీ వేకువజామున - ఎవకులజాము అనీబీ సాయంకాలాన్ని బొమ్మెత్తువేళ, వెన్నెలరాత్రి అనిబీ చీకటిపడింది అనటానికి వెలిబూది" అని వ్యవహరిస్తారు.

గిరిజన తెగల్లో కోయ, కొండ, గోండి, సవర, ఎరుకల జాతి వారి కథలు మౌఖిక సాహిత్యంలో రక్షింపబడుతున్నాయి. ఆయా భాషలకు లిపి లేకపోవడంతో అక్షరబద్ధం చేయడానికి సమీప ప్రాంతీయ భాషా లిపిలోనే వీరి కథల మనుగడ నిర్వహించ బడుతున్నది. గిరిజన జాతి భాషతో పరిచయం లేని, మైదాన ప్రాంత వాసులైన తెలుగు వారికి సులువుగా అర్థమయ్యేందుకు తెలుగు భాషాలో అనువాదం తప్పనిసరి.ఎరుకల జాతి మౌఖిక కథారూప ప్రారంభం కొద్దిగా సూచించడమైంది.

ఎరుకలజాతి మనసు :

ఎరుకల వారు కథలు చెప్పుకోవడంలో, కథను సృష్టించడంలో మంచి నేర్పరులుగా కనిపిస్తారు. ఈ జాతివారు చూడటానికి అమాయకుల్లా కనిపిస్తారేమో కాని, వాస్తవానికి సర్వజ్ఞులు. అక్షర జ్ఞానం లేకపోయినా మంచి సృజనతో కథల్ని మౌఖికంగా సృష్టిస్తారు. ఎరుకల వారి కథలు భారతీయ ఆత్మకు దర్పణం లాంటివి. ప్రస్తుతం సూరిగాడి సుక్కమ్మ మంత్రం, ముగ్గురు మిత్రులు అనే రెండు కథల విశ్లేషణ ప్రస్తుత కర్తవ్యం.

మొదటి కథ - సూరిగాడి సుక్కమ్మ మంత్రం :

ఈ కథలు ఎరుకుల జాతి వారి వ్యవహార భాషలో మౌఖికంగా రూపొందాయి. తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్ జిల్లా లోని ఇంద్రకళ్ గ్రామ నివాసి సుమారు ఐదుపదుల వయసుగల ఎరుకల జాతి వనిత శ్రీమతి కావాడి వెన్నెలమ్మ వినిపించిన "సూరిగాడి సుక్కమ్మ మంత్రం కథ". వారి వాడుక భాషలోని ఈ కథ తెలుగు లిపిలో-

"రామాపురం ఊరుకోరు సూరిగో, సుక్కమ్మ ఇండు పొండు మనాగో ఇంచు. సూరిగినుకు పొండు ఇండిగే ఎత్తునో ఇష్టం. సుక్కమ్మ మాత్రం మనాగున సరిగ్గా పాతుగారు గుండా అదుఓండు సొన్ని పొండు ఓండు సేయ్యించు. ఇనుగా సేయ్యందిగే సూరిగో ఎత్తునో బాధబుగంచు.

ఇనుగ ఇక్యందు ఓండురోజు సుక్కమ్మ తాయి తేపో ఓండు నాలుగు రోజులు పుల్లంచి ఇందుటు వోంబో

ఇండు వంచు అత్త వంచు ఇండు సూరిగో పొండుట కియ్యికి ఓండు తామిడి దుడ్డు కుడుతు నీంగమ్మ వందికి దల్లె ఈదూడ్డోటి నాటు కొయికర్రి జల్లమీను సేందు తింబిక్తి నాను కరువు పనికి గుట్టమేనుకు వొగక్కురే ఇండు సొన్నిటువోసూ...'' ఇలా సాగింది అసలు కథ.

కథా సారాంశం :

ఒక ఊరిలో సూరిగాడు, సుక్కమ్మ, అనే దంపతులు వుంటారు. సూరిగాడు భార్యను ఎంతో ప్రేమిస్తుంటాడు. సుక్కమ్మ మాత్రం భర్తమాటను నిర్లక్యం చేస్తుంటుంది. అంతేకాదు, భర్త ఏదైనా మాట చెప్తే అందుకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తుంది. ఈ క్రమంలో ఒకరోజు సుక్కమ్మ తల్లి దండ్రులు వస్తే గౌరవం కోసం 'కోడికూర' వండిపెట్ట మంటాడు సూరిగాడు. కాని సుక్కమ్మ భర్త మాటను కాదంటూ 'పచ్చికారం' చేసి పెడ్తుంది. మరోరోజు సూరి గాడు తల్లిదండ్రులు వస్తారు. అప్పుడు కావాలనే 'పచ్చి కారం' వండమంటాడు సూరిగాడు. అప్పుడు 'కోడికూర' వండి పెడుతుంది సుక్కమ్మ.

ఆ విధంగా అత్తమామల మనుసు చూరగొంటుంది సుక్కమ్మ. ఇలా వుండాగా ఒకానొకసారి ఊర్లో వాళ్ళంతా తీర్థయాత్రలకు బయలుదేరుతుంటారు, సూరిగాడికి కూడా వెళ్ళాలనిపించి ''మనం వాళ్ళతో కలిసి తీర్థ యాత్రలకు ఎట్టి పరిస్థితులలో కూడా వెళ్ళొద్దు'' అని ఉద్దేశ్యపూర్వకమైన పథకంలో మాట్లాడుతుండగానే అందుకు వ్యతిరేకంగా సుక్కమ్మ మనం ఎలాగైనా తీర్థ యాత్రలకు వెళ్ళాలిసిందే అని అంటుంది. సూరిగాడి పథకం ఫలించి ఎంతో ఇష్టంగా భార్యను తీసుకొని ఊరం దరితో కలిసి తీర్థయాత్రలకు బయలుదేరుతాడు. అయితే ఒకానొక పుణ్యక్షేత్రంలో సుక్కమ్మ నదిలో చాలా ముందుకు వెళ్ళి స్నానం ఆచరిస్తుంటుంది. అది గమ నించిన సూరిగాడు తొట్రుపాటుతో భార్య మనస్తత్వాన్ని మరిచిపోయి ''మునిగిపోతావే లోతుకు వెళ్ళొద్దు'' అని కంగారుగా కేకలు వేశాడు. ''నువ్వు చెప్తే నేను వినాలా?'' అంటూ సుక్కమ్మ ఇంకొంచెం ముందుకు వెళ్ళగా, మొసలి ఒకటి వచ్చి, ఆమెను అమాంతంగా నీళ్ళ లోపలికి లాక్కొని పోతుంది.

ఆ విధంగా సుక్కమ్మ బతుకు నీళ్ళపాలు కాగా, సూరి గాడు ఎంతో దు:ఖిస్తూ జంటగా వెళ్ళినవాడు ఒంటరిగా తిరిగి వస్తాడు. వాడితో పాటుగా ఊరి వారందరూ కూడా తిరిగి వస్తారు. వచ్చీ రాగానే వాతావరణంలో మార్పు వల్ల అందరికీ జ్వరాలు దగ్గులు, వాంతులు, విరేచనాలు మొదలౌతాయి.

ఇదంతా వాతావరణంలో మార్పు అని వైద్యులు సూచి స్తారు. కాని గ్రామస్థులకు నమ్మకం కుదరదు. సుక్కమ్మ దెయ్యమై మమ్మల్ని పీడిస్తున్నదని అందరూ నమ్ముతారు. దీంతో ఇక ఆలస్యం చేయకుండా అందరూ సూరిగాణ్ణి కలిసి ''నీ పెళ్ళామే దెయ్యమైంది. నీవే ఎలాగైనా వది లించాలి''. అని ప్రాధేయపడ్డారు. చేసేది లేక సూరిగాడు ఎంతో బాధపడుతూ ''ఏమే సుక్కమ్మ వెళ్ళిపో'' అంటాడు. విచిత్రంగా ఆ వచ్చిన వాళ్ళకు రోగం తీవ్రత ఎక్కువ అవుతుంది. భార్య మనస్తత్వం తెలిసిన వాడైన సూరిగాడు ''ఏమే సుక్కమ్మా! వీళ్ళను ఇంకా గట్టిగా పట్టి పీడించు'' అంటాడు. విచిత్రంగా అందరికీ రోగం తగ్గిపోతుంది. ఇక అది మొదలు ఆ ఊర్లో ఎవ్వరికి ఏ గాలి సోకినా 'సుక్కమ్మ మంత్రం' కోసం సూరిగాడి వద్దకు రావడం మొదలెడ్తారు. కాలక్రమంలో సూరిగాడు 'సుక్కమ్మ మంత్రగాడి'గా మారి పోతాడు. చుట్టుపక్కల గ్రామాల వాళ్ళు సైతం సూరిగాడు మంత్రాన్ని విశ్వసిస్తారు. ఆ విధంగా సూరిగాడికి సంపాదన కూడా బాగా మొదలౌతుంది. తర్వాత వాడు రెండవపెళ్ళి కూడా చేసుకుంటాడు. అయినప్పటికీ వాడికి సుక్కమ్మ మీద ప్రేమ చావదు. అందుకే ప్రతిరోజు తనలో తనే ఇలా అనుకుంటుంటాడు. ''నీది నాది విడదీయని బంధమే! అందుకే ప్రతిరోజు మంత్రమై నా నోట్లో నాను తున్నావు. నాపాలిట సంపాదనవై నన్ను సంతోషపెడ్తు న్నావు'' అని బాధపడటంతో కథ ముగుస్తుంది.

కథా విశ్లేషణ :

కథలో కనిపించిన విరుద్ధభావాలు కలిగిన భార్యా

భర్తలు కలిసి వుండాలని, విరుద్ధ భావాల్ని విడానాడి ఒకరికొకరు అనుకూలంగా మారిపోవాలని సూరిగాడి ప్రేమ నిరూపిస్తుంది. ''కోడికూర-పచ్చికారం'' వంటి కూరలు ఎరుకలవాళ్ళ రోజువారి ఆహారంలో తరుచూ కనిపిస్తుంటాయి. తీర్థయాత్రలుపట్ల ఎరుకలజాతివారి భక్తి విశ్వాసాలు ఈ కథలో స్పష్టమౌతున్నాయి. ఎరుకలవారు మణ్యంకొండ, యాదగిరి, తిరుపతి, శ్రీశైలం వంటి పుణ్యక్షేత్రాల్ని తరుచూ యాత్రగా వెళ్ళి దర్శించు కుంటుంటారు.ఈ జాతిలో కొందరు ఆడవాళ్ళు సోది చెప్పే వృత్తిని నేటికీ కొనసాగిస్తుండటం వీరి భక్తిభావాలకు నిదర్శనం. ఇక వాతావరణం, నీళ్ళల్లో చోటు చేసుకునే మార్పులవల్ల ప్రజల ఆరోగ్యంలో తేడా కనిపించడం అనేది ఒక్క ఎరుకల వారిలోనే కాదు, సమాజంలో సహజంగా అందరిలోనూసహజమే. అయితే ఇలాంటి ఆరోగ్య పరిస్థితుల్లో తేడాను 'గాలి/దయ్యం' గా భావించడంలో ఎరుకలవారు ముందు వరసలో వుంటారని చెప్పవచ్చు. ఇదొక నమ్మకం.

ఈ క్రమంలో కథలో కనిపించిన ''చనిపోయిన వ్యక్తులు దయ్యాలై వచ్చి పీడించడం'' వంటి నమ్మకం ఎరుకల జాతిలో ప్రగాఢంగా ఉన్నది. అంతేకాదు, కథలో మాదిరిగానే ఫలానా వాళ్ళే దయ్యాలయ్యారనే నమ్మకం బలంగా ఉంటుంది. అందుకే ఆ క్రమంలోనే నివారణో పాయాల వెతుక్కుంటుంటారు.

ఎరుకల వాళ్ళల్లో మంత్రగాళ్ళు కూడా ఉన్నారు. వీళ్ళల్లో సూరిగాడి లాంటి భూతవైద్యులు ప్రత్యేకం. కథ లోని ఒక సాధారణ సంఘటన కాలక్రమంలో ఒక అసా ధారణ భూతవైద్యంగా రూపుదిద్దుకున్న విచిత్రం కని పిస్తుంది. ఇలాంటి సంఘటనలు నిజ జీవితాల్లో కూడా అక్కడక్కడా కనిపిస్తుంటాయి. ఉదాహరణకు ఫలానా వాళ్ళే దయ్యాలయ్యారని ఆ సమయానికి అనుకోవడం వేరు, ఒక సమయంలో అనుకున్న విషయం శాశ్వత పరి ష్కారంగా రూపుదిద్దుకోవడం వేరు. ఏది ఏమైన కథ ద్వారా ''మంచి మాటలు వినిపించుకోవాలి'' అనే నీతిని ఆహ్వానించాలి.. కథన శైలి పాఠకుల్ని చదివింప చేసేలా, ఆకర్షణ జనకంగా, ఉత్సాభరితంగా సాగింది. కౌటుంబిక వ్యవస్థలో భార్యాభర్తల అన్యోన్యం అనివార్యమనేది కథ సామాజిక సందేశం.

రెండవ కథ – ముగ్గురు మిత్రులు :

''ఎనికటికి ఓండు రాజ్యంకోరు అయిట పని నల్ల పేరు ఎత్తెందుగుండా కుమ్మరాయి, సాలేయి, కంసా లాయి, ఇక్యాంచు ఇయ్య మూడేరు సిన్నప్పుడుండు ప్రాణదోస్తులు తీరి ఇక్యాంచు.

ఇనుగ ఇక్యాందు ఓండురోజు ఇయ్య మూడేరు అయిట అయిట వృత్తిపని విషయమై పక్కిలి రాజ్యంకు ప్రయాణం సేయ్యిను అనుగే ఎగినెల్లి బెరు అడవి ఓండు దాటిల్సి వంచు కాబట్టి మొబ్బు అగార్తు మినుగల్లె అడవి ప్రయాణం సాగిక్యిను అనిగేగూడా ఎగిసాగుమడిది అడవి నెల్లెమొబ్బు అలిమిగిండుసు.....'' ఇలాసాగింది అసలు కథ.

కథా సారాంశం :

ఒక ఊరిలో కుమ్మరివాడు, సాలెవాడు, కంసాలి వాడు, ముగ్గురు మంచి మిత్రులుగా వుండేవారు. వీరు ముగ్గురు ఒకానొక రోజు తమ వృత్తి పనుల నిమిత్తం పక్క రాజ్యానికి ప్రయాణ మౌతారు. మార్గమధ్యలో పెద్ద అడవి దాటాల్సి ఉంటుంది. కాని వారు ఆ అడవి దాటక ముందే చీకటి పడింది. దీంతో క్రూరమృగాల భయంతో తమ ప్రయాణాన్ని ఆ రాత్రికి ముగించుకుని, అడవిలోనే సురక్షితమైన స్థావరాన్ని ఎంచుకుని, అక్కడ ఆ రాత్రికి విశ్రాంతి తీసుకునే ప్రయత్నం చేశారు. కాగా ముందు జాగ్రత్తగా విడివిడిగా వారు బాధ్యతల్ని కేటాయించుకుని ఒకరు నిద్రపోతున్నప్పుడు మరొకరు మెలకువతో రక్షణకోసం కాపలా ఉండేలా నియమాన్ని కుదుర్చు కుంటారు.

కాపలాకోసం ముందుగా కుమ్మరివాని వంతు వస్తుంది. జాగారంతో పాలుపోని కుమ్మరివాడు అక్కడున్న

మట్టితో ఒక బొమ్మను తయారు చేస్తాడు. తర్వాత సాలె వాని వంతు వస్తుంది. వాడికి కూడా ఏమి పాలుపోక కుమ్మరివాడు తయారు చేసిన బొమ్మకు అక్కడున్న ఆకులు అలాల్ని వస్త్రాల్లా చుట్టి మానరక్షణచేశాడు. తర్వాత కంసాలివాడి వంతు వచ్చింది. అతడికి కూడా ఏమి పాలుపోక గడ్డితీగల్ని సేకరించి ఆ బొమ్మకు మాలల్ని తయారు చేసిఅందంగా అలంకరిస్తాడు. తర్వాత తెల్లవారుజాము కావడంతో మిత్రులతో పాటుగా కాసేపు నడుము వాలుస్తాడు. ఇదంతా గమనిస్తున్న పార్వతీ పరమేశ్వరులకు ఆ బొమ్మకు ప్రాణం పోయాలి అనే ఒక చిలిపి ఆలోచన వచ్చి ప్రాణం పోస్తారు. ఆ బొమ్మ ఒక అత్యద్భుత దివ్య సౌందర్యరాశిలా తయారౌతుంది. స్నేహితులు ముగ్గురు మెలకువ వచ్చి చూసే సరికి ఎదురుగా అందాలరాశి కనబడేసరికి ఆశ్చర్య చకితులౌతారు.

''ఆమె ఎవరో కాదు! తాము తయారుచేసిన బొమ్మయే'' అని అలంకరణల్ని చూసి ఆ మిత్రులకు అర్థమౌతుంది. అపుడా మిత్రులకు ఆమె 'ఎవ్వరి సొంతం'? అనే విషయమై మెల్లగా తగాదా మొదలై, ఎటూ తేల్చుకోలేక, చివరికి ఆమెను తీసుకుని రాజావారి వద్దకు తీర్పుకై వెళ్తారు. అంతా విన్న రాజావారు కింది విధంగా తీర్పు ఇచ్చాడు.

సృష్టించినవాడు తండ్రితో సమానం, కాబట్టి కుమ్మరి వాడు ఆమె తండ్రి! వస్త్రాలతో స్త్రీ మానాభిమానాల్ని కాపాడిన వాడు సోదరుడితో సమానం కాబట్టి కంసాలి వాడు ఆమెకు భర్త!

అంతా విన్న ఆ మిత్రులు రాజావారి తీర్పును శిరసావహించి తండ్రిగా, సోదరుడిగా, భర్తగా ఎవరి బాధ్యతతో వాళ్ళు ఆమెను ఆదరిస్తూ, ప్రేమిస్తూ తమతో తీసుకు వెళ్ళిపోతారు. తర్వాత ఎప్పట్లా కలిసిమెలిసి హాయిగా జీవిస్తారు. అది సంక్షిప్త కథ.

కథా విశ్లేషణ :

శివపార్వతుల్ని ప్రగాఢంగా విశ్వసించే ఎరుకలవారు. వారి లీల ఈ కథలో కొత్తకోణంలో ఆవిష్కరించబడింది. వృత్తి నైపుణ్యాన్ని జీవకళతో నిరూపించారు. కథలో ఇతర కులాలవారి ప్రతిభ కనిపించినప్పటికీ, చెప్పింది ఎరుకల వారే గదా! తాము చేసే ప్రతి చిన్నపనిలో కూడా లోపం లేకుండా చూసుకునే ఎరుకలవారి అంకితభావం, నిర్ణయాత్మక ప్రతిభ, కథను నడిపించడంలోని మూలాధార భూత బొమ్మ తయారీలో సృష్టమైంది. తమ బృంద సభ్యుల రక్షణలో నిమగ్నమైన ఆ ముగ్గురి వృత్తి నైపుణ్యదారులు, సుకుమార సౌందర్యరాశిగా బొమ్మను మలచడంలో ప్రదర్శించిన నేర్పుని గుర్తించాలి. అన్ని కులాల్లోనూ వృత్తి నిపుణులు అనాదిగా ఉన్నారనే వాస్తవం ఈ కథలో అంతర్లీనంగా ఉంది. రాజశాసనం అనతిక్రమణీయం గదా! సదసద్వివేచనగల రాజుగారి తీర్పు - ఆ ముగ్గురు మిత్రుల కన్నులు తెరిపించింది.తత్త్వం అవగతమైంది. ఈ కథ భారతీయ ఆలోచన విధానానికి పట్టుగొమ్మ. కుటుంబ సభ్యులపట్ల పరస్పర ప్రేమానురాగాలు, ఆత్మీయతలు, అనుబంధాలు, బాధ్యతలు వంటివాటిపట్ల పాటించాల్సిన హద్దులు రాజుగారి తీర్పుతో విశదమయ్యాయి. పెద్దవారి మాటలు గౌరవించాలి అనే సంస్కారం ఎరుకలజాతిలో మెండు. కథలో కనిపించిన అడవులు, క్రూరమృగాలు, ఎరుకలజాతి వారి ఒకప్పటి సంచార జీవనంలోనివే. ప్రస్తుతం 'వేట' జీవనంలోనూ భాగమయింది. ఎరుకల జాతి వారిలోమహిళలు సవరాలు తయారు చేయడం కూడా వృత్తిగా స్వీకరించారు.

ఎరుకల జాతి వారి క్రీడలు :

ఎరుకలజాతి వారి ఆటలు వినోదానికి విజ్ఞానానికి ఉత్సాహానికి పెద్ద పీట వేస్తాయి. వీరు ఆడుకునే ఆటలు అన్నీ కూడా సామూహికమైనవే. వయసు తేడా లేకుండా అన్ని ఆటలు పిల్లలు పెద్దలు ఆనందంగా కలసిమెలసి ఆడుకుంటారు. పిల్లలు ఆడుతుంటే పెద్దలు చూసి వినోదించడం, పెద్దలు ఆడుతుంటే పిల్లలు కాలక్షేపం చేయడం, వీరి జీవన విధానంలో సర్వ సాధారణం.

ఎరుకలవారి ఆటల్లో సంప్రదాయం, ఆచారం, స్పష్టంగా కనిపిస్తాయి. ఒకరకంగా చెప్పాలంటే వీరి ప్రతి

ఆట వీరి మనోభావమని చెప్పవచ్చు. ఒకప్పుడు ఎరుకల వారు పూర్తిగా నిరక్షరాస్యులు. ప్రస్తుతం నాగరిక జీవనానికి అలవాటుపడుతూ తమ వృత్తి పనుల్లో పిల్లల్ని చదివించు కుంటున్నారు. ఈ క్రమంలో పూర్వం పిల్లలు పెద్దలు పొద్దస్తమానం తమ వృత్తి పనుల్లో నిమగ్నమై రాత్రులు ఆటలతో వినోదించేవాళ్ళు. ప్రస్తుతం మాత్రం పరిస్థితి మారింది. పిల్లలు ఉదయం పాఠశాలకు వెళ్ళి వచ్చి సాయంకాలం వేళ ప్రతిరోజూ వినోదిస్తుంటారు. సెలవు దినాల్లో అయితే వీరి ఆటపాటలకు ఆటవిడుపు. ఇక పెద్దలు అప్పుడప్పుడూ పిల్లలతో జతకలుపుతూ పొద్దస్తమానం తాము పడ్డ శ్రమను ఆనందంతో మర్చి పోతుంటారు. వీరి ఆటలు ముఖ్యంగా మూడు రకాలు. వస్తు ప్రధానమైనవి. చిత్ర ప్రధానమైనవి గేయ ప్రధాన మైనవి. అవి -

వస్తుప్రధానమైన ఆటలు : 1.కర్ర కుస్తీలాట 2.గుంజ లాట 3.జిల్లెం కట్టె ఆట 4.కోతికొమ్మచ్చి ఆట 5.బలం ప్రయోగించే ఆట

చిత్ర ప్రధానమై ఆటలు : 1. బారకట్ట 2. చిర్రాట 3. కుంటిగిచ్చాట.

గేయ ప్రధానమైనవి : 1. పుంగిరిపూత 2. ముక్కుగిల్లు ఆట 3. దాగుడుమూతలు ఆట

పైన పేర్కొన ఆటలలో వారి సంప్రదాయం, ఆనంద మయ జీవన విధానం, శారీరక బలం వంటివి స్పష్టంగా కనిపిస్తుంటాయి.

ముగింపు :

ఎరుకలవారి కథలు, ఆటలు వారి జీవితానికి అను సంధానంగా కనిపిస్తాయి. ప్రతి కథలోనూ నీతి వుంటుంది. వీరు ఎక్కువగా రాత్రుళ్ళు, పంటపొలాల్లో కథలు చెప్పుకుంటారు. వీరు ఆచరించే మంత్రతంత్రాలు కూడా కథల్లో కనిపిస్తాయి. అన్నీ కూడా ఊకొట్టే కథలు. వీరి కథలు చాలావరకు మంచిని కాపాడుతాయి. మరికొన్ని కథలు మంచి వినోదాన్ని అందిస్తాయి. ఈ విధంగా వీరి కథల్లో నవరసాలు కనిపిస్తాయనేది గమనించాల్సిన విషయం. అనుబంధాలకు, ఆప్యాయతలకు, సంస్కృతీ సంప్రదాయాలకు కథల్లో పెద్దపీటనే తెలపడం వాస్తవం. ఈ విధంగా పై రెండు కథల్లోను ఎరుకల జాతి జీవన చిత్రణ తెలుసుకొన వచ్చును.

ఆధార గ్రంథాలు :

1. ఆధునిక సమాజంలో గిరిజనభాష సంస్కృతులు (వ్యాస సంకలనం), సంపాదకులు భూక్య తిరుపతి, ప్రథమ ముద్రణ 2012.
2. ఆంధ్రుల జానపద విజ్ఞానం, ఆర్వీయస్ సుందరం 1983.
3. ఎరుకలభాష సంస్కృతి సాహిత్యం, డా. జి. శ్రీరాములు, 2010.

చెంచుల మౌఖిక భక్తి గేయాలు – సామాజిక నేపథ్యం

– డా. కె. భాను నాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, యస్.యస్.ఎన్. కాలేజి, నర్సరావుపేట.

ఆంధ్రప్రదేశ్ వున్న 35 గిరిజన తెగలలో ముఖ్యమైన తెగ చెంచు. ఈ చెంచులు మన రాష్ట్రంలో కర్నూలు, గుంటూరు, ప్రకాశం, జిల్లాల్లో విస్తరించి వున్నారు. అలాగే తెలంగాణా రాష్ట్రంలో మహబూబ్‌నగర్ జిల్లాలో కూడా చెంచులు ఎక్కువగా నివసిస్తుంటారు. ఈ చెంచులు వేట, తేనె, వ్యవసాయం, అటవీ ఉత్పత్తుల ద్వారా జీవనం కొనసాగిస్తుంటారు. ఈ చెంచులు తేనె తీయటంలో నిష్ణాతులని చెప్పవచ్చు. పొడవైన చెట్ల మీద నుండి, నిటారుగా ఉండే కొండల్లో శిఖరాగ్రాన ఉండే తేనె పట్టుల నుండి, ఇతర ప్రమాదకర పరిస్థితులు ఉండే ప్రదేశాల నుండి కూడా ధైర్యంగా, సునాయాసంగా తేనెను సేక రిస్తారు. ఈ తేనె సేకరణలో చెంచులు తమ వెంట సోద రుల కంటే బావమరుదులను, ఇతర బంధువులను ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. చెంచులు తేనె టీగలను దైవసమానంగా భావిస్తారు. ఈ తేనెను ఆహారంగాను, ఔషధంగాను చెంచులు ఉపయోగిస్తారు. ఈ చెంచులు వేటకు వేళ్ళేటప్పుడు సాధారణంగా కుటుంబ సమేతంగా వెళతారు. కాని చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలు, వ్యాధిగ్రస్తులను ఇంటి వద్దే ఉంచి వెళతారు. చెంచులు వేట వెళ్ళేటప్పుడు 'కుక్క' వీరి వెన్నంటే ఉంటూ, వేటలో చాలా సహాయ పడుతుంటాయి. వేట సమయంలో వేటగాళ్ళు చాలా జాగ్రత్తగా నడుచుకునే విధంగానే వీరి కుక్కలు కూడా ఏ మాత్రం చప్పుడు కాకుండా, కాళ్ళ కింద ఆకుల శబ్దం సైతం రానీయకుండా చాలా జాగ్ర త్తగా నడుస్తాయి. చెంచులు భార్యపై చూపే అనురాగం, ప్రేమ చాలా గొప్పవి. ఎంతటి క్లిష్ట పరిస్థితుల్లోనూ భార్యను వీడరు. చెంచు స్త్రీలు చీరలు, రవికలను, మగ వారు గోచీలను ధరిస్తారు. గోచీకై వారి స్త్రీల పీలికలను, ఇతర గుడ్డ పీలికలను ఉపయోగిస్తారు. వీరు తడాకలతో శంఖాకృతి వుండే గుడిసెలను నిర్మించుకుంటారు. చెంచులు సాంప్రదాయకంగా తయారు చేసుకునే 'విప్పపువ్వు' సారాను ఇష్టంగా సేవిస్తారు.

చెంచులు తమ భార్య, సంతానం పట్ల అవ్యాజ ప్రేమానురాగాలు ప్రదర్శిస్తారు. వీరి వివాహాలు వధువు ఇంటి వద్దనే జరుపుతారు. ఈ నూతన జంట ఒకవేళ నదిని దాటాల్సి వస్తే నది పట్ల భయభక్తులు ప్రదర్శిస్తారు. నదిలో ఉమ్మి వేయడం, మలమూత్ర విసర్జనలు ఎట్టి సమయాల్లోను చేయరు. సరసాలకు కూడా దూరంగా ఉంటారు. బహు భార్యత్వం, విధవా పునర్వివాహాల్ని వీరి సమాజం సమ్మతిస్తుంది. ఉగాది, శివరాత్రి మొదలగు పండుగలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. దైవం పట్ల కృతజ్ఞతా భావం కలిగి దైవ ప్రార్ధన తర్వాతనే ఆహారాన్ని భుజించడం వీరి అలవాటు. ఈ చెంచులు వెదురుతో తడికలు, చాటలు, బుట్టలు, విల్లంబులు, తట్టలు మొద లగునవి తయారు చేస్తారు. వివిధ రకాల వాయిద్యాలు కూడా రూపొందిస్తారు. ఈ వాయిద్యాలతో వివిధ పండుగలు, వివాహ తదితర సంతోషకర సమయాల్లో వాయిస్తారు. పాటలు, నృత్యాలతో అనందంగా గడుపు తారు.

చెంచులక్ష్మి నరసింహస్వామికి తనను పరిణయ మాడాలంటే 'తేనె' సేకరణ వేటలో ప్రావీణ్యతను పరీక్షిస్తూ చెంచులక్ష్మి ఈ పాట పాడుతుంది.

"చెట్టు లెక్కగలవా ఓ నరహరి
పుట్టలెక్కగలవా
చెట్టు లెక్కి ఆ చిటారు కొమ్మన
తేనె తీయగలవా... ఓ నరహరి...
చెట్టు లెక్కగలనే ఓ చెంచిత
పుట్ట లెక్కగలనే
చెట్టు లెక్కి ఆ చిటారు కొమ్మన

తేనె తీయగలనే ఓ చెంచిత....
వేటలాడగలవా ఓ నరహరి
ఏనుగెక్కి గలవా
ఏనుగెక్కి ఒక ముష్టిదెబ్బతో
దరను కూల్చగలవా ఓ నరహరి...
అడవి తిరగగలనే ఓ చెంచిత
పండు కోయగలనే
నదులు దాటగలనే ఓ చెంచిత..."

- చెవుల ఈరమ్మ, వయస్సు - 55, పాలుట్ల.

జిల్లగరేకుల పూలు

"జిల్లగరేకుల పూలు జిల్లగరేకుల పూలు
ఒక్కొక్క పువ్వేసిన అవి జల్లనిండాది జిల్లగరేకుల పూలు
రెండ్రెండు పూలేసిన అవి జల్లనిండాది జిల్లగరేకుల పూలు
జిల్లగరేకుల పూలు జిల్లగరేకుల పూలు....
పూలకే దారాలు చెప్పరే సామి జిల్లగరేకుల పూలు
జిల్లగరేకుల పూలు జిల్లగరేకుల పూలు....
పువ్వుకే పూట్టాడే మొగ్గకే సామి జిల్లగరేకుల పూలు
జిల్లగరేకుల పూలు.... జిల్లగరేకుల పూలు.....
మూడేసి పూలేసిన అవి జిల్లనిండాది జిల్లగరేకుల పూలు
జిల్లగరేకుల పూలు జిల్లగరేకుల పూలు....
పూలల్లో దారాలు చెప్పరే సామి జిల్లగరేకుల పూలు
జిల్లగరేకుల పూలు జిల్లగరేకుల పూలు
నాలుగేసి పూలేసిన అవి జిల్లనిండాది జిల్లగరేకుల పూలు
జిల్లగరేకుల పూలు జిల్లగరేకుల పూలు
పూలల్లో దారాలు చెప్పరే సామి జిల్లగరేకు పూలు
జిల్లగరేకుల పూలు జిల్లగరేకుల పూలు"

- చెవుల ఈదమ్మ, వయస్సు 60, పాలుట్ల.

ఒక్కొక్క పువ్వు ఏరినా పెద్ద జల్ల నిండదు. రెండు రెండు ఏరినా జల్ల నిండదు. అదేవిధంగా ఒక్కరు అడవి అంతా గాలించినా చెంచు కుటుంబం గడవదు. భార్యా, భర్తలు ఇద్దరూ అడవిలో ఏ పని చేసినా కుటుంబం గడుచుట చాలా కష్టంగా ఉంటుంది. కానీ ఓ స్వామి మాకు బిడ్డలు పుట్టినారు మేము తిండికి లేని నిరు పేదలము మాకు మాత్రం మరాల బిడ్డలు పుట్టినారు. మేము బ్రతకటమే కష్టం అయినా మరలా మాకు వరుసగా పిల్లలు పుడుతున్నారు (పువ్వుకు పుట్టడే) మాకే తిండి గడుచుటలేదు, మరల మా కడుపులో పిల్లలు స్వామి.

ఓ దేవుడా! మరల మేము భార్యా, భర్తలం మరియు బిడ్డ పని చేసినను మా అందరికి కడుపులు నిండక, మా జీవితం గడుచుటలేదని, ఈ విధంగా మాకు నలుగురు పిల్లలు పుట్టి మేము అందరం అడవి అంతా గాలించినా, అడవి అంతా తిరిగి పనులు చేసుకున్నా మా కడుపు అనే జల్ల నిండటం లేదు స్వామి....

మమ్ములను ఎందుకు పుట్టించినావు స్వామి! మేము పుట్టినాము సరే, మా కుటుంబం అంతా పువ్వుకు దారాలు ఏవిధంగా అయితే ఉన్నాయో అదేవిధంగా మా కుటుంబం అంతా వరుసగా కలిసి పని చేసినా మా అందరి కడుపులు నిండుటలేదు. దేవుడా! చెప్పు స్వామి! మేము ఈ అడవిలో ఏవిధంగా బ్రతకలో అని దేవునికి పూలు సమర్పించు, పాడుకొనే విధానమే ఈ పాట యొక్క ముఖ్య ఉద్దేశం.

గట్టమీద కల్వ చెట్టు

"గట్టమీద కల్వచెట్టు - వలచందమామయ్య
ఆనఅచ్చి ఇగిరేసే - వలచందమామయ్య
ఇగిరేసే కొమ్మ పెంచా - వలచందమామయ్య
కొమ్మ పెంచి పూల్ పీసా - వలచందమామయ్య
కొమ్మెంచి కాయకాస్తే - వలచందమామయ్య
కాయ తెంప నేన్‌పోలే - వలచందమామయ్య
గోరు గోరు నెత్తరాయె - వలచందమామయ్య
గోరు కడగ నీళ్ళు లేవు - వలచందమామయ్య
ఏరు ఏరు నిన్నే చాపిస్తే - వలచందమామయ్య
ఏట్లో బొట్టేలేవు - వలచందమామయ్య

కాల్వ కాల్వ నిన్నే చాపిస్తే - వలచందమామయ్య
గోరు గోరు నెత్తరాయే - వలచందమామయ్య
గోరు కడగ నీళ్ళు లేవు - వలచందమామయ్య
కుంట కుంట నిన్నే చాపిస్తే - వలచందమామయ్య
గోరు గోరు నెత్తరాయె - వలచందమామయ్య
కుంట లొక్క బొట్టే లేవు - వలచందమామయ్య
ఏరొంక నిన్నే చాపిస్తే - వలచందమామయ్య
ఏరొంక నీళ్ళు లేవు - వలచందమామయ్య
గోరు గోరు నెత్తరాయె - వలచందమామయ్య
పారే కాల్వ నిన్నే చాపిస్తే - వలచందమామయ్య
పారే కాల్వలోక్క బొట్టేలేవు - వలచందమామయ్య
గోరు గోరు నెత్తరాయె - వలచందమామయ్య
ఏరొంక నీళ్ళుపాయె - వలచందమామయ్య
గోరు గోరు నీళ్ళు లేవు - వలచందమామయ్య
గోరు కడగ నీళ్ళు లేవు - వలచందమామయ్య
ఏరు చుట్టూ నిన్నే చూపిస్తే - వలచందమామయ్య
పాటలేని దవ్వలోన - వలచందమామయ్య
దవ్వలోన చుక్కలేవు - వలచందమామయ్య
గోరు గోరు నెత్తరాయె - వలచందమామయ్య
ఎత్తు పట్ట గుండు కింద - వలచందమామయ్య
నీనే తోడ నువ్వే గుప్పా - వలచందమామయ్య
గోరుకేమో ఆచ్చినవి నీళ్ళు - వలచందమామయ్య
గోరు నెత్తర పోయినాది - వలచందమామయ్య

- కుడుముల భయమ్మ, వయస్సు 50, పాలుట్ల.

చెంచు స్త్రీలు అడవికి పోయినపుడు అడవిలోని ఎన్నో రకాల చెట్ల పండ్లను సేకరిస్తారు. కొన్ని పండ్లు ముళ్ళ చెట్ల, కొన్ని చెట్లు జారేవి మరియు మరికొన్ని చెట్ల బెరడుకు చెక్కలు ఇలా ఎన్నో రకాల చెట్లు నుండి పండ్లను సేక రిస్తారు. అయితే ముళ్ళ చెట్లకు మంచి తియ్యటి పండ్లు కాస్తాయి. ఆ పండ్లను తొందపడి కోస్తే మాత్రం ముండ్లు గుచ్చుకుంటాయి.

ముళ్ళ చెట్లు మరియు తీగలైన పరికి, రేగు, ఏనుగు పరికి, బలుసు, కలివి అనే రకాలుగా ఉంటాయి. ఈ కలివి చెట్లు మరియు అన్ని రకాల చెట్లు, వాన వచ్చిన వెంటనే ఇగురు వేస్తాయి. ఇగురు వేసిన వెంటనే చెట్ల నిండా కొమ్ములు పెరుగుతాయి. కొమ్ములు పెరిగిన వెంటనే పూలు పూస్తాయి, పూలు కాయలుగా మారి అవే పండ్లు అవుతాయి. ఆ పండ్లను కోసేది మాత్రం చెంచు స్త్రీలే. అయితే ఆ పండ్లను కోసేటప్పుడు చాలా జాగ్రత్తగా కోయాలి. లేనిచో చేతికి ముళ్ళు గుచ్చుకుంటాయి. అడవిలో ఈ కలివి పండ్లు నీళ్ళు లేని ప్రాంతంలో మాగు తాయి. అందువల్ల చేతికి రక్తం అయితే చాలా కష్టం, కనీసం ఆ రక్తం కడుక్కోవటానికి నీళ్ళు కూడా దొరకవు.

అడవిలో పెద్దపెద్ద ఏరులు, కాలువలు, కుంటలు, ఏటి వంకలు మరియు నీరు పారే కాలువలు కూడా వుంటాయి. కాని కొన్ని కాలాల్లో వీటిలో ఎక్కడ వెదికిన నీళ్ళు ఉండవు. ఏ చిన్నపాటి దెబ్బ తగిలినా నీళ్ళు దొరకవు. అటువంటి కాలంలో నీళ్ళు ఉండే ప్రవేశముల గురించి చెంచులకు బాగా తెలుసు. వాటిలో కొన్ని ఏరు గల ప్రాంతంలోని పెద్ద పెద్ద బండల వద్ద రాళ్ళున్న ప్రదేశంలో, రాళ్ళు లేపితే వాటి క్రింద నీళ్ళు వుంటాయి. ఆ నీళ్ళు మాత్రమే త్రాగటానికి మరియు ఇతర అత్యావసరాలకు ఉపయోగిస్తారు. ప్రధానంగా చెంచు స్త్రీలు బయట వున్న సమయంలో ఎల్లప్పుడు నీళ్ళు పారే చలమల వద్దకు నీళ్ళు కోసం, ఆ నీళ్ళు ఎండిపోతాయని చెంచుల నమ్మకం.

గిరిజనుల వాడుక భాషలోని తెలుగు సామెతలు

– డా॥ జి. శైలమ్మ, ఎడిటోరియల్ అసిస్టెంట్, ప్రచురణల కేంద్రం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

ఏదైనా విరుద్ధమైన సంఘటన జరిగిన సమయంలో వెంటనే ఒక సామెతను వేసి ఈ తీరుగా ఉందే అని అనడం పరిపాటి. సామెతలు భాషలో నిక్షిప్తమై భాషకు పరిపుష్ఠిని కలిగిస్తాయి. దీనికోసం సామెతలు ఎక్కడుంటాయా అని ప్రత్యేకంగా వెతకాల్సిన పని లేదు. అవి జానపదుల నాలుకలపై ఓలలాడుతుంటాయి. సామెతలను ఆంగ్లంలో Proverb అని, తెలుగులో సామ్య శబ్దానికి, 'సామ్యత' అనే అసాధారణ రూపం ఏర్పడింది. తెలుగు సోదర భాష అయిన కన్నడంలో సామెతలను 'సామతి' అని వ్యవహరిస్తారు. సామతి 'సామ్యతె' నుండి ఆవిర్భవించినట్లు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తుంది.

సామెతలనేవి ఎక్కడి నుండో వచ్చి చేరవు, రోజు వారి దినచర్యలో ఏర్పడే సుఖ దుఃఖాలు, లాభం, నష్టం, కష్టం, ఇష్టం నేర్పిన జీవిత పాఠాలే సామెతలుగా వచ్చి చేరతాయి. సామెతలను గమనించినట్లైతే వాక్యరూపంలో ఉన్నప్పటికి అంత్యప్రాస కలిగి అల్పాక్షరాల్లో రూపొంది అనల్పమైన అర్థాన్నిచ్చేవిగా ఉంటాయి. సామెతల్లో ఆయా కాలాలకు సంబంధించిన సంస్కృతి సంప్రదాయాలు నిక్షిప్తమై ఉంటాయి. అంతేకాదు పిల్లలకు సంబంధించినవి, స్త్రీలు మాత్రమే వేసుకొనే సామెతలు, పండుగలకు సంబంధించినవి ఆహారానికి సంబంధించినవి ఉంటాయి. సామెతను బట్టి ఆ సమాజ పోకడను చెప్పొచ్చు.

కందువ మాటలు సామెత
లందముగ గూర్చి చెప్పనది తెలుగునకు
బొందై రుచియై వీనుల
విందై కానిపించు విబుధుల మదికిన్" పు: 115
జానపద విజ్ఞానధ్యయనం - జియస్. మోహన్

సామెత అనగా జన వ్యవహారక్షుణ్ణమైన ఉక్తి - శ్రీసంపత్ రాఘవాచారి గారి అభిప్రాయం, "పూర్వులు తమ యనుభవములను సూత్రప్రాయముగా చెప్పుచూ వచ్చినవే సామెతలైనవి" అని నేదూరి గంగాధరం, ఒక పిండితార్థాన్ని కొద్దిమాటల్లో చెబుతుంది సామెత - విశ్వనాథసత్యనారాయణ. ఏదైన ఒక విషయం చెప్పేటపుడు పోలిక కోసం చెప్పే వాక్యం సామెత అని స్థూలంగా చెప్పుకోవచ్చని డా.పి. నరసింహారెడ్డి అభిప్రాయం. "మానవుని అనుభవ పాఠం యొక్క ప్రతిరూపమే సామెత" - డా.జి. శైలమ్మ.

వీరి ఆలోచనలను బట్టి చూస్తే సామెతలంటే జనవ్యవహారంలో మానవుడు చేస్తున్న వివిధ పనులు, ప్రదర్శించే హావభావాలు, తనక్రియలు, మానసిక శారీరక ఆలోచనల భావ పరంపరలు సామెతలుగా ఆవిర్భవించినట్లుగా తెలుస్తుంది.

గిరిజనులు ఎక్కడో వేరేగ్రహం మీద నివాసం ఏర్పరచుకోలేదు. వాళ్లు కొండలను గుట్టలను, రోడ్లపక్క, చిట్టడవుల్లో, మైదాన ప్రాంతాల్లో నాగరిక సమాజానికి దూరంగా తమదైన సంస్కృతి సంప్రదాయాలు కలిగున్నారు. వీరికి ప్రత్యేకమైన భాషా మాండలికాలున్నాయి. కొండ, మండ, గోండీ, సవర, గదబ, బడగ, కట్టునాయకన్, కోయ, కొండరెడ్డి, పర్జి, ఒల్లారి, లంబాడీ, నక్కలోళ్లు, భిల్లులు ఇలా రకరకాల తెగలవారు భారతదేశమంతటా నివాసమేర్పరచుకొని ఉన్నారు. ఈ తెగలకు సంబంధించిన కోయ, లంబాడీ, సవర, కుయి, కువి ఇలా ఏవో కొన్నిటికి మాత్రమే లిపి అభివృద్ధి చెందివుంది. ఈ మాండలిక భాషా వ్యవహర్తలపై ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు భాష ప్రభావం అత్యధికంగా ఉంది.

ఆంధ్రప్రదేశ్‌లోని గిరిజనుల వెతలను చిత్రిస్తూ అనేక కథలు వచ్చాయి. కథల్లో కొంతమంది రచయితలు గిరిజనుల వ్యవహారంలో ఉన్న సామెతలను పొందు

పరిచారు. ఆ సామెతలను పరిశీలించినపుడు గిరిజనులే వాడుకునే సామెతలు అక్కడక్కడ కనిపించాయి. మిగిలిన వన్నీ తెలుగు వారు నిత్య వ్యవహారంలో నిత్యం ఉపయోగించే సామెతలుగానే ఉన్నాయి. తెలుగువారు ప్రయోగించే సామెతలు గిరిజనుల వ్యవహారంలో కొన్ని ధ్వని మార్పులకు కారణమవుతున్నాయి. శిష్ట, శిష్టేతర వ్యవహార భేదం స్పష్టంగా కనిపిస్తుంది. సామెతల్లో గిరిజనుల జీవన శైలి ప్రతిబింబిస్తుంది. ఉదా॥ "సాట్ల తవుడు బోసి కుక్కలకు తాకులాట బెట్టినట్టయ్యె" - ఈ సామెత వారి జీవన స్థితి ఎలా ఉందో, ఏవో కొద్ది సదుపాయాలు వారి ముందుపెట్టి అవి అందరికి సరిపోక వాళ్లను వాళ్లే నిందించుకొనే పరిస్థితి ఏర్పడిందని తెలియజేస్తుంది.

'సాట్ల తవుడు బోసి కుక్కలకు తాకులాట బెట్టినట్టయ్యె'

నేటి సమాజంలో జనాభా ఉత్పత్తి పెరిగినంత వేగంగా మనుషులకు అవసరమైన నిత్యావసర వస్తువులు, సౌకుమార్యాన్ని సమకూర్చే ఉత్పత్తులు పెరుగుదల అంతంత మాత్రంగానే ఉంది. పై సామెతలో అర్థం కాని పదాలు ఏమీ లేవు. చేటతో నిత్యం బియ్యం చెరుక్కోవడం అన్నం పచనం చేసే వారందరికి ఎరుక. ఆకలి చల్లార్చే ఆహార పదార్థం కొదువుగా ఉన్న ఎంగిలి విస్తరి కోసం కుక్కలు తమ ఆకలి మంటను చల్లార్చుకోడానికి పోటీ పడతాయి. బలమైనవి ముందుగా చొరబడి అందినంత దోచుకొంటాయి. అలాగే ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి ఇవ్వాల్సిన వనరులు తక్కువగా ఇవ్వడం వల్ల గిరిజనుల్లో అందరికి సరిపోదని, దాని వల్ల గిరిజనుల్లో అభివృద్ధి ఆశించిన మంచి ఫలితాలు రావడంలేదు! పైగా వారు వొకర్ని వొకరు నిందించుకొంటున్నారు.

ఈ సామెత ద్వారా గిరిజనుల కోసం అమలు చేసే పథకాలకు అత్యంత ఎక్కువ వ్యయం చేయాల్సిన అవసరం ఉందని తెలుస్తుంది. వారు చాలీచాలని వనరులతో జీవిస్తున్నట్లు తెలియజేసే ప్రయత్నమే ఈ సామెత.

అడవి పందులు సీని మేసిస్తే ఊరపందులు చెవులు గోస్సారట.

వ్యవసాయం మీద ఆధరపడి జీవించే వారికి అడవి పందులు ఏం చేస్తాయో తెలుసు. అడవి పందులు పంట పొలంలో దిగి ముట్టెతో భూమిని పెళ్లగించి కిందవున్న వేళ్ళు, గడ్డలు తింటాయి మట్టిగడ్డలకోసం పంటనంతటిని కుళ్లగిస్తాయి. ఇష్టమైన పంటను కూడా తింటాయి. దీనివల్ల రైతుకి రావాల్సిన రాబడి రాక నష్టాల పాలవుతాడు. రైతు అడవి పందుల బారి నుండి తన పంట పొలాన్ని రక్షించుకోడానికి నాటు బాంబులు, కరెంటు తీగలు చుట్టి వాటిని చంపుతుంటారు. కొన్ని సమయాల్లో ఉన్నత వర్గానికి చెందిన వారు తమ ఆస్తిని దోచుకున్న వారిని శిక్షించకుండా అన్యం పుణ్యం తెలియని పేదవాడ్ని హింసిస్తారు. అందుకే 'ఊరపందులు చెవులు గోస్సాడట' అన్నది వచ్చింది.

తప్పు చేసిన వారిని శిక్షించాల్సిన చోట గొడవతో సంబంధం లేని వారిని శిక్షించే సమయంలో వచ్చిన సామెత అని తెలుస్తుంది.

ఇడ్డోరం గుడ్డెడితే....తెల్లుల్లిపాయపిల్ల లెట్టి నట్టగ.

ఆవుపాలిస్తుంది. ఇది అందరికి తెలిసిన విషయమే. అదే దున్న గాని, ఎద్దుగాని పాలిస్తుందంటే ఎవరైనా నమ్ముతారా నమ్మరు కదా. ఒక్కో సారి వింతలు జరుగుతుంటాయి. కుక్క కోతికి పాలిస్తుందని, పిల్లి ఎలుకకు పాలిస్తుందనో వింటుంటాం విడ్డూరమైన సంగతులు తెల్లగడ్డ పిల్లలు పెట్టినట్టుగ వుంటుంది. తెల్లగడ్డ పిల్లల్ని పెట్టదు కదా! మనుషుల్లో ఒక కఠినమైన వ్యక్తి, పేదవాడి రక్తాన్ని పిండి చేసి వంట చేసుకొని తినే వ్యక్తి పేదవారిని ఉన్నట్టుండి ప్రేమిస్తున్నాడంటే అది నమ్మశక్యం కానిది అనే అర్థంలో ఈ సామెత ప్రయోగం కనిపిస్తుంది.

ఇచ్చికానికి ఉచ్చతాగితే నోరంతా రొచ్చుకంపే

ఒక్కోసారి మనుషులు చూస్తున్నారనో, గౌరవం కోసమో, ఏదైనా పదవిని ఆశించించినపుడు నీచమైన

పనులు చేయాల్సి వస్తుంది. ఇద్దరు వ్యక్తులు స్నేహానికి గుర్తుగా ఏవో బహుమతులిచ్చుకోవడం, ఒకరికోసం ఒకరు ఇష్టమైన పనులు చేసుకోవడంలో భాగంగా మనసుకి నచ్చని పనులు చేస్తారు. తరువాత దాని ప్రభావం తెలుస్తుంది. చెడు ఎప్పుడైనా మంచి ఫలితాన్ని ఇవ్వదు. థైరాయిడ్‌తో బాధపడుతున్న వ్యక్తి మాంసం నూనె పదార్థాలు మక్కువ కొద్ది అతిగా తినడం వల్ల పదికిలోల వ్యక్తి ఇరవై కిలోలయ్యే అవకాశముంది. దీనివల్ల శరీర అవయవాలు సరిగా పని చేయకుండా ఉండే పరిస్థితిలో ఉంటారు. మంచి పనులు ఇష్టంగా చేయడం మంచి ఫలితాన్నిస్తుందని చెడ్డ పని అని తెలిసినా కూడా చేస్తే తరువాత ఫలితాన్ని అనుభవించాల్సి వస్తుంది అని ఈ సామెత తెలియజేస్తుంది.

ఇనగా ఇనగా మేక కుక్కవుతాది గదా!

చదువు నేర్చుకోక ముందు కాకరకాయ అన్న వ్యక్తి చదువుకొన్న తరువాత కీకరకాయ అన్నాడట అన్నది అందరికి తెలిసిందే. అయితే ఇక్కడ మనకు మేక, కుక్క రెండు జంతువులున్నాయి. మేక పసరిక మేయడం, పిల్లల్ని ఈనడం యజమాని చెప్పినట్లు వింటుంది. కుక్క ఇల్లిల్లు తిరగడం కడుపు నింపుకోడం కోసం అనేక రకాల ఆహార న్వేషణ మార్గాలనెంచుకొంటుంది. ఎవరైన ఒక వ్యక్తికి చెప్పుడు మాటలు రోజు చెప్తుంటే వినే వ్యక్తి ఎప్పుడైన చెడ్డవారిగా మారిపోయే అవకాశం ఉంది. నిజాయితీగా ఉండేవాడు ఒకప్పుడు, కాని ఇపుడు చూడు అతను ఎలా ఉన్నాడో అని మంచి నడవడి గల వ్యక్తిని చూసి అంటుంటారు. కొంతమంది చెవినిల్లు కట్టుకొని చెడును బోధిస్తుంటారు. ఆ మాటలు వారిపై ప్రభావాన్ని చూపి చెడ్డ వారిగా మారిపోయిన తీరుని ఇనగా ఇనగా మేక కుక్కవుతాది గదా! అన్న సామెత తెలియజేస్తుంది.

ఈన కాసి నక్కల పాల్జేసినట్లు

తల్లులు తమ పిల్లల్ని రక్షించుకోడానికి ఎన్నోరకాల ప్రయత్నాలు చేస్తారు. కోడి తన పిల్లల్ని గ్రద్ద నుండి కుక్కల నుండి రక్షించుకొంటుంది. గుడ్డు దశ నుండి పిల్లగా పుట్టడానికి తల్లి అనేక రకాల బాధలననుభవిస్తుంది. బిడ్డ పుట్టగానే తల్లి తనుపడిన శ్రమనంతటిని మరచిపోతుంది. తరువాత బిడ్డను సంరక్షించి పెద్ద చేస్తుంది. పందులు గర్భం ధరించిన తరువాత మూడు నాలుగు నెలలకి పది, పదిహేను పిల్లల్ని కంటుంది. కన్న తరువాత ఆకలి బాధ భరించలేక తన పిల్లల్ని తానే తింటుంది. ఒక్కోసారి ముందు పుట్టిన పిల్లలు అటు ఇటు తిరుగుతుంటాయి. ఈ సమయంలో శత్రువైన నక్క రక్తపువాసన గమనించి అక్కడికి చేరుకొని అవకాశమొచ్చిన ప్రతిసారి ఒక్కో పిల్లని తినేస్తుంది. పంది పడుకొన్నచోట నుండి పైకి లేవలేదు అలసిపోయి అక్కడే పడుకొంటుంది. దాని పొట్ట కిందపడి కొన్ని చచ్చిపోతాయి. పంది గర్భంలో మోసిన పిల్లల్ని ఈనిన తరువాత రక్షించుకోలేదు. ఫలితంగా పిల్లల్ని నక్కలు తినేస్తాయి. ఇక్కడ నక్కల కోసం పంది పిల్లల్ని ఈనినట్ల యింది. పందుల యజమాని ఎంతో కష్టపడి మేపి ఎంతో కొంత లాభాన్ని పొందాలనుకొంటే ఫలితం తను అనుభవించకుండా నక్క తినిపోవడం పందుల యజమానికి తీవ్ర దుఃఖాన్ని కలిగిస్తుంది.

ఎతామెసుకు మాకు బత్తట్టావయి (నీళ్లల్లో చేపలం మాకేం తెల్సు)

బావిలో కప్ప తన చుట్టు ఉన్న బావి సరిహద్దునే ప్రపంచమంతా ఇదే అని అనుకుంటుంది. కాని అనంతమైన ప్రపంచంలో చిన్న మూలన అది ఉందని తెలుసుకోలేదు అలాంటిదే. ఎతా మెసుకు మాకు బత్తట్టావయి. కొండ ప్రాంతంలో నాగరిక సమాజానికి దూరంగా, మంచి చెడులు తెలుసుకోని స్థితిలో గిరిజనులున్నారన్న సత్యం దీనివల్ల తెలుస్తుంది. అభివృద్ధి పథకాలు వారికి ఎంత వరకు ఉపయోగపడగలవో వారినే అడిగి తెలుసుకొంటే మంచిది. కాని అలా జరగదు ప్రభుత్వం ఇష్టమొచ్చినట్టు పథకాలు ప్రవేశపెడుతుంది. నీటిలోని చేపలకు బలమైన ఆహారాన్ని వేసి పోషించవచ్చు. చేపను గట్టున పెట్టి ఆహారం వేసినా అది వ్యర్థం చేప చచ్చిపోతుంది. ఆహారంకి అయిన ఖర్చు భారమవుతుందే తప్ప గిరిజనులకు ఏ

మాత్రం ఉపయోగపడదు. నీళ్లలో చేప వంటి వారమని మీరే గుర్తించాలన్న అర్థంలో వచ్చింది.

ఎర్రిదామొచ్చి యేపచెట్టు దగ్గరి ఎరిగేత్తే అమ్మోరికి కోపమొచ్చి అందరి మీదా వాలిందట.

ఒక్కోసారి ఎవరో చేసిన తప్పుకి శిక్ష అందరి మీద పడుతుంది. ఇది సర్వసాధారణంగా కార్యాలయాల్లో కూడా జరుగుతుంది. వేపచెట్టు పరమ పవిత్రంగాను, అమ్మోరి దేవతగాను చూసుకోవడం సంప్రదాయం. ఎర్రి పట్టిన స్త్రీకి ఆ విషయం ఏం తెలుసు. పాపం తెలీక వేపచెట్టు కింద కాలుమడత పెట్టింది. అది అమ్మోరు చూసింది ఓర్చుకోలేక పోయింది. కాని పని చేశారంటు ప్రజలందరిని శోధిస్తుంది. అన్యాయంగా అనవసరంగా శిక్షకు గురవుతున్నపుడు వచ్చిన సామెత.

దేవతనుకొని మొక్కబోతే.....దెయ్యిమయివీక బట్టుకున్నట్టిగున్నది

ఒక్కోసారి అందరి జీవితాల్లో జరిగే సంఘటన ఇది. మంచి కోసం బోతే చెడు రావడం, మంచివాళ్లనుకొన్న వారి దగ్గరికి సాయమాశించి పోతే వారు సాయం చేయక పోగా మోసం చేసే వారుగా ఉంటుంటారు. అలాంటపుడు పుట్టుకొచ్చిందే ఈ సామెత. ఆపదలో సాయమార్థించి వెళ్లిన స్త్రీని హింసించి పంపితే ఆ స్త్రీ వేదనలో నుండి పుట్టుకొచ్చిందే ఈ సామెత. మొక్కుకోసం వెళ్ళిన వ్యక్తిని చంపే ప్రయత్నం చేసినపుడు, తను వచ్చింది దేవత దగ్గరకు కాదని (మేలు చేసే వ్యక్తి దగ్గరకురాలేదని) కీడు చేసే దెయ్యం దగ్గరకు (హాని తలపట్టే వ్యక్తి దగ్గరకు) వచ్చినట్లు తెలుసుకొంటారు.

కొర్రియ్యతోటి బుర్రగోక్కున్నట్టగ

మంచి, చెడుని గుర్తించి మంచిని ఎంచుకొనే వారు కొద్దిమంది ఉంటారు. కొంతమంది చెడ్డ వారిగానే చని పోయో అంత వరకు మార్పు లేని జీవితాలను కొన సాగిస్తుంటారు. నిప్పుమండుతుంది దేనైనా కాల్చే గుణం కలిగుంటుంది. పల్లెల్లో కొంత మంది కట్టెల పొయ్యి మీద వంట చేసుకొంటారు. కట్టెపుల్లలను మండించగా కాలు తుంటాయి. మండుతున్న పుల్ల కాల్చే గుణాన్ని కలి గుంటుంది. తల్లో పేను కొరికితే చేత్తో సరిచేసుకొంటే సరి. అలా కాకుండా కొరివితో సర్దుకోవాలనుకొంటే తలను కాల్చి వేస్తుంది. దీని సాదృశ్యంగా చెడ్డవారితో, కయ్యానికి కాలు దువ్వే వారితో, సంబంధం పెట్టుకొంటే కొర్రియ్య తోటి బుర్ర గోక్కున్నట్టే అని అంటుంటారు.

కాలికొచ్చిన తాపు చేతికొచ్చినగుద్దు అన్నట్టు

ఎవరైనా ఒంటరిగా పోతుంటే దొంగలు అతని నిస్సా హయతను గమనించి దాడిచేస్తారు. అతని దగ్గర ఉన్న దంతా దోచుకొని ఇష్టమొచ్చినట్టు చేత్తో కాల్తో తన్నడం జరిగినపుడు కాలికొచ్చిన తాపు చేతికొచ్చిన గుద్దు అన్నట్టు కొట్టాడు అని అంటారు.

గోండోల్ల ఎవుసాయం గట్టుకు కట్టెలు మోసినట్టే

గోండులు అడవుల్లో, లోయల్లో నాగరిక సమాజానికి దూరంగా నివసిస్తుంటారు. వీరు నివసిస్తున్న ప్రాంతంలో కొంత భూమిని సాగు చేసుకొని రాగులు, జొన్నలు వంటి మెట్టధాన్యాన్ని వేస్తారు. పోడు వ్యవసాయ పద్ధతి ద్వారా పంట పండిస్తారు. కనుక వర్షం మీద ఆధారపడవలసిందే. వర్షం వచ్చినపుడు పల్లంలో ఉన్న వస్తువులు తడిచిపోతా యని గట్టు (మెట్ట) ప్రాంతానికి తీసుకు రావడం చేస్తుంటాం. గోండులు ఒకచోట నుండి మరో చోటుకి భూసారం తగ్గిందని వెళుతుంటారు. జీవనాధారమైన వ్యవసాయం గట్టుకి కట్టెలు మోసినట్టుగా ఉంటుంది. వారి వ్యవసాయం గట్టు నుండి గట్టుకి మోసుకొన్నట్టు వుంటుంది. ఒక్కోసారి వీరి భూమిని ఇతరులు ఆక్ర మించినపుడు అక్కడ ఉన్న భూమిని ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకొంటున్నా భూమికి పట్టాలంటాయని తెలీక పోవడం, ఆ భూమిపై పట్టా సంపాదించుకొన్న వారు భూమిని ఖాళీ చేయమనగానే అన్నీ వదిలి వలస వెళుతుంటారు. స్థిరంగా ఒకచోట ఉండకపోవడం అన్న విషయాన్ని తెలియజేస్తుంది.

మతిమడపాల మీద దృష్టి దీపాల మీద అన్నట్టు

ఎవరైనా మనకోసం వస్తున్నారంటే ఎదురు చూడని వారంటూ ఎవరూ ఉండరు. చిన్న పిల్లలయితే మరీను పని మీద పట్టణం వెళ్లిన పెద్దలు తిరిగొచ్చేటపుడు పిల్లల కోసం రకరకాల మిఠాయిలు తెస్తుంటారు. పండగలపుడు జాతరపుడు పిల్లలకు సంబంధించిన వస్తువులు ఏమన్నా తీసిస్తామని ముందుగా చెప్పినట్లయితే అవి వారు పొందే వరకు పెద్దలను విసిగిస్తుంటారు. ఎవరన్నా వస్తున్నారన్న వినికడయితే ఆ పాదాల చప్పుడు తమ తల్లిదండ్రుల దేమోనని ఆలకిస్తుంటారు. చూపు పొద్దు మీద వుంటుంది. ఇంకా రాత్రయిపోతుందే ఎందుకు రాలేదు త్వరగా రావాలని ఎదురు చూసే సందర్భంలో వచ్చిందే మతి మడపాల మీద దృష్టి దీపాల మీద అన్నట్టు వుంది అని ఎదురుచూస్తున్న వ్యక్తిని చూసి అంటారు.

కొట్లాడి సాధించుకున్న అడ్డదున్న రొట్టయినా భక్ష్యమంత రుచిగ ఉంటదిరా

న్యాయంగా రావాల్సిన భాగాన్ని అన్యాయంగా ఆక్ర మించుకొన్న వ్యక్తి దగ్గర నుండి తిరిగి దాన్ని సాధించు కున్నపుడు విపరీతమైన ఆనందాన్ని పొందుతారు. కొంత మంది ఇంట్లో ఉన్న దాన్ని ఎవరికో ఇచ్చి తరువాత ఇబ్బంది పడుతుంటారు. బాధలో ఉన్నప్పుడు ఆకలి మంట చల్లార్చుకోడానికి పాడైపోయిన ఆహారం లభించి నప్పటికి అదే పరమాన్నంగా తినడం ఒకటి. పోరాడితే పోయేది ఏమి లేదు బానిస సంకెళ్లు తప్ప ఇది అందరికి తెలిసింది. దేని కోసమైన పోరాటం చేయగా వచ్చినది. పనికి మాలినదైన దానికి విలువ ఎక్కువగా ఉంటుందన్న అర్థంలో వాడుతాం. కొట్లాడి సాధించుకున్న అడ్డదున్న రొట్టయినా భక్ష్యమంత రుచి అంటే దున్నపోతు తినేది గడ్డి, మనుషులు తినేది భక్ష్యాలు పోరాటం చేసి దున్న పోతు తినే గడ్డిని సాధించుకున్నా అది భక్ష్యమంత రుచిగా ఉంటుందని చెప్పే సందర్భంలో వచ్చింది.

కోదోడి తోటి బేరం కొండముచ్చుతోటి సుట్టరికమని

కొండలను ఆశ్రయించి జీవించే కోయలు, కొండ దొరలు, కోందులు అడవిలో లభించే తేనె, చింతపండు, కందులు, పెసలు వంటివి పట్టణంలో అమ్మి తమకు కావాల్సిన వస్తువులు తెచ్చుకొంటుంటారు. కొలతలు, తూనికల పట్ల వీరికి అవగాహన తక్కువ. దారంతోనో ఏదో ఒక వస్తువుతోనో పోల్చుకొని కొలతలు వేసుకొంటారు. వీరి అమాయకత్వాన్ని సొమ్ము చేసుకొనే వాళ్లు అధికం కొంత మందికి గిరిజనుడు నష్టపోయినా పర్వాలేదు వారి వద్ద నుండి మాత్రం ఎక్కువ పరిమాణంలో వస్తువులు పొందడానికి ఆశపడతారు. గిరిజనులకు ఏదైనా పనులు చెప్పిన తొందరగా అర్థం చేసుకోరు వాళ్ల ఆలోచన ధోరణిలోనే వాళ్లు ఉంటారు. వీరు అమాయకత్వం, నిరక్షరాస్యత కారణంగా వెనుకబడి ఉంటారు. కొండ ముచ్చులు ఒక చోట స్థిరంగా ఉండవు. చెప్పిన పని చేయడానికి వాటికి మానవ భాష రాదు, వాటితో స్నేహం చేయడం కుదరదు. తమ భాషలో అరుసుకుంటూ కొమ్మల మీద గెంతుతుంటాయి. కొండ ముచ్చుతో బంధుత్వం కలుపుకోవడం ఎలాంటిదో కోయలతో వ్యాపారం అలాంటిదని చెప్పే సందర్భంలోనిది.

యీనాడు అప్పులు తీర్చడవూ అమ్మోరికి పిల్లలు బుట్టడమూ జరగని పని

వివిధ రకాల దేవతలను పూజించే దేవతల్లో అమ్మోరు దేవత ఒకటి. ఈమె ప్రతిగ్రామంలో వెలుస్తుంది. తమ పిల్లలకు అమ్మవారు సోకకుండా వుండేలా రోజు పూజలు చేసి సద్దన్నాలు పెడతారు. పండుగ సమయంలో మేకలు, గొర్రెలు, కోళ్లు బలిస్తారు. ఈమెను గ్రామాన్ని రక్షించే దేవత అని అంటారు. ఈమెకు పిల్లలు పుట్టడం కల్ల ఎందుకంటె దేవత కనుక. ఆమెను భక్తితో పూజించే వారికి సంతాన ప్రాప్తి కలిగించే శక్తి స్వరూపిణి. ప్రతి మనిషి ఏదో ఒక సమయంలో అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అప్పు చేయడం తప్పు కాదు అప్పు తీర్చకపోవడం తప్పు. గిరిజనులు నిత్యం తమ చుట్టూ ఉన్న పిట్టను, మట్టిలోని గడ్డలను ఆహారంగా స్వీకరించి జీవనం చేస్తుంటారు. వీరు

నివసిస్తున్న ప్రాంతంలో బెల్లం, చక్కెర, చుట్ట ఉండవు. వీరి కష్టాన్ని సొమ్ము చేసుకోవచ్చని గిరిజనేతరులు గిరిజనులకు అవసరమైన వస్తువులు అమ్ముతారు. కొనే సామర్థ్యం లేనపుడు వారి దగ్గరున్న గిన్నె చెంబు, బంగారం, ఎద్దులు, కోళ్లు కుదవ పెడతారు. అప్పుగా తీసుకొన్న మొత్తానికి వ్యాపారస్తులు వడ్డీల మీద వడ్డీలు వేసి వారు చేసిన అప్పును తీర్చలేక కొంతమంది పాలేర్లుగా కొంతమంది అప్పు తీర్చలేక, మరణిస్తే మిగిలిన వారి సంతస్తుకు సంక్రమించడం జరుగుతుంది. ఇలా అప్పులు తీరని క్రమంలో వచ్చిన సామెత యీనాడు అప్పులు తీర్చడవూ, అమ్మోరికి పిల్లలు బుట్టడమూ జరగని పని'' ఇది నిజమేకదా.

వెర్రి లేచిన కుక్కను చూసిపారిపోతే అది తరిమి తరిమి మన పిక్కలందుకుంటది.

మనుషులకు, జంతువులకు వెర్రి పట్టడం సహజం. వెర్రిపట్టినపుడు ఏం చేయాలో తెలియదు ఇష్టమొచ్చినట్టు ప్రవర్తిస్తుంటారు. వెర్రిపట్టిన వారిని చూసి పారిపోవడం వల్ల వచ్చే ఫలితం ఏమి లేదు. పారిపోవడంవల్ల వారు ఇంకా రెచ్చిపోయి భయపెట్టడం మొదలుపెడతారు. కుక్క విశ్వాసానికి ప్రతీక అయితే దానికి వెర్రి పడితే దొంగల్ని చూసి అరవాల్సినదిపోయి దారినపోయే ప్రతి వక్కర్ని చూసి అరుస్తుంటే దీనికి పిచ్చి పట్టిందని కర్ర తీసుకొని రెండు తగిలిస్తే అరవడం ఆపుతుంది. అలా కాకుండా అరుస్తుందని పరిగెత్తినట్లయితే కాళ్లను పట్టుకొని కొరుకుతుంది. అరిచేటపుడు పలాయనం చిత్తగించకుండా ధైర్యంగా నిలబడి ఆలోచిస్తే మంచి ఫలితం సమకూరుతుంది.

సిద్ధలనూని నేదంతే....ఎద్దుల సాలకి ఎలుగు కావాలన్నాడట.

ప్రపంచానికి వెలుగును పంచే సూర్యుడు రాత్రిపూట కనిపించనందున చీకటి అలముకొంటుంది. చీకటిని పారద్రోలడానికి నూనెలో వత్తిని వేసి వెలిగించుకొంటారు. ఈ వెలుతురు ఒక వైశాల్యం స్థలానికి సరిపోతుంది. గ్రామాల్లో దీపం వెలిగించుకోడానికి నూనె లేనపుడు పక్కింటికెళ్లి బదులు తెచ్చుకొంటారు. ఒకని ఇంట్లో నూనె లేని సమయంలో పక్కింటి వ్యక్తి వచ్చి ఎద్దుకొట్టంలో దీపంలేదు. దీపం పెట్టడానికి కొంచెం నూనె ఇవ్వు అని అడిగాడు. ఎద్దుల సాల చాల పెద్దది. మనుషులున్న ఇంట్లో వెలుగు పంచడానికి నూనెలేదంటే ఎద్దుల సాలకి వెలుగు కావాలంటే ఎక్కడి నుంచి వస్తుంది. లేదు అని చెప్పడానికి ఈ రకంగా వాడుకలో ఉంది.

ఇలా సామెతలు నిత్య జీవిత అనుభవంలో నుండి పుట్టుకొచ్చినవే. ప్రతి సామెత మానవునికి సంబంధించినదే. ప్రతి సామెత మానవుని జీవన విధానాన్ని ప్రతిబింబిస్తుంది.

ఆధార గ్రంథాలు :

1. జానపద విజ్ఞానాధ్యయం - డా॥ జి.యస్. మోహన్.
2. తెలుగు కథాసాహిత్యం - గిరిజన జీవితం - డా॥ జి. శైలమ్మ.
3. నెల్లూరు జిల్లా పాడుపు కథలు - డా॥ జి. శైలమ్మ.

గిరిజన హక్కుల కోసం పోరాడిన ఆదివాసీ వీరవనితలు

– ఓ. స్వప్న, సరోజినీ నాయుడు వనితా మహా విద్యాలయం, హైద్రాబాదు, తెలంగాణ.

గిరిజనులు సుమారుగా 1971 భారతదేశ జనాభా లెక్కల ప్రకారం 3 కోట్లమంది ఉన్నారు. వీరిని ఏడు వర్గాలుగా సర్ రిస్లీ విభజించారు. ఆ విభజనలో ద్రావిడ జాతికి చెందిన గిరిజనులు ఎక్కువగా ఉన్నారు. వీరి శారీరక లక్షణాలు ఒంటిరంగు కొంత నలుపు. ముఖం మీద రోమాలు ఉంగరాల జుట్టు తల. ఇలా వీరి లక్షణాలు చూస్తే వీరు మధ్య భారత గిరిజనులు అని తెలుస్తుంది. వీరు ద్రవిడియన్ ఆదివాసి మాత్రుభాషలతో పాటు స్థానిక వాడుక భాషలను కూడా మాట్లాడుతున్నారు.

గిరిజనుల వ్యవస్థ చూసినట్లయితే వివాహాల్లో దేవర న్యాయం, భార్యభగినీ న్యాయం. సోదరుడు చనిపోయిన తరువాత అతని భార్యను వివాహమాడేదే దేవర న్యాయం. ఒకని భార్య చనిపోయినప్పుడు పెళ్లికాని ఆమె సోదరిని పెళ్లిచేసుకునే ఆచారాన్ని భార్య భగినీ న్యాయమని ఇలా కొన్ని కనిపిస్తాయి. ఇది సవర, గదబ, గోండి, లంబాడీల్లో కనిపిస్తుంది. గిరిజనులు ఎక్కువగా వ్యవసాయం చేసే వారు మరియు స్వయం సమృద్ధి పనులు చేసేవారు. కోలాములు, నాయకపోండ్లు , జాతాపులు, గోండులు, పరధాన్లు, కొండరెడ్లు, కోయలు, సవర, చెంచులు, లంబాడీ, వాల్మీకులు అని కొన్ని తెగలవారు ఉన్నారు.

గిరిజన హక్కులకోసం పోరాడిన ఆదివాసీ వీరవనితలు సమ్మక్క సారక్క, గోండు రాణీ దుర్గావతి, పూల్మీబాయి. ఇలా ఎందరో వీరవనితలు ఉన్నారు. వారు చేసిన త్యాగాలు చూద్దాం.

సమ్మక్క సారక్క :

మనకు తెలిసిన కథ ప్రకారం సమ్మక్క ఒక కోయ వనిత. 13వ శతాబ్దానికి చెందిన ఆదివాసీ మహిళా సమ్మక్క. ఆమె కూతురు సారక్క. కొడుకు జంపన్న. వీరు ఆదివాసీలందరినీ ఒక్క తాటిపైకి తెచ్చి గిరిజన హక్కుల కోసం పోరాడారు. కాకతీయ రాజులు తమ ఆధిపత్యాన్ని పెంచడం కోసం ఆదివాసుల భూముల మీద వారి వ్యవసాయ ఆర్థిక వ్యవస్థల మీద దాడులు చేయాలని నిర్ణయించుకున్నారు. నేటి వరంగల్ జిల్లా లోని రామప్ప, లక్కవరం, పాకాల చెరువుల కింద పంటలు పండే ప్రాంతంలోని ఆదివాసుల భూములను కాకతీయ రాజులు ఆక్రమించుకున్నారు. కాకతీయుల దుర్మార్గాలను ఎదుర్కొనుటకు సమ్మక్క నాయకత్వంలో ఆదివాసీల తిరుగుబాటు జరిగింది. మారణాయుధాలను చేతపట్టుకొని కాకతీయ సైన్యంతో పోరాడింది. పోరాట సమయంలో ఆదివాసులు ఎంతోమంది తమ ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఈ పోరాటంలో సమ్మక్క సారక్కలు తమ ప్రాణాలు కోల్పోయిన కథానాయకురాళ్ళుగా ఆదివాసీ ప్రజలలో నిలిచిపోయారు. ఆదివాసీ ప్రజలకు దేవతలుగా మారిపోయారు. రెండేళ్ళకొకసారి సమ్మక్క సారక్క పేరిట వరంగల్ జిల్లా మేడారంలో పెద్ద జాతర జరుగుతుంది. ఈ జాతర ప్రపంచంలోనే అతి పెద్ద గిరిజన జాతరగా సమ్మక్క - సారక్క జాతర పేరుపొందింది.

గోండు రాణీ దుర్గావతి :

భారతదేశ చరిత్రలో అసమానమైన శౌర్యసాహసాలు, ప్రతిభ ప్రదర్శించిన మహిళామణులలో రాణీ దుర్గావతి ఒకరు. బ్రిటిష్ వారి పాలనా కాలంలో తన 29వ పుటలో రాణీ దుర్గావతి గూర్చి..... " ప్రపంచ మహావనితల సరసన నిలువగల సమర్థత గల మహిళ" అని ప్రశంసించారు. అంతటి పేరు తెచ్చుకున్న వీర వనిత రాణీ దుర్గావతి. భారతదేశంలో ఆకాలంలో సమాజ వికాసానికి తోడ్పడిన మహా మహిళల్లో ఒకరుగా పేరుగాంచారు. కేవలం ప్రజల వికాసం కోసమే తాను పోరాటం చేయలేదు. మొగలాయిల దురాక్రమణ నుండి జాతిని కాపాడేందుకు తన సర్వస్వాన్ని అర్పించారు.

కేవలం మహిళలకే కాదు యావన్మంది ప్రజలకు ఆమె ఆదర్శంగా నిలిచారు. ఆనాటి సమకాలిక నాయకులెవరు ఆమెకు సాటిరారు. అబుల్ ఫజల్ వ్రాసిన "అక్బరు నామా" లో కూడా రాణి దుర్గావతి గురించి వ్రాసి ఉంది. మరియు, ఆమె బాణం గురి తప్పేది కాదు. బాణాల్ని, తుపాకిని కూడా ప్రయోగించేది. వేటకు వెళ్ళేది. ఎక్కడైనా, సింహపు జాడను ప్రజలు చెబితే ఆ మృగాన్ని వేటాడి చంపేది. గోండులుగా పిలువబడుతున్న వారికి మంచి చరిత్ర ఉంది. వీరు తమకు తాము "కోయతూర్" లు అని పిలుచుకుంటారు. కోయతూర్ అనగా క్షత్రియ యుద్ధ వీరులని అర్థం. కానీ, మొగలాయిలు ఆ పేరు మార్చి వీరిని గోండులుగా పిలవడం ప్రారంభించారు. ఎంతో విశిష్టత కలిగిన ఈ గోండులను అలనాడు ' గడ్ మండల' రాజ్యాన్ని పరిపాలించిన రాజులలో రాజా సంగ్రామశాహ్ సర్వశ్రేష్ఠుడు అయిన ఈ రాజు గోండుల గొప్పతనాన్ని ఇలా వివరించాడు. గోండుజాతి పరంపర అలనాటి రామాయణ కలం నుండి వస్తున్నట్టిదే అని సగర్వంగా ప్రకటించాడు.

రాణీ దుర్గావతి 'గడ్ మండల' రాజవంశానికి చెందినది. ఈ వంశ ప్రస్తావన సంస్కృతంలో కూడా రాయబడి ఉంది. సంగ్రాహశాహ్, అతడి పుత్రుడు దళపతి శాహ్, కోడలు రాణీ దుర్గావతి ఈ వంశీయులే. తన భర్త దళపతి శాహ్ మరణానంతరం మూడేళ్ళప్రాయం గల తన పుత్రుడు వీర నారాయణ్ ను పేరుకు మాత్రమే ఆ రాజ సింహాసనాన్ని అధిష్ఠింపజేసింది. ఇలా 15 సంవత్సరాల పాటు మొగలాయిలతో పోరాటం చేసింది. గడ్ మండల రాజ్యాన్ని పరిపాలించింది. రాణీ దుర్గావతి శత్రువుల పాలిట దుర్గా రూపాన్ని దాల్చారు. నర్మదానది జలాలతో సుసంపన్నమైన, సారవంతమైన భూమి ఉండటంచేత పాడిపంటలు పుష్కలంగా ఉండి ఆమె రాజ్యపాలన సుఖఃశాంతులతో సాగినట్టుగా చరిత్ర చెబుతోంది.

ప్రజారక్షణ పట్ల దుర్గావతి ఎల్లవేళలా జాగరూకత వహిస్తూ ఏ విధమైన ఉపద్రవం వాటిల్లినా వాటి నుండి ప్రజలను కాపాడడానికి ఎల్లప్పుడూ సర్వసన్నద్ధంగా ఉండేది. రాణి దుర్గావతి తన ప్రజలను అడవి మృగాలా వలన భయం లేకుండా స్వయంగా వేటాడేది. ఆమె రాజ్యంలో రైతులు బంగారు నాణేల రూపంలోనూ, ఏనుగుల రూపంలోను ప్రభుత్వానికి శిస్తును చెల్లించేవారని తెలుస్తుంది. దీన్ని బట్టి భారతదేశంలో నివసిస్తున్న గోండు తెగవారు దారిద్ర్యంతో అలమటించడానికి కారణాన్ని పరిశీలించి చూస్తే ఆనాటి రాజ్యపాలనలోను, సమాజ వ్యవస్థలోను గల ఔన్నత్యమే అందుకు కారణం అని తెలుస్తుంది.

రాణి దుర్గావతి పాలనలో అన్ని రకాల కళలూ అభివృద్ధిలో ఉన్నాయి. కుల మాట వర్గ భేదాలు లేకుండా ప్రజలందరికీ సమానంగా ప్రభుత్వ సేవలు అందుతుండేవి. రాజ్యంలో నిరక్షరాస్యులు బహు తక్కువగా ఉండేవారు. రాణి దుర్గావతి కూడా విద్యపట్ల శ్రద్ధ చూపించేవారు అని చరిత్ర చెబుతుంది. ఆనాడు విద్యకుల, మత వర్గాలకు అతీతంగా ఉండేది. ఆనాడు భారత దేశంలో విద్య అందరికీ అందుబాటులో ఉండేది. విద్యా పరికరాలు కూడా తమకు అందుబాటులో ఉన్న వాస్తు సామాగ్రితోనే తయారు చేసుకొనేవారు. నేలను, ఇసుకను, సుద్దరాళ్లను, తాటి ఆకులను ఏది అందుబాటులో ఉంటే అది పరికరంగా వాడేవారు. గురుశిష్య సంబంధం కేవలం డబ్బు ఇచ్చి పుచ్చుకోవడం పైన ఆధారపడి ఉండేది కాదు. దీన్ని బట్టి పరిశీలించినా, రాణి దుర్గావతి రాజ్యంలో విద్యావ్యాప్తి సంతృప్తికరంగానే ఉందని తెలుస్తుంది.

ఆ రోజుల్లో ఒక మహిళ భర్తృవిహీన ఒక సామ్రాజ్యాన్ని ఏలడమే గాక అతి సమర్థవంతంగా పరిపాలించడం చూసి అసూయతో ఎంతో మందిరాజులు కబళించాలని కూడా చూశారు. వారిలో ముందు రాజబహద్దూర్ ఒకరు. 1550 -1560 కాలంలో అనేకమార్లు గోండు సామ్రాజ్యంపైన దాడిచేసి ఓటమి పాలయ్యాడు. ఇలా ఎంతోమంది రాజులూ రాణిదుర్గావతిని ఓడించాలని చూసి వారే

ఓడిపోయారు. ఇలా యుద్ధాలను చేస్తూనే వస్తుంది. ఓసారి యుద్ధంలో ఒక బాణాపుమొన రాణి దుర్గావతి శరీరంలో ఉండిపోయింది. ఇక ఆమె యుద్ధం చేయలేక పోయింది. ఎట్టి పరిస్థితులలోనైనా మొగలాయిల చేతిలో చనిపోవద్దని చివరకు ఆమె తన కత్తితో పొడుచుకొని చనిపోతుంది. తన మరణానంతరం 1564లో ''గడ్ మండల'' సామ్రాజ్యం నశించింది.

లంబాడి వీరవనిత పూల్నీబాయి :

ఆనాడు దొరలు ఆస్తులను, భూములను స్వాధీనం చేసుకొని చివరకు దొరికిన స్త్రీలపై అత్యాచారాలు జరుపుతూ ప్రజలను అల్లకల్లోలం చేసేవారు. నేటి జన గామ తాలూకా నాటి నల్లగొండ జిల్లాలో ఉండేది. ఈ తాలూకాలో పోరాటం ఉధృతం దాల్చడానికి అనాటి సామాజిక పరిస్థితులు కారణం. అంతేగాక పరమ కిరాత కుడు విస్నూరు దొర రాపాక రామచంద్రారెడ్డి 60 గ్రామా లపై దొరతనం వెలిగిస్తూ ప్రజలను బానిసలకన్నా నీచంగా చూస్తూ అనేక హింసలకు గురి చేసేవాడు. అతని కుమా రుడు జగన్మోహన్ రెడ్డి ఇంకా దుర్మార్గుడు. ఇలా వీరి పాలన ఉన్నది. ధర్మాపురం అనే గ్రామంల్లోని ప్రజలు దొరల దురాగతాలకు అడ్డుకట్ట కడుతూనే ఉన్నారు.

ఆ గ్రామంలో పడమట తాండా, తూర్పు తాండా అనే 2 లంబాడి తాండాలుండేవి. పడమటి తాండాలో ''ఝాటోత్ హాము '' కుటుంబం ఒకటి. ధైర్యసాహసాలు కలిగి వుండి ఆ తాండా సమస్యలు తీరుస్తూ ఉండేవారు. వీరిలో హాము ఆదొరలపై ఎదురు తిరిగాడు. హాము కుమారుల్లో పెద్దవాడైన ''జుద్యా '' భార్యే పుల్నీబాయి. వివాహానంతరం తన ఇంటివాతావరణం తనకు కొత్తగా అన్పించింది. అంటే, వారి ధైర్యసాహసాలు చూసి ఆమెకు వింతగా అన్పించింది. అయితే కాలానుగుణంగా ఆమె కూడా మారింది.

అప్పటి తాండాను రజాకార్లు తగలబెట్టారు. దొరలకు వ్యతిరేకంగా తన కుటుంబం ఎంతో పోరాడుతుంది. పుల్నీబాయి మరిదిని మరియు తనతో ఇంకో నలుగురిని సజీవ దహనం చేశారు దొరలు. అదిచూసి ఆమె ఇంకా కృంగిపోయారు. అలాగని ఆమె దుఃఖిస్తూ కూర్చుంటే పనులు ఆగవని ఆమె తనకు తానే ధైర్యం తెచ్చుకుంది. ఒకరోజు ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా ఆర్తనాదం విన్పించింది. ఒక స్త్రీ కేకలు విన్పించాయి. అప్పుడే తాను లేచి చేతిలో కారం, ఇంకో చేతిలో కత్తి పట్టుకొని బయలు దేరగా తన వెనకాల కొద్దిమంది స్త్రీలు కూడా బయలు దేరారు. అక్కడికి వెళ్ళగా అక్కడ ఒక లంబాడీ దాదాపు అత్యాచారయత్నం చేస్తున్నారు. వారిపై తానొక్కటే తిరగ బడింది.

పూల్నీబాయి జన్మతః లంబాడీ యువతి. లంబాడీలు బంగారు మేని ఛాయలో ఉంటారు. అందులో పూల్నీ బాయి అందమైన స్త్రీ, ఇద్దరు పిల్లల తల్లి. ఆమె సౌంద ర్యాన్ని చూసి రజాకార్లు ఆమెపై కన్నువేశారు. ఎలాగైనా వశపరచుకోవాలనుకున్నారు. ఒకరోజు ఒక లంబాడీ స్త్రీని చెరచబోయారు. ఎందుకంటే ఏ స్త్రీకైనా ఆపద వస్తే తానొస్తుందని గ్రహించి అలా చేస్తుండగా రానేవచ్చింది , పూల్నీబాయి. ఒకచేతిలో కారం, ఇంకో చేతిలో కొడవలి. వీరవనిత రుద్రమదేవిలా వారిపై విలయతాండవం చేసింది. పుల్నీబాయిని రప్పించాలనే ఆ పన్నాగం పన్నారు. ఆ స్త్రీని చెరచడానికి ప్రయత్నిస్తున్న ఆ కామపిశాచి యొక్క పురుషాంగాన్ని నరికింది. ఇదంతా చూసిన ఆ గ్రామ ప్రజలు అందరూ అప్పుడు బయటకు వచ్చారు. ఆ ప్రజ లను చూసి రజాకార్లు పరుగులు పెట్టారు. ఊరూ వాడా అంతా ఆమె సాహసాలకు మెచ్చుకున్నారు.

కోడలి సాహసానికి హాము ఎంతో గర్వపడినాడు. ఆవూరి ప్రజలందరు ఆమెకు జేజేలు పలికారు. ఇలా స్త్రీమూర్తులెందరో ఉన్నారు. వీరంతా గిరిజన హక్కుల కోసం పోరాడిన ఆదివాసీ వీర వనితలు. ఆటవిక జాతికి చెందిన గిరిజనులు, బోయలు, గోండులు, జంగాలు మొదలైనవారు, మన సంస్కృతికి మూలపురుషులు అనవచ్చు.

ప్రాచీన కావ్యాల్లో చెంచుల జీవన చిత్రణ

– డా॥. ఉడాలి విష్ణుప్రియ, తెలుగు విభాగాధిపతి, సెంట్ ఆన్స్ మహిళా కళాశాల, మెహదీపట్నం, హైదరాబాదు, తెలంగాణ.

సమకాలీన జీవనానికి సాహిత్యం అద్దం వంటిది. సాంఘిక జీవనం అన్నప్పుడు అన్ని తరగతుల ప్రజల జీవన విధానాలు, పరిపాలనా రీతులు, వృత్తులు, ఆహారం, వేషధారణ, ఆభరణాలు, గృహం, విశ్వాసాలు, పండుగలు, జాతరలు, పెళ్లి పేరంటాలు, విందులు వినోదాలు మొదలైన అంశాలన్నీ చోటు చేసుకుంటాయి. నీరు, గడ్డి, కట్టె సమృద్ధిగా లభించడానికి అనువైన ప్రాంతమే మానవ జీవనానికి పునాది.

గిరిజన సంస్కృతులలో ఆచార బద్ధమైన సామాజిక, ఆర్థిక పరస్పర సహకారం కనిపిస్తుంది. ఒక కులం వారు మరో కులం వారి వృత్తిని స్వీకరించరాదు. కాబట్టి ఒకరు మరొకరిపై ఆధారపడి జీవించవలసి వస్తుంది. గిరిజనులలో కట్టు, బట్టు, జుట్టు విధానాలను బట్టి మనిషి ప్రవర్తన నిర్ధారింపబడుతుంది. కేంబ్రిడ్జిలో పనిచేసిన మతాచార్యుడు, తులనాత్మక మత గ్రంథాల అధ్యయన శీలి అయిన ఏ.సి.బకే తన సుప్రసిద్ధ రచన ''Sacred Books of theWorld'' (పెలికాన్-1954)లో ఋగ్వేదం,

సుమేరియన్, బాబిలోనియా, ఈజిప్షియన్ ప్రార్థనా గీతాలకన్నా, రెడ్ ఇండియన్, ఆఫ్రికన్ ఆదిమ గీతాల కన్నా కూడా ప్రాచీనమని చెప్పదగ్గ ఒక మంత్రం గురించి పేర్కొన్నాడు. 'మేము తింటాం / నువ్వూ తిను' అనే ఈ మంత్రం తెలుగు మంత్రం! నల్లమలలో ఉంటున్న చెంచు తెగ ఏదైనా వేటాడినప్పుడో లేదా ఏ కంద మూలాలో సేకరించినప్పుడో ఆ ఆహారాన్ని సర్వేశ్వరుడి ముందు సమర్పించి అందులోంచి కొంత భాగాన్ని దేవుడికి సమర్పిస్తున్నప్పుడు చెప్పే మాట అది. అటువంటి పురాతన మంత్రాన్ని ప్రపంచానికి ప్రసాదించిన జాతి చెంచు వారిది. వారి భాష తెలుగు.

గిరిజన ఆదివాసీ చరిత్ర అంటే అడవి చరిత్ర. పూర్తిగా ప్రకృతిపై ఆధారపడ్డ ఆదివాసీ జీవనం వారి సంస్కృతి. అంటే ఈ దేశ సంపదలను సంరక్షించిన వారి సంస్కృతి. గిరిజన ఆదివాసీ సంస్కృతిపై ఆయా తెగల్లో చాలావరకు మౌఖికంగానే ఒక తరం నుంచి మరొక తరానికి ప్రసారమవుతూ వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లో చెంచు తెగ ప్రాచీన సంచార తెగలలో ఒకటి. నల్లమల ప్రాంతంలోని కొండలూ గుట్టలే చెంచుల నివాస స్థలం. కృష్ణానదీ పరీవాహక ప్రాంతంలో చెంచులు విస్తరించి అటు నిజాం రాజ్యానికి ఇటు బ్రిటీషు పరిపాలనలోని మద్రాసు ప్రెసిడెన్సీకి సరిహద్దుగా ఉన్న కృష్ణానదికి ఇరువైపులా ఉన్న ప్రాంతాల్లో కనిపించేవారు. శ్రీలంకలోని ప్రాచీన తెగ అయిన వెద్దాల మాదరిగానే చెంచులు కూడా రింగుల జుత్తు, విశాల వదనం, చప్పిడి ముక్కు, పొడవాటి దవడతో పొట్టిగా నల్లగా ఉంటారు. శరీరాన్ని తమ పూర్వీకుల్లాగా ఆకులతో చుట్టుకోవడం ఇప్పుడు లేకపోయినా మగవారు గోచీ మాత్రమే పెట్టుకుంటారు. ఆడవారు నూలు రవిక, చీర కట్టుకుంటారు. అడవి చెంచుల కన్నా నిరుపేదలు మొత్తం భారతదేశంలో ఎక్కడా కనిపించరు. విల్లంబులు, ఒక కత్తి, గొడ్డలి, గుంతలు తవ్వే కర్ర, కొన్ని కుండలు, బుట్టలు, మరికొన్ని చింకి పాతలు.. ఇవే వీరి ఆస్థిపాస్తులు. చెంచుల్లో వ్యక్తిగత స్వేచ్ఛ స్వాతంత్ర్యం అన్న భావాలు బలంగా కనిపిస్తాయి. చెంచులు వేటను, అడవి పండ్లనూ ప్రసాదిస్తుందని విశ్వసించే ఒక దేవతను పూజిస్తారు. హిందువులు పరమాత్మగా పూజించే భగవంతుడిలోని కొన్ని లక్షణాలతో సారూప్యం ఉన్న ఒక 'ఆకాశ దేవుణ్ణి' కూడా చెంచులు పూజిస్తారు. జీవితం దేవుడిచ్చిన వరప్రసాదమనీ, మరణించిన జీవుడు దేవునిలో కలసిపోతాడనీ చెంచులు బలంగా నమ్ముతారు. చెంచుల ఇలవేల్పులైన శ్రీశైలం మల్లికార్జున స్వామి, అహోబిల లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాలు వందల సంవత్సరాలుగా వీరి సంరక్షణలోనే ఉండేవి. శ్రీశైలంలోని మల్లన్న

ఆలయంలో జరిగే పూజా కార్యక్రమంలో చెంచులకు ప్రత్యేక స్థానం ఉంది. వీరు పార్వతీ దేవిని తమ ఆడపడుచుగా భావిస్తారు. దేవాలయాల గోడల మీద ఏవో పాటలు, సంకేతాలు వ్రాసేవారు. స్త్రీలు ముత్యాల మీది కన్నా గురివిందల మీదనే ఎక్కువ మోజును చూపేవారు. ధూర్జటి "శ్రీ కాళహస్తీశ్వర మహాత్మ్యం"లోని చెంచుల జీవన చిత్రణంలో ఈ విషయాన్ని గమనించవచ్చు.

శ్రీ కాళహస్తీశ్వర మహాత్మ్యంలో ధూర్జటి ఆటవికుల జీవితాన్ని సహజ మనోహరంగా వర్ణించిన తీరు అద్భుతం. చెంచుల ఆహారపు అలవాట్లను కూడా రమణీయంగా వర్ణించారు. అత్తగారి ఇండ్లలో మాటలు పడకుండా ఉండడానికి ముందుగానే తల్లులు తమ కూతుళ్లకు వంటావార్పుల్లో చక్కని శిక్షణ ఇస్తారని తెలిపాడు. 'తిన్నని' అక్కలు కమ్మని ఆహార పాదార్థాలను వండడంలో సిద్ధహస్తులనీ, ముఖ్యంగా మాంసం వండడంలో నేర్పరులనీ పేర్కొన్నాడు.

"కొండలకానలందదిరిగి క్రొవ్విన పందుల లేళ్లదుప్పులన్
చెండిన పెక్కు చందముల చిన్ననక పెద్దకగారు
వండుదురట్ల పటిట్టలును వండుదురిచ్చట నుండనేల నా
కొండొకటానతీక యుడుమూరికి రాగదవయ్య లింగమా..!

వేట చెంచుల ప్రధాన వృత్తి. పంది, లేడి, దుప్పి మొదలైన జంతువుల మాంసాన్నే కాక పిట్టల మాంసాన్ని కూడా ఆహారంగా స్వీకరిస్తారు.

చెంచులు అడవి పందిని సంహరించి దాని మాంసాన్ని ఆహారంగా స్వీకరించే విధానాన్ని ధూర్జటి కన్నులకు కట్టినట్లుగ ఇలా చిత్రించాడు..

"క్రొవ్విన మేకలంబులను కొన్నిటి గూర్చి కమర్చి పెంచులన్
జివ్వుచు నెఱ్ఱమన్నలది చివ్వున నీరివురంగనేర్చి
నోళ్లు విళులూర ప్రేట్చి చమురుట్టి పడంగఱుకుట్లు గాల్చిక
ల్ఱువ్వున నీడనొక్క పరిశుద్ధ శిలాతల భూమి నందఱున్.."

క్రొవ్వెక్కిన పందిని చంపి మొదట మంటలో వేసేవారు. కమిలే విధంగా కాల్చి పెంకుల సహాయంతో తోలు ఊడదీసేవారు. ఎర్రమన్ను పూసి మళ్లీ నిప్పులో వేసి నీరు ఇగిరేటట్లు కాల్చేవారు. ఆ తర్వాత ముక్కలు చేసి సన్నని సలాకులకు గ్రుచ్చేవారు. మూడవసారి మళ్లీ నిప్పులో వేసి వాటిని చమురు కారేటట్లు కాల్చేవారు. ఆ తర్వాత వేటగాళ్లంతా కల్సువ్వి చెట్టు కింద కూర్చుని ఆ మాంసాన్ని ఆరగించేవారు.

- ధూర్జటి శ్రీ కాళహస్తీశ్వర మహాత్మ్యం

ఆ కాలంలో అన్ని తరగతుల వారు పాయసం పదార్థం వండుకుని తినేవారని ధూర్జటి ఇలా ప్రస్తావించారు.

"ఓ లింగమా విను.. నివ్వరి ప్రాలును, నొడిపిళ్లు కునుకు ప్రాలును వెదురుం
బ్రాలును సవరపు మెకముల పాలును గలపచీలు నీకు పాయసమునకున్.."

- ధూర్జటి శ్రీ కాళహస్తీశ్వర మహాత్మ్యం

చెంచులు వేటాడడంతో పాటు తమ నివాస భూములైన అడవుల్లో లభించే తేనెలనూ, పళ్లనూ, రకరకాల మూలికలనూ సేకరించి వాటిని గ్రామాల్లోనూ, నగరాల్లోనూ అమ్ముతారు. మంచన 'కేయూర బాహు చరిత్ర'లో వీరు అడవి నుంచి తేనెను తెచ్చి నగరంలో అమ్మినట్లు పేర్కొన్నాడు.

"ధరణిపయి లాటనరపతి పురి తేనియ
నమ్ముకొరకు బోయలపల్లెన్
చరియించు చుండువాడొక పురుషుందద
యొక్క కలశమునగొ కదకన్.. "

- కేయూర బాహు చరిత్ర, మంచన

సాధారణంగా వేట రాజులకు వినోద కార్యక్రమాల్లో ఒకటి. బోయలకు అది జీవనోపాధి. ప్రాచీనకవుల్లో

ధూర్జటిలా వేటను వర్ణించిన వారు ఎవరూ లేరు. దీనికి కారణం.. వేటకు సంబంధించి ధూర్జటికి గల పరిచయమే. చెంచుల వేషధారణలో వారి ఇష్టాయిష్టాలు ధూర్జటి ఎంతో గొప్పగా వర్ణించారు. తిన్నని కథలో తిన్నని జన్మ స్థలం ఉడుమూరు. ఆ ఊరి చెంచులు ముత్యాలను రేగుపండ్లలాగా చూస్తారు. మంచి గంధం, కృష్ణాగరు కట్టెలను వంట కట్టెలుగా లెక్కిస్తారు. చెంచు స్త్రీలు పట్టు చీరలను కాదని పండుటాకులే కట్టుకుంటారు. రాజాన్నానికి బదులు అడవి ధాన్యాన్నే వండుకుంటారు. మాణిక్యా లకు బదులు గురువింద హారాలనే ధరిస్తారు. తూగు టుయ్యాలలను కాదని తీగలతో తయారైనఉయ్యాలల్లోనే ఊగుతారు -

"ఒకనాడు తెరవేటనుగ్ర సత్త్వంబుల
పుడమిపై తడకాలు పడవధించి
యొకసారి సారమేయోద్ధతి నుద్ధర
స్తబ్ధరోమంబుల సంహరించి
యొకమరి దీమంబులడ్డి పాదులు దీర్చి
బహు విహంగంబుల పట్టి తెచ్చి
యొకవేళ డేగ వేటకు చని యెగజోపి
నానాండజముల ప్రాణమును గెడపి
ముంగి వేటేదు వేట సివంగి వేట
యిట్టి వేటయు గంటవే టెద్దు వేట
మొదలుగా గల వేటల యదనెఱింగి
తిన్నడొక్కక్క తూకు వర్తింపదొడగె"

- ధూర్జటి శ్రీ కాళహస్తీశ్వర శతకము

ధూర్జటి చెంచులు వేటలో ఉపయోగించే తెర చీర కట్టలను, ప్రోగు చుట్టలను, ఏటి వలలను, కుందేటి వలలను పేర్కొన్నాడు. అంతేగాక అతడు విడి వేటకవసర మైన ఉరులు, ఉరి గోలలు, బోనులు, చిక్కాలు మొద లైన సాధనాలను ప్రస్తావించాడు. వేటలో మొదట దొరికిన మృగాన్ని శివునికి అర్పిస్తారు.

"మున్నుపడిన మెకము గొనివచ్చి మిడిగ్రుడ్లు
పొడిచి నీట శిరము తడిపి తోక
కోసి ధూపమిచ్చి మీసంబు పెకలించి
కానుకిచ్చి కాటి ఱేని గొలిచి"

- ధూర్జటి శ్రీ కాళహస్తీశ్వర శతకము

వేటకుపయోగించే ఎన్నో సాధనాలు 'చంద్రభాను చరిత్ర'లో ఇలా పేర్కొనబడ్డాయి..

"వలలు నురుల్ సిడుల్ పిసులు వంకర దుడ్డులు పందిపోట్లు ధీ
ములు గొర కత్తెరల్ జిగురు మోకులు బోనులు గాలి యుడ్లు బం
గులు మిడివిండ్లు బందములు కొమ్ములు పాయలు పల్లెత్రాళ్లు చి
వ్వల తడికెల్ ధరించి యిరవంకల జేరిరి కొందరు ధ్ధతిన్"

- మల్లన 'చంద్రభాను చరిత్ర'

యయాతి చరిత్రలో పొన్నెగంటి తెలగన్న వేటలో ఉపయోగించే రకరకాల వలలను ఒక జాబితాగా ఇలా ఇచ్చాడు చూడండి..

"వేట వలలను మేటి కుందేటి వలలను
నెలుక వలలను సవదండ వలలు దొడ్డి
వలలు పందిటి వలలను బలుపు మకిల
వలలు మొదలుగా గలిగిన వలలు మఱియు"

చంద్రభాను చరిత్రలో వేట కుక్కల పేర్లు చాలా చిత్రంగా ఉన్నాయి. వాటి వాటి స్వభావాన్ని అనుసరించి ఆటవికులు ఆ పేర్లు పెట్టినట్లు భావించవచ్చు.

"జాతర పుట్టచెండు నెరజాన గయాళి కరాళి దిట్ట చీ
బోతు తుపాకి జోగి సుకబోగి తుటారి తలారి మారి సం
గాతి లకోరి కోరి యనగా చను కుక్కల కేలబూని..."

ధూర్జటి శ్రీ కాళహస్తీశ్వర మహాత్మ్యంలో చెంచు బాలకుడైన తిన్నని వేషధారణను కళ్లకు కట్టినట్లు ఇలా వర్ణించాడు..

"జలంకంబార్చి విభూతి కుంభాబీజ సంకీర్ణమే
... ... పుత్రుల్ గూడి యాడంబురిన్..

గురివింద గింజల హారాలు, మొలత్రాళ్లు, ఆభరణాలు, నెమలి ఈకలు, తాయెత్తులు వీరికి అత్యంత ప్రీతి పాత్రమైనవి. స్త్రీ పురుషులిద్దరూ నెమలి పించాలతో అలంకరించుకుంటారు.

"కఱకు జుంజులు వెండ్రుకల కొప్పు గాఢత
రంబుగా నెమలి పించంబు జుట్టి ... ... నాయకుల
గూడి"

పై వాక్యాల్లో చెంచు స్త్రీలను ధూర్జటి ఇలా వర్ణించాడు.. "మోటైన చింపిరి జుట్టులో నెమలి పించాన్ని చుట్టుకుని, నుదుట జేగురు బట్టు ధరించి, పాలిండ్లపై గురువింద పేర్లనే గాక పండుటాకుల పైటను కూర్చుకుని, జంట ఒడ్డాణానికి కూడా నెమలి పించాన్ని చుట్టుకుని, విండ్లనూ, మొనదేలిన కొయ్య బాణాలను చేత బట్టుకుని చెంచు స్త్రీలు తమ భర్తలతో అడవుల్లో తిరిగినట్లు" కవి వర్ణించాడు.

చెంచుల ఆటల్లో సింగి సింగడు ప్రధాన పాత్రధారులు, నాయికా నాయకులు డప్పుకు తగినట్టుగా గంతులేస్తారు. ఇప్పపువ్వు సారా తాగితే మైమరచి కుప్పి గంతులేస్తారు. నెమలి నృత్యం, కోతి నృత్యం వీరి నృత్యాల్లో ముఖ్యమైనవి. పూర్వం ప్రసిద్ధి చెందిన జానపద కళల్లో సింగి, సింగడు నృత్యం ఒకటి.

'క్రీడాభిరామం'లో వినుకొండ వల్లభరాయుడు కూడా వీరి గురించి ఇలా చెప్పాడు..

"పావనంబైన తమిలేటి పరిసరమున
వేగికూరు వాటికా దేశ విపిన భూమి
గోవులను పేరి చెంచుల
కులమునందు గడిమికత్తుల నాగ
గలుగ గమ్మియలదు"

గుఱ్ఱం జాషువా గారు కూడా తమ 'గబ్బిలం' కావ్యంలో చెంచుల ప్రస్తావనను తెచ్చారు..

"విలునమ్ముల్ ధరియించి చెంచులు
తదాభీ లాటవీ మధ్య భూముల
కన్పట్టిన నంజలింపుము మహాత్ముండైన
భర్గుండు భక్తుల కిష్టార్థము లీయ
గోరిన గణస్తోమంబుల్ మాయ
పందుల వేటాడుచు భిల్లుడై నరుల
కన్నుల్ గప్పి క్రీడించెడిన్.."

ప్రకృతితో మమేకమైన గిరిజనుల సంస్కృతిలో చెంచుల జీవనం ప్రత్యేకమైనది. దానిని ప్రాచీన కావ్యాల్లో ప్రస్తావించిన తీరును ఇంతవరకూ మీతో పంచుకొన్నాను. గిరిజనులు ఇప్పటికీ ప్రజల్ని ఆకట్టుకోవడానికి ప్రధాన కారణం.. వారి కట్టూ బట్టే! ప్రకృతి మనస్తత్వమెలాంటిదో గిరిజనుల మనోచిత్రణ కూడా అలాంటిదే! ప్రముఖ కవులు రచించిన ప్రాచీన కావ్యాల్లోని పలు అంశాలు ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి!



లంబాడీ తెగ – ఆచారాలు, అలకంరణ

– డా॥. యస్. మైథిలి, సహాయ ఆచార్యులు, శ్రీకన్యకా పరమేశ్వరీ ఆర్ట్స్ & సైన్స్ మహిళా కళాశాల, చెన్నై, తమిళనాడు.

లంబాడీలు శారీరకంగా బారీ మనుషులు. ధృఢమైన శరీరం కలిగి ఎత్తుగా ఉంటారు. వారిని చూసిన బ్రిటీష్ ప్రభుత్వం "లాండ్ బాడీస్" అని పేరు పెట్టింది. దీని నుండి లంబాడీ అనే పేరు వచ్చింది. నిజాం కాలం కంటే పూర్వం నుండే అదిమ గిరిజన లంబాడీలు తెలంగాణలో ఉన్నారు.

1857 సిపాయిల తిరుగుబాటు కంటే ముందుండే లంబాడీ గిరిజనులు తెలంగాణ అడవులలో జీవనం కొనసాగిస్తున్నారు. లంబాడీల సంస్కృతి సంప్రదాయాలు, కట్టుబాట్లు ఎంతో గొప్పవైనవి, ప్రత్యేకమైనవి. "లంబాడీ" సుగాలీలు గిరిజనులలో 28వ తెగ. వీరినే లంబాడ, బంజారాలు అని కూడా అంటారు. హైదరాబాద్‌లోని బంజారా హిల్స్ వీరి పూర్వీకులదేనని ఒక వాదన. వీరి నివాస ప్రాంతాలను తండాలు అంటారు. పూర్వం వరి చేలలో కుప్ప నూర్పిళ్ళప్పుడు ధాన్యం కల్లాలు తొక్కించ డానికి ఆవుల్ని తోలుకొచ్చేవారు. లంబాడీ భాషకు లిపి లేదు. సవరభాష దీనికి కొంచెం దగ్గరగా వుంటుందని చెప్పవచ్చు. ప్రస్తుత గిరిజన తెగలలో వీరు ప్రత్యేక తెగగా కనిపిస్తారు.

లంబాడీలు ఇప్పటికి కూడా తండాలలో తమ ఆచార వ్యవహారాలను పాటిస్తూనే వున్నారు. లంబాడీ పూర్వీకులు గిరిజన ప్రజలు వుండడానికి తండాలను నెలకొల్పి లంబాడీ సంస్కృతిని కాపాడేలా చేశారు. ఈ తండాలు జనవాసానికి దూరంగా నిర్మించుకున్నారు. అంటే బయట ఎంత పెద్దవారైనా ఎంత గొప్పవారైనా, తండాలో వచ్చి ఎలాంటి కొత్త పద్ధతులు, సిద్ధాంతాలు, లంబాడీలపై వేయడానికి వీలు లేదు, కావున తండాలో బయట మనుషులను రానిచ్చేవారుకారు. తండా నాయక్ (తండా పెద్ద) ఏం చెబితే అదే లంబాడీ గిరిజన ప్రజలకు వేదం. ఒక వ్యక్తి లేదా ప్రజలు జనవాసానికి దూరం వుంటున్నారు. అంటే వారిలో ఏదో ప్రత్యేకం ఉందని అర్థం. లంబాడీలలో పుట్టినప్పటి నుండి గిట్టే వరకు సంస్కృతి, సంప్రదాయాలు, కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు, జీవన విధానం, పెళ్ళి అన్నీ ప్రత్యేకమైనవే. వీరు గిరిజనులు కాబట్టి ఇన్ని అంశాలు ఉన్నాయి. ప్రస్తుతం అభివృద్ధి పేరుతో వీరి సంస్కృతి, భాష కనుమరుగవుతున్నాయి. వీరు సంస్కృతి సంప్రదాయాలను రక్షించడం అందరి బాధ్యత.

లంబాడీల ఆచార సంప్రదాయాలు :

లంబాడీలు పెళ్ళిలో ప్రప్రథమంగా గోత్రాలను పరిశీలిస్తారు. కొన్ని గోత్రాల వారు మరికొన్ని గోత్రాల వారితో వివాహం చేసుకోకూడదనే నిషేధాలున్నాయి.

భరోపురాకరేర్ :

లంబాడీలలో కన్యాశుల్కం ఇవ్వడం ఆచారం. కన్యకు ఆమె తల్లిదండ్రులకు వరుడు పశువులను, ధాన్యాన్ని కన్యాశుల్కంగా అర్పించుకుంటారు. దీనినే లంబాడీలు భరోపురాకరేర్ అంటారు. వధువు తల్లి దండ్రులకు నాలుగు కోడెలు, 45 రూపాయలు ఇచ్చే వారు. వధువు ఆమె తల్లిదండ్రులు కూడా పరికిణి, కాంచళి (రవిక) మొదలైన దుస్తులను, ముక్కరను, రూపా యల దండను, ఒక తాంగిడిని ఇస్తారు. తాంగిడి అంటే పెళ్ళిలో పుట్టింటివారు పెళ్ళి కూతురికి ఇచ్చే గోనెసంచి, పశువుల రూపంలో కన్యాశుల్కాన్ని సమర్పించి పెళ్ళి చేసు కొనే ఆచారం ఉంది.

వరుని దేహ దారుఢ్య పరీక్ష :

వరుని దేహదారుఢ్యాన్ని, సహనాన్ని పరీక్షించటానికి కొన్ని కార్యక్రమాలు చేపడతారు. స్త్రీలు జిల్లేడు, మోదుగు కర్రలతో, రోకలితో కొడుతూ మా కూతుర్ని బాధిస్తావా చెడు మాటలు మాట్లాడుతావా అంటూ ప్రశ్నిస్తారు. బావా మరుదులు చిన్న చిన్న రాళ్ళు చెవి దొప్పలో పెట్టి మా

అమ్మానాన్నలను తిడతావా మా చెల్లిని బాధిస్తావా అంటూ నలుపుతారు. ఎంత కొట్టినా, ఎంత నలిపినా ఆ నొప్పి అని నోట మాట రాకూడదు. వీటిని బట్టి వరుని శరీర పటుత్వాన్ని ఓర్చుకొనే శక్తిని పరిశీలిస్తారు. ఈ అవస్థలను భరించినవాడే వధువుకు సరైన భర్తగా పోషించే సమర్థుడని నమ్ముతారు.

ఢావలో :

పెళ్ళికి వారం రోజుల ముందు నుండే తండాలోని స్త్రీలందరూ కలసి వధువుకు పంపక సమయంలో ఏడ్చే విధానాన్ని నేర్పుతారు. దీనినే ఢావలో అంటారు. ఈ కార్యక్రమంలో మూడు విధానాలుంటాయి. ఏడ్పును నేర్పించే ఆచారాన్ని ఢావలో అని, పంపక సమయంలో అందరినీ కౌగలించుకొని ఏడ్వటం, మళరో అనే ఎద్దుపై నిల్చొని తన పుట్టింటి వారు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ పాడే పాటను దావేలి అని అంటారు. ఢావలో ఎంత కఠిన హృదయులనైనా కరిగిస్తుంది. ఈ పాటలో వధువు పుట్టింటిలో తన బాల్యాన్ని తల్లి దండ్రులు ప్రేమాను రాగాలను తలచుకొని దుఃఖించే విధంగా తండాలోని వారందరికి కంట నీరు పెట్టిస్తుంది. ఆడ పుట్టుక పుట్టిన తర్వాత అత్తవారింటికి వెళ్ళవలసిందే అని వధువు నిశ్చయించుకొని పుట్టింటివారు క్షేమంగా ఉండాలని కోరుకుంటుంది.

మళేరో :

మళేరో అంటే తల్లిదండ్రులను, అన్నదమ్ములను, స్నేహితులను ఉద్దేశించి తన చిన్ననాటి జ్ఞాపకాలను తలచుకొంటూ దుఃఖించటం, లంబాడీలలో తల్లులే కాకుండా పెళ్ళి కూతురు తోటి వారు కూడా ఆమె దుఃఖాన్ని ఉపశమించిప చేయడానికి ప్రయత్నిస్తూ అత్త వారింటిలో మెలగవలసిన విధానాన్ని పాటలో బోధిస్తారు.

విందు (గోట్) :

గోట్ అంటే విందు అని అర్థం. పెళ్ళి కుమారుడే ఇవ్వాలని ఆచారముంది. తండా జనాన్ని దృష్టిలో పెట్టు కొని మేకల్ని బలియిస్తారు. రక్తాన్ని పాత్రలోపెట్టి సాలోయ్ వండుతారు. సాలోయేఽ అంటే చింతపండు పులుసు, ఉప్పు, రక్తం కలిపి తయారు చేస్తారు. సరిపోయే కల్లు, సారాయితో సాయంత్రం అందరిని బంతిగా కూర్చోబెట్టి సాలోయ్‌ని వడ్డించి మత్తుపానీయాలు సేవిస్తారు. తరు వాత భోజనం చేస్తారు.

కుటుంబీకుల సేవ :

కన్యకు పెళ్ళి పూర్తికావడంతో ఓ ఇంటి కోడలవు తుంది. అత్తమామలకు ప్రతిరోజు సాయంత్రం వేడినీళ్ళతో స్నానం చేయించాలి. అన్నపానాదులు క్రమపద్ధతిలో అందునట్లు జాగ్రత్త పడాలి. రాత్రి సమయంలో అత్త మామలకు కాళ్ళునొక్కడం వీరి ఆచారం.

బంజారాల ఆచారాలు, అలంకరణలు :

భారతదేశంలోని అనేక తెగలు, ప్రజలు వస్త్రధారణలో అలంకరణలో లంబాడీ స్త్రీల వేషధారణే ఆకర్షణీయంగా అందంగా ఉంటుంది. ముఖ్యంగా అలంకరించుకొనే ఆభరణాలు ప్రాచీనతను ప్రతీకను సంతరించుకున్నాయి. ఇప్పటికి నల్లగొండ జిల్లాలోని అన్ని మండలాలలో లంబాడీల వేషధారణ దుస్తులు అలంకరణలు ఆచా రణలో ఉన్నాయి. లంబాడీ పురుషుల వేషధారణలో ఏమీ లేదు. వారు ఆ కాలంలో ధరించే దుస్తులు మగవాళ్ళకు దోతి, ఖాది, అంగీ, తలకు 24 మూరల పెద్ద పెద్ద రుమాలు కట్టేవారు. భుజంమీద కండువా ధరించి చేతిలో చేతి కర్ర ఉండేది. చెవులకు బంగారు పోగులు, చేతికి వెండి కడియాలు ధరించేవారు. ఈ విధంగా నల్లగొండ జిల్లాలో ఇప్పటికీ ఆచరణలోనే ఉందని చెప్పవచ్చు. లంబాడీ స్త్రీలు దుస్తులు అందమైన కుట్టుపనులతో ఉంటాయి. అద్దాలు పొదిగించిన కాంచళి (రవిక), కుచ్చుల పేటియా (లంగా), అద్దాల రూపాయ బిళ్ళలతో తయారు చేసిన గుమ్‌టో (ముసుగు)ను ధరిస్తారు. లంబాడీ స్త్రీల ఆభరణాలు అందంగా ఉండటమే కాక బరువుగా కూడా వుంటాయి. వీరు ముక్కుకు భురియా ముక్కరను, చెవులకు వివిధ రకాల ములుసు, మెడలో

హంస్‌లో గొలుసును, చేతులకు బలియ గాజులును వాండీ కడియాలను, చేతి వేళ్ళకు చాస్ నగిషి ఉంగరాలను ధరిస్తారు. లంబాడీల్లో సాంప్రదాయక ఆభరణాలు ఈనాడు మార్పును పొందడమే కాక ఆధునిక ప్రభావం కారణంతో అంతరించి పోతున్నాయని చెప్పవచ్చు.

నల్లగొండ జిల్లాలోని లంబాడీ ప్రజలలో ఇప్పుడు పాత ఆచారాలు పోయి కొంత వరకు దుస్తులలోను, పెళ్ళి సామ్మూలలోను మనుష్యులలోను మార్పులు వచ్చాయి. అయినా లంబాడీలు మాట్లాడే భాషలో మార్పు రాలేదు. వారి గోత్రాలలో మార్పు రాలేదు. వారి గోత్రాలలో కొన్ని గుర్తింపు సంఖ్యలు ఉంటాయి. వారు వివాహాలవారి గోత్రాలకు వ్యతిరేఖ గోత్రాలతోనే పెళ్ళి చేసుకోవాలి. ఈ పెళ్ళి ఆచారాలను తెలుగు ప్రజలు చూసి లంబాడీ మానవుడు అని అంటారు. పెళ్ళి అయినవారు అత్తవారింటికి రావడం బహు అరుదు. ఈ లంబాడీలు ఏ ప్రదేశంలో ఉన్నా ఏ ప్రాంతంలో ఉన్నా వరుసకు వీరు అన్నా చెల్లెలు అవుతారు. ఇలా ఎన్నో ఆచార కట్టుబాట్లు ఉన్న వీరికి ఆదేశాలు, పట్టుదల, పంతాలు కూడా ఎక్కువే. లంబాడీలు శిశువు జన్మించిన మూడవ రోజు లేదా ఏడవ రోజు పురుడు చేసుకుంటారు. పూర్వం తల్లికి పాపకు పసుపు, ఆవుపేడతో ఒళ్ళు రుద్ది స్నానం చేయించేవారు. ఈ రోజు కూడా సబ్బులకు బదులు పశువుల పేడను ఉపయోగించడం కనిపిస్తుంది. ఆరోగ్య రీత్యా పరిశీలిస్తే పేడలో అమ్మోనియా, పసుపులో క్రిమి సంహారక శక్తి ఉందని విజ్ఞానశాస్త్రం తెలుపుతుంది.

పురిటిరోజే జలమాత పూజ చేస్తారు. దీనిని లంబాడీలు దళాయాదోకావేరో అంటారు. ఇంటికి తూర్పు దిక్కున తీసిన గుంతలో నీటిని నింపుతారు. ఈ పూజా కార్యక్రమం తెలంగాణా స్త్రీలు 21 వ రోజు సంతానం లేని స్త్రీలను బావి దగ్గరకు తీసుకొనిపోయి వీపుపై నీళ్ళు కుమ్మరించే ఆచారంతో పోలి ఉంటుంది. మూడు ఇత్తడి చెంబులను మరికొన్ని ప్రాంతాల్లో ఒకే చెంబును సున్నం, బొగ్గు, పసుపు బొట్లతో అలంకరిస్తారు. మొదటి చెంబులో పసుపు నీళ్ళు నింపుతారు. అలంకరించిన చెంబులను ఐదేండ్లు దాటని ముగ్గురు బాలురతో ఇద్దరు బాలికలతో బాలింత తలపైన పెట్టిస్తారు. సౌభాగ్యవతులు బియ్యాన్ని లేదా మొక్కజొన్నలను అక్షింతలు చల్లుతూ, చ్వారికి, చోరా, చ్వారికి, చోరా అని పాడుతూ చెంబులను గుంత దగ్గర నింపుతారు. ఈ పాటలో లంబాడీల జీవిత విధానం ప్రతి బింబిస్తుంది. పుట్టిన బిడ్డకు మొదటిసారి తల వెంట్రుకలు తీయడాన్ని లంబాడీ భాషలో లట్టాకడేర్ అని అంటారు. లంబాడీల్లో ఒక్కరికే కాకుండా జంటగా తలవెంట్రుకలు తీసే ఆచారం. లంబాడీలు సామాన్యంగా తుల్జాభవాని దేవత ముందే తల వెంట్రుకలు తీస్తారు. ఒకవేళ బాలాజీకి గానీ, వేములవాడ రాజన్న దేవునికి గానీ మొక్కుకున్నట్లయితే రెండు పిలకలు ఉంచుతారు. లంబాడీల్లో బుతుమతి అయిన అమ్మాయిలకు ప్రత్యేక ఉత్సవాలు చేయరు. అయితే ఈ రోజుల్లో లంబాడీలు కొంతమంది తెలుగువారి ప్రభావంతో ఉత్సవాన్ని జరుపుకుంటున్నారు.

ఈ విధంగా లంబాడీల జీవిన విధానం, వారి ఆచారాలు, అలంకరణ పద్ధతులు వారు ఏ విధంగా పాలించే వారు ఇత్యాది విషయాలను తెలుసుకున్నాం. ప్రస్తుతం అభివృద్ధి పేరుతో లంబాడీ ప్రజల భాష, సంస్కృతి నశించిపోతుంది. వారి భాష, సంస్కృతి మరింత అభివృద్ధి పథంలో వెళ్ళాలంటే అందరి సాయం ఎంతైనా అవసరం.



Studies of Religion, Culture and Traditions of Indian Tribal People

- ***Dr. Hilda Annie Grace,*** Dept. of Education, S K University, Ananthapuramu.

Abstract :

Tribal community in India has been the most vulnerable community. Their fundamental human rights are violated in every step of life. The vast landscape, over-sized population, multiplicity of castes and communities, religions and cultures are hardly found elsewhere in the world. The vitality of Indian culture is equally amazing. It has survived the test of times. This has been possible because of a sense of Indianness and unity in diversity. "The geographical unity of India is easily missed in the immensity and variety which only contributes to her wealth and strength and economic self-sufficiency." Even though many studies of tribes of India have been conducted, there is no unanimity regarding the concept of 'tribe'. Derived from the Latin term tribus, the term tribe means an inhabited place. Today, tribes are generally classified in terms of their region, language, ethnicity, level of social integration with non-tribal neighbors, economy, cultural patterns, education, etc. Tribals in remote areas are still devoid of common infrastructure facilities of road and communication, health and education and safe drinking water and sanitation, which do not allow them to absorb technological and financial help provided by government. Scheduled tribes are indications of primitive traits, distinctive culture, geographical isolation, shyness of contact with the community at large, and backwardness.

Introduction :

The word "tribal" or Adivasi brings to our mind a picture of half-naked men and women, with arrows and spears in their hands, feathers in their heads, and speaking an unintelligible language. Even when majority of the communities in the world kept changing their life-styles very quickly to keep pace with the "progress" of the world, there were communities still living in line with their traditional values, customs and beliefs, where they could continue to live in peace with Nature and their unpolluted environment. The mainstream world, so called civilized people branded these communities variously as natives, uncivilized people, Aboriginals, Adivasis, Tribals, Indigenous and uncontacted people etc. In India, we mostly refer them as Adivasis/ Girijans. Tribal communities are facing number of problems they are educationally backward, deals with many social & religious issues and faces poverty, exploitation, forced displacement, various health problems and many more. Like other societies, tribal society is also not static, rather is quite dynamic. The transformation among tribal society is very slow. That is why they have been backward and poor in comparison to other communities. Since they have been materially backward and economically poor, attempts have been made by the Government to develop them. Today, the governments of all over the world are paying special attention towards the development of the tribal.

Defining a Tribe :

Even though many studies of tribes of India have been conducted, there is no unanimity regarding the concept of 'tribe'. Derived from the Latin term tribus, the term tribe means an inhabited place. It denotes a group of persons

forming a community and claiming descent from a common ancestor.9 Murdock classifies tribes with reference to patriliny and matriliny. 10 Taylor emphasises on common physical traits, or common ancestral features as important criteria of conceptualisation of a tribe. 11 W. H. R. Rivers defines tribe as "a social group of a simple kind, the members of which speak a common dialect, have a single government and act together for such common purposes as warfare."12 Risley defines Indian tribes as "a collection of families, or groups of families bearing a common name which, as a rule, does not denote any specific occupation; generally claiming common descent from a mythical or historical ancestor and occasionally from an animal, but in some parts of the country held together rather by obligations of blood-feud than by the tradition of kinship; usually speaking the san1e language; and occupying, or claiming to occupy, a definite tract of country. A tribe is not necessarily endogamous, i.e., it is not an invariable rule that a man of a particular tribe must marry a woman of that tribe."

Regions of Indian Tribal People :

Indian Tribal People or "Adivasi" is an umbrella term for the ethnic and tribal groups living in various **states in India** and **Union Territories** of the country. They are counted as a minor, but they occupy a larger part of the country as they are the original inhabitants in India. According to Article 342 of the **Constitution of India**, there are 697 **tribes in India** as counted by the Central Government. These Indian tribal groups of people have been notified to occupy more than one State. More than half of the Indian tribal population is concentrated in the states of **Madhya Pradesh**, **Chhattisgarh**, **Maharashtra**, **Odisha**, **Jharkhand** and **Gujarat**. Other Indian tribal societies are found in **Rajasthan**, **Bihar**, **Andhra Pradesh**, **Kerala**, **Andaman and Nicobar Islands**, **West Bengal**, **Mizoram** and other states in **north eastern part of India**.

Tribal population of different areas in India:

Tribal population both in absolute numbers and in terms of percentage widely varies from state 0 to state. No Scheduled Tribe has been listed in Haryana, Punjab, Chandigarh, Delhi and Pondicherry. The population of some states and Union Territories consist of predominantly the Scheduled Tribes. As per the 1991 Census, the ratio of the Scheduled Tribes to gen~ral population was 94.75% in Mizoram, 93.15% in Meghalaya, 79.99% in Dadra and Nagar Haveli, 63.66% in Arunachal Pradesh, 34.41% in Manipur, 30.95% in Tripura, 23.27% in Madhya Pradesh and 22.21% in Orissa. Out of the total population of the Scheduled Tribes, 22.73% live in Madhya Pradesh, 10.80% in Maharastra, 10.38% in Orissa, which roughly constitutes 44% of the total Scheduled Tribes population of the country. In terms of absolute numbers, 71% of the Scheduled Tribes of India live in six states namely, Madhya Pradesh (15.4 million), Maharastra (7.3million), Rajasthan (5.5 million), Gujrat (6.2million), Bihar (6.2 million) and Orissa (7.0 million). The large tribal communities are the Gonds, the Bhils and the Santhals. A few tribes such as the Haisa, the Tangsa, the Hotang Tangsa, the Katin Tangsa, etc., have returned only single person, and the Bamdo, the Jambo Karka and the Kangoo have between two to ten persons (1981

census). According to the 1981 Census, the Andamanese including all sub- groups had only 42 persons followed by the Jarwas (31), the Chaimals (l8) the Onges(97), the Aranadans (236) and the Kochuvelans (53).

Linguistic Classification :

Tribals speak different languages in different regions and can be broadly classified into four main linguistic families, viz. (i) the Austro-Asiatic, (ii) the TibetoChinese, (iii) the Dravidian, and (iv) the Indo-European. The first three linguistic families speak of the dominant languages spoken by Indian tribes. The Hasangs speak the Indo-European language. The central Indian tribes such as the Munda, the Bhumij the Ho, the Kharia, etc. belong to the Astro- Asiatic family. The Gonds and the Oraons belong to the Dravidian language family.

Education :

There is a wide range of variations so far as the educational level of tribes is concerned. The tribes such as the Bhils, the Gonds, and the tribes of the NorthEastern, region especially the Nagas and the Mizos, have high literacy rate. Moreover, there is a wide gap between male-female ratio of literacy. Education plays a vital role in integrating tribals with the. The level of education is, therefore, a major index for measuring the level of tribal development. Inspite of Constitutional provisions and governmental efforts, literacy level has been very low among tribes, and a wide gap between the literacy level of the generaland the tribal people is quite alarming.The Bhil Katarias do not favor female education and dropout among the girl students is very high. However, all the tribes do not show same level of literacy. Some of the tribes, specifically in North-Eastern states and central industrial belts, return a large percentage of tribal literates. The tribes converted to Christianity, children from the upper economic strata and educated background have stronger motivation for education and thus have higher literacy rate.

Customs and Traditions of Indian Tribal people :

In India, culture and diversification amongst the tribal can also be admired from any land direction. Each of the tribes is a distinctive **community**, either migrated from a different place or the original denizens of the land. The speciality of the Indian tribes lies in their **customs**, **cultures**, beliefs and the harmony in which they survive in unanimity with nature.

Sentinelese tribe of **Andaman** is one of the most secret tribes existing in the world. They are fond of buckets, specifically red buckets. **Jarawa Tribe** of Andaman are still rooted in their tribal customs and traditions. They enjoy fish, pigs and other **animals** but wouldn't touch a deer as they consider **deer** sacred and they also change the names of their children post puberty. There is a detailed **ritual** held to celebrate, in which a boy has to search for a wild pig and present it to everyone in the **village** and a girl is rubbed in clay and pig oil. **Chenchus** in **Andhra Pradesh** speak a dialect of **Telugu language** known as 'Chenchu'. Chenchu youths are free to marry whoever they want to and they agree to the divorce, and widows as well are approved to **remarry**.**Bhil tribe** is one of the biggest tribes of India. There is lot of liberty given to Bhil **women** and they are treated equally.

Food culture of Indian tribal people :

The traditional **foods** consumed by Indian tribal people are very well connected to almost

all the aspects of their socio-cultural, spiritual life and health. Traditional food, wild **fruits**, roots and tubers, yams, green **vegetables**, spinach, fishes, **crabs**, **snails**, **ants**, honey, etc. are in the list of food of Indian tribal people. **Tribes from Odisha** eat 'ragi ka halwa', 'ragi porridge', 'organic **rice** and **dalma**' and 'ragi pakora'. Bhil tribe eat 'kachra sabji', 'chancch' and 'mirchiki **chatni**'etc.

In **North - East India**, soybean based fermented food is quite popular like 'bekang', 'aagya', 'peron namsing', 'yanni perung', 'chukchoro', 'bari', 'kinema', 'hawaizaar', 'hakhu mata/akhuni', 'axoni' etc. **Bamboo** based ethnic foods are also quite popular in North - East India like 'hikhu', 'hiring', 'hithyi', 'ekung', 'lungseij', 'godhak', 'gundruk' etc. **Tree** bean based ethnic foods of **North - East Indian tribes** are 'yongchak', 'iromba' etc.

Festivals of Indian Tribal people :

Indian tribal **festivals** have been an element of the structure of tribal India for centuries. **Central Indian** tribal festivals include '**Madai festival**,' '**Bhagoriya festival**,' 'Tribal **Dussehra**' of **Bastar**, **religious festival** of Karma, festival of 'Nagaj'. **Northern Indian** tribal festivals include '**Mim kut**', '**Sekrenyi festival**', 'Tsukhenyi festival', '**Aoling**', 'Monyu', '**Moatsu festival**', '**Amongmong festival**', **Ngada festival**', '**Hornbill festival**,' 'Sekrenyi' etc.

Eastern Indian tribal festivals include '**Bali Jatra**', '**Karama festival**', '**Chaitra Parva**', 'Kedu festival', '**Mage Parab**', 'Bohaggiyo Bishu', '**Sarhul**' etc. **Southern Indian** tribal festivals include '**Holi**', 'Samakka' festival and so on.

References :

1. L.P.Vidyarthi &B.K. Rai, 1985,The Tribal Culture in India, New Delhi, Concept Publishing Company.
2. B.D. Shrama, 1997, Development of Small Tribal Communities: A Theoretical Framework in Primitive Tribes, New Delhi, Ministry of Home Affairs, Government of India.
3. Mamata Chaudhury, 1977, Ancient Tribes of India, Calcutta, Indian Museum.
4. Quoted in L.P. Vidyarthi and B.K. Rai, 1985, The Tribal Culture of India, New Delhi, Concept Publishing Company.
5. K.L. Shanna, 1982, "Folk-culture of Jharkhand Region in Bihar" in Budhadeb Chaudhuri (ed.}, Tribal Development in India: Problems and Prospects, Delhi, Inter-India Publications.
6. S. Suryanarayan and V. Gangadharam, 1982, The Chenchus and Develoment Programme in Budhadev Chadhury (ed.).
7. Tribal Development in India: Problema and Prospects, Delhi, Inter-India Publications.
8. D. Ering, 1972, The North-East Frontier Agency inK. S. Singh (ed.), The Tribal Situation in India, Indian Institute of Advanced Studies, Simla, 1972.
9. https://www.indianetzone.com/37/indian_tribal_people.html.
10. Prasad, M. (1987), Tribes their environment and culture, Delhi.

సెప్టెంబర్ 2019

తెలుగులో గిరిజన
సంస్కృతి - సాహిత్యం

భావవీణ ప్రత్యేక సంచిక

Journal of Telugu Literary, Culture & Language Studies



మద్రాసు క్రైస్తవ కళాశాల

(స్వయం ప్రతిపత్తి)

తెలుగుశాఖ (స్థాపితం - 1887)

తాంబరం, చెన్నై - 600 059, తమిళనాడు.

Sundar Prints 9840199777